శ్రీమతే రామానుజాయనమః

శ్రీశ్రీనివాస పరబ్రహ్మణే నమః

అస్మద్ గురుభ్యోనమః  శ్రీరఘునాథదేశికేభ్యోనమః

## భగవద్రామానుజ విరచిత బ్రహ్మసూత్రభాష్యమ్

# శ్రీభాష్యమ్

## (ప్రథమ భాగము)



తెనుగుసేత

**కండ్లకుంట వేఙ్కట నరసింహాచార్యులు**

ప్రచురణ

**శ్రీమాన్ కండ్లకుంట సీతారామానుజాచార్య స్వామివారి**

తిరునక్షత్రోత్సవసమితి.

గ్రా: ఎరజర్ల. తా. జి. మానుకోట, తెలంగాణ

2019

**SRI BHASHYAM** *by*
Bhagavad Ramanujacharya

Telugu Translation *by*
**Sri Kallakunta Venkata Narasimha Charya**

భగవద్రామానుజ విరచిత బ్రహ్మసూత్రభాష్యమ్

**శ్రీభాష్యమ్** (ప్రథమ)

తెనుగుసేత

**కండ్లకుంట వేఙ్కట నరసింహాచార్యులు**

ప్రథమ ముద్రణ: **నవంబరు, 2019**

© కాపీరైట్స్ ప్రకాశకులవి

ప్రతులు : 500

**వెల: రూ. 500/-** (1, 2 భాగములు కలిపి)

ప్రకాశకులు : **శ్రీమాన్ కండ్లకుంట సీతారామానుజాచార్య స్వామివారి**
తిరునక్షత్రోత్సవసమితి.
గ్రా. ఎరజర్ల. తా. జి. మానుకోట,
తెలంగాణ.
సెల్: 9989392623

డిటిపి : జి. లక్ష్మీ మార్కండేయ స్వామి, 9533934457

ముద్రణ: **కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్,** హైదరాబాద్.

శ్రీమతే రామానుజాయనమః

# నమ్ర నివేదనము

శ్లో॥ వన్దే వేదాన్తకర్పూరచామీకర కరండకమ్
రామానుజార్యమార్యాణాం చూడామణి మహర్నిశం ॥

పెద్దలైన సుజ్ఞాన మనస్కులకు హార్దమైన నమస్సుమాంజలులు సమర్పించుతూ దాసుడు చేసుకొనే విన్నపమిది.

ఇప్పుడు మీ కరకమలాలను అలంకరించిన ఈ గ్రన్థము నిండుగా భగవదనుగ్రహముతో ఆయన ప్రేరణతో పూర్ణతను సంతరించుకొన్నది. దాసుడు నిమిత్తుడు మాత్రమే.

శ్లో॥ భాష్యంచేత్వ్యవృణోత్ స్వయంయతిపతిః వ్యాఖ్యాన వాచాంతథా ।
గామ్భీర్యాదన వస్థితిః మితమతిః దూరేజనస్తద్గిరామ్ ।
ప్రష్టవ్యః కథమీశ్వరః సహిననః ప్రత్యక్షరూపోదృశాం ।
తద్భాష్యం సచభాష్యకృత్ సచహరిః సమ్యక్ ప్రసీదన్తునః. అని

శ్లో॥ అవిస్తృతాః సుగమ్భీరాః రామానుజమునేర్గిరః ।
దర్శయన్తు ప్రసాదేన స్వంభావమఖిలందృఢమ్ ॥

అనిన్నీ, విజ్ఞానఘనులైన పూర్వాచార్యుల చేత ప్రశంసలు పొందినట్టిది ఈ గ్రన్థము. దీన్ని అర్థము చేసుకోవడం సులభంకాదు రామానుజుల వారి వాక్కులు విస్తారములు కావు. కానీ ఆలోచించుతున్నకొద్దీ లోతైన అంశాలను విశదపరిచేవిగా ఉంటున్నాయి. తమలోపలి నిక్షిప్తమైన అర్థాలను వాటంతటగా అవి అందించవలసినట్టివే. లేదంటే కర్తయైన రామానుజుల వారు కానీ అందులో ప్రతిపాదింపబడే సర్వజ్ఞుడు సర్వవిత్తూ ఐన శ్రీమన్నారాయణుడైనా కానీ వివరించవలసిందే. ఇట్లా గని చాటిన మహానుభావులు ఎందరో ఉండగా మితబుద్ధియైన దాసుడికి ఎంతమాత్రమూ ఊహకు అందని ముచ్చటే భాష్యార్థాన్ని అవగతం చేసుకొని వ్రాయగల్గడము.

మహా మహోపాధ్యాయ, కవిశాబ్దిక కేసరి, శాస్త్రరత్నాకర ఇత్యాది బిరుదాలకు వన్నెతెచ్చిన శ్రీమాన్ శ్రీరంగం నల్లాన్ చక్రవర్తుల రఘునాథాచార్యస్వామి వారి కటాక్షంతో భాష్యామృతాన్ని లవమాత్రంగా పొందినదాసుడు, తదుపరి కాలములో తరచుగా పారాయణలు చేస్తూ ఉండడము, అక్కడక్కడా ఆయా అంశాలపైన పెద్దలముందు మాట్లాడుతుండడము జరిగింది.

ఆ కారణంగా శ్రీ భాష్యాన్ని దాసుడి ఉపయోగం కోసమై ఐనా తెలుగులో వ్రాసుకొంటే బాగుంటుంది అనే ఊహ వచ్చింది. అది అట్లుండగా కొందరు పెద్దలు రామానుజ సహస్రాబ్ది సందర్భంగా శ్రీభాష్యాన్ని అచ్చువేస్తూ దీనికి తెలుగు భాగాన్ని ప్రచురించితే బాగుంటుంది అని నన్ను సంప్రదించినారు. సరేనని అందుకు ఉపక్రమించి జిజ్ఞాసా అధికరణములో మూడువంతులు సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా కొనసాగించిన తరువాత దాన్ని కుదించమని కోరడంతో అధికరణాలను ఆధారం చేసుకొని అచ్చులో రమారమిగా రెండు వందలు పుటలు వచ్చేటట్లు వ్రాసి అందించడం జరిగింది.

ఇది ఇట్లుండగా కరీంనగర్‌లో డా॥ లక్ష్మీనారాయణ గారి కోరికపైన శ్రీభాష్య ప్రవచనము సాగుతుండగా గోష్ఠిలోనున్నవారు తెలుగులో ఉంటే బాగుండును అనే ఆకాంక్షను వెల్లడించినారు.

దానిపైన గతంలో విడిచిపెట్టిన దగ్గరనుండి సంస్కృతభాష తెలియని సంప్రదాయముపై ఆసక్తికల వారికోసము విశిష్టాద్వైత సిద్ధాన్త ప్రతిపాదకమైన ఈ గ్రన్థాన్ని తిరిగి తెనుగు చేయడానికి బొత్తిగా సాధారణ ప్రజానీకానికి రామానుజ సిద్ధాన్తముపైన కుతూహలమున్నవారి కొరకు వ్రాయడానికి పూనుకున్నాను. తీర్థము స్వార్థమూ నెరవేరినట్లు సహృదయులైన పెద్దల మంగళాశాసనాలతో 2019 ఏప్రిల్ నాటికి గట్టెక్కించినాను.

సుమారు వంద సంవత్సరాలకు మునుపు శ్రీమాన్ కందాడై శేషాచార్యులవారు శ్రీభాష్యాన్ని తెలుగులో వ్రాసియున్నారు. మరొకరు, ఇద్దరు కొంత కొంతవరకు మాత్రమే వ్రాసినట్లు తెలుస్తున్నది. అందులో సింహాచలనివాసులొకరు వ్రాసిన జిజ్ఞాసాధికరణము నాకంటపడింది.

అది అట్లుండగా శ్రీమాన్ బందరుస్వామి వారు శ్రీభాష్యాన్నీ, శేషాచార్యులవారి తెలుగు భాగాన్నీ పేరా పేరాగా జతపరుస్తూ సుమారు 15 సంవత్సరాలకు పూర్వము 1500 పేజీలకు పైగా నున్న గ్రంథముగా తెచ్చి లోకానికి పరిచయము చేసినారు.

ఈ నేపథ్యంలో అనువదించిన తెనుగు శ్రీభాష్యాన్ని ఒక్కదానిని మాత్రమే దాసుడు రెండు భాగాలుగా అచ్చువేయించినాడు. కావలసినవారు సంస్కృత గ్రన్థాన్ని ప్రక్కన ఉంచుకొని అధ్యయనం చేయవచ్చును. దాసుడు చేసిన పొరపాట్లను రసభంగకారులను సరిదిద్దవచ్చును.

ఈ అనువాదము కేవలము మూలానికి ముక్కస్యముక్కః అని చెప్పుకున్నట్లుగా సాగింది తప్ప మూలంలోని గాంభీర్యానికి తగినట్లు కాదు. ఎక్కడో ఒకటిరెండు చోట్ల చిన్నచిన్న వివరణములు తప్పని సరిఐన చోట్ల మాత్రమే ఇచ్చే ప్రయత్నం చేసినాను. ఇది శాస్త్రము మరియు

వాదోపవాదాలతో కూడి తర్కకర్కశమై ఉన్నటువంటిది. నా బుద్ధికి అందినట్లుగా ఐనా వ్రాయుపూనుకొంటే ఒకనాటికైనా ముడిపడేదికాదు.

మా ఆచార్యులైన శ్రీమాన్ రఘునాథ దేశికులు సుమారు 5 సంపుటాలు వెలువరించినా శృతప్రకాశికా సహిత శ్రీభాష్యాన్ని ముగించలేకపోయినారు. స్థితప్రజ్ఞా సమర్థత కొరవడికాక వయస్సుపైబడి లేఖకులు తగినవారు అందుబాటులో లేకపోవడంతోనే అది అసంపూర్ణమయ్యింది. వారి పాదరేణువులలో ఒక చిన్న రేణువంతా కాని దాసుడు ఈవిషయంలో నిందుగా అసమర్థుడే అనడంలో స్వభావోక్తియే కాని ఉత్ప్రేక్షా అతిశయోక్తులకు ఎంతమాత్రం అవకాశమే లేదు.

కనుక సూచనామాత్రంగా నైనా పామరజనులకు పరిచయం చేయడం కొరకు మాత్రమే, వారి దాహాన్ని తీర్చగలుగుతుందనే ఉద్దేశంతోనే అనువదించినాను. నా ఊహను పరిపూర్ణము చేసుకొన్నాను. అంతే తప్ప దాచుకున్నది లేదు. నా ఈ ప్రయత్నములో ఏ పూట వ్రాసిన దాన్ని ఆ పూటనే చదివి అర్థం చేసుకొని నన్ను వెన్నుతట్టి ముందుకు నడిపించిన శ్రీమాన్ శేషం ఆళ్వార్ స్వామి వరంగల్ గార్కి సాష్టాంగప్రణామాలు.

అటుపిమ్మట నా బాల్యము నుండీ నన్ను ప్రోత్సహించుతూ మంగళాశాసనాలు చేస్తూ వచ్చిన శ్రీమాన్ డా॥ సముద్రాల యాదగిరిస్వామిగారు నా అనువాదాన్ని మొత్తాన్నీ చదివి ప్రశంసలు అందించినవారు ముఖ్యులు. వారికి వేనవేలదండాలు పెడుతున్నాను. శ్రీ రఘునాథాచార్యస్వామివారి అన్తేవాసులు వీరు.

ఇంకా ఈ గ్రన్థము అనువాదము చేయడంలో అక్షరరూపం దాల్చడంలోనూ మనసా వాచాకర్మణా చివరదాకా అండగా నిల్చిన నిజమైన మిత్రులు పండితులు శ్రీమాన్ డా॥ కిడాంబి నరసింహాచార్యులు, హైదరాబాదుగారికి ఎన్నివిధాలుగా ఐనా ఋణం తీర్చుకోవడం సాధ్యముకాదు. కనుక వారికిన్నీ తలవంచి నమోవాకాలు అర్పించుతున్నాను.

ఇంకా అజ్ఞాతంగా మూగగా నా ఈ ప్రయత్నం సఫలం కావాలని శ్రియఃపతి పాదారవిందాల వద్ద విన్నవించిన సహృదయ సుమనస్కులందరికీ చేతులెత్తి మ్రొక్కుతున్నాను.

ఈ గ్రన్థాన్ని చక్కగా, అందంగా DTP చేసిన మార్కండేయస్వామిగారికి, ముద్రించిన కర్షక్ ప్రింటింగ్ ప్రెస్సువారికిన్నీ ధన్యవాదాలు.

ఇట్లు

తేది: 10 –11–2019 భాగవతదాసుడు

హైదరాబాదు **కంద్లకుంట వేంకటనరసింహాచార్యులు**

ఓం

అస్మద్గురుభ్యో నమః　　　　　శ్రీమతే రామానుజాయ నమః

శ్రీ రఘునాథ దేశికేభ్యోనమః

# "సంతు శ్రేయాంసి భూయాంసి"

**శ్రీవాత్స్య వరదాచార్యపౌత్రం తత్పదసంశ్రయమ్ ।**
**తాతార్యతనయం వందే రఘునాథాహ్వయం గురుమ్ ॥**

తేది 12-5-1999 మొదలుకొని, వేసవి మరియు దసరా శలవులను అవకాశంగా తీసుకొని, 06-5-2001 వరకు వరంగల్ గీతాభవనంలో ఉ.వే. శ్రీమాన్ ముడుంబై రామానుజాచార్యులవారి ఆధ్వర్యంలో అయిదు విడుతలుగా, అమోఘమైన రీతిలో "శ్రీభాష్యశిక్షణ శిబిరములు" నిర్వహింపబడినవి. తత్సందర్భముగా వెలువరించిన "శిబిరముల సమాపనోత్సవ కరపత్రము" నందు ఈ దిగువ తెల్పబడిన రీతిగా ప్రకటింపబడినది.

"మనకు ప్రమాణమైన ఉపనిషత్తుల అర్థాన్ని నిర్ణయిస్తూ శ్రీవేదవ్యాస భగవానుడు బ్రహ్మసూత్రాలను అనుగ్రహించాడు. అట్టి బ్రహ్మసూత్రాలపై శ్రీ భగవద్రామానుజులు విరచించిన గ్రంథానికి "శ్రీభాష్యము" అని పేరు. శ్రుతి, స్మృతి, పురాణ, ఇతిహాసములను సుందరంగా సమన్వయపరుస్తూ; పూర్వాచార్య సురక్షితమగు విశిష్టాద్వైత సిద్ధాంతమును శ్రీభాష్యం ద్వారా ప్రవర్తింపజేశారు రామానుజులు. ఈ గ్రంథంపై "శ్రుతప్రకాశిక" అను పేర విస్తృతమైన వ్యాఖ్యానాన్ని తరువాతి తరాలవారికోసం రచించినవారు శ్రీ సుదర్శనసూరి.

శ్రుతప్రకాశికావ్యాఖ్యాసహితంగా శ్రీభాష్యగ్రంథాన్ని సాధికారంగా, ప్రామాణికంగా ప్రవచనము చేయు మహానుభావులు చాలా అరుదుగా లభిస్తున్న ఈ కాలంలో "నడయాడు శ్రీభాష్యము" అగు శ్రీమాన్ న.చ. రఘునాథాచార్యస్వామివారు కృపామాత్ర ప్రసన్నులై మే 12, 1999 న ఆరంభించి రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన 25 మందికి పైగా శిక్షణార్థులకు అయిదు శిక్షణా శిబిరాలలో 'శ్రీభాష్యము'ను ప్రవచించినారు. జూన్ 10, 2001 న ఉదయం ప్రవచనగోష్ఠి సమాపనోత్సవము (శాత్తుముఱై); సాయంత్రము ఆచార్య వరివస్యామహోత్సవము జరుగును." అని.

అత్యంత మహనీయమైన ఆ శ్రీభాష్యగోష్ఠిలో తమ కుమారులతో సహా ఉ.వే. శ్రీమాన్ ముడుంబై రామానుజాచార్యులవారు, ఉ.వే. శ్రీమాన్ సముద్రాల పురుషోత్తమా

చార్యులవారు; ఉ.వే. శ్రీమాన్ టి.కే.వి. అయ్యంగార్ గారు; ఉ.వే.శ్రీమాన్ సాతులూరి గోపాలకృష్ణమాచార్యులవారు, (అట్లే) మా ఆచార్యులవారగు ఉ.వే. శ్రీమాన్ ఎరిజర్ల సీతారామానుజాచార్యులవారు మొదలగు పెద్దలు చాలామంది అన్వయించారు. ఆ మహానుభావులందరితో కలిసి నేను, మా సోదరుడు చి॥ కండ్లకుంట వెంకట నరసింహాచార్యులు కూడా శ్రీభాష్య శిక్షణార్థులమై అన్వయించియున్నాము.

మహామహోపాధ్యాయ, కవిశాబ్దిక కేసరి, శాస్త్రరత్నాకర ఇత్యాది బహుబిరుద భూషితులు, రాష్ట్రపతి బహుమతి గ్రహీతలూ ఐన ఉ.వే. శ్రీమాన్ డా. నల్లాన్ చక్రవర్తుల రఘునాథాచార్యస్వామి వారి శ్రీభాష్య ప్రవచనాలను శ్రద్ధగా ఆలకించి, సూక్ష్మాంశములను కూడ శీఘ్రగతిన గ్రహించి మదిలో సుస్థిరం చేసికొన్న బుద్ధిశాలి శ్రీమాన్ కండ్లకుంట వేంకట నరసింహాచార్యులు.

శిక్షణ జరుగుచున్న రోజులలోనే చి॥ వెంకట నరసింహాచార్యులు జిజ్ఞాసతో ఒకచోట వచ్చిచేరిన సహ శిక్షణార్థులకు ఏ రోజు ప్రవచింపబడిన అంశములను ఆరోజే రాత్రివేళ చింతనగా వివరించేవాడు. దాంతో అతనిలో విషయ వైశద్యము చక్కగా ఏర్పడినది. అతనిలోని అవగాహనా గాఢతను గమనించిన శ్రీమాన్ ఆచార్యుల వారికి అతనిపై ఒక ఉత్తమ ఛాత్రుడుగా సదభిప్రాయ మేర్పడినది. దాని ఫలితమే శ్రీస్వామి వారి ఒక తిరునక్షత్రోత్సవ సందర్భమున స్వయంగా శ్రీమాన్ ఆచార్యస్వామివారి శ్రీహస్తముల ద్వారా – "శ్రీరఘునాథ దేశిక విశిష్టపురస్కార" స్వీకారమహాభాగ్యము. అది సామాన్యులకు అందునట్టిది కాదు. వారి హృదయం మెచ్చిన ఏ కొద్దిమంది విద్వద్వరులకో, ప్రతిభా సంపన్నులకో లభ్యమయ్యే అమూల్యమైన ప్రశంసాత్మకమైన పారితోషికమది.

తదనంతరకాలములో శ్రీమాన్ వెంకట నరసింహాచార్యులు ఆచార్యులవారి విశేష కటాక్షఫలంగా తనకు లభించినట్టి – శ్రీభాష్య పరిజ్ఞానమును పెంపొందించుకొని, దానినపేక్షించు శ్రద్ధాళువులకు బోధించి, ఋషి ఋణం తీర్చుకొనుట ద్వారా తాను కృతార్థతను పొందదలచినాడు.

అతడు సత్సంకల్పంతో అచిరకాలంలో శ్రీభాష్య శిక్షణాపేక్షతో సన్నిహిత మిత్రులొకరిద్దరు కోరుటే ఆలస్యం, వెంటనే ఆచార్యులవారి అనుమతితో శ్రీభాష్య ప్రవచనాన్ని ఆరంభించినాడు. వారు పట్టుదలతో విఘ్నశతాలను అధిగమిస్తూ ప్రవచనాలను త్వరితకాలంలో అధికరించి సమాపనోత్సవాన్ని (శాత్తుముఱై) గావించారు. భాగవత తదీయారాధనతో కాలక్షేపగోష్ఠిని సుసంపన్నం చేసుకొన్నారు.

అటు పిమ్మట ఈ సమాచారం తెలుసుకొన్న మరికొందరు శ్రద్ధాళువులైన జిజ్ఞాసువులు వెంకట నరసింహాచార్యులను అభ్యర్థించి, తమ పట్టణము (కరీంనగరము) నకే ఆహ్వానించుకొని, అక్కడ వారికి తగిన వసత్యాదిక సౌకర్యముల నేర్పరచి, మిక్కిలి శ్రద్ధతో తగురీతిలో వారినుండి "శ్రీభాష్యప్రవచన గోష్ఠి"ని సేవించుచున్నారు. ఈ సందర్భంలోనే వారు శ్రీమాన్ వెంకట నరసింహాచార్యులవారిని, "అయ్యా! ఈ శ్రీభాష్యమును సంస్కృత పరిచయము (అంతగా) లేనందున మళ్ళీ మళ్ళీ చదివి గ్రహింపజాలము గనుక తాము దయతో (యథామూలం) తెలుగులోనికి అనువదించి ఇస్తే మాకెంతో ఉపకారకమౌతుంది కదా! అట్లా తమరు దీనిని తెలుగులోనికి అనువదించి అందించగోరుచున్నాము" అని.

వారి ప్రార్థనను ప్రేరణగా గైకొని, ఆలస్యం లేకుండా అందుకు సిద్ధపడి, శ్రీభాష్యాంధ్రాను వాదమును ఆరంభించడం, పట్టుదలతో కొనసాగించి పూర్తి చేయడమేగాక, దానిని త్వరితగతిలో (స్వయంగానే) ముద్రణ పూర్తిచేసి, గ్రంథావిష్కరణకూ సిద్ధపడుతూ ఉండడం ఎంతగానో ప్రశంసనీయమైన అంశం.

ఇక ముఖ్యాంశం – అనువాద సరళిని తెలుసుకోవడం గురించి. గ్రంథంలోని ఆయా ఘట్టాలలోని అనువాద విశేషాలను తెలుసుకోవాలన్నప్పుడు ఆ మూలపంక్తులను, తదనువాద వాక్యములను ఈ పరిచయపు మాటలకడ ప్రస్తావించడం విస్తృతమౌతుంది గనుక, క్లుప్తముగ కొన్నింటిని పేర్కొని, మూలగ్రంథమును ప్రక్కన పెట్టుకొని, పైన పేర్కొన్న వాటిని పోల్చుకొని చూచుకొనుట ద్వారా అనువాదసరళిని గ్రహించగలరని భావించుచున్నాను.

**అనువాదసరళికి కొన్ని ఉదాహరణలు – (వ్రాతప్రతిలో)**

1. మంగళశ్లోకము (నాందీశ్లోకము)
   "అఖిలభువనజన్మ... ... ...శేముషీ భక్తిరూపా."

ఈ శ్లోకమునకు తాత్పర్యరూపమునగాక, ఉపోద్ఘాత రూపముగా వివరణ చేయబడింది.

భగవంతుడగు శ్రీమన్నారాయణుడే సృష్టి స్థితి లయకారకుడను విషయాన్ని విశదం చేస్తూ, అది అతని లీల అని, ఆశ్రితులైన ప్రాణికోటిని రక్షించడమే అతని దీక్ష అనీ, తెలిపి, ఆ పరమాత్మ వేదాంతములనబడు ఉపనిషత్తులచే ప్రతిపాదింపబడినవాడు. అట్టి శ్రీనివాసుడు (పరమాత్మ) నాలో భక్తిపూర్వకమైన బుద్ధివిశేషాన్ని ప్రకాశింపజేయుగాక

అని రామానుజులవారి ప్రార్థనారూపమైన మంగళం గ్రంథాదిలో రచింపబడిందని సూచించబడింది.

ఈ నాందీరూపమైన శ్లోకం ద్వారా శ్రీభాష్యగ్రంథగతమైన అంశాలు ఎట్లు సూచింప (ధ్వనింప) బడినవో వివరించినారు.

2. రెండవశ్లోకం–
"పారాశర్యవచస్సుధా... ... ...భౌమాః పిబన్త్వన్వహమ్."

ఇందు ముఖ్యమైన అంశం – పాలసముద్రాన్ని మథించగా వచ్చిన అమృతానికి, పారాశర్యవచస్సుధకు తగిన పోలికను రామానుజులవారు ఇందు వర్ణించిన వివరం విశదీకరించబడింది.

3. తిరోధానానుపపత్తి (వ్రాతప్రతిలో 128, 129 పుటలు)

4. "లోకవత్తు లీలాకైవల్యమ్" (బ్ర.సూ.) 2-1-33

5. "అనావృత్తిశ్శబ్దాదనావృత్తిశ్శబ్దాత్ (బ్ర.సూ.) 4-4-22. మొదలగు వానిని యథామూలం పరిశీలించగోరుతూ; విస్తృతిభీతిలో విరమిస్తున్నాను.

శేషోవా సైన్యనాథోవా
శ్రీపతిర్వేతి సాత్త్వికైః ।
వితర్క్యాయమహాప్రాజ్ఞై
భాష్యకారాయ మంగళమ్ ॥

స్వస్తి
ఇతోఽధిక శ్రేయః ప్రాప్తిగా దీవిస్తూ

05-08-2019

సోదరుడు
**సముద్రాల యాదగిరి స్వామి**

# విన్నపము

ఈ శ్రీభాష్య అనువాదంను గూర్చి రెండు మాటలు వ్రాయమని ఆచార్యులు, శ్రీమాన్ కవిశ్రాబ్ధిక కేసరులైన రఘునాథ దేశికుల పురస్కార గ్రహీతలైన శ్రీమాన్ కండ్లకుంట వేంకట నరసింహాచార్యులగారి ఆదేశము (ఉపదేశము/వచనము) నాల్గు అధ్యాయాలు – అధ్యాయానికి నాల్గు పాదాలు – ప్రతిపాదంలో తక్కువలో తక్కువగా ఐదు అధికరణాలు. ఎక్కువలో ఎక్కువగా ఇరవై ఆరు అధికరణాలు – కలిగి మొత్తంగా, నూటయాభైఆరు అధికరణాలు కల్గి, మొత్తంగా ఐదువందల నలభైఐదు సూత్రాలు గలది. దానికి 'సూత్రాక్షరాణివ్యాఖ్యాస్యంతే' అని ఆరంభించి అన్యూనానతిరిక్తంగా అన్నట్లు సాగిన అక్షరవ్యాఖ్య గలది శ్రీభాష్యము. దీనికర్త భగవద్రామానుజులు. రచన సంస్కృతంలో ఉన్నది. దీన్ని పఠించాలంటే షట్‌శాస్త్రములలో నిష్ణాతులై యుండాలి. (వ్యాకరణము, తర్క శాస్త్రము, మీమాంస వంటివి) అట్టి గ్రంథాన్ని శాస్త్రరత్నాకరులైన శ్రీమాన్ రఘునాథ దేశికులవారివద్ద పాఠంగా పొందినవారు శ్రీమాన్ మా ఆచార్యులవారు, కొందరూను. చదివిన పాఠాన్ని సాధికారికంగా ఇతరులకు పాఠంగా చెప్పగలిగిన వారు మా ఆచార్యులు. అందుకు వారు చేసిన శ్రీభాష్యపారాయణాలు, శ్రీభాష్యంపైన వారు చేసిన ఉపన్యాసాలు, అంతకంటే ముందు పాఠం నేర్చుకొంటున్న కాలంలోనే తోటి సహపాఠకులకు, జరిగిన, తాను విన్న పాఠాన్ని మళ్ళీ తాము చెప్పటం సాధారణ మేధస్సులకు దుస్సాధ్యం. వారి దగ్గర ఈ మధ్యకాలంలో, రిటైరయ్యాక, సప్తతిప్రాయంలో, బుద్ధి రోజురోజుకు మందగిస్తున్నవేళ, గ్రంథం పఠించిన, అల్పమేధస్సుతో రెండు వాక్యాలు వ్రాయబూనటమూ సాహసమే. 'ఉద్బాహురివవామనః' అన్నట్లు. ఐనా ఆచార్యుల వారి ఆజ్ఞ.

ఉ.వే.ప్ర. శ్రీమాన్ కండ్లకుంట సీతారామానుజాచార్యులవారి, అనగా వారి తండ్రిగారి వాగ్ధార వీరికి వంశతః సంక్రమించిన గుణం. అది ఉపన్యాసం చెప్పినా, పాఠం చెప్పినా, గ్రంథరచన సాగినా ఆ వాగ్ధార సాగుతూనే ఉంటుంది. అందువల్ల మూలానువాదంలో మధ్యమధ్య వారి వివరణ వాక్యాలు కన్పిస్తాయి. సాంకేతిక పదాలకు వివరణ కన్పిస్తుంది. ఆయా మతాలను (సాంఖ్యాది) గూర్చి చర్చించేవేళ ఇతరులైన వారి మతం గూర్చిన అవగాహన కల్పిస్తారు (పేజి 565). ప్రయోగించిన పదంకు, పాఠకుల సౌకర్యం కొరకు, అర్థమయ్యే కొరకు పర్యాయపదాలు వాడారు. వీలైనంత సులభంగా అర్థమయ్యేట్లు వ్రాసే ప్రయత్నం చేశారు, అనుకూల, వ్యతిరేక వాక్య నిర్మాణం, ఒక సర్వనామం ఆ సందర్భంలో ఏ నామవాచకాన్ని తెల్పుతుందో వివరిస్తూనూ.

భగవద్రామానుజుల తరువాత ఈ వెయ్యేళ్ళ కాలంలో శ్రీభాష్యాన్ని అనువదించే సాహసం చేసినవారు ఇద్దరే కన్పిస్తున్నారు. శ్రీమాన్ కందాడై శేషాచార్యులవారు తొలివారు. వీరు రెండవవారు. సంస్కృతంలోనైతే వేదాంత దేశికుల వారు మొదలుకొని దశాధికంగా వ్యాఖ్యలు వచ్చాయి. తెలుగులోను శ్రీభాష్యంలోని కొన్ని కొన్ని విషయాలు గ్రంథంగా వచ్చి యుండవచ్చును. కాని, శ్రీభాష్యాన్ని సంపూర్ణంగా తెలుగున అనువదించినవారు ఈ ఇద్దరు తప్ప మూడవవారు ఉన్నట్లు లేదు.

శాస్త్రగ్రంథము, ఆచార్యుని వద్ద సేవించవలసిన గ్రంథము శ్రీభాష్యము. ఈ గ్రంథంపై ఒక అవగాహన కల్పించటానికి 'గుడ్డిలో మెల్ల' అన్నట్లుగా కొంతలో కొంత ఉపకరిస్తుంది. ఈ గ్రంథం చదివితే శ్రీభాష్యం తెలిసినట్లే అని భావించకుండా, వేదములు, ఉపనిషత్తులు, భారతీయ (శ్రీవైష్ణవ) సంప్రదాయం ఈ దశకు చేరటానికి ఎన్నెన్ని మెట్లు ఎక్కి వచ్చిందో గమనించాలి. జీవుడు దేవుడుగా మారటానికి చేయవలసిన సాధన ఏమిటో తెలుసుకోవటానికి, ఉన్నస్థితి, చేయవలసిన ప్రయాణం, చేరాల్సిన గమ్యం నిర్దుష్టంగా గ్రహించటానికి ఈ అనువాదం, ఇందలి విషయాలు, సులభంగా, తెలుగువారికి లభిస్తాయి. ఇదొక గొప్ప ప్రయత్నం. తెలిసిన విజ్ఞానాన్ని నలుగురికి పంచటం (అధీతిబోధ ఆచరణ ప్రచారాలు) చదువుకున్నవారు చేయాల్సిన పని. తమ గురువులైన తండ్రిగారు, శ్రీమాన్ రఘునాథదేశికులవారు అనుసరించిన మార్గాన్ని అనుసరిస్తూ తమ జీవితాన్ని సార్థకపరచుకుంటున్నారు. అందులోని ఒక భాగమే ఈ శ్రీభాష్య అనువాదము కూడా. రామానుజార్యది వ్యాజ్ఞావర్ధతాం.

ఇట్లు
దాసుడు

హైదరాబాదు
14-9-2019

**– కిడాంబి నరసింహాచార్య**
సెల్: 9866828404

శ్రీమతే రామానుజాయనమః

# ఉపోద్ఘాతము

భారతదేశమునందు మిగతాదేశాల కంటే మిన్నగా ఆధ్యాత్మిక విచారము యుగయుగాలుగా కొనసాగుతూ వస్తున్నది. ఆ విషయములో శాశ్వత సత్యము – ఎల్లవేళలా అప్రతిహతమైన ఉనికి కలిగినట్టిది ఏది? అనే విచారము ధీమన్తులగు ద్రష్టలచే చేయబడింది. కనుపించుతున్న వస్తువులన్నీ పుడుతున్నవి. నశించుతున్నవి కనుక శాశ్వతమైన సత్యము ఏదీ లేదని కొందరు ప్రత్యక్షము ప్రమాణము ఆధారముగా నిశ్చయము చేసినారు. వీరు నాస్తికులు అనబడినారు. తమ సిద్ధాన్తాన్ని శ్రవణమనోహరముగా మనోరంజకముగా ప్రవచించినందువల్ల చార్వాకులు అనబడినారు. తరువాత వచ్చినవారు ఎన్నిరూపులు దాల్చినా 24 వికారాలు కలిగిన ప్రకృతి – ప్రధానము, పురుషుడు అనే రెండు తత్త్వాలు ఉన్నవి అని సాంఖ్యులు నిరూపించినారు. కొందరు అణువులు మూలముగా ఉన్నవని వాటి కలయిక వల్ల జగత్తు పుడుతున్నదని అన్నారు. వీటిలో కొద్ది తేడాను ఒప్పుకున్నందువల్ల కొందరు వైశేషికులు కాగా మరికొందరు నైయాయికులు అనబడినారు. మరికొందరు సమ్యక్ జీవనాన్ని ప్రతిపాదించినారు. ప్రశాన్త మరణమే /దేహత్యాగమే మోక్షము పునర్జన్మ లేదని అన్నారు. స్వర్గ నరకాలూ లేవు అని అన్నారు. వారే క్రమంగా జైనులు బౌద్ధులు ఐనారు. తరువాత సమ్యక్ జీవనానికి మూలమైన కర్మాచరణమే పరలోకంలో సుఖానికి హేతువు అవుతుంది అని చెపుతూ వేదప్రామాణ్యాన్ని అంగీకరిస్తూ కర్మలకు ప్రాధాన్యమును చెప్పినారు. జడమైన కర్మము ఫలాన్ని ఇవ్వడములో సమర్థము కాదు అని చెప్పుతూ ఆయా కర్మలచేత ఆరాధింపబడే అతీత శక్తి ఒకటి ఉన్నది. అదే మనం కోరిన ఫలాలను యాగాదులవల్ల ఆరాధింపబడి సంతృప్తి చెంది దయతో ఉపాసకుడికి ప్రసాదించుతున్నది అని ఈశ్వరుడనబడేవాడిని అంగీకరించినారు. ఈశ్వరుడు అనబడే ఇంద్రియాతీత శక్తి వేదము అనే ప్రమాణము ద్వారానే తెలియబడుతుంది అని అంగీకరించి అతడు శాశ్వత సత్యమని మూడు లోకాలను ఆయన సంకల్పము మాత్రము చేతనే పుట్టించి, రక్షించి, పోషించి, తిరిగి తన సంకల్పము ప్రకారం తనలో కల్పుకుంటున్నాడని సిద్ధాన్తము చేసినారు. ఐతే ఆయనకు నామము రూపము గుణములు ఉన్నాయా? ఆయన నివాస స్థానము ఎక్కడ? వంటి ప్రశ్నలు వేసుకొని ఉపనిషత్తుల ద్వారా విచారము చేసి నిర్ధారణ చేసుకున్నారు. ఇక్కడే సిద్ధాన్త భేదాలు ఏర్పడినవి.

దీనిపైన వేద సంహితయందు సమగ్రమైన అవగాహన కలిగి ఉండి అఖండమైన వేదాన్ని ఋక్కులు, యజుస్సు, సామము అధర్వణము అని వాటి స్వభావాన్ని కర్మలలో వాటికి ఉండే

ప్రాధాన్యాన్ని బట్టి నాలుగు విభాగాలుగా చేసి తన శిష్యుల ద్వారా లోకంలో ప్రవర్తింపచేసినాడు. ఆయనకు వేదవ్యాసుడు అనే సార్థకమైన నామధేయము ఏర్పడింది. తన కాలంలో జరుగుతున్న చర్చలను గమనించి పెద్దలై వేదార్థవేత్తలైన మహర్షుల యొక్క సన్నిధిలో సిద్ధాన్త నిర్ణయాన్ని చేసి **'బ్రహ్మసూత్రాలు'** అనబడే సూత్రాలను రచించినాడు. అవి నాలుగు అధ్యాయాలుగా ఉన్నవి మొదటి రెండు సాధ్యద్వికము అనబడితే తరువాతి రెండధ్యాయాలు సాధనద్వికము అని పిలువబడినాయి. ఒకటవ అధ్యాయానికి సమన్వయాధ్యాయము, రెండవ అధ్యాయానికి అవిరోధాధ్యాయము, మూడవ అధ్యాయానికి సాధనాధ్యాయము, నాలుగవ అధ్యాయానికి ఫలాధ్యాయము అని పేర్లు ఉన్నవి. పేర్లకు తగినట్లే వేదము పరమాత్మను తెలుపడములో తగిన సమర్థత కలది కాదు అనే ఆక్షేపాన్ని, బ్రహ్మను గురించి జిజ్ఞాసా తెల్సుకోవాలి అనే ప్రయత్నాన్ని చేయవలసిన అవసరము లేదు అనే వాదాన్ని ఖండించుతూ తత్వనిర్ణయము చేస్తూ మూలకారణము ఆయననే అనే విషయాన్ని స్థాపించడము ప్రథమాధ్యాయంలో జరిగింది. రెండవ అధ్యాయములో సాంఖ్యాది సిద్ధాన్తాల ఖండనము చేస్తూ పరావరతత్త్వాన్ని నిర్ధారించినారు. మూడవ అధ్యాయములో ఉపాసనా మార్గాలు ప్రతిపాదింపబడినాయి. నాలుగవ అధ్యాయములో పరమ పురుషార్థమైన మోక్ష పురుషార్థము ప్రతిపాదింపబడింది.

ఈ బ్రహ్మ సూత్రాల ఆధారంగానే తరువాతి కాలములో భారతీయ ఆధ్యాత్మిక ధోరణి ముందుకు సాగింది. చార్వాక జైన బౌద్ధాది నాస్తిక వాదాలను ఖండించుతూ వైదికమార్గము ప్రవర్తించింది. దీన్ని బలపరుస్తూ ఈశ్వర స్వరూపాన్ని నిర్ణయించి ఆదిశంకరాచార్యుల వారు అనేక తత్త్వాలు లేవు ఒక్కటే తత్త్వం ఉన్దని అద్వైతాన్ని నిరూపించినారు. వారి సిద్ధాన్తమునకు మూలము బ్రహ్మ సత్యం – జగన్మిథ్యా అనే అంశము. వీరి బ్రహ్మ నామరూప గుణక్రియాదులు లేని నిర్విశేష బ్రహ్మ. వీరి వాదాన్ని అంగీకరించుతూనే కొద్ది భేదాన్ని చెప్పినవాడు భాస్కరాచార్యులవారు. ఈయన బ్రహ్మకు నామరూపగుణాదులు ఉన్నవి. అంగీకరిస్తూనే అవి ఉపాధి వల్ల వచ్చినవి అని అన్నాడు. ఐతే ఆ ఉపాధి, జీవాత్మలకు భేదాన్నిన్నీ సహజమైనవేనంటూ భేదాభేదాలను ప్రతిపాదించినవాడు యాదవ ప్రకాశులవారు. ఇది భగవద్ రామానుజులవారు జన్మించే నాటికి ఉన్నటువంటి ఆధ్యాత్మిక ప్రపంచ పరిస్థితి.

ఇది ఇట్లుంటే సాధారణ జనము అతీతమైన శక్తి ఒక్కటి ఉన్నతి అని నమ్ముతూ తమకంటే బుద్ధిమన్తులు, పూర్వీకులు ఐన కొందరు పెద్దలు చెప్పిన ప్రకారము వేదముచే ప్రతిపాదింపబడిన శక్తిని బ్రహ్మేన్ద్రరుద్రాదులు, భద్రకాళి, వినాయకుడు, కుమారస్వామి, వీరభద్రుడు, భేతాళుడు మొదలుకొని గ్రామదేవతల వరకు తమ విశ్వాసాల ప్రకారము కొలుస్తుండేవారు.

ఇటువంటి సమయంలో కొందరు పరస్పరము మాటలతో ఘర్షణ పడుతూ తమదైవమే అసలు తత్త్వము అని ఒప్పించప్రయత్నించుతూ నెగ్గలేనప్పుడు పరస్పర హననానికిన్నీ

వెనుకంజవేయలేదు. మతకలహాలు పెరిగేట్లు చేసేవారు. అందుకు రాజుల సాయాన్ని కూడా తీసుకుంటూ ప్రత్యర్థులను తుదముట్టించుతూ తమ తమ అభీష్టదైవాల పేరు మీద గొప్ప గొప్ప ఆలయాల నిర్మాణాన్ని చేయించి ఉత్సవాలు జాతరలు చేయించుతూ తమవాదానికి ప్రచారం చేసుకుంటుండేవారు.

ఆ సమయంలో భగవద్ రామానుజులవారు అవతరించి పరతత్త్వాన్ని స్థాపించుతూ పండితులను వేదప్రమాణ పూర్వకంగా రాజ సభల్లో మెప్పించుతూ ఒప్పించుతూ సిద్ధాన్త స్థాపన చేసినారు. వారికి వేదవ్యాస విరచితమైన బ్రహ్మ సూత్రాలు కరదీపికలుగా ఉంటుండగా తమ కన్నా ముందు కాలాలకు చెందిన ఆళ్వార్లు రచించిన దివ్యప్రబన్ధాలు తైలాలు ఐ మరింత వెలుగులను విరజిమ్మినాయి. యావద్ భారతమూ సంచారము చేస్తూ వేదాన్ని బ్రహ్మ సూత్రాలనూ రెండు చేతుల్లో పట్టుకొని సవ్యసాచి లాగా విపక్ష పండిత లోకాన్ని జయించినారు రామానుజులు. ఆ తరువాత తమ యొక్క పరమాచార్యులైన యామునాచార్యులవారి కోరిక ప్రకారము బ్రహ్మసూత్రాలకు విపులమైన సాధికారికమైన సప్రమాణికమైన వ్యాఖ్యానాన్ని వ్రాసి కాశ్మీర దేశములోని శారదా పీఠస్థ సరస్వతీదేవికి సమర్పించగా ఆమె దాన్ని చూచి మెచ్చి ఆనందాశ్రువులను కురిపిస్తూ ఆగ్రన్థానికి **శ్రీభాష్యము అనే అన్వర్థమైన నామాన్ని కటాక్షించింది.** అదే రామానుజులవారు కృప చేసిన విశిష్టాద్వైత సిద్ధాన్థానికి పట్టు కొమ్మగా అలరార్తున్నది.

తరువాతి కాలములో జన్మించిన మధ్వాచార్యులవారు తత్త్వము శ్రీమన్నారాయణుడే. ఆయన అనుగ్రహము వల్లనే జీవుడికి మోక్షము సిద్ధించుతుంది అని చెప్పుతూ పరబ్రహ్మ – జీవుడు రెండూ శాశ్వతసత్యాలే అంటూ తమ మతాన్ని ప్రతిపాదించినారు. దీనికే ద్వైతము అని పేరు.

ఆదిశంకరాచార్యులవారు నిర్విశేషబ్రహ్మ ఒక్కటే సత్యము. రెండోది ఏదీలేదని అద్వైతాన్ని – పరమాత్మ – ప్రపంచము లేవు, పరబ్రహ్మనే శాశ్వత సత్యము అను విషయాన్ని ప్రతిపాదించినారు. ఈ విధంగా ముగ్గురు ఆచార్యులు వేదాన్ని పరమ ప్రమాణంగా అంగీకరించుతూ మూడు సిద్ధాన్తాలను స్థాపించినారు.

భగవద్ రామానుజులవారు, విశిష్టాద్వైతాన్ని – ప్రకతి జీవుడు, పరమాత్మ మూడు తత్వాలున్నాయంటూనే పరమపురుషుడితో విడదీయరాని వేరుగాలేని/ విశేషణాలుగా పరమాత్మతో కూడి ఉన్నవి. కనుక విశిష్టమైన అద్వైతము – పరమాత్మ సత్యము అని ప్రతిపాదించినారు.

ఇందుకు సమ్బన్ధించిన వీరు ముగ్గురు ప్రతిపాదించిన సిద్ధాన్తాల సంగ్రహము ఇట్లున్నది. ముందుగా ద్వైతము.

**శ్లో॥** **శ్రీమన్మధ్వమతే హరిఃపరతరః సత్యంజగత్ తత్త్వతో**
**భిన్నా జీవగణాః హరేరనుచరాః నీచోచ్చభావంగతాః।**
**ముక్తిర్నైజ సుఖానుభూతిః అమలాభక్తిశ్చ తత్సాధనం**
**హ్యక్షాదిత్రితయంప్రమాణం అఖిలామ్నాయై కవేద్యోహరిః॥**

**తా॥** శ్రీమన్తులగు మధ్వాచార్యులవారి మతములో శ్రీమన్నారాయణుడే పరులు అనుకొనే బ్రహ్మరుద్ర ఇంద్రాదులకంటే మిన్నఐనవాడు. వీరి పుట్టుకకు కారణము అయ్యి వారికి ఆయా శక్తులను ప్రసాదించినవాడు కాబట్టి. మన కండ్లకు కనిపించే ఈ ప్రపంచమంతా నిజంగా ఉన్నటువంటిదే. ఇక పంచభూతాలతో నిండిన జగత్తులో ప్రాణులన్నీ వారి వారి కర్మల ప్రకారంగా దేవ తిర్యక్ మనుష్య స్థావరాదులుగా కనిపించేవన్నీ వేరు వేరయినటువంటివి. ఆయా శరీరాల్లో ఉండే ఆత్మలన్నీ శ్రీమన్నారాయణునికి అనుచరులే. అనాదిఐన కర్మలవల్ల వారు ఒకరు ఎక్కువ జ్ఞానాదిశక్తులు కలవారైతే మరికొందరు తక్కువజ్ఞానమును కలవారై అధికులు, నీచులు అని వ్యవహరింపబడుతున్నారు. మోక్షము అంటే తనదైన స్వరూపానికి తగినట్లు ఆనందరూపమైన సుఖాన్ని అనుభవించడమే. ఐతే ఆ ముక్తిని పొందడానికి సాధనము శ్రీమన్నారాయణుని పాదపద్మాలయందు నిశ్చలమైన భక్తి కల్గి ఉండడమే. ఈ విషయాన్ని తెలుసుకోవడానికి ప్రమాణాలు మూడే ఉన్నవి. అవే ప్రత్యక్షము అనుమానము శబ్దము (వేదములు) లు.

ఆత్మ–జీవాత్మలు వేరు వేరే. కనుక భేదము ఉన్నది అని అంగీకరిస్తున్నారు. కనుక ఇది ద్వైతవాదము, భేదవాదము అనబడ్తున్నది.

**ఇక అద్వైతవాద సిద్ధాన్తము.**

**శ్లో॥** **బ్రహ్మైకం పరమార్ధసత్ తదితరత్ మాయామయత్వాత్ మృషా**
**బ్రహ్మైవైకముపాధిబింబిత మతోజీవేశభా వంగతమ్**
**భ్రాన్తిస్సంసృతిరస్య తత్ప్రశమనం ముక్తిః తదప్యాత్మనో**
**బ్రహ్మైక్యావగమాత్ శ్రుతిశ్రవణజాత్ ఇత్యాహురద్వైతినః ॥**

**తా॥** బ్రహ్మ ఒక్కడే యథార్థంగా ఉన్నాడు అని అనబడుతున్నాడు. ఆయనకంటే వేరుగా ఉన్నట్లుగా కనబడేదంతా మాయవలన పుట్టింది. కనుక ఉన్నది అని అనబడుతున్నది కాని తరచి చూస్తే గారడి వాని మాయవలెనే లేకుండా పోతున్నది. ఉనికిని కలిగి ఉండడము లేదు కనుక

ప్రపంచము మిథ్య లేనిదే. ఇక బ్రహ్మ కూడా కర్మ అనబడే ఉపాధి అద్దము వంటి దానియందు ప్రతిబింబించిన రూపాన్ని చూసి నాకంటే వేరుగా మరొక్కడు ఉన్నాడని తలుస్తున్నాడు. తాను బ్రహ్మ అయ్యి ఉంటుండగా తనకు ఎదురుగూా ప్రతిబింబముగా కనిపించేవాడిని జీవుడు అని తలుస్తున్నాడు. ఇట్లా కలిగిన జీవ ఈశ్వరభావాన్ని – భ్రాన్తిని – సంసారము అని అంటున్నారు. భ్రాన్తి అంటే భ్రమ. ఒకదాన్ని చూసి మరొక్కటిగా తలువడము. ఈ విధమైన భ్రాన్తి/ లేక సంసారము బొత్తిగా అణగిపోవము/ నశించడము ముక్తి అనబడుతున్నది. ఐతే ఆముక్తి నేనే బ్రహ్మను నాకన్నా మరొకరు ఎవ్వరూ లేరు అని వేదవాక్యము ద్వారానే. తత్వమసి, సోఽహమస్మి ఇత్యాదులద్వారా తెలిసి రావడముతో కలుగుతుంది. అనగా నేనొక్కడినే ఉన్నాను. నాకన్నా వేరే ఎవ్వరూ లేరు. ఇంతకుమునుపు చూచినదంతా నా భ్రమనే అని యథార్థమును అర్థము చేసుకోవడముతో ముక్తి కలుగుతుంది అని అద్వైత సిద్ధాన్తాన్ని నమ్మేవారు చెప్తున్నారు.

**ఇక విశిష్ట అద్వైత సిద్ధాన్తము.**

**శ్లో॥ శ్రీమల్లక్ష్మణయోగినస్తు భువనం సత్యం, తదీశః శ్రియః**
**కాన్తో, బ్రహ్మ సఏవ, సోఽఖిలతనుః భిన్నాస్తతశ్చేతనాః।**
**సత్యా సంసృతిరీశనిగ్రహకృతా ముక్తిస్తుభక్త్యాదినా**
**తత్ ప్రాప్తిః పరమేపదే తదను భూత్యా ఖ్యేతి సంచక్షతే ॥**

**తా॥** ఇక రామానుజులవారి సిద్ధాన్తమునందు ఈ కనిపించే బ్రహ్మాండం అంతా సత్యమే యథార్థమే. ఈ విశ్వానికి అధిపతి లక్ష్మీ దేవికి భర్తయైన శ్రీమన్నారాయణుడే. ఆయనకే బ్రహ్మ అని పేరు. మరొకడు అటువంటి వాడు లేడు. ఆయన ఈ చరాచర ప్రపంచాన్నంతటినీ తనకు శరీరముగా చేసుకొని ఉంటున్నాడు. చేతనులు జీవులు అనబడే వాళ్లందరూ ఆయనకంటే వేరయిన వాళ్లే. జీవుల యొక్క మరణ జనన రూప, సుఖదుఃఖాత్మకమైన సంసారము అనబడేది భ్రమకాదు. భగవన్తుని యొక్క కోపము కారణముగా జీవునికి కలిగినటువంటిది. అది యథార్థమైనది. ఈ సంసారాన్నించి విముక్తి శ్రియః పతిపాదారవిందాలపై నున్న అనన్యమైన భక్తి, భగవత్ భాగవతాచార్య అనుగ్రహము, ప్రపత్తి శరణాగతులవల్లనే కలుగుతుంది. శరణాగతికి ఫలము ఐన మోక్షము ఈ పాంచభౌతిక శరీరాన్ని విడిచిన తర్వాత శ్రీ వైకుంఠ నగరములో లభించుతుంది. అది భగవన్తునికి కైంకర్యము చేయడము ద్వారా ఆయన అనుగ్రహాన్ని పొందడమే. భగవద్ గుణానుభవమే.

# శ్రీభాష్యము గురించి

ప్రాచీనులు తాము సమ్పాదించిన విజ్ఞానాన్ని తరువాత రాబోయే తరాలవారికి అందించడానికిగాను ఫలరసాలను, మందులనూ చిన్నచిన్న గుళికలుగా అందించినట్లే చిన్నచిన్న సూత్రాలుగా అనుష్టుప్పులుగానూ అందించినారు. ఆస్తికులైన పూర్వులు ప్రపంచము యొక్క ఉత్పత్తి స్థితివినాశనాలకు సమ్బన్ధించి కారకుడైన ఒక అతీంద్రియ శక్తిమన్తుడున్నాడని వాదోపవాదాల మీదట నిర్ణయించినారు. ఆయన వల్ల జీవులు మోక్షరూపమైన సంసారబన్ధవిముక్తినీ అన్తములేని ఆనందాన్నీ ఒక పరిమితకాలం మాత్రమే కాకుండా అనన్తకాలము వరకూ అనుభవించవచ్చునని తేల్చినారు. అందుకుగాను చేయవలసిన విధానాన్ని, ఆమార్గాలు కూడా ఒకటిరెండు గాకుండా 32 విధాలుగా, ద్వాతింశద్ బ్రహ్మవిధానాలుగా ఉన్నవని, నిరూపించినారు. ఇంకా దేహత్యాగము చేసిన పిమ్మట పరమపురుషుడి సన్నిధి చేరుకోబోయే మార్గముయొక్క వైభవాన్నీ ముక్తపురుషుని యొక్క ఐశ్వర్యాన్నీ శ్రుతిప్రమాణపూర్వకంగా స్థాపించినారు.

ఆ విషయాన్నే సూత్రాలరూపంలో కూర్చుచేసి ఉన్నారు. అవే బ్రహ్మసూత్రాలు. నారాయణాంశజుడైన వ్యాసభగవానుడు వాటిని రూపుదిద్దినాడు.

భారతీయమైన తత్వచిన్తన అంతా వేదాలపైన ఆధారపడి ఉన్నది. అవి అనన్తములు. వాటియొక్క అర్థాన్ని అవగాహన చేసుకొని సంగ్రహంగా అంటే ఒక్కమాటలో చెప్పడం పారాశర్యుడికి మాత్రమే సాధ్యము. అందుచేత ఆయన బ్రహ్మసూత్రరచన చేసినాడు.

సూత్రం అంటే నిర్వచనము ఇట్లా ఉన్నది.

**శ్లో॥ అల్పాక్షరమసందిగ్ధం సారవద్ విశ్వతోముఖమ్ ।**
**అక్షోభ్యమనవద్యం చ సూత్రం సూత్ర విదోవిదుః ॥**

అంటే చెప్పే విషయాన్ని గురించి సూత్రంలో చాలా తక్కువ పదాలు లేక అక్షరాలు ఉండాలి. వాటి సమన్వయంతో తెల్సుకొనే విషయంలో సందేహానికి తావు ఉండకూడదు. ముఖ్యమైన అంశాన్ని ప్రతిపాదిస్తూనే ఆలోచించే కొద్దీ పరమాత్మ వలే అన్ని విషయాలతో సమ్బన్ధము కలదిగా ఉండాలి. ఏ ఇతర ప్రమాణాల చేతనున్నూ స్థాపింపబడిన విషయము కదల్చలేనిదిగా ఉండాలి. ఈ అంతటిలోనూ ఎక్కడా అవద్యము/దోషము లేకుండా ఉండాలి.

ఇలాంటి సూత్రము సాధారణులకేగాక కొండొకచో పండితులకు కూడా అంత సులభంగా కొరుకుడు పడదు. కనుక గురుముఖతః మాత్రమే అధ్యయనం చేయాలి. కొందరు

విజ్ఞాన ఘనులు ఆచార్యులవారి ద్వారా పొందిన విజ్ఞానాన్ని తమ ప్రతిభా సామర్థ్యాలతో మరిన్ని అర్థవన్తమైన విషయాలను ప్రతిపాదించి మెరుగు దిద్దుతారు. దాన్ని వ్యాఖ్యానము అనే పేర్కొనవచ్చు. దానికి పెద్దలు చెప్పిన లక్షణము ఇట్లా ఉన్నది.

**శ్లో॥ పదచ్ఛేదః పదార్థోక్తిః విగ్రహో వాక్యయోజనా ।**
**ఆక్షేపస్య సమాధానం వ్యాఖ్యానం పంచలక్షణమ్ ॥**

మూలములోని పద్యానికి గాని, గద్యానికిగానీ పదములను విడదీయడము, పదముయొక్క అర్థాన్ని చెప్పడము, పదానికి విగ్రహము చెప్పడము, మొత్తంగా వాక్యంలో ఉండే పదాలకు పరస్పర సమ్బన్ధాన్ని స్థాపిస్తూ వాక్యనిర్మాణము చేయడం లేక వాక్యాలకూర్పు, వాక్యార్థము పైన, పదాలపైన అనేకాంశాలపైన వచ్చే ఆక్షేపాలపైన సమాధానమును వివరించడము వ్యాఖ్యానము అని చెప్తున్నారు. ఈ ఐదు లక్షణాలు ఉంటే దాన్ని వ్యాఖ్యానమనాలి.

మరి భాష్యము అంటే ఏమిటంటారా? ఒకరకంగా ఇది కూడా వ్యాఖ్యానము అనడానికి తగి ఉంటుంది. ఐనా వ్యాఖ్యానానికంటేనూ విస్తారమైన ఆక్షేపాలు సమాధానాలు చర్చోపచర్చలు చేయబడి సమాధానము సిద్ధాన్తరూపంలో వెల్లడిచేయబడ్తుంది. దాని లక్షణాన్ని కూడా పెద్దలు ఇట్లా ప్రవచించినారు.

**శ్లో॥ సూత్రార్థో వర్ణ్యతే యత్రవాక్యైః సూత్రానుకారిభిః ।**
**స్వపదానిచ వర్ణ్యన్తే భాష్యం భాష్యవిదో విదుః ॥**

దేనియందైతే సూత్రములోని భావము పొరపొచ్చాలు విస్తారము సంక్షేపమూ కాకుండా తగినంత మోతాదులో సూత్రము యొక్క అర్థము వివరింపబడుతుందో మరియు సూత్రములోని పదాలున్నూ విశదీకరింపబడుతాయో అట్టి వ్యాఖ్యానాన్ని భాష్యము అని భాష్యము యొక్క లక్షణాలను తెల్సుకొన్న పెద్దలు చెపుతున్నారు. ఇంక దీనికిపైన మరొక చర్చకు అవకాశముండదు. ఇటువంటి సంశయ విపర్యయాలకు అవకాశమివ్వని వ్యాఖ్యానాలను అనేక శాస్త్రాలకు సమ్బన్ధించి పూర్వులు చేసి ఉన్నారు. పాణిని వ్రాసిన వ్యాకరణ సూత్రాలకు పతంజలి సిద్ధాన్తీకరించిన వ్యాఖ్యానము మహాభాష్యము అని లోకప్రసిద్ధిని పొందింది. ప్రస్తుతము బ్రహ్మసూత్రాలకు భగవద్రామానుజులవారి కంటే ముందు నుంచీ మహానుభావులు అందించిన భాష్యాలు ఎన్నో ఉన్నాయి. ఐనా అవన్నీ (ఎక్కువశాతం) తమకు తోచిన భావాలకుగాని, ఆచార్యోపదేశము ప్రకారముగానీ, ఆనాటి దేశకాలాదులకు, పరిస్థితులకు అనుగుణంగా మలచబడి తరువాతికాలములోని ధీమన్తుల బుద్ధివైశద్యానికి ప్రతిభా సామర్థ్యాలకుగాని, తర్కప్రతర్కాలకుగానీ, న్యాయాలకు గానీ, ప్రత్యక్షాది ప్రమాణాలకుగానీ అనుగుణంగా లేకపోవడం చేత నిలువలేకపోయినాయి.

శ్రీమద్ రామానుజులవారి నాటికి శంకర, భాస్కర, యాదవ ప్రకాశాదుల భాష్యాలు బ్రహ్మసూత్రాలపైన బలంగా ప్రతిష్ఠింపబడినప్పటికీ వేదవిరుద్ధంగా ఉండడముతో నాథయామునుల మార్గంలో పయనించిన, ఆళ్వార్ల శ్రీసూక్తులతో బలపర్చబడిన, శ్రుతిప్రమాణబద్ధమైన యతిరాజుల శ్రీసూక్తులముందు అవి ఝంఝూవాతానికి దూదిపింజల వలె (పలాయనం చిత్తగించినాయి) గాల్లో తేలిపోయినాయి.

అంతేకాదు, సాక్షాత్తూ శారదాదేవి ఈ గ్రన్థాన్ని చూచి శ్రీభాష్యము అని అన్వర్థకమైన నామధేయాన్ని ప్రసాదించింది.

ఈ బ్రహ్మసూత్రాలు 545 ఉన్నాయి. వీటిని నాలుగు అధ్యాయాలుగా వేదవ్యాసుడే విభజించినాడు. ప్రతి అధ్యాయంలో నాల్గు చొప్పున 16 పాదాలు ఉన్నాయి. ప్రథమాధ్యాయానికి సమన్వయాధ్యాయము అనే పేరు కాగా రెండవది అవిరోధాధ్యాయనము, 3వది సాధనాధ్యాయము, నాలుగవది ఫలాధ్యాయము అనబడుతున్నది.

ఇక 16 పాదాలు వరుసగా 1) అయోగవ్యవచ్ఛేద, 2) అస్పష్టజీవాదిలింగక (అన్యయోగవ్యవచ్ఛేద), 3) స్పష్టజీవాది లింగక, 4) సుస్పష్టజీవాది లింగకములు (2వ అధ్యా.), 5) స్మృతిపాదము, 6) తర్కపాదము, 7) వియత్పాదము, 8) ప్రాణపాదము (3వ అధ్యా.), 9) వైరాగ్యపాదము, 10) ఉభయలింగపాదము, 11) గుణోపసంహారపాదము, 12) అంగపాదము (4వ అధ్యా.), 13) ఆవృత్తి పాదము, 14) ఉత్క్రాన్తిపాదము, 15) గతిపాదము, 16) ఫలపాదము.

స్థూలంగా ఆయాపాదాలలో విషయము ఈ విధంగా విభజించబడింది. 1వ పాదం: పరమాత్మ విషయంలో ఆయన ఇంద్రియాలకు అందేవాడుకాదు గనుక ఆయనను గురించి తెల్సుకోవడానికి వేదమే పరమ ప్రమాణము. సిద్ధవస్తువు గనుక వేదము పరమాత్మను తెలుపదు అని మీమాంసకుల వాదాన్ని ఖండించడము, సందర్భాన్ని బట్టి బ్రహ్మ అనే శబ్దము యొక్క అర్థాన్ని వివరించడము వేదవాక్యాలు ఆయన్ను గురించి చెప్పగల్గుతాయి అని సమర్థించడము జరిగింది.

2వ పాదంలో జీవుడు ప్రకృతి ప్రపంచ ఉత్పత్తికి కారణాలు అవుతారు అని చెప్పే వాక్యాలు అస్పష్టములు. ఆ పేర్లతోనే పరమాత్మనే చెప్పబడతాడని తెల్పినారు.

3వ పాదంలో ప్రకృతి జీవులను గురించి తెలిపే తేటగానున్న వాక్యాలను ఖండించడము.

4వ పాదంలో సుస్పష్టమైన జీవప్రకృతులను వివరించే వాక్యాలున్నూ పరమాత్మకు చెందినవి అని విశదీకరించినారు.

ఆ విధంగా ప్రథమ అధ్యాయములో వేదవాక్యాలు వాటిలోని శబ్దాలున్నూ పరమాత్మను గురించే ప్రతిపాదిస్తున్నాయి అని సిద్ధాన్తీకరించడంతో సమన్వయ అధ్యాయమనబడింది.

ఇక 5వ పాదము – ద్వితీయాధ్యాయ ప్రథమపాదము స్మృతిపాదము. ఇందులో సాంఖ్యస్మృతి ప్రమాణము కాదు. వేదాన్ని అంగీకరించడము, పరిణామ వాదాన్ని సత్ కార్యవాదాన్ని ఒప్పుకోవడంతో వైదికంగా కనిపించినా బ్రహ్మలేదని ప్రవచించడంతో కాపిలవాదము ఖండింపబడింది.

6వ తర్కపాదములో తార్కికవాదము త్రోసిపుచ్చబడింది.

7వ వియత్ పాదములో ఆకాశానికి కూడా ఉత్పత్తి ఉన్నదని, దాన్నుంచి పుట్టిన భూతాలు వాయువు, అగ్ని, జల, పృథివీ నాలుగున్నూ ఒకదాన్నుంచి ఒకటి పుట్టినవేనని, ఇంద్రియాలు వగైరాలు కూడా ఉత్పత్తి కలవేనని నిర్ధారించబడింది.

8వదైన పాదంలో ప్రాణము జీవులు మొదలైన వాటి యొక్క ఉత్పత్తిని గురించి చర్చించి నిర్ణయించినారు. జీవస్వరూపము, కర్తృత్వాదులు ప్రాసంగికంగా శోధన చేయబడినాయి.

ఇక మూడవ అధ్యాయము యొక్క ప్రథమపాదము వైరాగ్యపాదములో జీవుడికి ఈ సంసారముపై రుచి కలుగకుండా ఉండడానికి వైరాగ్యాన్ని కలిగించే అంశాలు చెప్పబడినాయి.

రెండవదైన ఉభయలింగపాదంలో పరమాత్మయొక్క ఉభయలింగములు అనగా హేయగుణాలు లేకపోవడము కళ్యాణగుణాలు అన్నీ ఆయనలోనే పోగుపడి ఉండడాన్ని వర్ణించినారు.

బ్రహ్మవిద్యలన్నంటిలోనూ వేరువేరు చోట్ల వేరువేరుగా చెప్పబడిన పరబ్రహ్మ యొక్క గుణాలను అన్ని విద్యలలోనూ చేర్చుకోవచ్చునా? లేక విడివిడిగానే ఉండవచ్చునా? ఐనప్పుడు బ్రహ్మలు వేరువేరు అవుతారు కనుక పరబ్రహ్మలు చాలామంది ఉన్నారా? ఫలమైన మోక్షము వేరువేరా? ఒక్కటేనా మొదలైన ప్రశ్నలమీద చర్చ చేయబడి ముప్పదిరెండు బ్రహ్మవిద్యలు ఉన్నా పరబ్రహ్మ ఒక్కడే. మోక్షరూప పురుషార్థమున్నూ ఒక్కటే నన్న సిద్ధాన్తము చేయబడుతుంది. గుణోపసంహారపాదములో (మూడవది).

ఇక అంగపాదము పన్నెండవది. దీనిలో కర్మలు – బ్రహ్మవిద్యలు దేనికి అంగముగా ఉంటుంది? కర్మలకు బ్రహ్మవిద్య అంగమా? బ్రహ్మవిద్యకు కర్మలు అంగములా అనే విషయము చర్చించబడి బ్రహ్మవిద్యకే కర్మలు అంగము అవుతవి అని నిర్ణయము చేసినారు.

ఇక నాలుగవ అధ్యాయము యొక్క ప్రథమపాదము పేరు ఆవృత్తిపాదము. ఇందులో ఆచార్యోపదేశము పిదప ఉపాసనను మాటిమాటికి ప్రతి దినమూ కొనసాగించాలా అన్న ప్రశ్నను వేసుకొని సమాధానాన్ని చెప్పడమే గాకుండా దానికి సంబంధించిన చిన్నచిన్న విషయాలపైన కూడా నిర్ణయాన్ని తేటతెల్లము చేసినారు.

పద్నాల్గవ దగు ఉత్క్రాన్తిపాదము. బ్రహ్మ ఉపాసనాఫలంగా పరబ్రహ్మ యొక్క అనుగ్రహాన్ని పొందిన జీవుడు శరీరంలోంచి లేచిపోయే విధానము వర్ణించబడింది.

15వ దైన గతిపాదములో శరీరమును వదలిన జీవుడు పరమాత్మ సన్నిధికి పోయే అర్చిరాది మార్గాన్ని గురించి చర్చ చేయబడింది.

16వ పాదము ఫలపాదము. దీనిలో ముక్తపురుషుని యొక్క వైభవము వర్ణించ బడింది. చిట్టచివరగా ముక్తాత్మకు తిరిగి సంసార ప్రవేశము లేదని నిరూపించినారు.

ఈ విధంగా బ్రహ్మస్వరూపాన్ని గురించి తేటపర్చడం, ప్రమాణము యొక్క దార్ఢ్యతను బోధించడమేగాకుండా సాంఖ్యాది ఇతర పక్షాలతో విరోధము లేదని తేటతెల్లము చేసి జీవస్వరూపాన్ని పరమాత్మను ఉపాసించడానికి సాధనాలైన ముప్పది రెండు బ్రహ్మవిద్యలను గురించి వాటిద్వారా పరబ్రహ్మ/పరమాత్మ వద్దకు చేరి బ్రహ్మానందాన్ని అనుభవించడము పునర్జన్మ లేకపోవడము బ్రహ్మసూత్రాల ద్వారా చెప్పబడింది. ఆ విషయంపై వివిధ పక్షాల పలురకాల పోకడలు బ్రహ్మలేదనడం ఉన్నా నిర్విశేషచిన్మాత్రుడు. బ్రహ్మకు అజ్ఞానం పుట్టిందనడము వంటి పరస్పర విరోధాంశాలు అసమంజసాలు, కనుక కొట్టి పారవేసినారు. పరమాత్మ పురుషోత్తముడు కళ్యాణగుణాకరుడు ఆయనను గురించి తెల్సుకొని ఉపాసించితే ఆ స్వామి అనుగ్రహము ద్వారా ఆయనతో సమానంగా కళ్యాణగుణపరిపూర్ణుడై పరమపదములోనే బ్రహ్మానుభవాన్ని పొందవచ్చునని ఢంకాబజాయించి రామానుజుల వారు ప్రకటించినారు. విపక్షాల నోళ్ళు మూయించినారు. ఇక అధికరణాలను గురించి –

ఇందులో ఒక్కొక్క అంశాన్ని సమగ్రంగా చర్చించడానికి అనువుగా అధికరణ విభాగము చేయబడింది. అవి మొత్తంగా 156 అధికరణాలు ఉన్నాయి. వీటిలో ఒక విషయం తీసుకోబడగా దానిపైన సంశయము వ్యక్తం చేయబడుతుంది. ఆ పైన పూర్వపక్షము తన వాదాన్ని వినిపిస్తుంది. దానికి సమాధానాన్ని చెప్తాడు సిద్ధాన్తి. చివరగా రెండింటినీ పరిశీలించి సందేహాన్ని పటాపంచలు చేస్తూ విషయముపైన సిద్ధాన్తము అసలైన అర్థము వివరించి చర్చ ముగించబడుతుంది. ఇది అధికరణములోని సారము.

ముముక్షువులు ఐనవారు వ్యాసప్రణీత బ్రహ్మసూత్రాలను ఆదరించి వారి మనోగతానికి తగినట్లు సప్రమాణంగా సిద్ధాన్తీకరించుతూ భగవద్రామానుజులవారు వ్రాసిన వ్యాఖ్యానరూపమైన శ్రీభాష్యాన్ని అధ్యయనము చేసి పరమ నిశ్శ్రేయసాన్ని పొందుదురుగాక.

– సమాప్తము –

# శ్రీభాష్యమ్ - అధికరణ సూచీ

**ప్రథమాధ్యాయము - ప్రథమపాదము:** 1. జిజ్ఞా సాధికరణము: i. లఘు పూర్వ పక్షము, ii. లఘు సిద్ధాన్తము, iii. మహా పూర్వ పక్షము, iv. మహాసిద్ధాన్తము, v. శ్రుతిఘట్టము, vi. స్మృతి పురాణ ఘట్టము, vii. ఏడు రకాలైన అనుపపత్తులు: 1. ఆశ్రయ అనుపత్తి, 2. తిరోధానానుపపత్తి, 3. స్వరూపానుపపత్తి, 4. అనిర్వచనీయత్వ అనుపపత్తి, 5. ప్రమాణానుపపత్తి, 6. నివర్తకాను పపత్తి, 7. నివృత్త్యను పపత్తి; viii. సూత్రార్థ యోజనా; 2. జన్మాద్యధికరణము; 3. శాస్త్రయోనిత్వాధికరణము; 4. సమన్వయాధికరణము; 5. ఈక్షత్యధికరణము; 6. ఆనంద మయాధికరణము; 7. అంతరధికరణము; 8. ఆకాశాధికరణము; 9. ప్రాణాధికరణము; 10. జ్యోతిరధికరణము; 11. ఇంద్ర ప్రాణాధికరణము

**ప్రథమాధ్యాయము - ద్వితీయపాదము:** 1. సర్వత్ర ప్రసిద్ధ్యధికరణము; 2. అత్త్రధికరణము; 3. అన్తరాధికరణము; 4. అన్తర్యా మ్యధికరణము; 5. అదృశ్యత్వాదిగుణక అధికరణము; 6. వైశ్వానరాధికరణము

**ప్రథమాధ్యాయము - తృతీయపాదము:** 1. ద్యుభ్వాద్యధికరణము; 2. భూమాధికరణము; 3. అక్షరాధికరణము; 4. ఈక్షతి కర్మాధికరణము; 5. దహరాధికరణము; 6. ప్రమితాధి కరణము; 7. దేవతాధికరణము; 8. మధ్వధికరణము; 9. అపశూద్రాధికరణము, ప్రమితాధి కరణశేషము; 10. అర్థాన్తరత్వాది వ్యపదేశాధికరణము

**ప్రథమాధ్యాయము - చతుర్థపాదము:** 1. ఆనుమానికాధికరణము; 2. చమసాధికరణము; 3. సంఖ్యోపసంగ్రహాధికరణము; 4. కారణత్వాధికరణము; 5. జగద్వాచిత్వాధికరణము; 6. వాక్యాన్వయాధికరణము; 7. ప్రకృత్యధికరణము; 8. సర్వవ్యాఖ్యానాధికరణము

**ద్వితీయాధ్యాయము - ప్రథమపాదము:** 1. స్మృత్యధికరణము; 2. యోగప్రత్యుక్తి అధికరణము; 3. విలక్షణత్వాధికరణము; 4. శిష్టాపరిగ్రహాధి కరణమ్ 5. భోక్త్రాపత్త్యధికరణము; 6. ఆరమ్భణాధికరణము; 7. ఇతర వ్యపదేశాధికరణము; 8. ఉపసంహారదర్శనాధికరణము; 9. కృత్స్నప్రసక్తి అధికరణము; 10. ప్రయోజనవత్త్వాధికరణము

**ద్వితీయాధ్యాయము - ద్వితీయపాదము:** 1. రచనానుపపత్తి అధికరణము; 2. మహద్దీర్ఘాధి కరణము; 3. సముదాయాధి కరణము; 4. ఉపలబ్ధ్యధికరణము; 5. సర్వథా అనుపపత్తి అధికరణము; 6. ఏకస్మిన్ అసమ్భవాధికరణము; 7. పశుపత్యధికరణము; 8. ఉత్పత్తి అసంభవ అధికరణము

**ద్వితీయాధ్యాయము - తృతీయపాదము:** 1. వియదధికరణము; 2. తేజోఽధికరణము; 3. ఆత్మాధికరణము; 4. జ్ఞాధికరణము; 5. కర్త్రధికరణము; 6. పరాయత్తాధికరణము; 7. అంశాధికరణము

**ద్వితీయాధ్యాయము - చతుర్థపాదము:** 1. ప్రాణోత్పత్తి అధికరణము; 2. సప్తగతి అధికరణము; 3. ప్రాణాణుత్వాధికరణము; 4. వాయుక్రియాఅధికరణము; 5. శ్రేష్ఠాణుత్వాధి కరణము; 6. జ్యోతిరాద్యధిష్ఠా నాధికరణము; 7. ఇన్ద్రియాధికరణము; 8. సంజ్ఞామూర్తిక్లృప్తి అధికరణము

**తృతీయాధ్యాయము - ప్రథమపాదము:** 1. తదన్తర ప్రతిపత్తి అధికరణము; 2. కృతాత్యయాధి కరణము; 3. అనిష్టాదికార్యధి కరణము; 4. తత్ స్వాభావ్యాపత్తి అధికరణము; 5. నాతిచిరాధి కరణము; 6. అన్యాధిష్ఠితాధికరణము

**తృతీయాధ్యాయము - ద్వితీయపాదము:** 1. సన్ధ్యాధికరణము; 2. తదభావాధికరణము; 3. కర్మానుస్మృతి శబ్దవిధ్యధికరణము; 4. ముగ్ధాధికరణము; 5. ఉభయ లింగాధికరణము; 6. అహికుండలాధికరణము; 7. పరాధికరణము; 8. ఫలాధికరణము

**తృతీయాధ్యాయము - తృతీయపాదము:** 1. సర్వవేదాన్త ప్రత్యయాధికరణము; 2. అన్యథాత్వ అధికరణము; 3. సర్వాభేదాధి కరణము; 4. ఆనందాద్యధికరణము; 5. కార్యాఖ్యానాధికరణము; 6. సమానాధి కరణము; 7. సమ్బన్ధాధికరణము; 8. సమ్భృతి అధికరణము; 9. పురుష విద్యాధి కరణము; 10. వేధాద్యధికరణము; 11. హాన్యధికరణము; 12. సామ్పరాయాధి కరణము; 13. అనియమాధికరణము; 14. అక్షరధీ అధికరణము; 15. అన్తరత్వాధి కరణము; 16. కామాద్యధికరణము; 17. తన్నిర్ధారణానియమాధికరణము; 18. ప్రదానాధికరణము; 19. లింగభూయస్త్వాధికరణము; 20. పూర్వవికల్పాధి కరణము; 21. శరీరేభావాధికరణము; 22. అంగావబద్ధాధికరణము; 23. భూమజ్యాయస్త్వాధికరణము; 24. శబ్దాదిభేదాధికరణము; 25. వికల్పాధికరణము; 26. యథా శ్రయభావాధికరణము

**తృతీయాధ్యాయము - చతుర్థపాదము:** 1.పురుషార్థాధికరణము; 2.స్తుతి మాత్రాధికరణము; 3. పారిప్లవార్థాధికరణము; 4. అగ్నీంధనాద్యధి కరణము; 5. సర్వాపేక్షాధికరణము; 6. శమదమాద్యధికరణము; 7. సర్వాన్న అనుమత్యధికరణము; 8. విహితత్వాధికరణము; 9. విధురాధికరణము; 10. తద్ భూతాధికరణము; 11. స్వామ్యధికరణము; 12. సహకార్యన్తర విధ్యధికరణము; 13. అనావిష్కారాధికరణము; 14. ఐహికాధికరణము; 15. ముక్తి ఫలాధికరణము

**చతుర్థాధ్యాయము - ప్రథమపాదము:** 1. ఆవృత్తి అధికరణము; 2. ఆత్మత్వోపాసనాధి కరణము; 3. ప్రతీకాధికరణము; 4. ఆదిత్యాది మత్యధికరణము; 5. ఆసీనాధికరణము; 6. ఆప్రయాణాధికరణము; 7. తదధిగమాధికరణము; 8. ఇతరాధికరణము; 9. అనారబ్ధ కార్యాధికరణము; 10. అగ్నిహోత్రాద్యధికరణము; 11. ఇతరక్షపణాధికరణము

**చతుర్థాధ్యాయము - ద్వితీయపాదము:** 1. వాగధికరణము; 2. మనోఽధికరణము; 3. అధ్యక్షాధికరణము; 4. భూతాధి కరణము; 5. ఆసృత్యుపక్రమాధికరణము; 6. పరసమ్పత్తి అధికరణము; 7.అవిభాగాధి కరణము; 8. తదోకోఽధికరణము; 9. రశ్మి అనుసార్యధికరణము; 10. నిశాధికరణము; 11. దక్షిణాయన అధికరణము.

**చతుర్థాధ్యాయము - తృతీయపాదము:** 1. అర్చిరాద్యధికరణము; 2. వాయ్వధికరణము; 3. వరుణాధికరణము; 4. ఆతివాహికాధి కరణము; 5. కార్యాధికరణము

**చతుర్థాధ్యాయము - చతుర్థపాదము:** 1. సమ్పద్యావిర్భావాధికరణము; 2. అవిభాగేన దృష్టత్వాధికరణము; 3. బ్రాహ్మాధి కరణము; 4. సంకల్పాధికరణము; 5. అభావాధికరణము; 6. జగద్వ్యాపార వర్జాధికరణము

# కొన్ని పదాలకు వివరణలు

**ఆత్మ – అతతిగచ్ఛతి** ప్రకృతిలోని అన్ని వస్తువులలోకి – తాను అణువంతటి స్వరూపము గలది గాబట్టి భోగ్యబుద్ధితో ప్రవేశించుతున్నది కనుక ఆత్మ అనబడుతున్నది. దీనికే మరొకపేరు **జీవుడు**. వీరు ఇందరు అనే సంఖ్య లేదు. పుట్టుక లేదు కనుక అజుడు అని పిలువబడుతున్నాడు. ఈ ఆత్మలు మూడు విధాలుగా ఉన్నారు (1) బద్ధులు = కర్మ పాశానికి చిక్కి సంసారములో సుఖదుఃఖాలను అనుభవించేవారు. (2) ముక్తులు= భగవదనుగ్రహంతో సంసారము నుండి విడుదలను పొంది పరమాత్మ సన్నిధికి చేరి శాశ్వతానందాన్ని అనుభవించుతుండేవారు (3) నిత్యులు = ఎప్పుడు కూడా ప్రకృతి మండలములోకి రాకుండా పరమాత్మ సన్నిధిలో ఆయనకు కైంకర్యము చేస్తూ పరమపదములో ఉండెడివారు.

**పరమాత్మ, పరమపురుషుడు, పరబ్రహ్మ** = ఈయన శ్రీమన్నారాయణుడు. లక్ష్మీపతి. పురుష ఆత్మ బ్రహ్మ శబ్దాలచేత పిలువబడ్తున్నాడు. ఈయనకు సత్త్వరజస్తమో గుణాల ప్రభావము లేదు. కనుక నిర్గుణుడు. తన సంకల్పము చేతనే అఖిలాండకోటి బ్రహ్మాండాలను నిమేషకాలములో పుట్టించుతున్నాడు. లోకస్థులను పోషించేవాడు, కాపాడేవాడు తిరిగి తనలో కలుపుకొనే వాడూ ఈయనే. ఈయనకు సమానుడు, మించినవాడు, పుట్టించిన వాడున్నూ లేదు. శాసించ సమర్థుడూ లేదు. స్వతంత్రుడు. తన భక్తులకు పరతన్త్రుడు. మోక్షాన్ని ఇవ్వగలవాడున్నూ ఈయనే. మరొక్కరికి ఆ అధికారము లేదు. తనను ఆశ్రయించిన వారికి తాను అనుభవించే భోగాలను ప్రసాదిస్తాడు. తనంతటి వాడినిగా చేస్తాడు. ఈయన భక్తులను కాపాడడానికి వివిధ రూపాలలో తనదైన ప్రకృతితో అవతరించుతాడు. శిష్టరక్షణ దుష్టశిక్షణ ధర్మస్థాపన చేస్తాడు. అన్నింటిలో తాను అన్తరాత్మగా ఉండి చిదచిత్తులను నియన్త్రించుతాడు. ఈయనకు సత్తు అనే పేరు ఉన్నది. ఒక్క మాటలో వేదము సత్యమ్ జ్ఞానము అనన్తమ్ బ్రహ్మ అని అన్నది. సర్వజ్ఞుడు. సర్వవేత్త.

**బ్రహ్మ:** బృహతి బృంహయతి. తను స్వయంగా పెద్దది. మరియు తనను లేక తాను ఆశ్రయించిన దానిని పెద్దదిగా చేస్తుంది. కనుక బ్రహ్మ అనిపేరు. పరమాత్మ, జీవాత్మ, ప్రకృతులకు ముగ్గురికీ ఈ నిర్వచనము వర్తించుతుంది. వేదానికీ ఈ పేరు చెల్లుతుంది. కనుకనే పరమాత్మను చెప్పాల్సి వచ్చిన సందర్భాల్లో పర అనే విశేషణాన్ని జతచేస్తున్నారు.

**సత్తు:** ఈ పదము అసధాతువు నుండి పుట్టింది. అసభువి అన్నారు కాబట్టి ఉనికి గలది అని అర్థము. భూత భవిష్యత్ వర్తమానాల్లో ఉన్నాడు అనియే అనబడేవాడు కనుక పరమ

పురుషుడికీ ఈ పేరు వర్తిస్తుంది. జీవుడు కూడా ఒక శరీరంలో కాకపోతే మరొక శరీరంలో ఉంటున్నాడు కనుక అతడిని కూడా సత్‌పదార్థంగా వ్యవహరించవచ్చును. కాని ప్రళయకాలంలో మిక్కిలి సూక్ష్మ రూపాన్ని కలిగి పరమాత్మ శరీరంలో ఇమిడి ఉంటున్నాడు కనుక బయటి ప్రపంచములో లేదనియే వ్యవహరింపబడుతున్నాడు. సాక్షికమైన అస్తిత్వము ఈ జీవుడికి ఉంటున్నది. కనుకనే అజుడు పుట్టుకలేనివాడని వ్యవహరింపబడుతున్నాడు.

**అసత్తు:** ఇది ప్రకృతి. ఇది ఎప్పుడూ పరిణామాలను పొందుతూ లేదు అని అనబడుతున్నది. ఈ పరిణామాలన్నీ జీవుని యొక్క కర్మ ఫలానుభవము కొరకు మాత్రమే. దీనికి కర్మలేదు. బంధమూ లేదు. ఇది జడము. దేనికీ స్పందించే గుణము లేదు. శీతోష్ణములు మొదలైనవి దీన్ని ఏమీ చేయజాలవు.

**చిత్తు:** అనగా జ్ఞానము. దీన్ని కలవాడు జీవుడు. శీతోష్ణ సుఖదుఃఖాలను శబ్ద స్పర్శ రూప రసగన్ధాదులను అనుభవించుతున్నాడు. ప్రతీకారాన్ని చేస్తాడు. ప్రతిస్పందనను తెల్పుతాడు. ప్రత్యభిజ్ఞ, స్మృతి మొదలైన వాటిని కలిగి ఉంటాడు. ఇక **పరమ చేతనుడు పరమాత్మ. ఈయన బాహ్యాభ్యన్తర విషయాలను, భూత భవిష్యత్ వర్తమానాలనున్నూ ప్రత్యక్షంగా దర్శించగలడు. ఈ విషయంలోపరిమితి లేదు ఈయనకు.** అందుచేత ఈయన జ్ఞాన స్వరూపుడు. జీవుడికి ఉన్న జ్ఞానము అనాదికర్మలు కారణంగా పరమాత్మ నిగ్రహానికి గురి కావడం వల్ల కప్పివేయబడి అజ్ఞాని అవుతున్నాడు.

**అచిత్తు:** జ్ఞానము లేని జడపదార్థము. ఏ ప్రతిస్పందనా లేనిది. ఇదే ప్రకృతి అనబడుతున్నది.

**ప్రధానము:** ప్రకృతియే. ప్రపంచములోని అన్ని వస్తువులయొక్క శరీరాలకు మూలపదార్థము. లేక ఉపాదానకారణము. ఇది లేకుండా ఏ వస్తువుకూ బాహ్య స్వరూపము కలుగదు. దీనికే మాయ అని కూడా పేరున్నది. ఐతే గారడి వాని మాయ కాదు. **మాయాంతు ప్రకృతిం విద్యాత్ అని అన్నారు కనుక, దీనికి అజా అనిపేరు జీవునకు వలె.**

**పురుషుడు:** పురము అనగా శరీరము. దీనిలో శయనించి ఉంటాడు. కనుక పురుషుడు అనబడుతున్నాడు. పురుసనోతీతి పురుషః మనము కోరిన కోరికలన్నింటినీ మనచే అర్చించబడి ప్రీతుడై అడిగిన దానికంటే ఎక్కువగా ఇస్తున్నాడు కాబట్టిన్నీ పురుషుడు అనబడుతున్నాడు. ఈ పదము పరమాత్మకు జీవాత్మకున్నూ చెల్లుతుంది. జీవుడు పాంచ భౌతిక శరీరములో ప్రవేశించి పలుగతులననుభవిస్తున్నాడు కనుక పురుషుడు. పరమాత్మ అన్తర్యామిగా ఉంటూ జీవుడిని నియన్త్రించుతూ ఉన్నాడు, వరాలనిస్తున్నాడు గనుక పురుషుడు అనబడుతూ ఉన్నాడు. ఏ విశేషణమూ లేని పురుష శబ్దము

శ్రీమన్నారాయణునికే చెల్లుతుంది. లింగభేదాన్ని బట్టి మగవాడికి చెల్లుతుంది. **ఉత్తమః పురుష స్త్వన్యః పరమాత్మేత్యుదాహృతః.**

**మాయ :** మాయాతు వయునం జ్ఞానము – అనబడింది కనుక మాయ పరమాత్మ యొక్క జ్ఞాన రూపమైన సంకల్పము. ప్రకృతి. మమ మాయాదురత్యయా. మాయ కలవాడు మాయీ: ఆశ్చర్యకరమైన శక్తులు కలవాడు. ఇంద్రోమాయాభిః పురురూపఈయతే. కొందరి ఉద్దేశ్యములో గారడివాని కనుకట్టు (కనికట్టు)వలె లేనిది. ఉన్నట్లు కనిపించేది. యథార్థ జ్ఞానము కలిగిన తరువాత నశించిపొయ్యేది. దీనికే మరొక పేరు. అవిద్య, మిథ్యా. మృషా. అందుకేవారు బ్రహ్మ సత్యమ్. జగత్ మిథ్యా అని అన్నారు. అనృతమ్ అని కూడా.

**ఋతమ్:** అంటే పుణ్యకర్మ అని అర్థము. ఋతంపిబన్తౌసుకృతస్యలోకే. అని వేదము చెప్పుతున్నది. అనృతమ్ అంటే పుణ్య కర్మకానిది. అదే పాపకర్మ. అసత్యము అని అర్థము. కనుకనే అనృతేనహిప్రత్యూఢాః అని అన్నది శ్రుతి.

**అవిద్య:** విద్య = జ్ఞానము. దానికి వ్యతిరేకమైనది కర్మ. మోక్ష సాధనలో కర్మజ్ఞాన భక్తి యోగాలు సాధనాలు అవుతున్నాయి. **"అవిద్యా కర్మ సంజ్ఞాఽన్యా తృతీయాశక్తిరిష్యతే"** అని విష్ణుపురాణము చెపుతున్నది **అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయా అమృతమశ్నుతే**. అంటున్నది వేదము. ఇతరులు అవిద్య అంటే అజ్ఞానము మాయ అని అంటున్నారు.

**తమస్సు:** సూక్ష్మరూపములో ఉన్న చిదచిత్తుల కలసి ఉన్న రూపము. చీకటి అని సాధారణార్థము.

# విషయసూచిక


| | | |
|---|---|---|
| | **శ్రీభాష్యము ప్రథమాధ్యాయము** | **1-468** |
| | మహా సిద్ధాంతపర్యంతము | 1-159 |
| 1 | శ్రీభాష్యము – ప్రథమాధ్యాయము – ప్రథమపాదము | 160-288 |
| 2 | శ్రీభాష్యము – ప్రథమాధ్యాయము – ద్వితీయపాదము | 288-337 |
| 3 | శ్రీభాష్యము – ప్రథమాధ్యాయము – తృతీయపాదము | 337-406 |
| 4 | శ్రీభాష్యము – ప్రథమాధ్యాయము – చతుర్థపాదము | 407-468 |
| | **శ్రీభాష్యము ద్వితీయాధ్యాయము** | **471-654** |
| 1 | శ్రీభాష్యము – ద్వితీయాధ్యాయము – ప్రథమపాదము | 471-545 |
| 2 | శ్రీభాష్యము – ద్వితీయాధ్యాయము – ద్వితీయపాదము | 545-600 |
| 3 | శ్రీభాష్యము – ద్వితీయాధ్యాయము – తృతీయపాదము | 600-637 |
| 4 | శ్రీభాష్యము – ద్వితీయాధ్యాయము – చతుర్థపాదము | 638-654 |
| | **శ్రీభాష్యము తృతీయాధ్యాయము** | **655-814** |
| 1 | శ్రీభాష్యము – తృతీయాధ్యాయము – ప్రథమపాదము | 655-674 |
| 2 | శ్రీభాష్యము – తృతీయాధ్యాయము – ద్వితీయపాదము | 675-708 |
| 3 | శ్రీభాష్యము – తృతీయాధ్యాయము – తృతీయపాదము | 709-780 |
| 4 | శ్రీభాష్యము – తృతీయాధ్యాయము – చతుర్థపాదము | 780-814 |
| | **శ్రీభాష్యము చతుర్థాధ్యాయము** | **815-884** |
| 1 | శ్రీభాష్యము – చతుర్థాధ్యాయము – ప్రథమపాదము | 815-830 |
| 2 | శ్రీభాష్యము – చతుర్థాధ్యాయము – ద్వితీయపాదము | 830-848 |
| 3 | శ్రీభాష్యము – చతుర్థాధ్యాయము – తృతీయపాదము | 848-861 |
| 4 | శ్రీభాష్యము – చతుర్థాధ్యాయము – చతుర్థపాదము | 861-884 |

శ్రీమతే రామానుజాయనమః
శ్రీశ్రీనివాస పరబ్రహ్మణేనమః
అస్మద్ గురుభ్యోనమః
శ్రీరఘునాథదేశికేభ్యోనమః

## భగవద్రామానుజ విరచిత బ్రహ్మసూత్రభాష్యమ్

# శ్రీభాష్యమ్

**(ప్రథమభాగము)**

### జిజ్ఞాసాధికరణము

అఖిలభువన జన్మస్థేమ భంగాదిలీలే
వినతవివిధ భూతవ్రాతరక్షైకదీక్షే
శ్రుతిశిరసి విదీప్తే బ్రహ్మణి శ్రీనివాసే
భవతు మమ పరస్మిన్ శేముషీభక్తిరూపా॥

అకారవాచ్యుడు శ్రీమన్నారాయణుడు **అక్షరాణామకారోఽస్మి** అని శ్రీకృష్ణుని శ్రీసూక్తి. **అవరక్షణే** అనుధాతువు నుండి అకారము లభించినది. అది రక్షణను తెల్పుతున్నది. శబ్ద ప్రపంచానికి అకారము మూలము. అట్లే భౌతికప్రపంచానికి శ్రీపద్మనాభుడు. ఆ పుండరీకాక్షుని సంకల్పము వల్లనే ప్రపంచము ఆరంభము ఐనది. రక్షింపబడుతున్నది ఆయనలోనే లీనము అయ్యి ఆయన అనుగ్రహము వల్ల తన స్వరూపనాశనము లేక బాలముకుందుని చిరుబొజ్జలో స్వామి శ్రీపాదతీర్థ అమృతమును గ్రోలి ఉజ్జీవిస్తున్నది తిరిగి ఆయన సంకల్పముతో బాహ్యప్రపంచానికి వచ్చి అనాదియైన కర్మసంబంధంగా ఆయాదేహాలను పొంది ఈ బ్రహ్మాండభాండములందు విచిత్ర రూపాలతో వ్యక్తము ఔతున్నది. ఇలా ఆ పద్మనాభుని సంకల్పముతో ఆయనకులోబడి ఆజ్ఞానుసారము ప్రవర్తిస్తున్నది. ఇందులో కొందరు దుష్టులు ఐన జీవులనుండి సాధుపురుషులకు హాని కలిగినపుడు తానే కర్మసంబంధము లేని దేహాలతో నరమృగ రూపాలతో జన్మించి శిష్టరక్షణ దుష్టశిక్షణ గావిస్తున్నాడు. జగన్నాటకసూత్రధారియైన స్వామికి ఇక చాలు అని అనిపించినప్పుడు ప్రళయరూపములో ఆటకట్టేస్తున్నాడు. సృష్టిస్థితిలయలు ఆయనకు ఒక బాలలీల. ఇందులో తనను ఆశ్రయించిన గరుత్మంతుడు, జటాయువు, హనుమంతుడు,

బాలప్రహ్లాదుడు, బలిచక్రవర్తి, అజామిళుడు, విభీషణుడు అంబరీషుడు, బలిచక్రవర్తి, కుచేలుడు, ముచికుందుడు వంటివారిని రక్షించి తను చేపట్టిన ఏకదీక్షను ఏమాత్రము ఏమరక రక్షాకార్యం లో కంకణధారియై దృఢంగా **వృక్షఇవదివిస్తబ్ధోతిష్ఠతి** అన్నట్లు చల్లని నీడను ఇస్తూ నిలుచున్నాడు.

ఇట్టి పరమాత్మ ఈమాంసచక్షువులకు, ప్రేమలేనివారికి కనిపించుటలేదు. తన దివ్యమంగళ విగ్రహాన్ని కళ్యాణగుణాలను వాత్సల్యవైభవాన్ని వందలకొలది ఉపనిషత్తుల ద్వారా తెల్యపరిచినాడు. ఆయన అణువు ఐన జీవుని కంటే అణువు ఐన స్వరూపం కలవాడు. చాలా పెద్దదైన బ్రహ్మాండభాండము కన్నా పెద్దవాడు. ఐనా సూక్ష్మమైన జీవుడి కంటే పరమ సూక్ష్మరూపముతో జీవుడిలో దూరి నియంతయై అంతర్యామిగా ఉండి ప్రవర్తింపచేస్తున్నాడు. బ్రహ్మాండములనన్నింటినీ చుట్టి వస్తూ మహత్తుతో సంబంధము లేకుండా దానికి వెలుపల దశదిశలలోనూ అత్యతిష్ఠత్ దశాంగులమ్ అన్నట్లు పది అంగుళాల ఎత్తున ప్రకాశిస్తున్నాడు. ఇట్లాగా శ్రుతి శిరస్సులందు వెలుగొందే జ్యోతి పరంజ్యోతియైన స్వామిని వినయముతో ఆశ్రయించి తాను అస్తిత్వాన్ని పొంది తన యొక్క ప్రేమ స్వభావముతో స్వామిని తనకు స్వాధీనము చేసుకుని, జీవులకు ఆశ్రయ ణీయ స్వభావముతో చల్లని కరుణాకటాక్ష వీక్షణములను ప్రసరింపచేస్తూ కన్నబిడ్డల వలె జీవులను దరిజేర్చుకొని వారిని రక్షింపచేస్తున్న శ్రీమూర్తికి, పురుషకార స్వరూపిణికి నివాసస్థానముగానున్న ఆ ఏడుకొండలవాడికి వరణీయతా హేతువుఐన భక్తిగా పరిణమించే విశేషజ్ఞానము దాసుడనైన నాకు కలుగుగాక.

ఈ శ్లోకము నాందీ శ్లోకము. మంగళాచరణ శ్లోకము. ఇందులో బ్రహ్మ సూత్రాలతో ప్రతిపాదింపబడే విషయము సూచించబడింది. కనిపించే ఈ ప్రపంచానికి మూలకారణమైనవాడు, అతనియొక్క శక్తిసామర్థ్యాలు మొదటిపాదము నందు సూచించబడినాయి. బ్రహ్మసూత్రాలలోని మొదటి అధ్యాయము ద్వారా తెలియవచ్చే అంశము కూడా ఇదే. ఇక రెండవ అధ్యాయము నందు వేదముల నంగీకరించని, అంగీకరించినా ప్రపంచ సృష్టికి పరబ్రహ్మను తప్ప ఇతరములను, ఇతరులను కారణముగా అంగీకరించే దుష్టులను దూరము చేస్తూ వారివాదనలను ఖండిస్తూ స్వామి యొక్క ఉనికిని అంగీకరించే, ఉపాసించే దేవతిర్యక్ మనుష్య స్థావరాదులకు కలిగే ప్రయోజనమును స్వామియొక్క కళ్యాణ గుణములను గూర్చి చెప్పబడింది. మూడవ అధ్యాయము యొక్క ఉద్దేశ్యము మూడవపాదమునందు ఉపాసనా ప్రకరణంగానున్న

దాన్ని సాధనాన్ని తెల్పుతున్నది. భగవంతుడిని గుర్తించుటకు ప్రమాణము శ్రుతులేనని, వాటిద్వారానే ఉపాస్య, ఉపాసనా స్వరూపములను తెల్సుకోవాలని వివరించబడింది. శ్లోకములోని నాలుగవ పాదము ద్వారా నాలుగవ అధ్యాయము వివరించబడింది. దీనికి ఫలాధ్యాయము అని పేరు. మోక్షము ఫలము కాగా అది భగవదనుగ్రహము ద్వారానే లభిస్తుంది. దానికి పునరావృత్తి లేదని **"నచపునరావర్తతే"** అని స్పష్టము చేయబడింది. ఈ తీరుగా ఈ శ్లోకము కేవల ప్రార్థన, మంగళాచరణములనే కాక ప్రతిపాదింపబడబోయే విషయాన్ని విశదపరచింది.

ఇక రెండవ శ్లోకంలో ఇందులోని విషయము అమృతంతో సమానమని చెప్పినారు. అది మృతసంజీవని. అమృతము పాలకడలి నుండి ఉద్భవిస్తే ఈ విషయామృతం ఉపనిషత్తులనే అగాధశబ్ద ప్రపంచాన్ని మథించిపైకి తేబడింది. పలుమార్లు పుడుతూ చస్తూ ఉండడమనే సముద్రము వంటి సంసారములో దాక్కొని వున్న బడబాగ్ని ప్రభావంతో ప్రాణాలు కడబట్టిన జీవులను పునరుజ్జీవితులను చేసి రక్షిస్తుంది. సాక్షాత్తు శ్రీహరి జగన్మోహినిగా ప్రత్యక్షము అయ్యి దుష్టులైన రాకాసుల నుండి అమృతాన్ని తెచ్చి ఆశ్రితులైన దేవతలకు పంచి రక్షించినాడు. అట్లే బ్రహ్మసూత్ర సుధను భగవంతుడగు బాదరాయణుడు అశ్రితులైన శిష్య ప్రశిష్య పరంపర ద్వారా ఆస్తిక లోకానికి పంచినాడు. ఐకమత్యము లేక పలుపోకడలు పోయే కుహనాసాధువుల నుండి భగవద్ బోధాయన, టంక, గుహదేవ ద్రమిడాచార్యుల వంటి పెద్దలు, నాథయామునాది ఆచార్యుల చేత ప్రత్యర్థుల కుదుష్టుల ఆఘాతములనుండి రక్షింపబడి భద్రంగా కాపాడబడింది. ఆ అమృతాన్ని శ్రీహరి రక్కసుల బారిని పడకుండా రక్షించినట్లే తదంశపురుషులు, లోకహితైషులు, మహానుభావులు కాపాడి భగవద్ రామానుజుల వారికి అందించినారు. దానిని వారు తమ అమృతవాక్కులనే, పీయూష ధారలను చిలుకరిస్తూ పూర్వాచార్యుల మనోగతాన్ని గంభీరంగా శ్రీభాష్యరూపంలో అందిస్తున్నారు. ఆనాడు దేవతలు అనుభవించి ఉజ్జీవించినట్లే ఈ విశాల భూమండలములోని సుమనస్కులు / భూదేవతలు తరుగని ఈ సుధను ప్రతిదినము పానం చేసి దివ్యసూరులై వర్థిల్లండి అని ప్రార్థిస్తున్నారు. ప్రధానంగా ఇందులోని అంశము, వ్యాఖ్యానము స్వకపోల కల్పితము కాదని పూర్వుల మార్గాన్ని అనుసరించినదని వారిచే ప్రతిభటులనుండి కాపాడి సురక్షితంగా అందించిన దాన్ని కేవలము నామాటలతో పదిలంగా మీకందిస్తున్నానని యథార్థాన్ని దాచకుండా వినయంగా రామానుజులవారు విన్నవించుకున్నారు.

దీన్ని చదివి ఆకళింపు చేసుకొని దాన్ని భక్తిగా పరిణమింపచేసుకొని అర్చారూపియైన శ్రియః పతిని ప్రతిదినము ఆరాధిస్తూ, ఆలోచిస్తూ, కీర్తిస్తూ, అనుభవిస్తూ భ్రమరకీట న్యాయంగా భూదేవతలు సుమనస్కులు ఐన మీరు భగవత్ కళ్యాణగుణామృతపానం చేసి రమానాధుని కటాక్షములకు పాత్రులై ఆయన సన్నిధిలో నిత్యకైంకర్యాన్ని చేస్తూ ఆనందరసడోలికలలో తూగి బ్రహ్మానందాన్ని అనుభవించండి అని పామర జనహితైషి లోకోద్ధారకుడు ఐన ఎంబెరు మానారుల మహా ఆకాంక్ష. దాన్ని ఇకముందు అనుభవిద్దాము.

వేదవ్యాసమహర్షిగారి ప్రశిష్యులలో ఒకడైన బోధాయనుడు తమ ఆచార్యుల వారి బ్రహ్మసూత్రాలకు వారి మనోభావాలకు అనుకూలంగా విపులమైన వ్యాఖ్యానాన్ని వ్రాసినారు. అది మహాభారత ఇతిహాసము వలె పెద్దది ఐనందున మనబోంట్ల అసమర్థతను దృష్టిలో నుంచుకొని సంక్షిప్తము చేసినారు పూర్వఆచార్యులు. వారివారి ఉద్దేశ్యాలను వెల్లడించుతూ సూత్రాలలోని అక్షరాలు వివరింపబడుతున్నాయి.

బ్ర.సూ: **ఓమ్ అథాతో బ్రహ్మజిజ్ఞాసా** 1-1-1 సూత్రంలో ఉన్న మొదటిదైన అథ అను పదము అనంతరము అను అర్థాన్ని చెపుతున్నది. రెండవదైన అతః అనేది వర్తమానంలో జరుగనున్న దానికి కారణాన్ని తెలుపుతున్నది. వేదాంగములతో సహా తనదైన శాఖను చదివినవాడికి స్థూలంగా దాని అర్థము కొంత తెలియవస్తుంది. వేదపూర్వభాగంలో చెప్పబడి నిత్యనైమిత్తిక కామ్యములనే కర్మలకు ఫలములు చాలా కాలము ఉండవు. పైగా చాలా కొద్దిపాటివి అని కూడా తెలుస్తుంది. ఆ కారణంగా అతనికి ఉత్తరభాగంలో చెప్పబడిన పురుషార్థములలో శ్రేష్ఠమైన మోక్షమును గురించి తెల్సుకోవాలి అనే కోరిక తప్పక కలుగుతుంది. ఆ ఫలాన్ని ప్రసాదించేవాడు బ్రహ్మ. ఆయన స్వరూపము, స్వభావము, కళ్యాణగుణగణములు, నివాసస్థానము, ఫలప్రదాన శక్తి ఉపాసనా మార్గము వంటి బ్రహ్మకు సంబంధించిన అంశాలను తెల్సుకోవాలి అనిపిస్తుంది. అందుకోసము వేదార్థాన్ని వివరించే పూర్వమీమాంసను అధ్యయనము చేసినట్లే ఉత్తరమీమాంసా శాస్త్రాన్ని కూడా ఆచార్యముఖేన చదువుకోవడానికి ప్రయత్నిస్తాడు. దాన్నే బ్రహ్మజిజ్ఞాసా అనే పదము వివరిస్తున్నది. బ్రహ్మణః జిజ్ఞాసా – బ్రహ్మ జిజ్ఞాసా అని ఆ పదానికి విగ్రహవాక్యము. విగ్రహవాక్యము సాధారణముగా సమాసంలోని పదాలకు అర్థాన్ని విశదీకరిస్తుంది. **జిజ్ఞాసా** అను పదానికి అర్థము

**తెల్సుకోవాలి అనే కోరిక** అని అర్థము. జ్ఞా అనే ధాతువుపైన **సన్** అంత ప్రత్యయమురాగా జిజ్ఞాసా అను పదము ఏర్పడుతున్నది. ఇలాగే జిగమిషా, పిపాసా, జిగీషా వంటి పదాలు ఏర్పడుతున్నాయి. పోవాలని కోరిక, త్రాగాలని కోరిక, గెలవాలి అనే కోరిక అనేవి ఆయాపదాలకు అర్థాలు. ఇచ్చట జిజ్ఞాసా తెల్సుకోవాలని కోరిక అనగానే ఎవరిని గురించి, దేని గురించి అనే ప్రశ్నలు తలఎత్తుతాయి. అపుడు బ్రహ్మను గురించి అని సమాధానం వస్తుంది. ఇపుడు బ్రహ్మజిజ్ఞాసా అను పదానికి బ్రహ్మకు సంబంధించిన జ్ఞానమును/బ్రహ్మను గురించిన జ్ఞానమును తెల్సుకొనుట కొరకు కోరిక అని అర్థము తేటపడింది. ఐతే విగ్రహవాక్యంలో బ్రహ్మణః జిజ్ఞాసా అని చెప్పినపుడు బ్రహ్మశబ్దముపైన షష్ఠీ విభక్తి కనిపిస్తున్నది. ఈ విభక్తి ప్రత్యయము **కర్తృకర్మణోఃకృతి** అనే పాణినీయ సూత్రప్రకారము వచ్చింది. **శేషేషష్ఠీ** అనే సూత్రము ద్వారా సంబంధ అర్థములో షష్ఠీ విభక్తి ప్రత్యయము విధింపబడుతున్నా రాజు యొక్క పురుషుడు/ రాజపురుషుడు అనే విగ్రహవాక్యము వలె బ్రహ్మయొక్క జిజ్ఞాస అని చెప్పబడుట ఒప్పుతుంది. కాని వాక్యములో కర్మ ఏది అని ప్రశ్న వచ్చినపుడు బ్రహ్మను గురించి అని చెప్పవలసి వస్తుంది. ఐతే షష్ఠీ విభక్తికి కర్మార్థము లేదు కదా! విధి ఎలాగా? అన్నపుడు కృత్‌ప్రత్యయమైన పదము ప్రక్కనున్నపుడు కర్త్రర్థములో లేక కర్మార్థములో కూడా షష్ఠీ విభక్తి ప్రత్యయము వస్తుంది అని విశేష సూత్రము వివరిస్తున్నది. దాని ప్రకారము బ్రహ్మణః అను పదానికి కర్మార్థత్వము చెప్పుకుంటే, నిన్, నున్, లన్, కూర్చి, గురించి అని ద్వితీయా విభక్తి ప్రత్యయాన్ని కలుపుకుంటే బ్రహ్మను గురించి జిజ్ఞాస అను అర్థము తేట తెల్లము అవుతుంది. ఆ విధంగా సామాన్యమైన సంబంధాన్ని గ్రహించినా జిజ్ఞాసా పదానికి కర్మతో అపేక్ష। సంబంధము ఉంటున్నందున కర్మార్థత్వము సిద్ధించుతున్నది. ఐనా ఆక్షేపము ద్వారా తెలియవచ్చేదాని కంటె సహజమైన అభిధాశక్తితో తెలియవచ్చే అర్థాన్ని స్వీకరించడము ఉత్తమము కనుక కర్మార్థంలో షష్ఠీ విభక్తిని చెప్పుకోవడం తగును. ఐతే **ప్రతిపద విధానా షష్ఠీ నసమస్యతే** అను వృత్తికారుని వాక్యము నిషేధిస్తున్నది కనుక షష్ఠీ సమాసమురాదు అని అనవచ్చును కానీ **కృద్యోగా చషష్ఠీ సమస్యతే** అని నిషేధాన్ని పరిహరించే మరొక వార్తికము కనిపిస్తున్నది కనుక దాని ప్రకారము షష్ఠీ విభక్తి వస్తుంది. బ్రహ్మణః జిజ్ఞాసా అని విగ్రహవాక్యమూ ఔతుంది. అది కర్మార్థాన్ని తెలుపుతుంది. అపుడు బ్రహ్మను గురించి తెల్సుకోవాలని కోరిక అను అర్థము స్పష్టంగా ఏర్పడుతుంది.

ఇక బ్రహ్మ శబ్దానికి అర్థం ఏమిటి? అనే ప్రశ్న ఎదురౌతున్నది. బ్రహ్మ శబ్దానికి అనేక అర్థాలు ఉన్నా అవి పాక్షికాలే కాని సమగ్రమైనవికావు. కనుక సహజంగానే ఎలాంటి దోషాలు లేనివాడు. ఆయనకంటే ఏ విధంగానూ ఆధిక్యతను కలవాడు ఒక్కడూ లేడు. కనీసము సాటియగు వాడులేడు. ఇన్ని అని లెక్కించరాని మంచివైన గణాలు కుప్పలు తెప్పలుగా గలవాడు. బద్ధులు ముక్తులు నిత్యులు అనబడు మూడు రకాల పురుషులు/జీవులు అందరికన్నా మిన్నయైన వాడు పురుషోత్తముడు ఎవడో వాడే బ్రహ్మ శబ్దానికి అర్థముగా చెప్పబడుతున్నాడు. బృహత్త్వము అనే గుణమును కల్గినవాడు బ్రహ్మ అని చెప్పబడతాడు. బృహత్వమంటే స్వరూపంతోనూ గుణాలతోనూ తనకు సాటి, మించిన అధికుడు ఐనవాడు లేక ఎవడు ఉన్నాడో అతడే బ్రహ్మ బృహత్వము కలవాడు అనబడుతున్నాడు. వాడే బ్రహ్మ శబ్దానికి ముఖ్యార్థము ఔతున్నాడు. అతడే అందరినీ శాసించేవాడు సర్వ ఈశ్వరుడు. ఆయనే బ్రహ్మ శబ్దం చేత చెప్పబడుతున్నాడు. ఆయనను తప్ప ఎవరిని ఐనా బ్రహ్మ అని ఈశ్వరుడు అని సంబోధించినా వారిలో ఆ గుణము నందలి ఒక చిన్న అంశము ఉన్నందున, ఇతరులకన్నా అధికుడైనందున ఉపచారము/మర్యాదా గౌరవముల కొద్ది వ్యవహరించడమే ఔతున్నది. బ్రహ్మ శబ్దానికి అనే కార్థములను యోగశక్తితో చెప్పవచ్చును. యోగశక్తినే యౌగికము అంటారు. అభిధాదులు వలెనే ఒక శబ్ద శక్తి మరొకటి రూఢము. భగవంతుడు అను ఒక పదమున్నది. దానికి కూడా బ్రహ్మశబ్దానికి ఉన్నట్లే పలు అర్థాలు ఉన్నా ముఖ్యార్థము మాత్రము పరమాత్మ శ్రీమన్నారాయణుడే. ఆధ్యాత్మిక, ఆది భౌతిక, ఆది దైవికములనే తాపములు మూడింటి చేత బాధింపబడే జీవులందరూ మళ్ళీ అలాంటి దుఃఖాలు కర్మలతో సంబంధం లేకుండా అమృతత్వాన్ని ఆనందాన్ని పొందాలంటే **సర్వేశ్వరుడైన శ్రీహరిని, బ్రహ్మను గురించే తెలుసుకోవాలి**. అందువల్ల సర్వేశ్వరుడే జిజ్ఞాసా కర్మభూతుడు బ్రహ్మ. తెల్సుకోవాలనే కోరికనే జిజ్ఞాస. కోరికనే కోరబడే ముఖ్యవస్తువు. అది ప్రధానముగా ముఖ్యంగా కల కోరికకు అర్థమైన విజ్ఞానము ఇక్కడ విధింపబడుతున్నది. ఫలితార్థము ఏమనగా షడంగ వేదాధ్యయనమును పూర్తిగావించుకున్నవాడు స్థూలంగా వేదార్థము తెలుస్తున్నా సంశయరహితమైన జ్ఞానాన్ని పొందడానికి గాను వేదములోని అర్థాన్ని వివరించే పూర్వ మీమాంసా శాస్త్రాన్ని చదువుతాడు. దానివల్ల పూర్వభాగంలోని యజ్ఞాదికర్మల వల్ల కలిగే ఫలాలు అల్పములు అస్థిరములు అని తెల్సుకుంటాడు. దానితో

ఉత్తరభాగములోని విషయాన్ని, బ్రహ్మను గురించి తెల్సుకోవడానికి ఉద్యమిస్తాడు. రెండు భాగాలలోని విషయాలను, ఫలములను తెల్సుకున్నవాడు తనకు నచ్చిన దాన్ని శ్రేష్ఠమైన దాన్ని ఎంచుకోవడానికి వీలు ఔతుంది. అందుకని పూర్వభాగాన్ని తెల్సుకొన్నవాడు రెండవభాగంలోని పరబ్రహ్మను తెల్సుకోవడానికి ప్రయత్నించాలి అని సూత్రము చెపుతున్నది.

మీమాంసా శాస్త్రము యొక్క ముందటి భాగము చదివినవాడికి కర్మల గురించి విశదము ఔతుంది. అవి అల్పము అస్థిరములు ఐన ఫలాలను ఇస్తాయి అని తెలుస్తుంది. అట్లే అనన్తరము అక్షయఫలాలను ఇచ్చే పరమాత్మను గురించి ఉత్తరభాగము ద్వారా తెలుస్తుంది. పూర్వమీమాంస ద్వారా తెలిసిన కర్మజ్ఞానానన్తరము ఆ కారణంగానే బ్రహ్మను గురించి కూడా స్పష్టంగా తెల్సుకోవాలి అని ఈ సూత్రము వివరిస్తున్నది. దాన్నే బ్రహ్మసూత్రాలకు వృత్తిని వ్రాసిన మహానుభావుడు ఇలాగా చెప్పినాడు. **వృత్తాత్ కర్మలను గురించి తెల్సుకున్న పిదప బ్రహ్మను గురించిన జ్ఞానాన్ని సంపాదించుకోవాలి** అని అంతే కాదు మునుముందు కర్మమీమాంసా, బ్రహ్మ మీమాంసా అనేవి రెండున్నూ వేరు వేరు శాస్త్రాలు కావు. ఒకే గ్రంథంలోని రెండు భాగాలు. అంతా కలిపి ఒక్కటే శాస్త్రము అని చెప్పబోతున్నాడు కూడా. జైమిని వ్రాసిన పదహారు అధ్యాయాలు కల పూర్వమీమాంసతో ఈ శారీరకమీమాంస సాన్నిహిత్యము కలది అని అందువల్ల ఒక్కటే శాస్త్రము అవుతున్నది. అనిన్నీ అందువల్ల రెండింటిలోను ప్రతిపాదింపబడే అర్థాన్ని బట్టి, షట్క భేదమును బట్టి, అధ్యాయభేదమును బట్టి భేదములు ఉన్నట్లే పూర్వ మీమాంసకు ఉత్తరమీమాంసకున్నూ భేదాలున్నాయి. ఐనా రెండు కలసి ఒక శాస్త్రమే కాని వేరు శాస్త్రము కాదు. అధ్యాయాలుగా వేరువేరుగా ఒక నాలుగు ఉన్నందున నాలుగు అధ్యాయాలు వేరువేరు గ్రంథాలు కావు కదా? అట్లే ఇదిన్నీ. మీమాంసా శాస్త్ర మనేది **అథాతో ధర్మ జిజ్ఞాసా** అని మొదలు పెట్టి **అనావృత్తిః శబ్దాదనావృత్తిః శబ్దాత్** అనే సూత్రముతో ముగుస్తున్నంత వరకు ఉన్నదంతా ఒక దానితో మరొకదానికి సాంగత్యము / పరస్పర సంబంధము కల్గి ఒకానొక విశిష్టమైన వరుసను కల్గియున్నది. అది ఎట్లాగా అంటే **స్వాధ్యాయమును అధ్యయనము చేయాలి** అని ఆచార్యుని వద్ద అధ్యయనము చేసి స్వాధ్యాయము అనబడే వేదాఖ్య అక్షరరాశిని గ్రహించాలి అని శాస్త్రము విధిస్తున్నది. ఆ అధ్యయనము ఎలాంటిది? ఎలా చేయాలి? అనే సందేహము కల్గినపుడు. **ఎనిమిదేండ్ల వయస్సు గల బ్రాహ్మణ బాలుడికి ఉపనయన సంస్కారము**

**చేయాలి**. **అతడిని చదివించాలి** అనే వాక్యంతోను **శ్రావణమాసము నందు లేక భాద్రపదమాసమున యథావిధిగా ఉపాకర్మను పూర్తి చేసుకొని తరువాత రాబోయే ఐదు నెలల పదిహేను రోజుల వరకు బ్రహ్మచారితో కలసి గురువుగారు వేదమును చదువాలి** అని వ్రతనియమాలతో పాటు విశేషాంశాలనున్నూ ఉపదేశించుతూ, దానికి అంగములైన ఇతరములనున్ను ఆచరించదగినవిగా విధించుతున్నారు. ఈ విధంగా సత్సంతాన పరంపర గల వంశములో పుట్టి, సదాచార నిష్ఠుడై, ఆత్మగుణోపేతుడు వేదవేత్తయైన ఆచార్యునిచేత దగ్గరకు చేర్చుకొనబడి వ్రత దీక్ష, విశేషవ్రత నియమాలు పాటిస్తూ ఆచార్యులు గారు పల్కిన పిదప అట్లాగే తానూ పలుకుతూ వేదము అను పేరు గల అక్షరాశిని గ్రహించడమే ప్రధాన ప్రయోజనముగా గలది **అధ్యయనము** అని తెలుస్తున్నది. అధ్యయనము చేయడమనగా స్వాధ్యాయానికి సంస్కారమును కల్గించడము. **స్వాధ్యాయమును అధ్యయనము చేయాలి** అను వాక్యము ద్వారా స్వాధ్యాయానికి కర్మత్వము తెలుస్తున్నది. సంస్కారమంటే ఇతర కార్యములను చేసుకోడానికి తగిన యోగ్యతను చేకూర్చడము. స్వాధ్యాయము ఈ సంస్కారాన్ని పొందడం యుక్తము. సంస్కారమును పొందిన ఈ వేదము ధర్మము అర్థము కామము మోక్షము అను రూపాలతోనున్న పురుషార్థములను నాల్గింటిని పొందడానికి సాధనం ఔతున్నదని పెద్దల సూక్తి ద్వారా తెలియవస్తున్నది. అది ఎలా అంటే జపములు యజ్ఞములు చేయుట వాటివాటి స్వరూపాన్ని తెలుపుట చేతనున్నూ సాధనమని తేటగా తెలుస్తున్నది.

ఈ విధంగా వేదాధ్యయనమనేది విధి మన్త్రములాగా, నియమాల వలె అక్షరరాశిని గ్రహించడమేనని తెలుస్తున్నది. ఇలా అధ్యయనం ద్వారా గ్రహించిన స్వాధ్యాయము సహజంగానే ప్రయోజనవన్తమైన అర్థాన్ని తెలుపుతున్నది. కనుక తాను ఆచార్యుల వారి నుండి గ్రహించిన స్వాధ్యాయము ద్వారా తెలుస్తున్న ఫలవంతములైన అంశాలను స్థూలంగా అర్థము చేసుకుంటాడు. అటు వెనుక వేదాధ్యయనాన్ని పూర్తి చేసుకున్న బ్రహ్మచారి స్థూలంగా/పైపైన తెల్సుకున్న ప్రయోజనాల గురించి సమగ్రంగా లోతుగా తెల్సుకోవడానికి పూనుకుంటాడు. వాటిని వివరించే మీమాంసా శాస్త్రము ద్వారా వివిధాలైన కర్మలు, వాటి స్వరూపము, వాటి ఫలములు విశేషాంశాలు, వాటిని నిర్ణయించే వేదవాక్య విచారరూపమైన పూర్వమీమాంసాశాస్త్రంలో తనకు తానై ఇతరుల ప్రేరణ లేకుండానే తెల్సుకోవడానికి ప్రయత్నిస్తాడు.

వేదాన్త వాక్యాలు సాధారణమైన కర్మలన్నింటికీ లభించే ఫలాలన్నీ తరిగిపోయేవే అనిన్నీ బ్రహ్మజ్ఞానమునకు అక్షయ ఫలత్వమునూ చూపుతున్నవి. **అదెలాగంటే ఈ లోకంలో శారీరక శ్రమతో సంపాదించిన పాడిపంటలు సిరిసంపదలన్నీ అనుభవిస్తున్న కొద్దీ ఎలా తరిగిపోతున్నవో అలాగే పరలోకములోనూ ఈ లోకంలో చేసిన పుణ్యకార్యాల ఫలాలున్నూ తరిగిపోతాయి** (ఛాందోగ్యోపనిషత్తు) **ఈ కర్మలకు ఫలమునశించేదేఐ ఉన్నది.** (బృహదారణ్య కోపనిషత్తు). **అధృవములైన కర్మలవల్ల శాశ్వతము ధృవమైన మోక్షములభించదు** (కఠోపనిషత్తు) **దృఢములు కాని ఈ కర్మరూపములైన ఫలములు వట్టి తేలిపోయే పడవలు మాత్రమే** ముండకోపనిషత్తు. **కర్మలవలన సంపాదించిన పుణ్యలోకాలను గురించి బాగుగా పరిశీలించిన పిదప వేదార్థజ్ఞానము కల బ్రాహ్మణుడు వైరాగ్యాన్ని పొందవలెను. తాను చేసిన కర్మలవల్ల నిత్యుడైన పరమపురుషసాన్నిధ్యము లభించదు. అందువలన జ్ఞానము కొరకు గురువుగారి వద్దకు పోవలెను. కానుకగా సమిధలను వెంట నుంచు కొనవలెను. ఆచార్యుడు శ్రోత్రియుడుఐ బ్రహ్మజ్ఞానముతో ఉపాసకుడుగా నుండవలెను. తనను చేరవచ్చిన ప్రశాంతమనస్కుడు రాగద్వేషాదులు లేనివాడైన శిష్యునికి ఆవేదవేత్త దేని చేతనైతే అక్షరుడైన పరమపురుడిని సత్ పదవాచ్యుడైనవానిని తెల్సుకోగలడో అట్టి బ్రహ్మవిద్యనుదాచుకోకుండా బోధించవలెను** (ముండకోపనిషత్తు) **బ్రహ్మవేత్తయైన వాడు పరమపదమును పొందును** (తైత్తిరీయ ఉపనిషత్తు భృగువల్లీ) **నిత్యస్వరూపుడైన ఆపరబ్రహ్మను తెల్సుకొన్నవాడు తిరిగి జన్మించదు. బ్రహ్మజ్ఞానమున్నవాడు సంసారములోకి తిరిగిరాడు** (ఛాందో) **అతడు కర్మవశ్యుడు కాక తనంతట తానే ప్రవర్తించును.** (ఛాందోగ్యము) **ఆపరమపురుషుని యొక్క మంగళస్వరూపమును తెల్సుకున్నవాడు అమృతస్వరూపమును పొందుచున్నాడు. పరంబ్రహ్మను చేరుకోవడానికి జ్ఞానము తప్ప మరొక్క మార్గము లేదు.** (పురుషసూక్తము) **పరమాత్మకంటే వేరుగా తనను, ఆయా భోగాలను అనుభవించడానికి ప్రేరేపకుడైన ఆయన స్వరూప స్వభావగుణములను తెల్సుకొని ఉపాసన చేసి ఆయనకు ప్రీతిపాత్రుడైనచో భగవదను గ్రహముతో కర్మబంధాలను విడిపించుకొని మోక్షమును పొందుచున్నాడు**. (శ్వేతాశ్వతరోపనిషత్తు) ఇలాంటివి మరింకా ఎన్నో. కేవలకర్మలను పట్టుకోకుండా, భగవత్ జ్ఞానముతో ఆయనను ఉపాసించే మార్గముగా కర్మలను, ఫలములను ఆశించకుండా ఆచరించినవాడికి మోక్షము లభిస్తుంది.

ఏమండీ! అంగములైన వ్యాకరణాది శాస్త్రములతోసహా వేదాధ్యయనము చేసిన వాడికి – కర్మలు స్వర్గాదిఫలములను ఇస్తాయి అని అవి తరిగిపోయేవి అని, పరంబ్రహ్మను ఉపాసించినవాడికి తరుగులేని తిరుగులేని అమృత ఫలము లభించుతుందని స్థూలంగా తెలుస్తూనే ఉంది. కనుక కర్మమీమాంస చేయకుండానే నేరుగా బ్రహ్మవిచారము చేయవచ్చును కదా। మధ్యలో ఈ ధర్మవిచారము చేయవలసిన అవసరము ఏమిటి? అని అనకూడదు. ఆపాతప్రతీతి వల్లనే చూచాయగానే సర్వము తెల్సినపుడు, దానికి సాంగాధ్యయనము సహకరించినపుడు శారీరక మీమాంసా విచారము కూడా చేయనక్కర లేదుకదా! నిజమే! కర్మమీమాంస, శారీరక మీమాంసల వల్ల నిష్కర్షింపబడే అంశము స్థూలంగా తెల్సినప్పటికీ తర్కము, లౌకిక న్యాయములతో కలిపి విచారించినపుడే సంశయ, విపర్యయములు లేని చక్కని జ్ఞానము ఏర్పడుతుంది. కావున వేదాన్త వాక్యములను విచారించాలి అని అంటారా! అట్లైతే ధర్మ(కర్మ) విచారానికి కూడా ఇదే విషయము వర్తిస్తుంది అనేది గమనిస్తే బాగుంటుంది.

## - లఘు పూర్వపక్షము -

అయ్యా! బ్రహ్మ జిజ్ఞాస చేసేవాడికి ఏది తప్పని సరిగా అవసరమై ఉంటుందో దాన్నే పూర్వవృత్తముగా చెప్పాలి అంతేకాని బ్రహ్మ జిజ్ఞాసకు ధర్మ/ కర్మ విచారముతో సంబంధము లేదు. దాన్ని తెల్సుకొని యుండవలసిన అవసరము ఏమాత్రమూ లేదు. వేదాన్త వాక్య విచారానికి వేదములను నేర్చుకొని ఉంటేచాలును. కర్మలను గురించి విచారించకున్నా వేదాన్తవాక్య విచారమును చేయవచ్చును. కర్మాంగములను ఆశ్రయించినవైన ఉద్గీథము మొదలైన ఉపాసనములు ఈ జ్ఞాన భాగములైన వేదాంతముల యందే విచారింపబడుతూన్నవి కూడా! ఆఁ! అందుకే కర్మలను గురించి స్పష్టంగా తెల్సుకోనివాడికి బ్రహ్మ విచారము చేయడం కుదరదు సుమా! అని అంటావా! అయితే విను. అసలు నీకు శారీరక శాస్త్ర విచారమును గురించి ఏమీ తెలువదు. ఈ శారీరక మీమాంసలో చెప్పదలచుకున్న విషయము ఇది. ఏనాటిదో తెలియని అవిద్యవలన పలురకాలైన భేదాలతో ఈ ప్రపంచాన్ని దర్శించడం జరుగుతున్నది. ఆ కారణంగా జన్మ, ముసలితనం, మరణము మొదలైన సంసార దుఃఖాలు ఏర్పడుతున్నాయి. ఇది ఒక దుఃఖ సాగరము. దీనిలో పడి మునిగితేలుతూ ఏనాటికీ గట్టు చేరలేనివానికి అన్నిరకాల దుఃఖాలకు మూలకారణమైన మిథ్యాజ్ఞానమును అణచివేయడానికి ఆత్మ ఒక్కటే నిల్చియుండే శాశ్వతసత్యము.

మిగతాది అంతా అసత్యము అని ఆత్మ ఏకత్వమునకు సంబంధించిన జ్ఞానాన్ని ప్రతిపాదించదల్చుకున్నారు. ఇటువంటి శాస్త్రానికి భేదాలనే ప్రతిపాదించే కర్మజ్ఞానము ఏవిధంగా ఉపయోగపడగలదు? పైగా శారీరకమీమాంసకు విరుద్ధమైనది కూడా! ఇక ఉద్గీథాది విచారమైతేనో కర్మలకు సంబంధించినదే కాని జ్ఞానముతో పెద్దగా తేడా లేనివి కావడం వల్ల వేదాన్తవాక్యాల వద్దే చేస్తున్నారు. ఐతే అది సూటిగా/నేరుగా సంబంధము కలదికాదు. కావున శారీరక మీమాంసా శాస్త్రము ఏవిషయాన్ని ముఖ్యంగా చెప్పదలుచుకున్నదో దానికి సంబంధించిన దానినే పూర్వవృత్తంగా చెప్పాలి. మంచిది సరే! మీరన్నట్టు బ్రహ్మవిచారానికి కర్మవిచారమే పూర్వవృత్తంగా ఉండతగింది. ఎందుకంటే కర్మలతో కూడిన జ్ఞానముతోనే మోక్షము కలుగుతుందని తెలుస్తున్నది. బ్రహ్మ సూత్రకారులు వ్యాసులవారు రాబోయే అధ్యాయాలలో **"సర్వాపేక్షాచయజ్ఞాదిశ్రుతేః అశ్వవత్"** అను సూత్రము వద్ద. 444 సూత్రము 3-4-36. ఇదే విషయాన్ని చెప్పబోతున్నారు.

**తంబ్రాహ్మణా వివిదిషన్తి. యజ్ఞేన దానేన తపసా అనాశ కేన.** ఇది శ్రుతివాక్యము. బ్రహ్మవేత్తలు ఆ పరమాత్మను యజ్ఞము చేత దానము చేత, తపస్సు చేత ఉపవాస వ్రతముల చేత తెల్సుకోగోరుచున్నారు అని. కావున కర్మలు అవసరమని తేలుతున్నది. ఏకర్మతో కలుపుకోవాలి దేనితో కాదు అనేది కర్మవిచారము చేయకుండా తెలియరాదు కదా! కావున కర్మవిచారాపేక్షయే బ్రహ్మమీమాంసకు పూర్వ వృత్తము కాగలదు అని బాగా చెప్పారు కాని. ఇది ఎంతమాత్రమూ పొసగదు. ఎందుకంటారా! సత్‌శబ్దవాచ్యమైన బ్రహ్మఒక్కటి మాత్రమే సత్యమని తెలుసుకదా! ఆ బ్రహ్మ అన్ని రకాలైన విశేషాలకు / భేదాలకు పూర్తిగా వ్యతిరేకమైనది. కేవలము చిత్‌స్వరూమైనది. అలాంటి బ్రహ్మను గురించి తెల్సుకుంటేనే అన్ని కష్టాలకు మూలమైన అవిద్యతొలగిపోతుంది. అవిద్య తొలగిపోవడమే మోక్షము. ఇకకర్మలు వర్ణములు, ఆశ్రమాలు, అందులోనూ విశేషకర్మలు వాటికి సంబంధించిన సాధ్యమైన ఫలము, సాధనములు, ఆచరించవలసిన విధానము వంటి అనన్తములైన భేదాలతో కూడియుండేది కర్మ. ఇన్ని భేదాలు కల్గిన కర్మ అన్ని రకాలైన భేదములను చూపకుండా వాటిని తొలగించుట అనే అజ్ఞానమును త్రోసివేయడానికి / నివారించడానికి సాధనము ఎలా ఔతుంది? వేదాలు కూడా అనిత్యఫలాలను మాత్రమే ఇవ్వగల కర్మలు మోక్షమును పొందడానికి అడ్డంకులని, జ్ఞానము ఒక్కటి మాత్రమే మోక్షమును పొందడానికి

సాధనమని చూపుతున్నవి. **అన్తవదేవాస్యతద్ భవతి. 2) తద్యథేహ కర్మచితోలోకః క్షీయతే. ఏవమేవాముత్ర పుణ్య చితోలోకః క్షియతే 3) బ్రహ్మవిదాప్నోతిపరమ్ 4) బ్రహ్మవేద బ్రహ్మైవభవతి 5) తమేవ విదిత్వాఽ తిమృత్యుమేతి** అని 4) బ్రహ్మను గురించి తెలిసినవాడు బ్రహ్మనే అగుచున్నాడు (ముండకోపనిషత్తు) 5) ఆ పరబ్రహ్మను తెల్సుకున్న వాడే మృత్యురూప సంసారమును దాటుచున్నాడు (శ్వేతాశ్వతరోపనిషత్తు) అనునటువంటివి.

ఇంతకుముందు మీరన్నారు. బ్రహ్మజ్ఞానానికి కర్మాపేక్ష ఉన్నది అవి యజ్ఞాదికర్మలు అని. ఐతే అది ఫలోత్పత్తికి తోడు పడదు. తెల్సుకోవాలనే కోరికను వివిదిషను కలిగించడానికి మాత్రమే ఉపయోగిస్తున్నది. దానికి కారణమేమంటే 1) వస్తువిరోధము రెండింటికీ ఉన్నది 2) వేదవాక్యాలను బాగా విచారించినపుడు మనస్సులో ఉండే రాగద్వేషాదులు తొలగిపోయి మనస్సు తేటపడి వివిదిషపుట్టడానికి తోడు పడుతుంది. వాక్యంలో **"వివిదిషన్తి, తెల్సుకోవాలనుకుంటున్నారు"** అని కదా స్పష్టంగాతెలుస్తున్నది. వివిదిషకలిగినాకనే, జ్ఞానముఏర్పడటానికిశమముమొదలైనవి మిక్కిలి సన్నిహితమైన ఉపాయములుగా వేదమే చెప్పింది. **శాంతుడు దాంతుడు సర్వకామములు ద్వంద్వముల నుండి ఉపరతుడు ఓర్పు కలవాడు మానసిక ఏకాగ్రత కలవాడై మనస్సులోనే బ్రహ్మను దర్శించుకోవాలి** అని (బృహదారణ్యకోపనిషత్తు) కావున ఇలాగా వందలకొలది జన్మలలో ఫలాలను కోరకుండా చేసిన కర్మలవల్ల మనస్సులోని కల్మషము తొలగి పోయినవాడికి వివిదిష పుట్టినది కాగా **ఓసోమ్యుడా! ఈ సృష్టికి పూర్వము. సత్ అనబడేది మాత్రమే ఉండేది అది ఒకే ఒక్కటి. రెండవది లేదు**. (ఛాందోగ్యము) **అది సత్యము జ్ఞానము. అంతములేనిది ఐన బ్రహ్మ** (తైత్తిరీయ ఆనందవల్లి) **దానికి అవయవాలు లేవు. చేయవలసిన పనులు లేవు. ప్రశాంతమైనది** (శ్వేతాశ్వతరము) **ఈ ఆత్మయే బ్రహ్మము**. (బృహదారణ్యకము) **ఆ బ్రహ్మమే నీవు** (ఛాందోగ్యము) ఇట్లాంటి వాక్యాల వల్ల జ్ఞానము పుడుతుంది. దానివల్ల అవిద్య దూరము ఔతుంది. ఐతే పైన చెప్పబడినటువంటి వాక్యార్థమైన జ్ఞానానికి సహకరించేవి శ్రవణము, మననము, నిధిధ్యాసనములు.

**శ్రవణమనగా** వేదాంతవాక్యాలు ఆత్మ ఒక్కటే సత్యమైనది అదే నిత్యమైనది అనే జ్ఞానాన్ని ప్రతిపాదిస్తున్నాయి అని తత్త్వవేత్తఐన ఆచార్యుని ద్వారా న్యాయయుక్తమైన అర్థాన్నిగ్రహించడం. ఈ విధంగా ఆచార్యుడు ఉపదేశించిన అంశాన్ని తన మనస్సులో

ఇందువల్లఇది తగును. ఇది సరియైనది అని కారణాలను విచారించి గట్టిపరచుకోవడమే **"మననము"** అనబడుతుంది. ఇలాగా శ్రవణాదుల వలన భేదభావనలన్నీ తొలగిపోయినవానికి వాక్యార్థజ్ఞానము అవిద్యను పోగొడుతుంది. కావున ఇలాంటి శ్రవణమునకు పూర్వరంగముగా తప్పక అవసరమైన దానినే పూర్వవృత్తమని చెప్పాలి. అది ఏదంటే 1) నిత్యానిత్యవస్తు వివేకము 2) శమదమాది సాధన సంపత్తు 3) ఇహాముత్ర ఫలభోగ విరాగము 4) ముముక్షుత్వము అనే సాధనచతుష్టయము. ఇవి లేకుంటే జిజ్ఞాస పొసగదు అర్థము యొక్క స్వభావాన్ని బట్టి ఇదే పూర్వవృత్తము కాదగినది అని తెలుస్తున్నది. మొత్తంగా సారాంశము ఇది – బ్రహ్మస్వరూపాన్ని కప్పివుంచే అవిద్యకు మూలకారణము పరమార్థము కాని భేదదర్శనము. అదే సంసార బంధమునకు కారణము ఔతున్నది. ఈ బంధము యథార్థము కాదు అది పరమార్థము కాదు కనుక జ్ఞానముచే పారగొట్టబడుతుంది. దాన్ని దూరంచేసే జ్ఞానము తత్త్వమసి వంటి వాక్యాల వల్ల పుడుతుంది. ఇలాంటి వాక్య జన్యజ్ఞానానికి స్వరూపోత్పత్తికి కాని, అవిద్యను తొలగించే పనిలో గాని కర్మలవల్ల ఎటువంటి ఉపయోగము లేదు. తెల్సుకోవాలనే కోరికను పుట్టించడములో మాత్రమే కర్మలు ఉపయోగిస్తాయి. ఆ వివిదిషకూడా పాపములకు ప్రధాన కారణమైన రజస్సు, తమస్సు అనే గుణాలను అణగద్రొక్కి సత్వగుణాన్ని పెంపుచేయడం వల్లనే జరుగుతుంది ఈ ఉపయోగాన్ని గమనించే **"బ్రాహ్మణాః వివిదిషం తి"** అని వేదము చెప్పింది. కనుక కర్మ జ్ఞానమునకు ఉపయోగించదు. అందుచేత బ్రహ్మజ్ఞానము కొరకు ఇంతకుమునుపు చెప్పిన సాధన చతుష్టయాన్ని పూర్వవృత్తమని చెప్పాలి.

## లఘు సిద్ధాన్తము

దీనికి సమాధానము చెప్పబడుతున్నది. అవిద్య తొలగిపోవడమే మోక్షము అది బ్రహ్మవిజ్ఞానము వల్లనేకలుగుతుంది అని అంతవరకు మేము అంగీకరిస్తున్నాము. మోక్షమును కలిగించే జ్ఞానము వేదాన్తవాక్యములచే విధింపబడుతున్నది. ఐతే అది ఎటువంటిది? అని విచారణ చేయాలి. 1) వాక్యము నుండి వాక్యార్థము తెలియడం మాత్రమేనా? లేక దాని ఆధారంగా ఏర్పడిన ఉపాసనాత్మకజ్ఞానమా? అని. ఇందులో మొదటిదైన వాక్యార్థజ్ఞానము మాత్రము కాదు. దాన్ని శాస్త్రము విధించకున్నా ఆ వాక్యాన్ని విన్నంతమాత్రముననే జ్ఞానము కల్గుతూనే ఉన్నది. పైగా అంతమాత్రాన అవిద్య తొలగిపోవడమూ జరుగడంలేదుకూడా. భేదదర్శనమునకు కారణమైన

వాసన ఉన్నంతవరకు తత్త్వమసి ఇత్యాదివాక్యాలు అవిద్యను నివృత్తి చేసే జ్ఞానాన్ని కలిగించవు. ఒకవేళ జ్ఞానము పుట్టినా ఎవరో ఒకరిద్దరికి తప్ప అందరికీ భేదజ్ఞానము తొలగిపోలేదంటే అది తప్పేమీకాబోదు. ఎందుకంటే చంద్రుడు ఒకడే అనే విషయము తెల్సినా ఇద్దరు చంద్రులు కనిపిస్తున్నారు అనే జ్ఞానము తొలగిపోనట్లు. అంతేకాదు అది తొలగిపోకపోయినా దానికి మూలకారణమైన అవిద్య మొదలునరుకబడింది. కాబట్టి మళ్ళీ బంధానికి కారణము కాబోదు అని మీరు మాట్లాడవద్దు. కావలసిన పరికరాలు సామగ్రి ఉంటుండగా జ్ఞానము కలుగడం లేదని అనడం తప్పు. ఎందుకంటే విపరీతవాసన ఉంటున్నా ఆప్తులైన వారు వచ్చి అది సరికాదు అని నమ్మకంగా బోధ చేసినపుడు బాధకమైన జ్ఞానము పుడుతూ ఉండడము మనకు కనిపిస్తున్నది. అలాగే వాక్యార్థ జ్ఞానము కల్గియున్నపుడు అనాదియైన అవిద్యా వాసన వలన భేదజ్ఞానము ఇంకా కొనసాగుతూనే ఉన్నది అని చెప్పడం ఎంతమాత్రమూ తగదు. బ్రహ్మ మొక్కటే సత్యము మిగతా భేదజ్ఞానము, దాని వాసన మిథ్యయైనందున జ్ఞానము అనగా అభేదజ్ఞానము ఎప్పుడు పుట్టిందో అప్పుడే అవిద్య అనేది తొలగిపోతుంది కాదా! అట్లాకాకుండా బ్రహ్మసత్యము జగత్తుమిథ్యా! బ్రహ్మము ఒక్కటే ఉన్నది. దానికి మించింది రెండోది ఏదీ లేదు. అనే యథార్థజ్ఞానము పుట్టినా మిథ్యయైన అవిద్య తొలగిపోలేదంటే జ్ఞానమునకంటే మరొక అవిద్యను తొలగించే సాధనము లేదు కాబట్టి ఏనాటికీ అవిద్యావాసన తొలగిపోనేపోదు. అవిద్యావాసన వల్ల కలిగే బ్రహ్మ వేరు ప్రపంచము వేరు, నీవు వేరు నేను వేరు అనే భేదజ్ఞానమునకు మూలమైన అవిద్య నశించింది / నరకివేయబడింది. ఐనా అది కొనసాగుతూనే ఉన్నది అనే మాట తెలివిలేని మూర్ఖులమాట సుమా!

ఇక రెండు చంద్రులు ఉన్నారు అనే విషయంలో దాన్ని బాధించే ఒక చంద్రుడు వాస్తవము. రెండు చంద్రులు కనబడడము అయథార్థము అనే విషయము చూచే కంటికి ప్రక్కనే బుర్రలో స్థిరంగా ఉన్నా, నిజము కాని రెండు చంద్రులు ఉన్నారు అనే మిథ్యా జ్ఞానము కలుగడానికి కారణమైన నిజమైన తిమిరాది దోషము వట్టి జ్ఞానముతో తొలగిపోయేది కాదు కాబట్టి నిలచి యుంటుంది. అందుచేత మిథ్యాజ్ఞానము తొలగిపోలేదంటే తప్పేమీ కాదు. ప్రబల ప్రమాణమైన ఆప్తోపదేశము చేత భయము, వణకడంలాంటివి మాత్రము లేకుండా పోతాయి. ఇంకా భేదవాసనను తొలగించడం ద్వారా జ్ఞానము పుడుతుంది అని ఒప్పుకునేవారికి ఎప్పుడూ కూడా జ్ఞానోత్పత్తి

సిద్ధించదు. ఎందుకంటే భేదవాసన అనాది కాలము నుండి కూడపెట్టుకుంటూ వచ్చింది కాబట్టి అది అపరిమితంగా ఉంటుంది. దానికి విరోధియైన జ్ఞానము కొద్దిపాటిది. కనుక కొద్ది మోతాదు జ్ఞానము మేరు పర్వతమంతటి అవిద్యను / అజ్ఞానాన్ని కూలద్రోయడము సాధ్యమయ్యే పని కాదు. అందుచేత కేవల వాక్యార్థానికంటే వేరయిన ధ్యానము, ఉపాసనము మొదలైన శబ్దాల చేత చెప్పబడే జ్ఞానము వేదాన్త వాక్యాలచేత విధించబడింది. కాని వట్టి వాక్యార్థజ్ఞానము మాత్రము కాదు. అలాగని శ్రుతులు చెపుతున్నాయి.

1) **తెల్సుకొని ధ్యానము చేయవలెను** (బృహదారణ్యకము) 2) **తెలుసుకొని ధ్యానము చేయుచున్నాడు** (ఛాన్దోగ్యము) 3) **ఓమ్ అనుచు పరమాత్మను ధ్యానము చేయండి** ముండకోపనిషత్తు 4) **ఆయనను ధ్యానించి జననమరణ రూపసంసారమనే మృత్యువు నుండి బయట పడుచున్నాడు**. కఠ ఉపనిషత్తు. 5) **పరమాత్మనే చేరుకోదగిన గమ్యముగా ఉపాసించాలి**. బృహదారణ్యకము 6) **ఒరే! ఆత్మనే! పరమాత్మనే దర్శించాలి. ఆయనను గురించే వినాలి. వాడినే మాటిమాటికి తలచుకోవాలి ధ్యానము చేయాలి**. 7) **అతనినే ఈ ప్రపంచంలో దర్శించుటకై వెతుకాలి. అతనిని గురించియే తెల్సుకోడానికి ప్రయత్నించాలి**. ఛాందోగ్యము. ఇటువంటివి ఇంకా చాలా! వీటియందు **నిధిధ్యాసితవ్యః** అనే దానితో ఏకార్థతను / ఏకాభిప్రాయాన్ని కలిగియున్నందువల్ల **అను విద్య విజానాతి; విజ్ఞాయప్రజ్ఞాంకుర్వీత** ఇలాంటి వాటివల్ల తెలిసే వాక్యార్థజ్ఞానము ధ్యానము చేయడానికి ఉపకరిస్తున్నందువల్ల **అనువిద్య, విజ్ఞాయ** అని ఎత్తిచెప్పి ప్రజ్ఞాంకుర్వీత, విజానాతి అను పదాలతో ధ్యానము (చేయాలి) విధింపబడుతున్నది. వినాలి / శ్రోతవ్యః అని తిరిగి చెపుతున్నారు. స్వాధ్యాయనము / వేదాధ్యయనము ప్రయోజనవంతము కాబట్టి వేదాన్ని చదివినవాడు ప్రయోజనకరములైన అర్థాలను తెల్సుకున్నందు వలన వాటిని దృఢపర్చుకోవడానికి ఆచార్యుల వద్ద వినదలచి తనకు తానే ముందుకువస్తాడు కనుక శ్రవణము ఏర్పడింది. మననము విన్నదాన్ని దృఢంగా గట్టి పర్చుకొనేది కావున **"మన్తవ్యః"** అని అనవదించారు. అందుచేత ధ్యానమే విధింపబడుతున్నది. ఇకముందు చెప్పబోతున్నాడు కూడా. **ఆవృత్తిః అసకృదు పదేశాత్** బ్ర.సూ.4.1.1 ఉపదేశము పొందిననాటి నుండి మాటిమాటికి తల్చుకోవాలి అని కావున మోక్షానికి మార్గంగా చెప్పబడిన వేదనము (జ్ఞానము) ఉపాసనము అని అర్థము అవుతున్నది. విధి, ఉపాస్యములు రెండింటినీ ఉపయోగించుతూ పర్యాయపదాలుగా

ఉపక్రమము, ఉపసంహారములందు ప్రయోగించుట కనిపిస్తున్నది కూడా. **మనోబ్రహ్మేత్యుపాసీత** వాక్యసందర్భంలో **భాతిచతపతి చకీర్త్యాయశసాబ్రహ్మవర్చసేన యఏవంవేద 2) నసవేద అకృత్స్నో హ్యేషః ఆత్మేత్యే వోపాసీత** 3) యస్త **ద్వేద యత్ సవేద** సమయైతదుక్తః అనే చోట 4) అనుమఏతాం భగవో దేవతాం శాధియాందేవతా **ముపాస్సే** అని.

ఇక ధ్యానము అనగా నూనెధారలాగా ఎడతెగని స్మృతులసన్తానరూపము. **స్మృతిచెదరకుండా నిలువాలి. చక్కని స్మృతి లభిస్తే అన్ని రకాలైన మానసికముడులు విడిపోతాయి**. అని నిశ్చలమైన స్మృతి మోక్షానికి ఉపాయముగా పెద్దలద్వారా వినిపిస్తున్నది. ఆ స్మృతికూడా **భగవద్ దర్శనమును చేసుకుంటున్నట్లుగా రూపుదిద్దుకోవాలి**. అపుడు **మనసులో సకల రాగబంధాలు తెగిపోతాయి. అన్నిరకాల సంశయాలు – ముందు వెనుకలాడుటలు త్రుంపబడుతాయి. భగవద్ ధ్యానము చేసే వీడిపాపాలన్నీ తరిగిపోతాయి. ఇదంతా ఆ పరాత్పరుడిని దర్శించినపుడు జరుగుతుంది**. కఠోపనిషత్తు – అనే వాక్యముతో ఏకార్థతయున్నందువల్ల. ఇట్లాకాగా **ఆత్మావా అరే ద్రష్టవ్యః** అనే వాక్యముతో నిధిధ్యాసనము దర్శన రూపమని విధింపబడుచున్నది. మాటిమాటికి తలచుకుంటూ ఉండడము వల్ల ఆభావనాప్రకర్ష దర్శనముతో సమానము అవుతుంది కూడా!

వాక్యకారులచేత ఇదంతా చక్కగా వివరించబడింది. **వేదనము ఉపాసనగా పరిణమిస్తుంది. పరమాత్మవిషయమును వినుట వలన** అని అన్ని ఉపనిషత్తుల యందు మోక్షముసాధించి పెట్టేదిగా విధింపబడిన వేదనము ఉపాసనమని అనబడింది. **ఒక్కమారే ప్రత్యయమును చేయవలెను. శబ్దార్థము విదితమైనది కనుక ప్రయాజాదుల వలెనే** అని పూర్వపక్షమును చేసి. **ఉపాసనశబ్దము వలన మాటిమాటికి ఆవృత్తిచేయవలెనని నిశ్చితమైనది** అని తెలిసిన జ్ఞానమును మాటిమాటికి ఆవృత్తమైనపుడే మోక్షమునకు సాధనమవుతుంది అని నిర్ణయించినారు. **ఉపాసనమనగా ధృవానుస్మృతి అలాగా లోకములో కనిపిస్తున్నది. శ్రుతివాక్యము నిర్వచించినందు వల్లనూ** అని. ఆ తెలిసిన విషయాన్నే ఉపాసనారూపమైన దానిని మాటిమాటికి ఆ వృత్తి చేయబడిన దానిని ధ్రువాను స్మృతిగా వర్ణించినారు. అలాంటి స్మృతియే దర్శనరూపమని ప్రతిపాదింపబడింది. దర్శనరూపమంటే ఎదుట ఉన్న వస్తువు లాగా చూడడమే. ఈ విధంగా ప్రత్యక్షాకారమును పొందిన అప వర్గమునకు

సాధనమైన స్మృతిని విశేషించి చెపుతున్నారు. **ఈ పరమాత్మ మాటిమాటికి మననం చేసుకోవడం వలన గాని నిధిధ్యాసనము వల్లగాని పలుమార్లు పెద్దల ముఖతః వినడం వల్ల నైనా లభించడు. ఎవరినైతే తాను ఇష్టపడతాడో వాడిని తానే కటాక్షిస్తాడు. వాడికే తనదివ్యమంగళ విగ్రహాన్ని దర్శింపచేస్తాడు.** (ముండకోపనిషత్తు) ఈ వాక్యము చేత తెలిసేదేమంటే పరమాత్మ వట్టి శ్రవణము, మననము, నిధి ధ్యాసములవల్ల లభించడు. అవి ఆత్మ ప్రాప్తికి సాధనాలు కావు. ఎవడినైతే పరమాత్మ తనకు ప్రియభక్తుడుగా భావిస్తాడో వాడిని మాత్రమే ఎంచుకొని తనను దర్శింపచేస్తాడు అని చెప్పబడింది. మిక్కిలి ప్రియమైనవాడే వరణీయుడు ఔతాడు. ఎవనికి ఈ పరమాత్మ సాటిలేని ప్రేమాస్పదుడో వాడే పరమాత్మకు ప్రియతముడు ఔతాడు. ఈ ప్రియతముడైన భక్తుడు ఎలా తనను చేరుకోగల్గుతాడో అలాగా భగవంతుడే స్వయంగా ప్రయత్నించుతాడు. అలాగని భగవంతుడే నోరారా చెప్పినాడు. **ఎల్లప్పుడూ మనస్సులోనన్నే చేరియుంటూ ప్రేమతో సేవలు చేసేవారికి నన్ను చేరుకొనే బుద్ధియోగాన్ని ప్రసాదిస్తాను** అని జ్ఞానికి **నేను అన్నిటికన్నా మిక్కిలి ప్రేమపాత్రుడిని అతడు కూడా నాకు అంతే ప్రేమాస్పదుడు** అని కూడా చెప్పినాడు. అందువల్ల సాక్షాత్కారరూపమైన స్మృతి స్మరింపబడేవానికి అత్యంతము ప్రియమైనందున మరియు స్మరణము చేయడమే ఎవనికి మరింత ప్రీతిదాయకమో అలాంటి వాడే పరమాత్మకు వరణీయుడుఔతాడు కనుక అట్టివానికే పరమాత్మ తానే అందుబాటులోకి వస్తాని చెప్పినట్లు ఔతున్నది. ఇలాంటిదైన **"ధృవాను స్మృతియే భక్తి"** శబ్దంచేత వ్యవహరింపబడుతున్నది. దీనికి పర్యాయపదము ఉపాసనము కనుకనే శ్రుతిస్మృతుల చేత ఈ తీరున చెప్పబడుతున్నది. 1) **ఆయనను తెల్సుకొని ఉపాసించి మృత్యురూప సంసారాన్ని దాటుకుంటున్నాడు.** 2) **ఆయనను ఈ విధంగా ఉపాసించినవాడు ఈ లోకమందే కర్మ బంధవిముక్తుడు ఔతున్నాడు. పరమాత్మను చేరుకోవడానికి ఇది తప్ప మరో మార్గము లేదు.** 3) **వేదాధ్యయనము, తపస్సు, దానములు, యాగముల చేత కూడా ఇపుడు నీవు చూచిన రీతిగా నేను కనిపించను. ఐతే నిశ్చలమైన నాయందలి భక్తి చేత మాత్రము కనుపించగలను. ఆ భక్తి చేతనే తెల్సుకోబడుతాను. చూడబడుతాను. భక్తివల్లనే నాకు సన్నిహితంగా అన్తరంగమున చేరవచ్చును.** 4) **ఓ అర్జునా ఆ పరమపురుషుడు ఇతరులపైకి ఒకప్పుడు కూడా ప్రసరించని సాటిలేని నిశ్చలభక్తి చేతనే లభించగలడు** అని. ఇలాంటి ధృవాను స్మృతికి సాధనములు యజ్ఞాదులు. కనుకనే **"యజ్ఞాది శ్రుతేరశ్వవత్".** బ్ర. సూ.444. అని చెప్పబడుతున్నది. వివిదిషంతి అను శ్రుతి ప్రకారము యజ్ఞాదికర్మలు

వివిదిష పుట్టడానికి ఉపయోగపడుతుండవచ్చు. ఐనా ఆ ధ్యానరూపమైన జ్ఞానము ప్రతిదినమూ అనుష్ఠింపబడుతూ **"పునఃపునరభ్యాసము"** చేయుటవలన మిక్కిలి వృద్ధి చెంది ప్రాణము పోవునంతవరకు కొనసాగినపుడు బ్రహ్మప్రాప్తికి సాధనము కాగలదు. కావున దాని ఉత్పత్తి కొరకు అన్నిరకములైన ఆశ్రమకర్మలను బ్రతికి యున్నంతవరకు అనుష్ఠించాలి. దీనినే చెప్పబోతున్నాడు ఈ దిగువ సూత్రాలతో వ్యాసమహర్షి. 1) **ఆప్రయాణాత్ తత్రాపి హి దృష్టమ్**. 2) **అగ్నిహోత్రాది తు తత్కార్యాయైవ. తద్దర్శనాత్** 3) **సహకారిత్వేనచ** ఇత్యాదుల యందు.

వాక్యకారుడు కూడా వివేకాది సాధన సప్తకము వలన ధృవాను స్మృతి పుడుతుంది అని అన్నాడు. **ఆ స్మృతి లాభము** 1) **వివేకము** 2) **విమోకము** 3) **అభ్యాసము** 4) **క్రియా** 5) **కళ్యాణము** 6) **అనవసాదము** 7) **అనుద్ధర్షముల వలన కలుగుతుంది**. **అలా జరుగుతున్నందువలన మరియు నిర్వచనము వలన**. అని అంతేకాదు వివేకాదుల యొక్క స్వరూపాన్ని కూడా వివరించినాడు. 1) **జాతి, ఆశ్రయ నిమిత్తాల వల్ల దుష్టము కాని అన్నము వల్ల శరీర శుద్ధి కలుగుట వివేకము అని** ఇందుకు ప్రమాణము. **ఆహారము దోషము లేనిదైనపుడు మనస్సత్వము / సాత్వికగుణము శుద్ధ మవుతుంది. సత్వము శుద్ధిగా నున్నపుడు స్మృతి తప్పక నిలుస్తుంది**. 2) విమోకము. **కామములకు చిక్కకుండుటయే విమోకము**.నిర్వచనము **శాంతుడై ఉపాసించాలి అని**.3)అభ్యాసము. **ఆరంభించడము మాటిమాటికి ఆలోచించడమే అభ్యాసము** దీనికి స్మృతిలో చెప్పిన నిర్వచనాన్ని భాష్యకారులు భగవద్ రామానుజులు కాదు. ద్రమిడాచార్యుడు చూపినారు. **ఎల్లపుడూ ఆయన కళ్యాణ గుణములనే భావించేవాడు**. అని 4) క్రియా. **ప్రతిదినమూ తనచేత నైనంతలో పంచమహాయజ్ఞాలను తప్పక అనుష్ఠించడము క్రియ**. నిర్వచనము 1) **బ్రహ్మవేత్తల్లో గొప్పవాడైన ఇతడు కర్మలను ఆచరించుతున్నాడు**. 2) **అలాంటి పరమాత్మను వేదాధ్యయనము యజ్ఞము, దానములు, తపస్సు, ఉపవాసదీక్షలు మున్నగువానితో తెల్సుకోగోరుతున్నారు**. అనిన్నీ. 5) కళ్యాణము – **సత్యము, ఋజుత్వము, దయ, దానము, అహింస, అనభిధ్యలు కల్యాణములు** ఇవి గుణములు. వీనిని కల్గియుండాలి. నిర్వచనము **1) సత్యము చేతనే లభింపగలదు 2) వారికి మాత్రమే ఈ రజోగుణప్రభావము లేని బ్రహ్మలోకము** మున్నగునవి 6) అనవసాదము – **దేశకాలములు అనుకూలముగా లేనందువల్ల శోకము. వస్తువులను తలచుకోవడం వలన కల్గిన దైన్యము, ఉత్సాహము లేక మనస్సు కలత నొందుట**

**అవసాదము**. **అది లేక పోవుట అనవసాదము**. నిర్వచనము – **ఈ పరమాత్మ మానసిక ధైర్యము లేని బలహీనునికి చిక్కడు అని** ఉద్ధర్షము: – **దేశకాలాదులు కలసి వచ్చి కోరినవి చేజిక్కి నందువల్ల మనస్సులో కలిగిన మానసిక సంతుష్టి ఉద్ధర్షము**. **దానికి విపర్యయము అనుద్ధర్షము**. ఉబ్బిపోకుండుట అతి సంతోషము కూడా శత్రువేనని అర్థము. నిర్వచనము **శాంతుడు దాంతుడు** అని. ఈ విధంగా నియమాలతో నున్నవానికి తన ఆశ్రమానికి విధించిన కర్మానుష్ఠానము చేతనే బ్రహ్మ విద్యా నిష్పత్తి జరుగుతుందని చెప్పినట్లు ఐనది. అలాగని మరొక వేదవాక్యము చెపుతున్నది. **విద్యను అవిద్యను రెండింటినీ ఎవడు తెల్సుకుంటున్నాడో అతడు అవిద్య వలన మృత్యువును దాటుకొని విద్య వల్ల అమృతత్వమును పొందుచున్నాడు**. (ఈశా వాస్యోపనిషత్తు) ఇచ్చట అవిద్య శబ్దము చేత చెప్పబడింది. వర్ణాశ్రమాలకు విధించబడిన కర్మ. అవిద్యయా, కర్మతో మృత్యుం = జ్ఞానము కలుగకుండా అడ్డుకునే ప్రాచీన జన్మలలోని కర్మ. తీర్త్వా = ప్రక్కకు త్రోసి, విద్యయా = జ్ఞానముతో అమృతం = బ్రహ్మను అశ్నుతే = పొందుచున్నాడు అని అర్థము ప్రాచీనకర్మను తొలగించుకోవడానికి ఉపాయంగా ప్రసిద్ధికి ఎక్కింది అవిద్య. విద్య కంటే వ్యతిరేకమైనది కర్మ మాత్రమే. **జ్ఞానమునే ఆశ్రయించిన ఆయన అనేకములైన యజ్ఞములనాచరించినాడు**. **బ్రహ్మవిద్యను అధికరించి అవిద్యతో మృత్యువును ప్రక్కకు నెట్టివేయదల్చుకున్న వాడు కావున**. జ్ఞానవిరోధియైన కర్మపుణ్యము పాపము అని రెండు రూపాలుగా నున్నది. బ్రహ్మజ్ఞానమును కలుగకుండా అడ్డగించి యుంటున్నవి. కనుక రెండింటికీ పాప శబ్దముతో వ్యవహారము సబబుగా నున్నది. దీనికి జ్ఞానవిరోధిత్వము ఎలాగంటే జ్ఞానము కలుగడానికి కారణమైన శుద్ధ సత్వానికి శత్రువులైన రజస్తమస్సులను పెంపుచేయడము ద్వారానే. పాపము జ్ఞానోదయ విరోధి ఎలా అవుతున్నదంటే. **ఇతడే అసాధు కర్మలను చేయించుతున్నాడు**. **ఎవడిని తాను మరింత దిగజారిపోవునట్లు చేయదల్చుకున్నాడో?** (కౌషీతకీ ఉపనిషత్తు) అనే శ్రుతి వాక్యముతో అవగతమగుచున్నది. రజస్తమస్సులు యథార్థ జ్ఞానాన్ని కప్పివేస్తాయని సత్వము యథార్థ జ్ఞానము పుట్టడానికి హేతువని భగవంతుడే ప్రతిపాదించినాడు. **సత్వాత్ సంజాయతే జ్ఞానమ్** – సత్వము వలన జ్ఞానము పుడుతున్నది. అని ఇందువలన జ్ఞానము కలగడం కొరకు పాపపు కర్మనుదూరము చేసుకోవాలి. అది ఫలములను కోరకుండా అనుష్ఠించిన కర్మలవల్లనే ఔతుంది. అలాగని వేదవాక్యము **ధర్మముతో పాపమును దూరంగా త్రోసివేస్తున్నాడు** అని (తైత్తిరీయ నారాయణము)

ఈ విధంగా బ్రహ్మప్రాప్తికి సాధనమైన జ్ఞానము అన్ని ఆశ్రమాలలో ఆచరించవలసిన కర్మలవల్లనే సాధ్యము. అందువల్ల కోరిన కర్మలస్వరూపజ్ఞానము. కేవల కర్మలు అల్పములు అస్థిరఫలములనిస్తాయి అనే జ్ఞానమున్నూ కర్మమీమాంస వల్లనే పొందదగియున్నది. కనుకనే తెల్సుకోదగిన కర్మమీమాంసయే బ్రహ్మ జిజ్ఞాస చేయుటకు పూర్వవృత్తముగా చెప్పాలి. మరియు నిత్యానిత్యవస్తువివేకాదులు, మీమాంసా శాస్త్రమును చదువకుండా సిద్ధించేవి కావు. ఫలము, సాధనములు, చేయవలసిన విధానము, అధికారి విశేషము మున్నగు వాటిని నిశ్చయించకుండా కర్మ స్వరూపము, దాని ఫలము, దాని నిలకడ అస్థిరత్వములు ఆత్మయొక్క నిత్యత్వము అను విషయాలు అర్థము కావు. ఈ కర్మల సాధనత్వమున్నూ వినియోగించుటవల్లనే తెలుస్తుంది. వినియోగము కూడా శ్రుతిలింగాదుల వల్లనే. అది కూడా పూర్వమీమాంసలోని మూడవ అధ్యాయనము ద్వారానే తెలుస్తుంది.

ఉద్గీథాది ఉపాసనలు కర్మలను శక్తిమంతాలుగా చేసేవి ఐనప్పటికి బ్రహ్మముకాని వాటి యందు బ్రహ్మభావనను కల్గింపచేసేవి, బ్రహ్మజ్ఞానమును కోరునటువంటివి ఐనందువల్ల ఈ ఉత్తర / శారీరక మీమాంసయందే విచారించదగియున్నవి. ఆ కర్మలు కూడా ఫలములను ఆశించకుండా ఆచరించినపుడే బ్రహ్మవిద్యను పుట్టించుతాయి. పరబ్రహ్మతో సాద్గుణ్యాన్ని కల్గిస్తాయి. కనుక ఈ జ్ఞానభాగమందే తప్పక విచారించాలి. వాటికి కూడా కర్మస్వరూపాన్ని తెల్సుకోవాల్సియుండడమనేది అందరూ ఒప్పుకున్న విషయమే. **అని లఘుసిద్ధాంతము.**

★ ★ ★

## మహా పూర్వ పక్షము

అన్ని రకాలైన విశేషాలకు విరోధియైన కేవల జ్ఞానమే బ్రహ్మ అదే సత్యము. దానికన్నా వేరుగా కనిపించే పలువిధాలుగా నున్న జ్ఞాత, జ్ఞేయము, దానివలన ఏర్పడిన జ్ఞానభేదాదులన్నీ ఆ బ్రహ్మయందే కల్పింపబడుతున్నవి. అవి అన్నీ వాస్తవాలు కావు మిథ్యాభూతములు. అనగా ఉన్నట్టు కనిపిస్తాయి కాని నిజానికి తరచి చూస్తే లేకుండా పోతాయి.

1. **ఓసోమ్యుడా! ఈ సత్తు మాత్రమే తొట్టతొలుత ఉండింది. అది ఒంటరిది. రెండవది లేదు**. ఛాందోగ్యము.

2. **ఇక పరా విద్యను గురించి చెపుతున్నాను. దానివలన అక్షర స్వరూపమును పొందవచ్చును. ఆ అక్షరమనునది కంటికి కనిపించదు ఇతర ఇంద్రియాలకూ అందదు. పేరు లేనిది. రంగు లేనిది. కండ్లు, చెవులు, కాళ్ళు, చేతులు లేనట్టిది. ఎల్లపుడూ ఉంటున్నది. దేశకాలాదులచేత పరిమితము చేయబడదు. వస్తు పరిచ్ఛేదము లేనిది. అంతటా అన్నింటా ఉన్నట్టిది. మిక్కిలి సూక్ష్మము ఐనది. ఐనా భూతములన్నింటి పుట్టుకకు కారణమైనట్టిది దానిని జ్ఞానులు దర్శించుతున్నారు**. (ఆథర్వణికోపనిషత్తు).

3. **మిథ్యకానిది, జడముకానిది, పరిచ్ఛేదము లేనిది బ్రహ్మము**. తైత్తిరీయోపనిషత్తు. ఆనందవల్లి.

4. **అవయవములు లేవు. చేయదగిన కర్మలు లేవు. ఆరు ఊర్మలు లేవు**. (ఆకలి దప్పి, శోకమోహములు, ముసలితనము, చావు ఇవి ఆరు) **కర్మ సంబంధము, దాని ఫలములు లేనట్టిది**. (శ్వేతాశ్వతరోపనిషత్తు).

5. **ఎవనికి ఇంద్రియాదుల ద్వారా బ్రహ్మము తెలయబడుటలేదు అని గుర్తింపు కలిగినదో వానికి బ్రహ్మను గురించి తెల్సినట్లు. ఎవడు తెల్సినది అని తలుస్తున్నాడో వానికి ఏమీ తెలియదు. జ్ఞానమున్నవారిలోనూ తెలుసునన్న వారికి ఏమీ తెలియదు. బ్రహ్మము గురించి నాకేమీ తెలియదని ఎంచినవారికి బాగా తెల్సును**. కేనోపనిషత్తు.

6. చూపుకు వేరుగా చూచేవాడిని, మననము చేసేవాడిని మననము కంటే వేరుగా చూడకు. **అని వాజసనేయులు బృహదారణ్య కోపనిషత్తు యందు తెల్పినారు**.

7. **ఆనందమే బ్రహ్మ**. తైత్తిరీయ భృగువల్లి.

8. **ఈ కనిపించేది అంతయూ బ్రహ్మమే ఆత్మయే**. బృహదారణ్యము.

9. **ఇచ్చట పలువస్తువులు లేవు. ఉన్నట్లు తలచినవాడు మృత్యువు పిదప మృత్యువును** జన్మపరంపరలను **పొందుచున్నాడు**.

10. **రెండు ఉన్నట్లు చూచినవానికి ఇతరుడు కనిపిస్తున్నాడు. ఎవనికి ఇదంతా ఆత్మగా కనిపిస్తుందో వాడు ఆత్మ కన్నా వేరయిన దాన్ని చూడలేదు. చూచినా దేనితో ఎవడిని చూడగలడు?** బృహదారణ్యకోపనిషత్తు.

11. **వాక్కుతో వ్యవహారము – వస్తు వికారము. దానికి పేరు – మృత్తిక అనేది మాత్రము సత్యము**. ఛాందోగ్యోపనిషత్తు.

12. **ఎప్పుడైతే ఈ బ్రహ్మము నందు ఏ కొద్దిపాటి భేదమును చూస్తాడో వాడికి అనన్తరము భయము కల్గుతుంది**. తైత్తిరేయ ఆనంద.

13. **స్థానమును బట్టి పరునికి ఉభయలింగములు లేవు. అంతటా ఒక్కటే రూపము**. బ్రహ్మసూత్రము.

14. **ఇదంతా మాయా మాత్రమే. మొత్తమ్మీద ఇదీ అని వ్యక్తమైన స్వరూపము లేనివాడు**. బ్రహ్మసూత్రము.

15. **భేదములు లేక సత్తను కల్గియున్నా ఇంద్రియాలకు అందనిది, మాటలకు అందనిది, మనస్సుకు మాత్రమే తెల్యగలదేదో ఆ జ్ఞానమే బ్రహ్మ అను పేరుతో నున్నది**. విష్ణు పురాణము.

16. **జ్ఞానము యొక్క స్వరూపము పరమార్థ దృష్టితో చూచినపుడు అత్యన్త నిర్మలమైనది. అదే భ్రమాత్మక బుద్ధితో చూచినపుడు వివిధ పదార్థాల రూపాలతో కనిపిస్తున్నది**. విష్ణు పురాణము.

17. **పరమార్థము నీవొకడివే. ఓ జగత్పతే! నీకుంటే వేరుగా మరొకడు లేదు సుమా!** (విష్ణుపురాణము)

18. **జ్ఞానాత్మకుడవైన నీకు ఉన్నట్లుగా కనిపించేరూపము ఏది ఉన్నదో దాన్ని అయోగులైనవారు భ్రాన్తి జ్ఞానముతో జగత్ రూపమునుగా చూస్తున్నారు**. విష్ణుపురాణము

19. ఈ జగత్తు అంతా జ్ఞానస్వరూపము. తెలివిలేనివారు వస్తు స్వరూపంగా భావిస్తూ మోహమనే తెప్పలో భ్రమిస్తూ ఉన్నారు. ఎవరైతే జ్ఞానము కలవారై విశుద్ధమనస్సు గలవారుగా ఉన్నారో వారు ఈ ప్రపంచాన్ని అంతటినీ జ్ఞానాత్మకమైన నీరూపముగా భావిస్తున్నారు. **విష్ణు పురాణము.**

20. తనయొక్క ఇతరుల యొక్క శరీరము లందు ఉన్న సత్తుయొక్క స్వరూపము ఒక్కటే. అదే విజ్ఞానము. అది పరమార్థమైనట్టిది దానికి భేదము లేదు. రెండు ఉన్నట్లుగా చూచేవారు అయథార్థాన్నే చూస్తున్నారు. అభేదాన్ని కనుగొనడం లేదు. **విష్ణుపురాణము**

21. ఓ రాజా! నాకంటే వేరుగా మరొకడు ఉన్నాడు అనుకొనేట్లయితే అపుడు వీడు, నేను, ఇది మరొకడు అని చెప్పటానికి వీలుఔతుంది. **విష్ణుపురాణము**

22. పిల్లనగ్రోవిలోని ఏడురంధ్రాలలో నుంచి గాలి బయటకు వచ్చి వేరువేరుగా షడ్జము, గాంధారము పంచమము వంటి పేర్లను పొందుతున్నది. వాస్తవానికి భేదము లేనిదై అన్నింటిలో దూరే వాయువు ఒక్కటే. అట్లే పరమాత్మ ఒక్కడే. **విష్ణుపురాణము.**

23. వాడు నేను నీవు అనబడేదంతా ఆత్మయొక్క స్వరూపమే. ఇది అది అన్నీ ఆత్మయే. కనుక భేదభావాన్ని వదిలిపెట్టు అని ఉపదేశింపబడిన ఆ రాజు పరమార్థము నందే చూపునుంచినవాడై భేదభావమును వదిలివేసినాడు. **విష్ణుపురాణము**

24. విభేదమును కలిగించే అజ్ఞానము సమూలముగా నశించిపోయినాక తనకు బ్రహ్మకు లేని భేదాన్ని ఎవడు చూపుతాడు. **విష్ణుపురాణము**

25. ఓ అర్జునా! సమస్త భూతములయొక్క హృదయగుహల యందు ఉన్న ఆత్మను నేనే. **భగవద్గీత**

26. అన్ని క్షేత్రములు। శరీరముల యందు ఉన్న క్షేత్రజ్ఞుడిని కూడా నేనని తెల్సుకో. **భగవద్గీత**

27. ఈ సమస్త చరాచర ప్రపంచమునందు నేను లేకుండా ఏదీ లేదు. **భగవద్గీత**

ఇటువంటి బహుళ ప్రమాణాల చేత వాస్తవమైన వస్తుస్వరూపము తెలుపబడుతున్నది. ఈ శాస్త్రములన్నీ నిర్విశేషమైన జ్ఞానము అనబడే బ్రహ్మయే సత్యమైన తత్వము. ఆయన కంటే వేరయినది అంతా మిథ్య. ఉన్నట్లు కనబడుతుంది కానీ అది పరమార్థము కాదు. అని ప్రమాణీకరిస్తున్నవి.

**మిథ్య అంటే** ఏదైతే ఉన్నట్లుగా కనిపిస్తూ దానియొక్క యథార్థ జ్ఞానము కల్గినపుడు తొలగిపోయేది. ఎలాగంటే దూరమునుంచి చూచినపుడు పాముగా కనిపించిన త్రాడు దగ్గరగా వచ్చి పరిశీలించినపుడు పాము కాదు అని తెలిసినట్లు. ఐతే ఆత్రాడు పాముగా భావించడానికి కారణము ఏదంటే దోషమే. ఇలాగే కేవలము జ్ఞానమే శరీరముగా కల పరబ్రహ్మ యందు దోషము వల్ల కల్పింపబడిందే దేవతలు పశుపక్షులు, మనుష్యులు,

కొండలు, గుట్టలు మొదలైన భేదభావముతో కూడిన సర్వప్రపంచమున్నూ. ఎపుడైతే పరబ్రహ్మ ఒక్కటే జ్ఞానమే సత్యము అని యథార్థ జ్ఞానము కలుగుతుందో అపుడు ఇదేది కనపడకుండా పోతుంది. దీన్నే మిథ్యా స్వరూపంగా తెల్సుకోవాలి.

ఇక దోషమున్నూ ఎలాంటిది అంటే వస్తువు యొక్క యథార్థమైన స్వరూపాన్ని కప్పివేస్తూ దానిపైన వివిధములు విచిత్రములు ఐన విక్షేపములను / ఆరోపములను కలిగించుతూ, ఉన్నదీ, లేనిదీ గాక, ఇలాంటిది అని చెప్పడానికి పొసగనిదీ అనిర్వచనీయమైనదీ ఐ ఎప్పటినుంచి ఉంటూ వస్తూన్నదో తెలియరాని అవిద్యయే దోషము.

ఇందుకు ప్రమాణాలు ఇవి. అసత్యము చేత కప్పబడియున్నవి. **2**) సత్య స్వరూపములై ఉన్న సత్తులను అనృతము కప్పియున్నది. **3**) సృష్టికి పూర్వకాలములో అసత్తూ లేదు. సత్తుకూడా లేదు. తమస్సు మాత్రమే ఉండింది. దాని చేతనే జ్యోతిః స్వరూపము కప్పబడియున్నది. **4**) మాయా అనగా ప్రకృతి సర్వేశ్వరుడు మాయి. **5**) ఇంద్రుడు మాయల వలన పలురూపములతో కనిపిస్తున్నాడు. **6**) నా మాయ తప్పించుకోలేనిది. **7**) ఎప్పటినుంచి ఉంటూ ఉన్నదో తెలియరాని మాయచేత మోహింపబడి నిద్రిస్తున్న జీవుడు ఎపుడు లేస్తాడో!

ఇలాంటి వేదప్రమాణాల చేత ఎలాంటి విశేషములు లేని కేవల జ్ఞానస్వరూపుడైన బ్రహ్మనే సద్అసత్ అని చెప్పలేని అనాదియైన అవిద్యచేత తన స్వరూపమును కప్పివేయబడినందున ఏమీ తెలిసికోలేక తనలోనే పలురూపాలను దర్శిస్తున్నాడని అవగతమువౌతున్నది.

1) భగవంతుడు జ్ఞానస్వరూపుడు. ఈ సమస్తమూ ఆయన నుండియే బయలుదేరినది. వస్తువుకాదు. జ్ఞానస్వరూపమే. వివిధమైన భేదజ్ఞానము చేతనే కొండలు సముద్రము నేల అనే భేదాలు కనిపిస్తున్నాయి. ఎపుడైతే జ్ఞానము సర్వకర్మలు నశించి దోషాలు తొలగిపోయి శుద్ధమై ప్రకాశిస్తుందో అపుడు సంకల్పవృక్షమైన మనస్సులో కోరికలు తత్ఫలములు జనించవు. వస్తువులలో వస్తుభేదాలున్నూ కలుగవు.

2) ఓ బ్రాహ్మణుడా! విజ్ఞానము తప్ప మరేదీ ఎప్పుడూ ఎక్కడా లేనేలేదు. విజ్ఞానము ఒక్కటే. ఐతే వారి వారి కర్మభేదాలను బట్టి భేదజ్ఞానము కలవారికి

పలురకాలుగా కనిపిస్తున్నది. వాస్తవానికి జ్ఞానమనేది నిర్మలము, మిక్కిలి పరిశుద్ధము, దుఃఖములు లేనిది. లోభాదులైన అశేషదోషాలతో సంపర్కము లేనిది. అది ఒక్కటే. ఎల్లపుడూ ఒకే రీతిగా నుంటుంది. దానికన్నా ఉత్కృష్టమైనది లేదు. తనకన్నా వేరైన వానిని శాసిస్తుంది. ఆ విజ్ఞానాన్ని కొందరు వాసుదేవుడు అంటున్నారు. దానికంటే మరొకటి లేదు. యథార్థస్థితిని ఈలాగా నీకు వివరించాను. జ్ఞానము ఎలాగా సత్యమో దీనికంటే భిన్నమైన వస్తువు అసత్యము. ఈ ప్రపంచమంతటిలో వ్యవహార రూపములో ఏభేదభావము ఉన్నదో దాన్ని కూడా నీకు వివరించినాను అదే పురాణాలలోనూ చెప్పబడియున్నది అని.

ఇలాంటి అవిద్య, **"నిర్విశేషమైన జ్ఞానస్వరూపమగు బ్రహ్మ ఒక్కటే ఉన్నది. మరొక్కటి లేదు"** అనే ఐక్యజ్ఞానముతో తొలగిపోతుందని పెద్దలు చెపుతున్నారు. **1)** ఆ పరబ్రహ్మను ఒక్కటే సత్యముగా తెలుసుకున్నవాడు మళ్ళీ జన్మించడు. **2)** పరమాత్మ స్వరూపాన్ని తెల్సుకొన్నవాడు పునర్జన్మనెత్తడు. **3)** ఎపుడైతే వీడు కంటికి కనుపించని, మనస్సుకు ఊహించరాని, ఇలాంటి వాడని నిర్వచించలేని ఒక్కచోట మాత్రమే నిల్చిఉండని వానియందు అభయమును మనఃస్వస్థతను పొందుతాడో అపుడు వాడు నిశ్చింతుడుఔతాడు **4)** మనస్సులో ఉండే రాగబంధాలు భేదింపబడతాయి. అన్ని రకములైన అనుమానాలు తెగుతాయి. వీడియొక్క అనాదియైన పుణ్యపాపరూపకర్మలన్నీ నశించిపోతాయి. ఎపుడు? ఆపరాత్పరుడు చల్లగా చూచినపుడు. ఆయన దర్శనభాగ్యము కలిగినపుడు. **5)** బ్రహ్మను గురించి తెల్సుకున్న వాడు బ్రహ్మనేఔతాడు. **6)** ఆయనను తెల్సుకొన్నవాడు సంసారము దాటుకొనిపోతాడు. ఇందుకు వేరొకమార్గము లేదు. ఈ వాక్యములో మృత్యుశబ్దము అవిద్యను తెల్పుతున్నది. సనత్సుజాతుని వాక్యమిట్లున్నది. ప్రమాదమును మృత్యువని చెపుతున్నాను. అప్రమాదమే అమృతత్వము – మోక్షముసుమా! అప్రమాదము అమృత మైనపుడు దానికి వ్యతిరేకమైనది మృత్యువు. అదే జననమరణరూపసంసారము 1) పరబ్రహ్మ అస్తిశబ్దవాచ్యుడు సత్యస్వరూపుడు. జ్ఞానఘనుడు. జడము కంటే వేరైనవాడు దేశకాలాది పరిచ్ఛేదము లేనివాడు. 2) విజ్ఞానము. ఆనందమే బ్రహ్మమున్నగు శోధకవాక్యముల ద్వారా తెలియవచ్చే నిర్విశేషబ్రహ్మ ఒక్కటే అనే జ్ఞానము కూడా అవిద్యానివృత్తికి హేతువుఔతుంది.

**1**) ఇక ఎవడైతే తనకంటే వేరుగా దేవతను ఉపాసించుతాడో! వీడు వేరు. నేను వేరు అనే భేదభావాన్ని కల్గిఉంటాడో వాడు బ్రహ్మను గురించి ఏమీ ఎరుగడు. **2**) వీడు సమగ్ర జ్ఞానము లేనివాడు. **3**) ఆత్మ అనియే ఉపాసన చేయాలి. **4**) ఆ బ్రహ్మము నీవే. **5**) పూజ్యురాలవగు ఓ దేవతా! నీవే నేను ఐ ఉన్నాను. నేనేనీవై యున్నావు. అందువలన. ఎవడు నేనో వాడే వీడు ఎవడు వీడో అతడినే నేను అని ఇలాంటి వాక్యాలవల్ల తెలిసే ఎన్ని భేదాలు ఉన్నా అంతటా ఉన్న ఆత్మఒక్కటేననే విజ్ఞానము అవిద్యను పోగొడుతుంది. దీన్నే ముందు చెప్పబోతున్నాడు. **ఆత్మేతితూపగ చ్ఛన్తి**. **గ్రాహయన్తిచ**. బ్రహ్మసూత్రము – ఆత్మనుగా గుర్తిస్తున్నారు. ఇతరులకు దాన్నే తెల్పుతున్నారు – అట్లాగే వాక్యకారుడున్నూ – **ఆత్మేత్యేవతు గృహ్ణీయాత్ సర్వస్య తన్నిష్పత్తేః** – ఆత్మగానే గ్రహించాలి. ఈ సర్వస్వము ఆత్మనుండే పుట్టింది కాబట్టి అని.

ఈ విధమైన బ్రహ్మ అనగా ఆత్మ. అది ఒక్కటే అనే బ్రహ్మాత్మైకత్వ విజ్ఞానముచేత మిథ్యారూపము కారణమూ ఐన బంధము తొలగిపోవుట యుక్తమే.

ఏమండి! ప్రత్యక్షంగా వస్తుగతములై పలురకాలైన భేదాలు కనుపిస్తూ ఉంటే శాస్త్రమువల్ల పుట్టిన జ్ఞానము కారణంగా ఆ భేదాలన్నీ సత్యాలు కావు అన్నంత మాత్రాన ఎదురుగా ఉన్న వస్తువులు హఠాత్తుగా మాయంకావు కదా! కాబట్టి భేదనివృత్తి ఎలా జరుగుతుంది? చెప్పండి అన్నట్లయితే సమాధానము ఇది. తాడును చూచి పాము అని భ్రమపడినపుడు సర్పనివృత్తి జరగడం లేదా! అక్కడ ఇది పాము కాదు త్రాడే అనే జ్ఞానమే కదా భ్రమను తొలగిస్తున్నది! అలాగే ఇక్కడ కూడా! అక్కడ రెండు ప్రత్యక్షములకు విరోధము ఉన్నది. 1) తాడును చూచి పాము అనుకోవడము 2) ఆప్తవాక్యము సాయంతో సన్నిహితంగా పోయి సందర్శించడము. రెండు ప్రత్యక్షాలు ఉన్నాయి. ఒకదాన్ని మరొకటి బాధించింది. కాని ఇక్కడ ఒకటి ప్రత్యక్షము మరొకటి శాస్త్రజన్యజ్ఞానము. (దీనికి కూడా ప్రత్యక్షమే మూలము.) సరే! రెండు సమానమైన ప్రమాణాలకు బాధ్య భాధక భావము. **దుష్టకారణమువల్ల జన్యమైనది, అది కానిది అని రెండు విధాలు**. అందులో శాస్త్రము ప్రత్యక్షమూలమే ఐనా దుష్టకారణ జన్యము కాదు. ప్రత్యక్షము నేత్రములోని దోషము వల్ల తాడు పాముగా కనిపించింది. కనుక శాస్త్రము చేత ప్రత్యక్షము బాధింపబడుతుంది. కావున ప్రత్యక్షమునకు శాస్త్రమునకున్నూ విరోధము ఏర్పడిన ఈ సందర్భములో పైసూత్రము వర్తిస్తుంది. దీని వివరము ఇది –

బాధ్యబాధక భావాన్ని నిర్ణయించేటప్పుడు రెండూ సమానములా? కాదా? సాపేక్షమా? నిరపేక్షమా? అనేది కారణముకాబోదు. ఉదా! దీపము ఒక్కటిగానే కన్నులున్న అందరికీ కనిపిస్తుంది. అది ప్రత్యక్షప్రమాణము. ఇక అనుమానమనే తర్కశాస్త్ర ప్రమాణము అనేక జ్వాలలు అందులో ఉన్నవి. అవన్నీ ఒక్కొక్క నూనె బిందువువల్ల ఏర్పడుతున్నవి అని చెప్తున్నది. ఈ ప్రక్రియ కన్ను కనుగొనే కంటే వేగంగా జరిగిపోతున్నది. కనుక కన్నుదీపము ఒక్కటేనని చెపుతున్నది. కాని శాస్త్రము అనేక జ్వాలలు అనేక దీపాలు ఉన్నాయి అంటున్నది. ఈ రెండింటిలో శాస్త్రమును ప్రమాణంగా తీసుకొని ప్రత్యక్షాన్ని కాదనకూడదు. ఒకే జ్వాల అందరికీ స్పష్టంగా కనిపిస్తున్నది కనుక దాన్నీ కాదనరాదు. కాగా రెండు ప్రమాణాలకు విరోధము ఏర్పడినప్పుడు ఏది మరొక విధంగా సిద్ధించడానికి అవకాశము ఉన్నదో అది బాధ్యము అని, ఏది మరొక విధంగా సిద్ధించడానికి అవకాశము లేక నిరవకాశమై యున్నదో అది బాధకము అని నిర్ణయించుకుంటే సరిపోతుంది. బాధ్యము అంటే కొట్టివేయబడేది. బాధకము అనగా ఎదుటి దాన్ని కాదని పక్కకుతోసివేసేది. దీన్ని ప్రమాణంగా తీసుకున్నపుడు ప్రత్యక్షము, శాస్త్రము అను ప్రమాణాలలో ఏది బాధ్యము ఏది బాధకము అవుతుందో పరిశీలించుదాము. వేదమనే శాస్త్రము అనాదిగా వస్తున్నది. దానికి నాశనము లేదు. ఎడతెగని సంప్రదాయము – గురు ముఖతః శిష్యుడికి సస్వరంగా ఉపదేశింపబడుట, ఒకే రీతిగా పఠింపబడుట అనేదాన్ని – కల్గియున్నది దోషములున్నవని ఊహించడానికైనా ఆస్కారము లేనట్టిది. అంతేకాక అనవకాశము. ఇలాంటి శాస్త్రము వలన పుట్టిన జ్ఞానము – నిర్విశేషము, నిత్యము, అవిద్యాదోషము లేనిది, ఏవిధమైన జన్మమరణాదులు లేనిది, స్వతః ప్రకాశమానమైనది ప్రకాశవంతమైనది. జ్ఞానమాత్రమైన బ్రహ్మాత్మభావమును తెల్పుతున్నందున – దోషములు ఉండటానికి ఆస్కారములేనట్టిది, సావకాశమైనది. ఐన, ప్రత్యక్షాదిప్రమాణాల చేత ఏర్పడిన, పలురకములైన భేదములు కల్గియున్న బంధమనేది తొలగిపోవడము ఎంతైనా తగియున్నది.

ఇక ప్రత్యక్షానికి దోషమున్నది. శాస్త్రానికి లేదు. నిర్దోషము. ప్రత్యక్షము వివిధములైన వికల్పములను, భేదమును చూపించుతుంది. ఇలాంటి దానికి ఏనాటినుండి వస్తున్నదో తెలియరాని భేదవాసన రూపమైన అనాది అవిద్యా అనే దోషము అంటుకొని ఉన్నది. కనుక నిర్దోషము నిరవకాశము ఐన శాస్త్ర జన్యజ్ఞానము, చేత దోషములు కల్గినట్టిది సావకాశమున్నూ ఐన ప్రత్యక్షము బాధింపబడ్తుంది.

అందువల్ల **"పరమాత్మ ఒక్కడే సత్యము. ప్రపంచము మిథ్యా"** అనేది శాస్త్రము చేత ప్రమాణీకరింపబడుతుందని గ్రహించాలి.

సరే! అనాది నిధనము ఐ అవిచ్ఛిన్న సంప్రదాయము కలదియైన శాస్త్రము నిర్దుష్టమే ఐనా **జ్యోతిష్టోమేన స్వర్గకామోయజేత** – స్వర్గము కావాలని కోరేవాడు జ్యోతిష్టోమము అనే యాగాన్ని ఆచరించాలి – అని చెపుతున్నది. ఈ వాక్యము భూలోకము, స్వర్గలోకము అని, ఆరంభించి కర్మలలో భేదము కర్తలలో భేదము ఫలములలో ఎన్నో భేదములను తెల్పుతున్నది. కావున భేదదర్శనము చేస్తున్నది. కనుక బాధ్యము కావలసివస్తుందికదా! అనే సందేహము రావచ్చును. అవును ఇచ్చట అపచ్ఛేదన్యాయము వర్తిస్తుంది. దాని ప్రకారము రెండు అపచ్ఛేదములు జరిగినపుడు రెండవ అపచ్ఛేదము ముందటి దానిని బాధిస్తుంది. ఈ అంశము పూర్వమీమాంసలోనున్నది. అక్కడ విస్తారముగా పరిశీలించవచ్చును. అలాగే పూర్వశాస్త్రము – కర్మలను బోధించేవేద పూర్వభాగాన్ని – బ్రహ్మము ఒక్కడే సత్యమని నిరూపించే ఉత్తరభాగమైన మోక్షశాస్త్రము బాధిస్తుంది. కర్మభాగము సావకాశము, మోక్షభాగము / ఉపనిషత్తు. నిరవకాశము అంటే పూర్వభాగమైన కర్మశాస్త్రము బాధింపబడుతుంది. ఏకత్వాన్ని తెలిపే ఉత్తరభాగము బాధించుతుంది. కావున ఇదియే సరియైన విధానము.

**ఇంతేకాదు**. ఉత్తర భాగమైన వేదాన్తములందు సగుణవాక్యములు నిర్గుణ వాక్యములకు ఇదే న్యాయము వర్తిస్తుంది. పరబ్రహ్మ నిర్గుణుడు కదా! కావున సగుణవాక్యాలు నిర్గుణ వాక్యాలచేత బాధింపబడుతాయి. ఐతే ఒకసందేహము.

1) **పరమాత్మ ప్రపంచములోని పదార్థాలనన్నింటిని గురించి తెల్సినవాడు. ఆయన వాని యందలి మానసికములు, బాహ్యములు ఐన భావాలను వాటికి కారణములైన పుణ్యాపాపములున్నూ తెలిసినవాడు.**

2) **ఈయనయొక్క శక్తి అన్నిటికన్న మిన్నయైనట్టిది. అది పలురకాలుగానున్నదని కూడా వినిపిస్తున్నది. ఆయనకు ఉన్న జ్ఞానము, బలము, పనులు సహజమైనవి. ఎవరో ఇస్తే వచ్చినవికావు.**

3) **ఆయన తలచినవన్నీ నేరవేరుతాయి. వాటికి ఎట్టి అడ్డంకులు లేవు. కనుక ఆయన సత్యకాముడు. సత్యసంకల్పుడు.**

ఇలాంటి బ్రహ్మను ప్రతిపాదించేవాక్యాలకు బాధింపబడుట ఎట్లా కుదురుతుంది? అని అంటావా? నిర్గుణవాక్యములు చెప్పిన సామర్థ్యాన్ని బట్టే చెల్లుతుంది. 1) స్థూలము కాదు. అణువూ కాదు. పొట్టీకాదు పొడవు కాదు. 2) బ్రహ్మ పదార్థము సత్యము, జ్ఞానస్వరూపము, పరిచ్ఛిన్నము కాదు. 3) నిర్గుణము. గుణములు లేనిది. కర్మవాసనలు ఏవీ అంటనిది. ఇలాంటి వాక్యాలన్నీ విశేషాలు ఏవీ బొత్తిగా లేని నిర్వికారము కాలపరిచ్ఛేదమూ లేని చైతన్యస్వరూపము బ్రహ్మ అని ప్రతిపాదిస్తున్నాయి. వీనికన్న వేరైన వాక్యాలు సగుణుడని చెపుతున్నవి. ఈ రెండు విధములైన వాక్యాలకు విరోధము కల్గినపుడు అనగా వేదపూర్వభాగము, ఉపనిషద్భాగములోవి కాకుండా ఉత్తరభాగానికే చెందినవైనందున, సగుణనిర్గుణ బ్రహ్మలను ప్రతిపాదిస్తున్నందున, సాకారనిరాకారములను చూపుతున్నందున వైరుధ్యము ఏర్పడుతున్నది. కనుక ముందు చెప్పినట్లు అపచ్ఛేద న్యాయము ప్రకారమే బాధ్యబాధక భావము ఏర్పడుతుంది. ఇంకా పూర్వాపరములగుటవలన, మరియు గుణములున్నపుడే లేవని చెప్పడము పొసగుతుంది కనుక పరములైన నిర్గుణవాక్యాలే సగుణ వాక్యాలను బాధిస్తాయి. అవే అన్ని విధాలుగా బలవంతములు కూడాను. కావున ప్రమాణవిరోధము ఏమీలేదు కొరత ఏమీరాబోదు.

**సత్యంజ్ఞానమనన్తంబ్రహ్మ** అనే వాక్యము నందు గుణాలు కనిపిస్తున్నాయి కదా! లేవని నిర్గుణుడు బ్రహ్మ అని అంటున్నారు ఎలా! ఒక వ్యక్తిని / వస్తువును గుర్తించాల్సి వచ్చినపుడు గుణాలో ధర్మాలోధర్మిని, గుణిని గుర్తించడానికి ఉపయోగపడుతాయి కదా! పైవాక్యము పరబ్రహ్మకు లక్షణవాక్యము కదా! అనవచ్చును కాని మీమాట సబబు కాదు. అవి గుణాలు కావు. ఆ వాక్యంలో మూడు పదాలు మూడు అంశాలను బ్రహ్మపదములోని విశేషాన్ని చెపుతున్నాయి అని మీ ఉద్దేశ్యము. ఔనా! అందులోని పదాలకు ఏకార్థత్వము ఉన్నది. అంటే అవి అన్నీ కలిపి ఒకే అంశాన్ని చెపుతున్నాయి. వాటికి సామానాదికరణ్యము ఉన్నది. అదే ఏకార్థత్వమును తెల్యచేస్తున్నవి. పదాలన్నీ వేరువేరు గుణాలను చూపిస్తున్నవి అని భావించినా మొత్తంగా తెలిపేది ఒకే అర్థాన్ని పదాలు వేర్వేరు అర్థాలను చెప్పినా ఏకార్థత్వమునకు భంగము లేదు అనేట్లయితే (అంటే) నీకు అభిధాశక్తిని గురించి ఏమీ తెల్యదు అమాయకుడివి. చెపుతాను విను. ఏకార్థత్వమంటే వాక్యంలో ఉండే పదాలన్నీ ఒకే అర్థాన్ని చెప్పడము. విశిష్టమైన పదార్థాన్ని వస్తువును గురించి చెప్పినపుడు అందులోని విశేషణముల భేదముచేత

పదాలకు పరస్పరం అర్థభేదం తప్పదు. అందువల్ల ఏకార్థత్వము సిద్ధించదు. కానీ అన్నీ కలిపి ఒక్క అంశాన్నే, విశేష్యాన్నే చెపుతాయి అన్నపుడు వాక్యంలో ఎన్ని పదాలున్నా వాటికి అన్నింటికీ ఒక అర్థాన్ని చెప్పుకుంటే ఆ పదాలన్నీ పరస్పరము పర్యాయపదాలు ఔతాయి అనవచ్చు. ఐతే ఏ పదానికి ఆపదము విశిష్టార్థాన్ని చెపుతూనే చివరకు ఒకే అర్థాన్ని చెపుతున్నా పర్యాయపదత్వము ఎలా కాదో చెపుతాను. శ్రద్ధగా విను. వాక్యము మొత్తానికి ఒక్క అర్థాన్ని చెప్పడము తాత్పర్యము ఐనప్పుడు ఆ ఏకార్థానికి గాను ఆయాపదాల అర్థాలకు విరోధులైనవాటికి ప్రత్యనీకము అని అన్ని పదాలకు అర్థము చెప్పుకుంటే ప్రతిపదము నిరర్థకము కాకుండా సార్థకము ఔతుంది. మొత్తంగా ఏకార్థతకుదురుతుంది. పర్యాయపదత్వము లేకుండా పోతుంది.

ఇదీ చెప్పదలచుకున్న అంశము – లక్షణముల ద్వారా గుర్తుపట్టదగిన పదార్థము బ్రహ్మ. అది తనకంటే వేరయిన వాటికన్నింటికీ విరోధి. దాని విరోధి స్వరూపము ఈ వాక్యములోని మూడు పదాలతో త్రోసివేయబడుతున్నది అది ఇలాగా 1) ముందుగా సత్యపదము. వికారములకు నిలయమై అసత్యము (లేనిది) అనబడే వస్తువుకు వేరయినది బ్రహ్మ. అనగా "**అసత్యాత్ వ్యావృత్తం బ్రహ్మ**" అని అర్థము. 2) జ్ఞానపదము – ఇతరుల ప్రకాశము చేత తెలియబడేది. జడము ఐన వస్తువున కంటే వేరయినది బ్రహ్మ. "**జడాత్ వ్యావృత్తం బ్రహ్మ**" అని అర్థము. 3. అనన్తపదము = దేశాన్ని, కాలాన్ని, వస్తువునుబట్టి పరిచ్ఛిన్నమైన దానికి వేరయినది. "**పరిచ్ఛిన్నాత్ వ్యావృత్తంబ్రహ్మ**" ఇలా చెప్పుకున్నపుడు ప్రతిపదమూ సార్థకము అయ్యి ఏకార్థత్వమూ చక్కగాకుదురుతుంది. కనుక సత్య, జ్ఞానా, నన్తపదాలు గుణవాచకాలు కావు. ఐతే ఈ వ్యావృత్తి అనేది ఒక ధర్మము కావచ్చు. అది భావరూపమో అభావరూపమో ఏదైనా సరే! అని అనకూడదు. వ్యావృత్తము అనేది తనకంటే వేరయిన అన్నింటికి విరోధియైన బ్రహ్మయే. ఎలాగంటే శుక్లము తెలుపు నలుపు వలె. తెల్లదనము అనేది నలుపు ఎరుపు మొదలైన వాటికి వ్యావృత్తము / వేరుగా నుండుట అనేది ఆయా పదార్థాల యొక్క స్వరూపమే కదా! కనుక ధర్మాన్తరము కాదు. అలాంటిది వేరే లేదు. నలుపు దనము లేకపోవడము తెల్లదనములోని స్వరూపము మాత్రమే. ఇలాగే ఒకే వస్తువు తనకంటే వేరుగా నున్న అన్ని వస్తువులకూ విరోధి ఆకారము అని తెల్పుతూ అర్థవత్‌తరమవుతూ ఉన్నది. ఏకార్థము అపర్యాయపదమున్నూ అవుతున్నవి సత్యం జ్ఞానం అనన్తము అను మూడు పదాలు. కావున ఒకే ఒక్కటియైన బ్రహ్మ తనకు తానుగా ప్రకాశిస్తూ అన్ని విశేషాలను దూరము చేస్తు ఉన్నట్టిది అని చెప్పినట్లయ్యింది. కాని గుణాలను చెప్పలేదు.

ఇలా సత్యం జ్ఞానమనన్తంబ్రహ్మ అను వాక్యానికి అర్థము చెప్పుకున్నప్పుడే **సదేవసోమ్యేదమగ్ర ఆసీత్ ఏకమేవాద్వితీయం** వంటి వాక్యాలతో ఏకార్థత పొసగుతుంది.

1. **యతోవాఇమానిభూతానిజాయంతే** – ఎవడినుండి ఐతే ఈ భూతము లన్నీ పుడుతున్నాయో 2) **సదేవసోమ్యే దమగ్రఆసీత్** 3) **ఆత్మావా ఇదమేకఏవాగ్ర ఆసీత్** – ఈ సృష్టికి పూర్వము ఆత్మ ఒక్కటి మాత్రమే ఉండినది. ఇటువంటి వాక్యాల ద్వారా జగత్తునకు కారణమని గుర్తింపబడుచున్న బ్రహ్మకు స్వరూపము ఇది అని చెప్పబడుతున్నది. సత్యం జ్ఞానమనన్తంబ్రహ్మ అను వాక్యము ద్వారా!

1. లక్షణము / విశేషణము వస్తువులోనే ఉంటూ తనద్వారా ఆ వస్తువును వ్యక్తిని గుర్తింపచేస్తుంది. తెలుపుతుంది. 2. ఉపలక్షణము – వస్తువులలోనో వ్యక్తిలోనో ఉండక, మరియు కొన్నిసార్లు ఉన్నా అక్కర దీరగానే దూరమవుతూ ఆ వ్యక్తిని గుర్తింపచేస్తుంది. 1) ఉదాహరణము – దేవదత్తుడు అందగాడు. 2) దేవదత్తుడు చెవిపోగులవాడు. దండీ. సత్యజ్ఞానమనన్తాదులు పరమాత్మలో ఉండేవి కావున లక్షణాలు / విశేషణాలు. ఇక ఎవడి వల్ల లోకాలు పుడుతున్నాయో వంటివి ఉపలక్షణాలు అని తెల్సుకోవాలి.

జగత్తుకు కారణమైన బ్రహ్మ పదార్థాన్ని వివరించే కారణవాక్యాలు ఏయే శాఖలకు చెందినా **సర్వశాఖా ప్రత్యయము** అనే న్యాయాన్ని బట్టి అవన్నీ కూడా సజాతీయ, విజాతీయ వ్యావృత్తము అద్వితీయము ఐనదే బ్రహ్మ అని తెలుపుతున్నాయి. ఉపలక్షణాల ద్వారా జగత్ కారణంగా తెల్సుకోదగిన అద్వితీయమైన బ్రహ్మయొక్క స్వరూపాన్ని పైవాక్యాలకు వైరుధ్యము రాకుండా వివరించవలసియుంటుంది. ఎందుకంటే **ఏకమే వాద్వితీయం** అని చెప్పే అద్వితీయత్వశ్రుతి – సగుణ బ్రహ్మ, నిర్గుణబ్రహ్మ అని చెప్పినట్లు – గుణములు కల రెండవ బ్రహ్మను, సద్వితీయతను ఎంతమాత్రము ఓర్వనే ఓర్వదు. అలా కాకుంటే **నిర్గుణం నిరంజనమ్** లాంటి వాక్యాలతో వైరుధ్యము వస్తుంది. అందుచేత **అశేష విశేష ప్రత్యనీక చిన్మాత్రం బ్రహ్మ** అనే లక్షణ వాక్యము అఖండైకరసమైన వస్తువునే ప్రతిపాదిస్తున్నది.

సత్యజ్ఞానాదిపదాలకు వాటిదైన అర్థాన్ని వదిలిపెట్టి స్వార్థ విరోధి వ్యావృత్తవస్తుస్వరూపాన్ని (స్వార్థము = పదానికి ఉన్నతనదైన అర్థము, విరోధి = దానికి వ్యతిరేకమైనదాన్ని, వ్యావృత్త వేరుచేయబడిన, వస్తు స్వరూపము = వస్తువు

యొక్క స్వరూపము/ఆకారమును) ప్రతిపాదించి నందువల్ల లక్షణం ఏర్పడుతున్నది అనవచ్చు కాని ఇది దోషము కాదు. అభిధావృత్తి కంటే తాత్పర్యవృత్తి బలీయమైనది. అసలు సామానాధికరణ్యమునకు ప్రధాన ఉద్దేశ్యము ఐక్యతను చెప్పడమే కాదా, దాన్ని అందరూ అంగీకరించినారు కూడా కాబట్టి ఏకార్థత కొరకు లక్షణార్థము చెప్పుకోవడము తప్పుకాదు. (అభిధా, లక్షణా, వ్యంజనా అని మూడు శక్తులు ఉన్నవి. మొదటిది తనకు నిర్దిష్టమైన అర్థాన్ని చెప్తుంది. రెండవది వాక్యార్థము కుదురనప్పుడు వాక్యములో ఉండే ఒకానొక శబ్దాన్ని ఆధారము చేసుకొని దానికి పొసగే అర్థాన్ని చెపుతుంది. వ్యంజనా అనేది ఏ పదము యొక్క అర్థమూ వ్యర్థము కాకుండా ఉన్న దాన్ని ఉన్నట్లే స్వీకరించుతూనే చమత్కారమైన మరొక అర్థాన్ని చెప్తుంది. ఇదే ధ్వని అనబడ్తుంది.)

ఇకపోతే లక్షణ అనేది వాక్యంలో ఉండే ఒకపదానికి చెప్పుకుంటారు. సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ అనే వాక్యంలో బ్రహ్మ అనే పదానికి తప్ప మిగతామూడు పదాలకూ లక్షణార్థము చెప్పుకోవడము ఎక్కడా లేదు అలా దృష్టాంతము కనపడలేదు అని అంటారేమో। ఐతే ఏమిటి? అందువల్ల జరిగే నష్టము ఏమీ లేదు. సాధారణంగా వాక్యము యొక్క తాత్పర్యమునకు/ప్రధానోద్దేశమునకు విరోధము లేనపుడు వాక్యములోని ఒక్కపదానికి కూడా లక్షణ చెప్పుకోవాల్సిన పరిస్థితి తల ఎత్తడం లేదు. ఒక అభిప్రాయముతో చెప్పబడిన పద సముదాయానికి ఇది దీని ఉద్దేశము అని నిశ్చయించినట్లయితే ఆ అర్థము పొసగని తీరుకు విరుగుడుగా సరియగు ఉద్దేశమును వెల్లడి చేయడం కొరకు వాక్యంలోని రెండు, మూడు, లేదా అన్ని పదాలకు లక్షణ చెప్పుకున్నప్పటికీ, ఒక్కపదానికి లక్షణా అర్థాన్ని చెప్పుకోవడం వలెనే తప్పుకాదు. అలాగా శాస్త్రకారులు అంగీకరిస్తున్నారు కూడా.

మీమాంసా శాస్త్రమందు కార్యవాక్యార్థవాదులైన ప్రాభాకరుడు మున్నగు వారిచేత లోకవాక్యములందు అన్ని పదాలకు లక్షణావృత్తియే ఆశ్రయింపబడుతున్నది. జ్యోతిష్టోమేన స్వర్గకా మోయజేత అను వాక్యము జ్యోతిష్టోమయాగాన్ని చేయుమని విధిస్తున్నది. యజేత అనుక్రియా పదములో ధాతువు ప్రత్యయము రెండు ఉన్నాయి. యజ్ అనేది ధాతువు ఐతే అది యాగాన్ని చెపుతున్నది. అందులోని విధి లిఙ్ ప్రత్యయము త అనేది క్రియను చేయుము అని చెపుతున్నది లేదా విధిస్తున్నది. ఇందులో లిఙ్ ఆదులు ముఖ్యవృత్తములు ఐనందున అనగా అపూర్వము అనేదానిని సృష్టించుకో

అని చెపుతున్నందున లిఙాదుల చేత లక్షణార్థాన్ని స్వీకరించి యాగము చేయుటఅనే క్రియాకార్యాన్ని ప్రతిపాదిస్తున్నారు.

ఇంకా కార్యాన్వితమైనాకనే పదాలు స్వార్థాన్ని తెలియచేస్తాయి అనే మరో వర్గం వారి ఉద్దేశ్యంలోనూ క్రియయే కాకుండా ఇతర పదాలు కూడా అపూర్వమనే కార్యమునందు అన్వయించుటయే ముఖ్యార్థము కావున క్రియాకార్యాన్విత ప్రతిపాదనము కూడా లాక్షణికమే ఔతున్నది. కనుక వాక్యము యొక్క ఉద్దేశ్యానికి వైరుధ్యము కలుగకుండా ఉండేందుకు వాక్యంలోని అన్ని పదాలకూ లక్షణంను ఆశ్రయించితే తప్పేమీకాదు. కావున ఇదే అర్థాన్ని ప్రతిపాదించే అనగా లక్షణను ఆశ్రయించే వేదాంత వాక్యములు ప్రమాణములు ఔతున్నాయి.

ప్రత్యక్షాదిప్రమాణాలతో వైరుధ్యమేర్పడినపుడు శాస్త్రానికే బలీయస్త్వమును చెప్పినారు అని అనవచ్చును. విరోధమున్నపుడే బలీయస్త్వము చెప్పుకోవాలి. ఇచ్చట ప్రత్యక్షానికి శాస్త్రానికి వైరుధ్యమేలేదు. శాస్త్రము దేన్ని చెప్పుతున్నదో ప్రత్యక్షము కూడా దాన్నే చెపుతున్నది. ఏమని? నిర్విశేషసన్మాత్రము బ్రహ్మ అని శాస్త్రము/వేదము చెపుతుంటే ప్రత్యక్షము కూడా విశేషములు ఏమిలేని సన్మాత్రబ్రహ్మమునే చూపిస్తున్నది. కనుక వైరుధ్యము లేదు. బలీయస్త్వము అనే ప్రస్తావన కూడా లేదు.

ఏమండీ! ఘటము ఉన్నది. పటము ఉన్నది అని పలు ఆకారాలతో ఉన్న వస్తువులను తెలియపరిచే ప్రత్యక్షము కేవలము వస్తువు **ఉన్నది** అనే సత్తామాత్రమును చెపుతున్నది అంటారు? ఇది ఎలాగు కుదురుతుంది? అనే ప్రశ్నమొలకెత్తితే సమాధానము వినండి. జ్ఞానము క్షణికము అనే విషయము అందరికీ తెల్సును. ప్రత్యక్ష ప్రమాణమైన కన్ను క్షణకాలములో వస్తువు '**ఉన్నది.**' అని మాత్రమే ఎరుకపరుస్తుంది. ఐనపుడు దేన్ని చూచినా ఉన్నది అను జ్ఞానము కలిగి ఆయా వస్తువులలోని భేదాలు తెలియకుండా పోయినపుడు అన్ని జ్ఞానాలు అంటే ఘటపటాదులవి – ఒకే జ్ఞానమవడం వల్ల విజ్ఞానమంతా ధారావాహికమవడంతో ఉన్నది. అనే ఒకే ఒక వ్యవహారము ఏర్పడుతుంది. వాటిలోని విశేషాలు తెలియకుండా పోతాయి కదా! అంటే నిజమే. ఆ ముచ్చటనే ఇచ్చట వివరిస్తున్నాము వినండి.

కుండ ఉన్నది. అన్నపుడు ముందుగా అస్తిత్వము, తర్వాత దాని భేదము తెలుస్తున్నది కాని అవి రెండు ఏకకాలములో ఉత్పన్నమైన జ్ఞానములు కావు. రెండింటి

ఉత్పత్తికి వేరువేరు క్షణాలు కారణాలుగా ఉన్నాయి. ప్రథమ క్షణములో ఉన్నది అనే జ్ఞానము కలిగిన తర్వాత దాన్నిబట్టి అనుమానించి ఇది కుండ అని ఊహించుతాడు. ఇది రెండవక్షణములోని జ్ఞానము. ఈ రెండింటిని కలిపి కుండ ఉన్నది అని అంటున్నాడు. కనుక రెండు వ్యవహారాలకు ప్రత్యక్షము ప్రమాణము కాదు. ప్రత్యక్ష జ్ఞానము ఒక్క క్షణము మాత్రమే ఉంటుంది. ఇక్కడ మొదటి క్షణములోని జ్ఞానమునకు కారణమైన ప్రత్యక్షము వస్తువు యొక్క స్వరూపాన్ని చెపుతున్నదా? లేక భేదాన్ని చెపుతున్నదా? అని విచారించాలి. భేదాన్ని గ్రహించాలంటే ముందుగా అక్కడ ఉండే వస్తువు యొక్క స్వరూపాన్ని తెల్సుకోవాలి. తరువాత దానికి భిన్నమైన వస్తువునూ స్మరించుకోవాలి. దాన్ని స్మరించుకుంటేనే ఈ వస్తువు యొక్క స్వరూపము ఇది అని తేటపడుతుంది. అప్పుడుగాని రెండింటి భేదము తెలుస్తుంది. కాబట్టి స్వరూపాన్ని మాత్రమే క్షణకాలము నిలిచి ఉండే జ్ఞానము సత్తను తెలుపుతుంది. కాని భేదమును తెలుపదు. రెండవక్షణము మాత్రమే భేదమును తెల్పుతుంది. కనుక ప్రత్యక్షము వస్తువు యొక్క సత్తను చూపుతుంది. భేదమును చెప్పదు అని తేలిపోయింది. కనుక కుండ ఉన్నది అనే వ్యవహారములో భేదము. ఇది పటము కాదు కుండయే అనేది – భ్రాంతివల్ల ఏర్పడిందేకాని వేరు కాదు. ఇంతేకాదు భేదమనే ఒక పదార్థము ఉన్నది అని న్యాయవేత్తలు నిరూపించజాలరు. ఎందుకనగా! భేదమనేది ఒక వస్తువు యొక్క స్వరూపము కాదు. ఏ వస్తువుకు సంబంధించిన స్వరూపము దానికి తగినట్లు విడివిడిగా ఉంటుంది. అది తన స్వరూపాన్ని తెలుపుతుంది తప్ప మరోదానితో భేదాన్ని తెలుపదు. అయితే భేదము కూడా ఒక వస్తు స్వరూపమని భావిస్తే మిగతా వస్తువుల స్వరూపము వలె అదొక స్వరూపము అయ్యి ప్రతిదానితోను దానికి కూడా భేదమును చెప్పవలసివస్తుంది. అపుడు అది వస్తువు ఔతుంది కాని భేదము కాబోదు.

ప్రథమ క్షణములో ఒక వస్తువు యొక్క స్వరూపాన్ని మాత్రమే గ్రహించినా ఇది దానికంటే భిన్నమయినది అనే వ్యవహరించదల్చుకున్నపుడు ఎదురుగా ఉన్న వస్తువునకు ప్రతియోగి – వ్యతిరేకమైన వస్తువును తలచుకోక తప్పదు. కనుక ఎదుటనున్న వస్తువును తెల్సుకుంటున్నకాలములోనే ప్రతియోగి వస్తువును స్మరించడంలేదు కాబట్టి అదే కాలములోనే ప్రతియోగి వస్తువును స్మరించడం లేదు కాబట్టి అదే కాలములో భేదవ్యవహారము లేదు కదా! అని అనకూడదు. ఐతే అపుడు వస్తు స్వరూపమే భేదాన్ని తెలుపుతుంది అనాలి. ఐనపుడు ప్రతియోగి వస్తువు యొక్క

అపేక్ష ఉండనే ఉండదు. కనుక స్వరూపము, దాని భేదము వేరు వేరు గాక రెండూ ఒక్కటే అవుతాయి. స్వరూపమును వ్యవహరించుకున్నపుడు ప్రతియోగితో సంబంధము లేకుండా పోయినట్లు / అవసరము లేనందున భేదాన్ని గురించి ముచ్చటించుకున్నపుడు స్వరూపము ప్రసక్తి లేకుండా పోతుంది. అపుడు హస్తము, కరము అనే రెండు పదాలు పరస్పరము పర్యాయపదాలు ఐనట్లు ఘటము, భేదము, అనేవి పర్యాయపదములు కావలసి వస్తుంది. కావున స్వరూపమే భేదము అనడానికి వీల్లేదు. పోనీ ధర్మము అందామా అంటే అదీ కుదరదు. భేదము అనేది ఒక ధర్మము ఐతే దానికి స్వరూపము కంటే వేరయినదిగా ఒక భేదమును ఆశ్రయించాలి. లేకపోతే స్వరూపమే ఔతుంది. భేదమే ఒక స్వరూపము అయ్యేట్లయితే దానికి ఒక ధర్మము, దానికీ ఒక ధర్మము ఇలా ఒక ముగింపు లేకుండా అనవస్థ ఏర్పడుతుంది అది ఒక దోషము. కాబట్టి భేదము ధర్మముకాదు. ఇంకా జాత్యాదివిశిష్ట వస్తువుగా చెప్పుకొంటే భేదాన్ని గ్రహించవచ్చును అనుకొనేట్లయితే, భేదమున్నపుడే జాత్యాదివిశిష్టవస్తువుగా గ్రహించడము చెల్లుతుంది. కాని జాతి తెలిస్తే భేదము, భేదము తెలిస్తే జాతి పరస్పరాశ్రయాలు ఔతాయి. అపుడు అన్యోన్యాశ్రయణమనే దోషము వస్తుంది. పెళ్ళయితే పిచ్చి కుదురుతుంది. పిచ్చి కుదిరితే పెళ్ళవుతుంది అన్నట్లుంటుంది అన్యోన్యాశ్రయణమనే దోషము. కాబట్టి భేదాన్ని నిరూపించలేము. అందువలన ప్రత్యక్ష ప్రమాణము "**ఉన్నది**" అనే సత్తును మాత్రమే చెపుతుంది అని నిశ్చయమవుతున్నది. (సత్త అనగా వస్తువు యొక్క ఉనికి. అనుభూతి అనగా ఆ ఉన్న వస్తు ఫలానా అని తెల్సుకోవడం)

మరియు ఘటము ఉన్నది పటము ఉన్నది. నాకు ఘటము తెలియవస్తున్నది. నేను పటమును తెల్సుకుంటున్నాను అనే వాక్యాలలో వస్తువులన్నీ కూడా సత్తా, అనుభూతి విషయములైనవి గానే కనిపిస్తున్నవి. ఈ అన్ని ప్రతిపత్తులు / గుర్తింపులలోనూ సత్త మాత్రమే అనువర్తిస్తున్నది. అనువర్తమానము అనగా ఒక దశ నుండి మరొక దశలోకి, దాన్నించి మరొకదశలోకీ కొనసాగుతూ పోవుట. పదార్థాలు లేకుండా పోతున్నాయి. కనుక "**అనువర్తమానమైన సత్తయే, పరమార్థము**" (సార్వకాలిక సత్యము) విశేషాలు – ఘటపటాదులు – తొలగిపోతున్నాయి. అలా "**వ్యావర్తమానములు ఔతున్నాయి కనుక అవి అపరమార్థాలు**" ఉదా॥ రజ్జుసర్పాదుల వలె రజ్జువు – త్రాడు అధిష్ఠానము. దానిపైన పాము అనే భావన అట్లాగే అధిష్ఠానము ఐనత్రాడు ఒకనికి నేలమీది నెర్రెలాగున మరొకనికి వంకర కర్రలాగా, మరొకడికి

నీటి చాలుగానూ కనిపిస్తుంది. వాస్తవానికి అక్కడ ఉన్న వస్తువు తాడు – అధిష్ఠానము ఒక్కటే. ఆ ఒక్కటే పలువురికి పలువస్తువులుగా కనిపిస్తున్నవి. పాము, నీటి చాలు, నెఱ్ఱె, వంకరకర్ర ఇవన్నీ తొలగిపోతున్నాయి. కానీ తాడు మాత్రమ స్థిరంగా ఉంటూ ఉన్నది. కావున తొలగిపోయేవి। వ్యావృత్తములయ్యే పదార్థాలు అపరమార్థాలు. అలాకాక అన్ని భావనలకు ఆధారము అయ్యి అధిష్టానముగా నిలుస్తున్న తాడు / రజ్జువు అన్నింటిలోనూ అనువర్తమానము ఔతున్నందున అది పరమార్థము. ఇట్లే బ్రహ్మపరమార్థము. జగత్తు అపరమార్థము అని గ్రహించాలి.

రజ్జు సర్పాదులయందు ఇది త్రాడు పాముకాదు అను జ్ఞానంవల్ల రజ్జ్వాది అధిష్టానములు యథార్థములు అని తెల్సింది కాబట్టి యథార్థ జ్ఞానము చేత సర్పాదులు బాధితములౌతవి అందువలన అపారమార్థికములు. కాని వ్యావర్తమానములు ఐనందువల్లకాదు. రజ్జ్వాదులు అనువర్తమానములు ఐనందువల్ల పరమార్థములు కావు. అవి రజ్జ్వాదులు కావు అని ఏ ప్రమాణము చేత బాధింపబడలేదు కాబట్టి అని గ్రహించాలి. అలాగే ఇక్కడకూడా ఘటోఽ స్తి పటోఽ స్తి –అను స్థలాల్లో ఘటపటాదులు బాధితములు కాలేదు. కావున అవి పరమార్థములే ఔతవి. వాటిని అపరమార్థములు అనేది ఎలాగా? అంటే చెప్తాను విను. ఘటము పటము లందు వ్యావృత్తి (తొలగిపోవుట) ఐతే ఉన్నది. అవి లేవు కాబట్టి. అయితే ఆవ్యావృత్తి ఎటువంటిది? అని ఆలోచించాలి. ఘటము ఉన్నది అన్నపుడు పటము వంటివి ఏవైనా ఉన్నాయా? లేవు. అపుడు ఘటము ఉన్నది అనడము వలన పటము మొదలైనవి బాధింపబడుతున్నవి. కావున బాధఫలమైన విషయము లేకపోవడమనేదే వ్యావృత్తి. అది తొలగిపోయే వాటికి అపారమార్థ్యమును సాధిస్తున్నది. రజ్జు సర్పాదులలో రజ్జువు అన్ని చోట్లా ఉంటున్నది. అది దేని చేతా బాధితం కావడం లేదు. దాని లాగానే అన్ని స్థలాల్లో ఉన్నది అనబడే సత్ మాత్రము అనువర్తిస్తూనే ఉన్నది. అందుకని సన్మాత్రమునకంటే వేరయినదంతా అపరమార్థము. ఈ విషయములో కొన్ని వ్యాప్తులు / అనుమాన ప్రమాణాలు ఇలా ఉన్నాయి. 1) సత్తు పరమార్థము. అను వర్తమానము ఔతున్నందువలన. రజ్జు సర్పాదులలో రజ్జ్వాదుల వలె. 2) ఘటాదులు అపరమార్థములు. వ్యావర్తమానములు ఔతున్నాయి కాబట్టి. రజ్జ్వాదులైన అధిష్ఠానములయందున్న సర్పాదులవలె అని. యథార్థము ఇలా ఉన్నది కాబట్టే అనువర్తమానమైన అనుభూతియే । జ్ఞానమే పరమార్థము. అదియే సత్తు.

సత్తు అనుభూతికి విషయమవుతున్నది కనుక సత్ వేరు. అనుభూతి వేరు కదా! అని అనవచ్చును. అలా అనుకోవడం పొరపాటు. భేదము అనేది ప్రత్యక్ష ప్రమాణము చేత తెలియబడదు. అనగా కనుపించదు. కనుక దాన్ని ఇట్లా అని నిరూపించలేము అని ఇంతకుముందే చెప్పినాము. కనుక ఆ విషయము ఇంతకుముందే త్రోసివేయడం జరిగింది అందువల్లనే సత్తునకు అనుభూతి విషయము కావడమనేది కూడా ఏ ప్రమాణమూ సాధించలేదు. కాబట్టి సత్పదార్థము అనుభూతియే. ఆ అనుభూతి **"ఇది అనుభూతి"** అని తెల్యచేయబడితే ఘటపటముల వలె అనుభూతి / జ్ఞానము కాకుండా పోతుంది. జడపదార్థము కావలసి వస్తుంది. ఇంకా అనుభూతికి ఇది అని తెలపడానికి అవసరమైన అనుభవాన్ని కల్పించడము శక్యం కాదు. అనుభూతి తాను తన ఉనికి/ సత్తచేతనే ప్రకాశము ఔతుంది. అనుభవములోకి వస్తుంది. అనుభూతి అనేది తాను ఉన్నపుడు ఘటపటాదులవలె ఎవరికీ తెలియకుండా పడి ఉండదు. అనుభూతి స్వాయత్తప్రకాశము. అది తనను తాను చూపుకుంటూనే ఇతరమైన జడపదార్థాలను వెలుగులోకి తెస్తుంది. కావున అనుభూతి జ్ఞానము స్వతస్సిద్ధము. స్వప్రకాశము కలది. పరాయత్తప్రకాశము కాదు. పైపెచ్చు అనుభూతి దీపము వలె ఇతర జడపదార్థాలను ఇది ఫలానా అని చూపిస్తుంది.

ఒకవేళ నీవు ఇట్లాగా అనుకుంటున్నావా? అనుభూతి ఉత్పన్నమే ఐతే ఎదుటనున్న విషయము మాత్రమే కనిపిస్తుంది. నా చేత ఘటము అనుభవింపబడుతున్నది అని. లోకంలో ఎవడు కూడా ఇది కుండ అని తెలుసుకుంటూనే, అదే సమయంలో తన దృష్టికి అందని, విషయము కాని ఇది అని చెప్పలేని అనుభూతిని కూడా అనుభవించడు. అందువలన ఘటాదులకు ప్రకాశము ఏర్పడుతున్నపుడు కన్ను మున్నగు కరణమలు / సాధనములతో సన్నికర్ష / సంబంధము వలె అనుభూతికి అది ఉండడమే హేతువు ఔతుంది. అంటే కంటితో వస్తువునకు సంబంధము ఉన్నపుడే అది ఫలానా వస్తువు అని తెలుస్తుంది. కంటితో వస్తువుకు సంబంధము ఏమీలేనపుడు అది ఏమిటో ఎదురుగా ఉన్నప్పటికీ తెలియనే తెలియదు. అలా వస్తువుకు కంటితో సంబంధము ఏర్పడినాక ఆ వస్తువుతో అధికమైన ప్రకాశము కారణంగా ఇది కుండ అనే జ్ఞానము కలుగుతున్నది అని అనుమానిస్తున్నాము. ఇది ఇలాగే అయితే జడము కాని అనుభూతికి ఒక వస్తువునకు వలె జడత్వము కలుగుతుంది. అంటావా! అదలాగా ఉంచు అసలు అజడత్వము అంటే ఏమిటో చెప్పు? (జడము పరాయత్త ప్రకాశము.

అంటే ఇతరుల ద్వారా దాని ఉనికి వెల్లడింపబడుతుంది. ఉదా। చీకటిలో ఉన్న వస్తువు దీపమువల్ల ఇది ఫలానా వస్తువు అని గుర్తింపబడుతుంది. అంటే దీపపు కాంతి దానిపైన పడి ఆ వస్తువు తెలుస్తున్నది. కాని తానే దీపము లాగా మరొకరి సహాయము లేకుండా లోకానికి వెల్లడి కాదు. సారము ఏమంటే స్వయముగా ప్రకాశించలేనిది జడపదార్థము. దానికంటే భిన్నమైనది అజడము. స్వయంప్రకాశము దీపము వంటిది. బ్రహ్మ స్వప్రకాశకము. పరాయత్తప్రకాశము జడపదార్థము.) తన సత్త గురించి తనదైన ప్రకాశమును కోలుపోక ఉండడము / అవ్యభిచారము (వ్యభిచారము అనగా లక్ష్యములో ఉండవలసిన లక్షణము / విశేషణము మరొక వస్తువులోనూ ఉండడము. అవ్యభిచారము అనగా ఎప్పుడూ ఎక్కడాకూడా లక్ష్యమునందే స్థిరంగా ఉండడము) అని అనుకునేట్లయితే ఆ స్వభావము సుఖాదుల యందున్నూ ఉంటున్నది మానవుడికి సుఖాదులు కలుగుతున్నపుడు వాటిని గురించి తెలియకుండా ఉండడం లేదు. తెలుస్తూనే ఉన్నది. అలాగే అనుభూతి తాను ఉంటూ తనకు తాను తెలియడము లేదు. ఏదో ఒక వస్తువును తాకుతూవున్న చూపుడు వ్రేలు యొక్క స్పర్శానుభవమును వ్యక్తికి తెలుపుతున్నది కాని తనకు తాను తెలుసుకోవడము లేదు. అదెలాగో అనుభూతి తనకు తాను అనుభూతిని అని గుర్తించడం లేదు అని.

ఐతే ఇదంతా అనుభవమంటే ఏమిటో తెలియని వాని ఊహాపోహలు మాత్రమే. అంతేకాదు అనుభూతికి వ్యతిరేకమైన విషయధర్మమైన ప్రకాశము ఒక వస్తువునకు రూపము వలె విడిగా లభించదు. అనగా దీపము ప్రకాశము అనే ధర్మము ఎట్లా విడిగా లేవో అనుభూతి దాని విషయమున్నూ వేరుగా లేవు. రెండూ ఒక్కటే. వాదిప్రతివాదులందరూ ఒప్పిన అనుభూతి అనే దానివల్లనే వ్యవహారము నడుస్తూ ఉన్నపుడు మళ్ళీ దానికి ప్రకాశము అనే ఒక ధర్మాన్ని కల్పించడము దేనికి? పైగా పొసగదు కూడాను. అందువలన అనుభూతి అనుమాన ప్రమాణము చేత తెలియబడదు. అట్లాగే మరొక జ్ఞానము చేత కూడా ఉత్పన్నము కాదు. అంతేకాక తన ఉనికిని చాటుకుంటూ ఇతరులను ప్రకాశింప చేసే అనుభూతి తనంతతాను గానే పుడుతుంది. అందుచేత జ్ఞానము స్వతఃసిద్ధము.

ఇందుకు అనుమాన ప్రమాణములు ఇట్లున్నవి.

1. అనుభూతి అనన్యాధీనమైన స్వధర్మము కలది. తన సంబంధము ద్వారా ధర్మాంతరము నందు తద్ధర్మమునకు హేతువు అవుతున్నందువలన అని.

2. అనుభూతి అనన్యాధీనమైన స్వవ్యవహారము కలది. తన సంబంధము వలన అర్థాన్తరము నందు దాని వ్యవహారమునకు కారణము అవుతున్నందువలన.

ఇచ్చట రూపాదులు చక్షుర్విషయమగుటను ఉదాహరణముగా చూపినారు. రూపాదిధర్మాలు తాము తమయొక్క సంబంధము ద్వారా కండ్లకు కనబడేట్లుగా చేస్తూ ఉంటవి. కానీ చక్షువులకు విషయమై తమ యందు రూపాది సంబంధమును కన్నుల ద్వారా పొందుటలేవు. అందువలన అనుభూతి తాను ప్రకాశిస్తున్నది అనడములో, స్వయంగా ప్రకాశించుటలోనూ తనకు తానే హేతువు అగుచున్నది.

ఇలాంటి స్వయంప్రకాశమైన అనుభూతి నశించేది కాదు. నిత్యమైనది. ఎందుకంటే దీనికి ప్రాగభావము లేదు. ప్రధ్వంసాభావము, అత్యన్తాభావమున్నూ లేవు. ఇందుకు కారణము అది స్వతస్సిద్ధమైనందుననే. సహజసిద్ధమైన అనుభూతికి ప్రాగభావము ఉన్నదని తనవల్లనే గాని వేరేదానివల్లనేగాని తెల్సుకోవడానికి వీలుగాదు. (ప్రాగభావము అనగా వస్తువు పుట్టుకకు ముందు కాలములో లేకపోవడము. ప్రధ్వంసాభావము అనగా అది నశించిన తర్వాతలేకపోవడము. అత్యంతా భావము ఎప్పుడూ లేకపోవడము) అనుభూతి అనేది తాను ఉంటూ తాను ఇంతకుముందు లేనని తన ప్రాగభావాన్ని తెలుపజాలదు. అది నిల్చియున్నది కాబట్టి తనకు విరోధియైన అభావాన్ని దానితో తనకు ఉన్న వైరుధ్యము వల్ల తెలుపదు. ఇట్లే తాను లేకుండా కూడా చెప్పలేదు. అనుభూతి తన అభావానికి తాను ప్రమాణము ఎలా ఔతుంది. తాను లేకుండా ఉంటూ నేను లేను అని తానే చెప్పడం ఎంత మాత్రము కుదరదు. అట్లే వేరొక్క వ్యక్తితో / వస్తువుతోనైనా తన ప్రాగభావాన్ని తెలియజేయలేదు. ఎందుకంటే దేనికీ అందేదికాదు కనుక. అనుభూతి యొక్క ప్రాగభావాన్ని చెప్పాలంటే ఆ ప్రమాణము **"ఇది అనుభూతి"** అని దాన్ని చూపుతూ అది ఇంతకు ముందు లేదని చెప్పాలి. కాని అనుభూతి స్వతస్సిద్ధమైంది కనుక ఇది అనివేలెత్తి చూపడానికి వీలుకాదు. అట్లాగే దాని ప్రాగభావము దానికంటే వేరయిన ఒక ప్రమాణముతో గుర్తించలేము. ఇందువల్ల అనుభూతికి ప్రాగభావము లేనందున దాని పుట్టుకను నిరూపించలేకపోతున్నందువల్ల ఉత్పత్తికి సంబంధించిన భావవికారాలున్నూ దానికి లేనే లేవు. అవి ఆరు. ఉన్నది, పుడుతున్నది, పెరుగుతున్నది, మార్పులు పొందుతున్నది, క్షయిస్తున్నది, నశిస్తున్నది, జ్ఞానానికి ఈ ఆరు లేవు. ఉత్పత్తి లేదు గనుక. అలాగే పుట్టుకలేని ఈ అనుభూతి తనలో నానాత్వమును – అనేక రకాలుగా ఉండడమును – కూడా ఒప్పుకోదు. ఇందుకు

విరుద్ధమైన ప్రమాణము ఏదీ లేదు కాబట్టి. ఉత్పన్నమైన వస్తువుల్లోనే నానాత్వము కనిపిస్తున్నది. కాని అనుత్పన్నమైన వస్తువు పుట్టుకలేని వస్తువు పలురకాలుగా, అనేక సంఖ్యలోనూ ఉండడము ఎక్కడా కానరావడం లేదు. జ్ఞానములో భేదాలు ఉన్నవి అనుకుంటే అవి అనుభావ్యములు అనుభవింపబడేవి/తెల్సుకొనబడేవి అవుతవి. రూపాదులకు వలె అనుభూతికి ధర్మత్వము లేదు అందువల్ల అనుభూతికి అనుభవమే స్వరూపము ఐనందున దానికంటే వేరుగా అనుభావ్యమైన ధర్మము లేదు. అందుచేత అన్నిరకాలైన భేదాలకు దూరమైనది సంవిత్తు. కాబట్టే దీనికి స్వరూపాని కంటే వేరైన జ్ఞాతా, జ్ఞానానికి ఆశ్రయమైనవాడు – అనేవాడు లేడు. స్వప్రకాశరూపమైన అనుభూతి, సంవిత్తే ఆత్మ. ఇది జడము కానిది అనగా పరాయత్తప్రకాశము కలది కాదు. జడత్వము అనునది ఆత్మకంటే వేరైనది. అనాత్మత్వము అనేది జడపదార్థము యొక్క ధర్మము. అది సంవిత్తునందు వ్యావర్తమానము ఔతున్నది. అలా అవుతూ సంవిత్తునకు ఆ అనాత్మత్వమును దూరము చేస్తున్నది.

లోకంలో నేను తెల్సుకుంటున్నాను తెల్సుకున్నాను. నాకు తెలియును అనే ప్రయోగాల ద్వారా జ్ఞానమునకు ఆశ్రయమైన జ్ఞాతృత్వము అనేది కనిపిస్తున్నది కదా అనవచ్చును. కాని అది భ్రాన్తివల్ల ఏర్పడ్డది. ముత్యపు చిప్ప యొక్క చిన్నముక్క వెండిముక్కలాగా కనపడుతుంది. అంతమాత్రాన అది రజితము కాదు కదా! అనుభూతికి తనయందు తనకు కర్తృత్వము ఎట్లా కుదురుతుంది? కర్తకర్మలు వేరువేరుగా ఉండాలి కదా! అందువల్ల నేను మనుష్యుడను అని మనుష్యత్వానికి పూర్తి విరుద్ధమైన మనుష్యత్వాదులతో కూడిన మాంసపు ముద్ద యందు నేను అని అభిమానించినట్లుగానే జ్ఞాతృత్వము కూడా ఆరోపించబడిందే. కాని – యథార్థము కాదు. జ్ఞాతృత్వమంటే జ్ఞానక్రియను చేయడము తెల్సుకోవడము. ఈ కర్తృత్వము వికారములను పొందేది, జడమైనది వికారి ద్రవ్యమైన అహంకారమనే గ్రంథి/ముడి, యందుండేది. ఎలాంటి వికారము లేని సాక్షియైన జ్ఞానస్వరూపమే ఐన ఆత్మయందు కర్తృత్వము ఎలా సంభవిస్తుంది? రూపాదులు జ్ఞానము చేత తెల్సుకోబడుతున్నవి. స్వయం ప్రకాశములు కావు. వాటికి కర్తృత్వాదులు లేనట్లు కర్తృత్వాదులు ఆత్మకు ధర్మములు కావు. సుషుప్తి మూర్ఛాది దశల యందు అన్తఃకరణము లేకపోయినప్పటికీ ఆత్మానుభవము ఉంటున్నది. కావున ఆత్మ అహంప్రత్యయము (మనస్సు) నకు గోచరము కాదు. కర్తృత్వము అహంప్రత్యయగోచరత్వమున్నూ ఆత్మకు ధర్మములుగా

అంగీకరిస్తే శరీరానికి వలెనే జడత్వము, పరస్మై ప్రకాశమానత్వము, ఆత్మకాకుండా పోవడము – అనాత్మత్వము అనేవి వచ్చిపడుతవి. నేను అనిభావింపబడుతూ, అన్నిపనులూ చేసే కర్తగా ప్రసిద్ధమైన దేహముకంటే ఆ శరీరముచే చేయబడిన కర్మలకు ఫలమైన స్వర్గాన్ని తదితరాలను అనుభవించే ఆత్మ వేరే అనే విషయము ప్రామాణికులైన వారందరికీ తెల్సినదే. అట్లే జ్ఞాతగా భావింపబడుతున్న అన్తఃకరణమునకంటే విలక్షణుడుగా సాక్షియైన ప్రత్యగాత్మను వేరుగా గుర్తించాలి. ఇలాగా జడమైన అహంకారము వికారము లేని అనుభవ స్వరూపమైన ఆత్మకు ఆశ్రయమౌతూ తనను ఆశ్రయించినందువల్ల ఆత్మను జడమైన అహంకారము వెల్లడిస్తున్నది. సాధారణంగా లోకములో అభివ్యంజకములు తమలో ఉన్నవాటిని అభివ్యంజనము ప్రకాశింపచేయుట / వెల్లడించుట అనేది సహజ స్వభావము. అద్దము, నీరు, ముఖమును, చంద్రబిబంబమును, గోత్వాదులను తమలో ప్రతిఫలించుట ద్వారా వ్యక్తీకరిస్తున్నవి. అద్దము, నీరు వంటివి జడపదార్థాలు. ఐనా అవి ముఖము వంటి వాటిని చూపుతున్నవి. అట్లాగే జడమైన అహం ప్రత్యయము / మనస్సు ఆత్మను ప్రకాశింపచేస్తున్నది. ఆ కారణంగానే నేను తెల్సుకుంటున్నాను అనే భ్రమ ఏర్పడుతున్నది. స్వయం ప్రకాశకమైన అనుభూతి / ఆత్మ, తనచేత ప్రకాశింపచేయబడే జడమైన అహంకారము చేత తాను ఎలా అభివ్యంగ్యత్వమును పొందుతుంది అని అనబోకు. సూర్యకిరణాల చేత తెలియచేయబడే మానవహస్తము ఆ సూర్యకిరణాలనే తేటగా కనుపించేట్లు చేస్తున్నది ఉదయపువేళ కిటికీలోనుంచి ఇంటిలోకి ప్రవేశించిన సూర్యకిరణాలను వాటిచేత ఇది చెయ్యి అని గుర్తింపచేయబడే మానవహస్తము మరింత ప్రకాశవంతముగా దర్శింపచేస్తున్నది కదా। కావున నాకు తెల్సును (జానామి) అని అనుకొనే జ్ఞాతయైన అహమర్థము – మనస్సు, కేవల జ్ఞానస్వరూపుడైన ఆత్మకు పారమార్థిక మైన ధర్మము కాదు. కనుకనే సుషుప్తావస్థ, ముక్తావస్థలలో మనస్సు పాలుపంచుకోదు. ఆ దశలలో మనస్సు లేకుండానే తనకు సహజమైన అనుభవ మాత్రంగానే ఆత్మప్రకాశిస్తూ ఉంటుంది. కాబట్టే బాగా నిద్రపోయి లేచినవాడు ఇంతసేపు నేను ఏమి చేసినానో నాకేమీ తెలియదు. నన్ను నేను ఎరుగకున్నాను అని గడిచిన కాలాన్ని పరామర్శిస్తాడు. అందువలన అన్ని భేదములు, అన్ని వికల్పములు, విశేషములు లేని జ్ఞానమే, జ్ఞానముగా జ్ఞానానుభవముతో ఎలాంటి మార్పులు లేకనే ఉన్న, నాశములేని సంవిత్తే భ్రమకారణంగా జ్ఞాత, జ్ఞేయము జ్ఞానము అనబడే పలురకాలైన భేదములతో సుడులు తిరుగుతూ ఉన్నది. కనుక భ్రమకు ప్రధానహేతువు

ఐన అవిద్యను అణగద్రొక్కడానికి నిత్యము, శుద్ధము, బుద్ధము, ముక్తస్వభావము గలదైన బ్రహ్మ అనబడే ఆత్మ ఒక్కటే అనే తెలివిని పొందడానికి వేదాన్తములు అన్నీ ప్రారంభింపబడుతున్నవి. **అని మహాపూర్వపక్షము.**

★ ★ ★

## మహాసిద్ధాన్తము

ఇంతవరకూ చెప్పిన విషయమంతా ఉపనిషత్తులలో ప్రతిపాదింపబడిన పురుషోత్తముడిని వరించడానికి హేతువు ఐన గుణవిశేషమగు భక్తి లేని వారు ప్రస్తావించినట్టిది. వారు గొప్ప తెలివితేటలు గలవారే ఐనా వారి బుద్ధి అనాదిగా వస్తున్న పాప వాసనల చేత దూషితమైనది. వారు శాస్త్రపాండిత్యము కలవారే ఐనా పదములు, వాక్యాలు వాటియొక్క స్వరూపము, దాని అర్థములయొక్క అసలు ఉద్దేశ్యము భావము ఏమిన్నీ చక్కగా అవగాహన చేసుకున్నవారు కాదు. ప్రత్యక్షము మొదలైన అన్ని ప్రమాణాల పోకడ, వాటిని సమన్వయపరచుకొనే ఇతికర్తవ్యతలు తెలియవు, సందర్భానుసారము ఉపయోగించుకొనే న్యాయమార్గాలను సరిగా అర్థము చేసుకోలేదు. ఇలాంటి వీరియొక్క ప్రతిపాదన అంతా ఔనా? కాదా? ఇలాగా అలాగనా? అనివికల్పిస్తే తట్టుకోలేని పలురకాల వాదనలు కుతర్కములు అనే పిప్పితో కూడి నిస్సారముగా నున్నట్టివి. కావున న్యాయములు బలపరచిన ప్రత్యక్షాది అన్ని ప్రమాణాల పోకడలను బాగా తెల్సినవారు, వాస్తవములైన యథార్థములైన అంశాలను ఎరిగిన పెద్దలు పరులవాక్యాలను మన్నించకుందురుగాక!

అది ఎలాగంటే – నిర్విశేషచిన్మాత్రమే బ్రహ్మస్వరూపము అని చెప్పేవారు నిర్విశేషమైన వస్తువు ఒక్కటి ఉన్నది అనడానికి తగిన ప్రమాణమేదో దాన్ని చూపగలరా? చెప్పగలరా? ప్రత్యక్షము మొదలుకొని ప్రమాణాలన్నీ ఎన్ని ఉన్నా అవి అన్నీ విశేషములతో కూడిన వస్తువునే ప్రతిపాదిస్తున్నాయి. మా అనుభవములో ఉన్న ముచ్చట అని చెప్పిన అంశము కూడా తామే దానికి సాక్షిగా ఉండడము అనే అంశముతో సవిశేషము అవుతూ నిర్విశేషము కాకపోవడంతో ప్రక్కకు త్రోసివేయబడ్తున్నది. దీన్ని నేను చూచినాను అని ఎవరైనా చెప్పినా అందులోని ఇది అనే వస్తువు ఏదో ఒక విశేషణంతో విశిష్టము అయ్యే ఉంటుంది. ఇది లోకంలోని ఏ ఒక్కరిదో కాక అందరి అనుభవములో ఉన్న విషయమే. విశేషాంశముతో కూడిన అనుభవాన్నే పొందుతూ

కూడా ఏదో ఒక బలహీనమైన, నిజంగా యుక్తిగాని యుక్త్యాభాసముతో ఇది నిర్విశేషము అని గంభీరంగా పల్కుతున్నారు కాని వారు ఆ వస్తువు యొక్క సత్తా మాత్రమునే గాక దానికి మాత్రమే సంబంధించిన, అసాధారణమైన స్వభావవిశేషాలతో ఇది ఫలానా వస్తువు అని నిష్కర్ష చేయవలసియుంటుంది. అలా నిష్కర్ష చేయడానికి సత్తకు మించిన ఇతరులెవ్వరిలో లేకుండా తనకు మాత్రమే సంబంధించిన స్వభావవిశేషాలు హేతువులు చూపినపుడు అది సవిశేషమే ఔతుంది కాని నిర్విశేషము ఎపుడూ కానే కాబోదు. నిర్విశేషచిన్మాత్రైకరసము, నిత్యము ఐన సంవిత్తే బ్రహ్మ. అది నిత్యము శుద్ధము బుద్ధము ముక్తస్వభావము కలది. స్వయంప్రకాశము. ఏకము, అద్వితీయము అని చెప్పినపుడే ఎన్నో విశేషాలు తేటగా కళ్ళకు కట్టినట్లే, ప్రత్యక్షము ఔతున్నాయి. సాక్షాత్తుగా గొంతెత్తి చెప్పబడుతున్నాయి కూడా. అందువలన ఏవో కొన్ని విశేషాలతో కూడివున్న వస్తువులో అవిగాక వేరే మరికొన్ని విశేషాలు నిరసింపబడుతున్నాయే తప్ప ఈ ప్రపంచంలో ఎక్కడా నిర్విశేషమైన వస్తువు లభించనే లభించదు.

జ్ఞానానికి – బుద్ధికి ధీత్వమనేది స్వయంప్రకాశత్వమున్నూ జ్ఞానము కలవాడికి / జ్ఞానమునకు ఆశ్రయమైన వాడికి ఆయా విషయములను తెలియచేసే స్వభావము వల్లనే సిద్ధిస్తున్నది. తెలిస్తేనే తెలివి తెలిసింది, తెలుస్తున్నది కాబట్టే దాన్ని తెలివి అంటున్నాము. దాన్ని కల్గినవాడు తెలివిగలవాడు ఔతున్నాడు. సుషుప్తి, పిచ్చి లేక త్రాగిన దశ, మూర్ఛను పొందునపుడున్నూ కలిగే అనుభవము సవిశేషమే కాని నిర్విశేషము కాదని సందర్భము ముందువచ్చినపుడు చక్కగా నిరూపిస్తాము. ఇక నిర్విశేషవాదుల వాదములో వారు అంగీకరించిన నిత్యత్వము మున్నగు విశేషాలు దండిగా కొల్లలుగా ఉండనే ఉన్నాయి. అవి కేవలము వస్తువులు కావు. అట్లాగని ఎవర్నీ ఒప్పించలేరు కూడా. ఒకవేళ వస్తువులేనని అంగీకరించినప్పటికీ వాటిలోని వైవిధ్యము దగ్గర వివాదము ఉండనే ఉన్నది. అలా తాము తమకు నచ్చిన వైవిధ్యభేదములతోనే తమ మతాన్ని ఉపపాదించినారు అనేది స్పష్టమే. అందువల్ల ఏ వస్తువైనా బ్రహ్మపదార్థమే ఐనా సప్రమాణముగా నిరూపించగల్గిన, ప్రామాణికులగు విద్వాంసులు అంగీకరించిన విశేషములతో కూడినదే వస్తువు అని చెప్పాలి. ఇక ప్రమాణాలలో ఒకటి వారు అంగీకరించినది ఐన శబ్దము అనే ప్రమాణాన్ని తీసుకుంటే అది విశేషించి సవిశేషమైన వస్తువును చెప్పుతుంది. అందులోనే దానికి సామర్థ్యము / వృత్తి / శక్తి ఉన్నది. ఆ శబ్దము పదములు వాక్యములు అనే రూపంలో ప్రవర్తిస్తున్నది. పదము అనేది ప్రకృతి

ప్రత్యయములతో కూడి యున్నపుడే పదము అనబడుతుంది. పదములోని ప్రకృతికి ఒక అర్థము, ప్రత్యయానికి ఒక అర్థము ఉంటుంది. అలా వేరు వేరు అర్థాలతో కూడినదయ్యే విశిష్టమైన ఒక అర్థాన్ని ప్రతిపాదిస్తుంది అది దానికి వదులుకోలేని స్వభావము. వేరువేరు అర్థాలు చెపుతున్నందుననే పదాల్లో భేదము కనిపిస్తున్నది. అనేకములైన పదముల సముదాయరూపమైన వాక్యము అనేక పదార్థములతో కల్సి ఒక విశేషార్థాన్ని చెపుతున్నది కాబట్టి నిర్విశేషమైన వస్తువును ప్రతిపాదించే సామర్థ్యము వాక్యానికి లేదు. కనుక నిర్విశేష వస్తువును తెలుపడంలో శబ్దము ప్రమాణము కానేరదు.

ఇక ప్రత్యక్షమునకు వద్దాము. ఇది నిర్వికల్పకము సవికల్పకము అనే భేదాలతో కూడి యున్నది. ఇది నిర్విశేష వస్తువును తెల్పుటలో ప్రమాణము కలది కాదు. ముందుగా సవికల్పక ప్రత్యక్షము జాతి రూపము రంగు ఇలా అనేక పదార్థములతో విశిష్ట విషయమై యున్నందున సవిశేష విషయమే. ఇక నిర్వికల్పక ప్రత్యక్షము అనేది కూడా విశేషమును తెలియచేసేదే ఐనందున విశేషవిషయమే. సవికల్పక ప్రత్యక్షము. సహజంగానే తనయందు ఇంతకుముందు అనుభవించిన పదార్థముతో విశిష్టము ఐ అదే ఇది, అలాంటిదే ఇది అని ప్రతిసంధానమునకు / గుర్తించడానికి కారణము ఔతున్నది. అసలు నిర్వికల్పకము అంటే ఏదో ఒక విశేషణము లేకుండా ఉన్న దాన్ని గ్రహించుట ఐతే బొత్తిగా ఏ విశేషమూలేని దాన్ని గ్రహించడము కాదు. మరింతగా చెప్పవలెనంటే నాలుగైదు విశేషాలుంటుండగా, అందులో ఏదో ఒక్క విశేషములేని దాన్ని గ్రహించుట. అలా ఏ ఒక్క విశేషమూ లేని పదార్థము ఎప్పుడూ ఎక్కడా కనిపించదు. అలా ఉండుట జరిగేది కాదు. పొసగను కూడా పొసగదు. ఎక్కడైనా ఏదైనా ఒక విశేషమును కల్గియుంటున్నందువల్ల ఇది ఇలాంటి వస్తువు అని గుర్తింపుకల్గుతున్నది. త్రికోణము – ఆవు ముఖాన్ని .......త్రికోణ ఆకారములో ఉంటున్నది కనుక త్రికోణము అంటారు – గంగడోలు – మెడ క్రింది వ్రేలాడే చర్మము – మున్నగు విశేషాలు సంస్థానములు లేకుండా ఆవు అని అనలేము అట్లే ఆయా జాతులకుండే సంస్థాన విశేషాలతోనే అవి ఫలానా అని గుర్తిస్తాము. అట్లా కాకుండా గుర్తించడము సాధ్యంకాదు. అందువల్ల తెలియవచ్చేదేమిటంటే ఒకే జాతికి చెందిన ద్రవ్యాలయందు మొట్టమొదటిసారిగా ఒక వస్తువును / పదార్థాన్ని ఇది ఇటువంటిది అని తెల్సుకోవడం. దాన్నే నిర్వికల్పకము అని అంటాము. తరువాతి కాలంలో ముందు చూచిన సంస్థానములతో సమానమైన రెండవ దాన్ని గుర్తించినపుడు దాన్ని సవికల్పకము అని అంటాము. ఈ విషయంలో

మొదటి ఆకారాన్ని (పిండాన్ని) చూచినపుడు గోత్వము వంటి అనువృత్తాకారము గుర్తింపబడదు. రెండు మూడు ఇలా వరుసగా తొలుత చూచిన సంస్థానములతో సమానంగా ఉన్న వస్తువులను చూచి / సంస్థానములను కనుగొన్నపుడు మాత్రమే అనువృత్తిని గుర్తిస్తాము. మొదట చూచిన ఆవులో ఉన్న సంస్థానాదులు గోత్వములు రెండవదానిలో / రెండవవస్తువును చూచినప్పుడు కనిపిస్తే అవే ఇందులోనూ ఉన్నాయి అని గుర్తుపడతాము. వాటినే అనువృత్తి ధర్మాలు అంటాము వీనిని రెండవ పిండాన్ని చూచినపుడు మాత్రమే తెల్సుకోగలము. దీన్నే సవికల్పకత్వము అని వ్యవహరిస్తున్నారు. ఇక ప్రధమ పిండాన్ని గ్రహించినపుడు గంగడోలు మున్నగు సంస్థానము రూపము గోత్వాదులు వంటి అనువృత్తములు అయ్యే అంశాలు గ్రహింపబడడం లేదు. కనుక ప్రధమ పిండాన్ని గ్రహించడము నిర్వికల్పకము అనబడుతున్నది. సంస్థానము రూపము జాత్యాదులు గ్రహించకపోవడం వలన కాదు. సంస్థానరూపజాత్యాదులు కంటికి కనిపిస్తూనే ఉన్నాయి. కనిపించకుండా ఉండవు. సంస్థానము లేకుండా సంస్థానము కలదానిని  సంస్థానిని గుర్తుపట్టడము సాధ్యంకాదు కూడా. కనుక ప్రధమ పిండమునుగ్రహించినపుడు కూడా సంస్థానముతో కలసియున్న వస్తువునే ఇది అని ఇలాంటిది అని గ్రహిస్తున్నాము. ఇందువలన రెండు మూడు పిండములను గ్రహించినపుడు గోత్వాదులైన అనువృత్తిధర్మములతో విశిష్టమైయుండుటను తొలుతగా చూచిన సంస్థాని వలె, సంస్థానమువలెనే అనగా వాటిని కల్గియున్న వాటినే ఎల్లపుడూ ప్రత్యక్షము గ్రహిస్తుంది కాబట్టి రెండవ దాని నుండి అన్ని వస్తువులలోనూ సవికల్పకత్వమే ఉంటున్నది. కనుక ప్రత్యక్షము ఎపుడు కూడా నిర్విశేషమును చూపదు.

ఇందుచేతనే బ్రహ్మమునకు ప్రపంచానికి భేదము, అభేదము ఉన్నదని చెప్పేవారి వాదము త్రోసివేయబడుతున్నది. భేదమున్నచోట అభేదము లేదు. అభేదమే సత్యమైనపుడు అచట భేదానికి అవకాశము ఉండదు. రెండూ ఉంటవి అనే వాదము పస లేనిది. ఇది ఇట్లాంటిది అని చెపుతున్నపుడు ఇది అనబడే వస్తువు, ఇట్లాంటిది అనబడే విశేషము రెండూ వేరు వేరే అవుతవి. కాని వాటికి ఐక్యత ఎలా గుర్తించగలము? ఆవు అనబడే దాన్ని గుర్తిస్తున్నపుడు ఇలాంటిది అనబడే అంశము గంగడోలు మున్నగునవి ఉన్న సంస్థాన విశేషము ఔతుంది. ఆ విశేషాలు గలిగిన విశేష్యాంశము ఇది అనబడుతుంది. స్పష్టంగా రెంటికీ భేదము కొట్టవచ్చినట్లుగా కనబడుతూ ఉంటే అభేదాన్ని ఎలా చెప్పగలము? కనుక ఈ ప్రతీతివల్లనే/ప్రసిద్ధి వల్లనే భిన్నాభిన్నత్వము

నిలువదు. దాన్నే మరింత వివరంగా తెల్సుకుందాము – మొదటగా మన కంటికి కనుపించే వస్తువు దానికంటే వేరయిన అన్ని వస్తువులతో విడదీయబడినదయ్యే/ వ్యావృత్తమయ్యే ఇది ఫలానా అని గుర్తింపు పొందుతుంది. గోత్వము, గంగడోలు, త్రికోణము వంటి ఆకారవిశేషాలతో కలిసి ఇది ఆవు. దీనిలో ఈ విశేషాంశాలు ఉన్నాయి అనియే ప్రతీతి ఏర్పడుతుంది. ఎక్కడైనా విశేషణ విశేష్యభావాన్ని గుర్తించినపుడు ఆ రెండింటికీ పూర్తి విభేధము ప్రతీతి వల్లనే తేటతెల్లమవుతుంది. విశేషణాంశాలు ఐన దండము, కుండలములు వంటివి సంస్థానము కంటే విడిగానూ, లేక ఆ సంస్థానమునందు / రూపము నందు కలిసిగాని కొన్నిసార్లు వేరే ద్రవ్యములకు విశేషణములుగాను ఉంటాయి. గోత్వము వంటివి మాత్రము ద్రవ్యములోని సంస్థానములో అన్తర్భాగాలుగా ఉంటూ తాము పదార్థాలుగా గుర్తింపబడుతూ ఆయా ద్రవ్యాలకు విశేషణాలుగా ఉంటాయి. విడిగా ఉన్నా ద్రవ్యములో విడదీయరానివిగా ఉన్నా విశేషణ విశేష్య భావములో మార్పులేదు. విశేషణము విశేషణమే. విశేష్యము విశేష్యమేఔతుంది. అందువల్లనే ఆ రెండింటికి భేదము తెలియ వస్తుంది. ఐతే ఇక్కడొక విశేషాన్ని గమనించాలి అదేమంటే, దండము కుండలము వంటివి ఎపుడూ విడిగా ఉంటాయి. గోత్వము వంటివైతేనో ఎట్టిపరిస్థితిలోనూ ద్రవ్యాన్ని విడివడి ఉండజాలవు. కాబట్టే వస్తువిరోధము, ప్రతీతివల్ల పరాహతమగుచున్నది. కాని దాన్ని కప్పిపుచ్చి భిన్నాభిన్నత్వము చెప్పడం సరియైనది కాదు. ఇది ఇలాంటిది అనే కదా। లోకంలో ప్రతీతి కనిపిస్తున్నది. దాన్ని అందరూ ఒప్పుకుంటారు కదా। కనుకనే సూత్రకారుడైన వ్యాసమహర్షి కూడా – **నైకస్మిన్ అసంభవాత్** – సూ. 205 – 2-2-31 ఒకేదాని యందు రెండు భిన్నాంశాలు ఉండవు. అట్లా జరుగదు – అని చెప్పినాడు. అందువల్ల ప్రత్యక్షము సవిశేష వస్తువునే బోధిస్తున్నది. ప్రత్యక్షముతో సంబంధమును దృఢంగా కల్గియున్నది కావున అనుమాన ప్రమాణము కూడా సవిశేష ద్రవ్యమునే బలపరుస్తున్నది కాని నిర్విశేషవస్తువును కాదు. పోనీ ఈ రెండే నా ప్రమాణాలు లేవా? అవి నిర్విశేష విషయాన్ని చెప్పవా! అనేట్లయితే ప్రమాణాలుగా అంగీకరించిన వాటి సంఖ్య ఎంతైనా కావచ్చు. అందరూ అన్నింటినీ ఒప్పకపోవచ్చు. కానీ అందరికీ ఆమోదయోగ్యమైన ముఖ్యమైన కొన్ని ప్రమాణాలు మాత్రము సవిశేషమైన వస్తుపరిజ్ఞానాన్ని అందిస్తున్నవి కాని నిర్విశేష వస్తు విషయమును కావు. అందుచేత ఈ ప్రపంచములో ఏ ప్రమాణముతోనైనా నిర్విశేషవస్తు సిద్ధి జరుగదు. ఆ వస్తువులో ఉండే స్వభావవిశేషాలతో ఇది ఈ వస్తువు అని నిరూపిస్తూ, ఇది నిర్విశేషమండీ! అనడము

మా అమ్మ గొడ్రాలు అని ఒట్టుపెట్టుకుంటున్నట్లే ఔతుంది. కనుక నిర్విశేషవస్తువాదులు తాము మాట్లాడిన మాటలలోని వైరుధ్యాన్ని గమనించడము లేదు. ఎందుకోమరి!

ప్రత్యక్ష ప్రమాణము వస్తువుయొక్క సత్తను మాత్రమే గ్రహిస్తుంది. కాని అది మిగతా ద్రవ్యాలకంటే భిన్నమైనదని గుర్తించజాలదు. భేదమును కూడా వికల్పము చేస్తే ఇది అని నిరూపించడము సాధ్యంకాదు అని ఇంతకుమునుపు చెప్పినారు. అది సరికాదు. లోకంలో ప్రత్యక్షము జాత్యాదులతో కూడిన వస్తువునే గ్రహిస్తుంది. కనపడిన వస్తువులోని జాత్యాదులే ప్రతియోగిని గుర్తించే అవసరము లేకుండానే ఆ వస్తువును దానిలోని భేదాన్ని గుర్తించడానికి తోడ్పడుతున్నది కనుక ప్రతియోగి వస్తువు అవసరము లేనే లేదు. రెండవక్షణము తద్జ్ఞానముతో పొత్తును గురించి ఆలోచించనక్కరనేలేదు. ఒక వస్తువునకు చెందిన జ్ఞానము, దాని రూపము ఆ వస్తువు ఫలానా అని వ్యవహరించడానికి, అలాగే ఆ రెండే ఇతర వస్తువుల విషయంలో దీనితో ఇవి సమానములు కావు, మరొక వస్తువులు అని వ్యవహరించడానికి అవకాశాన్ని ఇస్తున్నాయి. దాన్ని మీరు ఒప్పుకున్నారు కూడా! అదే తీరుగా రూపము, తద్జ్ఞానము, వ్యవహారములే భేదాన్ని గుర్తించడానికి చక్కగా తోడు పడుతాయి. కనుక ఒక ధర్మము, రూపములుగా భేదాన్ని వేరుగా చెప్పుకోనవసరము లేదు. ఆ విషయములో అనవస్థాలేదు. అన్యోన్యాశ్రయణమూ ఉండదు.

జ్ఞానము ఒక్క క్షణము మాత్రమే నిల్చి ఉండేది ఐనా అదే క్షణంలో వస్తువు, భేదము, రూపము, దాని సంస్థాన రూపమైన గోత్వాదులనున్నూ గ్రహిస్తున్నది కనుక రెండవ క్షణములో గ్రహించవలసిన అంశమేది కూడా అక్కడ ఉండదు. ఇంతేకాకుండా వస్తువు ఉన్నది అని మాత్రమే ప్రత్యక్షము గ్రహించేటట్లయితే కుండ ఉన్నది. బుట్ట ఉన్నది అని లోకంలో ఉన్న వ్యవహారము లేక వస్తువిశిష్ట జ్ఞానముతో కూడిన ప్రతీతికి వైరుధ్యము ఏర్పడుతుంది. ఒకవేళ ప్రత్యక్షము వస్తుసత్తాను మాత్రమే తెలియచేస్తే ఆయా వస్తువుల యొక్క సంస్థానము, రూపము, జాతి మున్నగు లక్షణాలుగల భేదము తెలియకపోతే ప్రయాణము చేయడానికి గుర్రము కొరకు వెతికేవాడు దున్నపోతును చూచి దాన్ని తీసుకొని వెనుకకు వెళ్ళిపోగలడా? పోడుకదా! ఇంకా అన్ని విషయాల్లోను ఇట్లే సన్మాత్రమే గ్రహింపబడేటట్లయితే ఆయా ప్రతిపత్తులకు సంబంధించిన శబ్దాలన్నీ కూడా పర్యాయపదాల్లాగా ఒక్కసారిగా స్ఫురణకు వస్తున్నాయా? రావడం లేదుగా! ఎందుకు? ఇంతేకాదు. గుర్రము, ఏనుగుల గురించిన విషయాలు ఉన్నది అనబడే ఒకే

విషయానికి చెందినవవుతున్నాయి కనుక ముందుగా తెల్సిందే కాబట్టి, రెండవదైన ఏనుగును చూచినప్పుడు ఉన్నది అనే జ్ఞానము కలుగుతుంది కావున రెండు జ్ఞానాల్లోను విశేషమేమి ఉండనందున స్మృతిలో వేరుపాటు లేకుండా పోతుంది అనగా గుర్రాన్ని చూచినా ఏనుగును చూచినా వాటిలోని విశేషము, భేదము తెలియకుండా పోతుంది. ఈ గందరగోళము ఎందుకు? ప్రతిజ్ఞానానికి ఒక విశేషాన్ని మాత్రము అంగీకరిస్తాము అని తలచేటట్లయితే ప్రత్యక్షము విశిష్ట విషయాన్ని తెలిపేదే అని అంగీకరించినట్లవుతుంది. అలాకాక అన్ని జ్ఞానాలు ఒకే విషయాన్ని గురించి తెలియజేసేవే ఐనపుడు ఒకే ఒక్క సంవేదనతో అన్ని వస్తువులను గురించి తెల్పుతున్నందున (మనుషులు) ఉన్నారు అని మాత్రమే తెలుస్తుంది. కాని వారిలో కుంటిగుడ్డి చెవిటి భేదాలు లేకుండాపోయి అందరూ కుంటివాళ్లో గుడ్డి వాళ్లో అని భావించాల్సి వస్తుంది. లేదా ఏ విశేషమూ లేని వాళ్ళుగానైనా తలచవలసి వస్తుంది. సరి దాన్నట్లా ఉంచితే చక్షురింద్రియము కేవలము వస్తువు ఉన్నది అని మాత్రమే తెలుపదు. అది రూపము, దాన్ని కల్గిన రూపిని – రెండింటినీ కలిసిన రూపాన్ని గ్రహిస్తుంది కనుక విశిష్ట విషయాన్నే చెపుతుంది, చూపుతుంది. త్వగింద్రియము కూడా స్పర్శవత్ వస్తువునే తెల్పుతుంది. ఇక శ్రోత్రము మున్నగు ఇంద్రియాలు కూడా సన్మాత్రమును మాత్రమే తెలుపవు. శబ్దరసగంధములలోని విశేషములను, వాటిని కల్గిన వాటినీ ప్రదర్శిస్తాయి. అందువల్ల సత్తను మాత్రమే చెప్పే ఇంద్రియము ఏదీలేదు.

నిర్విశేషమైన సత్ మాత్రమును కంటితోనే కనుగొనేటట్లయితే దానికి సంబంధించిన విషయాన్ని తెలుసుకోగోరితే అది ముందే తెలుసుకున్న విషయము ఔతుంది అంటే ఉన్నది అని సత్తను తెల్సుకున్న విషయమే. కనుక తెల్సిన దాన్ని మళ్ళీ ఏదో ఒక క్రొత్త అంశము ద్వారా చెప్పవలసివస్తుంది. అలాంటి విశేషాలు ఏవీ లేవు కాబట్టి ఉన్నది అనియే మళ్ళీ చెప్పవలసి వస్తుంది. అప్పుడు చెప్పిన విషయాన్నే చెప్పడం అనువాదము అవుతుంది. అంతేకాదు సన్మాత్రబ్రహ్మము ప్రమేయము కాగలదు. ఆ వెంటనే జడత్వము నాశిత్వములు కూడా చుట్టు ముడుతాయి. ఆ మాటను మీరే చెప్పారు ఇంతకంటే అనర్థము మరేదైనా ఉంటుందా? అందుచేత వస్తు సంస్థాన రూప జాత్యాదిలక్షణములతో భేదములను కలిగిన విశిష్ట విషయాన్నే ప్రత్యక్షము తెలుపుతుంది. సంస్థానముకంటే వేరే మరొకటి ఒకే రూపములు గల పలుద్రవ్యములకు ఏకత్వబుద్ధిని తెలియచేసేది కనిపించడంలేదు. దానితోనే గోత్వాది జాతి వ్యవహారము

చక్కగా పొసగుతుంది. కాగా సంస్థానము కంటే వేరుగా జాతిని గుర్తించినప్పటికీ సంస్థానమును వారు కూడా అంగీకరించినారు కావున సంస్థానమే జాతి. తమకు మాత్రమే చెందిన అసాధారణ రూపాన్ని సంస్థానము అని అంటారు. అలా అన్ని వస్తువులను గమనించి వ్యవహరించాలి. ఒకే రకమైన రూపములు గలవన్నీ ఏకజాతిగా గుర్తించదగును. వస్తుసముదాయములు కలగలసి ఉన్నపుడు ఏది ఏ జాతికి చెందినదో గమనిస్తే పరస్పరభేదము సులభంగా తెలిసిపోతుంది. అలాగా ఏదో ఒక జాతికి చెందని వస్తువు ఉండదు. కనుక భేదము సులభగ్రాహ్యమే. అర్థాన్తరవాదులు కూడా దీన్ని అంగీకరించినారు. కనుక గోత్వాదులే పరస్పర భేదములకు కారణమవుతున్నవి.

ఐతే జాత్యాదులే భేదములుగా ఒప్పుకుంటే జాతులతో పాటు భేదాన్ని కూడా వ్యవహరించాల్సి ఉంటుంది కదా! అని అనవచ్చు. నిజమే భేదాన్ని వ్యవహరిస్తూనే ఉన్నాము. ఏమని? ఇది గోవు అని అన్నపుడు ఇది ఆవు – గోజాతికి చెందినది.మహిష జాతికి చెందినది కాదు అని తెలుస్తూనే ఉన్నది. గోత్వాదులే సకలేతర సజాతీయ వస్తువులను ప్రక్కకునెడుతున్నవి. పశుసముదాయములో ఒక్కదాన్ని గోవు అని వ్యవహరించినపుడు మిగతావికావు, అని తెలుస్తూనే ఉంది కదా! అపుడు మిగతా వాటిని గురించి గోజాతి అనే బుద్ధి కలుగదు. వ్యవహారమునున్నూ చెయ్యము. ఎపుడైతే భేదాన్ని గ్రహించినామో అపుడే అభేదము అనే భావనతొలగిపోతుంది. ఇది దీనికంటే వేరైనది అనే వ్యవహారములో మాత్రము దేనికంటే ఏది భిన్నమో చెప్పవలసి వస్తుంది కాబట్టి ప్రతియోగి అపేక్ష ఏర్పడుతుంది అందుచేత ఆవు కంటే గుర్రము వేరయినట్టిది అని వ్యవహిరించడము జరుగుతున్నది. అంతేకాని ఆవు అనడంతోనే మిగతాజాతులు వేరే అని భేదము స్పష్టముగా తెలుస్తున్నది కనుక భేదాన్ని ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు.

ఘటాదులు విశేషాలు అవి వ్యావర్తమానములు అవుతున్నాయి కనుక అపరమార్థములు. మృత్తిక అనువర్తమానము అది పరమార్థము. అని ఇంతకుమునుపు చెప్పినారు కాని అది బాధ్యబాధక భావాన్ని వ్యావృత్తి అనువృత్తి విశేషాలను గురించి చక్కగా తెల్సుకోక భ్రాంతితో చెప్పినమాట. సాధారణంగా రెండు వస్తువులకు లేదా జ్ఞానాలకు విరోధము ఏర్పడినపుడే బాధ్యబాధక భావము కుదురుతుంది. బాధితమైనది తొలగిపోతుంది.ఘటపటాదులకుదేశకాలభేదాన్నిబట్టివిరోధమనేదేలేదు.ఏకాలంలో ఏదేశంలో ఏ వస్తువును ఉన్నదని గుర్తించినామో అదేకాలంలో అదేచోట అదే వస్తువు కనపడకపోతే అక్కడ విరోధము ఏర్పడి బలవంతమైనది బాధిస్తుంది. బలహీనమైనది

బాధింపబడి తొలగిపోతుంది. ఒకదేశంలో ఒకానొక కాలంలో చూచినవస్తువు మరొకదేశంలో మరొకకాలంలో కనుపించకపోతే విరోధము ఉండనే ఉండదు. అలాంటప్పుడు వాటికి బాధ్యబాధకభావము ఎలా పొసగుతుంది. ఒక ప్రదేశంలో నివృత్తమైన దానికి మరొక దేశంలో వృత్తిలేదని ఎలా చెప్పుతాము? రజ్జుసర్పభ్రాన్తిలో మాత్రము ఏదేశములో ఏకాలములో చూచినామో ఆదేశములో ఆకాలములో మాత్రమే పాముకాదు త్రాడు అనుజ్ఞానము ఏర్పడుతున్నందున పాము అనే భ్రాన్తి తొలగిపోతున్నది. త్రాడు అనే జ్ఞానము నిలుస్తున్నది. ఎక్కడో చూచిన పాము ఇక్కడ లేదు అనడం లేదు. ఇక్కడ చూచిన త్రాడును ఇంకా ఎక్కడో పాము అని భ్రమపడడంలేదు. ఇక్కడే భ్రాంతి ఇక్కడే దాని నివృత్తి జరుగుతున్నవి. దేశాన్తరకాలాన్తరాల్లో చూచినదానికి దేశాన్తర కాలాన్తరముల యందు వ్యావర్తమానము కావడము, కనుపించక పోవడంతో మిథ్యయని భావించడము వ్యావర్తమైందని అపరమార్థమని చెప్పడం సరికాదు. కనుక కేవలము వ్యావర్తమానత్వమే అపారమార్థ్యానికి కారణము కాజాలదని గుర్తించాలి. ఇంతేకాదు అనువర్తమానమైనది సత్ అని, అదే పరమార్థమని భావించడం సరికాదు. సత్ పదార్థము సర్వకాలసర్వావస్థలలోనూ ఉంటూనే ఉన్నందున దాన్ని సాధించడానికి ప్రయత్నించాల్సిన అవసరము లేదు. అందుచేత సన్మాత్రమే వస్తువుకాదు అనుభూతి, సద్విశేషములకు విషయ విషయిభావము ఉన్నది కాబట్టి ఆ రెండింటికి భేదము ప్రత్యక్షముగా కనపడుతున్నందున అనుభూతి (జ్ఞానము) మాత్రమే ఉంటున్నది అనే మాట కూడా త్రోసివేయబడుతున్నది.

అనుభూతి స్వయంప్రకాశము కలది అని ఇంతకుమునుపు చెప్పినారు. ఐతే అది ఆ విషయమును గురించి తెలియచేయబడినపుడు జ్ఞాతకు దానంతట అదే ప్రకాశిస్తుంది. మరొక్క దాని సాయమక్కరలేదు. జ్ఞానానికి కూడా అంతే. నేను తెలియబడుతున్నాను అని ప్రకాశిస్తుంది. ఐతే జ్ఞానాశ్రయుడికి తనకు తప్ప ఇతరులకు ఇందులో సంబంధము ఉండదు. అందరికీ జ్ఞానము ఎలాంటి ప్రయత్నము లేకుండా ఏదో ఒక వస్తువును గురించి తెల్యవలసిన అవసరము లేదు అలాగని నియమమూ లేదు కూడా! ఒకడికి ఒక విషయాన్ని గురించి తెలుస్తున్నది అని మనము గుర్తించాలంటే ఆవును తీసుకురావడం లేక ఆవును వదిలిపెట్టడం వంటి పనులను బట్టి ఆ విషయాన్ని ఊహించాల్సి ఉంటుంది. ఒకడు ఆదేశిస్తే, మరొకడు ఆ మాటను అర్థం చేసుకొని ప్రవర్తిస్తే మూడోవాడు మొదటివాని మాటకు ఇది అర్థమని

గుర్తిస్తాడు. అక్కడ జరిగిన క్రియతో వాడికి సంబంధము లేకపోయినా శబ్దము వినిపించినంతమాత్రాన అర్థజ్ఞానముకలవాడవుతున్నాడు. శబ్దార్థజ్ఞానము లేనివాడు కండ్లారా చూచినదాన్నిబట్టి ఈ పదానికి ఇది అర్థమని ఊహించగల్గుతున్నాడు. ఇలా పరునికి గల జ్ఞానానుభవమును గురించి ఆయా లక్షణాలను (లింగములను) బట్టి ఊహించుకోవలసి వస్తున్నది కాని అనుభూతి స్వతఃసిద్ధమైనందునకాదు. ఇక తనకు కూడా గడచిపోయిన వృత్తాంత్తాన్ని గురించి తల్చుకున్నపుడు, నాకు ఇది తెలుసును అనుకున్నపుడు జ్ఞానవిషయము (తెల్సుకొనవలసిన అంశము) అవుతున్నది కావున అనుభూతి ఉన్నట్లయితే అది స్వతఃసిద్ధము అని చెప్పడానికి వీల్లేదు. అంటే అది ఉత్పన్నము కావలసిందే. అనుభూతి అనుభావ్యము ఐనట్లయితే అది జ్ఞానము (అనుభూతి) కాక జడము కావలసివస్తుంది అని మీరేది అన్నారో అది తొందరపాటుతో పల్కిన తప్పుడు మాట. అలాగే ఐనపుడు తమవైన గడచిన అనుభవాలు, ఇతరుల యొక్క అనుభవాలున్నూ అనుభావ్యములు ఔతున్నాయి కావున అవి కూడా జ్ఞానాలు కాకుండా పోవలసివస్తుంది. పరులయొక్క అనుభవాలను బట్టి వాడికి జ్ఞానం కలదు అని ఊహించడాన్ని అంగీకరించకుంటే శబ్దార్థ సంబంధము తెలియకుండా పోయి ఏ శబ్దాన్నీ ఎక్కడా ప్రయోగించకుండా ఊరుకోవలసి వస్తుంది. అపుడు వాగ్ వ్యవహారమే బొత్తిగా నిల్చిపోయి మూగవ్యవహారము దాపురించవచ్చును. ముముక్షువు ఐన వ్యక్తి బ్రహ్మజ్ఞానము కలవ్యక్తి వద్దకు వెళ్ళాలి. ఎదుటివాడు ఆ విషయకమైన జ్ఞానము కలవాడనియేగదా అతడిని ఆశ్రయించేది. అదెలా జరుగుతుంది? అతడికి తద్విషయక జ్ఞానము కలదని ఊహించినపుడే కదా! అది జరగనపుడు ఆచార్యుడు లేడు శిష్యుడూ లేడు జ్ఞానమూ ఉండబోదు. ఇది ఒక పెద్ద అనర్థము. అహా! అలాకాదు అన్య విషయమైనపుడు అది జడము (అననుభూతి) కాదని అనకూడదు. అసలు అనుభూతి అంటే అది ఉంటున్నదశలో తాను ఉంటున్నది కనుక తనకు ఆశ్రయమైన వాడికి తనను గురించి తెలియబడడము / ప్రకాశమానత్వము (అనగా అది ఉంటున్నది కనుక దానికి సంబంధించిన జ్ఞానము జ్ఞాతకు కలుగడం) లేదా తన సత్త వలన తనకు సంబంధించిన విషయాన్ని తెలుపడంలో ఉపకరించడము/ సాధనము కావడము. ప్రకాశమానత్వము, స్వవిషయసాధనత్వములు మరొక అనుభవము చేత అనుభావ్యములు అవుతున్నప్పటికి స్వానుభవము చేతనే సిద్ధించుతూ తొలగిపోవడం లేదు కనుక వాటికి అనుభూతిత్వము పోదు. అనగా జ్ఞానములుగా స్వయంప్రకాశత్వాన్ని కల్గియే ఉంటవి. ఘటపటాదులు మాత్రము

స్వయంప్రకాశకములు కావు కనుక వాటికి అననుభూతిత్వమే తప్ప అనుభూతిత్వము (జ్ఞానము) లేదు. అంతేకాని అనుభావ్యములు ఐనందువల్ల కాదు. మీరు చెప్పినట్లు అనుభూతి ఇతరానుభవాల వల్ల గానీ ఇంద్రియాల వల్లగానీ అనుభావ్యమే ఐనట్లయితే అననుభూతి ఘటాదుల వలె కావలసి వస్తుంది. దాన్ని అడ్డుకోజాలము. గగన కుసుమము, శశవిషాణము వంటివి అననుభావ్యములు. అందువల్ల వాటిని అననుభూతులు అనవలసివస్తుంది. ఐతే గగనకుసుమాదులకు అననుభూతిత్వమనేది ఆ వస్తువు అంటూ లేదు. ఊహాకల్పన మాత్రమే. కనుక అననుభూతి అసత్వము వల్ల వచ్చిందే అనుభావ్యములు కాకపోవుటవల్ల కాదు అని అనకూడదు. అదే సత్యమయితే ఘటాది జడపదార్థములకు అననుభూతిత్వమనేది అజ్ఞానాన్ని విరోధించనందువల్లనే ఏర్పడుతున్నది కాని అననుభావ్యములైనందువల్ల కాదని గ్రహించండి. జ్ఞానము (అనుభూతి) అనుభావ్యము ఐతే ఘటాదులకు వలె అజ్ఞానావిరోధిత్వము రావచ్చును అజ్ఞానమును ఎదిరించలేకపోవడము. అజ్ఞానము అనగా తెలియకపోవడము కదా! అని అంటారేమో? అననుభావ్యము ఐనప్పుడు కూడా ఆకాశపుష్పము, కుందేటి కొమ్ములకు వలె అజ్ఞానా విరోధిత్వము తప్పకవచ్చి తీరుతుంది. అందువల్ల జ్ఞానము అనుభావ్యము (మరొకదానితో తెల్సుకోవలసింది) అయితే అననుభూతిత్వము (జడత్వము) ను పొందుతుందనడము పదుగురు నవ్వుకోదగినది కాగలదు సుమా!

సంవిత్తు జ్ఞానము స్వతస్సిద్ధము. ఒకదానివల్ల పుట్టేదికాదు. కనుక దానికి ప్రాగభావములేదు. అందుచేత దానికి ఉత్పత్తి లేదు అని ఏది చెప్పబడిందో అది నిరసింపబడుతున్నది. ఒక్క మాటలో చెప్పాలంటే బొత్తిగా స్వరూప జ్ఞానములేని, చూచి ఎరుగని పుట్టు గ్రుడ్డివాడు కారణాంతరాలవల్ల గ్రుడ్డితనమును నడుమలో పొందినవాడికి దుడ్డుకర్ర ఎలాగా ఉంటుందో? ఎట్లా ఉపయోగించాలో నేర్పించినట్లే ఉంటుంది. జ్ఞానానికి ప్రాగభావములేదు. ప్రాగభావము ఉన్నదని చెప్పే ప్రమాణము లేదు కనుక అని మీరు అంటున్నారు అలా చెప్పడానికి వీల్లేదు. మనకు అనుభూతి ఎప్పుడు కలుగుతున్నదో అపుడే జ్ఞానము ఇంతకు ముందు నాకు లేదు. ఇపుడే ఈ వస్తువుకు సంబంధించిన జ్ఞానము కలిగింది అని అనుభూతి వల్లనే జ్ఞానప్రాగభావము తేటగా తెలియవస్తున్నది. అంటే జ్ఞానమే / అనుభూతే తన ప్రాగభావాన్ని మరొక ప్రమాణముతో అవసరము లేకుండానే తెలుపుతున్నది. ఐతే అనుభూతి తాను ఉంటూ తనకు విరుద్ధమైన తనప్రాగభావాన్ని ఎలా చెప్పగలదు అని ప్రశ్నించవచ్చు.

విను. ప్రాగభావము అనుభూతికి సమకాలంలోని వర్తమాన విషయమా? లేక అది పుట్టడానికి ముందటికాలములోనిదా? అని తర్కించుకోవాలి. వర్తమాన కాలవిషయమునే / అభావాన్నే చెప్పవలెననే నియమము ఎక్కడాలేదు. ఐతే అపుడు భూతభవిష్యత్తు కాలాలలోని అభావమునకు ప్రసక్తిలేకుండా పోతుంది. కనుక తన వర్తమానకాలములోనిదైన అభావమునుకాక దీనికంటే ముందుదైనకాలాన్ని తన ఉనికి వల్లనే ప్రాగభావవిషయాన్ని తప్పక తెలుపుతుంది. ఒకవేళ నీవు అనుకుంటున్నావో ఏమో? ప్రాగభావము వల్ల సిద్ధిస్తున్న జ్ఞానము తానున్న వర్తమాన కాలంలోనే తన అభావము కూడా ఉండాలని? ఎక్కడైనా అలాంటి దాన్ని చూచినావా? స్వసమకాలవర్తియై ఉండాలని నియమాన్ని చెపుతున్నావు? అయ్యా! అలాగయితే అభావము జ్ఞానము ఉన్న కాలములో ఉంటున్నది కనుకనే జ్ఞానములేని కాలములో అభావము ఉన్నది అని స్పష్టంగా కనబడుతున్నది. అందుచేత జ్ఞానప్రాగభావము సిద్ధిస్తున్నది. కనుక దాన్ని దాచిపెట్టడము కుదరదు. ప్రాగభావము దాని సమకాలములో ఉండాలని పిచ్చివాడు తప్ప ఎవడు చెప్పగలడు?

ఇంద్రియముల వల్ల పుట్టే ప్రత్యక్షానికి ఒక నియమమున్నది. అదేమిటంటే। తన సమానమైన కాలములో ఉన్న వస్తువును మాత్రమే గ్రహించగలుగడము. ఇక సమకాలములోనివికాని స్మరణము, ఆగమము యోగి ప్రత్యక్షాదులయందు సమకాలములోనివికాని కాలాన్తరముల యందున్నవాటిని కూడా గ్రహించగలుగడము కనిపిస్తున్నది. ఇందువల్లనే ప్రమాణముతో ప్రమేయానికి అవినాభావ సంబంధము సిద్ధిస్తున్నది. ఐతే ఏదేశకాలాదులతో సంబంధము కలదై ఏఏ వస్తువు కనిపిస్తున్నదో? అది ఆ దేశకాలాదులలో తాదృశాకారము మిథ్యా (లేదు) అనడానికి ప్రత్యనీకము అవుతుంది. ఈ కారణంగానే "**స్మృతి బాహ్య వస్తువులకు సంబంధించింది కాదు. వస్తువు నశించినా దానియొక్క స్మరణ ఉంటున్నది కనుక**" – అనే అంశము త్రోసి పుచ్చబడుతున్నది.

ఇక మీరు ఇలా అనవచ్చును. సంవిత్తు (జ్ఞానము) యొక్క ప్రాగభావము ప్రత్యక్ష ప్రమాణము ద్వారా తెలియబడదు. ప్రత్యక్షమునకు విషయంగా చక్షురాదులకు కనబడడం లేదు కనుక (పోనీ) మరొక ప్రమాణమైన అనుమానము వల్లనున్నూ సిద్ధించదు. దాన్ని సాధించడానికి అవసరమై లింగము / హేతువు దృష్ట్యాంతములు లేవు కాబట్టి. సంవిత్తు యొక్క ప్రాగభావాన్ని సాధించే లింగము లభించడం లేదు. లేదా

అనుపపత్తి అనే ప్రమాణము ద్వారా కూడా తెలియరావడము లేదు. ప్రాగభావానికి సంబంధించి ఆగమప్రామాణ్యము ఎక్కడ కూడా కనపడలేదు. ఇందువలన జ్ఞాన ప్రాగభావము ప్రమాణము లేకపోవుట వల్లనూ సిద్ధించదు. ప్రాగభావాభావము వల్ల అనుభూతి ఉత్పత్తిలేదు. అది స్వతః సిద్ధము అని.

ఇదే నిజమయితే ఇప్పటిదాకా జ్ఞానము స్వతస్సిద్ధము అని చెప్పిన మీరు ప్రమాణాభావమును ఒక హేతువుగా ముందుకు వచ్చేటట్లయితే మీరే అంగీకరించిన యోగ్యాను ప లబ్ధి ప్రమాణము జ్ఞానానికి ప్రాగభావాన్ని ఉన్నదని ఋజువు చేస్తున్నది. గమనించండి. ఇంతటితో వాదాన్ని చాలించండి.

ఇంతే కాకుండా ప్రత్యక్షజ్ఞానము తనచే తెలుపబడే ఘటాదులను తన సత్తా కాలము నందు ఉంటున్నవి అని తెలుపుతున్నది కాని ఎల్లకాలము అనగా భూతభవిష్యత్తులలో ఘటము ఉన్నది / ఉంటున్నది అని తెలుపడం లేదు. అలా ప్రతీతి లేకపోవడానికి కారణము కాలపరిచ్ఛేదమే. ఘటాదుల విషయమైన జ్ఞానము / సంవిత్తు స్వయంగా కాలముతో సంబంధములేకుండా ప్రతీతము అయ్యేదయితే సంవేదన విషయము ఐన ఘటపటాదులు కూడా కాలంతో సంబంధము లేకుండా సర్వదా ప్రతీయమానములు కావలసియుంటవి. అందువల్ల అవి నిత్యములు కాక తప్పదు. సంవేదనము నిత్యమైతే జ్ఞానము నిత్యము స్వతస్సిద్ధము అని కూడా ప్రతీయమానము కావాలి. కాని అలా ప్రతీయమానము కావడం లేదు. ఇలాగే అనుమానాది ప్రమాణాలు కాలముతో సంబంధము లేకుండా ప్రతీతములు ఐనట్లయితే తమకు సంబంధించిన విషయాలను కూడా కాలానవచ్ఛిన్నములుగా ప్రకాశింపచేస్తవి. అపుడవి అన్నీ కాలానవచ్ఛిన్నములై నిత్యములు ఔతవి. ఎందుకంటే విషయాలన్నీ జ్ఞానానుగుణమైన స్వరూపములు కలవి కాబట్టి ఇంకా విషయముతో సంబంధము లేని జ్ఞానమంటూ ఒకటి లేదు. ఇందుకు అనుపలబ్ధియే ప్రమాణము. దొరకకపోవడము. ఉపలబ్ధి (లభించుట) విషయాన్ని ప్రకాశింపచేయడాన్ని బట్టి సంవిత్తుకు – జ్ఞానానికి – స్వయం ప్రకాశత్వము సమర్థింపబడింది. సంవిత్తుకు విషయమును వెల్లడించే స్వభావము లేకపోతే స్వయంప్రకాశత్వము సిద్ధించదు మరియు అనుభూతి ఇతర అనుభవాల వల్ల అనుభవింపబడేది కానందువల్ల జ్ఞానము గగనకుసుమాదులవలె తుచ్ఛము కావాల్సి వస్తుంది.

గాఢనిద్ర, మత్తుపదార్థాలను త్రాగినపుడు, మూర్ఛపోయినపుడు ఏ విషయ పరిజ్ఞానము లేని వట్టి సంవిత్తే ప్రకాశిస్తుంది అని అనగూడదు. ఉంటే లభిస్తుంది. యోగ్యమైన జ్ఞానము లభించుట లేదు అనుకారణము చేత కొట్టివేయబడుతున్నది. ఆయా దశలయందు అనుభూతి కలిగినట్లయితే అది మెలకువ వచ్చిన పిదప తలచుకోబడాలి. అనుసంధానము లేదు కనుక అనుభూతి లేదనే చెప్పాలి. అనుసంధానము – తల్చుకోవడము.

ఔనండీ! అనుభూతమైన పదార్థాన్ని స్మరించాలి అని నియమము ఎక్కడా కనబడడం లేదు. స్మరించుకోనంత మాత్రాన అనుభవము లేదని ఎట్లా చెప్పగలము? అని అంటారా? చెప్తాము వినండి. అన్నిరకాల సంస్కారాలను ప్రక్కకు త్రోసివేసే శరీరపరిత్యాగము వంటి ప్రబలమైన కారణాలు లేకున్నా స్మరణము జరుగడం లేదంటే అనుభవము లేదనే అనుమానించవలసి యుంటుంది.

ఐతే స్మరణ జరుగడంలేదనే ఒక ఒక్క కారణంతో అనుభవము లేదు అని అనడం లేదు. గాఢ నిద్ర పోయిలేచిన వాడు ఇంతకాలము వరకు ఏమి జరిగిందో నాకు తెలియదు అని ప్రత్యవమర్శవల్లనే అనుభవాభావము తెలుస్తున్నది. అనుభవము ఉన్నప్పటికీ దాని విషయము ఇది అని తేటతెల్లం కాకుండట, అహంకారము – మనస్సు ఆదశలో పక్కకుపోవుట వల్ల తలచు కోవడం జరుగడం లేదు అని భావించవద్దు. నిద్రిస్తున్నందువల్ల తదనుభవము కంటే వేరయిన అర్థాంతరాననుభవము, లేదా కేవలము నిద్రయే తప్ప అర్థాన్తరము లేకపోవుట అనునవి అనుభవించిన అర్థాన్తరమును స్మరించకపోవటానికి కారణం కాదు. స్వాపమదమూర్ఛాది దశల్లోను అహమర్థమైన మనస్సు వెంటనంటేవుంటుంది అని ముందు వివరించబోతున్నాము. ఈస్వాపాది దశల్లో కూడా సవిశేషమైన అనుభవమే ఉంటుంది అని మీరు ఇంతకుముందు చెప్పారు కదా! అని అంటారా! ఐతే అది నిజమే. అది ఆత్మానుభవము. అది కూడా సవిశేషమేనని (మునుముందు) దృఢంగా ప్రతిష్ఠిస్తాము కూడా! ఇక్కడైతేనో ఏ విషయమూ లేని నిరాశ్రయమైన సంవిత్తు ఉండదని నిషేధింపబడుతున్నది. కేవల సంవిత్తే ఆత్మానుభవము అని అనడం తగదు. ఆ జ్ఞానము నిరాశ్రయముకాదు. సాశ్రయము అని ఉపపాదించుతాము. అందువల్ల అనుభూతి తాను ఉంటూ తనకు తానే తన ప్రాగభావాన్ని సాధించదు అని చెప్పడము కుదరదు. అనుభూతికి ఇతర జ్ఞానాదుల వల్ల అనుభావ్యత్వము సంభవిస్తుందని ఉపపాదించినాము. కావున ఇతరాంశములవల్ల

ప్రాగభావము సిద్ధించదనుమాట త్రోసిపుచ్చబడింది. ఆ కారణంగా ప్రాగభావము సిద్ధించనందువల్ల సంవిత్తుకు ఉత్పత్తి లేదనుట ప్రమాణదూరమైన విషయము.

అనుభూతికి పుట్టుకలేదు కాబట్టి వికారాలు కూడా లేవు అని అన్నారు. అది కూడా పొసగనిమాట. ప్రాగభావము నందు వ్యభిచారమను దోషము కనిపిస్తున్నది. దానికి జన్మలేకపోయినా వినాశము కనిపిస్తున్నది. అది వికారమే కదా! కనుక నీవు చెప్పిన మాట పొరపాటు. భావేషు – ఉన్న పదార్థము లందు – అని విశేషణమును చేర్చుకొనేట్లయితే మీతర్క పాండిత్యము బైటపడుతుందే తప్ప ప్రయోజనము ఏమీ ఉండదు. మీరంగీకరించిన అవిద్యకు పుట్టుకలేదు కదా। ఐనా అది వివిధములైన వికారములను పొందుతున్నది. అంతే కాదు తత్త్వజ్ఞానము కలిగిన పిమ్మట నశించి పోతున్నది. పుట్టుక లేనిదైనా అవిద్య పలు వికారాలను పొందడము నశించడము అను మార్పులను వికారాలను పొందుతున్నది. కాబట్టి మీరు చెప్పిన లక్షణమునకు అనైకాంత్యదోషము పడుతుంది. అవిద్యవలన కలిగిన వికారాలన్నీ మిథ్యా రూపాలే. పరమార్థాలు కావు అని అంటారా! ఐతే పరమార్థమైన వికారమంటూ ఒకటి ఉన్నదా! అలాగైతే మీరు వేసిన విశేషణము సార్థకము ఔతుంది కాని మీమాటను మేము ఒప్పుకోము. వికారమనేది సహజంగానే ఉత్పత్తి వినాశాలు కల్గియుంటుంది. అందులో ఒకటి పరమార్థము మరొకటి అపరమార్థము అంటూ ఉండడానికి అవకాశమే లేదు సుమా!

అనుభూతికి పుట్టుకలేదు. అందువల్ల దానిలో విభాగములను ఓర్వదు అని మీరు చెప్పిన మాట పొసగదు. పుట్టుక లేనిదే ఐన ఆత్మకు దేహేంద్రియాదులద్వారా విభాగాలు కనబడుతున్నాయి కదా! అట్లాగే అనాదిగా వస్తున్నది అని మీరంగీకరించిన ఆత్మకు వ్యతిరేకమైన అవిద్యకు విభాగములు ఉన్నవని తప్పక ఒప్పుకోవలసియుంటుంది. ఆత్మ అవిద్యకు ఆశ్రయమైనందున దానిలో విభాగాలు ఏర్పడడం తప్పని సరియే. ఐతే ఆ విభాగము మిథ్యా రూపము అనరాదు. జన్మసంబంధము వల్ల పరమార్థమైన విభాగము ఏర్పడుతున్నదని కాని సహజంగా ఉన్నదాన్ని కాని ఎక్కడైనా చూచియున్నావా! అవిద్యకు ఆత్మకు పరమార్థంగా విభాగము లేకుండా పోతే యథార్థానికి అవిద్యనే ఆత్మ ఔతుంది. దేనిచేత కూడా బాధితము కానిదై సిద్ధించిన దృశ్య భేదమును సమర్థించడము ద్వారా దర్శనభేదము కూడా సమర్థింపబడియున్నది. ఛేద్యమైన పదార్థము నందు భేదము ఉన్నట్లయితే ఛేదనములో భేదము ఉన్నట్లు జ్ఞానములోనూ భేదము తప్పదు.

జ్ఞానస్వరూపమైన అనుభూతికి తెల్సుకోదగిన ధర్మము అంటూ ఏమీలేదు. దృశ్యములైన వాటికి దృశిధర్మత్వము లేదు అని ఏమాట అన్నారో అది స్వోక్తి విరోధముతో కూడియున్నది. ప్రమాణములచేత సిద్ధములు, మీరు అంగీకరించినవి ఐన నిత్యత్వము, స్వయంప్రకాశకత్వము వంటివి ధర్మాలే కదా! అవిజ్ఞానములో నున్నపుడు అనైకాంత్యము అనే దోషము వస్తున్నది. నిత్యత్వ స్వయం ప్రకాశత్వాదులు కేవల జ్ఞానములు కావు. వాటికి స్వరూపంలో భేదమున్నది. సంవేదనము అనగా తాను ఉంటూ తనకు ఆశ్రయమిచ్చినవానికి ఏదో ఒక విషయాన్ని తెలియపరచడమే సంవేదనము. ఇక స్వయం ప్రకాశతా అంటే తన ఉనికి వల్లనే స్వాశ్రయమైన వానికి ప్రకాశమానత్వము. ప్రకాశమంటే చిత్‌లు, అచిత్తులు ఐన పదార్థాలన్నింటికీ సాధారణమైన ఇది ఫలానా అని వ్యవహరించడానికి అనువుగా ఉండడము. భూతభవిష్యత్ వర్తమాన కాలాలన్నింటి యందున్నూ ఉండడమే నిత్యత్వము. ఏకత్వము ఒక్కటి అనే సంఖ్యచే చెప్పబడడము – వాటికి జడత్వాదులు లేకపోయినా అలాంటి చైతన్యధర్మములైన వాటితో అనైకాన్త్యము తప్పించుకోరానిదే. జ్ఞానము నందు దాని స్వరూపానికంటే వేరుగా జడత్వాదులకు ప్రత్యనీకత్వము అనే అభావరూపమో భావరూపమో ఐన ఒక ధర్మాన్ని ఒప్పుకోకపోతే జ్ఞానానికి ఆయావిశేషాలు లేవని నిషేధించినందువల్ల జ్ఞానాన్ని గురించి ఏమీ చెప్పినట్టు కాబోదు. మరియు సంవిత్తు సిద్ధిస్తుందా? లేదా? సిద్ధిస్తే (ప్రకాశిస్తే) ధర్మము కలదే ఔతుంది. సిద్ధించకపోతే గగన కుసుమాదులవలె తుచ్ఛత వస్తుంది. సిద్ధించుటయే సంవిత్ అని అనేట్లయితే ఎవనికి? దేని గురించి అనే ప్రశ్నకు బదులు చెప్పాలి. ఒకవేళ ఎవ్వరికీ దేని గురించి కాదు అనేట్లయితే అపుడు అది సిద్ధి అనబడదు. సిద్ధి అంటే పుత్రత్వములాగా ఒకానొకనికి ఒకనిని బట్టి ఏర్పడుతుంది. ఆత్మకే ఆ సిద్ధి అనేట్లు ఐతే ఆత్మ అంటే ఏమిటో వివరించాలి. సంవిత్తు అని జెప్పాము కదా! అని అన్నారా! నిజమే చెప్పారు కాని అది తప్పుడుమాట. అది ఎలాగంటే? ఒకానొక వ్యక్తికి ఏదో ఒక అర్థాన్ని గురించి సిద్ధి రూపమైన ఆ అర్థ జాతమునకు సంబంధించిన జ్ఞానము తానే ఆత్మగా అనుభవాన్ని పొందేది ఎలాగా! మరింతగా చెప్పాలంటే – అనుభూతి అనేది తనకు ఆశ్రయమైన దానికి తాను ఉండడము వలన ఏదో ఒక వస్తువునకు ఇది అని వ్యవహరించడానికి తగిన స్థితిని ఆపాదించే స్వభావము గలదై జ్ఞానము అవగతి సంవిత్తు మొదలగు వేరు వేరు పేర్లతో సకర్మకమై అనుభవించే (వాడికి) ఆత్మకు చెందిన ధర్మవిశేషము. నేను ఘటమును ఎరుగుచున్నాను. 2. నేను ఈ అర్థాన్ని తెల్సుకుంటున్నాను 3. నేను

ఆ బుట్టను ఎరుగుదును / నాకు ఆ బుట్టను గురించి తెలియును అనే ప్రకారంగా అందరికీ ఆత్మసాక్షిగా ప్రసిద్ధమైనట్టిది. ఇలాగా ఒకనికి ఒక వస్తువును గురించి తెలుపే స్వభావము కలది గాబట్టే దానికి **"స్వయం ప్రకాశతా"** అని మీరు ప్రతిపాదించినారు. ఇలాంటి సకర్మకమైన, కర్తృధర్మ విశేషమైన, జ్ఞానానికి / సంవేదనము అను పేరు గల దానికి, సుఖదుఃఖాదులు పుట్టి కొంతకాలము తర్వాత నశించినట్లు ఉత్పత్తి, స్థితి, నిరోధములు ప్రత్యక్షంగా కనబడుతున్నాయి. జ్ఞానానికి పై లక్షణాలు ఉన్నా కర్త ఒక్కడే స్థిరంగా ఉంటున్నాడా? పలువురు కర్తలా! అన్నట్లయితే! ఈ అర్థము అదే. దాన్ని నేను ఇంతకుముందే అనుభవించినాను అని గతంలో అనుభవించిన విషయాన్ని, ఇపుడు ఎదురుగా ఉన్నదాన్ని, భూతకాలము నందు, వర్తమానము నందున్నూ ఉన్న అంశాన్ని తలచుకోవడము లేక గుర్తించడము ప్రత్యభిజ్ఞ ద్వారా ఎత్తి చెప్పడాన్ని కండ్లారా చూస్తూనే ఉన్నాము. అనగా జ్ఞానము వేరువేరు కాలాలకు చెందినా ఆ కాలాలకు సంబంధించిన కర్త ఒక్కడు – గానే ఉంటున్నాడు. కర్త మారడం లేదు. పైగా నేను ఎరుగుదును నేను ఇంతకుముందే తెల్సుకున్నాను. నాకు మునుపు తెలిసినదే ఐనా ఇపుడా జ్ఞానమును మరిచిపోయినాను అని వ్యవహరిస్తున్నందువల్ల సంవిత్తు యొక్క ఉత్పత్తి స్థితి నాశములు స్పష్టముగా కనిపిస్తున్నాయి కాబట్టి జ్ఞానానికి ఆత్మకు ఐక్యత ఎక్కడి నుండి వస్తున్నది? కావున జ్ఞానము / సంవిత్, ఆత్మ అనునవి రెండు వేరువేరు పదార్థాలే గాని ఒక్కటికావు.

ఈ విధంగా నీవు చెప్పినట్లు క్షణకాలములో నశించిపోయే జ్ఞానాన్ని ఆత్మ అని ఒప్పుకుంటే ముందుటిరోజున చూచిన దాన్ని మరుసటినాడు చూచి దీన్ని నేను ఇంతకుముందే చూచినాను అనే ప్రత్యభిజ్ఞ! గుర్తుపట్టడము ఎంతమాత్రము కుదరదుగాక కుదరదు. క్షణకాలములో నశించే జ్ఞానము ఆత్మ అని అంగీకరించిన పక్షములో నిన్నటికి ఇవాళ్టికి ఎన్నిక్షణాలు గడిచిపోయినాయో ఏమో! అప్పటి ఆ క్షణపు ఆత్మవేరు. ఇప్పటి క్షణపు ఆత్మ వేరే ఔతారు కదా! ఒకడు చూచిన దాన్ని మరొకడుచూచేదెట్లా! నేను ఇంతకుముందే చూచినాను అనడమున్నూ ఎట్లా? కావున ప్రత్యభిజ్ఞ జరుగదు. కుదరదు.

ఇంతేకాదు. అనుభూతి ఆత్మ అని అంగీకరిస్తే, అది నిత్యమైనది నశించదు అని చెప్పుకున్నా ప్రత్యభిజ్ఞ! ప్రతి సంధానము లేకపోవడము అట్లాగే ఉంటుంది. అసలు ప్రతి సంధానమనేది ముందు వెనుకలకాలములలోనూ నిల్చియుండే

అనుభవించినవాడిని ఎదుటనిలబెడుతుంది. కాని కేవలము అనుభూతిని కాదు. నేను దీన్ని ఇంతకుముందే అనుభవించినాను అని గదా వాక్యప్రయోగము. మీకు అనుభూతికి అనుభవితృత్వమును అంగీకరించడము ఇష్టం లేదు. జ్ఞానము జ్ఞానమే జ్ఞాతలేదని కదా।మీవాదము. ఐతే సంవిత్తు అనేది నిరాశ్రయము, నిర్విషయము ఐనదిగా ఎక్కడా బొత్తిగా లభించదు. అట్లా ఉండడమూ జరుగదు అని మేము ఇంతకుముందే చెప్పినాము. అనుభూతి సాశ్రయమా! నిరాశ్రయమా, నిర్విషయమా సవిశేషమా అనే వాదాలు కాస్త పక్కకుపెడితే జ్ఞానమే ఆత్మ అని ఇద్దరూ అంగీకరించినాము. అలాగని ఉపలబ్ధి కూడా ఉన్నది. అందుకని సంవిత్తే ఆత్మ అని ఉపలబ్ధి ప్రమాణముతో వాదము ముగించుదాము. ఇంతటితో అనుభూతి మాత్రమే పరమార్థము అని చెప్పే హేత్వాభాసాలు నిరాకరింపబడ్డాయి.

ఏమండీ! అహంజానామి అనువాక్యంలోని అహం శబ్దముచేత చెప్పబడుతున్న దాని యందు ఇది అని చెప్పబడకుండా ఉన్న అంశము ఏది ఉన్నదో, ఎల్లప్పుడూ ప్రకాశించుటయే స్వభావముగా కల పదార్థమేదో అదే ఆత్మ. దానిలో దాని ప్రకాశము చేత తెలుపబడుతున్న యుష్మదర్థలక్షణమై అహంజానామి అని సిద్ధించుతున్న అహమర్థము చిన్మాత్రమున కంటే వేరుగా నున్న యుష్మదర్థమేకదా।

అలాకాదు. అహంజానామి అను వాక్యములో నేను తెల్సుకొనుచున్నాను అన్నపుడు తెల్సుకొనుట ధర్మము, తెలివి కల్గియుండుట అనే ధర్మమును కల్గియుండుట వలన ధర్మి ప్రత్యక్షముగా తెలుస్తున్నది. ఈ ప్రతీతికి నీవు చెప్పిన దానికి వైరుధ్యము తేటగా కనపడుతున్నది. ఇంతేకాదు అహమర్థము ఆత్మకాకపోయినట్లయితే ఆత్మకు ప్రత్యక్త్వము సిద్ధించదు (ప్రత్యక్త్వము అనగా స్వయంప్రకాశకత్వము) స్వస్మైభాసమానత్వం నేను అనబడే భావముతోనే (అహంకారము) ప్రత్యగర్థము, పరాగర్థము నుంచి వేరవుతున్నది. (పరస్మైప్రకాశమానత్వము పరాగర్థము అనబడును. ఘటము వంటివి. ఇవి తమంతతాముగా ప్రకాశించవు. ఇతరులచేత/ దీపాదులచేత ప్రకాశింపబడుతవి) మోక్షమును కోరేవాడు అన్ని దుఃఖాలనుండి దూరమవుతాను. అనంతమైన ఆనందాన్ని అనుభవిస్తాను. కర్మవశ్యుడను గాక స్వరాట్‌నై యుంటాను అని తలచి / కోరుకొని శ్రవణ మనన ని ధిధ్యాసాదుల యందు ప్రవర్తిస్తాడు. మోక్షము అనగా అహమర్థమైన నేను నశించి పోవుటే అని గనుక

గట్టిగా నమ్మితే మోక్షమును గురించి చెప్పే విషయాల జోలికే పోకుండా దూరంగా పారిపోతాడు. నేను లేకపోయినా నాకంటే వేరయిన జ్ఞానము అనేది ఏదో ఒకటి ఉంటుందిలే అనుకొని దాన్ని పొందడానికిగాను ఎవ్వడూ ప్రయత్నము చేయడు. ఈ జ్ఞానానికి ఆత్మతో సంబంధము ఉన్నపుడే సత్త / ఉనికి, మరియు స్వయంప్రకాశము కల్గుతవి. ఆ ఆత్మ సంబంధమే లేకపోతే జ్ఞానమే సిద్ధించదు. చీల్చబడే పదార్థము, ఛేదించేవాడు లేకపోయినపుడు ఛేదనము అనే క్రియ సిద్ధించని తీరుగానే ఇది కూడా ఔతుంది. అందువలన అహమర్థము జ్ఞాతయైన ప్రత్యగాత్మనే అని నిశ్చయించబడింది. వేదము "**విజ్ఞాత (విజ్ఞాతార మరేకేన విజానీయాత్) యైన వానిని దేన్నిబట్టి గుర్తించాలి?**" అని అంటున్నది. భోగానుభవసాధనమైన శరీరాన్ని / క్షేత్రాన్ని ఎవడు గుర్తిస్తున్నాడో వాడిని క్షేత్రజ్ఞుడని అంటున్నారు. సూత్రకారుడు ఐన వ్యాసమహర్షి కూడా "**నాత్మాశ్రుతేః**" అని మొదలు పెట్టి ఇదే విషయాన్ని చెప్పబోతున్నాడు. "**జ్ఞో౽ త ఏవ**" అనే సూత్రము ద్వారా "**కేవలము జ్ఞానమే ఆత్మకాదు**" అని సిద్ధాంతము చేయబడింది. అహంప్రత్యయము చేత సిద్ధమైన అంశము అస్మదర్థము. యుష్మత్ ప్రత్యయమునకు విషయమైనది యుష్మదర్థము. (అస్మదర్థము నేను, యుష్మదర్థము నీవు అని) అహంజానామి (నేను తెల్సుకొనుచున్నాను) అను వాక్యముతో సిద్ధమైనది జ్ఞాత (జ్ఞానము కలవాడు) దాన్ని యుష్మదర్థము అని చెప్పడము నా తల్లి గొడ్రాలు అని చెప్పినట్లు అర్థము లేని మాట. ఈ జ్ఞాతయైన నేను అనుకొనేవాడు అన్యాధీనమైన ప్రకాశము కల జడపదార్థముకాడు. స్వయంప్రకాశము కలవాడు. (అన్యాధీన ప్రకాశము జడపదార్థము) దీపము వలె దీపానికి మరో దీపమును పెట్టి ఇది దీపమని తెలుపవలసిన పనిలేదు. అదే కుండ వంటి జడపదార్థాలనైతే ఇది కుండ అని దీపమును పెట్టి రాత్రివేళలో, పగటి వేళలో సూర్యకాంతి ద్వారా తెలుపవలసియుంటుంది. స్వయం ప్రకాశతా అనగా చైతన్యస్వభావమును కల్గియుండుట. ఏది ప్రకాశించు స్వభావము కలదో అది ఇతరులపై ఆధారపడి ప్రకాశించదు. అనన్యాధీన ప్రకాశము కనుక దీపమువలె అనేది అనుమాన ప్రమాణము. వ్యాప్తి దీపాదులు తమదైన ప్రభాబలము చేతనే వెలుగొందుతున్నవి గనుక వాటికి 1) ప్రకాశములేకపోవుటలేదు 2) అన్యాధీన ప్రకాశములూ కావు. మరేమిటి వాటికున్న ధర్మము అంటే. దీపము స్వయంప్రకాశ స్వభావము కలది. తనంతతానుగానే వెలుగుతుంది. తనకంటే వేరయిన జడపదార్థాలనున్నూ తనకాంతితో ప్రకాశింప చేస్తుంది.

ఇచ్చట చెప్పబడుతున్న విషయమిది – ఒక్కటే ఐన తేజోద్రవ్యము ప్రభా, ప్రభ గలదిగాను ఉంటున్నది. ప్రభ అనేది ప్రభ కల ద్రవ్యానికి గుణములాగా దాన్ని వదలకుండా ఉంటున్నది. ఐనా అది తేజోద్రవ్యమే కాని తెలుపు ఎరుపునలుపుల వలె గుణము కాదు. ప్రభ అనేది తనకు ఆశ్రయమైన ప్రభావద్ ద్రవ్యానికి విడిగా వేరుచోట్లులోనూ ఉంటున్నది. అలాగే రూపాన్ని కూడా కల్గియుంటున్నది. అట్లే శౌక్ల్యాదులతో సామ్యము లేక వైధర్మ్యముతో నుంటున్నది. ప్రకాశాన్ని కల్గియున్నందున తేజోద్రవ్యమే కాని జడము వంటి మరొక పదార్థము కాదు. దీనికి ప్రకాశవత్త్వము సిద్ధించింది ఎలాగంటే తన రూపాన్ని, ఇతర పదార్థాల రూపాన్నీ వెల్లడించుట వల్ల. దీనికి వేరు పదార్థముగా కాకుండా గుణత్వము అనే వ్యవహరించుటకు కారణమేమనగా ఎల్లవేళలా తన ఆశ్రయమైన దాన్ని అంటిపెట్టుకొని యుండడము, దానికే శేషమై లొంగి ఉండడము అని రెండు ధర్మాల వల్ల. ప్రభా అనేది తన ఆశ్రయమునకు అవయవము కాదు అవయవాలుగా విడిపోయి దీపము యొక్క చుట్టుప్రక్కలా చెల్లాచెదురై వ్యాపించి ప్రభా అను పేరుతో వ్యవహరింప బడడం లేదు. అలాగైతే మణి, సూర్యుడి వంటి వాటికి వినాశము కలుగవలసి వస్తుంది. దీపము నందు కూడా అవయవి అనే ప్రతిపత్తి ఎప్పుడూ కలుగనే కలుగదు. విడిపోయే స్వభావము గల అవయవములతో కూడిన దీపాలు నాలుగు అంగుళముల వరకూ మాత్రము ముద్దగా ఉండి ఆ తర్వాత పైకెగసి అటు వెనుక ఒక్కసారిగా అడ్డంగా, నిలువుగా పైకి క్రిందికి ఒక్కతీరుగా చెదరిపోయి అన్ని వైపులా సంచారము చేస్తాయి అని కూడా చెప్పలేము. కనుక ప్రకాశవంతములైన దీపాలే క్షణక్షణమూ పుడుతూ నశిస్తున్నాయని – పుష్కలకారణములవల్ల పుడుతున్నాయి అవి నశించుటవల్ల తాము నశిస్తున్నాయని అర్థము ఔతున్నది. అనగా ఒక్కొక్క నూనె బిందువు వత్తి కొసకు చేరినపుడు జ్వాలగా వెలుగుతున్నది. నూనె బిందువు కాలిపోగానే దీపము నశిస్తున్నది. ప్రభ కూడా తనకు ఆశ్రయమైన దీపము చుట్టుప్రక్కల ఎక్కువ వెలుతురు ఉండడము, ఎక్కువ వేడిమిని కలిగి యుండడములను ఉపలబ్ధి వల్ల తెల్సుకోవాలి. అగ్నిమొదలైన వాటి వేడిలాగా. ఇదే తీరుగ ఆత్మ చిద్రూపమే. అలాగే చైతన్యము / జ్ఞానము అనే గుణము కలది. అని – చిద్రూ పత అంటే స్వయంప్రకాశము అనే గుణాన్ని కల్గియుండడము. ఆ విషయాన్ని వేదవాక్యాలు ఇలా విశదీకరిస్తున్నాయి. 1) ఉప్పురాయి వెలుపల, లోపల అనకుండా మొత్తంగా రసపు ముద్దగా ఎట్లాగా ఉంటుందో అలాగే ఈ ఆత్మ లోపలనే, వెలుపలనే అనకుండా మొత్తంగా ప్రజ్ఞానపుకణికయే. 2) విజ్ఞానపు గడ్డయే 3) ఈ పురుషుడు

జ్యోతిస్సువలె తనకు తానే వెలుగుతుంటాడు. 4) విజ్ఞాన స్వరూపుడైన ఈ ఆత్మకు విజ్ఞానములో ఏ మాత్రము కొరత లేదు. 5) ఇక ఎవడైతే వాసనను గుర్తిస్తున్నాడో వాడే ఆత్మ / వాసనను పీల్చాలనుకుంటున్నాడో వాడు ఆత్మ. 6) ఆత్మ అనగా ఎవడు? ఎవడైతే విజ్ఞానమయుడుఐ ప్రాణాలు ఇంద్రియాలయందు మనస్సులో హృదయంలో ప్రకాశ స్వరూపుడై వెలుగుతున్నాడో వాడు. 7) ఈ విజ్ఞాన స్వరూపుడైన పురుషుడే ద్రష్ట, శ్రోత. రుచులననుభవించే వాడు. పరిమళాలను పీల్చేవాడు. మననము చేసేవాడు. ఇతరులకు బోధించేవాడు, కర్త పనులను చేసేవాడు. 8) విజ్ఞానము కలవాడిని దేనితో తెల్సుకోవాలి? 9) ఈ పురుషుడు అన్నీ తెల్సుకుంటున్నాడు. తెలియును కూడా. 9) జ్ఞానము గల ఇతడు మరణము నొందడు. రోగమును అందువల్ల దుఃఖములనున్నూ అనుభవించడు. 10) వాడు ఉత్తముడగు పురుషుడు. 11) ఈ శరీరాన్ని గాని, దాని చుట్టూ మూగియున్న జనాన్ని గానీ తలుచుకోకుండా 12) ఇలాగే బాగా తెల్సినవాడికి పురుషుడి యందుండే పదహారు కళలున్నూ పురుషుడిని చేరి నశించి పోతాయి. 13) ఈ మనోమయుడైన వానికంటే వేరైనవాడు దేహము నందున్న విజ్ఞానమయుడైన ఆత్మ మున్నగునవి. వ్యాసమహర్షి కూడా బ్రహ్మసూత్రాలలోనే మునుముందు చెపుతాడు. **జ్ఞోఽ త ఏవ.** ఈ కారణంగానే ఆత్మ జ్ఞానము కలవాడు అని తెలుసుకోవాలి అని.

కావున స్వయంప్రకాశుడైన ఈ ఆత్మ జ్ఞాతనే. కాని కేవల ప్రకాశము కాదు. ప్రకాశ స్వరూపము ఐనందువల్లనే ఎవ్వనికైనా జ్ఞానప్రకాశము కాగలదు. దీపాదుల యొక్క ప్రకాశము లాగా. కాబట్టి జ్ఞానము ఆత్మకావడానికి అర్హతను కల్గిలేదు. ఇంకనూ సంవిత్, అనుభూతి, జ్ఞానము వంటి శబ్దాలన్నీ ఒక వస్తువు / వ్యక్తితో సంబంధము కల, సంబంధమును తెలియచేసే పదాలే అని శబ్దార్థ సంబంధము తెల్సినవైయాకరణులు, పెద్దలు చెపుతున్నారు. లోకములోనైనా, వేదరాశిలోనైనా **"జానాతి"** వంటి పదాలకు అకర్మక అకర్తృక ప్రయోగాలు కనపడలేదు.

జడము కానందువలన సంవిత్తే / జ్ఞానమే ఆత్మ అని గదా మీరు చెప్పినారు. అచట అడగవలసినది ఒకటి ఉన్నది. అజడత్వమని దేన్ని ఉద్దేశించినారు అని **స్వసత్తాప్రయుక్తప్రకాశత్వం అజడత్వం తన ఉనికి వలన ప్రకాశత్వం** అని, గనక మీ సమాధానమైతే దీపాదులు కూడా అలాంటివే కనుక వాటియందు మీ లక్షణము అతి వ్యాప్తము ఔతుంది. అందువలన అనైకాన్త్యము అనే దోషము వస్తుంది. సంవిత్తుకంటే

వేరుగా ప్రకాశాన్ని ధర్మముగా అంగీకరించక పోతే మీ లక్ష్యము సిద్ధించదు. పైగా వైరుధ్యము ఏర్పడుతుంది. **"అవ్యభిచరిత ప్రకాశసత్తాకత్వము అజడత్వము"** అని చెపితే సుఖాదులలో వ్యభిచారము వస్తుంది. దాన్ని ఇంతకు ముందే త్రోసివేసినాము. ఒకవేళ సుఖాదులు అవ్యభిచరిత ప్రకాశములే ఐనా తమ కొరకు తాముగాకుండా ఇతరులకు ప్రకాశించుతున్నాయి గనుక ఘటాదుల వలె జడములు అవుతాయి కనుక అనాత్మలే అవి అని అనవచ్చు. ఐతే జ్ఞానము తన కొరకే ప్రకాశిస్తుందా? ప్రకాశించదు. అది కూడా తనకంటే వేరయిన అహమర్థమునకే జ్ఞాతకే ప్రకాశిస్తుంది. నేను సుఖముగానున్నాను అన్నట్లే "**అహంజానామి**" నేను తెలుసుకుంటున్నాను / నాకు తెల్సును అని. కాబట్టి **స్వస్మై ప్రకాశమానత్వ రూపమైన అజడత్వము** జ్ఞానము నందు సిద్ధించదు. అందుకని "**తనను గురించి తనసత్తవల్లనే సిద్ధించే జడము కాని** (పరాయత్త ప్రకాశము కాని) **అహమర్థమే ఆత్మ**" జ్ఞానమునకున్న ప్రకాశము కూడా ఆత్మసంబంధము వల్ల ఏర్పడిందే. ఆత్మసంబంధము వల్లనే జ్ఞానము కూడా సుఖాదుల లాగా తనకు ఆశ్రయమైన చేతనుడికి ప్రకటము / వెల్లడి అవుతుంది. ఇతరులకు వెల్లడికాదు. అందుచేత **కేవలము జ్ఞానమే ఆత్మకాదు. జ్ఞాతయైన అహమర్థమే ఆత్మ**?

ఇక అనుభూతి పరమార్థంగా నిర్విషయము నిరాశ్రయము ఔతూ భ్రమవల్ల జ్ఞాతగా ప్రకాశిస్తున్నది. అధిష్ఠానము లేకుండా భ్రమ కలుగడానికి అవకాశము లేదు. పొసగదు గనుక ఏదో ఒక అధిష్ఠానము ఉండాలి. అందుకే ముత్యపు చిప్ప అనే అధిష్ఠానము పైన వెండి కణిక అనే భ్రమ పొసగినట్లు అహమర్థము జ్ఞానముపైన జ్ఞాత అనే భ్రమను పొందుతున్నది అని అన్నమాట గురించి అది సరికాదు. నీవన్నట్లే ఐతే అనుభవముతో నున్న సామానాధికరణ్యము వలన అనుభవించేవాడుగా అహమర్థము గుర్తింపబడాలి. నేను అనుభూతిని అని. ఎదురుగానున్న ప్రకాశవంతమైన ద్రవ్యాకారాన్ని కలిగినందువల్ల వెండి లాగా నేను శక్తిని అని. కాని ఇచ్చట వేరుగా ప్రకాశిస్తున్న ఈ జ్ఞానము అర్థాంతరమైన అహమర్థాన్ని దేవదత్తుడికి దండము విశేషణము ఐనట్లు విశేషణమై ప్రకటిస్తున్నది. అది ఇలాగా! "**అనుభవామి అహమ్**" – నేను అనుభవిస్తున్నాను అని లోకప్రతీతి. నేను అనబడేవాడికి అనుభవము అనేది అనుభవము కలవాడు అని విశేషణంగా ప్రకటిస్తున్నది. అలాగా! అందువల్ల ఈ తీరుగ అస్మదర్థమును (నేను) అనుభూతితో కూడినదిగా /విశిష్టమైనదిగా ప్రకాశింపచేస్తూ **అనుభవామి అహం** అను ప్రత్యయము దండమును మాత్రమే కలిగియున్న

దేవదత్తుడిని **దండీదేవదత్తః** అని ప్రత్యయమువలె విశేషణమైన అనుభూతిని మాత్రమే ఆలంబనముగా చేసుకొని జ్ఞానమే ఆత్మ అని ప్రతిజ్ఞ నెలా చేస్తారు? ఇంకొకటి కూడా మీరు చెప్పారు. స్థూలోఽ హం (నేను దొడ్డుగా నున్నాను) ఇత్యాదిగా దేహమునే తననుగా భావించేవాడికే జ్ఞాతృత్వము ప్రతిభాసిస్తున్నట్లు జ్ఞాతృత్వము కూడా మిథ్యనే అని. అది తగదు. అలాగే ఐనపుడు ఆత్మగా మీరంగీకరించే అనుభూతి కూడా మిథ్యనే కావలసివస్తుంది. ఆత్మ కలవాడికే దేహమే నేను అనే భ్రాంతి కల్గుతున్నట్లు అనుభూతి కలవాడిని నేను అనే ప్రతీతి కలిగితే దేహము ఆత్మకాదు అని అన్నట్లు అనుభూతి ఆత్మ కాదు మిథ్య అని అనవలసి వస్తుంది. తనకంటే వేరయిన అన్నింటినీ అణచి వేసేటువంటి తత్వజ్ఞానము చేత అబాధితమైనది కనుక అనుభూతికి మిథ్యాత్వము లేదు అంటావా। అయ్యా అలాగే ఐతే ఆతత్వజ్ఞానము చేతనే బాధింపబడలేదు కాబట్టి జ్ఞాతృత్వము కూడా మిథ్య కాదు.

ఇంకొక మాట కూడా చెప్పారు. వికారము లేని ఆత్మకు జ్ఞానక్రియకు కర్తృత్వరూపమైన (తెలుసుకోవడం) జ్ఞాతృత్వము అనేది సంభవించదు. అందువలన జ్ఞాతృత్వము అనేది సంభవించదు. అందువలన జ్ఞాతృత్వమనేది వికార స్వభావము కలది. అది జడము. కనుక వికారాలకు నెలవై అవ్యక్తము యొక్క పరిణామరూపమైన అహంకారమనే గ్రంధి యందుండేది. కనుక జ్ఞాతృత్వము ఆత్మకు చెందదు. అన్తఃకరణరూపమైన (మనస్సు) అహంకారానికే దక్కుతుంది. కర్తృత్వాదులు ద్రవ్యము యొక్క రూపాదులవలె కనుపించే ధర్మము. కర్తృత్వము అహంప్రత్యయగోచరత్వమున్నూ ఆత్మకు ఒప్పుకునేట్లయితే శరీరానికి వలెనే అనాత్మత్వము, పరాక్త్వము, జడత్వము వంటివి వచ్చిపడతాయి అని.

ఈ మాటా పొసగదు. అన్తఃకరణ రూపమైన అహంకారానికి దేహానికి ఉన్నట్లే అచేతనత్వము,ప్రకృతి వలె పరిణామిత్వము (మార్పులను పొందడము) – దృశ్యత్వము పరాక్త్వము పరార్థత్వములు ఉన్నాయి. జ్ఞాతృత్వము చేతనాసాధారణ ధర్మము. ఇచట చెప్పబడుతున్న అంశమిది. దేహాదులు ఎలాగైతే దృశ్యత్వము, పరాక్త్వము మున్నగు కారణాల వలన దానికి వ్యతిరేకములైన ద్రష్టృత్వము ప్రత్యక్త్వము మున్నగు వానితో విభేదిస్తున్నాయో అదే తీరుగా అన్తఃకరణ రూపమైన అహంకారము గూడ జడపదార్థము ఐనందున ముందుచెప్పిన కారణాల మూలంగా ఆత్మతో విభేదిస్తున్నది అని. అందువల్ల సహజమైన విరోధమున్నందున అహంకారానికి జ్ఞాతృత్వములేదు.

దృశిత్వములాగా. దృశిత్వము దానిక్రియను అహంకారాన్ని ఎలా అంగీకరించడం లేదో అలాగే జ్ఞాతృత్వము. అందువల్ల జరిగే క్రియలనున్నూ అంగీకరించగూడదు. మరియు జ్ఞాతృత్వము అనేది వికారాత్మకమైనది కాదు. జ్ఞాతృత్వమంటే జ్ఞానమనే గుణానికి ఆశ్రయమై ఉండడము. జ్ఞానము కూడా నిత్యమైన ఆత్మకు సహజమైన ధర్మము కాబట్టి నిత్యమే. సూత్రకారుడు ఇదే విషయాన్ని **నాత్మాశ్రుతేః** అనే సూత్రము వద్ద పలుసూత్రాల ద్వారా చెప్పనున్నాడు. **జ్ఞోఽ తఏవ** అను సూత్రము వద్ద “**జ్ఞః**” అని నిర్దేశిస్తూ ఆత్మకు జ్ఞానాశ్రయత్వము స్వాభావికమైన గుణమని వివరించనున్నాడు. జ్ఞానస్వరూపుడైన ఆత్మకు, మణి, ద్యుమణి సూర్యుడు ఆదులకు ప్రభాఆశ్రయత్వము వలె జ్ఞానాశ్రయత్వమగుట విరుద్ధమేమీ కాదని చెప్పబడింది. జ్ఞానం స్వయంగా దేనిచేత కూడా పరిచ్ఛిన్నము కాకుండా ఉంటూ సంకోచవికాసములను పొందుటకు తగియున్నదని ముందు మేము వివరించగలము. ఇందువల్ల ఆత్మక్షేత్రజ్ఞుడుగా ఉంటున్నపుడు తాను చేసుకున్న కర్మ వలన సంకుచిత జ్ఞానస్వరూపాన్ని ఆయా కర్మలకనుగుణంగా దానిలో ఎక్కువ తక్కువలనున్నూ అనుభవించుతాడు. అది కూడా ఇంద్రియాల ద్వారా కట్టుదిట్టము చేయబడుతుంది. ఇలాగా ఇంద్రియాల ద్వారా జ్ఞానప్రసారాన్ని బట్టి జ్ఞానము కలుగడం, నశించడము అనే వ్యవహారాలు జరుగుతాయి. జ్ఞానప్రసారము నందు ఆత్మకు కర్తృత్వము ఉన్నది. ఆ కర్తృత్వము స్వాభావికము కాదు. కాని కర్మకారణముగా జరిగేది. కావున ఆత్మవికారమును పొందదు. అవికార స్వరూపమే ఆత్మ. ఈవిధమైన వికారము, జ్ఞాతృత్వములు జ్ఞాన స్వరూపమైన ఆత్మకే కాని జడము ఐన అహంకారానికి ఎప్పుడూ కూడా జ్ఞాతృత్వము అనేది సంభవించదు. అహంకారము జడస్వరూపమే ఐన చిత్తుకు దగ్గరలో ఉన్నది కాబట్టి దాని నీడ సోకి ఛాయాపత్తి – జ్ఞాతృత్వము ఏర్పడుతుంది అనేటట్లయితే చిత్ ఛాయా అనే కొత్తపదము వినిపిస్తున్నది. చిచ్ఛాయ అంటే ఏమిటో కాస్త వివరిస్తారా? సంవిత్తుకు అహంకారచ్ఛాయా పత్తియా! లేక అహంకారానికి సంవిత్ ఛాయాపత్తియా? అహంకారానికి సంవిత్ ఛాయా పత్తికాదు. సంవిత్తుకు జ్ఞాతృత్వాన్ని మీరు అంగీకరించలేదు. అహంకారానికి సంవిత్ ఛాయాపత్తి కూడా కాదు. జడమైన అహంకారానికి జ్ఞాతృత్వమును ఒప్పుకోలేదు. కాబట్టి ఇంతకుముందు చెప్పుకున్నట్లు జడమైన దానికి జ్ఞాతృత్వము పొసగదు కూడా! అహంకారము, జ్ఞానము ఇవి చక్షురింద్రియానికి కనబడవు. అచాక్షుషపదార్థాలకు ఛాయ అంటూ ఎక్కడా కనపడలేదు. కనుక ఛాయనే లేకపోయినందున ఛాయాపత్తి అనడము ఎంత

మాత్రం తగదు. పోనీ నిప్పుతో చేరిక వల్ల ఉష్ణము వచ్చినట్లు చిత్తుతో సంపర్కము వలన అహంకారానికి జ్ఞాతృత్వము సిద్ధిస్తుంది అనవచ్చును. అది కూడా సరియైనది కాదు. మీరు సంవిత్తునందే జ్ఞాతృత్వాన్ని ఒప్పుకున్నారు కాదు. సంవిత్తుకే లేని ధర్మము / గుణము దానితో కలసి యన్నందువల్ల జడమైన అహంకారానికి జ్ఞాతృత్వమురాదు. అది అహంకారములో లభించడమూ లేదు. అహంకారము చైతన్యము లేనిది. కనుక జ్ఞాతృత్వము దానిలో పొసిగేది కానందున అహంకారము యొక్క సంపర్కముతో జ్ఞానమునందు జ్ఞాతృత్వమూ లేదు. దాని లాభమూ బొత్తిగా కుదరదు.

ఆత్మలోను, అహంకారములోనూ జ్ఞాతృత్వమనే ధర్మము నిజానికి లేదు. ఐతే అహంకారము అనుభూతిని వెల్లడించేది వ్యంజకము కావున తనలో నున్న అనుభూతిని వ్యక్తీకరిస్తుంది. అద్దము లాగా అని మీరు చెప్పినారు. అది కూడా సరియైనది కాదు. ఆత్మస్వయంప్రకాశకము. అది పరాయత్త ప్రకాశము, జడము ఐన అహంకారము చేత వెల్లడింపబడుతుంది అనడము ఎంతమాత్రము పొసగదు. అందుకే పెద్దలు అన్నారు – చల్లారిన బొగ్గులా ఉన్న సూర్యుడిని వలె జడాత్మకమైన అహంకారము స్వయం జ్యోతియైన ఆత్మను ప్రకాశింప చేస్తుందన్నమాట యుక్తియుక్తము కాదు అని. లోకములోని పదార్థాలన్నీ స్వయంప్రకాశములైన వాటి ద్వారా అనుభవములోకి వస్తున్నాయి. అలాగా స్వయంప్రకాశమైన చిత్తుచేత వెల్లడింపబడే అచిత్తు ఐన అహంకారము చేత క్రొత్తగా కలుగడము లేక ఉన్నది నశించడము అనేది లేనిదైన, స్వరూప ప్రకాశము కల, సర్వవిధప్రయోజనాలు నెరవేరడానికి కారణము ఐన అనుభూతిని వెల్లడిస్తుంది అనే మీ మాటను విని ఆత్మజ్ఞానము కల పెద్దలు నవ్వుతున్నారు సుమా! ఇంతే కాదు. అహంకారము నకు, అనుభూతికి ఉన్న స్వభావ విరోధము వల్లనే అహంకారము వల్ల ప్రకటింపబడిన కారణంగా అనుభూతికి అననుభూతిత్వము దాపురించే ప్రమాదమున్నది. కనుక అహంకారానికి, అనుభవానికి వ్యంక్తృ, వ్యంగ్యభావము లేదు. పెద్దలమాట కూడా ఇలాగే ఉన్నది. "**అహంకారానికి అనుభూతికి పరస్పర విరోధమున్నది కాబట్టి పరస్పరము వ్యంక్తృత్వము, వ్యంగ్యత్వము సంభవించవు. ఆత్మ అహంకారము చేత వెల్లడింపబడితే దానికి అననుభూతిత్వము వస్తుంది. ఘటానికి వలె**" అని సూర్యకిరణాల సముదాయము తమచేత వెల్లడింపబడే అరచేతితో వ్యంగ్యము చేయబడినట్లు సంవిత్తు చేత అభివ్యంగ్యమైన అహంకారము ద్వారా సంవిత్తు వెల్లడింపబడుతుందని అనడం సాధువు కాదు. వాస్తవానికి ఆ

వృత్తాంతములోనూ సూర్యకిరణ సముదాయాలు అరచేతితో అభివ్యంగ్యము చేయబడడం లేదు. అరచేతితో అడ్డుకోబడినవైన సూర్యకాంతులు పుష్కలంగా ఒక్క దగ్గరే నిల్చిపోయి తామే తేటగా కనిపిస్తున్నాయి. అక్కడ అరచేయి సూర్యకిరణాలు ముందుకు సాగిపోలేక ఒక్కచోట గుమిగూడేటట్లు అడ్డుకున్నదే తప్ప తాను వాటిని ప్రకాశింపచేయలేదు. ఇది వాస్తవము. అందువల్ల అరచేతికి అభివ్యంజకత్వము లేదు. మరియు సంవిత్ రూపమైన ఆత్మకు అహంకారము చేత నిర్వర్తింప దగిన అభివ్యక్తి / వెల్లడింపు ఎలాంటిది? కొత్తగా ఉత్పత్తి కల్గించడమూ కాదు. సంవిత్తు స్వతస్సిద్ధమైనది కనుక మరొకదానిచేత పుట్టింపబడదు అని అంగీకరింపబడ్డది కాబట్టి. పోనీ ప్రకాశమా! అంటే అది కూడా కాదు. ఇతర అనుభవాల (జ్ఞాన) ద్వారా అనుభవింపబడేది కానందువల్ల ఆ కారణంగానే అనుభూతిని అనుభవించడానికి సాధనము లేదనుట. సాధనాలు రెండు రకాలుగా ఉంటాయి 1) ఇంద్రియసంబంధము ద్వారా జ్ఞేయమును తెల్సుకోగల్గడము. ఎలాగంటే జాతిని, తన ముఖము వంటి వాటిని తెల్సుకోవడంలో వ్యక్తికి దర్పణాదులకు నడుమ కన్ను మున్నగు ఇంద్రియాలకు సంబంధాన్ని కలిగించడం ద్వారా 2) బోధించే వస్తువులోని కల్మషాన్ని తొలగించడము ద్వారా ఎలాగంటే పరతత్వాన్ని ఎరుకపరిచే సాధనమైన శాస్త్రాన్ని తెల్సుకోడానికి శమ దమాదుల వల్ల కాబట్టే ఇలా చెప్పినారు. "**కరణములకు ఇంద్రియాలకు అందనిది ఐనందున ఆత్మతో సంబంధమునకు అవి కారణాలు కావు**" అని కన్ను ఎదురుగా నున్న వస్తువునే చూపించుతుంది. మధ్యలో ఏది అడ్డమైనా దూరంగా ఉన్నా ఆ వస్తువును చూపలేదు.

ఇంకనూ అనుభూతి అనుభవింపబడుతుంది అని అంగీకరించినా అహమర్థమైన అంతఃకరణము అనుభవించడానికి సాధనము ఔతుందని అంత తేలికగా చెప్పలేము. సాధనమనేది అనుభవించదగిన అనుభవానికి ఉత్పత్తి నిరోధకాన్ని తొలగించగల్గేదిగా ఉండాలి. పుట్టకుండా అడ్డుకొనేదాన్ని ప్రక్కకు త్రోసివేసేది కావాలి. ఎలాగంటే కన్ను వస్తువులయొక్క స్వరూపాన్ని గమనించకుండా, జ్ఞానోత్పత్తి కలగకుండా అడ్డుగా నిలిచిన చీకటిని దూరము చేసి దీపము ఆయా వస్తువులను తెల్సుకోగలిగేలా చేస్తుంది. ప్రస్తుతము అనుభూతిని అనుభవించడానికి మధ్యలో చీకటిలాగా అడ్డునిలిచే దాన్ని దూరము చేయదగినది ఏదీ కనుపించడం లేదు. సంవిత్తులోనే దాగియుండి, దానికి జ్ఞానము పుట్టకుండా నిరోధించేది అయ్యి అహంకారము చేత తొలగింపబడేది ఏదీ

కొంచెమైనా లేదు. అజ్ఞానమున్నది గదా అనవచ్చును. కాని అహంకారము చేత అజ్ఞానము దూరము చేయబడదు. అట్లాగని ఎవరూ అంగీకరించలేదు. అజ్ఞానాన్ని తొలగించేది జ్ఞానమేకదా! అజ్ఞానము సంవిత్తును ఆశ్రయించి ఉండదు. సహజంగానే విరోధియైన జ్ఞానముతో కలసి ఒకేదాన్ని ఆశ్రయించవలసి యుండడము, రెండూ ఒకే అంశానికి సంబంధించినవై ఉండడము, అంతేకాకుండా జ్ఞాతృభావము, విషయభావము రెండూ లేని, సాక్షియైన కేవలము వట్టి జ్ఞానము నందు అజ్ఞానము ఉండలేదు. ఎలాగంటే జ్ఞానమునకు ఆశ్రయము కాని, ఆ ప్రసక్తే లేని ఘటపటాదులకు అజ్ఞానాశ్రయత్వము వలె, అదే తీరున కేవల జ్ఞానమునందున్నూ జ్ఞానాశ్రయత్వము లేదు కాబట్టి అజ్ఞానాశ్రయత్వమున్ను లేదు. సంవిత్తు అజ్ఞానమునకు ఆశ్రయము ఔతుందని ఒప్పుకున్నప్పటికీ జ్ఞానాన్నే ఆత్మగా భావిస్తున్నాము కాబట్టి అది జ్ఞానవిషయము కాదు గనుక దానిలోని అజ్ఞానము జ్ఞానము ద్వారా తొలగిపోదు. జ్ఞానమనేది ఏ విషయానికి సంబంధించిందో దానికి చెందిన అజ్ఞానాన్నే పోగొడుతుంది. రజ్జువు మీద ఏర్పడిన పాము అనే భ్రాన్తి రూపమైన అజ్ఞానాన్ని యథార్థమైన రజ్జు జ్ఞానమే తొలగిస్తుంది కాని మరో వస్తువునకు చెందిన జ్ఞానము కాదు. అందుచేత ఏ సాధనముతోనైనా ఏ కాలములోనైనా సంవిత్తును ఆశ్రయించియున్న అజ్ఞానాన్ని తొలగించడం సాధ్యంకాదు. సత్తు అని కాని అసత్తు అని కానీ చెప్పరానిదైన ఈ అజ్ఞానము యొక్క స్వరూపమే నిరూపించబడజాలదు అని మునుముందు నిరూపిస్తాము. అజ్ఞానము జ్ఞానము పుట్టడానికి ముందుండే ప్రాగభావరూపము అని నిర్వచించితే కుదరదు. అజ్ఞానము జ్ఞానోత్పత్తికి విరోధికాదు గనుక దాన్ని నిరసించినందువల్ల జ్ఞానము కలుగడానికి అది హేతువు కాబోదు. అందుచేత ఏ ప్రకారంగా కూడా అహంకారము చేత అనుభూతి వ్యక్తీకరింపబడదు.

తమను ఆశ్రయించియున్నందున అభివ్యంగ్యము చేయదగిన వస్తువులను వెల్లడి చేయడము అభివ్యంజకములకు స్వభావము కాదు. ప్రదీపాదులలో ఆ లక్షణము కనబడడంలేదు. దీపాదులు తమలో లేని, తమకు బయట ఉన్న వస్తువులను తెలియపరుస్తున్నవి. పదార్థము యొక్క స్థితిని ఉన్నదున్నట్లుగా తెలియజేయడమే జ్ఞానము, సాధనములకున్నూ, వాటికి సహకరించే వాటికిన్నీ ఉన్న స్వభావము. అది కూడా ఇంకొక ప్రమాణముచేత సమర్థింపబడిన స్వతః ప్రమాణములైన న్యాయములచేత సిద్ధమైన అంశము. దర్పణాదులు తమలోనున్న ముఖము మున్నగువాటిని వెల్లడి

చేయడంలేదు. పైగా కంటి సంబంధమైన కాంతిని ప్రతిఫలింపచేయడమనే దోషానికి కారణమవుతున్నవి. ఆ కారణంగానే అందులో కుడిఎడమలు మారి మరొక తీరుగా కనిపించడం జరుగుతున్నది. ఐతే అభివ్యంజకములు మాత్రము చూపువంటివే. ప్రస్తుతము స్వయంప్రకాశకమైన సంవిత్తునందు దర్పణాదుల వలె అహంకారమున్నూ ప్రతిఫలనరూపమైన దోషాన్ని ఆపాదించజాలదు. లోకంలో ఒక వ్యక్తికి ప్రతీతి జాతి ఆకారములకారణంగా జరుగుతున్నది. అవి అతడిని ఆశ్రయించి ఉంటవి. కాని అవి వ్యక్తిని తెలియబరచవు. అట్లే అన్తః కరణమనే (మనస్స) అహం తనలో ఉండడము ద్వారా సంవిత్తు లభించడానికి యథార్థంగాగాని దోషము కారణంగానైనా అంతః కరణము కారణము కాదు. కావున అహంకారానికి జ్ఞాతృత్వము లేదు. అలాగా ఎక్కడ కనబడడమూలేదు. అందుచేత సహజంగానే జ్ఞాతృత్వమును కలిగియున్న అహమర్థమే ప్రత్యగాత్మ. కాని కేవలము వట్టి జ్ఞానము కాదు. అహంభావము (నేను అని అనుకోవడము) లేకపోయినపుడు జ్ఞానానికి కూడ ప్రత్యక్త్వము (తన కొరకు తాను ప్రకాశించడము – స్వస్మై ప్రకాశమానము) సిద్ధించదు అని మునుపే చెప్పినాము.

తమోగుణము బాగా కప్పివేయడము వలన, పరాగర్థానుభవము – ఇతరులు కొరకు ప్రకాశించడము – ఆయా వస్తువులను తెల్యపరచడము – లేకపోవడము వల్లనూ అహమర్థము విడిగా తేటగా ప్రతిభాసించడము లేకపోయినప్పటికిన్నీ నిదురబోయిన వాడు మెలకువపొందేవరకు నేను అని ఒకే ఆకారముతో స్ఫురిస్తున్నందువల్లనున్నూ గాఢ నిద్రాదశలోనూ అహంభావము ప్రక్కకు తొలగిపోవడంలేదు. నీవు ఇష్టపడిన అనుభూతికిన్నీ అలాగే ప్రసిద్ధి ఉంటుంది అని చెప్పవలసియున్నది. గాఢ నిద్రపోయిలేచినవాడు అహంభావము లేని అర్థాంతరమునకు ప్రత్యనీక ఆకారమైన జ్ఞానము కలవాడై నేను అజ్ఞానమునకు సాక్షిగా ఉండినాను అనే నిదురబోయిన కాలములోని అనుభూతిని పరామర్శిస్తాడు. (అనగా మైమరచి నిద్రించినందువల్ల పండుకున్నది మొదలు మెలకువ పొందేవరకు ఉన్నకాలములో బాహ్య ప్రపంచములోనే కాక తన నిద్రాలోకంలో ఏమి జరిగిందో నాకేమీ తెల్యదు అని అంటాడు) అపుడు అతడు నిద్రలో జరిగింది ఏదైనా తెలిస్తే జ్ఞానసాక్షి. ఏమీ తెల్యకపోతే అజ్ఞాన సాక్షి ఔతాడు. ఐతే ఇది కూడా ఒక అనుభూతియే.

సుప్తోత్థితుడైన వాని పరామర్శ ఇలా ఉంటుంది. నేను సుఖముగా నిదుర పోయినాను అని. ఈ విధమైన ప్రత్యవమర్శవల్ల సుఖంగా నిద్రించినకాలములోనూ

అహమర్థమైన ఆత్మకు సుఖిత్వము, జ్ఞాతృత్వమూ ఉన్నట్లు తెలుస్తున్నది. ఇపుడెలాగైతే సుఖంగా హాయిగా ఉన్నదో అపుడు అలాగే హాయిగా నిద్రించినాను అని గుర్తిస్తున్నాడు. అలా ప్రతిపత్తి కల్గుతున్నది అని అంటున్నాడని మీరనవద్దు. ఈ ప్రతిపత్తి మీరు చెప్పినట్టిది కాదు. అహమర్థమైన ఆత్మ అస్థిరమైనది. కనుక అపుడు అహమర్థానికి సుఖిత్వమును గురించి అనుసంధానము లేదని అనుపపత్తి చెప్పరాదు. ఎందుకంటే సుషుప్తి దశ కంటే ముందు అనుభవించిన వస్తువులను గురించి లేచిన తరువాత నేను ఈ పని చేసినాను. నేను దీన్ని అనుభవించినాను, నేను ఈ మాట పలికినాను అని పరామర్శచేస్తున్నాడు. ఈ మధ్యకాలములో జరిగినదేమిటో ఎరుగను అని నిద్రాకాలాన్ని గురించి చెపుతున్నాడు. బొత్తిగా ఎరుగను అని చెపుతున్నందున మొత్తంగా ప్రతిషేధమే అని అనకూడదు. నేను ఎరుగను అని అన్నపుడు నేను అను పదంతో వేత్తయైన అహమర్థము అనువృత్తి – (నిద్రాదశలోను కొనసాగుతుండడము) ఔతున్నందున విషయానికి సంబంధించిన ప్రతిషేధమే కాని ఆత్మను గురించికాదు. "**నకించిత్**" అనే పదానికి మొత్తానికే అని అర్థము ఐనట్లయితే మీరు అంగీకరించిన అనుభూతి (ఆత్మ) కూడా నిషేధింపబడినట్లవుతుంది (జ్ఞానము) ఆత్మ లేకపోతే దాని నిత్యత్వానికి భంగము వస్తుంది)

సుషుప్తి సమయమందు అనుసంధింపబడుతున్న అహమర్థము ఐన ఆత్మను జ్ఞాతను నేను అని పరామర్శించి "**నకించిదవేదిషం**" (ఏ మాత్రము ఎరుగకుంటిని) అని జ్ఞానమును ప్రతిషేధించుచున్నాడు, కాగా తమరు నిద్రాకాలములో నిషేధింపబడుతున్న జ్ఞానాన్ని ఉన్నట్టుగాను అనువర్తమానమైన జ్ఞాతయైన అహమర్థమును అసిద్ధించుచున్నది లేదు అని **నకించిదహమవేదిషం** అనే పరామర్శ వాక్యముతో సాధిస్తున్నారు. దీన్ని ఉత్సవమూర్తులముందు చెప్పండి. ఆ దేవతలు మిమ్ములిని కాదనలేరు గదా! నన్ను నేను కూడా ఎరుగకుంటిని (మా మప్యహంన జ్ఞాతవాన్) అన్న మాటతో అహమర్థమైన ఆత్మను గురించి అననుసంధానము కనిపిస్తున్నది కదా! అనవచ్చు. కాని మీరు స్వానుభవము, స్వవచనములకున్న విరోధమును కూడా తెల్సుకోలేకుండా ఉన్నారు. అహం మాంన జ్ఞాతవాన్ (నేను నన్ను ఎరుగకుంటిని) అని గదా అనుభవవాక్కులు. ఐనచో మామ్ (నన్ను) అనుపదముతో నిషేధింపబడేది ఏమిటి? అని ప్రశ్నిస్తున్నారా! బాగా అడిగినారు చెపుతున్నారు వినండి. అహమర్థమైన జ్ఞాతయొక్క అనువృత్తి స్వరూపము నిషేధింపబడడంలేదు. కాని నిద్రపోయి లేచిన

పిదప అనుసంధానము చేయబడుచున్న అహమర్థము యొక్క వర్ణ ఆశ్రమాదులతో కూడియుండుటను నేను నన్ను ఎరుగకుంటిని అని పలికినపుడు విషయమేమిటి? అని ఆలోచించాలి. మెలకువతోనున్నపుడు జాత్యాదులతో కూడియున్న అస్మదర్థమే మామ్ అనే పదానికి విషయము. గాఢనిద్రావస్థలో లోకప్రసిద్ధిలేని విశదము కాని స్వానుభవముతో కూడిన అహమర్థము అహమను పదానికి విషయము. ఇక్కడ పండుకున్న నేను "**ఇలాంటి వాడిని నేను**" అని కూడా నన్ను ఎరుగకుంటిని అనియేకదా అనుభవపుతీరు. ఇంకా గాఢనిద్రయందు ఆత్మ అజ్ఞానమునకు సాక్షిగా ఉంటుంది అని కదా మీ ఆలోచనా విధానముంటున్నది. సాక్షిత్వమంటే ఆయా సందర్భాలలో ఎట్టఎదుటగా కండ్లారా చూడడమే. చూసి ఎరుగని వానికి సాక్షిత్వము ఉండదు. చూచినవాడే లోకములో, వేదములోనైనా సాక్షి అని పిలువబడుచున్నాడు. వట్టి జ్ఞానమును కాదు. భగవానుడగు పాణినియున్నూ తన వ్యాకరణ సూత్రాలలో **సాక్షాత్ ద్రష్టరి సంజ్ఞాయాం** అని చెప్పినాడు. కావున **జ్ఞాతయందే సాక్షి శబ్దము ప్రయోగింపబడుతున్నది. అలాంటి సాక్షియైన వాడు జానామి – ఎరుగుదును / తెల్సుకొనుచున్నాను – అని గుర్తింపబడుచున్న అస్మదర్థమే కనుక అహమర్థము అపుడు ప్రతీయ మానము కాకుండా ఎట్లా ఉంటుంది?** తనకు స్వయంగా అవభాసమానమవుతున్నవాడు. అహమ్ (నేను) అనియే ప్రకాశమానమవుతున్నాడు. కావున స్వాపాది అవస్థలలోనూ ఆత్మ ప్రకాశమానమవుతూ నేను అనియే ప్రకాశిస్తుంది అని తేటతెల్లమైనది.

మోక్షదశయందు అహమర్థము అనువర్తమానము కాదని ఏది అన్నారో అది కూడా సమంజసము కాదు. అలాగే అయ్యేటట్లయితే డొంక తిరుగుడుగా ఆత్మనాశనమే మోక్షము అని ప్రతిజ్ఞ చేసినట్లవుతుంది. అహమర్థమనేది వట్టి ధర్మము కాదు. అవిద్యానాశనము తర్వాత స్వరూపము నిల్చినట్లు ధర్మము పోయి స్వరూపము మిగలడానికి అవకాశము లేదు. ఆత్మకు అహమర్థమే స్వరూపము. జ్ఞానమేమో ఆత్మకు ధర్మము. కనుకనే అహం జానామి. జ్ఞానంమే జాతం (నాకు తెలియును. నాకు జ్ఞానము కలిగింది) అని అహమర్థానికి ధర్మంగా జ్ఞానప్రతీతి లోకములో ఉన్నది. మరియు పరమార్థంగానైనా భ్రాన్తితోనైనా ఆధ్యాత్మికము ఆధిదైవికము, ఆధిభౌతికము మున్నగు దుఃఖాలతో బాధపడి తనను దుఃఖపరంపరతో బాధపడుతున్నవాడిగా గుర్తించినవాడు అహం దుఃఖీ అని తల్చుకుంటాడు. ఈ కష్టపరంపరను తొలగించుకోవాలి. అందుకు కారణమైన పునర్జన్మను లేకుండా చేసుకొని, చికాకులకు దూరమై ప్రశాంతమనస్కుడను

ఎలా కాగలను అని ఆలోచించి మోక్ష పురుషార్థము నందు అనురాగము కలవాడై దాన్ని సాధించుకోవడానికి పూనుకొంటాడు. ఈ సాధనానుష్ఠానములవల్ల నేనే ఉండనుగాక ఉండను అని తెల్సుకున్నట్లయితే మోక్షపుదారినుండే దూరంగా పారిపోతాడు. ఆపైన అధికారులు లేకపోవడం చేత మోక్షశాస్త్రం మొత్తంగా అప్రమాణము ఔతుంది. లేదండీ అహమనబడే ఒక ప్రకాశము మాత్రము పరమపదము నందు ఉంటుంది అనేట్లయితే నేను చనిపోయినా ప్రకాశమాత్రమైన ఏదో ఒక పదార్థము అపవర్గము నందు ఉంటుంది అని ఎవడు కూడా బుద్ధి పూర్వకంగా ప్రయత్నించడు. కావున జ్ఞాతగా కనిపించే అహమర్థమే ప్రత్యగాత్మ. ఆ ప్రత్యగాత్మనే మోక్ష దశలోనూ నేను అనియే ప్రకాశిస్తుంది. స్వస్మైప్రకాశమానత్వము అనే ధర్మము ఆత్మకు ఉంటుంది కాబట్టి. ఏదైతే స్వస్మైప్రకాశమానమో అదంతా నేను అనియే ప్రకాశిస్తుంది. జ్ఞానరూపంలో ప్రకాశించినా నేను అనుభావంతో ప్రకాశించినా ఉభయ పక్షాలకూ సమ్మతమైన సంసారియే ఆత్మ. ఏదైతే నేను అనుభావంతో ప్రకాశించదో అది స్వస్మై ప్రకాశమానము కాదు. ఘటము నేను ఘటాన్ని అని తలచలేదు. అలాగే ఇదిన్నీ ఈ ముక్తాత్మ స్వయంప్రకాశకము. కావున నేను అనియే ప్రకాశిస్తుంది. అహమ్ అనుభావముతో ప్రకాశించినందువల్ల ముక్తాత్మకు అజ్ఞత్వము సంసారిత్వము కలుగవు. ఇవి మోక్షానికి విరుద్ధములైనవి. కాన వీటిని మోక్షము అడ్డుకుంటుంది. మోక్షము నందు అహం ప్రత్యయము అజ్ఞత్వము మున్నగునవి కలుగడానికి కారణము కాదు. అజ్ఞానమంటే మీ ఉద్దేశ్యములో 1) స్వరూపా జ్ఞానమా 2) అన్యథాజ్ఞానమా 3) విపరీత జ్ఞానమా! ఏది? అహమని భావించడమే ఆత్మకు సహజస్వరూపము. స్వరూపజ్ఞానరూపమైన అహం ప్రత్యయము అజ్ఞత్వమును ఆపాదించదు. అదే లేకపోయినపుడు మళ్ళీ సంసారిత్వము ఎక్కడినుంచి వస్తుంది? స్వరూపజ్ఞానానికి అజ్ఞత్వము విరోధి కనుక స్వరూపజ్ఞానము దాన్ని నశింపచేస్తుంది. తమకు పరబ్రహ్మ అనే జ్ఞానము కలిగి పరమాత్మను ప్రత్యక్షంగా దర్శించుకోగల్గడం వలన కించిత్తు అవశేషము కూడా మిగులకుండా తుడిచిపెట్టుకునిపోయిన అవిద్యకలవారైన వామదేవాదిమహర్షులకున్నూ **అహమ్** అనియే ఆత్మానుభవము ఉన్నట్లు కనిపిస్తున్నది. **బృహదారణ్యకము** వాక్యమిలా వినిపిస్తున్నది. ప్రపంచమంతా బ్రహ్మాత్మకమని తెల్సుకున్న వామదేవుడనే మహర్షి నేను మనువునైనాను. సూర్యుడినైనాను 2) నేనొకడినే ముందు ఉండినాను. ఇపుడు ఉన్నాను భవిష్యత్తులోనూ ఉండగలను. మున్నగు వాక్యాలు అన్ని రకములైన అజ్ఞానములకు

విరోధియైన కేవలము సత్ శబ్దము చేత మాత్రమే పిలువబడదగిన **పరబ్రహ్మ కూడా నేను అనియే వ్యవహరించియున్నాడు.** హన్తాఽ **హమి** మాస్తి స్రోదేవతాః – ఆహా! నేను ఈ ముగ్గురు దేవతలను – 2) బహుస్యాం ప్రజాయేయ **నేను** అనేకములైన రూపాలతో పుడతాను. 3) సఈక్షతలోకాన్ను సృజా ఇతి – ఆయన సంకల్పించెను. లోకములను సృష్టిస్తాను అని. **అలాగే** 1) ఏ కారణంగానైతే క్షరమైన అచిత్తుకు, అక్షరమనబడే చిత్ పదార్థానికి **నేను** అతీతుడైనానో అందువల్ల **నేను** లోకములోను వేదములోను పురుషోత్తముడు అని ప్రసిద్ధికెక్కినాను. 2) ఓ అర్జునా! **నేను** ఈ చిద చిన్మిశ్రమైన జగత్తునకు ఆత్మను 3) **నేను** ఒకప్పుడున్నూ లేను 4) ఈ సమస్త జగత్తు పుట్టుకకూ ప్రళయములకు **నేను** కారణమును 5) **నేను** ఈ సమస్త జగత్తు పుట్టుకకు కారణాన్ని. నావల్లనే ఈ ప్రపంచము ముందుకు సాగుచున్నది. 6) వారిని జనన మరణరూప సంసారము నుండి **నేనే** పైకి లేవనెత్తుతాను. 7) **నేను** బీజము నుంచే తండ్రిని 8) **నేను** గడిచిపోయిన వాటిని ఎరుగుదును. **ఇవన్నీ భగవద్గీతలోవి**.

అహమనేది ఆత్మకు స్వరూపమైతే భగవంతుడు అగు శ్రీకృష్ణుడు అహంకారము క్షేత్రములో ఒక భాగము అని చెప్పినది ఎట్లు? మహాభూతాలు ఐదు, అహంకారము బుద్ధి, అవ్యక్తమున్నూ ప్రకృతి యొక్క ఎనిమిది విధాలు అని కదా ఆయన నోటిమాట అన్నచో చెపుతాము వినండి. ఆత్మస్వరూపాన్ని ఉపదేశించే అన్నిస్థలాల్లోను అహమ్ అనే ఉపదేశించారు. అట్లే ఆత్మస్వరూపము కూడా అహమ్ అనియే గుర్తింపబడుతున్నది. కనుక అహం అనేదే ప్రత్యగాత్మకు స్వరూపము. అవ్యక్త ప్రకృతియొక్క పరిణామ భేదాల్లో ఒకటైన అహంకారము క్షేత్రములో అంతర్భవిస్తుందని భగవంతుడి చేతనే ఉపదేశింపబడింది. ఆ అహంకారమే ఆత్మ. కాని శరీరము నందు నేను అని భావించుటకు కారణమవుతున్నందున అహంకారము అని అనబడుతున్నది. ఈ అహంకార శబ్దానికి అభూత తద్భావార్థము నందు (అలాంటి వస్తువుకాక పోవడము) చ్విప్రత్యయమును చేసుకొని వ్యుత్పత్తి చెప్పుకోవలెను. ఈ అహంకారమే గొప్పవారైన సత్పురుషులను అవమానించుటకు కారణమైనందున **గర్వము** అనే మరొక పేరును కలిగి శాస్త్రము లందు వదలుకోదగినదిగా పలుమార్లు ప్రతిపాదింపబడుతూ ఉన్నది. అందుచేత ఎలాంటి బాధకములేని నేను అనే అహం బుద్ధి సాక్షాత్తూ "**ఆత్మనే**" తెలుపుతుంది. శరీరము నందు ఒక భాగముగా గోచరించే అహం బుద్ధి మాత్రము "**అవిద్యనే**". భగవానుడగు పరాశరుడు కూడా ఇదే చెప్పినాడు. వంశములో

నివారినందరినీ ఆనందపరిచేవాడా! అవిద్యాస్వరూపాన్ని చెపుతాను విను "**ఆత్మకాని దానియందు ఆత్మ అను బుద్ధి ఏది ఉన్నదో అదే అవిద్య**"

ఒకవేళ జ్ఞానము మాత్రమే ఆత్మ అయితే అపుడు అనాత్మయైన శరీరమునందు ఆత్మగా అభిమానాన్ని చూపితే జ్ఞప్తి మాత్రమే ప్రతిభాసించాల్సియుంటుంది. జ్ఞాతృత్వ ప్రతిభాసము ఉండదు. అందుచేత **జ్ఞాతయైన అహమర్థమే ఆత్మ** దాన్నే చెప్పినారు యామునాచార్యులవారు – లోకంలో ప్రత్యక్షంగా నేను అని అనాత్మయైన శరీరము నందు ఆత్మాభిమానము కనపడుతున్నందున, ఇంతకు మునుపు చూపిన న్యాయములు శ్రుతివాక్యములు పొసగుతున్నందుననూ, అవిద్యతో పొత్తు వల్లనున్నూ జ్ఞాతయైన ఆత్మ నేను అని భాసిస్తున్నది అని. అలాగే – దేహము ఇంద్రియాలు, మనస్సు, పంచప్రాణాలు, బుద్ధి కంటే భిన్నుడు ఆత్మ. ఎవ్వరిచేతనున్నూ ప్రకాశింపచేయబడడు. నిత్యుడు అన్నింటియందూ దూరియుండేవాడు. ప్రతిశరీరము నందుంటూనే పరస్పరము వేరయినవాడు సహజంగానే సుఖము గలవాడు ప్రత్యగాత్మ అని. అనన్యసాధనః – స్వయం ప్రకాశకుడు. పరప్రకాశకమైన జడము వంటి వాడు కాదు. వ్యాపీ = మిక్కిలి సూక్ష్మమైన వాడవడం వలన అన్ని అచేతనములలోనూ దూరే స్వభావము కలవాడు.

దోషమూలమైనందువల్ల, మరొకరీతిగా సిద్ధించుటకు అవకాశమున్నందున పలురకాలైన భేదాలను చూపించే ప్రత్యక్షము శాస్త్రము చేత బాధింపబడుతుంది అని చెప్పినారు కదా! అచ్చట దోషమేదో తెలుపవలసి యున్నది. దాని కారణంగానే ప్రత్యక్షము అన్యథా సిద్ధమవుతున్నది కదా! అనాదియైన భేదవాసనయే ఆ దోషము అని చెప్పేట్లయితే భేదవాసన కలుగడానికి తిమిరాదుల వలె సహజసిద్ధంగా నున్న వస్తువును గురించి విపరీత జ్ఞానము కలుగడానికి కారణమేదో ఎక్కడైనా తెలుస్తున్నదా? అంటే ఈ వేదశాస్త్రముతో ఉన్న విరోధము వల్లనే తెలుస్తున్నది అని అంటారా! అది తగదు. అచట అన్యోన్యాశ్రయ దోషము వస్తున్నది ఎలాగంటే వేదశాస్త్రము ఎలాంటి విశేషములులేని వస్తువును తెలుపుతున్నది అని నిశ్చయమైతే భేదవాసన దోషమని నిర్ణయమవుతుంది. భేదవాసన దోషము అని నిశ్చయింపబడితే శాస్త్రము నిరస్త నిఖిల విశేషవస్తువును బోధిస్తుంది అని నిశ్చయమవుతుంది. ఇంతేకాదు భేదవాసనా మూలంగా ప్రత్యక్షము విపరీతార్థమును చెపుతున్నది. ఆ ప్రత్యక్షమునే మూలముగా కల్గిన శాస్త్రము కూడా విపరీతార్థమునే చెప్పేది ఔతుంది. దోషమూలమే ఐనా శాస్త్రము ప్రత్యక్షము ద్వారా

అర్థమైన సకల భేదాలను త్రోసిరాజనడానికి అవసరమైన జ్ఞానాన్ని అందిస్తున్నది కాబట్టి పరమైనది కనుక పూర్వమైన ప్రత్యక్షాన్ని బాధిస్తుంది అని అంటారేమో అది తప్పు. దోషమూలమని తెలిసినాక పరమే ఐనా అది దేనికీ అక్కరకురాదు. త్రాడును చూచి పాము అని జ్ఞానము కలిగి దానితో భయపడినవాడిని చూచి వీడు భ్రమపడినాడు సుమా అని తెల్సుకొన్న ఎవడో ఒకడు వచ్చి అయ్యా! ఇది పాము కాదు. భయపడకు అని చెప్పినా వాడికి భయము తొలగిపోవడం లేదుకదా! ఇది ప్రత్యక్ష విషయము. ఇక శాస్త్రము దోషమూలమైనది అని దాన్ని వినే వేళకే తెలిసింది. శ్రవణం తర్వాత జరిగేది మననము. విన్నదాన్నే మననం చేస్తాము. శ్రవణం ద్వారా అవగతమైన నిఖిలభేదములను అణచివేసే బ్రహ్మఅనబడే ఆత్మ ఒక్కటే అనే విజ్ఞానమునే అభ్యాసము చేయుట మననము. ఇందువల్ల జరిగేదేమిటి? దోషమూలమైన శాస్త్రము వలన దుష్టమైన అంశమే అభ్యాసము చేయబడుతుంది. ప్రత్యక్షము, శాస్త్రము దోషమూలములే ఐనపుడు కలిగే ప్రయోజనము ఏముంటుంది? శాస్త్రము దోషములు కలదని ఊహించడానికే అవకాశములేనిది. ప్రత్యక్షము దోషములు కల్గియుండడానికి అనేకావకాశములున్నట్టిది? అని అంటారా? ఐతే ఏప్రమాణము ద్వారా మీకావిషయము ఎరుకఅయ్యిందో చెప్పండి? అనుభూతి ఐతే అలాగా ఎన్నటికీ చెప్పదు. అది స్వతస్సిద్ధమైనట్టిది. దానిలో ఎలాంటి విశేషాలూ లేవు. కనుక జ్ఞానము ఈ విషయాన్ని తెల్పదు. దానికి ఏ విషయాలతోనూ సంబంధమూ లేదు. విరాగి. పైగా శాస్త్రముపైన దానికి ఎలాంటి పక్షపాతమూ లేదు. పోనీ ఐంద్రియిక ప్రత్యక్షము అందామా! అది దోషమూలముగా ఏర్పడేది కాబట్టి విపరీతార్థాన్నే తెల్పుతుంది. దాన్ని ఆధారంగా చేసుకొని ప్రవర్తించేవి కాబట్టి అనుమానాది ప్రమాణాలు కూడా శాస్త్రము నిర్దుష్టము. బ్రహ్మ సత్యము జగత్ మిథ్య అని తెలుపజాలవు. అందువల్ల మీ పక్షమును సమర్థించే, స్థాపించే ఏ ప్రమాణాన్ని మీరు చూపలేకపోతున్నారు కాబట్టి మీ అభిమతము నెరవేరదు.

మాకు వ్యావహారిక ప్రమాణము, వ్యావహారిక ప్రమేయము అను ఒక వ్యవస్థ ఉన్నది దానివల్ల సాధ్యమే అని అనేట్లయితే! వ్యావహారికమంటే ఏమిటో చెప్పండి. ఆపాత ప్రతీతి వల్ల తెల్సిన అంశము తరువాత యుక్తుల చేత విచారించిన పిదప ఆ అంశము సత్యము కాదు. ఔను అని తెలియుట అని అన్నట్లయితే సరియే! దానివల్ల కలిగే ప్రయోజనమేమిటి? ప్రమాణంగా, యథార్థమైన విషయంగా తెల్సిన యుక్తుల

చేత బాధింపబడినట్లయితే ప్రమాణములు చేత తెలియవచ్చే జ్ఞానం ఏమీ ఉండదు. అందువల్ల ప్రయోజనమూ ఉండదు.

శాస్త్రము ప్రత్యక్షములు రెండూ దోషమూలములే అవిద్యపై ఆధారపడినవే. ఐనా ప్రత్యక్షము తెలిపే భేదదర్శనాన్ని శాస్త్రము బ్రహ్మమొక్కటే. "**నేహనానాస్తికించన**" అని చెప్పి బాధించుతుంది. శాస్త్రములోను, సత్తు అద్వితీయము ఐన బ్రహ్మను గురించిన జ్ఞానాన్ని నిర్విశేష బ్రహ్మ జ్ఞానము ఖండిస్తుంది. కనుక నిర్ విశేషానుభూతి మాత్రమే ఐన బ్రహ్మమే పరమార్థము అని నిశ్చయింపబడుతున్నది. అంటున్నారా? ఆ మాట సరికాదు, అబాధితమైనా శాస్త్ర జ్ఞానము దోషమూలమైనందున అపరమార్థమే ఔతుంది ఎలాగంటావా విను. ఎక్కడో కొండ గుహలలో కొందరు ప్రజలు నివసిస్తున్నారు. వారందరికీ కండ్లల్లో **తిమిరము** అనబడే వ్యాధి దోషమున్నది. తమకు ఆ దోషము ఉన్నట్లు వారిలో ఎవ్వరికీ తెలియదు. కంటిలో **నీరు కాసులు** అనే దోషములు లేని సాధారణ ప్రజలు ఎవ్వరూ వారి వద్దకు పోయేవారు కాదు. కావున కొండగుహలలో నున్నవారికి తమ దోషము తెలియనందున ఇద్దరు చంద్రులు కనపడుతున్నందున ఇద్దరు చంద్రులు ఉండడమే సత్యమని నమ్ముతున్నారు. అది నిజము కాదని తెలిపేవారు లేరు. కనుక వారి ద్విచంద్రజ్ఞానము బాధక ప్రత్యయము లేనందున నిజము కాబోదు. ఏకచంద్ర స్థితి అబద్ధమూ కాదు. కాబట్టి వారి ద్విచంద్రజ్ఞానము ఎట్లా మిథ్య ఔతున్నదో అట్లే దోషమూలమైన శాస్త్ర జ్ఞానము కూడా మిథ్యనే కావలసివస్తుంది. ఇంతటికి మూలము దోషమే. అది అయథార్థ జ్ఞానానికి హేతువు అవుతున్నది. అట్లే బ్రహ్మజ్ఞానము అవిద్య మూలంగా కలుగుతున్నది కనుక దాన్ని బాధించే జ్ఞానము మరొకటి లేకున్నా తాను తెలిపే బ్రహ్మతో సహా మిథ్యనే అవుతుంది అని. ఈ విషయంలో కొన్ని అనుమాన ప్రయోగాలు ఇలా ఉన్నాయి. 1) వివాదాస్పదమైన బ్రహ్మ మిథ్యా. అవిద్యదోషము కలవానికి పుట్టిన జ్ఞానము ద్వారా తెల్సుకోదగిన విషయమైనందువల్ల. ప్రపంచము వలె 2) బ్రహ్మ మిథ్య. మిథ్యా జ్ఞానవిషయమైనందున. ప్రపంచము వలె 3) బ్రహ్మ మిథ్య, అసత్యమైన హేతువు వలన పుట్టిన జ్ఞాన విషయమైనందున. ప్రపంచము వలెనే అని.

స్వప్నములో చూచిన ఏనుగు మేడలు రథాలు వంటివాని గురించిన జ్ఞానము అసత్యము. ఐనా అది నిజమయ్యే శుభాశుభములను గుర్తించడానికి హేతువు అవుతున్నది. అట్లాగే శాస్త్రము అవిద్యామూలమైనందున అసత్యమే. ఐనా పరమార్థమైన బ్రహ్మ జ్ఞానమును పొందటానకి కారణము కాగలదు అనడంలో వైరుధ్యము ఏమీలేదు

అని చెప్పగూడదు. స్వప్నములోని జ్ఞానము అసత్యము ఏమీకాదు. కలలోని వస్తువులు విషయాలు మాత్రమే మిథ్యా భూతములు. వాటికి మాత్రమే బాధ కనిపిస్తున్నది. కాని జ్ఞానానికి కాదు. ఎవడు కూడా నేను స్వప్నవేళలో అనుభవించిన జ్ఞానము లేదు అని అనుకోవడము లేదు. కలలో చూచింది సత్యమే. కాని ఆ వస్తువులు మాత్రము లేవు అనిగదా బాధక జ్ఞానము ఉంటున్నది.

మాయలు చేసేవాడు, మాయావి, గారడి వాడు మున్నగు వాండ్ల యొక్క మంత్రములు, ఔషధులు మున్నగు వాటివల్ల పుట్టిన మాయామయమైన జ్ఞానమున్నూ సత్యమే. కాబట్టే ప్రీతి, భయములు కలుగుతున్నవి. అక్కడ కూడా జ్ఞానము బాధింపబడడం లేదు. అదే విధంగా విషయములయందు ఇంద్రియముల యందు ఉన్న దోషాదుల వల్ల పుట్టిన త్రాడు మొదలైన వాని యందు కల్గిన సర్పాది జ్ఞానమున్నూ సత్యమే. కావుననే భయము కంపము వంటి వాటికి కారణమవుతున్నది సత్యము కాబట్టే అది కరవకపోయినా పాము దగ్గర నుంచి పోయిన కారణంగా కరచింది అనే భావన కల్గుతున్నది. అదే విధంగా అనుమానము కూడా నిజమే. విషము ఎక్కిందేమో ననే జ్ఞానము చేతనే మరణము సంభవిస్తుండడమున్నూ. నీళ్ళు అద్దము మొదలైన వాటిలో ముఖాదులు ప్రతిభాసించడమున్నూ వస్తువులే నిజములే కాబట్టే వాటిలో, వస్తుభూతములైన ముఖాదులలోనున్న విశేషాలను నిశ్చయించగల్గుతున్నాము. ఈ జ్ఞానాలన్నీ కూడా ఉత్పత్తి మత్త్వములు. అనగా పుట్టుక గలవి. అర్థక్రియాకారులున్నూ అనగా ప్రయోజనాలను కలిగించేవిగానూ ఉన్నవి. అందుచేత సత్యములుగా పరిగణింపబడుతున్నవి. కలలోని హస్త్యాదులు లేకున్నా వాటికి చెందిన జ్ఞానాలు సత్యాలు ఎలా అవుతాయి? అనవచ్చు. కాని జ్ఞానములకు ఆలంబనము మాత్రము ఉంటే చాలునని నియమమున్నది. వస్తువులకు మాత్రము ప్రతిభాసమానత్వముంటే సరిపోతుంది. స్వప్నదోషము వలన ప్రతిభాసమానత్వము ఉన్నది. ఆ దోషము బాధింపబడినట్లైతే అసత్యము అని నిశ్చయింపబడుతుంది. బాధితము కాని బుద్ధి మాత్రం సత్యమౌతుందని చెప్పినాము. రేఖలను బట్టి అక్షరబుద్ధి కల్గుతున్నచోట కూడా అసత్యము నుండి సత్యబుద్ధి కలుగడము లేదు. వర్ణములుగా కనపడడానికి కారణమైన రేఖ ఉన్నది వాస్తవమే కాదా! అక్షరం లాగా కనిపించిన రేఖ ఇది ఈ అక్షరము అనే బుద్ధి కలగడానికి కారణమేగాని ఆయా వర్ణాలుగా ఉండడమైతే అసత్యమే అని అనరాదు. అసత్యమైన వర్ణాత్మత ఉపాయంగా పనికిరాదు. వాస్తవానికి లేనిది, ఇలాంటిది అని

చెప్పరానిది (ఐనట్టిది) ఉపాయము కాదు. అట్లాంటి దాన్ని చూడలేదు. ఉపపన్నము కూడా కాదు. ఒకవేళ రేఖ వర్ణబుద్ధికి ఉపాయము అయ్యేటట్లయితే నీవు చెప్పినట్లు అసత్యము నుండి సత్యబుద్ధి కలుగదు. బుద్ధి (జ్ఞానము) సత్యము అవుతున్నది కావున అపుడు ఉపాయము, ఉపేయము (ఫలము – పొందదగినది)లు రెండూ ఒక్కటే కావలసి వస్తుంది. రేఖను చూచినా అక్షరాన్ని చూచినా వర్ణ బుద్ధే కలుగుతున్నందున భేదము లేకుండా పోతుంది. ఏదో ఒక అక్షరరూపములో లేని రేఖ యందు ఉపాయబుద్ధి ఉండేలాగయితే ఒకే రేఖ యందు – ఏ వర్ణమూ నిర్దిష్టంగా లేనందువల్ల – సులభంగా ఒక్కరేఖ యందే సర్వవర్ణములనూ గుర్తించడము సాధ్యమవుతుంది. ఒకానొక రూపమున్న మాంసపు ముద్ద యందు దేవదత్తుడు వంటి శబ్ద సంకేతము వలెనే కంటికి కనిపించే రేఖా విశేషము నందు చెవుల ద్వారా తెల్సుకోదగిన వర్ణ విశేషము యొక్క సంకేతము ద్వారా రేఖావిశేషము వర్ణవిశేషమును గుర్తించడానికి హేతువు అవుతున్నది అని అంటున్నావా! అయితే సత్యము నుండే సత్యమును గుర్తించడము అవుతుంది. నీవన్నట్లు అసత్యము నుండి సత్యప్రతిపత్తికలగదు. ఇక్కడ కూడా రేఖ సత్యమే. సంకేతమున్నూ సత్యమే. అట్లే రేఖలుగా గీసిన గవయము (అడవిదున్న) నుండి సత్యగవయమును తెలుసుకోవడము రెండింటిలోనున్న పోలికవల్ల సాధ్యమవుతున్నది. ఐతే ఆసాదృశ్యము నిజమే. ఒకేరూపంగా ఉన్న శబ్దానికి నాదవిశేషాన్ని / ధ్వనిలో భేదాన్ని బట్టి అర్థభేదము కలుగడానికి వీలున్నప్పటికిన్నీ అసత్యము నుండి సత్యప్రతిపత్తి కలుగవచ్చునని అనకూడదు. పలురకములైన నాదములతో పలుకబడిన శబ్దము ఒక్కటే ఐనా ఆయానాదములచేత అభివ్యంగ్య స్వరూపముతో వేరువేరు అర్థవిశేషాలతో సహా సంబంధ గ్రహణము కారణంగా అర్థభేదబుద్ధి కలుగుతుంది. ఇంతేకాక పలుకడంలో స్వరభేదము శబ్దభేదము ఏర్పడుతున్నందున శబ్దము ఏకరూపము అని అనడం సాధువు కాదు. ఇంద్ర శత్రువృత్తాంతాన్ని ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఆయా అర్థాలను బోధించే గకారాదులనే శ్రోత్రము గ్రహిస్తున్నది. అపుడే దానికి శబ్దము అనే సార్థకనామము కల్గుతున్నది. అందువలన అసత్యమైన శాస్త్రము నుండి సత్య బ్రహ్మ విషయ ప్రతిపత్తి ఉపపాదించలే(ము)రు.

శాస్త్రము గగనకుసుమాదుల వలె బొత్తిగా అసత్యము కాదు. అద్వైతజ్ఞానము కలుగడానికి ముందు **సద్బుద్ధిని** కలిగిస్తున్నది. తత్వజ్ఞానము కలిగిన పిదప శాస్త్రము అసత్యము ఔతుంది. అపుడు శాస్త్రము నిరస్త నిఖిల భేద చిన్మాత్రబ్రహ్మ జ్ఞానోపాయము

కాదు. ఎపుడు ఉపాయమవుతుందో అపుడు శాస్త్రమున్నట్లే. ఆస్తి అనే బుద్ధి కలుగుతున్నది గనుక అని చెప్పబోకు. శాస్త్రము లేనపుడు శాస్త్రము ఉన్నది అని బుద్ధి కలిగితే అది మిథ్యా జ్ఞానము. మిథ్యయైన శాస్త్రము వలన పుట్టిన జ్ఞానమున్నూ మిథ్యనే. కావున దానికి విషయమైన బ్రహ్మ కూడా మిథ్యనే ఔతాడు. ఎలాగంటే పొగమంచును చూచి పొగ అనుకున్నవాడికి కండ్లల్లో నీరు వచ్చితే అందువలన ఈ పొగ పుట్టడానికి కారణమైన అగ్ని ఇక్కడెక్కడో వున్నది అనుకొన్నాడు. కాని తర్వాతికాలంలో అది పొగకాదు పొగ మంచు అని తెల్సినాక దానివల్ల ఊహించిన అగ్ని జ్ఞానము కూడా మిథ్యనే ఐనట్లు మిథ్యయైన శాస్త్ర జన్యజ్ఞానము వలన తెలియవచ్చిన బ్రహ్మ కూడా మిథ్యయే కాక తప్పదు. తరువాత శాస్త్రము ఉన్నదని తెల్సినా ప్రయోజనం ఏమీ ఉండదు. ఐనపుడు శూన్యమే తత్వము అని అనవలసి వస్తుంది. దానికి కూడా బాధకము ఉన్నదనేది – కనపిస్తున్నది. ప్రపంచము ఉన్నదను మాట భ్రాంతి మూలముగా ఏర్పడింది అని అనేట్లయితే ఈ శాస్త్రము కూడా భ్రాన్తి మూలమని నీవే చెప్పినావు కదా! దానికీ బాధకము కనిపిస్తున్నది అనేది నీ తిరుగు జవాబు అయ్యేటట్లయితే ఇక చాలు. నీ కుతర్క పరంపర.

## - శ్రుతిఘట్టము -

వేదాన్తవాక్యాలు నిర్విశేష జ్ఞానైకరసవస్తువునే ప్రతిపాదిస్తున్నాయి. అవి **"సదేవసోమ్యేదమగ్ర ఆసీత్"** మొదలైనవి అని చెప్పిన విషయము యుక్తమైనది కాదు. ఆ ప్రకరణంలో ఒక్క వస్తువును తెల్సుకుంటే అన్ని వస్తువులను గురించి తెల్సుకున్నట్లే ఔతుంది అని ప్రతిజ్ఞ చేసి దాన్ని ప్రతిపాదించడం కొరకు ఓ సోమ్యుడా! ఈ ప్రపంచము పుట్టడానికి మునుపు సత్ అనబడేది ఒక్కటే ఉన్నది అని మొదలుపెట్టి సత్ శబ్దవాచ్యుడైన పరబ్రహ్మకు జగదుపాన కారణత్వము, నిమిత్తకారణత్వము, సర్వజ్ఞత్వము, అన్ని రకములైన శక్తులు కల్గియుండడము, తాను తలచినవన్నీ ఎటువంటి అడ్డంకులు లేకుండా నెరవేరడము, అన్ని వస్తువులలోనూ తాను ఉండగల్గడము, అన్నింటికీ ఆధారమవడము, చిదచిత్తులనన్నింటినీ అదుపులో పెట్టగల్గడము వంటి అనేకములైన కళ్యాణ గుణములు కల్గియుండుట చిదచన్మిశ్రమైన ప్రపంచానికి ఆత్మగా నుండుటనున్నూ ప్రతిపాదించి ఇలాంటి బ్రహ్మను ఆత్మగా కలవాడవు, బ్రహ్మ స్వరూపుడవు నీవు అని శ్వేత కేతువుకు ఉపదేశించడానికి ఈ ప్రకరణము ఆరంభము అయ్యింది. ఇదే అర్థము **వేదార్థసంగ్రహములో విపులముగా**

**తెలుపబడింది**. **ఈ గ్రంథములోనున్నూ ఆరంభణాధికరణము నందు కూడా సవివరముగా ప్రతిపాదిస్తాము**. "**అధపరాయయా తదక్షరమ్**" అనే శ్రుతి వాక్యము వద్ద కూడా ప్రకృతి వల్ల కలిగే ఆకలిదప్పులు వంటి హేయ గుణాలు పరమాత్మలో లేవని నిషేధించి నిత్యత్వము విభుత్వము సూక్ష్మత్వము సర్వగతత్వము అవ్యయత్వము భూతయోనిత్వము సర్వజ్ఞత్వము వంటి కళ్యాణగుణములు కల్గియుండుట పరబ్రహ్మకు ప్రతిపాదింపబడింది.

"**సత్యం జ్ఞానమనన్తంబ్రహ్మ**" అనే వాక్యము వద్దకూడా కనిపిస్తున్న సామానాధికరణ్యము అనేక విశేషణములతో విశిష్టమైన ఏకార్థాన్ని అభిధాశక్తితో వివరిస్తున్నది కాబట్టి నిర్విశేషమైన వస్తువు సిద్ధించడములేదు. సామానాధికరణ్యము అనగా ఆయా అర్థాలను చెప్పడం కొరకు బయలుదేరి ఎన్ని నిమిత్త భేదాలు ఉన్నా చివరికి ఒకే అర్థాన్ని చెప్పడమే. అనగా ఒక్క వస్తువును గురించి వివరించడము. ఆ కారణంగా సత్యజ్ఞానాది పదాలకు ముఖ్యార్థాలైన గుణాలతో కాని ఆయా గుణాలకు విరోధ్యాకారాలకు ప్రత్యనీకమైన స్వరూపముతోనైనా ఒకే అర్థము / వస్తువునందు పదములు ప్రవర్తించినపుడు ఆయా పదాలను, ప్రయోగించడంలో ఉన్న నిమిత్త భేదాన్ని తప్పక వివరించాలి. ఐతే ఇక్కడొక విశేషము – గుణాలుగా చెప్పే పక్షము, గుణాలు కావు విరోధిప్రత్యనీకాకారములని చెప్పిన పక్షాలు రెండున్నాయి. ఒక పక్షముతో (అనగా రామానుజుల వారి పక్షము) పదాలకు ముఖ్యార్థతా అభిధావృత్తి, వేరే పక్షములో – (అద్వైతుల పక్షములో) సత్య జ్ఞానాది పదాలకు లక్షణా.

అజ్ఞాన ఆదులు జ్ఞానానికి ప్రత్యనీకములు కావడమనేది వస్తు స్వరూపము అని చెప్పకూడదు. ఒక్క పదముతోనే బ్రహ్మ వస్తుస్వరూపము తెలుస్తుండగా ఇతరమైన పదాలు ప్రయోగించడము దండుగ ఔతుంది. సామానాధికరణ్యము సిద్ధించదు కూడా. ఎందుకంటే ఒకే వస్తువు విషయంలో పలు పదాలకు వాటిని ఉపయోగించవలసిన నిమిత్త భేదమును చెప్పకపోయినందున. ఐతే ఒకే వస్తువును గురించి అనేక పదాలను ఉపయోగించినపుడు నిమిత్త భేదము కారణంగా విశిష్టతా భేదము ఏర్పడుతుంది. అందువల్ల సామానాధికరణ్యముతో వైరుధ్యము వస్తుంది అని చెప్పబోకు. అసలు సామానాధికరణ్యము అంటేనే ఒకే వస్తువు అనేక విశేషణాంశములతో విశిష్టము ఐ ఉండడము. ఈ విషయములో ప్రామాణికులు ఐనవైయాకరణులు ఏర్పరచిన వ్యవస్థ ఇది. వేరువేరు అర్థములను వివరించుటకై పూనుకున్న వేరు వేరు శబ్దాలు

ఒకే అర్థము నందు సమన్వయము కావడము సామానాధికరణ్యము అని. **భిన్న ప్రవృత్తినిమిత్తానాం శబ్దానాం ఏకస్మిన్నర్థే ప్రవృత్తిః సామానాధికరణ్యం అని నిర్వచనము**. **ఏకమేవాద్వితీయం బ్రహ్మ** అన్నచోట అద్వితీయం అన్న పదము గుణముల చేత కూడా రెండవ వాడు ఉండుటను, సద్వితీయతను ఓర్వదు. అందువల్ల సర్వశాఖాప్రత్యయ న్యాయముతో కారణ వాక్యాలన్నింటికీ అద్వితీయ వస్తువును ప్రతిపాదిస్తున్నట్లుగా అర్థమును చెప్పుకోవాలి. కారణత్వముతో ఉపలక్షితమైన అద్వితీయ బ్రహ్మకు **సత్యంజ్ఞాన మనన్తంబ్రహ్మ** అని లక్షణము చెప్పబడింది. కావున లక్షణము ద్వారా చెప్పబడవలసిన బ్రహ్మ నిర్గుణమే. లేకపోతే **నిర్గుణం నిరంజనమ్** ఇత్యాదివాక్యాలతో విరోధము వస్తుంది అని మీరు చెప్పిన మాట ఉపపన్నముకాదు – జగత్తుకు ఉపాదానకారణమైన బ్రహ్మకు, తనకు వ్యతిరేకంగా మరొక అధిష్ఠాతలేదని చెపుతూ, విచిత్ర శక్తియోగమును ప్రతిపాదిస్తున్నది అద్వితీయపదము. అలాగే విచిత్ర శక్తియోగమును తెలియచేస్తున్నది **తదైక్షత బహుస్యాం ప్రజాయేయేతి**. **తత్తేజోఽ సృజత** ఇత్యాదివాక్య సముదాయము. ప్రత్యేకమైన విశేషాన్ని ఏమీ చెప్పకుండా అద్వితీయమ్ అని అన్నంత మాత్రాన మరొక నిమిత్తమును నిషేధిస్తున్నది అని ఎట్లా తెలుస్తున్నది? అనేట్లయితే, సృష్టి చేయదల్చుకున్న బ్రహ్మకు ఉపాదానకారణత్వాన్ని **సదేవసోమ్యేదమగ్రఆసీదేకమేవ** అని ప్రతిపాదించింది శ్రుతి. తరువాత ఏ కార్యమైనా జరుగడానికి లేక వస్తువు ఉత్పత్తి చేయడానికి సహజంగానే నిమిత్త కారణమెవరు అనే ప్రశ్న వస్తుంది అలాగా బుద్ధిలో ఉన్న మరొక కారణాన్ని వివరిస్తూ అలాంటి వాడెవడూ లేడని ఉపాదానమైన వాడే నిమిత్త కారణమని తెల్పుతూ నిమిత్తమైన వాడెవడూ వేరేలేడని **అద్వితీయ** పదంతో నిషేధిస్తున్నది అని అర్థమవుతున్నది. అన్ని విశేషాలనూ లేవు లేవు అని నిషేధించుకుంటూపోతే మీరు అంగీకరించినవీ, మీరు సాధించదల్చుకున్నవీ ఐన నిత్యత్వాదులు కూడా నిషేధింపబడతాయి. సర్వశాఖాప్రత్యయ న్యాయము కూడా మీకు విపరీతమైన ఫలితాన్నే ఇస్తుంది. కారణముతో అన్వయించే అన్ని వేద శాఖలలోని సర్వజ్ఞత్వాదులైన గుణాలు సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ అన్న వాక్యము నందు ఉపసంహరింపబడుతున్నాయి. అందువల్ల కారణవాక్యస్వభావాన్ని బట్టి కూడా **సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ** అనే వాక్యము చేత సవిశేషమైన బ్రహ్మనే ప్రతిపాదింపబడుతున్నది.

నిర్గుణ వాక్యములతోనున్నూ విరోధము లేదు. అవి ప్రకృతి సంబంధము వల్ల వచ్చేవి, హేయములూ ఐన గుణాలను నిషేధిస్తున్నవి. కాని అసలే బొత్తిగా

గుణాలు లేవని కాదు. **నిర్గుణం నిరంజనం నిష్కలం నిష్క్రియం శాన్తం** ఇత్యాదులు హేయగుణాలనేవే లేవని చెపుతున్నాయి. జ్ఞానము మాత్రమే బ్రహ్మకు స్వరూపము అని చెప్పేవాక్యాలు కూడా బ్రహ్మకు జ్ఞానస్వరూపాన్ని తెలియచేస్తున్నవి. అంతమాత్రము చేత నిర్విశేషజ్ఞానము మాత్రమే తత్వమని కాదు. జ్ఞాతకు స్వరూపము జ్ఞానమే. జ్ఞానస్వరూపుడైన బ్రహ్మకు / జ్ఞాతకు జ్ఞానానికి ఆశ్రయమై ఉండడము మణులు, సూర్యుడు, దీపములకు వలె తగినదైయుంటుంది అని అక్కడ చెప్పబడింది. జ్ఞాతృత్వాన్నే శ్రుతులన్నీ చెపుతున్నాయి. **యః సర్వజ్ఞః సర్వవిత్, తదైక్షత. సేయందేవతైక్షత, సఈక్షతలోకాన్ను సృజా ఇతి, నిత్యోనిత్యానాం చేతనశ్చేతనానాం ఏకోబహూనాంయో విదధాతి కామాన్, జ్ఞాజ్ఞౌద్వావజావీశనీశౌ, తమీశ్వరాణాం పరమం మహేశ్వరం తందేవతానాం పరమంచదైవతం। పతింపతీనాం పరమం పరస్తాత్ విదామదేవం భువనేశమీడ్యం; న తస్యకార్యం కరణంచవిద్యతే నతత్సమశ్చాభ్యధికశ్చదృశ్యతే పరాఽస్యశక్తిః వివిధైవశ్రూయతేస్వాభావికీ జ్ఞానబల క్రియాచ ఏష ఆత్మాఽపహతపాప్మావిజరో విమృత్యుః విశోకో విజిఘత్సోఽపిపాసః సత్యకామః సత్యసంకల్పః** ఇత్యాదులైన శ్రుతులు జ్ఞాతృత్వము మొదలైన కళ్యాణగుణాలను జ్ఞానస్వరూపుడైన బ్రహ్మకు సహజములైనవిగా చెపుతున్నవి. ఇంకా హేయమైన గుణములు లేకుండుటను గురించి కూడా. నిర్గుణ వాక్యాలకు సగుణ వాక్యాలకు విషయము ఐన బ్రహ్మను అపహత పాప్మా అని మొదలుపెట్టి అపిపాసః అనునంత వరకు హేయగుణములు లేవని నిషేధించి సత్యకామః సత్య సంకల్పః అని బ్రహ్మకు కళ్యాణగుణాలను విధిస్తున్న ఈ శ్రుతి వాక్యమే ఉభయ లింగాలు కలవాడని వివరిస్తున్నది. కావున సగుణ నిర్గుణ వాక్యాలకు విరోధము లేదు. అందువల్ల శ్రుతివాక్యాలలో కొన్నిటిని మిథ్యయని భావించడము, లేక ఊహించడము, శంకించడమూ తగదు.

**భీషాఽస్మాద్వాతః పవతే** ఇత్యాది వాక్యముతో ఆరంభించి బ్రహ్మగుణాలను చెపుతూ తేయే శతమ్ అని క్రమంగా క్షేత్రజ్ఞునియొక్క ఆనందాతిశయాన్ని చెప్పి **యతోవాచోనివర్తన్తే అప్రాప్యమనసాసహ ఆనందంబ్రహ్మణో విద్వాన్** అని బ్రహ్మయొక్క కళ్యాణ గుణములకు అంతులేదని మిక్కిలి గౌరవముతో ఈ శ్రుతి చెపుతున్నది. **సోఽశ్నుతే సర్వాన్ కామాన్ సహ బ్రహ్మణా విపశ్చితా** అని బ్రహ్మను తెల్సుకొని ఉపాసించినందుకు ఫలమును తెలుపుతూ ఉన్న ఈ వాక్యము సర్వస్మాత్

పరుడూ **వివిధం పశ్యంతీచిత్ యస్యసః విపశ్చిత్** అని చెప్పినట్లు సర్వజ్ఞుడైన బ్రహ్మకు ఉన్న గుణానన్త్యమును వివరించుతున్నది. విపశ్చిత్ ఐన బ్రహ్మతో కలసి అన్ని కామాలను అనుభవిస్తాడు. కోరబడుచున్నవి కనుక కామములు అనబడుచున్నవి. అవే కళ్యాణగుణాలు బ్రహ్మతో కూడి ఆయన యందలి గుణములనన్నింటిని అనుభవిస్తున్నాడు అని అర్థము.

దహరవిద్యయందున్నూ **తస్మిన్ యదన్తః తదన్వేష్టవ్యం** ఆయనలో ఏ కల్యాణ గుణవైశిష్ట్యమున్నదో దానిని కోరాలి అని చెప్పినట్లు గుణప్రాధాన్యమును చెప్పుటకొరకు సహ శబ్దాన్ని ప్రయోగించినారు. ఫలము ఉపాసనలు రెండింటికిన్నీ ఒకే విధముగా ఉండటాన్ని **యథాక్రతురస్మిన్ లోకేపురుషోభవతి తథేతఃప్రేత్య భవతి** – ఈ లోకములో పురుషుడు ఏవిధమైన ఫలాన్నికోరి యాగమును చేస్తున్నాడో దానికి తగినట్లుగానే పరలోకానికి పోయినాక ఫలమును పొందుచున్నాడు అని శ్రుతి చెపుతున్నది. విత్తు ఒకటి పెడితే చెట్టొకటి మొలవదు గదా!

**యస్యామతం తస్యమతం** 2) **అవిజ్ఞాతం విజానతాం** అనే వాక్యాలతో బ్రహ్మజ్ఞానమునకు అందదు అని చెప్పినారు కదా అన్నట్లయితే **బ్రహ్మవిదాప్నోతిపరం** – బ్రహ్మను గురించి తెల్సినవాడు పరమమైన గతిని పొందుచున్నాడు – **బ్రహ్మవేద బ్రహ్మైవభవతి** – బ్రహ్మను గురించి తెల్సుకున్నవాడు బ్రహ్మవలె అగుచున్నాడు – అని జ్ఞానము వలన మోక్షము కల్గుతుందని మోక్ష మార్గ ఉపదేశము చేయబడింది. **అసన్నేవ స భవతి అసద్బ్రహ్మేతివేదచేత్ అస్తి బ్రహ్మేతిచేద్వేద సన్తమేనంతతోవిదుః** – ఎవడు బ్రహ్మలేడని తలుస్తున్నాడో వాడు లేనివాడే అగుచున్నాడు. బ్రహ్మ ఉన్నాడని ఎవడు నమ్ముతాడో వాడు ఆపరమాత్మను ఆయన యొక్క కటాక్షము వలన చేరుకుంటున్నాడు – అని బ్రహ్మజ్ఞానమును కల్గియుండుట లేకుండుటలవలన తనకు తాను నిల్చియుండుటనున్నూ తాను నశించి పోవుట వేదము చెపుతున్నది. అందువల్ల బ్రహ్మకు సంబంధించిన విషయాన్ని తెల్సుకోవడమే అపవర్గము/మోక్షమును పొందుటకు మార్గమని అన్ని శ్రుతులూ చెపుతున్నవి. **దాన్నే విధిస్తున్నవి.** జ్ఞానమున్నూ ఉపాసనా రూపమే. ఉపాసించదగిన బ్రహ్మ సగుణుడని చెప్పబడింది. **యతో వాచోనివర్తన్తే అప్రాప్యమనసాసహ** – పరమాత్మయొక్క కళ్యాణగుణాలను చెప్పుట అను పని నుండి తమకు సమర్థత లేనందువల్ల మనస్సుతో పాటు కలిసి వాక్కులు వెనుకకు తిరిగిపోవుచున్నవి – అను వాక్యముతో పరబ్రహ్మ అనంతుడు అపరిచ్ఛిన్నగుణాలు

కలవాడు. మాటలకు, మనస్సుకున్నూ ఇలాంటివాడని కొలవడానికి హద్దులు లేనివాడని వినిపిస్తున్నందువలన బ్రహ్మ ఇంతటి వాడు ఇలాంటివాడు అని పరబ్రహ్మయొక్క వైభవము ఇంతటిదని పరిచ్ఛేదము / హద్దు / విభాగము కలదన్నవారికి అవిజ్ఞాతం, అమతం తెలియని వాడేనని చెప్పబడింది. బ్రహ్మ అపరిచ్ఛిన్నుడు. అలా కాకపోతే **యస్యామతం తస్యమతం** – ఎవనికి బ్రహ్మను గురించి తెలియలేదో వాడికి తెలిసినట్లు. **విజ్ఞాతమవిజానతాం** నాకు ఆయన కళ్యాణగుణాల గురించి ఏమీ తెలియదు అని అనుకున్నవాడికి చక్కగా తెల్సినట్లవుతున్నది అని మతత్వము, విజానత్వములు ఆశ్రుతి వాక్యము వద్దనే వైరుధ్యమును పొందెడివి. ఏదైతే **నదృష్టేః ద్రష్టారం నమతేః మన్తారం మన్వీథాః** అనుమంత్రము చూపుకు, మతికి వ్యతిరేకంగా ద్రష్టను, మంతనుచూచేవాడిని తలిచేవాడిని – నిషేధిస్తున్నది అని చెప్పినావో అది సహజమైనదిగాక ఆగంతుకమైన చైతన్యగుణముతో కూడియున్నందున జ్ఞాతయైనవాడికి నిజమైన స్వరూపము అజ్ఞానమేనని అదిన్నీ కుతర్కము వల్ల సిద్ధించినదని తలచి నీవు అలాగా నిన్ను ద్రష్టగాను భావించకు. మన్తగానూ తలంచకు. ఐతే ద్రష్టను మన్తనున్నూ నీకు ఆత్మయైన పరమాత్మను దృష్టి మతిరూపాలుగానే దర్శించు అని చెపుతున్నదని వివరించుటతో పరిహరింపబడుచున్నది లేదా దృష్టికి చూచేవాడిని మతికి మన్తను జీవాత్మను కాదని ప్రతిషేధించి సర్వభూతము లోను అన్తరాత్మగా నున్న పరమాత్మనే ఉపాసించు అని వాక్యార్థము. అలా కాకపోతే **విజ్ఞాతారమరే కేనవిజానీయాత్** – అన్నీ తెల్సినవాడిని దేనితో తెల్సుకోవాలి – అనే "**పరమాత్మకు జ్ఞాతృత్వాని తెలిపే శ్రుతితో**" విరోధము వస్తుంది. **ఆనన్దో బ్రహ్మ** అను వాక్యము ఆనందముమాత్రమే బ్రహ్మ స్వరూపము అని తెలియవస్తున్నది అని ఏది చెప్పినారో అది "**జ్ఞానాశ్రయుడైన బ్రహ్మకు జ్ఞానమే స్వరూపము**" అని చెపుతున్నది అనుటతో పరిహరింపబడినది. అనుకూల జ్ఞానమే ఆనందము అని చెప్పబడుతున్నది. **విజ్ఞానమానన్దం బ్రహ్మ** అను వాక్యమునకు "**ఆనందరూపమైన జ్ఞానమే బ్రహ్మ**" అని అర్థము. ఇందువల్లనే మీకు "**ఏకరసత**" కుదురుతున్నది. ఈ విధమైన జ్ఞానస్వరూపునకే **జ్ఞాతృత్వము** కూడా ఉన్నదని వందల కొలది శ్రుతి వాక్యాలవల్ల తెలియవస్తున్నది. దానిలాగానే **సఏకోబ్రహ్మణఆనన్దః** – అది బ్రహ్మకు ఒక ఆనందము – **ఆనందంబ్రహ్మణో విద్వాన్** – బ్రహ్మయొక్క ఆనంద స్వరూపాన్ని తెలిసి ఉపాసించినవాడు – అని బ్రహ్మకంటే విడిగా నిర్దేశించినందువల్ల 1) "**కేవల ఆనందము బ్రహ్మకాదు.** 2) **ఆనందము కలవాడు ఆనంది బ్రహ్మ**". జ్ఞాతృత్వమే ఆనన్దిత్వము.

ఏద్వైతే ఇలాగా చెప్పబడిందో – **యత్రహిద్వైతమివ భవతి** – ఏ ఏకమైన సద్వస్తువు(నందు) రెండుగా చూడబడ్డుందో, **నేహనానాఽ స్తి కించన మృత్యోః సమృత్యుమాప్నోతి యఇహ నానేవపశ్యతి** – ఈ ప్రపంచము నందు పలురకములుగా నున్నది ఏదీ లేదు. ఒక్కటి మాత్రమే ఉన్నది. ఎవడైతే పలువిధములుగానున్నట్లు భావిస్తున్నాడో చూస్తూన్నాడో వాడు మళ్ళీ మళ్ళీ పుడుతూ చస్తున్నాడు – **యత్రత్వస్యసర్వమాత్మైవాభూత్ తత్కేన కం పశ్యేత్** ఎవనికి ఈ ప్రపంచమంతటా పరమాత్మగానే కనిపిస్తుందో వాడు దేనితో / ఎవనితో ఎవడిని చూస్తాడు అను వాక్యాలద్వారా భేదనిషేధము పలుమార్లు చేయబడుచున్నది. అని, ఆ మాట ఈ సమస్త జగత్తూ బ్రహ్మకార్యము – బ్రహ్మచేత పుట్టింపబడింది. ఆయనను అన్తర్యామి – **ఆత్మలోనుండి ఆయా కార్యాలు చేసేటట్లు నియమిస్తున్నవాడు** – గా కల్గియుండుటచేత, పరబ్రహ్మనే తనకు ఆత్మగా కల్గియుండుట చేతను జీవాత్మలు – పరమాత్మకు భేదము లేకపోవుటవల్ల ఇద్దరూ ఒక్కటే ఐనందువల్ల దానికి వ్యతిరేకమైన నానాత్వము – పలువస్తువులుండుట – ను నిషేధిస్తున్నది. అంతేకాని **బహుస్యాం ప్రజాయేయ** అని అనేకరూపములు పొందుతాను అని సంకల్ప పూర్వకముగా "**బ్రహ్మనానారూపములు పొందుటను నిషేధించుటలేదు**" అని పరిహరింపబడింది. ఇది శ్రుతి సిద్ధమైన విషయము.

నానాత్వమును నిషేధించుతున్నది గనుక ఇది అపరమార్థమైన విషయము అంటే కాదు. ప్రత్యక్షము మొదలుగా గల అన్ని ప్రమాణాలచేత తెలియరానిదైన పరబ్రహ్మయొక్క అనితరసాధ్యమైన నానాత్వమును ప్రతిపాదించిన వేదమే దాన్ని నిషేధిస్తున్నది అనడం నవ్వులాటమాట. **యదాహ్యేవైషఏతస్మిన్ ఉ దరమన్తరం కురుతే అథతస్యభయంభవతి** – ఈ ఉపాసకుడు ఎపుడైతే ఈ పరమాత్మయందు ఏ కొద్దిపాటియైన ఎడమును పొందుతాడో అపుడే వానికి భయము కలుగుతుంది. అని పరమాత్మ యందు నానాత్వాన్ని చూచేవాడికి భయము కలుగుతుందని చెప్పబడిందో అది సరికాదు. **సర్వంఖల్విదంబ్రహ్మ. తజ్జలానితి శాన్తఉపాసీత** – ఎదురుగా కనపడుతున్నదంతా బ్రహ్మయే. మనస్సులో ఎట్టి చికాకులు పెట్టుకోకుండా చరాచరప్రాణి సముదాయమంతా ఆ బ్రహ్మ నుండే పుట్టింది. ఆయన వల్లనే బ్రతుకుతున్నది. చివరకు ప్రళయకాలములో ఆయనలోనే లయమవుతున్నది అని

తలచి శాన్తుడై ఉపాసించాలి – అని ఆయన యొక్క నానాత్వాన్ని ఉపాసించుటము శాంతికి కారణంగా చెప్పబడింది. అది ఈ ప్రకారము – సమస్త జగత్తు ఆయనవల్లనే ఉత్పత్తి స్థితిలయములను పొందుతున్నది కనుక తదాత్మకముగా – ఆయన యొక్క స్వరూపంగానే తలంచుటతో శాన్తి కలుగుతుందని విధింపబడుతున్నది అందుకని దేవతిర్యక్ మనుష్యస్థావరాత్మకమైన జగత్తును కంటికి కనపడుతున్నదానిని వాటికున్న స్వరూపాలతోనే ఇది పరబ్రహ్మ స్వరూపము అని తలంచడం చేత శాంతికి కారణమవుతున్నది. అభయము లభిస్తున్నది. కనుక భయము కలుగడానికి అవకాశము లేదు. ఇదే నిజమైతే **"అథతస్యభయం భవతి"** అని ఇక వానికి భయము కలుగుచున్నది అని ఎందుకు చెప్పబడిందంటే! **యదాహ్యేవైషఏతస్మిన్నదృశ్యేऽనాత్మ్యేऽ నిరుక్తేऽ నిలయనేऽ భయంప్రతిష్ఠాం విన్దతే అథసోऽ భయంగతోభవతి** ఎపుడైతే ఈ ఉపాసకుడు కంటికి కనుపించని, ఇతరులు ఎవరూ తనకు ఆత్మలుగాలేని, ఇలాంటివాడని చెప్పజాలని, ఏదో ఒక్కచోటు అనకుండా అన్నింటా ఉండే సర్వాన్తర్యామి యందు అభయమును దృఢమైన దర్శనరూపమగు ప్రతిష్ఠను పొందుతాడో అపుడే వాడు దేనినుండీ భయములేనివాడౌతాడు అని పరబ్రహ్మయందు అభయప్రాప్తికి హేతువుగా చెప్పబడిన ఏ ప్రతిష్ఠ – నిశ్చలమైన ఉపాసనాత్మనిష్ఠ – చెప్పబడిందో దానికి తెంపుకలిగితే ఇక వానికి భయము కలుగుతుంది అని చెప్పబడింది. మహర్షులు కూడా దీన్నే చెప్పినారు. ఒక ముహూర్తము, క్షణకాలము వాసుదేవుని పాదపద్మములను కళ్యాణగుణాలను చింతించకుండా ఉన్నట్లయితే అదే ఒక గొప్ప సంపదను పోగొట్టుకున్నట్లు అది ఓ పెద్ద ఆపద. అదే మతిమరపులేక పిచ్చిఎక్కుట. అదే మరణముతో సమానమైన వికారము అని. ప్రతిష్ఠా అనగా పరమాత్మయందు చెదరని భక్తి కలుగుట. దానియందు అంతరము ఎడబాటు అవకాశము విచ్ఛేదమే.

**నస్థానతోऽ పి** అను బ్రహ్మ సూత్రముచేత ఎలాంటి విశేషములు లేనిదే బ్రహ్మ అని చెప్పనున్నాడు అని ఏదైతే చెప్పినారో అది తప్పు. అక్కడ కూడా బ్రహ్మసవిశేషమే అనియే చెపుతాడు. **మాయామాత్రంతు** అను సూత్రముతోను కలలో కనిపించిన వస్తువులకు మెలకువతో ఉన్నపుడు చూచిన, అనుభవించిన పదార్థాలతో పోలిక లేకపోవడంతో మాయా మాత్రములని చెప్పబడుతున్నది అని జాగరితావస్థలో అనుభవించిన వాటికివలెనే పారమార్థికత్వమునే చెప్పగలదు.

## - స్మృతి పురాణ ఘట్టము -

స్మృతులవల్లను పురాణములవల్లనున్నూ నిర్విశేషమగు జ్ఞానము మాత్రమే పరమార్థము అంతకుమించినదంతా అపరమార్థము అని తెలియవస్తున్నది అని ఏది చెప్పబడిందో అది సత్యము కాదు 1) **యోమామజమనాదించవేత్తి లోకమహేశ్వరమ్**. లోకాలన్నింటికిన్నీ గొప్ప ప్రభువునైన నన్ను పుట్టుకలేని వాడుగాను ఆదిలేనివాడుగాను ఎవడు ఎరుగునో 2) **మత్‌స్థాని** – సర్వప్రాణులున్నూ నాపైనే ఆధారపడియున్నవి. కాని నేను వాటిపైన ఆధారపడిలేను. ఈ భూతములు నాయందు లేవు. నాయొక్క ఈశ్వర శక్తి సామర్థ్యమేమిటో గమనించు. నాకు ఆత్మవంటివాడైన జీవుడు భూతముల చేత భావింపబడుతున్నాడు. భూతములను భరిస్తున్నాడు. కాని భూతములయందు లేడు 3) **అహంకృత్స్నస్య**.... ఈ సమస్త ప్రపంచానికి పుట్టుకకు కారణమైనవాడిని అట్లే ప్రళయము చేసేవాడినీనేనే. ఓ అర్జునా! ఈ జగత్తులో నన్ను మించినది ఏదీ లేదు. దారముపై మణులన్నీ గుదిగ్రుచ్చబడినిల్చి హారము రూపముగా ఉంటున్నవో అట్లాగే ఈ సమస్తమూ నాపైననే ఆధారపడియున్నది. 4) **విష్టభ్యాహమిదం కృత్స్నం ఏకాంశేన స్థితోజగత్**. నేను ఈ ప్రపంచమునధిష్టించియున్నాను. నాలోని ఒక్క శక్తి అంశముచేతనే ఈ సమస్త జగత్తూ నిల్చియున్నది. 5) **ఉత్తమః పురుషః**.... బద్ధముక్తరూప పురుషులకన్న శ్రేష్ఠుడైన పురుషుడొకడున్నాడు. అతడు నిత్యులకన్నా వేరైనవాడు. అతడినే పరమాత్మ అని పిలుస్తున్నారు. అతను ముల్లోకములలోనున్న జీవరాశి అంతటిలోనూ ప్రవేశించి ఎలాంటి మార్పులను పొందకుండానే వాటినన్నింటినీ శాసిస్తూ ఈశ్వరుడనబడుచూ వాటిని భరించుతున్నాడు. నశించే ప్రకృతిని అక్షరుడనబడే జీవుడినీ ఉత్తముడినై సరిసాటిలేక ఆ రెండింటినీ మించియుండి శాసిస్తున్నానో ఆ కారణంగా లోకములోను వేదములయందున్నూ "**పురుషోత్తముడు**" అని ప్రసిద్ధికెక్కినాను. **ఇంతవరకు భగవద్ గీతలోనివి. 6) స సర్వభూతప్రకృతిం**... ఓ మహర్షి! ఆయన సర్వభూతములకు మూలమైన ప్రకృతిని, దాని వికారాలను గుణాదులు దోషములను అధిగమించియున్నాడు. సప్తావరణములకు ఆవలనున్నాడు. అన్నింటికీ ఆత్మగానుంటూ అన్నీ తానైయైయున్నాడు. ఈ భువనాలన్నింటిలోపలా ఆయనయే నిండియున్నాడు. 7) **సమస్తకల్యాణ గుణాత్మకోఽ సౌ**.... ఈ పరమాత్మ అన్ని విధములైన మంగళరూపములను కల్గియున్నాడు. తన శక్తిలోని ఒక చిన్న అంశముతో అన్ని భూతాలను ప్రళయము నుండి పైకి లేవనెత్తి సృష్టిని గావించినాడు.

తన ఇష్టము ప్రకారముగానే తనకు నచ్చిన పలురకాల దేహాలను స్వీకరించి గొప్పశక్తి యుక్తులతో సమస్తప్రాణి కోటికి మేలు చేకూర్చినవాడితడు. తేజస్సు బలము అందరినీ శాసించే శక్తి గొప్పదైన విజ్ఞానము, ఉత్సాహము, చురుకుదనము, సామర్థ్యము మొదలైన గుణాలకు రాశి వంటివాడు. పరులము అని అనుకొనే రుద్రేంద్రాదులకున్నూ పరుడు. ఏ ఒక్క క్లేశము ఆయనకు లేదు. పరులకు చిన్నలకు ఈశ్వరుడు ఆయన. ఆయన వ్యక్తిగా విడిగా ఒక జీవిగాను పంచభూతముల కలయిక రూపమైన దేహముతోను ఉన్నాడు. ఆయన యొక్క నిజమైన స్వరూపమేదో తెలియదు. ఐనా తనను ప్రేమించినవారికి తేటతెల్లమైన స్వరూపము కలవాడు. ఆయన సర్వేశ్వరుడు అన్ని బాహ్యాభ్యంతర భావనాపరంపరను దర్శించగలడు. భూతభవిష్యత్ వర్తమానములను ఎరిగినవాడు. సమస్త శక్తులన్నీ ఒక్కరూపుగా నున్నవాడు. ఆయనకే పరమేశ్వరుడు అని పేరు. దోషములు ఏవీ లేక నిష్కపటమైన అందరికన్నా అధికమై నిర్మలమై సదా ఏకరీతిగా నుంటూ ఉన్న ఆ సద్వస్తువును పరమపురుషుడిని దేనితో దర్శించగలమో, తెల్సుకోగలమో అట్టి జ్ఞానమే నిజంగా జ్ఞానమని వ్యవహరింప బడుతుంది. దీనికి భిన్నమైనది అజ్ఞానమనబడుతుంది. 8) **శుద్ధేమహావిభూత్యాఖ్యే.....** ఓ మైత్రేయుడా! భగవచ్ఛబ్దము సర్వకారణములకున్నూ మూలకారణమైనవాడు, కర్మసంబంధము లేనివాడు గొప్ప విభూతికలవాడు అని చెప్పబడేవాడైన పరంబ్రహ్మ యందు మాత్రమే ఉపయోగింపబడుతుంది. భగవచ్ఛబ్దములోని భకారము రెండు అంశములను చెపుతున్నది. సంభర్తా చిదచిత్తులకు తగిన ఉపకరణములను ఇచ్చి (సృష్టించి)నవాడు, వాటికి యజమాని అని. ఇక గకారమున్నూ మూడు అర్థాలను తెల్పుతున్నది. పుణ్యపాపరూపమైన కర్మలకు తగినట్లు ముందుకు నడిపించేవాడు. తన సన్నిధికి వచ్చునట్లు చేసేవాడు, స్రష్ట అని. భకారగకారములను కలిపితే భగ శబ్దము ఏర్పడుతుంది. దాని అర్థము ఇది. సమగ్రమైన ఏ కొరతాలేని శాసనాధికారము, వీర్యము, యశస్సు, సంపదలు, జ్ఞానము బలము ఈ ఆరు అంశాల సముదాయానికి భగము అని పేరు. ఇవి కలవాడు భగవానుడు. 9) **వసన్తితత్రభూతాని..** పంచమహాభూతములకున్నూ ఆత్మయైన వాడు, అన్ని ప్రాణులను తన శరీరముగా చేసుకొని వాటికి ఆత్మయైన వానిలో భూతాలన్నీ నివసిస్తున్నవి. ఆయన కూడా వాటన్నింటిలోనూ అన్తరాత్మగా నివసిస్తున్నాడు. కానవకారార్థము ఇది. 10) **జ్ఞాన శక్తి బలైశ్వర్య...** జ్ఞానము శక్తి బలము ఐశ్వర్యము వీర్యము తేజస్సు సంపూర్ణములుగా నుండి ప్రకృతి సంబంధములైన హేయగుణాలు బొత్తిగా లేకుండినట్లయితే అవన్నీ

భగవచ్ఛబ్దముతో చెప్పబడుతాయి. ఓమైత్రేయుడా! ఇలాంటి ఈ గొప్పదైన భగవత్ శబ్దము పరబ్రహ్మయైన వాసుదేవునికే తప్ప ఇతరులకు చెల్లదు. ఆయన యందు మాత్రమే పూజ్యుడు అనే అర్థముతో యోగరూఢ్యర్థములు రెండింటియందున్నూ చెల్లుతుంది. ఆయనకన్నా ఇతరులయందు మాత్రము ఉపచారము – మర్యాద కొరకు మాత్రమే ప్రయోగింపబడుతున్నది. 11) **సమస్తాఃశక్తయశ్చ** ముందు చెప్పబడిన శక్తులన్నీ దేనియందు నిల్చియున్నాయో అట్టిరూపము శ్రీహరి రూపాలలో వేరైనది చాలా గొప్పది. ఓ రాజా! ఆయననే సమస్త శక్తి రూపాలను సృష్టిస్తున్నాడు. అవి దేవతలు, తిర్యక్‌లు మనుష్యులు చేష్టలు కల్గినట్టివన్నీనూ. ఇందుకు ఆయన శ్రమపడడంలేదు. ఒక ఆటగా మాత్రమే దీన్ని తన లీలావినోదముగా కావించుతున్నాడు. ఇదంతా కర్మ నిమిత్తంగా మాత్రమే జరుగుటలేదు. జగత్తులకు ఉపకారము కొరకే. అప్రమేయుడైన ఆయన చేష్ట అన్నింటా అడ్డము లేకుండా కొనసాగుతుంది. 12) **ఏవంప్రకారమమలం** – ఇలాంటి గుణగుణాలు కలదై నిత్యమూ, వ్యాపకము, నాశరహితము ఎలాంటి హేయ గుణములేనిది విష్ణులోకం అని చెప్పబడేది పరమపదము. 13) **పరఃపరాణాం** – పరులకందరికీ పరుడు ఆయన కంటే అధికుడు లేనట్టివాడు. బద్ధముక్త నిత్య ఆత్మలకున్నూ ఆత్మయైన వాడు. ఎవ్వరిపైనా ఆధారపడనివాడు. హృదయగుహలో ఉండేవాడు. రూపము రంగువంటి వాటితో విశేషింపబడక విశేషణములకు దూరమైనవాడు. తరిగిపోవుట, నశించుట, పరిణామము, వృద్ధి జన్మలు అనుభావవికారాలు లేనివాడు. ఎల్లవేళలలోను ఉన్నాడని చెప్పదగినవాడు. అన్నింటా ఆయన, సమస్తమూ ఆయన యందు ఉంటున్నాయి గనుక ఆయనను **వాసుదేవుడు** అని విద్వాంసులు వ్యవహరిస్తున్నారు. అదియే పరబ్రహ్మము. నిత్యమైనది. పుట్టుకలేనిది. నాశము లేనిది. వికారములు లేనిది. ఎల్లప్పుడూ ఒకే రూపముతో నుండు నట్టిది. హేయమైన ప్రకృతి సంబంధము లేనిది గనుక నిర్మలము. ఆ బ్రహ్మయే ఈ వ్యక్తావ్యక్త స్వరూపములతో జగద్రూపముగా నున్నది. అట్లే జీవస్వరూపముతోను కాలరూపముగానూ ఉన్నది. 14) **ప్రకృతిర్యా....** వ్యక్తా వ్యక్తస్వరూపములతో నున్న ప్రకృతి, బద్ధులు ముక్తులు అనబడు ఈ పురుషులిద్దరూ పరమాత్మయందు కలసిపోవుదురు. పరమాత్మ అందరికీ ఆధారమైన వాడు పరమేశ్వరుడున్నూ. ఆయనే వేదములయందు వేదాంతములయందున్నూ **విష్ణువు** అని పేరుతో ప్రశంసింపబడుతున్నాడు. 15) **ద్వేరూపే** – ఆ పరబ్రహ్మకు మూర్తము అమూర్తము అని రెండు రూపాలున్నాయి. వాటికే మరో పేరు క్షరాక్షరములు అవి అన్ని

భూతములయందూ ఉన్నవి. అక్షరమనువాడు పరబ్రహ్మ. ఈ సమస్త జగత్తూ క్షరమనబడుతున్నది ఇది నశిస్తుంది. అక్షరము ఎల్లవేళలా ఉండునట్టిది. ఒక ప్రదేశమునందున్న అగ్నియొక్క కాంతి అన్నిదిక్కులలోనూ వ్యాపించియుంటున్నది. అలాగే పరబ్రహ్మ యొక్క శక్తి ఈ జగత్తు రూపములో దశదిశలా నిండియున్నది. 16) **విష్ణుశక్తిః** – విష్ణుశక్తి పరా అని చెప్పబడుతున్నది. క్షేత్రజ్ఞ శక్తికి అపరా అని పేరు. **అవిద్యా అనేది** మూడవ శక్తి. దీనికే **కర్మము** అని పేరు. ఓ రాజా! అన్నింటిలోనూ దూరగల్గిన క్షేత్రజ్ఞశక్తి అవిద్యా అనే శక్తి చేత కప్పివేయబడి అతివిస్తారములైన పుట్టుట చచ్చుట అనే సంసారతాపాలను అన్నింటినీ తప్పించుకోలేక తలవంచి అనుభవిస్తున్నది. క్షేత్రజ్ఞుడు అను పేరుగల శక్తి అవిద్యా।కర్మ శక్తి చేత కప్పివేయబడినదై సర్వభూతాలలోనూ ఎక్కువతక్కువలతో ఉంటున్నది 17) **ప్రధానం చపుమాంశ్చైవ** – ఓ గొప్ప తెలివికలవాడా! ప్రధానమనబడే ప్రకృతి క్షేత్రజ్ఞుడనబడే పురుషుడు ఇద్దరున్నూ పరస్పరము ఆశ్రయించి యుంటారు. వారు అలా కలిసి ఉండడానికి కారణము విష్ణుశక్తి. ఈ విష్ణుశక్తి సర్వభూతములకున్నూ ఆత్మగా ఉండేటువంటిది. ప్రకృతి పురుషులు కల్సిఉండడానికి హేతువైన విష్ణుశక్తియే ఆ రెండు విడిపోవడానికిన్నీ హేతువవుతున్నది. నీళ్ళమీద నుండి పారినగాలి వందల కొలది సూక్ష్మకణాలను తనలో కల్గియున్నట్లే ప్రధాన పురుషులనున్నూ విష్ణుశక్తి భరిస్తున్నది. **ప్రధానరూపములుగా నుంటున్నది కూడా విష్ణుశక్తియే సుమా!** 18) **తదేతదక్షయం** – ఓ మునివరా! ఈ జగత్తు అంతాకూడా విష్ణుశక్తి చేత నిర్వహింపబడుతూ ఉన్నందున అక్షయము నిత్యమూఐ యున్నది. కాని ఆవిర్భావ తిరోభావములతో కూడి పుడుతున్నది. నశిస్తున్నది అన్నట్లు కనిపిస్తున్నది. ఇత్యాదివాక్యములతో పరంబ్రహ్మ సహజంగానే దోషముల వాసన కూడా ఏ మాత్రము లేనివాడు. అన్ని రకములైన మంగళగుణములు కలవాడు, లోకాలను పుట్టించుట, వాటిని రక్షించుట, ప్రళయకాలములో తనలో చేర్చుకోవడము, సృష్టివేళ ప్రకృతిపురుషులను తనలో నుండి వెలిగక్కి చిదచిన్మిశ్రమైన భూతప్రపంచము నందు అన్తరాత్మగా ప్రవేశించడము, వాటికి తెలియకుండా ఉండడం వాటిని ఆయా పనులను చేయడంలో మానడంలో అనుమతి, నిరాకరణల ద్వారా నియంత్రించడము, శరణుజొచ్చిన వారిని సంసారసాగరము నుండి ఉద్ధరించి తన పాదపద్మముల సన్నిధికి చేర్చుకుని శాశ్వతానందరూపకైంకర్యమును ప్రసాదించడము అనే లీలలు కల వాడినిగాను ప్రతిపాదించి, అన్ని అవస్థలలోనూ ఉన్న సమస్త చిదచిత్తులకూ పారమార్థికత్వమును చెపుతూ పరంబ్రహ్మకు శరీరముగా నుండుట

వాటి స్వరూపముగా, శరీర, రూప, తను, అంశ, శక్తి విభూతి ఆది శబ్దాలతో పరమాత్మతో సామానాధికరణ్యమునున్నూ తెలిపి, ఆయన యొక్క విభూతిలో ఒక భాగమైన చిద్వస్తువునకు సహజమైన స్వరూపముతో నుండుటను, అచిత్తు అనబడే ప్రకృతితో కలిసియున్నందున క్షేత్రజ్ఞుడను రూపములో (జీవుడుగా) నుండుటను చెప్పి, క్షేత్రజ్ఞావస్థలో పుణ్యపాపములనబడే కర్మరూపమనే అవిద్య చేత చుట్టుకొనబడి నందున, తనకు సహజమైన జ్ఞానరూపత్వమును తలచుకొనకపోవడము, అచిద్ రూపమైన వస్తువుగా భావించబడమున్నూ పైప్రమాణాల వల్ల తెలియవస్తున్నది. స్పష్టంగా ప్రతిపాదించబడినది కూడాను. కావున **"పరంబ్రహ్మ సవిశేషము. నిర్విశేషము కాదు. ఆయన విభూతిలో భాగంగా ఉన్నందున జగత్తు కూడా పరమార్థమే"** కాని మిథ్య, లేనిది, ఉన్నట్లుగా కనిపించేదికాదు. ఉన్నది కావుననే ఉన్న స్థితి కనిపిస్తున్నది.

**ప్రత్యస్తమితభేదం** అను శ్లోకము వద్ద దేవమనుష్యాది ప్రకృతిలోని పరిణామవిశేషాలతో సృష్టింపబడిన ఆత్మ యొక్క స్వరూపము, దానిలో భేదము లేకపోవడము, భేదాలను తెలిపే దేవాది శబ్దాలకు అందక జ్ఞానమును కల్గియుండడము అనే ఏకైక లక్షణములో తనవల్ల మాత్రమే తెలియబడేదిఐ ఉండుటవల్ల యోగము చేసే వాని మనస్సు తెలియరాదు అని చెప్పుతున్నది కావున ప్రపంచము లేదని మిథ్యయని చెప్పబడడం లేదు. ఇది ఎలా తెలుస్తున్నది అంటే చెపుతున్నాము వినండి.

**ఖాండిక్యకేశిధ్వజో పాఖ్యానము నందు** – సంసారమనే రోగానికి ఒకే ఒక్క మందు యోగము అని చెప్పి, యోగములోని విభాగాలను ప్రత్యాహారము వరకు చెప్పి **"ధారణా"** సిద్ధి కొరకు (అష్టాంగాల్లో ఇది ఒకటి) శుభాశ్రయాన్ని చెప్పపూనుకున్నాడు. పరబ్రహ్మయైన విష్ణువు యొక్క రెండు శక్తులుగా చెప్పబడిన రూపములు మూర్తము, అమూర్తము అని విభజించి చెప్పి మూడవ శక్తి రూపమైన కర్మ అనే మరో పేరుగల అవిద్యచే చుట్టుకోబడిన అచిద్విశిష్టుడైన క్షేత్రజ్ఞుడిని (జీవుడిని) మూర్తాఖ్యమైన విభాగముగా పేర్కొన్నాడు. భావనాత్రయము 1) **కర్మభావన 2) బ్రహ్మభావనా 3) ఉభయభావన** అనే వానితో సంబంధమున్నది కాబట్టి మూర్తము అనే పేరు గల ఈ బ్రహ్మ స్వరూపము **అశుభము** అని చెప్పినాడు. కర్మ మనే అవిద్యా సంబంధము లేని, ప్రకృతితో సంబంధము లేక విడిగా ఉన్న జ్ఞానమే ఒక్క ఆకారముగా నున్న అమూర్తము అనే రెండవదైన స్వరూపము యోగము సిద్ధించిన యోగులకు ధ్యానము

చేయుటకు ఆలంబనముగా నుండతగినది కాదు. స్వయంగా కర్మసంబంధము లేనిదికాదు. భగవదనుగ్రహము చేతనే పూర్వము ఉండిన కర్మనుండి విముక్తి జరిగినందున శుభాశ్రయము కాదని నిషేధించినాడు. (అనగా కర్మ సంబంధులైన బద్ధులు, ఇప్పుడు లేకపోయినా ఒకప్పుడు కర్మ సంబంధము కల ముక్తాత్మలు ధ్యానించదగిన శుభాశ్రయులు కారు) పరశక్తి రూపమైన ఈ అమూర్తము, అపరశక్తిరూపమైన క్షేత్రజ్ఞుడు అను పేరుగల మూర్తరూపమున్నూ పరశక్తిరూపమైన ఆత్మకు క్షేత్రజ్ఞతా దశ (జీవదశ) కలుగడానికి కారణమైన తృతీయ శక్తిగా నున్న కర్మరూపమైన అవిద్యనున్నూ కలిసి ఈ మూడు శక్తులకు ఆశ్రయమైనదై భగవంతుని యొక్క అసాధారణ రూపము **ఆదిత్యవర్ణంతమసస్తుపారే** ఇత్యాదివేద వాక్యాల చేత సిద్ధాన్తితమైన మూర్తరూపము "**శుభాశ్రయము**" అని చెప్పబడింది. ఇచట **కర్మసంబంధములేని పరిశుద్ధాత్మ స్వరూపుడికి** (ముక్తాత్మ) **శుభాశ్రయతానర్హతను చెప్పడానికి" ప్రత్యస్తమితభేదం యత్ అని చెప్పబడుతున్నది**. ఇది ఇలాగా – **నతద్యోగయుజాశక్యం** – ఓ రాజా! యోగసాధన చేసేవాడికి చిన్తన చేయడానికి సాధ్యము కాదు ఆ రూపము. విష్ణు సంజ్ఞ గల పరబ్రహ్మ యొక్క రెండవదైన ఉత్కృష్ట స్వరూపమే పరమపద మూర్తియే ధ్యానించుటకు అనువైనది. ఇంతకుమునుపు చెప్పిన శక్తులు అన్నీ ఆయన యందు మాత్రమే నిల్చియున్నవి. జగదాకారంగా కనిపించే శ్రీహరి రూపానికి మరొక్క రూపమది. అది చాలా గొప్పది అని చెప్తాడు. అట్లే బ్రహ్మ, సనక సనందనాదులు జగత్తులో ఒక భాగాలే. వారు అవిద్యతో చుట్టబడి యున్నవారే. కావున శుభాశ్రయత వారికి లేదు. అని చెప్పి, బద్ధులేఐనా వారు చేసిన యోగసాధన కారణంగా జ్ఞానమును కల్గినవారై తమదైన జ్ఞానానందమయమైన స్వరూపాన్ని పొందిన ముక్తులకు సహజంగా శుద్ధి (కర్మసంబంధము లేకుండా ఉండుట) లేనందున భగవంతుడగు శౌనకుడు శుభాశ్రయత లేదని చెప్పినాడు. **ఆ బ్రహ్మస్తంబ పర్యంతాః** – చతుర్ముఖబ్రహ్మను మొదలుకొని గడ్డి పరకవరకు ఉన్నవారందరు జగత్తులోని ఒక భాగములే అయ్యి ఉన్నవారే. కనుక తమ తమ కర్మలవలన ఏర్పడిన సంసారమునకు లొంగినడచుకొనవలసిన వారే. కావుననే వారు ఎవ్వరు కూడా ధ్యానము చేసే వారికి ధ్యానములో ఉపకరించరు. అవిద్యాన్తర్గతులై సంసారములో కనిపిస్తున్నారు. తరువాత వారికి జ్ఞానము కల్గినా వారు కూడా ధ్యానములో ఉపయోగపడరు. వారికి కలిగిన జ్ఞానము సహజ సిద్ధమైనది కాదు. పరమాత్మ దయ వల్ల సిద్ధించింది. అందుచేత పరబ్రహ్మ కర్మ సంబంధము బొత్తిగా లేక సహజమైన జ్ఞానము కలవాడైనందున

శుభాశ్రయుడు అని చెపుతూ పరబ్రహ్మ ఐన విష్ణువునకు చెందిన, ఆయనకు మాత్రమే తగినదైన అసాధారణ స్వరూపము ఏదో అదే శుభాశ్రయము అని చెప్పబడింది. కనుక ఈ సందర్భములో / విష్ణుపురాణములో భేద ప్రసక్తి లేదు.

**జ్ఞానస్వరూపమఖిలం** అనే చోటనున్నూ జ్ఞానము కంటే వ్యతిరేకమైన సమస్త పదార్థాలు మిథ్యా భూతాలే అని ఏమీ ప్రతిపాదింపబడడంలేదు. జ్ఞానస్వరూపమైన ఆత్మను దేవుడు మనుష్యుడు అని/ కనిపిస్తున్నాడను కోవడము భ్రాన్తి అని ఇంత మాత్రమే చెప్పబడింది. ముత్యపు చిప్ప యందు వెండిగా కనిపించడము భ్రాంతి అని చెప్పితే జగత్తులో కనిపించే నిజమైన వెండి అంతా మిథ్య కాదు. జగత్తు బ్రహ్మలు రెండింటికీ ఉన్న సామానాధికరణ్యము వల్ల భేదము లేక ఐక్యతనే కనిపిస్తున్నది. జ్ఞానస్వరూపుడైన బ్రహ్మకు అర్థాకారత భ్రాన్తి యని చెపితే జగద్ బ్రహ్మలకున్న ఐక్యత వల్ల మొత్తము పదార్థము (జగత్తు) మిథ్య అని చెప్పినట్లే ఔతుంది కదా అనవచ్చును. అది సరికాదు – ఈ విష్ణు పురాణమనే శాస్త్రమునందు పరబ్రహ్మయైన, అజ్ఞానాది దోషాల వాసనేలేని, సమస్త కళ్యాణగుణాలు కల, మహావిభూతి కల శ్రీమహావిష్ణువును తెల్పుతున్నందున ఆయనకు భ్రాన్తిదర్శనము కలుగడానికి అవకాశమే లేదు. సామానాధికరణ్యముతో జగత్ బ్రహ్మలకు ఐక్యమును ప్రతిపాదించడమున్నూ బాధను సహించదు, విరుద్ధమున్నూ కాదని దీని వెంటనే ప్రతిపాదింపబడగలదు. కనుక ఈ శ్లోకము కూడా అర్థస్వరూపాన్ని బాధించడము లేదు.

అదెలాగంటే. **యతోవా – ఎవ్వనివల్ల ఈ భూతములు అన్నీ పుడుతున్నవో, ఎవనివల్ల పుట్టినవి అన్నీ బ్రతుకుతున్నవో, ఎవనినుద్దేశించి బయలుదేరిపోతున్నవో, అత్యంత ప్రళయకాలములో ఎవనిలో ప్రవేశిస్తున్నవో – అలాంటిదేదో తెల్సుకో. అదే బ్రహ్మ** అని జగత్తుయొక్క జన్మాదులకు కారణమైన బ్రహ్మ అని గుర్తించితే **ఇతిహాసపురాణములద్వారా వేదము చెప్పిన అర్థాన్ని వివరించి బలపర్చాలి**. **కొద్దిగా తెల్సుకున్న వాడిని చూచి నన్ను వీడు మోసగిస్తాడు, విపరీతార్థాన్ని, ఉన్న దానికి భిన్నంగా చెపుతాడని వేదము భయపడుతుంది** అని శాస్త్రము (మనుస్మృతి) చెప్పిన విధంగా వేదార్థానికి ఇతిహాసములు, పురాణములచేత ఉపబృంహణము చేయాలని తెలుస్తున్నది. ఉపబృంహణము అనగా సకలవేదములు, వేదార్థములునున్నూ తమ యోగాభ్యాసమహిమవల్ల వేదములోని నిజమైన అర్థాలను తెల్సుకొనిన మహానుభావుల వాక్కులతో తాను చక్కగా తెల్సుకున్న వేదవాక్యముల అర్థాలను

వెల్లడించడము. వేదములోని అన్ని శాఖల్లో అక్కడా అక్కడా చెప్పబడిన వాక్యార్థాన్ని ఏ కొంచెమో తెల్సుకున్నందువల్ల పూర్తిగా తెల్సుకోవడం చాలా కష్టమైన పని కాబట్టి ఉపబృంహణము లేకుండా నిశ్చయము ఒకటి చేయడము కుదరదు గనుక మహర్షులు చెప్పిన వాక్యాల వల్ల ఉపబృంహణమును తప్పక చేయాల్సిందే.

ఆ సందర్భముగానే పులస్త్యుడు వసిష్ఠుడు అనబడే మహానుభావుల వరముల వల్ల పరదేవత, పరమార్థాలను గురించి చక్కని జ్ఞానము కల భగవంతుడైన పరాశర మహర్షి నుండి తాను నేర్చిన వేదము యొక్క అర్థానికి ఉపబృంహణాన్ని కొరుతూ మైత్రేయుడు ఇలా అడిగినాడు. **ఓ ధర్మములనెరిగిన మహానుభావా! తమరి నుండి కొన్ని ధర్మ సందేహాలను గురించి వివరాలను తెల్సుకోగోరుతున్నాను. అవి ఏమంటే! ఈ జగత్తు ఎలా పుట్టింది? తరువాతి కాలములోనూ, కల్పాలలోను ఎలా సంభవిస్తుంది. ఓ బ్రహ్మర్షే! ఈ ప్రపంచానికి ఉపాదాన కారణము ఏది? నిమిత్త కారణమున్నూ ఏది? ఇంతకు మునుపు దేనిలో। ఎవనిలో లీనమయ్యింది? తిరిగి దేనిలో లీనమవుతుందో వివరించండి** అంటూ ప్రశ్నించినాడు. ఇంకా ఇటువంటివే పలు ప్రశ్నలున్నూ ఉన్నాయి. ఇచ్చట బ్రహ్మస్వరూపము దానిలోని విశేషము, ఆయన యొక్క విభూతి, అందులోని భేదాలు వాటి విశేషాలు/ ప్రకారాలు, బ్రహ్మను ఆరాధించే విధానము, దాని స్వరూపము ఫలవిశేషాలనున్నూ అడిగినాడు. బ్రహ్మస్వరూప విశేషాన్ని గూర్చిన ప్రశ్నలలో **యతశ్చఏతత్ చరాచరమ్** అనే దాని ద్వారా నిమిత్త ఉపాదానకారణముల గురించి అడుగబడింది. **యన్మయమ్** అనే ప్రశ్న ద్వారా సృష్టించబడి, నిలుస్తూ ఉండి, లయములను పొందుచున్న జగత్తు దేన్ని ప్రచురంగా కల్గి ఉన్నదని అడిగినాడు. దానికి సమాధానము **జగచ్చసః** జగత్తున్నూ ఆయనయే అని. ఇచ్చట చెప్పబడిన అబేధము / తాదాత్మ్యము అన్తర్యామిగా పరబ్రహ్మ జగత్తు అంతటా నిండియున్నందున వ్యాపనక్రియవల్ల ఏర్పడింది. కాని వ్యాప్యము వ్యాపకముల కుండే వస్తు ఐక్యత వల్ల ఏర్పడింది కాదు. యన్మయం (ఏది ప్రచురముగా గలది) అను ప్రశ్నకు జగచ్చసః (జగత్తు ఉన్నూ ఆయనయే) సామానాధికరణ్యానికి ఉత్తరముగా చెప్పబడిన మయట్ ప్రత్యయార్థము **"వికారమును"** చెప్పేది కాదు. విడిగా అందుకు ప్రశ్నవేయవలసిన అక్కరలేదు. పోనీ ప్రాణమయము అని అన్నట్లుగా స్వార్థమును బోధిస్తున్నదా? అంటే అదిన్నీకాదు. అపుడుజగచ్చసః జగత్తున్నూ అతడే అని సమాధానామూ పొసగదు. విష్ణురేవ (విష్ణువే) అని ఉత్తరము అయ్యుండేది.

కావున ప్రాచుర్యార్థమే చెప్పుకోవాలి. తత్ప్రకృత వచనే అని మయట్ ప్రత్యయము విధింపబడుతున్నది. జగత్తు అంతయూ ఆయనకు శరీరము ఐనందువల్ల తత్ ప్రచురమే. అందువల్ల యన్మయం అనేదానికి బదులు జగచ్చసః అని చెప్పబడింది. దానివల్ల చెప్పబడిన సామానాధికరణ్యము జగత్ బ్రహ్మలకు "**శరీరము ఆత్మ**" రూప సంబంధము ఐనదని నిర్ణయింపబడుతున్నది. అలా కాకుండా నిర్విశేషమైన వస్తువునే ప్రతిపాదించేదిగా నున్నట్లయితే, శాస్త్రమున్నూ అలాగే చెప్పేటట్లుంటే **మైత్రైయుడి ప్రశ్నలు** పరాశరుడి సమాధానాలు సమంజసములుకావు. వివరణ రూపమైన గ్రంథ మంతా పొసగకుండా పోతుంది. అలాగే ఐతే ప్రపంచ భ్రమమునకు అధిష్ఠానము ఏది? అనే ఏకైక ప్రశ్నకు నిర్విశేష జ్ఞానమే అనేటువంటి ఒకే ఒక జవాబు సిద్ధమయ్యేది. జగత్తు పరబ్రహ్మ రెండున్నూ ఒకే ద్రవ్యమే ఐనట్లయితే సామానాదికరణ్యమూ దాన్నే వివరించితే సత్యసంకల్పాది గుణములకు ఏకైక స్థానము నిఖిలహేయ ప్రత్యనీకతా అనేవి బాధింపబడేవి. పరబ్రహ్మ అన్ని అశుభములకు ఆస్పదము అయ్యేడిది. కనుక ఆత్మ శరీరభావమునే సామానాధికరణ్యము ప్రధానాంశముగా చెపుతున్నదని మునుముందు దృఢపరచబడగలదు. కావుననే **విష్ణోః సకాశాదుద్భూతం** – విష్ణువు వద్ద నుండి పుట్టిందీ జగత్తు. ఆయన యందే నిల్చియుంటున్నది. ఈయనే జగత్తుకు సంబంధించి స్థితిని సంహారమునున్నూ చేస్తున్నాడు. జగత్తు కూడా ఆయనే. అని సంగ్రహముగా చెప్పబడిన అర్థమే **పరఃపరాణాం** అను శ్లోకముతో మొదలుపెట్టి విస్తారంగా వివరించదలచి పరబ్రహ్మయైన భగవంతుడగు విష్ణువును తనదైన స్వరూపముతో నున్నవాడిని **అవికారాయ** అనే శ్లోకముతో తొలుత నమస్కరించి ఆయన్నే హిరణ్యగర్భుడు, తన అవతారమై ఐన శంకరరూపాన్ని, త్రిమూర్తులను, ప్రధానము, కాలము, క్షేత్రజ్ఞుడు సమిష్టి వ్యష్టి రూపముతోనున్నూ ఉన్నవాడిని నమస్కరించుతున్నాడు. ఆ సందర్భములో **జ్ఞానస్వరూపం** అనే శ్లోకము క్షేత్రజ్ఞుడుగా విడిగా (వ్యష్టి) గానున్న పరమాత్మ యొక్క స్వభావాన్ని చెప్పినాడు. కావున ఇచ్చట నిర్విశేష వస్తువును గురించిన ప్రతీతి లేదు.

ఒకవేళ నిర్విశేషరూపమైన బ్రహ్మ యందు అధిష్ఠానము జగత్తు అంతా భ్రమరూపముగా కనిపిస్తున్నదని ఈ శాస్త్రం ప్రతిపాదించేది ఐనట్లయితే **నిర్గుణుడు, అప్రమేయుడు, కర్మరహితుడు నిర్మలమనస్కుడు ఐన బ్రహ్మకు సర్గాదులకు (కర్తృత్వము) ఎలాగా అంగీకరింపబడుచున్నది?** అని ప్రశ్న; **తపస్వులలో శ్రేష్ఠుడవైన**

**ఓ మైత్రేయుడా! అన్ని విధాలైన భావపదార్థాల యొక్క శక్తులు చింతించలేనివి. జ్ఞానమునకుగోచరములయ్యేవీకావు.అలాగేపరమాత్మయొక్కసర్గాదులైనశక్తులున్నూ అచింత్యములు. ఊహలకందని వన్నీ ఆశక్తులు బ్రహ్మకు స్వాభావికమైనవి. అగ్నికి ఉష్ణము ఎలా సహజమో నారాయణునికి ఇవి సహజములు** అని సమాధానమున్నూ కుదిరేది కాదు. నిర్విశేషబ్రహ్మను గురించియే ప్రతిపాదించునట్లైనచో నిర్గుణుడైన బ్రహ్మకు సర్గాదికర్తృత్వము ఎలాసిద్ధిస్తుంది? అని చోద్యము బ్రహ్మకు పారమార్థికంగా సర్గకర్తృత్వము లేదు. అది భ్రాంతితో పరికల్పించబడిందే అన్ని ప్రశ్న సమాధానాలు అయ్యేడివి. ఉత్పత్తి స్థితిలయములు అనే కార్యాలు సత్వరజస్తమస్సులనే గుణములు కలవారై ఎంత అనుభవించినా వడిసిపోని కర్మలు గలవారియందే కనిపిస్తున్నవి. కాని సత్వాది గుణములు లేనివాడు పరిపూర్ణుడు కర్మకు వశము కానివాడు, అసలు కర్మసంబంధము ఏర్పడుటకే తగనివాడు ఐన బ్రహ్మకు సర్గాది కార్యములకు కర్తృత్వము అంగీకరించేది ఎలా? అని ప్రశ్న ఏర్పడి, కనపడే ప్రపంచానికి పూర్తిగా విరుద్ధమై సజాతీయుడు గాని బ్రహ్మకు ఇంతకుముందు చెప్పినట్లు నిఖిల హేయప్రత్యనీకమైన కళ్యాణగుణ పూర్ణునికి సత్యకాముడికి సత్యసంకల్పుడికి బొత్తిగా విసజాతీయమైన నీటికి అగ్నిదైన వేడిమి స్వభావము సిద్ధించినట్లు సర్వశక్తియోగము వైరుధ్యమును ఎంతమాత్రము కలిగించదు అని పరిహారము చెప్పుట కుదిరినది.

**పరమార్థఃత్వమేవఏకః** – పరమార్థము నీవు ఒక్కడివి మాత్రమే అనునటువంటి వాక్యాలున్నూ బ్రహ్మను వదిలి సమస్త జగత్తునకు అపరమార్థతను చెప్పడం లేదు. అయితే ఇదంతా తదాత్మకము. ఆయనకు శరీరము ఆయనను ఆత్మగా కల్గియున్నది – కనుక ఆయనకు భిన్నస్వభావము కలదియై వ్యతిరేకముగా ఉన్నది కాబట్టి అపరమార్థము ఔతున్నది. దాన్నే ప్రతిపాదిస్తున్నాడు. **ఇది నీమహిమయే. ఈ చరాచర ప్రపంచాన్నంతటినీ వ్యాపించి యున్నావు**. తవైషమహిమా అని. ఈ చరాచర ప్రపంచాన్ని అంతటిలోనూ వ్యాపించియున్నావు. కావుననే ఇదంతా త్వదాత్మకము. ఇటువంటి వాడు నీకన్న వేరొకడు లేదు. అందువలన అందరికీ అన్నింటికీ ఆత్మవైనందున నీ వొక్కడివే పరమార్థము. అందుచేతనే ఇది నీయొక్క మహిమ అన్నింటిలో నిండియుండుట అని చెప్పబడింది. కానిచో ఇదినీ భ్రాన్తి అని చెప్పవలసియుండింది. అంతే కాకుండా శ్లోకము లోని జగతఃపతే। త్వమ్ మున్నగు పదాలకు లక్షణార్థము చెప్పుకోవలసి వచ్చేది. బ్రహ్మాండకటాహములో మునిగిపోయిన

భూదేవిని చిన్నపిల్లవాని ఆటలాగా పైకిలేవనెత్తిన భగవంతుడైన శ్రీ ఆదివరాహమూర్తిని స్తోత్రము చేస్తున్న ప్రకరణానికి విరోధమున్ను కలిగియుండెడిది.

ఈ సమస్త జగత్తు జ్ఞానాత్ముడైన నీచే ఆత్మగా నిండి యుండినందున మూర్తమైయున్నది. అందుచేత ఈ జగత్తును త్వదాత్మకంగా దర్శించే అనుభవాన్ని కల్గించే యోగసాధన లేని వారు ఇదంతా కేవలం దేవతలు మనుష్యులు జన్తువులు అనే ఆకారాలతో నిండి ఉన్నదని భ్రాంతి జ్ఞానముతో చూస్తున్నారు అని **యదేతత్ దృశ్యతే** – ఈ కనపడేది ఏదైతే ఉన్నదో – అనే శ్లోకంతో. త్వదాత్మకమైన ఈ జగత్తును కేవలము దేవతలు మనుష్యులు అని భావించడమే భ్రమకాదు. జ్ఞానా కారములైన ఆత్మలను దేవమనుష్యాది ఆకారములుగా చూడడం కూడా భ్రమయే నని **జ్ఞానస్వరూపం అఖిలం** – ఈ కనిపించేది అంతా జ్ఞానస్వరూపమే – అనే శ్లోకంతో చెపుతున్నాడు. ఎవరైతే బుద్ధిమంతులై ఉన్నారో వారు ఆత్మ జ్ఞాన స్వరూపము అని తెల్సుకున్నవారు ఇదంతా భగవదాత్మకము అనే అనుభవమును సాధించడానికి తగిన పరిశుద్ధమైన మనస్సులు కలవారో వారందరున్నూ ఈ సమస్త జగత్తును దేవతలు మనుష్యులుగా ప్రకృతి పరిణామ విశేషమైన నీరూపము అని ఎంచి శరీరము కంటే వేరుగా నున్న జ్ఞాన స్వరూపమైన ఆత్మను నీకు శరీరముగా దర్శిస్తున్నారు అని – **యేతు జ్ఞానవిదః** – ఎవరైతే జ్ఞానస్వరూపాన్ని తెల్సుకొనియున్నారో – అను శ్లోకము ద్వారా చెప్పినాడు. అలా కాకపోతే చెప్పిన శ్లోకాలకు మళ్ళీ చెప్పడము – **పౌనరుక్త్యమ్** అనే దోషము, పదాలకు **లక్షణా,** అర్థ విరోధము, ప్రకరణ విరోధము, శాస్త్రతాత్పర్యవిరోధము అనే ఐదు దోషాలు వస్తాయి.

**తస్యాత్మపరదేహేషు సతోఽ ప్యేకమయం** – తన ఇతరులయొక్క శరీరాల యందు ఉన్నవానికి ఈ స్వరూపము ఒక్కటే – అనే చోటనున్నూ ఆత్మలన్నీ జ్ఞానముతో ఏకాకారములు ఐనందున వీడు దేవుడు, వీడు మనుష్యుడు మొదలుగా గల రీతులలో ప్రకృతి పరిణామ విశేషరూపమైన పిండము నందు కల్సియున్నందున ఏర్పడిన దాన్ని ఆత్మలయందు దేవాది ఆకారులగా ద్వైతము – శరీరము + ఆత్మ – రెండుగా చూడడము భ్రమ / అతథ్యము అని చెప్పబడుతున్నది. పిండము నందున్న, ఆత్మ యందున్న ద్వైతమును – రెండుగా నుండుటను – నిషేధించడం లేదు. కాని దేవతలు మనుష్యులు మొదలైన పలురకాలైన ఆశ్చర్యకరాలైన మాంసపు ముద్దలయందున్న **"ఆత్మ"** అనబడే వస్తువంతా సమానమే. ఒక్కటే అని అర్థము. భగవంతుడగు

శ్రీకృష్ణుడిదే విషయాన్ని చెప్పినాడు. **శునిచైవ శ్వపాకేచ పండితాః సమదర్శినః** పండితులైన వారు నీచజంతువుఐన కుక్క యందు, దాన్ని వండు కొని తినే చండాలుని యందున్నూ సమదృష్టి కల్గి ఉన్నారు. 2) **నిర్దోషంహి సమంబ్రహ్మ** – బ్రహ్మదోషములు లేనట్టిది అంతటా సమమైనది – మొదలైన వాక్యాలయందు ఆత్మ పరదేహములందు ఉన్నదానికి అని దేహానికంటే వేరయిన వస్తువు నందు స్వపర విభాగమును చెప్పినారు.

**యద్యన్యోఽ స్తి పరఃకోఽ పి** – ఒకవేళ అన్యుడు, పరుడు అని ఎవడైనా ఉన్నప్పటికీ – అనే స్థలమునందున్నూ ఆత్మ ఒక్కటే ఉన్నదనే ఆత్మైక్యము తోచడము లేదు. **"ఒకవేళనాకంటే పరుడు ఎవడైనా ఒకడు"** అని ఒకే అర్థము నందు పరశబ్దము, అన్యశబ్దములను ప్రయోగించడము పొసగదు కాబట్టి. పరశబ్దము స్వవ్యతిరిక్తమైన – తనకంటే వేరయిన – ఆత్మను చెప్పేది. అన్య శబ్దము వాడికి కూడా జ్ఞానమే ఏకాకారము కాబట్టి అతని కంటే వేరైనదాన్ని నిషేధించునట్టిది. ఇక్కడ చెప్పేది ఇది. – ఒకవేళ నాకంటే వేరయిన ఎవరైన ఒక ఆత్మ నా ఆకారమైన జ్ఞానాకారంకంటే వేరయిన ఆకారము కలవాడు ఉంటే అపుడు నేను ఇలాంటి రూపము కలవాడిని వీడు మరొక ఆకారాన్ని కలవాడు అని చెప్పడానికి వీలవుతుంది. అలాగా ఏమీ లేదు. అందరి ఆకారమూ జ్ఞానమే ఐనందున సమానమేఐ ఉన్నది.

**వేణురంధ్ర విభేదేన** – పిల్లనగ్రోవి లోని రంధ్రముల భేదము వలన – అనే చోటనున్నూ వ్యక్తుల ఆకారములలోని ఎగుడుదిగుడులు ఆత్మల స్వరూపాన్ని బట్టి ఏర్పడింది కాదు. దేవాది శరీరాలలో దూరినందున ఏర్పడినట్టిది అని ఉపదేశింపబడుతున్నది. కావున **"ఆత్మైక్యము"** లేదు. ఉదాహరణలోనూ పలు రంధ్రాలలో నున్న వాయు అంశాలకు స్వరూపైక్యము లేదు. కాని ఆకార సామ్యమున్నది. సరిగమ ఆదులుగా పలుకబడుతున్న వాటికి వాయు అంశాలైనందున ఒకే ఆకారము ఉన్నప్పటికీ ఆయారంధ్రాలలో నుండి వెలువడినవి కాబట్టి షడ్జము మధ్యమముగా గాంధారము వంటి పేరుతో భేదములు సిద్ధిస్తున్నవి. ఇట్లాగే ఆత్మలకు కూడా దేవుడు మనుష్యుడు మొదలైన సంజ్ఞాభేదము ఏర్పడుతున్నది. ఎలాగంటే తేజస్సు, నీరు, భూమి అనే ద్రవ్యాంశములు ఆయా ద్రవ్యాలవడం చేత ఒక్కటే అనబడుతున్నాయి. కాని ఆ ద్రవ్యాంశాలన్నీ స్వరూపాన్ని బట్టి ఒక్కటి కావు. అనగా ఆయా భాగాలు తమ మూలపదార్థాలకు చెందినందున ఒక్కటే ఐనా వేరువేరు భాగాలు కావడంచేత ఐక్యత లేదు. అలాగే వాయువుకు సంబంధించిన అంశాలకు స్వరూప భేదము తప్పదు.

**సోఽ హం సచత్వమ్** – వాడు నేను, వాడు నీవు అని – అన్ని ఆత్మలకున్నూ జ్ఞానమే ఆకారమని ముందు చెప్పిన దాన్ని తత్ శబ్దముతో పరామర్శించి జ్ఞానముతో సామానాధికరణ్యాన్ని ఎత్తి చూపి నేను నీవు అనుపదార్థాలకు జ్ఞానమే ఆకారమని అని ముగించుతూ దేవాది ఆకారాల భేదాన్ని బట్టి ఆత్మలయందు భేదమోహమును వదిలిపెట్టు అని చెప్పినాడు. కాని తీరుకు దేహానికంటే విడిగా ఆత్మ ఉన్నదని చెపుతున్న సందర్భములో నేను నీవు ఈ కనిపించేది అంతా ఆత్మస్వరూపమని భేదమును చూపడం కుదరదు. నేను నీవు మున్నగు శబ్దాలకు ఉపలక్ష్యమైన ఇదంతా ఆత్మస్వరూపమే అనే వాక్యముతో సామానాధికరణ్యము వలన ఉపలక్షణత్వము సరిపోలదు. అతడు కూడా ఉపదేశము చొప్పుననే ప్రవర్తించినాడని చెప్పినాడు. **తత్యాజభేదం పరమార్థదృష్టిః** – పరమార్థమునే దర్శిస్తున్న అతడున్నూ భేదాలను గమనించుటను మానుకున్నాడు – అను శ్లోకంతో. దేన్నిబట్టి ఈ నిర్ణయం చేసినారన్నట్లయితే – అక్కడ చెప్పిన విషయము దేహము ఆత్మవేరే అను విషయాన్ని గురించి ఉపదేశింపబడింది. అది **పిండః పృథక్ యతః పుంసఃశిరః పాణ్యాదిలక్షణః** – పురుషుడికంటే శిరస్సు, చేతులు మున్నగు పేర్లతో పిలువబడుతున్న పిండము వేరు గనుక – అని ఆరంభించినారు.

**విభేదజానకేఽ జ్ఞానే నాశమత్యన్తికంగతే** – భేదజ్ఞానాన్ని కలిగించే అజ్ఞానము పూర్తిగా నశించినాక – అనుచోటకూడా ఆత్మలకు స్వరూపము ఒక్కటి అని చెప్పబడలేదు. అట్లే జీవపరమాత్మలకున్నూ స్వరూపైక్యములేదు. ఆత్మస్వరూపైక్యము ఇంతకు మునుపు చెప్పినట్లు నిషేధించబడింది. జీవపరులకు కూడా. దేహము ఆత్మలకు వలె ఐక్యము – స్వరూపైక్యము సంభవించదు. అలాగని శ్రుతి చెపుతున్నది. 1) **ద్వాసుపర్ణా = రెండు పక్షులు కలసి మెలసి తిరిగెడివి. స్నేహితులు ఒక్క చెట్టుపైననే ఉంటున్నవి. వాటిలో ఒక్కటి రుచికరమైన ఆ చెట్టు పండును అనుభవిస్తున్నది. వేరొక్కటి దాన్ని తినకుండానే ఉత్సాహంగా ప్రకాశిస్తున్నది** 2) ఋతంపిబన్తౌ – **సాటి లేని ఉత్కృష్టమైన పుణ్యలోకమునందు ఋతమనబడు పుణ్యకర్మను అనుభవిస్తూ హృదయ గుహయందు ప్రవేశించినారు. ఆ ఇద్దరిని బ్రహ్మవేత్తలు త్రిణాచికేతము అనే అగ్ని విద్యను ఉపాసించేవారు ఛాయ ఆతపము అని చెప్పుతున్నారు**. 3) అన్తః ప్రవిష్టః **జనుల హృదయ గుహయందుప్రవేశించినవాడై వారిని శాసించుతున్నాడు ఆయన చిదచిత్తులందరికీ ఆత్మ కనుకనే సర్వాత్మ అనబడుచున్నాడు**. మున్నగునవి ఈ విష్ణుపురాణ శాస్త్రము నందు కూడా – 1) ససర్వభూత **ఆయన సర్వభూతములకు**

**మూలమైన ప్రకృతిని. దానివల్ల పుట్టే భావవికారాలను గుణాలను దోషాలనున్నూ మించినవాడు. అన్ని రకాలైన ఆవరణాలనున్నూ దాటినవాడు. అఖిలజగత్తుకు ఆత్మ ఆయనయే. భువనభాండాలకు నడుమ వ్యాపించినదేది ఉందో అదంతా ఆయనయే. ఆయనవల్లనే.** 2) పరఃపరాణాం – **అతను పరులనుకునే వారందరికీ పరుడు. ప్రకృతి సంబంధమైన క్లేశాదులు ఏ ఒక్కటి ఆ పరావరేశుని యందులేవు** 3) అవిద్యా – **అవిద్యా అనబడే కర్మ మూడవ శక్తిగా చెప్పబడుతున్నది. అన్ని చోటులలోనూ కనిపించే క్షేత్రజ్ఞ శక్తి అవిద్య చేత చుట్టుకొనబడి యున్నది**. అని భేదాన్ని చక్కగా చెప్పినారు. **ఇక బ్రహ్మసూత్రాల్లోనూ –** ఉభయేఽ పిహి భేదేనైనమ ధీయతే – రెండు శాఖలవారున్నూ భేదమును చెప్తూ పఠించుచున్నారు. 2) భేదవ్యపదేశాచ్చాన్యః – భేదాన్ని చెప్పినందువల్లనున్నూ జీవుడు పరమాత్మ కన్నవేరయినవాడే. 3) అధికంతు భేదనిర్దేశాత్ – జీవుడికన్న అధికుడే. ఉభయులకూ భేదము నిర్దేశింపబడినందున. మున్నగుసూత్రాలయందు భేదము తేటగా చెప్పినారు. **ఉపనిషత్ వాక్యాలు – 1)** యఆత్మని – **ఎవడు జీవాత్మలోనుంటూ అతనికన్నా భిన్నుడై ఉన్నాడో, ఎవడిని ఆత్మ తెల్సుకోలేదో, ఎవడికి జీవాత్మ శరీరముగా అవుతున్నాడో, ఎవడు ఆత్మలోనుంటూ అదుపు ఆజ్ఞలతో నుంచుకుంటున్నాడో, 2)** ప్రాజ్ఞేనా – **అన్నీ తెల్సిన పరమాత్మచే గాఢముగా ఆలింగనము చేసుకొనబడినవాడు. 3)** ప్రాజ్ఞేనాత్మనాఽ న్వారూఢః **ప్రాజ్ఞుడగు ఆత్మచే వెంటనంటబడియున్న వాడు**. ఇలాంటి వాక్యాలతో ఒకరికొకరు విరుద్ధాకారాలతో స్వరూపాన్ని నిర్ణయించి చెప్పినారు. బద్ధుడితో కాకున్నా సాధనాలను పాటించినందున అవిద్యనుండి విడివడిన ముక్తాత్మ కున్నూ పరమాత్మతో స్వరూపైక్యము లేదు. అవిద్యాశ్రయుడైనందున ప్రస్తుతముగాకున్నా – దానికి అర్హత సంభవించదు. అనగా అవిద్యాశ్రయుడు గాకుండా పోవడానికి అర్హతలేదని అర్థము. భగవన్ని గ్రహానికి పాత్రుడైతే ఇహలోకంలో రావణకుంభ కర్ణాదులుగా పుట్టే అవకాశమున్నది. ఇలా చెప్పబడింది – **పరమాత్మాత్మనోర్యోగః – పరమాత్మకు జీవాత్మకు పరస్పరము కల్సిపోవడము పరమార్థము మోక్షము అని భావిస్తున్నారు కొందరు. కాని ఇది అబద్ధము. మిథ్య. వేరువేరు ద్రవ్యాలు ఐన జీవపరమాత్మలు ఒక్క ద్రవ్యము కాదు. కాన కల్సిపోవడం కుదరదు** అని. ముక్తుడికి పరమాత్మయొక్క లక్షణాలు / ధర్మాలు మాత్రమే వస్తవి అని భగవద్గీత యందు చెప్పబడింది. 1) **ఇదం జ్ఞానం –** ఈ జ్ఞానాన్ని ఆధారంగా చేసుకొని నాతో సమానమైన ధర్మాలను పొందినారు. సృష్టికాలంలో తిరిగి పుట్టరు. ప్రలయము నందు తిప్పలు పడరు. **విష్ణుపురాణంలోనూ**

– ఆబ్రహ్మను నిరంతరము చింతించేవాడిని తనతో సమానమైన ధర్మాన్ని పొందించుతాడు. అయస్కాంతము తన వద్దకు లాక్కొని ఇనుపముక్కను తనలాగా ఆకర్షకశక్తి గల దాన్నిగా చేసినట్లు అని. ఆత్మభావమ్ఽ తనయొక్క స్వభావాన్ని. ఆకర్షకమైన అయస్కాంతము యొక్క స్వరూపము ఆకర్షింపబడే ఇనుపముక్కకు కలుగదు కదా! దీన్ని బ్రహ్మసూత్రాలలో చెప్పబోతున్నాడు. **జగద్వ్యాపార వర్జం ప్రకరణా దసన్నిహితత్వాచ్చ** – సాన్నిహిత్యము లేనందునను ప్రకరణాన్ని బట్టి జగత్తును పుట్టించుట రక్షించుట లయము చేయుట తప్ప. 2) **భోగమాత్ర సామ్యలింగాచ్చ** – భోగాలను పరమాత్మతో సమానంగా అనుభవించును అని హేతువును శ్రుతి చెపుతున్నది. 3) **ముక్తోపసృప్యవ్యపదేశాచ్చ** – ముక్తుల చేత చేరుకోదగిన వాడని చెప్పినందున – అని **వృత్తికారుడున్నూ** – పరంజ్యోతితో అన్నింటా సమానుడే జగత్ వ్యాపారము ఒక్కటే తప్ప అని. **ద్రమిడభాష్యకారుడున్నూ** – పరదైవముతో సాయుజ్యము నొంది నందున శరీరము లేనివాడే ఐనా ముక్తునికి పరబ్రహ్మకు వలెనే సర్వార్థములు తలచినంతనే నెరవేరుతవి అని. **శ్రుతులుకూడా – 1) యఇహ** – ఎవడీ లోకము నందు ఆత్మను ఉపాసించి పరమ పదమునందున్న పరమాత్మను చేరుకొనునో అతడు సత్యకాముడు సత్యసంకల్పుడు ఔతాడు. అన్నిలోకములయందున్నూ స్వేచ్ఛగా సంచరించగలడు. **2) బ్రహ్మ విదాప్నోతిపరమ్** – బ్రహ్మవేత్త పరమాత్మను చేరబోవును. **3) సోఽశ్నుతే** – బ్రహ్మోపాసన చేసిన వాడు ఆయన సన్నిధికి చేరి సర్వజ్ఞుడూ సర్వవేత్త యయిన పరబ్రహ్మతో కలిసి సర్వకామాలను అనుభవిస్తాడు. 4) **ఏతమానందమయ** – ఇటువంటి ఆనందమయుడైన పరమాత్మ దరిజేరి ఈ కామానుభవములైన లోకాలను ఎలాంటి స్పృహ లేనివాడై సంచరించుతూ **5) సతత్రపర్యేతి** – అతడక్కడకు పోవును **6) రసోవైసః** – ఆ పరబ్రహ్మ రసస్వరూపుడు. ఈ ముక్తాత్మరస పురుషుడిని చేరబారి ఆనందపూర్ణుడు అవుతాడు. 7) **యధానద్యః** – నదులు ఎలాగైతే జరాజరా జారుకుంటూ పోయి సముద్రములో కల్సి తమయొక్క నామరూపాలను వదిలిపెట్టి సాగరములో కనపడకుండా పోతాయో అలాగే పరబ్రహ్మను ఎరిగి ఉపాసించిన పండితుడు తన యొక్క నామమును రూపాన్ని వదలివేసి పరాత్ పరుడైన దివ్యపురుషుడిని చేరుకుంటున్నాడు. **8) తథావిద్వాన్** – అలాగే బ్రహ్మవేత్త తన యొక్క పుణ్యపాపములు రెండింటినీ దులిపివేసుకొని ఎలాంటి ద్వంద్వాలు కర్మ సంబంధము లేనివాడై, పరమాత్మతో మిక్కిలి గొప్ప సామ్యమును పొందుచున్నాడు – వంటి వాక్యాలు ఆత్మ స్వరూపైక్యమును నిషేధించుతున్నవి.

పరవిద్యల్నినింటి యందున్నూ ఉపాసించదగినవాడు సగుణబ్రహ్మయే ఫలము అన్నింటికీ ఒకే విధమైనదే అని చెప్పబడింది. కావుననే విద్యలయందు భేదము ఏర్పడింది. అది సూత్రకారుడైన వ్యాసమహర్షి చేతనే **ఆనందాదయః ప్రధానస్య, వికల్పోఽ విశిష్టఫలత్వాత్** మున్నగు సూత్రాలయందు చెప్పబడింది. వాక్యకారుడున్నూ సగుణుడే ఉపాసింపతగినవాడు, అని అంటూ విద్యల యందు భేదమును కూడా చెప్పినాడు. **యుక్తం తద్గుణకోపాసనాత్** అని. భాష్యకారుడు **యద్యపిసచ్చిత్తః** ఇత్యాది వాక్యాలతో వివరించియున్నాడు. **బ్రహ్మవేదబ్రహ్మైవభవతి** – బ్రహ్మను గురించి తెల్సిన వాడు బ్రహ్మవలె ఔతాడు – అనే శృతి వాక్యము వద్ద కూడా. **నామరూపాద్విముక్తః పరాత్పరం పురుషముపైతి దివ్యమ్ 2) నిరంజనః పరమం సామ్యముపైతి 3) పరంజ్యోతి రుప సంపద్య స్వేన రూపేణాభినిష్పద్యతే** – పరంజ్యోతి వద్దకు చేరుకొని తనదైన విజ్ఞానఘనము, స్వయంప్రకాశము, ఆనందమయము ఐన స్వరూపాన్ని తిరిగి పొందుతాడు. ఇత్యాది వాక్యాలతో ఏకార్థతవలన. ప్రకృతి వలన వచ్చిన నామము రూపములనుండి విడివడి, పరమాత్మ నుండికల్గిన భేదములనన్నింటినీ కోలుపోయినందున ఇరువురికీ జ్ఞానమే ఏకాకారము కావడంచేత జీవుడు పరబ్రహ్మకు విశేషణము / ప్రకారము అగుచున్నాడు. ప్రకారము / శరీరము ఒక్కటే ఐనా తత్త్వవ్యవహారము ముఖ్యము ఔతుంది. సేయంగౌః అన్నట్లు, ఆ ఆవే ఇది. అన్నపుడు ఇంతకు మునుపుచూచిన ఆవే అనే ప్రత్యభిజ్ఞలోగోత్వము సమానము ఐనట్లు జ్ఞానము ఏకాకారమై ఐనా జీవపరమాత్మ భేదము విశేషణ విశేష్యాంశాలు వలె నిల్చి ఉంటుంది.

ఇచ్చట కూడా **విజ్ఞానం** – ఓ రాజా! ప్రాప్యుడైన పరంబ్రహ్మను చేరుకోవడానికి ప్రాపకము విజ్ఞానము. చేర్పదగినవాడు అన్నిరకాలైన భావనలు నశించినట్టి జీవాత్మ. కర్మ భావనా, బ్రహ్మ భావనా ఉభయ భావనా అని భావనలు మూడు విధాలు. ఈ మూడింటినీ అశేషముగా నాశనము చేసుకున్నవాడు ప్రాపణీయుడు అని చెప్పి **క్షేత్రజ్ఞఃకరణీ** – క్షేత్రజ్ఞుడు కరణము సాధనమును కల్గియున్నట్టివాడు. అతనికి జ్ఞానము కరణము. ముక్తి కార్యాన్ని కల్గించి / పుట్టించి కృతకృత్యుడైన జీవుడిని సంసారము నుండి నివర్తింపచేస్తుంది. పరబ్రహ్మను ధ్యానము చేయుట అనే రూపములోనున్న జ్ఞానసాధనము జీవుడికి అన్నిరకాలైన భావనలు నశించి ఆత్మస్వరూపము ప్రాప్తమైనది గనుక చేయవలసిన తన పనిని తాను పూర్తిచేసినందున తొలగిపోతుందని చెప్పినారు కాబట్టి సిద్ధి కలుగేంతవరకూ ధ్యానము చేయాలి అని చెప్పి **తద్భావ భావ** – ఈ జీవుడు

పరమాత్మతో సమానమైన స్వభావాన్ని పొంది ఆయనతో భేదము లేని వాడౌతాడు. కానీ భేదము వారిద్దరిలో ముక్తుడికి అజ్ఞానము కారణంగా కనిపించుతుంది అని ముక్తుని స్వరూపాన్ని చెప్పినాడు. తద్భావము అనగా బ్రహ్మ యొక్క భావము స్వభావము, స్వరూపైక్యము కాదు. **తద్భావభావ మాపన్నః** అన్నచోటనున్న రెండవదైన భావపదము అన్వయమును పొందదు. ముందుచెప్పిన అర్థానికి విరోధము కూడా వస్తుంది. బ్రహ్మకున్న భావము అన్ని భావనలు బొత్తిగా లేకపోవడం. దాన్ని పొందడము తద్భావ భావాపత్తి. ఎప్పుడు ఈవిధంగా తద్భావాపత్తిని పొందినాడో అపుడే పరమాత్మతో భేదము లేనివాడు ఔతాడు. ఇద్దరికీ జ్ఞానమొక్కటే ఆకారము కాబట్టి పరమాత్మతో సమానంగా ఒకే తీరున ఉన్నవాడికి పరమాత్మనుండి ఏర్పడే భేదము దేవాదిరూపము. దానితో సంబంధము వీడికి ఏర్పడడానికి కారణము కర్మరూపమైన అజ్ఞానమువల్ల వచ్చిందే కాని స్వరూపం వలన ఏర్పడింది కాదు. అలాంటి దేవాదిభేదము కూడా పరబ్రహ్మను ధ్యానించుట ద్వారా ప్రధాన కారణమైన అజ్ఞానరూపమగు కర్మబొత్తిగా లేకుండా నాశనమైనందున కారణము లేదు కాబట్టి కార్యము ఐన భేదము నశించి అభేది అవుతున్నాడు. ఇదే అంశమిలా చెప్పబడింది. స్వరూప భేదము ఒక్కటే ఉన్నది. అది బాహ్యమైనది కర్మ చుట్టుకోవడం వల్ల పుట్టినట్టిది. దేవాదిదేహ భేదము నశించితే ఆ కర్మావరణము లేకుండా పోతుంది అని దీన్నే మరింతగా వివరించుతున్నాడు. జీవపరమాత్మలకు విభేదాన్ని కల్గించే అజ్ఞానము బొత్తిగా నశించిపోతే ప్రత్యగాత్మకు పరమాత్మకు లేని భేదమును ఎవడు చూపగలడు అని విభేధము అనగా వివిధములైన భేదములు. అదే దేవతలు పశువులు మనుష్యులు స్థావరములు అనేవి శౌనక మహర్షి చెప్పినదిది. ఈ నాల్గురకాలైన భేదము మిథ్యా జ్ఞానము వల్ల ఏర్పడినట్టిది అని జ్ఞానరూపమైన ఆత్మయందు దేవాదిరూపములుగానున్న పలువిధాలైన భేదాలు పుట్టడానికి కారణమైన కర్మ అనబడే అజ్ఞానము పరబ్రహ్మను ధ్యానము చేసినందున బొత్తిగా లేకుండా పోయింది కనుక భేదదర్శనానికి హేతువు లేదు కనుక పరంబ్రహ్మకు ప్రత్యగాత్మకు లేనిదైన దేవాదిరూప భేదాన్ని ఎవడు చేయగలడుఅని అర్థము. **అవిద్యాకర్మ సంజ్ఞా అన్యా** అని ఈ సందర్భములోనే చెప్పబడింది.

**క్షేత్రజ్ఞుడిని కూడా నేనేనని తెల్సుకో** ఇత్యాది వాక్యాలద్వారా అన్తర్యామి రూపంలో సర్వజగత్తుకూ ఆత్మగా ఉండడముచేత జీవపరమాత్మలకు ఐక్యత చెప్పబడింది. కానిచో **సర్వభూతాలున్నూ క్షరము అనబడుతవి. జీవాత్మకు మూలపురుషుడైనవాడు**

**అక్షరుడు అనబడుతాడు. ఈ ఇద్దరికంటే వేరుగానున్నవాడు ఉత్తమ పురుషుడు** అనే వాక్యాలతో విరోధము వస్తుంది. అన్తర్యామి రూపంలో అందరికీ / అన్నింటికీ భగవంతుడు ఆత్మగా నుండుట భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మచే చెప్పబడింది. **సర్వభూతాలకున్నూ ఈశ్వరుడు వారి వారి హృదయ ప్రదేశాలలో ఉంటున్నాడయ్యా అర్జునా** అని **సమస్త చరాచర ప్రాణులన్నింటికి నేను హృదయంలోనే ఉంటూ అందుబాటులో దగ్గరగా ఉన్నాను** అని కూడా చెపుతూ **ఓ గుడాకేశ! నేను ఆత్మను. సర్వభూతముల యొక్క హృదయకోశములలోనుండే వాడిని** అని కూడా చెపుతూ ఆ అభిప్రాయాన్నే చెప్పినాడు. ఇచట శబ్దము కేవల శరీరానికి గాక లోన ఉన్న ఆత్మను కూడా చెపుతుంది. శరీరంలో ఉన్నది కాబట్టి. ఎందుకంటే ఆయన అందరికీ ఆత్మ. అనగా చిదచిత్తులకు అని భావము. అన్తర్యామిత్వము దాన్నే వివరిస్తుంది. ఆ కారణంగానే **అన్ని ప్రాణులూ ఆయనకు శరీరాలు అవుతున్నందున జీవపరబ్రహ్మలకు విడిగా ఉండుటను నిషేధిస్తున్నారు. "ఆయనలేకుండా ఏదైతే ఉన్నదో" నతదస్తి వినాయత్ స్యాత్ మయాభూతం చరాచరమ్** అనేది పూర్తి వాక్యము. దీనిద్వారా భగవద్ విభూతిని ఉపసంహరించడమవుతున్నది. అనగా క్రోడీకరించడము. ఒక్క దగ్గర చేర్చడము ఒక పరిధిలోకి తీసుకురావడమన్నమాట అని అర్థము చేసుకోవాలి. అందువల్లనే ఈ మాట చెప్పబడింది. **ఏదేదిఐతే విస్తారమైన ఈశ్వర లక్షణాలను కల్గియున్నదో, శ్రీమంతము ఉత్సాహవంతము చురుకుదనము కల్గినది ఐనదేది ఉన్నదో ఆ యావస్తువులన్నీ కూడా నాయొక్క తేజస్సులోని అతి సూక్ష్మాంశతో కూడియున్నవని తెల్సుకో**. అని **నేను ఈ సమస్త జగత్తు నంతటిని నాయొక్క శక్తిలోని ఒకానొక అంశముతో వ్యాపించి/నిలబెడుతున్నాను/ఉన్నాను** అని అందువల్ల **"శాస్త్రములలో దేనిలోనూ నిర్విశేషమైన వస్తువు ఉన్నదని ప్రతిపాధింపబడలేదు."** అట్లే ఈ **"వస్తువులన్నీ భ్రమవల్ల ఏర్పడుతున్నవని లేదు. ఇంకా చిద్ ఈశ్వరులకు స్వరూపంలో భేదమున్నూ నిషేధింపబడలేదు."**

## ఇక ఏడు రకాలైన అనుపపత్తులు

### 1. ఆశ్రయ అనుపత్తి

కొందరు ఇలాగా చెపుతున్నారు – నిర్విశేషమై స్వయం ప్రకాశము ఐన వస్తువునందు దోషము చేత ఈశుడు, పరిపాలింపబడేవాడు అనునట్లు అనన్తమైన

భేదాలతో జగత్తు కల్పింపబడుతున్నది. దోషము అనగా స్వరూపాన్ని కప్పివేస్తూ పలురకాలైన వింతవింతలైన విక్షేపాలను/ఆరోపాలను కలిగిస్తుంది. అది ఉన్నది అని కాని లేదనికానీ చెప్పడానికి వీలుకానట్టిది. ఏనాటి నుంచిఉంటున్నదో తెలియరానిది. దాని పేరు అవిద్య. (**దోషశ్చ స్వరూపతిరోధాన వివిధ విచిత్ర విక్షేపకరీ సదసదనిర్వచనీయా అనాది అవిద్యా**) దాన్ని తప్పక ఒప్పుకోవాలి. **అనృతము చేత కప్పివేయబడినవి**. ఇత్యాదులైన శ్రుతులతో బ్రహ్మతో **తత్త్వమసి** మున్నగు వాక్యాలలోని సామానాధికరణ్యము వల్ల జీవునికి ఉన్నట్లుగా తెలుస్తున్న ఐక్యత పొసగడం లేదు కనుక. ఆ దోషము ఉన్నది కాదు. ఉన్నట్లు కనిపిస్తున్నది కానీ మళ్ళీ తెల్లారి చూస్తే కనిపించడంలేదు. ఇచ్చట ఉన్నట్లు కనిపించడం భ్రాంతి లేకపోవడము బాధ. యథార్థానికి ఉన్నదే ఐతే లేదు అని బాధ కలుగడం జరుగకూడదు కనుక ఇది ఉన్నది కాదు. పోనీ లేనిది అని అందామా? ఉన్నట్లు లోకమంతటా ఖ్యాతి/ప్రసిద్ధి ఉంటున్నది లేనిదే ఐతే ఉన్నదని లోకప్రసిద్ధి ఉండకూడదు. పిదప దానికి బాధ ఉన్నది అని కలుగకూడదు. నిజానికి ఏ పదార్థమైనా ఉన్నది అని అనేట్లయితే ఎల్లప్పుడూ ఉండి తీరాలి. లేదంటే లేనిది గానే ఉండాలి. కానీ రెండు విధాలుగా కనిపించుతున్నది కనుక ఇది **"సదసదనిర్వచయము"** దాని పేరే అవిద్యా ఐతే ఉన్నది, లేనిది అనే రెండు పక్షాలకు చెందనిదిగా కనిపిస్తున్న దాన్ని "**అవిద్య**" అని పెద్దలంటున్నారు. తత్వవేత్తలు చెపుతున్నారు అని.

ఐతే అది సరికాదు. తగదు. ఎందువల్లనంటే దానికి ఏదో ఒక ఆశ్రయము ఉండి తీరాలి. దానిపై తాను ఆశ్రయించి ఉండి అవతలి వ్యక్తికి అంటే మూడవవానికి భ్రమను కల్పించాలి. ఆశ్రయము అంటే అధిష్ఠానమే. ఐనపుడు ఆ అవిద్య ఎవరిని ఆశ్రయించి ఎవరికి భ్రమను కల్గిస్తుంది? జీవుడిని ఆశ్రయించి అని చెప్పవీలులేదు. జీవభావము అవిద్య చేతనే కల్పింపబడింది. తనచే కల్పింపబడిన జీవుడిని తాను ఆశ్రయించడము కుదరదు. జీవుడు యథార్థ పదార్థము కాదు కదా. అంటే లేనివాడు కదా. లేని వాడిని ఆశ్రయించేది ఎలా? పోనీ బ్రహ్మను ఆశ్రయించి భ్రమను కల్గిస్తున్నది అందామా? అంటే ఆయన స్వయంప్రకాశకమైన జ్ఞానస్వరూపుడు. జ్ఞానమునకు అవిద్యకు సహజవైరము కదా! సూర్యకాంతి ఉన్నచోట చీకటి ఉండలేదు. తూర్పున ప్రొద్దుపొడవడానికి చాలా ముందే చీకట్లు జాడలేకుండా పోయేది సత్యము. కాగా విరోధియైన బ్రహ్మను తాను నశించిపోకుండా ఆశ్రయించేది ఎలాగా। భ్రమను కలిగించేది ఎలా? సరే

అదలా ఉంచుదాము. అవిద్య అనేది జ్ఞానము చేత బాధింపబడుతుంది అని గదా మీ అభిమతము. **జ్ఞానరూపము పరంబ్రహ్మ. దానిచేత / బ్రహ్మచేత మిథ్య అనేది త్రోసివేయబడుతుంది / నశింపచేయబడుతుంది. అలాంటి జ్ఞానాన్ని బ్రహ్మను అజ్ఞానము కమ్మివేస్తే దాన్ని తొలగించేవాడు ఇంకెవ్వడున్నాడు. అంటే అపుడు లోకంలో అజ్ఞానమే మిగులుతుంది. 2) కేవల జ్ఞానమే బ్రహ్మ అన్నట్లయితే జ్ఞానము అజ్ఞానాన్ని తొలగిస్తుంది. ఐతే బ్రహ్మ లాగే దాని ప్రకాశము కూడా కనుక ప్రకాశము తొలగిపోయేది కాదు. 3) జ్ఞానము బ్రహ్మ అనే జ్ఞానము ఉన్నది అనేటట్లయితే బ్రహ్మ ప్రమేయము ఔతుంది. అపుడు నీవు చెప్పినట్లు బ్రహ్మకు అననుభూతిత్వము (జడత్వము) వస్తుంది** ఇవి నాథమునుల వారి వాక్యములు.

జ్ఞానస్వరూపము బ్రహ్మ అను జ్ఞానము అవిద్యకు బాధకము / తొలగించేది. కాని స్వరూపమైన జ్ఞానము కాదు అని అనేట్లయితే రెండురకాల జ్ఞానాలు కూడా స్వరూపాన్ని ప్రకాశింపచేసేవే. వాటిలో ఒకటి అవిద్యకు విరోధి, మరొకటి కాదు అని గుర్తించడానికి రెండింటిలో భేదము / విశేషము తెలియరావడం లేదు. ఇదీ ఇక్కడ చెప్పబడుతున్నది – జ్ఞాన స్వరూపము బ్రహ్మ అనే జ్ఞానముతో బ్రహ్మ యందు ఏ స్వభావము కనపడుతున్నదో అది బ్రహ్మకు స్వయం ప్రకాశకత్వము. తనంత తానుగానే ప్రకాశిస్తున్నది కనుక అవిద్యా విరోధిత్వమునందు – అవిద్యను విరోధించడములో స్వరూప జ్ఞానము, విషయజ్ఞానములకు భేదము ఏమీలేదు. ఇంతే కాకుండా అనుభవస్వరూపమైన బ్రహ్మ మరొక జ్ఞానముచేత తెలియబడేది కాదు కనుక నీకు బ్రహ్మకు సంబంధించిన విషయ జ్ఞానము లేదు. ఉన్నది ఒక్కటే జ్ఞానము. ఒక్కటే బ్రహ్మము. అటువంటి ఆ ఒక్క బ్రహ్మము అజ్ఞానమనకు విరోధి. తానే విరోధి కనుక దానిని అజ్ఞానము ఆశ్రయించడమనేది సుతరామూకుదరదు. శుక్తిని చూచి రజతమనే భ్రాన్తి కలుగుతున్న సందర్భాలలో నేను రజతాన్ని కాను ముత్యపు చిప్ప ముక్కను అని తమ యథార్థ స్థితిని తెలియచేసే శక్తి లేనివి కాబట్టి తమ అజ్ఞానాన్ని తొలగించే మరొక జ్ఞానాన్ని కోరుతుంటాయి. బ్రహ్మ మాత్రము తన అనుభవము చేతనే తన యథార్థము ఐన స్వరూపాన్ని తెల్సుకోగల్గుతున్నది. అందుచేత తనకు వ్యతిరేకమైన అజ్ఞానానికి తాము విరోధి అయ్యే ఉంటున్నది అజ్ఞానాన్ని తొలగించుకోగల్గుతున్నది కాబట్టే తనకంటే వేరుగా మరొక సాధనాన్ని / వ్యక్తిని కోరడంలేదు. పోనీ మీరిట్లా అనవచ్చును. బ్రహ్మకంటే వేరుగా నున్న దంతా మిథ్య అనే జ్ఞానమే అజ్ఞాన విరోధి.

మిగతాది కాదు అని. కాని అదితప్పు. ఒక ప్రశ్న. ఈ బ్రహ్మకు వేరయినదంతా మిథ్య అనే జ్ఞానము బ్రహ్మ సత్యము అనే విషయం తెల్యకపోవడమనే అజ్ఞానానికి విరోధికాదు. ఎందుకంటే బ్రహ్మకు వ్యతిరిక్తమంతా మిథ్య అనే జ్ఞానమునకు సంబంధించింది కాదు. జ్ఞానము అజ్ఞానము ఒక్క వస్తువునకు / విషయానికి చెందినవిఐతే పరస్పర విరోధము ఉంటుంది. ప్రపంచము మిథ్య అని తెలిపే జ్ఞానము, అది సత్యము అని తెలిపే జ్ఞానంతో విరోధిస్తుంది. దానితో ప్రపంచము సత్యము అనే అజ్ఞానమే బాధితమవుతుంది. అపుడు బ్రహ్మ స్వరూపాన్ని ఎరుగకపోవడమనే అజ్ఞానము నిలిచిపోతుంది. బ్రహ్మ స్వరూపా జ్ఞానము ఒకటి ఉన్నదనియంటే బ్రహ్మస్వరూప జ్ఞానమే కాకుండా బ్రహ్మ స్వరూప అజ్ఞానమనేది వేరే ఒక జ్ఞానము రెండవది ఉన్నదన్నమాట. ఐతే అది దానికి వ్యతిరిక్తమైనది ఐన మిథ్యాత్వ జ్ఞానము చేత తొలగిపోతుంది. దాని స్వరూపము మాత్రము స్వానుభవముచే సిద్ధిస్తుంది అని అనకండి. బ్రహ్మకు అద్వితీయత్వమనేదే స్వరూపము. (అద్వితీయత్వము = తనకు సాటియైన వాడు మరొక్కడు లేకపోవడము) అది స్వానుభవముచేతనే సిద్ధిస్తున్నది. అందువలన దానికి విరోధియైన సద్వితీయత్వ రూపమైన అజ్ఞానమూ, దానికి బాధ లేకుండా పోతాయి. కాదండీ! అద్వితీయత్వము స్వరూపం కాదు ధర్మము అని అంటున్నారా! ఐతే అనుభవ స్వరూపమైన బ్రహ్మకు అనుభవింపబడుట అనే ధర్మము లేదు అని మీరే ఇంతకుముందు ప్రతిపాదించినారు కదా! ఇపుడు ధర్మము అని చెప్పడం సమంజసమేనా! కావున జ్ఞానస్వరూపమైన బ్రహ్మకు అజ్ఞానముతో నున్న వైరుధ్యము వల్లనే అజ్ఞానమునకు ఆశ్రయము కాజాలదు.

## 2. తిరోధానానుపపత్తి

అవిద్య చేత ప్రకాశించుటయే స్వరూపముగా కల బ్రహ్మ కనబడకుండా పోతున్నది అని మీరు చెపుతున్నారంటే బ్రహ్మకు స్వరూపము నశిస్తున్నది అని చెప్పినట్లవుతుంది.

ప్రకాశము యొక్క తిరోధానము అంటే ప్రకాశము పుట్టకుండా అడ్డగింపబడడమో లేక ఉన్న ప్రకాశమూ బొత్తిగాలేకుండా నశించి పోవడమో ఏదో ఒకటి ఔతుంది. దీపాన్నే ఉదాహరణగా తీసుకుంటే వెలుతురు ప్రసరించకుండా మందపు వస్తువును అడ్డము పెడితే క్రమంగా వెలుగుతగ్గి బొత్తిగా ఆరిపోతుంది. అట్లేఇక్కడ కూడా. ఇక ప్రకాశాన్ని పుట్టించలేము పుట్టింపబడేది కాదు అని మీరు అంగీకరించినారుకనుక ఉన్న ప్రకాశాన్ని

కప్పివేయడమంటే ప్రకాశము నాశనం కావడమే. అద్దము లాంటిది కాకుండా దళసరి పదార్థాన్ని అడ్డంగా ఉంచితే ఎంతనూనె ఉన్నా దీపము తప్పక ఆరిపోతుంది. కావున ప్రకాశ తిరోధానము అనగా దాని వినాశనమే. అట్లే జ్ఞానము స్వయంప్రకాశము. స్వతస్సిద్ధము. దాన్ని పుట్టించలేము. దానికి పుట్టుకలేదు. అది బ్రహ్మ స్వరూపము అని చెప్పిన మీరు తిరోధానము అంటే వినాశనమే అని ఒప్పుకోవలసి వస్తుంది కనుక అవిద్య చేత బ్రహ్మ కమ్మివేయబడతాడు అనడం పొసగదు, తప్పు.

## 3. స్వరూపానుపపత్తి

మరియు విషయములేనిది దేనికి ఆశ్రయము కానిది / దేనినీ ఆశ్రయించనిది స్వయంగానే వెలుగొందేది ఐన ఈ అనుభూతి / బ్రహ్మ తనను ఆశ్రయించిన అవిద్య అనే దోషము కారణంగా అనన్తమైన భ్రమలకు ఆశ్రయమై, అనన్త విషయాలకు ఆస్పదమై తనను అనుభవిస్తున్నది. అనగా తనలోనే ప్రపంచభ్రమను పొందుచున్నది. అని కదా మీరంటున్నారు. ఐతే జ్ఞానాన్ని లేక బ్రహ్మను పట్టుకున్న ఈ దోషము పరమార్థమా? అపరమార్థమా? (నిజమైనదా? కాదా? ఉన్నదా? లేనిదా?) అని విచారించాలి. ముందుగా ఇది పరమార్థము అని అనుకుందాము. ఎందుకంటే ఈ దోషము లేక అవిద్య పరమార్థము కాదు అని మీరు ఘంటాపథంగా చెప్పినారు. కనుక పరమార్థముకాదు. పోనీ అపరమార్థమా? అంటే అదీకాదు. అపరమార్థమే గనుక ఐతే దాన్ని ద్రష్టగానో, దృశ్యముగానో, దృశిగానో అంగీకరించవలసియుంటుంది. ఇందులో దృశికాదు. జ్ఞానస్వరూపంలో భేదాలు లేవని అన్నారు. ఐనపుడు ఉన్న ఒక్క జ్ఞానమే ప్రపంచభ్రమకు అధిష్ఠానము ఔతుంది. బ్రహ్మ స్వరూపము అలాంటిదికాదు. అపరమార్థము అనేట్లయితే భ్రమాస్పదమైన జ్ఞానము కూడా లేకపోతే దానిలాంటి మరొక జ్ఞానమూ లేనందున, ఉన్నది అపరమార్థమై అసలు ఏదీ లేకుండా పోతుంది. అపుడు మీరు సర్వమూ శూన్యమే అనే బౌద్ధమతము లోని మాధ్యమిక వర్గము వారితో జతకావాల్సివస్తుంది. అది మీ కిష్టము కాదు. జ్ఞానమంటూ ఒకటి ఉన్నది అని వారిని మీరు ఖండించినారు గనుక జ్ఞానము అపరమార్థము కాదు. ఇక ఈ భ్రమాధిష్ఠాన జ్ఞానము మరొక దోషము చేత కల్పింపబడింది అనేట్లయితే అవిద్య అనేది ఒకటి ఉంటుండగా ద్రష్టా దృశ్యము, దృశి అనే భేదాలు మరో దోషము వల్ల ఏర్పడ్డవి కల్పించబడ్డవి అన్నపుడు దానికి కారణము, దానికి కారణము ఇలా పలుదోషాలను ఒప్పుకోవాల్సి వస్తుంది. దానికి ఒక అంతు లేకుండా పోయి అనవస్థా అనే దుఃస్థితి

వస్తుంది. ఐతే ఈ పరిస్థితిని తొలగించుకోవడానికి పరమార్థమైన అనుభూతియే బ్రహ్మరూపమే దోషము అని అంటే అపుడు బ్రహ్మ స్వరూపము దోషమూలమైనందున ప్రపంచభ్రమకు అవిద్య కాకుండా బ్రహ్మకారణము ఔతుంది. ఆ అవిద్య బ్రహ్మ నిత్యము కాబట్టి తాను కూడా నిత్యమేఐ కూర్చుంటుంది. అపుడు బ్రహ్మ ఒకటి, అవిద్య ఒకటి ప్రపంచముతో సమానమైన అవిద్య మరొకటి ఏర్పడుతుంది ఈ కల్పన వల్ల సాధించే ప్రయోజనమేముంటుంది? ఇంకా బ్రహ్మనేదోషమై, ఆ బ్రహ్మ నిత్యమైనందున నాశము లేదు. కాబట్టి బ్రహ్మకు దోషము నుండి విముక్తి ఏనాటికీ ఏర్పడదు. అందుకని ఎంతకాలము వరకు యథార్థమైన దోషము ఒకటి బ్రహ్మ కంటే వ్యతిరేకంగా / భిన్నంగా ఉందని మీరు ఒప్పుకోరో అంతదాకా బ్రహ్మకు ప్రపంచభ్రాన్తి ఏర్పడుతున్నదని మీరు ప్రతిపాదించలేరు.

## 4. అనిర్వచనీయత్వ అనుపపత్తి

ఇక ఈ దోషము అనిర్వచనీయమని అన్నారు కదా! దాని ఉద్దేశ్యము ఏమిటో చెపుతారా? సత్ పదార్థానికి అసత్ పదార్థానికీ చెందకుండా ఉన్న విలక్షణమైనది అని అంటున్నారా? సరే. కానీ. అలాంటి వస్తువు ఒకటి ఉన్నది అని తెలియచేసే ప్రమాణము అంటూ ఏదీ లేదు కనుక అనిర్వచనీయమే ఔతుంది. ఇక్కడ చెప్పబడుతున్న అంశమిది – లోకంలో ఏదైనా ఒక వస్తువు ఇది ఇలాంటిది అని ప్రతీతి చేత నిర్ణయింపబడుతున్నది. ప్రతీతి ఎలాంటిదైనా అది ఉన్నది లేనిది సత్తు, అసత్తు అనే ప్రతీతి కలిగి ఉన్నది. రెండు రకాలైన సదసదాకారమైన వస్తు ప్రతీతికి ఈ రెండు లక్షణాలకంటే వేరయినది విషయము అని అంగీకరించితే రెండు లక్షణాలు కలిగినందున అన్ని వస్తువులు అన్ని ప్రతీతులకు విషయముకావలసి వస్తుంది కనుక అనిర్వచనీయత అనేది లేదు.

## 5. ప్రమాణానుపపత్తి

వస్తువుయొక్క స్వరూపాన్ని కప్పిపుచ్చేది లోపల బయటా వివిధములైన ఆరోపములకు ఉపాదానకారణము ఐనట్టిది సత్ అని కాని, అసత్ అని కాని చెప్పడానికి వీలుకాకుండా రెండు విధాలైన లక్షణాలను కల్గియుంటూ ఇట్లాంటిది అని చెప్పడానికి వీలుకానిదై అవిద్యా అజ్ఞానము వంటి పదాలతో వ్యవహరింపబడుతూ ఆయా వస్తువులయొక్క యథార్థమైన స్థితి తెల్సినంతనే జ్ఞానంతో తొలగిపోయేది జ్ఞానము కలుగడానికి ముందున్నప్రాగభావానికి భిన్నంగా భావరూపమైన (ఉన్నది అని అనబడే)

ఒకానొక వస్తువు ప్రత్యక్షము, అనుమానము అనే ప్రమాణములచేత తెలియబడుతున్నది. ఆ అవిద్య చేత ఉపహితమైన (కూడిన) బ్రహ్మ అనబడే ఉపాదానకారణము ఎలాంటి వికారము లేనిదైన స్వప్రకాశకమైనట్టి కేవల జ్ఞానమనే శరీరమునందు అవిద్య చేతనే తిరోహితమైన స్వరూపము కల ప్రత్యగాత్మ యందు అహంకారము (నేను అనుకొనడం) జ్ఞానము, జ్ఞేయము అనే విభాగరూపములైన అధ్యాసములు / ఆరోపములు / లేనివి ఉన్నట్లు కనబడడము ఏర్పడుతున్నది. అవిద్యచే కప్పివేయబడిన బ్రహ్మ అనబడు వానికే అవస్థావిశేషముతో అధ్యాసరూపమైన జగత్తునందు యథార్థజ్ఞానమున్నూ పుడుతున్నది. ఇలాగా ఏర్పడిన మిథ్యా రూపమైన మొత్తము ప్రపంచానికి ఉపాదాన కారణమున్నూ – లేనిదైన పదార్థానికి లేనిదే మూలకారణమైనట్లు – మిథ్యా రూపమే కారణంగా గలదని హేతుబలాన్ని బట్టి అర్థమౌతున్నది. ఇలా అధ్యాసము ఏర్పడడానికి కారణముఐన అజ్ఞానము / అవిద్యకు చెందిన విషయము ప్రత్యక్షము ఏది అంటే – అహమజ్ఞం మామన్యంచనజానామి – నేను తెలియనివాణ్ణి, నన్నుగాని ఇతరులను గురించిగాని ఎరుగను అని అపరోక్షంగా / ప్రత్యక్షంగా తెలియవస్తున్నది. ఐతే ఇది జ్ఞానప్రాగభావ విషయము కాదు. ఆ ముచ్చట ఆరవప్రమాణానికి సంబంధించినది – ప్రమాణాలు ఎన్ని అనే విషయంతో వివాదము ఉన్నది. ఐనా వాటి గురించి తెల్సుకుందాము. 1) ప్రత్యక్షము 2) అనుమానం 3) ఉపమానము 4) శబ్దము 5) అర్థాపత్తి 6) **అనుపలబ్ధి** కాగా ఈ కారణం జ్ఞానవిషయము అహం సుఖీ – నేను సుఖం కలవాడిని – అనే దానివలె స్పష్టంగా తెలియవచ్చే విషయము. (సుఖీ – సుఖము కలవాడు. కొన్ని సందర్భాలలో ముఖలక్షణాలు, మాటలు చేష్టలను బట్టి ఎదుటివాడు సుఖంగా ఉన్నాడని ఊహించుతాము. తను తనలోని సుఖభావాలను స్వయంగా చెప్పేంతవరకు ఎక్కువసార్లు తెలియదు. బయటివాళ్ళకు తెలియకపోయినా సుఖము అనుభవిస్తున్నవాడికి స్పష్టంగా తెలుస్తుంది కదా! అపుడు అతని అనుభవాన్ని ప్రకటిస్తాడు. అదే నేను సుఖవంతుడను. అనే విషయము. ఇది తేటగా కనిపించే ప్రత్యక్షవిషయము. దీన్నే అపరోక్షము అంటున్నారు) జ్ఞానప్రాగభావాన్ని కూడా ప్రత్యక్షంగా తెలుస్తున్నది అని ఒప్పుకున్నప్పటికీ – నేను నన్ను గురించి ఇతరుల గురించి తెలియనివాడ్ని అనే ఈ జ్ఞానానుభవాభావము ఆత్మకు / తనకు **"జ్ఞానము లేదనే విషయాన్ని తెలుపదు".** నాకేమీ తెలియదు అని అనేప్పుడు కూడా ఆ మాటను చెపుతున్నాడంటే దానికి చెందిన జ్ఞానము ఉన్నది కాబట్టే చెప్పగల్గుతున్నాడు. తెలిస్తే తెల్సును అంటాడు. తెలియదు కాబట్టే నాకు తెల్యదు అని చెపుతున్నాడు. ఒకవేళ ఆ

విషయజ్ఞానము కూడా లేకపోతే **జ్ఞానము లేదు అనే ప్రతిపత్తి** పొసగకుండా పోతుంది. ఇచ్చట మరి కాస్త వివరణము ఇది. నేను అజ్ఞుడను అనే అనుభవము నందు అహమ్ నేను అని "**తనకు జ్ఞానాభావము కలవాడు**" అనే ధర్మాన్ని కల్గిఉన్నవాడుగా / ధర్మిగా జ్ఞానానికి ప్రతియోగిగా – జ్ఞానము లేనివాడుగా అర్థమవుతున్నదా / అవగాహన ఉన్నదా? లేదా? ఉన్నది అనే మాట సమాధానము అయ్యేటట్లయితే సహజమైన విరోధము వల్లనే జ్ఞానాభావము యొక్క అనుభవము లేదు. లేదనే మాటనే సమాధానము ఐతే ధర్మి ప్రతియోగియైన జ్ఞానముయొక్క–సవ్యపేక్ష అవసరాన్ని తెలుపే జ్ఞానాభావానుభవము బొత్తిగా పుట్టదు. జ్ఞానాభావానుభవమును అనుమానించేటప్పుడు గాని, అభావము అనే ప్రమాణానికి విషయంగా స్వీకరించినప్పుడున్నూ ఈ పొసగకపోవడము సమానంగా వర్తించుతుంది.

1) అభావము – లేకుండుట లేదని చెప్పడానికి ఆ వస్తువేదో దేన్ని గురించి అవతలివాడు అడుగుతున్నాడో దాని గురించి తెలిస్తేనే గాని ఉన్నదో లేదో చెప్పగలడు. అతను అడిగిన వస్తువు ఫలానా అని తెలియకపోతే తెల్లమొహము వేస్తాడు గాని ఉన్నది లేదు అని ఏ విషయాన్ని చెప్పలేడు. **లేకపోవడము అని గదా అభావానికి అర్థము**. **వస్తువు తత్ కాలంలో ఉండకపోవచ్చు మరొకచోట ఉండవచ్చు అసలేలేకపోవచ్చును**. **దీన్ని కూడా ఒక ప్రమాణంగా కొందరు శాస్త్రవేత్తలు అంగీకరించినారు**.

2) సవ్యపేక్షా – ప్రతియోగి వస్తువుకు సంబంధించిన జ్ఞానము. జ్ఞానమునకు వ్యతిరేకము అజ్ఞానము. జ్ఞానము అంటే ఏమిటో తెల్సినపుడు అజ్ఞానాన్ని గురించి తెలుస్తుంది. ఇదే సవ్యపేక్ష. జ్ఞానానికి అజ్ఞానము, అజ్ఞానానికి జ్ఞానం ప్రతియోగి. ప్రతియోగి అనగా ఉన్న వస్తువుకు వ్యతిరేకమైనది.

ప్రస్తుతానికి వస్తే – అజ్ఞానము అనేదాన్ని భావరూపమైన పదార్థంగా భావిస్తే, దానికి వ్యతిరేకమైన ధర్మి ప్రతియోగి జ్ఞానము ఉన్నప్పటికీ విరోధము లేదు కాబట్టి ఈ నేను అజ్ఞానిని అనే అనుభవమును భావరూపమైన అజ్ఞానవిషయమనే అర్థం చేసుకోవాలి.

ఈ అజ్ఞానము భావరూపము ఐనా వస్తువు యొక్క యథార్థమైన ఉనికిని అవభాసింపచేస్తున్నందున సాక్షిచైతన్యంతో విరోధిస్తుంది. కాన విరోధము

లేదనకూడదు అని అనరాదు. ఈ మాట సరికాదు. సాక్షి చైతన్యము అనేది వస్తువు యొక్క యథార్థ అవస్థను తెలిపేది కాదు. దానికి చెందిన అజ్ఞానానికి సంబంధించింది. నీవన్నట్లే అయ్యేటట్లయితే మిథ్యా అర్థము – అవభాసించుట పొసగకుండాపోతుంది. అజ్ఞానానికి సంబంధించిన జ్ఞానంతో అజ్ఞానం తొలగిపోదు. కాబట్టి విరోధం లేదు.

ఏమండీ! భావరూపమైన ఈ అజ్ఞానము దాంట్లో ఏ విషయానికి, చెందినది కాక కేవలం వట్టి జ్ఞానము మాత్రమే సాక్షిచైతన్యానికి తెలుస్తుంది. ఇది జ్ఞానము అని. ఐతే ఇది ఫలానా దానికి చెందిన జ్ఞానము అని తెలియాలంటే దానికి కూడా ఒక ప్రమాణము ఉండాలి. ఆ ప్రమాణము ద్వారానే ఇది ఫలానా వస్తువు అని చెప్పగల్గుతాము. కనుక ఇక్కడ సాక్షి చైతన్యానికి నేను నాది అనే అస్మదర్థము లేని అజ్ఞానము ఎలా తెలియబడుతుంది? అని అనవచ్చు. కాని ఇది దోషము కాదు. సాక్షిచైతన్యము **సాక్షీ చేతా కేవలో నిర్గుణశ్చ**. కేవలము తనకు ఎదురుగా జరుగుతున్నదాన్ని చూస్తుంటుంది. అది దేనికి సంబంధించింది? మంచిదా? చెడ్డదా? ఇలాంటి దాన్ని పట్టించుకోదు. అలా చూస్తూ ఉంటుంది. కాబట్టే దానిలో ఏ గుణము లేదు అని చెప్పినట్లు ఎదురుగానున్న వస్తువులనన్నింటినీ జ్ఞాతగాకానీ అజ్ఞాతగా (తెలియనివాడుగా) కానీ సాక్షిచైతన్యము కనిపెడుతూ ఉంటుంది. అక్కడ జడత్వ(ధర్మ)ముతో కూడియున్నపుడు మధ్యలో ప్రమాణముయొక్క అవసరము ఏర్పడుతూనే ఉన్నది. జడము పరాయత్త ప్రకాశము కదా! ఇక అజడమే ఐతే స్వయంప్రకాశమైన ప్రత్యగాత్మకు తనంతటి తానే తెలియవస్తున్నందున ప్రమాణము జోక్యము చేసుకొని ఇది ఘటము. ఇదికాదు అని చెప్పవలసిన అవసరము లేదు. ప్రత్యగాత్మ ఎల్లపుడూ జ్ఞానరూపమై ఉంటున్నది తానే అజ్ఞానాన్ని తొలగించగల్గేది కాబట్టి అది వ్యావర్తకంగా ప్రకాశించడము దానికి తగును. అందుచేత లౌకిక న్యాయాలచేత బలపర్చబడిన ప్రత్యక్ష ప్రమాణంతో భావరూపముగానే అజ్ఞానము ప్రతీయమానము ఔతూ ఉన్నది.

ఇది అనుమాన ప్రమాణము చేత కూడా సిద్ధించుతుంది. వివాదాధ్యాసితమైన ప్రమాణ జ్ఞానముతన ప్రాగభావానికి వ్యతిరిక్తమైన తన విషయానికి (జ్ఞానానికి) కప్పుగా నిలిచి తనచేతనే తొలగింపదగినదైన, తానున్నచోటనే ఉన్న మరొక వస్తువుతో కూడియున్నట్టిది. జ్ఞానము అప్రకాశితమైన అర్థాన్ని (తెలియనిదాన్ని) ప్రకాశింపచేసేది కాబట్టి. చీకటిలో మొదటగా పుట్టిన ప్రదీపముయొక్క కాంతి వలె అని. దీన్ని వ్యాప్తి అంటారు ఇది అనుమాన ప్రమాణానికి సంబంధించినది. అజ్ఞానాన్ని చీకటితోను

దీపాన్ని జ్ఞానముతోనూ పోల్చి చెప్పడము వేదాన్త శాస్త్రములో కనపడుతుంది. ఆ విషయమే ఇక్కడ చెప్పబడింది. తార్కికులు తమస్సును (చీకటిని) ఒక ద్రవ్యంగా పరిగణించలేదు. కాని కొందరు దాన్ని గూడా ద్రవ్యమనే అంగీకరించినారు. ఇక్కడ అద్వైతి తార్కికమతాన్ని అవలంబించి దాన్ని ఖండిస్తున్నాడు. తమస్సు అనేది ద్రవ్యములలో ఒకటికాదు. కనిపించకపోవడం మాత్రమేకాని (ఆలోకాభావము) రూపము కనిపించకుండుట కాని తమస్సు అని చెప్పవచ్చును. అంతేకాని దానికి ద్రవ్యత్వ లక్షణము లేదు. అయితే భావరూపమైన అజ్ఞానాన్ని సాధించినప్పుడు ఉదాహరణగా చూపినారు గదా! అదెలా కుదురుతుంది? అని అంటున్నారా? చెపుతున్నాను. వినండి. బహులత్వము (దట్టమైనదిగా ఉండడము) విరలత్వము (పలుచగా ఉండడము) మొదలైన అవస్థలను కలిగి రూపముతో కనపడుతూ లభించుతున్నందున తమస్సు కూడా ద్రవ్యమే. మిగతా తొమ్మిదింటికి కలిపితే పది ద్రవ్యాలు అవుతాయి అని. ఇంతవరకు పూర్వ పక్షము.

ఇక సిద్ధాంతము ఆరంభింపబడుతున్నది. అవిద్య అనేది ఒకటి ఉన్నది అనడానికి తమస్సును ఆధారంగా చేసుకొని ప్రత్యక్షము, అనుమానములు రెండూ ఉన్నవని చూపించినాడు. ఇప్పుడది తప్పు అని సిద్ధాన్తి ఖండించబోతున్నాడు. ఇచ్చట దీనికి సమాధానము చెప్పబడుతున్నది – అహమజ్ఞః మామన్యంచనజానామి– నేను తెలియనివాడిని. నన్ను గురించి గాని ఇతరులను గురించిగాని ఎరుగను – ఇది నిద్ర పోయిలేచిన వాని మాట. ఇచ్చట ఉపపత్తితో కూడిన కేవల ప్రత్యక్షముతో భావరూపమైన అజ్ఞానము కనిపించుట లేదు. జ్ఞానప్రాగభావవిషయములో మీరే విరోధాన్ని చెప్పినారో అది భావరూప అజ్ఞానము నందున్నూ వర్తించుతుంది. విషయముగాగాని ఆశ్రయముగాగాని ప్రత్యగర్థము (ఆత్మ) వ్యావర్తకముగా కనిపిస్తున్నదా? లేదా? ప్రతిపన్నమే ఐతే దాని స్వరూపమైన జ్ఞానముచేతనే తొలగింపబడేది ఐన అజ్ఞానము జ్ఞానము కనపడిన తర్వాత ఎలా నిల్చి ఉంటుంది. సూర్య కిరణరేఖలు ప్రసరిస్తుండగనే చీకటి పరుగులు పెట్టి పారిపోతుందికదా! అట్లే జ్ఞానము కలిగినాక అజ్ఞానము ఎలా ఉండకల్గుతుంది? అప్రతిపన్నమేఐతే వ్యావర్తకమునకు ఆశ్రయమైన, విషయమునకు చెందిన, జ్ఞానములేని అజ్ఞానము ఏవిధంగా అనుభవంలోకి వస్తుంది? కేవలజ్ఞానముకాక విశదంగా దాని స్వరూపము తెలియడమే అజ్ఞానానికి విరోధి అని, ఇక్కడ జ్ఞానము తేటగా తెలియరావడము లేదు. అవిశద స్వరూపంగా కనిపిస్తున్నది.

కనుక ఆశ్రయ విషయ జ్ఞానమున్నప్పటికీ అజ్ఞానానుభవానికి విరోధము లేదు అని అంటున్నారా! అయ్యో! జ్ఞానము కలుగడానికి ముందు ఉన్న ప్రాగభావము కూడా తేటగానే తెలియవస్తున్నది. ఐతే ఆశ్రయము యొక్క ప్రతియోగి జ్ఞానము మాత్రము విశదస్వరూపవిషయము కాదు. కనుక ఇచ్చట పట్టుదలకుపోవడమే తప్ప విశేషము మాత్రమేమీ లేదు. భావరూపమైన అజ్ఞానము కూడా అజ్ఞానమే అని తెలియవస్తున్నది గనుక ప్రాగభావ సిద్ధిలోవలె సాపేక్షత్వము ఉండనే ఉంటున్నది. ప్రాగభావము అనగానే దేనికి సంబంధించినది అని ప్రతియోగి సాపేక్షత ఉంటున్నది. అదెలాగంటే – అజ్ఞానము అని అన్నపుడు దాని అర్థము జ్ఞానం లేకపోవడమా? లేక జ్ఞానానికి విరోధియా? లేక దాని కంటే పేరయిన మరొకటి అని అర్థమా? మూడింటికిన్నీ దాని స్వరూప, జ్ఞానాపేక్షను తప్పక ఆశ్రయించవలసియే ఉంటుంది. అంటే ఆ మూటి స్వరూపాలను తెల్సుకోకతప్పదు. చీకటిని గురించి తెల్సుకోవాలంటే వెలుతురు యొక్క అవసరము లేకపోయినా ప్రకాశవిరోధి అనే ఆకారముతో గుర్తించితే ప్రకాశము యొక్క ప్రతిపత్తి అపేక్ష ఉండనే ఉంటున్నది. మీరనుకున్నట్లు భావరూపమైన అజ్ఞానము ఎప్పుడూ కూడా స్వరూపంతో సిద్ధించదు. అజ్ఞానము అని మాత్రమే తెలియవస్తుంది. అలాగైనపుడు జ్ఞానాభావము (జ్ఞానము లేకపోవడము) లాగే తదపేక్షత్వము (దానిని గురించి తెల్సుకోవాలసిన అవసరము) న్నూ సమానమే. జ్ఞానప్రాగభావాన్ని మీరు అంగీకరిస్తున్నారు. ఇంతకుముందు నాకు జ్ఞానములేదు అనడముతో జ్ఞానాభావము ప్రతీయమానమవుతున్నది కాబట్టి ఉభయులమూ అంగీకరించిన జ్ఞానప్రాగభావమే అహమజ్ఞః మామన్యంచ న జానామి అని అనుభవంగా పరిణమిస్తున్నదని ఒప్పుకోవాలి. ఇంతేకాదు నిత్యమూ ముక్తము స్వప్రకాశము చైతన్యమే స్వరూపముగా గల బ్రహ్మకు అజ్ఞానానుభవమున్నూ జరుగదు. ఎందుకంటే బ్రహ్మము స్వానుభవస్వరూపము కనుక. స్వానుభవస్వరూపమే ఐనా అవిద్య చేత తనదైన ప్రకాశము కప్పబడిపోయి అజ్ఞానాన్ని అనుభవిస్తుంది అని అనేట్లయితే ఒక ప్రశ్నకు సమాధానము చెప్పాలి. తిరోహిత స్వరూపత్వమ్ అంటే ఏమిటి? అప్రకాశితస్వరూపము. అంటే తన స్వరూపము జ్ఞానము ప్రకాశింపకపోవుట. ఐతే స్వానుభవ స్వరూపము (స్వానుభవస్వరూపము అనగా తనయొక్క/ తనదైన జ్ఞానాన్ని అనుభవించడము, కలిగి ఉండడము = ఎల్లపుడూ జ్ఞానముతో ప్రవర్తించడము. దీపము తనదైన వెలుగును ఎప్పుడూ కలిగే ఉంటుంది. అదే దానియొక్క అనుభవ స్వరూపము అట్లే ఎల్లపుడూ బ్రహ్మజ్ఞానానుభవంతో ఉండడము.) కల బ్రహ్మకు అప్రకాశిత స్వరూపత్వము ఎలా

వస్తుంది? పరప్రకాశము కాకుండా స్వానుభవ స్వరూపమే ప్రకాశకము ఐన బ్రహ్మకు ఇంకొక వేరయిన దానివలన తన ప్రకాశము అప్రకాశితము కావచ్చునని అనేట్లయితే అపుడు ప్రకాశము అనేది ధర్మము ఔతుంది. అలాంటి ప్రకాశధర్మాన్ని మీరు అంగీకరించలేదు కాబట్టి ప్రకాశమే స్వరూపంగా కల బ్రహ్మమునకు వేరొక్క దానివలన ఆప్రకాశము నశించితే బ్రహ్మకు స్వరూపనాశము – తాను నశించిపోవడము – అనేది వస్తుందని ఇంతకుముందే చెప్పినాము.

ఇంతేకాకుండా బ్రహ్మయొక్క స్వరూపము కప్పివేయబడడానికికారణమైన ఈ అజ్ఞానము **స్వయంగా బ్రహ్మకు తెలియబడ్తూ బ్రహ్మను కప్పివేస్తుంది. బ్రహ్మను కప్పివేసి స్వయముగా ఆయనకు అనుభవంలోకి వెళ్తుంది.** కాబట్టి అన్యోన్యాశ్రయణము అనే దోషము వస్తుంది. అనుభూతమవుతూనే తిరస్కరిస్తుంది అనేటట్లయితే ఒకవేళ అజ్ఞానముచేత తిరోహితము కాకుండానే బ్రహ్మ అజ్ఞానాన్ని పొందుతున్నట్లయితే అపుడు తిరోధానము చేయడమనే కల్పన వ్యర్థమవుతుంది. అలాగే అజ్ఞానస్వరూపకల్పన కూడా. ఎందుకంటే బ్రహ్మకు అజ్ఞానము కనిపించినట్లే అందువల్ల కల్గుతున్నదని అంగీకరిస్తున్న ప్రపంచదర్శనమున్నూ జరుగుతుందికాబట్టి. ఐతే బ్రహ్మకు ఈ అజ్ఞానానుభవము తనంత తాను గానే కల్గుతుందా? మరొకదానివల్లనా? స్వతహానే అయ్యేటట్లయితే అది బ్రహ్మకు స్వరూపము వలన ఔతుంది. కాబట్టి ఏనాటికీ అజ్ఞానము నుండి బ్రహ్మకు విడుదల కానేకాదు. అనుభూతియే స్వరూపముగాకల బ్రహ్మకు అజ్ఞానానుభవము స్వరూపము కావడంతో మిథ్యా రజతమును అది వెండికాదని చెప్పే బాధకజ్ఞానంతో రజతానుభవము కూడా నశించిపోయినట్లే అజ్ఞానాన్ని నివృత్తి చేసే జ్ఞానంతో అనుభూతి స్వరూపమైన బ్రహ్మకు స్వరూపనివృత్తి జరుగుతుంది కదా! ఐతే అది వేరే మరొక దానితోనే ఐతే?అదిఏది? అజ్ఞానాంతరము (మరియొక అజ్ఞానము) అలాగే ఐతే ముందే ఉన్న అజ్ఞానము తొలగడానికి ఒక అజ్ఞానము, దాన్ని తొలగించడానికి మరొక అజ్ఞానము ఇలా కొనసాగితే అనవస్థ ఏర్పడుతుంది ఇది ఒక దోషము.

ఇక బ్రహ్మను కప్పివేసియే స్వయంగా అనుభవింపబడుతుంది (అనుభవ విషయమవుతుంది) అనగా నేను అజ్ఞానముతో కప్పివేయబడినాను అని తెల్సుకుంటాడు. అని అనేట్లయితే అలా ఐనపుడు ఈ అజ్ఞానమనేది కన్నులలో ఉండే **కాసులు** అనే పొరలాంటి వ్యాధిలాగా తాను బ్రహ్మలో ఉండి బ్రహ్మను కప్పివేస్తుంది.

కనుక **అజ్ఞానము జ్ఞానము చేత బాధింపబడదు**. ఇద్దరు చంద్రులు లేరు. చంద్రుడు ఒక్కడే ఉన్నాడని చెప్పినంత మాత్రాన వాడికి ఒక్క చంద్రుడు **"జ్ఞానమువల్ల"** కనిపించడు. కంటిలోనున్న రెండు చంద్రులు కనిపించడానికి కారణమైన **కాసులు** అనబడే పొరను తొలగించిన తర్వాతనే ఏక చంద్ర జ్ఞానము కలుగుతుంది అంటే **వట్టి మాటలతో కాక కంటిలోని పొరలను తొలగించుట అనే "కార్యమువల్లనే" రెండు చంద్రులు కనిపించడమనే దోషము లేకుండా పోతుంది**.

ఇక ఈ అజ్ఞానం స్వయంగా అనాది ఏనాటి నుండి ఉంటూ వస్తున్నదో తెలియదు. బ్రహ్మ సాక్షి. కావున ఆయనకు తన విషయంలో సాక్షిత్వాన్ని కల్పిస్తూ, బ్రహ్మ స్వరూపాన్ని తిరస్కరించడమనే రెండు పనులను ఒకేసారి అజ్ఞానము చేస్తుంది. అపుడు అనవస్థా వంటి దోషాలు ఉండవు అని అంటారా? ఇలా అనడంతగదు. స్వానుభవస్వరూపుడైన బ్రహ్మకు ఆ అనుభవ స్వరూపాన్ని కప్పివేయకుండా / తిరస్కరించకుండా సాక్షిత్వాన్ని ఆపాదించడము కుదరదు. అజ్ఞానం వల్ల కాకుండా మరొక కారణంతో తిరస్కారము జరుగుతుంది అనేట్లయితే అపుడు ఈ అవిద్య / అజ్ఞానము మరొకదానివల్ల పుడుతున్నది కనుక అజ్ఞానము ఉత్పన్నము ఔతుంది దానితో అనాదిమత్వము లేకుండా పోతుంది. పుట్టిన దానికి వినాశము తప్పదు కనుక ఇక ఇంతకుముందు చెప్పినట్లు అనవస్థా కూడా అలాగే ఉంటుంది.

తనదైన స్వయంప్రకాశతారూపమైన స్వరూపము తిరస్కరింపబడకుండానే అజ్ఞానానికి బ్రహ్మకు స్వానుభవము (జ్ఞానానుభవము) ఒక్కటే కాకుండా అజ్ఞానానుభవమున్నూ కలుగవలసి వస్తుంది. అపుడు బ్రహ్మ అజ్ఞానికాక తప్పదు.

మరియు బ్రహ్మను అవిద్య కప్పివేస్తే బొత్తిగా బ్రహ్మ ప్రకాశించకుండా పోతాడా! ఏదో ఒకింత ప్రకాశిస్తాడా? ఈరెండింటిలో మొదటి కల్పము ప్రకారమే ఐతే ప్రకాశ స్వరూపుడైన బ్రహ్మ ఏమాత్రము ప్రకాశించకపోతే తుచ్ఛత్వము వస్తుంది. అనగా గగనకుసుమంలాగా సర్వశూన్యత్వము ఏర్పడుతుంది. ఈ మాటను ఎన్నో సార్లు చెప్పినాము.

ఏదో ఒకింత ప్రకాశిస్తాడు అనేది రెండోకల్పమునకు సమాధానము ఐనపుడు. అంటే వ్యక్తి మొత్తముగా కనిపించదుకాబట్టి సచ్చిదానందైకరసమగు బ్రహ్మయందు ఏ అంశము / భాగము తిరస్కరింపబడుతుంది? ఏది ప్రకాశించుతుంది? చెప్పండి.

బ్రహ్మ సాంశము కాదు. నిరంశము, నిర్విశేషము ప్రకాశమాత్రమే ఐన వస్తువునందు రెండు ఆకారాలు సంభవించవు కాబట్టి తిరస్కారము ప్రకాశము అనేవి రెండూ ఒకేసారి జరుగవు. సరే. ఇక సచ్చిదానందైకరసమైన బ్రహ్మ అవిద్య చేత తిరోహితస్వరూపము కలదై **అవిశదస్వరూపము లాగా కనిపిస్తుంది** అంటున్నావు కాబట్టి ప్రకాశము మాత్రమే తన స్వరూపముగా కల బ్రహ్మకు సహజమైనది విశదతనా? లేక అవిశదతనా? స్పష్టంగా తేల్చవలసియున్నది.

ఇక్కడ వివరింపడుతున్న విషయము ఇది – ఏదైతే సాంశమై సవిశేషమై ప్రకాశింపబడుతున్నదో దానిలోని అన్ని అంశాలు కూడా స్పష్టంగాకనబడడమే **విశదావభాసము.** కొన్ని కొన్ని విశేషాలు కనబడకుండా కొన్ని మాత్రమే కనబడడము. **అవిశదావభాసము.** అలాంటి దాంట్లో ఏ ఆకారము ప్రతిపన్నము కాదో దానిలో ప్రకాశము లేదు కాబట్టే ప్రకాశావైశద్యము లేదు. ఏ అంశము కనబడుతున్నదో దాని యందు దాని యొక్క విషయప్రకాశము విశదంగానే ఉంటున్నది. అందుచేత అన్నిచోట్లలోను ప్రకాశింపబడే అంశమునందు అవైశద్యము అనేది లేదు. విషయమునందున్నూ స్వరూపము కనిపించుతుండగా దానిలోని కొన్ని విశేషాలు కనబడకపోవడమే అవైశద్యము. అందుకని అవిషయము, నిర్విశేషము, ప్రకాశమాత్రము ఐన బ్రహ్మయందు స్వరూపము ప్రకాశమానమవుతుండగా దానిలోని కొన్ని విశేషాలు కనుపించుటలేదు అనే అవైశద్యము అనగా అజ్ఞాన కార్యము జరుగదు. మరియు ఈ అవిద్యాకార్యమైన అవైశద్యమనేది తత్త్వజ్ఞానము పుట్టిన తర్వాత పోతుందా? పోదా? పోకపోయినట్లైతే మోక్షము లేదు. తొలగిపోతే వస్తువు ఎలాంటిది? అని విచారించవలసి ఉంటుంది. విశదస్వరూపము వస్తువు అని అంటే అది ఇంతకుముందున్నదేనా? ఉన్నదే ఐతే అవిద్య వల్ల ఏర్పడిన అవైశద్యము, అది తొలగిపోవడమున్నూ ఉండవు. లేకపోతే మోక్షము అనేది కార్యము ఔతుంది. అందువల్ల దానికి అనిత్యత్వము వస్తుంది. కాగా ఈ అజ్ఞానానికి ఆశ్రయమేదో నిరూపించలేకపోయినందున అవిద్య బ్రహ్మను ఆశ్రయించడం జరుగదు అని మునుపే చెప్పినాము. మరియు ఈ అవిద్య / అజ్ఞానం పరమార్థము కాని దోషము కారణంగా భ్రమ ఏర్పడుతున్నదని చెప్పేవారికి అధిష్ఠానము లేకుండా భ్రమపుట్టదు అనే విషయాన్ని ప్రతిపాదించడం ఏమాత్రము కూడా కుదరదు. భ్రమ కలుగడానికి కారణమైన దోషము, దోషాశ్రయత్వములవలె అధిష్ఠానము అపరమార్థమైనా భ్రమకలుగడము సాధ్యమౌతుంది. అపుడు బౌద్ధులవలె అంతా శూన్యమే ఔతుంది.

భావరూపమైన అజ్ఞానము అనుమాన ప్రమాణము చేతనున్నూ సిద్ధిస్తుంది అని ఏది అన్నారో అది తప్పు. అనుమానమును / వ్యాప్తిని చెప్పడము కుదరదు. చెప్పాము కదండీ అంటున్నారా! నిజమే చెప్పినారు. కానీ అది దురుక్తము. అచ్చట మీరుచెప్పిన హేతువు అజ్ఞానము నందు అనభిమతమైన మరొక అజ్ఞానాన్ని సాధిస్తున్నది. కనుక **విరుద్ధము** అనే **హేత్వాభాసము** అనే దోషముతో కూడియున్నది. హేతువు వలె ఉండి సాధ్యాన్ని సాధించలేదు. కనుక అది హేత్వాభాసము. సాధ్యాభావస్థలములో హేతువు ఉండడము విరుద్ధ లక్షణము. అస్తు. అంతేకాకుండా మరొక అజ్ఞానాన్ని సాధించలేకపోతున్నందున హేతువు '**అనైకాంత్యము**' అనే దోషానికి గురియవుతున్నది. సాధ్యాభావవద్ వృత్తిః అనైకాన్తికః అని లక్షణము. సాధ్యములేని దానియందుండడము ఈ దోషానికి లక్షణము, ఒకవేళ మరొక అజ్ఞానాన్ని సాధించినా అజ్ఞానము అజ్ఞానసాక్షిత్వమును అడ్డుకుంటున్నది. అందువల్ల అజ్ఞానాన్ని కల్పించడం వ్యర్థము ఔతుంది. దృష్టాంతము కూడా సాధన వికలము ఔతుంది. దీపప్రభ అంతవరకు తెలియకుండా ఉన్న వస్తువును ప్రకాశింపచేసేది కాదు గనుక. అన్నిచోట్లలోనూ జ్ఞానానికే ప్రకాశత్వము అనే ధర్మము ఉంటున్నది. దీపము ఉన్నప్పటికీ ఆయా వస్తువులను గురించిన జ్ఞానము లేకపోతే విషయమేమిటో తెలియదు కదా! జ్ఞానేంద్రియాలు ఏవీ కూడా జ్ఞానము కలుగడానికి కారణాలు ఔతాయే తప్ప స్వయంగా ఆయా వస్తువులను ప్రకాశింపజాలవు. బాగా వెలిగే ప్రదీపము యొక్క ప్రభ జ్ఞానాన్ని పుట్టించే కంటికి అడ్డంగా ఉండే చీకటిని తొలగించడం ద్వారా తోడుపడుతుందే తప్ప తాను స్వయంగా జ్ఞానాన్ని పుట్టించదు. ఐతే ఫలానా వస్తువు ఇది అనే ప్రకాశక జ్ఞానము పుట్టడంలో నిమగ్నమైన చక్షురింద్రియానికి ఉపకారకము అవుతున్నందున దీపానికి ప్రకాశకము అని వ్యవహారము చేస్తున్నారు కాని సూటిగా అది ప్రకాశకముకాదు. ఆధర్మము జ్ఞానానిదే. అలాకాదండీ! జ్ఞానంతో సమానమైన ప్రకాశత్వధర్మాన్ని దృష్టిలో పెట్టుకొని దీపప్రభను ఉదాహరణగా చెప్పినాము. జ్ఞానమే తనకుచెందిన విషయావరణాన్ని త్రోసివేస్తూ ప్రకాశకమై ఉంటున్నదన్న విషయాన్నే అంగీకరిస్తున్నాము. అని చెపుతున్నారా! ఐతే ప్రకాశకత్వము అంటే కేవలము జ్ఞానం కలుగకుండా అడ్డుపడే విరోధిని తొలగించడము ఒక్కటేకాదు. ఆయా అర్థాలను/ వస్తువులను ఇది ఫలానా అని విడదీసి తెల్పడం కూడాఅందులో భాగమే. అనగా వ్యవహారము చేయడానికితగిన యోగ్యతను కలిగించడమన్నమాట. అంటే ఇది పండు అని గుర్తించి అందులోనూ మామిడిపండు అని నిర్దేశించి చెప్పడానికి తగిన స్థితిని

కల్గించడము. ఈ స్థితి / శక్తి జ్ఞానానికే ఉన్నది. దీపప్రభకు లేదు. ఒకవేళ జ్ఞానము ఉత్పత్తి కావడంలో ఉపకారకములైన ప్రకాశాదులను కూడా అప్రకాశితమైన అర్థాలను ప్రకాశింపచేయడమనే శక్తి ఉన్నదని ఒప్పుకుంటే అంతకంటే ఎక్కువగా సహకారాన్ని అందిస్తున్నాయి కాబట్టి ఇంద్రియాలకు కూడా అప్రకాశితార్థ ప్రకాశకత్వమును ఒప్పుకోవాలి. అలా ఐనప్పుడు ఇంద్రియాలు తమచేత తొలగింపబడే వస్త్వంతరములు కలవి కావు కనుక అనైకాంత్యమనే దోషము అలాగే ఉంటుంది. ఇంద్రియాలు ఆయా వస్తువులను గుర్తించడానికి తోడ్పడ్తాయే తప్ప అడ్డంగా ఉండేవేరే వస్తువులను తొలగించవు. కనుక ఇక్కడికి చాలు. అనుమాన ప్రమాణములో హేతువే చాలా ముఖ్యమైనది దాన్నిబట్టే వ్యవహారము నడుస్తుంది. ఇక్కడ ఆ హేతువులో ఉన్న దోషాన్నే ఎత్తిచూపి ప్రతిపక్షివాదాన్ని ఖండించినారు.

మీరు చెప్పిన ప్రయోగానికి విరుగుడుగా మేము కూడా కొన్ని ప్రయోగాల్ని చెపుతాము ఆలోచించండి.

1. వివాదానికి కారణమైన అజ్ఞానము కేవలం జ్ఞానమాత్రమైన బ్రహ్మను **ఆశ్రయించినది** కాదు. అది అజ్ఞానము కాబట్టి (జ్ఞానము కాదు. జ్ఞానవిరోధి కాబట్టి) శుక్తికాదులయందలి అజ్ఞానంవలె **జ్ఞాతను ఆశ్రయించి** యుంటుంది.

2. వివాదాధ్యాసితమైన అజ్ఞానము జ్ఞానమాత్రమైన బ్రహ్మకు **ఆవరణము** కాదు. అజ్ఞానమైనందువల్ల శుక్తికాదులయందలి అజ్ఞానమువలె. **అది విషయావరణము**.

3. వివాదాధ్యాసితమైన అజ్ఞానము **జ్ఞానముచేత తొలగిపోదు**. జ్ఞానవిషయానికి ఆవరణము కాదు గనుక. ఏది జ్ఞానము చేత తొలగింపబడే అజ్ఞానమో అది జ్ఞానవిషయావరణము. ఎలాగంటే శుక్తికాదులందలి అజ్ఞానమువలె.

4. బ్రహ్మ అజ్ఞానానికి ఆస్పదము (నెలవు)కాదు. జ్ఞాతృత్వము లేనందువల్ల. ఘటాదుల వలె

5. బ్రహ్మ అజ్ఞానము చేత ఆవరింపబడినవాడు కాదు. జ్ఞానము నకు విషయము కాదు గనుక. ఏది అజ్ఞానావరణమో అది జ్ఞానమునకు విషయమైనది. శుక్తికాదులవలె.

6. బ్రహ్మ జ్ఞానముచేత తొలగింపబడే అజ్ఞానము కాదు. జ్ఞానానికి విషయము కాదు గనుక. ఏది జ్ఞానము చేత నివర్తింపదగిన అజ్ఞానమో అది జ్ఞానానికి విషయమవుతుంది. శుక్తికాదులవలె.

7. వివాదాధ్యాసితమైన ప్రమాణ జ్ఞానము. తన ప్రాగభావానికంటే వేరైన అజ్ఞానపూర్వకము (ముందున్నట్టిది) కాదు. ప్రమాణ జ్ఞానమైనందువలన. మీకు ఇష్టమైన అజ్ఞానాన్ని సాధించే ప్రమాణ జ్ఞానము వలె.

8. జ్ఞానము వస్తువును నశింపచేయదు. శక్తి విశేషముతో ఉపబృంహణము లేనిదైన జ్ఞానం కావడం వల్ల. ఏది వస్తువును నశింపచేస్తుందో అది శక్తి విశేషము చేత ఉపబృంహితము. అలాంటి జ్ఞానము, అజ్ఞానమున్నూ కనపడ్డవి. ఎలాగంటే భగవంతుడు, యోగులు వంటి వారి జ్ఞానము, ముద్గరాదుల వలెనున్నూ.

9. భావరూపమైన అజ్ఞానము జ్ఞానము చేత నాశము చేయబడదు. భావరూపమై నందున కుండ వలె (భావము – అనగా ఉన్నట్టి కనపడునట్టి వస్తువు.)

ఇక మీరిట్లా అనవచ్చును – బాధక జ్ఞానంతో అంతకు మునుపు పుట్టిన పాము అనే జ్ఞానము దానివల్ల కలిగిన భయము, వణుకు, నోట్లో తడారిపోవుట, వంటి వన్నీ నశించిపోవడము కనిపిస్తున్నదికదా! అని. అది సరికాదు. అవి పాము కాదు తాడే అనే జ్ఞానంతో నశించడం లేదు. వాటన్నింటికీ కారణమైన పాము అనే జ్ఞానమునశించింది కాబట్టి అవీ నశించి పోయినాయి. జ్ఞానము క్షణకాలము మాత్రమేకదా ఉండేది. కారణజ్ఞానము నశించినందున కార్యమైన భయాదులు కూడా దానితోపాటే పోయినాయి. క్షణికత్వము అనేది కూడా వాటికి జ్ఞానంలాగే అవి ఉత్పత్తికావడానికి కారణము ఉన్నపుడు కనుపించడము కారణము పోయిన తర్వాత కనుపించకపోవడం వల్ల అర్థమవుతున్నది. ఒకవేళ క్షణికము కాకపోయినపుడు భయాదులకు కారణమైన జ్ఞానాల పరంపర ఎడము లేకుండా కొనసాగుతున్నందున, అన్నిజ్ఞానాలూ భయాదులకు కారణాలు అవుతున్నాయి కనుక అనేకంగా భయాదులు కలిగే అవకాశమేర్పడుతుంది.

ఇకమీరు చెప్పిన అనుమాన ప్రయోగంలో "**స్వప్రాగ భావ వ్యతిరిక్త వస్త్వంతర పూర్వకం**" అని పనికిరాని విశేషణాన్ని చేర్చడం వల్ల మీ ప్రయోగనైపుణ్యము బయటపడుతున్నది. అందువల్ల అనుమాన ప్రమాణము చేతనున్నూ భావరూపమైన

అజ్ఞానము సిద్ధించదు. శ్రుతి ప్రమాణము, అర్థాపత్తి ప్రమాణాల చేత కూడా మీ ఇష్టము నెరవేరదు. దాన్ని తరువాత చెపుతాము. మిథ్యయైన పదార్థానికి మిథ్యయే ఉపాదానము అవుతుంది అనే మాటను కూడా **నవిలక్షణత్వాత్ అనే అధికరణ న్యాయముతో** పరిహరిస్తాము. అందువల్ల అనిర్వచనీయమైన అజ్ఞానానికి సంబంధించి ఎలాంటి ప్రతీతి లేదు. ప్రతీతి ముందుగా ఉండడము, తరువాత భ్రాన్తి కలుగడము, ఆ తరువాత అది సరికాదు అని యథార్థము తెలువడము – బాధ. ఈ మూడింటివల్ల జగత్తు భ్రమ అజ్ఞాన జన్యము అని అనుకోవద్దు. వస్తువు కనుపిస్తున్నది కాబట్టే ప్రతీతి, భ్రాన్తి బాధలకు విషయము ఔతున్నది. అసలు ఏ వస్తువూ అక్కడ లేకపోతే శూన్యంతో ప్రతీతి భ్రాన్తి బాధలకు అవకాశమెక్కడిది? ఇదిగో లోకంలో తాడు పాము వెండి ముత్యపు చిప్పలు కనిపిస్తున్నాయి కదా వీటి మీద రజ్జు సర్పభ్రాన్తి, శుక్తిరజతభ్రాంతులు ఏర్పడుతున్నాయి కాబట్టి, ఇవే కాక ప్రతీతులను బట్టికూడా జ్ఞానాజ్ఞానాలకు విషయము లభించడము లేదు కాబట్టి అనుపలబ్ధి అనే ప్రమాణము ద్వారా భావరూపమైన అజ్ఞానము లభిస్తుంది అని కల్పన చేయకండి అది తగదు.

శుక్త్యాదుల యందు రజతాదులు కనిపిస్తున్నాయి. ప్రతీతి కాలములోనే అచ్చట వెండిలేదనే బాధ కారణంగాను, ఒక వస్తువు మరొక వస్తువుగా ప్రకాశించడము పొసగదు కాబట్టిన్నీ సత్ అసత్ అని చెప్పలేని అపూర్వమైన ఈ వెండి దోషము చేత కనిపిస్తున్నది. అని కల్పించుకొంటే సరిపోతుంది. అని అంటే. అది తగదు. అట్లా కల్పించుకున్నా కూడా ఒక వస్తువు మరొక వస్తువుగా కనిపించడము – ముత్యపుచిప్ప వెండిగా – ప్రకాశించడము తప్పదు గాక తప్పదు. మరొకటిగా కనిపిస్తున్నది అని అంగీకరించినందువల్లనే ఖ్యాతి, ప్రవృత్తి, బాధ, భ్రమ అనేవి పొసగుతున్నాయి. ఖ్యాతి: ఒక అర్థవన్తమైన వస్తువు కనుపించడము. ప్రవృత్తి:– ఆ వస్తువు నుండి ప్రయోజనాన్ని పొందడం కొరకు దాన్ని తెచ్చుకోవడానికి పూనుకోవడము. బాధ: తీరా అక్కడికి పోయినాక అక్కడ తాను తలచిన వస్తువు కాదు. లేదు. అని తెల్సుకోవడం. భ్రమ:– ఇదంతా ఒకటి ఉంటే మరో వస్తువును భావించినాను అర్థము చేసుకోవడం. ఎక్కడా కనిపించని నిష్కారణమైన వస్తువును కల్పించడము ఎంత మాత్రము తగదు. కల్పించబడుతున్న ఈ అనిర్వచనీయమైన అజ్ఞానమనే వస్తువు అనిర్వచనీయమని ఎవరికీ అనిపించడం లేదు. పరమార్థమైన రజతమనే ప్రతీతి కలుగుతున్నది. అనిర్వచనీయమనియే ప్రతీతమైతే భ్రాంతి బాధ ప్రవృత్తి అనేవి కూడా ఉండబోవు.

ఒక వస్తువు కనిపించి, తదుపరి అది ఫలానా కావచ్చును అని భ్రమ కలిగి ఆ తర్వాత సంపాదించుకోవడానికి ప్రయత్నించడాలు జరుగుతాయి. ఇది అది అని కాదు అనకుండా ఏదీ కాదు అని అనిపిస్తే ప్రవృత్తి వంటివి ఏవీ ఉండవు. కనుక ఒక వస్తువు అంటూ ఉండి తీరాలి. అందువల్ల ఒకదాన్ని చూచి ఒకటిగా అనుకోకపోతే, ఆ వస్తువు మరొక వస్తువుగా కనుపించకపోతే ప్రతీతి, ప్రవృత్తి, బాధ, భ్రమలు పొసగవు. కనుక దాన్ని ప్రక్కకు త్రోసివేయలేము కనుక శుక్త్యాదులే రజతాదులుగా ప్రకాశిస్తున్నాయి/ కనుపిస్తున్నాయి అని మీరు ఒప్పుకోక తప్పదు. ఖ్యాత్యంతర వాదులు కూడా ఎంతదూరము వాదించినా చివరికి అన్యథా అవభాసాన్ని ఆశ్రయించాల్సిందే. అసత్ ఖ్యాతివాదులు సత్ రూపంలోనూ, ఆత్మఖ్యాతివాదులు వస్తువులుగాను, అఖ్యాతి పక్షములో ఒకదాని విశేషణము మరొక దానికి విశేషణంగాను, జ్ఞానాలు రెండున్నూ ఒకటిగాను, విషయములేదు అనే అసద్ భావపక్షములో ఉన్నదానిని గాను అంగీకరించవలసియుంటుంది. (ప్రపంచము శూన్యములో నుంచి పుట్టిందా? లేక ఉన్న దాన్నించే ప్రపంచము పరిణామము చెందిందా? అనే అంశం పైన ఖ్యాతి వాదము అను పేరుతో చర్చ జరిగి దానిమీద వేదాన్తులందరూ ఒక్కొక్కరు ఒక్కొక్క వాదాన్ని సమర్థించినారు. సత్‌ఖ్యాతి, అసత్‌ఖ్యాతి, యథార్థఖ్యాతి, అయథార్థఖ్యాతి, ఆత్మఖ్యాతి, అఖ్యాతి అని పలుభేదాలు ఉన్నాయి. శుక్తిరజతభ్రాన్తిలో శుక్తియందు రజతమున్నదని భ్రమ కలుగడానికి కారణముపైన చర్చిస్తూ నిజంగా రజతమున్నదా! రజత అంశ ఉన్నదా? మరొక వస్తువా? మొదలుగాలోతైన చర్చకు అవకాశమున్నది గనుక ఖ్యాతి వాదము ప్రస్తావనకు వచ్చింది)

ఇంకా అనిర్వచనీయమైన అపూర్వమైన రజతము ఇక్కడ పుట్టింది అని చెప్పేవాడు దాని జన్మకు కారణమేదో కూడా చెప్పవలసి ఉంటుంది. ప్రతీతి కారణంకాదు. ప్రతీతికి ఆ వెండి విషయమవుతున్నందున వెండి పుట్టడానికి ముందు ప్రతీతి కలుగడానికి అవకాశమేలేదు. నిర్విషయంగానే పుట్టి, వెండిని పుట్టించి దాన్ని తనకు విషయంగా ప్రతీతి చేసుకున్నది అని చెప్పడము మహాత్ములైన మీకే ఇలా ఉపపాదించడం తగుతుంది. లేదూ ఇంద్రియాదులలో ఉన్న దోషము అలా ప్రతీతిని కల్గిస్తుంది. అంటారా అది కూడా తగదు. ఇంద్రియము స్వతంత్రము కాదు. పురుషుడిని ఆశ్రయించి ఉంటుంది కాన అర్థగతమైన కార్యాన్ని పుట్టించజాలదు. ఇంద్రియాలు కూడా అపూర్వమైన రజతాన్ని సృష్టించవు. అవి కేవలము జ్ఞానాన్ని పుట్టించడములో

మాత్రమే సాధనాలు / కారణాలు కాగలవు. పోనీ దుష్టేంద్రియాలు అందామా! అవీ కావు. అవి తమ కార్యమైన జ్ఞానమునందే విశేషంగా పనిచేస్తాయి. అన్నింటికంటే వేరుగా అనాదియైన మిథ్యాజ్ఞానమైన ఉపాదానమా? అంటే దాన్ని కూడా కాదని ఇంతకుముందే తోసిపారేసినాము.

ఇంతేకాకుండా అనిర్వచనీయమైన ఈ వస్తు సముదాయము రజతము మున్నగు బుద్ధిశబ్దాలతో ఏవిధంగా విషయంగా వ్యవహరింపబడుతుంది? ఘటాది జ్ఞానము, ఘట శబ్దముల వల్ల కాదు. దాని విషయము వేరే. ఇది ఘటాదులకు భిన్నము. రజతము (వెండి) మున్నగువాటి పోలికలతో / సాదృశ్యముతో అనేట్లయితే అపుడు "**వెండిలాంటిది**" అని ప్రతీతి, "**వెండివంటిది**" అని శబ్దము / పేరు ఏర్పడుతాయి. రజతాదిజాతితో కూడినందున (రజతాది జాతియోగాత్) అని అంటే ఆ జాతి యోగము పరమార్థమా? అపరమార్థమా? పరమార్థమైతే కాదు. అపరమార్థముతో కూడికపొసగదు. అపరమార్థమైనా పరమార్థముతో కూడి ఉండడము ఒప్పేది కాదు. అవి కల్సినా పరమార్థ బుద్ధి, శబ్దముల వ్యవహారము సాధ్యం కాదు. కనుక తర్కవాదంలో పరిణతి లేక కుతర్కము చేసే వారితో చాలు నింక వివాదము.

లేదా ''**యథార్థం** సర్వ విజ్ఞానం'' కనిపించేదంతా కూడా యథార్థమే కాని మిథ్య కాదు అని వేదవేత్తలైన వారి యొక్క అభిప్రాయము. శ్రుతులు స్మృతులు దీన్నే చెపుతున్నాయి. వీటి ప్రకారము సమస్త ప్రతీతుల్లోను సర్వాత్మయైన నారాయణుడు ఉంటున్నాడు. అట్లాగే ప్రకృతి అంశాలు అన్నింటిలోనూ ఉన్నాయి. పూర్వము సృష్టి చేయడానికి పూనుకున్నపుడు భగవానుడు **నేను పలురకాలుగా అవుతాను** అని సంకల్పించినాడు. అటుపిమ్మట నీరు తేజస్సు భూమి అనువాటిని సృష్టించినాడు అవి దేనికదే విడివిడిగా నున్నందున భూత సృష్టి జరుగలేదు. అపుడు ఆయన ప్రతిమహాభూతములోనూ మిగతా రెండింటి భాగాలను కలిపినాడు. సగభాగము ఒక ప్రధానభూతము మిగతా సగములో వేరు రెండింటి భాగాలను చేర్చినాడు. అలా త్రివృత్కరణము పూర్తి అయ్యింది. అదే మనకు ప్రత్యక్షంగా కనిపిస్తూ ఉన్నది. **అగ్ని యొక్క ప్రకాశవంతమైన రూపము నీటిలో నున్నది.** అది తేజోధర్మము. అగ్నిలోనూ రోహితము **తెలుపు నలుపు అనేవి ఉన్నాయి. అవి పృధివికి చెందినవి.** ఈ విధంగా అగ్నికిన్నీ త్రిరూపత వచ్చింది. ఈ విషయాన్ని వేదమే చెప్పింది. కనుక అన్నీ అన్నింటిలో కలసి ఉన్నవి. **విష్ణుపురాణము**లోనూ సృష్టి ప్రకరణములో ఇదే చెప్పబడింది.

పలురకాలైన శక్తులు కలిగిన విడివిడిగా ఉన్న పృథివీ అప్ తేజస్సులు తాము **ఒక్కటిగా కలువకుండా ప్రజలను సృష్టింపలేకపోయినాయి.** తదనంతరము పరమాత్మ సంకల్పముతో **ఒకదానితో ఒకటి కలసి** మహత్తును మొదలుకొని విశేషాన్తముగా అండ సృష్టిని చేసినాయి. సూత్రకారుడైన వేదవ్యాసుడు కూడా భూతాలన్నీ **త్రిరూపములని త్ర్యాత్మకత్వాత్తు భూయస్త్వాద**ని సూత్రము ద్వారా చెప్పినాడు. మూడింటిలో ఏది అధికమైతే దానికి ఆ భూతము పేరు వ్యవహారములో ఉంటున్నది. **సోమలత దొరుకనపుడు** పూతీకమను తీగరసాన్ని సోమయాగములో ఉపయోగిస్తారు. అలా చేయమని వేదము చెపుతున్నది. కారణమేమంటే దాంట్లో సోమలతాంశాలున్నాయి కనుక. అట్లాగే **వడ్లు లేకుంటే** దూసవడ్లను తీసుకోవడము కూడా వడ్లలోని లక్షణాలు దానిలో ఉండడమే. అలాగే ఒక వస్తువులో మరొక వస్తువు యొక్క అంశాలు ఎక్కువగా ఉన్నపుడు దానితో సదృశము అనబడుతున్నది. వెండిలోని ప్రకాశవంతమైన లక్షణాలు తెల్లదనము ఉండడము చేత **ముత్యపుచిప్ప వెండిగా** భావింపబడుతున్నది. ఈ ముచ్చటను కూడ వేదమే చెప్పింది. ఇది వెండి ఇది ముత్యపుచిప్ప అనే భేదము ఏ వస్తువు యొక్క అంశాలు. ఎక్కువగా ఉంటాయో దాన్ని బట్టి వెండి ముత్యము చిప్ప అని వ్యవహరింపబడుతున్నది. **ముత్యపు చిప్ప వెండితో సాదృశ్యాన్ని** కల్గియున్నది. అందువల్ల ఈ చిప్పలో వెండి ఉన్నట్లు ప్రతీతి ఏర్పడుతున్నది. ఒకానొకప్పుడు **కండ్లలో ఉండే దోషాన్ని** బట్టి శుక్తి అంశాలను వదిలి రజితాంశాలను గ్రహిస్తే ఇది రజతమని భావించి వెండికొరకు ముందుకు వస్తాడు. కంటిదోషము తొలగిన తర్వాత శుక్త్యంశము తెలియవస్తే ఆ ప్రయత్నాన్ని మానుకుంటాడు. అందువలన శుక్తిలో రూప్యాది విజ్ఞానం యథార్థమే. **బాధ్య బాధకభావము** కూడా అధికాంశాలున్న కారణాన్ని బట్టే చెల్లుబాటవుతుంది. **అందువల్ల మిథ్యార్థము** సత్యార్థము అనే భేదాలేవీ లేవు. ఈ విధంగా అన్నింటికీ సర్వత్వముతో పాటు వ్యవస్థా కూడా ఏర్పడియున్నది.

ఇక కలల్లో కూడా ప్రాణులయొక్క పుణ్యపాపాలననుసరించి భగవంతుడు ఆయా వ్యక్తులు మాత్రమే అనుభవించేటట్లుగా ఆయా కాలాలలో నశించిపోయేట్లుగా మంచివీచెడ్డవీ ఐన పదార్థాలను సృష్టించుతున్నాడు. కలలను గురించి వేదము ఇలాగా చెపుతున్నది. **అచ్చట రథాలు, గుఱ్ఱాలు, బాటలు ఉండవు. వాటిని ఆయన సృష్టించుతాడు. అచ్చట ఆనందము, ముదము ప్రముదములుండవు వాటిని కలిగిస్తాడు. అచ్చట మేడలు మిద్దెలు కొలనులు సెలయేళ్ళు ఉండవు. వాటినీ**

**కల్పించుతాడు**. **ఆయనయే అన్నింటినీ పుట్టించేకర్త** అని. కలలో లోకములోని ఇతర వ్యక్తులందరూ అనుభవించడానికి అనువుగా ఆయా పదార్థాలు లేకపోయినా ఆయా పురుషులు మాత్రమే అనుభవించడానికి తగినట్లు మంచీ చెడ్డలవైన పదార్థాలను ఈశ్వరుడు సృష్టించుతాడు. ఆయనేకదా! నిజమైన కర్త. సత్యసంకల్పుడు ఆశ్చర్యమైన శక్తులున్న ఆయనకు మాత్రమే అలాంటి వస్తువులను పుట్టించగల కర్తృత్వము ఉన్నది. ఇతరులకెవ్వరికీ చేతకాదు అని అర్థము. 1) **ముదము 2) ప్రముదము 3) ఆనందములు – అన్నీ ఆనందములోని భేదాలు**. 1) క్రొత్త వస్తువును చూచినపుడు కలిగేది ముదము 2) అది తనకు దక్కితే ప్రముదము 3) దాన్ని అనుభవించితే కలిగేది ఆనందము. అని నిర్వచనము.

**ఈ ప్రాణులందరూ నిద్రిస్తుండగా మెలకువతో ఉన్న పరమాత్మ వాళ్ళ వాళ్ళ కోరికలను సృష్టిస్తూ ఉంటాడు. ఆయనకే జ్యోతిస్వరూపుడు అమృతము బ్రహ్మ అని పేర్లు. ఆయన పైననే ఈ లోకాలన్నీ ఆధారపడి ఉన్నాయి. ఎవ్వడు కూడా ఆయన ఆజ్ఞను ఉల్లంఘించడు. ఉల్లంఘించలేడు**. అని శృతి చెపుతున్నది. సూత్రకారుడు కూడా 1) **సంధ్యే సృష్టి రాహహి** 2) **నిర్మాతారం చైకే పుత్రాదయశ్చ** అనే రెండు సూత్రాలద్వారా స్వప్నములోని వస్తువులను గురించి జీవుడికే స్రష్టృత్వమును ఊహించి **మాయా మాత్రంతు కార్త్స్న్యేనా నభివ్యక్తి స్వరూపత్వాత్** మొదలైన సూత్రాలతో జీవుడు సంకల్పము మాత్రాన సృష్టిని చేయలేడు. జీవుడికి సత్యసంకల్పత్వము, సత్యకామత్వము సహజంగా ఉన్నప్పటికీ సంసారదశలో అవి బయటపడవు. ఈశ్వరుడికి మాత్రమే ఆయావ్యక్తులు మాత్రమే అనుభవించదగిన వస్తువులను పుట్టించే ఆశ్చర్యకరమైన శక్తి ఉన్నది. అదే స్వప్నాలలో కల్గించి వారి వారి పుణ్యపాప ఫలాలను అనుభవింపచేస్తున్నాడు. **తస్మిన్ లోకాః శ్రితాః సర్వే తదునాత్యేతికశ్చన** అను వాక్యంతో ఆ పరమాత్మనే స్రష్ట అని అర్థమవుతున్నది. అని జీవుడి కాశక్తి లేదని పరిహరించినాడు. పడకటింటిలో మంచముపైన మెత్తటి పరుపుపైన పండుకొని కలలు కంటున్నవాడు తన శరీరంతోనే ఇతరదేశాలకు వెళ్ళడము, రాజుగా పట్టాభిషేకమును పొందడము లేదా శిరశ్ఛేదమును పొందడంలాంటి పుణ్యపాపఫలాలను పడుకున్నప్పుడు ఉన్న దేహముతో సమానమైన స్వరూపము కల మరొక శరీరాన్ని సృష్టించి భగవంతుడు అనుభవింపచేస్తున్నాడు. కాబట్టే సుఖదుఃఖానుభవాలు పొసగుతూ ఉన్నాయి. ఇక శంఖము తెల్లగా ఉండేది పసుపుపచ్చగా కనబడుతున్న సందర్భంలో కంటిలో ఉండే

పచ్చని ద్రవ్యముతో కూడిన కాంతులు శంఖాదులతో కలుస్తాయి. అపుడు పచ్చని ద్రవ్యములో పసుపుదనంతో దట్టంగా కమ్ముకొనబడిన శంఖములోని తెలుపుదనము కంటికి కనిపించదు. అందువల్ల బంగారు పూతపూసిన శంఖంలాగా పచ్చని శంఖము కనబడుతుంది. పచ్చని పదార్థము, దానిలోని పచ్చదనముగాని మిక్కిలిగా సూక్ష్మంగా ఉన్నందువల్ల పక్కనున్న వాళ్ళకు కనుపించదు. కామెర్ల రోగము వలన కండ్లు పచ్చగా ఐన వాడికి మాత్రము తనకండ్లలో నుంచే పచ్చని కాంతులు బయటకి వచ్చినాయి కనుక మిగతావాళ్ళకంటే మిక్కిలి దగ్గరగా ఉన్నందున సూక్ష్మంగా ఉన్నపచ్చదనము స్పష్టంగా కనిపిస్తుంది. అలాగా గ్రహింపబడుటవల్ల, పుట్టిన సంస్కారంతో సహకరింపబడే కంటికాన్తులతో దగ్గరగా ఉండేదాన్నే కాకదూరంగా ఉన్నదాన్ని కూడా పచ్చగానే గ్రహించడం జరుగుతుంది. దాసెన పువ్వుకు దగ్గరగా ఉండే తెల్లని పటిక (స్ఫటిక) మణి కూడా దాని కాంతి చేత కమ్మివేయబడి ఎర్రని రంగు కలదిగా కనిపిస్తుంది. జపాకుసుమము యొక్క కాన్తి అంతటా వ్యాపించి ఉన్నా తేటగా ఉండే ద్రవ్యముతో జతకలసినందువల్ల స్పష్టంగా లభిస్తున్నది అని అలా ఉదాహరణల్లో కనిపించే ఉపలబ్ధివలన ఋజువు చేయవచ్చు.

ఇక ఎండమావులకు సంబంధించి నీరున్నట్లు జ్ఞానం కలుగడానికిన్నీ తేజస్సు, పృథివీ అంశాలు నీటిలో ఉన్నందున కంటిలోని దోషం వల్ల తేజస్సును పృథివిని గ్రహించక పోవడం వల్ల, కనపడకపోవడం చేతనున్నూ, నీటిని మాత్రము గ్రహించడం వలననూ ఎండమావులలో నీరున్నట్లు కనుపించడము యథార్థమే గాని మిథ్యకాదు.

కుమ్మరిసారె – చక్రము – విషయంలో కూడా అది చాలా వేగంగా తిరుగుతుంది కాబట్టి అన్ని ప్రాంతాలతో సంబంధము ఉండి చక్రములోని అరలకు నడుమనున్న ఎడమును గ్రహించకపోవడము వల్ల అరలు లేనట్లు మనకు కనిపిస్తున్నది. ఈనాటి పంకావలె ఇకకొరివిని తీసుకొని గుండ్రముగా తిప్పినపుడు కూడా ఇదే పరిస్థితి దీపావళికి ఇంకా మారుమూల గ్రామాలలోని ప్రజలు సాయంత్రము వేళలో కొరివి లాగా తయారుచేసి మండించి దాన్ని పిల్లలచుట్టూ త్రిప్పి దిష్టి తీస్తారు. దోషము పోతుందంటారు. అక్కడా మంట వేగంగా తిరిగినందువల్ల అంతటా ఉన్నట్లు కనిపిస్తుంది. వేగము తగ్గినపుడు నడుమనున్న వస్తువులు కనిపిస్తవి. కారణం ఎడము ఏర్పడడమే. కనుక అక్కడ కనిపించేది యథార్థమే. అద్దము వంటి వాటిల్లోను ముఖాదులు కనిపించడము కూడా నిజమే. మన కన్నులలోని కాంతులు

దర్పణాదులను తాకి వెనుకకు మళ్ళి వచ్చి ముఖాదులను గ్రహిస్తున్నాయి. అక్కడ కూడా అంతరాలమును గ్రహించకపోవడము, వేగమున్నూ కారణాలుగా అయి ప్రతిబింబము అక్కడ ఉన్నట్టు చూపుతు ఉన్నవి.

దిక్కులుతోచకపోయిన సందర్భములోనున్నూ మరొక్క దిగంశము ఉన్నందున సరియైనదిశ తెలియక ఎదురుగా ఉన్నదిక్కును గ్రహించక మరొక దిశగా గ్రహిస్తున్నాము. కనుక దిగన్తర ప్రతీతి కూడా యథార్థమే.

ఇద్దరు చంద్రులు ఉన్నారనే జ్ఞానములోను బొటనవ్రేలుతో కంటి అడుగున వత్తినందువల్ల లేక కంటిలోనున్న తిమిరమనే వ్యాధి కారణంగాను (తిమిరమనగా చీకటి అని అర్థమున్నప్పటికీ, వైద్య శాస్త్రము తిమిరము అనే పేరుతో కంటి వ్యాధి ఉన్నట్లు చెపుతున్నది. దానికే తెలుగులో కాసులు / నీరు కాసులు అని పేరు) కంటిలోని కాంతులయొక్క గతిలో భేదము ఏర్పడి కారణసామగ్రులు రెండు ఏర్పడినందువల్ల ఒకదానితో మరొకదానికి సంబంధము లేకుండా రెండు సామగ్రులు రెండు చంద్రులను చూపడానికి కారణమవుతున్నది. ఆ రెండింటిలో ఒకటి తనస్థానంలో ఉన్న చంద్రుణ్ని చూపుతుంది. రెండవది మాత్రము సూటిగా ప్రయాణించక కొంచెము వంకరగా పోయి చంద్రుడికి దగ్గరగా ఉన్న ప్రదేశాన్ని చూపిస్తూ తన దేశంలో గాక మరొక చోట నున్న వాడినిగా చంద్రుడిని చూపిస్తుంది. ఇందువలన రెండు సామగ్రులు ఒకేసారి వేరువేరు చోట్లలో నున్న చంద్రుడిని చూపడంలో గ్రహణభేదాన్ని బట్టి గ్రాహ్యమైన ఆకారంలో భేదము ఏర్పడుతుంది. ఇలా ఒక్క చంద్రుడిని గ్రహించ నందున ఇద్దరు చంద్రులు అని ప్రతీతి కలుగుతున్నది.

ఒక ప్రదేశంలో ఉన్న చంద్రుడికి యధాస్థానంలో ఉన్నందున ఆకాశంలో చంద్రుడు అని, మరొక చంద్రుడికి అనగా తన స్థానంలో ఉన్నట్టు గ్రహింపబడని చంద్రుడికి నిరంతర గ్రహణము కాక మరొకచోట ఏదో ఒక చెట్టు పై నున్నట్లు కనపడుతుంది. ఇలా కనబడడానికి సామగ్రులు / హేతువులు రెండు ఉండడమే. అవి రెండు ఉన్నాయిగాబట్టి రెండు చంద్రులు ఉన్నట్లు కనిపిస్తున్నారు. కారణాలు యథార్థము కాబట్టి కార్యాలు కూడా యథార్థమే. ఇచట విశేషణాలు రెండింటితో కూడిన రెండు చంద్రులను గ్రహించడంలో ఇంతకుముందు ఒక్క చంద్రుడినే చూచినాము. ఇపుడు ఇద్దరు కనపడుతున్నారు మనము ఒక్కటినే చూడాలి అనే ప్రత్యభిజ్ఞానము ఉన్నా కేవల చక్షుస్సుకు అలాంటి సామర్థ్యము లేదు కావున రెండు చంద్రులనే

చూపిస్తుంది. నిత్యమూ రెండు కండ్లు పెట్టుకొని చూస్తున్నాము. రెండు చంద్రులు కనిపించక ఒక్కడే చంద్రుడు కనిపిస్తున్నాడేమిటి? అనే సందేహము రావచ్చు. అలాగా రెండు ఒక్క సామగ్రిలో కలిసిపోయినందున ఒక్కడిగానే కనిపిస్తున్నాడు. దోషము వలన రెండు సామగ్రులు ఉన్నాయి. కాబట్టి రెండు కనపడ్తున్నాయి అని కార్యాన్ని బట్టి కారణాలను ఊహించి సమన్వయము చేసుకోవాలి. కంటివ్యాధి తొలగిపోతే తన స్థానంలోనే ఉన్నవాడిని గ్రహిస్తున్నాము కాబట్టి చంద్రుడు ఒక్కడే కాని కంటి దోషము వల్ల అలా జరిగింది అని విశ్వాసము ఏర్పడుతుంది. "**దోషము వల్ల సామగ్రీద్విత్వము. అందువల్ల గ్రహణద్విత్వము. అందువల్ల గ్రాహ్యమైన ఆకారాలున్నూ రెండు.**" ఈ కారణంగా "**విజ్ఞానమంతా /** తెలియబడేదంతా / కనపడేదంతా **యథార్థమే.** " అని నిశ్చయమయ్యింది.

యథార్థఖ్యాతి కాకుండా అసత్ఖ్యాతి అఖ్యాతి వంటివన్నీ ఆయా పక్షాలవారు తమ వాదాలను సమర్థించుకుంటూ ఇతరుల వాదాలను ఖండించియున్నారు. కనుక ఆ విషయంలో మేమేమీ ప్రయత్నం చేయదల్చుకోలేదు. లేదా పలురకాలుగా దృశ్యమాన ప్రపంచమంతా మిథ్యకాదు. అపరమార్థమైన అవిద్యాకల్పితం కాదు అని పలుమార్లు చెప్పడం దేనికి?

ప్రత్యక్షము, అనుమానము, ఆగమము – వేదము అనే ప్రమాణాలలో, ఆగమముల చేతనే తెలియబడేవాడు అన్ని రకాలైన దోషగంధములు లేనివాడు. ఇంత అని చెప్పరాని అతిశయము గలవాడు, లెక్కింపలేనన్ని కళ్యాణ గుణగణములు కల్గినవాడు. సమస్తమును ఎరిగినవాడు, సత్యసంకల్పుడు ఐన పరంబ్రహ్మను అంగీకరించేవారికి సిద్ధించనిదేముంటుంది? పొసగనిది ఏముంటుంది? భగవంతుడు అగు పరబ్రహ్మచేత క్షేత్రజ్ఞుల జీవుల యొక్క పుణ్యపాపాలకు తగినట్లు, వారు ప్రేమగా అనుభవించడానికి తగినట్లు సుఖము, దుఃఖము, ఉపేక్షలఫలములనుభవించడానికిగాను పదార్థాలు అందరూ అనుభవించడానికి తగినవిగా సృష్టించబడినవి. మరికొన్ని ఆయావ్యక్తులు మాత్రము అనుభవించ తగిన విషయాలుగా ఆయాకాలాల్లో నశించిపోయేట్లుగా సృష్టింపబడుతున్నాయి. ఆ విషయంలో అందరూ అనుభవించదగినవి, కొందరికి మాత్రమే తగినవి అనే అంశాన్ని బట్టి బాధ్య బాధక భావము నిర్ణయించబడుతున్నది. కావున అంతయూ సమంజసమే. **ఇదియథార్థఖ్యాతి – ప్రమాణానుపపత్తిలో భాగము –**

సత్ అసత్ అని చెప్పరానిది అజ్ఞానము. సద సద నిర్వచనీయము. ఇందుకు శ్రుతి ప్రమాణమున్నది అని ఏది చెప్పినారో నిజంగా అది అసత్ – **అనృతేనహి ప్రత్యూఢాః** అనే వాక్యంలో, ఇతర స్థలాల్లోనూ కనపడుతున్న "**అనృత**" శబ్దానికి అనిర్వచనీయము అని అర్థముకాదు. ఋత**మునకంటే వేరు ఐనది** అని దాని యర్థము. ఋతశబ్దము కర్మను తెల్పుతున్నది. **ఋతంపిబన్తౌ సుకృతస్యలోకే** అని చెప్పినందువల్ల ఋతం కర్మ అనగా ఫలములను పొందాలి అనే కోరికలేకుండా పరమ పురుషుడిని ఆరాధించే క్రియ. ఆయన సాన్నిధ్యానికి చేరుకోవడమే ఫలముగా కలది. ఇచ్చట చెప్పబడినటువంటిది. అనృతం అనగా సాంసారిక ఫలములను కోరుతూ చేయబడేది ఐన కర్మ. అది బ్రహ్మ ప్రాప్తికి విరోధి. పరబ్రహ్మను చేరకుండా అడ్డుపడేటు వంటిది. కాబట్టే **ఏతంబ్రహ్మలోకం నవిన్దన్తి అనృతేన హిప్రత్యూఢాః** – ఈ పరమోత్కృష్టమైన బ్రహ్మ లోకాన్ని వారు పొందలేరు. వారు కర్మబద్ధులై యున్నారు అని చెప్పినారు. **అపుడు అసత్తులేదు**. **సత్తూలేదు** అనే వాక్యంలోనూ సత్ అసత్ శబ్దాలు చిత్తును అచిత్తును విడివిడిగా నున్నవాటిని గురించి చెపుతున్నవి. ప్రపంచ సృష్టి కాలమందు సత్ త్యత్ శబ్దములచేత చెప్పబడిన విడివిడిగా నున్న చిత్ అచిత్ అనబడే వస్తువులు ప్రళయకాలమునందు ఆ చిత్తుయొక్క ప్రకృతి అంతా కలిసినట్టి, తమస్సు అనే శబ్దముతో పిలువదగిన వస్తువునందు లయమును ఈ వాక్యము ప్రతిపాదిస్తున్నది. ఈ సందర్భంలో దేనికీ సదసదనిర్వచనీయత చెప్పబడడం లేదు సదసత్తులకు రెండింటికీ కాలవిశేషము నందు – అసద్ భావమును – మాత్రమే చెపుతున్నది. (అనగా ప్రళయము ఏర్పడినపుడు చిదచిత్తులు రెండూ కల్సిపోయి '**తమస్సు**' అనే పేరుతో వ్యవహరింపబడుతవి. ఆ తమస్సు పరమాత్మలో లీనము అవుతుంది. అపుడు పరమాత్మ ఒక్కడే ఉంటాడు. ఆయన నిజంగా సత్ శబ్దవాచ్యుడు చిదచిత్తులు పరమాత్మలో కల్సిపోయి బయట ఎక్కడా కనిపించడం లేదు. ఇది ఆ కాలానికి మాత్రమే పరిమితం. ఐతే అపుడు రెండింటికీ **అసత్** అని వ్యవహారము. అసత్ భావము అనగా అసత్ యొక్క స్వభావము. లేకపోవుట ఇచట తమ శ్శబ్దానికి "**అచిత్స మష్టిత్వము**" అనే అర్థము వేరొక శ్రుతివాక్యంవల్ల తెలియవస్తున్నది. **అవ్యక్తము అక్షరము నందు కలుస్తున్నది**. **అక్షరము తమస్సులో కలుస్తున్నది** అని గదా! అంటారేమో! సత్యమే! తమశ్శబ్దము చేత అచిత్ సమష్టి రూపమైన ప్రకృతి యొక్క సూక్ష్మావస్థ చెప్పబడుతున్నది. దానికే **మాయనే ప్రకృతిగా తెల్సుకోవాలి**. **మాయ కలవాడు మహేశ్వరుడు అని ఎరుగవలెను**. అని చెప్పడం చేత మాయా శబ్దానికి అనిర్వచనీయత్వము అర్థమని ఎక్కడా చెప్పలేదు.

మిథ్యా శబ్దానికి మాయా శబ్దము పర్యాయవాచకము కాదా! అంటే కాదు అన్ని చోట్లా మాయా శబ్దము మిథ్యా విషయము అని భావించకూడదు. ఆ సురము, రాక్షసములు ఐన అస్త్రాల విషయాలలో మాయా శబ్దము ప్రయోగింపబడింది.

**యథోక్తమ్ – పిల్లవాడి శరీరమును కాపాడుచున్న ఆయన చేత శంబరుని యొక్క వేలకొలది మాయలనన్నింటినీ ఒక్కొక్కటిగా నరకివేయబడినవి** అని చెప్పబడింది. కావున మాయా శబ్దము వింతలైన ఆశ్చర్యకరములు ఐన వస్తువులను సృష్టించునట్టిది అని తెల్పుచున్నది. ప్రకృతిని మాయా శబ్దంతో వ్యవహరించడము కూడా వింతలైన వస్తువులను పుట్టించడము వల్లనే. **ఈ ప్రకృతి నుండే ఆశ్చర్యకరాలైన వస్తువులను సృష్టించే శక్తిసంకల్పములు కల పరమాత్మ వాటిని సృష్టించుతుండగా ఆ పదార్థాలయందు భోగ్యబుద్ధితో మరొక్కడు** – జీవుడు **వాటిలో దూరి బయటకు రాలేక ఇరుక్కుపోయి ఉన్నాడు** అని మాయాశబ్దం చేత చెప్పబడే ప్రకృతి విచిత్రములైన వస్తువులను సృష్టించే శక్తి కలది అని స్పష్టమవుతున్నది. పరమ పురుషుడికి మాత్రము ఆ మాయాగుణము ఉన్నందున **మాయి** అని వ్యవహారము ఏర్పడింది. "**జీవుడికి మాత్రమే మాయతో అడ్డగింపబడడము వినిపిస్తున్నది**". **తస్మింశ్చాన్యో మాయయా సన్నిరుద్ధః** అని **అనాదియైన మాయ ప్రభావము చేత నిదురపోయిన జీవుడు ఎపుడు మెలకువను పొందుతాడో** అని కూడా వినిపిస్తున్నది. **ఇంద్రుడు మాయలచేత పలురూపాలను పొందుచున్నాడు**. అనే చోటనున్నూ మాయశబ్దము చేత **విచిత్రములు వింతలు ఐన శక్తులు** అని చెప్పబడుతున్నది. కావుననే **త్వష్టాబ్రహ్మవలే గొప్పగా ప్రకాశిస్తున్నాడు** అని చెప్పినారు. మిథ్య, మాయ, లేనిది ఐన దానితో ఎవ్వడున్నూ ప్రకాశించడు కదా! **నామాయ తప్పించుకొని పోరానిది** అనే స్థలము లోనూ **"గుణమయీ"** అని వివరించినందున మునుపు చెప్పిన ప్రకృతియే సత్వరజస్తమస్సులనే గుణాలతో కూడియున్నదిగా చెప్పబడుతున్నది. కనుక **"వేదవాక్యములతో సదసదనిర్వచనీయమైన అజ్ఞానాన్ని గురించిన ఎలాంటి ప్రతిపాదనా చేయబడలేదు."** అంతేకాక **"తత్త్వమసి అనుచోట జీవబ్రహ్మలకు ఉన్న ఐక్యోపదేశము పొసగడం లేదని అనిర్వచనీయ మగు అజ్ఞానాన్ని కల్పించకూడదు."**

తత్త్వమసి అనువాక్యంతో జీవుడికి పరమాత్మకున్నూ ఐక్యతను చెప్పినట్లయితే సర్వజ్ఞుడు, సత్యసంకల్పుడు సమస్త ప్రపంచానికి సృష్టి స్థితిలయములు జరుగడానికి మూల కారణమైనవాడు తత్ శబ్దం చేత చెప్పబడే ఈ పరబ్రహ్మ యందు ఆయనకు

పూర్తిగా విరుద్ధమైన అజ్ఞానాన్ని కల్పించడానికి అవసరమైనట్టి అనుపపత్తి ఏదీలేదు. ఐక్యతను తెలిపే మాటలో త్వంశబ్దవాచ్యుడు **జీవుడిని తన శరీరముగా కల పరమాత్మనే.** కావున అన్యథా శంకించనవసరం లేదు. **విచిత్రమైన శరీరాలకు ఆత్మగా నున్న ఈ జీవుడిలో ప్రవేశించి అతనితోపాటు దేహాలలోకి దూరి వాటికి నామములను, రూపములను కలిగించుతాను** అని చెప్పినట్లుగా త్వంశబ్దంతో చెప్పబడే జీవుడిలోనూ ఆత్మగానూ ఉన్నాడు కనుక అన్ని వస్తువులలోనూ ఉన్న జీవుడికి వ్యవహారము కలిగినట్లు పరమాత్మకున్నూ వ్యవహారము కుదురుతుంది. ఏ పేరుతో పిల్చినా శరీరానికి అది చెందక ఆత్మకే చెందినట్లు ఆ పేరు జీవుడికి అన్తర్యామియైన పరమాత్మకున్నూ వర్తిస్తుంది కనుక త్వంశబ్దము చేతనున్నూ పరంబ్రహ్మకే వ్యవహారము పొసగుతుంది. కనుక నామ రూపాలన్నీ ఆయనవే. అందుచేత బ్రహ్మకు అజ్ఞానాన్ని కల్పించడమేమీ లేదు. అది తగదు కూడా. ఆ అవసరమూ లేదు. **ప్రమాణానుపపత్తిలో శ్రుతితదర్థా పత్తి సిద్ధత్వ నిరసనము ముగిసింది**.

(అర్థాపత్తి అనేది ఒకప్రమాణము. ఇది ఇలా ఉంటుంది. **పీనోదేవదత్తః దివానభుంక్తే**. బలిసి యున్న దేవదత్తుడు పగటి పూట భోజనము చేయడు అన్నపుడు తిండి తినని వాడు బలిసి ఉండడం కుదరదు. కనుక పగటిపూట తినకున్నా రాత్రి వేళ తింటున్నాడని ఊహించడము ఔతుంది. ఇలా కార్యాన్ని బట్టి కారణాన్ని ఊహించడమే **అర్థాపత్తి**.)

## అవిద్యస్మృతి పురాణాలవల్ల సిద్ధించింది అనేది తప్పు

ఇక ఇతిహాసాలు పురాణాలలోనూ బ్రహ్మకు అజ్ఞానము కలిగినట్లు ఎక్కడా చెప్పబడలేదు. ఏమండీ! విష్ణు పురాణములో **జ్యోతీంషి విష్ణుః భువనాని విష్ణుః** అనే శ్లోకము ద్వారా బ్రహ్మ ఒక్కటే యథార్థతత్వము అని ప్రతిజ్ఞ చేసి **జ్ఞానస్వరూపుడు భగవంతుడు**. **ఆయన నుండే ఈ కొండలు సముద్రాలు నేల** మొదలైన భేదాలతో పరస్పరము భిన్నంగా ఉన్న జగత్తు జ్ఞానస్వరూపుడైన బ్రహ్మకు అజ్ఞానము కమ్మినందున కనపడ్తున్నదని చెప్పి **ఎపుడైతే కర్మరూపా జ్ఞానము తొలగిపోయి పరిశుద్ధుడు అయ్యి తనదైన సహజ స్వరూపాన్ని పొందుతాడో** అని చెపుతూ జ్ఞానస్వరూపుడైన బ్రహ్మకు తనదైన స్వరూపముతో నున్నపుడు ప్రపంచరూపమైన పలువస్తువులను దర్శించడము లేదు అనగా భేదదృష్టి లేదు. ఇపుడు అవిద్య కమ్మినందున వివిధమైన భేదాలను

దర్శించడమనేది అజ్ఞానం వల్లనే జరుగుతున్నదని స్థిరీకరించినాడు. తరువాత **వస్తువు ఏది ఉన్నది? నేల కుండ రూపాన్ని** అనే రెండు శ్లోకాలతో జగత్తు ప్రస్తుతము కనపడుతున్న రూపంలోనైనా స్థిరంగా ఉండక నశించిపోతూ పలు పరిణామాలు పొందుతున్నది కాబట్టి జగత్తు అసత్యమేనని ప్రతిపాదించి **అందుచేత విజ్ఞానము తప్ప వేరు లేదు** అని అంటూ బ్రహ్మకంటే భిన్నమైనది ఏదీ లేదు అని ముందు తాను చేసిన ప్రతిజ్ఞను బలపరుస్తూ ముగించినాడు. అనన్తరము **విజ్ఞానమొక్కటే** అని జ్ఞానస్వరూపుడైన బ్రహ్మ యందు భేదదర్శనానికి కారణమైన అజ్ఞానానికి మూలము తనదైన కర్మనే అని స్పష్టం చేసినాడు. అంతటితో ఆగక **జ్ఞానం విశుద్ధం** అను శ్లోకంతో జ్ఞానస్వరూపుడైన బ్రహ్మ యొక్క స్వస్వరూపాన్ని పరిశోధించి **ఇలాగా ఉన్నదైన సద్భావమును గురించి నేను నీకు చెప్పినాను** అని అంటూ జ్ఞానస్వరూపుడైన బ్రహ్మనే సత్యము ఆయన కంటే వేరుగా కనిపించేది ఏది కూడా నిజము కాదు అని చెప్పినాడు. ఒకవేళ ఏదైనా ఉన్నట్లు కనిపించినా అది అసత్యమే. అంతేకాదు అవి నిజంగా నిజము కాదు **"వ్యావహారిక సత్యములే"** అనే తత్వాన్ని నీకు ఉపదేశించినాను అని ఆ ఘట్టము కనపడుతున్నది కదా అని అనరాదు. వ్యావహారిక సత్యము అనగా ప్రసంగము పొసగడము కొరకు ఉన్నదని అనుకోవడం. నిజానికి అక్కడ ఏదీ ఉండదు. పాము ఉన్నది అని అనుకుంటేనే కదా భయము వంటివి కల్గుతవి. పామే లేదనుకున్నపుడు భయాదులు కూడా ఉండవు. అచట వృత్తాంతము మీరు తలచినట్లుగా లేదు. ఈ ప్రకరణములో ఈ బ్రహ్మండము యొక్క విస్తీర్ణాన్ని, స్వరూపాన్ని చెప్పి ఇంతకుమునుపు చెప్పనిదైన మరొక రూపాన్ని సంగ్రహంగా చెపుతాను. వినండి అని మొదలుపెట్టి చెప్పబడుతున్నది. చిత్, అచిత్తులతో కలిసి ఉన్న ఈ జగత్తునందు చిదంశము వాక్కులకు మనస్సుకు అందనిది. తనకు మాత్రమే తెలియ దగిన స్వరూపభేదాన్ని కల్గియున్నట్టిది. జ్ఞానమొక్కటే దాని ఆకారము. ప్రకృతివల్ల కలిగే సంబంధాలతో ఎలాంటి అంటు సొంటు లేనట్టిది. కావున నాశము లేనిదిగా ఉన్నది. అందుచేతనే అది **అస్తి ఉన్నది** అనే శబ్దంతో చెప్పబడ్తున్నది. అచిత్ అంశమైతేనో చిదంశమైన జీవునియొక్క కర్మమును కారణంగా చేసుకొని పలురకాలైన పరిణామాలను భేదాలను పొందుతున్నది. కనుక అడుగడుగునా నాశాన్ని పొందుతున్నది. కనుక **నాస్తి లేనిది** / **లేదు** అనే శబ్దంతో పిలువబడుతున్నది. ఈ రెండూ కూడా పరంబ్రహ్మ ఐన వాసుదేవుడికి శరీరముగా నున్నవి. అందువల్ల అవి భగవదాత్మకములు / భగవన్మయములు. ఈ విషయమే ఇక్కడ సంక్షేపంగా చెప్పబడింది. అది ఈలాగున ఉన్నది.

**శ్లో: యదమ్బు – ఓ బ్రాహ్మణుడా నీరు విష్ణువు యొక్క శరీరము. దానినుండే పర్వతాలు సముద్రాల వంటి వాటితో కలిసియున్న భూమి పద్మము వంటి ఆకారము కలదై పుట్టినది** అనే శ్లోకంతో **నీరు విష్ణువుకు శరీరమని** నీటి నుండి పరిణామము చెందిన **బ్రహ్మాండము కూడా** విష్ణువు యొక్క **శరీరమేనని** దానికి విష్ణువు **ఆత్మ** అని తెలుపుతూ సకల శ్రుతుల ద్వారా తెలియవచ్చే తాదాత్మ్యాన్ని బలపరిచే సామానాధికరణ్యము **జ్యోతిస్సులు విష్ణువు** అని ఆరంభించి చెప్పబడింది. – **జగత్తుకు విష్ణువు కున్నూ** – శరీర ఆత్మసంబంధమే కారణము. ఈ శాస్త్రములో ఇదే విషయము దీనికి ముందు పలుమార్లు చెప్పబడింది. **అవన్నీ ఆయనకు దేహాలు**. 2) **అదంతా శ్రీహరికి శరీరము** 3) **ఆయనయే సర్వభూతాలకు ఆత్మ**. **విశ్వరూపుడు**. **అందువల్లనే నాశనము లేదు**. **వికారరహితుడున్నూ** అని. అందువల్ల జగత్ బ్రహ్మలకు ఉన్న తాదాత్మ్యము శరీర + ఆత్మభావము చేత సిద్ధించినది. కాబట్టే సామానాధికరణ్యముగా ఉపదేశింపబడుతున్నది **జ్యోతీంషి విష్ణుః అని**. ఇచ్చట అస్తి నాస్తి శబ్దాలతో చెప్పబడే వస్తువంతా – జగత్తులో కనిపించేది – విష్ణువుకు శరీరమైనందున **"విష్ణ్వాత్మకము"** అని చెప్పబడింది. ఐతే ఇది ఉంది అనబడేది, ఇదిలేదు అనబడేది ఐన చిదచిత్తులతో మిశ్రితమైన జగత్తు నాస్త్యాత్మకము – **లేదు అనబడేదిగా వ్యవహరించడము** – అనడానికి కారణము ఇది అని ఇలాగా చెప్పినాడు. **జ్ఞానస్వరూపో భగవాన్ యతోఽసౌ** అనే శ్లోకముతో. సమస్త క్షేత్రజ్ఞులుగా – **దేవతిర్యక్ మనుష్యులుగా** – ఉన్నటువంటి భగవంతుడికి జ్ఞానమే సహజమైన రూపం. దేవమనుష్యాది రూపము కాదు. ఇది ఇలాగా ఉన్నది కాబట్టే అచిత్తు యొక్క రూపమైన దేవతలు, మనుష్యులు, కొండలు, సముద్రాలు, భూమి మొదలైనవన్నీ అయన యొక్క విజ్ఞానము నుండి బయలుపడినట్టివి. జ్ఞానము ఒక్కటే ఆకారముగా కల్గియున్న ఆ సత్ శబ్దవాచ్యుడు దేవాది ఆకారాలతో తనలో తాను తలచుకోవడం వల్ల, వైవిధ్యాన్ని తలచినందువల్ల పుట్టినట్టివి. అనగా దేవాదిఆకారాలు ఏర్పడడానికి కారణమైన కర్మమూలంగా బయలుదేరినట్టివి అని అర్థము. **"అచిత్ వస్తువు క్షేత్రజ్ఞుడనబడే జీవుని యొక్క కర్మకు తగినట్లు పరిమాణాలను పొందుతుంది"**. అందువల్ల అచిత్తు నాస్తి శబ్దముతో పిలువబడుతుంది. దీనికి భిన్నమైనది – జీవాత్మ – అస్తి శబ్దముతో చెప్పబడుతుంది. దానినే వివరించుతున్నాడు. **యదాతుశుద్ధం నిజరూపి** అని. జ్ఞానము ఒక్కటే సహజస్వరూపముగా కల ఈ ఆత్మవస్తువు దేవాది ఆకారాలుగా వైవిధ్యాన్ని తలుచుకొనడానికి కారణమైన పుణ్యపాపములనబడే కర్మలన్నీ నశించి పోయి నిర్దోషము, పరిశుద్ధమున్నూ అయ్యి నిజరూపాన్ని పొందుతుందో అపుడు దేవాది

ఆకారాలన్నీ ఒక్కటిగా అయ్యి తనను పలురకాలుగా కల్పించుకోవడానికి మూలమై కర్మఫలములై ఆత్మానుభవానికోసము ఏర్పడిన వస్తువుల యందు వస్తుభేదములు కలుగవు. ఏవైతే దేవాది వస్తువులుగా నున్నవారికి తనవిగా భావించినందువల్ల భోగ్యవస్తువులు ఐన దేవుడు మనుష్యుడు కొండలు సముద్రాలు నేలలు అనే వస్తుభేదాలు ఉన్నవో అవి, వాటికి కారణాలు ఐన కర్మలు, నశించిన తర్వాత ఏర్పడవు, అవి అన్నీ అచిత్ వస్తువునకు ఆయా అవస్థా విశేషాలలో జతపడుతున్నందున ఎల్లపుడూ ఒక్క రీతిలో ఉండనందువల్లనున్నూ నాస్తి శబ్దంతో వ్యవహరింపబడుతున్నవి. ఇక దీనికి భిన్నమైన చిత్ స్వరూపుడు తనకు స్వాభావికమైన జ్ఞానాకారముతో చెదరక బెదరక ఉంటున్నందున అస్తి శబ్దంతో చెప్పబడుతున్నాడు అని అర్థము. క్షణక్షణానికి మార్పులు పొందుతూ కాదా చిత్‌కములైన అవస్థలను పొందుతున్నందున అచిత్ వస్తువు – ప్రకృతి – నాస్తి శబ్దం చేతనే వ్యవహరింపతగినది అని అంటూ **వస్త్వస్తికిమ్** అను శ్లోకంతో చెప్పినాడు. అస్తి శబ్దంతో చెప్పబడేది **ఇది మొదలు, ఇది నడుమ, ఇది చివర** అనే భేదాలు / దశలు లేనిదై ఎల్లకాలాలలోనూ ఒకే ఒక్క రూపాన్ని కల్గియుండే పదార్థము. అది ఒకానొకపుడు కూడా నాస్తి లేదు అనే ఊహను ఐనా కల్గించదు. అచిద్ వస్తువు ఏ ఒక్కటి గాని ఎక్కడ ఎపుడు గాని దీనిలాగా కనపడడం లేదు. ఐతే ఏమిటి? అనే దానికి సమాధానం చెపుతున్నాడు. **యచ్చాన్యథాత్వమ్** అని. ఏ వస్తువైతే ప్రతిక్షణమూ ఉన్న రూపాన్ని కోలుపోతూ కొత్తరూపాన్ని పొందుతూ ఉన్నదో అది ఒకదాని వెంట ఒకటొక్కటిగా ఉత్తరోత్తరావస్థలను పొందుతూ ముందున్నట్టి పూర్వ పూర్వ అవస్థలను వదిలిపెడుతూ వస్తున్నది. కనుక దానికి రెండవ అవస్థలో మొదటి అవస్థ యొక్క అనుసంధానము / గుర్తింపు ఏమాత్రము ఉండడం లేదు. అనగా ఇంతకుముందు చూచిన వస్తువే ఈ రూపంలో కనిపిస్తున్నది అని తెలియడానికి మచ్చుకు ఒక్క లక్షణము / గుర్తు కూడా కనుపించనందున **ఇది వేరే** అనే బుద్ధి కలుగుతున్నది కానీ **అదే ఇది అనే భావన కలుగడం లేదు.** అందువల్ల అచిత్ వస్తువుకు ఎల్లకాలాల్లోనూ **నాస్తి** శబ్దంతోనే వ్యవహారం జురుగుతున్నది. అదే దానికి తగినట్టిది. ఆ తీరుగానే ప్రత్యక్షంగా కనిపిస్తున్నది అని **మహీఘతత్వమ్** – మట్టి కుండగా – **అనే శ్లోకంతో చెప్పినాడు** – తాము చేసిన కర్మలననుసరించి దేవమనుష్యాది రూపాలను ధరించి తాము భోక్తలమనే భావనను నిశ్చయించుకొని తమకు అనుభవించడానికి తగినదైన అచిత్ వస్తువును ప్రతిక్షణమూ మార్పుచెందుతున్నదాన్ని గమనించుతున్నారు. అనుభవించుతున్నారు అని అర్థము. ఇది ఇలాగా ఉంటున్నది కాబట్టే అచిత్ వస్తువు

అస్తి ఉన్నది అని అనడానికి యోగ్యమై, ఆది మధ్యము చివర అనే దశలు / అవస్థలు లేనిదై మూడుకాలాల్లోను ఒకే ఒక రూపంతో ఎక్కడైనా కనిపిస్తున్నదా! అంటే లేదని అభిప్రాయము. ఇది ఇట్లా ఉన్నది కాబట్టే జ్ఞానస్వరూపమైన ఆత్మ కంటే వ్యతిరేకమైన అచిత్ వస్తువు ఒకానొకప్పుడు గాని ఒకచోట కాని కేవలము అస్తి శబ్దము చేత చెప్పదగినది కాదు అని **తస్మాత్ నవిజ్ఞానంఋతే** అనే శ్లోకంతో చెప్పినాడు. **ఆత్మ ఐతేనో** అన్నిచోట్లా / శరీరాల్లోను జ్ఞానము ఒక్కటే రూపాన్నిగా కల్గి ఉన్నది కనుక పరస్పరము భిన్నాలైన దేవాది స్వరూపాలు కన్న తాను వేరుగా నుంటున్నా ఆయాదేవాది శరీరాల్లో దూరడానికి కారణమైన, తాను చేసిన కర్మల వలన కల్గిన నేను దేవుడిని, నేను మనుష్యుడిని అనే భేదాలతో ఇతరులకంటే తాను వేరు అనే బుద్ధి కలవారి చేత ఆయా విధాలుగా తరచూ అనుసంధానించుకోవడం జరుగుతున్నది. ఐతే ఆ అనుసంధానము ఆత్మకు తగిన స్వరూపం కాదు. **దేహాన్ని బట్టి ఏర్పడుతున్నది**. దాన్నే **విజ్ఞానమేకం** అనే శ్లోకంతో చెప్పినాడు.

నిజానికి ఆత్మస్వరూపం **కర్మ సంబంధము లేనట్టిది. అందుచేతనే మలరూపమైన ప్రకృతితో అంటు** / **స్పర్శ కూడా లేదు. దానితో ప్రకృతి వల్ల కలిగే శోకము, మోహము, లోభము వంటి హేయ గుణాలతో సంగము / కలయిక కూడా లేదు. అంతేకాదు. ప్రకృతి స్పర్శలేదు కాబట్టే పెరుగుదల, తరుగుదలలూ లేవు. ఒకే రూపముతో ఎల్లపుడూ ఉంటున్నది. కనుక సదా ఏకరూపము అనబడుతున్నది. వాసుదేవుడికి శరీరమున్నూ ఔతున్నది. కావున వాసుదేవాత్మకము. ఆవిధంగా వాసుదేవుడు ఆత్మగా లేనిది ఒక్కటే లేదు. అని అంటూ జ్ఞానం విశుద్ధం అని చెప్పినాడు**. చిదంశము ఎల్లపుడూ ఒకే రూపంతో ఉంటున్నది కనుక సర్వదా అస్తి అనే శబ్దంతో చెప్పదగియున్నది. అచిదంశము మాత్రము క్షణక్షణమూ మార్పులను పొందుతున్నది గనుక నాశమే గర్భముగా కలది ఔతున్నందున అది అన్ని సమయాల్లోనూ నాస్తి శబ్దంతో చెప్పదగినదే.

ఈ విధమైన చిదచిదాత్మక జగత్తు వాసుదేవుడికి శరీరముగా ఉంది. అందుచేత అది వాసుదేవాత్మకము అవడం యథార్థమైన స్థితి. ఆయాథాత్మ్యమే చక్కగా వివరింపబడింది అని **సద్భావ ఏవం** అనే శ్లోకం ద్వారా తెలుపడం చేశినాడు అని. ఈ సందర్భంలో **యదస్తి, యన్నాస్తి** అనే శ్లోకంతో ప్రస్తుత చర్చావిషయము ముగించబడింది. జ్ఞానమే ఒకేఒక్క ఆకారంగా కల్గియున్నందున ఒక్కటే ఐనా, ఇది ఇలా అని చెప్పడానికి వీలుకానిదై స్వరూపంలో భేదాలు లేనిదైనప్పటికీ, అచిత్తుతో కలిసి

ఈలోకాల్లో కనిపించుతున్న, దేవుడు మనుష్యుడు వంటి రూపాలతో ఇది ఫలానా ఇది ఫలానా అని చక్కగా గుర్తించి చెప్పదగిన భేదము ఏది ఉన్నదో దానికి కారణము కర్మనే అని చెప్పినాడు **ఏతత్తుయత్** అనే శ్లోకంతో. దాన్నే వివరించుతున్నాడు. **యజ్ఞఃపశుః** అను పద్యంతో. ఇక ఈ జగత్తు యొక్క యథార్థ స్వరూపాన్ని తెల్సుకున్నందు వల్ల కలిగే ప్రయోజనమేమిటన్న ప్రశ్నకు **మోక్షమార్గాన్ని అవగతం చేసుకోవడం కొరకే** అని **యచ్చైతత్** అనే శ్లోకముతో విశదీకరించినాడు.

ఇక ఈ శాస్త్రము నందు పరబ్రహ్మనిర్విశేషుడు ఆయనను ఆశ్రయించిన సదసదనిర్వచనీయమైన అజ్ఞానాన్ని గురించి, ఈ జగత్తంతా అవిద్యచేత కల్పించబడింది అనే విషయాన్ని గురించి గాని అలా చెప్పడానికి గాని తగిన పదము ఒక్కటి కూడా కనుపించడము లేదు.

అస్తి నాస్తి శబ్దాలతో చెప్పబడుతున్న చిత్, అచిత్తులతో కూడి కనిపిస్తున్న ఈ సమస్త జగత్తు కూడా తనను మించినవాడు ఎవ్వడూ లేక తానే అందరినీ అదుపులో పెట్టగలిగేవాడై, అందరికన్నా గొప్పవాడైన పరబ్రహ్మ శబ్దంతో పిలువబడే **శ్రీమహావిష్ణువుకు శరీరము ఐ ఉన్నందున విష్ణ్వాత్మకము.** జ్ఞానము మాత్రమే ఏకాకారంగా ఉన్న ఆత్మకు దేవాది వివిధములగు ఆకారాలను పొంది అనుభవించడంలోను, అందుకు తగినట్లు అచిత్తు పరిణామాలను పొందడంలోనూ హేతువు ఐనట్టిది కర్మ. అదే వస్తువు యొక్క యథార్థ స్థితిని తెలిపిడిచేసే జ్ఞానానికి అడ్డంకిగా విరోధిగా నిలుస్తున్నది అని ప్రతిపాదించినారు. ఇక అస్తి నాస్తి సత్యము అసత్యము అనే శబ్దాలు సదసద నిర్వచనీయమైన వస్తువు ఒకటి ఉన్నదని చెప్పలేవు. కనుక నాస్తి అసత్య శబ్దాలు అస్తి సత్య శబ్దాలకు విరోధ్యర్థాన్ని మాత్రమే చెపుతున్నాయి. అందువల్ల ఆ పదాల చేత అసత్వము – **లేకపోవడము** మాత్రమే తెలియవస్తున్నది కాని **అనిర్వచనీయత్వము** తెలియరావడం లేదు. ఈ ప్రకరణంలో కూడా అచిద్వస్తు విషయంలో నాస్తి అసత్య శబ్దాలు తుచ్ఛము, మిథ్య అనే అర్థంలో ప్రయోగింపబడలేదు. వినాశి నశించిపోయేవి అనే అర్థంలోనే వాడియున్నారు. **వస్త్వస్తికిం. మహీఘటత్వం** అనే శ్లోకాల్లోను వినాశిత్వాన్నే ఉపపాదించినారు. నిష్ప్రమాణికము అని కాని జ్ఞానము చేత బాధింపబడేది అని కాని చెప్పలేదు. ఒక ఆకారంతో ఒక కాలంలో కనిపించిన వస్తువు మరొకకాలంలో సరికొత్త పరిణామంతో మరొక తీరుగా కనిపిస్తున్నది

కనుక లేనిది నాస్తి అని ప్రతిపాదించినారు. తుచ్ఛత్వము అనగా ఏ ప్రమాణంతోనూ సంబంధము లేకుండా దేనికీ అందక యథార్థజ్ఞానం తెలియరాకపోవడం. బాధింపబడడము అంటే ఒక దేశాన్ని బట్టి ఒక కాలంలో దొరికిన వస్తువు అదే దేశకాలాదులలో లేదు అనబడడము. ఏదో ఒక కాలంలో ఉన్నదిగా అనుభవింపబడి మరొకకాలంలో మార్పులు పొందిలేదనబడడము బాధగా చెప్పకూడదు. ఎందుకంటే కాలాదులు వేరయినందున వైరుధ్యము లేదు. అందువల్ల మిథ్యా అని కూడా అనరాదు – సంగ్రహంగా చెప్పబడుతున్న మాట ఇది – జ్ఞానమే స్వరూపంగా కల **ఆత్మవస్తువు** ఆది మధ్యము అంతములు లేనిది. ఎల్లపుడూ ఒకేవిధంగా ఉండేది. కనుక సహజంగానే అది సర్వదా **అస్తి** అనే శబ్దంతో వ్యవహరింపబడుతుంది. చైతన్యము లేని **ప్రకృతి** యైతేనో క్షేత్రజ్ఞుడైన ఆత్మకు భోగ్యవస్తువుఐ వాడికర్మలకు తగినట్లు పలురకాల రూపాలను పొందుతూ నశిస్తున్నది కాబట్టి **నాస్తి పదార్థము**. కావుననే నాస్తి అసత్య శబ్దాలతో వ్యవహరింపబడుతున్నది. అదే **ఇలా చెప్పబడింది. ఓ రాజా! పరిణామాదుల కారణంగా కాలాన్తరములోనైనా మరొక పేరును కూడా ఏది పొందదో దానినే ప్రాజ్ఞులు నాశనము లేనిది. పరమార్థము ఐనది అని అంటున్నారు. ఆ వస్తువుకు భిన్నంగా నశించే ద్రవ్యంతో సిద్ధమైన ద్రవ్యము ఎప్పుడూ లేనిదనే చెప్పబడుతున్నది. ఇందుకు సందేహమేమీ లేదు**. దేశకాలకర్మ విశేషాల దృష్ట్యా అస్తి నాస్తి అని చెప్పబడే వస్తువు కేవలం అస్తి అనే బుద్ధి కలుగడానికి, అలా వ్యవహరించడానికి అవకాశము లేదు. అది అపరమార్థము అని చెప్పబడింది. ఆత్మ మాత్రమే కేవల అస్తి బుద్ధి, అస్తి శబ్దబోధ్యము ఔతున్నది. అదే పరమార్థము అని చెప్పబడింది. శ్రోతయైన మైత్రేయుడు కూడా **ఈ ముల్లోకాలున్నూ విష్ణువుపైనే ఆధారపడియున్నవి. పరమార్థము కూడా ఎలా ఉన్నదో జ్ఞానాన్ననుసరించి నాకు చక్కగా చెప్పినారు** అని పలికినాడు. కనుకనే **జ్యోతీంషి విష్ణుః** అని సమస్త జగత్తు అంతయూ విష్ణువే అని చెప్పిన సామానాధికరణ్యమున్నూ శ్రీమహావిష్ణువుకు జగత్తుకు ఆత్మ శరీర భావమే కారణముగా తెలుపబడింది. చిద చిత్ వస్తువులకు అస్తి నాస్తి శబ్దాలను ప్రయోగించడంలో, జ్ఞానము కర్మ నిమిత్తమైనది కాక సహజ స్వరూపము కలదవడం చేత ప్రాధాన్యమును పొందుతున్నది. అచిద్వస్తువు జీవుడి యొక్క కర్మకారణంగా పరిణామాలను మార్పులను పొందుతున్నది. కనుక అప్రధానమని తెలుస్తున్నది. ఈ విధంగా అవిద్య స్మృతి, పురాణాలచేత సిద్ధించిన దనుమాట ఖండింపబడింది. **ఇది ప్రమాణానుపపత్తి.**

## 6. నివర్తకానుపపత్తి

నిర్విశేషమైన బ్రహ్మను గురించి తెల్సుకోవడం వల్లనే అవిద్య తొలగిపోతుంది అని శ్రుతులు చెపుతున్నాయి అని ఏది చెప్పబడిందో ఆ మాట సత్యము కాదు. **ఈ మహాపురుషుడిని నేను తెల్సుకున్నాను**. **తమస్సుకు** ప్రకృతికి / సంసారానికి **ఆవల సూర్యునివలె ఉజ్వలమైన కాన్తులతో ఉన్నాడాయన**. **ఇటువంటివాడిని తెల్సి ఉపాసించిన వాడు సర్వకర్మబంధవిముక్తుడౌతున్నాడు. ముక్తి పొందడానికి ఇది తప్ప మరొకమార్గము లేదు**. 2) **సమస్త విజ్ఞానాలు –** (ప్రాణులు / చేతనులు) **ప్రకాశస్వరూపుడైన పరమాత్మనుండే జన్మించినవి**. 3) **ఆయనను శాసించేవాడెవ్వడూ లేడు**. **ఆతని నామము గొప్పదైన యశస్కరము / మంగళములను కలిగించునట్టిది**. 4) **ఆయన స్వరూప స్వభావాలను ఇలాంటివి అని ఎరిగిన వారు అమృతస్వరూపులు ఔతున్నారు**. ఇలాంటి అనేక శ్రుతి వాక్యాలు విరోధిస్తున్నాయి. బ్రహ్మ సవిశేషమైయున్నది కావుననే సమస్త శ్రుతి వాక్యాలున్నూ సవిశేష జ్ఞానంవల్లనే మోక్షము లభించగలదని చెపుతున్నాయి. బ్రహ్మను గురించి శోధించే వాక్యాలు కూడ విశిష్టుడైన బ్రహ్మనే ప్రతిపాదిస్తున్నాయి అని ఇంతకుముందే చెప్పినాము. **"తత్త్వమసి"** మొదలైన వాక్యాల్లోనూ చెప్పబడిన సామానాధికరణ్యము నిర్విశేషమైన వస్తువులకు ఐక్యతను చెప్పడం లేదు. తత్, త్వం పదములు సవిశేషమైన బ్రహ్మనే తెల్పుతున్నవి. ఎలాగంటే తత్ అనే పదము సర్వజ్ఞుడు సత్య సంకల్పుడు జగత్తుకు కారణము ఐన బ్రహ్మను ప్రతిపాదిస్తున్నది. **ఆ బ్రహ్మ సంకల్పించెను**. **నేను పలు రూపములుగా అగుదును** అనునటువంటి సమాన వాక్యాలలో ఆయనను గురించే చెప్పబడుతున్నది. తత్ పదంతో సమానాధికరణమైన త్వంపదము కూడా అచిత్తుతో విశిష్టుడైన జీవుడిని శరీరముగా కల్గిన బ్రహ్మనే చెపుతున్నది. సామానాధికరణ్యము అనేది రెండు ప్రకారములతో / విశేషణాలతో కూడిన ఏక వస్తువునే బోధిస్తుంది. రెండు ప్రకారాలను విశేషణాలను విడిచిపెట్టినట్లయితే ఆయా పదాలు వేటిని బోధించడం కోసం బయలుదేరినాయో వాటికి భేదము లేకుండా పోయినందున మొత్తంగా సామానాధికరణ్యాన్నే కోలుపోవాల్సి వస్తుంది. పైఫెచ్చు ఆ రెండుప్రకార వాచక పదాలకు లక్షణను ఆశ్రయించవలసి వస్తుంది. సోఽ యందేవదత్తః ఆదేవదత్తుడే వీడు అన్నపుడు లక్షణను ఆశ్రయించవలసిన అక్కరలేదు. సః అనే తచ్ఛబ్దము చేత ఇంతకుముందు చూచిన దేవదత్తుడు. అయం అనే పదంతో ఇపుడు ఎదురుగా నున్న దేవదత్తుడు

చెప్పబడుతున్నందున దర్శనకాలాల్లో ఉన్న భేదాన్ని బట్టి నిన్న ఎక్కడో చూచిన, ప్రస్తుత మిక్కడ ఎట్టఎదుట చూస్తున్న దేవదత్తుడు ఒక్కడే అనే ప్రతీతికి / గుర్తింపునకు విరోధము ఏమీ లేదు. కనుక లక్షణా ప్రసక్తి లేనేలేదు. ఇంకా దేశభేదము వల్ల దేవదత్తులు వేరు కానవసరము లేదు. కాలభేదాన్ని బట్టి నిన్న ఒకచోట కనుపించిన వాడు నేడు ఇక్కడ కనిపించడంలో దేశభేదవిరోధము ఏమీ ఉండబోదు. **ఆ సద్ వస్తువు సంకల్పించెను. నేను పలురూపులు ధరిస్తాను**. అనే వాక్యంద్వారా తెలియవచ్చే ఉపక్రమానికి విరోధము వస్తుంది. అంటే సృష్టి జరుగడానికి కారణాన్ని చెపుతూ ప్రళయకాలములో ఒంటరిగానే ఉన్న సద్వస్తువు తాను జగత్ రూపంగా – చిత్ అచిత్తులసమ్మేళనంగా – ఏర్పడుతాను అని సంకల్పం చేసి తన శరీరాన్నుంచి ఈ భువన భాండాలనన్నింటినీ పుట్టంచినాడు. ఇదే విషయాన్ని తండ్రి కుమారుడైన శ్వేతకేతువుకు వివరిస్తూ ప్రారంభించిన సృష్టి క్రమవాక్యానికి పరమాత్మ జీవాత్మ అనేవి వేరే ఏవీలేవు. పరమాత్మ ఒక్కటే ఉన్నది. తత్ త్వం అనే పదాలతో ప్రకారభేదము లేని బ్రహ్మనే చెప్పింది. అనేట్లయితే బహుస్యాం అనే వాక్యంతో వైరుధ్యము తప్పక వస్తుంది. పైగా ఒకవస్తువును మూలకారణమైన దాన్ని తెల్సుకొంటే సర్వవస్తువులకు సంబంధించిన జ్ఞానము కలుగుతుంది అనే ప్రతిజ్ఞ కూడా పొసగకుండా పోతుంది. జ్ఞానస్వరూపుడు సమస్త దోషముల్లో ఒక్కటి కూడా లేనివాడు సర్వజ్ఞుడు సమస్త కళ్యాణగుణాలు కలవాడు ఐన బ్రహ్మకు అజ్ఞానము అంటుతుంది. దానివల్ల అనన్తము లైన పురుషార్థములు కాని వాటికి ఆశ్రయము కావలసి వస్తుంది. ఐతే అలాంటివి ఏవీ లేవు అని బాధార్థాన్ని తెలుపడమే సామానాధికరణ్యము యొక్క ఉద్దేశము అనేట్లయితే త్వం, తత్ పదాలు రెండింటికి జ్ఞాన అజ్ఞానాలు రెండింటికి అధిష్ఠానములు ఐనట్లు అధిష్ఠానలక్షణం, దాన్ని తొలగించే నివృత్తి లక్షణనున్నూ చెప్పుకోవాల్సి వచ్చి లక్షణాదోషము మరో రూపములో కళ్ళముందరే నిలుస్తుంది. కాకపోతే కొద్ది భేదముంటుంది. అది ఇలాగా – **నేదం రజితమ్** – ఇది వెండికాదు అన్న వాక్యంలో వలె బాధ ఏర్పడకముందే ఏంచేయాలో దిక్కు తోచక బాధను చెప్పుకోవలసి వస్తుంది. కొంచెము వివరణ – ఒక ఇద్దరు వెళుతున్నారు. వార్కి ఏదో ఒక మెరిసే వస్తువు కనిపించింది. ఒకడు తనతోటి వాడికి అది. వెండి అనుకుంటున్నావా? కాదుసుమా! అని చెపుతున్నాడు. రెండవవాడు ఆ మెరిసేదాన్ని గురించి వెండి అని భ్రమించనేలేదు. కాని ఇవతలివాడు రెండవ వాడు భ్రమించినాడేమోనని వీడే భ్రమించి అది వెండికాదు అని భ్రమజ్ఞానానికి విరుగుడు బాధాజ్ఞానాన్ని చెపుతున్నాడు. అట్లాగే తత్ త్వమసి అని చెప్పే చోటనున్నూ ఆ బ్రహ్మ వేరు నీవు వేరు అని అనుకుంటున్నావేమో! కాదు కాదు.

ఆ బ్రహ్మవు నీవే సుమా! అని బాధను కల్పించుకోవలసి వస్తున్నది. తత్ అనే పదంతో అధిష్ఠానం కంటే వేరయిన ధర్మాన్ని చూపలేకపోతున్నందున బాధ చెప్పడం పొసగదు. ఐతే అక్కడ అధిష్ఠానమనేది ఇంతకుముందు కప్పివేయబడి ఉన్నది. దాన్నే అతిరోహిత స్వరూపంగా ఇపుడు తత్ పదంతో చూపబడుతున్నది అని పలుకతగదు. మొదట్లోనే అధిష్ఠానము ప్రకాశితము కాకపోతే దాన్ని ఆశ్రయించి భ్రమపడడము, కాదు అని బాధ చెప్పడమున్నూ సంభవించవు అంటే తాడు అనేదే కనిపించకుంటే పాము కాబోలును అనే భ్రమ, కాదు అది త్రాడే అనే బాధయున్నూ రెండూ కలుగవు.

భ్రమకు ఆశ్రయమైన అధిష్ఠానము తిరోహితము కాదు అనేట్లయితే ఆ అధిష్ఠానము యొక్క స్వరూపము జ్ఞానము కాబట్టి అదే భ్రమకు విరోధి. అందువల్ల ఆ జ్ఞానము / బ్రహ్మ ప్రకాశము ఔతుండగా (త్రాడే అనే విషయము తేటగా తెలుస్తున్నందున) దాన్ని ఆశ్రయంగా చేసుకొని భ్రమ కలుగడము, దాన్ని బాధించడము బొత్తిగా ఉండవు అందువలన అధిష్ఠానానికంటే వేరుగా పారమార్థిక ధర్మాన్ని, దాన్ని కప్పివేయడాన్ని అంగీకరించకపోతే భ్రాన్తి, బాధలను ప్రతిపాదించడం అసాధ్యమే.

ఒక రాజకుమారుడు తప్పిపోయినాడు. ఆ పిల్లవాడిని ఆటవికులైన వ్యాధులు పెంచినారు. పెరిగి పెద్దవాడయి ఉండగా రాజపురోహితుడి కంట్లో పడ్డాడు. అతడిని చూచి అయ్యా! నీవు వ్యాధ జాతికి చెందిన వాడివి కావు. నీవు రాజకుమారుడివి సుమా అని చెప్పినాడు. దానితో అతడికి వ్యాధత్వ భ్రమ తొలగిపోయింది. అతడు ఆనందపడ్డాడు. ఇక్కడ వ్యాధత్వ భ్రమకు అధిష్ఠానమైన వాడు రాకుమారుడు. పురుషమాత్రుడు. అది తేటగా తెలుస్తుండగా దానికంటే వేరయిన పరమార్థము ఐన రాజత్వము కప్పబడి (తెలియక) ఉంటున్నపుడు మాత్రమే వ్యాధుడను నేను అనే భ్రమ, నీవు రాకుమారుడవు అని ఉపదేశం చేసినపుడు ఆ భ్రమతొలగిపోతుంది. కేవలము అధిష్ఠానము ఐన నీవు పురుషుడివి అని చెపితే భ్రమ తొలగిపోదు. ఆ విషయం స్పష్టంగానే తెలుస్తున్నది కనుక ప్రత్యేకంగా ఎవరో వచ్చి నీవు పురుషుడివోయ్ అని చెప్పవలసిన అవసరము లేదు. తాను వ్యాధుడిని అనే జ్ఞానము బలంగా ఉన్నది. ఇక తత్ త్వమసి అనుచోట తత్ పదం చేత జగత్ కారణుడైన బ్రహ్మ, త్వం అను పదం చేత జీవుడిని శరీరంగా చేసుకొని యున్న బ్రహ్మను చెపుతున్నందున కారణ బ్రహ్మ ఒకరు, కార్య బ్రహ్మ ఒకరు వేరయి ఉన్నందువల్ల ఆ విషయంలోనే రెండు పదాలు ముఖ్యార్థాన్ని బోధిస్తున్నవి అంతేకాక అవి రెండూ ఏకమై రెండు ప్రకారములుగా నున్నవాటితో కూడిన

విశిష్ట వస్తువును ప్రతిపాదిస్తున్న కారణంగా సామానాధికరణ్యమున్నూ సిద్ధిస్తున్నది. ఏ దోషమూ లేక సమస్తకళ్యాణ గుణాత్మకుడైన బ్రహ్మ జీవుడికి అన్తర్యామిగా ఉండడము వలన మిగతా విశేషాలకు అదనంగా ఐశ్వర్యత్వము ఉన్నట్లుగా తెలియవస్తున్నది. ఉపక్రమానికి అనుకూలత్వమున్నూ బలపడుతున్నది. ఏకవిజ్ఞానంతో సర్వవస్తు విజ్ఞానము కలుగడమనే ప్రతిజ్ఞ కూడా చక్కగా పొసగుతున్నది. సూక్ష్మములైన చిదచిత్తులకు శరీరము గానున్న పరమాత్మ స్థూలములుగానున్న చిదచిత్తులను తనకు శరీరముగా చేసుకున్నందున తొలుత కారణరూపములో నున్నవాడు కార్యరూపము (జగత్) గాను ఉన్నాడు. అందుచేతనే 1) **తమీశ్వరాణాంపరమం మహేశ్వరం** ఈశ్వరులుగా చెప్పబడే బ్రహ్మరుద్రేంద్రులనున్నూ నియంత్రించే శక్తి గల సాటిలేని మహేశ్వరుడు 2) **పరాஉ స్యశక్తిః వివిధైవ శ్రూయతే** ఇతని శక్తి చాలా గొప్పది. అది పలురకాలుగానూ ఉన్నట్లు వినవస్తున్నది. 3) **అపహత పాప్మాసత్యకామః సత్యసంకల్పః** – పాపపుణ్యరూపకర్మలేవీ లేనివాడు. ఎట్టి అడ్డంకులు లేకుండా తన కోరికలన్నీ నెరవేర్చుకొనేవాడు. తన సంకల్పాలు / తలపులు అన్నీ యథార్థాలుగా చేసుకోగల్గినవాడు. **మున్నగు** శ్రుతివాక్యాలతో వైరుధ్యమున్నూ రాకుండా ఉంటుంది. ఐనపుడు తత్వమసి అనే వాక్యంతో చెప్పదలచిన ఉద్దేశ్యము ఏది. ఉపాదేయము ఏది? వీటి విభాగం ఎలాగా? అని అడుగవచ్చును. ఇచ్చట దేన్నో ఒకదాన్ని ఉద్దేశించి ఏదీ విధించబడడం లేదు. **ఐతదాత్మ్యమిదం సర్వమ్** – ఈ దృశ్యమానమైన ప్రపంచమంతా ఈతడినే ఆత్మగా కల్గియున్నది. అనే వాక్యంతోనే తెలిసిపోయింది. **అప్రాప్తేహి శాస్త్రమర్థవత్** – తెలియనిదాన్ని తెల్పినపుడే శాస్త్రము ప్రయోజనవంతమవుతుంది అని అనగా విన్నారు కదా! **ఇదంసర్వం** అని జీవునితో కల్సియున్న జగత్తును నిర్దేశించి, **"ఐతదాత్మ్యం"** అను దానితో ఆ చిదచిన్మిశ్ర ప్రపంచానికి ఈ పరమాత్మ ఆత్మ అని ఆ ప్రకరణంలో ప్రతిపాదించినారు. అంతేకాకుండా అందుకు కారణాన్నిన్నీ తెలిపినారు 1) **సన్మూలాః సోమ్య ఇమాః సర్వాః ప్రజాస్సదాయతనాః సత్ప్రతిష్ఠాః** – ఓ సోమ్యుడా! ఈ ప్రజలు – ప్రాణులు అందరున్నూ సత్ శబ్దవాచ్యుడైన పరబ్రహ్మనుండి పుడుతున్నవి. ఆయనవల్ల జీవించుతున్నవి. చివరగా ఆయనలో కలిసి ఉంటున్నవి. 2) **సర్వంఖల్విదం బ్రహ్మ. తజ్జలానితి శాన్తఉపాసీత**. ఈ జగత్తంతా పరబ్రహ్మ స్వరూపమే. ఆయననుండి పుడుతున్నది. ఆయనవల్ల బ్రదుకుతున్నది. ఆయనలో లీనమవుతున్నది. దీన్ని తెలిసికొని రాగద్వేషాదులు మానుకొని ప్రశాన్త చిత్తుడై పరమాత్మను ఉపాసించాలి. **అని అలాగే** ఇతర శ్రుతి వాక్యాలు కూడా బ్రహ్మకు, ఆయనకు వ్యతిరిక్తమైన చిద

చిద్ వస్తువులనకున్నూ **"ఉన్నతాదాత్మ్యము" శరీర + ఆత్మ రూపమైనది** అనియే చెపుతున్నవి 1) **పరమాత్మ సర్వజనులలో ప్రవేశించి యున్నాడు. సర్వులకూ ఆత్మగా నున్న ఆయన శాసించేవాడుగా నున్నాడు.** 2) **ఎవడు పృథివి యందు ఉంటూ, పృథివికి లోపలనే ఉన్నా ఆయనను పృథివి తెల్సుకోలేక పోతున్నదో, పృథివి ఎవడికి శరీరమో, ఎవడు పృథ్వి లోపల ఉండి దానిని అదుపులో పెడ్తున్నాడో వాడు నీకు అన్తరాత్మ.** కర్మ సంబంధములేనివాడు. ఆనంద ప్రదుడు 3) **ఎవడు ఆత్మ యందు ఉంటూ – యస్యమృత్యుః శరీరం యం మృత్యుఃనవేద, ఏషసర్వ భూతాన్తరాత్మా అపహతపాప్మా దివ్యోదేవ ఏకోనారాయణః** – ఎవనికి మృత్యువు శరీరమో ఎవడిని మృత్యువు ఎరుగదో – ఇతడు సర్వభూతాలకూ అంతరాత్మ. పుణ్యపాపరూప కర్మ సంబంధములేని వాడు. దివ్యుడు. ప్రకాశవంతుడైన దేవుడు నారాయణుడు ఒక్కడే. 4) యః పృథివీ మన్తరే సంచరన్ అని మొదలు పెట్టి **దానిని సృష్టించి, దానిలోనే జీవుడికి ఆత్మగా నుంటూ అనుప్రవేశము చేసినాడు. అలాగా ప్రవేశించి సత్ శబ్ద వాచ్యుడైన జీవుడుగాను, ఎప్పటికప్పుడూ వదిలిపెడ్తూ ఉన్న శరీరాలు కల త్యత్ – ప్రకృతిగానూ ఐనాడు**. ఇలాంటివి ప్రస్తుత ప్రకరణంలోనూ – **అనేన జీవేనాత్మనాఽ ను ప్రవిశ్యనామ రూపేవ్యాకరవాణి –** ఈ జీవుడి వెంట, జీవుడికి ఆత్మగా ఉంటూ, శరీరానికి ఆత్మయైన జీవునితో కలసి ప్రవేశించి నామ, రూపాలను కలిగిస్తాను **అని** బ్రహ్మను ఆత్మగా కల్గిన జీవుని వెంట శరీరాలలో ప్రవేశించడంతోనే అందరికీ / అన్నింటికీ వస్తువుగా రూపము కల్పించడము దానికి తగిన శబ్దంతో పలుకబడడము వ్యవహరింపబడడమున్నూ జరుగుతున్నవి అని ప్రతిపాదించబడింది. **తదను ప్రవిశ్య సచ్చత్య చ్చాభవత్** అనే వాక్యంతో ఏకార్థత కల్గియున్నందున జీవుడికి బ్రహ్మాత్మకత్వము బ్రహ్మ యొక్క అనుప్రవేశము వల్లనే అని అవగతమవుతున్నది. అందువలన చిదచిదాత్మకమైన వస్తుసముదాయమంతటికిన్నీ బ్రహ్మతో తాదాత్మ్యము **ఆత్మ శరీరభావము వల్లనే నని తెలుస్తున్నది** అందుకని బ్రహ్మకంటే వేరుగానున్న దంతా పరమాత్మకు శరీరము ఐనందువల్లనే వస్తువుగా వస్తుత్వము ఏర్పడినందువల్ల దాన్ని ప్రతిపాదించే శబ్దము కూడా ఆయనదాకా తన అర్థాన్ని చెపుతున్నది. అందువల్ల శబ్దాలన్నీ లోకములో వ్యుత్పత్తి ద్వారా అర్థమైన ఆయా పదార్థాలతో భేదము లేకుండా కల్సియున్న బ్రహ్మనే చెపుతుండడము కూడా సిద్ధిస్తున్నది. కనుకనే **"ఐతదాత్మ్యమిదంసర్వం"**అని ప్రతిజ్ఞ చేయబడిన విషయము **"తత్త్వమసి"** అని సామానాధికరణ్యముతో విశేషాంశాన్ని ప్రతిపాదించుతూ ఉపసంహరింపబడింది.

అందువల్ల నిర్విశేషమైన వస్తువు ఒక్కటే ఉన్నది అని వాదించేవారు, జీవాత్మలకు భేదము ఉంది, లేదు అని చెప్పేవారు. ఇద్దరికీ భేదమే ఉన్నది అనేవారున్నూ వైయధికరణ్యము, సామానాధికరణ్యముల మూలంగా బ్రహ్మ ఆత్మగా నున్నాడు అనే ఉపదేశాలనన్నింటినీ వదిలిపెట్టుకోవాల్సి ఉంటుంది. వస్తువు ఒకటే ఉన్నదన్నట్లయితే దేనితో దేనికి ఎవరితో ఎవరికి తాదాత్మ్యము చెపుతారు? దానికే అనేటట్లయితే అది మీమాటతోనే (తత్త్వమసి అనే వాక్యముతోనే) అర్థము ఔతున్నందున తాదాత్మ్యము ఉపదేశము వల్ల తెల్సుకోవలసింది ఏమీ లేదు. కాదు కల్పితమైన జీవబ్రహ్మల భేదమును నిరసించడం జరుగుతుంది అనేటట్లయితే అది సామానాధికరణ్యము, తాదాత్మ్యోపదేశములవల్ల తెల్సుకోదగింది కాదని ముందే చెప్పినాము. సామానాధికరణ్యము అనేది పరబ్రహ్మయందు కారణ, కార్యరూప రెండు ప్రకారాలను ప్రతిపాదించడంవల్ల విరోధాన్నే ఆపాదిస్తుంది. భేదాభేదవాదమునందు ఐతేనో ఉపాధితో సంసర్గము ఉన్నందువల్ల జీవుడిలోనున్న దోషాలు అన్నీ పరబ్రహ్మ యందు చేరి దోషములు కలవానినిగా చేస్తాయి. అపుడు దోషాలేవీ లేక కళ్యాణ గుణాత్ముకుడైన బ్రహ్మతో తాదాత్మ్యం చెప్పే ఉపదేశవాక్యాలన్నీ సహజమైన వైరుధ్యమున్నందున వదలివేసుకోవలసివస్తుంది.

ఇక సహజంగానే జీవబ్రహ్మలిద్దరికీ భేదము అభేదము అనే రెండూ ఉన్నాయనే వాదములోనూ బ్రహ్మయే జీవభావాన్ని పొందుతున్నాడనడం వల్ల గుణాలు వచ్చినట్లే దోషాలు కూడా స్వాభావికంగా సిద్ధిస్తాయి కాబట్టి నిర్ధోషమైన బ్రహ్మతో తాదాత్మ్యమును ఉపదేశించుట విరుద్ధమే ఔతుంది. కేవలము భేదము మాత్రమే ఉన్నదని చెప్పేవారికిన్నీ బొత్తిగా భిన్నమైన స్వభావాలు కలవారికి ఏ ప్రకారంగానూ ఐక్యత సంభవించదు. కాబట్టి బ్రహ్మాత్మ భావ ఉపదేశాలు సంభవించవు కాబట్టి అందరూ తమ తమ వేదాన్త వాదాలను వదిలి కోవాల్సి ఉంటుంది.

చిదచిన్మిశ్రమైన ఈ ప్రపంచమంతా పరమాత్మకు శరీరముగా అంగీకరించేవారికి సర్వంఖల్విదం బ్రహ్మ అని బ్రహ్మాత్మకత్వ ఉపదేశాలన్నీ చక్కగా పొసగుతాయి. జాతిగుణాలు ద్రవ్యాలకు వలె శరీరభావము విశేషణత్వములు పొసగి గోవు అశ్వము మనుష్యుడు దేవుడుగా తన కర్మలచేత ఐనాడు అని లోకములోను వేదములోనూ సామానాధికరణ్యము ముఖ్యముగానే కనిపిస్తున్నది. జాతిగుణాలు కూడా ద్రవ్యానికి ప్రకారములుగా నుండుట మనేది విరిగిన కొమ్ములు కలది ఆవు. తెల్లనిది బట్ట అన్నట్లు

సామానాధికరణ్యసంబంధమైనట్టిదే. మనుష్యత్వాదులతో విశిష్టమైన పిండాదులు కూడా ఆత్మకు ప్రకారము (విశేషణము) ఐనందువల్లనే పదార్థత్వాన్ని పొందుతున్నవి. మనుష్యుడు, పురుషుడు షండుడు, (నపుంసకుడు) యోషిత్ (స్త్రీ) ఆత్మ ఐనాడు. అనుచోట సామానాధికరణ్యము అంతటా అనువర్తిస్తున్నది. ఇందుకు కారణము సామానాధికరణ్యము. అది ప్రకారత్వాన్నే చెపుతున్నది ఆత్మమనుష్యుడు ఐనాడు. ఆత్మపురుషుడిగా పుట్టినాడు. ఆత్మ స్త్రీగా ఐనది. ఆత్మషండుడుగా జన్మించినాడు. ఇచ్చట విశేషణ విశేష్యభావము సామానాధికరణ్యము వల్లనే సిద్ధించింది. పరస్పరము తొలగింపబడిన (వ్యావృత్తములైన) జాత్యాదులు అనువృత్తాలు కాలేదు. తమలోనున్న – విశేష్యములోనున్న – ద్రవ్యాలకు ఒకానొకప్పుడు ఒకానొకచోట ద్రవ్యానికి విశేషణత్వము ఏర్పడితే తద్వాచకమైన శబ్దానికి మత్వర్థమును తెలిపే ప్రత్యయము చేరడము కనిపిస్తున్నది. దండీ, కుండలి అని. ఐతే ఈ ప్రత్యయము విడిగా అంటే విశేష్యాన్ని వదలివేరుగా ఉండలేని ద్రవ్యాలకు మాత్రం ఈ ప్రత్యయము కనబడుతులేదు. అవి విశేషణాలని సామానాధికరణ్యాన్ని బట్టే తెలుసుకోవలసి ఉంటుంది.

ఒకవేళ గోవు గుఱ్ఱము మనుష్యుడు పురుషుడు దేవుడు యోషిత్ షండుడుగా ఆత్మ తన కర్మలచేత ఆయా రూపాలతో జన్మించినాడు అన్నచోట విరిగిన కొమ్ములు గలది, బోడిది ఆవు, తెల్లనిబట్ట, నల్లనిగుడ్డ అని జాతి గుణాలవలె ఆత్మకు విశేషణంగా మనుష్యాది శరీరాలనున్నూ అంగీకరించినట్లయితే అపుడు జాతి వ్యక్తులవలె ప్రకారము ప్రకారిలకున్నూ శరీరానికి ఆత్మకున్నూ తప్పనిసరిగా ఒకదాన్ని ఒకటి విడువకుండా సహప్రతిపత్తి / కలసి గుర్తింపు కలుగవలసి ఉంటుంది. కాని ఇలాగా లోకంలో కనిపించడం లేదు. గోవును చూచినపుడు గోత్వముతో కూడిన దానిని గమనించినట్లుగా ఆత్మను ఆశ్రయించి ఉన్నది కాబట్టి ఆత్మతో కూడిన మనుష్యాది శరీరాలను గమనించడం లేదు. అందువల్ల మనుష్యుడు ఆత్మలకున్న సామానాధికరణ్యము లాక్షణికమే. ముఖ్యము కాదు అని అనవచ్చును.

కాని ఇది సరికాదు. మనుష్యాది శరీరాలకున్నూ ఆత్మనొక్కదాన్నే ఆశ్రయించి ఉండడము, దానికే ప్రయోజనాన్ని కల్గించేదిగా ఉండడము, దానికి విశేషణంగా ప్రకారంగా ఉండడమున్ను జాత్యాదులతో సమానమే. ఇచ్చట శరరీము ఆత్మను ఒక్కదాన్ని మాత్రమే ఆశ్రయించి ఉండడమనేది ఆత్మ శరీరాన్ని విడిచిపోయినప్పుడు శరీరము పాడైపోతున్నది. నశిస్తున్నది. ఇందువల్ల ఆత్మైకాశ్రయమని తెలుస్తున్నది. ఇక

ఆత్మకే ప్రయోజనకరమై ఉండుట, ఉపయోగపడుట అనేది కూడా అందులో ప్రవేశించిన జీవుని / ఆత్మ యొక్క కర్మ ఫలాలననుభవించడం కొరకు అయ్యే తన ఉనికిని / సత్తను కలిగియున్నందున తెలుస్తున్నది. ఇక ఆత్మకే ప్రకారమై విశేషణమై యుండుట యున్నూ దేవుడు, మనుష్యుడు అని ఆత్మకు విశేషణమై యుండుట ద్వారానే ప్రతీతి కల్గుతున్నది. ఈ విధంగా తదేకాశ్రయత్వ, తదేక ప్రయోజనత్వ, తత్ప్రకారత్యాదులవల్లనే గవాది శబ్దాలకున్నూ వ్యక్తివరకు చెప్పబడడానికి కారణమవుతున్నది. ఇలాంటి స్వభావం లేకపోయినందువల్లనే దండము, కుండలము మొదలైన వాటికి విశేషణత్వము ఏర్పడినపుడు దండీ కుండలీ అని మత్వర్థీయ ప్రత్యయము చేరుతున్నది. దేవ మనుష్యాది పిండాలకు / శరీరాలకు ఆత్మైకా శ్రయత్వము, ఆత్మైకప్రయోజనత్వము, ఆత్మైకప్రకారత్వము అనే స్వభావము ఉన్నందున దేవుడు మనుష్యుడు ఆత్మ అని లోకవేదములయందు సామానాధికరణ్యముతో కలసి వ్యవహారము ఏర్పడుతున్నది. జాతి, వ్యక్తులు రెండున్నూ నియమంగా ఒకదాన్ని ఒకటి విడిచి పెట్టకుండా సహప్రతీతి కల్గడమనేది రెండున్నూ అలాకల్సియుంటున్నాయి కనకనే జరుగుతున్నది. శరీరంలోని ఆత్మ మాత్రం కంటికి కనిపించడం లేదు కాబట్టి కంటితో శరీరాన్ని చూచినపుడు ఆత్మ గ్రహించబడుతూ లేదు. శరీరము ఒక్కటే కనిపిస్తున్నది. ఐతే విడిగా ఇంద్రియాదులద్వారా కాకుండా గ్రహింపబడేది ప్రకారతైక స్వరూపము / విశేషణంగా వదిలిపెట్టకుండా కల్సియుండడమనేది ఎట్టి పరిస్థితుల్లోనూ దుర్ఘటమని చెప్పవద్దు. జాత్యాదుల లాగానే తదేకాశ్రయత్వ, తదేకప్రయోజనత్వ, తద్విశేషణత్వములచేత శరీరం కూడా ఆత్మకు ప్రకారతైక స్వభావము కలదిగానే కనిపిస్తున్నది. రెండూ జాతిద్రవ్యాలు విశేషణ విశేష్యాలు కల్సియే కనిపించితీరాలనే సహోపలంభనియమము మాత్రము ఏక సామగ్రీ వేద్యత్వము – ఒక్క ఉపకరణము / ఇంద్రియము ద్వారా మాత్రమే తెలియబడడము కల్గియుండాలి. అనే నిబంధన – నిర్బంధము కల్గియున్నది. ఇక్కడ సామగ్రి పదం చేత సాధనము, ఉపకరణము, లేక ఇంద్రియము అని అర్థం చేసుకోవాలి అని ఇంతకు మునుపే చెప్పినాము. ఎలాగంటే పృథివికి గంధము సహజ విశేషణమేఐ ఉన్నా దాని గంధము నాసికచేత, దానిరుచి నాలుకచేత దాని స్వరూపము కంటిచేత వేరువేరు సామాగ్రులతో తెలియవస్తున్నవి. అవి ఒకే ఇంద్రియం చేత గ్రహింపబడుతూ లేవు. అట్లే పృథివికే చెందిన గంధరసాదులు కంటిచేత గ్రహింపబడడం లేదు. ఈ విధంగానే కంటిచే గ్రహింపబడే శరీరము ఆత్మకు అపృథగ్ విశేషణమే ఐనా విశేష్యము ఐన ఆత్మ శరీరంతోపాటు కనరావడం లేదు. కంటికి దాన్ని గ్రహించే సామర్థ్యము లేదు

కాబట్టి ఇంత మాత్రంచేత శరీరము ఆత్మకు విశేషణము / ప్రకారము కాకుండా పోదు. కావున ఆత్మకు ప్రకారమై యుండడమనే స్వభావమే సామానాధికరణ్యం చెప్పడానికి మూలము ఔతున్నది. ఆత్మకు ప్రకారతను ప్రతిపాదించడంలో సమర్థమైన శబ్దము ఆత్మతో కలసియే ప్రకారతా విశేషాన్ని ప్రతిపాదిస్తున్నది.

ఏమండీ! శబ్ద వ్యవహారంలో శరీరపదంచేత శరీరము మాత్రమే గ్రహింపబడుతుంది గానీ ఆత్మదాకా చెప్పగలిగే శక్తి శరీరానికి లేదు కదా! అని అనవచ్చును. కాని అలా కాదు. ఆత్మకు ప్రకారమైన శరీరాన్ని చెప్పేదే ఐనా ఆత్మ శరీరాల్లో శరీరమనే ఒక్కదాన్నే చెప్పడం కొరకు, ఇది శరీరము, దీనికంటే భిన్నమయినది ఆత్మ అని వివరించడం కొరకు ప్రయోగింపబడుతున్నందున ఈ శరీర శబ్దము నిష్కర్షక పదమవుతున్నది. ఎలాగా అంటే గోత్వము, శుక్లత్వము, ఆకృతి, గుణము వంటి శబ్దాల్లాగా! అందువల్ల గవాది శబ్దాల్లాగా దేవమనుష్యాది శబ్దాలు కూడా ఆత్మవరకు బోధించే సామర్థ్యాన్ని కల్గియున్నవి. ఇలాగే **దేవమనుష్యాది ఆకారాలతో పిండాలతో కూడిన జీవులకు వాచకమైన పదాలు కూడా, వారికే కాకుండా పరమాత్మకు దేవమనుష్యాదులు శరీరాలుఐ ఉన్నందున పరమాత్మకు కూడా వాచకాలు ఔతున్నాయి. అందువల్ల పరంబ్రహ్మకు ప్రకారములైయున్నందువల్లనే చిద్ అచిద్వస్తువులకు పదార్థము అని వ్యవహరింపబడే యోగ్యత – పదార్థత్వము – ఏర్పడుతున్నది కనుకనే సామానాధికరణ్యము చేతనే పదప్రయోగము జరుగుతున్నది**. ఈ విషయము **వేదార్థ సంగ్రహంలో** చక్కగా వివరింపబడింది. ఇదే జీవబ్రహ్మలకున్న శరీరాత్మభావలక్షణమైన **"తాదాత్మ్యము"** దీన్నే సూత్రకారులు **ఆత్మేతితూపగచ్ఛన్తి, గ్రాహయన్తి చ** అనే సూత్రంతో చెప్పినారు. వాక్యకారుడున్నూ **ఆత్మేత్యేవతు గృహ్ణీయాత్** అని చెప్పినాడు. ఇచ్చట తెల్సుకోదగిన తత్వము వాస్తవికస్థితి ఇది. 1) అచిద్ వస్తువుకు 2) చిత్ వస్తువుకు 3) పరబ్రహ్మకు భోగ్యము భోక్త ఈశ్వరుడు అని వారివారి స్వరూప వివేకాన్ని కొన్ని శ్రుతులు తెలియజేస్తున్నాయి. **1) అస్మాత్ మాయీ సృజతేవిశ్వమేతత్ తస్మింశ్చాన్యోమాయయా సన్నిరుద్ధః** మాయాశబ్దం చేత చెప్పబడే ప్రకృతిని స్వాధీనపర్చుకున్న మాయీ ఐన భగవంతుడు దానిని మూలంగా చేసుకొని ఈ విశ్వాన్ని సృష్టిస్తున్నాడు. ఆశ్చర్యకరమైన స్వరూప స్వభావాలు కల ఈ ప్రకృతిని చూచి మోహితుడైన భగవంతుడికంటే ఇతరుడైన జీవుడు / ఆత్మ మాయ అనబడే ప్రకృతిలో చిక్కుకున్నాడు. **2) మాయాంతు**

**ప్రకృతిం విద్యాత్ మాయినంతు మహేశ్వరమ్**. మాయ అనగా ప్రకృతియని, మాయి అనగా అందరికన్నా అధికుడై శాసించే భగవంతుడిగానూ తెల్సుకోవాలి. **3) క్షరం ప్రధానం అమృతాక్షరం హరః క్షరాత్మానౌ ఈశతేదేవ ఏకః** నశించే స్వభావం కలది ప్రధానము లేక ప్రకృతి. నాశము లేనిది శాశ్వతమైనది కర్మసంబంధము లేనిది ఐన చిత్ పదార్థము, భోగ్యబుద్ధితో ప్రకృతిని అనుభవిస్తున్నాడు. ఈ క్షరము, ఆత్మ అనబడే రెండింటిని సాటిలేని వాడైన ఒకే ఒక్కడైన ఉజ్వల ప్రకాశవంతుడగు దేవుడు శాసించు తున్నాడు. తన అదుపులో పెట్టుకుంటున్నాడు. ఈ వాక్యంలో అమృతాక్షరం హరః అనే పదాలతో భోక్త సూచింపబడుతున్నాడు. ప్రధానమును / ప్రకృతిని తనకు రుచికరమైనదిగా గుర్తించినందున స్వీకరించి అనుభవిస్తున్నాడు. కాబట్టి హరః అని భోక్తయైన ఆత్మ చెప్పబడుతున్నాడు. **4) సకారణం కరణాధిపాధిపో నచాస్యకశ్చిత్ జనితా నచాధిపః** కరణాలు ఇంద్రియాదులు. వాటికి అధిపతి జీవుడు. ఆ జీవుడిని శాసించేవాడు పరమాత్మ. ఆయన కరణాధిప + అధిపుడు. ఆ పరబ్రహ్మను పుట్టించినవాడెవ్వడూ లేడు. శాసించేవాడున్నూ లేడు. అలాంటి శ్రీమన్నారాయణుడు ఈ జగత్తుకు మూలకారణముగా నున్నాడు. **5) ప్రధానక్షేత్రజ్ఞ పతిర్గుణేశః** ప్రధానము = ప్రకృతి, క్షేత్రజ్ఞుడు జీవాత్మ. ఈ ఇద్దరినీ రక్షించేవాడు సకల కళ్యాణగుణపరిపూర్ణుడైన ఈశ్వరుడు. **6) పతింవిశ్వస్యాత్మేశ్వరగ్ం శాశ్వతం శివ మచ్యుతమ్** ఈ సమస్త ప్రపంచానికి ప్రభువు, సర్వాంతరాత్మగా ఉండి వాటిని నడిపించేవాడు. సర్వాత్మ ఈశ్వరుడు నాశములేక ఎల్లపుడూ ఒక్క తీరుగా నుండేవాడు. మంగళాలకు ప్రోవు. ఆశ్రయించిన వారిపై ప్రేమతో ఏనాడూ వదలనివాడు. తననుండి జారిపోనివ్వనివాడు. 7) జ్ఞాజ్ఞౌ ద్వావజా వీశనీశౌ. వారు ఇర్వురు ఒకరు అన్నీ తెల్సినవాడు. మరొకడు తెలియని అజ్ఞుడు. ఒకరు శాసించేవాడు. మరొకడు తన పనిని కూడా తెల్సికోలేక మరొకని ఆజ్ఞకు లోబడి నడుచుకొనేవాడు. కానీ వీరిద్దరూ పుట్టుక లేనివారు. **8) నిత్యోనిత్యానాం చేతనశ్చేత నానాంఏకో బహూనాంయో విదధాతి కామాన్** అనన్త గరుడవిష్వక్సేనాది నిత్యసూరులకున్నూ నిత్యుడు. బద్ధముక్తాద్యవస్థలలోను దేవతిర్యక్ మనుష్యస్థావరాదులలోనూ ఉన్న జీవులకు చేతనులకు చైతన్యమును జ్ఞానమును ప్రసాదించేవాడు. అసంఖ్యాకులైన ప్రాణికోటికందరికీ వారివారి ఆకాంక్షలననుసరించి వారివారి కోరికలను తీర్చగల సమర్థుడు శక్తిమంతుడూ ఐన ఏకైక పురుషుడు. **9) భోక్తా భోగ్యంప్రేరితారం చమత్వా** – భోక్తయైన – కర్మఫలాలను అనుభవించే జీవుడు, భోగ్యమైన ప్రకృతిని, తనను ఆయా సుఖభోగాలను అనుభవించడానికి పురికొలిపే

పరమాత్మను తెలిసి కర్తవ్యాన్ని నిశ్చయించుకొని **10) తయోరన్యః పిప్పలం స్వాద్వత్తి అనశ్నన్నన్యో అభిచాక శీతి** – ఆ ఇద్దరిలో ఒకడు రుచికరమైన పిప్పలమను పండును తింటున్నాడు. మరొకడు ఏమీ తినకుండానే మిక్కిలి ప్రకాశవంతుడై వెలిగిపోతున్నాడు. **11) పృథగాత్మానం ప్రేరితారం చమత్వా జుష్టః తతస్తేనామృతత్వమేతి**. తనను, ప్రేరేపించే పరమాత్మను వేరువేరు స్వభావాలు శక్తిసామర్థ్యాలు కలవారని గ్రహించి దుఃఖవిముక్తికి కావలసిన దారి కనిపించినందున సంతోషించి భగవంతుడిని ప్రపత్తిచేసి ఆయనకృపకు పాత్రుడై ఆయన చేత రక్షింపబడి మోక్షమును పొందుచున్నాడు. **12) అజామేకాం లోహిత శుక్లకృష్ణామ్ బహ్వీంప్రజాంజనయన్తీం సరూపాం. అజోహ్యే కోజుషమాణోఽ నుశేతే జహాత్యేనాం భుక్తభోగాం అజోఽ న్యః** – పుట్టుక లేనిదై ఎరుపునలుపు తెలుపు–రజస్సు తమస్సు సత్వము – వన్నెలు కలదై తనవంటి అనేకమైన సంతానాన్ని కంటూ ఉన్న ప్రకృతిని చూచిన పుట్టుక లేని మరొకడు ఆనందముతో దానితో కలసి సుఖిస్తున్నాడు. పుట్టుకలేని మరొక్కడు ఇతరునిచే అనుభవింపబడిన ప్రకృతిని విడిచిపెట్టి దూరముగా నుంటున్నాడు. **13) సమానేవృక్షే పురుషో నిమగ్నోఽ నీశయా శోచతి ముహ్యమానః జుష్టం యదాపశ్యత్య న్యమీశమస్య మహిమానమితివీతశోకః** – ఇరువురికీ సమానాశ్రయమైన వృక్షమునందున్న జీవుడనే పురుషుడు సంసార వృక్ష ఫలాలను అనుభవిస్తూ తనను తాను నియంత్రించుకోలేక అనీశయైన ప్రకృతి యందు మోహపరవశుడై పలు దుఃఖాలుననుభవించతూ దీనినుండి ఎట్లా విడిపించుకుందునా? అని విచారించుతుంటాడు. ఎపుడైతే తనతోపాటే ఉంటూ ప్రకృతికి లొంగక సహజానందస్వరూపుడై శాసించే సమర్థుడైన ఈశ్వరుడిని గమనించి అతని మహిమను తెల్సుకొని ఉపాసించినపుడు శోకాలు లేనివాడై సుఖించగలడు. ఇవన్నీ ఉపనిషత్ సూక్తులు – **ఇంక స్మృతులయందున్నూ కనిపించే కొన్ని ప్రమాణవాక్యాలు ఇవి.1) భూమి రాపోఽ నలోవాయుఃఖం మనోబుద్ధిరేవచ। అహంకార ఇతీయంమే భిన్నాప్రకృతిరష్టధా**. ఓ అర్జునా! నేల నీరు నిప్పు నింగి గాలి మనస్సు బుద్ధి అహంకారము అను ఎనిమిది విధాలుగా నున్న ప్రకృతి అపరా అనబడుతున్నది. దీనికంటే వేరుగా జీవస్వరూపమై పరా అనబడు ప్రకృతి ఒకటి ఉన్నది. ఈ రెండింటితో ఈ జగత్తు నిలబెట్టబడుతున్నది. పరా, అపరా అనబడే ప్రకృతులు నావే. మదాత్మకములే. **2) సర్వభూతానికౌన్తేయ ప్రకృతిం యాన్తి మామికామ్। కల్పక్షయేపునస్తాని కల్పాదౌ విసృజామ్యహం॥ ప్రకృతిం స్వామవష్టభ్య విసృజామిపునఃపునః। భూతగ్రామ మిమం కృత్స్నమవశం ప్రకృతేర్వశాత్॥** ఓ కుంతి

పుత్రుడా! కల్పము అనే పరిమితకాలము ముగిసిన పిమ్మట భూతాలు అన్నీ కూడా నాదైన ప్రకృతిలో ప్రవేశిస్తాయి. మళ్ళీ వాటిని ఇంకొక్క కల్పము ప్రారంభమయ్యే సమయంలో నేను విడుదల చేస్తాను. వాటి వాటియొక్క అనాదికర్మలతో కూడి నా సంకల్పము చేతనే మాటిమాటికి ఈ భూతసముదాయాన్ని పుట్టించుతుంటాను. ఈ ప్రాణిజాతమంతా కూడా నాదైన సంకల్పానికి లొంగి ఉంటుంది. **3) మయాఽధ్యక్షేణ ప్రకృతిః సూయతే సచరాచరమ్। హేతునాఽ నేనకౌన్తేయ జగద్ విపరివర్తతే॥** ఓ కుంతికొడుకా! నా అధికారపరిశీలన క్రిందనే చరాచర ప్రాణిజాతాన్నంతటినీ ప్రకృతి ఉత్పత్తి చేస్తున్నది నా సంకల్పము కారణంగానే ఈ జగత్తు వివిధరూపాలలో పరిణామాన్ని పొందుతూ ఉన్నది. **4) ప్రకృతిం పురుషంచైవ విద్ధి అనాదీఉభావపి** ప్రకృతి పురుషులు ఇద్దరు కూడా ఎప్పటి నుండి ఉంటున్నారో తెలియదు. వారు అనాదులు. **5) మమయోనిః మహత్ బ్రహ్మ తస్మిన్ గర్భందధామ్యహమ్। సంభవః సర్వభూతానాం తతోభవతిభారత॥** ఓ భరతపుత్రుడా! నాదైన ఈ ప్రకృతి చాల గొప్పది, పెద్దది. దానియందు జీవుడనే గర్భమును ఉంచుతున్నాను. దాని నుండి అన్ని రకముల భూతాలకు పుట్టుక ఏర్పడుతున్నది. అని జగత్తు పుట్టుటకు కారణమైన మహద్ బ్రహ్మనాకు సంబంధించినది. ప్రకృతి అనే పేరుగల భూతసూక్ష్మమైన అచిద్ వస్తువు ఏది ఉన్నదో దానియందు చేతనుడను పేరు గల గర్భమును కూర్చుతున్నాను. దానినుండి నేను చేసిన చిదచిత్తుల సంసర్గము / కలయిక వల్ల దేవతలు మొదలుకొని స్థావరములు చివరగా కల అచిత్‌లతో కలగలసిన భూతాలన్నింటికీ పుట్టుక ఏర్పడుతున్నది. ఈ తీరుగా భోక్త, భోగ్యముల రూపములోనున్న అన్ని రకాల అవస్థలలో నున్న చిదచిత్తులు పరమపురుషుడికి శరీరముఐ ఉన్నందున, ఆయన చేత నియమింపబడుతున్న కారణాననున్నూ ఆయన నుండి విడివడి ఉండలేని స్థితిని, పరమపురుషుడు వాటికన్నింటికి ఆత్మ అనిన్నీ కొన్ని శ్రుతులు వివరిస్తున్నాయి.

**యః పృథివ్యాం తిష్ఠన్ పృథివ్యాఅన్తరో యంపృథివీ నవేద యస్యపృథివీ శరీరం యః పృథివీ మన్తరో యమయతి** – ఎవడు పృథివి యందు ఉంటూ బైటకు కనిపించకుండా దానిలో ఉంటున్నాడో ఎవడిని పృథివి తనలోనున్నాడనే విషయాన్ని ఎరుగక ఉన్నదో ఎవడికి పుడమి శరీరమో ఎవడు భూమిలో పలనుంటూ దానిని అదుపులో పెడుతున్నాడో **అని మొదలుపెట్టి య ఆత్మని తిష్ఠన్ ఆత్మనోఽ న్తరో యమాత్మానవేద యస్యాత్మా శరీరం య ఆత్మాన మన్తరో యమయతి సతే ఆత్మా**

**అన్తర్యామీ అమృతః** ఎవడు ఆత్మ (జీవుడి) లో ఉంటూ ఆత్మలో దూరి హృదయగుహ యందునిండియున్నా ఆత్మ ఎవడిని ఎరుగడో ఎవనికి ఈ ఆత్మ శరీరమై యున్నదో ఎవడు ఆత్మలోనే నివసిస్తూ తన అదుపు ఆజ్ఞలలో నడుపుతూ ఉన్నాడో అలాంటి అన్తర్యామి పురుషుడు కర్మసంబంధములేని అమృత, ఆనందస్వరూపుడు నీకు ఆత్మగా నిన్ను మునుముందుకు నడిపించే వాడుగానున్నాడు. అనేవరకు అన్తర్యామి బ్రాహ్మణములోనిది. అట్లే సుబాలోపనిషత్తులోనూ – **యః పృథివీ మన్తరే సంచరన్ యస్యపృథివీ శరీరం యంపృథివీనవేద** అని ఆరంభించి **యోఽక్షర మన్తరే సంచరన్ యస్యాక్షరం శరీరం యమక్షరంనవేద, యో మృత్యు మన్తరే సంచరన్ యస్యమృత్యుః శరీరం యంమృత్యుర్నవేద ఏష సర్వభూతాన్తరాత్మా అపహతపాప్మాదివ్యో దేవఏకోనారాయణః** అనిచెప్పబడింది. ఈమహాపురుషుడుసర్వభూతాలకుఅంతరాత్మ. కర్మసంబంధము లేనివాడు దివ్యుడు. తనలీలకొరకై సృష్టి స్థితిలయాదివ్యాపారాలను చేసేవాడు ఒకే ఒక్కడైన శ్రీమన్నారాయణుడు అని గొంతెత్తి మూడు తత్త్వాలున్నవని వివరిస్తూ చిదచిత్తులనున్నూ శాసించేవాడు శ్రీమన్నానారాయణుడు అనే పేరుగల వాడు అని తెలిపింది. ఇక్కడ వాక్యంలో **మృత్యు** శబ్దముచేత మరణము యముడు అని అర్థము కాకుండా **తమశ్శబ్దం** చేత వ్యవహరింపబడేదిఐన **సూక్ష్మావస్థలో, కారణావస్థలోనున్న అచిత్ వస్తువు** చెప్పబడుతున్నది. ఇదే ఉపనిషత్తులో **అవ్యక్తమక్షరే లీయతే అక్షరం తమసి లీయతే** నామరూపములు లేని జీవకోటి అవ్యక్తము తమకు మూలము కూటస్థుడైన అక్షరునియందు, అక్షరుడు తమస్సులో కల్సిపోతున్నాడు అని, **అన్తఃప్రవిష్టః శాస్తాజనానాం సర్వాత్మా** సర్వులకూ ఆత్మవంటివాడైన పరమాత్మ జీవులందరిలోనూ ప్రవేశించియున్నాడు. అతడే వారిని శాసించుతున్నాడు అని కూడా ప్రత్యేకంగా చెప్పబడింది.

ఈ విధంగా అన్ని అవస్థలలోనూ ఉన్న చిదచిత్తులను తనకు శరీరంగా కల్గియుండడంతో వాటిని విశేషణంగా చేసుకునియున్నాడు కావుననూ ఆ పరమపురుషుడు కార్యావస్థలో కారణావస్థలో కనిపిస్తున్న జగద్రూపంలో ఉన్నాడు అనే ఈ అర్థాన్ని తెలుపడానికి కొన్ని శ్రుతులు కారణావస్థలో సృష్టికి మునుపు సూక్ష్మరూపంలో, కార్యావస్థలో చిదచిన్మిశ్రమైన ప్రపంచాకారంలో స్థూలరూపంలోనూ కనిపిస్తున్న "**జగత్తు ఆయనయే**" అని చెపుతున్నవి. **1) సదేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయం – తదైక్షత బహుస్యాం ప్రజాయేయేత. తత్తేజోఽసృజత** ఓ సోమ్యుడా! సృష్టికి పూర్వకాలంలో సత్ అనేదే ఉండినది అది ఒక్కటి మాత్రమే.

దానికి సాటియైనది మిన్నయైనది రెండవది ఏదీ లేదు. ఆ సద్వస్తువు తలచినది. పలురకాలుగా, రూపాలుగా అవుతాను. అందుకని జన్మించుతాను అని. అపుడా సద్వస్తువు తేజస్సును సృష్టించింది అని మొదలుపెట్టి **సన్మూలాః సోమ్య ఇమాః సర్వాప్రజాః సదాయతనాః సత్ ప్రతిష్ఠాః ఐతదాత్మ్యమిదంసర్వం. తత్ సత్యం. స ఆత్మా తత్త్వ మసిశ్వేతకేతో?** అని. ఓ సోమ్యుడా! ఈ ప్రజలందరూ సత్ పురుషుడి నుండి పుట్టుకు వచ్చినారు. ఆయన యే తమకు ఆత్మగా కల్గి ఆయనకు నివాస స్థానాలుగా నున్నారు. ఆయన వల్లనే చెక్కుచెదరకుండా దృఢంగా నిల్చియున్నారు. కావున కనుపించే ప్రపంచమంతా కూడా తదాత్మకమై యున్నది. అది యథార్థము. ఆయన ఆత్మ అని చెప్పబడతున్నాడు. ఓ శ్వేతకేతూ! నీవు కూడా ఈ ప్రపంచములో ఒకడివైయున్నందున నీవున్నూ బ్రహ్మాత్మకుడవై బ్రహ్మ స్వరూపుడవై యున్నావు. అని అట్లాగే **సోఽ కామయతబహుస్యాం ప్రజాయేయేతి. సతపోఽ తప్యత. సత పస్తప్త్వా ఇదగ్ం సర్వమసృజత**. ఆ పరమాత్మ కోరుకున్నాడు. ఒక్కడనే ఐన నేను పలురకాలుగా పుడుతాను అని. అందుకు ఆయన ఆలోచన చేసినాడు. అలా తపించి ఈ సర్వప్రపంచాన్ని పుట్టించినాడు అని ఆరంభించి **సత్యం చానృతం చ సత్యమభవత్**. భూతభవిష్యత్ వర్తమానాల్లోనూ ఉన్నాడనబడే జీవుడుగాను. లేదనబడే ప్రకృతిగాను ఆద్యన్తరహితుడైన పరమపురుషుడు గాను ఐనాడు అని. ఈ వాక్యంలోను ఇతర ఉపనిషత్తులలో నిశ్చయింపబడిన చిదచిత్తులు పరమపురుషుడియొక్క స్వరూప వివరము జ్ఞాపకము చేయబడినవి. **హన్తాహమిమాఃతిస్రోదేవతాః అనేన జీవేనాఽ త్మనాఽ నుప్రవిశ్యనామరూపే వ్యాకరవాణి**. ఆహాహా! ఎంతసంతోషము. పృథివీ, నీరు తేజస్సులనబడే ఈ దేవతలలోనికి, వాటివికారాలైన శరీరాలలోకి వాటికి ఆత్మయైన జీవుడి ద్వారా ప్రవేశించి వాటికి (శరీరానికి + జీవుడికిన్నీ) నామము రూపములను కలిగించుతాను. అని, – **తత్సృష్ట్వా తదేవానుప్రావిశత్. తదనుప్రవిశ్య సచ్చ త్యత్చాభవత్. విజ్ఞానంచావిజ్ఞానంచ సత్యం చానృతంచ సత్యమభవత్** – దాన్ని (శరీరాన్ని) పుట్టించి దానిలోకే జీవుడిని ప్రవేశింపచేస్తూ తాను కూడా ప్రవేశించినాడు. అలా ప్రవేశించి సత్ అనబడేదిగాను, వదిలిపెట్టబడే ప్రకృతి / శరీరముగానూ ఐనాడు. విజ్ఞానస్వరూపుడు, జ్ఞానము లేని జడరూప ప్రకృతియూ ఐనాడు. అలా అయ్యి సత్యము (జీవుడు) అనృతము (లేదనబడే ప్రకృతి) సత్యము ఉభయాత్మకుడు సత్ + త్యత్ఽ సత్త్యము జీవప్రకృతుల కలగలుపు ఐన జగత్తున్నూ ఐనాడు. అని కూడా! “**అనేన జీవేన ఆత్మనా అనుప్రవిశ్య**” శరీరానికి ఆత్మయైన ఈ జీవుడితో కలిసి దూరి అని జీవుడికి

బ్రహ్మాత్మకత్వమును "**తదనుప్రవిశ్యసచ్చ త్యచ్చా భవత్**" "**విజ్ఞానంచావిజ్ఞానంచ**" అనే వాక్యాలతో ఏకార్థత ఉన్నందున చిదచిత్తులకు + పరమాత్మకు ఉన్న సామానాధికరణ్యము, తాదాత్మ్యమున్నూ శరీరనామ రూప వ్యాకరణమున్నూ. **తద్హ ఇదం తర్హి అవ్యాకృత మాసీద్. తన్నామరూపాభ్యాంవ్యాక్రియత**. ఆ సృష్టికి పూర్వ కాలములో ఈ ప్రపంచము విడివిడిగాకాక మొత్తంగా కలిసి పోయి ఇది ఇట్లా అని చెప్పడానికి వీలుగాకుండా ఉండినది. సృష్టి సంకల్పకాలంలో దాన్నే సత్ శబ్దవాచ్యుడు అగు పరమాత్మ వాటిని విడదీసి ఇది ప్రకృతి వీడు జీవుడు ఈ సమ్మిళిత స్వరూపము దేవమనుష్యాదులు అని నామములను రూపములను కలుగజేసెను. అను వాక్యము చోటనున్నూ తెలుస్తున్నది.

అందువల్ల కార్యావస్థలో కారణావస్థలోను స్థూలసూక్ష్మరూపాలలోనున్న చిదచిద్ వస్తువులను తనకు శరీరాలుగా కలిగియున్నవాడు పరమపురుషుడేనని నిశ్చయమైనది కాబట్టి కారణము నుండి కార్యము వేరుకాదు కాబట్టి, కారణాన్ని తెల్సుకుంటే కార్యము తెలియబడుతున్నందుననూ ఏకవస్తువును తెల్సుకుంటే సర్వవస్తువులను గురించి తెల్సుకోగలుగడము కుదురుతుంది. సద్విద్యలో తొట్టతొలుత చేసిన ప్రతిజ్ఞ కూడా చక్కగా నప్పుతుంది. హన్తాహమిమాస్తిస్రో దేవతాః అనేన జీవేన ఆత్మనా అనుప్రవిశ్యనామరూపే వ్యాకరవాణి అని తిస్రోదేవతా అని అచిద్ వస్తువు నంతటినీ నిర్దేశించి, దానిలో తనను ఆత్మగాకల, తన స్వరూపమైన జీవుని ద్వారా అనుప్రవేశించి నామరూపములను కలిగించినాడని చెప్పినందున ఆయా వస్తువులకు పదార్థాలకు వ్యక్తులకు వాచకాలైన శబ్దాలు అన్నీ కూడా అచిత్తుతో కూడిన జీవుడు, ఆ జీవునితో కూడియున్న పరమాత్మకే వాచకాలు ఔతున్నాయి. కనుక కారణావస్థలో ఉన్న పరమాత్మను తెలియచేసే శబ్దంతో, కార్యావస్థలో నున్నదాన్ని తెలియచేసే శబ్దానికిన్నీ సామానాధికరణ్యము ముఖ్యార్థము అవుతున్నది. కాబట్టి స్థూల సూక్ష్మములుగా నుండే చిదచిత్తులను తనకు విశేషణములుగా చేసుకొని రెండు ప్రకారాలుగానున్న పరబ్రహ్మయే కార్యము కారణమూ అవుతున్నాడు కనుక ఈ జగత్తు బ్రహ్మనే ఉపాదానకారణముగా కలిగియున్నది.

సూక్ష్మచిదచిద్వస్తువులు శరీరంగా కలిగిన బ్రహ్మనే ఈ జగత్తుకు కారణము అని బ్రహ్మయే ఉపాదాన కారణము ఐనప్పటికీ మూడింటికలయిక స్వరూపమే ఉపాదానము అవుతున్నందున చిదచిత్తులకు బ్రహ్మకు వేరువేరు స్వభావములు కలవారికి

సహవాసదోషము వలన వారి వారి స్వభావాలలో విశుద్ధత కాకుండా సాంకర్యము ఏర్పడవచ్చును అని అనుకోకూడదు. ముగ్గురు ఒక్కదగ్గర ఉన్నప్పటికీ సాంకర్యము లేకపోవడము ఇలా కుదురుతుంది. కలనేత చీరను నేసినపుడు దానిలో తెలుపు ఎరుపు నలుపు దారాలు కలసి ఆవస్త్రానికి ఉపాదానకారణము అవుతున్నప్పటికీ కలనేత వస్త్రంలో ఆయా నిర్దిష్ట ప్రదేశాలలోనే తెలుపు మొదలగు దారాలతో సంబంధముంటున్నది తప్ప అంతటా ఉండడము లేదు. అట్లే కార్యావస్థలో నున్న చిదచిదీశ్వరులకున్నూ అన్ని చోట్లా సంకరము లేదు. అనగా కార్యావస్థలోనున్నప్పటికీ చిదచిదీశ్వరులకున్నూ భోక్తృత్వము భోగ్యత్వము నియంతృత్వాది స్వభావాల్లో సాంకర్యము లేదు. విడిగా ఉండదగినవైన దారాలు నేసే పద్మశాలివాని సంకల్పాన్ననుసరించి ఒకప్పుడు కల్సిపోయి, ఒకప్పుడు కలువకుండానూ కారణత్వమును కార్యత్వమునున్నూ పొందుతున్నవి. ప్రస్తుతము ఇక్కడైతేనో అన్ని అవస్థలోను ఉన్న చిదచిత్తులు పరమపురుషుడికి శరీరముగానుండడంవల్ల ఆయనకు ప్రకారమై యున్నందువల్లనే పదార్థత్వాన్ని పొందుతున్నందుననూ వాటిని తనకు విశేషణాలుగా కల్గియున్న పరమ పురుషుడు కారణావస్థ కార్యావస్థలోను అన్ని శబ్దాలచేత వ్యవహరింపబడుతున్నాడు. చెప్పబడుతున్నాడు. స్వభావ భేదము సాంకర్యము లేకపోవుట కలనేతవస్త్రంలోను చిదచిద్విశిష్టమైన పరమాత్మ స్వరూపముగానున్న జగత్తులోనూ సమానమే. ఇట్లా అయ్యిందికాబట్టే పరబ్రహ్మకార్యము నందు (అచిద్విశిష్టజీవశరీరంలో) అను ప్రవేశము చేసినప్పటికీ తనయొక్క స్వరూపము మరొక్కతీరుగా మారిపోవడం లేదు కనుక **అవికృతత్వము** చక్కగా పొసగుతుంది. స్థూలావస్థలోనున్న నామరూప విభాగాలతో విడిపోయిన చిదచిన్మిశ్రవస్తువునకు ఆత్మగా ఉంటున్నందువల్ల కార్యత్వము కూడా బాగా పొసగుతుంది. కార్యత్వమనగా "**కారణావస్థలో నున్నవస్తువే మరొక అవస్థలోకి / కార్యావస్థలోకి మారడమే / పొందడమే**"

పరబ్రహ్మ నిర్గుణుడు అనే వాదము కూడా హేయగుణాలు లేనివాడు అన్నపుడు మాత్రమే చక్కగా అతుకుతుంది. **అపహత పాప్మా, విజరః విమృత్యుః విశోకః విజిఘత్సః అపిపాసః సత్యకామః సత్యసంకల్పః** ఈ పరమాత్మ పుణ్యపాప రూపకర్మసంబంధము లేనివాడు ముసలితనము, మరణము, శోకము, ఆకలి దప్పులు, లేనివాడు. అని హేయములైన ప్రకృతి సంబంధములైన గుణాలు లేనివాడు అని నిషేధించి **సత్యకామః సత్యసంకల్పః** తాను తలచిన కోరికలు నిజములు ఐనట్టి వాడు, తన సంకల్పము

ఎటువంటి అడ్డంకులు లేకుండా యథార్థము అవుతున్నట్టివాడు అని కళ్యాణగుణాలను ఉన్నవని విధిస్తున్న ఈ శ్రుతియే "నిర్గుణః నిరంజనః" అని వేరే చోటచెప్పినదాన్ని హేయగుణసంబంధము లేదని తెల్పుతున్నది తప్ప అసలే గుణాలేవీ లేనివాడని కాదు.

జ్ఞానస్వరూపము బ్రహ్మ అనే వాదము కూడా సర్వజ్ఞుడు, సర్వశక్తులు గలవాడు, అన్నిరకాలైన హేయగుణాలకు విరోధి, కళ్యాణ గుణాలకు సముద్రుడు ఐన బ్రహ్మ యొక్క స్వరూపము జ్ఞానము ఒక్కదానిచేతనే నిరూపించదగినది స్వయంప్రకాశము అగుటచేత జ్ఞానస్వరూపము అని అంగీకరించినట్లయితే బాగా ఉపపన్నమవుతుంది.

**యఃసర్వజ్ఞఃసర్వవిత్** – ఎవడు అన్నీ తెల్సినవాడు, భూతభవిష్యద్ వర్తమానాల్లోని సర్వవిషయాలు తెల్సినవాడు. **పరాఽ స్యశక్తిః వివిధైవశ్రూయతే స్వాభావికీ జ్ఞానబలక్రియాచ**. ఈయన యొక్క శక్తి చాల గొప్పది అది పలురకాలుగానున్నట్లు వినవస్తున్నది. ఇతని జ్ఞానము, బలము, క్రియలు సహజమైనవే కాని ఇతరులదయవల్ల పొందినవి కావు. **విజ్ఞాతారమరేకేనవిజానీయాత్** ఓరీ! సర్వవిజ్ఞాతఐన ఆయనను దేని ద్వారా ఏ ప్రమాణము ద్వారా తెల్సుకోగల్గుతాము. ఇత్యాది వాక్యాలన్నీ **విజ్ఞానము కలవాడిగానే జ్ఞాతగానే తెల్పుతున్నాయి వట్టి జ్ఞానముగా కాదు**. **సత్యంజ్ఞాన మనన్తంబ్రహ్మ** ఇత్యాది వాక్యాలు కూడ జ్ఞానము చేత మాత్రమే నిరూపింపదగినవాడు అని స్వయం ప్రకాశుడు అవడం చే జ్ఞానము అతనియొక్క స్వరూపమని తెల్పుతున్నవి.

**సోఽ కామయత బహుస్యాం, తదైక్షత బహుస్యాం, తన్నామ రూపాభ్యాం వ్యాక్రియత** ఇత్యాది వాక్యాలచేత పరబ్రహ్మయే తనయొక్క సంకల్పముచేతనే ఆశ్చర్యకరమై స్థిరమైన త్రసరూపముతో (మూడింటితో కూడిన రూపము 1) మూడు అణువులు కలసి ఏర్పడిన రూపము 2) అచిత్ + చిత్ + ఈశ్వరుడు ఈ మూడిటితో కలసినట్టిది 1) నానా ప్రకారాలుగా ఉన్నాడని అందుచేత ఆయనకు భిన్నమైన వ్యతిరేకమైన బ్రహ్మతో సంబంధములేని, ఆయనకు చెందని వస్తువులు అనేకమున్నవనుట యథార్థము కాదని దాన్ని నిషేధిస్తున్నది శ్రుతి. అంతేకాని బ్రహ్మ ఒక్కటే సత్యము. అంతకు మించి ఏదీ లేదు. ఉన్నట్లు కనిపిస్తే అవి మిథ్య అని చెప్పడంలేదు.

**1) మృత్యోః సమృత్యుమాప్నోతి య ఇహనానేవ పశ్యతి** – ఎవడైతే బ్రహ్మకు సంబంధము లేని అబ్రహ్మాత్మకములైన వస్తువులు చాలగా ఉన్నవని భావిస్తున్నాడో వాడు మళ్ళీ మళ్ళీ పుడుతూ చస్తున్నాడు. **నేహనానాఽ స్తికించన** ఈ జగత్తులో

పరమాత్మ స్వరూపము కాని వస్తువు ఏదీ కూడా లేదు. **3) యత్రహిద్వైతమివ భవతి తదితర ఇతరం పశ్యతి. యత్రత్వస్య సర్వమాత్మైవాభూత్ తత్ కేనకంపశ్యేత్ కేనకంవిజానీయాత్** ఎచ్చట రెండు వస్తువులు ఉండునో అపుడు అవి రెండు పరస్పరము గమనించగలవు. ఈ జ్ఞానానికి ప్రపంచమందంటతటనూ ఆత్మయే (తానే) నిండి కనిపిస్తుండగా ఏసాధనంతో రెండవవాడిని చూస్తాడు ఏ ప్రమాణముతో ఆత్మకంటే వేరయిన ఆ వస్తువును తెల్సుకోగల్గుతాడు. ఇత్యాదులు ఇందుకు ప్రమాణాలు. ఇకపోతే నానాత్వాన్ని నిషేధించే ఈ శ్రుతులు **బహు స్యాంప్రజాయేయ** ఇత్యాది పలు శ్రుతులచేత సిద్ధమైన, తన సంకల్పము చేతనే తానే నానా నామములను, నానారూపములను పొంది నానా ప్రకారములు కావడాన్ని మాత్రమ నిషేధించడము లేదు. **యత్ర త్వస్యసర్వమాత్మైవాభూత్** ఇత్యాది నిషేధవాక్యానికి ముందు ఆ విషయమే స్థిరపరచబడింది. **సర్వంతం పరాదాత్ యోఽ న్యత్రా త్మనః సర్వంవేద, తస్యహవా ఏతస్య మహతోభూతస్య నిశ్వసితమేతత్ యద్ ఋగ్వేదో యజుర్వేదః –** అదంతా దూరంగా త్రోసి వేయబడుతున్నది. పరమాత్మ అన్తర్యామిగా లేని, పరమాత్మను విడిచి ఉండేదానినిన్నీ. ఆ మహాభూతమైన పరమ పురుషుని యొక్క ఉచ్చ్వాసనిశ్వాసరూపమే ఋగ్వేదము యజుర్వేదమున్నూ. సర్వమూ బ్రహ్మాత్మకమే అని అర్థము.

ఈ విధంగా చిద చిద్ ఈశ్వరులకు స్వరూపభేదము స్వభావభేదమును, కార్యకారణభావమును, కార్యకారణములకు అనన్యభావమును (వేరువేరుగాక పోవడమును) చెపుతున్న శ్రుతివాక్యాలకు వైరుధ్యము లేకపోవడం, స్వారస్యము ఉండడమున్నూ కుదురుతున్నది. చిదచిత్తులకు పరమాత్మకున్నూ శరీరాత్మభావము, శరీరముగా నుంటున్న చిదచిత్తులు కారణావస్థయందు నామరూప విభాగము చేయడానికి వీలుకానిస్థితిని పొందడము, కార్యదశయందు నామరూపాలకు తగిన దశను పొందడాన్ని శ్రుతులే వివరించి చెపుతున్నాయి. కనుక బ్రహ్మకే అజ్ఞానము అవరించిందని చెప్పే వాదానికి, ఉపాధి కారణంగా బ్రహ్మకు భేదదృష్టి ఏర్పడింది అని చెప్పే వాదానికి, ఈ రెండింటికీ విరుద్ధంగా అపన్యాయాలు కుతర్కాలు సకల శ్రుతులకు విరుద్ధ వ్యాఖ్యానాలు చేస్తూ స్వాభావిక భేదాభేదాన్ని తెలిపే వాదానికిన్నీ ఏ మాత్రమూ అవకాశము కనిపించడం లేదు. చిదచిదీశ్వరులు వేరు వేరు స్వభావాలు కలవారు. వారిలో ఒకరు ఆత్మయైతే మిగతావారు శరీరాలు ఔతున్నారు. ఒకరు ప్రకారము ఐతే మరొకరు ప్రకారి. ఒకరు విశేష్యము ఐతే తతిమ్మా ఇద్దరు విశేషణములై ఎడబాయక

ఉంటున్నారు. వారికే కార్యకారణభావమును, కార్యకారణములకు ఐక్యమున్నూ ఉన్నదని శ్రుతులు చెపుతున్నాయి. ఐతే వైరుధ్యము తప్పనిసరికదా అని అనవచ్చును. కాని అది సరికాదు. ఎలాగంటే ఆగ్నేయాది యాగాలు ఆరు అవి వేరు వేరు వాక్యాలచేత విధింపబడ్డాయి. 1) ఆగ్నేయము 2) అగ్నీ షోమీయము. 3) ఉపాంశుయాగము 4) 5) ఐంద్ర యాగాలు రెండు. 6) ఐంద్రాగ్నము. మొత్తము ఆరు. ఇవి **యదాగ్నే యో అష్టా కపాలో అమా వాస్యాయాం పౌర్ణమాస్యాం చాచ్యుతోభవతి** వంటి వాక్యాల చేత విధింపబడ్డవి. అమావాస్యనాడు, పూర్ణిమ నాడు ఆచరింపవలసినవిగా చెప్పబడ్డవి. **యఏవం విద్వాన్ పౌర్ణమా సీం యజతే, యఏవం విద్వాన్ అమావాస్యాం యజతే** అనువాక్యాలచేత విడివిడిగా విధింపబడినా సముదాయముగా ఆచరించవలసినదిగా ఆదేశింపబడ్డాయి.

ఉత్పత్తి వాక్యాలచేత విడివిడిగా ఉత్పన్నము లైన ఆగ్నేయాది ఆరు యాగాలను సముదాయముగా చేసి చెప్పబడే అనువాక్యాలు రెండింటిచేత రెండు సముదాయాలుగా ఏర్పడిన వాటిని **దర్శపూర్ణమాసాభ్యాం** అనే అధికారవాక్యము ఆయా ఫలాలను కోరే కాముకులకు చేయండి అని విధిస్తున్నది. అట్లే ఇచట కూడా, చిత్ అచిత్ ఈశ్వరులు వేరువేరు స్వరూప స్వభావాలు కలవారు. **1) క్షరం ప్రధానం, అమృతాక్షరంహరః, క్షరాత్మానౌ ఈశతేదేవ ఏకః** ప్రధానము నశించేది కనుకక్షరము. అమృతుడు అక్షరుడు ప్రధానమును అనుభవించేవాడు జీవాత్మ. ఈ ఇద్దరినీ శాసించే దేవుడు ఒకడు. **2) పతిం విశ్వస్యాత్మే శ్వరం** – విశ్వమంతటికీ ఏకైక ప్రభువు. రక్షకుడు పాలకుడు. తనకు తానే అధికారి. తనను శాసించేవాడు మరొకడు లేడు. **3) ఆత్మానారాయణః పరః** – సమస్త ప్రపంచానికి ఆత్మ నారాయణుడు. ఆయనే పరాత్పరుడు. ఇత్యాది వాక్యాల చేత చిదచిదీశ్వరుల యొక్క స్వరూపస్వభావాలను చెప్పి. **యస్య పృథివీ శరీరం, యస్య ఆత్మా శరీరం, యస్య అవ్యక్తం శరీరం, యస్య అక్షరం శరీరమ్ ఏష సర్వభూతాంతరాత్మా అపహత పాప్మా దివ్యో దేవ ఏకోనారాయణః** ఇత్యాది వాక్యాలతో కార్యకారణావస్థలలోనున్న చిదచిత్తులు పరమాత్మకు శరీరాలు అని, పరమాత్మ వాటికి ఆత్మ అని ప్రతిపాదించి, శరీరియైన పరమాత్మను బోధించే సత్, బ్రహ్మ, ఆత్మ మొదలైన పదాలతో కారణావస్థలోను కార్యావస్థలోను ఉన్న పరమాత్మ ఒక్కడేనని, విడిగా కనిపించిన మూడు వస్తువులు **సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్, ఐతదాత్మ్య మిదం సర్వమ్, సర్వం ఖల్విదం బ్రహ్మ**. సద్, ఆత్మ, బ్రహ్మ శబ్దాలతో ఒక్కటిగానే ప్రతిపాదించినవి

శ్రుతులు. అచ్చట ఆగ్నేయాది ఆరు యాగాలు వేరువేరుగా ఉత్పన్నములైన వాటిని, రెండు సముదాయాలు – పున్నమనాడు చేసేవి అమవాస్యనాడు చేసేవిగా చెప్పి దర్శపూర్ణమాసాభ్యాం అనే అధికారసూత్రంతో దర్శ పూర్ణమా సయాగంగా – ఒక్కటిగా చెప్పినట్లే మూడు స్వభావాలు కలవారుగా విడివిడిగా చిదచిదీశ్వరులని చెప్పి, తదుపరి చిదచిత్తులను ఒక వర్గంగా, దేవఏకః అని ఈశ్వరుడిని ఒకడుగా విడదీసి, చివరికి చిదచిత్తులు పరమాత్మకు శరీరమని, ఆయన వాటికి ఆత్మయని కార్యావస్థను గురించి చెప్పి, కారణావస్థలో పరమాత్మయందున్న చిదచిత్తులను కల్పుకుని సదాత్మ బ్రహ్మ శబ్దాలతో ఒక్కటిగానే చెప్పబడింది. చిదచిద్వస్తువులను శరీరముగా కల్గిన పరమాత్మను పరమాత్మ శబ్దముతో పిల్చినప్పటికీ విరోధము ఏమీలేదు. లోకంలో మానవ పిండాన్ని శరీరంగా కల్గిన ఆత్మవిశేషాన్ని ఈ ఆత్మ సుఖి అని ఆత్మశబ్దంతో వ్యవహరించినప్పటికీ ఎలాంటి ఇబ్బంది కనబడదం లేదుకదా!

## 7. నివృత్త్యను పపత్తి

బ్రహ్మ ఒక్కటే సత్యము అని ఏకత్వ విజ్ఞానము చేతనే అవిద్య తొలగిపోతుంది అని ఏదైతే చెప్పినారో అది తగిన మాటకాదు. జీవుడికి ఉన్న సాంసారిక అజ్ఞానబంధము అనేది పరమార్థము. కనుక అది కేవల జ్ఞానంతో పొయ్యేది కాదు. పుణ్యపాప రూపమైన కర్మల నిమిత్తంగా దేవాది శరీరాలలో జీవుడికి ప్రవేశము కల్గుతున్నది. ఆ కారణంగా సుఖదుఃఖాలను అనుభవించడమనే బంధము ఏర్పడుతున్నది. అది అనుభవములో కండ్లతో చూస్తున్న విషయము. అలాంటి దాన్ని మిథ్య అని ఎలా చెప్పగలము.

ఇలాంటి సుఖదుఃఖ అనుభవరూపమైన బంధము యొక్కనివృత్తి కేవల జ్ఞానము వల్ల కాకుండా భక్తి రూపంగా మారిన ఉపాసన వల్ల సంతోషించిన పురుషోత్తముని యొక్క అనుగ్రహము వలన మాత్రమే సాధ్యమవుతుంది అని ఇంతకుముందే చెప్పినాము. మీకు నచ్చిన ఐక్యజ్ఞానము యథార్థంగా ఉన్న ప్రపంచానికి విపరీతమైనది కాబట్టి అదే మిథ్యా రూపము దానివల్ల బంధము మరింత బిగుసుకొనిపోతుంది కాని బంధ విముక్తి కానేరదు.

**మిథ్యైతద్ అన్యద్ద్రవ్యం హినైతి తద్ద్రవ్యతాం యతః** అని శాస్త్రము చెపుతున్నది. రెండు భిన్నస్వభావాలు ఉన్నపుడు అందులో ఒటి మరొకదానితో సమానముకావడము,

అభేదాన్ని పొందడం జరుగదు. అవి రెండు భిన్నభిన్నద్రవ్యాలు కాబట్టి. ఎవరైనా అలా జరుగుతుంది అనుకుంటే అది మిథ్య అని శాస్త్రము చెపుతున్నది.

**ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మేత్యుదాహృతః** ముందు చెప్పబడిన పురుషుల కన్నా వేరొకడు శ్రేష్ఠుడు ఉత్తముడు ఉన్నాడు. అతడినే పరమాత్మ అని అంటున్నారు. **పృథగాత్మానం ప్రేరితారంచ మత్వా** తనకన్నా వేరయిన ప్రేరకుడిని తెలిసి కొని అని రెండు వాక్యాల ద్వారా జీవాత్మకు పూర్తిగా విరుద్ధమైన జాతీయుడు, జీవునిలో అన్తర్యామిగా ఉండేవాడు ఐన బ్రహ్మను గురించిన జ్ఞానమే మిక్కిలి గొప్ప పురుషార్థము ఐన మోక్షమును సంపాదించుకోవడానికి సాధనము ఔతుంది అని కూడా శాస్త్రము ఉపదేశిస్తున్నది.

ఇంకా నీవంగీకరించిన నివర్తక జ్ఞానము మిథ్యయైనది కాబట్టి దాన్ని తొలగించేదైన మరొక్క వస్తువును దేవులాడక తప్పదు. లేదండి! బ్రహ్మ ఒక్కడే సత్యము. మిగతా అంతా అపరమార్థము అనే బ్రహ్మైక్యజ్ఞానము తనకు విరోధియైన భేదముల సముదాయాన్ని దూరంచేసి తాను క్షణకాలము మాత్రమే ఉండేదైనందున వెంటనే తాను నశిస్తుంది అని అనేట్లయితే సరికాదు. అలా ఐతే దాని స్వరూపము, దాని పుట్టుక, దాని వినాశాలు అన్నీ కల్పితాలే ఔతాయి కాబట్టి వినాశ తత్కల్పనా రూపమైన అవిద్యకు మరొక నివర్తకాన్ని అన్వేషించాల్సి యుంటుంది. కాదండీ అవిద్యకు వినాశము బ్రహ్మస్వరూపమేనండీ అన్నట్లయితే అపుడు నివర్తక జ్ఞానము అనేది పుట్టనే పుట్టదు. ఎందుకంటే దాన్ని నశింపచేసే వస్తువు సిద్ధంగా ఉంటే అది పుట్టడానికి అవకాశమే ఉండదు. కనుక, అవిద్యానివృత్తి జరుగదు.

చిన్మాత్రబ్రహ్మకంటేవేరుగానుండేపదార్థమంతామిథ్యఅనిచెప్పేజ్ఞానాన్నితెల్పిన జ్ఞాత ఎవరు? చెప్పగలరా! అధ్యాసరూపమే అని అంటారా? కాదు. అధ్యాసరూపము నిషేధింపబడేది ఐనందున నివర్తక జ్ఞానానికి అది కర్మ ఔతుంది. కాని దానికి కర్తృత్వము పొసగదు. బ్రహ్మ స్వరూపమే జ్ఞాత అంటారా? ఐతే ఆ బ్రహ్మగారికి అవిద్యను తొలగించే నివర్తక జ్ఞానానికి సంబంధించి జ్ఞాతృత్వమనేది సహజ స్వరూపమా! లేక అధ్యస్తమా? అధ్యస్తమే కనుక ఐనట్లయితే ఈ అధ్యాసము, దానివల్ల ఏర్పడిన మరొక అవిద్య నివర్తక జ్ఞానానికి చెందక పోయినందువల్ల అవిద్య నిలిచే ఉంటుంది. దాన్ని తొలగించడానికి మరొక నివర్తక జ్ఞానాన్ని అంగీకరించినట్లయితే అది మూడు రూపాలు (జ్ఞానం + జ్ఞేయము + జ్ఞాత) కలదే అవుతున్నందున జ్ఞాతను బట్టి విచారించినపుడు ఒక అనవస్థ ఏర్పడుతుంది. ఏ జ్ఞాత అని? పోనీ ఈ అవస్థ అంతా ఎందుకు? బ్రహ్మ స్వరూపమే జ్ఞాత

అని ఒప్పుకుంటే మా పక్షాన్నే అంగీకరించినట్లవుతుంది. ఇక నివర్తక జ్ఞాన స్వరూపము, దాని జ్ఞాత కూడా బ్రహ్మకంటే వేరైన వారైనందున తనచేత తొలగింపబడే అవిద్యలోనే చేరి ఒక భాగమవుతారు అని అనేట్లయితే – "**నేలను తప్ప నేల మీద ఉన్న అన్నింటినీ దేవదత్తుడు నరికివేసినాడు**" అని చెప్పినట్లు దేవదత్తుడు చేసిన ఛేదనక్రియలో, నరికిన దేవదత్తుడు, అతను చేసిన ఛేదనక్రియ నరకదగిన పదార్థములో చేరిపోతున్నందున ఎదుటివారికి నవ్వులపాలు కాక తప్పదు. అపరమార్థమైన అధ్యస్తుడగు జ్ఞాత తన నాశనానికి కారణమైన నివర్తక జ్ఞానాన్ని పుట్టించడానికి తాను కర్త ఎన్నటికీ కాబోడు. ఒకవేళ అలాగే జరిగినట్లయితే అది పురుషార్థము కాదు.

అవిద్యా నాశనం వల్ల బ్రహ్మస్వరూపత్వము వస్తుంది అని అంటే భేదదర్శనము, దానికి కారణము ఐన అవిద్యాదులకు కల్పనము అనేవే లేకుండా పోతాయి. కావున ఇంతటితో వాదము ముగిస్తున్నాము. తనకు తానే ముద్గరముతో కొట్టుకొని చచ్చేవాడిని ఇంకా కొట్టవలసిన పని ఏముంది? **ఇది నివృత్త్యనుపపత్తి.**

అందువలన అనాదియైన కర్మప్రవాహరూపమైన అజ్ఞానము వలన ఏర్పడింది కాబట్టి ఈ బంధము ముందు చెప్పిన "**భక్తి రూపాపన్న జ్ఞానంవల్లనే**" తెగిపోతుంది. అలాంటి భక్తి రూపాపన్నజ్ఞానము ప్రతిదినమూ విడువకుండా పరమ పురుషుడైన నారాయణుడిని ఆరాధించుట అనే స్వరూపం కలదై ఆత్మ యొక్క యథార్థ స్వరూపాన్ని తెల్సుకోవడమనే బుద్ధి విశేషం చేత సంస్కరింపబడిన తమతమ వర్ణాశ్రమోచితమైన కర్మలవల్ల మాత్రమే లభిస్తుంది. అచట కేవల కర్మలు అల్పములు అస్థిరములు ఐన ఫలాలనే ఇస్తాయి. అలా కాకుండా కర్మలకు ఫలాలను కోరకుండా పరమపురుషుడైన లక్ష్మీనాథుని యొక్క ఆరాధనా రూపాలుగా ఆచరించినట్లయితే ఉపసనాత్మకమైన జ్ఞానాన్ని పుట్టించుతుంది. బ్రహ్మ యొక్క యథార్థ స్థితిని దర్శించి అనుభవించే అనంతస్థిరఫలత్వము కర్మలయొక్క స్వరూప జ్ఞానము లేకుండా తెలియరాదు. అలాగే కేవల కర్మలను వదిలి పెట్టడం ద్వారా ఫలాభిసంధిరహితమైన ఆత్మజ్ఞాన సహితమైన పరమపురుషారాధన రూపంగా కర్మలను చేబట్టడం జరుగదు. కనుక కర్మలయొక్క మంచిచెడ్డలను విచారించిన తర్వాతనే, ఆకారణంగానే బ్రహ్మ విచారము చేయాలి అని అథ అతః పదాలను ఉపయోగించినారు.

**ఇంతటితో మహాసిద్ధాన్తము ముగిసినది.**

★ ★ ★

శ్రీమతే రామానుజాయనమః

## శ్రీభాష్యము – ప్రథమాధ్యాయము – ప్రథమపాదము
## (సూత్రకారునకిష్టమైన సూత్రార్థ యోజన)

**అథాతో బ్రహ్మ జిజ్ఞాసా 1–1–1:** అథాత శ్శబ్దములవిచారము తర్వాత సూత్రార్థ విచారమును ఆరంభించుతున్నాడు. బ్రహ్మ విచారము చేయాలి అని చెప్పినందున బ్రహ్మ విచారము చేయనక్కరలేదని పూర్వ పక్షవాది ప్రాభాకర మతస్థుడు వాదిస్తున్నాడు. సిద్ధ వస్తువైన బ్రహ్మను గురించి శబ్దము చెప్పజాలదు. ఎందుకనగా పదాలన్నీ కార్యార్థవాచకాలు ఐ యున్నాయి. వృద్ధులు పెద్దలయొక్క వ్యవహారమువల్లనే ఆయాశబ్దాలు తమ తమ అర్థాలను వస్తువులను తెలియపరుస్తున్నాయి. గామానయ గాంబధాన ఆవును తీసుకొనిరా! ఆవును కట్టివేయి అని ఒక వ్యక్తి చెప్పగా మరొకవ్యక్తి ఆ పని చేస్తున్నాడు. దాన్ని చూచిన పిల్లవాడు గౌః అంటే ఆవు అని అర్థము చేసుకుంటాడు. మరొకసారి ఆనయ బధాన పదాలు ఆవృత్తమైనపుడు తీసుకురావడము కట్టివేయడాలు గమనించి బధాన అంటే కట్టివేయడము ఆనయ తీసుకు రావడము అని తెలుసుకుంటాడు. ఇట్లా కార్యార్థము ద్వారా ఆయా పదాలు ఆయా అర్థాలను తెల్పుతున్నాయి. అని తెల్సుకొని వ్యుత్పన్నుడౌతున్నాడు. తరువాతికాలంలో వాటిని స్వతంత్రంగా ప్రయోగిస్తున్నాడు. అట్లే వేదములోని శబ్దాలకు కూడా వ్యుత్పత్తి ఏర్పడుతుంది. జ్యోతిష్టోమేన స్వర్గకామోయజేత అని వినిపించినపుడు యాగము చేయాలి అని తెల్సుకుంటున్నాడు. యాగానికి జ్యోతిష్టోమము పేరు అని, విధానాన్ని గమనించి యాగమంటే మంత్ర పూర్వకంగా ఆజ్యాన్ని అగ్నిలో ఆర్పించడమని తెల్సుకుంటాడు కాబట్టి శబ్దాలన్నీ కార్యార్థమునందు మాత్రమే ప్రమాణములౌతున్నాయి. అందుచేత లౌకిక శబ్దాలవలెనే వైదిక పదాలు కూడా కార్యార్థము నందు మాత్రమే ప్రామాణ్యమౌతున్నాయి. కావున సిద్ధవస్తువు ఐన పరబ్రహ్మకు హానోపాదానాది కార్యమందు అన్వయము లేదు కాబట్టి పరబ్రహ్మను గురించి వైదిక శబ్దాలు చెప్పజాలవని అన్నారు. పుత్రుడు పుట్టినాడు అన్నపుడు అది సిద్ధవస్తు విషయము. దానివల్ల ఆనందము కల్గుతున్నది. వాటికి కారణము మూడుకాలాలలో ఉండే ప్రయోజనాలు అనన్తములు కాబట్టి మంచి లగ్నములో పుట్టడము, సుఖప్రసవము జరుగుట వంటి ఇతర ప్రయోజనాలు జతపడియుండడం వల్లనూ సంతోషజనకమైన అంశాలు తెలిసినందున దాన్ని

తెలిపే ముఖవికాసము వంటి సూచనలతో వీడికి ఆనందకరమైన ప్రయోజనము సిద్ధించింది అని నిశ్చయించుతున్నాము. వాక్యములోని ఒక పదానికి అర్థము తెలియకపోయినా తెలిసిన మరొక పదము యొక్క అర్థాన్ని బట్టి సిద్ధ వస్తువు యందు అర్థనిర్ణయము చేసుకొనవచ్చును అని అనకూడదు. జరిగిన, పలుమార్లు చూచిన కార్యాన్ని తెలియచేసే పదసముదాయము ఐనందువల్ల అర్థ నిర్ణయం చేసుకోవడానికి అవకాశము ఉంటుంది. కాని సిద్ధవస్తు విషయంలో అలా జరుగడానికి అవకాశం లేదు. సర్పభయంతో వణుకుతున్నవాడికి ఇది పాము కాదు. తాడు మాత్రమే అన్నమాట వినడంతోనే భయము తొలగిపోవడం చూస్తున్నాము. కాబట్టి సర్పాభావబుద్ధికి వాక్యము హేతువు ఔతున్నదని అనకూడదు. అక్కడ కార్యవ్యవహారముంటున్నది. ఏమని? అది కదలికలేకుండా ఉన్నది. తాడు కాబట్టే దానిలో విషము లేదు. అచేతనమైన జడపదార్థమిది మొదలైన భయాన్ని తొలగించే పలుకారణాలు ఉన్నపుడే విశేషనిశ్చయము కలుగుతున్నది. ఈ కార్యము చేయాలి దీనివల్ల ఈ ప్రయోజనాన్ని పొందాలి అని ఉద్దేశించి ఆయా పనులు చేయడం తత్‌సంబంధితమైన పదాలను ప్రయోగించడము కార్యానికి శబ్దానికి ఉండే వ్యాప్తి బలముతో శబ్దానికి అర్థావబోధము జరుగుతున్నది. కాబట్టి పదాలన్నిటికి కార్యపరత్వము సిద్ధమైనందున పదాలన్నింటి చేతనున్నూ విశిష్టమైన కార్యమే ప్రతిపాదింపబడుతున్నది కనుక కార్యాన్వితములైన పదములు మాత్రమే తమ తమ అర్థాలను బోధించడానికి శక్తిని కల్గి ఉన్నాయి. తనకు ఇష్టమైన దానిని సాధించుకోవాలనే బుద్ధి మాత్రము కార్యబుద్ధి ద్వారానే ప్రవృత్తికి / పూనుకోవడానికి కారణము ఔతున్నది. స్వరూపముతో కాదు. గడచిపోయిన, రాబోయే ప్రస్తుతమున్నటువంటి ఇష్టోపాయబుద్ధుల యందు అన్నిసార్లు ప్రవృత్తి కనిపించడము లేదు. ఇష్టోపాయమనగా నా ప్రయత్నము లేకుండా ఈ పని జరుగదు. అందువల్ల ఇది నా కృతి వల్లనే సాధ్యమౌతుంది అనే బుద్ధి ఎంతవరకు కలుగదో అంతవరకు తాను తలచిన పనిని నెరవేర్చుకోవడానికి పూనుకోడు. అందువలన కార్యబుద్ధియే కర్తయొక్క ప్రవృత్తికి కారణమౌతున్నది. కాబట్టి ప్రవర్తకుడు బయలుదేరి గామానయ, గాంబధాన అని ఆదేశాలిచ్చి పనిచేయించుకుంటాడు. అలాగే వేదము చేత కార్యబుద్ధితో ఆదేశాలు ఇవ్వవలసి యుంటుంది. లేదా తెలుపబడవలసి యుంటుంది. వేదము వలన బ్రహ్మ విచారము చేయాలి. అందువల్ల ఏదో గొప్ప ఫలము లభిస్తుంది అనే ఆ పాతప్రతీతి కలుగడం లేదు. సరికదా! **అక్షయ్యం హవై చాతుర్మాస్యయాజినః సుకృతంభవతి** చాతుర్మాస్యయాగము వ్రతము చేసిన వాడికి అక్షయమైన పుణ్యము లభిస్తున్నది.

ఇత్యాది వాక్యాల చేత కర్మలకే స్థిరఫలములు కల్గుతున్నట్లు ప్రతిపాదిస్తున్నందువల్ల, కర్మఫలాలు అల్పాస్థిరములని, బ్రహ్మజ్ఞానం వల్ల కలిగే ఫలాలు అనల్పాలు, అనన్తము అని చెప్పే వాక్యాలు లేనందున బ్రహ్మ విచారము చేయనవసరము లేదు.

దీనికి సమాధానము ఇది – లోకంలో అందరికీ తెల్సిన శబ్దార్థాల సంబంధము ఇట్టిది ఇలాగా అని ఉండగా ప్రసిద్ధమైన దాన్ని ప్రక్కకు నెట్టి అన్ని శబ్దాలకున్నూ లోకంలో లేని, అలౌకికమైన ఒకే అర్థాన్ని బోధించే పద్ధతిని నిశ్చయించడం ప్రామాణికులు ఎవ్వరూ మెచ్చరు. లోకంలో చిన్నపిల్లలు ఈవిధంగా శబ్దార్థ సంబంధాన్ని తెల్సుకుంటున్నారు. పిల్లల తల్లిదండ్రులు, ఇంకా పెద్దలు, ఆ పిల్లలకు తండ్రి మేనమామ మొదలైనవారిని, చందమామ పశువులు, మనుష్యులు, జంతువులు, పిట్టలు, పాములు మున్నగు వాటిని చూపుతూ వీడు ఫలానా, ఇది ఫలానా దీన్ని తెల్సుకో వీడిని గుర్తుపట్టు అంటూ తమ వ్రేళ్ళతో చూపి చూపి మాటిమాటికి చెప్పి పలికించి వారికి ఆయాపదాలకు, వాటి అర్థాలైన వ్యక్తులతో వస్తువులతో ఉన్న సంబంధాన్ని అర్థం చేయించుతారు. అలా శిక్షింపబడిన పిల్లవాండ్లు మెల్లమెల్లగా ఆయా శబ్దాలను ఆయా అర్థాల విషయంలో ప్రయోగిస్తూ వస్తారు. అలా శబ్దార్థాలకు ఉన్న సంబంధాన్ని గ్రహించి, తనలాగే ఆయా వస్తువులయందు ఆయా పదాలను ప్రయోగించే పెద్దలను గమనించుతూ వారిచే సరిదిద్దబడుతూ "**ఆయాశబ్దాలు ఆయావస్తువులను బోధిస్తాయి**" అని నిశ్చయించుకుంటున్నారు. మళ్ళీ వ్యుత్పన్నేతర శబ్దాలగురించి – కార్యాన్వయము లేకుండా సిద్ధవస్తుప్రతిపాదకాలైన పదాల గురించి – ఈ శబ్దానికి ఇది అర్థము అని తల్లిదండ్రులు, గురువులు మొదలైనవాటిద్వారా అడిగి తెల్సుకొని, లేదా వారిచేత బోధింపబడి పదాలన్నింటికీ అర్థాలను తెల్సుకొని ఇతరులకు తెలుపడం కొరకు ఆయా అర్థాలను తెలిపే వాక్యపద సముదాయాన్ని ప్రయోగిస్తున్నారు.

మరొక తీరుగ కూడా శబ్దార్థ సంబంధాన్ని నిశ్చయించుకోవడము సులభమే. ఒకానొక వ్యక్తి తనచేతి సైగలతో "**మీనాయన గారు సుఖంగా ఉన్నారు**" అని దేవదత్తుడికి తెలుపు అని ఒక మనిషిని పంపించినాడు. దీన్ని చూచినటువంటి వాడు దాని అర్థమేమిటో తెల్సుకొందామని అతని వెంట బయలుదేరి వెళ్ళినాడు. అచ్చట దేవదత్తునికి తాను తెచ్చిన సందేశాన్ని వినిపించినాడు. మూగివానివలె చేష్టావిశేషాలను తెల్సిన ఇతను ఆ చేష్టలకు ఈ శబ్దాలు సమానార్థాలు అని నిశ్చయించుకున్నాడు. కాబట్టి కార్యార్థము వల్లనే శబ్దార్థ వ్యుత్పత్తి కలుగుతుందని నిర్బంధమేమీ లేదు. కనుక

వేదాన్త వాక్యాలు ముందే సిద్ధమైయున్న పరంబ్రహ్మను గురించి, ఆయన గురించి చేసిన ఉపాసనకు ఫలము కూడా అపరిమితమని బోధించడానికి తగిన సామర్థ్యాన్ని కల్గియున్నవి. అందుకని ఆ విషయాన్ని నిర్ణయించే బ్రహ్మ విచారము చేయవలసిందే.

ఇక శబ్దాలన్నీ కూడా కార్యార్థములే ఐనప్పటికీ వేదవాక్యాలను గురించి కూడా బ్రహ్మ విచారము చేయవలసిందే. ఎలాగా అంటావా? విను. **ఆత్మావా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యః మన్తవ్యః నిదిధ్యాసితవ్యః** ఓరీ! ఆత్మను దర్శించాలి. అందుకుగాను ఆయనను గురించి, స్వరూపస్వభావాలను, కళ్యాణగుణాలను గురించి తెల్సిన పెద్దల వలన వినాలి. విన్నవాటిని న్యాయాలకనుగుణంగా ఇది సబబే అంటూ నిర్ణయించుకోవాలి. అటుపిమ్మట వాటిని మనస్సులో బాగా ధ్యానము చేసుకోవాలి. 2) **సోఽ న్వేష్టవ్యః సవిజిజ్ఞాసితవ్యః** ఆ పరమాత్మను గురించి ప్రపంచ మంతటా వెదుకులాడాలి. ఆయన ఒక్కడు మాత్రమే లోతుగా తెల్సుకోదగినవాడు. ఆయన గురించిన జ్ఞానాన్నే సంపాదించుకోవాలి. 3) **విజ్ఞాయ ప్రజ్ఞాంకుర్వీత** తెల్సుకుని ఇంద్రియనిగ్రహ సామర్థ్యంతో మనస్సు నిలిపి ఉపాసన చేయాలి. 4) **దహరోఽ స్మిన్నన్తర ఆకాశః తస్మిన్ యదన్తః దతన్వేష్టవ్యః తద్వావ విజిజ్ఞాసితవ్యమ్**. ఈ హృదయము మధ్యలో నున్న ఆకాశము దహరమని పిలువబడుతున్నది. దానిలోపల ఏది ఉన్నదో దానిని అన్వేషించాలి. అది మాత్రమే ప్రత్యేకంగా తెల్సుకోదగినదై యున్నది. 5) **తత్రాపిదహ్రంగగనం విశోకః తస్మిన్ యదన్తః తుదుపాసితవ్యమ్**. ఆ హృదయములోనూ ఉన్న ఆకాశము దహ్రము అనే పేరు గల్గినట్టిది. అది ఎలాంటి శోకాలు లేనిది. దానిలోనూ ఏదియున్నదో దానిని ఉపాసించాలి. ఇత్యాది వాక్యాల చేత తెలియవచ్చిన ఉపాసనకు సంబంధించిన కార్యానికి అధికృత ఫలమైనందున, **బ్రహ్మవిదాప్నోతి పరమ్** బ్రహ్మను గురించి తెల్సి ఉపాసించినవాడు పరమమైన మోక్షఫలాన్ని పొందుతాడు ఇత్యాది వాక్యాలచేత పరబ్రహ్మను పొందడమనే ఫలము వినిపిస్తూనే ఉన్నది. కనుక బ్రహ్మస్వరూపము ఆయనకు విశేషణములైన కళ్యాణగుణాలు దుఃఖపువాసనయే లేని దేశవిశేషరూపమైన స్వర్గాదులవలెను, **ఇది ఒక యాగము రాత్రివేళలో చేయబడుతుంది. దీనివల్ల కర్తకు లోకములో మంచిపేరు వస్తుంది. ప్రతితిష్ఠన్తి హవా ఏతేయఏతారాత్రీరుపయన్తి. ఇది శ్రుతి. బ్రాహ్మణునికి ఎవడు అపకారము చేస్తాడో అటువంటి వాడికి నూరు కొరడాదెబ్బలు శిక్ష పడుతుంది. తస్మాద్ బ్రాహ్మణాయ నాపగురీత. యోఽ పగురుతే తంశతేన యాతయేత్. దీనికి సంబంధించిన శ్రుతి ఇది. ఒకదానితో విధి ఒకదానితో నిషేధము చెప్పబడుతున్నాయి.**

**రాత్రి సత్రప్రతిష్ఠ వలెను అపగోరణ శతయాతనా సాధ్యసాధన** భావము వలెనూ **"కార్యోపయోగిత వలన"** బ్రహ్మ విచారము చేయతగినది అని సిద్ధించుతున్నది.

గామానయ ఇత్యాది వాక్యాల యందు కార్యార్థము నందే వ్యుత్పత్తి కలుగడం లేదు. అచట నీవనుకున్నటు వంటి కార్యము నిరూపించడానికి సాధ్యము కాదు. **కృతి భావభావి కృత్యుద్దేశ్యం. కదా నీ దృష్టిలో కార్యము.** మానసిక ప్రయత్నము కృతి అనబడుతుంది. కృతి భావము వల్ల జరిగేది కృతిభావభావి. అనగా ఈ పనిని చేయాలని మనస్సులో తలచుకొని బాహిరంగా శరీరంతో ఆ పనిని చేయడము. కృతిభావభావి. అలాంటి కృత్యుద్దేశ్యమే కార్యము. అనగా తన ప్రయత్నము చేత ఒక ఫలితాన్ని సాధించుకోవాలి. పొందాలి అని అనుకోవడమే కృత్యుద్దేశ్యము. ఇదే నీ దృష్టిలో కార్యము. కృత్యుద్దేశ్యము అంటే కృతి కర్మత్వము. కృతికర్మత్వము అంటే తన ప్రయత్నము వల్ల ఫలాన్ని పొందడానికి ఇష్టమును కల్గి ఉండడము. **ఇష్టమైనది ఏది?** అంటే సుఖాన్ని పొందడము. లేదా ప్రస్తుతమున్న లేదా అనుభవిస్తున్న దుఃఖము తొలగిపోవడము. మానవుడు తనకు ఇష్టమైనదాన్ని తన ప్రయత్నము లేకుండా పొందలేనని తెల్సుకొన్నపుడు ఆ ఫలాన్ని పొందడానికి ప్రయత్నం చేయతలచి అందుకు పూనుకుంటాడు. కావున తన ఇచ్ఛాధీనమైన విషయము తన కృతికి అధీనమైన సిద్ధి **కృత్యధీనసిద్ధి** ఐయ్యే ఉంటుంటుంది అది లేకుండా కృత్యుద్దేశ్యత్వము అంటూ లభించదు. ఒక యజమాని తాను పొందదల్చుకున్న దాని కొరకై భృత్యుడిని నియోగిస్తున్నాడు. అతడు సాక్షాత్తు కర్తకాడు. సేవకుడు సాక్షాత్తు కర్త. యజమాని ప్రేరకుడు. అతని కొరకు బంటు పని చేస్తున్నాడు. వాడికి కృత్యుద్దేశ్యము అనగా ఈ పని వల్ల నేను ఈ ప్రయోజనాన్ని పొందాలి అనే ఉద్దేశ్యము లేదు కదా అనవచ్చును. ఐతే ఇచ్ఛావిషయమైన ఫలాన్ని పొందడానికి ప్రేరకత్వము కూడా ప్రయత్న అధీనసిద్ధియే. ప్రయత్నం లేకుండా ఏ పనీ నెరవేరదు. నేను యజమానికి ఈ పనిని చేసి పెట్టి సంతోషపరచాలి అనుకొనే సేవకుడు కూడా ప్రయత్నము చేస్తున్నాడు కదా! ఏ ప్రయత్నము, ఎవ్వరి ప్రయత్నమూ లేకుండా ఏ ప్రయోజనమూ నెరవేరదు కదా! ప్రేరణ కూడా ఒక ప్రయత్నమే ఔతుంది. గమనించాలి. ఐతే కృత్యుద్దేశ్యత్వము అంటే పురుషుడికి అనుకూలమై ఉండాలి. అనుకూలము కానపుడు కృత్యుద్దేశ్యత్వము లేదు అని అనగూడదు. సుఖమే పురుషానుకూలము. కనుక దుఃఖనివృత్తి పురుషానుకూలము కాదు. ఎందుకంటే పురుషునికి అనుకూలమైనదే సుఖము. పురుషుడికి ప్రతికూలమైనది దుఃఖము అని కదా ఆ

రెండింటియొక్క స్వరూపము నిర్ణయించబడింది. దుఃఖము పురుషుడికి ఎందుకు ఇష్టమవుతున్నదంటే అనుకూలమైనందువల్ల కాదు. అది ప్రతికూలమైనది కాబట్టి దాన్ని తొలగించుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. అనుకూల ప్రతికూలములు రెండింటిలో సంబంధము లేకుండా ఉండడమే తనదైన స్వరూపంతో ఉండడమవుతున్నది. అదే దుఃఖనివృత్తి. కనుక సుఖము కంటే వ్యతిరేకమైన క్రియాదులు అంటే తాను పనిచేయడం కానీ ఇతరుని ఆజ్ఞ మేరకు తప్పనిసరియై పనిచేయడమైనా అనుకూలములు కావు. ప్రయత్నము కూడా తరువాత ఎప్పుడో పొందబోయే సుఖందృష్ట్యా ఇప్పుడు కష్టపడడం అనేది పురుషుడికి అనుకూలముకాబోదు. ప్రయత్నం కూడా దుఃఖాత్మకమే కదా! ఈ యాగం చేస్తే మరణానంతరము నాకు సుఖము కలుగుతుంది. స్వర్గంలో అనే ఉద్దేశ్యంతోనే కష్టపడి యాగం చేస్తున్నాడు తప్ప యాగము పురుషానుకూలం కాదు. అందుకు ఇచ్ఛ మాత్రమే కలుగుతుంది.

కృతికి సంబంధించి శేషిత్వమే కృత్యుద్దేశ్యత్వము అని కూడా భావించవద్దు. నీ పక్షంలో శేషిత్వము అంటే నిర్దిష్టంగా నిరూపణ చేయబడలేదు. పరోద్దేశ్య ప్రవృత్త కృతి వ్యాప్త్యర్హత్వం శేషత్వం. తనకంటే వేరైన యజమానియొక్క ఉద్దేశ్యానికి తగినట్లు పనికి పూనుకొని అందులో పాలుపంచుకోవడానికి తగిన అర్హతను కల్గి ఉండడమే శేషుని/సేవకుని యొక్క లక్షణము/ధర్మము. దాని ప్రతిసంబంధియే శేషిత్వము అని చెప్పబోకు. (**పరుడి యొక్క ఉద్దేశ్యాన్ని అనుసరించి ప్రవృత్తుడై పూనుకొని కృతిలో పాలు పంచుకోవడానికి యోగ్యతను కల్గి ఉండడం శేషత్వము. వాడికి ఆవలి పక్షమందుండి వాడు చేసిన – శేషుడు చేసిన – పనియొక్క ఫలాన్ని పొందడమనే సంబంధాన్ని కల్గిఉండడమే – ప్రతిసంబంధిత్వమే శేషిత్వము**) అట్లాగైనపుడు కృతి – ప్రయత్నమనేది ఆత్మాశ్రయము – ప్రయోజక కర్తయందు లేదు కాబట్టి సాధ్యంతో శేషిత్వము లేకుండా పోవును కదా! కాదండీ! శేషత్వమంటే పరోద్దేశ్య ప్రవృత్త అర్హతయే. శేషత్వము. వాడికంటే వేరయినవాడు / యజమాని శేషీ అని కూడా చెప్పవద్దు. అక్కడ ఉద్దేశ్యం మాత్రమే నిరూపింపబడుతున్నది. ప్రధానుడికి కూడా భృత్యుని యొక్క ఉద్దేశ్య ప్రవృత్తి అర్హత్వము కనబడ్తున్నది. భృత్యుడు ఒకప్పుడు యజమాని మాట వినకపోవచ్చును. పనిచేయకపోవచ్చును. అపుడు ప్రధానుడు తన ప్రయత్నాన్ని మానుకోవచ్చును. బంటుకు అనుకూలంగా వాని ఉద్దేశ్యానికి తగినట్లుగా నడచుకోవచ్చు. వాడు చేయగల్గే పనిని మాత్రమే చెప్పవచ్చును. వానికి అనుకూలతను కూర్చవచ్చును. ప్రధానుడు

కూడా భృత్యుడిని పోషించేపనిలోనూ తన ఇష్టానికి తగినట్లుగా వాడిని కష్టపెట్టకుండా నడచుకుంటాడని అనకూడదు. ఐనపుడు భృత్యుడు కూడా తన ప్రధానుడిని యజమానిని పోషించడానికే సంతోషపరచడానికే ప్రయత్నము చేస్తూ ఉంటాడు కదా! ఈ విధంగా కార్యస్వరూపాన్నే నిరూపించలేకపోయారు గనుక "**కార్యప్రతిసంబంధి శేషుడు**", "**వాడికి ప్రతిసంబంధి శేషి**", అని చెప్పడం కూడా అసంగతము అని కూడా పలుకవద్దు. కృతి ప్రయోజనమంటే తాను ఒక పనిని చేయడానికి / మొదలుపెట్టడానికి ప్రయోజనము ఏదో అదే గదా కృతిప్రయోజనము. అది ఇచ్ఛకు సంబంధించి యుంటుంది. అందుచేత ఇష్టానికి వ్యతిరేకంగా / భిన్నంగా / వేరుగా కృత్యుద్దేశ్యాన్ని నిరూపించ లేకపోయినందున కృతి సాధ్యతా కృతిప్రధానత్వ రూపమైన కార్యము నిరూపింపబడేది కాదు. (**కృతి చేతనే సాధింపబడేదై, కృతియే ప్రయత్నమే ప్రధానమైన / ముఖ్యమైన కార్యము అనబడేది**)

ఇక నియోగము – ఒకని చేత ఆదేశింపబడి పనిచేయడము – అనేది నేరుగా తన ఇచ్ఛకు విషయమైన సుఖము, లేదా దుఃఖము తొలగిపోవుట అనే రెండింటికీ భిన్నమైనది కాబట్టి వాటిని సాధించడానికి సాధనము ఉపకరణమైనందువల్ల ఇష్టముఐ ఉండడము, ప్రయత్నము చేత సాధ్యమైయుండడము నియోగము అనబడుతున్నది. లేకపోతే "**క్రియనే కార్యము" కావలసి వస్తుంది.** జ్యోతిష్టోమేన స్వర్గకామోయజేత అనే వాక్యంలో స్వర్గకామపదము చేత వ్యవహరింపబడిన దానికి తగినట్లుగా "**యజేత**" అను క్రియా పదములో "**త**" అనే విధి లిజ్ ప్రత్యయము మొదలైనవాటి చేత చెప్పబడే అంశము పుణ్యమును సంపాదించుకోవడమనేదే చెప్పబడుతున్నది కాని తక్షణమే స్వర్గాన్నిసాధించుకోవడము కాదు. కావున క్షణములో నశించే కర్మకు వేరుగా స్థిరముగా నిల్చి, దేహత్యాగానంతరము కర్త స్వర్గాన్ని చేరుకోవడానికి అనువైన అపూర్వమనే దాన్ని సంపాందించుకోవడమనేదే చెప్పబడుతున్నది. కాబట్టి స్వర్గసాధనముగా చెప్పబడిన అపూర్వాన్ని ఉత్పత్తి చేసుకోవడమే క్రియాఫలము ఔతున్నది. ఐతే ఇక్కడ మొదట స్వర్గ ప్రాప్తియే ప్రధాన ప్రయోజనమని తెల్యవచ్చిన యాగకర్మ, దాని అనన్యార్థత్వాన్ని నిర్వహించడం కొరకు వచ్చిన అపూర్వములలో మొదటిదాన్ని యాగాన్ని కాదని అపూర్వమే స్వర్గసాధనమవుతున్నదని చెప్పడము మీ సన్నిహితులు కూడా మిమ్ములను చూచి నవ్వుకునే విధంగా ఉన్నది. ఎందుకంటే స్వర్గకామపదంతో అన్వయించే కార్యాన్ని తెలియచేసే యజేత అనే పదంతో మొదట కూడా అనన్యార్థాన్ని చెప్పడం

లేదు కనుక. సుఖము, దుఃఖము తొలగిపోవుట వాటిని సాధించే / కలిగించే సాధనాని కంటేనూ మరొకటియైన అనన్యార్థము కృతి చేత సాధింపబడవలసినదిగా ప్రతీతి కలుగడం లేదు. అంటే యజ్ఞం చెయ్యి. స్వర్గం కలుగుతుంది అని మాత్రమే చెపుతున్నది కాని యజ్ఞము చేస్తే పుణ్యము కలుగుతుంది. అది నీ మరణకాలం వరకు ఉండదు. అందుకని అపూర్వాన్ని సృష్టిస్తుంది. అపూర్వము నిన్ను స్వర్గంలో ప్రవేశపెడుతుంది. అంటూ యాగానికి అప్రాధాన్యాన్ని అపూర్వానికి ప్రాముఖ్యతను చెప్పడం లేదు. అలా ప్రతీతి కలుగుతుంది అని చెప్పినా దానికి ప్రమాణం లేదు. కనుక అది పొసగదు.

మరియు నియోగానికి ప్రయోజనత్వము అంటే ఏమిటి? అనే ప్రశ్నకు సుఖములాగానే నియోగము కూడా అనుకూలత్వమే. అనేట్లయితే? నియోగము సుఖము అవుతుందా? సుఖము అంటే అనుకూలము కదా! అనే సందేహానికి సుఖవిశేషములాగానే నియోగమనే పర్యాయపదంతో చెప్పబడే విలక్షణమైన సుఖాన్తరం మరొక సుఖము అని బదులు చెపుతున్నారా! ఐతే అలా చెప్పడానికి తగిన ప్రమాణమేదో చెప్పండి! ప్రత్యక్షాదులు కాదు. స్వానుభవమే ప్రమాణము అని గొంతెత్తి పలుకడం తగదు. ఏదో ఒక విశేష విషయాన్ని వస్తువును అనుభవించినపుడు కలిగే సుఖంలాగా, – మల్లెపూల వాసన, ఇది కలువపూల వాసన, ఇది సంపెంగ వాసన అని వింగడించి చెప్పినట్లు "**నియోగానుభవసుఖము ఇది**" అని నీవు కూడా చెప్పలేవు. అనుభవమూ కలుగదు. లేదండీ! నియోగము అనేది పురుషార్థమని శాస్త్రము ప్రతిపాదిస్తున్నది. ఆ నియోగాన్ని పాటించిన తరువాత నియోగ సుఖము అనుభవింపబడుతుంది? అని అంటున్నారా! ఐతే అలా! నియోగం కూడా పురుషార్థమే సుమా అవి చెప్పే శాస్త్రము ఏది? లౌకికుల వాక్యము కాదు. అది కష్టాలతో కూడిన పనులనే చెప్తుంది. అంతేకాదు. సుఖాలకు కారణము, సాధనము ఔతున్నందువల్ల ప్రయత్నము చేస్తేనే సుఖానుభవము కల్గుతుందని చెపుతూ ఉన్నది కూడా. ఇక వైదిక వాక్యమా! అంటే అది కూడా సుఖము అనుకూలము కాదు. అది కూడా స్వర్గాదులకు సాధనంగానే యాగాది కార్యాలను ఆచరించు అని ప్రతిపాదిస్తున్నది. పోనీ నిత్యనైమిత్తికాది క్రియలను ఆచరించు అని చెప్పే శాస్త్రమా! అది కూడా స్వర్గకామవాక్యంలోనున్న అపూర్వమును ఉత్పత్తి చేసుకో అని ఇంతకుముందు చెప్పుకున్నట్లు సుఖాదులకు సాధనాలైన కార్యాలను ఆచరించు అనే చెపుతుండడము స్పష్టమవుతూనే ఉన్నది. **"నియోగము సుఖము"** అనే విషయంలో ఎలాంటి ప్రమాణమూ దొరకడం లేదు. ఐతే ఇది ఒక్కటే కనిపిస్తున్నది.

ఐహిక ఫలము తప్పక లభించడము అనుబంధముగా కలిగి ఆచరించబడిన కర్మకు ఫలంగా అప్పటికప్పుడు భుజించబడిన అన్నాదులకు భిన్నంగా నియోగానికి ఫలితము సుఖరూపమైనది ఏదీ లేదు. నియోగము రూపంలో ఉండే సుఖానుభవము కూడా ఎక్కడా లభించడం లేదు. అందువలన నియోగము సుఖము కాదు. ఆయా కర్మలయొక్క గొప్పతనాన్ని పొగిడే అర్థవాదాదులలో కూడా స్వర్గాదుల వల్ల సుఖం కలుగుతుంది అని చెప్పినట్లు నియోగ రూపసుఖము యొక్క శ్రేష్ఠతను వివరించే శ్రుతి వాక్యము ఒక్కటైనా మాకే కాదు మీకున్నూ కనిపించని విషయము వాస్తవం కాదా!

అందువలన విధి వాక్యాల యందు – ఆయా కర్మలను చేయండి. మీ కోరికలు నెరవేరుతవి అని చెప్పేవి. జ్యోతిష్టోమేన స్వర్గకామోయజేత ఇత్యాదులు – క్రియా పదంలోని ధాతువు యొక్క అర్థము మాత్రము కర్త యొక్క ప్రయత్నం చేత సాధింపబడుతుంది అనే విషయము వ్యాకరణ శాస్త్రం వల్ల సిద్ధమౌతున్నది. అది లిఙ్ మొదలైన వాటిచే చెప్పబడ్తున్నది అని నిశ్చయింపబడింది. ధాత్వర్థము యాగాది క్రియల యందు అగ్ని మొదలైన దేవతలకు అన్తర్యామిగా నున్న పరమ పురుషుడిని చక్కగా భక్తి శ్రద్ధలతో ఆరాధించే రూపము. అలాగా ప్రేమతో ఆరాధింపబడిన పురుషోత్తముడి అనుగ్రహము వల్లనే ఫలము లభిస్తుంది అని **ఫలమతః ఉపపత్తేః** అనే సూత్రము వద్ద ప్రతిపాదింపబడ్తుంది. కావున వేదాన్త వాక్యాలు పరినిష్పన్నమైన ఎవ్వరిక్రియవల్ల గానీ ఎవ్వరివల్ల గానీ కాకుండా అనాదికాలమునుండి ఉత్పత్తి చెందని పరబ్రహ్మను బోధిస్తున్నాయి. ఎరుకపరుస్తున్నాయి. కనుక బ్రహ్మను ఉపాసించిన వారికి కలుగబోయే "బ్రహ్మానందరూప మోక్ష పురుషార్థఫలము అనన్తము స్థిరము" అని సిద్ధించాలి.

ఇక చాతుర్మాస్యాది కర్మలలో కూడా ఫలమును కోరకుండాను, ఫలాన్ని పుండరీకాక్షుడికి అర్పించకుండాను వట్టిగా చేసే కామ్యాదికర్మలన్నింటికి కలిగే ఫలితాలు నశించేవి గానే **యథాక్రతురస్మిన్ లోకే పురుషో భవతి తథేతః ప్రేత్యభవతి. తద్యథేహ కర్మచితో లోకః క్షీయతే. అన్తవదేవాస్యభవతి.** ఇత్యాదుల వల్ల తెలుస్తున్నందున, ఎక్కడైనా అక్షయ ఫలత్వము వినిపించినా **వాయు శ్చాన్తరిక్షంచ ఏతదమృతమ్** ఇత్యాదివాక్యాలలో చెప్పబడిన వాటికి వలెనే ఇతరములైన వాటికంటే అధికఫలాలనిస్తాయి అనే విషయాన్ని **ఇతర కర్మాపేక్షయా** – గమనించాల్సి యుంటుంది. అందువల్ల కేవలములైన – వట్టి కర్మలకు అల్పములు అస్థిరములైన

ఫలితాలు దక్కుతాయి, పరబ్రహ్మను గురించి తెల్సుకొని ఉపాసించిన భక్తి రూపాపన్నమైన జ్ఞానానికి అనన్తమైన స్థిరఫలము లభిస్తున్నదని తెలుస్తున్నందున, ఆ విధమైన నిర్ణయము చేయడంకొరకు బ్రహ్మ విచారము చేయడానికి పూనుకోవడము చాలా యోగ్యమైన కార్యము. **జిజ్ఞా సాధికరణము ముగిసినది**

★ ★ ★

## జన్మాద్యధికరణము

**జన్మాద్యస్య యతః 1-1-02:** మొదటి సూత్రములో బ్రహ్మను గురించి విచారము చేయవలసినది అని నిశ్చయము చేయబడింది. ఐతే ఆ బ్రహ్మ ఎలాంటి వాడు? ఎవరు? అనే ప్రశ్నముందుకు రాగా రెండవసూత్రముతో సమాధానము చెప్పబడుతున్నది. అస్య = ఈజగత్తునకు జన్మ + ఆది జన్మపుట్టుక, స్థితి = రక్షింపడి నిల్చియుండుట, లయము, చిట్టచివరకు కారణమైన దానిలో కలసిపోవుట మరియు సంసార చక్రమునుండి విడివడి మోక్షానందమును పొందుటయతః = ఎవనివల్లనైతే జరుగుతున్నదో అతడు బ్రహ్మ అని యర్థము.

జన్మాదీతి – సృష్టిస్థితి ప్రళయములు. ఈ పదము తద్ గుణ సంవిజ్ఞాన బహువ్రీహికి చెందినది. అస్య – ఊహించుటకు వీలు కాని వివిధములు వింత వింతలు ఐన రూపాలు కలిగిన దేశము కాలము ఫలములు వాని భోగాలు ఎవనికి వాడే వేరువేరుగా కల్గియున్న బ్రహ్మ మొదలుకొని గడ్డి పరక వరకు ఉన్న పలురకాలుగా ఉన్న క్షేత్రజ్ఞులతో కలగలసియున్న జగత్తునకు అని అర్థము. యతః – తనకు వ్యతిరేకంగా సమస్త చరాచర జీవరాశికంతటికీ ఈశ్వరుడై శాసకుడై స్వల్పకాలికములై ప్రకృతి సంబంధము కల్గి కోరదగనివి ఐన గుణాలు కామాలు అన్నింటికిన్నీ పూర్తి విరోధియైనటువంటి కర్మసంబంధము లేనటువంటి స్వరూపముకల, తలచినంతనే అప్రతిహతంగా కార్యాలన్నీ సిద్ధించేటువంటి, జ్ఞానము, ఆనందము వంటి అనంతములైన కళ్యాణగుణాలు కలిగిన, అన్నీ తెల్సినవాడైన అఘటన ఘటనా సామర్థ్యము కల్గి సర్వశక్తియైన, అంతమాత్రాన దయలేనివాడు కాక పరమకారుణికుడైన పరమపురుషుడినుండి సృష్టిస్థితిలయాలు ఏ పురుషోత్తముడి వలన జరుగుతున్నవో అతడు బ్రహ్మ అని సూత్రము యొక్క అర్థము.

**భృగుర్వై వారుణిః వరుణం పితరము పససార. అధీహిభగవో బ్రహ్మేతి.** వరుణుడు అను మహర్షి పుత్రుడు భృగువు. అతడు తన తండ్రి వద్దకు పోయి ఇలా

అన్నాడు. ఓ భగవానుడా! నాకు బ్రహ్మను గురించి తెలియచేయండి అని అన్నాడు. **అని ఆరంభించి** యతో **వాఇమానిభూతాని జాయన్తే. యేన జాతానిజీవన్తి. యత్ ప్రయన్త్యభి సంవిశన్తి. తద్విజిజ్ఞాస్వ. తద్ బ్రహ్మ.** ఎవనినుండైతే ఈ భూతాలు (ప్రాణులు) పుడుతున్నవో, ఎవ్వనివలన పుట్టినవన్నీ సుఖంగా బ్రతుకుతున్నవో, ఎవని నివాస స్థానమైన పరమపదము కొరకు ప్రయత్నించి ఆస్థానము లోకి ప్రవేశిస్తున్నారో, ప్రళయకాలము నందు ఎవని యందు నామరూపరహితులై కలిసిపోతున్నారో అతడిని బ్రహ్మ అని తెల్సుకో! అని తైత్తిరీయోపనిషత్తులో వినిపిస్తున్నది. ఆ వాక్యములో బ్రహ్మశబ్దము నందు అనుమానము కలుగుతున్నది. ఏమని? ఈ వాక్యము ద్వారా తెలియవచ్చే లక్షణాల నాధారంగా చేసుకొని బ్రహ్మను గుర్తించడము సాధ్యమౌతుందా? కాదా? అని. ఏమి తేలుతున్నది? అనగా, వీలు కాదు. గుర్తించలేము అనియే. అది ఇలాగా! ఇందులో చెప్పబడిన జన్మాది లక్షణాలు బ్రహ్మకు విశేషణాలు అవుతున్నాయి. ఈ వాక్యంలో విశేషణాలు చాలా ఉన్నాయి. విశేష్యం ఒక్కటే ఉన్నది. ఐనా విశేషణము ఒక్కొక్కటి విశేష్యాన్ని వేరువేరు చేస్తుంది. కనుక ప్రతిఒక్క విశేషణాన్ని బట్టి విశేష్యాలు విడిపోవాల్సి వస్తుంది. విశేషణము తాను విశేష్యము ఉంటూ ఆ వస్తువును ఇతర వస్తువుల నుండి వేరు చేస్తుంది. కనుక బ్రహ్మలు అనేకులు కావాల్సి వస్తుంది. ఏమండీ! **దేవదత్తః శ్యామోయువా లోహితాక్షః సమపరిమాణః** దేవదత్తుడు నల్లనివాడు. యువకుడు. ఎర్రనికండ్లు కలవాడు. సమమైన అవయవముల పొందిక కలవాడు అనే వాక్యములో విశేషణాలు చాలాఉన్నప్పటికీ దేవదత్తుడు ఒక్కడే తెలియవస్తున్నాడు. పలువురి గురించి ఆ వాక్యంతో తెలియరావడం లేదు. అలాగే ఈ వైదిక వాక్యంలోనూ విశేషణాలు చాలా ఉన్నా అవన్నీ ఉన్న బ్రహ్మ ఒక్కడేనని ఎందుకు భావించకూడదు? అని ప్రశ్నించవచ్చును. అది సరి కాదు. అక్కడ విశేషణాలు చాలగా ఉన్నా మరొక ప్రమాణము చేత విశేషణాలు ఎన్ని ఉన్నా విశేష్యమైన దేవదత్తుడు ఒక్కడే అని తెలియవస్తున్నది. ప్రత్యక్షాది ప్రమాణాలలో శబ్దము ఒక్కటే భగవంతుడిని తెల్పుతున్నది. మరొక ప్రమాణము ఆయన విషయంలో కనుపించడం లేదు. లోకంలోనైతే శబ్దముతో చెప్పిన విషయాన్ని ప్రత్యక్షము – కండ్లతో చూచుట – అనే ప్రమాణము బలపరుస్తున్నది. అలా కాని తీరుకు లోకములోనూ విశేషణాలకుండే వ్యావర్తకత్వము వల్ల దేవదత్తుడు ఒక్కడు కాకుండా పలువురు దేవదత్తులు తెలియబడే వాళ్ళేసుమా! ఇచ్చటనైతే నేమో ఈ విశేషణాల ద్వారానే గుర్తించవలసి యున్నందున

మరొక్క ప్రమాణము చేత బ్రహ్మ ఒక్కడే అనే ఐక్యము తెల్యరావడం లేదు కనుక వ్యావర్తక భేదాలను బట్టి బ్రహ్మ ఒక్కడుకాక పలువురు కాక తప్పటం లేదు. వాక్యంలో బ్రహ్మ అనే పదము ద్వారా ఐక్యము ఒక్కడే అని తెలుస్తున్నది కదా! అని అనవచ్చును. ఒక ఉదాహరణ చెపుతాను విను. గోవు అంటే తెలియక తెల్సుకోవాలని కోరుకుంటున్న ఒక వ్యక్తికి **విరిగిన కొమ్ములు గలది, బోడిది, నిండైన కొమ్ములున్నట్టిది ఆవు** అని చెపితే అందులో ఆవు అనే పదము ఒక్కటే ఐనా ఖండః ముండః పూర్ణశృంగః వంటి వ్యావర్తక విశేషణాల భేదాలను బట్టి ఆవులు అనేకాలు – చాలా అని తెలిసినట్లే. ఇక్కడకూడా బ్రహ్మలు చాలామందే ఔతారు. కనుక గుర్తించదలచిన వస్తువు నందు లక్షణాలు, విశేషణాలు అన్నీ ఒక్కటిగాఐ లక్ష్యాన్ని నిరూపించడమనేది కుదరదు.

పోనీ ఉపలక్షణాలతోనైనా బ్రహ్మను గుర్తించవచ్చునా అంటే అదీ కుదరదు. ఆకారాంతరము లేదు కాబట్టి. ఉపలక్షణాలతో లక్ష్యాన్ని గుర్తించాలంటే. ఉప లక్షణము 2) ఉపలక్ష్య ఆకారము 3) పూర్వ ప్రతిపన్నాకారము అనేవి తప్పక ఉండాలి. “ఎక్కడ సారసపక్షి ఉన్నదో దేవదత్తుని పొలము అది” అనుచోట 1) సారసపక్షితో సంబంధము ఉపలక్షణము 2) దేవదత్తుడికి చెందియుండడము ఉపలక్ష్యము 3) పంటపొలముగా నుండడము పూర్వప్రతిపన్న ఆకారము. ఉపలక్షణాలు ఒక ఆకారముతో తొలుత గుర్తించిన దానిని మరొక ఆకారముతో గుర్తు పట్టడానికి అనువుగా ఉంటాయి. “**ఎక్కడ కొంగ ఉన్నదో అది దేవదత్తుని పొలము**” అన్న విధంగా బ్రహ్మను గుర్తించాలి అంటే ఆకారాన్తరము అక్కడ ఉండాలి కదా! అది లేదే. అంటే లేకేమి? “**సత్యం జ్ఞానమనన్తంబ్రహ్మ**” అనే వాక్యముతో తెలియవచ్చిన బ్రహ్మను తెల్సుకోవడానికి జగజ్జన్మాదులు ఉపలక్షణాలు ఔతాయి అని అంటారేమో? నిజమే కాని ఇక్కడ అన్యోన్యాశ్రయదోషము వస్తున్నది. యతోవాఇమాని అనే వాక్యంతో తెలిసే బ్రహ్మను బలపరచుకోవడానికి సత్యం జ్ఞాన మనన్తం బ్రహ్మ అనే వాక్యాన్ని, దీనికి యతోవా ఇమాని అనే వాక్యాన్ని అన్వయము చేసుకోవాల్సి ఉంటుంది. ఇట్లాగా ఇవి రెండు పరస్పరాపేక్ష కల్గియుంటున్నాయి రెండు లక్షణ వాక్యాలు. కావున అన్యోన్యాశ్రయదోషం తప్పనిసరి ఔతున్నది. అందుచేత లక్షణాలద్వారా బ్రహ్మను గుర్తించడము సాధ్యంకాదు అని ఇది పూర్వ పక్షము. ఇలా సిద్ధమైన దానికి సమాధానము చెప్పబడుతున్నది.

ఉపలక్షణాలైన జగత్ సృష్టిస్థితిలయాల ద్వారా బ్రహ్మను గుర్తించడం వీలవుతుంది. సాధారణంగా **ఉపలక్షణ మనేది లక్ష్యంలో ఉండకుండా లక్ష్యానికి**

**వెలుపల ఉండి లక్ష్యాన్ని ఇది ఫలానా అని తెల్పుతుంది. ఇక లక్షణమేమో లక్ష్యంలోనే ఉంటూ ఆ లక్ష్యమైన గుర్తించవలసిన వస్తువును తెల్పుతుంది**. శ్యామో, యువాదేవదత్తః నల్లనివాడు యువకుడు దేవదత్తుడు అనుచోట నల్లదనము, యౌవనము దేవదత్తుని శరీరములో అన్తర్భాగాలై ఉంటూ వీడు దేవదత్తుడు అని తెలుపుతున్నవి. దండీ కుండలీ బ్రహ్మచారీ అన్నచోట దండకుండలాలు విడిగా ఉంటున్నవి కాబట్టి అవి ఉపలక్షణాలు. వీటికి సంస్కృత వాక్యాల్లో నిర్వచనాలివి.

1) **జ్ఞాప్యబహిర్భూతః జ్ఞాప్యప్రతీత్యుపాయః ఉపలక్షణమ్.**

2) **జ్ఞాప్యాన్తర్భూతః జ్ఞాప్యప్రతీత్యుపాయఃవిశేషణమ్** అని కావున ఉపలక్షణ, ఉపలక్ష్య ఆకారాలకంటే మరొక ఆకారాన్తరం లభించడంలేదు కనుక బ్రహ్మను గుర్తించడం కుదరదు అని అనకూడదు. ప్రస్తుత విషయంలో ఉపలక్ష్యమైన వస్తువు అనవధిక అతిశయమైన బృహత్ (పెద్దది). బృంహణము కూడా, అనగా తనను ఆశ్రయించిన వారిని కూడా తనలాగే బృహత్తుగా చేస్తుంది. బృహత్ అనే ధాతువుకు అనవధికాతిశయమైనది అని అర్థము కాబట్టి. దానికి ఉపలక్షణాలు ఐనట్టివి జగత్ జన్మస్థితి లయాలు యతః, యేన, యత్ అనే పదాలతో ప్రసిద్ధమైన వస్తువును ఆప్రసిద్ధికి అనుగుణంగా జగజ్జన్మాది కారణమని తిరిగి చెప్పబడ్తున్నది (అనువాదము) ప్రసిద్ధి ఏదంటే **సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్, ఏకమేవాద్వితీయమ్**. **తదైక్షత బహుస్యాం, ప్రజాయేయేతి**. **తత్తేజోఽ సృజత**. ఓ సోమ్యుడా! సృష్టికి మునుపుకాలములో సత్ అనబడేది మాత్రమే ఉన్నది. రెండవది ఏదీ లేని ఒంటరి అది. ఆసద్వస్తువు నేను పలు రూపాలుగా అవుతాను. పలు రూపాలుగా జన్మిస్తాను అని సంకల్పించింది. ముందుగా తేజస్సును పుట్టించింది – అనే వాక్యంతో సత్ శబ్దంతో చెప్పబడే ఆ ఒక్క వస్తువుకే నిమిత్త కారణము, ఉపాదాన కారణము అనే రెండు ధర్మాలున్నట్లు ప్రసిద్ధి తెలుస్తున్నది. అది కూడా **సదేవేదమగ్రఏకఏవాసీత్** అని ఉపాదానతను ప్రతిపాదించి **అద్వితీయమ్** అనే పదంతో అధిష్ఠాతయైన మరొకటి లేదని నిషేధించి **తదైక్షత బహుస్యాంప్రజాయే యేతి**. **తత్తేజోఽ సృజత** అని ఆ ఒక్కనికే రెండు కారణాలను చెప్పింది. అందుచేత ఎవడిని మూల కారణంగా కలిగి జగజ్జన్మ స్థితిలయలు ఏర్పడ్తున్నవో అది బ్రహ్మ అని, జన్మస్థితిలయలు తమకు నిమిత్తకారణము ఉపాదాన కారణము ఐన వస్తువు బ్రహ్మ అని గుర్తింపచేస్తున్నవి. జగత్తుకు నిమిత్త ఉపాదానతల ద్వారా ఊహింపబడిన సర్వజ్ఞత్వ, సత్యసంకల్పత్వ, విచిత్రశక్తిత్వము మొదలైన

బృహత్వ ఆకారాలతో ప్రతిపన్నమైనది బ్రహ్మ అని కూడా జన్మాదులకు ప్రతిపన్నమైన బ్రహ్మకు లక్షణమైనందున ఆకారాన్తరము లభించడంలేదనే అనుపపత్తి లేనే లేదు. జగజ్జన్మాదులు విశేషణాలు ఐనపుడు కూడా లక్షణత్వములో ఏలాంటి దోషమూ లేదు. లక్షణాలుగా ఉండే విశేషణాలు తమకు విరోధియైన వస్తువులకు దూరమైన/ లేనట్టి వస్తువును గుర్తింపచేస్తాయి. ఇంతకుముందు తెలియని ఒక వస్తువును గుర్తించదలచినపుడున్నూ పరస్పర విదోధము లేని అనేక విశేషణాలను లక్షణాలుగా కల్గియుండడము భేదాన్ని చూపెట్టవు. విశేషణాలు ఒక్కదాన్నే ఆశ్రయించి ఉండడము కనిపిస్తున్నది అట్లే ఒక్క వస్తువునందే జతకూడుతున్నవి కూడాను. ఖండత్వాదులు సహజంగానే మిగతావాటితో వైరుధ్యాన్ని కల్గియున్నందువల్ల గోవ్యక్తిలో భేదాన్ని చూపుతాయి. ఈ బ్రహ్మ విషయంలో జన్మాదులు ఒకే కాలంలో కాకుండా వేరువేరు కాలాల్లో జరుగుతున్నందువల్ల వైరుధ్యమనేది లేదు.

**యతోవా ఇమాని భూతాని జాయన్తే** మొదలైన కారణవాక్యముతో తెలియవచ్చిన జగత్ జన్మాదులకు కారణుడైన బ్రహ్మకు తనకంటే వేరయిన అన్నింటినుండీ వేరు చేసే స్వరూపమును **సత్యం జ్ఞానమనన్తంబ్రహ్మ** అని తెలుపుతున్నది. అందులో **సత్యపదము** నిరుపాధిక సత్తను కలిగిన బ్రహ్మను చెపుతున్నది. దానితో పలురకాలైన వికారాలకు (మార్పులకు) నెలవు ఐన అచేతనాన్ని (ప్రకృతిని) దానితో కలిసియున్న జీవుడినిన్నీ ప్రక్కకు నెట్టేయడమవుతున్నది. ఎందుకంటే ప్రకృతి అనేక మార్పులను పొందుతూ దానితో పాటే చాలా పేర్లనూ పొందుతూ ఒక్క తీరుగా ఉండడము లేదు. అట్లే జీవుడు కూడ అనేక జన్మలనెత్తుతూ ఎన్నో శరీరాలను పొందుతూ ఎప్పటికప్పుడు వేరువేరు పేర్లతో వ్యవహరింపబడుతున్నాడు. అందువల్ల **వాళ్ళకు నిరుపాధికసత్తలేదు.** ఇక **జ్ఞానపదము** నిత్యమై ఏనాడూ కుందించుకుని పోని, సంకుచితము కాని జ్ఞానమే ఏకాకారముగా కలవాడని తెల్పుతున్నది. దానితో సంసారదశలో తమ తమ జ్ఞానాలు సంకుచితమైనందున ముక్తులు పక్కకు తొలగిపోతున్నారు. **అనన్తపదము** దేశము కాలము వస్తువులు మున్నగు వాటిచేత పరిచ్ఛేదము, లేనట్టివాడు విడదీయబడడము విభాగము చేయబడడము లేనివాడు అని బ్రహ్మ యొక్క స్వరూపాన్ని తెలుపుతున్నది. అంతేకాదు. అతని స్వరూపము గుణాలు కల్గినట్టిది. అందుచేత స్వరూపాలతోను గుణాలతోనూ ఆయనకు ఇంత అని అంతములేదు కనుక ఆనంత్యము ఉన్నది. అందువల్ల సత్యజ్ఞానపదాలచేత పక్కకు నెట్టేయబడిన రెండువర్గాల వారికంటే

విలక్షణులు, వారికంటే అధికమైన స్వరూపగుణాలు కల్గినట్టి "**నిత్యులు**", వ్యావృత్తులు ఐనారు. విశేషణాలు ఆపనినే కదా చేసేది. అందువల్ల సత్యం జ్ఞానం అనన్తంబ్రహ్మ అనే వాక్యంతో జగజ్జన్మాది వాక్యంతో అవగతమైన రూపాన్ని కల్గియున్న "**బ్రహ్మ సకల ఇతర వస్తు విసజాతీయము**" అని గుర్తింపబడుతున్నది. కావున అన్యోన్యాశ్రయణ దోషమనేది లేదు.

అందువలన సకల జగత్తుల జన్మాదిస్థితులకు కారణము ఐనవాడు. ఎలాంటి దోషాలు లేనట్టివాడు, సర్వజ్ఞుడు సత్యసంకల్పుడూ, సర్వప్రకారాలైన శక్తులున్నవాడు ఐన బ్రహ్మ లక్షణాలతో (గుర్తులతో) తెల్సుకోబడగలడు అని నిశ్చయము చేయబడింది.

ఎవరైతే **నిర్విశేషమైన బ్రహ్మనే తెల్సుకోవాలి** అని అంటున్నారో వారి పక్షంలో, అభిప్రాయంలో బ్రహ్మను గురించి తెల్సుకోవాలి. జన్మాదులు ఎవని వల్లనో **బ్రహ్మజిజ్ఞాసా, జన్మాద్యస్యయతః** అనే రెండుసూత్రాలు ఎంతమాత్రము పొసగవు. ఎందుకంటే బ్రహ్మ శబ్దానికి నిరతిశయమైన బృహత్, బృంహణమును చేయకలది బ్రహ్మ జగజ్జన్మాదులకు కారణము అని చెప్పినారు కాబట్టి. ఇలాగే రాబోయే సూత్రగణాలయందు, ఆయాసూత్రాల వద్ద ఉదహరింపబడిన శ్రుతివాక్య గణాలయందున్నూ **ఈ క్షణాదులు సంకల్పించుటవంటివి** అన్వయించుతున్నందువల్ల బ్రహ్మసూత్రాలు సూత్రాల వద్ద ఉదాహరింపబడిన శ్రుతులున్నూ వారికి **ప్రమాణాలు కాబోవు**. తర్కమైనా ప్రమాణమవుతుందా అంటే అదీ కాజాలదు **అది సాధ్యధర్మ అవ్యభిచారి సాధన ధర్మ అన్వితవస్తు విషయమైనందువల్ల** అంటే **సాధ్య** మనగా తెల్సుకోదగినవస్తువు. ప్రతివస్తువులోనూ దానికి మాత్రమే పరిమితమైన **ఒకధర్మము** ఉంటుంది. అది సాధ్య ధర్మము. అది దానిలోనే తప్ప మరెక్కడా లేకపోవడము, దాన్ని మాత్రమే అంటి పెట్టుకొని ఉండడము **అవ్యభిచారిత్వము**. అది సాధ్యము నందు ఉండే ధర్మముతో కల్సి ఉండాలి. కాగా తేలిన అంశమేమంటే సాధ్యములో తప్పక ఒక ధర్మము ఉండి తీరాలి. అది ఇంకొక వస్తువుకు చెందరాదు. ఇది ఫలానా వస్తువు అని చెప్పడానికి ఉపకరణము సాధనము ఏది ఉన్నదో దానిలోనూ ఉంటూ సాధ్యసాధనాలు పరస్పర పోషకాలు అయ్యి ఉండాలి. బ్రహ్మను గురించి లక్షణము చెప్పినపుడు ఆ ధర్మమేదో బ్రహ్మలో ఉండితీరాలి. ఎలాంటి విశేషము ధర్మము లేనిది బ్రహ్మ అని చెప్పినపుడు ఆ మాట ఏ విశేషమూ లేకపోవుటము అనేది కూడా ఒక విశేషమే ఐ సవిశేషాన్ని సాధించుతున్నది. కాని నిర్విశేషాన్ని కాదు. అందుచేత నిర్విశేషమనే వస్తువు సిద్ధించదు. కాబట్టి అనుమానము ప్రమాణము కాజాలదు.

పోనీండి "జగజ్జన్మాదిభ్రమలు ఎవని వల్ల కల్గుతున్నవో అతడు బ్రహ్మ" అని లక్షణము చెప్పుకుందా మంటే అపుడు కూడా నిర్విశేషమైన బ్రహ్మ లేక వస్తువు మీకు దక్కదు. ఎందుకంటే భ్రమకలుగడానికి కారణము అజ్ఞానము. ఆ అజ్ఞానానికి సాక్షి బ్రహ్మ అని మీరే కదా అంగీకరించియున్నారు. సాక్షిత్వము అనేది ప్రకాశతా ఏకరసమైనపుడే పొసుగుతుంది. ప్రకాశతా అంటే తనను, ఇతరులనున్నూ ఇతడు బ్రహ్మ. ఇది కుండ అని భేదాన్ని చూపి అందులోని విశేషాన్ని బట్టి వ్యవహార యోగ్యతను కలిగించడం. మరింత తేటగా చెప్పాలంటే ప్రకాశత్వమనేది జడపదార్థాన్నుంచి దూరముచేసి తనకు, ఎదుటి వస్తువునకూ వ్యవహారయోగ్యతను కలిగించే స్వభావము. అలా ఐనపుడు సవిశేషమే. ఆ ప్రకాశత లేనపుడు ప్రకాశతే ఉండదు. అపుడు గగనకుసుమం వలె తుచ్ఛత ఏర్పడుతుంది. కనుక చాలు. **ఇది జన్మాద్యధికరణము.**

★ ★ ★

## ఇక శాస్త్రయోనిత్వాధికరణము

జగత్తు యొక్క జన్మాదులకు కారణమైన బ్రహ్మ వేదాంతముల చేత మాత్రమే తెల్సుకోదగినవాడు అని చెప్పబడింది. ఆ మాట తగినది కాదు. ఆ బ్రహ్మ వాక్కులచేత ప్రతపాదింపబడదు. అనుమాన ప్రమాణం చేత బ్రహమ్ సిద్ధిస్తున్నాడు కాబట్టి.

**శాస్త్రయోనిత్వాత్ – 1-1-03 :** శాస్త్రము ఎవనికి కారణము ప్రమాణము అవుతున్నదో అతడు శాస్త్రయోని అనబడుతున్నాడు. అతని స్వభావమే శాస్త్రయోనిత్వము. అందువలన / శాస్త్రయోనిత్వాత్. శాస్త్రము లేక వేదము బ్రహ్మను గురించిన జ్ఞానము పొందడానికి కారణమవుతున్నది. కనుక బ్రహ్మకు శాస్త్ర యోనిత్వము ఏర్పడుతున్నది. బ్రహ్మ ఇంద్రియాలకు బొత్తిగా అందరానివాడై యున్నందున వాటి కారణంగా ఏర్పడుతున్న ప్రత్యక్షాదిప్రమాణాలు బ్రహ్మను చెప్పలేకపోతున్నాయి గనుక ఒక్క శాస్త్రము మాత్రమే ఆయనను చెప్పగల్గుతున్నది కాబట్టి శాస్త్రయోని పరబ్రహ్మ. "**యతోవాఇమాని భూతా నిజాయన్తే**" ఇత్యాది వాక్యము ఆయనను గురించి బోధిస్తూనే ఉన్నది అని అర్థము.

ఏమండీ? బ్రహ్మకు శాస్త్రయోనిత్వము కుదరదు. ఇతర ప్రమాణముచేత తెలుపబడుతూనే ఉన్నాడు కదా! శాస్త్రము అనేది ఇతరత్రా తెలియని విషయాన్ని తెలిపినపుడే అర్థవంతముఔతుంది అంటున్నారా. సరే! ఆ ప్రమాణము ఏదై

ఉండవచ్చును. ప్రత్యక్షము ఐతే కాదు. అది రెండు విధాలు. 1) ఇంద్రియాలవల్ల ఏర్పడిన ప్రత్యక్షము 2) యోగము వల్ల ఏర్పడిన ప్రత్యక్షము అని. మళ్ళీ ఇంద్రియసంభవము అనేది 1) బాహ్యసంభవము 2) ఆన్తరసంభవము అని రెండు రకాలుగా ఉన్నది. బాహ్యేంద్రియాలు అనేవి తమకు సన్నిహితంగా ఉండుటకు యోగ్యములై తమకు విషయములైన వాటిని గురించే జ్ఞానాన్ని కల్గిస్తాయి. అంటే కంటికి ఎదురుగా ఉండే వస్తువును గురించి దాని ఆకారాన్ని గురించి మాత్రమే తెల్పుతుంది కాని రుచి వాసనలను గురించి తెల్పలేదు. అట్లాగే ఇతరేంద్రియాలు. కనుక సర్వార్థములను తన ఎట్టఎదుటనున్నట్లు దర్శించగల, వాటిని పుట్టించడానికి నిర్మించడానికి తగిన సామర్థ్యమున్న పురుషవిశేషుడగు పరమాత్మను గురించి బోధను/జ్ఞానాన్ని **కలిగించజాలవు.** ఆన్తర ఇంద్రియమూ తెలుపజాలదు. మనస్సనే ఆ అన్తరింద్రియము సుఖదుఃఖాలు తప్ప బాహ్యప్రపంచంలోని విషయాలను తెలుపజాలదు. పైగా బాహ్యేంద్రియాల సహకారం లేకుండా పనిచేయజాలదు. పోనీ యోగజన్యప్రత్యక్షమా? అంటే అదీకాదు. గొప్పగా భావన/ఊహచేయడంవల్ల, దాని చిట్టచివరి దశలో పుట్టినదవడం వల్ల తేటగా కనిపిస్తున్నప్పటికీ, ఆ వస్తువు ఇంతకుముందు అనుభవించిన విషయానికి చెందిన స్మృతి వల్లనే పుడుతుంది కాబట్టి దానికి ప్రామాణ్యము లేదు. ఐనపుడు ప్రత్యక్షత ఎలా సంభవిస్తుంది? పూర్వానుభూత విషయాన్ని కాకుండా కొత్తవిషయాన్ని దర్శించగలదనేట్లయితే అందుకు తగిన కారణమైన ఇంద్రియ సంబంధము లేదు కదా! అదే నిజమైతే దాన్ని **భ్రమ** అనవలసియుంటుంది.

ఇక ప్రత్యక్షము తరువాత రెండవదైన అనుమానప్రమాణమున్నూ పరబ్రహ్మను తెలుపజాలదు. అనుమానము విశేషదృష్టము, సామాన్యదృష్టమైనా సరే! వాటి గతి అంతే! అతీంద్రియమైన పరబ్రహ్మ విషయంలో సంబంధాన్ని నిశ్చయం చేసే సాధనం లేనందువల్ల విశేషదృష్టము అనర్హతను పొందుచున్నది. సమస్త వస్తువులను ఉన్నచోటినుండే దర్శించగలిగి ఆ వస్తువులను నిర్మించసమర్థుడైన పురుష విశేషుడిని యందుండే లింగము హేతువు సామాన్యంగా కనిపించేది ఎచ్చటా లభించడంలేదు.

ఏమండీ! లోకంలో కార్యమైన ఏ వస్తువైనా దానికి ఉపాదానకారణము, ఆ వస్తువునుతయారుచేయడానికికావలసినసాధనాలు,ఆవస్తువునుఉపయోగించేవాడు, ప్రయోజనము – వినియోగములను, తెల్సిన ఒక కర్తతోనే సంబంధమును

కల్గియుంటున్నది. ఉత్పత్తి చేయబడుతున్నది కూడాను. జగత్తంతా అచేతనము చేత ఆరంభింపబడి ఏకచేతనుని యొక్క వశములో ఉంటున్నది. ఘటాదులు మొదలైన కార్యమంతా కూడా దాని ఉపాదాన ఉపకరణ సంప్రదాన ప్రయోజనములను తెలిసిన ఒక కర్త చేత సృష్టింపబడుతున్నట్లుగానే కనిపిస్తున్నది. మన శరీరము అచేతనముచే ఆరంభింపబడి రోగములు లేనిదై ఏకచేతనాధీనమయ్యే ఉన్నది. జగత్తంతా సావయవము కాబట్టి కార్యము అవుతున్నది. కనుక జగత్తు కార్యము. బ్రహ్మ కర్త. ఇలా అనుమానము చేత ఈశ్వరుడు సిద్ధిస్తున్నాడు కదా! అనవచ్చును. దీనికి సమాధానము చెప్పబడుతున్నది. మీరు చెప్పిన లక్షణములో ఏకచేతనాధీనత్వము అని చెప్పినారు కదా! దాని అర్థమేమిటి? తదాయత్త ఉత్పత్తి స్థితిత్వము అని కాదు కదా! (ఆ ఏకచేతనుడికి వశమైయుండిన పుట్టుక, బ్రతికియుండి క్షేమంగా ఉండడము) అట్లాగైనపుడు మీరు చెప్పినది సాధ్యవికలము /సాధ్యముతో సంబంధం లేనిది అవుతుంది. రోగములు లేని తన శరీరము ఏకచేతనుడికి ఆయత్తమైన ఉత్పత్తి స్థితులు కలది కాదు. ఆ శరీరము భోక్తలైన భార్య మొదలైన సంబంధికులందరియొక్క భాగ్యవశము చేతనే పుడుతున్నది. స్థితి కూడా అలాగే. ఇంకా శరీరావయవియైన ఆత్మకు తన అవయవాలతో కలసి యుండిన స్థితి అవయవాలయొక్క సంశ్లేషము, విశ్లేషములలో తప్ప చేతనునియొక్క అవసరమును కోరడం లేదు. ప్రాణనా – ఉచ్ఛ్వాసనిశ్వాసలు తీసుకుంటూ ఉండుట – ఇట్టి ప్రాణనాలక్షణమైన స్థితినిలుకడను పక్షముగా ఒప్పుకున్న పక్షములో నేల, సముద్రము, కొండలు మొదలైన వాటిలో ప్రాణాలతో కూడి యుండుట అనే ధర్మము పక్షమైన శరీరముతో సపక్షమైన భూమి మొదలైనవానిలోనూ ఒక్కతీరుగా సమానంగా కనిపించడం లేదు. **పక్షము అనగా సాధ్యమైన అంశమును కల్గియున్నట్టిది. సపక్షము అనగా దృష్టాన్తము. పర్వతముపైన నిప్పు ఉన్నది. పొగ ఉన్నది కనుక ఉదా! వంట ఇంటిలోవలె. అని చెప్పినపుడు. సాధ్యము నిప్పు.** సాధ్యమును కల్గి ఉన్నందువల్ల **పర్వతము 1) పక్షము.** అనగా సందిగ్ధసాధ్యవాన్ పక్షః. దేనియందు సాధ్యము అనుమానింపబడుతున్నదో అది పక్షము. కొండపై వలెనే నిప్పు కల్గిన ప్రదేశము **వంట యిల్లు. ఇది సపక్షము.** అనగా సాధ్యమైన నిప్పు కల్గినట్టిది. జగత్తుకు కార్యత్వాన్ని సాధించే విషయంలో చెప్పిన లక్షణంలో ప్రాణమును కల్గియుండుటను పక్షంగా తీసుకొంటే సపక్షమైన కొండలు, నేల, సముద్రాలలో ప్రాణమును కల్గియుండడమనే సమానధర్మము లభించడం లేదు. ఏకచేతనాధీనత్వమంటే తదాయత్తోత్పత్తి స్థితిత్వమ్ అని చెప్పడం తగదు. కాదండీ! తదాయత్త ప్రవృత్తిత్వం అంటే తదధీనత్వము అని

అంటున్నారా! ఐతే చాలా చాలా పెద్దగా ఉండే శిల్పాలు నిర్మాణాలు, రథాలు పెద్దపెద్ద వృక్షాలు వంటివి ఒక్కని వశములో ఉండేవికావు. వాటిని నిర్మాణము చేయడంలోనూ, నిర్వహించడంలోను, ఒకచోట నుండి మరొకచోటికి తరలించడంలోను ఒక్క వ్యక్తి ప్రమేయము ఎందుకూ పనికిరాదు. పలువురు మనుష్యులు కలిస్తేనే తప్ప ఏదైనా సాధ్యమవుతుంది. మీరు చెప్పిన లక్షణంలో వ్యభిచారమనే దోషం వస్తుంది అంటే సాధ్యంలో కాకుండా ఇతరత్రా కూడ లక్షణము కనిపిస్తుండడమన్నమాట! పోనీండి. చేతన మాత్రాధీనత్వము చెప్పుకుందాము. ఏకచేతనాధీనత్వము అని అనము అనేటట్లయితే ఇంతకు మునుపే సిద్ధము ఐనదాన్ని మళ్ళీ సాధించడమవుతుంది. అది పురుషార్థంకాదు. సిద్ధమైన అంశాన్ని తిరిగి సాధించడమనే దాన్ని **సిద్ధసాధనము** అని అంటారు. అది తెలివిగలిగిన పనికాదు.

అది అలా ఉండనివ్వండి. మన ఇద్దరి అభిప్రాయాల ప్రకారం కల్పనా గౌరవం కంటే లాఘవతర్కాన్ని ఆశ్రయించి జీవులకే కర్తృత్వాన్ని అంగీకరిద్దాము. ఈశ్వరుడిని పక్కకు పెడదాము. కార్యము జగత్తు. కర్త జీవుడు అందాము. ఐతే ఏ వస్తువుకు ఏది ఉపాదానము కాగలదో ఆ విషయము అందరికీ తెలియదు గనుక కర్తృత్వము సంభవించదు అనకూడదు. చేతనులందరికీ పృథివ్యాదులైన ఉపాదానాలు, యాగాదులైన ఉపకరణాలు మొదలైన వాటిని సాక్షాత్కరించుకొనే శక్తి తప్పక ఉంటున్నది. ఉదాహరణకు మనమిప్పుడు పృథివ్యాదులైన ఉపాదానాలు యాగాదులైన ఉపకరణాలను మనము చూస్తూనే ఉన్నాము. వాటివాటి సాయముతో ఆయా వ్యక్తులు యాగాదులనాచరించడంలో శక్తిరూపాలైన అపూర్వాదిశబ్దాలచేత చెప్పబడే **అదృష్టాన్ని** సాక్షాత్కరించుకొనే శక్తి లేకపోయినప్పటికీ చేతనులకు కర్తృత్వము లేకుండా పోవడం లేదు. యాగాదికార్యాలు చేయడానికి అపూర్వాదులను ప్రత్యక్షం చేసుకోవాలని ఏమీ నియమం లేదు. ఆయా పనులను చేయడానికి తనకు తగిన శక్తి ఉన్నదా? లేదా? అని నిశ్చయించుకోవడమే ఆయా కార్యాలను మొదలుపెట్టడానికి ఉపయోగపడుతుంది. శక్తికి మాత్రము జ్ఞానము మాత్రమే ఉపయోగిస్తుంది. కాని దాని సాక్షాత్కారముకాదు. కుమ్మరివాడు మొదలైన పనివాండ్లు తాము చేయబోయే కుండలు సిద్ధము చేయుటవంటి పనులకు సాధనాలైన గుత్పకర్ర, కుమ్మరి సారె వంటివాటిని వలె పనులు చేయుటలో వాటికి ఆ శక్తి ఉన్నదా? లేదా? అని విచారించి కుండలు చిప్పలు వంటివి చేసే పనిని ఆరంభించడం లేదు. ఐతే ప్రస్తుతము వేదాధ్యాయనము

చేయడం ద్వారా యాగాదుల యొక్క శక్తి విశేషాలను తెల్సుకొని వాటిని చేయడానికి పూనుకోవడంలో అసంగతము ఏదీ లేదు.

ఇంకా ఏదైతే చేయడానికి వీలు అవుతుందో ఉపాదానాదులను వాటికి సంబంధించిన జ్ఞానాన్ని తెల్సుకోవడానికి వీలవుతుందో అట్టివాటినే, వాటిని తెల్సుకున్న అభిజ్ఞుడు చేస్తున్నాడు. ఇక్కడొక చిన్న వ్యాప్తి **1**) ఏది ఉత్పత్తి చేయడానికి వీలవుతుందో అది, ఉపాదానాది విజ్ఞానము తెల్సుకోబడేదో అది వాటికి సమ్బన్ధించిన జ్ఞానము కలవానిచే నిర్మించబడినట్టిది. **యత్ శక్యక్రియం శక్యోపాదానాది విజ్ఞానం తత్ తదభిజ్ఞకర్తృకం**. అని. అవి ఎవరితోనో ఒకరితో చేయబడిన కార్యాలే ఐనా మహీ, మహీధరము, మహా అర్ణవము మొదలైనవి మాత్రము వాటిని పుట్టించడము అనే పని "**అశక్యక్రియ**" వాటికి మూలము ఉపాదానము ఐన వస్తువులు ఏవి? ఎంతమోతాదులో తీసుకోవాలి? అందుకు సాధనాలు ఏవి? వంటివాటియొక్క విజ్ఞానము సాధ్యమయ్యేదికాదు కనుక అవి **అశక్యోపాదానాది విజ్ఞానములు** అవుతాయి. కాబట్టి ఇవి చేతనకర్తృకాలుకావు. **వ్యతిరేకవ్యాప్తి ఇది 2) ఏది ఉత్పత్తి చేయడానికి వీలుకాదో ఉపాదానాదుల విజ్ఞానము తెలియబడదో అట్టిది ఒక చేతనుడి చేత జీవుడిచేత ఉత్పత్తి చేయబడింది కాదు. యత్ అశక్యక్రియం అశక్యోపాదానాది విజ్ఞానం చతత్ నచేతనకర్తృకమ్**. అని. అందువల్ల కుండమూకుడు వంటి వాటికి సజాతీయాలై శక్యక్రియ, శక్యోపాదానాది విజ్ఞానములైన వస్తువులకు సంబంధించినదైన కార్యత్వమనేది "**బుద్ధిమత్ కర్తచే చేయబడినది**", అనే అంశాన్ని సాధించడంలో తగిన సామర్థ్యాన్ని కల్గియున్నది. మరియు ఘటపటాదులను ఉత్పత్తి చేయడం అనే పనులు తనను తాను అదుపులో పెట్టుకోలేని తలచిన పనిని చివరదాకా కొనసాగించలేని అనీశ్వరుడు, కొద్దిపాటివైన జ్ఞానశక్తులు కలవాడు, కర్మవశ్యుడు, ఏవో ఒకటి రెండు వస్తువులు చేయడానికి తగిన పనిముట్లు కలవాడు, కోరినవాటిలో ఏదీ సమగ్రంగాగాని, కొంచెంగాని పొందలేని అనాప్తకాముడు ఐన వానితో నిర్మింపబడడం కనిపిస్తున్నది. కనుక జగత్తు కార్యము అనడానికి చెప్పుకున్న హేతువు ఏదైతే ఉన్నదో – అభిజ్ఞకర్తృకత్వాది అది ముందు ఎత్తిచూపినట్లు అసమర్థుడు అల్పజ్ఞుడు అనీశ్వరుడు, అనవాప్తకాముడు ఐన కర్తనే సాధిస్తున్నది. కాని సాధించదల్చుకున్న సర్వజ్ఞుడు సర్వైశ్వర్యములు కలవాడైన పురుషుడిని కాక విపరీతమైన వ్యక్తిని సాధిస్తున్నది కాబట్టి **విరుద్ధ విషయకము** అవుతున్నది. ఇది **విరుద్ధ** మనే దోషమునకు

కల లక్షణము. బమ్మిని చేయబోతే తిమ్మి తయారైనట్లుంటుంది. ఐతే ఇంతమాత్రాన అనుమాన ప్రమాణమే పనికి రాకుండా పోదు. సాధ్యము – లింగి అది ఇతర ప్రమాణం చేత సిద్ధమైనపుడు లింగము – హేతువు, హేతువు యొక్క బలముచేత ఉపస్థాపితాలు – బలపర్చబడి నిలదొక్కుకున్నపుడు – విపరీతవిశేషాలు అన్నీ ఆ లింగబలముచే కొట్టి వేయబడతాయి / అడ్డుకోబడి వెనుకకు మరలిపోతాయి. ఇక్కడ శబ్దము / శాస్త్రము తప్ప ప్రమాణాలన్నింటికీ చిక్కని సాధ్యమైన లింగియగు అన్నిరకాల వస్తువులను నిర్మించగల నేర్పరియైన ఈశ్వరుని యందు అన్వయము, వ్యతిరేకముల వలన అవగతమైన ఆయన లేకుంటే ఉండలేని అవినాభావమైన ధర్మాలు అన్నీ కూడా ఎలాంటి తేడాలులేకుండా అన్వయిస్తాయి. వాటిని తొలగించే ప్రమాణాలు లేకపోవడంతో ధర్మాలన్నీ ధర్మియైన ఈశ్వరుని యందే అంటిపెట్టుకొని ఉంటాయి. ఇలాగా సిద్ధసాధనత్వము, సోపాధికత్వము, విరుద్ధత్వము అనే దోషాలతో దూషితమైనందున ప్రత్యక్షము, లేదా అనుమాన ప్రమాణము చేత ఈశ్వరుడు సిద్ధించడు. **ఇచ్చట సాక్షాత్తూ పూర్వపక్షి యగు తార్కికుడు అనుమాన ప్రమాణంతో ఈశ్వరుడు సిద్ధిస్తాడు** అని రంగంలోకి దిగుతున్నాడు.

**ఇచ్చట కొందరు ఇలా అంటున్నారు** – జగత్తు అవయవాలతో కూడియున్నందు వల్లనే **కార్యము** అవుతున్నది. దాన్ని కాదనడానికి వీల్లేదు. దీనికి సంబంధించి అనుమాన ప్రయోగాలు ఇలాగా ఉన్నాయి. **1**) వివాదంలో చిక్కుకున్న భూమి, భూమిని నిలబెట్టే కొండలు మున్నగునవి కార్యములు. అవయవాలతో కలసియున్నవి గనుక. **2**) వివాదాధ్యాసితమైన నేల, కడలి, కొండలు మున్నగునవి కార్యములు. చాలా పెద్దవిఐనా క్రియావంతములు కాబట్టి. కుండవలె. **3**) శరీరము, భువనాదులు కార్యాలు. మహత్త్వములు ఔతూనే మూర్తములు కావున. ఘటాదుల వలె, అని. అవయవాలతో కలసిన ద్రవ్యాల యందు **ఇది మాత్రమే చేయబడుతుంది**. **ఇంకొకటి చేయబడదు** అని కార్యత్వానికి నియామకము ఐన, సావయవానికి వేరైన మరొక రూపాన్ని పొందలేకపోతున్నాము. అంటే కార్యము అనడానికి హేతువు "**సావయవము**" అగుటవలన అనేది తప్ప మరొకటి ఏదీ లభించడం లేదని అర్థము. కాదండీ! కార్యత్వాన్ని సాధించే శక్యక్రియత్వము; శక్యోపాదానత్వము విజ్ఞానము వంటివి ఉన్నాయి కదా! అని పలుకవచ్చును. కాని వాటికి కార్యత్వసాధకాలుగా గుర్తింపు ఉన్నా, విషయాలుఐన జ్ఞానశక్తులు **జరిగిన పనిని బట్టి వీడు ఈ పనిని చేసినాడంటే వీనికి దానికి సంబంధించిన తగిన జ్ఞానము, తగిన శక్తి ఉన్నాయి**

అని ఊహించాల్సి వస్తున్నది. పక్షములోనూ అవయవాలను కల్గియుండటం వల్ల కార్యత్వము ఎరుకపడుతున్నది. కనుక జ్ఞానశక్తులు ఊహింపబడుతూనే ఉన్నాయి. కనుక పెద్ద విశేషమేమీ లేదు. అది ఈలాగున – కుండలు మూకుళ్ళు మొదలైనవి చేసిపెట్టబడియుండగా చూచినవాడు అవి కార్యములు కనుక వాటిని చేసిన కుమ్మరి వాని యందున్న నిర్మాణశక్తి, జ్ఞానాలను గుర్తించిన ఒకడు ఇంతకుముందెన్నడూ చూడని వింతలైన కూర్పులు చేర్పులు గల రాజభవనాన్ని చూచి ఆయా భాగాలు కూర్పును బట్టి అది ఒక పెద్ద నిర్మాణ కార్యమని నిశ్చయించుకొని దాని వెంటనే దాన్ని కట్టిన మేస్త్రీ / శిల్పి యొక్క జ్ఞాన శక్తుల వైచిత్రిని అనుమానించుతాడు. అందువల్ల తనువు, భువనము మొదలైనవి కార్యములు అని తేలిపోయినాక సర్వమును సాక్షాత్కరించుకోగల వాటిని నిర్మించడంలో మంచి నేర్పు కలిగిన ఒకానొక విశిష్ట పురుషుడు సిద్ధిస్తూనే ఉన్నాడు.

మరియు జీవులందరూ సుఖదుఃఖాలను అనుభవించడానికి వారివారి ధర్మాధర్మాలే కారణాలు. ఐనప్పటికీ ఆ ధర్మాధర్మాలు జడములైనందువల్ల చేతనుడి చేత నియమింపబడకుండా ఫలాలను ఇవ్వడానికి కారణం అవడము పొసగదు **సమర్థములు కావు**. **ఇవ్వలేవు**. కావున అందరి యొక్క కర్మలకనుకూలంగా అన్నిరకాలైన ఫలాలనందించగల నేర్పు ఉన్న ఒకానొక వ్యక్తిని అంగీకరించాలి. వడ్ల వానిచే ధరింపబడని బాడిసె వంటి పనిముట్లు, మంచి నిర్మాణప్రదేశము, కాలము వంటి అనేక పరికరాలు చేరువలో ఉన్నప్పటికీ యూపము – యజ్ఞములో బలి పశువును కట్టివేసే గుంజ – వంటి వస్తువులను నిర్మించడంలో సాధనాలుగా సహకరించలేవు. ఇందుకు భిన్నంగా లోకంలో కనబడడం లేదు కూడా! నేలలో వేసిన విత్తనాలు తమంటతామే మొలకెత్తడమనేది పక్షమైన కార్యములో ఒక భాగమే అవుతున్నాయి కాబట్టి వాటికి వ్యభిచారదోషాన్ని అంటగట్టడము చాదస్తపు పీనుగలయొక్క తెలివిలేని తనమే. చేతనుడితో సంబంధము లేని ఒంటిపై పులకలు మొదలైన వాటిని పుట్టించే చేతనాధిష్ఠితములు కాని స్వయంగా అచేతనాలైన సుఖాదులకున్ను వ్యభిచారదోషమును చెప్పడం తెలియకపోవడం వల్లనే.

ఇక లాఘవం కొరకు ఉభయవాదులంగీకరించిన క్షేత్రజ్ఞులకే కర్తృత్వపూర్వక అధిష్ఠాతృత్వమును కల్పించడం తగదు వారికి సూక్ష్మమైన వస్తువులను, ఇతర వస్తువులతో ఎడమున్న వాటిని, దూరంగా ఎక్కడో ఉన్న వాటిని దర్శించే శక్తిలేదు. లోకంలో దేన్ని సిద్ధంచేసినా తాము చూచిన దాన్నిబట్టే నిర్మాణం చేస్తున్నారని

తెలుస్తున్నది. జీవుడి వలె ఈశ్వరుడికి శక్తి లేదు **ఆయనకు శరీరము లేదు, ఉందని** ఎక్కడా నిర్ణయం చేయబడలేదు. అందువల్ల ప్రమాణాన్తరము వల్ల ఈశ్వర సిద్ధి జరుగుతున్నదని అనుమాన ప్రమాణాను పపత్తి చెప్పకూడదు. కార్యానికి సమర్థకర్త ఐన వాడే కారణమవుతున్నాడనే నియత సంబంధాన్ని తెలిపే హేతువు వల్ల సిద్ధించే కర్త సహజంగానే సర్వార్థాలను సాక్షాత్కరించుకొనగల, వాటిని నియమించగల శక్తి సంపన్నుడైన వాడే సిద్ధించుతాడు.

అనీశ్వరత్వాదులను ఆపాదించుతూ ధర్మవిశేషాలకు విపరీతత్వాన్ని సాధిస్తున్నట్లుగా ఏది చెప్పబడిందో అది అనుమాన ప్రమాణపుపోకడను దాని స్థితి గతులను తెలియక చెప్పిన మాటయే. సపక్షములో సాధ్యము, హేతువుతోపాటు కనిపించినవన్నీ, కార్యానికి కారణాలు కాని ధర్మాలు అన్నీ – లింగియందు, సాధ్యము నందు కనిపించవు. ఉండవు. చెప్పబడుతున్న అంశము ఇది – ఒకానొకడి చేత చేయబడుతున్న ఒక కార్యము తన పుట్టుకకు / పరిపూర్తికి కర్తయైనవాడికి తనను నిర్మించగల సమర్థతను, తనకు ఉపాదానాన్ని, పనిముట్లకు సంబంధించిన జ్ఞానాన్ని ఆశిస్తుంది. కానీ తనకు సంబంధం లేని తన పుట్టుకకు హేతువు కాని ఇంకొక పని చేయలేనితనాన్ని, అందుకు అవసరమైన జ్ఞానము లేకపోవడాన్ని కాదు. అంటే కుండలు చేసేవాడికి దానికవసరమైన మట్టి, సారె, కర్ర మొదలైన సాధనాలు ఉపాదానము, వాటిని చేసే విధానానికి చెందిన తెలివిని కోరుతుంది కానీ బట్టను నేయడానికి తగిన జ్ఞానము, ఉపకరణాలను, నేయ గల సామర్థ్యాన్నీ కాదు. అవి కుండ చేయడానికి అవసరమైనవి కావు. తనను నిర్మించడానికి కావలసిన సామర్థ్యము, తనకు ఉపాదానము, ఉపకరణములు, అందుకు తగిన జ్ఞానముల వల్లనే ఆ పని జరుగుతుండగా ఏదో ఒక సంబంధమున్నట్టు కనిపించినంత మాత్రాన ఎందుకూ పనికిరాని మరొక వస్తువుకు చెందిన జ్ఞానము లేకపోయినందువల్ల దానికి హేతుత్వము (ఊహించడము) కల్పించడము తగదు కదా! ఇంకనూ చేయబడుతున్న వస్తువునకు వ్యతిరేకమైన అర్థములకు చెందిన అజ్ఞానాదులు అన్ని విషయాలకు చెందిన క్రియలకు ఉపయోగపడుతవా? లేక కొన్ని విషయాలకా? అన్ని విషయాలకు చెందినదైతే కాదు. కుమ్మరివాడు మొదలైనవారు తాము చేసేపనికి భిన్నమైన దేన్నీ తెలిసియుండరు. కొన్ని విషయాలనైనా తెల్సియుండాల్సిన అక్కరా లేదు. కర్త లందరిలోనూ ఆయా అజ్ఞానాలు ఆయా అశక్తులు ఉండితీరాలి అనే నియమం లేనందున అందరి అజ్ఞానాలకు వ్యభిచార దోషం వస్తుంది. అందువల్ల కార్యత్వాన్ని సాధించని అనీశ్వరత్వాదులు లింగియైన

సాధ్యమైన కర్త యందు ప్రాప్తించడం లేదు కనుక విపరీత సాధనత్వమనే దోషము పట్టదు.

ఇకపోతే కులాలాదులకు దండచక్రాదులను చేపట్టి పనులు చేయడమనేది శరీరము ద్వారానే జరుగుతుండడాన్ని చూస్తున్నాము. కనుక అశరీరుడు ఐన ఈశ్వరుడికి జగత్తుకు ఉపాదానము కావడము, ఉపకరణములను చేపట్టకపోవడము అనేవి కర్తృత్వాన్ని పొందడంలో ఉపపన్నములు కావు కదా! అనవచ్చును. కాని అది సరికాదు. శరీరము లేకపోతే మాత్రమేమిటి? ఉపకరణాలు లేకపోతే మాత్రమేమిటి? లోకంలో ఉపాసకులు, సత్పురుషులు తమ సంకల్పము మాత్రము చేతనే ఎదుటివాళ్ళ శరీరాల్లోని భూతాలు, భేతాళుడు, విషాలను తొలగించడము, నశింపచేయడాన్ని చూస్తూనే ఉన్నాము కదా! సరే! శరీరమే లేని వాడికి ఇతరులను నడిపించడమనే సంకల్పము ఎలా కల్గుతుంది? అనేటట్లయితే? సంకల్పం చేయడానికి శరీరంతో అవసరం లేదు. శరీరము సంకల్పించడానికి కారణం కావడం లేదు. మనస్సే సంకల్పానికి కారణము. అది ఈశ్వరుడికి ఉన్నది అని మేము ఒప్పుకుంటున్నాము. జ్ఞానశక్తులవలెనె మనస్సు కూడా కార్యకరమవుతున్నది. అలాగైతే మనస్సంకల్పము సశరీరుడికే. శరీరము ఉన్నవాడికే మనస్సు ఉంటుంది. శరీరము లేని వాడికి మనస్సు ఉండదు. అంటే అలా కాదు. మనస్సు నిత్యము. శరీరము నశించిపోయినా మనస్సు ఉంటున్నది కనుక నీవు చెప్పినమాట అనైకాంత్యమనే హేత్వాభాస అవుతుంది సుమా! దేహమున్నవాడికే మనస్సు ఉండాలి అనే నియమమేమీ లేనందున విచిత్రావయవ సన్నివేశవిశేష, తను భువనాదికార్యములను నిర్మించడంలో పుణ్యపాపాలకు వశుడైనవాడు పరిమితమైన శక్తి జ్ఞానాలు కలవాడు క్షేత్రజ్ఞుడు ఈ జగత్తును నిర్మించడానికి అసమర్థుడు. కాబట్టి ఈ సమస్త భువనాలను నిర్మించడంలో నేర్పరియైన అచింత్య, అపరిమిత జ్ఞాన, శక్తి, ఐశ్వర్యాలు కలవాడు, శరీరము లేనివాడు, తన సంకల్పమును మాత్రమే సాధనంగా చేసుకొని దానివల్లనే పుట్టుకొచ్చే అనన్తము విస్తారము ఐన విచిత్ర ప్రపంచమును రచించగల విశేష పురుషుడైన ఈశ్వరుడనే వాడు అనుమాన ప్రమాణంచేతనే సిద్ధిస్తున్నాడు.

అందువల్ల శబ్దము కాకుండా మరొక ప్రమాణం చేత ఈశ్వరుడు సిద్ధిస్తున్నాడు. కనుక వేదవాక్యము. బ్రహ్మను ప్రతిపాదించలేదు. ఇంకా నిమిత్తోపాదానాలు,

సద్ద్రవ్యము కులాలుడు పూర్తిగా పరస్పర భిన్నులుగా కనిపిస్తున్నారు. కాబట్టి నిరవయవద్రవ్యమైన ఆకాశాదులకు కార్యత్వము పొసగక పోవడం చేత బ్రహ్మ ఒక్కడే ఈ సమస్త జగత్తుకు నిమిత్త కారణము, ఉపాదాన కారణమున్నూ అవుతున్నాడని ప్రతిపాదించుటకు వేదానికి శక్తి లేదు.

## ఇక సిద్ధాన్తము

ఇలా ఏర్పడిన పూర్వపక్షానికి మా సమాధానము ఇది. జగజ్జన్మస్థిత్యాదులకు కారణమైనసత్యంజ్ఞానమనన్తంబ్రహ్మఅనిచెప్పబడినబ్రహ్మనుగురించివేదవాక్యములు బోధించుతూనే ఉన్నవి. ఎందువల్లనంటే ఇతర ప్రమాణాదులు వేటిచేత కాకుండా శాస్త్రమనే ఒకే ఒక్క ప్రమాణము చేత మాత్రమే తెలియచేయబడుతున్నాడు కనుక – ఈ జగత్తు అంతా అవయవాలను కల్గియుంటున్నది కనుక కార్యమే. కార్యమైనది అందుకు తగిన కర్తృవిశేషాన్ని కలది గానే కనబడుతున్నది. కావున సమస్త జగత్తును నిర్మించే నేర్పు, దాని ఉపాదానము. అందుకు అవసరమైన పనిముట్లు మొదలైన వాటిని తెలిసియున్న నిపుణుడైన ఒక కర్తను ఊహించవలసినది. అనుమానించవలసినది అని ఏది చెప్పినారో అది యుక్తి యుక్తం కాదు. భూమి, విశాలమైన సముద్రము మొదలైనవి కార్యాలే ఐనా ఒక్కసారే ఒక్కడిచేతనే నిర్మించబడినవి అనడానికి ప్రమాణమేదీ లేదు. ఒక కుండకు ఒకడు కర్తయైనట్లే ఒకేమారు ఒకే ఒక వ్యక్తి అన్ని కుండలకు కర్త కావలసియుంటుంది. వేరువేరు పనులకు కాలభేదము కర్తృభేదము కనిపిస్తున్నందువల్ల కర్త కాలము ఒక్కటే కావాలి అనే నియమమేదీ కాన రావడంలేదు. క్షేత్రజ్ఞులకు విచిత్రమైన జగత్తును నిర్మించడంలో శక్తి ఉన్నందువల్ల, కార్యత్వహేతుబలము చేత క్షేత్రజ్ఞుడి కంటే వేరయిన వాడిని కల్పించినట్లయితే ఒక్కొక్క విచిత్ర నిర్మాణానికి ఒక్కొక్క కర్తను కల్పించుకుంటూ పోయినట్లయితే, అలా కల్పించడము పొసగకుండా పోతుంది కాన ఒక్కడే కర్త అని చెప్పకూడదు. పుణ్యాలు పోగుచేసుకున్న క్షేత్రజ్ఞులకే విచిత్రమైన శక్తి ఉంటున్నట్లు కనిపిస్తున్నది. కాబట్టి వారికే గొప్పదైన అదృష్ట శక్తి కలుగడానికి అవకాశమున్నది. దానివల్ల ఆయా విలక్షణమైన కార్యాలను వారు చేయడం సాధ్యమవుతున్నది కాబట్టి అలాంటి వారికన్న వేరుగా నుండే మిక్కిలి గొప్ప అదృష్టము కల పురుషుడిని ఒకడిని కల్పించడము ఉపపన్నము కాదు. అలాగే ప్రపంచమంతా ఒకేసారి పుట్టుకురావడము, ఒక్కసారే సర్వనాశము కావడమున్నూ ఎప్పుడూ జరిగేవి కావు. అలాగా కనిపించడము లేదు. ఒక క్రమము ప్రకారమే ఉత్పత్తి

వినాశాలు కనిపిస్తున్నాయి కూడా. కార్యము ఐనందున సర్వప్రపంచముయొక్క ఉత్పత్తి వినాశాలు కల్పించబడుతున్నపుడు / ఊహించబడుతున్నపుడు లోకములో కనిపిస్తున్న ప్రకారంగా, శాస్త్రము చెప్పిన విధంగా కల్పించినట్లయితే విరోధము ఏమీ ఉండదు. అందువలన సాధ్యమైన జగత్ కార్యము, బుద్ధిమంతుడైన ఒక్కనిచే/ కర్తచే నిర్మించబడినది అని చెప్పినట్లయితే కార్యత్వానికి (కార్యమైన జగత్తుకు) అనైకాంత్యము వస్తుంది. పక్షమైన జగత్తు అప్రసిద్ధ విశేషణము కలది ఔతుంది. వస్తువులను తయారుచేసేవారు అందరూ బుద్ధిమంతులుగా కనిపించడం లేదు. ఆయా వస్తువులను చేయడానికి అవసరమైనంత పరిమిత జ్ఞానం కలవారు మాత్రమేఐ ఉంటున్నారు. దృష్టాంతము సాధ్యముతో సంబంధమును కోలుపోయి వికలమవుతున్నది. అన్నిరకాల వస్తువులనున్నూ నిర్మించేనేర్పున్న ఒకానొక వ్యక్తిని గురించి / ఒక్కని గురించి తెలియరావడం లేదు. అలాగా ప్రసిద్ధి లేదు. సాధ్యము బుద్ధిమత్ కర్తృకము అని చెబితే సిద్ధసాధనత ఔతున్నది. సర్వజ్ఞుడూ సర్వశక్తియుక్తుడూ ఐన ఒక కర్తను సాధించే ఈ కార్యత్వమనేది ఒకేసారి పుట్టబడే వస్తువులను అన్నింటినీ ఆధారంగా చేసుకొని చెప్పబడ్తున్నదా? లేక ఒకదాని పిదప మరొకటి చొప్పున క్రమంగా పుట్టుకొచ్చే సర్వ వస్తువులను పుట్టించినవాడిని తెల్పుతున్నదా? ఒకేసారిగా పుట్టుతున్న అన్ని వస్తువులకు చెందినదే ఐతే కార్యత్వము అసిద్ధతా దోషానికి గురి అవుతుంది. ఒకదాని వెంట ఒకటిగా పుట్టుకొచ్చే వాటికి సంబన్ధించినదైతే ఆ వస్తువులన్నీ అనేకమంది కర్తలను సాధిస్తున్నాయి. కాబట్టి విరుద్ధతా అనే దోషము వస్తుంది. ఇక ఈ పరమాత్మ విషయంలోనూ ఒకే కర్త ఈ సమస్త ప్రపంచాన్ని సృష్టించినాడని చెప్పినపుడు ప్రత్యక్ష అనుమానప్రమాణాలతోనూ వైరుధ్యము వస్తుంది. ఎందుకంటే కుంభకారుడు పుడుతున్నాడు, (కుమ్మరి) రథకారోజాయతే వడ్రంగి పుడుతున్నాడు. అనికదా లోకములో వినిపిస్తున్నది. వాళ్ళు వాళ్ళు ఆయా వస్తువులను మాత్రమే చేస్తున్నారు. కాని పలురకాలైన భిన్నభిన్నవస్తువులను ఉత్పత్తి చేయడం లేదు. కనుక ఏకకర్తృత్వము సిద్ధించదు.

మరియు కార్యములు అనబడే శరీరాదులకు సత్వరజస్తమస్సులనబడే గుణములచేత పుట్టింపబడే కార్యములైన సుఖదుఃఖాదులతో సమ్బన్ధము కనిపించుతున్నందున వాటికి సత్వాదులను మూలములు/ కారణములుగా తప్పక అంగీకరించవలసి యుంటుంది. కార్యములలో ఉండే వైచిత్రి – వింతలకు కారణములైన, కారణములందుండే విశేషాలే సత్వాదులు. ఇవి ఆయా వ్యక్తులలో

ఉంటాయి. వారు చేసే ఆశ్చర్యకరములైన పనులకు అవి కారణం అవడమనేది వాటిని కల్గియున్న పురుషులలో వారి మనస్సుయందు మార్పులు / ఊహలు/ ఆలోచనలను కల్గించడాన్ని బట్టి వ్యవహరిస్తున్నాము. పురుషుడికి అలాంటి సత్వాదులు కల్గియుండడము, లేక పుట్టడములు వారు చేసుకున్న పూర్వజన్మలలోని కర్మల కారణంగానే. అది వాళ్ళ చేత ఆశ్చర్యకరములైన కార్యములను చేయిస్తుంది. అదే లేకుంటే వింత వింత కార్యాలను చేయజాలడు కదా! జ్ఞానవంతుడైన కర్తకు కర్మసమ్బన్ధము ఆయా పనులను చేయడానికి కారణంగా తప్పక ఒప్పుకోవాలి. జ్ఞానశక్తి వైచిత్రికి కర్మయే మూలము. వ్యక్తికి ఇలాంటి ఆశ్చర్యకరమైన పనిచేయాలి అనే విషయంలో ఇచ్ఛ / కోరిక / సంకల్పము కార్యారంభానికి హేతువు అవుతున్నా జ్ఞానవిశేషముతో కూడిన దానికి కూడా సత్వాదులే మూలము అవుతున్నందున కర్మతో సమ్బన్ధమును నిరాకరించకూడదు. అది వదులు కోరానిదే. కనుక క్షేత్రజ్ఞులే (జీవులు) కర్తలు అవుతున్నారు. వారికంటే వేరుగా విలక్షణుడైన వాడొకడు అనుమానప్రమాణం చేత సిద్ధించడు. ఇందుకు కొన్ని అనుమాన ప్రయోగాలు ఇట్లాగా ఉన్నాయి. గమనించాలి. 1) శరీరము భువనములు (లోకాలు) మున్నగునవి క్షేత్రజ్ఞుల చేతనే నిర్మించబడినవి. కార్యములు ఐనందున. కుండవలె. 2) ఈశ్వరుడు కర్త కాడు. సృష్టి చేసినందువలన ఆయనకు ఒక్క ప్రయోజనము కూడా సిద్ధించదు కనుక ముక్తాత్మకు వలెనే 3) ఈశ్వరుడు కర్త కాడు. ఆయనకు శరీరము లేదు.

క్షేత్రజ్ఞులైన జీవులకు తమ శరీరమునకు తాము అధిష్ఠాతలు కావడములో వ్యభిచారము (అతివ్యాప్తి) దోషము ఏర్పడుతున్నదని అనకూడదు. అంతకుముందు వారికి అనాదిగా వస్తున్న శరీరము ఉంటున్న విషయాన్ని గుర్తించాలి. విమతి (భేదము) విషయము ఐన కాలము లోకములు లేనిది కాదు. అది కాలము కనుక. వర్తమానకాలము వలెనే. అని అనుమాన ప్రమాణముచేత ఈ దేహానికి ముందున్న దేహాన్ని ఊహించుకోవాలి.

మరియు ఈశ్వరుడు సశరీరుడుగా ఉండి సృష్టిని చేస్తున్నాడా? శరీరము లేకుండానేనా? అని అంటే. శరీరము లేకుండానే ఐతే కాదు. లోకములో శరీరము లేకుండా ఎవ్వడూ ఏపనినీ చేయడంలేదు అలాగా అశరీరుడై పనిచేస్తున్నట్లు కనిపించడం లేదు. మనస్సుతో చేసే పనులు కూడా శరీరమున్నవాడే చేస్తున్నాడు. మనస్సు నిత్యమూ ఎల్లపుడూ ఉండేదే ఐనా శరీరములు లేనివారైన ముక్తులు

మానసికములైన పనులను నిర్వహించుతున్నట్లు కనబడడం లేదు. పోనీ సశరీరుడైన ఈశ్వరుడు సృష్టి చేస్తున్నాడని గూడ అనడానికి వీలులేదు. వికల్పముచేసితే నిలువదు కాబట్టి, అదేమిటంటే ఈశ్వరుడియొక్క శరీరము నిత్యమా? అనిత్యమా? అని. ముందుగా నిత్యము ఎల్లపుడూ ఉండేది అని ఎంచితే సావయవము కాబట్టి అదినశ్వరము. నిత్యమైనిల్చియుండేదైనట్లయితే అవయవాలతో కూడిన శరీరులతో కూడిన చిదచిన్మిశ్ర ప్రపంచమంతా నిత్యమే అవుతుంది. అపుడు ఈనిత్య ప్రపంచాన్ని సృష్టించాల్సిన అవసరమే లేదు. అది నిల్చియున్నందున దానికి కర్తగా భావించబడే ఈశ్వరుడు అనే ఒక కర్త సిద్ధించదు. పోనీ ఈశ్వర శరీరము అనిత్యమని తలచుదామా? అంటే ఈశ్వరుని కన్న వ్యతిరిక్తమైన (వేరైన) ఆ శరీరానికి కారణమైనది అపుడుండడము లేదు. కాదు. ఈశ్వరుడు స్వయంగానే తన శరీరానికి కారణమవుతున్నాడని అంటావా? అశరీరుడైన ఆయన తన శరీరాన్ని ఎలా సృష్టించుకోగల్గుతాడు? అది కుదిరేపని కాదు. మరొక శరీరంతో సృష్టించుకోగలడని అంటావా? ఐతే దానికి కారణం, దానికి కారణము అవి పలు శరీరాలను హేతువులుగా చెప్పుకుంటూ పోతే అనవస్థాదోషము వస్తుంది. ఒక కొలిక్కిరాదు. ముగింపు ఉండదు. పోనీ మరొక శరీరంతో తన శరీరాన్ని సృష్టించుకోగలడని అంగీకరిద్దాము. మంచిదే కానీ ఆ సశరీరుడైన ఈశ్వరుడు ఆ శరీరముతో ఏవైనా పనులు – సృష్టి – జగత్తును పుట్టించడం అనే పని కాకుండా మరేదైనా వ్యాపారమును (పనిని) చేస్తాడా? చేయకుండా చేతులు ముడుచుకుని ఉంటాడా? నీ వాదము ప్రకారము మనస్సు తప్ప శరీరములేని ఈశ్వరుడు నిర్వ్యాపారుడే. లేదూ! నిర్వ్యాపారుడూ కాదు. ఐనా శరరము లేకున్నా ముక్తాత్మవలె పనులను చేస్తుంటాడు. అయితే ఆ కార్యము ఐన జగత్తును ఆయన తన సంకల్పముచేత మాత్రమే సృష్టించగలడు అని అనేటట్లయితే పక్షము అప్రసిద్ధ విశేషణము అవుతుంది. సందిగ్ధసాధ్యవాన్ పక్షః కాబట్టి ఈశ్వరుడు సృష్టిని శరీరికాకుండానే చేయగలడు అన్న విషయములో శరీరము లేకుండా అనే విశేషణము, లోకప్రసిద్ధిలేనిది అవుతుంది. శరీరము కల్గినవారు మాత్రమే కార్యములు చేస్తూండడము లోకములో కనిపిస్తున్నది. శరీరాలు లేనివారు కాదు. కనుక ఇది అప్రసిద్ధ విశేషణమవుతుంది. దృష్టాన్తమైన ముక్తుడికి సాధ్యహీనత కల్గుతుంది. అతడికి అశరీరుడై సృష్టి చేస్తే / పనులు చేస్తే పొందవలసిన ప్రయోజనము అంటూ ఏదీ కనిపించడం లేదు. కనుక సాధ్యహీనత అను దోషము పట్టుతుంది. ఇందువలన దర్శనానుగుణముగా సాధింపబడిన ఈశ్వరుడు కలడనే అనుమానము అదే దర్శనము (అనుమానము) – తర్క శాస్త్రం ప్రకారముగా

తిప్పికొట్టబడింది. కనుక శాస్త్రము అనబడే వేదమే ప్రమాణముగా కల పరబ్రహ్మ అని చెప్పబడే పురుషోత్తముడు సిద్ధించుతున్నాడు.

శాస్త్రమైతేనో తనకంటే వేరయిన ఇతర ప్రమాణములచేత బాగుగా తెల్సికోబడిన సమస్త వస్తువులకన్న బొత్తిగా విసజాతీయుడు ఐన సర్వజ్ఞత్వము సత్యసంకల్పత్వము మొదలగు వానితో కల్సియున్న అవధిలేని ఆధిక్యముతో కూడిన అపరిమితమగు గొప్పదైన గుణములకు సముద్రము వంటి వాడిని, అన్నిరకములైన ప్రకృతి సంబన్ధము వల్ల ఏర్పడే హేయగుణాలన్నింటికీ ప్రతిభటమైన స్వరూపము కలవాడినిగా ప్రతిపాదిస్తున్నది. కనుక ఇతర ప్రమాణాలచేత సిద్ధించిన వస్తువులతో సమానధర్మాన్ని కల్గియున్నందున ఏర్పడే దోషముల వాసనకూడా కలవాడని చెప్పవీలులేదు.

ఏదైతే నిమిత్త కారణము, ఉపాదానములు ఒక్కటే కావడము, ఆకాశాదులైన నిరవయవద్రవ్యాదులకు కార్యత్వమున్నూ అనుపలబ్ధమూ అశక్యప్రతిపాదనము (ప్రతిపాదించుటకు వీలుకానిది) అనిముందు చెప్పబడిందో అదిన్నీ విరుద్ధము ఏమీ కాదని **ప్రకృతిశ్చప్రతిజ్ఞాదృష్టా న్తోపరోధాత్, న వియద్ అశ్రుతేః** అను సూత్రాలవద్ద ప్రతిపాదింపబడగలదు.

ఇందువలన ఇతర ప్రమాణాలకు అగోచరుడైనందున కేవలం శాస్త్రము చేత మాత్రమే తెలియబడుతున్నందున **యతోవాఇమాని భూతాని** మొదలుగా గల శ్రుతివాక్యము, చెప్పిన లక్షణములు గల బ్రహ్మను ప్రతిపాదిస్తున్నది. తెలుపుతున్నదని నిశ్చయమైనది. **ఇది శాస్త్రయోనిత్వాధికరణము.**

★ ★ ★

## ఇక సమన్వయాధికరణము

ఒకవేళ ఇతర ప్రమాణములద్వారా బ్రహ్మ తెలియబడనివాడే ఐనప్పటికీ, ప్రవృత్తిగానీ నివృత్తిగానీ లేనందువల్ల సిద్ధరూపుడైన బ్రహ్మను శాస్త్రము ప్రతిపాదించజాలదు అని శంక చేసుకొని దానికి సమాధానమును చెప్పుతున్నారు.

**బ్ర.సూ: తత్తు సమన్వయాత్ 1-1-4:** కలిగిన శంకను తొలగించడానికై సూత్రములో తు శబ్దాన్ని ఉపయోగించినారు. తత్ – ఆ శాస్త్రప్రమాణకత్వమనేది బ్రహ్మకు సంభవించుతూనే ఉన్నది. ఎందువల్ల నంటే. ధర్మార్థ కామమోక్షములనబడే

పురుషార్థాలలో చివరిది త్రివర్గములో చేరనిదీ అపవర్గము అనుపేరుగలది ఐన మోక్షరూప పరమపురుషార్థము తానే అయ్యి ఉన్నందువల్ల ఆవిధంగా అన్వయము పొత్తు / కలయిక ఉన్నందువలన సమన్వయము చక్కగా కలివిడి / సమ్బన్ధము కుదురుతున్నది. పరమ పురుషార్థమైన బ్రహ్మను తెలిపేపేరయినది కావడంతో అన్వయము ఉన్నది. ఈ చెప్పబోయే తీరుగా ఉపనిషత్ పదసముదాయము అన్వయించుతున్నది బ్రహ్మతో – **యతోవా ఇమాని భూతానిజాయన్తే – ఎవనివల్లనైతే ఈ భూతాలు – ప్రాణులు పుడుతున్నాయో. సదేవసోమ్యేదమగ్ర ఆసీత్ ఏకమేవాద్వితీయం. ఓ సోమ్యుడా! సృష్టికి ముందుకాలములో ఈ కనిపించేదంతా ఒకటే అయ్యి సత్ అనే పేరుతో పిలువబడుతూ ఉండేది. సృష్టి జరిగినపుడు దానికి కారణాలలో ఒకటైన నిమిత్తముగా మరొకటి ఏదీలేదు. తదైక్షత. బహుస్యామ్ ప్రజాయేయేతి. తత్తేజోఽ సృజత. ఆ సత్తు వివిధములుగా పుడుతాను అని. నేను బహురూపములుగా అవుతాను. పలువిధములుగా పుడుతాను అని సంకల్పించినది. ఆ తరువాత ఆ సత్తు తేజః పదార్థాన్ని పుట్టించినది. బ్రహ్మ వాఇదమేకమే వాగ్రఆసీత్. తొట్టతొలుత ఈ బ్రహ్మయే ఒంటరిగా నుండినాడు. ఆత్మావా ఇదమేక ఏవాగ్ర ఆసీత్ ఈ ఆత్మ ఒకటే ఆ తొల్లిటికాలములోనుండెను. తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః ఆ విధంగా సృష్టిచేయాలి అని సంకల్పించిన ఆత్మ నుండే ఈ ఆకాశము పుట్టినది. ఏకోహవై నారాయణఆసీత్. నారాయణుడు అనుసార్థకనామధేయము కలవాడొక్కడే ఉండినాడు గదా! సత్యమ్ జ్ఞానమ్ అనన్తంబ్రహ్మ ఎల్లపుడూ ఉన్నాడనబడేవాడు. జ్ఞానస్వరూపుడూ, దేశకాల వస్తువులచేత పరిచ్ఛేదము – విడదీయబడుట లేనివాడు బ్రహ్మ–ఆనందోబ్రహ్మ. ఆనంద స్వరూపుడే / ఆనందమే బ్రహ్మ.** ఇలాంటివన్నీ బ్రహ్మతో సమన్వయము చెందుతున్నాయి.

వ్యుత్పత్తి చేత సిద్ధమై పరినిష్పన్నమైన (ముందుగానే ఏర్పడి యున్న) వస్తువులను తెలుపగలిగే సామర్థ్యమున్న పదసముదాయములకు / వాక్యాలకు సమస్తముఐన జగత్తుయొక్క ఉత్పత్తి స్థితి వినాశములకు కారణమైన సమ్పూర్ణమైన హేయదోషాలన్నింటికీ ప్రత్యనీకమై (ఎదురై) ఇంత అనే పరిమితిలేని, ఉదారగుణాలకు సముద్రము వంటివాడైన ఎల్లలు లేని గొప్ప ఆనందస్వరూపుడైన పరబ్రహ్మయందు చక్కగా అతుకుతున్న వాక్యాలకు ప్రవృత్తి నివృత్తి రూపమైన ప్రయోజనము తెలియరావడం లేదన్నవంకతో అవి సిద్ధరూప బ్రహ్మను గురించి

చెప్పవు. బోధించజాలవు. కనుక అవి ఇతర విషయాలను మాత్రమే బోధిస్తవి అని అనడం తప్పు. ప్రమాణాలన్నీకూడా తమకు సమ్బన్ధించిన విషయాలనే చక్కగా బోధించి ముగిసిపోతాయి. ఐతే ప్రమాణాలు ప్రయోజనానుగుణంగా ప్రవర్తించవు. ప్రయోజనము అనేదే ప్రమాణానికి అనుగుణంగా ఉంటుంది. అట్లాగే ప్రవృత్తి, నివృత్తులతో సమ్బన్ధము / అన్వయము లేనిది ప్రయోజనము లేనిదై ఉంటుంది అనవద్దు. పురుషార్థముతో అన్వయము తేటగా కనబడ్తున్నది. ప్రతీతమవుతున్నది. అట్లాగే ఆయా వస్తువుల స్వరూపాలను తెలిపే వాక్యాలకు – నీకు కొడుకు పుట్టినాడు; ఇది పాము కాదు. వంటివాటికి హర్షము / ఆనందము / సంతోషము, భయము తొలగిపోవుట వంటి ప్రయోజనములు కలుగుతుండడాన్ని తేటగా చూస్తూనే ఉన్నాము కదా!

**ఈ సందర్భములో ఒకరు ఇట్లా చెపుతున్నారు.** వేదాన్త వాక్యాలు బ్రహ్మను ప్రతిపాదించడము లేదు. సాధారణంగా శాస్త్రము ప్రవృత్తిని ఈపని చేయి. దీనివల్ల మేలు కలుగుతుంది. నివృత్తిని ఈ కార్యాన్ని చేయబోకు. నీకు నష్టము కల్గుతుంది అని చెప్పాలి కానీ బ్రహ్మను గురించి తెలిపే వాక్యాలు ఈ రెండు కార్యాలనూ చేయడం లేదు. ప్రవృత్తి నివృత్తులతో అన్వయము లేదు కనుక అట్టి శాస్త్రము అర్థములేనిదవుతుంది. నిష్ప్రయోజనము, ప్రత్యక్షాదిప్రమాణాలు వస్తువు యొక్క యథార్థస్థితిని మాత్రమే తెలిపెడివి అయ్యి ఉన్నా శాస్త్రము మాత్రము ప్రయోజనాన్ని కలిగించేదిగానే ఉంటున్నది. లోకంలోగానీ వేదములో గానీ ప్రయోజనరహితమైన వాక్యప్రయోగము కానరావడం లేదు. అట్లాగే ఏ ప్రయోజనము లేకుండానే వాక్యాన్ని ప్రయోగించడమూ కాని శ్రవణము కాని సంభవించడంలేదు. ఐతే ఆ ప్రయోజనమనేది తప్పక ఒక ప్రవృత్తి ద్వారా ఇష్టప్రాప్తి, అనిష్ట నివారకమయ్యే ఉంటున్నది. అర్థాన్ని కోరేవాడు రాజ గృహానికి వెళ్ళాలి. అజీర్ణరోగి నీళ్ళను ఎక్కువగా తాగకూడదు. స్వర్గాన్ని కాంక్షించేవాడు యజ్ఞాన్ని చేయాలి. మాంసాన్ని తినకూడదు వంటివాక్యాలు ఇటువంటి ప్రయోజనాత్మకములే. ఏదైతే ఇంతకుముందు సిద్ధవస్తువులను తెలిపే వాక్యాలద్వారా కూడా – పుత్రుడు నీకు పుట్టినాడు. ఇది పాము కాదు. తాడు మాత్రమే వంటివి – హర్షప్రాప్తి, భయనివృత్తి రూపపురుషార్థాలతో అన్వయము ఉంటున్నదని చెప్పినారో అక్కడ పుత్రజననాద్యర్థాలవల్ల పురుషార్థము లభిస్తున్నదా? లేక దాన్ని తెల్సుకోవడం వల్లనా? అని ఆలోచించవలసి ఉన్నది. వస్తువు ఉన్నా దాని గురించి

తెలియనందువలన పురుషార్థము సిద్ధించడం లేదు కనుక దాని జ్ఞానము వలననే పురుషార్థము సిద్ధించుతుంది అని అనేటట్లయితే అపుడు వస్తువు / అర్థము లేకపోయినా దాని జ్ఞానము వల్లనే పురుషార్థం సిద్ధించుతుంది. కనుక అర్థపరము కానందున ప్రయోజన పర్యవసాయి ఐనా శాస్త్రము అర్థము ఉన్నది అనడంలో ప్రామాణ్యము కావడము లేదు. అందుచేత అన్ని విషయాలలోనూ అన్ని వాక్యప్రయోగాలు ప్రవృత్తినో నివృత్తినో చెపుతున్నందున జ్ఞానాన్ని కలిగించడం ద్వారాగానీ ప్రయోజన పర్యవసాయులు అవుతున్నవి. కనుక ఎలాంటి వాక్యము కూడా పరినిష్పన్న వస్తువును తెలుపజాలకున్నది. కాబట్టి వేదాన్త వాక్యాలు పరినిష్పన్న వస్తువు ఐన బ్రహ్మను తెలియజేయజాలవు.

**మరొకడు (జరన్మాయావాది) ఇలాగా అంటున్నాడు** – వేదాన్త వాక్యాలు కార్యమును బోధించేవి ఐనందువల్లనే బ్రహ్మను గురించి తెలుపుతున్నవి. ఎలాగంటే! ప్రపంచము లేదు. రెండవది లేనిది, జ్ఞానము ఒక్కటి మాత్రమే రసముగా గలది బ్రహ్మ. అది అనాదియైన అవిద్య కారణంగా ప్రపంచము అనేది ఉన్నది అని తలుస్తున్నది. దానిని /ప్రపంచాన్ని లేకుండా చెయ్యాలి. అని ప్రపంచాన్ని ప్రవిలయము చేయడం ద్వారా బ్రహ్మ విధి విషయము అవుతున్నది. అని అన్నట్లయితే ద్రష్టా, దృశ్యము  చూచేవాడు, అతనికి కనిపించేది అనువిధములుగా నున్న ప్రపంచాన్ని విధ్వంసము చేయడం ద్వారా సాధ్యజ్ఞానైకరసమగు బ్రహ్మను ఆదేశించే వాక్యము ఏది? అనే ప్రశ్న బయలుదేరుతున్నది. **నదృష్టేః ద్రష్టారం పశ్యేః న మతేః మన్తారం మన్వీథాః** అనువాక్యమే గాక ఇట్లాంటివి మరికొన్ని. దీని అర్థమేమనగా? ద్రష్టృదృశ్య రూపభేదములు లేని కేవలం దృశి, జ్ఞానము మాత్రమే బ్రహ్మ అని తెలుపాలి. అని ఐతే కుర్యాత్ అని అన్నపుడు బ్రహ్మ కార్యము అవుతున్నాడు గదా అని అనవచ్చును. కాని తనంతటతానే ఎపుడో ఏర్పడిన బ్రహ్మకు నిష్ప్రపంచతా రూపముగా కార్యత్వము ఏర్పడుతున్నావైరుద్ధ్యము ఏమీ ఉండదు అని అనగూడదు అది తప్పు.

నియోగమే వాక్యార్థము అని చెప్పే నీవు నియోగము, నియోజ్యవిశేషణము, విషయము, కరణము, ఇతికర్తవ్యతా, ప్రయోక్త అను **ఆరు** అంశాలను గురించి గూడా చెప్పవలసి ఉంటుంది. వాటిలో నియోజ్య విశేషణము అనేది విధేయము కాదు. విధి వాక్యము కాదని అర్థము. కాగా ఆ నియోజ్యవిశేషణము రెండు విధాలుగా ఉన్నది. 1) నిమిత్తము 2) ఫలము అని. ప్రస్తుత మిక్కడ నియోజ్య విశేషణము నిమిత్త రూపమా?

ఫలరూపమా? విచారించవలసి ఉన్నది. బ్రహ్మ స్వరూపయాథాత్మ్య అనుభవమే నియోజ్యవిశేషణము అని తలిస్తే అపుడది నిమిత్తము కాకుండా పోతుంది. ఎందుకంటే **యావజ్జీవమగ్ని హోత్రంజుహోతి** – బ్రతికియున్నంతవరకూ అగ్నిహోత్రమును చేయుచున్నాడు – అనుచోట జీవనము వలె బ్రహ్మయాథాత్మ్యానుభవము సిద్ధము కావడంలేదు. కనుక ఫలము నియోజ్యవిశేషణము కాదు. ఇక నిమిత్తమందామా? ఐతే అది బ్రహ్మము నిత్యము కావున అపవర్గము – మోక్షము లభించిన తరువాత కూడా బ్రతికియున్నందువలన అగ్నిహోత్రమును ఆరాధించుట ప్రతిదినమూ చేయవలసియున్నట్లే నిత్యమూ బ్రహ్మ యాథాత్మ్యానుభవమును అనుష్ఠించవలసి ఉంటుంది. పోనీ ఫలము అని తలుద్దామా? అది కూడా కాదు. ఆ ఫలము ఒక నియోగము – ఒకరి ఆజ్ఞ ప్రకారము పనిచేయడము ద్వారా పుట్టినది. కాబట్టి నైయోగికఫలము అవుతుంది. అపుడది అనిత్యము. ఎల్లపుడు ఉండేది నిల్చేది కాకుండాపోతుంది. ఎలాగంటే జ్యోతిష్టోమేన స్వర్గకామోయజేత – స్వర్గాన్ని కావాలని కోరుకునేవాడు జ్యోతిష్టోమయాగాన్ని వేదశాస్త్రాదేశము ప్రకారము చేసినాడు. మరణానన్తరము ఫలాన్ని పొందినాడు. కొన్నినాళ్ళ పిదప క్షీణేపుణ్యేమర్త్యలోకం విశన్తి అని అన్నట్లు తిరిగి భూలోకానికి రావలసివస్తుంది. నిత్యమే అయ్యేటట్లయితే వెనుకకు వచ్చే ప్రసక్తిలేదు. అట్లాగే ఇక్కడ బ్రహ్మ నిష్ప్రపంచం కుర్యాత్ అని విధి వాక్యము ద్వారా నిష్ప్రపంచజ్ఞానము ద్వారా బ్రహ్మ ఒక్కటే అదీ కూడా నిర్విశేషచిన్మాత్రమే సుమా అనే జ్ఞానాన్ని సంపాదించుకుంటే అది నియోగము / విధి ద్వారా లభించింది కాబట్టి స్వర్గము వలె అనిత్యము కావాల్సి ఉంటుంది. సరే! దాన్ని అట్లా ఉంచుదాము.

ఐదే ఈ నియోగము / విధి ఏ వ్యక్తినుద్దేశించి చేయబడిందో చెప్తారా! బ్రహ్మకే ఈ నియోగము. ఆయనయే నియోగ విషయము అనేది సమాధానమయ్యేటట్లయితే అది సరికాదు. ఆ బ్రహ్మ నిత్యమైనవాడు. ఆయనకు నిష్ప్రపంచీకరణ ద్వారా బ్రహ్మ యాథాత్మ్యజ్ఞానాన్ని సంపాదించుకొనుమని ఆదేశించడము తప్పు. అది సంపాదించుకొనేదికాదు. జ్ఞానము బ్రహ్మ/ ఆ జ్ఞానము సిద్ధమే కాని సాధ్యమయ్యేది కాదు **స్వతఃసిద్ధము** అనగా ఒక వస్తువు లాగా పుట్టింపబడేది కాదు. అలా ఐనపుడు ఆ జ్ఞానానికి గొప్పతనము ఏమీ ఉండదు. అంతేకాదు. భావార్థముకాదు. అనగా కర్మవాచకము ఐన శబ్దముకాదు. భావార్థాఃకర్మ శబ్దాః తేభ్యః క్రియాప్రతీయేత అని మీమాంసకుల ప్రక్రియ.

కాదండీ! ఇక్కడ నిష్ప్రపంచము ఐన బ్రహ్మ సాధ్యము అని అనేట్లయితే సాధ్యత్వము ఐనా ఫలత్వమే అవుతుంది. భావార్థము కాదు. కాబట్టి విధి (ఆదేశము) విషయముకాదు. సరే! సాధ్యత్వము అయితే అది ఎవరికి? బ్రహ్మకా? ప్రపంచనివృత్తికా? బ్రహ్మ సాధ్యము కాదు. అది సిద్ధమైనదే. ఒకవేళ పుట్టింపబడేది, సాధ్యము అయ్యేటట్లయితే ఆ బ్రహ్మ నిత్యము కాక అనిత్యము కావాల్సివస్తుంది. యజ్జన్యం, తన్నశ్యం, పుట్టేది/పుట్టింప బడేది అంతా నశించిపోయేదీ అనికదా సాధారణ అవగాహన.

పోనీ ప్రపంచనివృత్తియే సాధ్యము అంటారా? అపుడు బ్రహ్మకు సాధ్యత్వములేదు. ప్రపంచ నివృత్తియే విధి విషయము అనేటట్లయితే అది ఫలము. దానికి విధి విషయత్వము ఉండదు. ప్రపంచనివృత్తియే మోక్షము కదా! అదే ఫలము. దీనికే నియోగవిషయత్వమైతే నియోగము వలన ప్రపంచనివృత్తి జరుగుతుంది. ప్రపంచ నివృత్తి యైతే నియోగము జరుగుతుంది. అపుడు ఇతరేతరాశ్రయత్వము / అన్యోన్యాశ్రయణము అనే దోషము వస్తుంది.

మరియు నివర్తనీయము / తొలగింపదగినది ఐన ప్రపంచము మిథ్యారూపమా? లేక సత్యమా? ఒకవేళ మిథ్యారూపము – లేనిది ఉన్నట్లు బుద్ధికి తోస్తుంది – కనుక అది జ్ఞానము కల్గితే అనగా యథార్థంగా లేదు. ఉన్నది అనుకుంటున్నాను అని తెలిస్తే నిజంగా లేనిది కాబట్టి జ్ఞానము చేతనే తొలగిపోతుంది. అలాంటి దానికి భ్రమను తొలగించుకోవయ్యా అని నియోగము / ఆదేశము / విధి అక్కరలేదు. కనుక నియోగము వల్ల కొంచెమంత ప్రయోజనము కూడా ఉండదు. నియోగము నివర్తక జ్ఞానాన్ని పుట్టించి దాని ద్వారా ప్రపంచాన్ని తొలగిస్తుంది. కనుక ప్రయోజనము లేకేమి? అని అనగూడదు. ఆ నివర్తక జ్ఞానము "**తత్త్వమసి**" అనే వాక్యము చేతను, అథవా నీవు చెప్పే బ్రహ్మ సత్యం. జగత్తు మిథ్యా. ఆ బ్రహ్మకూడా నిర్విశేష చిన్మాత్రమే సుమా అనే వాక్యము ద్వారా తెలుస్తుండగా నియోగము నిష్ఫలమే అవుతుంది. వాక్యార్థ జ్ఞానము చేతనే బ్రహ్మ కన్న వేరుగా నున్న మిథ్యా భూతమైన ప్రపంచమంతా భాధితమై లేకుండా పోతున్నపుడు సపరికరమైన నియోగము అసిద్ధము కాక తప్పదు.

ప్రపంచమేతొలగింపబడేదిఐనపుడుప్రపంచాన్నిఅసత్యముమిథ్యఅనితొలగించే నివర్తకమైన నియోగము బ్రహ్మ స్వరూపమేనా? లేక దానికన్న వ్యతిరేకమైనదా? ఒకవేళ బ్రహ్మ స్వరూపమే అయ్యేటట్లయితే నివర్తకమైన బ్రహ్మ నిత్యము కాబట్టి

నివర్త్యము / తొలగింపబడేది ఐన ప్రపంచము ఉనికి లోనే లేకుండా పోతుంది. అట్లాగే బ్రహ్మ నిత్యమైనందున నియోగము నిత్యము అయ్యి నియోగవిషయానుష్ఠానము చేత సాధింపబడేది ఉండదు. చేయడం కుదురదు. ఇక ప్రపంచ నివర్తకమైన నియోగము బ్రహ్మ కంటే వేరయినది. అని అనేట్లయితే మొత్తము ప్రపంచాన్ని తొలగించుట అనే విషయాన్ని అనుష్ఠించుట చేతనే అది నెరవేరుతుంది కనుక ఆ పని చేసే ప్రయోక్త కూడా నశించాల్సి ఉంటుంది. అపుడు ఆశ్రయము ఉండదు కనుక తలచిన నిష్ప్రపంచీకరణ సిద్ధించదు. ఎట్లాగో ఒకట్లాగా ప్రపంచ నివృత్తిరూపమైన విషయాన్ని అనుష్ఠించితే బ్రహ్మ కంటే వ్యతిరిక్తంగా ఉన్నదంతా లేకుండా పోయింది. కాబట్టి నియోగము చేత పుట్టింపబడేది కాదు మోక్షము అను ఫలము.

ఇంతేకాకుండా నియోగము అనే సాధనము ద్వారా చేయబడే ప్రపంచనివృత్తి ఈ విధంగా ఆరంభించి, ఇట్లాగా ముందుకు సాగి ఇట్లాగా ముగించాలి. దీని తర్వాత ఇది చేయాలి. ఇది చేయాలి అనే ఇతికర్తవ్యత లేదు కాబట్టి చెప్పిన దాన్ని చేయడంలో తగిన సాధనములేనందున – నిష్ప్రపంచీకరణకు ఆదేశము, విధి మాత్రమే ఉపకరించదు. కనుక అది సాధనము కాజాలదు. ఇతి కర్తవ్యత లేకపోవటమేమిటి అండి? ఉన్నదికదా! అని అంటారా? ఇది ఇట్లాగా? నిష్ప్రపంచీకరణకు ఇతి కర్తవ్యత అనేది భావరూపమా? లేక అభావరూపమా? ముందుగా తెలుపండి. భావరూపమే ఐతే అది రెండు విధాలుగా ఉంటుంది 1) కరణ శరీరనిష్పాదికా 2) అనుగ్రాహికా అని. సాధనమైన కరణములను పుట్టించెడిది. 2) తోడుపడేది. ఐతే ఈ రెండు రకాలుగానూ కారణంకాదు. ఎట్లాగంటే గుదె బండతో కుండను మోది దాని నామరూపాలను లేకుండా చేసినట్లు మొత్తము ప్రపంచాన్నే లేకుండా చేసేటువంటి సాధనము ఒకటి కూడా లేదు. కనుక నిష్ప్రపంచీకరణము సాధ్యమయ్యేది కాదు. లేదూ! సాధనమే సిద్ధమైనా దానికి నిష్ప్రపంచీకరణ సాధ్యము కాదు. చెయ్యజాలదు. సహకరించే అంశమేదైనా ఉన్నా మొత్తము ప్రపంచాన్నే లేకుండా చేయలేదు. కనుక దానికి కరణస్వరూపము – పనిముట్టుతనము – సిద్ధించదు. పనిముట్టు అనుకున్న పనిని సాధించి తీరాలి. కానప్పుడు అది పనిముట్టు – కరణము అనబడదు. బ్రహ్మతో సమానుడైన వాడులేడు. ఆయన అద్వితీయుడు అనే జ్ఞానమే నిష్ప్రపంచీకరణను సాధించగలదని, అందుకు తగిన కరణమును పుట్టించగలదనిన్నీ అంటారా? దానిచేతనే – అద్వితీయత్వబ్రహ్మజ్ఞానము చేతనే ప్రపంచ నివృత్తి రూపమైన మోక్షము

సిద్ధించుతుంది కనుక కరణము – పనిముట్టు చేత సాధించవలసిన విషయము ఏమీ ఉండదు అని మేము ఇంతకుముందే చెప్పియున్నాము.

ఇతికర్తవ్యత అనేది అభావరూపమే గనుక అయితే అది సహజంగానే లేనిది కాబట్టి కరణమును / సాధనాన్ని పుట్టించలేదు. అట్లే నిష్ప్రపంచీకరణలో తోడ్పడగలదాన్ని కూడా పుట్టించదు. అందువలన నిష్పపంచమును చేయవయ్యా అని బ్రహ్మకు విధించే నియోగము / విధివాక్యము కుదురదు.

**మరొకతను ఈ విధంగా అంటున్నాడు.** వేదాన్తవాక్యాలు పరినిష్పన్నమైన బ్రహ్మ స్వరూపాన్ని తెల్పుతున్నవి కాబట్టి వాటికి ప్రామాణ్యము లేకపోవచ్చును. ఐనా బ్రహ్మస్వరూపము తప్పక సిద్ధించుతుంది. ఎట్లాగా? అని అంటే ధ్యాతవ్యః, ధ్యేయః వంటి పదాలతో ధ్యానము చేయండి అని విధిస్తున్నవి కాబట్టి అవి ప్రవృత్తిని బోధిస్తున్నవి కనుక బ్రహ్మను తెల్యచేయగలుగుతాయి.

శ్రుతివాక్యాలు ఇలాఉన్నాయి **ఆత్మావా అరే ద్రష్టవ్యః ఓరీ ఆత్మనే దర్శింపదగింది. నిధిధ్యాసితవ్యః బాగుగా ధ్యానించాలి. య ఆత్మా అపహతపాప్మా. ఏ ఆత్మయైతే ఉన్నాడో ఆయన పుణ్యాపాపరూప కర్మలు లేనివాడు. సోఽన్వేష్టవ్యః సవిజిజ్ఞాసితవ్యః, అతడినే వెదకాలి. ఇతరములన్నింటికంటే తెల్సుకోదగినవాడు అతడే. ఆత్మా ఇత్యేవ ఉపాసీత అతడు నాకు ఆత్మయని ఉపాసన చేయాలి, ఆత్మానమేవలోకముపాసీత దృశ్యమానమైన ప్రపంచమంతటినీ పరమాత్మగానే భావించి ఉపాసించాలి. అని.**

ఈ వాక్యాలయందు నియోగము ధ్యానమునకు విషయమైన వాడి గురించి. స్వవిషయమైన ధ్యానము ధ్యేయము ఒక్కదాని చేతనే నిరూపింపబడుతుంది. కనుక ధ్యేయమైనవాడిని ఆక్షేపించుతుంది. ఆధ్యేయమైన వాడు ధ్యాననియోగవాక్యము ద్వారా తెలుపబడే ఆత్మనే. అతడు ఎలాంటివాడు? అని అపేక్ష ఏర్పడినపుడు ఆతని యొక్క స్వరూప విశేషాన్ని తెలుపడం ద్వారా **సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ. సదేవసోమ్యే దమగ్రఆసీత్** ఇత్యాది వాక్యాలకు ధ్యానవిధికి సంబంధించి యున్నందువల్ల ప్రామాణ్యము ఏర్పడుతున్నది. కావున విధికి విషయమైన ధ్యాన శరీరము నందు అనుప్రవేశము చేసిన బ్రహ్మ స్వరూపము నందుకూడ ఉద్దేశ్యము / తాత్పర్యము ఏర్పడుతున్నది. ఇందువల్ల **ఏకమేవాద్వితీయం 2) తత్ సత్యం సఆత్మా. తత్త్వమసిశ్వేత కేతో? 3) నేహనానాస్తికించన**. మొదలైన వాక్యాల ద్వారా బ్రహ్మ స్వరూపము ఒక్కటే

అదే సత్యము. దానికంటే వేరుగా ఉన్నదంతా మిథ్య అని తెలియవస్తున్నది. ప్రత్యక్షాది ప్రమాణాలచేతను, భేదాలను విరివిగా తెలిపే కర్మశాస్త్రము చేతనున్నూ భేదము ప్రసిద్ధంగా తెలుస్తున్నది. భేదము అభేదములు రెండింటికీ పరస్పరము విరోధము ఏర్పడినపుడు అనాదియైన అవిద్య కారణంగానూ భేదప్రతీతి తేటతెల్లమవుతున్నందున అభేదమే పరమార్థము అని నిర్ణయింపబడుతున్నది. బ్రహ్మను గురించి ధ్యానము చేయి అనే నియోగము వల్ల బ్రహ్మను సాక్షాత్కారము చేసుకోవడమే ఫలమవుతున్నందున సమస్తంగా అవిద్య తొలగిపోయి, అందువల్లే అవిద్య వలన కలిగిన వివిధ భేదాలూ అన్తరించి అద్వితీయమైన జ్ఞానైకరసమైన బ్రహ్మభావము సిద్ధించి తద్రూపమైన మోక్షము దక్కుతుంది. కేవలము తత్త్వమసి మొదలైన వాక్యాలయొక్క అర్థజ్ఞానము వల్లనే మోక్షము చిక్కుతుంది అని తలచవద్దు. లోకములో కేవల వాక్యార్థ జ్ఞానము వల్లనే ఏ ప్రయోజనమూ సిద్ధించుతున్నట్లు కనపడడం లేదు. పైగా వివిధములైన భేదములయొక్క దర్శనము అనువృత్తము అవుతూనే ఉంటుంది. కొనసాగుతూ ఉంటుంది. ఐతే వాక్యార్థము వల్లనే జ్ఞానము సిద్ధించి అవిద్య తొలగిపోయి మోక్షము దక్కేట్లు ఐతే శ్రవణము మననము నిధిధ్యాసములను విధించాల్సిన అవసరమే ఉండదు. విధించడం వ్యర్థమవుతుంది. కనుక ధ్యానవిధి సామర్థ్యము వల్ల బ్రహ్మప్రవృత్తి సమ్బన్ధము కలవాడు ఔతాడు. అందుచేత వేదాన్తంవల్ల బ్రహ్మ తెలియబడుతాడు.

అద్వైతులకు మాయావాదులు అని పేరు. అవిద్యకు మరో పేరు మాయ. ప్రాచీనులు కాబట్టి వారికి జరన్మాయావాదులు అని నామకరణం చేసినారు. వారు రెండు వర్గాలుగా ఉన్నారు. 1) నిష్ప్రపంచీకరణ నియోగవాదులు 2) ధ్యాననియోగవాదులు. వేదాన్తవాక్యాలకు ప్రవృత్తి నివృత్తి రూపకార్యాన్వయము లేదు. కనుక బ్రహ్మను గురించి తెలుపజాలవు అన్న మీమాంసకుల వాదాన్ని ఎదుర్కొంటూ ఈ జరన్మాయా వాదులు చెప్పిన సమాధానమే రెండు వాదాలుగా ప్రసిద్ధిలోకి వచ్చింది. ఇంతవరకూ భగవద్ రామానుజులవారు ఆ రెండు వాదాలనూ వివరించినారు. ఇపుడు సాక్షాత్తుగా మాయావాది (నవ్యుడు) తమకన్నా పూర్వులవాదాన్ని ఖండిస్తూ చెప్పిన స్వాభిప్రాయాన్ని, ఈ సూత్రము వద్ద ప్రధాన పూర్వపక్షి వాదాన్ని ఆరంభిస్తున్నారు.

ఇలా మీరు అనవచ్చు. రజ్జువు ఇది పాముకాదు అని తెల్సినవాడు ఉపదేశించినందువల్ల భ్రమకారణంగా పాముగా భావించి భయపడిన వాడికి ఆ భయము తొలగిపోతున్నది. అక్కడ రజ్జువు మీద పాములాగా ప్రపంచములో సంసార

బన్ధము కూడా మిథ్యయైనందున (వాస్తవముకాదు ఉన్నదని భ్రమించడం) జ్ఞానము చేత బాధింపబడుతున్నది కనుక ఆ భ్రాన్తి తత్త్వమస్యాదివాక్య జన్యజ్ఞానం చేతనే తొలగి పో(వడం తగు)తుంది. నియోగము చేతకాదు. ఒకవేళ నియోగముచేతనే బన్ధనివృత్తి జరిగేటట్లయితే అలాంటి మోక్షము అనిత్యము అవుతుంది. స్వర్గాదులవలె. ఐతే మోక్షము నిత్యమని వేదాన్తవేత్తలు అందరూ అంగీకరిస్తున్నారు కూడా. ఇంతేకాకుండా ధర్మాధర్మాలు తాము ప్రసాదించే ఫలాలను అనుభవించడానికి తగిన శరీరాలను పుట్టించి ఆయాకర్తలను తమ తమ కర్మఫలాలను అనుభవింపచేస్తున్నాయి. కావున బ్రహ్మ మొదలుకొని స్థావరాన్తమైన దేవ తిర్యక్ మనుష్యస్థావరములు అనబడే నాల్గురకాలైన శరీర సంబంధరూపమైన ఫలములనుభవించడం తప్పదు. అందువలన ధర్మము వలన మోక్షము సాధ్యమయ్యేది కాదు. అట్లాగని శ్రుతి చెపుతున్నది. **నహవై సశరీరస్య సతఃప్రియాప్రియయోః అపహతిరస్తి. అశరీరం వా వ సన్తం న ప్రియాప్రియేస్పృశతః** శరీరాన్ని కలిగిన వాడికి ప్రియాప్రియములు కలుగకుండా ఉండవు. శరీరము లేనివాడిని అవి అంటనే అంటవు అని. మోక్షమును పొందిన వాడికి శరీరము ఉండదు గనుక ధర్మాధర్మములు చేత ఏర్పడే ప్రియాప్రియాలు లేవు అని వినిపిస్తున్నందున అశరీరత్వము అనేది పుణ్యము (ధర్మము) చేత కలుగదని తేటపడుతున్నది. అంతేకాదు నియోగము చేత సాధింపబడే ఫలవిశేషము వలె ధ్యాననియోగము చేత అశరీరత్వము సాధింపబడదు. అశరీత్వం అనేది ఒకానొక స్వరూపంగా సాధింపబడేది కాదు. శ్రుతులు ఇట్లాగా చెపుతున్నాయి. **అశరీరం శరీరేషు. అనవస్థేషు అవస్థితమ్. మహాన్తం విభుమాత్మానం మత్వాధీరోన శోచతి.** శరీరాలయందు అశరీరుడైన వాడు అవస్థలు (దశ) లేనివాటి యందు ఉన్నటువంటి వాడిని, గొప్ప వాడిని అంతటా అన్నిటా వ్యాపించి యున్నవాడినిగా ఆత్మను తలచి ధీరుడైన బుద్ధిమన్తుడు విచారపడడు. **అప్రాణోహ్యమనాః శుభ్రః** ఇంద్రియాలులేనివాడు మనస్సులేనివాడు పుణ్యపాపరూపకర్మలు లేనివాడు. **అసంగోహ్యయం పురుషః** ఈ పురుషుడు దేనియందూ సంగములేని వాడు. మున్నగు వాక్యాలు. కనుక అశరీరత్వరూపమైన మోక్షము నిత్యము. కావున అది పుణ్యకర్మలచేత సాధింపబడేది కాదు. అదేమాట శ్రుతిచే చెప్పబడుతున్నది. **అన్యత్ర ధర్మాదన్యత్రాధర్మాత్ అన్యత్రాస్మాత్ కృతా కృతాత్ అన్యత్ర భూతాత్ భవ్యాచ్ఛయత్తత్ పశ్యసి తద్వద**. ధర్మము లేకుండా అనగా దానితో సంబన్ధము లేకుండా అధర్మముతో సంబన్ధము లేకుండా, చేయబడేది

భూత్ భవిష్యత్తుల్లో ఏది ఉంటున్నదనుకుంటున్నావో దాన్ని చెప్పు అని, ధర్మాధర్మాలతో సమ్బన్ధము లేకుండా ఏదీ సిద్ధించదు అన్నీ వాటివల్లనే దక్కుతున్నాయి అని అర్థము.

మరియు సాధ్యముఐనది ఏది ఐనా 1) ఉత్పత్తి 2) ప్రాప్తి 3) వికృతి 4) సంస్కృతి అనే నాలుగు రకాలుగా ఉంటుంది. ఇలాంటప్పుడు మోక్షం నాల్గురకాల్లో ఏ రూపంగానూ సాధ్యము అయ్యేది కాదు. మొదటగా అది పుట్టింపబడేది కాదు. మోక్షమనేది బ్రహ్మ యొక్క స్వరూపము కాబట్టి అదినిత్యము. దాన్ని పుట్టించలేము. పోనీ ప్రాప్యము అంటే కాదు. అది ఆత్మ స్వరూపము కాబట్టి బ్రహ్మకు ఎల్లపుడూ సిద్ధించియే ఉంటున్నది. కాదు వికార్యమా? అది కాదు. పాలు మారితే పెరుగు అవుతున్నది. మోక్షమునకు మార్పులులేవు. అట్లయినపుడు మోక్షము అనిత్యం కావలసి వస్తుంది. సంస్కార్యమూకాదు. సంస్కారము అనేది ఏదైనా ఒక వస్తువులో ఉన్న దోషాన్ని పోగొట్టడం, లేదా గుణాన్ని పెంపుచేయడము ద్వారా జరుగుతుంది. మోక్షము దోషా పనయనము ద్వారా సంస్కరింపబడదు. బ్రహ్మ నిత్యపరిశుద్ధుడు. ఆయనలో దోషాలులేవు. ఉన్నగుణాన్ని పెంపుచేయడం ద్వారానూ సంస్కరింపు కుదరదు. అనాధేయమైన అతిశయరూపము కలవాడు కనుక. కొత్తదేదో తెచ్చిపెట్టజాలము. నిత్యమూ నిర్వికారుడై ఉంటున్నందున తనచేతగానీ ఇతరులచేత గానీ చేయబడే ఒక క్రియద్వారా దిద్దబడడు. కనుక అద్దాన్ని తుడిచినట్లు తుడిచి తేటగా చేయడం మెరుగుపెట్టడము వంటి గుణాధానక్రియలు ఆచరించడం కుదరదు. కనుక సంస్కార్యత్వమున్నూ లేదు. స్నానము చేసి శరీరము పైనున్న మురికిని తొలగించుకొన్నట్లు ఆత్మను సంస్కరించలేము. కాని అవిద్యకు చిక్కి దానికి లొంగినది ఐన అహంకారాన్ని మనస్సును మాత్రము సంస్కరించవచ్చును. అందువలన కలిగే ఫలితమును కూడా మనస్సే అనుభవించుతుంది. ఐతే అహంకర్తయైన మనస్సే ఆత్మనా? అని అనకూడదు. ఆత్మ దానికి సాక్షి. అలాగని వేదమంత్రము చెపుతున్నది. **తయోరన్యః పిప్పలం స్వాద్వత్తి. అనశ్నన్నన్యో అభిచాకశీతి. ఆ రెండింటిలో ఒకటి రుచికరమైన పిప్పల ఫలాన్ని తింటున్నది. మరొకటి దాన్ని తినకుండా ఉజ్జ్వలంగా వెలుగుతున్నది.** (ఇచ్చట ఆత్మ మనస్సులు రెండు శరీరమనే వృక్షమునందే చేరినవి. మనస్సు కర్మఫలాలను భుజించుతున్నది. ఆత్మ దానికి సాక్షిగా నిల్చియున్నది అని అద్వైతుల వాదము) **ఆత్మేన్ద్రియమనోయుక్తం భోక్తేత్యాహుర్మనీషిణః బుద్ధిమన్తులు ఇంద్రియాలు మనస్సుతో కూడిన ఆత్మను భోక్త అని చెపుతున్నారు. ఏకోదేవః**

**సర్వభూతేషు గూఢః సర్వవ్యాపీ సర్వభూతాన్తరాత్మా కర్మాధ్యక్షః సర్వభూతాధివాసః సాక్షీ చేతాకేవలోనిర్గుణశ్చ. బాగుగా వెలుగుతూ ఉండేవాడొకడు అన్ని భూతాల యందున్నూ దాగియున్నాడు. ఆయన అంతటా వ్యాపించియున్నాడు. సర్వభూతాలకున్నూ ఆత్మలోపలనుండేటువంటివాడు. కర్మాధ్యక్షుడు. సర్వభూతాలను అధిష్ఠించి వసించుతాడు. జరుగుతున్న దాన్ని చూస్తుండేవాడు మాత్రమే – చైతన్యము కలవాడు. ఉన్నాడంటే కేవలము ఉన్నవాడే. గుణములు లేనివాడు. సపర్యగాత్ శుక్రమ్ అకాయమవ్రణం అస్నావిరం శుద్ధమపాపవిద్ధమ్. ఆయన అవిద్యా రహితము, వాసనారహితము, కర్మ, కర్మఫలమున్నూలేనిది శుద్ధము ఐనదిగా కాయాన్ని వ్రణాలు, పాపములు లేనిదిగానూ భావించినాడు.** అనిన్నీ కావున అహంకర్తఐన మనస్సే భోక్త. ఆత్మ కేవలము సాక్షియే. అవిద్యచే పట్టుబడిన మనస్సు కంటే ఆత్మ యొక్క స్వరూపము కొత్తగా చేర్చవలసిన అక్కరలేని అతిశయము గల్గినట్టిది. నిత్యశుద్ధము, నిర్వికారము అనిన్నీ నిష్కర్షింపబడుతున్నది. అందువలన ఆత్మస్వరూపమైనందున మోక్షము **సాధ్యము** కాదు.

ముక్తి సాధింపబడేది కానపుడు వాక్యార్థ జ్ఞానము వల్ల కలిగే ప్రయోజనము ఏమిటంటే మోక్షము కలుగడానికి అడ్డంకిగా నున్నదానిని (అవిద్యను) తొలగిస్తుందని చెప్పుతున్నాము. ఆ విషయాన్నే శ్రుతులు చెప్పుతున్నాయి. **త్వంహి నఃపితా యోఽస్మాకం అవిద్యాయాః పరంపారం తారయసీతి. నీవు మాకు తండ్రివి కదా! అందుచేతనే మమ్ములను అవిద్యాసముద్రానికి ఆవలి ఒడ్డుకు దాటించుతున్నావు. శ్రుతం హ్యేవమే భగవద్దృశేభ్యః తరతిశోకమాత్మవిదితి. సోఽహం భగవః శోచామి. తం మా భగవాన్ శోకస్య పారంతారయతు. మీ వంటి పూజ్యుల వద్ద ఆత్మవేత్తయైనవాడు శోకమును దాటుకునిపోతాడు అని విన్నాను. ఓ పూజ్యుడా! అట్టి నేను దుఃఖిస్తున్నాను. ఓ భగవన్తుడా? నన్ను శోకము యొక్క ఆవలిగట్టు దాటింతువుగాక! తస్మై మృదిత కషాయాయ తమసః పారందర్శయతిభగవాన్ సనత్కుమారః. మానసికమైన పూర్వానుభవవాసనలన్నీ నశించిన ఆయనకు భగవన్తుడగు సనత్కుమారుడు అజ్ఞానానికి ఆవలి ఒడ్డును చూపించుచున్నాడు. ఇత్యాదులు.** అందువల్ల నిత్యమైన మోక్షానికి అడ్డంకిగా నున్నదానిని వాక్యార్థజ్ఞానము తొలగిస్తుంది. నివృత్తి సాధ్యమే / పుట్టించేదే ఐనా దానికి ప్రధ్వంసాభావము లేదు కనుక నశించదు. **బ్రహ్మ వేద బ్రహ్మైవ భవతి** బ్రహ్మను గురించి తెల్సినవాడు బ్రహ్మనే అవుతాడు.

**తమేవవిదిత్వాఽ తి మృత్యుమేతి. ఆ బ్రహ్మను తెల్సుకున్నవాడు మృత్యువును (అజ్ఞానమును) దాటుకుని పోతున్నాడు.** ఇత్యాదులైన వాక్యాలు జ్ఞానము కలిగిన తరువాత కలిగేదిగా మోక్షాన్ని తెల్పుతూ జ్ఞానానికి మోక్షానికి నడుమ నియోగము వల్ల ఎడము కల్గుటను నిరోధిస్తున్నది. అనగా జ్ఞానం కలుగగానే మోక్షము వస్తున్నది కాగా ఇందులోనియోగముతో అవసరము లేదని తెలుస్తున్నది.

విది క్రియా కర్మత్వముచేతగాని, ధ్యానక్రియాకర్మత్వముచేతగానీ (వేదనము తెల్సుకోవడము. ధ్యానము చేయడము) కార్యముతో అను ప్రవేశము లేదు. అనగా వేదనము, ధ్యానములతో సంబన్ధము లేదనుట. ఎందుకు అనగా ఈ విధమైన రెండు కర్మలనున్నూ నిషేధించినారు కనుక. **అన్యదేవతద్విదితాత్ అథో అవిదితాదధి. జ్ఞేయమైన దానికంటే, జ్ఞాతకంటేనూ ఆ మోక్షము వేరయినదే. యేనేదం సర్వం విజానాతి. తంకేన విజానీయాత్. దేనిచేతనైతే ఈ సమస్తాన్ని తెల్సుకోగల్గుతున్నాడో అలాంటి దానిని దేనిద్వారా తెల్సుకోవాలి. అని తదేవబ్రహ్మ త్వం విద్ధి. నేదం యదిదముపాసతే. దానినే బ్రహ్మ అని తెల్సుకో. నీవు దేనినైతే ఉపాసిస్తున్నావో అది మాత్రము కాదు సుమా! అనిన్నీ ఆ విషయాన్నే చెపుతున్నాయి.**

అయితే ఇంతమాత్రము చేత శాస్త్రము నిర్విషయము కాదు! శాస్త్రము అవిద్య వల్ల కల్పించబడిన భేదాలను తొలగించేది గానే ఉంటున్నది కదా! కాగా అవిద్యను తొలగించగల్గినందువల్ల శాస్త్రము బ్రహ్మను తెలుపజాలదు. కానీ తనకు లక్ష్యముకాని (అవిషయము) ప్రత్యగాత్మయొక్క స్వరూపాన్ని ప్రతిపాదించుతూ అవిద్య చేత కల్పింపబడిన జ్ఞాత జ్ఞేయము, జ్ఞానము అనే భేదాలను దూరము చేస్తుంది. అదే విషయాన్ని శాస్త్రము **నదృష్టేః ద్రష్టారం పశ్యేః** ఇత్యాది వాక్యాలతో స్పష్టం చేస్తున్నది.

ఇంతేకాదు వాక్యార్థ జ్ఞానము వల్లనే బంధాలు తొలగిపోతున్నాయి. కాబట్టి శ్రవణమననాదులను విధించడం వ్యర్థమని అనకూడదు ఆ శ్రవణాదులు సహజంగానే వచ్చిపడుతున్న అన్నిరకాలైన భేదాలకు అనుకూలంగా కాకుండా (వ్యతిరేకంగా) వైముఖ్యాన్ని కల్పించడం ద్వారా వాక్యార్థాన్ని అర్థం చేసుకోవడానికి కారణాలు అవుతున్నాయి!

కేవలం జ్ఞానము చేతనే బంధాలు తొలగిపోవడం లోకంలో కనిపించడం లేదని అనకూడదు. బంధమనేది మిథ్య కాబట్టి జ్ఞానము కల్గినమరుక్షణమే తొలగిపోతుంది.

అట్లాగే నిలచిపోతుందని అనడానికి అవకాశమే లేదు. కావుననే శరీరాన్ని విడిచి పెట్టిన తరువాతనే బన్ధనివృత్తి అని చెప్పలేము. మిథ్యా రూపమైన సర్పభయము తొలగిపోవడానికి రజ్జువే ఉన్నది. అనేయధార్ధజ్ఞానము కంటే పాము చావడం అవసరము లేదు. ఒకవేళ శరీరసమ్బన్ధము పారమార్థికమే అయితే అపుడు ఆ శరీరము నశించడము అవసరమే. కాని ఆ శరీరము బ్రహ్మ కంటే వేరయినది కాబట్టి పారమార్థికము కాదు. ఎవనికైతే బంధము తొలగిపోలేదు అనేట్లయితే వానికి అసలు జ్ఞానమే కలుగలేదని తెలుసుకోవాలి. జ్ఞానం కలిగితే దాని కార్యము ఐన భ్రమ / అజ్ఞానము / బన్ధము తొలగిపోవాలి. కాని పోలేదంటే అజ్ఞానమే తొలగిపోలేదని అర్థము చేసుకోవాలి. అందుచేత శరీరం ఉండనీ, ఉండకపోనీ వాక్యార్థ జ్ఞానము కలిగిన వెంటనే అతడు ముక్తుడే అవుతాడు. అందువల్ల ధ్యాన నియోగము చేత సాధింపబడేది మోక్షముకాదు. కనుక ధ్యానవిధి శేషమైన బ్రహ్మ సిద్ధించడు. కానీ **సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ, 2) తత్వమసి, 3) అయమాత్మాబ్రహ్మ** మున్నగు ఆయనను తెలిపే పదసముదాయము చేతనే సిద్ధించుతాడు.

**దీన్ని ధ్యాన నియోగవాది ఖండించుతున్నాడు.** ఇట్లా నీవు చెప్పడం తగదు. కేవలం వాక్యార్థ జ్ఞానముచేత మాత్రాననే బంధముతొలగడం పొసగడం లేదు. ఒకవేళ మిథ్యా రూపమైన బంధము జ్ఞానము చేత బాధింపబడేదే ఐనా బంధము పరోక్షముకాకుండా ప్రత్యక్షముగా కనిపించుతూ ఉంటే పరోక్ష రూపమైన వాక్యార్థ జ్ఞానము చేత అది బాధింపబడదు. రజ్జ్వాదులలో ప్రత్యక్షంగా సర్పము కనిపించడం జరుగుతూ ఉంటే ఇది పాము కాదు. ఇది తాడే సుమా అనే ఆప్తోపదేశము వలన పుట్టిన పరోక్షమైన సర్పానికి వ్యతిరేకమైన జ్ఞానము మాత్రము చేత భయము తొలగిపోకుండడము కనిపిస్తున్నది కదా! ఆప్తోపదేశము భయాన్ని తొలగించడానికి హేతువు కావడము వస్తుయాథాత్మ్యము యొక్క జ్ఞానానికి ప్రత్యక్షము నిమిత్తమై ప్రవర్తించడము వలన. అది ఎలాగంటే? తాడును చూచి పామునుగా భావించి పారిపోయిన మనిషి ఇది పాము కాదు. త్రాడే సుమా! అని ఆప్తుడైన వానియొక్క ఉపదేశము చేత అది నిజమేనా? కాదా? అని దాని యొక్క యథార్థమైన స్థితిని కండ్లారా చూడడానికి పూనుకొని ఆప్తుడు చెప్పిన దానినే ప్రత్యక్షంగా చూచి భయాన్ని పోగొట్టుకుంటాడు. ఐతే శబ్దమే ప్రత్యక్ష జ్ఞానాన్ని పుట్టించుతుందని అనరాదు. దానికి ఇంద్రియముతో సమ్బన్ధము లేదు. జ్ఞానమును కలిగించే సాధనాల్లో ఇంద్రియాలే అపరోక్ష సాధనాలు. ఫలాలను కోరకుండా

చేయవలసినదే అని భావించి కర్మలను ఆచరించి దానితో పూర్వజన్మసమ్బన్ధమైన వాసనలను తొలగించుకున్నవాడికి శ్రవణము, మననము, నిదిధ్యాసనముల చేత బాహ్య విషయార్థాలపైన వైముఖ్యము కలిగినవాడికి వాక్యమే ప్రత్యక్షజ్ఞానాన్ని కలిగించదు. జ్ఞానం కలుగడానికి అడ్డంకిగా ఉన్నది తొలగిపోతే పురుషుడు బ్రహ్మమునందు దృష్టి గల్గినవాడైనా జ్ఞానము పుట్టడానికి సాధనాలైన ఇంద్రియాదులు తాము చేయవలసిన లౌకిక విషయార్థాలను చూపించడమనే పనిని మానుకోవు. కనుక ప్రత్యక్ష జ్ఞానము ఇంద్రియసమ్బన్ధము కలదికాదు.

మరియు ధ్యానము వాక్యార్థ జ్ఞానం కలుగడానికి ఉపాయము / మార్గము కాదు. ధ్యానము కుదురుతే జ్ఞానము కలుగుతుంది. బ్రహ్మ సత్యము జగత్తు మిథ్య అనే జ్ఞానము కలిగితే ధ్యానము సాధ్యమవుతుంది. కనుక అన్యోన్యాశ్రయదోషము ఏర్పడుతుంది. ఎట్లా అంటే వాక్యార్థ జ్ఞానము పుడితే తద్విషయ ధ్యానము, ధ్యానమాచరించితే వాక్యార్థ జ్ఞానము కలుగుతుంది కనుక. ఐతే ధ్యానము, వాక్యార్థ జ్ఞానాలు వేరువేరు విషయాలకు సంబన్ధించినవి అని భ్రమ పడవద్దు. అట్లాగే ఐనట్లయితే ధ్యానము వాక్యార్థ జ్ఞాన ఉపాయము కాకుండా పోతుంది. లోకంలో ఎక్కడైనా ఒక వస్తువును గురించిన ధ్యానము మరొక వస్తువుయందు ఔన్ముఖ్యాన్ని (ఆసక్తిని) పుట్టించదు కదా! **"తెల్సిన వస్తువును గురించి తల్చుకోవడమే ధ్యానం"** అయినపుడు వాక్యార్థ జ్ఞానము ముందుగా కల్గియుండడము తప్పనిసరి అవుతున్నది. ధ్యేయమైన బ్రహ్మకు సమ్బన్ధించిన జ్ఞానము ఇతరములైన ప్రత్యక్షాది ప్రమాణాల చేత పుట్టదు. ధ్యానము చేయడానికి మూలమైన జ్ఞానము మరొక వాక్యము – తత్త్వమసి ఇత్యాదులు కాకుండా – చేత పుట్టదు. ఐతే అజ్ఞానాన్ని / అవిద్యను తొలగించే జ్ఞానము తత్వమస్యాదివాక్యములచేత పుడుతుందని గుర్తించడము మంచిది. ధ్యాన మూలమైన వాక్యాంతర జన్యజ్ఞానము తత్వమస్యాది వాక్యాల చేత పుట్టిన జ్ఞానానికి సమానమైనదా? లేక వేరువేరు విషయాలకు సంబన్ధించినదా? చెప్పు. రెండూ ఒకే విషయాన్ని చెప్పేడివి ఐతే మేము ముందుగానే చెప్పినట్లు అదే అన్యోన్యాశ్రయ దోషము తప్పదు. వేరువేరు విషయాలకు సంబన్ధించినదంటావా? అపుడు ధ్యానముతో వాక్యార్థ జ్ఞానానికి ఔన్ముఖ్యము పుట్టనే పుట్టదు.

ఇంతేకాదు. ధ్యానానికి ధ్యేయము – తలచుకోదగినది – ధ్యాత మొదలైన అనేక విషయాలను తెల్సుకోవాల్సిన అవసరము ఏర్పడుతుంది. అపుడు ప్రపంచము లేకుండా

బ్రహ్మ ఒక్కడు మాత్రమే ఉన్నాడు అనే ఏకత్వానికి సంబంధించిన వాక్యార్థ జ్ఞానము పుట్టడములో ఇంతవరకూ చెప్పుకొచ్చిన తీరుగా ఉపయోగము ఏమీ ఉండదు. కనుక వాక్యార్థ జ్ఞానము చేత మాత్రమే అవిద్యా / నివృత్తి తొలగిపోవడము జరుగుతుందని చెప్తుండగా శ్రవణ మనన నిధిధ్యాసనములను విధించడము వ్యర్థమే సుమా!

వాక్యము వల్ల అపరోక్ష జ్ఞానము పుట్టదు, కనుక వాక్యార్థ జ్ఞానము చేత అవిద్య తొలగిపోదు. ఆ కారణంగానే జీవన్ముక్తిని కూడా త్రోసిపుచ్చినారు. జీవన్ముక్తి అనగా ఏమిటి అంటే శరీరము పోయిన తరువాత మోక్షము కలుగకుండా ఈ పాంచ భౌతిక శరీరముతో ఈ ప్రపంచములో ఉంటుండగానే మోక్షము కలుగడం అని అంటున్నావా? అట్లాగైతే నీమాట నా కన్నతల్లి గొడ్రాలు అని చెప్పినట్లు అర్థము లేని మాట అవుతుంది. ఎందుకంటావా? శ్రుతులు శరీరముతో ఉన్నవాడికి బంధము, శరీరమును విడిచినవాడికి మాత్రమే మోక్షమని చెప్పుతున్నాయి. అని నీవే ఇంతకుముందు ప్రతిపాదించినావు కాదా? సరే! కానీ నేను శరీరాన్ని కల్గియున్నాను అనే ప్రతిభాసముతోస్తుండగానే ఎవనికైతే ఇట్లా అనిపించడము మిథ్యా అని గట్టి నమ్మకము ఏర్పడుతుందో అలాంటి వాడికి నేను సశరీరుడను అనే భావన తొలగిపోతుంది. దానినే సశరీరత్వనివృత్తి అంటాము అదే జీవన్ముక్తి అని చెప్పకు అది నిజం కాదు. ఈ శరీరము మిథ్యా అనే జ్ఞానము / నమ్మిక కలుగగానే సశరీరత్వము తొలగిపోతే – శరీరము ఉంటున్నది కాబట్టి – సశరీరుడికి ముక్తి ఎట్లాగా లభిస్తుంది? శరీరము వదలిపెట్టి లోకంలో బ్రదికి ఉన్నా యుండకపోయినా/ సశరీరత్వ మిథ్యా ప్రతిభాసము తొలగిపోవడమే ముక్తి అని చెప్పేట్లయితే జీవన్ముక్తి అనడంలో విశేషము ఏమున్నది? కాదండీ! సశరీరత్వ ప్రతిభాసము నిజము కాదని బాధింపబడినా ఎవనికైతే ద్విచంద్రజ్ఞానము వలె – ఒక్కడే చంద్రుడున్నాడని యథార్థము తెల్సిన తరువాత కూడా – ఆ మొదటి ఇద్దరు చంద్రులున్నారనే జ్ఞానము కొనసాగుతుందో వాడు జీవన్ముక్తుడు అని చెప్పడమున్నూ సరికాదు. బాధక జ్ఞానము అనేది బ్రహ్మకంటే వేరుగా నున్నదంతా నిజము కాదు. మిథ్య అని చెపుతున్నది అపుడు అవిద్యకు కారణమైన అవిద్యా కర్మాదిదోషము సశరీరత్వ ప్రతిభాసముతో సహా బ్రహ్మ సత్యము. జగత్తు మిథ్య అనే జ్ఞానము చేతనే బాధితమై తొలగిపోతుండగా, బాధితమైనా సరే. ఇంకా కొంతకాలం కొనసాగుతుందని చెప్పడము న్యాయము కాదు. ద్విచంద్ర జ్ఞానంలో మాత్రము ఇద్దరు చంద్రులు ఉన్నారు. కనపడుతున్నారనే జ్ఞానం కలుగడానికి కారణమైన దోషము

తొలగిపోవడం లేదు. ఒక్కడే చంద్రుడు ఇద్దరు చంద్రులు లేరు అనే జ్ఞానము, ఉన్నారనే భావనకు హేతువు ఐన దోషాన్ని బాధించడం లేదు. కనుక ఇద్దరు చంద్రులు ఉన్నారనే భావన సమసిపోక కొనసాగడం సమంజసమే.

ఇంతేకాకుండా **తస్య తావదేవ చిరమ్ యావన్నవిమోక్ష్యే అథ సమ్పత్స్యే** వాడికి అదే ఆలస్యము. ఎంతవరకూ ఈ శరీరాన్ని విడువనో. దేహ త్యాగము పిమ్మట మోక్షమును పొందగలను. అని సద్విద్యా నిష్ఠుడైనవానికి శరీరముకూలిపోవడాన్ని మాత్రమే కోరుతున్నది మోక్షము అని స్పష్టంగా చెపుతున్న ఈశ్రుతి జీవన్ముక్తిని అడ్డకుంటున్నది. ఇలాంటి జీవన్ముక్తిని ఆపస్తంబుడున్నూ నిరసించినాడు. **వేదాని ఇమం లోకం అముంచ పరిత్యజ్య ఆత్మానమన్విచ్ఛేత్**. వేదశాస్త్రముచే చెప్పబడిన కర్మలను ఈ లోకాన్ని పరలోకాన్నిన్నీ వదలిపెట్టి ఆత్మను తెల్సుకోవడానికి ప్రయత్నించాలి. **బుద్ధే క్షేమప్రాపణమ్**. వాక్యార్థ జ్ఞానము కలిగితే మోక్షము లభించుతుంది. **తత్ శాస్త్రైః విప్రతిషిద్ధమ్**. ఆ జీవన్ముక్తి వేదవాక్యాల చేత నిషేధింపబడింది. **బుద్ధే చేత్ క్షేమప్రాపణమ్, ఇహైవ నదుఃఖముపలభేత**. వాక్యార్థ జ్ఞానము కల్గినంత మాత్రాననే మోక్షం సిద్ధించే ఎడల ఈ లోకమునందు తిరిగి దుఃఖాలను పొందకూడదు. **ఏతేన పరం వ్యాఖ్యాతమ్**. ఈ ప్రకారముగా మోక్షమును గురించి వివరించబడింది. ఈ విధంగా చెప్పబడింది కనుక కేవల జ్ఞానంతో మోక్షము సిద్ధించడము నిరసింపబడింది. ఇందువలన సకలభేదములు తొలగిపోవడమనే రూపంలోనున్న ముక్తి బ్రతికియున్న వాడికి సిద్ధించదు.

అందువల్ల ధ్యానము చెయ్యి అని నియోగించుటతో ఆ ధ్యానము వల్ల బ్రహ్మను గురించి అపరోక్షజ్ఞానము లభించుట అనే ఫలముతో బంధములు తొలగిపోతవి. నియోగము చేయడంతో పుట్టింపబడినందున మోక్షము కొంతకాలమే ఉంటూ పిదప నశిస్తున్నందున అనిత్యము అవుతుందని అనరాదు. ధ్యానము వల్ల సాధ్యమయ్యేది మోక్షప్రతిబంధము తొలగింపబడడమే మోక్షము పుట్టింపబడదు. ఇంతేకాకుండా నియోగము చేత నేరుగా బంధనివృత్తి చేయబడదు. కాని ప్రపంచము లేదు. కేవల జ్ఞానైకరసమైన బ్రహ్మ ఒక్కడు మాత్రమ ఉన్నాడు అనే అపరోక్ష జ్ఞానము చేతనే బంధనివృత్తి జరుగుతుంది. నియోగము మాత్రము ఆ బ్రహ్మకు సమ్బన్ధించిన అపరోక్ష జ్ఞానాన్ని పుట్టిస్తుంది. ఐతే నియోగము జ్ఞానోత్పత్తికి కారణమెలాగా ఔతుంది అని ప్రశ్నించేటట్లయితే ఎలాగంటే నీకు అనభిసంహితఫలములు – ఫలాలను

కోరకుండా చేసిన – ఐన కర్మలు వేదనమును ఎట్లాగా పుట్టిస్తున్నాయో అట్లాగే సుమా! మాకు ఆ కర్మలు మనో నైర్మల్యాన్ని కల్గిస్తాయి. తద్ద్వారా జ్ఞానోత్పత్తికి కారణము లవుతాయి అని అంటావా? మాకు కూడా అంతే. నిజమేనండీ! మాకు నిర్మలమైన మనస్సు నందు వేదశాస్త్రము చేత జ్ఞానము పుడుతుంది. నీకైతేనో నియోగముతో నిర్మలమైన మనస్సులో జ్ఞానము పుట్టడానికి కారణమైన సామగ్రి – సాధనములు – ఏవో చెప్పవలసి ఉంటుంది. అంటావా? విను. ధ్యాననియోగము చేత నిర్మలమైన మనస్సే సాధనము అని చెపుతున్నాను. ఇది దేని చేత తెలియవస్తున్నది అని అంటే మరి నీకు అనభిసంహితములైన కర్మలచేత మననములతో బ్రహ్మకంటే వేరైన అన్ని విషయాలయందు వైముఖ్యము కల్గినవాడికి శాస్త్రము అవిద్యను తొలగించే జ్ఞానాన్ని పుట్టించుతుందని ఏ ప్రమాణముతో తెలుస్తున్నదో చెప్పు. ఇదిగో వేదశాస్త్రం లోని వాక్యముతో. **తంబ్రాహ్మణాః వివిదిషన్తి యజ్ఞేనదానేన తపసా అనాశకేన**. **ఆయనను బ్రాహ్మణులు యజ్ఞము, దానము, తపస్సు ఉపవాసముల ద్వారా తెల్సుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. శ్రోతవ్యోమంతవ్యోనిదిధ్యాసితవ్యః పరమాత్మను గురించి ఆచార్యుడి ద్వారా వినాలి. దాన్ని మననము చేయాలి. ధ్యానము చేయాలి. బ్రహ్మవిదాప్నోతి పరమ్**. బ్రహ్మను గురించి తెల్సినవాడు పరమపదాన్ని పొందుతున్నాడు. **నచక్షుషాగృహ్యతే నాపివాచా**. ఈ కన్నులతో గ్రహించబడడు. వాక్కులతోనూ తెల్యబడడు. **మనసాతు విశుద్ధే న** – పరిశుద్ధమైన మనస్సు చేత మాత్రమే గ్రహింపబడుతాడు. **హృదామనీషా మనసాఽ భిక్లుప్తః** నిండుబుద్ధితో మనస్సుతోనూ గ్రహింపబడుతాడు. ఇత్యాది శాస్త్రాలచేత ధ్యాననియోగముతో మనస్సు నిర్మలమవుతుంది. నిర్మలమైన మనస్సు బ్రహ్మాపరోక్ష జ్ఞానాన్ని పుట్టిస్తుందని తెలుస్తున్నది.

అది సరేగానీ! **నేదం యదిదముపాసతే** అనే వాక్యము చేత ఉపాస్యత్వము నిషేధింపబడుతున్నదని తెలుస్తున్నది గదా! అంటున్నావా? అది సరికాదు. నీవనుకున్నట్లు బ్రహ్మను ఉపాసించకూడదు. అనడము లేదు. కానీ బ్రహ్మ జగత్తుకన్నా వేరయిన రూపము కలవాడని ప్రతిపాదింపబడ్తున్నది. ప్రాణులు ఏ జగత్తును ఉపాసిస్తున్నారో అది బ్రహ్మ కాదు. దాన్ని మాత్రమే బ్రహ్మ అని తెల్సుకో. ఏది మాటలకు అందనిదో దేని నుంచైతే వాక్కులు (వేదము) పుడ్తున్నాయో అది మాత్రమే బ్రహ్మ అని ఆ వాక్యానికి అర్థము. ఇట్లాగే దానికి అర్థము కాకపోయినపుడు “**తదేవ బ్రహ్మ త్వం విద్ధి**” అనే వాక్యముతో వైరుధ్యము వస్తుంది. పైపెచ్చు ధ్యానము చెయ్యి అని విధించడము

కూడా దండుగ అవుతుంది. తాత్పర్యమేమంటే మనో బ్రహ్మ, ప్రాణం బ్రహ్మ అని ప్రతీకోపాసనలు నిషేధించి సాక్షాత్ పరమాత్మ యొక్క కళ్యాణ గుణ విశిష్ట స్వరూపాన్ని ఉపాసించడమే సరియైనదని చెప్పడమే.

ఇందువలన ధ్యాననియోగము ద్వారా బ్రహ్మ సాక్షాత్కార ఫలము సిద్ధించి అపరమార్థమైన సమస్త జగత్తులోని ద్రష్ట దృశ్యము వంటి భేదరూపమైన ప్రపంచబన్ధము తొలగిపోతుంది.

కొందరు భేదాభేదములకు విరోధము లేదు అని అంటున్నారు. అది తప్పు. శీతోష్ణములు తమస్సు ప్రకాశముల వలె పరస్పర విరుద్ధములైన అంశాలు ఒక్క వస్తువులో కూడి ఉండడము పొసగనే పొసగదు.

ఐతే ఇట్లాగా మీరు చెప్పవచ్చును – లోకములోని వస్తువులన్నీ ప్రతీతి – ప్రసిద్ధి – వల్లనే ఇది ఈ వస్తువు ఇది ఈ వస్తువు అని వ్యవస్థ చేయబడ్తూ నిర్ధారింపబడుతున్నాయి. ప్రతిదీ భిన్నమూ, అభిన్నముగా ప్రతీతిని కలిగి ఉన్నది. అదే. కారణస్వరూపంగా, జాతిరూపంగా భేదములేనిదిగా ఉంటున్నది. అట్లాగే కార్యముగా వ్యక్తిగానూ భేదమును కల్గిఉంటున్నది. అనగా ఒక జాతిగా ఆ జాతికి చెందిన వస్తువులు భేదము లేకుండా ఒక్కటిగా ఉంటున్నాయి. అట్లే కారణమైన వస్తువులున్నూ, కారణంగా కాకుండా కార్యము ఐనపుడు వ్యక్తి ఐనపుడు భేదాన్ని కల్గియుంటున్నాడు. ఒక వ్యక్తిని గ్రహించినపుడు రెండు లక్షణాలు కల్గి ఉంటున్నాడు. ఒకటి మానవ జాతిగా జాతిని కల్గియుంటూ వ్యక్తిగా వేరవుతున్నాడు. ఇపుడు జాతి రూపేణ ఇతరులతో అభేదాన్ని వ్యక్తిగా భేదాన్నీ కలవాడై యుంటున్నాడు. అని. ఐతే నీడ ఎండలు రెండింటిలో మాత్రము సహానవస్థా, భిన్నాధారత్వముల వల్ల వైరుధ్యము ఉంటున్నది. **సహ + అనవస్థా = కలిసి ఉండలేకపోవడము, భిన్న + ఆధారత్వము వేరు వేరు వస్తువులను ఆధారముగా కల్గిఉండడము**. ఇందువల్ల వీటిలో వైరుధ్యము కనిపించుతున్నది. కార్యకారణాలకు, జాతి వ్యక్తులకు మధ్య పై లక్షణాలు లేవు. పైగా ఒకే వస్తువు రెండు రూపాలుగా కనిపిస్తున్నది. ఎలాగంటే మట్టికుండ, కొమ్ములు విరిగిన ఆవు, బోడి ఆవు ఇత్యాదుల్లో. మట్టి కుండలో మట్టి అనే ద్రవ్యానికి చెందినది. కుండ ఒకటి అని, అట్లే గోవులో గోత్వజాతి మరియు ఒకవ్యక్తి అని అది బోడికొమ్ములది అని, గోత్వజాతి + గోవ్యక్తి + విరిగిన కొమ్ములు గలది అని తెలుస్తున్నపుడు ఆ ఒక్క వస్తువులో జాతి + వ్యక్తి + విశేషాలు తెలియవస్తున్నాయి గదా అవన్నీ వేరు వేరు అంశాలేకదా! భిన్న

భిన్నమైనవి కూడాను. ఈ విధంగా పరిశీలించి చూచినపుడు ఒకే రూపము కల్గిన వస్తువు ఏదీలోకంలో కనిపించదు. ఇంకా గడ్డి పరకలను కాల్చి బూడిదగా చేసే అగ్ని లాగా భేదాన్ని ఏమాత్రము కనిపించకుండా చేసే అభేదము కనిపించడం లేదు కాబట్టి ముందు చెప్పుకున్నట్లు రెండు లక్షణాలు కల్గియుండడంలో వైరుధ్యము ఏమీ లేదు. మట్టి బంగారము ఆవు గుఱ్ఱము మున్నగు రూపాలలో ఉన్నదే ఘటము, కిరీటము, ఆడ గుఱ్ఱము, బోడి ఆవు ఆది రూపాలతో ఉంటున్నది. అంతే కాదు. జాతికి వ్యక్తికి భేదము అభేదమున్నూ ఒక్కటే ఆకారము అయ్యి ఉండాలని దైవాజ్ఞ ఏమీ లేదుకదా! అట్లా కనిపించుతున్నది, ప్రతీతి అలాగే ఉన్నది కనుక ఐకరూపత అని అంటావా? నీవు చెప్పిన ఆ ప్రతీతి వల్లనే భిన్నాభిన్నత్వమని ద్వైరూప్యాన్ని ఒప్పుకో. లోకంలో ఎవడు కూడా కండ్లు విచ్చి చూచుకుంటూ ఘటము శరావము, ఖండముండాదులందు ఇది మట్టి + ఇది కుండ అని, ఇది గోత్వము + ఇది వ్యక్తి అని విడదీసి చూపజాలడు. రెండూ కలిసే ఉంటాయి. అందుచేత ఇది మట్టి కుండ, విరిగిన కొమ్ముల ఆవు, బోడి ఆవు అనే గుర్తిస్తాడు. అను వృత్తి **అన్నింటిలో కొనసాగుతూ వచ్చేది.** ఇది అని గుర్తింపబడేది కారణము, ఆకృతి అని, వ్యావృత్తి **తొలగిపోయేది ఇది** అని గుర్తింపబడేది కార్యము, వ్యక్తి అని తెల్సుకుంటాడు అని అనబోకు. అది సరికాదు. అట్లా వాటికి వేరువేరు విడివిడి ఆకారాలు కనబడడం లేదు. చాలా లోతుగా మిక్కిలి సూక్ష్మంగానూ చూడగలిగే వాళ్ళు ఇది అన్నింటిలోనూ అనువర్తమానము, ఇది వ్యావర్తమానము అని తమకు ఎట్టఎదురుగా నున్న వస్తువులోనూ రెండింటియొక్క ఆకారభేదాన్ని కనిపెట్టలేరుగదా! ఎలాగైతే ఎదుటనున్న రెండింటినీ ధర్మాలను కల్గియున్న ఒక కార్యములో / వస్తువులో విశేషమునందున్నూ ఒక్కటే అనే బుద్ధి ఎట్లాగా కలుగుతున్నదో అట్లాగే కారణముతో కూడి ఉన్నదానిలో సాధారణమైన దానిలోనూ, ఒకటే సుమా అనే బుద్ధి విశేషాలు లేనిదిగానే కలుగుతుంది. ఈ విధంగానే దేశాన్ని బట్టి, కాలాన్ని బట్టి ఆకారాన్ని బట్టి పూర్తిగా విలక్షణమైన వస్తువుల్లో కూడా అదే ఇది అనే ప్రత్యభిజ్ఞ – గుర్తింపు / స్మరణ కల్గుతుంది. అందువల్ల రెండు రకాలైన భిన్నాభిన్నములైన స్వభావాలతో కూడిన వస్తువు గుర్తింపబడుతున్నది కనుక కార్యకారణములు, జాతి వ్యక్తులకు మిక్కిలి భేదము / తేడా ఉన్నదని చెప్పడము లోకప్రసిద్ధి ద్వారానే కొట్టివేయబడుతున్నది.

**ఐతే మీరిట్లాగా అనవచ్చును.** ఈ మట్టి కుండ **మృదయం ఘటః,** ఖండమైన కొమ్ములుగల ఖండోగౌః ఆవు అని అంటున్నట్లుగానే నేను దేవుడను, నేను మనుష్యుడను

అనుచోటులోనూ సామానాధికరణ్యము చేత ఐక్యప్రతీతి ఉన్నందున ఆత్మకు శరీరానికి కూడా భిన్నాభిన్నత్వము ఉన్నట్లు తెలియవస్తున్నది. అందువల్ల మీరు చెప్పే భేదాభేదము మీకొంపకు మీరే నిప్పు పెట్టుకున్నట్లు అవుతుంది. అని మీరిలా అనడము భేదాభేదసాధనమైన సామానాధికరణ్యము, దాని యథార్థస్థితిని అర్థము చేసుకోకుండా మాట్లాడిన మాట. ఎలాగంటే! ఎక్కడైనా అబాధితమైన అర్థమే ఒక విషయాన్ని నిర్ధారిస్తుంది. ఎవరైనా తన దేహాన్నే తానుగా భావించుతున్నట్లయితే ఆ విషయము ఆత్మ యొక్క యథార్థస్థితిని తెలిపిడి చేసే ప్రమాణాలన్నింటిచేత బాధింపబడి రజ్జువును చూచి పాము అని భావించే జ్ఞానం వలె ఆత్మకూ శరీరానికి అభేదాన్ని ఎరుకపరుచదు. ఖండోగౌః ముండోగౌః అన్నచోట్ల ఉన్న సామానాధికరణ్యమునకు ఏ ప్రమాణము చేత గానీ ఏ ప్రదేశములోగానీ బాధ కనిపించడం లేదు. అందువలన నీవు చెప్పినట్లు శరీరాత్మలకు భిన్నాభిన్నత్వము కుదురదు.

కావుననే జీవుడు కూడా బ్రహ్మతో పూర్తిగా భిన్నమైన వాడు కాడు. కానీ బ్రహ్మాంశమవడం చేత భిన్నాభిన్నుడే. ఐతే అభేదము మాత్రము స్వాభావికము. భేదము మాత్రము ఉపాధివలన కలిగినట్టిది. ఈ విషయము ఎలా తెలుస్తున్నదంటావా? **తత్త్వమసి. ఆ బ్రహ్మవునీవేసుమా. నాన్యోఽ తోఽ స్తిద్రష్టా ఈయనకంటే ద్రష్ట ఐనవాడు మరొకడు లేడు. అయమాత్మా బ్రహ్మ ఈ ఆత్మనే (జీవుడే) బ్రహ్మ.** ఇత్యాదులైన శ్రుతులద్వారా తెలుస్తున్నది. **బ్రహ్మేమేద్యావా పృథివీ ఈ ఆకాశము – ఊర్ధ్వలోకాలు – భూమి కూడా పరమాత్మనే.** బ్రహ్మ. అని మొదలుపెట్టి **బ్రహ్మ దాశాః బ్రహ్మదాసాః బ్రహ్మేమేకితవాః ఉత. స్త్రీ పుంసౌ బ్రహ్మణో జాతౌ స్త్రియోబ్రహ్మ ఉతవాపుమాన్. ఈ బెస్తవాళ్ళు బ్రహ్మనే. ఈ దాసులు బ్రహ్మనే. ఈ వంచకులైన జూదగాళ్ళు కూడా బ్రహ్మనే. బ్రహ్మనుండే స్త్రీ పురుషులు పుట్టినారు. స్త్రీలు బ్రహ్మనే. పురుషుడు కూడా బ్రహ్మనే.** అని అధర్వవేదములోని **సంహితోపనిషత్తు నందలి బ్రహ్మ సూక్తంలో** అభేదము వినిపిస్తున్నది. **నిత్యోనిత్యానాం చేతనశ్చేతనానాం ఏకోబహూనాం విదధాతి కామాన్. ఆ బ్రహ్మనిత్యులైన వారికి నిత్యుడు. చేతనులకు చేతనుడు. అనేకులకు తానొక్కడేదిక్కయ్యి వారివారి కోరికలను తీరుస్తున్నాడు.** జ్ఞాజ్ఞౌద్వావజావీశనీశౌ **ఆ ఇద్దరూ ఒకడు జ్ఞాని ఒకడు అజ్ఞాని. ఒకరు ఈశుడు మరొకడు అనీశుడు. కానీ వారిద్దరూ పుట్టుకలేనివారే.** క్రియా **గుణైరాత్మ గుణైశ్చ తేషాం సంయోగహేతుః అపరోఽ పిదృష్టః వారికి ఇరువురికి కలయిక కారణమైనది మరొకటి ఉన్నది. సంసారము ఏర్పడడానికి**

**కారణమైన క్రియాగుణాలు మోక్షము సిద్ధించడానికి హేతువైన ఆత్మగుణాలు అనేవే. ప్రధాన క్షేత్రజ్ఞ పతిర్గుణేశః సంసారమోక్షస్థితిబంధహేతుః. ప్రధానమనబడే ప్రకృతికి, క్షేత్రజ్ఞుడనబడే జీవుడికిన్నీ ప్రభువు. ఆయన కళ్యాణగుణాలకు ఈశుడు. సత్త్వరజస్తమోగుణాలనున్నూతన అదుపులో ఉంచుకొనగల్గిన సమర్థుడు. జీవుడికి సంసారము – జననమరణరూపము – కలుగడానికి, అందులోనే పడి ఉండడానికి, బంధాలు చుట్టుకోవడానికి వాటి నుండి విడివడడానికిన్నీ కారణమైనవాడు. స కారణం కరణాధిపాధిపః భోగసాధనాలై ప్రకృతి నుండి పుట్టుకొచ్చిన ఇంద్రియాలకు అధికారియైన జీవుడికీ అధిపతి. ఆయనయే ఈ ప్రకృతి జీవులబన్ధానికి కారణము ఐనట్టివాడు. తయోరన్యః పిప్పలం స్వాద్వత్తి. అనశ్నన్నన్యో అభిచాకశీతి. ఆ ఇద్దరిలో ఒకడు రుచికరమైన పిప్పలము (పండు) ను తింటున్నాడు. మరొకడు దాన్ని తినకుండానే ఉజ్జ్వలంగా ఆనందంగా ప్రకాశిస్తున్నాడు. య ఆత్మని తిష్ఠన్ ఎవడు ఆత్మయందు ఉంటున్నవాడై, ప్రాజ్ఞే నాత్మనా సంపరిష్వక్తః నబాహ్యం కించన వేద. ప్రాజ్ఞుడైన పరమాత్మ చేత కౌగిలించుకొనబడిన వాడై బయటి ప్రపంచాన్ని గురించి ఏమీ తెలియకుండా ఉన్నాడు. ప్రాజ్ఞేనాత్మనాఽ న్వారూఢః ఉత్సర్జన్ యాతి. ప్రాజ్ఞుడైన పరమాత్మచేత సన్నిహితుడుగా కూడబడియుండి ఈ ప్రపంచాన్ని విడిచిపోతున్నాడు. తమేవ విదిత్వాఽ తిమృత్యుమేతి. ఆ పరమాత్మను తెల్సుకొని ఉపాసించి మృత్యు స్వరూపమైన సంసారాన్ని దాటిపోతున్నాడు**. ఇత్యాది వాక్యాలచేతనున్నూ భేదము వినిపిస్తున్నది. కనుక జీవుడికీ పరమాత్మకూ భేదాభేదాలను ఒప్పుకుని తీరాల్సిందే. వీటిలో ఈ జీవేశ్వరులకు **బ్రహ్మ వేదబ్రహ్మైవభవతి బ్రహ్మను గురించి తెల్సుకొన్న వాడు బ్రహ్మనే అవుతున్నాడు**. ఇత్యాదివాక్యాలచేత మోక్షదశలో జీవుడికి బ్రహ్మ స్వరూపము వస్తున్నదని పేర్కొనబడినందున **యత్రత్వస్య సర్వమాత్మైవా భూత్ తత్కేనకం పశ్యేత్ ఈ ప్రపంచమునందు కనిపించేదంతా పరమాత్మనే అయ్యి ఉంటే ఏ సాధనముతో మరొకడిని చూడగలడు**. అని తనకు ఆయనకున్నూ భేదదర్శనాన్ని నిషేధించినారు గనుక అభేదము స్వాభావికము అనిన్నీ తెలియవస్తున్నది.

ఏమండీ! **సోఽశ్నుతే సర్వాన్ కామాన్ సహబ్రహ్మణా విపశ్చితా. ఆ ముక్త పురుషుడు సర్వమునూ సందర్శించగలిగిన పరబ్రహ్మతో కూడియుండి అన్ని కామములనున్నూ అనుభవించుతాడు. అనిసహశ్రుతిద్వారాకలసి అనుభవించుతాడు అని చెప్పేవేదవాక్యము.** ఆ ముక్తదశలో కూడా భేదము తేటపడుతున్నది

కదా! ఇంతేకాదు. సూత్రకారుడైన వ్యాసమహర్షి కూడా **జగద్వ్యాపారవర్జం. ప్రకరణాదసంనిహితత్వాచ్చ; భోగమాత్రసామ్యలింగాచ్చ** అనే రెండు సూత్రాల ద్వారా కూడా సృష్టి స్థితిలయాలు అనే జగద్వ్యాపారము ఉండదు. భోగములను అనుభవించే విషయంలో మాత్రమే ముక్తపురుషుడికీ ఈశ్వరుడికిన్నీ సమానత్వము ఉంటుంది అని చెపుతున్నందున అక్కడ కూడా భేదము ఉండనే ఉన్నది. అని అనకూడదు. ఆ మాట సరికాదు. **నాన్యోఽ తోఽ స్తిద్రష్టా**. ఇత్యాదులైన వందలకొద్ది శ్రుతివాక్యాల చేత ఆత్మ భేదాన్ని నిషేధించినారు కాదా! **సోఽ శ్నుతే సర్వాన్ కామాన్ సహబ్రహ్మణా విపశ్చితా అ**నే చోట కూడా కామములన్నింటితో కూడా బ్రహ్మను అనుభవిస్తాడు. సర్వగుణాన్వితుడైన బ్రహ్మను అనుభవిస్తాడు అని చెప్పబడుతున్నది. అని అర్థము కాకపోతే బ్రహ్మణా సహ అని ప్రయోగించడం చేత బ్రహ్మకు అప్రాధాన్యము వస్తుంది. జగద్వ్యాపారవర్జమ్ అన్నచోట కూడా ముక్తుడు భేదము కలవాడై ఉంటే ఐశ్వర్యములో తక్కువతనమును చెపుతున్నారు. అదే సరికాకుంటే **సమ్పద్యావిర్భావః స్వేనశబ్దాత్ ఆయనను చేరుకున్న తరువాత ముక్త పురుషుడికి తనదైన పూర్వరూపము వస్తుంది. శ్రుతిలో ఉన్న స్వేన అనుశబ్దము ఇందుకు కారణము**. ఇత్యాదులతో వైరుధ్యము వస్తుంది.

కనుక అభేదమే స్వాభావికమైనది. భేదము మాత్రము జీవులకు పరమాత్మకున్నూ ఒకరితో ఒకరికి బుద్ధి, ఇంద్రియాలు దేహము అనే ఉపాధులవల్ల ఏర్పడుతుంది. బ్రహ్మనిరవయవుడు అన్నిచోట్లా ఉండేవాడూ ఐనప్పటికిన్నీ ఆకాశము ఎలాగైతే ఘటాదుల చేత వలె భేదము కలదిగా కనిపిస్తున్నదో అట్లాగే బుద్ధ్యాదులనే ఉపాధులచేత బ్రహ్మలోనూ భేదము తప్పక ఏర్పడుతుంది. బుద్ధ్యాదులైన ఉపాధులతో సంయోగము వలన బ్రహ్మలోభేదము ఏర్పడుతుంది. అపుడు అన్యోన్యాశ్రయదోషము రాదా! అని అనగూడదు. ఉపాధులకు, వాటితో సంయోగమున్ను కర్మవలన ఏర్పడుతున్నది. అంతేకాకుండా క్రర్మప్రవాహము అనాదిగా కొనసాగుతున్నట్టిది. మొత్తమ్మీద చెప్పబడుతున్న మాట ఇది.

పూర్వకర్మలతో బాగుగా బిగించబడిన జీవుడినుండియే తనకు సంబన్ధించినట్టి ఉపాధి పుడుతున్నది. దానితో కూడియున్న వానివలన కర్మ జనిస్తున్నది. మళ్ళీ కర్మవలన ఉపాధి, ఉపాధి వలన కర్మ. ఇది ఒక చక్రము. బీజాంకుర న్యాయము ప్రకారము కర్మ ఉపాధి సమ్బన్ధము అనాదియైనందున అది ఒకదోషము కాదు. అందువలన జీవులకు

ఇతర జీవులతో, అట్లాగే జీవులకు బ్రహ్మకున్నూ అభేదమే స్వాభావికము. భేదము మాత్రము ఉపాధివల్ల వచ్చినట్టిదే. ఉపాధులకున్నూ పరస్పరము మరియు బ్రహ్మతోనూ అభేదము వలెనే భేదము కూడా సహజసిద్ధమే. ఉపాధులకు మరొక ఉపాధి లేదు. ఉన్నదని అంగీకరించితే దానికి ముగింపులేకుండాపోయి అనవస్థ ఏర్పడుతుంది. అందువల్ల జీవుని యొక్క కర్మకు తగినట్లుగా బ్రహ్మతో భిన్నాభిన్న స్వభావాల కలవే ఐన ఉపాధులు పుట్టుకొస్తున్నాయి.

**దీనికి ధ్యాననియోగవాది సమాధానము చెపుతున్నాడు :** అద్వితీయమై సచ్చిదానంద స్వరూపమైన బ్రహ్మను ధ్యానించే విషయంలో నియోగాన్ని విధించుతున్నది వేదాంతవాక్యముల సముదాయము. కనుక వేదాన్త వాక్యాలచేత అభేదమే ప్రతీతము అవుతున్నది. భేదాలకు పట్టుగొమ్మలైన కర్మశాస్త్రాలచేత మరియు ప్రత్యక్షాది ప్రమాణాలచేతనున్నూ భేదము కనిపిస్తున్నది. ఈ భేదాభేదాలకు పరస్పరము విరోధము ఉన్నది కాబట్టి, అనాదియైన అవిద్యను మూలముగా కలిగియున్నందున భేదప్రతీతియే తేటతెల్లము అవుతున్నది కాబట్టి అభేదమే పరమార్థము అని చెప్పబడింది. ఆ విషయంలో భేదాభేదములు రెండు కూడా ప్రతీతి వల్ల ఏర్పడినవే కనుక వైరుధ్యము లేదు అని ఏదైతే చెప్పినారో అది సరియైనది కాదు. సాధారణంగా ఏదో ఒక విశేషాన్ని బట్టి ఒకానొకనికి విలక్షణత్వము ఉండడమే వానికి ఇతరులతో భేదము అని చెప్పబడుతున్నది. అట్లా ఆ ఇద్దరిలోనూ పరస్పరము వైలక్షణ్యము లేకపోవడమే అభేదము. అక్కడ ఆ విధంగా వైలక్షణ్యము ఉండడము లేకపోవడములు ఒకేచోట కలిసి ఉండడాన్ని పిచ్చివాడు తప్ప మరెవ్వడూ చెప్పడు. ఒప్పుకోడు కూడానూ.

కారణాత్మనా జాత్యాత్మనా అభేదము. కార్యాత్మనా వ్యక్త్యాత్మనానున్నూ భేదము అని ఆకారములో భేదము ఉంటున్నది కనుక విరోధము లేదు అని అంటే మేము ఒప్పుకోము. వికల్పము చేసితే మీ వాదము తట్టుకొని నిలబడజాలదు. అదేమంటే ఆకారములో భేదము చెపుతున్న నీవు దీనికి సమాధానము చెప్పు. ఒక్క వస్తువునందే ఆకార భేదము మరొక ఆకారము నందు అభేదము అని అభిప్రాయమా? లేక రెండు ఆకారాలయందు వస్తుగతము లైన భేదాభేదములు రెండు అనియా? మొదటి కల్పము ప్రకారమైతే వ్యక్తిగతంగా భేదము. జాతి గతంగా అభేదము ఐనపుడు ఒకేదానికి రెండు లక్షణాలు ఉండడము కుదురదు. కాదండీ! జాతి వ్యక్తి అనే రెండూ కలిసియే ఒక వస్తువు అని అంటావా? అప్పుడు ఆకారభేదముంటున్నందువలన

అభేదాన్ని / అవిరోధాన్ని వదులుకున్నట్లవుతుంది. ఎందుకంటే ఒక్కవస్తువు నందు విలక్షణత్వము, అది లేకుండుట అనేవి రెండూ పరస్పర విరుద్ధములని ముందే చెప్పినాము. ఇక రెండవ కల్పము ప్రకారము అన్యోన్యవిలక్షణము లైన రెండు ఆకారాలు ఉండడము, దానికి ఆశ్రయమైన వస్తువున్నూ ఉండడము అని మూడవ ఆకారాన్ని కూడా ఒప్పుకున్నట్లయితే ఆ మూడింటికిన్నీ వైలక్షణ్యమే ప్రతిపాదించినట్లవుతుంది. కానీ అభేదాన్ని చెప్పినట్లు కాదు. ఆకారములు రెండింటిచేత నిర్వహింపబడుతున్న అవిరోధము, దానికి ఆశ్రయమైన వస్తువునందు భిన్నాభిన్నత్వము అని అంటున్నావా? ఐతే తనకన్నా విలక్షణమైనవై తనకన్నా వేరయిన రెండు ఆకారాలు తనయందు విరుద్ధ ధర్మాలు రెండింటికి చేరియుండడానికి నిర్వాహకము ఎట్లా అవుతుంది? అప్పుడు అది విలక్షణము కాకపోయేది ఎట్లాగా? రెండాకారాలు, వాటిని కల్గియున్న రెండింటికిన్నీ రెండు లక్షణాలు కల్గియుండడమనే **ద్వ్యాత్మకతను** ఒప్పుకున్నట్లయితే వాటినన్నింటినీ నిర్వహించే మరొక వస్తువును కల్పించుకోవలసివస్తుంది. మళ్ళీ దానికి మరొక నిర్వాహకము దానికి మరొక్కటిని కల్పించుకుంటూపోతే అనవస్థాదోషము వస్తుంది. ఎదురుగా ఉన్న ఒక వ్యక్తిని / వస్తువును చూచినపుడు ఇతడు ఒకడు, ఇది ఒక వస్తువు అని తోచినట్లు సాధారణమైన వస్తువులో కూడా ఒకే విధమైన / ఏకరూపమైన ప్రతీతి పుట్టదు. ఎందుకంటే? ఏవిషయంలోనైనా "**ఇది ఇటువంటిది**" అని ఒక విశేషముతో కూడిన విశిష్టవస్తువే ప్రతివాని బుద్ధికిన్నీ సర్వసాధారణంగా తోస్తుంది. అటువంటి ప్రతీతిలో ప్రకారాంశము / విశేషణాంశము **జాతి.** ప్రకార్యంశము / విశేష్యము విశిష్టము **వ్యక్తి**. కనుక ప్రతీతి ఏకాకారముగా ఉండదు / లేదు.

ఇందువల్లనే జీవుడికి కూడా బ్రహ్మతో భిన్నాభిన్నత్వము సంభవించదు. అందుచేత అభేదము అనన్యధా సిద్ధమైన శాస్త్రము కారణముగా తెలియవస్తున్నది కనుక భేదమున్నదని భ్రమపడడము అవిద్య కారణంగానే ఏర్పడుతున్నది. అట్లాగైతే బ్రహ్మకే అజ్ఞత్వము దానివల్ల జన్మజరామరణాదులు అనే దోషాలు వచ్చిపడుతాయి. దానివల్ల **1) యః సర్వజ్ఞః సర్వవిత్ 2) ఏషఆత్మా అపహతపాప్మా** ఇత్యాది శాస్త్రాలు బాధింపబడుతాయి గదా! అలాగా కాదు. అజ్ఞానాది దోషాలు పరమార్థాలుకావు. కనుక బ్రహ్మకు అంటవు. కానీ నీకు మాత్రం ఉపాధి బ్రహ్మకంటే వేరుగా మరొక వస్తువు లేదని అంటున్నావు కనుక బ్రహ్మయందే ఉపాధి సంసర్గము దానివల్ల కలిగిన జీవత్వము, అజ్ఞత్వము మున్నగు దోషాలు పరమార్థంగానే సంభవించుతవి. ఐతే నిరవయవము,

విడదీయడానికి వీలుకాని వాడైన బ్రహ్మ యందు ఈ సంబన్ధము కల్గియున్నదోషాలు ఆ బ్రహ్మను నరికి (ఛిత్వా) భేదము కలవాడుగా భేదించి (భిత్వా) సంబంధము కలవికావు. కాలేవు. సమ్బన్ధాన్ని పొందలేవు. అయితే బ్రహ్మ స్వరూపముతో కలిసి (సంయుజ్య) ఆయనయందే తమ పనులను చేసుకుంటాయి.

**ఒకవేళ నీవిట్లా అనుకుంటున్నావో ఏమో!** ఉపాధితోకూడిన బ్రహ్మనే జీవుడు. ఆయన అణువంత పరిమాణములో ఉంటాడు. అవచ్ఛిన్నతలేని ఆయనకు ఆ అణుత్వ పరిమాణము అంతే పరిమాణములో ఉండే మనస్సువల్ల కలుగుతుంది. మనస్సుకైనా ఆపరిమాణము అనాదిగా ఉంటూ ఉన్నదే. ఈవిధంగా ఉపాధితో కూడి అంశముతో సంబన్ధాన్ని పొందియున్న దోషాలు ఉపాధి దోషములేని పరబ్రహ్మకు అంటబోవు అని.

ఇపుడు మిమ్ములను ఒకటి అడుగవలసి ఉన్నది. ఉపాధితో ఛేదించబడిన బ్రహ్మఖండమే అణురూపుడైన జీవుడా? లేక విడదీయబడకుండానే ఉన్న బ్రహ్మలో అణురూపమైన ఉపాధితో కూడిన బ్రహ్మ ప్రదేశవిశేషమా? లేక ఉపాధితో కలిసియున్న బ్రహ్మ స్వరూపమా? లేక ఉపాధి సంయోగము కల మరొకచేతనుడా? ఏదీ కాకుంటే ఉపాధియేనా? అని.

ఇక బ్రహ్మనుచీల్చలేము కనుక మొదటి కల్పము కాదు. అపుడు జీవునికి ఆదిమత్వము వస్తుంది. అసలు ఛేదనము అంటే ఒకటిగా నున్నదాన్ని రెండుగా చేయడమే కదా! ఇక రెండవ కల్పానికి వస్తే బ్రహ్మయొక్క ఒకానొక ప్రదేశములో ఉపాధితో సంబన్ధము ఉన్నందువల్ల ఔపాధికమైన దోషాలు అన్నీ ఆభాగానికే చెందుతవి. ఉపాధి తొలగిపోతే ఉపాధితో తాను కలిసియున్న బ్రహ్మ ప్రదేశాన్ని ఆకర్షించుకొని పోవడం కుదరదు కనుక ప్రతిక్షణము ఉపాధితో కలిసియున్న బ్రహ్మ ప్రదేశము వేరవుతుండడము వల్ల క్షణక్షణానికి బంధము మోక్షము ఏర్పడ్తూ పోతూ ఉంటాయి. తనతో కూడిన ఉపాధి దోషం ఆకర్షించుతున్నందువల్ల ఛేదింపరానిది కావున మొత్తంగా బ్రహ్మనే ఆకర్షించకతప్పదు. బ్రహ్మకు తనలో అంశము అంటూలేదు. అంతటా నిండియున్నందువల్ల కూడా బ్రహ్మను ఆకర్షించడం కుదరదు అని అంటే అప్పుడు ఉపాధియే తొలగిపోతుంది కనుక మునుపు చెప్పిన దోషమే ఎదురౌతుంది. ఇక అచ్ఛిన్నుడైన బ్రహ్మ యొక్క ప్రదేశాలలో అన్ని ఉపాధులతో సంసర్గము కలిగితే జీవులందరూ బ్రహ్మయొక్క, బ్రహ్మలోని ప్రదేశాలు ఔతున్నందున అందరినీ బ్రహ్మను వలెనే ఒక్కరిగా తలచవలసివస్తుంది. ప్రదేశాలు వేరువేరు కాబట్టి జీవులను ఒక్కరిగా

తలచలేము అనేట్లయితే ఏ ఒక్కడికిన్నీ తన ఉపాధి తొలగిపోతుండగా అతనికి కొంచెము కూడా తెలియకుండా పోతుంది.

ఇక మూడవ కల్పములో బ్రహ్మ స్వరూపానికే ఉపాధితో సమ్బన్ధము కారణంగా జీవత్వము వచ్చి పడ్తుంది. దానితో ఉపాధి బ్రహ్మ కంటే వేరుగా అనుపహిత –ఉపాధితో సమ్బన్ధము లేని – బ్రహ్మ లభించకుండా పోగలదు. అంతే కాకుండా అన్ని దేహాల్లోనూ వేరువేరు జీవులు కాకుండా ఒక్కడే జీవుడుంటాడు. ఇక నాలుగవ కల్పములో బ్రహ్మకంటే వేరుగా నున్నవాడు జీవుడే అవుతాడు కాబట్టి జీవులలో భేదానికి కారణమైన ఔపాధికత్వాన్ని విడిచి పెట్టవలసి వస్తుంది. చివరిదైన కల్పములో చార్వాక పక్షాన్ని స్వీకరించినవారౌతారు.

కావున అభేదాన్ని చెప్పే శాస్త్రము యొక్క బలముతో భేదమంతటికీ అవిద్యయే మూలమని అంగీకరించడమే మేలు చేయగలదు. అందువల్ల ప్రవృత్తి నివృత్తి రూపమైన ప్రయోజనము కనిపించుతున్నది. శాస్త్రమే ఇందుకు ప్రమాణము. ఐనా ధ్యానమును చేయమని విధించుతున్న శాస్త్రానికి విధేయమైనందువల్ల వేదాన్త వాక్యాలకు బ్రహ్మ స్వరూపమును తెలిపే విషయంలో ప్రామాణ్యమున్నది.

ఈ వాదాన్ని – **ధ్యాననియోగివాదాన్ని – మీ మాంసకుడు దూషించుతున్నాడు.** ఇలాగా మీరు చెప్పింది కూడా సరికాదు. ధ్యానవిధికి శేషమై ఉన్నప్పటికీ వేదాన్త వాక్యాలకు బ్రహ్మ ఉన్నాడనే అర్థము యొక్క సత్యత్వానికి ప్రామాణ్యము కుదరదు. ఇదీ మేము చెప్పదలచుకున్నది. బ్రహ్మ స్వరూపాన్ని తెలియపరచే వాక్యాలు ధ్యానవిధితో ఏకాభిప్రాయాన్ని కలిగి బ్రహ్మ స్వరూపము నందు ప్రామాణ్యాన్ని ప్రతిపాదిస్తున్నాయా? లేక స్వతంత్రముగా నేనా? అని సందేహము. వాటితో ఏకవాక్యత్వాన్ని కల్గినవే అయ్యేట్లుంటే ధ్యానవిధినే బలపరుస్తున్నటువంటివి కాబట్టి బ్రహ్మ స్వరూపాన్ని తెలుపడంలో ప్రమాణములు కాజాలవు. భిన్నవాక్యత్వము ఐనట్లయితే ప్రవృత్తి నివృత్తి రూపమైన ప్రయోజనము లేదు కాబట్టి అవి బ్రహ్మను తెలుపలేవు. ఐతే మీరిట్లాగా అనవచ్చు. ధ్యానమంటే స్మృతి సన్తతిరూపము. అది స్మరించదగినదాని చేత మాత్రమే నిరూపింపబడుతుంది. కనుక స్మరించదగిన విశేషము ఏది? అని ఆకాంక్ష కలిగినపుడు **ఇదం సర్వం యదయమాత్మా ఈ కనిపించేదంతా ఆత్మనే. అయమాత్మా బ్రహ్మసర్వానుభూః. ఈ ఆత్మ సర్వమును అనుభవించేడివాడు. సత్యం జ్ఞానమన్తం బ్రహ్మ. ఈ బ్రహ్మ త్రికాలములలోనుండు నట్టివాడు. జ్ఞానమే స్వరూపముగా కలవాడు.**

**దేనిచేతనూ పరిచ్ఛిన్నము కానివాడు.** ఇత్యాదులు బ్రహ్మస్వరూపాన్ని అందులోని విశేషాలనున్నూ అందజేస్తున్నాయి. దానితో ఏకవాక్యతను పొందినట్టివి బ్రహ్మ అనబడేవస్తువు ఉన్నట్టు తెలుపడంలో ప్రమాణాలు అవుతవి అని. ధ్యానవిధికి దేనిని ధ్యానం చేయాలి? అని స్మరించదగినదాని గురించి స్మర్తకు విశేషాపేక్ష ఉన్నప్పటికీ **నామబ్రహ్మ నామమే బ్రహ్మ** ఇత్యాదులయందు దృష్టిని నిలుపండి అని చెప్పినట్లు యథార్థంగా వస్తువు లేక పోయినా ధ్యానము చేయడం కుదురుతున్నందున ధ్యేయము సత్యమై ఉండాల్సిన అవసరము లేదు. అందువల్ల వేదాన్తవాక్యాలకు ప్రవృత్తినివృత్తి రూపమైన ప్రయోజనము లేదుకాబట్టి ధ్యానవిధికి చెందినవే ఐనా ధ్యేయమైన వస్తువు యొక్క విశేష స్వరూపాన్ని అందించడములో మాత్రమే పని ముగిసిపోతున్నది. వేదాన్త వాక్యాలు స్వతంత్రములే ఐనప్పటికీ చిన్నపిల్లలకు, రోగాలచేత బాధపడుతున్నవారికి ఆయా పదార్థాలు ఔషధాల గురించి ప్రశంసించుతూ బుజ్జగించుతూ మాట్లాడిన మాటలవలె జ్ఞానమాత్రము చేతనే పురుషార్థము దాకా సిద్ధి కలుగుతున్నది. కావున పరినిష్పన్న వస్తువు ఐన బ్రహ్మను గురించి సత్యత్వము తెలియరావడము లేదు గనుక బ్రహ్మ శాస్త్ర ప్రమాణము కలవాడు కాడని తేటపడుతున్నది.

ఇపుడు సిద్ధాన్తి తన నిర్ణయాన్ని ప్రకటిస్తున్నాడు. తత్తు సమన్వయాత్ అని. సమన్వయః – చక్కగా అన్వయించుట. పురుషార్థమగుటచేత సమన్వయము అని అర్థము. పరమ పురుషార్థ స్వరూపుడైన తనకన్న మించినది లేని ఇంత అని చెప్పరాని ఆధిక్యమే స్వరూపముగా గల ఆనందమూర్తి యైన బ్రహ్మను తెలియపర్చునదిగా వేదవాక్యము ఉండి తాను చెప్పబడే వాడైయున్నందున ఆయనతో తత్ = ఆ శాస్త్ర ప్రమాణకత్వము సిద్ధించుతూనే ఉన్నది అని అర్థము. అన్నిరకాలైన దోషాలను దూరముగా తరిమివేసి సాటిలేని గొప్పదైన ఆనందాన్ని స్వరూపముగా గల వాడగుటచేత ప్రాప్యములలో అత్యున్నతమైన ప్రాప్యముగా బ్రహ్మను బోధించుతూ వేదాన్తవాక్యములగణము ప్రవృత్తి నివృత్తులతో సంబన్ధము లేకుండా ఉన్నందున ప్రయోజనాన్ని గలిగించగలవాడు కాడని చెపుతున్నవాడు రాజప్రాసాదాలలో నివసించే రాజపురుషుడు / రాకుమారుడు కుక్కల దొడ్లలోకి / వాటిని పెంచుకుంటూ అదే వృత్తిగా బ్రతికే వారి యిండ్లల్లోకి దూరకపోవడం వలన అతడు పనికిరాని వాడనడం సరికాదు. ఇది ఇక్కడ చెప్పబడుతున్నమాట –

అనాదియైన కర్మరూపమైన అవిద్య చేత కప్పబడినందువలన, పరుడెవ్వడు అపరుడెవ్వడు? తత్వము ఏది అనే విషయాల గూర్చి తెలియని వారు ఐన దేవతలు, అసురులు, గంధర్వులు, సిద్ధులు, విద్యాధరులు, కింనరులు, కింపురుషులు, యక్షులు, రాక్షసులు, పిశాచులు, మనుష్యులు, పశువులు, పక్షులు, పాములు, తొండలు మొదలైన పాకుడు జన్తువులు – చెట్లు, పొదలు, తీగలు, గరకపోచలు మొదలైనవారు, స్త్రీలు, పురుషులు, నపుంసకులు, అనే భేదాల చేత వేరు చేయబడిన క్షేత్రజ్ఞులు, ధారక, పోషక, భోగ్య విశేషాలుగా ఆయా వస్తువులను అనుభవించడానికి కట్టడి చేయబడిన వారు, ముక్తులు, తనకున్నూ భేదము / తేడా లేకుండా అనుభవము ఏర్పడుతుండగా స్వరూపము, రూపము, గుణములు వాటియొక్క గొప్పతనమును కలిగి పలురకాలైన ఆశ్చర్యకరాలైన చేష్టలు చేయడము ద్వారా ఆనందాన్ని కలిగించుతూ ఉండే పరంబ్రహ్మ ఉన్నాడు అని తెల్పుతూనే వాక్యము / వేదము ప్రయోజనాలను కలిగించుతూనే ఉన్నది. ప్రవృత్తి, నివృత్తులతో సంబన్ధమున్న వాక్యమైతే పురుషార్థముతో అన్వయ జ్ఞానము కలుగనంతవరకు ప్రయోజనాలను సిద్ధింపచేయజాలడు.

ఇటువంటి పరంబ్రహ్మ ఎట్లాగా పొందబడుతాడు అని కోరిక కల్గినపుడు **బ్రహ్మవిదాప్నోతి పరమ్ 2) ఆత్మానమేవలోకముపాసీత వేదన, ఉపాసన ఆది శబ్దాలతో ఉపాసనము బ్రహ్మను చేరుకోవడానికి మార్గముగా విధించబడుతున్నది.** ఎలాగంటే తనయింటిలో బంగారు పాతర నిధి ఉన్నదని చెప్పిన వాక్యము విన్న పురుషుడు నిధి ఉన్నదని తెల్సుకొని సన్తోషపడి తరువాత దాన్ని చేజిక్కించుకోవడానికి ప్రయత్నిస్తాడు. ఒక రాజకుమారుడు చిన్నతనంలో సాటి బాలురతో కలిసి ఆడుకోవడంలో ఆసక్తుడై రాజభవనాన్ని విడిచి బైటకువచ్చి దారి తప్పి ఎక్కడికో వెళ్ళిపోతాడు. రాజుగారు కూడా తన కుమారుడు తప్పిపోయినాడు. దొరుకలేదని విచారించి చేసేదేమీలేక ఊరుకున్నాడు. జాడదొరుకక పరిభ్రమిస్తున్న రాకుమారుడిని ఒకానొక బ్రాహ్మణుడు చేరదీయగా ఆయనచేత పెంచబడి పెరిగి పెద్దవాడయి వేదశాస్త్రాలనున్నూ ఆసాంతము పూర్తిచేసుకొని పదహారేండ్ల ప్రాయముతో సర్వకళ్యాణ గుణాకరుడై ఉంటూ మీతండ్రి సర్వలోకాధిపతి. గాంభీర్య ఔదార్య వాత్సల్య సౌశీల్య శౌర్య పరాక్రమాది గుణసంపన్నుడు తప్పిపోయిన నీరాకకోసం ఎదురుచూస్తూ పట్టణములో ఉన్నాడని **"తెల్సిన పెద్దమనిషి చెప్పిన మాట"** విన్న వెంటనే నేను జీవించియున్నవాడి కుమారుడను. నా తండ్రి సర్వసంపదలతో తులతూగుతున్నాడని ఆనందపడిన

వాడవుతున్నాడు. రాజుగారున్నూ తన కుమారుడు బ్రతికియున్నాడు. ఆరోగ్యవన్తుడు. చూడచక్కనివాడు. నేర్వవలసిన వాటినన్నింటినీ నేర్చినట్టివాడు. అని విని సమస్త పురుషార్థాలను పొందిన వాడు అవుతున్నాడు. ఆ తరువాత అతడిని తన వద్దకు చేర్చుకోవడానికి తగు ప్రయత్నము చేస్తాడు. ఆ తరువాత వాళ్ళిద్దరూ కల్సుకుంటారు.

పరినిష్పన్నమైన వస్తువును గురించి తెలిపే వాక్యము దాని జ్ఞానము మాత్రము చేతనే పురుషార్థము సిద్ధించుతున్నందున బాల ఆతురఆదులను ప్రేరణ కల్గించుట కొరకు చెప్పిన మాటల్లాగే యథార్థమైన వస్తువు ఉన్నదనుటలో ప్రామాణ్యము కలది కాదు అని ఏమాటను చెప్పినారో అది మంచిమాట కాదు.

అర్థ సద్ భావములేదు అని నిశ్చయింప బడినప్పటికీ తెల్సినట్టి అర్థము పురుషార్థాన్ని సాధించజాలదు. బాల ఆతురాదులు కూడా ఏదో ప్రయోజనము కలుగుతుందనే భావనతో సంతోషపడుతారు. వాళ్ళకే గనుక ఉపచ్ఛందనాది వాక్యాలద్వారా కల్గిన జ్ఞానముతో ఇందువల్ల ప్రయోజనము లేదని తెల్సినపుడు అపుడే వాళ్ళకు వట్టిమాటలవడంచేత ఇంతకుముందే కలిగిన హర్షము వంటివి తొలగిపోతాయి. ఉపనిషద్ వాక్యాలలోనూ బ్రహ్మ ఉన్నాడనే విషయమునందు నిశ్చయము లేదని తెలిసినపుడు బ్రహ్మను గురించిన జ్ఞానము ఉన్నప్పటికీ అది పురుషార్థముగా పరిణమించదు.

కావున **యతోవాఇమాని భూతాని జాయన్తే** ఇత్యాదులైన వాక్యాలు నిఖిల జగాలకు ఒకే కారణమైనవాడు నిరస్త నిఖల దోషగన్ధుడు సర్వజ్ఞుడు సత్యసంకల్పత్వాది అనన్త కళ్యాణ గుణాకరుడు అనవధికాతి శయా నందుడూ ఐన పరంబ్రహ్మ ఉన్నాడని బోధిస్తున్నవి. అని తేలింది. **అని సమన్వయాధికరణము.**

**చతుస్సూత్రి ముగిసింది**

★ ★ ★

## ఇక ఈక్షత్యధికరణము

**బ్ర.సూ. ఈక్షత్యధికరణమ్ 1-1-05 : ఈక్షతేర్నాశబ్దమ్ (సూ) : యతోవా ఇమాని** మొదలుగా గల వాక్యాలు జగత్ కారణము ఐన వాడిని గురించి తెలుపుతున్నవి. వాటి చేత ప్రతిపాదింపబడేవాడు సర్వమూ (బాహ్యాభ్యన్తర విషయాలతోసహా)

తెల్సినవాడు విచిత్రమైన సృష్టిని చేయగల శక్తి కలవాడు అన్నిరకములైన ప్రకృతి వల్ల కలిగే హేయగుణాలకు ప్రత్యనీకుడు సమస్త కళ్యాణగుణాలకూ ఒకే ఒక నెలవు ఐనవాడు బ్రహ్మ/ఆయనను గురించి తెల్సుకోవడానికి ప్రయత్నం చేయాలి అని చెప్పబడింది. ఇప్పుడు ఈక్షతేర్నాశబ్దమ్ అనే ఈ సూత్రము ద్వారా జగత్కారణాన్ని చెప్పే వాక్యాలద్వారా ఆనుమానికము ప్రధానము మొదలైన పదాలచేత వ్యవహరింపబడే ప్రకృతికి జగత్ కారణము కావడానికి తగిన యోగ్యతలేదని త్రోసివేస్తున్నారు.

ఛాందోగ్యోపనిషత్తులో ఇట్లాగా పఠింపబడుతున్నది. **సదేవసోమ్యేదమగ్ర అసీత్. ఏకమేవాద్వితీయమ్. తదైక్షత బహుస్యామ్. ప్రజాయేయేతి తత్తేజోఽసృజత.** సోమ్యుడా! సృష్టి జరుగడానికి మునుపటికాలములో ఈ కనిపించే ప్రపంచమంతా సద్ అనబడుతూ ఒక్కటిగానే ఉండేది. అది ఒక్కటే. దానికి నిమిత్త కారణము సహకారి కారణములుగా మరే వస్తువుతోడుగా లేకుండినది. ఆ సత్తు అనబడేది నేను అనేకములుగా అగుతాను. అందుకొరకు జన్మించుతాను అని సంకల్పించినది. అటు పిమ్మట తన సంకల్పాన్ని నెరవేర్చుకొనుట కొరకు ముందుగా తేజస్సును సృష్టించినది అని మొదలైన రీతిగా.

ఈ విషయంలో సందేహము కలుగుతున్నది. ఈ వాక్యములోని సత్ శబ్దము చేత చెప్పబడేది జగత్తు పుట్టడానికి కారణము ఐనట్టిది. ఇతరులచే (సాంఖ్యుల చేత) కారణముగా చెప్పబడినట్టిది ఆనుమానికము, ప్రధానము అనుపేర్లు గలిగినట్టి ప్రకృతియా? లేక పరంబ్రహ్మనా? ఈ బ్రహ్మయే యతోవా ఇమాని భూతాని జాయన్తే అనే వాక్యాదులచే చెప్పబడినాడు కదా! ఈ ఇద్దరిలో కారణము ఎవరు? అని.

ఐతే ఏమి సిద్ధించింది? ప్రధానము అనియే. ఎందువల్ల నంటావా? **సదేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవ** అనే చోట **ఇదమ్** అనే పదము చేత చెప్పబడేది చేతనుడికి రుచికరంగా అనుభవించదగినట్టిది; సత్యము రజస్సు తమస్సు అనే మూడు గుణాలను ప్రధానంగా గల్గినట్టిది; ఆకాశము మొదలుగా గల పలురకాలైన వికారాలతో వివిధ అవస్థలతో కనిపించుతున్న వస్తువుకు ఇపుడున్న దానికి పుట్టడానికి కారణమైన అవస్థలో ఉన్న దానిని గుర్తించి తెలుపుతున్నది. **కారణమైన ద్రవ్యమే** మరొక అవస్థను పొందితే అపుడు అది **కార్యము** అని పిలువబడుతుంది. అందువల్ల **"ఏ ద్రవ్యమైతే ఎలాంటి స్వభావాన్ని కల్గియుండి కార్యమనబడే అవస్థలో ఉంటున్నదో ఆ ద్రవ్యమే అటువంటి స్వభావాన్ని కలిగియుండి కారణావస్థలోనూ ఉంటుంది."** ఇపుడు

సత్త్వాదిగుణాలు ఎక్కువతక్కువలుగా ఉండడంవల్ల ఏది కార్యము అని అనబడుతున్నదో అది సత్త్వరజస్తమో గుణాలు అన్నీ సరిసమానంగా ఉన్నప్పుడు కారణము అని పిలువబడుతున్నది. దాన్నే ప్రధానము అని అంటాము. అట్టి గుణ సామ్యావస్థలోనున్నదే ప్రస్తుతము కనిపించుతున్న సకల భేదాలలో ఏ ఒక్కటీ లేకుండా ఉన్నట్టిదే సత్ మాత్రము అనబడుతుంది అని **సదేవ సోమ్యేదమగ్రఆసీత్. ఏకమే వాద్వితీయం** అనే వాక్యము చేత చెప్పబడుతున్నది. కాబట్టే కార్య కారణాలకు ఏకత్వము సిద్ధించుతున్నది. అట్లయినపుడే ఏక విజ్ఞానేన సర్వవిజ్ఞాన ప్రతిజ్ఞ **కారణమైన ఒక వస్తువును గురించి తెల్సుకుంటే కార్యములు ఐన సర్వవస్తువులను గురించి తెల్సుకోవడం కుదురుతుంది. అనే ప్రతిజ్ఞ** పొసగుతుంది. అట్లా కానప్పుడు **యథాసౌమ్యేకేన మృత్ పిండేన** అని ఆరంభించి మట్టి ముద్ద దాన్ని కారణంగా చేసుకొని కనిపించుతున్న కుండ, మూకుడు, చిప్ప, గురిగి, బాన, గూన వంటి కార్యములన్నీ – దృష్టాన్తము, దార్ష్టాన్తికములన్నీ – భిన్నరూపాలు కావలసివస్తుంది అని మహానుభావుడు ఆప్తుడూ ఐన కపిలుడు చెప్పినట్లు ప్రస్తుత మీ జగత్కారణాది వాక్యము చేత ప్రధానమే జగత్కారణముగా ప్రతిపాదింపబడుతున్నది. అంతేకాదు ఇక్కడ చూపిన ఏకవిజ్ఞానేన సర్వవిజ్ఞాన ప్రతిపాదన రూపమైన వాక్యము తర్కశాస్త్రప్రతిపాదితమైన అనుమాన ప్రమాణరూపములో కనిపిస్తున్నది. కనుక ఈ వాక్యములోని సత్ శబ్దము చేత చెప్పబడేది ప్రధానమే తప్ప బ్రహ్మ కాదు.

ఇక్కడ రెండు అనుమాన ప్రయోగాలు శ్రుతప్రకాశికలో ఇవ్వబడినాయి. వాటి స్వరూపము ఇది 1) జగత్ స్వానన్యోపాదానకం. కార్యత్వాత్. ఘటవత్. **ఈ ప్రపంచము తనకన్న వేరయిన దాన్ని ఉపాదానముగా కలది కాదు. అది కార్యము ఐనందువల్ల ఉదా: మట్టి కుండవలె.** 2) ఇదమ్ జగత్ స్వకారణైక జ్ఞానేన జ్ఞాతం భవతి. కార్యత్వాత్. ఏకమృత్ పిండాద్యారబ్ధఘటాదివత్. **ఈ జగత్తు తనకు కారణమైన ఒక వస్తువును తెల్సుకున్నట్లయితే తెలియబడుతుంది. అది కార్యమైనది కాబట్టి. ఒక్క మట్టి ముద్ద వంటి వాటి ద్వారా పుట్టింపబడిన ఘటాదుల వలెనే** అని.

ఇట్లాగా పూర్వపక్షము ఎదురైనప్పుడు దీనికి సమాధానమును చెప్పుతున్నాము. ఈక్షతేఃఽఈ క్షణరూపమైన సంకల్పము కారణంగా బ్రహ్మ చేతనే సృష్టి చేయబడింది. కాన అశబ్దము అనే పేరుతో వ్యవహరింపబడే ప్రధానము వలన కాదు అని.

ఏ వస్తువు విషయము నందు శబ్దము – వేదము స్మృతీతిహాసపురాణాదులు మాత్రమే ప్రమాణము కాదో అది అశబ్దము అని పిలువబడుతుంది. మరొక్క పేరు

అనుమానికము. అనుమాన ప్రమాణము చేత కారణముగా ఊహింపబడుతున్నది కనుక ఆనుమానికము అని. అనగా ప్రధానము అని అర్థము. అలాంటి ప్రధానము జగత్కారణాన్ని తెలిపే వేదవాక్యాలచేత ప్రతిపాదింపబడడము లేదు. ఎందువల్లననగా ఈక్షతి కారణంగా సత్ శబ్దము చేత చెప్పబడే వానియొక్క వ్యాపారము క్రియ/పనిలోని విశేషాన్ని తెలిపే ఈక్షతిధాతువు వినిపించుతున్నది కాబట్టి. ఎక్కడ? అని అంటావా? ఇదే ప్రకరణములో తరువాత **తదైక్షత బహుస్యాంప్రజాయేయ** అని. ఈక్షా/ఈక్షధాతువునకు "**దర్శనము**" అని అర్థము. ఇక్ అనుధాతువునకు "**స్మరణము**" అని అర్థము. ఈ విధమైన ఈక్షణమనే పనితో సమ్బన్ధము చేతనుడికేగాని చైతన్యము లేని ప్రధానముతో కుదురదు అసమ్భవం ఐన పని. అందువలన ఈ విధమైన జగద్వ్యాపారరూపమైన పనిని చేయడంలో చేతనుడే సమర్థుడు కాని ఇతరము కాదు. చిన్నచిన్నపనులు చేయడానికి కొద్దిపాటి తెలివితేటలున్నవాడు చాలుతాడు కాని అన్యుడు ప్రపంచాన్ని చిదచిన్మిశ్రమైన దాన్ని విచిత్రమైన వింతలతో కూడుకున్న దాన్ని సృష్టించడానికి అసాధారణ చైతన్యమున్నవాడే తగును. అలాంటి వాడు సర్వజ్ఞుడు, సర్వశక్తి, పురుషోత్తముడు మాత్రమే సచ్ఛబ్దవాచ్యుడు కాగలడు. అంతేకాదు సృష్టికి సమ్బన్ధించిన ఉపనిషత్ వాక్యాలన్నింటిలోనూ సంకల్ప/ఈక్షా పూర్వకంగానే సృష్టి చేయబడినట్లు తెలుపబడుతున్నది. **సఈక్షత లోకాన్ను సృజా ఇతి. సఇమాన్ లోకానసృజత.** ఆయన తలచినాడు లోకాలను సృష్టించాలని. అపుడు ఆ సంకల్పము చేసిన ఆయన లోకాలను పుట్టించినాడు **2) సఈక్షాంచక్రే. సప్రాణమసృజత్.** ఆయన సంకల్పించినాడు. అటుపిమ్మట ప్రాణమును సృష్టించినాడు. మొదలైన వాక్యాలు ఇందుకు ఉదాహరణాలు సుమా!

ఏమండీ! ఒక సందేహము. ఎక్కడైనా కార్యాన్ని బట్టే కదా! కారణము ఉంటుంది. ఐనప్పుడు బ్రహ్మ విలక్షణుడుగా కనపడుతున్నాడు. ఈ ప్రపంచమనే కార్యాన్ని పరిశీలించితే కారణముగా చెప్పబడే బ్రహ్మతో సమ్బన్ధము ఎక్కడా! పొసగడంలేదు గదా అని. నిజమే! ఆయన అన్ని కార్యాలకు తగినట్లుగా కారణమై ఉండగలడు. సర్వజ్ఞుడు. సర్వశక్తులూ సమృద్ధిగా ఉన్నట్టివాడు. సత్యసంకల్పుడు. పురుషోత్తముడు. సూక్ష్మ రూపాలుగా ఉన్న చిదచిత్తులను తన శరీరములో నిల్పుకొన్నట్టివాడు. చిదచిత్తులను తనకు శరీరముగా మల్చుకున్నవాడు. వాటిని నియన్త్రించే సమర్థుడు. తానువాటిలో ఉండటము చేత వానికి ఉనికిని కల్గించుతున్నట్టివాడు. దాన్నే వేదము ఇట్లాగా చెప్పింది. **పరాఽ స్య శక్తిః వివిధైవ శ్రూయతే స్వాభావికీ జ్ఞాన బలక్రియాచ.** ఈ బ్రహ్మకు ఉన్న

శక్తి చాలా గొప్పది. అది పలురకాలుగా నుంటుంది. ఇతరులవలన సంక్రమించినది కాదు. ఆయనకు అది స్వభావసిద్ధమైనట్టిది. అంతేకాదు. జ్ఞానము, బలము, క్రియలు కూడా అట్లాంటివే. **యస్సర్వజ్ఞః సర్వవిత్ యస్యజ్ఞానమయం తపః** జగత్కారణముగా చెప్పబడుతున్న ఏ బ్రహ్మ ఉన్నాడో అతడు సర్వజ్ఞుడు సమస్త పదార్థాలను గురించి పుట్టువు, పూర్వోత్తరాలూ తెల్సినవాడు ఆయావస్తువులలోని మానసిక సంభావనలూ మరియు అందుకు కారణమైన త్రిగుణాలు అందుకు కారణమైన కర్మలనున్నూ సమగ్రముగా తెల్సియున్నట్టివాడు. ఆయన తపస్సు ఆలోచన జ్ఞానము ప్రచురముగా కలది. **యస్యావ్యక్తం శరీరమ్. యస్యాక్షరమ్ శరీరం యస్యమృత్యుశ్శరీరమ్. ఏషసర్వభూతాన్తరాత్మా.** సృష్టికి కారణమైన బ్రహ్మకు అవ్యక్తము అని పిలువబడే మూలప్రకృతి శరీరము. అక్షరశబ్దము చేత చెప్పబడే కూటస్థ పురుషుడైన జీవుడు అక్షరుడు శరీరము. మృత్యువనబడే సంసారరూపకర్మశరీరము. ఇలాంటి ఈయన సర్వభూతములలో అన్తరాత్మగా నుంటున్నాడు అని. అందుచేత పరమాత్మ విలక్షణుడు ఐనా దృశ్యమాన ప్రపంచానికి కారణం అవుతున్నాడనే విషయాన్ని **నవిలక్షణత్వాత్** ఇత్యాది సూత్రాల వద్ద విపులంగా ప్రతిపాదించుతాము. ఇక్కడ మాత్రము సృష్టివాక్యాలు ప్రధానమును ప్రతిపాదించుటకు తగవు అని చెపుతున్నాము. కార్యకారణవస్తువిరోధాన్ని ఆ సూత్రాల వద్దనే తొలగించుతాము.

ఏకవిజ్ఞానేన సర్వవిజ్ఞానవాక్యము వద్ద ప్రతిజ్ఞాదృష్టాంతాలు కనిపిస్తున్నవి కనుక ఇది అనుమానరూపమైన వాక్యము అని మీరేదైతే చెప్పినారో అది తగినది కాదు. అనుమాన ప్రయోగములో ప్రతిజ్ఞ తరువాత హేతువుండి తీరాలి కదా! ఇక్కడ దాని ప్రస్తావన బొత్తిగా లేనేలేదు కదా! **యేనా శ్రుతం శ్రుతం భవతి** అనే వాక్యము వద్ద మాత్రము ఏకవిజ్ఞానేన సర్వం విజ్ఞాతమవుతుంది అని ప్రతిపాదించదల్చుకొనగా ఎట్టి పరిస్థితులలోనూ అది సంభవము కాదు అని గట్టి నమ్మకాన్ని కలిగి ఉన్నవాడికి దాన్ని తొలగించడము కొరకు అట్లాగా సాధ్యమవుతుందయ్యా అని చెప్పడంకొరకు మాత్రమే హేతువు లేకుండా దృష్టాన్తాన్ని ఎత్తి చూపడం జరుగింది. అంతే తప్ప ఆనుమానిక ప్రయోగము చేయబడలేదు. ఈక్షత్యాదుల శ్రవణము వలన అసాధారణమైన హేతువు సృష్టికి కారణముగా వినిపించుతున్నందువల్ల అనుమానపువాసనే ఇక్కడ లేదుగాకలేదు. మీరు చెప్పేది బాగానే ఉంది కానీ ఇక్కడ చేతనుడిలో ఉండే ముఖ్యార్థ్య ఐన ఈక్షణము ఇక్కడ చెప్పబడడం లేదు. ఐతే ప్రధానములో కనిపించే గౌణార్థమైన ఈక్షణము మాత్రమే ఇక్కడ చెప్పబడుతున్నది. తత్తేజ **ఐక్షత** అతేజస్సు సంకల్పించెను.

**తాఆప ఐక్షన్త** ఆ నీళ్ళుతల్చుకున్నవి. అనే ప్రయోగాల ద్వారా గౌణేక్షణమే తదుపరి ప్రకరణములో కనిపిస్తున్నది. కనుక ఇక్కడకూడా గౌణేక్షణమే కాని ముఖ్యేక్షణము కాదు. లోకములో కూడా ఇదే కనిపిస్తున్నది. ఏమిటంటే అచేతనములయందు కూడా చేతనుడిలో ఉండే ధర్మాలను ఆరోపించి చెప్పడము. ఎలాగంటే **వృష్టి ప్రతీక్షాః శాలయః** చేలు వర్షము కొరకు ఎదురుచూస్తున్నవి. **వర్షేణ బీజమ్ ప్రతిసంజహర్ష** వానకురువడంతో విత్తనము హర్షించినది. అని అందువలన ఇక్కడ చెప్పబడిన ఈక్షణము గౌణ ఈక్షణము అని. దీన్ని సూత్రకారుడే స్వయంగా ఖండించుతున్నాడు.

**గౌణశ్చేన్నాఽఽత్మ శబ్దాత్: 1-1-6:** ఈక్షణము గౌణము అని అనేట్లయితే కాదు. అక్కడే ఆత్మ శబ్దము వినిపిస్తున్నది కదా! అని. గౌణేక్షణ సాహచర్యము (గౌణము ముఖ్యము కానిది. అప్రధానమైనది. అటువంటి ఈక్షణము కలిగి ఉండడము) వలన సత్ శబ్దవాచ్యుడికి కూడా ఈక్షణవ్యపదేశము సృష్టికి ముందున్న, నియతమైన, తప్పని సరియై ఉన్న పూర్వావస్థతో కారణముగా ఉన్నట్టిది అనే అభిప్రాయము ప్రకారము గౌణమే అని ఏదైతే ఆ శంకను లేవనెత్తినావో అది తప్పు. **ఐతదాత్మ్య మిదం సర్వమ్. తత్ సత్యం. సఆత్మా.** ఈ కనిపించే ప్రపంచము అంతాకూడా ఇతడినే ఆత్మగా కలది. ఆయనలేకుండా ప్రవర్తించలేదు. బ్రహ్మాత్మకము అది నిజము. అతడే ఆత్మగా ఉన్నాడు. ఇదంతా అతనికి శరీరమే. అని సత్ శబ్దము చేత సృష్టికారణముగా చెప్పబడిన వాడిని ఆత్మ శబ్దముతో చెప్పినాడు. అనగా సారము ఇది. **ఐతదాత్మ్యమిదం సర్వం సఆత్మా** అని చేతనాచేతన మిశ్రితమైన ప్రపంచానికి సత్ శబ్దము చేత చెప్పబడేవాడు ఆత్మగా నున్నాడు అని ఉపదేశించుట ప్రధానానికే అన్వయించుకొనేట్లయితే అచేతనానికి మరొక అచేతనము ఆత్మగా ఉండడము ఎంతమాత్రమూ పొసగేది కాదు సుమా! అని.

కావున తేజస్సు, నీరు, పృథివీ మొదలైన పంచభూతాలకు కూడా పరమాత్మనే ఆత్మ ఐ ఉంటున్నాడు కాబట్టి తేజస్సు మొదలగు శబ్దాలు కూడా పరమాత్మకే వాచకాలు కాని మరొకరికి కావు. అనగా ఆయా రూపాల్లో ఉన్నందున అవి ఆయనకే వాచకాలు కానీ కేవలము శరీరంగా ఉన్న వాటిని గురించి తెలిపేవికావు. అదెట్లాగంటే! **హన్త! అహమిమాస్తి స్రోదేవతాః అనేన జీవేనాత్మనా అనుప్రవిశ్యనామరూపే వ్యాకరవాణి.** ఆహా ఏమినాభాగ్యము. ఈమూడుతేజోఽబన్నములనేదేవతలులభించినవి.వీటిలోనికి నేను ఈ జీవుడి ద్వారా ప్రవేశించి వీటికి నామమును, రూపాన్ని కలిగించుతాను. అని చెప్పినట్లు పరమాత్మ యొక్క అను ప్రవేశము ద్వారానే తేజస్సు మున్నగు భూతాలకు

వస్తుత్వము, ఆయా పేర్లను కలిగి వ్యవహరింపబడడం అనేది ఏర్పడుతున్నదని తెలుస్తున్నది. కావున తత్తేజ ఐక్షత,తా ఆపఐక్షన్త అని చేసిన ప్రయోగాలు కూడా ముఖ్య ఈక్షణార్థాన్నే చెపుతున్నాయి. కాని గౌణేక్షణమును మాత్రముకాదు. కనుక సాహచర్యము వల్ల నున్నూ తదైక్షత అని అన్నపుడు గౌణఈక్షణము కావచ్చుననే శంక దూరముగా త్రోసివేయబడుతున్నది అని సూత్రాభిప్రాయము.

ఇంకనూ ఈ చెప్పబోయే కారణము చేత కూడా ప్రధానము సత్ శబ్దము చేత చెప్పబడడము లేదు. **తన్నిష్ఠస్య మోక్షోపదేశాత్ 1–1–7** ఆ పరమాత్మను ఉపాసన చేసినవాడికి మోక్షము కల్గుతుందని చెప్పినందువల్ల ప్రధానము కారణం కాదు.

మోక్షాన్ని పొందాలని కోరుతున్న శ్వేతకేతువుకు **తత్వమసి** అనే వాక్యము ద్వారా నీవు సదాత్మకుడవే బ్రహ్మను ఆత్మగా కల్గినవాడవే సుమా అని ఆ విధంగా నీకు ఆత్మయైన పరబ్రహ్మను ఉపాసన చెయ్యి అని ఉపదేశించి ఆయన యందు నిష్ఠ గలవాడికి **తస్య తావదేవచిరమ్. యావన్న విమోక్ష్యే అథసమ్పత్స్యే.** పరమాత్మను ఉపాసిస్తూ ఆయనయందే నిష్ఠను కల్గి ఉన్న వాడికి శరీరమును విడిచివేయడమే ఆలస్యము. ఆ వెనువెంటనే బ్రహ్మ వద్దకు వెళ్ళిపోతాను. ఆయనను చేరుకుంటాను అని ఎదురుచూస్తుంటాడు. అని చెప్పినట్లు బ్రహ్మను చేరుకోవడములో శరీరము మాత్రమే అడ్డంకిగా నిలుస్తుంది. ఆ పని జరిగిన వెంటనే బ్రహ్మను చేరుకోవడమనే బ్రహ్మ స్వరూపమైన జ్ఞానానందమయమైన స్వరూపాన్ని పొందడమనే మోక్షము చేకూరుతుంది అని ఆచార్యుడు ఉపదేశిస్తున్నాడు. ఒకవేళ అచేతనమైన ప్రధానమే కారణమని ఉపదేశించినట్లయితే అపుడు తనను ప్రధానముగా కారణముగా కలవాడినిగా ప్రధానాత్మకుడుగా ఉపాసన చెయ్యి అని చెప్పినట్లయితే అది మోక్ష సాధనము అని ఉపదేశించడము కుదరదు. **యథాక్రతు రస్మిన్ లోకేపురుషోభవతి తథేతః ప్రేత్యభవతి** ఈ లోకములో ఏ లోకాన్ని ఏ ఫలాన్ని గురించి ఉపాసన చేస్తాడో వాడు ఈ లోకము నుండి వెళ్ళిన పోయిన పిదప ఆ లోకాన్ని ఆ దేవతను ఆ ఫలాన్నే పొందుతాడు – అని శ్రుతి చెప్పుతున్నది. కనుక ప్రధానాన్ని ఉపాసించిన అతడు అచేతనత్వాన్నే పొందుతాడు. చేతనుడు ఐనవాడు పరమ చేతనత్వాన్ని పొందడానికి బదులు చైతన్యము లేని మొద్దు/ జడస్వరూపాన్ని పొందవలసి ఉంటుంది. అది మోక్షము కాదు గదా తల్లిదండ్రులకంటే వేయిరెట్లు వాత్సల్యము/ప్రేమ గల వేదశాస్త్రము ఈ విధమైన తాపత్రయములచేత పీడింపబడుటకు కారణమైన అచిత్తును

ఉపాసించు దాన్నే చేరుకో అని ఏనాడూ చెప్పదు కదా! అపార సుఖస్వరూపుడైన పరంబ్రహ్మను ఉపాసించు ఆయన వద్దకే చేరుకో అని మాత్రమే చెప్పుతుంది. ఇది ఇట్లుంటే ఈ ప్రపంచానికి మూల కారణమని వాదించేవారు కూడా ప్రధానమును ఉపాసించితే మోక్షము కలుగుతుందని ఒప్పుకోవడము లేదు. పైగా ప్రకృతి సంపర్కము వ్యాధివంటిది అని తెల్సుకో దాన్ని వదిలించుకోవడానికి తగిన ప్రయత్నాన్ని చెయ్యి అని మాత్రమే ప్రదాన కారణవాదియైన సాంఖ్యమతము ఉపదేశిస్తున్నది.

ఇందు మూలముగా కూడా ప్రధానము కారణము కాదు. **హేయత్వ అవచనాచ్చ 1-1-08** హేయమైనదని చెప్పనందువల్ల ప్రధానము జగత్ కారణము కాదు.

ఒకవేళ ప్రధానమే కారణమని సత్ శబ్దము చేత చెప్పబడినట్లయితే అపుడు ముముక్షువు ఐన శ్వేతకేతువుకు ప్రదానాత్మకత్వము మోక్షము పొందడానికి అడ్డంకిగా నిలుస్తున్నందున హేయమైనది (వదిలించుకో దగినది. **ఓ హాక్ త్యాగే** అనిధాతువు) అనియే చెప్పవలసియుండింది. కానీ ఆ మాట చెప్పలేదు. పైగా సదాత్మకత్వత్వమే ఉపాదేయము/కోరి స్వీకరించదగినది. **తత్త్వమసి. తస్యతావదేవ చిరమ్** అనే వాక్యాల చేత తేటగా చెప్పబడుతున్నది.

ఇందువల్ల కూడా ప్రధానము జగత్కారణము కాదు. **ప్రతిజ్ఞా విరోధాత్ 1-1-09** కారణమైన ఒక వస్తువును తెల్సుకొంటే అన్నీ తెలుస్తాయి అనే ప్రతిజ్ఞతో విరోధము వేస్తున్నందువల్ల.

ప్రధానమే కారణము ఐనట్లయితే తొలుత చేసిన ఏకవిజ్ఞానేన సర్వవిజ్ఞాన ప్రతిజ్ఞతో విరోధము ఏర్పడుతుంది. సద్విద్యలో ఉపదేశాన్ని ఆరంభించినప్పుడు ఒక్క వస్తువును గురించి సమగ్రంగా తెల్సుకుంటే అన్ని వస్తువులను గురించిన ఎరుక కలుగుతుంది అని ప్రతిజ్ఞ చేసినారు. అదెలాగా అంటే కార్యము కారణములు ఒకటి కొకటి విభేదించవు. వదిలిపెట్టి ఉండవు అని అనన్యములు వేరు పదార్థాలుకావు. అందువలన కారణము ఐన చేతనాచేతన ప్రపంచము తెలియవస్తుంది అనియే ఉపపాదించాలి. నీవు చెప్పినట్లు ప్రధానమే కారణమయ్యేటట్లయితే చిదచిన్మిశ్ర ప్రపంచములో చిత్స్వరూపుడైన జీవుడికి ప్రధానము కారణముకాదు కాబట్టి, జీవుడు ప్రధానాన్నించి జన్మించలేదు కనుకనూ ప్రధానాన్ని గురించి తెల్సుకుంటే చేతన వర్గము

గురించిన విజ్ఞానము కలుగదు. కావున ప్రతిజ్ఞాభంగము/విరోధము ఏర్పడుతుంది. అందువల్ల ప్రధానము కారణమూ సత్ శబ్ద వాచ్యమూ కాదు.

**స్వాప్యయాత్ 1-1-10** కారణమైన సత్ శబ్దవాచ్యుని యందు లీనమవు తున్నందువల్ల.

కారణమైన ఆ సచ్ఛబ్దవాచ్యమైన దాన్ని గురించే వేదము ఇట్లాగా చెప్పింది. **స్వప్నాన్తం మేసోమ్య విజానీహీతి. యత్రైతత్పురుషః స్వపితినామ. సతాసోమ్యతదాసంపన్నోభవతి. స్వమపీతోభవతి తస్మాదేనం స్వపితి ఇత్యాచక్షతే. స్వంహ్యపీతోభవతి.** ఓ సోమ్యుడా! స్వప్నము యొక్క చివరిదశను - ఎలాంటి కల లేకుండా గాఢ నిద్రయొక్క దశ - చెపుతున్నాను. విను. ఎపుడైతే ఈ జీవుడు నిదురించుతున్నాడో! అపుడ సత్ శబ్దవాచ్యుడైన కారణబ్రహ్మలో లీనము అవుతున్నాడు ఆయనను చేరుకుంటున్నాడు. ఆయనతో కల్సిఉంటున్నాడు. కనుక స్వపితి అని అంటున్నారు**.** కార్యమైనదంతా తన కారణములో కల్సిపోతుంది. బాలుడు ఆడిపాడి అలసి పోయినవాడు వచ్చి తనతల్లిదండ్రుల ఒడిలో వాలిసేద తీరుతున్నాడు. అంతవరకు బాహ్యప్రపంచములో సుఖదుఃఖాలననుభవించి తన జన్మకు కారణమైన వారివద్దకే పోయి ఓదార్పు పొందుతున్నాడు. అని గాఢ నిద్ర - (సుషుప్తి) ను పొందిన జీవుడిని, సత్ శబ్దవాచ్యుడైన పరమచేతనుడిని చేరుకున్నవాడిని, స్వమపీతః - స్వస్మిన్ తన కారణమైన వానితో కలిసిపోయినవాడని ఎత్తిచెప్పుతున్నది. ప్రలయము అనగా తనకు కారణమైన వానియందు లీనము అగుట కనుక అచేతనము చేతనుడికి కారణము కాదు. కాబట్టి చేతనుడికి కారణమైన పరమచేతనుడిలో కలవడమే సరి ఐనది. అందువలన జీవుడికి ప్రధానము కారణము కాదు.

స్వమపీతోభవతి అని అనగా ఆత్మయైన వాడినే జీవుడు చేరుతున్నాడని అర్థము. చిద్వస్తువును (జీవుడిని) శరీరముగా గల్గి ఆ శరీరానికి ఆత్మయైన బ్రహ్మయే జీవశబ్దము చేత చెప్పబడుతున్నాడని నామరూప వ్యాకరణ శ్రుతి చెప్పింది. ఆ విధంగా జీవశబ్దము చేత వ్యవహరింపబడే బ్రహ్మ సుషుప్తి సమయమునందు కూడా ప్రలయకాలములో వలె నామరూపములతో పొత్తులేనందు వల్ల కూడా ప్రలయము సత్ శబ్దము చేతనే వ్యవహరింపబడదగును అని **సతా సోమ్య తదా సంపన్నో భవతి స్వమపీతోభవతి** అనే శ్రుతి వాక్యము చెప్పుతున్నది. అట్లే దీనికి సమానప్రకరణములో **ప్రాజ్ఞేనాత్మనా**

**సంపరిష్వక్తః న బాహ్యంకించనవేద నాన్తరమ్** ప్రాజ్ఞుడు తనకు ఆత్మయూ ఐన పరబ్రహ్మతో గాఢాలింగనము చేసుకొనబడిన జీవుడు బయటి ప్రపంచములో జరిగేవి కాని తన మనస్సులో కలిగేవాటి గురించిగానీ ఏమీ ఎరుగడు. అనిన్నీ వేదము చెప్పుతున్నది. పరమపురుషుని అనుగ్రహముతో మోక్షము సిద్ధించేంతవరకు జీవుడికి నామరూపాలతో సమ్బన్ధము కలిగియున్నందువల్లనే తనను గురించి తప్ప సమస్త బాహ్య ప్రపంచానికి చెందిన విషయాలను గురించిన జ్ఞానము కలుగుతున్నది. అందుచేత వాటికోసము వెంపరలాడి దుఃఖాల పాలౌతున్నాడు. సుషుప్తి కాలములో మాత్రము ఈ ప్రపంచానికి చెందిన నామమును, రూపాన్ని వదిలిపెట్టి పరమాత్మతో చేరికను పొందుతున్నాడు. తిరిగి మెలకువను పొందిన తరువాత నామరూపాలను పొంది ఆయా నామరూపాలతో వ్యవహారము చేస్తున్నాడు. అని మరొక శ్రుతివాక్యము చెపుతున్నది **యదాసుప్తః స్వప్నం న కథంచన పశ్యతి, అథాస్మిన్ ప్రాణ ఏవ ఏకథా భవతి.** నిద్రించినవాడు ఎటువంటి కలలు లేకుండా గాఢనిద్రాదశకు చేరుకుంటాడు. అపుడు వాడిలో ఇంద్రియవ్యాపారము నశించి ప్రాణము ఒక్కటి మాత్రమే ఒంటరిగా నిల్చి ఉంటుంది. **2) ఏతస్మాదాత్మనః ప్రాణాః యథాఽయతనం విప్రతిష్ఠన్తే.** ఎపుడైతే పరమాత్మ పరిష్వంగమునుండి జీవుడు బయటపడుతాడో అపుడు అతని యొక్క ఇంద్రియాలన్నీ తమతమ గూళ్ళకు చేరుకుంటాయి. అట్లాగే **త ఇహ వ్యాఘ్రోవా సింహోవా వృకోవా వరాహోవా దంశోవా మశకోవా యద్యద్ భవన్తి తదా భవన్తి** ఆ ఇంద్రియాలతో కూడిన పిదప జీవులు ఈ శరీరము నందు ప్రవేశించి నిదురించడానికి మునుపు పెద్దపులియో సింహమో తోడేలో లేక అడవి పందియో జోరీగయో దోమనో ఏదిఐతే అయ్యి ఉండెనో ఆ మెలకువ వచ్చిన దశలో తిరిగి ఆయా దేహాలతో కూడి ఆయా స్వభావాలతో ప్రవర్తిస్తారు అని.

అట్లాగే సుషుప్తుడైన జీవుడిని **ప్రాజ్ఞేనాఽత్మనా సంపరిష్వక్తః** ప్రాజ్ఞుడైన పరమాత్మచేత కౌగిలించు కొనబడియున్నాడని కూడా శ్రుతి చెపుతున్నది. అందువల్ల సత్‌శబ్దము చేత చెప్పబడేవాడు పరబ్రహ్మ. ఆయన సర్వజ్ఞుడు పరమేశ్వరుడు ఐన పురుషోత్తముడే. దానినే వృత్తికారుడైన బోధాయనుడు ఇట్లాగా చెప్పినాడు. **ఆ గాఢ నిద్రలో జీవుడు సత్ శబ్ద వాచ్యుడైన పరంబ్రహ్మతో కూడియుంటున్నాడు. ఇది సమ్పత్తి, అసమ్పత్తిలవలన తెలుస్తున్నది.** సతి సమ్పద్య నవిదుః సతి సమ్పత్స్యామహే ఇతి. సత

ఆగమ్య నవిదుః సత ఆగచ్ఛామహే ఇతి **లోకులు సుషుప్తిదశలో సత్‌శబ్దవాచ్యుడిని చేరుకుంటున్నారు గానీ ఆయనను చేరుకున్నట్లు తెలియదు. ఆయననుండి బయలుదేరి వచ్చి ఈ శరీరాలలో దూరి సత్ శబ్దవాచ్యమైన బ్రహ్మనుండి మేము వచ్చినామని ఎరుగకున్నారు. అని చెప్పిన వేదవాక్యాన్ని బట్టి సమ్పత్తి అసమ్పత్తుల ద్వారా ఇది తెలియవస్తున్నది అని** ప్రాజ్ఞేనాఽత్మనా సమ్పరిష్వక్తః అని **కూడా వేదమే తెల్పుతున్నది** అని.

ఇందువల్ల కూడా ప్రధానము జగత్తుకు కారణము కాదు. **గతిసామాన్యాత్ 1-1-11** చిదచిత్తుల యొక్క గతి - ప్రవృత్తి ఆపరమాత్మనుండే జరగడం సమానమైనందున.

**1) ఆత్మావా ఇదమేక ఏవాగ్ర ఆ సీత్, నాన్యత్ కించన మిషత్. సఈక్షత లోకాన్ను సృజా ఇతి. సఇమాన్ లోకానసృజత.** సృష్టిజరుగడానికి ముందుకాలములో ఆత్మ ఒక్కడు మాత్రమే ఉండెను. మరొక్కటి ఏదీ లేకుండెను. ఆ ఆత్మ లోకములను పుట్టించవలెనని తలచినాడు. అట్లాగా సంకల్పించిన ఆత్మ ఈ లోకాలను పుట్టించినాడు. **2) తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశః సమ్భూతః ఆకాశాద్వాయుః వాయోరగ్నిః. అగ్నేరాపః అద్భ్యః పృథివీ.** ప్రళయ కాలములోనూ చెక్కుచెదరక నిల్చియున్న ఆత్మనుండి, సృష్టి చేయదల్చిన వాని నుండి తొలుతగా ఆకాశం పుట్టినది. దానినుండి వాయువు, దానినుండి అగ్ని, దానినుండి నీరు, దానినుండి పృథివి పుట్టినది. 3) **తస్యహ వా ఏతస్యమహతో భూతస్య నిశ్శ్వసిత మేతత్ యత్ ఋగ్వేదః.** అలాంటిదైన ఈ మహాభూతము తాను తన ముక్కురంధ్రములనుండి వదిలిన గాలియే ఈ ఋగ్వేదము అని పిలువబడుతున్నది. మొదలైన సృష్టివాక్యాలకు ఏ గతి - **ప్రవృత్తి** ఉన్నదో అది తత్సామాన్యాత్ - దానితో సమానార్థమై యున్నది. ఈ సత్ శబ్దము కూడా. పై సృష్టి వాక్యాలన్నింటిలోనూ సర్వేశ్వరుడు ఐన పరంబ్రహ్మనే కారణము అని అర్థమవుతున్నది. అందుచేత ఇక్కడ కూడా ఈ సద్విద్యలో కూడా సర్వేశ్వరుడే కారణము అని నిర్ణయము చేయబడుతున్నది.

ఇందువల్ల కూడా ప్రధానము కారణము కాదు. **శ్రుతత్వాచ్చ 1-1-12** ఇదే ఉపనిషత్తులో ఈ సచ్ఛబ్దవాచ్యుడికి **సర్వ ప్రపంచానికి ప్రవృత్తి= బోధనావ్యాపారము, దేనిని తెలియచేస్తున్నదో అని అర్థము.** తాను ఆత్మయై యున్నందున నామరూపములను

ఏర్పర్చడము అందుకు తగినట్లు సర్వజ్ఞత్వము సర్వశక్తిత్వము సర్వఆధారత్వము అపహతపాప్మత్వము – పాపపుణ్యరూపకర్మ సమ్బన్ధము లేకపోవడము – మొదలైన వాటితో పాటు సత్యకామత్వము సత్యసంకల్పాదులున్నట్లు తెలుపబడుతున్నది. 1) **అనేన జీవేన ఆత్మనా అను ప్రవిశ్య నామరూపే వ్యాకరవాణి** ఈ జీవుడికి నేను ఆత్మగా అయ్యి అతని ద్వారా ఈ శరీరములో ప్రవేశించి శరీరాన్ని కల్గియున్న జీవుడికి నామమును రూపాన్నీ ఏర్పర్చుతాను. **2) సన్మూలాః సోమ్యేమాః సర్వాః ప్రజాః సదాయతనాః సత్ ప్రతిష్ఠాః** ఓ సోమ్యుడా! ఈ ప్రజలందరూ సత్ శబ్దవాచ్యుడినే మూలకారణముగా కల్గి పుడుతున్నారు ఆయనయందే ఆధారపడి బ్రతుకుతున్నారు. ఆయన వద్దకే చేరుకుని నిల్చిపోతున్నారు. **3) ఐత దాత్మ్యమిదం సర్వమ్. తత్ సత్యం స ఆత్మా.** ఈ కనిపించే చరాచరప్రపంచమంతా ఈ సత్ శబ్దవాచ్యుడినే ఆత్మనుగా కల్గియున్నది. అది యథార్థము ఆయనయే ఆత్మ. **4) యచ్చాస్యేహాస్తి యచ్చనాస్తి సర్వమ్ తదస్మిన్ సమాహితమ్.** ఈ ప్రపంచములో ఏది ఉన్నదో ఏది లేదో (జీవుడు, ప్రకృతి అన్నీ కూడా) ఆయనలోనే కూర్చబడియున్నది. **అస్మిన్ కామాః సమాహితాః** ఈయనలోనే కోరదగిన మంగళగుణములు అన్నీ చేరియున్నవి. **ఏషఆత్మాఽపహతపాప్మా విజరోవిమృత్యుః విశోకః అవిజిఘత్సః అపిపాసః సత్యకామః సత్యసంకల్పః** ఇతడు ఆత్మ. ఏ పాపములు లేనివాడు. అందువల్లనే ముసలితనము, దాని తరువాత కలిగే మరణము, వీటివలన కలిగే దిగులు, శరీరమున్నందువలన కలిగే ఆకలి దప్పులు లేనివాడు. ఆయన కోరిన కోర్కెలు అన్నీ నెరవేరియున్నట్టివాడు. ఆయన తలచిన దానిని అడ్డుకోగల్గినవాడెవ్వడూ లేడు అని.

అట్లాగే ఇతర ఉపనిషత్తులు కూడా చెప్తున్నాయి. **1) నతస్యకశ్చిత్ పతిరస్తిలోకే నచేశితా నైవచ తస్యలింగమ్. స కారణం కరణాధిపాధిపో నచాస్యకశ్చిత్ జనితా నచాధిపః** సర్వప్రపంచానికీ కారణభూతుడైన బ్రహ్మకు ప్రభువైన వాడు ఎవడూ లేడు. ఏలుకునేవాడున్నూ లేడు. ఆయనకు శరీరములేదు. ఆయనయే అందరికీ కారణమైనవాడు. ఆయన ఇంద్రియాలకు అధిపతియైన జీవుడినిన్నీ శాసించుతాడు. ఆయనను పుట్టించేవాడు లేడు. ఆయన కన్నా పెద్దవాడై నియంత్రించేవాడున్నూ లేడు. **2) సర్వాణి రూపాణి విచిత్య ధీరో నామాని కృత్వాఽభివదన్ యదాస్తే** జ్ఞానము చేతనే ఆనందించుతూ ఉండే ఆయన అన్నిరకాలైన రూపాలను ధరించి వాటికి తగినపేర్లను పెట్టి వాటిలో ఆయా రూపధారులను వ్యవహరించుతూ ఉన్నాడు. **3) అన్తః ప్రవిష్ట**

**శ్సాస్తా జనానాం సర్వాత్మా.** ఆయన జనులయొక్క హృదయాలలోపల ప్రవేశించి యున్నాడు. వాళ్ళను వారివారి పుణ్యపాపాలకు అనుగుణంగా శాసించుతూ ప్రవర్తింపచేస్తూ ఉన్నాడు. అందరికీ ఆయనయే ఆత్మ. **4) విశ్వాత్మానం పరాయణమ్** విశ్వానికంతటికీ ఆయనయే ఆత్మయై వాటికి ఉనికిని నిల్పుతూ తానే విశ్వముగా ఉన్నటువంటివాడు. ఆయనయే పరమగతియైనవాడు. **5) పతిం విశ్వస్యాత్మేశ్వరమ్.** విశ్వానికి పతియైన ప్రభువు. ఆయనను పాలించేవాడు లేక తనకు తానేప్రభువైనవాడు. **6) యచ్చకించిజ్జగత్యస్మిన్ దృశ్యతే శ్రూయతేఽపివా! అన్తర్బహిశ్చతత్సర్వంవ్యాప్య నారాయణః స్థితః** ఈ ప్రపంచములో ఏదైతే కనిపిస్తున్నదో ఏది ఉన్నది అని వినిపిస్తున్నదో వాటిలో లోపలా బయటా వ్యాపించి శ్రీమన్నారాయణుడు ఉన్నాడు. **7) ఏష సర్వభూతాన్తరాత్మాఽపహత పాప్మాదివ్యోదేవ ఏకోనారాయణః** ఈయన సర్వభూతాలకున్నూ అన్తరాత్మయైయున్నాడు. పుణ్యపాపరూపకర్మల సమ్బన్ధము లేనటువంటివాడు. దివ్యుడు దేవుడు ఉజ్వలంగా వెలిగేవాడు. ఆయన పేరే నారాయణుడు. ఇట్లాంటివి ఇంకా ఎన్నెన్నో.

అందువలన జగత్తు పుట్టడానికి కారణమైన దాన్ని చెప్పే ఈ శ్రుతివాక్యము ప్రధానాన్ని ప్రతిపాదించజాలదు. అందువల్ల సర్వజ్ఞుడు, సర్వశక్తి. ఈశ్వరులుగా భావించుకొనేవారందరికిన్నీ ఈశ్వరుడు/ ఎలాంటి దోషగన్ధము లేనివాడు/ అనవధికమైన అతిశయాన్ని కలిగిన లెక్కింపరాని కళ్యాణగుణగణములు అనే ప్రవాహాలన్నింటికి సముద్రము వలె కలయికకు ఏకైక స్థానమైన వాడు పురుషోత్తముడూ ఐన నారాయణుడే సమస్త జగత్తుకూ ఏకైక కారణము/ అందరికీ తెల్సుకోదగిన ఉపాసింపదగిన బ్రహ్మ అని సుస్థిరమైయున్నది.

పైన చెప్పిన కారణాలవల్లనే ప్రధాన కారణవాదముతో పాటుగా నిర్విశేషమైన చిన్మాత్రమే బ్రహ్మ అనే వాదమును కూడా సూత్రకారుడైన వేదవ్యాసమహర్షి తోసిపారేసినాడు అని తెల్సుకోవాలి. ఎందుకంటే పరమార్థమైన ముఖ్యార్థమైన ఈక్షణము లేక సంకల్పించుట అనే గుణాన్ని కల్గిన బ్రహ్మయే తెల్సుకోదగినవాడు జిజ్ఞాస్యుడు బ్రహ్మ అని నిలబెట్టినాడు కనుక.

బ్రహ్మ ఎలాంటి విశేషాలు లేనివాడు అని చెప్పినప్పుడు ఆయన సాక్షి అని అంటే ఆసాక్షిత్వము కూడా అపరమార్థమే అవుతుంది. ఆయనకు జ్ఞాతృత్వమనే గుణమేలేనప్పుడు సాక్షి ఎలా కాగలడు?

బ్రహ్మవేదాన్తముల చేత మాత్రమే తెల్సుకోబడుతాడు. అలాంటి ఆయననే తెల్సుకోవాలి అని ప్రతిజ్ఞ చేయబడింది. ఐతే ఆ బ్రహ్మ అచేతనము కాదు. చేతనుడు అని ఈక్షతేర్నా శబ్దమ్ మున్నగు సూత్రాలతో ప్రతిపాదింపబడింది. చేతనత్వము అనగా చైతన్యము అనే గుణాన్ని కల్గియుండుట. అందువలన ఈక్షణము అనే గుణము లేకపోయినట్లయితే ఆ బ్రహ్మ కూడా ప్రధానముతో సమానంగా జడపదార్థము అవుతాడు కదా!

ఇంతే కాకుండా నిర్విశేష ప్రకాశము మాత్రమే బ్రహ్మ అనేటట్లయితే ఆయనకు ప్రకాశత్వమును కూడా మనము ప్రతిపాదించలేము. ప్రకాశము అంటే తనను బయటివాడిని ఇద్దర్నీ ఇతడు ఇట్లాంటివాడు ఈపేరు గలవాడు ఈ రూపుగలవాడు అని వ్యవహరించడానికి తగిన యోగ్యతను చేకూర్చే ఒకానొక వస్తువిశేషము. ఏ విశేషమూ లేని వస్తువుకు తనను గురించి గాని పరాయి వ్యక్తిని గురించి గాని వ్యవహారము చేయగల శక్తి లేనప్పుడూ ఘటపటాదుల వలె అచిత్త్వము జడత్వము కాక తప్పదు. ఆ స్వప్రకాశపరప్రకాశత్వాలు రెండూ లేకపోయినా అందుకు తగిన సామర్థ్యము ఉన్నది అని అనేటట్లయితే అది తప్పు మాట. క్షమత్వము అంటే సామర్థ్యమే. సామర్థ్యము అనే గుణమున్నది అని ఒప్పుకుంటే నిర్విశేషవాదాన్ని నీవు వదులుకున్నట్లే అవుతుంది సుమా!

అలా కాదండీ వేదప్రామాణ్యముననుసరించి ఈ ఒక్క అంశము ఉన్నట్లు అంగీకరిస్తాము అని అంటున్నారా? అయ్యో! అట్లాగే ఐతే ఆ సామర్థ్యము ఉన్నదనే కారణంగా, వేదము ప్రమాణీకరిస్తున్నది కాబట్టినీ సర్వజ్ఞతా, సర్వశక్తిత్వము, సర్వేశ్వరేశ్వరత్వము సర్వకళ్యాణగుణాకరత్వము, సకలహేయ ప్రత్యనీకత్వము మున్నగు వాటినన్నింటినీ ఒప్పుకుని తీరవల్సిందే! ఎందుకంటావా? శక్తి మత్త్వము అనేది చేయబోయే కార్య విశేషానికి అనుగుణ్యతను కలిగి ఉండడమే. అది తాను చేయబోయే/చేసే కార్యవిశేషము చేతనే నిరూపింపబడుతుంది. కార్యవిశేషమును గురించి ప్రమాణము ఏదీ లేదనేట్లయితే దానిచేత మాత్రమే నిరూపింపబడే శక్తిమత్త్వము కూడా ప్రమాణము లేనిదే అవుతుంది. ఇంతేకాకుండా నిర్విశేషమైన వస్తువు ఉన్నదని వాదించేవారు నిర్విశేషమైన వస్తువు ఉన్నదని బల్ల గుద్దుతున్నారు కదా! దానికి ముందుగా వస్తుత్వము ఉన్నదని చెప్పడానికి తగిన ప్రమాణమేదో చూపగలరా! లోకంలో ప్రసిద్ధములైన ప్రత్యక్షము అనుమానము ఆగమము/వేదము/శాస్త్రము తమరిదైన స్వానుభవము ఏదైనా సరే! ఇవి అన్నీ కూడా ఏదో ఒక విశేషముతోకూడిన

వస్తువునే ప్రతిపాదిస్తాయి. తప్ప నిర్విశేషమైన వస్తువును కాదని మేమింతకుముందే చెప్పియున్నాము.

కావున విచిత్ర చేతనాచేతనాత్మక జగద్ ఆకారంగా నేనే బహురూపాలను పొందుతాను అని సంకల్పించగల సామర్థ్యమున్న పురుషోత్తముడే జిజ్ఞాస్యుడు అని తేల్చబడింది. **ఇది ఈక్షత్యధికరణము**.

★ ★ ★

## ఇక ఆనంద మయాధికరణము

ఈవిధంగా తెల్సుకోదగిన వాడైన బ్రహ్మ చేతనుడికి అనుభవింపదగిన జడరూపమై సత్త్వరజస్తమోమయమైన ప్రధానానికంటే వేరయిన స్వరూప స్వభావాదులు కలవాడని నిరూపింపబడింది.

ఇప్పుడు కర్మలకు వశుడై త్రిగుణాత్మకమైన ప్రకృతితో సంసర్గము వలన నానావిధములైన ముగింపు ఎన్నటికో తెలియని దుఃఖముల సముద్రములో మునిగి తేలుతున్నందున అశుద్ధుడైన జీవుడు, ఇవేవీలేని శుద్ధుడూ ఐన ప్రత్యగాత్మకంటే కూడా వేరయినవాడు నిఖిలహేయప్రత్యనీకమై నిరతిశయానందస్వరూపుడైనవాడే బ్రహ్మ అని ప్రతిపాదింపబడుతున్నది.

**ఆనంద మయో అభ్యాసాత్ 1-1-13** హెచ్చువేసి చెప్పిన కారణంగా సత్ శబ్ద వాచ్యుడు ఆనందమయుడు.

తైత్తిరీయులు ఈ విధంగా పఠించుతున్నారు. **సవాఏషపురుషో అన్నరసమయః** అటువంటి ఈ పురుషుడు అన్నరసమయుడు. అని ఆరంభించి **తస్మాద్వాఏతస్మాద్విజ్ఞాన మయాత్. అన్యోఽన్తర ఆత్మాఽనందమయః** అలాంటి వాడైన ఈ విజ్ఞానమయుడగు జీవుడికంటే వేరయిన వాడు ఆత్మ. అతడు ఆనందమయుడు అని. ఇచ్చట అనుమానము ఏర్పడుతున్నది. ఈ ఆనందమయుడనబడేవాడు సంసారబంధమును పొందుట దుఃఖించుట కొన్నాళ్ళకు ఏదోవిధంగా దాన్నుండి విడిపించబడుటను పొందిన జీవశబ్దం చేత చెప్పదగినవాడైన ప్రత్యగాత్మకంటే మరొకడైన పరమాత్మ అనబడేవాడా? లేక ఆ జీవుడేనా? అని ఏది సరియైనది ఈ రెండింటిలో అనేట్లయితే ప్రత్యగాత్మనే అని మేమంటున్నాము. ఎందువల్లనంటే? **తస్యైషఏవ శారీర ఆత్మా.**

దానికి ఈ శరీర సంబన్ధమున్నవాడే ఆత్మ. అని ఆనందమయుడికి శరీర సమ్బన్ధము ఉన్నట్లు తెలుస్తున్నది. శారీరుడు అని అంటే శరీర సమ్బన్ధీ అని అర్థము. ఆ విధంగా శరీరముతో పొత్తు కలవాడు జీవుడే కాని పరమాత్మ కాదు కనుక ఆనందమయుడు జీవాత్మనే కానీ శరీరమే లేని ఇంద్రియాలే లేని పరమాత్మ అనబడేవాడు కాదు.

ఏమండీ జగత్కారణంగా ప్రతిపాదింపబడిన బ్రహ్మను సుఖంగా అర్థము చేసుకోవడం కొరకు అన్నమయాదులను వరుసగా చెప్పుకొచ్చి ఆజగత్కారణమైనవాడే ఆనందమయుడు అని గదా, ఉపదేశిస్తున్నాడు వేద పురుషుడు. జగత్కారణత్వమున్నూ "**తదైక్షత**" అని ఈక్షణమును గురించి వినిపించుతున్నందున ఆయన సర్వజ్ఞుడు, సర్వేశ్వరుడుఅనిన్నీచెప్పనారుకదా!అనిఅన్నట్లయితే!సత్యమే.ఐతేఆయనజీవునికంటే వేరయినవాడుకాడు. **అనేన జీవేన ఆత్మనా అను ప్రవిశ్య 2) తత్త్వమసి శ్వేతకేతో** అని కారణముగా నిర్దేశింపబడినవాడిని ఒకానొక జీవుడినిగా సామానాధికరణ్యమును చెప్పినారు కదా! సామానాధికరణ్యమనేది ఏకత్వాన్ని ప్రతిపాదిస్తుంది. ఎలాగంటే **సోఽయందేవదత్తః** ఇత్యాదులలోవలె. అప్పుడెప్పుడో అక్కడెక్కడో చూచినవాడే ఈ దేవదత్తుడు అన్నపుడు కొన్నికొన్ని లక్షణాలతో గుర్తింపబడినవాడు ఇపుడు కనబడితే అతడే వీడు అన్నట్లు ఇంతకుమునుపు జగత్ కారణంగా గుర్తింపబడిన వాడే ఈ ఆనందమయుడు అని అనవచ్చును. సంకల్పపూర్వకమైన సృష్టి చేయడము జీవుడికి కూడా ఒప్పుతుంది. అందవల్లనే **బ్రహ్మవిదాప్నోతిపరం** బ్రహ్మను గురించి తెలిసినవాడు పరమశ్రేయస్సును పొందుతున్నాడు అనే వాక్యము ప్రకారము జీవునికి అచిత్తుతో/ ప్రకృతితో కలయిక లేని స్వరూపము ప్రాప్యముగా ఉపదేశింపబడుతున్నది. అచిత్తుతో పొత్తులేని వానియొక్క స్వరూపాన్ని గురించి లక్షణము ఇలాగా ఉన్నది. **సత్యం జ్ఞానమనన్తమ్ బ్రహ్మ** అని. ఆ బ్రహ్మ యొక్క స్వరూపాన్ని పొందడమే మోక్షము. **నహవై సశరీరస్య సతః ప్రియాప్రియయోరపహతిరస్తి. అశరీరం వావసన్తం నప్రియాప్రియేస్పృశతః** శరీరముతో సమ్బన్ధము కలవాడికి ప్రియాప్రియములు తొలగిపోవు. అశరీరుడైన వాడికి ప్రియాప్రియములు అంటవు అని అనగా శరీరము లేనివాడు బ్రహ్మ. శరీరముతో సమ్బన్ధమున్నవాడు జీవుడు ఆ ఇద్దరూ ఒక్కటే అని సామానాధికరణ్యము తెల్పుతున్నది. అదే తత్త్వమసి. కనుక జీవునికి అవిద్యతో సమ్బన్ధము లేని స్వరూపము ప్రాప్యముగా ముందుకొచ్చినట్టిది. ఆనందమయము అని చెప్పబడుతున్నది. అదెట్లా గంటే శాఖా చంద్రన్యాయము ప్రకారము – ముందుగా

చెట్టు కొమ్మను చూపించి ఆ తర్వాత కొమ్మపైన ఉన్నవాడిని చంద్రుడిని చూపించినట్లు – ఆత్మ స్వరూపము ఇట్లాంటిది సుమా అని తెలుపడానికి ముందుగా **అన్నమయః పురుషః** అన్నమయుడు పురుషుడు అని శరీరాన్ని చూపించి దానికి లోపల ఉన్న ఆ శరీరానికి ధారకము – నిలబెట్టేది – ఐన ఐదు రకాలుగా వ్యాపించి ఉన్న ప్రాణాన్ని దానికి కూడా లోపల ఉన్న మనస్సును, దానికిన్నీ లోపల నున్నట్టిదైన బుద్ధినిన్నీ **ప్రాణమయః, మనోమయః, విజ్ఞానమయః** అక్కడా అక్కడా బుద్ధికి తోచేటట్లు ఒక దాని తర్వాత ఒకటిగా వరుసప్రకారము మెట్టుమెట్టుగా దిగివచ్చినట్లు నిర్దేశించి ఈ అన్నింటికిన్నీ లోపల ఉన్న జీవాత్మను **అన్యోఽన్తర ఆత్మాఆనందమయః** ముందు చెప్పినవానికన్నిటికన్నా లోలోపల ఉన్నట్టివాడు వీళ్ళందరికిన్నీ వేరయినవాడు ఆత్మ. అతడు ఆనందమయుడు. అని చెప్పి అన్తరాత్మ పరమ్పరను ముగించుతున్నాడు. కనుక జీవాత్మ స్వరూపమే **బ్రహ్మవిదాప్నోతి పరం** అని చెప్పబడినవాడే బ్రహ్మ అతడే ఆనందమయుడు అని ఉపదేశింపబడింది అని మేము నిశ్చయించుతున్నాము.

ఈ విధంగా ఆనందమయ శబ్దానికి ప్రత్యగాత్మ పరంగా అర్థము చెప్పిన సాంఖ్యుడిని – పూర్వపక్షిని – మృషావాది పక్షమువాడు ప్రశ్నించుతున్నాడు. ఏమండీ! **బ్రహ్మ పుచ్ఛమ్ ప్రతిష్ఠా** బ్రహ్మ యొక్క పుచ్ఛము ప్రతిష్ఠా ఆధారము అని చెప్పబడినదాన్ని బట్టి ఆనందమయుడైన వానికంటే వేరయినది మరొక్కటి బ్రహ్మ అని తోస్తున్నది గదా అని.

మీరన్నది కాదు. బ్రహ్మనే తనయొక్క స్వభావవిశేషముతో ఒక పురుషుడి విధముగా/ఆకారముగా శిరస్సు రెక్కలు పుచ్ఛము/తోక రూపముగా పోల్చి నిరూపింపబడుతున్నది. ఎలాగైతే ఆహారముతో పోషింపబడి వృద్ధిచెందిన శరీరము, అవయవములు కలది తనకంటే వేరుకాని తనయొక్క అవయవాల చేతనే **తస్యేదమేవశిరః అతనికిది/దానికి ఇదియే శిరస్సు** ఇత్యాదిగా శిరస్సు పక్షము పుచ్ఛములవలె ఉదాహరించి చెప్పబడింది. అట్లాగే ఆనందమయుడైన బ్రహ్మ కూడా తననుంచి వేరుకాని ప్రియమోద ప్రమోద ఆనందాలతో ఉదహరించబడినాడు. అక్కడ అవయవాలుగా పోల్చబడిన ప్రియ మోద ప్రమోద ఆనందములకు ఆశ్రయమైన వాడుగా అఖండరూపమైన ఆనందమయుడిని **బ్రహ్మపుచ్ఛం ప్రతిష్ఠా** అని చెప్పబడుతున్నది. ఒకవేళ ఆనందమయుడి కంటే మరొకటి బ్రహ్మ అయ్యి ఉంటే **తస్మాద్వాఏతస్మాదానందమయా దన్యోఽన్తరః ఆత్మా బ్రహ్మ** ఈ ఆనందమయుడికంటే

మరొకడు వానిలో నున్నవాడు ఆత్మ అనబడువాడు బ్రహ్మ అని చెప్పబడెడిది. కాని ఇట్లా చెప్పబడలేదుకదా! మొత్తమ్మీద ఇదీ చెప్పబడుతున్న విషయము –

**బ్రహ్మవిదాప్నోతి పరమ్** అని ఆరంభింపబడిన బ్రహ్మ **సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ** అని లక్షణము ద్వారా తనకంటే వేరయిన అన్నింటికంటే విలక్షణమైన ఆకారము కలవాడు బ్రహ్మ అని ప్రతిపాదించి దానినే **తస్మా ద్వాఏతస్మాదాత్మనః** అని ఆత్మ శబ్దంతో నిర్దేశించి ఆ బ్రహ్మకు సర్వాన్తరత్వము (అన్నింటికీ లోలోపల నుండటం) ద్వారా ఆత్మత్వాన్ని వెల్లడించుతూ ఉన్న వాక్యము అన్నమయము మొదలైనవాటిలో వాని వానికి లోనఉంటున్నందున ఆత్మగా నిర్దేశించబడిన ప్రాణమయము మొదలైన వాటినిన్నీ దాటిపోయి **అన్యోఽ న్తర ఆత్మా ఆనందమయః** అని ఆత్మ శబ్దంతో నిర్దేశించడాన్ని ఆనందమయుడితో ముగించుతున్నది. అందువలన ఆత్మ శబ్దముతో, ప్రక్రాన్తమైన బ్రహ్మ ఆనందమయుడని నిశ్చయింపబడుతున్నది. అని

తిరిగి శంకచేయబడుతున్నది. అయ్యా! **బ్రహ్మ పుచ్ఛమ్ ప్రతిష్ఠా** అని చెప్పి ఆ వెనుకనే **అసన్నేవ సభవతి అసద్ బ్రహ్మేతి వేదచేత్. అస్తి బ్రహ్మేతి చేద్వేద సన్తమేనం తతో విదుః** బ్రహ్మ లేదని ఎవడు అంటున్నాడో వాడే లేనివాడవుతున్నాడు. బ్రహ్మ ఉన్నాడని ఎవడు తలుస్తున్నాడోవాడు తరువాతి కాలములో ఆయన అనుగ్రహముతో తెల్సుకొంటున్నాడు. ఆయనను క్రమంగానే చేరుకుంటున్నాడు అని బ్రహ్మజ్ఞానము, బ్రహ్మను గురించిన అజ్ఞానముల వలన ఆత్మయొక్క (తనయొక్క) సద్భావము (ఉనికి) అసద్ భావములను (ఉనికి లేకపోవుటవలన) చూపుతున్నాడు. కానీ ఆనందమయుని యొక్క జ్ఞానాజ్ఞానాల వల్లకాదు. అయితే ఆనందమయుడిని గురించి లోకంలో ప్రియమోదాది రూపాలతో అందరికీ తెల్సినవాడిని సమ్బన్ధించి సద్ భావ అసద్ జ్ఞానాల ఆశంక/అనుమానము చేయతగదు. కావున ఉపనిషత్తులో ఉదహరింపబడిన శ్లోకము ఆనందమయుడిని గురించి ఉదాహరింపబడలేదు. కావున ఆనందమయుడి కంటే బ్రహ్మ వేరయినవాడే. అన్యుడే అని.

అలా అనడం తగదు. **ఇదం పుచ్ఛం ప్రతిష్ఠా. పృథివీ పుచ్ఛమ్ ప్రతిష్ఠా, అథర్వాంగిరసః పుచ్ఛమ్ ప్రతిష్ఠా. మహః పుచ్ఛమ్ ప్రతిష్ఠా.** అని చెప్పి అక్కడక్కడ ఉదాహరింపడిన శ్లోకాలు **అన్నాద్వై ప్రజాః ప్రజాయన్తే** అన్నము ఆహారము నుండియే ప్రజలు పుడుతున్నారు. మొదలుగ గలవి ఏ విధంగానైతే పుచ్ఛమును మాత్రమ ప్రతిపాదించేవి కావో. అట్లాగే ఆనందమయుడి కంటే వేరుగా నున్న పుచ్ఛమునున్నూ

ప్రతిపాదించేవి కావు. ఇట్లాగే ఇక్కడ కూడా ఆనందమయుని యొక్క **అసన్నేవసః** అనే శ్లోకమున్నూ కాని ఆనందమయుని కంటే భిన్నమయిన పుచ్ఛమునకు సంబన్ధించినది కాదు.

ఒకవేళ ఆనందమయుడికే బ్రహ్మత్వము కలిగినా కూడా ప్రియమోదాది రూపములుగా నిరూపింపబడిన అఖండము అపరిచ్ఛిన్నమూ ఐన ఆనందాన్ని గురించి ఉన్నదా? లేదా? అని సద్భావా సద్భావా శంకచేయడము తగినదే అవుతుంది. పుచ్ఛ బ్రహ్మను గురించి కూడా అపరిచ్ఛిన్నానందాన్ని కల్గియుండుట వల్లనే లోకములో ప్రసిద్ధి లేదు. బ్రహ్మకు శిరస్సు మొదలుగా గల అవయవాలు లేవు. కనుక ఆనందమయుడు బ్రహ్మకాదు. అనేట్లయితే నీవు చెప్పిన బ్రహ్మకు కూడా పుచ్ఛత్వము, ప్రతిష్ఠాత్వములు లేవు. కాబట్టి పుచ్ఛము కూడా బ్రహ్మ కాకుండా పోతుంది. పుచ్ఛత్వము = అవయవ విశేషత్వము వెన్ను. ప్రతిష్ఠాత్వము = ఆధారత్వము అయితే అవిద్యచే కల్పింపబడిన వస్తువునకు, దానికి ఆధారమైన బ్రహ్మకున్నూ పుచ్ఛము ప్రతిష్ఠా అనేవి ఒక రూపణము – పోల్చి చెప్పడము/ఆకారాన్ని కల్పించి చెప్పడము – మాత్రమే నిజానికి లేవు అని చెప్పేటట్లయితే అయ్యో! అసుఖము కంటే వ్యావృత్తము ఐన ఆనందమయుడైన బ్రహ్మకు కూడా ప్రియ శిరస్త్వాదులు కూడా రూపణమే అవుతవి.

ఈ అంతటి చర్చకారణంగా **సత్యం జ్ఞానం అనన్తం బ్రహ్మ** అని వికారాస్పదమైన జడము చేత పరిచ్ఛిన్నమైన/విడదీయబడిన ఇతర వస్తువుల కన్న వేరయిన అసుఖము/దుఃఖము లేనటువంటి వాడు ఆనందమయుడు అని ఉపదేశింపబడుతున్నది. ఆ కారణంగా అఖండ ఏకరస ఆనందరూపుడైన బ్రహ్మయందు ప్రయోగించిన **ఆనందమయః** అనే **మయట్ ప్రత్యయము ప్రాణమయః అని చెప్పినట్లుగానే స్వార్థికమైనదనియే గ్రహించాలి.** అందువలన అవిద్యచేత కల్పింపబడిన విచిత్రములు, వివిధములు, ఐన భేదాలతో కూడిన జీవాత్మకు స్వాభావికమైన రూపము అఖండ ఏకరసము సుఖానికి మాత్రమే ఒకే ఒక తావు ఐనవాడు ఆనందమయము అని తెలుస్తున్నది గనుక ఆనందమయుడు ప్రకృతితో సంబన్ధము లేని ప్రత్యగాత్మ ఆనందమయుడు అతడే. అని పూర్వపక్షము నిర్ణయము చేసినపుడు దీనికి సిద్ధాన్తము ఈక్రింది విధముగా చేయబడుతున్నది.

ఆనందమయో అభ్యాసాత్. ఆనందమయుడు పరమాత్మ. ఎందువల్లనంటే అభ్యాసము వలన. అభ్యాసము అనగా గుణనమ్ లేక ఆవృత్తి. హెచ్చవేత అని

అర్థము. **సైషానందస్యమీమాంసా భవతి.** ఆనందమును గురించి ఈ విధంగా చర్చచేయబడుతున్నది అని ఆరంభించి యతోవాచోనివర్తన్తే ఎవరి ఆనందగుణాన్ని వివరించి చెప్పలేక వాక్కులు వెనుకకు మళ్ళుతున్నాయో అనేంతవరకూ ఉన్న వాక్యము ద్వారా ఒకదానికంటే మరొకదాన్ని వందరెట్లుగా హెచ్చవేసుకుంటూపోయి నిరతిశయమైన దశనే తలకెత్తు కొనబడిన ఆనందము, అనన్తము ఐన దుఃఖముల చేత కలగలుపు చేయబడి పరిమితమైన సుఖలవాన్ని మాత్రమే కలిగిన జీవాత్మలో సంభవించక నిఖిలహేయ ప్రత్యనీకుడు కళ్యాణగుణాలకు ఏకైకస్థానము/ తనకంటే వేరయిన వారందరి కన్నా విలక్షణుడు ఐన పరమాత్మనే తనకు ఆశ్రయమైన వాడుగా తెలియపరుస్తున్నది. దాన్నే ఇట్లాగా చెప్పింది. **తస్మాద్వా ఏత స్మాత్ విజ్ఞానమయాద్ అన్యోఽన్తర ఆత్మా ఆనందమయః** అని ఈ విజ్ఞానమయుడి కంటే మరొకడు అయ్యి అతనికి లోపల ఉండే ఆత్మయే ఆనందమయుడు అని.

ఇచ్చట చెప్పిన విజ్ఞానమయుడు నీవనుకున్నట్లు జీవుడే. వట్టి బుద్ధిమాత్రము కాదు. మయట్ ప్రత్యయము చేత విజ్ఞానము కన్నా వేరయిన, జ్ఞానాన్ని కల్గినవాడు మరొకడు స్ఫురించుతున్నాడు. ప్రాణమయుడు అన్నప్పుడు మాత్రము మరొక మార్గము లేక స్వార్థికతను ఆశ్రయించుతున్నాము. ఇక్కడనైతేనో విజ్ఞానాన్ని కలిగిన జీవుడు అనే వాడొకడు లభించుతున్నాడు గనుక **విజ్ఞానం యజ్ఞం తనుతే** అని చెప్పినా కేవలము విజ్ఞానము/బుద్ధి యజ్ఞాలను ఆచరించదు గనుక విజ్ఞాన వాన్, విజ్ఞానీ వంటి పదాలను వాడకపోవడము అనర్థకమే అని అనుకోకూడదు. బద్ధుడు/సంసారములోనున్న జీవుడు, ముక్తిపొందిన పురుషుడు ఎవరైనా వట్టి జ్ఞానమాత్రులుకారు. జ్ఞానము కల్గినట్టివారు. జ్ఞాతలు అని మేము ముమ్ముందు వివరించనున్నాము. ప్రాణమయః అన్నమయః ఇత్యాదుల యందు మాత్రము వికారార్థము చెల్లుతుంది. అని దీని తర్వాత చెప్పబడనున్నది. ఐతే విజ్ఞాన విషయ శ్లోకము **విజ్ఞానం యజ్ఞం తనుతే** అనుచోట కేవల విజ్ఞాన శబ్దాన్ని ప్రయోగించడము ఎట్లా కుదురుతుంది అని అనుమానపడుతున్నావా? జ్ఞానగుణాశ్రయుడైన ఆత్మకు స్వరూపము కూడా స్వప్రకాశత అవడం వలన విజ్ఞానం అని చెప్పవచ్చును. కనుక దోషము ఏమీ కాదు. జ్ఞాత యొక్క స్వరూపము జ్ఞానము చేత మాత్రమే నిరూపింపబడుతుంది కదా! స్వరూపాన్ని నిరూపించే ధర్మ శబ్దాలన్నీ కూడా ధర్మమును ఉగ్గడించడం ద్వారా ధర్మి/ (ధర్మమును కల్గినవాడినీ) ప్రతిపాదించుతూనే ఉంటాయిసుమా! గోశబ్దము గోత్వాన్ని కలిగిన గోవ్యక్తినిన్నీ చెపుతున్నదికాదా!

విజ్ఞానము అనే శబ్దములో జ్ఞాధాతువు మీద కృత్యల్యుటో బహులమ్ అనే సూత్రము చేత కర్త్రర్థములో **ల్యుట్** ప్రత్యయము చేర్చబడుతుంది. లేదా నంద్యాది గణములో చేరియున్నందుననైనా **నందిగ్రహిపచి పచాదిభ్యః** అనే సూత్రము ద్వారాగాని కర్త్రర్థములో **ల్యు** ప్రత్యయము వచ్చి రూపనిష్పత్తి జరుగుతుంది. ఇందువల్లనే **విజ్ఞానంయజ్ఞం తనుతే కర్మాణి తనుతేఽపిచ** అని యజ్ఞాదికర్తృత్వము విజ్ఞానానికి వినిపిస్తున్నది. మొత్తంమీద తాత్పర్యమేమనగా విజ్ఞానశబ్దము చేత విజ్ఞానమే స్వరూపముగా/ధర్మముగా గల పురుషుడు జ్ఞాతయైనవాడు చెప్పబడుతున్నాడుగాని వట్టి బుద్ధి మాత్రము కాదు. అదే అర్థము అయ్యేట్లుంటే జడమైనదానికి కర్తృత్వము సంభవించదు. చైతన్యము కల జీవులకు తమ తమ కోరికలను నెరవేర్చుకొనుటలో ఉపయోగపడే సాధనాలకు/ఉపకరణాలకు, విజ్ఞానమయుడు కంటే ముందు చెప్పబడిన అన్నమయాదుల యందు చేతనుడికి ధర్మమైన కర్తృత్వము ఎక్కడా వినిపించడం లేదు కూడా. అందువల్లనే చేతనము అచేతనములను తమకు మాత్రమే చెందినవైన నిలయనత్వ అనిలయనత్వ ఆదులైన అసాధారణ ధర్మవిశేషాలతో విభజించి చెప్పే వాక్యము **విజ్ఞానం చావిజ్ఞానంచ** అని విజ్ఞాన శబ్దముతో విజ్ఞానమనే గుణాన్ని కలిగిన చేతనుడిని చెపుతున్నది. అదే తీరుగా అన్తర్యామి బ్రాహ్మణంలో **యో విజ్ఞానే తిష్ఠన్** అనే కాణ్వపాఠగతమైన పర్యాయపదము యొక్క స్థానములో **య త్మని తిష్ఠన్** అని పర్యాయపదాన్ని పఠించుతున్న మాధ్యందిన శాఖీయులు కాణ్వపాఠములో ఉన్న విజ్ఞానశబ్దము చెప్పబడినవాడు జీవాత్మ అని తేటతెల్లము చేస్తున్నారు. విజ్ఞానమ్ అనే పదము నపుంసక లింగానికి సంబంధించినది. అది వస్తుత్వాన్ని తెల్పుతున్నది. కనుక ఇంతవరకూ చూపించిన ఉపపత్తుల ప్రకారము విజ్ఞాన శబ్దము చేతనుడిని తెలిపేది ఐనందున విజ్ఞామయుడు ఐన జీవుడికంటే మరొకడు, ఆ జీవునిలోనూ ఉన్నట్టివాడు పరమాత్మయే. ఆయన ఆనందమయుడు.

ఒకవేళ **విజ్ఞానం యజ్ఞం తనుతే** అనే శ్లోకముతో కేవలము విజ్ఞానము మాత్రమే అనే అర్థాన్ని గ్రహించేట్లయితే – జ్ఞాతకాదని ఎంచితే – అప్పుడు కూడా **అన్యోఽన్తర ఆత్మా విజ్ఞానమయః** అని చెప్పడం వల్ల విజ్ఞానాన్ని కలిగియున్న జ్ఞాతనే చెప్పబడతాడు. ఎట్లాగంటే **అన్నాద్వైప్రజాః ప్రజాయంతే** అనే శ్లోకంలో కేవలము అన్నము అనే అన్నరసమయుడు అనుచోట కేవలం అన్నమే నిర్దేశింపబడలేదు. కానీ తన్మయుడు

– అన్నము చేత వికారాన్ని పొందినవాడు/వృద్ధి క్షయాలను పొందినట్టివాడు అనే అర్థాన్ని ఎట్లా తీసుకుంటున్నామో అట్లాగే విజ్ఞానమయుడు అన్నప్పుడు విజ్ఞానము ప్రచురముగా కలవాడనే అర్థాన్ని గ్రహించాలి. దీన్నంతా తన మనస్సులో ఉంచుకునియే సూత్రకారుడైన వ్యాసుడు స్వయంగా భేదవ్యపదేశాత్ అనే సూత్రాన్ని వెనువెంటనే చెప్పుతున్నాడు.

ఇది ఇలాగా ఉంటే జగత్తు ఉత్పత్తికి కారణంగా నిర్దేశింపబడిన వాడికి **అనేన జీవేన ఆత్మనాఽనుప్రవిశ్య, తత్త్వమసి,** అనిన్నీ జీవుడితో సామానాధికరణ్యాన్ని చెప్పినందువల్ల బ్రహ్మజగత్తుకు కారణము ఐనా కూడా జీవస్వరూపుడే కాని అంతకుమించిన వాడుకాడు అని తెలుస్తున్నది కాబట్టి జీవునికే చెందిన స్వరూపము **బ్రహ్మ విదాప్నోతి పరమ్** అని ఉపక్రమించి చెప్పబడినట్టిది. అసుఖానికంటే వ్యావృత్తమైనది /వ్యతిరేకమైనది కాబట్టి అట్టి స్వరూపము ఆనందమయము అని ఉపదేశింపబడుతున్నది అని మీరే మాట చెప్పినారో అది ఒప్పిదమైనది కాదు.

జీవుడికి చేతనత్వము ఉన్నప్పటికీ **తదైక్షత బహుస్యామ్ ప్రజాయేయేతి. తత్తేజోఽసృజత** అని చెప్పినట్లు కేవలము తనయొక్క సంకల్పము చేత మాత్రమే, ఇతరమైన సహకారి కారణాలు లేకుండానే విచిత్ర సృష్టి చేయగల్గడము జీవుడికి ఎంత మాత్రమూ కుదరదు. మోక్షాన్ని పొంది పరిశుద్ధాత్మగా నున్న ముక్త పురుషుడికిన్నీ సత్యకామత్వసత్యసంకల్పత్వాదులు సిద్ధించినా సృష్టి మొదలైన జగద్ వ్యాపారము లేదు అని **జగద్వ్యాపారవర్జమ్, భోగమాత్ర సామ్యలింగాచ్చ** అనే సూత్రాల వద్ద కళ్ళకు కట్టేట్లు చెప్పుతాము.

కారణమైన బ్రహ్మకు జీవస్వరూపత్వాన్నీ అంగీకరించకుంటే **అనేన జీవేనాత్మనా, తత్త్వమసి** ఇత్యాది వాక్యాలలో చెప్పబడిన సామానాధి కరణ్యము ఎలా కుదురుతుంది? అని అంటావా? ఎలాగంటే నిరస్త నిఖిల దోషగంధుడు సత్యసంకల్పుడు సర్వజ్ఞుడు సర్వశక్తి అనవధిక అతిశయ అసంఖ్యేయ కళ్యాణ గుణగణుడు సకల కారణములూ తానే ఐనట్టి వాడికి బ్రహ్మకు నానారకాలు అయిన అనన్తదుఃఖాకరుడూ అయ్యి కర్మాధీనుడై చింతిత నిమిషితాది సకల ప్రవృత్తులూ కలిగిన జీవమిథ్యాత్వాన్ని చెప్పుకుంటే సరిపోతుందంటావా? ఐతే ఆ మిథ్యాత్వము జీవుడికా? లేక పరమాత్మకా? ఒకడేమో హేయము/దుఃఖముతో సమ్బన్ధము

ఉన్నట్టివాడు. మరొకడేమో దుఃఖాలకు ప్రత్యనీకమైన కళ్యాణగుణాలకు మాత్రమే నెలవైన స్వభావము కలవాడు హేయప్రత్యనీకమైన కళ్యాణ గుణైక తానుడికే బ్రహ్మకే అనాదియైన అవిద్య ఆశ్రయించిన కారణాన హేయసంబంధమైన మిథ్యా ప్రతిభాసము లేక భ్రాన్తి జ్ఞానము మిథ్యారూపము కల్గుతుంది అని అంటున్నావా? అయితే నీవు పరస్పర విరుద్ధంగా/విప్రతిషేధంగా మట్లాడుతున్నావుసుమా! సహజంగానే బ్రహ్మకు హేయప్రత్యనీక కళ్యాణైకతానత్వము ఉన్నదంటున్నావు. అదే నాలుకతో అనాది అవిద్యకు ఆశ్రయుడైనందువల్ల అనన్తదుఃఖవిషయ మిథ్యాప్రతిభాసాశ్రయత్వమున్నూ ఉన్నదంటున్నావు. ఈ రెండూ ఒకేచోట ఉండడం కుదరదు. అవి పరస్పర విరుద్ధాలు. అవిద్యాశ్రయత్వము దానియొక్క కార్యమైన దుఃఖప్రతిభాసాశ్రయమున్నూ హేయసమ్బన్ధములే ఐనపుడు దుఃఖాలతో సమ్బన్ధాన్ని కలిగిఉండడము, దుఃఖాలకు ఎదురుఅయ్యి ఉండడము/ప్రత్యనీకత్వము విరుద్ధములే కావా? అట్లైనా అవిద్యాదులు హేయములే ఐనా ఆ ఆశ్రయసమ్బన్ధము/అవిద్య మిథ్య కాబట్టి వైరుధ్యము లేదు అని అనబోకు. అవిద్య/దుఃఖము మిథ్యయే ఐనా అది అపురుషార్థమే. దాన్ని దూరం చేయడానికే వేదాన్తాలు/ఉపనిషత్తులు ఆరంభింపబడుతున్నాయి అని కూడా నువ్వే చెపుతున్నావు. అలాంటి త్రోసివేయదగిన అపురుషార్థాన్ని కలిగి ఉండడము హేయప్రత్యనీక కళ్యాణైకతానతతో విరోధిస్తుంది. కాబట్టి ఏం చేద్దామంటారో చెప్పండి.

**యేనాశ్రుతం శ్రుతంభవతి** అని ఏకవిజ్ఞానము చేత సర్వవస్తువులను గురించి తెల్సుకోవచ్చును అని ప్రతిజ్ఞ చేసి **సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్** ఇత్యాదివాక్యాలతో నిఖిల జగదేకకారణత్వాన్నీ **తదైక్షత బహుస్యామ్** అని సత్యసంకల్పత్వాన్ని కూడా బ్రహ్మకు ప్రతిపాదించి అదే బ్రహ్మకు **తత్త్వమసి** అని సామానాధికరణ్యము ద్వారా అనన్తదుఃఖాశ్రయుడైన జీవుడితో ఐక్యతనున్నూ చెప్పడం జరిగింది. అది మరొక్క విధంగా కావడానికి వీలులేదు. అట్లా అయ్యేట్లు ఉంటే అనుపపత్తి ఏర్పడుతుంది కాబట్టి బ్రహ్మకే అవిద్యా ఆశ్రయత్వము ప్రపంచభ్రమము మున్నగునవి ఏర్పడుతాయి అని కల్పించుకుంటే సరిపోతుంది కదా! అని అంటున్నారా! వేదవాక్యాలద్వారా వినపడుతున్న విషయాన్ని ఉపపన్నము/సమన్వయము/పొసగుట కొరకు తర్కముచే కొట్టివేయబడదగిన అనుపపన్నమును (పొసగనిదాన్ని) బొత్తిగా విరుద్ధమైన దాన్ని కల్పించుకోకూడదు.

ఇక హేయసంబన్ధమే పారమార్థికమైనది. బ్రహ్మకు ఉన్న కళ్యాణగుణైక స్వభావమేమిధ్య ఐనట్టిది అని తలిస్తే అయ్యో! ఆధ్యాత్మిక ఆధిభౌతిక ఆధిదైవికాది తాపత్రయములచేత కొట్టుమిట్టాడుతూ ఉన్న దుఃఖితులైన చేతనులను బాగుపర్చడాని కోసము బయలుదేరిన శాస్త్రము "**తాపత్రయాదులచేత తన్నుకులాడడమే పారమార్థిక విషయము. బ్రహ్మకు కళ్యాణైక స్వభావము మాత్రము భ్రాన్తిచేత కల్పింపబడినట్టిది**" అని బోధిస్తూ వారిని బాగానే ఉజ్జీవింపచేస్తుంది సుమా!

పోనీ అట్లాకాదు. ఈ దోషాన్ని తొలగించడం కొరకు బ్రహ్మకు ఉన్న నిర్విశేష చిన్మాత్రస్వరూపానికంటే వేరయిన జీవత్వము, దానివల్ల వచ్చే దుఃఖిత్వము మొదలైనవన్నీ, మరియు సత్యసంకల్పత్వకళ్యాణగుణాకరత్వ జగత్ కారణాత్వాదులన్నీ కూడా మిథ్యా విషయాలే అని కల్పించుకుంటే సరిపోతుందంటారా? అయ్యయ్యో! ఎంత సుందరంగా ఉందండీ మీ వాక్యార్థ పర్యాలోచనా కౌశల్యము. ఏకవిజ్ఞానము ద్వారా సర్వవిజ్ఞానప్రతిజ్ఞ అనేది ఉన్నదంతా మిథ్యనే అయితే తెల్సుకోవలసింది ఏమీ ఉండదు కాబట్టి తద్ద్వారా పొందేది కూడా ఉండదు. ఎప్పుడైతే ఏకము ఐన బ్రహ్మ/ కారణము పరమార్థము, అట్లాగే సర్వవిజ్ఞానమున్నూ పరమార్థము అవుతుందో, దానిలో భాగమైనదంతా కూడా పరమార్థము అవుతుందో అపుడు పరమార్థమైన కారణము ద్వారా పరమార్థమైన కార్యము ప్రపంచము దానిలోని సర్వపదార్థాలూ సత్యములే అని వాటికి సమ్బన్ధించిన విజ్ఞానాన్ని చెప్పడానికి వీలవుతుంది. కానీ పరమార్థ శుక్తి (ముత్యపుచిప్ప) జ్ఞానముతో దానిని ఆశ్రయించి ఉన్న అపరమార్థ రజతము – (వెండిలాగా మెరుస్తున్న నిజం కాని వెండి) తెలియబడదు.

ఐతే ఇట్లాగా నీవు అనవచ్చు – ఒక వస్తువును గురించి తెల్సుకొంటే వస్తువులనన్నింటినీ గురించీ తెల్సుకోవచ్చును అనే వాక్యానికి/ప్రతిజ్ఞకు అసలు అర్థము ఇది. నిర్విశేషమైన వస్తువు మాత్రమే సత్యము. దానికంటే వేరయినదంతా అసత్యము. (బ్రహ్మ సత్యము అని తెలిస్తే దానికంటే వేరుగా కనిపించే ప్రపంచమంతా అసత్యము) అని.

అట్లాగే ఐనపుడు **యేనాశ్రుతం శ్రుతంభవతి అమతమ్ మతం అవిజ్ఞాతం విజ్ఞాతం** అని ఆవాక్యము ఉండవలసియుంటుంది. దేన్ని గురించి విన్నట్లయితే విననిది కూడా విన్నట్లు అవుతుంది అని ఈ వాక్యానికర్థము. నీవన్నట్లు కారణంగా

ఉపలక్షణము ద్వారా తెలియవచ్చిన నిర్విశేష వస్తువు మాత్రమే ఉన్నది అని ప్రతిజ్ఞ చేసినట్లయితే **యథాసౌమ్యేకేన మృత్ పిండేన సర్వమ్ మృణ్మయం విజ్ఞాతమ్.** ఓ సోమ్యుడా! ఒక మట్టిముద్దను గురించి తెల్సుకుంటే మృణ్మయములు (మట్టితో చేయబడినవి) అన్నీ తెలియబడుతవి అని దృష్టాన్తము కూడా అతుకదు. మృత్పిండము యొక్క విజ్ఞానము ద్వారా దానియొక్క వికారత్వము మార్పు చేయబడడము ఉదాహరింపబడింది కదా! అందువల్ల బ్రహ్మ సత్యమైనప్పుడు ఆయన వికారము/ఆయన నుండి పుట్టినది ఐన ప్రపంచం కూడా సత్యమే అని తెలుస్తుంది కాని అసత్యము అని కాదు. ఐనా అది వికారము కాబట్టి అసత్యమేననే విషయము తోస్తుంది. దాన్నే ఉద్దేశించినారు అని మీరు అనేటట్లయితే మృద్వికారము ఐనది రజ్జు సర్పాదులలో సర్పాదుల వలెనే అసత్యత్వము అయినపుడు తత్త్వమసి అని ఉపదేశించే ఆచార్యుడి విషయము ఎట్లున్నా శ్రవణము చేసే శిష్యుడు లేకుండా పోతాడు. కాబట్టి ప్రతిజ్ఞ చేసి చెప్పుతున్న అర్థాన్ని జరిగితీరుతుందని ప్రదర్శించి చూపడం కొరకు **"యథాసోమ్య"** అని ప్రసిద్ధి కలదానినిగా ఉపన్యసించిచెప్పడం పొసగకుండా పోతుంది. అట్లాగే తత్త్వమసి మొదలగు వాక్యములవల్ల కలిగే జ్ఞానము పుట్టడానికి ముందు కనిపించే వికారప్రపంచమంతా కూడా అసత్యమే సుమా అని తెల్విడి కలిగించే ప్రమాణమొకటి అది తర్కము చేత బలపర్చబడినా, బలపర్చబడనిది ఐనా లోకంలో దొరకడం లేదనే ముచ్చటను **మేము తదనన్యత్వం ఆరంభణా దిశబ్దాదిభ్యః** అనే సూత్రము దగ్గర వివరంగా చెప్పుతాము.

అదే విధంగా **1) సదేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయం 2) తదైక్షత బహుస్యాంప్రజాయేయేతి తత్తేజోఽసృజత 3) హన్తాఽహమిమాః తిస్రోదేవతాః అనేన జీవేనాత్మనాఽనుప్రవిశ్యనామరూపేవ్యాకరవాణి 4) సన్మూలాః సోమ్యేమాః సర్వాః ప్రజాః సదాయతనాః సత్ప్రతిష్ఠాః – ఐతదాత్మ్య మిదంసర్వమ్.** మొదలైన వాక్యాల ద్వారా ఈ ప్రపంచమంతా కూడా సత్ శబ్దవాచ్యుడైన బ్రహ్మను ఆత్మగా కలిగినట్టిది, సృష్టి జరుగడానికి ముందు నామరూప విభాగాలను కోలుపోయి ఉండడము, జగదుత్పత్తిని చేసినపుడు, సచ్ఛబ్దవాచ్యుడైన బ్రహ్మ తనకన్నా వేరొక్కడిని నిమిత్తకారణంగా కానీ సహకారి కారణంగానే అపేక్షించకపోవడము, సృష్టిజరిపిన కాలములో **"నేనే అనన్తమైన స్థిరత్రసరూపంగా పలురూపాలను పొందుతాను"** అని వేరెవ్వరికీ లేని/కనిపించని అసాధారణమైన సంకల్ప విశేషాన్ని చేయడం; ఆ సంకల్పము ప్రకారంగానే

అనన్తములై వింతవింతలైనతత్వాలను ఒక విలక్షణమైన క్రమ విశేషవిశిష్టమైన వాటినిగా పుట్టించడము, సమస్తములైన అచేతన వస్తువులందు తనను ఆత్మగా కల్గిన జీవుడి ద్వారా ప్రవేశించడముతోపాటు అనన్తములైన నామములను రూపాలను ఏర్పర్చడము తనకంటే వేరుగా ఉన్న ఈ చరాచరప్రపంచానికంతటికీ తానే మూల కారణమై ఉండడము, తనయందే అవన్నీ ఆధారపడి బ్రతకడం, తనచేతనే అవన్నీ నియమింపబడి ముందుకు సాగడము, తనచేతనే పోషింపబడి ఉండడము, తనపైననే ఆధారపడి యుండడము మొదలైన అనన్తవిశేషాలు అన్నీ కూడా కేవలము శాస్త్రము/వేదము చేత మాత్రమే తెల్సుకోబడేవి ప్రతిపాదింపబడినాయి. ఆ బ్రహ్మకే సమ్బన్ధించినవై యున్నందున ఈ సద్విద్యాప్రకరణము మాత్రమే కాక ఇతర ప్రకరణాలలో ఉపనిషత్తులలోనూ ఉగ్గడింపబడిన అపహతపాప్మత్వాదులైనవి మొదలుకొని ఎలాంటి దోషాలు ఏమాత్రమూ లేకపోవుట సర్వజ్ఞత్వము సర్వేశ్వరత్వము సత్యకామత్వము సత్యసంకల్పత్వము తనకంటే వేరుగా ఉన్న ప్రాణులను/ జీవులను అందరినీ ఆనందపర్చగల నిరతిశయమైన ఆనందాన్ని తాను మాత్రమే కలిగియుండడము ఇతరప్రమాణాలకు వేటికిన్నీ అందని విషయాలు వేలకొలది/ వేలసార్లు ప్రతిపాదింపబడినాయి.

ఈ తీరుగా ఏ ప్రమాణము చేత తెలియరాని అనన్తవిశేషములతో విశిష్టుడైన, ప్రస్తుత జగత్ కారణమైన/చర్చనీయాంశమైన బ్రహ్మను తడిమిచూపే **తత్ శబ్దము** నిర్విశేషమైన బొత్తిగా శూన్యమనదగిన వస్తువును మాత్రమే ఉపదేశిస్తున్నది అని ప్రతిజ్ఞ చేయడము ఎంతమాత్రమూ ప్రామాణికత లేనిదే కాకుండా అంతా అవకతవకలమయము, పిచ్చి వాని ప్రేలాపన కంటే తక్కువ ఏమాత్రమూ కాదు. ఇక **త్వమ్** అనే పదమూ కూడా సంసారిత్వమనే ధర్మముతో కూడిన జీవుడిని తెలుపుతున్నది. అది కూడా నిర్విశేష స్వరూపాన్నే తెలియజెప్పేటట్లయితే ఆపదము తనదైన అర్థాన్ని వదిలిపెట్టినది అవుతుంది. నిర్విశేష ప్రకాశస్వరూపము గల వస్తువు అవిద్యచేత కప్పబడిపోవడం,దానివలన తనదైన స్వరూపాన్నేకోలుపోయే దుఃస్థితి దాపురించడము ఇంతకు మునుపే చెప్పియున్నాము. ఇట్లాగే ఐనపుడు సామానాధికరణ్యాన్ని కలిగిన తత్ త్వమ్ అనే రెండు పదాలకున్నూ శబ్దగతమైన ముఖ్యార్థాన్ని వదిలిపెట్టి నిర్విశేషము అని చెప్పినందున అర్థము పొసగడంకొరకు లక్షణా శక్తిని ఆశ్రయించవలసిన దుర్గతి పడ్తుంది.

ఒకవేళ మీరిట్లాగా అనవచ్చు – సామానాధికరణ్యమనే వృత్తిలో ఉన్నటువంటి పదాలు అవి ఎన్ని ఉన్నా ఒకే అర్థాన్ని చెప్పడమే ప్రధానము కాబట్టి విశేషణాంశాలకు ప్రాధాన్యము ఉండదు. కనుక విశేషణాలు తమ ధర్మాన్ని చేజార్చుకుంటున్నందున వస్తువు ఒక్కటి మాత్రమే ఉన్నది అనే విషయాన్ని ప్రతిపాదిస్తున్నందువల్ల లక్షణను చెప్పుకోవలసిన అవసరమే లేదు. రాదు. ఎట్లాగంటే **నీలమ్ ఉత్పలమ్** అనే రెండు పదాలూ ఒక్క విశేష్యాన్నే ప్రతిపాదించేవి ఐనందున నీలత్వము ఉత్పలత్వము అనే రెండు విశేషణాలను గురించి చెప్పబడడం లేదు. రెండు విశేషణాలను చెప్పాలనే వివక్షలేదు. అలాంటి వివక్షనే గనుక ఉన్నపుడు నీలత్వవిశిష్టాకారముతో ఉత్పలత్వ విశిష్టాకారమునకు ఏకత్వము ఏర్పడుతుంది. అయితే అది జరిగేది కాదు. నైల్యవిశిష్టాకారమైన ఉత్పలపదంతో ఆ వస్తువు విశేష్యము కాదు. ఐనపుడు జాతిగుణములు రెండూ పరస్పరము సమ వాయములు కావాల్సి ఉంటుంది. అందువలన నీలత్వఉత్పలత్వముల చేత ఉపలక్షితమైన వస్తువు ఒక్కటి మాత్రమే సామానాధికరణ్యముతో ప్రతిపాదింపబడుతున్నది. అట్లాగే **సోఽయం దేవదత్తః** వాడే ఈ దేవదత్తుడు అని గడచి పోయినకాలము మిక్కిలి దూరమైన దేశము ఈ రెండింటితో కూడిన ఆనాటి రూపముతో దగ్గరి ప్రదేశము నందు వర్తమానకాలముతో కూడినవాడినిగా ప్రతిపాదించడము (ఏకకాలంలో) కుదరదు కాబట్టి రెండు దేశాలు కాలాలలోనూ గుర్తింపబడుతున్న స్వరూపమునొక్కటిని మాత్రమే సామానాధికరణ్యము ప్రతిపాదిస్తున్నది. ఒకవేళ నీలమ్ ఇత్యాదులైన ఒకే పదాన్ని విన్నపుడుతోచే విశేషణము సామానాధికరణ్యమున్న వేళలో వైరుధ్యమున్నందున ప్రతిపాదింపబడకపోవచ్చు. అట్లైనా వాచ్యమైన అర్థము నందు ప్రధానాంశము ఐన ఏకత్వాన్ని ప్రతిపాదించుతున్నది. కావున లక్షణాశక్తి ప్రమేయము ఉండదు. కానీ విశేషణాంశము యొక్క అవివక్షా అవసరము మాత్రము ఉంటుంది. ఇదే అన్నిచోట్లా సామానాధికరణ్యమునకు ఉండే స్వభావము. కాబట్టి దోషము ఏమీ లేదు అని.

ఐతే ఇది సారహీనమైన విషయము సుమా! వాక్యాలు సమానాధికరణములు కావచ్చు, వ్యధికరణాలూ కావచ్చు ఏవైనాసరే! వాటన్నింటిలోనూ పదాలకు వాటివ్యుత్పత్తి ప్రకారము ఏర్పడిన అర్థముతో వాటికున్న సంసర్గము/సంబన్ధమును మాత్రమే గుర్తించాల్సి ఉంటుంది. అచట సామానాధికరణ్యములోనున్న నీలాది పదాలకు నైల్యాది విశిష్టమైన అర్థము మాత్రమే వ్యుత్పత్తి సిద్ధమై ఇతరపదాల అర్థాలతో

సంసర్గము కలది అయ్యే చెప్పబడుతుంది. ఎట్లాగంటే **నీలమ్ ఉత్పలమ్ ఆనయ** నల్లని ఉత్పలమును/కలువను తీసుకొని రా! అని చెప్పినప్పుడు నల్లదనము మొదలగు ధర్మాలతో కూడినదాన్నే తీసుకువస్తారు. ఇంకా **వింధ్యాటవ్యాం మదముదితో మాతంగగణః తిష్ఠతి.** వింధ్యారణ్యము నందు మదముతో కూడి ఆనందంగా విహరించుతున్న ఏనుగులగుంపు ఉన్నది అని పలికినప్పుడు రెండు పదాల చేత తెలియవస్తూ ఉన్న విశేషణాలతో కూడిన అర్థమే స్ఫురించుతుంది. ఇదే పద్ధతిలో వేదాన్తవాక్యాలలోనూ సామానాధికరణ్యమున్న స్థలాల్లో ఆయాపదాలతో చెప్పబడిన విశేష అంశాలతో కూడియున్న బ్రహ్మనే గుర్తించాలి. అంతేకాని విశేషణభేదాలవలన వేరువిశేషాలతో కూడిన వేరువేరు విశిష్టాంశాలను గానీ పరస్పర విశిష్టాంశముగా గానీ విశేషించగూడదు. అయితే అన్ని విశేషణాలతో కూడిన స్వరూపమే విశేష్యము అని గుర్తించాలి.

అది ఈ ప్రకారముగా ఉంటుంది. **వైయాకరణులు సామానాధికరణ్యము యొక్క లక్షణాన్ని ఇట్లాగా చెప్పినారు.** భిన్న ప్రవృత్తి నిమిత్తానాంశబ్దానాం ఏకస్మిన్ అర్థే వృత్తిః సామానాధికరణ్యమ్. వేరువేరు అర్థాలను తెలియజేయడం కొరకు బయలుదేరిన/ప్రయోగింపబడిన పదాలు ఒకానొక అర్థాన్ని తెలుపడంలోనే ప్రవృత్తి కలిగి ఉన్నట్లయితే దానిని సామానాధికరణ్యము అని అంటాము అని. ఒకానొక పదముతో/వస్తువుతో అన్వయముఖంగా కానీ వ్యతిరేకంగా కానీ/అది లేదని తోసివేయడం ద్వారాగానీ మరొక పదము చేత చెప్పబడే మరొక్కరూపముతో కూడియున్న ఆ వస్తువునే మరొక పదముతోనున్నూ చెప్పుతుండడం సామానాధికరణ్యము యొక్క పని. **ఒక పదముతో ఒక రూపము కలదిగా చెప్పబడే ఆ వస్తువునే మరొక్కపదముతోనూ మరొక్క విశేషము కలదిగా ఎరుకపర్చడమే.** ఇట్లా చెప్పబడే విశేషాలు ఆ వస్తువులో ఉన్నదిగానూ, లేనిదిగానూ ఐ ఉండవచ్చును. ఎలాగంటే **దేవదత్తః శ్యామో యువా లోహితాక్షః అదీనః అకృపణః అనవద్యః** అని దేవదత్తుడు చామన చాయ గలవాడు యువకుడు. ఎరుపుకన్నులవాడు. దైన్యములేనివాడు. నిర్ధనుడు కాడు. దోషాలు/తప్పులు లేనివాడు అని. ఇక్కడ మొదటి మూడు పదాలు దేవదత్తుడిలో ఉన్నటువంటివి కాబట్టి అన్వయములు/అన్వితములైన అంశాలు. వాటిని చెప్పే పదాలు. తర్వాత ఉన్న మూడు పదాలు వ్యతిరేకములు ఐనటువంటి అంశాలను చెప్పుతున్నాయి. ఇవన్నీ ఒకే దేవదత్తుడిలోనూ ఉన్నాయి. పదాలు కూడా ఒక్కొక్క విశేషాన్ని తెల్పుతూ అన్నీ

దేవదత్తః అనే విశేష్యమునందే ఒక్కవస్తువుయందే అన్వయించుతున్నవి. ఫలితంగా దేవదత్తుడు ఈ గుణాలను కల్గియున్నట్టి వాడు ఈఈ గుణాలను లేకుండా ఉన్నటువంటి వాడని తెలుస్తున్నది. ఈ విధంగా తెలియచేయడాన్ని సామానాధికరణ్యము అని అంటున్నాము.

ఎక్కడైతే సమన్వయము చెయ్యడానికి వీలుగాని విశేషణాలు రెండు సమానాధికరణములైన పదములతో అనేక పదాలతోనూ కావచ్చు. నిర్దేశించ బడుతుందో అక్కడ కూడా ఆ రెండింటిలో ఏదో ఒక పదము మాత్రమే ముఖ్యార్థాన్ని తెలిపేదిగా ఎంచుకుంటాము. కానీ రెండింటినీ కాదు. ఎలాగంటే గౌః వాహీకః. ఆవు బరువులు మోసేది అన్నట్లు గో శబ్దము చేత లోకంలో గోజాతి చెప్పబడుతున్నది. ఐనా స్త్రీ పశువుకే గోశబ్దము చేత ప్రసిద్ధి ఉన్నది. వాహీకః బరువులు మోసెడిది అని అర్థము. అనగా గంత, గంతకు తగిన బొంత సామెత. ప్రస్తుతానికి వస్తే ఆవు మరియు బరువులను మోసే గంత అని అర్థము వచ్చినపుడు ఆవు అయితే గంతకాదు. గంత ఐతే పాలను ఇవ్వదు. ఇవి రెండూ పరస్పర విరుద్ధాలు. ఈ వాక్యానికి అర్థము చెప్పుకున్నపుడు వాహీకః అనే పదంతో చెప్పబడే విశేషణాంశాన్ని గ్రహించినపుడు గో శబ్దానికి ఎద్దు అని అర్థము చెప్పుకుంటాము. కాబట్టి రెండు పదాల్లో ఒక్క పదానికి మాత్రమే ముఖ్యార్థాన్ని గ్రహించుతాము అవి పరస్పర విరుద్ధాంశాలు ఐనప్పుడు అని.

ఇక నీలోత్పలమ్ నీలమ్‌ఉత్పలమ్ ఇత్యాదులలో మాత్రము విశేషణాలు రెండింటికిన్నీ అన్వయించడములో వైరుధ్యము లేదు కాబట్టి ఉభయవిశేషణ విశిష్టమే గ్రహింపబడుతుంది. నల్లకలువ అంటే నలుపుదనం + కలువజాతితో కూడిన పుష్పము అని రెండు ధర్మాలతో / విశేషాలతో కూడిన విశిష్టాంశము **పూవు** అని తెలియవస్తుంది. నలుపు కలువజాతి రెండూ పరస్పర విరుద్ధాలు కావు కదా! కనుక అవి రెండూ పువ్వు అనే అంశములో అన్వయించినవి.

ఒకవేళ ఇట్లాగా నీవు తలుస్తూ ఉండవచ్చు – ఒక విశేషణముతో కూడి ఉన్నందువలన తద్విశిష్టంగా నిరూపింపబడే వస్తువు మరొక విశేషణంతో కూడా సమ్బన్ధము కల్గియుండినట్లయితే మొదటి దానికన్నా విలక్షణము వేరుగా అవుతున్నది కాబట్టి ఎంతగా ఒకే విభక్తితో చెప్పబడినా ఘటపటములవలె ఒక్కటే వస్తువు అని ప్రతిపాదించడానికి కుదరదు. కనుక సమానాధికరణ శబ్దము విశిష్టార్థముతో కూడిన

వస్తువును ప్రతిపాదించలేదు కానీ విశేషణము ద్వారా దానియొక్క స్వరూపాన్ని తెలియజెప్పి అది ఒక్క వస్తువే అని చెప్పగల్గుతుంది అని.

అయితే అట్లా కావచ్చును. ఎప్పుడు? ఆ వస్తువు రెండు విశేషణాలతో విశిష్టమైన ఒక వస్తువు ఐనప్పుడు మాత్రమే. కానీ ఇది లోకంలో కనుపించడం లేదు. ఒక ధర్మమును ధర్మియందు / వస్తువునందు రెండింటినీ కూర్చడానికి వీలుకాని ధర్మములు రెండింటితో కూడినపుడు మాత్రమే ఏకత్వము నిరాకరింపబడుతుంది. అనగా భిన్నభిన్న విరుద్ధ విశేషణాలతో కూడి ఉండవలసినపుడు మాత్రమే ఆ వస్తువు ఒకటి కాదు. రెండు వస్తువులు అని ఏకత్వము నిరోధింపబడుతుంది. నీవు చూపిన ఉదాహరణములో అనగా ఘటపటాదులలో ఆయోగ్యత ఇతర ప్రమాణము చేత సిద్ధించుతుంది. ఘటపటాదులు ఏకవిభక్తితో శబ్దరూపంగా చెప్పినా ప్రత్యక్ష ప్రమాణము ఆ రెండింటినీ వేరువేరు వస్తువులు. పరస్పర విరుద్ధాలు అనియే చూపుతుంది. నీలముత్పలమ్. ఇత్యాది స్థలాలలో దండిత్వము, కుండలిత్వములవలే రూపవత్త్వము, రసవత్త్వము, గంధవత్త్వము మొదలైన వాటివలె ఒకే వస్తువు నందు ఉండటాన్ని అడ్డుకోగల అంశము ప్రమాణము ఏదీ, అందుకు కారణమైన వైరుధ్యమున్నూ లేదు. ఒక వ్యక్తిని తీసుకుంటే వాడిలో దండిత్వము – చేతిలో కర్రను కలిగి పూని ఉండడము, చెవులకు కుండలాలను పెట్టుకోవడము పరస్పరము అడ్డుకోజాలవుకదా! ఒక పువ్వులో / పండులోనైతే చక్కని వర్ణము, మంచి వాసన తీయని రుచి పరస్పరము అడ్డుకోవు. పైగా అన్నీ ఒక దగ్గర అమరి ఉండి ఆ పువ్వుకో పండుకో ఒక ప్రత్యేకతను చేకూరుస్తవి.

ఆ విధంగా కేవలము వైరుధ్యము లేకపోవడమే కాక శబ్ద ప్రవృత్తికి నిమిత్తమైన భేదము కారణంగా ఏకార్థ నిష్ఠారూపమైన (ఒకే వస్తువును గురించి చెప్పడంలో ఐక్యతను కల్గిఉండుట) సామానాధికరణ్యమును ధర్మద్వయ విశిష్టత ఉపపాదిస్తుంది. అట్లాకాకపోతే వస్తుస్వరూపాన్ని ఒక్కటే అని మాత్రమే చెప్పేట్లయితే అనేక పదాలను ప్రయోగించాల్సిన అవసరమే ఉండదు. కనుక సామానాధికరణ్యమే లేకుండా పోతుంది. విశేషణాలు తమతో సమ్బన్ధము లేకుండానే వస్తుస్వరూపాన్ని ఉపలక్షణాలు వివరించగలిగినపుడు ఒక్కదానితోనే వస్తువు గుర్తింపబడుతుంది. కావున మరొక ఉపలక్షణము వ్యర్థమే అవుతుంది. ఉపలక్షణాన్తరముతో (మరొకదానితో) ఉపలక్ష్యమైన (గుర్తించదగిన) వస్తువులో భేదము ఉన్నది అని అంగీకరించితే ఆ ఆకారమున్న కారణాన సవిశేషమైన వస్తువు ఉన్నది – నిర్విశేషచిన్మాత్రబ్రహ్మ కాదు –

అని ఒప్పుకోవలసి వస్తుంది. ఇక్కడ శాఖాచంద్ర న్యాయాన్ని సమన్వయం చేసుకోవాలి. ఆ కొమ్మకు పైన తెల్లగా కనిపిస్తున్నదే అది చంద్రుడు అని అన్నప్పుడు చంద్రుడిలో తెల్లగా ప్రకాశాన్ని కలిగి ఉండడము అనే విశేషము ఉన్నది అని చెప్పడం ద్వారా చంద్రుడిని గుర్తించడం సాధ్యపడుతున్నది. కనుక చంద్రుడిలో విశేషము ఉన్నది అని అంగీకరించినట్లే ప్రపంచమును సృష్టించడము, రక్షించడము ఉపసంహరించడము అనే ఉపలక్షణాలతో కూడిన బ్రహ్మను విశేషాంశము కలవాడినిగా గుర్తించవలసి వస్తుంది. అందువల్ల నిర్విశేషబ్రహ్మ కాస్తా సవిశేష బ్రహ్మ అయ్యి కూర్చుంటాడు.

**సోఽయందేవదత్తః** అనుచోట కూడా లక్షణాగన్ధము లేనే లేదు. వాక్యార్థ విరోధము అక్కడ లేదు. గడిచిపోయిన కాలము దేశాన్తర సమ్బన్ధములు కల దేవదత్తుడు ప్రస్తుతము సన్నిహిత దేశసమ్బన్ధాన్ని కలిగి వర్తమానకాలములో ఎట్ట ఎదుట ఉన్నాడు కాబట్టి విరోధము లేదు. ఇందువల్లనే సోఽయమ్ వాడే వీడు అని ప్రత్యభిజ్ఞ కారణంగా రెండుకాలాలతో సమ్బన్ధమున్న వస్తువుకు ఐక్యమును స్థిరత్వవాదులు ప్రతిపాదిస్తున్నారు. అనగా బౌద్ధులు **సర్వమ్ క్షణికమ్** ఏదైనా క్షణకాలము మాత్రమే ఉంటుంది అని నమ్ముతారు. దాన్ని ఖండించినవారు అద్వైతులు స్థిరత్వవాదులు అంటే ఏ వస్తువు ఐనా కొంతకాలము నిలిచే ఉంటుంది. క్షణభంగురము కాదు అని వారిని ఖండించియున్నారు. ఇలాంటివారు రెండుకాలాలతో సమ్బన్ధము ఎవ్వరికీ దేనికీ ఉండదు అని విరోధాన్ని చెప్పడం తగదు అని అర్థము.

అట్లాకాక కాలద్వయ సమ్బన్ధ విరోధముతో ప్రతీతి వైరుధ్యము ఏర్పడినపుడు అన్నీ క్షణికాలే కావలసి యుంటుంది. ఐతే దేవదత్తుడు ఒక్కడే ఐనా రెండుదేశాలతో సమ్బన్ధము ఎట్లాకుదురుతుంది అని అంటే వేరువేరు కాలాల్లో సంబన్ధాన్ని కలిగి ఉండడంలో తప్పేమీ లేదు కదా! అని అంటున్నాము.

సమానాధికరణములోని పదాలు అనే విశేషణాలతో కలసియున్న ఒక్క వస్తువును చెపుతున్నవి కనుకనే **అరుణయా ఏకహా యన్యాగవా పింగాక్ష్యా సోమంక్రీణాతి** ఎర్రనిరంగు గలది ఒక్క సంవత్సరము వయస్సు కలది పసుపు కల్సిన పింగళవర్ణము కలకండ్లు కలది ఐన ఆవును ఇచ్చి సోమలతను కొనుచున్నాడు అని ఎర్రదనము మొదలైన విశేషాలు కలిగి ఏడాది వయస్సున్న ఆవు ద్వారా కొనుగోలు చేయాలని విధింపబడుతున్నది. అందుకే ఇలా చెప్పినారు. **అర్థైకత్వే ద్రవ్యగుణయోః ఐక కర్మ్యాత్ నియమః స్యాత్** అర్థము ఒక్కటి యైనపుడు ద్రవ్యము గుణములకున్నూ

ఒకే కర్మతో సమ్బన్ధము ఉన్నందున నియమము ఏర్పడుతున్నది. అని ఈ విషయములో పూర్వపక్షిగారి అభిప్రాయము ఇట్లా ఉన్నది.

అరుణయా అనే పదము ఆకారానికి వలెనే గుణము కూడా ద్రవ్యానికీ విశేషణము అయ్యి ఉండడమే స్వభావము అయినందువలన ద్రవ్యపర్యన్తమే ఎరుపు దనాన్ని చెపుతున్నది. అట్లా ఐనా ఏడాది వయస్సును కలిగి ఉండాలనే నియమము ఎర్రదనానికి చెల్లదు. ఏడాది వయస్సున్న దానితో సో మలతను కొంటున్నాడు. అదీ ఎరుపురంగు కలదానితో అని. దానితో అర్థద్వయ విధానము కుదరదు. దానితో అరుణయా అని వాక్య భేదము ఏర్పడి ప్రకరణములో విధించబడిన సర్వద్రవ్యాలకు అరుణిమ/ ఎరుపుదనాన్ని ఏ మాత్రమూ తేడా లేకుండా తెలుపుతుంది. అనగా ఆ వాక్యంలో ఉన్న విశేషణాలన్నింటికీ ఈ ఎరుపుదనము విశేషణము కావాల్సివస్తుంది అని. అరుణయా అని స్త్రీ లింగనిర్దేశము ప్రకరణములో విధించబడిన అన్నిలింగాలకూ చెందిన ద్రవ్యాలను ప్రదర్శించడం కొరకు. అందువలన ఏక హాయనీపదముతో అన్వయము అయ్యి తీరాలనే నియమము కాకూడదు.

దీనికి సమాధానము ఇట్లాగా చెప్పబడుతున్నది. **అర్థైకత్వేద్రవ్యగుణయోః ఐకకర్మ్యాత్ నియమః** అని అరుణయా ఏకహాయన్యా అని ఆరుణ్య విశిష్టద్రవ్య, ఏకహాయనీద్రవ్యాన్ని తెలిపే పదాలు రెండింటికీ సామానాధికరణ్యముతో ఒకే అర్థానికి చెందినది (అర్థైకత్వము) అని సిద్ధించుతుండగా ఏక హాయనీద్రవ్య ఆరుణ్య గుణములకు అరుణయా అనే పదము చేతనే విశేషణ విశేష్య సంబన్ధము కలవిగా చెప్పబడిన వాటికి క్రయము –కొనుగోలు చేస్తూ చెల్లించినవెల – అనే ఒకే కర్మయందు అన్వయించడములో వైరుధ్యము ఏమీ లేదు కాబట్టి అరుణిమ – ఎరుపుదనముకు క్రయసాధనమైన ఏడాది వయస్సు కలది అనే దానితోనే అన్వయము కావాలి అనే నియమము వర్తిస్తుంది.

ఒకవేళ ఏకహాయనీ అనే పదానికి క్రయముతో సమ్బన్ధమున్నట్లుగానే ఎరుపుదనముతో సంబన్ధము కూడా వాక్యముతోనే తెలియవలసినది ఐనపుడు వాక్యానికి అర్థద్వయ విధానము చెప్పవలసి వస్తుంది. కానీ అట్లాగా ఏమీ లేదు. అరుణయా అనే పదము తోనే అరుణిమ – ఎరుపుదనము – తో కూడిన విశిష్టద్రవ్యమేనని చెప్పబడింది. ఏకహాయనీ పదముతో నున్న సామానాధికరణ్యము యొక్క అర్థము. **భిన్న ప్రవృత్తి నిమిత్తానామ్ శబ్దానాం ఏకస్మిన్నర్థే వృత్తిః సామానాధికరణ్యమ్** వేరువేరు విశేషాలను

వదిలిపెట్టకుండానే ఆయా విశేషాలన్నింటితోనూ కూడియున్న ఒక వస్తువును తెలియపర్చడమే సామానాధికరణ్యము. ప్రాతిపదిక ద్వారా గుణముతో అన్వయము, సమానవిభక్తితో పదాలకు పరస్పరాన్వయము, వాక్యముతో క్రియాన్వయము అనే మూడున్నూ కుదురుతున్నవి కాబట్టే రక్తః పటః భవతి ఎర్రని బట్ట సిద్ధమవుతున్నది అనుచోట ఏకార్థత లభ్యమవుతున్నది. కనుకనే వాక్యభేదము ఏర్పడక ఏకవాక్యత్వము సిద్ధించుతున్నది. వస్త్రము ఏర్పడుతున్నదశకు సమ్బన్ధించే వాక్యప్రయోగము జరుగుతున్నది కదా! ఆ వస్త్రములోని రంగుకు సమ్బన్ధించిన అంశము రక్తః అనే పదముతోనే చెప్పబడింది. రాగము (రంగు) తో సమ్బన్ధమున్న ద్రవ్యము వస్త్రము అనే అంశము మాత్రము ఆ వాక్యములో సామానాధికరణ్యము వల్ల మాత్రమే తెల్సుకోవలసి ఉంటుంది.

ఇదే తీరుగా ఒకే గుణము, లేక రెండు మూడు చాలా చాలా గుణాలతో తద్వాచకమైన పదాలతో విడివిడిగాగానీ సమాసము చేయబడిన వాటితోగానీ కూడియున్న సవిశేషమైన అంశాన్ని లేక వస్తువును ముందుంచి సామానాధికరణ్యము ద్వారా అన్ని విశేషణాలతో కూడిన వస్తువు ఒక్కటే అని తెలియపరచి దానితో క్రియాసమ్బన్ధాన్ని చెప్పడం విరోధము ఏమీ కాదు. **దేవదత్తః శ్యామః యువాలోహితాక్షః దండీకుండలీ తిష్ఠతి. 2) శుక్లేనవాససా యవనికాం, సమ్పాదయేత్ 3) నీలముత్పల మానయ 4) గామానయ శుక్లామ్ శోభనాక్షీమ్ 5) అగ్నయే పథికృతే పురోడా శమష్టాక పాలమ్ నిర్వపేత్** అని 1) దేవదత్తుడు నల్లనివాడు యువకుడు లోహితాక్షుడు చేతిలో కర్రను పట్టుకున్నవాడు, చెవులకు కుండలాలను ధరించిన వాడు నిలబడి ఉన్నాడు. 2) తెల్లని వస్త్రముతో తెరను సమకూర్చుకోవలెను. 3) నల్లని కలువను తీసుకొనిరా 4) తెల్లనిది అందమైన కన్నులు గలదీ ఐన ఆవును తీసుకుని రమ్ము 5) మార్గమధ్యములో చేసే అగ్నిహోత్రకార్యానికి ఎనిమిది చిప్పలలో పురోడాశము సిద్ధము చేసుకోవలెను. అని ఉదాహరణములు ఇవ్వబడినవి. ఈ అన్నింటిలోనూ విశేష్యాలు ఐన వస్తువులు వ్యక్తులు పలురకాలైన విశేషణాలతో ఒకే ఒక్క వ్యక్తిగా కనిపిస్తున్నారు. ఏకత్వాన్నే చాటుతున్నారు తప్ప మరో విధముకాదు. ఇట్లాగే **అరుణయా ఏకహాయ న్యాగవాపింగాక్ష్యాసోమంక్రీణాతి** ఎన్ని విశేషణాలున్నా సమానాధికరణము ద్వారా విశేషణ విశిష్టమైన ఏకవ్యక్తియే తెలుపబడ్తున్నది – అనగా ఇదీ విస్పష్టము చేయబడుతున్నది.

ఎలాగైతే **కాష్ఠైః స్థాల్యామోదనం పచేత్** కట్టెలతో గిన్నెలో అన్నాన్ని వండాలి. అనే స్థలములో అనేక విభక్తులతో/కారకాలతో విశిష్టమైన ఒక క్రియ విడివిడిగా కాక ఒక్కసారిగానే తెలియబడుతున్నదో అట్లాగే సమానాధికరణపద సముదాయము చేత తెలియచెప్పబడిన ఒక్కొక్క కారకమున్నూ ఆయా కారకములను గుర్తించుతున్న సమయంలోనే అనేక విశేషణాలతో కూడినదయ్యే ఒక్కసారిగా యుగపత్ ప్రతిపన్నమయ్యి/ తెలియవచ్చి క్రియలో అన్వయించుతున్నది. కనుక ఎలాంటి వైరుధ్యము లేదు. ఉదాహరణకు ఈ వాక్యాన్ని పరిశీలించండి. **ఖాదిరైః శుష్కైః కాష్ఠైః సమపరిమాణే భాండే పాయసం శాల్యోదనం సమర్థః పాచకః పచేత్,** ఎండిన చంద్ర కట్టెలతో సమానపరిమాణము గల కుండలో వరి బియ్యపు అన్నముతో పాయసాన్ని సమర్థుడైన పాచకుడు (వంటవాడు) వండగలడు. ఇత్యాదులు.

ఉపాత్తద్రవ్యక వాక్యములోనున్న గుణశబ్దము కేవలగుణాన్ని మాత్రమే తెల్పుతుంది అని అందువల్ల అరుణయా అనే పదము ద్వారా కేవల గుణము మాత్రమే ఎఱ్ఱదనము అరుణయా అనే పదము ద్వారా కేవల గుణము మాత్రమే ఎఱ్ఱదనము మాత్రమే చెప్పబడుతుంది అని మీరన్న మాట సరియైనది కాదు. లోకంలో గానీ వేదములో గానీ ద్రవ్యాన్ని చెప్పే పదములతో గల సమానాధికరణమైన గుణవాచి శబ్దానికి కేవలం గుణాన్ని మాత్రమే తెలుపడం అనేది కనుపడడం లేదు. ఉపాత్తద్రవ్యకమైన వాక్యములో నున్న గుణపదము కేవలగుణాన్ని మాత్రమే చెప్పుతుంది. అని అనడమున్నూ అసంగతమే. **పటః శుక్లః** బట్ట తెల్లటిది ఇత్యాది వాక్యాలలో ఉపాత్తద్రవ్యములోనూ గుణముతో కూడిన దానినే తెలుపుతుండడం కనుపిస్తున్నది. ఆ మాట అట్లాగే చెప్పుతున్నది. అదే **పటస్య శుక్లః** బట్ట యొక్క తెల్లదనము అన్నచోట తెల్లదనముతో కూడిన వస్త్రమును గురించి ఉపాత్త ద్రవ్యకత్వము వల్ల పుట్టింది కాదు. అదే సందర్భములో **పటస్య శుక్లో భాగః** వస్త్రము యొక్క తెల్లని భాగము ఇత్యాదులయందు సమానవిభక్తి నిర్దేశమున్నందువల్ల తెల్లదనముతో కూడియున్న ద్రవ్యము స్ఫురించుతున్నది.

ఏదైతే క్రయమునకు ఏకహాయనీ నియమము వలన ఎరుపుదనానికి క్రయముతో అన్వయము కుదురదు/సంభవించదు అని అన్నారో అది కూడా విరోధి గుణరహితమైన ద్రవ్యమును బోధించే పదముతో సమానాధికరణము గల గుణపదము దానికి ఆశ్రయమైన గుణాన్ని చెప్పుతున్నందున క్రియాపదంతో అన్వయించడానికి

విరోధము ఏమీలేదు కాబట్టి అసంగతమే సుమా! ఇక రాద్ధాన్తము నందున్నూ ముందు చెప్పిన **సంభవతి ఏకవాక్యత్వేవాక్యభేదశ్చనేష్యతే** ఏకవాక్యత్వము కుదురుతూ ఉండగా వాక్యభేదమును ఆశ్రయించడము అంగీకారయోగ్యము కాదు అనే న్యాయము ప్రకారము అరుణిమకు శాబ్దికమైన ద్రవ్యాన్వయము సిద్ధించుతున్నది అలాంటప్పుడు ద్రవ్యము దాని గుణములకు రెండింటికీ క్రయసాధనము కావడములో అర్హత పొసగడము లేదు కాబట్టి అర్థము వలన మాత్రమే పరస్పరాన్వయము సిద్ధించుతున్నది అని మీరు చెప్పిన మరొకమాట కూడా పొసగనిదే. కనుక మేము చెప్పిన విధమే సరియైనది.

అందువలన తత్త్వమసి మొదలైన వాక్యాలలోని సామానాధికరణ్యము నందు తత్, త్వం అనే పదములు రెండింటి చేత చెప్పబడిన విశేషణాలను వదిలిపెట్టకుండానే ఐక్యప్రతిపాదన చేయాలి ఆ విధంగా వర్ణించాలి అయితే అది అనాదియైన అవిద్యా ఉపాధి కారణంగా అనేక దుఃఖాలపాలు అవుతున్నందున శుద్ధి, అశుద్ధి అవస్థలను రెండింటినీ అనుభవిస్తున్న చేతనుడికంటే పూర్తిగావేరయిన వాడు అశేషహేయ ప్రత్యనీకుడు అనవధికమైన కళ్యాణగుణాలకు ఒకే ఒక్క నెలవు ఐన పరమాత్మను అంగీకరించకుంటే సామానాధికరణ్యము కుదరదు.

సరే! ఒప్పుకుంటాము కానీ సమానాధికరణములోని పదాలకు ఉన్నది ఉన్నట్లుగా విశేషణ విశిష్ట ఐక్యప్రతిపాదనను చేసెడివిగా అర్థాన్ని చెప్పుకున్నట్లయితే త్వమ్ పదము చేత తెలియవచ్చే సకల దోషాలను పొందడము అనేది పరమాత్మకు వచ్చిపడుతుంది కదా! అని అంటున్నారా! అట్లాగా ఏమీ జరుగదు. త్వమ్ శబ్దముచేత కూడా జీవాన్తర్యామియైన పరమాత్మనే చెప్పబడుతున్నాడు కదా!

ఇంతవరకూ చేసిన విచారము వల్ల తేలిన సారాంశమిది – సత్‌శబ్దము చేత చెప్పబడినవాడు దోషగంధము ఏ మాత్రము లేనివాడు సత్యసంకల్పత్వముతో మిశ్రమై అనవధికము, తనకన్నా అతిశయము ఐనది లేనట్టి అసంఖ్యేయములైన కళ్యాణగుణగణములు కలవాడు అన్నిరకాలైన కారణములూ తానే ఐనవాడూ అయినట్టి పరబ్రహ్మ **బహుస్యామ్** నేను అనేకములుగా అవుతాను అని తలచి తేజస్సు నీరు భూమి మొదలుగా గల సమస్త జగత్తునూ సృష్టించి, ఆ జగత్తులో దేవాదులైన వింతవింత రూపాలతో నిండియున్న శరీరాలలో చైతన్య గుణముకల జీవవర్గాన్ని వారివారి కర్మలకు తగినట్లుగా వాటిని నిర్వహించే ఆత్మలుగా ప్రవేశపెట్టి, స్వయంగా

తాను కూడా తన యిష్టము ప్రకారముగానే జీవులకు అన్తరాత్మగా అనుప్రవేశము చేసి ఇట్లాగా తనతోపాటు కూడియున్న దేవాది ఆకారాల సముదాయానికి ఒక్కొక్క దానికి విడివిడిగా నామరూపముల విభాగాన్ని చేసినాడు. ఈ విధంగా ప్రకృతి / జీవ పరమాత్మలతో కూడిన సంఘాతము (చేరిక) నకే వస్తుత్వాన్ని ఒకానొక శబ్దముచేత వ్యవహరింపబడేట్లుగా చేసినాడని అర్థము. **అనేనజీవేన ఆత్మనా** అని వాక్యముతో "**జీవుడుగా పిలిపించుకొనబడుతున్న నాచేత**" అని నిర్దేశింపబడుతున్నందువల్ల జీవుడు బ్రహ్మాత్మకుడు అని చూపబడుతున్నది. జీవుడికి బ్రహ్మాత్మకత్వము అనేది జీవుడికి అన్తరాత్మగా బ్రహ్మ అనుప్రవేశము చేసినందువల్లనే అని అర్థమవుతున్నది. **ఇదమ్ సర్వమసృజత. యదిదంకించ. తత్ సృష్ట్వా, తదేవాను ప్రావిశత్. తదను ప్రవిశ్య సచ్చత్యచ్చఅభవత్.** ఏదైతే కనబడుతూ వినబడుతూ ఉన్నదో దానిని అంతటినీ పుట్టించినాడు. దాన్ని పుట్టించి దానిలోనే అనుప్రవేశము చేసినాడు. ఆ విధంగా దానిలో అనుప్రవేశించి సత్తు అనబడే జీవుడుగానూ త్యత్ – ఎప్పటికప్పుడూ పాతరూపాలను వదిలిపెట్టే – ప్రకృతిగాను తానే ఐనాడు. అని ఈ వాక్యములో **ఇదంసర్వమ్** అని నిర్దేశింపబడిన చేతనాచేతన వస్తువులు రెండింటినీ సత్ త్యత్ శబ్దాలచేతను విజ్ఞాన అవిజ్ఞాన శబ్దాల చేతనూ విడదీసి నిర్దేశించి చిత్ వస్తువులో కూడా అనుప్రవేశించినవాడుగా పరమాత్మను గురించి తెలుపబడింది. కావున ఇంతకుముందు ఉదాహరించిన శ్రుతివాక్యము కారణంగా పరమాత్మ వరకూ నామరూపవ్యాకరణము ప్రతిపాదింపబడినందువల్ల ఆయా వస్తువులనన్నింటినీ తెలిపే శబ్దాలన్నీ కూడా **అచిత్తు + జీవులతో కలసియున్న పరమాత్మను తెలుపుతున్నాయి** అని అర్థమవుతున్నది.

ఇంతేకాకుండా **ఐతదాత్మ్యమిదం సర్వమ్** ఈ చిద చిన్మిశ్రము ఐన ప్రపంచమంతా కూడా ఈసత్ శబ్దవాచ్యుడైన వాడినే ఆత్మనుగా కల్గియున్నది అనే వాక్యములో చేతనుడితో కలసియున్న ప్రపంచాన్ని **ఇదమ్ సర్వమ్** అని నిర్దేశించి **దానికి ఇతడే ఆత్మ** అని ప్రతిపాదింపబడింది. కాగా చేతనాచేతనములన్నింటికీ బ్రహ్మ ఆత్మగా అయ్యి ఉన్నందువల్ల సచేతనమైన ఈ జగత్తంతా ఆయనకు శరీరమవుతూ ఉన్నది. అట్లాగని ఇతర శ్రుతి వాక్యాలు కూడా తెలుపుతూ ఉన్నవి. 1) **అన్తః ప్రవిష్టః శాస్తాజనానాం సర్వాత్మా 2) యః పృథివ్యాం తిష్ఠన్ పృథివ్యా అన్తరో యంపృథివీ నవేద. యస్యపృథివీ శరీరమ్. యః పృథివీమన్తరో యమయతి. సతే ఆత్మా అన్తర్యామీ**

**అమృతః.** అని మొదలుపెట్టి **3) య ఆత్మని తిష్ఠన్ ఆత్మనోఽన్తరో యమాత్మా నవేద యస్యాత్మా శరీరమ్। యః ఆత్మాన మన్తరోయమయతి. సతేఆత్మా అన్తర్యామ్యమృతః 4) యః పృథివీమన్తరే సంచరన్ యస్య పృథివీ శరీరమ్। యోఽపోఽన్తరే సంచరన్ యస్యాఽపః శరీరమ్** అని ఆరంభించి 5) **యోఽక్షరమన్తరే సంచరన్ యస్యాక్షరమ్ శరీరమ్. యమక్షరమ్ నవేద.** ఏష సర్వభూతాన్తరాత్మా అపహత పాప్మా దివ్యోదేవ ఏకోనారాయణః ఇత్యాదులైన శ్రుతులు చేతనుడితో కూడిన జగత్తంతా ఆయనకు శరరమునుగా నిర్దేశించి చెప్పి "**దానికి ఆత్మనుగా పరమాత్మను ఉపదేశిస్తున్నది**" కావున చేతనుడిని చెప్పే శబ్దాలు చేతనుడికి కూడా ఆత్మఐన, చేతనుడిని తనకు శరీరమునుగా చేసుకున్న పరమాత్మనే తెల్పుతున్నాయి. ఎట్లాగైతే అచేతనములు ఐన దేవాది సంస్థాన పిండాలను తెలిపే శబ్దాలు ఆయా శరీరాలను కలిగియున్న జీవాత్మలకే వాచకాలు అవుతున్నాయో అట్లాగే అని తెల్సుకోవాలి. **చత్వారః పంచదశరాత్రాః... దేవత్వం గచ్ఛన్తి.** పంచదశరాత్రము అనే పేరుగల నాలుగువిధములైన కర్మలను ఆచరించినవారు దేవత్వమును పొందుచున్నారు. ఇత్యాదివాక్యాలలో వలెనే. అనగా దేవతలుగా అగుచున్నారు. దేవశరీరాన్ని పొందుచున్నారు అని అర్థము. శరీరము శరీరాన్ని కలిగినవానికి (ఆత్మకు) ప్రకారము/విశేషణము ఐ ఉంటున్నది కాబట్టి ప్రకారవాచకములైన శబ్దాలు ప్రకారి/విశేష్యము నందే ముగుస్తున్నవి. కనుక శరీరవాచకములైన శబ్దాలు శరీరిని గురించి తెలుపడము న్యాయము అవుతుంది. ప్రకారము అంటే ఇది ఇట్లా అని ఎదురుగా కనిపించే వస్తువులో ఇట్లాంటిది అని తోచే అంశము. ఎర్రని ఆవు అన్నపుడు ఆవులోని ఎరుపుదనము. ప్రకారమునకు ఆ ప్రకారి/ విశేషమును గల్గియున్న వస్తువుతో సమ్బన్ధము తప్పనిసరి కనుక ప్రకారి యందే ప్రకారానికి పర్యవసానము తగును గనుక ఆ ప్రకారాన్ని చెప్పే పదము కూడా విశేష్యమునందే పర్యవసిస్తుంది. వాచకము అవుతుంది. విశేషణ వాచకమైన శబ్దము విశేష్యమును కూడా బోధించ గల్గుతున్నది. కాబట్టే **గౌః అశ్వః మనుష్యః** మొదలైన ప్రకారములైన ఆకారాలను తెలిపే పదాలు ప్రకారి అయిన పిండము నందున్నూ వాచకాలుగా అయ్యి ఉంటున్నందున, పిండము (శరీరము – ప్రకృతి) చేతనుడికి శరీరము అవుతున్నది కాబట్టి చేతనునికి విశేషణముగా గుర్తింపబడుతున్నది. ఆ విధంగా పిండాన్ని శరీరంగా కల్గిన చేతనుడు కూడా పరమాత్మకు ప్రకారము/ విశేషణము ఐనందువల్ల పరమాత్మయందే వాచకాలుగా ముగుస్తున్నవి. లేక పరిణమించుతున్నవి. కనుక శబ్దాల కన్నింటికిన్నీ పరమాత్మనే వాచ్యుడు అవుతున్నాడు.

కాబట్టి పరమాత్మను చెప్పే పదముతో సామానాధికరణ్యము ముఖ్యార్థ ప్రతిపాదకమే. సూక్ష్మము ఏమిటంటే తత్ త్వమ్ శబ్దాలు రెండింటి చేతనున్నూ పరమాత్మనే ముఖ్యార్థముగా చెప్పబడుతున్నాడని అర్థము.

ఏమండీ **ఖండోగౌః ఖండః శుక్లః** విరిగిన కొమ్ములు గల యావు ఖండమైనది. తెల్లనిది అని జాతి, గుణాలను తెలిపే పదాలు మాత్రమే ద్రవ్యమును/వస్తువును తెలిపే పదాలతోనే సమానాధికరణ్యమును కల్గియున్నట్టివిగా వ్యవహారంలో కనబడుతున్నాయి. ఒక ద్రవ్యానికి మరొకద్రవ్యము ప్రకారము/విశేషణము ఐనపుడు మాత్రము మత్వర్థీయ ప్రత్యయము కనపడుతున్నది. "**దండీ కుండలీ**" అని అన్నట్లు. అని అంటున్నారా! అది సరికాదు. అది జాతి కావచ్చు గుణము కావచ్చు ద్రవ్యము కావచ్చు. వీటిలో ఏదో ఒకటే సామానాధికరణ్యానికి సూచకము కాదు. అట్లాంటపుడు వాటిలో ఒకదాని కొకటి వ్యభిచరితములు అవుతవి. అనగా వాటియందే కాక సామానాధికరణ్యము ఇతరములయందు కూడా వర్తించుతుంది అని. ఒక పదార్థము ఏదో ఒక మరో పదార్థానికి విశేషణము అయితేనే తప్ప తనకు ఉనికి లేనిది అవుతుందో అటువంటిది తనకు ఆశ్రయమైన విశేష్యాన్ని/పదార్థాన్ని వదిలిపెట్టకుండా ఉంటూ తాను వెల్లడి అవుతూ ఉంటుందో అలాంటి దాన్ని వివరించే/వాచకాలు ఐన శబ్దాలు స్వాభిదేయ విశిష్టద్రవ్యవాచకాలు (తమచేత చెప్పబడే వస్తువులతో – జాతి రంగు మొదలైనవి – కూడిన ద్రవ్యాలను చెపుతాయి) కనుక ధర్మాన్తర విశిష్టద్రవ్యవాచి (మరొక ధర్మముతో కూడియున్న ద్రవ్యాన్ని తెలిపే వాచకమైన) శబ్దముతో సామానాధికరణ్యాన్ని కలిగియుండడము ఒప్పేకాని తప్పుకాదు. ఇక ఎక్కడైతే పృథక్ సిద్ధమై తాత్కాలికంగా ఒక వస్తువులో ఉండి ఒకానొకప్పుడు ఒకానొకచోట మరొకద్రవ్యానికి ప్రకారము/విశేషణము అయ్యి ఉండేటట్లయితే మాత్రము అప్పుడు మత్వర్థీయ ప్రత్యయము ప్రయోగింపవలసియుంటుంది. అనగా అపృథక్ సిద్ధవిశేషణము ఐనప్పుడు మత్వర్థీయ ప్రత్యయముతో కూడిన పదప్రయోగము అనవసరము. ఉదా: నల్లకలువ వంటివి. దండ కుండలాదులు విశేష్యమును విడిచి ఉండలేనివి కానందువల్ల, పృథక్ సిద్ధవిశేషణాలు ఐనందువల్ల వాటికి మాత్రము దండీ కుండలీ అన్నట్లు మత్వర్థీయ ప్రత్యయప్రయోగము తప్పనిసరి. అట్లే జాతి గుణాదులు ఒకే వస్తువునందు అవిరోధంగా ఉంటున్నందువల్ల వాటిని చెప్పే పదాలు విశేష్యవాచకపదముతో సామానాధికరణ్యాన్ని కల్గిఉండడంలో అతివ్యాప్తి/వ్యభిచారదోషముండదు.

అందువల్ల ముందు చెప్పిన ప్రకారంగా పరమాత్మకు శరీరం ఐనందువల్ల ఆయనకు ప్రకారము/విశేషణమవుతున్నాడు కాబట్టి అచిత్తులో కలిసియున్న జీవుడికి జీవుడు అని చెప్పే విశేషయుక్తాలు ఐన అహమ్ **నేను** త్వమ్ **నీవు** వంటి శబ్దాలున్నూ పరమాత్మనే చెపుతాయి. కనుక **తత్త్వమసి** అని సామానాధికరణ్యముతో ప్రసంగము ముగించబడింది. ఇట్లా ఐనందువల్లనే పరమాత్మతో జీవుడు శరీరముగా అన్వయించుతున్నందువల్ల/సమ్బన్ధమును కల్గియున్నందువల్ల జీవుడిలోని ధర్మాలు పరమాత్మకు అంటవు. ఎట్లాగంటే జీవునికి శరీరములో ఉండే బాల్యము, యవ్వనము వంటి ధర్మాలు ఏవిధంగా అంటవో అట్లాగే పరమాత్మకు జీవుడిలోని ధర్మాలు స్పృశించవు. కనుక తత్త్వమసి వాక్యములోని సామానాధికరణ్యము నందున్న తత్ అనే పదము జగత్ కారణభూతుడు సత్యసంకల్పుడు సర్వకళ్యాణగుణాకరుడు నిరస్త హేయగంధుడు ఐన పరమాత్మను తెల్పుతుంది. త్వమ్ అనే పదము కూడా సశరీరజీవ శరీరకుడైనఆపరమాత్మనేతెలుపుతుంది.కావునసామానాధికరణ్యముముఖ్యవృత్తము అనగా ముఖ్యార్థాన్నే బోధిస్తున్నది. కనుకనే ప్రకరణముతో విరోధములేదు. అన్ని శ్రుతులతోనూ వైరుధ్యమూలేదు. నిరవద్యుడు కళ్యాణగుణైకతానుడూ ఐన బ్రహ్మకు అవిద్యాదిదోషపు వాసన కూడా లేదు. ఇన్ని కారణాల వలన పరమాత్మకు జీవునితో చెప్పబడిన సామానాధికరణ్యము కూడా తనకు విశేషణము ఐన జీవుడికంటే వేరయినవాడు ఇతరుడు అని భేదాన్నే ప్రతిపాదించుతున్నది కాబట్టీ విజ్ఞానమయుడైన జీవుడికంటే అన్యుడు మరొకడు ఆనందమయుడు పరమాత్మ.

**తస్యైష ఏవ శారీరఆత్మా** అనే వాక్యము ద్వారా ఆనందమయుడికి శరీరముతో సమ్బన్ధము ఉన్నదని తెలుస్తున్నందున, భగవన్తుడికి శరీరము లేదని తేటపడ్తున్నందున జీవుడి కంటే ఆనందమయుడు వేరుకాదని భావిస్తున్నాము అని మీరు ఏ మాటైతే చెప్పినారో అది తగినది కాదు. ఈ ప్రకరణము అంతటిలోనూ ప్రతిచోట కూడా **తస్యైష ఏవ శారీర ఆత్మా. యః పూర్వస్య.** ఇంతకుమునుపు చెప్పినవాడికి ఎవడు శారీరుడు ఐన ఆత్మ ఎవడో వాడే ఇతనికి కూడా ఆత్మ అని పరమాత్మకే శారీరత్వము, మరియు ఆత్మత్వమున్నూ చెప్పబడినాయి. ఎలాగా అంటావా! ఇదిగో వివరించుతాను విను. **తస్మాద్వా ఏత స్మాదాత్మన ఆకాశస్సమ్భూతః** ఆ విధంగా సృష్టికి కారణభూతుడైన ఈ ఆత్మనుండే ఆకాశము పుట్టింది అని ఆకాశము మొదలైన సృజ్యవర్గానికి పరమకారణుడుగా, లోకప్రసిద్ధి గాంచిన జీవుడికంటే మరొక్కడైన పరబ్రహ్మనే

ఆత్మగా ఎత్తి చూపుతున్నందున ఆయనకంటే వేరయిన ఆకాశాదులు మొదలుకొని అన్నమయుని వరకూ ఉన్న వారందరూ ఆ పరమాత్మకే శరీరములుగా అవుతున్నారని తెలుస్తున్నది. **1) యస్యపృథివీ శరీరమ్ 2) యస్యాపశ్శరీరమ్ 3) యస్యతేజః శరీరమ్ 4) యస్యవాయుః శరీరమ్ 5) యస్య ఆకాశః శరీరమ్ 6) యస్య అక్షరమ్ శరీరమ్ 7) యస్యమృత్యుః శరీరమ్ ఏష సర్వభూతాన్తరాత్మా అపహతపాప్మాదివ్యోదేవ ఏకోనారాయణః** అని చెపుతున్న సుబాలోపనిషత్తు ద్వారా సర్వతత్త్వాలూ పరమాత్మకు శరీరాలు అని తేటతెల్లమవుతున్నది. ఇందువలన **తస్మాద్వా ఏతస్మాదాత్మనః** అనుచోట కూడా అన్నమయుడిని గురించి ఇట్లాగా చెప్పబడింది. **తస్యైషఏవ శారీర ఆత్మా. యః పూర్వస్య** అని. ఇంతకుమునుపు చెప్పబడిన అన్నమయుడికి ఎవడు శారీరుడు ఆత్మ అని ఇతర శ్రుతి వాక్యాలచేత చెప్పబడినాడో పరమకారణమైన వాడు పరమాత్మ ఆయనయే ఈ ప్రాణమయుడికిన్నీ శారీరుడు ఆత్మ అని అర్థము. ఇదే విధంగా మనోమయ విజ్ఞానమయులను గురించిన్నీ అర్థం చేసుకోవాలి. ఆనందమయుడి విషయంలోనైతే **ఏష ఏవ** అని నిర్దేశించడము అతనికి మరొకడు ఆత్మగా లేడు. తనకు తానే ఆత్మ అని చెప్పడంకొరకు మాత్రమే సుమా! అది కూడా ఏవిధంగా నంటావా? ఇదిగో! ఇట్లాగా! విజ్ఞానమయుడికి కూడా ముందు చెప్పిన నీతి ప్రకారమే పరమాత్మయే శారీరుడు ఆత్మ అని తెలిసింది. ఇట్లాగా ఐనప్పుడు విజ్ఞానమయుడికి ఎవడు శారీరుడు ఆత్మగాఐ ఉన్నాడో అతడే ఆనందమయుడికి కూడా శారీరుడు ఆత్మ అని చెప్పితే ఒక్కొక్క దానికి వందరెట్లు అధికము అని చెప్పుకొంటూ వచ్చినందువల్ల ఆనందమయుడు పరమాత్మ అని తెలియవచ్చినవాడికి పరమాత్మకు తానే ఆత్మ అని అవగాహన కల్గుతున్నది. ఇందువల్ల తనకంటే వేరుగా ఉన్న చేతనాచేతన వస్తు సముదాయమంతా పరమాత్మకు శరీరమవుతున్నందువల్ల ఆయనయే ఎటువంటి కారణసమ్బన్ధము లేని నిరుపాధికుడైన శారీరుడు ఆత్మ. ఆ కారణంగానే ఈ పరంబ్రహ్మను గురించి తెలియజేయడానికి ప్రారంభింపబడిన శాస్త్రాన్ని కూడా బాగా తెల్సిన పెద్దలు **శారీరకం శాస్త్రమ్** శారీరకమీమాంసా అని పల్కుతున్నారు. కనుక విజ్ఞానమయుడైన జీవుడికంటే పూర్తిగా వేరయిన లక్షణాలు గల పరమాత్మయే ఆనందమయుడు.

దీనిపై పూర్వపక్షి మళ్ళీ ఇట్లాగా సందేహిస్తున్నాడు. ఈ ఆనందమయుడు జీవుడి కంటే వేరొకడు కాడు. వికారార్థాన్ని తెలిపే మయట్ పత్యయము వినిపిస్తున్నది కాబట్టి. పాణిని **మయడ్వైతయోః** అని అధికరించి **నిత్యం వృద్ధ శరాదిభ్యః** అనే

సూత్రం ద్వారా మయట్ ప్రత్యయాన్ని విధించినాడు. ఏతయోః అని చెప్పినదానికి ఇది తాత్పర్యము 1) **తస్యవికారః** 2) **అవయవేచప్రాణిఓషధి వృక్షేభ్యః** అని ప్రకృతములైన వికారావయవాలకు మయట్ ప్రత్యయము వస్తుంది. ఆనంద శబ్దము **వృద్ధి ర్యస్యాచామాదిః తద్వృద్ధమ్** అని వృద్ధ సంజ్ఞ వస్తున్నది. దానిపైన వికారార్థములో మయట్ ప్రత్యయము వచ్చి ఆనందమయః అని రూపము ఏర్పడుతున్నది. వికారము, జీవుడికే గాని పరమాత్మకు లేదు. కావున జీవుడే ఆనందవికారుడు ఆనందమయుడు. ఇంకా ఒక శంక ప్రాచుర్యార్థములో కూడా మయట్ ప్రత్యయము విధింపబడుతున్నది. దానికి **తత్ ప్రకృతవచనేమయట్** అనేది ఆధారము. ఉదాహరణకు **అన్నమయోయజ్ఞః** అన్నదానము ప్రధానముగా గలది యజ్ఞము. అని ప్రయోగము కనిపిస్తున్నది కనుక ఆ ప్రాచుర్యార్థములో వచ్చిన మయట్ ప్రత్యయముతో కూడి ఆనందము ప్రచురముగా / అధికముగా కలవాడు అనే అర్థము ఏర్పడినపుడు జీవుడు అనే అర్థముతోస్తుంది కదా! అని అంటారేమో! కానీ అట్లా అనడం సరికాదు. ఎందుకంటే? ఈ ఉపనిషత్తు యొక్క ఉపక్రమంలో / ఆరంభములో వికారార్థమే కనుపడుతున్నది. అంతేకాకుండా ఆ అర్థాన్ని తీసుకోవడమే ఉచితంగా ఉంటుంది కాబట్టి వికారార్థాన్నే చెప్పుకోవడం మంచిది. ఇంకా నీవన్నట్లు ప్రాచుర్యార్థాన్నే గ్రహించినా జీవుడి కంటే వేరైనవాడు ఆనందమయుడు అనడం కుదరదు. అదెట్లాగా అని అంటావూ! ఆనందప్రచురుడు అని అన్నప్పుడు ఆనందము ఎక్కువగా ఉన్నది. దుఃఖము దానితో మిళితమై యున్నది అనేది కూడా తప్పకుండా తెలియవస్తుంది. దుఃఖము ఆనందము దృష్ట్యా అల్పంగా ఉన్నది అవగతమవుతుంది. అట్లాగా ఆనందమొక్కటే గాకుండా దుఃఖముతో మిశ్రితమైయుండడమే కదా జీవత్వము? అందువలన ఔచిత్యము ద్వారా తెలియవచ్చిన వికారార్థమే స్వీకరించుటకు తగినది. ఇంతేకాకుండా లోకంలో మృణ్మయమ్ హిరణ్మయం దారుమయం అని అన్నప్పుడు. వేదంలోనూ **పర్ణమయీ జుహూః శమీమయ్యః స్రుచః దర్భమయీ రశనా** జుహూః అనబడే స్రువము మోదుగు ఆకులతో కూడినది. స్రుక్కులు జమ్మి కర్రలతో నిర్మించబడినట్టివి. దర్భలతో నిర్మించబడినట్టిది మొలత్రాడు అనేచోట్లలోనూ వికారార్థములోనే మయట్ ప్రత్యయప్రయోగము బహుళముగా కనపడుతున్నది. కనుక అటువంటి మయట్ ప్రత్యయప్రయోగాలలో ఎన్ని అర్థాలు ఉన్నా వికారార్థమే మొట్టమొదటగా బుద్ధికి తోస్తుంది. జీవుడికి కూడా ఆనంద వికారత్వము ఉన్నది. అతడు సహజంగా ఆనంద స్వరూపుడే అయితే సంసారిగా ఉన్న దశలో మాత్రము ఆనందవికారియే. కాబట్టి వికార్థాన్ని తెలిపే

మయట్ ప్రత్యయము వినిపించుతున్నందువలన ఆనందమయుడు జీవుడికంటే వేరైనవాడు కాడు అని. ఈ వాదాన్నంతా మనస్సులో నుంచుకొని సూత్రకారుడిట్లాగా సమాధానం చెప్తున్నాడు.

**సూత్రమ్: వికారశబ్దాత్ నఇతిచేత్‌న ప్రాచుర్యాత్ 1-1-14** నీవు చెప్పినమాట తగినది కాదు. ఎందువల్లనంటే మయట్ ప్రత్యయానికి ప్రాచుర్యము అనే అర్థాన్నే గ్రహించాలి కనుక. పరబ్రహ్మయందు ఆనందమే ప్రచురంగా ఉన్నది. ప్రాచుర్యార్థము లోనూ మయట్ ప్రత్యయానికి ప్రయోగము తరచుగా కనిపించుతున్నది. ఇదీ ఇక్కడ చెప్పబడుతున్న విషయము వరుసగా వందరెట్ల చొప్పున హెచ్చుచేసి చెప్పబడుతున్న ఆనందము జీవుడిని ఆశ్రయించి ఉండడమనేది బొత్తిగా కుదిరేది కాదు గనుక బ్రహ్మను ఆశ్రయించి ఉండేది ఇది అని నిశ్చయానికి వస్తే ఆ పరబ్రహ్మలో వికారము కలుగనే కలుగదు గనుక ప్రాచుర్యార్థములోను మయట్ ప్రత్యయము ప్రయోగింపబడుతున్నందువల్ల ఆనందమయుడు పరబ్రహ్మ అని.

ప్రకరణ ఔచిత్యాన్ని బట్టి ప్రయోగప్రౌఢిమ చేతనున్నూ మయట్‌నకు వికారార్థమును గ్రహించడము వికారార్థత్వము అర్థవిరోధాన్ని తెచ్చిపెడుతున్నందున జీవుడు ఆనందమయుడు అనడము పొసగదు.

ఇంకా ఔచిత్యమనేది ప్రాణమయః అన్నచోటనే విడిచి పెట్టబడింది అక్కడ వికారార్థత్వము సంభవించదు కాబట్టి ప్రాణ వికారము అని అర్థము చెప్పడము అన్నమయః - అన్నవికారము/పరిణామము ఐనవాడు జీవుడు అన్నట్లు ప్రాణమయుడు/ప్రాణవికారుడు అని అనడం కుదరదు. ప్రాణమునకు వికారము లేదుకదా! అన్నము రక్తమాంసాదులుగా పరిణామాన్ని చెందుతున్నది కానీ ప్రాణము మరో పరిణామాన్ని పొందడం లేదుకదా! అందువల్ల ప్రాణమయః అన్నచోట ఐదు విధాలుగా - ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన - ఉన్న వాయువు ప్రాణవృత్తి మత్వము చేత ప్రాణమయత్వాన్ని పొందుతున్నది. లేక ప్రాణాపానాది ఐదు వృత్తులయందు ప్రాణవృత్తిగా నుండుటలో ప్రాచుర్యార్థము చేతగానీ కావచ్చును. అయితే ప్రాచుర్యార్థంలో మయట్ ప్రత్యయానికి ప్రయోగప్రౌఢి లేదు అని అనకూడదు. అన్నమయో యజ్ఞః. శకటమయీ యాత్రా ఇత్యాదులలో కనిపిస్తూనే ఉన్నది కదా! **యజ్ఞము అన్నదానమును అధికంగా కల్గినట్టిది. యాత్రలో బండ్లు కాలిబాటన నడిచే వారికంటే ఎక్కువగా ఉన్నవి.** అని అర్థము.

ఆనంద ప్రాచుర్యము – అధికంగా ఉండుట అనేది అల్పదుఃఖము యొక్క అస్తిత్వాన్ని/ఉనికిని తెల్పుతున్నది అని ఏమాటనైతే అన్నారో అది తప్పు. దానియొక్క ప్రచురత్వము అనగా అది ప్రభూతముగా ప్రబలంగా ఉండడమని అర్థము. అంతేకాని దానికి వ్యతిరేకమైన దానియొక్క ఉనికిని తెలుపదు. కానీ ఏదైతే ప్రచురంగా ఉన్నదని చెప్పబడుతున్నదో అది అల్పమైనది కాదు అని దానియొక్క ప్రాబల్యాన్ని ఆధిక్యతను ప్రధానంగా చెపుతుంది. ఆనందమయుడు అన్నప్పుడు ఆనందము అనేది అల్పంగా లేదు. చాలా ప్రబలంగా ఉన్నది అని దానియొక్క అల్పత్వాన్ని త్రోసి రాజంటున్నది. ప్రభూతంగా ఉన్న దీనికంటే వేరయినవి ఉన్నవా? లేవా! ఎంతఎంత మోతాదులో ఉన్నవి అనే విషయాలు మరో ప్రమాణము ద్వారా తెల్సుకోవాల్సి యుంటవి. ప్రస్తుత విషయములోనైతే మాత్రము **అపహత పాప్మా** ఇత్యాదిశ్రుతి వాక్యము ద్వారా ఆ దుఃఖము యొక్క ఉనికే పరమాత్మలో లేదని స్పష్టంగా ఎరుకపడ్తున్నది.

ఆనందమయుడు అన్నచోట దీన్ని గురించే చెప్పాల్సి ఉంటుంది. బ్రహ్మానందము ప్రభూతము/ప్రబలముగా ఉన్నది. అన్యానందము/జీవానందము అల్పత్వాన్ని మాత్రమే కోరుతున్నది అని. అదే విషయము చెప్పబడుతున్నది కూడా. **సఏకోమానుష ఆనందః** ఇత్యాదుల ద్వారా జీవానందము కంటే బ్రహ్మానందము సాటిలేని నిరతిశయమైన దశకు చెందినట్టిది. ప్రభూతమైనదీ అని.

జీవుడికి ఆనంద వికారత్వము సంభవిస్తుంది అని ఏ మాటనైతే మీనోట పలికినారో అది కూడా పొసగని మాటే సుమా! జ్ఞానానందస్వరూపుడైన జీవుడు మట్టికుండగా మారినట్లు ఏదో ఒక రూపముతో మార్పును పొందదాన్ని సకల శ్రుతులు స్మృతులు న్యాయాలు గట్టిగా విరోధించుతున్నాయి. సంసారదశలో ఉన్నప్పుడు మాత్రమే అతడు చేసిన కర్మను బట్టి జ్ఞానానందాలు కుంచించుకునిపోతాయి అని ముందు ముందు ఉపపాదిస్తాము. ఇందువల్లకూడా జీవుడి కంటే వేరయినవాడు పరంబ్రహ్మనే ఆనందమయుడు. ఇదిగో ఈ చూపబోయే కారణంతోనూ జీవుడికంటే వేరైనవాడు ఆనందమయుడు పరంబ్రహ్మనే!

**సూ॥తద్ధేతువ్యపదేశాచ్చ 1–1–15** ఆనందముకలుగదానికికారణమైనవాడుగా చెప్పినందువల్ల.

**కోహ్యేవాన్యాత్ కః ప్రాణ్యాత్. యదేష ఆకాశ ఆనందోనస్యాత్. ఏషహ్యేవా నందయాతి** ఈయనకంటే వేరయినవాడెవడు ఈ ప్రపంచాన్ని జీవింపచేస్తున్నాడు. ఈ ఆకాశ శబ్దవాచ్యుడైనవాడు లేనట్లయితే. ఈయన మాత్రమే ఆనందస్వరూపుడు. ఇతడే ఈ ప్రపంచాన్ని ఆనందింపచేస్తున్నాడు గదా! అని తైత్తిరీయోపనిషద్వాక్యం ఈయన మాత్రమే జీవులను ఆనందింపజేస్తున్నాడు. కనుక జీవులకు ఆనందము కలుగడానికి కారణమైనవాడు ఈ ఆనందస్వరూపుడు ఆకాశశబ్దవాచ్యుడు అని చెప్పబడుతున్నది. ఇందువల్ల కూడా ఆనందింపజేయబడే జీవుడికంటే ఆనందింప చేసే ఇతడు ఆనందమయుడు పరమాత్మ అని తెలుస్తున్నది. వాక్యములో ఉన్న ఆనంద శబ్దముచేత చెప్పబడేవాడు ఆనందమయుడేననే విషయము దీని వెంటనే చెప్పబడుతుంది. ఇందువల్ల కూడా ఆనందమయుడు జీవుడి కంటే అన్యుడే.

**సూ॥ మాన్త్రవర్ణికమేవచ గీయతే 1-1-16** మన్త్రవర్ణము కూడా తేటగా చెప్పుతున్నది.

**సత్యం జ్ఞాన మనన్తం బ్రహ్మ** అని మన్త్రాక్షరాలలో చెప్పబడిన బ్రహ్మనే ఆనందమయుడని గానము చేయబడుచున్నది. **కైగై శబ్దే** అని ధాతువు. దానిమీది లట్ ప్రథమై కవచనము **గీయతే** అనబడే పదము. అనగా శాబ్దమైన అర్థము. అది జీవుని కంటే వేరయిన పరంబ్రహ్మనే. అదెట్లా అంటే? **బ్రహ్మ విదాప్నోతిపరమ్** బ్రహ్మను గురించి తెల్సుకొని ఉపాసించినవాడు పరము అనబడే ముక్తి స్థానాన్ని పరమ నిశ్శ్రేయసాన్ని పొందును. అని జీవునికి చేరుకోవలసిన ప్రాప్యముగా బ్రహ్మ నిర్దేశించబడినాడు. **తదేషాఽభ్యుక్తా** ఆప్రాప్యము ఇట్లాగా వివరింపబడింది అని. తత్ = ఆ బ్రహ్మ, అభి = అభిముఖముగా చేసుకొని, ప్రతిపాద్యముగా చేపట్టి ఈరుక్ అధ్యేతలైన పెద్దలచేత చెప్పబడింది. బ్రాహ్మణము అనుదానితో చెప్పబడిన అర్థానికి వివరణము ఈ మన్త్రముతో చేయబడుతున్నది అని అర్థము. అపూర్వమైన ఒక అర్థాన్ని తెలిపే వేదవాక్యానికి బ్రాహ్మణము అని పేరు. మన్త్రమేమో ఇంతకు మునుపు తెలిసిన అర్థాన్ని స్మరింపచేస్తుంది. ఇది ఈ రెండింటికీ ఉన్నటువంటి భేదము. ఉపాసకుడైన జీవుడికి ప్రాప్యమైన బ్రహ్మ ఆ జీవుడి కంటే విలక్షణుడే అయ్యి తీరుతాడు. ఆ వాక్యము తరువాత **తస్మాద్వా ఏతస్మా దాత్మన ఆకాశః సమ్భూతః** అని మొదలుపెట్టి ఉత్తరోత్తర బ్రాహ్మణములచేత మన్త్రముల చేతనున్నూ ఆ పరమాత్మ స్వరూపమే విశదీకరింపబడుతుంది. ఇందువల్ల జీవుడికంటే వేరయినవాడు/అన్యుడు ఆనందమయుడు.

ఇక్కడ పూర్వపక్షి శంకించుతున్నాడు. ఉపాసకుడి కంటే ఉపాస్యుడు భేదాన్ని కలవాడే అయ్యి ఉండాలి. అట్లా ఐనప్పటికీ మాన్త్రవర్ణికుడైన బ్రహ్మ జీవుడి కంటే వేరయిన వస్తువుకాడు. ఐతే ఆ ఉపాసకుడైన జీవుడికి ఉపాసన ఫలితంగా అన్ని రకాలైన అవిద్యలయొక్క వాసన కూడా లేకుండా పోయి నిర్విశేష చిన్మాత్రై కరసమైన శుద్ధమైన స్వరూపము లభించడము మాత్రమే సుమా! దాన్నే **సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ** అనే మన్త్రముతో శోధించడం జరుగుతున్నది.

అవిద్యా స్వరూపాలు నాలుగు రకాలుగా ఉంటున్నవి. **1) కారణావిద్య 2) ఆచ్ఛాదికా అవిద్య 3) కార్యా అవిద్యా 4) విక్షేపికా అవిద్యా** అని. ఆశోధించబడే బ్రహ్మ స్వరూపమే **యతో వాచోనివర్తనే. అప్రాప్య మనసాసహ** ఏ ఆనంద స్వరూపుడైన పరమాత్మను తెలుపడానికి పూనుకున్న వేదవాక్కులు తమ లక్ష్యాన్ని చేరుకోలేక మనస్సుతో కలసి వెనుకకు మళ్ళినవి. అని వాక్కులకు మనస్సుకున్నూ తెలియరాని వాడవడం చేత ఆ స్వరూపము నిర్విశేషమని తెలుస్తున్నది. అందువల్ల ఆ నిర్విశేష చిన్మాత్ర శుద్ధ బుద్ధ స్వరూపమే మన్త్రాక్షరాలలో చెప్పబడింది. కనుక జీవుడికి ఉపాసన ఫలితంగా లభించే స్వరూపమే జీవుడి కంటే వేరయినది కాదు కనుక ఆనందమయుడు జీవుడే అని.

**సూ॥ నేతరోऽనుపపత్తేః 1-1-17** బ్రహ్మకంటె వేరయినవాడు కాదు పొసగనందువలన.

పరమాత్మకన్నా వేరయిన వాడు, ముక్తావస్థలోనున్నట్టి వాడు, జీవశబ్దము చేత వ్యవహరింపదగినవాడు మాన్త్ర వర్ణికుడు కాడు. ఎందువల్లనంటే పొసగదు కాబట్టి. అట్లాగా కర్మరహితుడై ముక్తావస్థలోనున్న ఆత్మకు నిరుపాధికమైన ఎలాంటి కర్మ సమ్బన్ధమూ లేని విశేషములైన ఇంద్రియాలతో అక్కరలేని విపశ్చిత్త్వము పొసగదు కాబట్టి. ఈ నిరుపాధికమైన విపశ్చిత్త్వమే **సోऽకామయత బహు స్యామ్ ప్రజాయేయ** అని సత్యసంకల్పత్వాన్ని ప్రదర్శించడం ద్వారా వివరింపబడనున్నది. విపశ్చిత్త్వము అంటే వివిధం పశ్యత్ చిత్త్వం విపశ్చిత్త్వము అని. అనగా పలురకాలైన వస్తువులయొక్క ఆన్తర బాహ్య (లోపలి వెలుపలి) సంకల్పాలను చేష్టలను మనస్సంకల్పము ద్వారానే తెల్సుకోగల్గడము అని అర్థము. పృషోదరాదులు అని కొన్ని శబ్దాలు గణముగా పఠింపబడినాయి. పృషోదరాదీనియధో **పదిష్టమ్** అని పాణిని చెప్పినట్లు సాధు

శబ్దమే. ఇదే తీరుగా మరి కొందరు పెద్దలు కూడా నిర్వాహము చేసి చూపినారు. పృషతః ఉదరమివ ఉదరము అని పృషోదరము యొక్క నిర్వచనము పృష + ఉదరము అని ఏర్పడగా గుణసంధి వచ్చి పృషోదర శబ్దము సిద్ధము అయ్యింది. ఇక్కడ తకారానికి ఎట్లాగా లోపము వచ్చిందో అదే విధంగా పశ్యన్తీ చిత్ అనుచోటకూడా పశ్యత్‌లోని యకారానికిన్నీ లోపము వచ్చి విపశ్చిత్ పుట్టింపబడింది. పృషోదరాది గణముల చేరింది కనుక సాధు శబ్ద రూపమే అవుతుంది. కనుక దానికి చెప్పిన వ్యుత్పత్త్యర్థమున్నూ సరియైనదే. ఒకవేళ ముక్తుడికి విపశ్చిత్త్వము సంభవించినా ఆ ఆత్మకే ఇంతకుమునుపు సంసార దశలో ఉన్నప్పుడు అవి పశ్చిత్త్వము (ఏమీ బొత్తిగా తెలియకపోవడము) అనేది ఉన్నది కాబట్టి నిరుపాధికమైన (ఏ కారణమూ లేని) విపశ్చిత్త్వము ఉండడము కుదురదు. నిర్విశేషమైన చిన్మాత్రతను (జ్ఞాతృత్వాదులు లేని) పొందిన ముక్తుడికి వివిధాలైన వస్తువులను దర్శించగల శక్తి లేదు కాబట్టి ముక్తుడైన జీవుడికి బొత్తిగా విపశ్చిత్వము కుదురనే కుదురదు. ఇంకా లోతుగా విచారణ చేసినప్పుడు ఎన్నిరకాలుఐన ప్రమాణాలను అంగీకరించినా కూడా ఏ ప్రమాణము కూడా ఎటువంటి విశేషాన్ని లేనిది ఐన వస్తువును ప్రతిపాదించజాలదు అని మేము ఇంతకుమునుపే కండ్లకు కట్టినట్లు వివరించియున్నాము. **య తోవాచోనివర్తన్తే** అనే శ్రుతి వాక్యము కూడా వాఙ్మనస్సులకు అందరానివాడు బ్రహ్మ అని చెప్పినా అంతమాత్రాన ఆ వస్తువు విశేషము ఒక్కటి కూడా లేనిది అని చెప్పలేదు. చెప్పజాలదు. అయితే వాఙ్మనస్సులు రెండున్నూ బ్రహ్మను గురించి తెలుపడంలో ప్రమాణాలు కాలేవు అని మాత్రమే చెపుతుంది. అట్లాగా బ్రహ్మ ప్రమాణము లేనిదే అయితే అది తుచ్ఛమే అవుతుంది. గగన కుసుమం వలె.

**బ్రహ్మ విదాప్నోతిపరమ్** అని మొదలుపెట్టి బ్రహ్మకు విపశ్చిత్త్వము, జగత్‌కారణత్వము జ్ఞానానందాలకు ఒకే ఒక్క నెలవుగా అయ్యి ఉండడము, తనకన్నా వేరయినవారందర్నీ ఆనందింపజేయడము తనదైన సంకల్పము/కోరిక చేత మాత్రమే చిదచిత్తులతో కలిసియున్న ప్రపంచము మొత్తాన్ని పుట్టించడము, సృజ్యవర్గములో జీవుడి ద్వారా అనుప్రవేశమును చేసే వాటికి ఆత్మ అయి ఉండడము, తనను గురించి తెల్సుకున్న ఉపాసించినవారికి అభయహేతువు కావడము, అలా కానివారికి భయము కలుగడానికి కారణమైయుండడము, వాయువు సూర్యుడు మొదలైన మహాశక్తి మన్తులనున్నూ శాసించి అదుపులో పెట్టుకోవడము, ఒకదానికంటే ఒకటి

వందరెట్లుగా హెచ్చవేయబడినప్పటికీ నిరతి శయమైన ఆనందాన్ని కలిగిఉండడము ఇవే కాకుండా ఇతరములైన అనేకవిశేషాలను ప్రతిపాదించి వాక్ మనస్సులు బ్రహ్మను గురించి తెలుపజాలవు అని వాటికి ప్రవృత్తి లేనందువల్ల బ్రహ్మ నిష్ప్రమాణకుడు/ ప్రమాణములేనివాడు అని గొంతెత్తి చెప్పేటట్లయితే ఆ మాట మతిభ్రమించినవాడు పల్కినమాటే అవుతుంది తప్ప ఆదరణీయము కాబోదు.

**యతో వాచో నివర్తన్తే** అని యత్ శబ్దము చేత నిర్దేశించబడిన అర్థము **ఆనందమ్ బ్రహ్మణో విద్వాన్** అని ఆనంద శబ్దముతో ప్రతి నిర్దేశమును చేసి దానికి బ్రహ్మ సమ్బన్ధము కలదని చెపుతూ బ్రహ్మణః బ్రహ్మయొక్క అని వ్యతిరేకనిర్దేశముతో ప్రతిపాదించి, అదేవాక్ మనసా గోచరమైన దానిని గురించి విద్వాన్ అని బ్రహ్మను గురించిన వేదనమును/జ్ఞానాన్ని చెపుతున్న వాక్యము జరద్గవాదివాక్యమును వలె అర్థము లేనిదీ వాక్కునకు అనన్తర్గతమున్నూ అవుతుంది.

**శ్లో॥ జరద్గవః కంబళపాదుకాభ్యాం ద్వారిస్థితోగాయతిమద్రకాణి**
**తంబ్రాహ్మణీ పృచ్ఛతి పుత్ర కామారాజన్ రుమాయాం లశునస్యకోఽర్ఘః**

తా॥ ముసలిఎద్దును వెంటబెట్టుకొని చెప్పులు తొడుక్కొని భుజాలపైన గొంగడి కప్పుకొనియున్న ఒక బిచ్చగాడు వాకిటిలో నిలబడి మద్రకములు అనబడే పాటలు పాడుతున్నాడు. ఆ యింటి యజమానురాలైన బ్రాహ్మణ స్త్రీ ఓ రాజా! ఎడారి భూముల్లో ఎల్లిగడ్డల ధర ఎంత అని అడుగుతున్నది.

ఇక్కడ విషయమంతా అవకతవకలమయమై అర్థమూ పర్థమూ లేనిదిగా ఒకదానితో ఒకటి పొసగకుండా ఉన్నది. ఇటువంటి వాక్యాలను జరద్గవాది వాక్యాలు అని అంటారు. కనుక పూర్వపక్షివాదమంతా సముద్రఘోష వలె ఏమీ తెలియకుండా పోతున్నది. అర్థమున్నదో! లేదో! కనీసము అది ఒకమాట అని ఎంచడానికి అవకాశము లేకుండా పోతున్నది.

అందువల్ల వందరెట్ల చొప్పున ఒకదాని కంటే మరొకదాన్ని పెంచుకుంటూ పోయి బ్రహ్మానందము యొక్క అతిశయము ఇంతటిది అని చెప్పటానికి పూనుకొని దానికి ఇంత అని ఒక పరిమాణము లేకపోయినందువల్ల వాక్ మనస్సులు చెప్పలేక వెనుకకు మళ్లీ పోయినవి అని **యతో వాచో నివర్తన్తే** అని వాక్యము ద్వారా చెప్పబడుతున్నది.

ఈ విధంగా ఇంత అనే ఒక పరిమాణము లేనిది ఐన బ్రహ్మ యొక్క ఆనందాన్ని ఎరిగిన ఉపాసకుడు దేని నుండి కూడా భయపడడు అని చెప్పబడుతున్నది. ఇంతే కాకుండా మాన్త్రవర్ణికుడైన విపశ్చిత్ ఐన బ్రహ్మ **సోఽకామయత** అని ఆరంభించి చెప్పబోయే విధంగా తన సంకల్పము చేత మాత్రాననే జగత్‌జన్మ, స్థితి, జగత్తుకు అన్తరాత్మగా అయ్యి ఉండడము వంటి పనుల వలన ముక్తస్వరూపుడైన జీవుడి కంటే వేరయిన వాడు అని తేట తెల్లము అవుతూనే ఉన్నది. ముక్తునియొక్క వైభవము "**జగద్ వ్యాపారవర్జమ్**" అని వివరింపనున్నాడు సూత్రకారుడు. కనుక జగద్వ్యాపారము కలవాడు బ్రహ్మ అతడే ఆనందమయుడు అని తెల్లమే. ఇందువల్ల కూడా బద్ధముక్తావస్థలు కల జీవులకంటే అన్యుడు ఆనందమయుడు–

**సూ॥ భేదవ్యపదేశాచ్చ 1-1-18** భేదము నిర్దేశింపబడినందువల్ల కూడా **తస్మాద్వాఏతస్మాదాత్మన ఆకాశః** అని ఆరంభించి మాన్త్ర వర్ణికుడైన బ్రహ్మను వ్యక్తపరుస్తున్న వేదవాక్యము అన్నమయ, ప్రాణమయ మనోమయముల కంటే వేరయిన వాడినిగా జీవుడిని చెప్పినట్లే పరబ్రహ్మకు ఆనందమయుడికి భేదాన్ని శ్రుతివాక్యము చెప్తున్నది. **తస్మాద్వాఏతస్మాద్విజ్ఞానమయాత్ అన్యోఽన్తర ఆత్మాఽనన్దమయః** ఈ విజ్ఞానమయుడైన జీవుడి కంటే అన్యుడు విజ్ఞానమయునిలో నున్నట్టివాడు వానికి ఆత్మ ఐనవాడు ఆనందమయుడు అని. కావున జీవుని కంటే వేరుగా భేదాన్ని కలవాడినిగా చెప్పినందువలన ఈ మాన్త్ర వర్ణికుడు ఐన ఆనందమయుడు అన్యుడే అనియే తెలుస్తున్నది. దీనివలన కూడా ఆనందమయుడు జీవుని కంటే అన్యుడే!

**సూ॥ కామాచ్చ నానుమానాపేక్షా 1-1-19** బ్రహ్మ తన సంకల్పమువల్లనే సృష్టించుతున్నందువల్లను ప్రకృతితో అవసరము లేదు. అవిద్యాపరవశుడైన జీవుడికి జగత్కారణత్వమును ఒప్పుకొనేటట్లయితే ఆనుమానికము ప్రధానము మొదలైన శబ్దాలచేత వ్యవహరింపబడే అచిద్వస్తువుతో సంసర్గము/కలయిక తప్పని సరి అవుతుంది. అలాగైనందువల్లనే చతుర్ముఖబ్రహ్మ మొదలైనవారికి జగత్ కారణత్వము దక్కుతున్నది. ఈ బ్రహ్మ విషయములో మాత్రము అట్లాగా కాదు. **సోఽకామయత బహుస్యాంప్రజాయేయ** అని అచిత్తుతో సంసర్గము లేకుండానే తన కోరిక/సంకల్పము వల్లనే విచిత్రమైన చిదచిద్వస్తువులను బ్రహ్మపుట్టిస్తున్నాడు. **ఇదమ్ సర్వ మసృజత యదిదం కించ** అనే వాక్యాలు దీనినే తేటపరుస్తున్నాయి. కావున ఈ జగత్తును సృష్టించే

ఆనందమయుడికి ఆనుమానికమైన అచిద్వస్తువుతో సంసర్గావసరము కనపడటం లేదు.

చెప్పబోయే ఈ కారణము చేతనున్నూ ఆనందమయుడు జీవునికన్నా వేరయినట్టివాడే! **సూ॥ అస్మిన్నస్యచ తద్యోగం శాస్తి 1-1-20** పరమాత్మ యందు జీవునికి కలయికను శాస్త్రము శాసిస్తున్నది.

అస్మిన్ = ఈ ఆనందమయుడి యందు, అస్య = ఈ జీవుడికి, తద్యోగమ్ ఆనంద యోగమును, శాస్తిశాస్త్రమ్ = శాస్త్రము ఆదేశించుతున్నది. **రసోవైసః రసగ్గ్ హ్యేవాయం లబ్ధ్వాఽఽనందీభవతి** ఆయన రసస్వరూపుడు. ఈ జీవుడు రసస్వరూపుడైన పరమాత్మను చేరబారి ఆనందమును కలవాడు అవుతున్నాడు. అని రస శబ్దము చేత పిలువబడే ఆనందమయుడిని దక్కించుకొన్నందువల్ల ఈ జీవశబ్దముతో వ్యవహరింపబడేవాడు ఆనందము కలవాడు అవుతున్నాడు అని కంఠోక్తిగా చెప్పుతుంటే ఎవడిని పొందినవాడు ఆనందము కలవాడు అవుతున్నాడో వాడు వాడే అని పిచ్చివాడు తప్ప మరొక్కడు అనగలడా!

ఈ విధంగా ఆనందమయుడు పరబ్రహ్మ అని నిశ్చయము చేయబడితే **యదేష ఆకాశ ఆనందః 2) విజ్ఞానమానందంబ్రహ్మ** ఇత్యాది వాక్యాలలోనూ ఆనంద శబ్దము చేత ఆనందమయుడే పరామర్శ చేయబడుతాడు. విజ్ఞానశబ్దము చేత విజ్ఞానమయుడు అని తెలియబడినట్లు. ఇందువల్లనే **ఆనందం బ్రహ్మణో విద్వాన్** అని ఆనందము వేరు బ్రహ్మ వేరు. అది ఆయనకే సమ్బన్ధించినది అని ఎదురుబొదురుగా నిర్దేశమును చేసింది వేదము. కావుననే **ఆనందమయమాత్మానము పసంక్రామతి** ఆనందమయుడైన ఇతడిని చేరుకుంటున్నాడు. అని బ్రహ్మ విజ్ఞాన/ఉపాసనఫలము చెప్పబడింది. దీనికి తరువాత ఉన్న అనువాకములో కూడా ముందటి ముందటి అనువాకాలలో చెప్పబడి అన్నమయాదులకు **అన్నం బ్రహ్మేతివ్యజానాత్.** అన్నమును బ్రహ్మ అని తెల్సుకొనెను. **ప్రాణం బ్రహ్మేతి వ్యజానాత్.** ప్రాణాన్ని బ్రహ్మ అని తెల్సుకొనెను. **మనోబ్రహ్మేతి వ్యజానాత్** మనస్సును బ్రహ్మ అని తెల్సుకొనెను. **విజ్ఞానం బ్రహ్మేతి వ్యజానాత్** విజ్ఞానాన్ని బ్రహ్మ అని తెల్సుకొనెను. అని ప్రతిపాదించినందువల్ల **ఆనందోబ్రహ్మ** ఆనందమే బ్రహ్మ అనే వాక్యమున్నూ ఆనందమయుడికి చెందిన ప్రతిపాదనమని తెలుస్తున్నది. అందువలన కూడా ఆనందమయుని విషయంలోనూ **ఆనందమయమాత్మానముపసంక్రమ్య** ఆనందమయుడైన ఆత్మను చేరుకుని అని ముగింపు చేయబడింది.

ఆనంద ఆనందమయ శబ్దాలు రెండున్నూ ఒకే అర్థాన్ని తెలుపుతున్నాయి కనుక ప్రధాన శబ్దము చేత పిలువబడే ప్రకృతి కంటే మరొక అర్థము/వస్తువు ఐన పరబ్రహ్మ జీవశబ్దము చేత వ్యవహరింపబడే వాడికంటే కూడా అర్థాన్తరత్వము/మరొకవస్తువు అయ్యి ఉండడము సిద్ధించుతున్నది. **ఇది ఆనందమయాధికరణము.**

★ ★ ★

## ఇక అంతరధికరణము

ఒకవేళ తక్కువ పుణ్యాన్ని మాత్రమే చేసుకున్న సాధారణజీవులు తన కోరికమేరకు జగత్తును పుట్టించడము గానీ అందరికన్నా మించిన ఆనందాన్ని కల్గియుండడము గానీ భయాభయములకు కారణము అయ్యి ఉండడాన్ని ఇంకా ఇంట్లాంటివే మరిన్ని విశేషాలను గానీ పొందలేకపోయినా వీరిలో ఒకరుగా అయ్యి ఉంటూ విలక్షణమైన పుణ్యములను సంపాదించుకొనియున్న ఆదిత్యుడు ఇంద్రుడు ప్రజాపతి (బ్రహ్మ) మొదలైన వారికి పై లక్షణాలన్నీ కలుగవచ్చును కదా! అనే శంకకు సమాధానమును చెప్పుతున్నారు.

**సూ॥అన్తస్తద్ధర్మోపదేశాత్ 1-1-21** చిదచిత్తులలోనూ ఉండేవాడు ఆ పరమాత్మ. ఆయన యొక్క ధర్మాలనే ఉపదేశించినందువల్ల ఇది ఛాందోగ్యోపనిషత్తులోని వాక్యము **యఏషోఽన్తరాదిత్యే హిరణ్మయః పురుషోదృశ్యతే హిరణ్యశ్మశ్రుః హిరణ్యకేశః ఆ ప్రణఖాత్ సర్వఏవ సువర్ణః తస్యయథాకప్యాసం పుండరీకమేవ మక్షిణీ. తస్యోదితినామ. సఏష సర్వేభ్యః పాప్మభ్యః ఉదితః ఉదేతిహవై సర్వేభ్యః పాప్మాభ్యోయఏవంవేద. తస్యర్ క్చ సామచగేష్ణౌ ఇత్యధిదైవతమ్. అథాధ్యాత్మమ్ అథయ ఏషోఽన్తరక్షిణి పురుషోదృశ్యతేసైవర్క్. తత్ సామ. తదుక్థమ్. తద్యజుస్తద్బ్రహ్మ. తస్యై తస్య తదేవరూపమ్. యదముష్యరూపమ్. యావముష్యగేష్ణౌ తౌగేష్ణౌ. యన్నామ తన్నామ** అని ఏ వ్యక్తియైతే ఆదిత్య మండలము లోపల ఉన్నవాడై కనిపిస్తున్నాడో అతడు బంగారము వలె రమణీయస్వరూపుడు అతని మీసాలు తలవెంట్రుకలు చేతిగోళ్ళ వరకూ అంతా సువర్ణమే. మనోహరమే అతని ముఖము సూర్యమండలము వలె ఉజ్జ్వల కాన్తిమన్తము. కన్నులు నీటిలో ఉన్న తామరపూ రేకులవలె విశాలములు మనోహరములు/ ఆయనకు **ఉత్** అని పేరు. ఆయన పుణ్యపాపరూప కర్మలకు అందరానంత ఎత్తులో ఉన్నట్టివాడు. ఇలాంటి ఆయనను

గురించి తెలిసి ఉపాసించినవాడున్ను ఆయన వలెనే అన్నిరకాలైన పాపాల నుండి దూరముగా వెళ్ళిపోవును. ఆయనను గురించి కీర్తించేవే ఋక్కులు సామములున్నూ. ఇదంతా దేవతా ఉపాసనకు చెందినది. ఇక ఆత్మలో దేహములో చేసే ఉపాసనము గురించి ఇక ఈ వ్యక్తి కన్నులలోపల ఎవడు కనిపిస్తున్నాడో వాడు ఋక్కు సామ, ఉక్థ్యము, యజుస్సు, అతడే బ్రహ్మ. ఈ కంటిలో కనిపించే వాడి రూపము ఆ సూర్యమండలములో కనిపించే వానివంటిదే. ఏవి అతనికి గేయములో అవే గేష్ణములు. ఏది అతనికి పేరో అదే ఇతనికి కూడా.

ఈ వాక్యము పైన సందేహము కల్గుతున్నది. ఏమని! ఈ సూర్యమండలములో మనిషి కంటిలోనూ కనిపించే పురుషుడు పుణ్యమును పుష్కలంగా సమ్పాదించుకోవడం వల్ల కల్గిన ఐశ్వర్యము కలవాడు ఆదిత్యుడు మొదలైన శబ్దాలతో పిలువబడేవాడూ ఐన జీవుడా! లేక ఆతనికంటే వేరయిన పరమాత్మనేనా? అని. రెండింటిలో ఏది తగినది? అనేట్లయితే పుణ్యాలను పోగుచేసుకున్న జీవుడేనని. ఎందువల్ల నంటే ఆదిత్యమండలములో కంటిలోనూ ఉన్నప్పటికీ శరీరాన్ని కల్గి ఉన్నవాడుగా శ్రుతి వినిపిస్తున్నది కాబట్టి. శరీరముతో సమ్బన్ధమును కల్గిఉండడము జీవులకే గాని పరమాత్మకు లేదు. శరీరసమ్బన్ధమనేది తాను చేసిన కర్మలకు తగినట్లు ప్రియాప్రియాలను పొందడానికే గదా ఏర్పడుతున్నది. కావుననే కర్మసమ్బన్ధము లేనిదైన మోక్షమును పొందాలంటే అశరీరుండై ఉండాలని కాదా శ్రుతివాక్యము చెప్పుతున్నది? **నహవైసశరీరస్యసతః ప్రియాప్రియయోః అపహతిరస్తి. అశరీరం వా వ సన్తం నప్రియాప్రియే స్పృశతః** శరీరముతో కూడి ఉండిన వాడికి ప్రియాప్రియములు దూరము కావు. శరీరము లేనటువంటి వానికి ప్రియాప్రియములు అంటవు అని. ఎక్కువ పుణ్యము కలవానికి ఎక్కువ జ్ఞానము ఎక్కువ శక్తియున్నూ కల్గుతున్నవి. ఇందువల్లనే లోకకామేశత్వము – తనను ఉపాసించిన ప్రజలకు వారు కోరిన కోరికలను నెరవేర్చగల్గడము, వారిని శాసించడమున్నూ వానికే పొసగుతున్నవి. అందువల్లనే ఉపాసింపబడ్తూ ఫలాలను ప్రసాదించుతున్నాడు. పైగా వారివారి పాపాలను అణచివేయగల్గుతున్నందున మోక్షాన్ని పొందడానికిన్నీ ఉపయోగపడుతున్నాడు. మానవులలో కూడా పెద్దగా పుణ్యాలు చేసినవారు కొంతమంది జ్ఞానము శక్తి మొదలగు వానితో సాటివారి కంటే అధికులుగా కనిపిస్తున్నారు. వాళ్ళకంటే సిద్ధులు గంధర్వులు మొదలైనవారు అధికులు. వారికంటే దేవతలు, వాళ్ళకంటే ఇంద్రుడు

మున్నగువారు అధికులు. కావున బ్రహ్మాదులలో ఎవడోఒకడు ఒక్కొక్క కల్పములో తన పుణ్యవిశేషము కారణంగా ఈవిధమైన **లోకకామేశత్వము, ఉపాస్యత్వము ఫలప్రదాయిత్వము మోక్షోపయోగిత్వము**, ఇంద్రాది పదవులను అధిరోహించడము వంటి ఐశ్వర్యాలను పొందినవాడు జగత్ సృష్టిస్థితి లయాదులున్నూ చేయగలడు. ఏవైతే జగత్కారణత్వము, జగదన్తరాత్మత్వమును మున్నగు ఐశ్వర్యాలను తెలిపే వాక్యాలు ఉన్నవో అవి ఈ ఉపచితపుణ్యవిశేషము గల సర్వజ్ఞుడు సర్వశక్తియైన వానియందు చక్కగా సరిపోలుతవి. చెల్లుతవి. ఇట్లాగా అయ్యి ఉన్నదికాబట్టే **అస్థూలమ్ అనణు అహ్రస్వమ్ దొడ్డూ కాదు. అణువంత చిన్నాకాదు. పొట్టీకాదు** ఇత్యాది లక్షణ వాక్యాలున్నూ జీవాత్మయొక్క స్వరూపాన్ని తెలిపిడిచేసేవిగా అవుతున్నాయి. మోక్షశాస్త్రాలు కూడా ఆ స్వరూపాన్ని, దాన్ని పొందడానికి అవసరమైన ఉపాయాలను ఉపదేశించేవిగా ఉంటున్నాయి అని.

ఈ విధంగా పూర్వపక్షము ఎదురైతే దీనికి సమాధానము చెప్తున్నాము. **అన్తస్తద్ధర్మోపదేశాత్.** ఆదిత్యమండలములో కన్నులోనూ ఏ పురుషుడైతే కనిపించు తున్నాడో అతడు జీవుడు కంటే భిన్నుడయిన పరమాత్మనే. ఎందువల్లనంటావా? అతనియొక్క ధర్మాన్ని ఉపదేశించుతున్నది కాబట్టి. జీవులలో జరుగనిదై వారిని మించిన పరమాత్మదే అపహతపాప్మత్వాది ధర్మము. **సఏషసర్వేభ్యః పాప్మభ్యః ఉదితః** ఇత్యాది వాక్యము చేత అది చెప్పబడుతున్నది. అపహత పాప్మత్వము అనగా కర్మలు లేనివాడై ఉండుట. అనగా కర్మలకు చిక్కినవాడై ఉండుట అనే దోషముల యొక్క వాసన కూడా లేనివాడై యుండుట అని అర్థము. కర్మలకు అధీనమై సుఖదుఃఖాలను పొందుతున్నందువల్లనే జీవులు కర్మవశ్యులు. ఇందువల్ల అపహత పాప్మత్వము అనేది పరమాత్మకు మాత్రమే చెందిన ధర్మము. అట్లాగా ఐనందువల్లనే స్వాభావికమైన లోకకామేశత్వము, సత్యసంకల్పత్వాదులు, సర్వభూతాన్తరాత్మత్వములున్నూ ఆయనకే ఉన్న స్వాభావికధర్మములు. దీన్నే శ్రుతి ఇట్లాగా చెప్పింది.

**ఏషఆత్మా అపహతపాప్మా విజరో విమృత్యుః విశోకోఽవిజిఘత్సోఽపిపాసః సత్యకామః సత్యసంకల్పః** ఈ చిదచిత్ మిశ్ర ప్రపంచానికి ఆత్మయైన ఇతడు పాపాలు లేనివాడు. ఆ కారణంగానే ముసలితనం లేనివాడు, చావులేనివాడు, విచారము దుఃఖమూ లేనివాడు ఆకలి దప్పిలేనివాడు. తన కోరికలు యథార్థమై

రూపుదాల్చేటువంటివాడు. ఆయన కోరికలను అడ్డగించగలవాడు లేనివాడు. అట్లాగే **ఏషసర్వభూతాన్తరాత్మాఽపహతపాప్మాదివ్యోదేవ ఏకోనారాయణః** అనిన్నీ.

**సోఽకామయత. బహుస్యామ్. ప్రజాయేయేతి.** ఇత్యాదిగా సత్య సంకల్ప పూర్వకముగా సమస్త చిదచిద్వస్తులనన్నింటినీ పుట్టించగల్గడము నిరుపాధికమైన (కారణము లేకుండానే) భయాభయహేతుత్వము వాక్కు మనస్సులకు ఉండే పరిమితికి లోబడి ఏర్పర్చబడే/చెప్పబడే పరిచ్ఛేదము లేని అనవధికాతిశయ ఆనందమును కలిగి ఉండడము ఇత్యాదులైన కర్మలచేత సంపాదించుకోలేని సహజ ధర్మాలు జీవుడికి కలుగవు.

శరీర సమ్బన్ధమున్నట్టు శ్రుతి ద్వారా వినపడుతున్నది కాబట్టి అక్షి, ఆదిత్యాన్తర పురుషుడు పరమాత్మకాడని ఏ మాటను మీరు చెప్పినారో అది సత్యము కాదు. శరీరాన్ని కలిగి ఉండడమనేది కర్మవశ్యతను ఋజువు చేయదు. సత్యసంకల్పుడికి తన ఇష్టము ప్రకారమే శరీరముతో సమ్బన్ధము ఏర్పడవచ్చును. ఒకవేళ మీరిట్లాగా వాదించవచ్చును. శరీరము అనేది త్రిగుణాత్మకమైన ప్రకృతి యొక్క పరిణామమైన భూతాలయొక్క కలయిక రూపము అని. అలాంటి దానితో సమ్బన్ధము అపహత పాప్మఐనవాడు సత్యసంకల్పుడూ ఐనట్టి పురుషుని యొక్క కోరిక ప్రకారమే ఐనా కలుగనే కలుగదు. అది పురుషుడు కోరుకునేదికాదు కాబట్టి. కర్మవశ్యుడికి మాత్రము తనదైన స్వరూపాన్ని ఎరుగడు కాబట్టి వాడు చేసుకున్న కర్మఫలాలను అనుభవించడానికి గాను వాడు అక్కరలేదని దూరంగా తోసిపారవేసినా ఏ రీతిగానైనా తప్పించుకోలేక అనుభవించకతప్పదు అని.

ఐతే మీరన్నట్లు కావడానికి అవకాశము ఉన్నది. కావచ్చును కూడా. కానీ ఈ పరమాత్మ దేహము సత్వరజస్తమస్సులు అనే గుణత్రయమయము ఐన ప్రకృతికి సమ్బన్ధించినదైనపుడు మాత్రమే. అట్లా కాకుండా అది ఆయన కోరినట్టిది తనకు అనురూపమైనది పంచభూతమయ ప్రకృతితో ఎటువంటి సమ్బన్ధము లేనిది కదా! అందువల్ల శరీరసమ్బన్ధము పరమాత్మకు కూడా ఉండవచ్చును.

ఈ సంగ్రహవాక్యాలవల్ల మీకు వివరింపబడుతున్న విషయమిది. పరంబ్రహ్మకు మాత్రమే నిఖిలహేయ ప్రత్యనీకమైన అనన్త జ్ఞానానందైక స్వరూపము ఉన్నది. కాబట్టి సకలేతర విలక్షణుడు. అంతేగాక స్వాభావికము అనవధిక అతిశయ అసంఖ్యేయ కళ్యాణగుణగణాలున్నూ ఆయనకు ఉన్నాయి. అట్లాగే స్వాభిమతానికి తగినట్లు

ఏకరూపము అచింత్యము, దివ్యము అద్భుతము నిత్యము నిరవద్యము నిరతిశయమైన ఔజ్జ్వల్యము ఐన సౌందర్యము సౌగంధ్యము సౌకుమార్యము లావణ్యము యవ్వనము మొదలైన గుణగుణాలకు నిధియైన దివ్యమైన రూపము సహజమైనది కూడా ఉన్నది. అట్లాంటి దానితోనే తనను ఉపాసించే వారియందు తనకు ఉండే అనుగ్రహము ప్రకారము వారివారి ఇష్టాలననుసరించి ఆయా రూపాలను తాను పొందుతున్నాడు. ఆ పురుషుడు ఎవరో కాదు అపారమైన కారుణ్యము సౌశీల్యము వాత్సల్యము ఔదార్యము ఐశ్వర్యములకు సముద్రము వంటివాడు నిరస్తనిఖిలహేయగన్ధుడు. అపహత పాప్మ. పరమాత్మ. పరంబ్రహ్మ. పురుషోత్తముడు నారాయణుడు అని.

**1) యతో వాఇమాని భూతానిజాయన్తే 2) సదేవసౌమ్యేదమగ్ర ఆసీత్ 3) ఆత్మావాఇదమేకఏవాగ్ర ఆసీత్ 4) ఏకోహవై నారాయణ ఆసీన్న బ్రహ్మా నేశానః** ఇత్యాది వాక్యాలలో నిఖిలజగత్తు కంతటికీ ఏకైక కారణముగా అవగతము అవుతున్న పరబ్రహ్మకు **1)సత్యం జ్ఞానమనన్తంబ్రహ్మ 2)విజ్ఞానమానన్దం బ్రహ్మ** ఇత్యాదులతో ఇదీ ఆయన యొక్క స్వరూపము అని తెలుస్తున్నది. **నిర్గుణమ్ నిరంజనమ్. అపహతపాప్మా విజరో విమృత్యుః విశోకోఽవిజిఘత్సోఽపిపాసః సత్యకామః సత్యసంకల్పః నతస్యకార్యం కరణంచవిద్యతే నతత్సమశ్చాభ్యధికశ్చదృశ్యతే। పరాఽస్యశక్తిః వివిధైవ శ్రూయతే స్వాభావికీ జ్ఞానబలక్రియాచ. తమీశ్వరాణాం పరమం మహేశ్వరం తందైవతానాం పరమం చదైవతమ్. సకారణం కరణాధిపాధిపో నచాస్య కశ్చిత్ జనితా నచాధిపః. సర్వాణిరూపాణి విచిత్య ధీరః నామానికృత్వాఽభివదన్ యదాఽస్తే, వేదాహమేతం పురుషమ్ మహాన్తమ్ ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్. సర్వేనిమేషా జజ్ఞిరే విద్యుతః పురుషాదధి.** మొదలైన వాటియందు పరబ్రహ్మయొక్క ప్రకృతి సమ్బన్ధము వల్ల కలిగే హేయగుణాలను ప్రాకృతదేహ సమ్బన్ధాన్ని దాని కారణంగా వచ్చే కర్మవశ్యతా సంబన్ధాన్ని లేవని నిషేధించి కళ్యాణగుణాలను కళ్యాణరూపాన్నీ ఉన్నవని చెప్పుతున్నాయి. ఈ విధంగా తనకే చెందిన స్వాభావికమైన రూపాన్ని తనను ప్రేమగా కొలిచే ఉపాసకుని యందు ఉండే దయతో ఆ భక్తుడు ఏ ఏ రూపాలపై ఆసక్తిని చూపించుతాడో దానికి అనుగుణమైన ఆకారంలో దేవుడుగానో మనుష్యుడుగానో దేన్ని కోరితే దానినిగా తన యిష్టము ప్రకారమే పరమకారుణికుడైన భగవన్తుడు ధరించుతున్నాడు. ఆ ముచ్చటనే శ్రుతి ఈ విధంగా స్తోత్రము చేసింది. **అజాయమానో**

**బహుధావిజాయతే.** తాను కర్మవశ్యమైన పుట్టుకలు లేనివాడే అయినా పలుమార్లు అనేక రూపాలతో అవతరిస్తున్నాడు. అని.

ఇంక స్మృతి కూడా – భగవద్గీత – **అజోఽపి సన్నవ్యయాత్మా భూతానాం ఈశ్వరోఽపిసన్। ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మమాయయా/** నేను పుట్టుకలు లేనివాడనైనా మార్పులు చేర్పులు లేనివాడనైనా భూతాలనన్నింటినీ శాసించే వాడనైనా నాదైన ప్రకృతిని మాత్రమే ఆధారంగా చేసుకొని నా సంకల్పము ప్రకారమే జన్మించుతున్నాను. **పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతామ్** సాధువులను కాపాడడానికి దుర్మార్గులను అణచివేయడం కొరకును పుడుతున్నాను. అని చెప్పుతున్నది.

ఇక్కడ సాధువులు అనగా భగవన్తుడిని ఉపాసించేవారు అని అర్థము. వారిని కాపాడడమే భగవన్తుడికి ప్రధానోద్దేశ్యము. ఆనుషంగికము/అప్రధానముఐన పని దుష్టులను నశింపచేయడం. ఎందుకంటే ఆ పనిని తాను అవతరించి చేయవలసింది ఏమీ కాదు. సకల జగత్తునూ సృష్టించినవాడికి తన సంకల్పము ద్వారానే నశింపచేయడము తేలికైనది కదా! **ప్రకృతిం స్వాం** అనుచోట ప్రకృతి పదానికి అర్థము స్వభావము అని. తనదైన స్వభావమును కల్గియుండి అనియేకాని సంసారులయొక్క స్వభావాన్నికాదు అని అర్థము. ఆత్మమాయయా తన సంకల్పరూపమైన జ్ఞానముతోనని తెల్సుకోవాలి. **మాయా వయునం జ్ఞానమ్** అని వేదనిఘంటుకారులు మాయాశబ్దాన్ని జ్ఞానానికి పర్యాయంగా పఠించుతున్నారు. భగవన్తుడగు పరాశరమహర్షిగారున్నూ **సమస్తాశ్శక్తయశ్చైతా నృపయత్రప్రతిష్ఠితాః। తద్విశ్వరూపవైరూప్యం రూపమన్యత్ హరేర్మహత్॥ సమస్త శక్తిరూపాణి తత్కరోతి జనేశ్వర। దేవతిర్యఙ్మనుష్యఆఖ్యాచేష్టా వన్తి స్వలీలయా। జగతాముపకారాయ న సా కర్మనిమిత్తజా॥** ఓ రాజా! ఈ శక్తులన్నీ ఎవనియందైతే పోగుపడిఉన్నవో అట్టి విశ్వరూపానికి భిన్నరూపము గొప్పదైనది శ్రీహరిది. ఆయన సమస్త శక్తిరూపాలను పుట్టించుతున్నాడు. తన లీలలో / ఆటలో ఒక భాగంగా దేవ తిర్యక్ మనుష్యులు అనేవే కాక పలురకాలైన చేష్టలను కలవానినన్నింటినీ ఆయనయే జన్మింపచేస్తున్నాడు. ఈ విధంగా తానే జన్మించడము లోకులకు ఉపకారము చేయడానికే గాని కర్మకారణంగా కాదు సుమా! అని. శ్రీమహాభారతములోనున్నూ తనయొక్క అవతార రూపాలన్నీ మనవంటి ప్రకృతికి సమ్బన్ధించినవి కావు అని

చెప్పబడుతున్నది. **నభూత సంఘసంస్థానోదేహోఽస్యపరమాత్మనః** ఈ పరమాత్మ యొక్క శరీరము పంచభూతాలకలయిక వల్ల ఏర్పడినట్టిది కాదు అని.

ఇందువల్ల పరబ్రహ్మకే ఈవిధమైన అప్రాకృతమైన కర్మసంబన్ధము లేని విలక్షణమైన అన్తఃసమ్బన్ధ స్వరూపము ఉంటున్నందున ఆదిత్య చక్షురన్తర్వర్తిత్వము అపహతపాప్మత్వము అనే ధర్మము ఉంటున్నది. అది ఆయన ధర్మమే కాని జీవుడిది కాదు. కనుక ఆదిత్యమండల అక్ష్యధికరణుడు ఆదిత్యాది జీవులకంటే భిన్నుడు పరమాత్మనే సుమా!

**సూ॥ భేదవ్యపదేశాచ్చాన్యః 1-1-22** భేదాన్ని స్పష్టంగా పేర్కొంటున్నందున ఆదిత్యునిలో ఉండేవాడు పరమాత్మనే. ఈ పరమాత్మకు ఆదిత్యాది జీవులకంటే భేదము చెప్పబడుతున్నది. **య ఆదిత్యే తిష్ఠన్ ఆదిత్యాదన్తరో యమాదిత్యోనవేద యస్యాదిత్యః శరీరం యఆదిత్యమన్తరోయమయతి.** ఎవడు ఆదిత్యునిలో ఉంటూ ఆదిత్యుడిని తాకకుండా ఉన్నాడో ఎవడిని తనలో ఎవడో ఒకడు నాకు తెలియకుండా ఉన్నాడు ఆదిత్యుడు అని ఎరుగడో, ఎవనికి ఆదిత్యుడు శరీరముగా నున్నాడో ఎవడు ఆదిత్యుడిని ఆయనలో ఉంటూనే అదుపులో పెడుతూ తన యిష్టము ప్రకారము నడిపించుతున్నాడో. **యఆత్మనితిష్ఠన్ ఆత్మనోఽన్తరో యమాత్మానవేద యస్యాత్మాశరీరం యఆత్మాన మన్తరోయమయతి.** ఎవడు ఆత్మయందు ఉంటూ ఆత్మలోనే తనస్పర్శ తెలియకుండా ఉన్నాడో ఎవడిని గురించి ఆత్మతెల్సుకోలేదో ఎవనికి ఆత్మశరీరమో ఎవడు లోపలనుండి ఆత్మను అదుపుచేస్తున్నాడో అని. **యోఽక్షరమన్తరే సంచరన్ యస్యాక్షరం శరీరమ్యమక్షరం నవేద. యోమృత్యుమన్తరే సంచరన్ యస్యమృత్యుశ్శరీరం యం మృత్యుర్న వేద. "ఏషసర్వభూతాన్తరాత్మా అపహత పాప్మాదివ్యోదేవఏకో నారాయణః"** అని కూడా ఈ అపహత పాపుడైన పరమాత్మకు జీవులందరినీ శరీరములు అని అంటూ వాటికి లోపల అన్తరాత్మగా ఐ ఉంటున్నందున ఇతడిని అన్తరాత్మ అని చెపుతున్నది. ఇందువలన హిరణ్యగర్భాది జీవులందరికంటే వేరయినవాడు పరమాత్మ అని సిద్ధించినది. **ఇది అన్తరధికరణము.**

★ ★ ★

## ఇక ఆకాశాధికరణము

యతోవాఇమాని భూతానిజాయన్తే ఎవడినుండైతే ఈ కనుపించే భూతాలన్నీ పుడుతున్నాయో అనే శ్రుతివాక్యము ద్వారా జగత్కారణము బ్రహ్మ అని

విశదమవుతున్నది. ఆ జగత్‌కారణము ఎటువంటిది? అని తెల్సుకోవాలని కోరిక కలిగినప్పుడు. **1) సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్. 2) తత్తేజోఽసృజత 3) ఆత్మా వాఇదమేకఏవాగ్ర ఆసీత్ 4) సఇమాన్ లోకాన్ అసృజత 5) తస్మాద్వా ఏతస్మా దాత్మన ఆకాశస్సంభూతః** అని సాధారణ శబ్దాలతో జగత్కారణము నిర్దేశింపబడింది. ఈక్షణవిశేషధర్మము, ఆనందవిశేషరూప విశేషార్థ స్వభావాన్ని బట్టి ప్రధానము క్షేత్రజ్ఞుడు మున్నగువారికంటే వేరయినవాడు బ్రహ్మ అని వివరించబడింది. ఇప్పుడు ఆకాశము మున్నగు విశేషశబ్దాలతో నిర్దేశించి జగత్‌కారణత్వము జగదైశ్వర్యము – ఈ జగమంతా ఆయనయొక్క ఆస్తి. దానిని తాను అదుపులో ఉంచుకుంటున్నాడని – చెప్పే వాక్యాలలో ఆకాశాదిపేర్లతోనూ చెప్పబడుతున్నందున ప్రసిద్ధమైన చిదచిత్తులకంటే అర్థాన్తరము, ఇంతకు మునుపు చెప్పిన లక్షణాలు కలది బ్రహ్మ అని ఇపుడు ప్రతిపాదింపబడుతున్నది. **ఆకాశస్తల్లింగాత్** ఇత్యాది సూత్రముతో ఆరంభము అయ్యి పాదము ముగిసేదాకా.

సూ॥ **ఆకాశస్తల్లింగాత్ 1-1-23** ఛాందోగ్యోపనిషత్తునందు ఈవిధంగా పఠింపబడుతున్నది. **అస్యలోకస్యకాగతిరితి, ఆకాశఇతిహోవాచ సర్వాణిహవా ఇమాని భూతాని ఆకాశాదేవ సముత్పద్యన్తే ఆకాశంప్రతి అస్తంయన్తి. ఆకాశోహ్యేవైభ్యో జ్యాయాన్ ఆకాశఃపరాయణమ్.** ఈ లోకానికంతటికీ ఏది దిక్కు/ గతి అని అనగా ఆకాశమేనని చెప్పినాడు. ఇట్లా కనిపిస్తున్న ఈ భూతాలన్నీ ఆకాశాన్నుంచే పుడుతున్నవి. చివరకు ఆకాశము వద్దకే మనకు కనిపించకుండా పోతున్నవి. ఆకాశమే వీటన్నింటికంటే గొప్పది. ఆకాశమే అందరికిన్నీ పరమలక్ష్యము. పరమగమ్యము **అని.** ఈ వాక్యము వద్ద సందేహము కలుగుతున్నది. లోకములో అందరికీ తెల్సిన ఆకాశమే ఈ వాక్యములో చెప్పబడుతున్నదా? లేక ఇంతకు మునుపు చెప్పిన లక్షణాలు కల బ్రహ్మయే ఆకాశమని పిలువబడుతున్నాడా? అని. ఏది నిర్ణయమైనది? అని అంటే ప్రసిద్ధ ఆకాశమేను అని. ఎందువల్లనంటావా? ఒక్క శబ్దప్రమాణము చేత మాత్రమే తెలియబడే బ్రహ్మ పదార్థమునందు ఏ అర్థమైతే వ్యుత్పత్తి సిద్ధమైన శబ్దముతో బుద్ధికి తోస్తుందో ఆ అర్థాన్నే గ్రహించాలి. ఇందువల్ల ప్రసిద్ధ ఆకాశమే చరాచర ప్రాణి సముదాయానికంతటికీ కారణము కనుక దానికంటే వేరయినది కాదు బ్రహ్మ అని ఏమండీ! ఇంతకుముందు సంకల్ప పూర్వకముగా జగత్తును సృష్టించినందువల్ల అచేతనమయిన ప్రధానము కంటే, జీవుడి కంటే వ్యతిరిక్తుడు బ్రహ్మ అని చెప్పినారు

కదా! ఔనండీ! చెప్పినాము. అట్లాగే అయ్యేటట్లుంటే అది తగని మాట. అది ఇట్లాగా! **యతోవా ఇమాని భూతానిజాయన్తే... తద్బ్రహ్మ.** అని చెప్పినప్పుడు దేనినుండి ఈ భూతాలు పుట్టినాయి? అని ఇంకా మరి కొన్ని నిమిత్త, సహకారి కారణాలను గురించిన్నీ తెల్సుకోగోరినపుడు **సర్వాణి హవా ఇమాని భూతాని ఆకాశాదేవ సముత్పద్యన్తే,** సర్వభూతాలూ ఆకాశాన్నుండే పుడుతున్నాయి అనే వాక్యము ఆదిగా ఆయా విశేషాలుతోస్తున్నవి కనుక జగజ్జన్మాదికారణము ఆకాశమే అని నిశ్చయము చేయబడితే **సదేవసోమ్యేదమగ్రఆసీత్** ఇత్యాది వాక్యాల యందున్నూ సదాదిశబ్దాలు పరస్పరము సాధారణ శబ్దాలు ఐనందున తమకంటే వేరయిన విశేషార్థాన్ని తెలిపే **ఆకాశ** శబ్దాన్ని చూపిస్తున్నవి. **ఆత్మావా ఇదమేక ఏవాగ్ర ఆసీత్** ఇత్యాదులలో ఆత్మశబ్దము కూడా దానియందే ఆకాశమునందే ప్రవర్తిస్తున్నది. దానికి కూడా చేతన ఏకాన్తత్వము – చేతనుడినే తెలియపర్చడము – సంభవించడము లేదు. **"మృదాత్మకోఘటః"** ఈ కుండ మట్టిది అని అన్నపుడు అది మట్టితోనే సిద్ధము చేయబడింది. మరొక్కదానితో కాదు. అని నిశ్చయము ఐనట్లు ఆకాశశబ్దము చేత జీవుడు నిర్ణయింపబడడం లేదు **ఆప్నోతిఇతి ఆత్మా** తాను కోరినదాన్ని పొందుచున్నది. అనే వ్యుత్పత్తి ప్రకారము ఆకాశశబ్దము నందే ఆత్మశబ్దము పూర్తిగా అన్వయించుతున్నది. ఇదేవిధంగా ఆకాశమే కారణమైన బ్రహ్మ అని నిశ్చయించితే ఈక్షణాదులు దానికి తగినట్లు గౌణములు/అప్రధానములుగా సమన్వయము చేసుకోవాలి.

ఒకవేళ సదాదిసాధారణ శబ్దాల చేతనే కారణము చెప్పబడినట్లయితే ఈక్షణాదులైన అర్థాలచేత చేతనవిశేషమే కారణమని నిర్ణయింపబడేది. ఆకాశశబ్దము చేతనే విశేషము నిశ్చయింపబడింది. కనుక అర్థము యొక్క స్వభావాన్ని నిర్ణయించాల్సింది ఇంకా ఏమీ మిగలలేదు. **రూఢ్యర్థము, యోగికార్థము అని అర్థాలు రెండు రూఢి అనగా ఆ శబ్దము అందరికీ తెల్సిన అర్థాన్ని మాత్రమే చెప్పుతుంది. మరొకదాన్ని చెప్పదు. యోగము వ్యుత్పత్తి బట్టి ప్రసిద్ధి కల అర్థాన్నే కాక దానికంటే వేరొక్క అర్థాన్ని కూడా చెప్పవచ్చును. ఏ అర్థాన్ని గ్రహించాలి అనేది ప్రకరణాన్ని బట్టి నిర్ణయించవలసి ఉంటుంది. యోగము కంటే రూఢి బలీయమైనది. అదే మనకు/బుద్ధికి ముమ్మందు తోచుతుంది.**

**"ఆత్మనః ఆకాశస్సమ్భూతః"** ఆత్మ నుండి ఆకాశము పుట్టింది అనే వాక్యము వలన ఆకాశము కూడా ఒకనిచేత పుట్టింపబడింది. కావున అది కార్యము అని

తెలుస్తున్నది కదా అని అంటున్నారా? సత్యమే. ఐతే ఆకాశాదిభూతాలన్నింటికిన్నీ సూక్ష్మావస్థా స్థూలావస్థా అని రెండు అవస్థలు ఉన్నవి. అక్కడ సూక్ష్మావస్థ కారణము అనబడుతున్నది. స్థూలావస్థనేమో కార్యమవుతున్నది. **ఆత్మన ఆకాశస్సంభూతః అని** అంటే అర్థము ఇది. తనదైన సూక్ష్మరూపాన్నుంచే తాను స్థూలరూపంతో అవతరించింది అని.

**సర్వాణిహ వా ఇమానిభూతాని ఆకాశాదేవసముత్పద్యన్తే** అనే వాక్యము ద్వారా సమస్తజగత్తూ ఆకాశాన్నుండే పుద్తున్నది. అందులోనే చేరిపోతున్నది అని ప్రభవము, అప్యయఆదులు పుట్టుక నాశములు మొదలైనవి వినిపిస్తున్నవి కనుక అదే కారణమైన బ్రహ్మ అని నిశ్చయము చేయబడింది. ఈ విధంగా ప్రసిద్ధ ఆకాశము కంటే బ్రహ్మ వేరుకాదు కాబట్టి **యదేష ఆకాశ ఆనందో నస్యాత్ 2) ఆకాశోవైనామరూపయోః నిర్వహితా.** ఈ ఆకాశం అనబడే ఆనందము లేకపోయినట్లైతే 2) ఆకాశమే నామరూపాలను నిర్వహిస్తున్నది ఇట్లాంటి వాక్యాలన్నీ కూడా చాలా చక్కగా అర్థవంతాలై పొసగుతాయి.

ఈ తీరున పూర్వపక్షము ఏర్పడగా సమాధానము చెప్పుతున్నాము. ఆకాశము ఆ బ్రహ్మనే. ఆయన లక్షణాలు దానిలో ఉన్నాయి. కాబట్టి ఆకాశశబ్దము చేత పిలువబడే వాడు అచేతనమైన ప్రసిద్ధాకాశము కంటే మరొక వస్తువు ఐన ఇంతకుముందు చెప్పిన లక్షణాలను కల్గియున్న పరమాత్మనే సుమా! ఎందువల్లనంటావా? ఆ లక్షణాలు ఉన్నవి కాబట్టి సమస్త చేతనాచేతనాలతో కలిసి ఉన్న జగత్తుకంతటికీ ఏకైకకారణము కావడము, అందరికన్నా అధికుడుగానుండడము, పరాయణత్వము ఇట్లాంటి పరమాత్మ లక్షణాలు ఈ ఆకాశములో కనిపిస్తున్నవి. చేతనా చేతనాలన్నింటికీ కారణమై యుండడమనేది జడపదార్థమైన ప్రసిద్ధ ఆకాశానికి బొత్తిగా కుదురదు. ప్రపంచములో ఒక భాగమైన చేతన వస్తువు జడపదార్థము నుండి పుట్టదు. కనుక జగత్తుకార్యము కాదు. ఆకాశము కారణము కాలేదు. ఇక పరాయణత్వమంటే చేతనులందరికిన్నీ పరమమైన ప్రాప్యము అయ్యి ఉండడము. అచేతనము, హేయమూఐ సకలపురుషార్థాలకూ విరోధి ఐనటువంటిది పరాయణము ఎట్లా అవుతుంది? సర్వస్మాత్‌జ్యాయస్త్వము (అందరికన్నా పెద్దదిగా ఉండడము) అనగా ఏ వంకా లేకుండా అన్నివిధాలైన కళ్యాణగుణాలను కల్గియుండి, తాను తప్ప మిగతా వారందరికన్నా సాటిలేని, తనను మించిన వాడు లేని గొప్పతనాన్ని కలిగి ఉండడము. అది కూడా అచిత్ పదార్థమైన ప్రసిద్ధ ఆకాశానికి ఒప్పదు.

జగత్కారణముగా చెప్పబడినదానిలోని విశేషాన్ని ప్రత్యేకతను తెల్సుకోదల్చు కున్నప్పుడు ఆకాశశబ్దముతో విశేషాన్ని తెలిపినందున తక్కినదంతా దానికి తగినట్లుగానే వర్ణించాలి అని మీరే మాట అన్నారో అది యుక్తమైన మాటకాదు. **సర్వాణి హ వా ఇమాని భూతాన్యాకాశాదేవ సముత్పద్యన్తే.** ప్రసిద్ధి కలిగియున్నట్లుగా నిర్దేశించబడుటకు ఇతర ప్రమాణాలలో దేనితోనైనా సమర్థింపబడుట అవసరమవుతుంది. ప్రమాణాన్తరాలు ఏవంటే **సదేవ సోమ్యేద మగ్ర ఆసీత్** ఇత్యాదులైన వాక్యాలే. అవి అన్నికూడా ఇంతకుమునుపు చెప్పినతీరుగనే బ్రహ్మను ప్రతిపాదిస్తున్నవి. కనుక వాటి చేత ప్రతిపాదింపబడిన బ్రహ్మ ఆకాశశబ్దము చేత ప్రసిద్ధి కలవాడుగా నిర్దేశింపబడుతున్నాడు. పరబ్రహ్మ ఆకాశ శబ్దముతో చెప్పబడడానికి పూర్తి అర్హత కలిగిఉన్నాడు. ఆయన అందరినీ ప్రకాశింపచేస్తాడు. కనుక ఆకాశశబ్దాభిధేయుడు. అట్లాగే ఆకాశతే – తనకు తాను ప్రకాశించుతున్నాడు. **స్వస్మై ప్రకాశతే** ఆకాశయతి.. తనకొరకు ఇతరుడిని ప్రకాశింపచేస్తాడు. **అన్యంప్రకాశయతిస్వాత్మనే** అనిన్నీ.

ఇంతేకాకుండా ఈ ఆకాశ శబ్దము విశేషాన్ని తెలుపగల సామర్థ్యాన్ని కల్గిఉన్నప్పటికీ చేతనాంశాన్ని గురించి కారణభావాన్ని ఊహచేయడానికిన్నీ వీలులేని అచేతన విశేషాన్ని చెపుతున్నట్లయితే **తదైక్షత బహుస్యాంప్రజాయేయ 2) సోఽకామయత బహుస్యామ్ ప్రజాయేయ** మొదలైన వాక్యవిశేషాలను బట్టి నిర్ధారించబడిన సార్వజ్ఞ్యత్వము, సత్యసంకల్పత్వము మొదలైన విశిష్టములు, అపూర్వార్థ ప్రతిపాదనము చేసే సామర్థ్యమున్న వాక్యాలను మరొకవిధంగా మార్చి చెప్పడము ప్రామాణ్యతను పొందలేదు.

**అపూర్వార్థప్రతిపాదనము అనగా ఇంతకుముందు చెప్పబడని కొత్త అర్థాన్ని తెలుపడము.** ఈ విధంగా అపూర్వము, అనన్తములు ఐన విశేషణాలతో కూడియున్న ఒక కొత్త అర్థాన్ని/వస్తువును ప్రతిపాదించగల సామర్థ్యమున్న అనేక వాక్యాలయొక్క గతిసామాన్యమును/సమానమైన ప్రవృత్తిని కల్గిఉండడాన్ని ఒక్క అనువాదముతో పోలిక ఉన్న వాక్యాన్నిబట్టి అనేకవాక్యాలను యథార్థస్థితిని వదిలిపెట్టి మరోవిధంగా/ వ్యతిరేకంగా మలిచిచెప్పడం కుదరదు. అనువాదము=**మునుపు ఒకచోట చెప్పిన విషయాన్ని మళ్ళీ ఈ ప్రకరణములోనూ ఎత్తిచెప్పడము.** అపూర్వము=**మునుపు ఎక్కడా చెప్పకుండా ఇక్కడే తొలుతగా ప్రతిపాదించడము.**

ఆత్మ శబ్దము ఒక్కచేతనుడిని మాత్రమే చెప్పదు. మృదాత్మకోఘటః ఇత్యాదులు కనిపిస్తున్నాయి కదా అని మీరేదైతే చెప్పినారో! దాని గురించి మాట్లాడుకుందాము.

చేతనుడిని కాకుండా ఇతరమైన వస్తువు విషయములో కూడా కొన్నిచోట్ల ఆత్మశబ్దము ప్రయోగింపబడినా శరీరానికి వ్యతిరేకమైనదిగాను దానితో సమ్బన్ధాన్ని కలిగియున్నట్టిదిగాను ఆత్మ శబ్దానికి ప్రయోగము తరచుగా కనిపించుతున్నది.

కనుకనే **ఆత్మావా ఇదమేక ఏవాగ్రే ఆసీత్; ఆత్మనః ఆకాశః సంభూతః** ఇత్యాదులలో శరీరముతో ప్రతిసమ్బన్ధి ఐన చేతనుడు మాత్రమే స్ఫురించుతున్నాడు. ఎలాగైతే గోశబ్దానికి అనేకార్థాలు ఉన్నా ప్రయోగము తరచుగా గంగడోలు వంటి లక్షణాలు కల్గిన గోవ్యక్తి మాత్రమే తటాలున స్ఫురిస్తున్నది. ఇతర అర్థాలను గురించిన ప్రతీతి మాత్రము ఆయా అసాధారణ నిర్దేశాల అపేక్షను కలిగియుంటుంది. అదేవిధంగా ఆత్మ శబ్దానికిన్నీ శరీరసమ్బన్ధియైన చేతనుడిని గురించియే తోచడము జరుగుతుంది. కావుననే **సఈక్షత లోకాన్ను సృజా ఇతి, సోకాకామయత బహుస్యామ్ ప్రజాయేయ** ఇత్యాది వాక్యవిశేషాలే ఆత్మ అనే అర్థాన్నే స్థిరపరుస్తాయి. ఈ విధంగా వాక్యవిశేషాలచేత నిశ్చయింపబడిన అనన్యసాధారణమైన అనేకములైన అపూర్వ అర్థాలతో కూడియున్నవాడు చేతనాచేతనమిశ్రసమస్త జగత్తుకు ఏకకారణము ఐనవాడు **సదేవసోమ్య** ఇత్యాదివాక్యాలచేత తేల్చిచెప్పబడినవాడు ఐన బ్రహ్మ మాత్రమే ఆకాశశబ్దముచేత ప్రసిద్ధమైనవాడుగా **సర్వాణి హ వా ఇమాని భూతాని** ఇత్యాది వాక్యము ద్వారా నిర్దేశింపబడుతున్నాడు అని సిద్ధమైనది. **ఇది ఆకాశాధికరణము**

★ ★ ★

## ఇక ప్రాణాధికరణము

**సూ॥ అతఏవప్రాణః 1-1-24** ఆకాశశబ్దము చేత పరబ్రహ్మ చెప్పబడుతున్నా డనడానికి ఏకారణాలు చెప్పబడినాయో వాటి వల్లనే ప్రాణ శబ్దము చేత పిలువబడే వాడు కూడా పరమాత్మనే. ఛాందోగ్యోపనిషత్తులో ఈవిధంగా పఠింప బడుతున్నది. **ప్రస్తోతర్యాదేవతా ప్రస్తావమన్వాయత్తా.** ఓ ప్రస్తోతా! ఏదేవత ఇపుడు ప్రస్తావింపబడుతున్నది. అని ఆరంభించి **కతమా సాదేవతా ఇతి। ప్రాణ ఇతిహోవాచ, సర్వాణిహవా ఇమానిభూతాని ప్రాణమేవాభిసంవిశన్తి. ప్రాణమభ్యుజ్జిహతే। సైషాదేవతాప్రస్తావ మన్వాయత్తా। తాంచేదవిద్వాన్ ప్రాస్తోష్యః మూర్ధాతే వ్యపతిష్యత్. ఇతి** ఆదేవత ఎవరు? అని ప్రాణము అని చెప్పినాడు. ఈ భూతాలన్నీ ప్రాణమునందే ప్రవేశించుతున్నవి. ప్రాణము నుండే బయటపడ్తున్నవి. ఆ దేవతనే ఇపుడు

ప్రస్తావముతో సమ్బన్ధమును కలిగియున్నది. ఆ దేవతను గురించి తెలియక స్తోత్రము చేయకపోయినావో నీ తల తెగిపడిపోయెడిది అని.

ఈ వాక్యములో కూడా ప్రాణశబ్దము ఆకాశశబ్దము వలెనే ప్రసిద్ధ ప్రాణానికి వ్యతిరిక్తుడైన పరబ్రహ్మను గురించే బోధిస్తున్నది. ఆయనకు మాత్రమే అసాధారణమైన నిఖిలజగత్తులోని జీవజాలములో ప్రవేశించడము, వెలుపలికి రావడము మొదలైన గుర్తులను బట్టి, మరియు ప్రసిద్ధి కలదిగా నిర్దేశించడాన్ని పట్టిన్నీ.

ఇక్కడ కలుగుతున్న అధికశంక ఏమిటంటే సమస్త జీవజాలమంతా కూడా ప్రాణాధీనమైన స్థితి – జీవించుట – ప్రవృత్తి – ఆయా పనులను చేసుకోవడము – అనే వాటిని కలిగి మనుగడ సాగించుతున్నదై చాలా తేటగా కండ్లకు కనుపించుతున్నది కాబట్టి ప్రసిద్ధమైన ప్రాణమే జగత్కారణము అని అనడానికి అర్హతను కలిగి ఉన్నది అని.

పరిహారము ఏమిటంటే? బండరాళ్ళు, కట్టెలు మొద్దులు మొదలైనవాటిలో అతిసూక్ష్మస్థితిలో చైతన్యము ఉన్నప్పటికీ ఊపిరి తీసుకోవడము, వదలడము అనెడిది లేదు కాబట్టి **సర్వాణి హ వా ఇమాని భూతాని ప్రాణమే వాభిసంవిశన్తి ప్రాణమభ్యు జ్జిహతే.** అని చెప్పిన విషయము పొసగకుండా పోతుంది. కనుక **"ప్రాణయతి సర్వాణిభూతాని"** సర్వభూతాలను బ్రతికించుతున్నాడు కాబట్టి పరంబ్రహ్మనే ప్రాణశబ్దము చేత పిలువబడుతున్నాడు. కనుక ప్రసిద్ధ ఆకాశ ప్రాణాదుల కంటే వేరయినట్టివాడే నిఖిల జగదేక కారణుడు అపహత పాప్మత్వము సార్వజ్ఞత సత్యసంకల్పత్వము మొదలైన అనన్తకళ్యాణ గుణగణాలు కల పరబ్రహ్మనే ఆకాశ ప్రాణశబ్దాలచేత చెప్పబడుతున్నాడు. అని నిర్ణయము చేయబడింది. **ఇది ప్రాణాధికరణము.**

★ ★ ★

## ఇక జ్యోతిరధికరణము

ఇక్కడ నుండి జగత్కారణము అని చెప్పడానికి తగిన ఏదో ఒక ఉత్కృష్టమైన గుణముతో కూడియున్న జ్యోతి ఇంద్రాది శబ్దాలతోను, అర్థాన్తరములందు – పరమాత్మకాకుండా ఇతరవ్యక్తులను గురించి తెలిపేవాటితో – ప్రసిద్ధి కలిగి

ఉన్నవానితోనూ చెప్పబడేవాడు కూడా పరంబ్రహ్మనే అని జ్యోతిశ్చరణాభిధానాత్ మొదలగు సూత్రాదుల ద్వారా నిర్ధారణ చేస్తున్నారు.

సూ॥ **జ్యోతిశ్చరణాభిధానాత్ 1-1-25** జ్యోతిశ్శబ్దవాచ్యుడు పరమాత్మనే. చరణములను గురించి చెప్పినందువల్ల. ఛాందోగ్యమునందిట్లాగా పఠిస్తున్నారు. **అథయదతః పరోదివో జ్యోతిర్దీప్యతే విశ్వతః పృష్ఠేషు సర్వతః పృష్ఠేషు అనుత్తమేషూత్తమేషు లోకేషు, ఇదంవావతత్ యదిదమస్మిన్ అన్తః పురుషే జ్యోతిః** ఇక ఈ ఆకాశానికి పైన – స్వర్గాదులకంటే ఆవల ఏదైతే జ్యోతి వెలుగుతున్నదో – ఈ విశ్వానికి ఆవల, పై భాగంలో అన్నింటికీ పైపైన తమకంటే గొప్పవిలేనట్టి ఉత్తమోత్తమ లోకాలకున్నూ పైపైన వెలుగుతున్న ఏ జ్యోతి ఉన్నదో అదే ఇది. ఏదైతే ఈ జీవుడి యొక్క హృదయాకాశంలో ఉజ్వలంగా వెలుగుతూ ఉన్నదో. దీనిపైన సంశయము కలుగుతున్నది. ఏమని? ఈ జ్యోతి శబ్దము చేత చెప్పబడుతున్న సాటిలేని కాంతిమన్తమైన వస్తువు ఏది ఉన్నదో అది ప్రసిద్ధి వహించి అందరికీ కనపడుతూ ఉన్న ఆదిత్యుడు మొదలైన పేర్లు గల కారణమైన బ్రహ్మనా? లేక సమస్త చిద చిద్వస్తువులకంటే విసజాతీయుడైన పరమకారణము ఐనట్టివాడు మిక్కిలి ప్రకాశము కలవాడు సర్వజ్ఞుడు సత్యసంకల్పుడు పురుషోత్తముడా? అని. ఏది తగినది అని అంటే లోకప్రసిద్ధి గల జ్యోతియే. ఎందుకంటే ప్రసిద్ధి కలదానినిగా నిర్దేశించడము ఉన్నప్పటికీ ఆకాశము ప్రాణము మొదలైన వాటివలె తనను గురించి తెలిపే వాక్యమునందు గ్రహింపబడిన పరమాత్మతో సమ్బన్ధాన్ని సూచించే లింగవిశేషము కనిపించుటలేదు. మరియు పరమ పురుషప్రత్యభిజ్ఞానము లేదు కాబట్టినీ. పైగా కడుపులోనుండే జ్యోతిస్సుతో (కుక్షి=కడుపు–పొట్ట. దానికి సంబన్ధించినది కౌక్షేయము) సామానాధికరణ్యము/ ఐక్యోపదేశము చేసినందువల్లనున్నూ ప్రసిద్ధ జ్యోతియే కారణత్వము కూడిన నిరతిశయమైన దీప్తి యోగమున్నందుననూ జగత్కారణమైన బ్రహ్మ అని.

ఈ విధంగా పూర్వపక్షి తన అభిప్రాయాన్ని వెల్లడించగా సిద్ధాన్తి సమాధానాన్ని చెప్పుతున్నాడు. జ్యోతిశ్చరణాభిధానాత్ అని. ద్యులోకముతో సమ్బన్ధ మున్నట్టిదిగా నిర్దేశింపబడిన నిరతిశయ దీప్తియుక్తమైన జ్యోతిస్సుపరమపురుషుడే. **పాదోఽస్య సర్వాభూతాని త్రిపాదస్యామృతందివి.** ఈ కనిపించే విశ్వమందలి భూతాలన్నీ ఆ పరమ పురుషుడికి ఉన్న ఐశ్వర్యములో ఒక్క పాదము మాత్రమే. తక్కిన మూడు పాదాలూ పరమాకాశము నందు ఉన్నవి అని ఇతనికేద్యులోకముతో సమ్బన్ధమున్నవానికే

చరణముగా ఒక భాగముగా చెప్పబడుతున్నదికదా! ఇచ్చట చెప్పబడ్తున్న విషయము ఇది.

ఒకవేళ **అథయదతః పరోదివో జ్యోతిః** అనే వాక్యము నందు పరమపురుషుడికి మాత్రమే సంబన్ధించిన అసాధారణ చిహ్నము లభించకపోయినా దీనికి ముందున్న వాక్యము నందు పరమ పురుషుడినిద్యుసమ్బన్ధము కలవాడినిగా చెప్పినందున ఈద్యులోక సమ్బన్ధము కల జ్యోతి ఆయనయే అని ప్రత్యభిజ్ఞ (గుర్తుపట్టడము) కల్గుతున్నది. కౌక్షేయజ్యోతిస్సుతో ఐక్యోపదేశము కూడా ఉపాసన చేసేవాడికి ఫలము కొరకు తదాత్మకత్వము అని అనుసన్ధానము చేసుకొమ్మని విధించబడుతున్నది. కావున ఆ మహాజ్యోతికి పొట్టలోని సూక్ష్మజ్యోతికి ఐక్యత దోషము కాదా! అని భావించవద్దు. కౌక్షేయజ్యోతిస్సుకు ఆ పరంజ్యోతితో తాదాత్మ్యమును గురించి భగవన్తుడగు శ్రీకృష్ణుడు స్వయముగానే చెప్పి ఉన్నాడు. అహంవైశ్వానరోభూత్వాప్రాణినాందేహమాస్థితః నేను వైశ్వానరుడిగా అయ్యి ప్రాణులయొక్క శరీరాలలో ఉన్నాను అని.

సూ॥ **ఛన్దోఽభిధానాన్న ఇతిచేన్నతథా చేతోఽర్పణనిగమాత్ తథాహిదర్శనమ్ 1–1–26** ఛందస్సును గురించి చెప్పినారు కనుక పరమాత్మకాదనరాదు. మనస్సును నిలుపడానికి పోల్చి చెప్పినారు. అంతే. అట్లాగే కనిపిస్తున్నది. ఈ ఉపనిషత్తులో ప్రస్తుత వాక్యానికి ముందు **గాయత్రీవా ఇదం సర్వమ్** ఇదంతా గాయత్రియే అని గాయత్రీ అను పేరుగల ఛందస్సును పేర్కొని **తదేతద్ ఋచాఽభ్యనూక్తమ్** ఆ విషయమే ఒక ఋక్కుతో వివరించబడింది/అనువదింపబడింది. అని ఉదాహరింపబడిన **తావానస్యమహిమా** ఇతనియొక్క మహిమ అంతటిది అని ఈ ఋక్కు కూడా ఛందో విషయమైనందున ఇచ్చట పరమపురుషుని గురించి చెప్పబడలేదు అని అనేట్లయితే అది తప్పు. ఆ విధంగా మనస్సును దానిపై నిలుపు అని చెప్పటమే అక్కడ ప్రధానోద్దేశ్యము. గాయత్రీ శబ్దముతో కేవలము ఛందస్సును గురించి చెప్పదలచలేదు. కేవల ఛందస్సు నందు సర్వాత్మకత్వదృష్టి పొసగదు కదా! ఇక్కడ బ్రహ్మయందే గాయత్రిగా భావన చేసి మనస్సును నిల్పుకో అని ఉపదేశింపబడుతున్నది. బ్రహ్మ యందు గాయత్రీ సాదృశ్యానుసన్ధానము ఫలాన్ని సంపాదించుకొనడానికి ఉపదేశించబడుతున్నదని అర్థము. అట్లా జరుగడానికి అవకాశము ఉన్నది. **పాదోఽస్యసర్వాభూతాని త్రిపాదస్యామృతం దివి.** అని నాలుగు పాదాలు కల బ్రహ్మతో గాయత్రికి సాదృశ్యము ఒప్పుతుంది. నాలుగు పాదాలున్న గాయత్రీ చందస్సు వేదములో కొన్నికొన్ని చోట్లలో కనిపిస్తున్నది.

ఎలాగంటే. **ఇంద్రశ్శచీపతిః। బలేనపీడితః। దుశ్చ్యవనోవృషా। సమిత్సుసాసహిః** ఇంద్రుడు శచీదేవి మగడు బలుడనే రాక్షసుడిచేత బాధింపబడినాడు. ధర్మాత్ముడైన ఆయన తన స్థానాన్నుంచి సులువుగా విడదీయబడేవాడు కాడు. యుద్ధాలలో ఆరితేరినట్టివాడు. అట్లాగే మరొకచోట కూడా సాదృశ్యము (ద్వారా) ఉన్నందువలన ఛందస్సును గురించి తెలిపేపదము మరొకదానియందున్నూ ప్రయోగింపబడి కనపడుతున్నది. ఎట్లాగు అంటే? సంవర్గవిద్యయందు. **తేవా ఏతే పంచాన్యేపంచాన్యే దశసంపద్యన్తే** అలాంటివిఐన ఒక ఐదు మరొక ఐదు కలసి పది అవుతున్నాయి అని ఆరంభించి **సైషా విరాడన్నాత్** ఆ ఇది అన్నము కంటే విరాట్ ఐనట్టిది అని చెప్పబడుతున్నది.

1) పంచఅన్యే – **వాయువు, అగ్ని, సూర్యుడు, చంద్రుడు, నీరు (ఐదు)**

2) పంచ అన్యే – **ప్రాణ వాక్ చక్షువు (శోత్రము మనస్సు(05) ఇవి మొత్తము కలిపి విరాట్ అనబడుతున్నవి.**

3) అన్నాత్=తాను **తినబడుతుంది. తిరిగి వారిని తాను తింటుంది కనుక అన్నము** మరియు అన్న + అత్ఉఅన్నాత్.

ఇక ఈ చెప్పబోయే కారణాన్ని బట్టి కూడా గాయత్రీ శబ్దము చేత బ్రహ్మనే చెప్పబడుతున్నాడు.

సూ॥ **భూతాది పాదవ్యపదేశోపపత్తేశ్చఏవమ్ 1–1–27** 1) భూతములు 2) పృథివీ 3) శరీరము 4) హృదయాలను నిర్దేశించి **సైషా చతుష్పదా** అలాంటి ఇది నాలుగు పాదాలు కలది అనే వ్యపదేశము గాయత్రీ శబ్దాభిధేయుడైన బ్రహ్మయందే పొసగుతుంది.

సూ॥ **ఉపదేశభేదాన్నేతి చేన్నోభయస్మిన్నప్యవిరోధాత్ 1–1–28** పూర్వవాక్యము నందు **త్రిపాదస్యామృతందివి.** ఇతని యొక్క త్రిపాద్విభూతి ద్యులోకమునందున్నది. అది అమృతము నశించేది కాదు. ద్యులోకానికి అధికరణము/ఆధారముగా నిర్దేశించబడింది కనుక ఇక్కడ కూడా "**దివఃపరః**" అని అవధిగా నిర్దేశము చేసినందున ఉపదేశము భిన్నభిన్నరూపాలుగా ఉన్నది కనుక పూర్వవాక్యము నందు చెప్పబడిన బ్రహ్మ పరవాక్యమునందు గుర్తుపట్టబడుటలేదుకదా అని అన్నట్లయితే అది సరికాదు. రెండుచోట్లా చేయబడిన ఉపదేశములందున్నూ అర్థమైన బ్రహ్మయొక్క స్వభావము

ఒక్కటిగానున్నది కనుక వాడే వీడు అనే ప్రత్యభిజ్ఞకు వైరుధ్యము లేదు. ఎట్లాగంటే **వృక్షాగ్రేశ్యేనః** చెట్టుయొక్క చివరల్లో గద్ద. **వృక్షాగ్రాత్ పరతః శ్యేనః** వృక్షాగ్రమునకు ఆవల శ్యేనః అని అన్నపుడు రెండు వాక్యాలలో చెప్పబడిన అర్థానికి భేదం లేదు కనుక ఎట్లా చెప్పినా ఆ వస్తువే చెప్పబడుతున్నది అని గుర్తించినట్లే ఇక్కడ కూడా వాక్యభేదము పూర్వాపరరూపంలో ఉన్నప్పటికీ చెప్పబడిన బ్రహ్మ ఒక్కడే. వేరువేరు వ్యక్తులు కారు. **ఏతావానస్య మహిమా। అతోజ్యాయాగ్ంశ్చపురుషః పాదోఽస్యవిశ్వాభూతాని త్రిపాదస్యామృతందివి.** అని ప్రతిపాదింపబడిన నాలుగు పాదాలు గల పరమపురుషుని యొక్క **వేదాహమేతం పురుషంమహాన్తమ్ ఆదిత్యవర్ణం తమసస్తుపారే.** తమస్సు యొక్క ఆవలివైపున ఆదిత్యుని వంటి వర్ణము గల మహాపురుషుడిని నేను ఎరుగుదును అని చెప్పబడిన ప్రకృతి సమ్బన్ధము లేని స్వరూపము గల వానికి ఉన్న తేజస్సు కూడా అప్రాకృతమేనని, అలాంటి దానిని కలిగి ఉన్నాడు కనుక అతడే జ్యోతిశ్శబ్దము చేత చెప్పదగినవాడు. **ఇది జ్యోతిరధికరణము.**

★ ★ ★

## ఇక ఇంద్రప్రాణాధికరణము

నిరతిశయదీప్తియుక్తుడు జ్యోతిశ్శబ్దము చేత వ్యవహరింపదగినవాడు ప్రసిద్ధవత్ నిర్దిష్టుడూ పరమపురుషుడేనని చెప్పబడింది. ఇక ఇప్పుడు కారణత్వముతోకూడి అమృతత్వమును – మోక్షాన్ని/ఆనందాన్ని పొందడానికి ఉపాయమైన వాడు ఉపాస్యుడుగా వినబడుతున్నవాడు ఇంద్ర ప్రాణాదిశబ్దాలచేత చెప్పబడేవాడు కూడా **పరమపురుషుడే** అని చెప్పినాడు సూత్రకారుడు.

సూ॥ **ప్రాణస్తథాఽనుగమాత్ 1-1-29** ఇంద్రప్రాణశబ్దములో పరమాత్మ ప్రాణశబ్దముతో చెప్పబడుతున్నాడు. పూర్వాపర వాక్యాలకు సమ్బన్ధము / అనుగమము ఉన్నందువల్ల

**కౌషీతకీ బ్రాహ్మణములోని ప్రతర్దన విద్యయందు ప్రతర్దనోహవై దైవోదాసిః ఇంద్రస్యప్రియం ధామోపజగామ యుద్ధేనచ పౌరుషేణచ** – దివోదాసు యొక్క కుమారుడైన ప్రతర్దనుడను పేరుగల మహారాజు ఇంద్రునికి ప్రియమైన స్వర్గలోకానికి యుద్ధాలలో సాయము చేయడానికి తన పురుష ప్రయత్నము చేతనున్నా వెళ్ళినాడు. అని మొదలుపెట్టి **వరం వృణీష్వ** నీకు ఇష్టమైన వరాన్ని కోరుకో అని పలికిన

ఇంద్రుడితో **త్వమేవమే వరం వృణీష్వయం త్వమ్ మనుష్యాయ హితతమంమన్యసే** నీవే నాకొరకు వరాన్ని ఎంపిక చెయ్యి. ఏదైతే మానవుడికి మిక్కిలి మేలును కల్గిస్తుందో! అని ప్రతర్దనుడు పలుకగా ఇంద్రుడు ఇట్లాగా మాట్లాడినాడు. **ప్రాణోఽస్మి ప్రజ్ఞాత్మా తం మామాయురమృతమ్ ఇత్యుపాస్స్వ** నేను అన్నిటినీ తెలిసిన ప్రాణస్వరూపుడనై ఉన్నాను అట్టి నన్ను ఆయువు అమృతము అని ఉపాసన చెయ్యి అని వినిపిస్తున్నది. ఇచ్చట సంశయము. ఇక్కడ హితతమమైన ఉపాసనను చేయవలసినదిగా/ఉపాస్యుడుగా ఇంద్రప్రాణ శబ్దముచేత చెప్పబడినవాడు జీవుడేనా! లేకవానికంటే మించినవాడు ఐన పరమాత్మనా? అని. ఏది తగును? అని అనగా జీవుడేనని సమాధానము. ఎందువల్ల. సాధారణంగా ఇంద్ర శబ్దానికి జీవుడేనని అర్థము, జీవులలో విశేషుడు అని ప్రసిద్ధి ఉన్నది. దానితో సామానాధికరణ్యాన్ని చెప్పినందువల్ల ప్రాణశబ్దానికి కూడా ఇంద్రునియందే బోధకత్వమున్నది. ఈ ఇంద్రుడని పేరు గల జీవుడు ప్రతర్దనుడి చేత **త్వమేవమేవరం వృణీష్వ. యం త్వమ్ మనుష్యాయ హితతమం మన్యసే** అని చెప్పబడినవాడై **మామ్ ఉపాస్స్వ** అని తన ఆత్మను ఉపాసించడము హితతమమైనదిగా ఉపదేశించినాడు. హితతమమైనది ఏది అంటే అమృతత్వాన్ని మోక్షాన్ని పొందే ఉపాయమే. జగత్‌కారణమైన వాడిని ఉపాసించడమే అమృతత్వాన్ని పొందడానికి కారణమవుతుంది. **తస్యతావదేవ చిరమ్ యావన్నవిమోక్ష్యే. అథసమ్పత్స్యే.** ఆ భగవదనుగ్రహపాత్రుడైన వాడికి అంతవరకు వేచిచూడటమే ఆలస్యము. అతను నేను ఎంతవరకు ఐతే ఈ శరీరాన్ని విడువనో అదే నాకు మోక్షప్రాప్తికి విలమ్బము. ఆ తరువాత ముక్తిని పొందుతాను అని తలుస్తుంటాడు ఎదురుచూస్తుంటాడు. అనే వాక్యము ద్వారా తెలుస్తున్నది. ఇందువల్ల ప్రసిద్ధ జీవుడైన ఇంద్రుడే కారణమైన బ్రహ్మ అని. ఈ శంకకు సమాధానము చెపుతున్నాడు. ప్రాణః తథాఽనుగమాత్ అని.

ఈ "**ఇంద్రప్రాణ**" శబ్దము చేత చెప్పబడినవాడు జీవుడు మాత్రమే కాదు. జీవుడి కంటే అర్థాన్తరమైన పరంబ్రహ్మయే. **సఏష ప్రాణ ఏవప్రజ్ఞాత్మా ఆనందోఽజరోఽమృతః** ఈ ప్రాణుడే ప్రజ్ఞాత్మా. ఆనందస్వరూపుడు/ ముసలితనమును లేనివాడు. మరణమున్నూ లేనివాడు అని ఇంద్ర ప్రాణశబ్దాలచేత ప్రస్తావింపబడినవాడు అజర అమృత శబ్దాలతో సామానాధికరణ్యాన్ని పూర్వోత్తరవాక్యసమ్బన్ధముతోనూ చెప్పబడినందున పరమాత్మ అనియే అర్థము చెప్పుకోవాలి. అట్లాగైతేనే సమన్వయము కుదురుతుంది. జీవుడు అజరుడు, అమృతుడు ఆనందమయుడు కాదు కదా! కనుక ఇంద్రప్రాణశబ్దము చేత చెప్పబడినవాడు పరమాత్మనే.

సూ॥ **న వక్తు రాత్మోపదేశాదితి చేదధ్యాత్మ సమ్బన్ధభూమాహ్యస్మిన్. 1-1-30**
ఇంద్రప్రాణ శబ్దనిర్దిష్టుడు **ఆనందోఽ జరోఽ మృతః** అనే వాక్యంతో ఏకార్థతను కల్గియున్నందున ఇతడు పరంబ్రహ్మనే అని ఏదైతే మాట్లాడినారో ఆ మాట సరియైనదికాదు. **మామేవ విజానీహి.** నేనేనని తెల్సుకో. **ప్రాణోఽస్మిప్రజ్ఞాత్మాతం మామాయురమృతమిత్యుపాస్స్వ.** అని చెపుతున్నవాడు ఇంద్రుడేకదా! **త్రి శీర్షాణం త్వాష్ట్రమహనమ్.** త్వష్టా అనువాని కుమారుడైన త్రిశీర్షుడిని చంపినాను ఇట్లాంటి త్వాష్ట్రవధ మున్నగు వానివలన అందరికీ ఎరుకపడిన జీవభావముగల తననే ఉపాస్యుడినిగా ప్రతర్దనుడికి ఉపదేశిస్తున్నాడు. కనుక ఉపక్రమంలో జీవవిశేషుడు అని అర్థము చేసుకున్నపిదప **ఆనందోఽజరోఽమృతః** ఇత్యాదులతో ఉపసంహారాన్ని కూడా దానికి అనుగుణంగానే మలిచి చెప్పాలిసుమా! అని అన్నట్లయితే దానికి పరిహారము ఈ విధంగా ఉన్నది.

ఆత్మ యందు ఏ సంబన్ధము ఉన్నదో అని అధ్యాత్మ సమ్బన్ధము తస్యభూమాఽ దానియొక్క భూమా, భూయస్త్వము, బహుత్వము అని అర్థము. ఆత్మ యందు అధేయములుగా సంబంధమును గలవి అధికముగా ఉన్నవి కనుక సంబన్ధబహుత్వము అని అన్నారు. అది ఈ వక్త పరమాత్మయందే (అధికంగా) ఉన్నది. **తద్యథా రథస్యారేషు నేమి రర్పితా. నాభావరాఅర్పితాః ఏవమేవైతా భూతమాత్రాః ప్రజ్ఞామాత్రాస్వర్పితాః ప్రజ్ఞామాత్రాః ప్రాణేఽర్పితాః సఏష ప్రాణఏవ ప్రజ్ఞాత్మాఽ నందోఽజరోఽమృతః** అదెలాగా అంటే రథము యొక్క అరలు/ఆకులు/లందు నేమి అర్పించబడింది. అవి నాభి యందు పెట్టబడినవి. ఇదే తీరుగా ఈ భూతమాత్రలు ప్రజ్ఞామాత్రలందు ఉంచబడినవి. ప్రజ్ఞామాత్రలు ప్రాణము నందు ఉంచబడినవి. ఆధారపడి ఉన్నవి. ఈ ప్రాణమే మిక్కిలి జ్ఞానము కలవాడు ఆనందస్వరూపుడు ముసలితనము (తరుగుదల) లేనివాడు అమృతుడు. ఇక్కడ ఒక బండి చక్రాన్ని ఉదాహరణగా చూపిస్తున్నారు. చక్రంతో ముందుగా పైన లోన అరలను అన్నింటినీ కలిపి ఉంచేనేమి అనబడేది ఉంటుంది. ఈ నేమికి అరలు ఆధారము. వాటికి బొడ్డు కుండ ఆధారము. అట్లాగే మనిషి ఇంద్రియాలు/భూతమాత్రాలు, ప్రజ్ఞామాత్రలు ప్రాణముపైన ఆధారపడి ఉంటవి. ఇవి అన్నీ కలసి ఉంటేనే జీవుడు/మనిషి. ఇతడు కూడా అన్తరాత్మ పైన ఆధారపడి ఉంటాడు. ఈ విధంగా పరమాత్మ అందరికీ ఆధారమై ఉంటున్నాడు.

ఇందులో భూతమాత్ర శబ్దంతో అచేతన వస్తువులను చెప్పినారు. ప్రజ్ఞామాత్ర శబ్దంతో వాటికి ఆధారంగా చేతన వర్గాన్ని చెప్పి దానికి కూడా ఆధారంగా ప్రకృత ఇంద్రప్రాణశబ్దముతో పిలువబడుతున్నవాడిని నిర్దేశించి అతడినే **ఆనందోఽజరోఽమృతః** అని ఉపదేశిస్తున్నాడు. అందువల్ల ఈ చేతనాచేతనాత్మకమైన సమస్త వస్తువులకన్నింటికీ ఆధారమై ఉండడము అనేది ఈ పరమాత్మ యందు మాత్రమే పొసగుతుంది అని అర్థము. లేదా

అధ్యాత్మ సమ్బన్ధభూమా హ్యస్మిన్ – పరమాత్మయొక్క అసాధారణ ధర్మసంబంధము ఏది ఉన్నదో అదే అధ్యాత్మక సమ్బన్ధము. దానియొక్క భూమా బహుత్వము ఈ ప్రకరణము నందు ఉన్నది. అది ఎట్లాగా అంటే మొదటగా **త్వమేవమే వరం వృణీష్వ యం త్వమ్ మనుష్యాయ హితతమం మన్యసే.** అని **మాముపాస్స్వ** అని కూడా పరమాత్మకు మాత్రమే చెందిన అసాధారణ, మోక్షసాధనమైన ఉపాసనాకర్మత్వము ప్రాణశబ్దముచేత నిర్దేశింపబడిన ఇంద్రుడికి ఉన్నదని తోస్తున్నది. అట్లాగే **ఏషఏవ సాధుకర్మ కారయతితమ్, యమేభ్యోలోకేభ్య ఉన్నినీషతి। ఏషఏవా సాధుకర్మకారయతితమ్, యమధోనినీషతి.** ఈ అన్తరాత్మనే అతడితో మంచిపనులను చేయించుతాడు. ఎవడినైతే ఈ లోకాలన్నింటినుండీ మరింతపైలోకానికి/ పరమపదానికి తీసుకొని పోదల్చుకున్నాడో. ఈయనే వాడితో పాడు పనులను చేయించుతున్నాడు. ఎవడినైతే మరింత దిగువలోకాలకు దిగజార్చదల్చుకున్నాడో అని చెప్పినట్లు అన్ని పనులను అవి మంచివైనా చెడ్డవైనా, "**కారయితృత్వము**"/ **చేయించడమున్నూ పరమాత్మయొక్క ధర్మమే.** అట్లాగే **తద్యథారథస్యారేషు నేమిరర్పితా నాభావరా అర్పితాః. ఏవమేవైతాః భూతమాత్రాః ప్రజ్ఞామాత్రా స్వర్పితాః ప్రజ్ఞామాత్రాః ప్రాణేఽర్పితాః** అని వివరించినట్లు సర్వాధారత్వమున్నూ ఆ పరమాత్మయొక్క ధర్మమే. **ఏషలోకాధిపతిః ఏషసర్వే శః** ఈయన లోకాలన్నింటికీ స్వామి. యజమాని. స్వంతదారు సర్వమునూ నియమించగలట్టివాడు అని పరమాత్మయందే స్వామిత్వము సంభవిస్తుంది. జీవుడిలో స్వామిత్వము సంభవించదు.

అందువల్ల ఆధ్యాత్మ సమ్బన్ధభూమత్వము ఈ ఇంద్రుడిలో ఉన్నది కాబట్టి పరమాత్మనే ఇంద్రప్రాణశబ్దము చేత చెప్పబడినాడు. అయితే ప్రఖ్యాత జీవభావము కల ఇంద్రుడు తనకు ఆత్మయైన వాడిని ఉపాసించుమని ఉపదేశించుట ఏవిధంగా కుదురుతుంది? అనే సందేహానికి సమాధానమును చెప్పుతున్నాడు –

సూ॥ **శాస్త్రదృష్ట్యాతూపదేశః వామదేవవత్ 1-1-31** శాస్త్రముప్రకారము ఇంద్రుడు ఉపదేశించినాడు. వామదేవుని వలెనే. జీవుడుగా అందరికీ తెలిసిన ఇంద్రుడు **మామేవ విజానీహి** నన్నే తెల్సుకో **మాము పాస్వ** నన్ను ఉపాసించు అని ఉపాస్యుడైన బ్రహ్మను తనకు ఆత్మగా ఉపదేశించడము ఇతర ప్రమాణాల చేత తనను, తనకు ఆత్మయైన వాడిని తెల్సుకుని చేసిన ఉపదేశించినది కాదు. కానీ శాస్త్రము ద్వారా తనకు ఆత్మగా తెల్సుకొని చేసినట్టిది. ఇదీ ఇచ్చట చెప్పబడిన విషయము. **అనేన జీవేన ఆత్మనా అనుప్రవిశ్యనామ రూపే వ్యాకరవాణి.** ఈ శరీరానికి నిర్వాహకుడుగానున్న ఆత్మతో పాటు అతని వెంట శరీరములో ప్రవేశించి, ఆ శరీర+ ఆత్మలకు రెండింటికీ నామరూపాలను కల్గిస్తాను. శరీరానికి జీవుడు ఆత్మ అయ్యి దానిలో ప్రవేశిస్తున్నట్లే పరమాత్మ తనకు శరీరముగా ప్రకృతి జీవులను – కల్సియున్నవాటిని – చేసుకొని జీవుడిని ముందుగా శరీరములో ప్రవేశపెట్టి వాడికి ఆత్మగా వాని ద్వారా ప్రవేశిస్తున్నాడు. అతని ప్రవేశము వల్ల ఆ రెండింటికి నామరూపాలు ఏర్పడుతున్నవి. **ఐత దాత్మ్యమిదం సర్వమ్** ఈ సమస్త ప్రపంచము ఈ పరమపురుషుడినే ఆత్మగా కలిగియున్నది. **అన్తః ప్రవిష్టః శాస్తాజనానాం సర్వాత్మా. 2) యఆత్మని తిష్ఠన్ ఆత్మనోఽన్తరో యం ఆత్మా న వేద. యస్యాత్మా శరీరం యఆత్మానమన్తరోయమయతి. 3) ఏష సర్వభూతాన్తరాత్మా అపహతపాప్మాదివ్యోదేవ ఏకోనారాయణః** ఇలాంటిది ఐన శాస్త్రము జీవాత్మను తనకు శరీరముగా గల్గిన పరమాత్మను గమనించి, జీవాత్మను తెలిపే పదాలు ఐన అహం, త్వమ్ మొదలైన శబ్దాలు కూడా పరమాత్మ దాకా పర్యవసిస్తున్నాయని తెల్సుకొని **మామేవ విజానీహి, మాముపాస్స్వ** అని తన ఆత్మను శరీరముగా కల్గిన పరమాత్మనే ఉపాస్యుడుగా ఉపదేశించినాడు. వామదేవవత్ – ఎట్లాగైతే వామదేవుడు పరబ్రహ్మకు సర్వాన్తరాత్మత్వము, సర్వమూ తనకు శరీరముగా కల్గియుండడము, శరీరాన్ని చెప్పే శబ్దాలు శరీరియందు ముగిసిపోవడం (పర్యవసానము) ను తెల్సుకొని **అహమ్** అని స్వాత్మను శరీరముగా కల్గిన పరబ్రహ్మను నిర్దేశించి, ఆయనతో సామానాధికరణ్యమున్నందున మను సూర్యాదలనున్నూ అహమ్ అనియే వ్యపదేశిస్తున్నాడు. **తద్ధైతత్ పశ్యన్ ఋషిర్వామదేవః ప్రతిపేదే అహం మనురభవమ్ సూర్యశ్చ** తనతో పరమాత్మకున్న సామానాధికరణ్యాన్ని ప్రత్యక్షంగా గమనించిన వామదేవుడు అనబడే ఋషి నేను సూర్యుడిని, నేను మనువును అయినాను అని తద్భావాన్ని పొందినాడు. **అహం కక్షీవాన్ ఋషిరస్మివిప్రః** నేను కక్షీవాన్ అను పేరుగల విప్రర్షినిఐనాను. ఇత్యాదులు ఇందుకు ఉదాహరణలు. ప్రహ్లాదుడు కూడా

**సర్వగత్వాదనన్తస్య సఏవాహమవస్థితః। మత్తస్సర్వమ్ అహం సర్వమ్ మయిసర్వమ్ సనాతనే॥** అనన్తుడు అన్నింటిలోనూ నిండియున్నాడు కనుక అతడే నేను ఐ ఉన్నాను. కనుక నానుండే ఈ సర్వప్రపంచము పుట్టింది. ఈ అంతానేనే. నాకంటే వేరుగాలేదు. సనాతనుడైన నాయందు అంతా ఉన్నది. ఇత్యాది వాక్యాలను ప్రహ్లాదుడు కూడా చెప్పినాడు.

ఈ ప్రకరణములో జీవుడిని తెలిపే శబ్దాలు, అచిద్వాచియైన శబ్దాలు రెండింటితోనూ పరబ్రహ్మను చెప్పడానికి గల కారణాన్ని ఒక ప్రశ్న పూర్వకముగా చెప్పుతున్నాడు.

సూ॥ **జీవముఖ్యప్రాణలింగాన్నేతిచేన్నోపాసాత్రైవిధ్యాదిహతద్యోగాత్. 1-1-32**

**నవాచం విజిజ్ఞాసీత. వక్తారంవిద్యాత్.** వాక్కును మాటను గురించి తెల్సుకోవడానికి ప్రయత్నించవద్దు. వక్తను తెల్సుకోవాలి. **త్రిశీర్షాణం త్వాష్ట్రమహనమ్. అరున్ముఖాన్ యతీన్ సాలావృకేభ్యః ప్రాయచ్ఛమ్** మూడు తలలున్న త్వాష్ట్రుడిని చంపినాను. అరున్ముఖులనే కపటయతులను తోడేళ్ళకు ఆహారముగా ఇచ్చినాను. ఇత్యాదులైన జీవులగుర్తులను బట్టి. **యావద్ధ్యస్మిన్ శరీరే ప్రాణోవసతి తావదాయుః.** ఈ శరీరము నందు ఎంతవరకు ప్రాణము (ప్రాణుడు) ఉండగలదో అంతవరకే ఆయుస్సు **అథఖలు ప్రాణఏవ ప్రజ్ఞాత్మా ఇదం శరీరం పరిగృహ్య ఉత్థాపయతి. అటుపిమ్మట గదా ప్రజ్ఞాత్మ ఐన ప్రాణమే ఈ శరీరాన్ని గట్టిగా పట్టుకొనిపైకిలేవనెత్తుతున్నాడు.** అని పంచవృత్తిప్రాణవాయువుకు చెందిన గుర్తును పట్టికూడ అధ్యాత్మసమ్బన్ధభూమయైనవాడు పరమాత్మకాడు అని అనేటట్టయితే అది సరికాదు. ఉపాసన చేసే పద్ధతి మూడు విధాలుగా ఉంటున్న కారణాన నీవన్నది తప్పు. ఉపాసనాత్రైవిధ్యాన్ని ఉపదేశించడము కోసము ఆయా శబ్దాలతో చెప్పడం జరిగింది. 1) నిఖిల జగత్తుకు కారణభూతుడైన బ్రహ్మను ఆయనదైన స్వరూపంతో అనుసన్ధానం చేయడము 2) భోక్తృవర్గము (జీవులు) యొక్క శరీరములోనున్నటువంటి వాడినిగా ఉపాసించడం 3) భోగ్యభోగోపకరణ శరీరకత్వానుసన్ధానము, భోగ్యము అచిత్తు భోగోపకరణములు ఇంద్రియాలు. మనోబ్రహ్మ, ప్రాణోబ్రహ్మ, అనగా వనుస్సును ప్రాణాన్నిబ్రహ్మ దృష్టితో ఉపాసనచేయడము. ఈ రెండింటిని శరీరమునుగా గలవాడినిగా ఉపాసించడము అనే ఉపాసనాత్రైవిధ్యాన్ని ఉపదేశించడము కొరకు అని అర్థము. ఈ మూడు రకాలైన బ్రహ్మను సన్ధానము వేరే ప్రకరణాలలోనూ

ఆశ్రయింపబడింది. **సత్యమ్ జ్ఞానమనన్తం బ్రహ్మ 2) ఆనందో బ్రహ్మ** ఇత్యాదుల యందు పరమాత్మయొక్క స్వరూపానుసన్ధానము. **తత్సృష్ట్వాతదేవానుప్రావిశత్. తదనుప్రవిశ్యసచ్చత్యచ్చాభవత్. నిరుక్తం చానిరుక్తంచ. నిలయనం చానిలయనంచ. విజ్ఞానం చావిజ్ఞానంచ. సత్యంచానృతం చసత్యమభవత్.** ఇత్యాదుల యందు భోక్తృశరీరతతో, భోగ్యభోగోపకరణ శరీరమును కలవాడిగానూ అనుసన్ధానము కనబడుతున్నది. ప్రస్తుతప్రకరణము ప్రతర్దన విద్యలో కూడా ఆ మూడురకాలైన అనుసన్ధానము చక్కగా కుదురుతుంది అని అర్థము.

ఇదీ చెప్పబడుతున్న విషయము. ఎక్కడనైతే హిరణ్యగర్భుడు మొదలైన జీవవిశేషాలలో, ప్రకృతి మొదలైన అచేతన విశేషాలలోనూ పరమాత్మనే ఉండే అసాధారణ ధర్మముతో కూడిక ఉంటుందో, వాటిని తెలిపే శబ్దాలకు పరమాత్మవాచి శబ్దాలతో సామానాధికరణ్యముగాని కనపడుతుందో, అక్కడ పరమాత్మకు ఆయా చిదచిద్విశేషాలకు అన్తరాత్మత్వానుసన్ధానము ప్రతిపాదించదల్చబడింది. కనుక ఇక్కడ ఇంద్రప్రాణశబ్దముతో నిర్దేశింపబడినవాడు జీవుడికంటే మరొక్క వేరువస్తువు ఐనట్టి పరమాత్మయేనని నిశ్చితమైనది. **అని ఇంద్రప్రాణాధికరణము.**

**ఇంతటితో శ్రీభాష్యమునందు ప్రథమాధ్యాయములోని**
ప్రథమపాదము ముగిసినది.

శ్రీమతే రామానుజాయనమః

## శ్రీభాష్యము – ప్రథమాధ్యాయము – ద్వితీయపాదము

ప్రథమపాదము నందు వేదాధ్యయనమును చేసిన పురుషుడు కర్మమీమాంసను ఆచార్యముఖతః విని తద్ద్వారా కర్మలయొక్క యథార్థస్వరూపాన్ని తెల్సుకొని కేవలకర్మలు అల్పములు అస్థిరములుగా ఐన ఫలితాలనే ప్రసాదిస్తవి అని తెల్సుకుంటాడు. వేదాన్తములు అనబడు ఉపనిషత్ వాక్యములందు అనన్తమైన స్థిరమైన ఫలాన్ని ప్రసాదించే బ్రహ్మ స్వరూపాన్ని, ఆయనను ఉపాసించే పద్ధతినిన్నీ ఆ పాతప్రతీతి – చూచాయగా – ద్వారా తెలుసుకుంటాడు. ఆకారణంగా పరమపురుషార్థము ఐన మోక్షాన్ని సంపాదించుకోవాలి అనే ఆశగల వాడై తాను చదివిన వేదాన్త వాక్యాలయొక్క

అర్థాన్ని తేటగా తెల్సుకోవడానికి పూనుకొంటాడు. ఇతర ప్రమాణములు ఏవీ పరమాత్మను గురించి తెల్పజాలవు. వేదము అనబడే శాస్త్రము ఒక్కటి మాత్రమే ఇందుకు చాలినది. అంతేకాక ఉపనిషత్ శబ్దాలు సిద్ధవస్తువైన పరమాత్మను తెల్పుటకు తగిన బోధనాశక్తిని కలవి అని నిర్ధారణ చేసుకొని వేదాన్త వాక్యాలు పరబ్రహ్మ యందు ప్రామాణ్యభావాన్ని కలవని గట్టిగా నమ్మి, దానికి తగినట్లు ఇతికర్తవ్యతారూపమైన శారీరక మీమాంసా శ్రవణాన్ని చేయాలని చెప్పినారు ఆవిధంగా శాస్త్రారంభము సిద్ధించింది.

అందులో రెండవ సూత్రము చేత అనన్తము, విచిత్రము స్థిరము త్రసరూపము – తేజస్సు, నీరు, పృథివీ మూటికలయిక – లేదా సత్త్వ రజస్సు తమస్సు అనే గుణత్రయాలకలయిక – ఐన, భోక్తజీవుడు, భోగ్యము ప్రకృతి, భోగోపకరణములు ఇంద్రియాలు, శరీరాలు, భోగస్థానములు భూలోక సురలోకాదులు, మొదలైన లక్షణాలతో కూడిన చిదచిన్మిశ్రజగత్తునకు పుట్టుక, చక్కగా వికసించి అలరారుట – స్థితి, తిరిగి తనపుట్టుకకు కారణమైన దానిలోకి చేరుట, మహదానందరూపమైన పరమపురుషార్థమనబడే మోక్షాన్ని పొందుటలు అన్నిటికిన్నీ తానొక్కడే కారణముఐ ఉన్న పరబ్రహ్మను గురించి "**యతోవాఇమాని**" ఇత్యాదివాక్యము చెప్పుతున్నది అని ప్రతిపాదింపబడింది.

ఇక జగదేకకారణమైన పరబ్రహ్మను శాస్త్రము తప్ప ఇతరములైన ఏ ప్రమాణములు తెల్పజాలవని మూడవసూత్రము ద్వారా నిర్ధారింపబడింది.

ప్రవృత్తి – ఒక పనిచేయడము, నివృత్తి – మానుకోవడములతో సమ్బన్ధము లేకపోయినా పరబ్రహ్మ తనయొక్క స్వరూపము చేతనే పురుషార్థము అవుతున్నాడు గనుక పరబ్రహ్మయందు వేదాన్త వాక్యాలు సమన్వయిస్తున్నాయి కావున శాస్త్ర ప్రమాణకత్వము నిర్వహింపబడుతున్నది. ఇది నాల్గవ సూత్రతాత్పర్యము.

ఈ విధంగా ఉపోద్ఘాతరూపమైన చతుస్సూత్రీసారము శాస్త్రారంభ సమర్ధనమున్నూ చెప్పబడినాయి.

ఈ సమస్త ప్రపంచానికీ ఆయనొక్కడే కారణము. అట్టి బ్రహ్మవేదాన్త వేద్యుడు. ఆయన తన సంకల్పము మాత్రముచేతనే సృష్టి చేయగల సమర్థుడు. ఆయన పరమచేతనుడు. ఆనుమానికము ప్రధానము అనే శబ్దాలతో పిలువబడే జడపదార్థమైన

ప్రకృతి జగత్సృష్టికి కారణము కాజాలదు. కావున చేతనవిశేషమైన పరమాత్మనే జగత్ సృష్టికి కారణము.

అటువంటి ఆయన సహజంగానే అనవధికాతిశయమైన ఆనందము కలవాడు. వివిధములైన వస్తువులను గురించి వాటి బాహ్య ఆభ్యన్తర స్వరూపాలను గురించీ, అనాదిగా వస్తూ ఉన్న పుణ్యపాపరూపకర్మసంబన్ధాలను గురించీ తెలిసిన విపశ్చిత్త్వము కలవాడు. ఇంతేకాక దేవతిర్యక్ మనుష్యస్థావరాది రూపాలతోనున్న చేతనులకందరికీ భయాన్ని కలిగించగలవాడు. తన ఆజ్ఞను పాటించి ప్రవర్తించి తనను శరణుజొచ్చిన వారికి అభయాన్నీ ఇవ్వగలవాడు. సత్యసంకల్పుడు, సమస్త చేతనా చేతనములందున్నూ అన్తరాత్మగా ఉండేవాడు. బద్ధులు ముక్తులు అనే రెండు వర్గాలుగా నుండి జీవశబ్దము చేత పిలువబడేవారికంటే పూర్తిగా భిన్నుడు. ఆనందమయుడు. అట్లాంటి ఆయన పంచభూతాత్మకము కాని తనకు మాత్రమే చెందిన పంచోపనిషణ్మయమైన అసాధారణదివ్యరూపము గలవాడు.

అచేతనాలను చెప్పే ఆకాశము, ప్రాణము మున్నగు పదాలతో జగత్కారణముగా ప్రసిద్ధి గలవాడుగా నిర్దేశింపబడుతున్నవాడు సకలేతరచేతనాచేతన విలక్షణుడైన ఆ మహాపురుషుడే కాని ఆ అచేతన పదార్థ విశేషాలు కావు.

ద్యుశబ్దముతో సమ్బన్ధము ఉన్నది కాబట్టి అదే పరతత్త్వమైన వాడియొక్క అసాధారణ లక్షణము. అది నిరతిశయ దీప్తియుక్తము. ఆ గుర్తును (ప్రత్యభిజ్ఞను) బట్టి జ్యోతిశ్శబ్దము చేత చెప్పబడేవాడున్నూ ఆ పురుషోత్తముడే పరబ్రహ్మయే.

పరమకారణమై అసాధారణ అమృతత్వమును పొందడానికి హేతువైనవాడు పరమపురుషుడు. ఆయన శాస్త్ర దృష్ట్యా ఇంద్రాది శబ్దాలతో ఉపనిషద్ వాక్యాలలో అక్కడక్కడ చెప్పబడుతున్నాడు.

ఈ విధంగా ఇతరప్రమాణాలకు వేటికిన్నీ అందుబాటులో లేనివాడు శాస్త్రము చేతనే తెలియదగినవాడు సర్వజ్ఞత్వము సత్యసంకల్పత్వము మొదలైన ఉదారగుణాలకన్నింటికీ ఆవలి ఒడ్డు అనేది లేనటువంటి సాగరము వంటివాడు, తనకంటే వేరయిన సమస్త వస్తువులకన్నింటి కన్నా పూర్తి విలక్షణుడు పరబ్రహ్మ పురుషోత్తముడు నారాయణుడు మాత్రమే వేదాన్తముల వల్ల తెలియదగినవాడు అని ప్రథమాధ్యాయ మందలి ప్రథమపాదము చేత స్థాపించబడింది.

ఇక మీదట రెండవ మూడవ నాలుగవ పాదాల యందున్నూ – వేదాన్త వేద్యుడు బ్రహ్మనే అయినా కొన్నికొన్ని వేదాన్తవాక్యాలు ప్రధానములోనూ, క్షేత్రజ్ఞులలోనూ అన్తర్భూతమైన వస్తు విశేషాలనే ప్రతిపాదిస్తున్నాయి అని అనుమానపడి దాన్ని తొలగించుతూ ఆయావాక్యాల చేత పరమాత్మ – బ్రహ్మలోని కళ్యాణగుణాలను వివరించుతున్నారు. మొదటగా రెండవ పాదంలో అస్పష్ట జీవాది లింగకములు తరువాత మూడవపాదంలో స్పష్టజీవాది లింగకాలు, నాలుగవ పాదంలో ఆయావస్తువులను వర్ణించుతున్న పోలికలు గలవాటిని విచారించుతూ ఉన్నారు.

★ ★ ★

## సర్వత్ర ప్రసిద్ధ్యధికరణము

సూ॥**సర్వత్రప్రసిద్ధోపదేశాత్ 1–2–1** ఉపనిషత్తులు అన్నింటిలోనూ ప్రసిద్ధుడుగా ఉపదేశింపబడినందువల్ల. ఛాందోగ్యము నందు ఈ విధంగా పఠింపబడుతున్నది. **అథఖలుక్రతు మయః పురుషః యథాక్రతురస్మిన్ లోకే పురుషోభవతి. తథేతః ప్రేత్యభవతి. సక్రతుం కుర్వీత – మనోమయః ప్రాణ శరీరో భారూపః** మానవుడు క్రియాశీలుడై ఉంటున్నాడు కదా! ఈ లోకంలో ఎటువంటి పనులను చేస్తున్నాడో వాటికి తగినట్లుగానే ఈ శరీరాన్ని విడిచిన తరువాత పైలోకాలకు పోతున్నాడు. కనుక క్రతువును చేసి తీరాలి. మనోమయుడు ప్రాణశరీరుడు భారూపుడుగానూ ఇత్యాదిగా. ఇక్కడ "**సక్రతుంకుర్వీత**" అనుచోట ప్రతిపాదితమైన ఉపాసనకు ఆలమ్బనమైన ఉపాస్యుడు **మనోమయుడు ప్రాణశరీరుడు** అని నిర్దేశింపబడుతున్నాడని తెలుస్తున్నది. కాగా ఇక్కడ సంశయము. ఏమని? ఈ మనోమయత్వాది గుణము కలవాడు క్షేత్రజ్ఞుడా? (శరీరము ఉన్న జీవుడా?) లేక పరమాత్మనా? అని. ఏది తగినది? అనగా క్షేత్రజ్ఞుడు జీవుడేనని. ఎందువల్లనంటావా? మనస్సు ప్రాణము రెండున్నూ జీవుడికి భోగోపకరణాలుగా ఉంటున్నాయి. పరమాత్మనేమో **అప్రాణోహ్యమనాః** ప్రాణములేనివాడు మనస్సు కూడా లేనివాడు అని ఆ రెండూ లేనివాడు అని నిషేధింపబడిందికదా! **సర్వంఖల్విదం బ్రహ్మ** ఈ సమస్త ప్రపంచమూ బ్రహ్మనే కదా! అని దీనికి ముందరివాక్యముతో నిర్దేశించబడిన బ్రహ్మ ఇక్కడ ఉపాస్యుడుగా సమ్బన్ధమును కల్గియున్నాడని చెప్పకూడదు. **శాన్తఉపాసీత** శాన్తుడై ఉపాసన చేయాలి అని ఉపాసనకు ఉపకరణమైన శాన్తి నిర్వృత్తికి ఉపాయమైన బ్రహ్మాత్మకత్వ ఉపదేశము కొరకు ఆ మాట తెలుపబడింది. అట్లే **సక్రతుం కుర్వీత** అతడు పనిని (ఉపాసన) చేయాలి

అని ఉపాసనము ఉపాస్యుడిని ఎవరో? తెల్సుకోగోరినందున అదే వాక్యంలో లేకున్నా ఇతర వాక్యములో చెప్పబడిన బ్రహ్మతో సంబన్ధము ఉన్నది అని కూడా అనకూడదు. అదే వాక్యంలోనే చెప్పబడిన మనోమయత్వాది గుణములు కలవాడి వల్ల ఆకాంక్ష తీరిపోయి ఇతడు ఉపాసింపదగినవాడు అని తేలిపోతున్నందున అసలు ఉపాస్యుడు ఎవడు అనే ఆకాంక్షనే తల ఎత్తదు. **మనోమయః ప్రాణమయః** అనే దానితో ఏకార్థత కల్గిఉన్నట్లు నిర్దేశింపబడినవాడే కొద్దిగా విభక్తిని మార్పుచేసుకుంటే మనోమయాది పదం చేత చెప్పబడేవాడెవడు? క్రతుం కుర్వీత అని ఎవడు నిర్దేశింపబడుతున్నాడు అనే రెండు ఆకాంక్షలున్నూ తీరిపోతున్నాయి కదా! ఈ తీరుగ జీవత్వము నిశ్చయింపబడితే ఉపసంహారము / ముగింపులో ఉన్న బ్రహ్మ పదము కూడా జీవుని విషయములోనే పూజార్థము / గౌరవము కొరకు ప్రయోగింపబడిందని విశ్వసించుతున్నాము అని.

ఇట్లాగా పూర్వపక్షము రాగా సమాధానమును చెప్తున్నాము. **సర్వత్ర ప్రసిద్ధోపదేశాత్** అని. మనోమయత్వాది గుణాలు కలవాడు పరమాత్మనే. ఎందువల్లనంటే? సర్వత్ర – వేదాన్తవాక్యాలయందు ప్రసిద్ధుడైన పరమాత్మ విషయం లోనే మనోమయత్వాదులు ఉపదేశింపబడినాయి కాబట్టి. బ్రహ్మకు మనోమయాదులు ప్రసిద్ధములే. ఉన్నవని అందరికీ ఎరుక ఉన్నట్టి ముచ్చటనే. ఎలాగంటే **మనోమయః ప్రాణ శరీరనేతా.** మనోమయుడు ప్రాణశరీరములను నిర్వహించేవాడు. **2) సఏషోఽన్తర్హృదయ ఆకాశః తస్మిన్నయం పురుషోమనోమయః అమృతోహిరణ్మయః** అది హృదయములోని ఆకాశము. దానిలో ఈ మనోమయుడైన పురుషుడు ఉన్నాడు. అతడు ఆనందస్వరూపుడు. బంగారము వలె మనోహరమైన కాన్తితో మెరిసిపోతున్నాడు. **3) హృదామనీషామనసాఽభిక్లుప్తో. యఏవం విదురమృతాస్తే భవన్తి.** హృదయముతో బుద్ధితో మనస్సుతో కూడి ఉన్నట్టివాడు. ఇట్లాగని ఎవరు తెలిసి ఉపాసిస్తున్నారో వారు మరణము లేక ఆనంద పరవశులౌతారు. మోక్షాన్ని పొందుతారు **4) నచక్షుషా గృహ్యతే. నాపివాచా మనసాతు విశుద్దేన** ఆయన కంటికి కనిపించడు. మాటలతో వర్ణింపనలవి కానివాడు. కేవలము నిర్మలమైన మనస్సుతో మాత్రమే గ్రహింపబడుతాడు. **5)** అట్లాగే **ప్రాణస్యప్రాణః** ప్రాణానికి ప్రాణమైన వాడు. **6) అథఖలు ప్రాణఏవ ప్రజ్ఞాత్మా ఇదం శరీరం పరిగృహ్య ఉత్థాపయతి.** అటుపిమ్మట మిక్కిలి జ్ఞానము కలవాడైన ప్రాణుడే ఈ శరీరాన్ని గట్టిగా పట్టుకొని పైకిలేవనెత్తుతూ ఉన్నాడు. **7) సర్వాణిహవా ఇమాని భూతాని ప్రాణమే వాభిసంవిశన్తి**

**ప్రాణమభ్యుజ్జిహతే.** ఈ సమస్త భూతాలున్నూ ప్రాణమునందే ప్రవేశించుతున్నవి. ప్రాణము నుండే వెలుపలికి / ప్రపంచములోకి వస్తున్నవి. ఇట్లాంటి వాక్యాల్లో పరమాత్మ మనోమయుడు ప్రాణమయుడుగా వర్ణింపబడుతున్నాడు. **మనోమయత్వము అనగా** – పరిశుద్ధమైన మనస్సుతో మాత్రమే గ్రహింపబడుట. **ప్రాణశరీరత్వమ్** – ప్రాణానికి కూడా ఆధారమై ఉండుట మరియు దానిని నియన్త్రించుట. రెండూ! ఇట్లా ఐనందువల్ల **ఏషమే ఆత్మా అన్తర్ హృదయే ఏతద్ బ్రహ్మ.** ఇతడు నాకు ఆత్మ. నా హృదయములో నెలకొని ఉండేవాడు. ఇతడే బ్రహ్మ అని బ్రహ్మ శబ్దము కూడా ఆ పరమాత్మయందే ముఖ్య అర్థాన్ని బోధించుతుంది. **అప్రాణోహ్యమనాః** అనే వాక్యము పరమాత్మ మనస్సుపై ఆధారపడి యుండే జ్ఞానాన్ని, ప్రాణముపై ఆధారపడి ఉండే నిలుకడను కలిగినవాడు కాడని చెపుతున్నది. లేదా! "**సూత్రానికి రెండవనిర్వాహము**".

**సర్వంఖల్విదమ్ బ్రహ్మ తజ్జలానితి శాన్త ఉపాసీత** ఈ సమస్త ప్రపంచమూ ఆ బ్రహ్మనే. ఇది ఆయన నుండి పుట్టినది. ఆయన వల్ల బ్రతుకుతున్నది. ఆయనలోనే కలుస్తున్నది. అని తెల్సుకొని ప్రశాన్తమగు చిత్తముతో ఉపాసన చేయాలి. అను ఈ వాక్యము వద్దనే ఉపాసనము విధింపబడుతున్నది. సమస్తానికి ఆత్మగా అన్ని పదార్థాలలో బ్రహ్మ పూర్ణుడై ఉన్నాడు. కనుక శాన్తుడై ఉంటూ ఉపాసన చేయవలెను అని తిరిగి **సక్రతుం కుర్వీత** అతడు కర్మను చేయవలెను అని ఆ ఉపాసననే గుణములను స్వీకరించడం కొరకు తిరిగి చెప్పడము (అనువాదము) జరిగింది. ఉపాదేయములు ఐన గుణాలు ఏవి అని అంటే మనోమయత్వాదులు. ఇందువలన సర్వాత్మకుడైన మనోమయత్వాదిగుణాలు కలిగిన బ్రహ్మను ఉపాసించవలెను అని అర్థము. ఇది వాక్యార్థము. కాగా ఇక్కడ సందేహము. ఏమని ఈ వాక్యములోని బ్రహ్మ శబ్దము చేత ప్రత్యగాత్మ నిర్దేశింపబడుతున్నాడా! లేక పరమాత్మనేనా? అని. ఏది తగును అని అంటే ప్రత్యగాత్మ అనే. ఎందువల్లనంటే సర్వమ్ అనే శబ్దముచేత చేయబడిన సామానాధికరణ్యము జీవుడికి మాత్రమే చెల్లుతుంది. సర్వశబ్దము చేత బ్రహ్మ మొదలుకొని స్తమ్బము వరకు ఉన్న మొత్తం జగత్తు నిర్దేశింపబడుతున్నది. బ్రహ్మగావడము ప్రత్యగాత్మకే అనాదియైన అవిద్యకు మూలకారణమైన కర్మవిశేషము అనేది ఉపాధిగా ఉంటూనే ఉన్నది. పరబ్రహ్మనేమో సర్వజ్ఞుడు సర్వశక్తి అపహత పాప్మ. సమస్తములైన అవిద్యాదిదోషగంధాలు లేనట్టివాడు. కనుక అన్నిరకాలైన హేయాలకు నెలవైన "**సర్వభావము**" అస్సలే కుదరదు.

ఇంతేకాకుండా ప్రత్యగాత్మ – జీవుడి – యందు కొన్నికొన్ని చోట్లలో బ్రహ్మ శబ్ద ప్రయోగము కనుపిస్తున్నది. ఇందువల్లనే "**పరమాత్మా**". "**పరంబ్రహ్మ**" అని పరమేశ్వరుడికి కొన్నిచోట్లలో విశేషణముతో కలిపి ప్రయోగము చేస్తున్నారు. ఉపాధియైన కర్మనుండి విడుదల జరిగినప్పుడు ప్రత్యగాత్మకు కూడా **బృహత్వము** ఉన్నది. **స చానన్త్యాయకల్పతే** అతడు కూడా అనన్తత్వాన్ని పొందదానికి తగును అని శ్రుతివాక్యము స్పష్టముగా వినిపించుతున్నది కాబట్టి. అదే విజ్ఞానము లేక అజ్ఞానిగా ఉన్న ఆ ప్రత్యగాత్మకు కలిగే జగత్ జన్మస్థితి లయాదులన్నీ కర్మకారణంగా ఏర్పడుతున్నవి కనుక "**తజ్జలానితి**" హేతువును నిర్దేశించడమున్నూ చక్కగా సరిపోతుంది. మొత్తం మీద తేల్చిన సారాంశము ఇది. – ఈ జీవాత్మ సహజంగా పరిచ్ఛేదము – (విభాగము– ఇంతపాటి అని విడదీయబడుట) లేని స్వరూపము గలవాడు కావున బ్రహ్మగాఐ ఉంటూ అనాదిఐన అవిద్య చేత దేవుడు తిర్యక్ మనుష్యుడు స్థావరము అనే రూపాలలో కనిపిస్తున్నాడు అని.

దీనికి సమాధానము చెప్పబడుతున్నది. సర్వత్ర ప్రసిద్ధోపదేశాత్ అని. సర్వత్ర – "సర్వం ఖల్విదమ్" అని నిర్దేశించబడిన సర్వజగత్తు నందు బ్రహ్మశబ్దముతో ఆ జగమునకంతటికీ ఆత్మగా చెప్పబడేవాడు పరబ్రహ్మనే. ప్రత్యగాత్మ కాదు. ఎందువల్లనంటే ప్రసిద్ధోపదేశము వలన – తజ్జలాన్ అనే కారణాన్నిబట్టి **సర్వమ్ ఖల్విదం బ్రహ్మ అని ప్రసిద్ధి గలదిగా ఉపదేశించబడింది గనుక. బ్రహ్మ నుండి పుట్టినందు వల్ల, బ్రహ్మయందు లీనమవుతున్నందువల్ల, బ్రహ్మకు లొంగి – అధీనమై బ్రతుకుతున్నందువల్లనున్నూ – ఈ మూడు కారణాలను బట్టి ఈ సర్వమైన జగత్తు బ్రహ్మాత్మకము కదా!** అని చెప్పితే ఎవడినుండైతే జగజ్జన్మస్థితి లయాలు జరుగుతున్నవని ఉపనిషత్తులలో ప్రసిద్ధములుగా వినపడ్తున్నవో ఆ కారణంగా అతడే ఇక్కడ ఈ ప్రపంచరూపంగా కనిపించుతున్నాడని అర్థము. కనుక ఆయనే ఆ పరమాత్మనే బ్రహ్మ కానీ జీవుడు కాడు. అది ఎలాగంటే **యతోవా ఇమాని భూతాని జాయన్తే. యేనజాతాని జీవన్తి యత్ ప్రయన్త్యభి సంవిశన్తి. తద్విజిజ్ఞాసస్వ. తద్బ్రహ్మ.** ఎవని నుండి ఐతే ఈ ప్రాణులన్నీ పుడుతున్నాయో, పుట్టినవన్నీ ఎవనివల్ల బ్రతుకుతున్నవో, ఎవనిదిశగా కోరిన కోరికలను పొందదానికి పరుగులు తీస్తున్నవో, ఎవనిలో లీనము అవుతున్నవో అటువంటి వాడిని బ్రహ్మనుగా తెల్సుకో! ఇత్యాదిగా దీనికన్నా ముందు ఉన్న అనువాకము నందు ప్రతిపాదింపబడినవాడు అనవధిక

అతిశయ ఆనందము కలవాడైన, విపశ్చిత్తుఐన పరబ్రహ్మనుండి మాత్రమే జగదుత్పత్తి స్థితిలయాలు జరుగుతున్నవని నిర్దేశింపబడుతున్నాయో, అట్లాగే **సకారణం కరణాధిపాధిపోనచాస్య కశ్చిజ్జనితా నచాధిపః** అతడు కారణమైనవాడు కరణములు ఇంద్రియాలు – ప్రకృతివల్ల ఏర్పడినట్టివి – వాటికి అధిపతి జీవుడు, వాడికి అధిపుడు పరమాత్మ. ఇట్లాంటి ఇతడిని పుట్టించినవాడు లేడు. ఈయనను శాసించేవాడున్నూ లేడు. అని కరణాధిపుడైన జీవుడికి అధిపుడు పరబ్రహ్మనే. ఆయననే కారణము అని చెప్పబడుతున్నది. ఈవిధంగా అన్నిచోట్లలో అంతటికీ పరబ్రహ్మనే కారణమని ప్రసిద్ధి ఉన్నది. అది అందరికి తెలిసిందే. ఇందువల్ల పరబ్రహ్మనుండి పుట్టినందువల్ల ఆయన యందే లీనము అవుతున్నందువల్ల, ఆయనవల్లనే బ్రతుకుతున్నందువల్లనున్నూ ఆయనను ఆత్మగా కల్గి మనుగడ సాగిస్తున్నందువల్ల కూడా తాదాత్మ్యము చక్కగా పొసగుతుంది.

ఇందువల్ల అన్నింటినీ విశేషణాలుగా కల్గియున్న అన్నింటినీ / చేతనాచేతనాలను తనకు శరీరముగా చేసుకున్న, అన్నింటికీ తాను ఆత్మగా అయ్యి ఉన్న పరబ్రహ్మను ప్రశాన్తుడై ఉపాసించాలి అని శ్రుతియే పరబ్రహ్మకు సర్వాత్మకత్వాన్ని ప్రతిపాదించి అతడిని గురించి ఉపాసనాన్ని ఉపదేశించుచున్నది. పరబ్రహ్మ కారణావస్థలో ఉన్న, కార్యావస్థలోనూ ఉన్న సూక్ష్మము, స్థూలములైన చిదచిద్ వస్తువులను తనకు శరీరముగా కలిగియున్నందున అన్నికాలాల్లోనూ సర్వదాసర్వాత్మఐ ఉన్నాడు. ఈ విధమైన తాదాత్మ్యాన్ని ప్రతిపాదించినప్పుడే పరబ్రహ్మకు సకలహేయప్రత్యనీక కళ్యాణగుణాకరత్వము విరోధించదు. ప్రకారముఐన శరీరములోని దోషాలు ప్రకారియైన ఆత్మకు చెందవు. పైగా నిరతిశయమైన ఐశ్వర్యాన్ని – శాసించగల్గుటను – ప్రతిపాదించినందువల్ల అది దోషము కాకుండా గుణమే అవుతుంది అని మేము ఇంతకు ముందే చెప్పినాము.

జీవునికి అన్నింటితో తాదాత్మ్యము పొసగుతుంది అని ఏది చెప్పినారో అది సరియైనది కాదు. ప్రతిశరీరానికి వేరువేరుగా సంబన్ధించి ఒకరికొకరు వేరు వేరయిన వారికి అన్యోన్యము తాదాత్మ్యము అనేది కుదురదుగాక కుదురదు. దేనిచేతకూడా విభాగము లేని ముక్తుడనబడే జీవుడికి కూడా ఈ జగత్తుతో తాదాత్మ్యము జగత్తుకు జన్మస్థితిలయాలకు కారణత్వము కలుగదు అని **జగద్ వ్యాపారవర్జమ్** అనే సూత్రము దగ్గర చెప్పబడుతుంది. జగజ్జన్మ స్థితిలయాలకు జీవులయొక్క కర్మయే

కారణమవుతున్నది కాబట్టి జీవుడు కారణమని చెప్పడమున్నూ మంచిమాట కాదు. వాళ్ళ కర్మలు కారణము ఐనా ఈశ్వరుని సంకల్పము లేకుంటే జన్మస్థితిలయాలు జరుగవు. కనుక కర్మకారణము కాదు. ఇందువల్ల ఈ వాక్యము లోని బ్రహ్మ శబ్దానికి పరమాత్మనే అర్థము. ఈ విధంగా చెప్పిన సూత్రార్థాన్నే పూర్వాచార్యులందరూ హర్షించినారు. ఆమోదించినారు కూడాను. వృత్తికారుడుఐన బోధాయనుడు **సర్వం ఖల్వితి సర్వాత్మా బ్రహ్మేశః** సర్వంఖలు అని చెప్పబడిన వాక్యములోని బ్రహ్మ శబ్దవాచ్యుడు సర్వాత్మయైన ఈశ్వరుడే అని చెప్పినాడు.

సూ॥ **వివక్షిత గుణోపపత్తేశ్చ 1-2-2.** పరమాత్మకు ఉన్నవి అని వివరించబడే గుణాలు ఆయనకు మాత్రమే చెల్లుతవి. ముమ్మందు చెప్పబోయే గుణాలుకూడా పరమాత్మయందే పొసగుతవి. **మనోమయః ప్రాణశరీరః భారూపః సత్యసంకల్పః ఆకాశాత్మా సర్వకర్మా సర్వకామః సర్వగన్ధః సర్వరసః సర్వమిద మభ్యాత్తః అవాకీ అనాదరః** అతడు మనోమయుడు ప్రాణాన్ని శరీరముగా కలిగిన వాడు భాస్వరమైన/ ప్రకాశవన్తమైన రూపము ఆకారము కలవాడు. సత్యసంకల్పుడు. ఆకాశము వలె అంతటా వ్యాపించియున్నవాడు. అన్నింటీనిన్నీ సృష్టించినవాడు. సర్వకాముడు, సర్వగన్ధుడు, సర్వరసుడు అనగా గన్ధాలు రసాలూ కోరబడేవి అన్నీ ఆయనే. ఈ సమస్తాన్నీ స్వీకరించినవాడు. అన్నీ కలవాడు కనుక ఎవ్వరితోనూ మాట్లాడడు. ఎవనివల్లనూ ప్రయోజనము లేదుకనుక ఎవ్వరియందున్నూ ప్రత్యేకమైన ఆదరమునుచూపనవసరము లేనివాడు. అని

**మనోమయః** – పరిశుద్ధమైన ఒక మనస్సుతో మాత్రమే గ్రహింపదగిన వాడు. వివేకము, విమోకము మొదలైన సాధన సప్తకము చేత సహకరింపబడిన పరమాత్మోపాసన ద్వారా నిర్మలమైన మనస్సు చేతనే గదా గ్రహింపబడతాడు. ఇతర విషయాలున్నచోట పరమాత్మ చేరడు. ఈ విధమైన హేయప్రత్యనీకములైన కళ్యాణగుణాలకు మాత్రమే ఏకైక స్థానమవడం చేత పరమాత్మకు సకలేతర విలక్షణస్వరూపత చెప్పబడుతున్నది. మలినమనస్కుల చేత మాలిన్యాలు మాత్రమే స్వీకరింపబడుతాయి. **ప్రాణశరీరః** జగత్తులోని అందరి ప్రాణాలను నిలబెట్టేవాడు. ధారకుడు. ప్రాణము ఎవనికి శరీరమో ఆధేయము ఆధారపడిఉండేదో, విధేయం – శాసనానికి లొంగి ఉండేది, శేషభూతము – దాసుడి వలె చెప్పినట్లు చేసెడిదిగా కూడా ఉంటున్నదో – అట్లాంటి ప్రాణాన్ని తనకు శరీరముగా కలవాడు. ఇచ్చట ప్రాణశబ్దము

చేత జీవుడు చెప్పబడుతున్నాడు. ఆధేయత్వ విధేయత్వ శేషత్వాలు శరీరము అనే శబ్దము చేత చెప్పబడడానికి హేతువులు అని మున్ముందు ఉపపాదిస్తాము. **భారూపః** – ప్రకాశవంతమైన రూపము కలవాడు. ప్రకృతి సమ్బన్ధము లేని, తనకు మాత్రమే చెందిన అసాధారణమైన నిరతిశయమైన దీప్తితో కూడి ఉన్నవాడని అర్థము.

**సత్యసంకల్పః**– అప్రతిహతమైన సంకల్పము కలవాడు. **ఆకాశాత్మా** = ఆకాశము వలె సూక్ష్మము స్వచ్ఛమూ ఐన స్వరూపము కలవాడు సకలేతర పదార్థాలకు కారణమైన ఆకాశానికి కూడా ఆత్మయైనట్టి వాడు కనుక ఆకాశాత్మా. లేదా స్వయంగా తాను ప్రకాశించుతాడు ఇతరులనున్నూ ప్రకాశింపచేస్తాడు. ప్రకాశమనగా వ్యవహారయోగ్యతాపాదనము, **సర్వకర్మా**ఽక్రియతే చేయబడుతుంది కనుక కర్మ అని అనబడుతున్నది. అట్లాగా ఈ జగత్తు ఎవని కర్మనో, అట్టి జగత్ సృష్టికారి కనుక సర్వకర్మ అనబడుతున్నాడు. సర్వవైదిక క్రియలూ ఎవనికి ఆరాధన స్వరూపాలో లేదా లౌకికవైదికక్రియలు అన్నింటికిన్నీ జీవుల ద్వారా సద్వారక కర్త అవుతున్నాడు కనుక సర్వకర్మ.

**సర్వకామః** – కోరబడుతున్నవి కనుక కామములు భోగ్యభోగోపకరణాదులు. అవి అన్నీ అప్రాకృతములు, పరిశుద్ధములున్నూ. అలాంటివి సర్వవిధాలైనవి ఉన్నవి ఆయనకు అని అర్థము. **సర్వగన్ధః సర్వరసః**ఽ"**అశబ్దమ్ అస్పర్శమ్**" ఇత్యాది వాక్యము చేత ప్రకృతిలో పుట్టే గన్ధరసాదులను నిషేధించినారు కనుక అప్రాకృతములు తనకు మాత్రమే అసాధారణములు, ఎటువంటి దోషాలు లేనివి. నిరతిశయములు, మనోహరములు తనకు భోగ్యములు ఐనట్టివి అన్నిరకాలైన గన్ధాలు రసాలూ ఆయనకు ఉన్నవి అని అర్థము. **సర్వమిద మభ్యాత్తః** = ఇంతవరకూ చెప్పబడిన రసమువరకూ ఉన్న ఈ సమస్తాన్నీ కళ్యాణగుణసముదాయాన్నీ స్వీకరించినవాడు. **అభ్యాత్తః** అనే పదము **భుక్తాః బ్రాహ్మణాః** బ్రాహ్మణులు భుజించినారు అని అన్నట్లు కర్త్రర్థములో**క్త ప్రత్యయము** వచ్చినట్లుగా గమనించాలి. **అవాకీ** = వాకః అనగా పల్కుట. అది ఈయనకు లేదు కనుక అవాకీ అని అనబడుతున్నాడు. ఎందుకు? అనగా అనాదరుడు అని చెప్పబడుతున్నాడు. అంతేకాని మూగివాడు కాడు. ఆయన అవాప్తసమస్తకాముడు. అందువలన ఆదరించదగినవాడు లేనందున ఆదరరహితుడు. ఈ కారణము చేతనున్నూ అవాకీఽతరచుగా అతిగా మాట్లాడేవాడు కాడు. నిండైన ఐశ్వర్యము కలవాడు కనుక బ్రహ్మను మొదలుకొని స్తమ్బము వరకు ఉన్న నిఖిల ప్రపంచమును

గడ్డిపోచగా తీసిపారవేసి సుఖంగా ఉన్నాడని అర్థము. ఇట్లాంటి ఈ గుణాలన్నీ, వివక్షితాలైనవి పరమాత్మయందే చక్కగా సరిపోలుతవి. ఇతరుల విషయములో కాదు.

సూ॥ **అనుపపత్తే స్తున శారీరః 1-2-3** పైన చెప్పిన గుణాలు పొసగవు కనుక జీవుడుకాడు. ఈ విధమైన గుణసముద్రుడైన పరమాత్మను గురించి తెల్సుకొన్నపుడు సూర్యుడివంటి పురుషోత్తముని ముందు మిణుగురు పురుగువంటివాడు శరీరముతో సమ్బన్ధమును కల్గియుండి అపరిమితమైన దుఃఖాలతో సతమతమయ్యే బద్ధ ముక్తావస్థలలో నున్న జీవునికి ప్రస్తుత గుణాలలో ఏ ఒక్క గుణములోనూ చీమకాలంత ఐనా సమ్బన్ధము లేదు కనుక ఈ ప్రకరణములో శారీరుడైన జీవుని గ్రహించాలనే శంక కలుగడానికి అవకాశమే లేదు అని అర్థము.

సూ॥ **కర్మకర్తృవ్యపదేశాచ్చ 1-2-04** ఒకరిని కర్మగాను మరొకరిని కర్తగానూ వేరు చేసి నిర్దేశించినందువల్ల. **ఏతమితః ప్రేత్యాభిసంభవితాస్మి** ఈ శరీరాన్నుంచి విడివడిపోయి పరమపురుషుడిని చేరుకొని నాదైన సహజస్వరూపాన్ని పొందుతాను అని ప్రాప్యుడుగా పరంబ్రహ్మ చెప్పబడుతున్నాడు. పొందేవాడుగా జీవుడు ఉట్టకింపబడుతున్నాడు. ఇందువల్ల ఉపాసకుడైన జీవుడు చేరేవాడు. ఉపాస్యుడైన పరబ్రహ్మ ప్రాప్యుడు అని తెలుస్తున్నది కనుక ప్రాప్తయైన జీవుడికంటే వేరయినవాడే.

సూ॥ **శబ్దవిశేషాత్ 1-2-05** విశేషమైన శబ్దాన్ని ప్రయోగించి చెప్పినందువల్ల. **ఏషమే ఆత్మాఽన్తర్ హృదయే** నా హృదయంలో ఈ ఆత్మయైన వాడు ఉన్నాడు నన్ను ఉజ్జీవింపచేస్తున్నాడు. అని శరీరసంబన్ధము గల జీవుడు షష్ఠీ విభక్తితో (మే) చెప్పబడినాడు. ఉపాస్యుడు మాత్రం ప్రధమా విభక్తితో (ఏషఆత్మా) చెప్పబడినాడు. ఇట్లాగే ఇదే సమాన ప్రకరణములో వాజసనేయ శాఖవాళ్ళు కూడా జీవపరుల విషయంలో శబ్ద విశేషాన్ని పఠిస్తున్నారు. ఎట్లాగంటే **వ్రీహిర్వాయవోవాశ్యామా కోవా శ్యామాక తండులోవా, ఏవమన్తరాత్మన్ పురుషోహిరణ్మయః యధాజ్యోతిరధూమమ్.** వడ్లగింజ లేక యవధాన్యపు గింజలేక చామలగింజ లేదా చామలబియ్యపుగింజ కానీ కావచ్చును. ఇట్లాగే జీవుని అన్తరాత్మలో ప్రకాశవన్తుడైన పురుషుడు ఉంటున్నాడు. ఆయన పొగలేని అగ్నిలాగా వెలుగుతున్నాడు అని. ఇక్కడ **"అన్తరాత్మన్"** అని సప్తమీ విభక్త్యన్తముతో శరీర సమ్బన్ధముగల జీవుడు నిర్దేశింపబడుతున్నాడు. **పురుషోహిరణ్మయః** అని ప్రధమావిభక్తితో ఉపాస్యుడు చెప్పబడినాడు. కావున

పరమపురుషుడే ఉపాస్యుడు. ఇదిగో! ఈ కారణము వల్లనున్నూ జీవుడికంటే వేరయినవాడే!

సూ॥ **స్మృతేశ్చ 1-2-06** స్మృతి (భగవద్ గీత) చెప్తున్నందువల్ల. **సర్వస్యచాహంహృదిసన్నివిష్టః మత్తః స్మృతిర్జ్ఞానమపోహనంచ.** నేను అందరి హృదయాలలో ఉంటూ వారికి చేరువలోనే ఉన్నాను. నావల్లనే గడచిన విషయాలను తలచుకోవడము కొత్త విషయాలను తెల్సుకొనడము పొరపాటు పడి తప్పుడు ఊహలు చేయడమున్నూ జరుగుతున్నవి. **యోమామేవమసంమూఢోజానాతి పురుషోత్తమమ్** ఈ విధంగా అజ్ఞానములేనివాడై నన్ను పురుషోత్తముడినిగా తెల్సుకొంటున్నాడో **ఈశ్వరస్సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి। భ్రామయన్ సర్వభూతానియన్త్రారూఢానిమాయయా॥ తమేవశరణం గచ్ఛ.** ఓ అర్జునా! సర్వభూతాలలోనూ వారియొక్క హృదయస్థానములో ఈశ్వరుడు ఉంటున్నాడు. సర్వభూతాలనున్నూ తనయొక్క ఆశ్చర్యకరమైన సర్వజ్ఞత్వముతో రంగులరాట్నము వంటి యన్త్రాన్ని ఎక్కించి వారిని త్రిప్పుతూ ఉన్నాడు. అందువల్ల నీవు సరియైన జ్ఞానాన్ని పొంది బాగుపడదల్చుకుంటే ఆయననే శరణువేడుకో! అని కూడా శారీరకుడిని (జీవుడిని) ఉపాసకుడిగా, పరమాత్మను ఉపాస్యుడినిగా స్మృతి (భగవద్గీత) చూపించుతున్నది.

సూ॥ **అర్భకౌకస్త్వాత్ తద్వ్యపదేశాచ్చనేతిచేన్న. నిచాయ్యత్వాదేవం వ్యోమ వచ్చ. 1-2-07** చిన్నదైన స్థానములో చిన్నవాడుగా ఉన్నాడని చెప్పినందువల్ల పరమాత్మకాడు అని అనకూడదు. ఉపాసన చేయడానికి గాను అట్లా చెప్పినారు. ఆయన ఆకాశము వలె అన్నింటా వ్యాపించి ఉన్నాడు. అల్పాయతనత్వము – చిన్నదైన స్థానాన్ని కలిగియుండడము – అర్భకౌకస్త్వము. తద్వ్యపదేశః – అల్పత్వమును కల్గియున్నట్లు చెప్పడము. **ఏషమే ఆత్మా అన్తర్ హృదయే** అని అణువంతటి హృదయ స్థానము నందు ఉంటున్నాడు కావున **అణీయాన్ వ్రీహేర్వాయవాద్వా** వడ్లగింజకంటే యవగింజకంటేనూ చిన్నవాడు. అణువంతటివాడు. ఇత్యాది వాక్యాల ద్వారా అణువంతటి స్వరూపముతో నున్నవాడుగా చెప్పినందువల్ల ఇతడు పరమాత్మకాడు. ఐతే జీవుడు మాత్రమే **సర్వగతమ్ సుసూక్ష్మమ్ తదవ్యయం యద్భూతయోనిం పరిపశ్యన్తిధీరాః** అన్నింటా అన్ని ప్రదేశాలలో ఉండేవాడిని మిక్కిలి సూక్ష్మమైన వాడిని మార్పులు లేనివాడిని ఈ భూతాలు అన్నీ పుట్టడానికి కారణమైన వాడిని

దేనికీ బెదరక చెదరక నిల్చి ఉంటూ బుద్ధితోనే రమించే జ్ఞానులు ఆ పరమాత్మను దర్శించుకుంటున్నారు. ఇత్యాది వాక్యాలద్వారా పరమాత్మ అపరిచ్ఛిన్నుడని తెలుస్తున్నది కాబట్టి జీవుడు వడ్లగింజ కొసకు ఉండే ముల్లు అంతటి వాడనిన్నీ చెప్పినందువల్ల పరమాత్మ కాదు జీవుడే బ్రహ్మ శబ్దవాచ్యుడు అని అనేట్లయితే అది సరికాదు. పరమాత్మయే అణువైన ఆకారము కలవాడని దర్శించి ఉపాసించడము కొరకు చెప్పబడుతున్నది. ఈ విధంగా నిచాయ్యత్వేన – ద్రష్టవ్యముగా (చూడదగినదిగా) ఉపాస్యమైనదిగా అని అర్థము. అంతేకాని అణువంతనే ఈ పరమాత్మ స్వరూపము అనికాదు. వ్యోమము – ఆకాశమువలెనున్నూ ఇతడు చెప్పబడుతున్నాడు. అనగా స్వాభావికమైన మహత్త్వము ఇదే వాక్యములో ఉద్ఘోషింపబడుతున్నది **జ్యాయాన్ పృథివ్యాః జ్యాయానన్తరిక్షాత్ జ్యాయాన్దివో జ్యాయానేభ్యోలోకేభ్యః** పృథివి కంటే పరిమాణములో పెద్దవాడు. అన్తరిక్షము కంటే ద్యులోకముకంటే ఇంకా ఈ పైపై లోకాలన్నింటికంటెనూ పెద్దవాడు అని. అందువల్ల ఇంతటి పెద్దవాడేఐనా ఉపాసకుడు ఉపాసకుని సౌకర్యము కొరకు మాత్రమే అల్పత్వము పరమాత్మకు చెప్పబడుతున్నది.

అది ఇట్లాగా ఉన్నది. **సర్వమ్ ఖల్విదం బ్రహ్మ తజ్జలానితి శాన్త ఉపాసీత** అని సర్వోత్పత్తి ప్రలయాలకారణమైనందున సమస్త జగత్తుకున్నూ ఆత్మగా అనుప్రవేశము చేసి జీవింపచేస్తున్నవాడవడం చేతనున్నూ సర్వాత్మకుడైన బ్రహ్మను ఉపాసించాలి అని ఉపాసనను విధించి **అథఖలు క్రతుమయః పురుషః। యథాక్రతురస్మింల్లోకే పురుషోభవతి. తథేతః ప్రేత్యభవతి.** అని ఉపాసకుడు తాను ఉపాసన చేసిన ప్రకారంగానే ప్రాప్యమైన ఫలాన్ని పొందుతాడని చెప్పి. **సక్రతుంకుర్వీత** అని గుణాలను విధించడము / తెలుపడంకొరకు ఉపాసనను తిరిగి ఎత్తి చెప్పి **మనోమయః ప్రాణశరీరోభారూపః సత్యసంకల్పః ఆకాశాత్మా సర్వకర్మా సర్వకామః సర్వగన్ధః సర్వరసః సర్వమిదం అభ్యాత్తః అవాకీ అనాదరః** అని జగదైశ్వర్యముతో కూడియున్న బ్రహ్మయొక్క తప్పక స్వీకరించదగియున్న స్వరూపాన్ని గుణాలనున్నూ ప్రతిపాదించి **ఏషమే ఆత్మా అన్తర్హృదయే అణీయాన్ వ్రీహేర్వా యవాద్వా సర్షపాద్వా శ్యామాకాద్వా శ్యామాకతండులాద్వా** అని ఉపాసకుని యొక్క హృదయములో అణువంతరూపములో, వానికి ఆత్మగా ఉపాస్యుడైన పరమపురుషుడు ఉపాసనము చేయడానికి అనువుగా ఉంటున్నాడు అని చెప్పి **ఏషమే ఆత్మాఅన్తర్హృదయే జ్యాయాన్**

**పృథివ్యాః జ్యాయానన్తరిక్షాత్ జ్యాయాన్ దివో జ్యాయానేభ్యోలోకేభ్యః,సర్వకర్మాసర్వకామః సర్వగన్ధః సర్వ రసః సర్వమిదమభ్యాత్తోఽవాక్యనాదరః** అని హృదయము లోపల ఉన్న ఉపాస్యుడైన వానియొక్క ప్రాప్యాకారాన్ని నిర్దేశించి **ఏషమే ఆత్మా అన్తర్ హృదయే. ఏతద్బ్రహ్మ** అని చెప్పి ఇట్లాంటి వాడైన పరబ్రహ్మ మిక్కిలి దయగలవాడు కాబట్టి మనలనుబ్రతికించి బాగుపరచడానికిగాను మన హృదయములో సన్నిహితుడై ఉన్నాడు అని అనుసన్ధానమును చేసుకోవాలి అని విధించి **ఏతమ్ ఇతఃప్రేత్య అభిసంభవితా అస్మి** ఉపాసన చేస్తున్న ప్రకారము ప్రాప్తి తప్పక కలుగుతుందని నిశ్చయాన్ని అనుసన్ధానము చేసుకోవాలి అని ఆదేశించి **ఇతి యస్య స్యాదద్ధా నవిచికిత్సాఽస్తి** అని ఎవడికి గట్టినమ్మకము కలుగుతుందో అట్టవాడికి పరమాత్మను పరమానందాన్ని పొందడము గురించి మాటిమాటికీ విచారము పడవలసిన అవసరం లేదు. అని ఈవిధమైన ప్రాప్యమును పొందుతాను అని నిశ్చయమున్న ఉపాసకుడికి ఫలాన్ని పొందడములో సందేహము అక్కరలేదని చెప్పి ముగింపుచేయబడింది. ఇందువల్ల ఉపాసనము కొరకు అర్భకౌకస్త్వము అణీయస్త్వమున్నూ పరమాత్మ విషయంలో చెప్పబడినవి.

సూ॥ **సంభోగప్రాప్తిరితి చేన్నవైశేష్యాత్ 1-2-08** సూక్ష్మంగా శరీరములో ఉన్నందువల్ల కర్మానుభవము కలుగదు. విశేషమున్నందువల్ల. జీవుడికి వలెనే పరబ్రహ్మకు కూడా శరీరము లోపల చేరి ఉండడాన్ని అంగీకరించినట్లయితే ఆ జీవుడికివలెనే శరీరముతో సమ్బన్ధం ఉన్న కారణము వల్ల సుఖదుఃఖాలను పరమాత్మ అనుభవించవలసి వస్తుంది అని అనకూడదు. అట్లాగా శరీరంలో ఉండడానికి విశేష హేతువు ఉన్నది. అదేమంటే శరీరములో ఉండడము మాత్రమే సుఖదుఃఖప్రాప్తికి కారణముకాదు. కానీ పుణ్యపాపరూపమైన కర్మవశ్యతయే కారణము అవుతుంది. ఆ కర్మపరవశత అపహత పాప్మడైన పరమాత్మకు కలుగదు. అట్లాగని శ్రుతి చెప్పుతున్నది. **తయోరన్యః పిప్పలమ్ స్వాద్వత్తి అనశ్నన్నన్యో అభిచాకశీతి.** ఆ రెండింటిలో ఒకటి రుచికరమైన కర్మఫలాన్ని భుజిస్తున్నది. మరొక్కటి ఫలాన్ని తినకుండానే ఆనందంగా ఉత్సాహంగా ఉంటున్నది అని. **సర్వత్రప్రసిద్ధి అధికరణము ముగిసింది.**

★ ★ ★

## ఇక అత్త్రధికరణము

పరమాత్మభోక్త కాకపోయినట్లయితే అపుడు అన్నిచోట్లలోను భోక్తగా కనుపించేవాడు జీవుడే కావలసి ఉంటుంది అను ఆ శంకకు సమాధానమును చెప్పుతున్నారు.

సూ॥ **అత్తా చరాచరగ్రహణాత్ 1-2-9** పరమాత్మనే భోక్త. చరాచరములైన వాటినన్నింటినీ భుజిస్తున్నాడు గనుక. కఠవల్లియందు పఠింపబడుతున్నది. **యస్యబ్రహ్మచక్షత్రంచ ఉ భేభవత ఓదనః మృత్యుర్యస్యోపసేచనం కఇత్థా వేదయత్ర సః** ఎవనికి బ్రాహ్మణ జాతి మరియు క్షత్రియజాతి కూడా ఇద్దరున్నూ ఆహారముగా అవుతున్నారో! మృత్యువు ఎవడికి నంచుకొనే పదార్థము అవుతున్నదో! ఇటువంటి వాడిని ఎవడు తెల్సుకుంటున్నాడో వాడు అతని సన్నిధికి చేరుకుంటున్నాడు అని. ఇక్కడ ఓదనము, ఉపసేచనములద్వారా సూచింపబడిన భోక్తజీవుడేనా? లేక పరమాత్మనా? ఎవరు కావచ్చును అని సందేహము కలుగుతున్నది. ఏది తగును? అంటే జీవుడేనని మా సమాధానము. ఎందువల్లనంటే భోక్తృత్వము అనేది కర్మకారణంగా వస్తుంది. ఆ కర్మ జీవుడికే ఉన్నది కాబట్టి అని.

దీనికి సమాధానము ఇట్లాగా చెప్పబడుతున్నది. అత్తా చరాచర గ్రహణాత్. అత్తా భుజించేవాడు పరమాత్మనే. ఎందువల్లనంటే చరాచరములనన్నింటినీ భోంచేయడము ఆయనకు మాత్రమే సాధ్యమవుతుంది. ఈ భోక్తృత్వము కర్మ నిమిత్తంగా వచ్చింది కాదు. కానీ జగజ్జన్మ స్థితి లయములకు కారణమైన పరబ్రహ్మ అనబడు విష్ణుమూర్తి సంహర్తృత్వము. అనగా తాను సంకల్పపూర్వకముగా చేసిన సృష్టిని ఉపసంహరించుకోవడం తప్ప మరొకటి కాదు. **సోஉధ్వనః పారమాప్నోతి తద్విష్ణోః పరమమ్ పదమ్.** ఆ ఉపాసకుడు తనదైన జీవన యాత్రలో మార్గానికి ఆవలి లక్ష్యమైన ఆ విష్ణువు యొక్క నివాస స్థానమైన పరమపదానికి చేరుకుంటాడు. అని ఇదే ఉపనిషత్తులోని ప్రకరణము నందు కనిపిస్తున్నది. అట్లాగే **మృత్యుః యస్యోపసేచనమ్** అని చెప్పడాన్నిబట్టి **బ్రహ్మచక్షత్రంచ** అని చరాచర రూపమైన ఈ జగత్తంతా తినదగిన ఆహారంగా గ్రహింపబడుతున్నది. ఉపసేచనము అంటే తాను స్వయంగా తినబడుతూనే మరొకదానిని తినడానికి కారణమయ్యేది. అనగా భోజనము చేసేటప్పుడు మధ్యమధ్యలో పచ్చళ్ళు వంటివి నంచుకోబడి, మిగతా అన్నాన్ని తినడానికి సాధనములు అవుతాయి. అట్లే పరమాత్మ జగదుపసంహారసమయంలో మృత్యువు

కూడా నంచుకొనే పదార్థంగా తినబడుతున్నది కనుక ఆయన చేత తినబడుతున్న బ్రహ్మక్షత్రము మొదలుగాగల సమస్త చరాచరాలను జగాన్ని తినడమనేది ఇక్కడ ఉపసంహారముగా చెప్పదలచుకున్నవిషయమని గమనించాలి.

ఇటువంటి తినడము జగదుపసంహారమే. అందువల్ల ఇలాంటి జగదుపసంహారిత్వరూపమైన భోక్తృత్వము పరమాత్మదే కాని జీవుడికి సమ్బన్ధించినది కాదు.

సూ॥ **ప్రకరణాచ్చ 1-2-10** ప్రకరణాన్ని బట్టి కూడా. ఈ ప్రకరణము కూడా పరబ్రహ్మకు సమ్బన్ధించినదే. **మహాన్తం విభుమాత్మానం మత్వాధీరోన శోచతి** అంతటా నిండియున్న ఆ మహాపురుషుడిని అందరికీ ఆత్మగా ఉండి ఉజ్జీవింపచేస్తున్న వాడిని చక్కగా తెల్సుకొని మననము చేసుకుంటున్న జ్ఞానియైన వాడు విచారపడడు. **2) నాయమాత్మా ప్రవచనేనలభ్యోనమేధయా బహునాశ్రుతేన యమేవైషవృణుతే తేన లభ్యః తస్యైష ఆత్మా వివృణుతే తనూం స్వామ్.** ఈ పరమాత్మ కర్మజ్ఞానభక్తులచేత లభించేవాడు కాడు. ఎవడినైతే ఆయన ఇష్టపడుతాడో వానికి మాత్రమే దర్శనమిస్తాడు. అంతమాత్రమే కాదు. తనదైన స్వరూప స్వభావ గుణాదులను చక్కగా వివరించి చూపుతాడు అని ప్రకృతసందర్భము. **క ఇత్థావేదయత్ర సః.** ఇటువంటి వాడని అతడిని ఎవడు తెల్సుకుంటున్నాడు అని చెపుతూ ఆయన దయలేకపోతే తాను ఎంత కష్టపడినా తెలియబడడు అని ముందు ప్రస్తావించబడిన వాని గురించి ప్రత్యభిజ్ఞ కల్గుతూ ఉన్నది.

ఐతే ఇట్లా కావచ్చును. ఈ బ్రహ్మక్షత్రములను ఆహారముగా భుజించుతున్న వాడైన పురుషుడు అపహతపాప్మయైన పరమాత్మ కాడు. దాని తర్వాత **ఋతంపిబన్తౌ సుకృతస్యలోకే గుహామ్ప్రవిష్టౌ పరమేపరార్ధ్యే. ఛాయాతపౌ బ్రహ్మవిదో వదన్తి పంచాగ్నయో యేచత్రిణాచికేతాః** పుణ్యలోకమునందు తాము చేసుకున్న పుణ్యకర్మను అనుభవించుతూ హృదయగుహలోకి ప్రవేశించినారు ఇద్దరు. వారు సాటిలేని మహోన్నతులు. అట్లా విడదీయడానికి వీలులేని ఆ ఇద్దరినీ బ్రహ్మవేత్తలు, త్రిణాచికేతములు అనబడే అగ్నివిద్యను ఉపాసించే కర్మిష్ఠులున్నూ ఒకరు ఛాయ మరొకరు ఆతపము (ఎండ) అని పోల్చి చెప్పుతున్నారు. అని కర్మఫలాన్ని భుజించేవాడే తనవెంట మరొకడిని కల్గియున్నాడని తెలుస్తున్నది. ఆ రెండవవాడు ప్రాణము కాని, బుద్ధికానీ కావచ్చును. ఋతపాన మంటే కర్మఫలాన్ని అనుభవించడమే. అది పరమాత్మకు సంభవించేది కాదు. బుద్ధి ప్రాణాలైతే భోక్త ఐన జీవుడికి ఉపకరణాలు / సాధనాలుగా ఉపయోగపడుతున్నవి కాబట్టి ఎట్లో ఒకట్లాగా ఋతపానము

నందు అన్వయము సంభవిస్తుంది కనుక ఆ బుద్ధి ప్రాణాల్లో దేన్నో ఒకదాన్ని తన వెంట పెట్టుకున్నవాడు సద్వితీయుడు జీవుడే అని ప్రతిపాదింపబడుతున్నది. దానితో ఏక ప్రకరణమైనందున జీవుడే అని ప్రతిపాదింపబడుతున్నది. దానితో ఏకప్రకరణమైనందున పూర్వము ప్రస్తావించబడిన అత్తా కూడా జీవుడే కావడానికి అవకాశమున్నది కదా! అని. దానికి సమాధానమున చెపుతున్నారు.

సూ॥ **గుహామ్ప్రవిష్టావాత్మానౌ హి తద్దర్శనాత్ 1-2-11** హృదయగుహలో ప్రవేశించినవారు జీవపరమాత్మలు. ఆ విషయము వేదములో కనిపిస్తున్నది. ప్రాణజీవులు, బుద్ధిజీవులు కానీ గుహలో ప్రవేశించి ఋతాన్ని పానము చేస్తున్నారని చెప్పబడడము లేదు. అయితే వారిద్దరూ జీవపరమాత్మలు మాత్రమే. అట్లాగా చెప్పబడినారు. ఎందువల్లనంటే ఆ ముచ్చటే కనపడుతున్నది కాబట్టి. ఈ ప్రకరణంలో జీవపరమాత్మలకే గుహాప్రవేశవ్యపదేశము కనిపిస్తున్నది. పరమాత్మకైతే **తం దుర్దర్శం గూఢమను ప్రవిష్టమ్ గుహాహితం గహ్వరేష్టం పురాణమ్। అధ్యాత్మయోగాధిగమేన దేవం మత్వాధీరో హర్షశోకౌ జహాతి.** ఆ విధముగా కంటితో చూడశక్యము కాని వాడు, తాను కర్మరూపమైన అవిద్యను పరమాత్మ కనరాకుండా ఉంచే తెరగా కల్గియున్నందున గూఢమైనవాడిని జీవునితో పాటు అను ప్రవేశము చేసినవాడిని తన హృదయములోనే ఉన్నవాడిని, తన అన్తర్యామిని / పరమవ్యోమము నందుండే వాడిని తన ఆత్మయందున్న పరమాత్మను ఉపాసన చేయడంద్వారా అద్భుతంగా వెలుగుతున్నవాడిని సందర్శించి జ్ఞానియైన వాడు హర్షమును శోకాన్ని రెండింటినీ వదిలివేసి ఆనందంగా ఉంటాడు అని. జీవుడికిన్నీ **యాప్రాణేన సమ్భవత్యదితిః దేవతామయీ. గుహామ్ ప్రవిశ్యతిష్ఠన్తీ యాభూతేభిః వ్యజాయత.** అదితి అనబడే ఈ జీవుడు ప్రాణముతో కూడి జన్మిస్తున్నాడు. ఇతడు హృదయగుహలో ఉంటున్నాడు. పంచభూతాలు ఇంద్రియాలతోనూ కలిసి వివిధరూపాల్లో పుడుతున్నాడు. కర్మఫలాలను అనుభవించుతున్నాడు కనుక జీవుడు అదితి అనబడుతున్నాడు. ప్రాణేన సంభవతి – ప్రాణముతో కలిసి ఉంటున్నాడు. దేవతామయీ – ఇంద్రియాలకు లొంగిన భోగములు కలవాడు. గుహాంప్రవిష్యతిష్ఠన్తీ – హృదయపుండరీకములో సంచరించేవాడు. భూతేభిః వ్యజాయత – నేల మొదలైన పంచభూతాలతో కలసి దేవాదిరూపాలలో పలురకాలుగా పుడుతున్నాడు. ఇట్లా పరమాత్మ జీవుడు ఇద్దరున్నూ హృదయగుహలో ప్రవేశాన్ని గలవారైనారు. కనుక **ఋతంపిబన్తౌ** అనేచోట త్రాగుతున్నారు అని అనడము ఇద్దరూ కర్మపానము

చేస్తున్నారు అని కాక **"ఛత్రి ణోగచ్ఛన్తి" గొడుగులు కలవారు పోతున్నారు** అని చెప్పినట్లుగా – ఒకడు గొడుగును పట్టుకొని పోతుంటే లేనివాడొకడు తోడుగా వెంట గొడుగు లేకుండానే కలసి దాని నీడలోనే పోతున్నాడని అన్నట్లే జీవుడు కర్మఫలాన్ని అనుభవించుతుంటే పరమాత్మతోడుగా చూస్తూ పోతున్నాడని అర్థము చేసుకోవాలి. లేదా ఒకరు ఋతపానము చేసే వారయితే మరొకరు దాన్ని చేయించేవారుగా ప్రయోజ్య ప్రయోజకులుగా ఇద్దరికీ కర్తృత్వము నప్పుతుంది అని చెప్పుకోవచ్చును.

సూ॥ **విశేషణాచ్చ 1-2-12** గుహలో ప్రవేశించిన ఇద్దరికీ విడివిడిగా విశేషణాలను చెప్పినందువల్ల. ఈ ప్రకరణంలోనే జీవపరమాత్మలు ఇద్దరున్నూ ఉపాస్య ఉపాసకులుగా ప్రాప్యప్రాప్తలుగా విశేషధర్మాలతో కూడినవారై అన్నిచోట్లా ప్రతిపాదింపబడుతున్నారు. అదెట్లాగంటే **బ్రహ్మజజ్ఞం దేవమీడ్యం విదిత్వానిచాయ్యఇమాంశాన్తిమత్యన్తమేతి** బ్రహ్మ నుండి పుట్టినవాడు జ్ఞానము కలవాడు ఐన జీవుడు తాను ఆయన నుండి పుట్టినవాడినని తెల్సుకొని స్తుతింపదగిన ఈశ్వరుడిని తెల్సుకొని ఉపాసించి దర్శించి ఈవిధమైన కర్మ సమ్బన్ధములగు సుఖదుఃఖాలనుండి విముక్తుడై నిండైన శాన్తిని పొందుతున్నాడు అని. **బ్రహ్మజజ్ఞుడు** జీవుడు, ఆయననుండి పుట్టినందువల్ల, జ్ఞానము కలవాడైనందువల్ల. **తందేవమీడ్యంవిదిత్వాఽ**ఉపాసకుడైన జీవాత్మను బ్రహ్మాత్మకుడినిగా అర్థము చేసుకొని అని అర్థము. అట్లే **యఃసేతుః ఈజానానాం అక్షరం బ్రహ్మయత్ పరమ్। అభయం తితీర్షతాం పారంనాచికేతం శకేమహి.** ఎవడు ఉపాసన చేసేవారికి సేతువు వలె సంసారసాగరము నుండి దాటించెడి వాడో! ఏదైతే నాశనములేని పరంబ్రహ్మ అనబడుతూ దాటదల్చుకున్న వారికి భయాన్ని పోగొడుతున్నాడో అటువంటి నాచికేతాగ్ని స్వరూపుడిని ఉపాసనచేసి చేరుకుందముగాక! అని ఉపాస్యుడు పరమాత్మ అని చెప్పబడుతున్నది. నాచికేతమ్ = నా చికేతమనే కర్మకు ప్రాప్యమైనవాడిని అని అర్థము. **ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవచ.** ఆత్మను (జీవుడిని) రథము కలవాడై ప్రయాణించెడివాడినిగా తెల్సుకో. నీదైన శరీరాన్ని రథమునుగా తెల్సుకో ఇత్యాదివాక్యముద్వారా ఉపాసకుడు జీవుడని చెప్పబడుతున్నది. అట్లాగే **విజ్ఞాన సారథిర్యస్తు మనః ప్రగ్రహవాన్నరః సోఽధ్వనః పారమాప్నోతి తద్విష్ణోః పరమంపదమ్.** ఏ నరుడైతే బుద్ధిని తనకు సారథినిగా చేసుకొని మనస్సు అనే పగ్గాలను చేత బట్టుకొని ప్రయాణమును చేస్తాడో అతడు తాను చేయదల్చుకున్న ప్రయాణ మార్గానికి ఆవలి లక్ష్యమైన శ్రీమహావిష్ణువునకు నివాస

స్థానమైన పరమపదానికి చేరుకుంటాడు. అని ప్రాప్యప్రాప్తలు జీవపరమాత్మలుగా చెప్పబడినారు. ఇక ఋతం పిబన్తౌ ఈ వాక్యంలో కూడా ఛాయాతపౌ అనే పదముచేత అజ్ఞత్వ సర్వజ్ఞత్వాలచేత ఆ ఇద్దరే జీవపరమాత్మలే విశిష్టులుగా చెప్పబడుతున్నారు.

ఐతే ఇట్లాకావచ్చునేమో! **యేయంప్రేతే విచికిత్సామనుష్యే అస్తీత్యేకే నాయమస్తీతిచైకే** ఈ శరీరాన్నుంచి జీవుడు పోతే అతడు ఉన్నాడని కొందరు ఇతడు లేడని కొందరు విచికిత్స – విచారాన్ని చేస్తున్నారు. అనగా జీవస్వరూపయథార్థస్థితిని తెల్సుకొనేందుకై ప్రశ్న ఆరంభమవుతున్నందున ఈ ప్రకరణమంతా జీవునికి సమ్బన్ధించినదే అని అర్థమవుతున్నదికదా! అని కాని అది అట్లాగా కాదు. ముందుగా ఆ ప్రశ్న దేహానికంటే వేరైన జీవుడికి సమ్బన్ధించి అస్తిత్వనాస్తిత్వశంకకు చెందినది కాదు. అదే నిజమైతే దీనికంటే ముందు రెండువరాలను కోరుకోవడము పొసగదు. అదెలాగంటే నచికేతుడు తన తండ్రిగారు చేసిన సర్వవేదసదక్షిణమనే పేరుగల యజ్ఞాన్ని ముగించేకాలములో దక్షిణగా ఇవ్వబడే ఆవులు అన్నీ ముసలివి పాలు ఇవ్వక వట్టి పోయినవి ఐనందువల్ల అవి సరియైన దక్షిణ కానందువల్ల అట్లాంటి వాటిని దానం చేసినందువల్ల కలుగపోయే ఫలము కూడా క్రతువుకు తగినట్లుగా మంచిఫలము లభించదో ఏమోనని తలచి కొడుకైన నచికేతుడు ఆస్తి కాగ్రేసరుడైన తనను ఐనాదానము చేసినట్లయితే తండ్రికి చక్కని యజ్ఞ ఫలము దక్కుతుందని తలపోసి **"నన్నెవ్వరికి ఇస్తావు"** అని తనతండ్రిని మాటిమాటికీ విసిగిస్తుంటే ఆయన కోపపడి యముడికి ఇస్తున్నాను అని అనడంతో యమధర్మరాజుగారి ఇంటికి పోయినాడు. అక్కడ ఆయన లేకపోవడంతో మూడు దినాలు ఉపవాసము ఉండినాడు. తిరిగి వచ్చిన యమధర్మరాజు అతనియొక్క ఉపవాసస్థితిని గమనించి తాను ఉండక సరియైన అతిథి మర్యాదలు చేయలేకపోవడంతో ఏమి జరుగుతుందోని భయపడి మూడు వరాలను ఇవ్వజూపగా అందులో మొదటివరముతో గొప్ప ఆస్తిక్యభావన గలవాడైనందున తనపైన తండ్రికి కోపముపోయి అనుగ్రహము కలుగాలని కోరినాడు. ఇదంతా దేహం కంటే వేరయినవాడు ఆత్మ అని తెలియకుంటే పొసగకుండా పోతుంది. ఇక రెండవ వరముతో శరీరము నుంచి బయటకు వచ్చిన ఆత్మ అనుభవించవలసిన సత్ఫలాన్ని సాధించే అగ్నివిద్యను కోరుకున్నాడు. ఆ వరము కూడా దేహము కంటేవేరుగా ఆత్మ అనేది ఒకటి ఉన్నదని తెలియకపోయినవానికి తోచనే తోచదు. ఇందువల్ల మూడవ వరముతో దీన్ని కోరుకున్నాడు. **యేయంప్రేతే విచికిత్సా మనుష్యే అస్తీత్యేకేనాయమస్తీతిచైకే।**

**ఏతద్విద్యామనుశిష్టస్త్వయా అహమ్ వరాణామేషవరస్తృతీయః.** ఈ మనుష్యుడు శరీరాన్ని విడిచి వెళ్ళిపోతే మిగతా వాళ్ళు ఇతడు ఉన్నాడని కొందరు లేడని మరికొందరు విచికిత్స చేస్తున్నారు. ఈ విషయాన్ని తమరి ద్వారా తెల్సుకొని ఆనందపడాలని కోరుతున్నాను. ఇది నాయొక్క మూడవవరము. అని ఇక్కడ పరమపురుషార్థరూపమైన బ్రహ్మ ప్రాప్తి అనే లక్షణము గల మోక్షము యొక్క యథార్థస్థితిని తెల్సుకోవడం కొరకు, దానికి ఉపాయమైన పరమాత్మోపాసనము – పరావరఆత్మతత్వములను తెల్సుకొనేందుకు ఈ ప్రశ్న చేయబడింది కాగా **"యేయంప్రేతే"** అనే వాక్యము శరీర వియోగమాత్రానికే చెందిందికాదు. కాని సర్వబన్ధాలనుండి విముక్తికి సమ్బన్ధించినది. ఎలాగంటే **నప్రేత్య సంజ్ఞాఅస్తి** అని. ఇదీ దీని అర్థము – మోక్షాధికారియైన మనుష్యుడు సర్వబన్ధాలనుండి వినిర్ముక్తుడైనప్పుడు అతని యొక్క స్వరూపానికి సమ్బన్ధించిన వాదులయొక్క వేరువేరు విప్రతిపత్తులకు చెందిన అస్తి నాస్త్యాత్మికమైన ఈ విచికిత్స ఏదైతే ఉన్నదో దాన్ని తొలగించడానికి ఆ మోక్షస్వరూప యాథాత్మ్యాన్ని తమ ద్వారా శాసింపబడినవాడినై / తీర్చిదిద్దబడినవాడినై విద్యామ్ – తెలుసుకుంటాను. విజ్ఞానమును కలవాడనౌతానని.

ఆ మోక్షమును గురించి అనేక విభేదాలున్నవి – కొందరు కేవలము జ్ఞానస్వరూపమైన ఆత్మకు స్వరూప విచ్ఛిత్తియే మోక్షమని చెప్పుతున్నారు. ఇతరులు విజ్ఞాన స్వరూపుడై ఉన్నవానికి అవిద్య తొలగిపోవడమే మోక్షమని అంటున్నారు. ఇంకొందరు బండరాయితో సమానమైన ఆత్మకు జ్ఞానము కల్గిఉండుట వంటి అన్నిరకాలవైశేషిక గుణాలు లేకుండా పోయి కైవల్యరూపాన్ని పొందడమే మోక్షమని అన్నారు. మరికొందరు అపహత పాప్మడైన పరమాత్మను ఒప్పుకుంటూనే అతడికే కర్మరూప ఉపాధితో సంసర్గము ఏర్పడినందువల్ల జీవుడు అయ్యి జీవుడి లక్షణాలను పొంది సుఖదుఃఖాలను పొందుతున్నవాడికి ఆ ఉపాధి తొలగిపోయి తిరిగి తనదైన స్వభావాన్ని సంపాదించుకోవడమే మోక్షమంటున్నారు. ఇక వేదాన్తములందు పూర్తి విశ్వాసము ఉన్నవారు మాత్రము – నిఖిలజగత్తుకు ఏకైక కారణుడు అశేష హేయాలకు ప్రతిభటమై అనన్తజ్ఞాన ఆనందములే తనదైన స్వరూపంగా కలవాడు సహజమైన అనవధికము అతిశయము ఐన లెక్కించరాని కళ్యాణగుణాలకు సముద్రము వంటివాడు. తనకంటే వేరయిన వారందరికన్నా విలక్షణుడు సమస్తచిదచిత్తులకు ఆత్మయైన పరబ్రహ్మకు శరీరము ఐనందువల్ల ఆయనకు విశేషణము /

ప్రకారము అయ్యి అనుకూలము అపరిచ్ఛిన్నము ఐన జ్ఞానస్వరూపుడు అయ్యి పరమాత్మానుభవమొక్కటే రసముగా గలవాడు ఐన జీవుడికి అనాదియైన కర్మరూప అవిద్యచేత తిరోహితమైన స్వరూపముగలవాడికి అవిద్య తొలగిపోవడము తోపాటు స్వాభావికమైన పరమాత్మానుభవమే మోక్షమని ప్రవచిస్తున్నారు. ఆ సందర్భములో మోక్షస్వరూపాన్ని దాన్ని సాధించే ఉపకరణమైనదాన్నీ తమరి అనుగ్రహముతో తెల్సుకోదల్చుకున్నాననినచికేతుడు అడుగగా మృత్యుదేవతయైన యమధర్మరాజు ఆ పురుషార్థము సులభముగా అర్థమయ్యేదికాదని తెలిపి పలురకాలైన భోగాలను సమృద్ధిగా అందజేయడము ద్వారా అతడిని ఆశపెట్టి ఆ విధంగా నచికేతుడిని పరీక్షచేసి అతడి బ్రహ్మ విద్యాయోగ్యతను బాగా తెల్సుకొని పరావర ఆత్మ విజ్ఞానాన్ని, పరమాత్మను ఉపాసించే పద్ధతిని, ఆయన ఉండే చోటైన పరమపదానికి చేరుకోవడమే స్వరూపముగా గల మోక్షాన్నీ **తందుర్దర్శం గూఢమనుప్రవిష్టమ్** అని ఆరంభించి **సోఽధ్వనః పారమాప్నోతి తద్విష్ణోః పరమం పదమ్** అనే మన్త్రముతో ఉపదేశించి దానికి అవసరమైన ప్రణవము, అగ్నివిద్యాదులనున్నూ ఉపదేశించినాడు. కనుక అంతా సమంజసమే. ఇందువల్ల పరమాత్మనే **అత్తా, జీవుడు కాదని** నిశ్చితమయ్యింది. **ఇది అత్త్రధికరణము.**

★ ★ ★

## ఇక అన్తరాధికరణము

సూ॥ **అన్తర ఉపపత్తేః 1–2–13** చరాచర ప్రాణులన్నింటిలోపల ఉన్నవాడు పరమాత్మనే. అది ఆయనకే చెల్లుతుంది. ఛాన్దోగ్యోపనిషత్తులో ఇట్లాగా వినిపిస్తున్నది. **యఏషోఽక్షిణిపురుషోదృశ్యతే. ఏషఆత్మేతి హోవాచ. ఏతదమృతమే తదభయమేతద్బ్రహ్మ.** కంటిలో కనిపిస్తున్న పురుషుడు ఎవడున్నాడో అతడు ఆత్మ అని చెప్పినాడు. అంతేకాదు. ఆయన అభయమిచ్చేవాడు. అమృతస్వరూపుడు ఆనందమయుడు. ఇతడే బ్రహ్మ అని. ఇక్కడ ఒక సందేహము. కంటిని ఆధారముగా చేసుకొని ఉన్నట్లుగా చెప్పబడుతున్న ఈ పురుషుడు ప్రతిబింబస్వరూపుడా? లేక చక్షురింద్రియానికి అదిష్ఠాత ఐన దేవతావిశేషమా? లేక జీవాత్మనా? ఇవేవీ కాకపోతే పరమాత్మనేనా? అని. ఏది తగును అనగా ప్రతిబింబాత్మనే అని సమాధానము చెప్పుతున్నాము. ఎందుకనగా ప్రసిద్ధమైన నిర్దేశము కనపడుతున్నది. **దృశ్యతే** అని సూటిగా చెప్పుతున్నందువల్ల. కాకపోతే జీవాత్మనైనా అవుతాడు. అతడు కూడా కంటిలో

విశేషంగా ఉంటున్నట్లు తెలుస్తున్నది. కనుక అతడికైనా లోక ప్రసిద్ధి కుదురుతుంది. లోకంలో బాగా కన్నురెప్పలను తెరచి చూచి శరీరంలో జీవాత్మ ఉన్నాడా లేడా? అని అతనిస్థితి (ఉండడము) గతు (చనిపోవడము) లను నిర్దేశిస్తున్నారు కదా! **రశ్మిభిరేషోఽస్మిన్ ప్రతిష్ఠితః** ఈతడు **తనయొక్క కాన్తులతో ఈ కంటిలో కుదురుకొని ఉన్నాడు.** అనే శ్రుతి ప్రసిద్ధితో చక్షువులో ప్రతిష్ఠితుడైన దేవతావిశేషమైనా కావచ్చును. వీరియందే ప్రసిద్ధి ఉన్నట్లు నిర్దేశము పొసుగుతున్నది కనుక వీరిలో ఎవ్వరైనా ఒకరు మాత్రమే అన్తఃపురుషుడు. అని పూర్వ పక్షము రాగా సమాధానము చెప్పుతున్నాము వినండి.

అన్తరః ఉపపత్తేః అన్తరుడు పరమాత్మనే. ఆయన యందే ఈ ధర్మము ఉపపన్నము అవుతున్నది. **ఏషఆత్మేతిహోవాచ. ఏతదమృతం ఏతదభయం ఏతద్‌బ్రహ్మేతి. 2) ఏతం సంయద్వామ ఇత్యాచక్షతే. ఏతం హిసర్వాణి వామాని అభిసంయన్తి. ఏషఉఏవ వామనీః ఏషహి సర్వాణివామానినయతి. ఏష ఉ ఏవ భామనీః. ఏష హిసర్వేషు లోకేషుభాతి.** 2) ఇతడిని సంయద్వామ అని పిలుస్తారు. అన్ని మంగళములూ ఇతినినే చేరియుంటున్నవి. ఇతడే ఇతరులు అందరికిన్నీ మంగళములను చేకూరుస్తున్నాడు. ఇతడు మాత్రమే మంగళకరమైన స్థానాలకు తీసుకొనిపోతున్నాడు. ఇతడే అత్యుజ్జ్వలమైన ప్రకాశము కలవాడు. భామనీః అని అతనికి మరో పేరు. ఇతడే అన్ని లోకాలలోనూ ప్రకాశించుతున్నాడు. ఈపై చెప్పిన గుణాలన్నీ పరమాత్మయందే చక్కగా అతుకుతవి కదా!

**స్థానాదివ్యపదేశాచ్చ 1-2-14** స్థానాదులను పేర్కొన్నందువల్ల కూడా. కంటిలో ఉంటూ నియమించడము వంటివి చేయగల్గడము. పరమాత్మకు మాత్రమే సాధ్యము. **యశ్చక్షుషి తిష్ఠన్** అని ఇట్లాంటివన్నీ ఆయనకే ఉన్నవి అని శ్రుతులు చెప్పుతున్నవి. ఇందువల్ల **య ఏషో అక్షిణి పురుషః** అని చెప్పబడినవాడు ఆ పరమాత్మనే అని ప్రతీతి। స్ఫురణ/తోచడము అవుతున్నది. అందువల్ల ప్రసిద్ధవన్నిర్దేశమున్నూ పరమాత్మయందే ఉపపన్నమవుతుంది. ఆ శ్రుతి ప్రసిద్ధి కారణంగానే **దృశ్యతే** అనే సాక్షాత్కార వ్యపదేశమున్నూ యోగులకు కనబడుతున్నందున పొసగుతుంది

సూ॥ **సుఖవిశిష్టాభిధానాచ్చ 1-2-15** సుఖముతో కూడి ఉన్నవాడినిగా చెప్పినందువల్ల నున్నూ. ఇదిగో ఇందువల్ల కూడా అక్ష్యాధారుడైన పురుషుడు సాక్షాత్తూ పురుషోత్తముడే. **కంబ్రహ్మ. ఖంబ్రహ్మ.** సుఖము / జలము బ్రహ్మ.

ఆకాశమున్నూ బ్రహ్మనే అని ప్రస్తావములో ఉన్న సుఖవిశిష్టుడైన బ్రహ్మను ఉపాసించే స్థానాన్ని తెలుపడం కొరకు మరియు సంయద్వామత్వాది గుణాలను విధించడం కొరకున్నూ **యఏషోఽక్షిణి పురుషః** అని చెప్పినారు. సూత్రములోనున్న ఏవకారము హేతువుయొక్క అవసరమే లేదని తోపింపచేస్తున్నది.

ఏమండీ! ఇక్కడ అగ్నివిద్యతో కొంత ఎడము / వ్యవధానము ఏర్పడుతున్నది కనుక **కంబ్రహ్మ** అని చెప్పబడిన బ్రహ్మకు సమ్బన్ధము లేదు. అది ఇట్లాగా – అగ్నులు **ప్రాణోబ్రహ్మ. కంబ్రహ్మ. ఖంబ్రహ్మ** అని బ్రహ్మ విద్యను ఉపదేశించి **అథహైనంగార్హపత్యోఽనుశశాస.** అటుపిమ్మట గార్హపత్యుడు అను అగ్ని ఈ విధంగా అనుశాసనము చేసినాడు అని ఆరంభించి అగ్నులను ఉపాసించే విధానాన్ని ఉపదేశించినారు. ఐతే బ్రహ్మ విద్యకు అగ్ని విద్య అంగము / భాగము అని అనకూడదు. బ్రహ్మ విద్యకు ఫలమైన దానిలో అన్తర్గతము కానిదై దానికి విరోధియైన సర్వాయుః ప్రాప్తి, వంశము విచ్ఛేదం కాకుండా ఉండడము / కొనసాగడం వంటి ఫలాలు వినిపిస్తున్నాయి కాబట్టి. అక్షిపురుషవిద్య అగ్ని విద్య రెండున్నూ వేరువేరు కాబట్టి అగ్నివిద్యలో చెప్పబడిన బ్రహ్మకు అక్షిపురుషుడితో సమ్బన్ధము లేదు అని. దానికి ప్రత్యుత్తరమిట్లాగా చెప్పబడుతున్నది. **1) ప్రాణోబ్రహ్మ 2) ఏతదమృతమేతద భయమేతద్బ్రహ్మ** అని ఈ రెండు వాక్యాల్లోనూ బ్రహ్మ శబ్దాన్ని వత్తి పలికినందువల్లా, **ఆచార్యస్తుతేగతింవక్తా** ఆచార్యులుగారు నీకు పరబ్రహ్మ స్థానానికి పోయే మార్గాన్ని చెప్పుతారు అని అగ్ని వాక్యాన్ని బట్టిన్నీ అర్చిరాదిగతి ఉపదేశానికంటే ముందు బ్రహ్మ విద్య ముగిసిపోనందువల్ల దానిమధ్యలో చెప్పబడిన అగ్నివిద్య బ్రహ్మ విద్యకు అంగము అని నిశ్చయమవుతున్నది. **అథహైనం గార్హపత్యోఽనుశశాస** అని బ్రహ్మ విద్యాధికారియైన వానికే అగ్నివిద్య ఉపదేశింపబడింది కాబట్టిన్నీ. ఇంతేకాకుండా **వ్యాధిభిః ప్రతిపూర్ణోఽస్మి** వ్యాధులతో (ఆధ్యాత్మికమైన) నిండియున్నాను అని బ్రహ్మ ప్రాప్తికి వ్యతిరేకమై అడ్డుగా నిలిచే నానావిధాలైన కామాలతో కొట్టుబడి ఉండడమే కాకుండా గర్భ జన్మ జరా మరణములు మొదలైన సంసార భయాలచేత మరిగి పోతున్న ఉపకోసలుడికి **ఏషా సోమ్య! తేఽస్మద్విద్యాచ ఆత్మ విద్యాచ** ఓ సోమ్యుడా! ఇది మావిద్యా. అట్లాగే ఆత్మ విద్య కూడా. అని రెండింటినీ కలిపి ఉపదేశించినందున మోక్షము ఒక్కటే ఫలముగా గల ఆత్మవిద్యకు అగ్నివిద్య అంగమని తెలుస్తున్నది. ఈ విధంగా అంగత్వము తెలిసిన పిమ్మట ఫలాన్ని గురించి చెప్పడము అర్థవాదము

– **పొగడ్త** – అని అర్థమవుతున్నది. ఐతే ఇక్కడ మోక్షానికి విరోధియైన ఫలమేదీ వినిపించడము లేదు. **అపహతే పాపకృత్యాం లోకీభవతి. సర్వమాయురేతి. జ్యోక్ జీవతి. నాస్యావర పురుషాః క్షీయన్తే. ఉపవయం తం భుంజామో అస్మింశ్చలోకే అముష్మింశ్చ.** పాపకార్యాలు పాపాలు అన్నీ నశించి పోగా బ్రహ్మలోకాన్ని పొందుతాడు పూర్ణాయుష్యముతో జీవిస్తాడు. ఏరోగాలూ నొప్పులూ లేకుండా ఆరోగ్యముతో ఉత్సాహంగా కళకళలాడుతూ ఉంటాడు. ఇతని వంశములో ఇతని తరువాతి వారు నశించిపోరు. వారిని మేము ఎల్లవేళలా కాపాడుతుంటాము అని చెప్పబడిన ఈ ఫలితాలు అన్నీ మోక్షవిద్యకు అధికారియైన వానికి అనుగుణంగా ఉంటున్నాయి. **అపహతే పాపకృత్యామ్** – బ్రహ్మ ప్రాప్తికి విరోధియైన పాపాన్ని నశింపచేస్తుంది. **లోకీభవతి** – బ్రహ్మను చేరుకోడానికి అడ్డంకిగా నిలిచే పాపము నశించినది కనుక బ్రహ్మలోకానికి చేరుకుంటున్నాడు. **సర్వమాయురేతిఽ**బ్రహ్మోపాసనముగియ డానికి ఎంత ఆయుష్యము అవసరమో దాన్ని మొత్తాన్నీ పొందుతాడు. **జ్యోగ్జీవతి,** వ్యాధులు మొదలైన వాటితో క్రుంగికృశించి పోకుండా బ్రహ్మ ప్రాప్తి కలిగేంతవరకూ ఆరోగ్యంగా బ్రతుకుతాడు. **నాస్యావర పురుషాః క్షీయన్తేఽ**ఇతని శిష్యప్రశిష్యాదులు పుత్రపౌత్రాదులున్నూ బ్రహ్మవేత్తలే అవుతారు. **నాస్యాబ్రహ్మవిత్కులే భవతి.** అనికూడా ఇతర శ్రుతులలో బ్రహ్మ విద్యాఫలంగా వినిపిస్తున్నది. **ఉపవయం తం భుంజామోఽస్మింశ్చలోకేఽముష్మింశ్చఽ**అగ్నులమైన మేము ఈ బ్రహ్మ విద్యా ఉపాసకుడిని దగ్గరగా ఉండి అనుభవిస్తాము. అనగా బ్రహ్మను చేరుకొనేంత వరకు వెంట ఉండి విఘ్నాల నుండి కాపాడుతాము అని. ఇందువల్ల అగ్నివిద్య బ్రహ్మవిద్యకు అంగము ఐనందున దానికి సాన్నిధ్యము ఉండడములో వైరుధ్యము లేదు కనుక సుఖవిశిష్టుడైన ప్రస్తుత బ్రహ్మనే ఉపాసన చేయదగిన స్థానాన్ని విధించడం కొరకు మరియు గుణములను విధించడం కొరకున్నూ (అక్షి పురుషుడిని) గురించి చెపుతున్నారు.

ఏమండీ! **ఆచార్యస్తుతే గతింవక్తా** అని బ్రహ్మ విద్యలో గతిమాత్రమే మిగిలినందున ఆచార్యుడి చేత గతి మాత్రమే చెప్పబడాలి అని తెలుస్తున్నది. ఐనప్పుడు స్థానగుణవిధ్యర్థత ఎలా చెపుతున్నారు అని అంటున్నారా? చెపుతున్నాము వినండి. ఆచార్యస్తుతేగతింవక్తాఅనేవాక్యానికిఇదీఅభిప్రాయము.బ్రహ్మవిద్యనుబోధించకుండా ఎక్కడికో వెళ్ళిపోయినవాడు గురువుకాగా ఆ బ్రహ్మ విద్య లభించకపోయినందువల్ల భోజనము చేయకుండా ఉపవాసము ఉంటున్న ఉపకోసలుడు అనే పేరు గల శిష్యుడిని ఉజ్జీవింపచేయడం కొరకు తమకు చక్కగా సేవచేసినందువల్ల సంతోషపడిన

గార్హపత్యాదులైన గురువుగారియొక్క త్రేతాగ్నులు అతడికి బ్రహ్మస్వరూపాన్ని మాత్రమే దానికి అంగము ఐన అగ్నివిద్యనున్నూ ఉపదేశించి **ఆచార్యాద్ధైవ విద్యావిదితా సాధిష్ఠమ్ ప్రాపత్.** ఆచార్యులవారి ద్వారా మాత్రమే తెల్సుకోబడిన విద్యశ్రేష్ఠమైన ఫలాన్ని పొందిస్తుంది అనే శ్రుత్యర్థాన్ని విచారించి సాధుతమత్వప్రాప్తి కొరకు ఆచార్యుడు మాత్రమే సంయద్వామత్వాది గుణకుడైన బ్రహ్మను ఆయనను ఉపాసించేస్థానాన్నీ అర్చిరాది మార్గాన్నీ ఉపదేశించునుగాక అని తలచి ఆచార్యస్తుతే గతిం వక్తా అని చెప్పినారు. గతిని గ్రహించడము ఉపదేశించవలసిన విద్యాశేషాన్ని ప్రదర్శించడానికి మాత్రమే. ఇందువల్లనే అతని ఆచార్యుడు కూడా **అహంతుతే తద్వక్ష్యామి యథాపుష్కరపలాశ ఆపోనశ్లిష్యన్తే ఏవమేవం విదిపాపంకర్మనశ్లిష్యతే.** దాన్ని నీకు చెప్పబోతున్నాను విను. తామర ఆకుపైన నీళ్ళు ఎట్లాగా అంటుకొని ఉండవో అదే విధంగా ఈ పద్ధతిలో పరమాత్మను తెల్సుకొని ఉపాసించేవాడికి పాపకర్మ అంటబోదు. అని మొదలుపెట్టి సంయద్వామత్వాది కళ్యాణగుణవిశిష్టుడైన బ్రహ్మ అక్షిస్థానమునందు ఉపాసించదగినవాడని, ఉపాసన చేసినందుకు ఫలితంగా పరమపదానికి పోయే మార్గమైన అర్చిరాదిగతినిన్నీ ఉపదేశించినాడు. ఇందువల్ల **కంబ్రహ్మ ఖంబ్రహ్మ** సుఖవిశిష్టుడైన ప్రకృతబ్రహ్మను గురించే చెప్పినందువల్ల ఈ అక్ష్యాధారుడైన పురుషుడు పరమాత్మనే.

ఔనండీ! **కంబ్రహ్మ ఖంబ్రహ్మ** అనే వాక్యము ద్వారా పరబ్రహ్మనే చెప్పబడినాడని ఎట్లా తెలుస్తున్నది? ఏ బ్రహ్మనైతే అక్ష్యాధారుడని నీవు చెపుతున్నావు **నామబ్రహ్మ మనోబ్రహ్మ.** ఇత్యాది వచనాలతో పోలికలు ఉన్నందున **కంబ్రహ్మ ఖంబ్రహ్మ** అనే వాక్యము చేత కూడా చెప్పబడిన ప్రసిద్ధాకాశము మరియు లౌకికసుఖాలయందున్నూ బ్రహ్మ దృష్టి విధింపబడుతున్నదని తోస్తున్నది కదా! అని అంటే దానికి ఇది సమాధానము.

సూ॥ **అతఏవచ సబ్రహ్మ. 1-2-16.** ఏ కారణంగానైతే అక్కడ **యదేవకమ్ తదేవఖమ్.** ఏదైతే సుఖమో అదే ఖమ్ అని సుఖవిశిష్టుడైన ఆకాశ శబ్దవాచ్యుడిని గురించి చెప్పబడింది. అందువల్లనే, సుఖవిశిష్టుడైన వానిని చెప్పుతున్నందువల్లనే ఖ శబ్దముచేత ఆయన చెప్పదగినవాడు. ఆకాశము పరంబ్రహ్మ అని, ఇదీ చెప్పబడుతున్న విషయము. అగ్నులు **ప్రాణోబ్రహ్మ కంబ్రహ్మ ఖంబ్రహ్మ** అని చెప్పగా ఉపకోసలుడు ఇట్లాగా సమాధానము చెప్పినాడు. **విజానామ్యహం యత్ ప్రాణోబ్రహ్మ. కంచతు**

**ఖంచన విజానామి.** ప్రాణము బ్రహ్మ అనినేను ఎరుగుదును కాని కంను గురించి గాని ఖమ్‌ను గురించిగానీ తెల్సినవాడిని కాను. అని దీనికి ఇది అభిప్రాయము. అగ్నులు ప్రాణాది ప్రతీకలను ఉపాసించు అని చెప్పలేదు. జన్మ జరా మరణాదిభవభయము చేత భయపడిన వానికి మోక్షాన్ని కోరుతున్నవానికి బ్రహ్మను గురించి ఉపదేశించడానికి పూనుకున్నారు కాబట్టి. ఇందువల్ల ఉపాస్యుడుగా బ్రహ్మను మాత్రమే ఉపదేశించినారు. ఆ సందర్భములో లోకప్రసిద్ధి కలిగిన ప్రాణాదులతో సామానాధికరణ్యము గల బ్రహ్మను చెప్పినారు. ఆ ప్రాణాదులలో ప్రాణవిశిష్టత్వమనేది జగత్తును విశేషంగా ధరించుట అనే యోగంతో గానీ ప్రాణాన్ని శరీరమునుగా కలిగియున్నందువల్లగానీ, ప్రాణాన్ని నియన్త్రించే వాడైనందువల్లగానీ బ్రహ్మకు చక్కగా పొసగుతుంది. అని తెల్సుకొని **విజానామ్యహం యత్ ప్రాణోబ్రహ్మ.** ప్రాణము బ్రహ్మ అని మీరెందుకు అంటున్నారో అది నాకు బాగా తెలుసును అని చెప్పినాడు. అట్లాగే సుఖాకాశాలను గురించి కూడా అవి బ్రహ్మకు శరీరము అవడం చేత ఆయనచేత నియన్త్రింపబడుతున్నందువల్లా అవి విశేషణా లౌతున్నాయని, లేక అన్యోన్యము ఒకటికొకటి వేరు పరిచేవి అయినందువల్ల నిరతిశయానంద రూపుడైన బ్రహ్మ స్వరూపాన్ని సమర్పించడం వల్లగానీ విశేషణాలు అవుతున్నాయి / ఆ పరమాత్మ యందు విడివిడిగా ఉన్న సుఖాకాశాలు విశేషణాలు అయితే విషయ అనుభవరూపమైన సుఖము, భూతాకాశాలకు నియామకుడు అవుతాడు గనుక ఆయనయొక్క స్వరూపము ఎటువంటిదో తెలియకుండా పోతుంది. అవి రెండూ అన్యోన్యమూ వ్యవచ్ఛేదకాలు అయితే అపరిచ్ఛిన్నానందైక స్వరూపము బ్రహ్మకు ఉన్నట్లు తెలుస్తుంది కనుక ఈ రెండింటిలో ఏది? సరియైనది అని నిర్ధారించుకోవడానికి **కం చతు ఖం చ నవిజానామి.** అని పల్కినాడు. ఉపకోసలునియొక్క ఉద్దేశ్యాన్ని తెలుసుకొన్న అగ్నులు **యద్వావకమ్ తదేవ ఖమ్ యదేవఖమ్ తదేవకమ్** ఏది సుఖమో అదే ఆకాశము. ఏది ఆకాశమో అదే సుఖము అని చెప్పినారు. బ్రహ్మకు సుఖరూపత్వమే అపరిచ్ఛిన్నము అని అర్థము. ఇందువలన ప్రాణమును శరీరముగా కల్గి ఉన్నందున ప్రాణవిశిష్టమైన ఏ బ్రహ్మ ఉన్నదో అదే అపరిచ్ఛిన్న సుఖరూపము కూడా అని ముగింపు చేసినారు. **ప్రాణం చ హాస్మై తదాకాశం చోచుః** ఇతనికి ఈ ప్రాణము ఆకాశమున్నూ శరీరములే అని చెప్పినారు అని ఇందువల్ల **కంబ్రహ్మ ఖంబ్రహ్మ** అనుచోట అపరిచ్ఛిన్న సుఖమైన బ్రహ్మ ప్రతిపాదింపబడినాడు కనుక పరంబ్రహ్మనే. అక్కడ ప్రస్తావితుడు. ఆ పరబ్రహ్మనే సంయద్వామగుణకుడే ఇక్కడ అక్ష్యాధారుడుగా చెప్పబడుతున్నాడు. కావున అక్ష్యాధారుడు పరమాత్మనే.

సూ॥ **శ్రుతోపనిషత్క గత్యభిధానాచ్చ 1-2-17** ఉపనిషత్తుల ద్వారా పరమాత్మను తెల్సి ఉపాసించిన వాడియొక్క గతిని పేర్కొన్నందువల్ల. **శ్రుతోపనిషత్కస్య** – పరమ పురుషునియొక్క యథార్థస్వరూపాన్ని తెల్సుకున్న వాడికి అనుసన్ధానము చేసుకొనదగినదిగా ఇతర శ్రుతులలో ప్రతిపాదింపబడుతున్న అర్చిరాది గతి ఏదైతే ఉన్నదో పునరావృత్తి లేనిది అనే లక్షణాన్ని కలిగి ఉన్న పరమ పురుష ప్రాప్తిని కలిగించే దానిని అక్షిపురుషుడిని గురించి విన్న ఉపకోసలుడికి **తేఽర్చిషమేవాభి సంవిశన్తి. అర్చిషోఽహః. అహ్నః ఆపూర్య మాణ పక్షమ్** వారు అర్చిః / కాన్తిలోకి ప్రవేశించుతున్నారు. అక్కడి నుండి పగటిపూట, పగటి నుండి శుక్లపక్షము లోనికి అని ఆరంభించి **చంద్రమసోవిద్యుతమ్. తత్పురుషోఽమానవః సఏనాన్ బ్రహ్మగమయతి. ఏషదేవపథో బ్రహ్మపథః ఏతేన ప్రతిపద్యమానాః ఇమం మానవ మావర్తమ్ నావర్తన్తే.** చంద్రుడినుండి విద్యుత్ పురుషుడి వద్దకు అతడు అమానవుడు. ఆయన ఈ బ్రహ్మోపాసకులను బ్రహ్మ వద్దకు చేరుస్తాడు. ఇది దేవ పథము. ఇదే బ్రహ్మ పథము. దీనిద్వారా బ్రహ్మ లోకాన్ని చేరుకున్నవారు. ఈ మానవ జన్మను తిరిగిపొందరు. అని చివరిదాకా ఉపదేశించుతాడు. ఇందువల్ల ఈ అక్షి పురుషుడు పరమాత్మనే.

సూ॥ **అనవస్థితే రసంభవాచ్చ నేతరః 1-2-18** ఉండనందువల్ల, ఎన్నటికీ కుదరనందువల్ల జీవుడు అక్షిపురుషుడు కాడు. ప్రతిబింబాదులు కన్నులో తప్పని సరిగా ఉండడం అనేదిలేదు. అట్లే అమృతత్వాదులు నిరుపాధికాలు (కారణమేదీ లేకుండానే కలిగేవి) ఐన గుణాలు అవి వారిలో ఉండేవికావు. కనుక పరమాత్మకంటే ఇతరుడు ఛాయాదులు అక్షిపురుషుడు కావడానికి అర్హత లేదు. ప్రతిబింబమైతేనేమో ఎదురుగా మరొకపురుషుడు ఉంటేనే తప్ప ఖచ్చితంగా ఎప్పుడూ ఉండడమనేది సంభవించదు. జీవుడు కూడా అన్ని ఇంద్రియాల వ్యాపారాలకు తగినట్లుగా ఉండడము కోసం సర్వేంద్రియాలకు మూలకందమైన ఒకానొక విశేషస్థానము నందు ఉంటున్నాడు. కనుక జీవుడికి కంటిలో ఉనికి లేదు. ఇక అధిష్ఠాన దేవత **రశ్మిభిరేషోఽస్మిన్ ప్రతిష్ఠితః** అని రశ్మి ద్వారా ఉంటున్నాడు అని చెప్పినందువల్ల కన్నులోనే కాకుండా మరేదో ఒకదేశములో ఉంటూ కూడా చక్షురింద్రియానికి అధిష్ఠాతఐ ఉండడం పొసగుతుంది కనుక అతడున్నూ కంటిలో నియతంగా ఉండడము కుదరదు. ఇది ఇట్లుంటే ఈ చెప్పినవారందరికీ నిరుపాధికమైన అమృతత్వాదులు సంభవించనే సంభవించవు. అందువల్ల అక్షిపురుషుడు పరమాత్మనే. **ఇది అన్తరధికరణము.**

★ ★ ★

## ఇక అన్తర్యామ్యధికరణము.

స్థానాదివ్యపదేశాచ్చ అనుసూత్రము వద్ద యశ్చక్షుషితిష్ఠన్ ఇత్యాదివాక్యము ద్వారా ప్రతిపాదింపబడే కంటిలో ఉండడము, శరీరాన్తర్వర్తియైన ఆత్మను నియమించడము వంటి లక్షణాలు పరమాత్మకే తప్ప అన్యులకు లేవు కాబట్టి అక్షిపురుషత్వము పరమాత్మదేనని సాధించబడింది. ఇప్పుడు దానినే సమర్థిస్తున్నాడు.

సూ॥ **అన్తర్యామ్యధిదైవాధిలోకాదిషు తద్ధర్మవ్యపదేశాత్ 1-2-19**
పరమాత్మ అన్తర్యామి. అధిదైవ అధిలోకాదులలో ఆయనలో ధర్మాలను చెప్పినారు గనుక- కాణ్వులు మాధ్యందినులు వాజసనేయవేదశాఖకు చెందినవారు ఇట్లాగా పఠించుతున్నారు. **యః పృథివ్యాం తిష్ఠన్ పృథివ్యా అన్తరో యంపృథివీనవేద యస్యపృథివీ శరీరం యఃపృథివీ మన్తరో యమయతి స తే ఆత్మా అన్తర్యామీ అమృతః** అని ఇదే విధంగా నీరు నిప్పు అన్తరిక్షము వాయువు ద్యులోకము ఆదిత్యుడు దిశలు చంద్రుడు చుక్కలు ఆకాశము తమస్సు (సూక్ష్మప్రకృతి – చీకటి కాదు) తేజస్సు దేవతలలో, సమస్త భూతాలలో, ప్రాణము వాక్కు చక్షువులు చెవులు మనస్సు చర్మము విజ్ఞానము రేతస్సు ఆత్మ ఆత్మీయముల యందు ఉంటున్నవాడు. వాటికి అన్తరుడు. బైటనున్నవాడికి గానీ ఎవడిలోనున్నాడో వానికిగానీ తెలియనివాడు ఐనా వాటినే తనకు శరీరముగా చేసుకున్నట్టివాడు, వాటివాటిని అదుపులో పెట్టుకుంటూ నియమించేవాడు ఐన ఒకానొకడిని నిర్దేశించి **ఏష తే ఆత్మా అన్తర్యామీ అమృతః** ఇట్లాంటి వాడు నీకు కూడా ఆత్మ. అన్తర్యామీ లోపలనున్నట్టి వాడు. ఆనందస్వరూపుడు. అని ఉపదేశింపబడుతున్నది. మాధ్యందినశాఖ వారి పాఠములోనైతే **యః సర్వేషులోకేషుతిష్ఠన్** ఎవడు అన్నిలోకాలలోనూ ఉంటూ **యఃసర్వేషువేదేషు, యఃసర్వేషుయజ్ఞేషు** అని కూడా పర్యాయములు, **యో విజ్ఞానే తిష్ఠన్** అనే పర్యాయము యొక్క స్థానంలో **యః ఆత్మని తిష్ఠన్** అని పర్యాయముగా / బదులుగా పాఠము కనిపిస్తున్నది. అట్లాగే **సతే ఆత్మా అన్తర్యామీ అమృతః** అని కూడా విశేషము ఉన్నది.

ఇచ్చట సంశయము వెలిబుచ్చబడుతున్నది. ఈ అన్తర్యామి ప్రత్యగాత్మనా? లేక పరమాత్మనా అని? ప్రత్యగాత్మనే అని అనుట తగును. ఎందువల్ల నంటే ఈ వాక్యముయొక్క చివరలో **ద్రష్టాశ్రోతా** అని కరణములు ఇంద్రియములపై ఆధారపడి జ్ఞానాన్ని పొందుతూ ఉన్నట్లు వినిపిస్తున్నది కనుక. ఈ విధంగా ద్రష్టఐన వాడికే అన్తర్యామిత్వం ఉపదేశించబడినందున, **మరియు నాఽన్యోఽతోఽస్తిద్రష్టా** ఇతని

కంటే ద్రష్టయైన వాడు మరొకడు లేడు అని మరొక ద్రష్టను నిషేధించినందువల్లనున్నూ అని.

ఇట్లా పూర్వపక్షము ఏర్పడితే సమాధానము చెప్పబడుతున్నది. అన్తర్యామ్యధి దైవాధి లోకాదిషు తద్ధర్మ వ్యపదేశాత్ అని. అధిదైవఅధిలోకాది పదములచేత చిహ్నితములైన వాక్యాల యందు వినిపించుతున్న అన్తర్యామి అపహత పాప్మడైన పరమాత్మ నారాయణుడే. కాణ్వుల పాఠము వల్లసిద్ధించిన అధిదేవాదిమత్తులు ఐన వాక్యాలకంటే ఎక్కువగా అధిలోకాదిమత్తులు ఐన వాక్యాలు మాధ్యన్దిన పాఠములో ఉన్నాయని తెలుపడం కొరకు అధిదైవ అధిలోకాదిషు అని రెండింటినీ తీసుకున్నారు. ఆ తీరుగా రెండు శాఖలకు చెందిన వాక్యాలలోనూ అన్తర్యామి పరమాత్మ అని అర్థము. ఏకారణంగా అనేట్లయితే అతని యొక్క ధర్మాన్ని వ్యపదేశించినందువల్ల, చెప్పినందువల్ల అని. పరమాత్మ యొక్క ధర్మమిది. తాను ఒక్కడే అయ్యి ఉండి కూడా సర్వలోకాలు సర్వభూతాలు సర్వదేవాదులను నియమిస్తున్నాడనునది. ఉద్దాలకుని ప్రశ్న కూడా అట్లాగే ఉన్నది. **య ఇమం చలోకంపరంచలోకం సర్వాణిచ భూతాని యోఽన్తరో యమయతి.** ఎవడు ఈ భూలోకాన్ని దీనికి పైనున్న పరలోకాన్నీ సర్వభూతాలనున్నూ ఎవడువాటిలో ఉంటూ నియమిస్తున్నాడు అని ఉపక్రమించి **తమన్తర్యామిణం బ్రూహి** ఆ అన్తర్యామిని వివరించు అని. దానికి సమాధానము – **యః పృథివ్యాం తిష్ఠన్** అని ఆరంభించి చెప్పబడింది. ఈ విధమైన సర్వలోకాలను సర్వభూతాలను సర్వదేవతలను సర్వవేదాలను సర్వయజ్ఞాలనున్నూ వాటి లోపలకు ప్రవేశించి అన్నిరకాలుగా నియమించుట అన్నింటినీ తనకు శరీరంగా కలిగి ఉన్నందున అన్నింటికీ ఆత్మఐ ఉండడమున్నూ సర్వజ్ఞుడూ సత్యసంకల్పుడూ ఐన పురుషోత్తముడికితప్ప ఇతరునికి సంభవించదు. అదెట్లాగంటే **అన్తః ప్రవిష్టః శాస్తాజనానాం సర్వాత్మా 2) తత్ సృష్ట్వా తదేవాను ప్రావిశత్. తదను ప్రవిశ్య సచ్చ త్యచ్చాభవత్** ఇత్యాదులైన ఉపనిషద్ వాక్యాలు పరమాత్మకే చరాచర మిశ్రము చిదచిన్మిశ్రమూ ఐన ఈ సమస్తాన్నీ ప్రశాసించగలుగడము. అంతటికీ ఆత్మయై ఉండడమున్నూ చెపుతున్నాయి. అట్లాగే సుబాలోపనిషత్తులోనూ **నైవేహకించనాగ్ర ఆసీదమూల మనాధారమిమాః ప్రజాః ప్రజాయన్తే దివ్యోదేవో ఏకో నారాయణః చక్షుశ్చద్రష్టవ్యంచ నారాయణః శ్రోత్రంచశ్రోతవ్యంచనారాయణః.** ఈ లోకంలో సృష్టికి ముందు కాలములో ఏదీలేకుండెను. మూలమైనవాడు పదార్థమూ లేకుండా ఈ బిడ్డలు / ప్రజలు పుట్టరు. దివ్యుడూ ఉజ్జ్వలంగా వెలుగుతూ ఉండే నారాయణుడు

ఒక్కడే ఉండినాడు. కన్నూ దానితో చూచే చూడదగిన దృశ్యమూ ఆయనే నారాయణుడే. చెవ్వు దానితో వినబడేది కూడా నారాయణుడే. అని మొదలుపెట్టి **అన్తశ్శరీరే నిహితో గుహాయాం అజఏకోనిత్యః యస్యపృథివీ శరీరమ్. యఃపృథివీ మన్తరేసంచరన్ యం పృథివీనవేద యస్యాపశ్శరీరమ్** శరీరములో హృదయగుహలో నిల్చియున్నాడు. పుట్టుకలేనివాడు. ఒక్కడు నిత్యుడు. ఎవనికి భూమి శరీరమో ఎవడు పృథివి లోపల సంచరించుతూనే ఉన్నా ఎవనిని పృథివి ఎరుగదో! ఇట్లే ఎవనికి నీరు శరీరమో ఇత్యాదులు. **యస్యమృత్యుః శరీరమ్. యోమృత్యుమన్తరే సంచరన్ యంమృత్యుర్నవేద. ఏషసర్వభూతాన్తరాత్మా అపహతపాప్మాదివ్యోదేవ ఏకోనారాయణః** ఎవనికి మృత్యువు – మరణశీలమైన మూలప్రకృతి – శరీరమో ఎవడు మృత్యువులోపల తిరుగుతూనే ఉంటాడో ఎవడిని మృత్యువు ఎరుగదో అట్టి ఈ పురుషుడు సర్వభూతాలకున్నూ లోన ఉండేవాడు. అన్తరాత్మ. పాపాలు లేనివాడు. దివ్యుడు ద్యులోకములోనుండేవాడు. దేవుడు. ఒక్కడు నారాయణుడు. అని పరబ్రహ్మకే సర్వాత్మత్వము సర్వశరీరత్వము సర్వనియంతృత్వము కూడా ప్రతిపాదిస్తున్నది. సహజమైన అమృతత్వము పరమాత్మకే ఉన్న ధర్మము. పరమాత్మకు ఇంద్రియాలపైన ఆధారపడిన ద్రష్టృత్వాదులు లేవు. ఐతే / కానీ సహజంగానే సర్వజ్ఞత్వము సత్యసంకల్పత్వమున్నూ ఆయనవల్ల సిద్ధించినవే కాని ముక్తుడికి వలె పరాయివ్యక్తి నుండి కలిగినవి కావు. అతని దయతో వచ్చినవిన్నీ కావు. అట్లాగని శ్రుతి పలుకుతున్నది. **పశ్యత్యచక్షుః సశ్రుణో త్యకర్ణః అపాణి పాదోజవనోగృహీతా.** ఆయనకు కన్నులులేవు ఐనా చూడగలడు. ఆయనకు చెవులులేవు. ఐనా వినగలడు. కాళ్ళూ చేతులున్నూ లేవు. అయినా వేగంగా ముందుకు సాగగలడు. పట్టుకోనూగలడు. అని దర్శన శ్రవణాదిశబ్దాలు చక్షురాది ఇంద్రియాలు (సాధనాలు–పనిముట్లు) ద్వారా పుట్టే జ్ఞానానికి వాచకాలు కావు. ఐతే రూపాదులను తెలుపడానికి మాత్రమే పనికివస్తాయి. ఆ విధమైన రూపాది సాక్షాత్కారము కర్మ కారణంగా మూసుకుపోయిన సహజజ్ఞానం కల జీవుడికి చక్షురాది పనిముట్లు ద్వారా పుడుతున్నది. పరమాత్మకు ఏసాధనాలు లేకుండానే జ్ఞానము కలుగుతుంది.

**నాన్యోఽతోఽస్తి ద్రష్టా** అనే వాక్యము కూడా దీనికన్నా ముందు ఉన్న వాక్యము ద్వారా చెప్పబడిన నియన్త ఐన ద్రష్ట కంటే మరొక ద్రష్ట లేదని చెప్పుతున్నది. **యం పృథివీనవేద. యమాత్మా నవేద** ఇటువంటి వాక్యాల ద్వారా పృథ్వీ ఆత్మ మొదలైన నియమింప బడేవారికి కనుపించని తెలియరానివాడే వారిని నియమిస్తున్నాడు / అదుపు చేస్తున్నాడు అని ఏది ఇంతకుముందు చెప్పబడిందో దాన్నే **అదృష్టో ద్రష్టా**

**అశ్రుతః శ్రోతా** ఆయన కనుపించడు కానీ తాను అందరినీ చూడగలడు. ఆయన వినిపించడు కాని అందరి విన్నపాలనూ వింటాడు అని ముగించి **నాన్యోఽతోఽస్తి ద్రష్టా** ఇత్యాది వాక్యముతో నియన్తఐన ఆయనకు పైన మరొక నియన్తలేదని నిషేధింపబడుతున్నది. **ఏషతే ఆత్మా, సతే ఆత్మా** ఇతడు నీకు ఆత్మ ఆయన నీకు ఆత్మ అనే వాక్యము ద్వారా కూడా ఈ పరమాత్మ కంటే వేరుగా వ్యతిరేక విభక్తి చేత నిర్దేశింపబడిన జీవుడికి ఆత్మగా ఉపదేశింపబడుతున్న అన్తర్యామి జీవుడు కావడానికి వీలులేదు. ఆ అర్హత అతనికి లేదు.

సూ॥ **నచస్మార్తమ్ అతద్ధర్మాభి లాపాచ్ఛారీరశ్చ 1-2-20** ప్రకృతి, జీవులు కారు. వారికి చెందని ధర్మాలను పేర్కొన్నందువల్ల. స్మార్తమ్ – ప్రధానం ప్రకృతి (కపిలస్మృతి ద్వారా జగత్ కారణంగా ప్రతిపాదింపబడింది కనుక స్మార్తమ్ అనబడ్తున్నది) శారీరః=జీవుడు శరీరాన్ని కలిగినవాడు. దానితో ప్రవేశరూపమైన సమ్బన్ధము ద్వారా తెలియబడుతున్నాడు కనుక జీవుడు శారీరుడు అని పిలువబడ్తున్నాడు. ఈస్మార్తము మరియు శారీరుడున్నూ అన్తర్యాములు కారు అతద్ధర్మాభిలాపాత్ – వారికి ఉన్నదని ఊహించడానికి ఐనా వీలుకాని ధర్మాన్ని గురించి చెప్పబడింది కాబట్టి. సహజంగానే అన్నింటినీ అంతటినీ చూడగల్గడము, అన్నింటినీ అదుపులో ఉంచుకోవడము, అన్నింటికీ ఆత్మగా ఉండి నామరూపవ్యాకరణము, ఉజ్జీవింపచేయడము తనకుతానే సహజంగానే అమృతత్వము ఆనందపూర్ణత్వము వారిద్దరికిన్నీ ఊహించడానికైనా అవకాశము లేదు. ఆ వాసన కూడా అంటదు. ఇదీ ఇక్కడ చెప్పబడుతున్నది – ఎట్లాగైతే స్మార్తము అచేతనమైనట్టిది సర్వజ్ఞత్వము నియన్తృత్వము సర్వాత్మత్వములకు తగినది కాదో అట్లాగే జీవుడు కూడా తగినవాడు కాడు. వారికి ఆ ధర్మాలు లేవు అని. ఈ గుణాలు పరమాత్మలో అన్వయిస్తాయి. ప్రత్యగాత్మలో వ్యతిరేకిస్తాయి అని రెండు సూత్రాల ద్వారా సూచింపబడింది. నిరపేక్షమైన మరొక హేతువును చెపుతున్నాడు.

సూ॥ **ఉభయేఽపిహి భేదేనైన మధీయతే 1-2-21** రెండు శాఖలవారు కూడా భేదము కలవాడినిగా బ్రహ్మను పఠించుతున్నారు. ఉభయే – మాధ్యందినులు, కాణ్వులున్నూ అన్తర్యామి చేత నియమింపబడే వాడైనందువలన వాక్కు మొదలైన అచేతనాలతో సమానంగా ఈ శారీరుడిని కూడా విభజించి చదువుతున్నారు. **య ఆత్మనితిష్ఠన్ ఆత్మనోఽన్తరో యమాత్మా నవేద యస్యాత్మా శరీరమ్ య ఆత్మాన మన్తరో యమయతి సతఆత్మాఽన్తర్యామ్యమృతః** అని మాధ్యన్దినులు, **యో విజ్ఞానే తిష్ఠన్** అనిన్నీ

కాబ్బట్టి పరమాత్మచేత నియమింపబడే వాడైనందున ఆయనకన్నా విలక్షణుడు అని ఈయనను గురించి పఠిస్తున్నారు అని అర్థము. ఇందువల్ల అన్తర్యామి ప్రత్యగాత్మ కన్నా విలక్షణుడు. అపహతపాప్మడు పరమాత్మ నారాయణుడు అని సిద్ధమైంది. **ఇది అన్తర్యామ్యధికరణము.**

★ ★ ★

## ఇక అదృశ్యత్వాదిగుణక అధికరణము

సూ॥ **అదృశ్యత్వాది గుణకోధర్మోక్తేః 1-2-22** పరమాత్మ అదృశ్యత్వాది ధర్మాలు కలవాడు. ఆయన ధర్మాలను చెప్తున్నందువల్ల. ఆధర్వణికులు ఇట్లాగా చదువుతున్నారు. **అధపరా యయా తదధిగమ్యతే. యత్ తదద్రేశ్యమగ్రాహ్యమగోత్ర మవర్ణమచక్షుశ్శ్రోత్రమ్ తదపాణిపాదమ్, నిత్యం విభుమ్. సర్వగతమ్ సుసూక్ష్మమ్ తదవ్యయమ్ యద్భూతయోనింపరిపశ్యన్తి ధీరాః!** ఇక పరా అనే విద్య గురించి చెప్పుచున్నాను దేని చేతనైతే ఆ పరబ్రహ్మ తెల్సుకోబడుతాడో / చేరుకోబడుతాడో / ఆ బ్రహ్మ అనబడేది కంటికి కనబడదు. చేతులకు చిక్కదు. దానికి పేరు లేదు. రంగులేదు. కండ్లూ చెవులూ లేవు. కాళ్ళు చేతులున్నూ లేవు. అది ఎల్లకాలం ఉండెడిది. అంతటా వ్యాపించి యుండునది. మిక్కిలి సూక్ష్మమైనది. ఎటువంటి మార్పులనూ పొందెడిది కాదు. ఇటువంటి దీనిని జ్ఞానం కలవారు ఈ సమస్త భూతాలకున్నూ పుట్టుకకూ కారణమైనదిగా దర్శించుతున్నారు. అట్లాగే దీని తర్వాత కూడాను. **అక్షరాత్ పరతః పరః.** అక్షరమైన ప్రకృతి కంటే పరుడనబడే జీవుడికన్నా పరుడైనవాడు. అని ఇచ్చట సందేహం కల్గుతున్నది. ఇక్కడ అదృశ్యత్వాదిగుణములు కలది అక్షరము ఐన స్వభావము కలపరుడు జీవుడా? లేక ప్రకృతి పురుషులా? లేక రెండుచోట్లనున్నూ పరమాత్మ మాత్రమే చెప్పబడినాడా? అని. ఏదినిశ్చితమవుతున్నది అనగా ప్రకృతి పురుషులు ఇద్దరు అని. ఏ కారణంగానంటే ఈ అక్షరమైన ప్రకృతికి **అదృష్టోద్రష్టా** కనబడదు కానీ అన్నింటినీ చూస్తుంటాడు ఇత్యాదివాక్యాల్లో వలె ద్రష్టృత్వము మొదలైన చేతనధర్మాలు ఇక్కడ వినిపించడం లేదు. **అక్షరాత్ పరతః పరః** అని కూడా వికారాన్ని చెందే ఈ ప్రకృతి కంటే పరమైన అక్షరము కంటే పరుడైన క్షేత్రజ్ఞ సమష్టిపురుషుడైన వాడు ప్రతిపాదింపబడుతున్నాడు. ఇదీ ఇక్కడ చెప్పబడుతున్నది - రూపాదులను కలిగియుండి స్థూల రూపమైన చైతన్యము లేని పృథివీ మొదలగు భూతాలకు ఆశ్రయమై దృశ్యత్వాదులు లేవు అని చెప్పబడుతున్న పృథివ్యాదులతో సజాతీయమై

సూక్ష్మమైన రూపముతో ఉండే అచేతనాన్నే ఎదుట ఉంచుతున్నది. అది ఏదో కాదు. ప్రధానమే. దానికంటే పరత్వము – ఆధిక్యము సమష్టి పురుషుడికే ప్రసిద్ధము. ఆ సమష్టి పురుషుడి చేత అధిష్ఠితమైన ప్రధానమే మహత్తు మొదలుకొని విశేషము వరకు ఉన్న పలురకాల వికారాల సముదాయాన్ని ఈనుతున్నది పుట్టిస్తున్నది అని చెపుతూ అందుకు తగిన అనేక దృష్టాన్తాలున్నూ ఉపన్యసింపబడుతున్నాయి. **యథోర్ణనాభిః సృజతే గృహ్ణతేచ. యథాపృథివ్యామోషధయః సమ్భవన్తి. యధాసతః పురుషాత్కేశలోమాని తథాఽక్షరాత్ సమ్భవతీహవిశ్వమ్.** ఊర్ణనాభి అనబడు సాలెపురుగు తనలో నుండి దారాన్ని పుట్టించుతుందో, తిరిగి తనలోనికి వెనుకకు తీసుకుంటుందో, ఎలాగైతే నేలలో నుండి చెట్లు మొక్కలు పుడుతున్నాయో, ఎట్లాగైతే దేహములో ఉంటున్న జీవుడి నుండి వెంట్రుకలు తలపైనుండి శరీరాన్నుంచీ పుట్టుకొని వస్తున్నాయో అట్లాగే అక్షరుడి నుండి విశ్వము పుడుతూ ఉన్నది అని ఇందువల్ల ఈ ప్రకరణంలో ప్రధానము, పురుషులు మాత్రమే ప్రతిపాదింపబడుతున్నారు. అని.

ఇట్లా పూర్వ పక్షము ఎదురుకాగా చెప్పబడుతున్నది. అదృశ్యత్వాది గుణకోధర్మోక్తేః అదృశ్యత్వాది గుణములు కలవాడు అక్షరాత్ పరుడైన ఆయన యొక్క ధర్మాన్ని చెపుతున్నది కాబట్టి **యః సర్వజ్ఞః సర్వవిత్** ఎవడు సర్వజ్ఞుడూ సర్వవిత్తూనో ఇత్యాది వాక్యముతో సర్వజ్ఞత్వాదులు ఏవి చెప్పబడినాయో అవి అన్నీ ఆయనలోని ధర్మాలే.

అది ఎట్లాగా ఉన్నాయో వివరిస్తాము. **యయాతదక్షరమధి గమ్యతే** దేనిచేతనైతే ఆ అక్షరపురుషుడు / నాశనము లేని స్థానము పరమపదాన్ని చేరుకోగలమో! ఇత్యాది వాక్యము ద్వారా అదృశ్యత్వాదిగుణాలను కల్గిఉన్న అక్షరుడిని పేర్కొని **అక్షరాత్ సంభవతీహవిశ్వం** అక్షరుడి నుండి ఈ విశ్వము పుడుతున్నది. అనిఆయన నుండే విశ్వము యొక్క పుట్టుకనున్నూ చెప్పి **యః సర్వజ్ఞః సర్వవిత్ యస్యజ్ఞానమయం తపః తస్మాదేతద్ బ్రహ్మ నామరూపమన్నంచ జాయతే.** ఎవడు సర్వమునూ, బాహ్యాభ్యన్తరములలోని వారి ప్రవృత్తులనునూ తెల్సుకొనగలవాడో, ఎవనియొక్క తపస్సు జ్ఞానమయమో అతడి నుండి ఈ బ్రహ్మ (జీవుడు) నామరూపములు అన్నమున్నూ పుడుతున్నవి. అని భూతాలన్నింటికీ పుట్టుకకు కారణమైన అక్షరుని యొక్క సర్వజ్ఞత్వాదులు ప్రతిపాదింపబడుతున్నవి. తరువాత **అక్షరాత్ పరతః పరః** అని ప్రస్తావములోనున్న అదృశ్యత్వాదిగుణాలున్న భూతాలపుట్టువుకు కారణమైన

అక్షరుడిని సర్వజ్ఞుడినే పరుడిగా చెప్పుతున్నది. ఈ కారణంగా **అక్షరాత్ పరతః పరః** అనే వాక్యములోని పంచమీవిభక్త్యన్తమైన శబ్దము ప్రకృత అదృశ్యత్వాది గుణాలు కలవాడైన అక్షరుడిని గురించి తెలుపడం లేదు. సర్వజ్ఞుడు విశ్వయోని ఐన అందరికన్నా మిన్నయైన వానికంటే పరుడైన వాడులేడు. ఇందువల్ల ఇక్కడి అక్షరశబ్దము భూతసూక్ష్మము ఐన అచేతనాన్నే ప్రకృతినే చెప్పుతున్నది. ఈ కారణమువలన కూడా ప్రధానపురుషులు కారు –

సూ॥ **విశేషణ భేదవ్యపదేశాభ్యాంచనేతరౌ 1–2–23.** విశేషణాలను భేదాలనున్నూ చెప్పినందువల్ల ప్రకృతి పురుషులు కారు. ఇక్కడి ప్రకరణము ప్రధానాన్నుండి పురుషుడి నుండి భూతాలకు పుట్టుక కారణమైన అక్షరుడిని, ఒక విజ్ఞానంతో అన్ని వస్తువుల గురించి తెల్సుకోగల్గడము అనే ప్రతిజ్ఞను ఉపపాదించుట మొదలైనవాటి ద్వార విశినష్టి – వ్యావర్తయతి – వేరుచేస్తున్నది అని అర్థము. అట్లాగే ప్రధాన పురుషులకంటే అక్షరుడైన వానికున్న భేదము కూడా చెప్పబడుతున్నది – **అక్షరాత్పరతః పరః** ఇత్యాది వాక్యము ద్వారా!

అది ఈ విధంగా ఉన్నది – **సబ్రహ్మవిద్యామ్ సర్వవిద్యాప్రతిష్ఠా మథర్వాయ జ్యేష్ఠపుత్రాయ ప్రాహ.** ఆ బ్రహ్మ సర్వవిద్యలకున్నూ ప్రతిష్ఠా(నిలుకడ–ముగింపు) కారణమైన బ్రహ్మవిద్యను అథర్వుడు అనే పేరున్న పెద్దకొడుక్కు చెప్పినాడు. ఇట్లాగా చతుర్ముఖ బ్రహ్మ నుండి సర్వవిద్యలకు మూలమైన బ్రహ్మవిద్య క్రమంగా లోకంలోకి వచ్చింది. పరవిద్య మాత్రమే సర్వవిద్యలకు ప్రతిష్ఠాకారణము. అట్లాంటి ఈ విద్యను చతుర్ముఖ అథర్వ ఆది గురుపరమ్పర ప్రకారంగా అంగీరసుడికి ప్రాప్తించింది. ఆ బ్రహ్మ విద్యను తెల్సుకోవడానికి జిజ్ఞాసువు ఐన మహాశాలుడనబడే శునకుని కుమారుడు అంగిరసుడి వద్దకు శాస్త్రంలో చెప్పిన ప్రకారం చేరుకుని అడిగినాడు. **కస్మిన్ ఉ భగవో విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతి.** ఓ పూజ్యుడా ఏ ఒక్కదానిని తెల్సుకుంటే అంతా తెలిసినట్లు అవుతుంది అని బ్రహ్మవిద్య సర్వవిద్యలకూ ఆశ్రయమైనట్టిది. కాబట్టి బ్రహ్మను గురించి తెల్సుకుంటే అంతా తెల్సినట్లు అవుతుంది అని తలచి ఈ శౌనకుడు బ్రహ్మ స్వరూపాన్ని గురించి తెల్సుకోవడానికి ప్రయత్నించుతూ ఆంగిరసమహర్షిని అడిగినాడు ఆయన ఇతడితో చెప్పినాడు. **ద్వేవిద్యేవేదితవ్యే ఇతి హ స్మ బ్రహ్మవిదోవదన్తి పరాచైవాపరాచ.** బ్రహ్మవేత్తలు రెండు విద్యలను గురించి తెల్సుకోవాలని అంటున్నారు. అవి పరా 2) అపరా అను పేర్లు గల్గినట్టివి. అని. బ్రహ్మను చేరుకోవాలనుకునేవాడు

రెండు విద్యలను తెలుసుకోవాలి. బ్రహ్మ విషయంలో పరోక్ష అపరోక్ష రూపాలైన రెండు విజ్ఞానాలను సంపాదించుకోవాలని అర్థము. వాటిలో శాస్త్రజన్యము పరోక్షజ్ఞానము. అపరోక్షజ్ఞానము యోగము ద్వారా తెలియవచ్చేది. వాటిలో బ్రహ్మ ప్రాప్తికి ఉపాయమైనటువంటిది అపరోక్షజ్ఞానము. **అది కూడా భక్తిరూపముగా మారాలి. యమేవైష వృణుతే తేన లభ్యః** ఎవడినైతే ఈ పరమపురుషుడు నచ్చుతాడో అతనికి ఈ పురుషోత్తముడే ఆయన ఇష్టము ప్రకారము మాత్రమే అందుతాడు. అని ఈ అదృశ్యత్వాదిగుణకుడైన భూతయోనియైన అక్షరుడియందే విశేష్యముగా చెప్పబడుతున్నది. ఆలస్యము లేకుండా భగవన్తుడి వద్దకు చేర్చే ఈ భక్తి రూపాపన్న జ్ఞానమును పొందడానికి ఉపాయమైనట్టిది శాస్త్రము వల్ల పుట్టేది, సాధనసప్తకము – వివేక విమోక అభ్యాస క్రియాకళ్యాణాది ఏడుచేత సహకరింపబడిన జ్ఞానము. **తమేతం వేదానువచనేన బ్రాహ్మణాః వివిదిషన్తి. యజ్ఞేనదానేన తపసాఅనాశకేన.** అలాంటి కళ్యాణగుణాకరుడు ఆనందమయుడూ మోక్షప్రదాతఐన పరమపురుషుడిని బ్రాహ్మణులు – బ్రహ్మజ్ఞానమున్నవారు – వేదార్థాన్ని తెలిసి ఉన్నవారు – యజ్ఞము ద్వారా దానము చేయుటద్వారా – తపస్సు చేయడము, ఉపవాసములు చేయడం ద్వారాను – తెల్సుకోవడానికి ప్రయత్నించుతున్నారు. ఇందుకు వారికి ప్రమాణము వేదవాక్యమే, వేదాధ్యయనమే. అని శ్రుతి వినిపిస్తున్నది కాబట్టి. భగవన్తుడైన పరాశరుడున్నూ ఇట్లాగా చెప్పినాడు. **శ్లో॥ తత్ప్రాప్తి హేతుః జ్ఞానం చకర్మచోక్తం మహామునే। ఆగమోత్థం వివేకాచ్చ ద్విధాజ్ఞానం తథోచ్యతే॥** ఓ మహామునీ? భగవన్తుడిని చేరుకోవడానికి కర్మజ్ఞానాలు సాధనాలుగా ఉపయోగపడుతవి. అందులో జ్ఞానము రెండు విధాలుగా ఉన్నది. ఒక్కటి వేదము ద్వారా ఉదయించేది. రెండవది వివేకము ద్వారా పుట్టేది అని **తత్రఅపరా ఋగ్వేదోయజుర్వేదః** ఆ అపరా అనే విద్య ఋగ్వేదము, యజుర్వేదము. ఇత్యాదిగా మొదలుపెట్టి **ధర్మశాస్త్రాణి** అనేంతవరకు ఆగమోత్థమైనది బ్రహ్మ సాక్షాత్కారాన్ని పొందడానికి కారణమైన పరోక్షజ్ఞానం చెప్పబడింది. ఆరంగాలు, ఇతిహాస పురాణాలు ధర్మశాస్త్రము మీమాంసా శాస్త్రములతో కూడిన వేదము బ్రహ్మ జ్ఞానోత్పత్తికి హేతువు అవుతున్నది. **అథపరా, యయా తదక్షరమధిగమ్యతే.** ఇక పరా చెప్పబడుతున్నది. దేనిచేతనైతే ఆ అక్షర పురుషుడిని చేరుకోబడుతున్నదో అని ఉపాసన అనే పేరు గల బ్రహ్మ సాక్షాత్కార లక్షణమైనది భక్తిరూపాపన్నమైన జ్ఞానము. **యత్తదద్రేశ్యమగ్రాహ్యమ్** ఇత్యాది వాక్యం ద్వారా పరోక్ష అపరోక్ష రూపమైన రెండు జ్ఞానాలకు విషయమైన పరబ్రహ్మయొక్క స్వరూపము చెప్పబడుతున్నది. **యథోర్ణనాభిః**

**సృజతే గృహ్ణతేచ.** ఇత్యాది వాక్యముతో ఇంతకుముందు చెప్పిన స్వరూపం గల అక్షరుడైన పరబ్రహ్మ నుండి చేతనాచేతనాత్మకమైన మొత్తము ప్రపంచము యొక్క ఉత్పత్తి చెప్పబడింది. అక్కడ **విశ్వమ్** అని చెప్పబడింది గనుక. ఒక్క అచేతన మాత్రానికి గాదు. **తపసా చీయతే బ్రహ్మ. తతోఽన్నమభిజాయతే. అన్నాత్ ప్రాణో మనస్సత్యమ్ లోకాఃకర్మసు చామృతమ్.** బ్రహ్మ తనయొక్క జ్ఞానంతో వృద్ధిపొందుతున్నాడు. ఆయన నుండి అన్నము – పంచభూతాత్మక ప్రకృతి పుడుతున్నది. ఆ అన్నము నుండే ప్రాణము మనస్సు జీవుడు స్వర్గాదిలోకాలు కర్మలయందు ఆధారపడి యున్న అమృతము – అమృతత్వానికి సాధనమైన కర్మ పుడుతున్నది అని బ్రహ్మనుండి విశ్వము పుట్టిన ప్రకారము చెప్పబడుతున్నది.

**తపసా**=జ్ఞానముతో **యస్యజ్ఞానమయం తపః** ఎవని తపస్సు జ్ఞానమయమో! అని చెప్పబోతున్నాడు గనుక. **చీయతేఽ**వృద్ధి పొందుతున్నాడు/పెరుగుతున్నాడు. **బహూస్యామ్** అని సంకల్ప రూపమైన జ్ఞానముతో బ్రహ్మ సృష్టి చేయడానికి పూనుకుంటున్నాడు. **తతోఽన్నమభిజాయతే** అద్యతే ఇతి తినబడుచున్నది గనుక అన్నం, విశ్వమంతటా నిండియున్న భోక్తృ వర్గానికి భోగ్యభూతమైనది భూత సూక్ష్మాలతో కూడిన అవ్యాకృతము అనబడే ప్రకృతి పరబ్రహ్మ నుండి పుడుతున్నది అని అర్థము. ప్రాణము మనస్సు మొదలైనవి కూడా స్వర్గం మోక్షము రూపాలుగానున్న ఫలాలను సాధించడానికి ఉపకరణము ఐన కర్మ దాకా అవికార సముదాయము అంతా ఆయన నుండే పుడుతున్నది. **యస్సర్వజ్ఞః సర్వవిత్** ఇత్యాది వాక్యము ద్వారా సృష్టికి ఉపకరణాలైన సర్వజ్ఞత్వము సత్యసంకల్పత్వము మొదలైనవి కూడా చెప్పబడినవి. సర్వజ్ఞుడు సత్యసంకల్పుడూ పరబ్రహ్మ ఐన అక్షరుడి నుండి ఈ కార్యరూపములోనున్న బ్రహ్మనామ రూప విభక్తం ఐ భోక్తభోగ్యరూపాలుగానూ అయ్యి పుడుతున్నది. **తదేతత్ సత్యమ్** అని పరబ్రహ్మకు నిరుపాధిక సత్యత్వము చెప్పబడుతున్నది. **మన్త్రేషు కర్మణికవయో యాన్యపశ్యంస్తాని త్రేతాయాంబహుధాసన్తతాని. తాన్యాచరత నియతం సత్యకామాః.** మన్త్రాలయందు కర్మలయందున్నూ దీర్ఘదర్శులైన జ్ఞానులు ఋషులు వేటిని దర్శించినారో అవి త్రేతాగ్నులయందు అనేకరూపాలుగా విస్తరించి ఉన్నవి. సత్యస్వరూపుడైన పరబ్రహ్మను పొందగోరే ముముక్షువులారా! ఆ కర్మలను భగవదారాధనారూపాలైన వాటిని ఎన్నడూ వదలకుండా శ్రద్ధతో ఆచరించండి అని సర్వజ్ఞత్వ సత్యసంకల్పత్వములు మొదలైన కళ్యాణగుణాకరుడైన అక్షరపురుషుడిని

సహజము గానే సత్యమైనవాడిని ప్రతిదినమూ ఎల్లప్పుడూ కోరుతున్నవారై ఋగ్యజుస్సామాధర్వవేదాలలో జ్ఞానులచేత కవులచేత దర్శించబడిన/ కనుగొనబడిన మీమీ వర్ణాశ్రమాలకు తగినవైన వానిని త్రేతాగ్నుల యందు పలుమార్లు ఆచరింపబడిన వాటిని కర్మలను ఆచరించండి అని చెప్పబడుతున్నది. ఏషవః పన్థాః. ఇవి మీరు మీగమ్యానికి చేరుకొనే బాటలు. అని ఆరంభించి **ఏష వః పుణ్యః సుకృతో బ్రహ్మలోకః** ఇది మీయొక్క పుణ్యము. సుకృతము మంచి కర్మలనాచరించడం ద్వారా సమ్పాదించుకున్నది ఐన బ్రహ్మలోకము అనేదాకా కర్మానుష్ఠాన ప్రకారము / పద్ధతి. శ్రుతులు స్మృతులు ప్రేరేపించిన కర్మలయందు ఏ ఒక్క అంశము ఆచరించకపోయినా ఆచరించిన ఇతర కర్మలకున్నూ ఫలితము లేదని శాస్త్రోక్త ప్రకారం ఆచరించని దానికి అసలు /బొత్తిగా ఆచరించని దానితో సమానమేనని చెప్పి **ప్లవాహ్యేతే అదృఢాయజ్ఞ రూపాః అష్టాదశోక్తం అవరం యేషు కర్మ. ఏతత్ యేஉభినన్దన్తి మూఢాః జరామృత్యూ తేపునరే వాపియన్తి.** యజ్ఞములరూపంలో ఉన్న ఈ పడవలు గట్టివి కావు. ఓటి పడవలు. ఇది పద్దెనిమిది. లేక పద్దెనిమిది స్మృతులలో చెప్పబడినట్టివి. లేదా 9 గ్రామ్యపశువులు 9 ఆరణ్యకపశువులు = 18 ఇట్లా చేసే కర్మను గురించి ఎవరైతే శ్రేయస్కరమైనది. ముక్తిప్రదాయకము అని భావిస్తున్నారో మెచ్చుకుంటున్నారో వారు యథార్థమైన దానిని ఎరుగని మూఢులు గనుక మాటిమాటికి పుడుతూ జరా మృత్యువులనే పొందుతున్నారు. ఇత్యాది వాక్యము ద్వారా కర్మల ఫలాన్ని కోరిచేస్తున్నవైనందున జ్ఞానము లేకపోవడంచేత శ్రేష్ఠము కాని అవసరమైన కర్మనే ఆచరించుతున్నారు. కనుక వారికి పునరావృత్తి (తిరిగి ఈ లోకంలో పుట్టడము)ని చెప్పి **తపశ్శ్రద్ధే యే హ్యుపవసన్తి** తపస్సు (జ్ఞానము – తపఆలోచనే) శ్రద్ధలు కలవారై ఎవరు ఉపవాసము (మనస్సును పరమాత్మసాన్నిధ్యములో ఉంచుట) భక్తితో ప్రవర్తించుతున్నారో ఇత్యాది వాక్యముతో తిరిగి ఫలాలను కోరకుండా జ్ఞానిచేత ఆచరించబడిన కర్మ బ్రహ్మప్రాప్తికి తోడ్పడుతుంది. అని మెచ్చుకొని **పరీక్ష్యలోకాన్‌కర్మచితాన్** కర్మల ద్వారా సంపాదించిన పుణ్యలోకాలను గురించి బాగుగా విచారించి ఇత్యాది వాక్యము ద్వారా కేవలకర్మ ఫలాలయందు విరక్తుడైన వానికి శాస్త్రములో చెప్పినట్లున్నకర్మలతో కూడిన జ్ఞానము బ్రహ్మప్రాప్తికి మార్గమైనదానిని – తెల్సుకోదల్చుకున్నవానికి ఆచార్యుని వద్దకు పోవలసినది అని విధించి **తదేతత్ సత్యమ్ యథాసుదీప్తాత్** ఇది సత్యము. యథార్థమైనది. ఎట్లాగైతే బాగా మండుతున్న అగ్ని నుండి నిప్పురవ్వలు ఎగిసి పడుతాయో ఇత్యాది వాక్యముతో

**సోఽవిద్యాగ్రన్థిం వికిరతీ హసోమ్య** ఓ సోమ్యుడా! అతడు జ్ఞానముతో వెలుగుతున్నవాడై తనయొక్క అవిద్యా (కర్మగ్రన్థిని (ముడిని) పటాపంచలు చేసి దూరంగా వెదజల్లుతాడు అనే దాకా ఇంతకుముందువరకు చెప్పబడిన అక్షరుడు భూతయోని ఐన పరబ్రహ్మ పరమపురుషుని యొక్క తరచుగా చెప్పబడిన స్వరూపము గుణాలతో సహా, ఆయన సర్వభూతాలకూ అన్తరాత్మ ఐనందున విశ్వమంతా ఆయనకు శరీరముఐనందున విశ్వరూపము కలవాడు అని, ఆయన నుండి విశ్వము సృష్టి చేయబడినదనిన్నీ చాలా తేటగా చెప్పి **ఆవిః సన్నిహితమ్** యోగులకు అపరోక్షంగా సన్నిహితుడు ఇత్యాదిగా ఆ అక్షరుడికే అవ్యాకృతమైన ప్రకృతికంటే పరుడైన ప్రత్యగాత్మ అనబడే జీవసమష్టి పురుషుడైన వానికిన్నీ పరుడైన పరబ్రహ్మ పరమపదము నందు నిల్చియున్నాడని, అతడు అనవధిక అతిశయానంద స్వరూపుడైన వాడని ఆయనను హృదయ గుహయందు నిల్పుకొని ఉపాసన చేసే పద్ధతి, ఉపాసన పరభక్తి రూపమై – దర్శనం పరభక్తిః స్యాత్ – ఉండాలని ఉపాసన చేసినవానికి అవిద్య నుండి విడుదల కావడమే కాకుండా బ్రహ్మతో సమానంగా బ్రహ్మానుభవఫలమునున్నూ కలుగునని ఉపదేశించి ఉపసంహరించబడింది. ఇందువల్ల ఈ విశేషణాల వల్ల భేదాన్ని తెలుపడము వల్లనున్నూ ఈ ప్రకరణములో ప్రధానము పురుషుడూ ప్రతిపాదింపబడుటలేరు.

భేదవ్యపదేశము కూడా ప్రధాన పురుషులకున్నూ పరబ్రహ్మకున్నూ ఇక్కడ కనపడుతున్నది. **దివ్యోహ్యమూర్తః పురుషః సబాహ్యాభ్యన్తరోహ్యజః. అప్రాణోహ్యమనాః శుభ్రోహ్యక్షరాత్పరతః పరః** ఆ పురుషుడు దివ్యుడు. ఒకానొక నిర్దిష్టమైన ఆకారము లేనివాడు. ఆయన విశ్వమంతటి లోనూ లోపల బయట వ్యాపించియున్నాడు. పుట్టుక లేనివాడు. ప్రాణము లేనివాడు. కర్మ సమ్బన్ధము లేని పరిశుద్ధుడు. అక్షరమునకంటే పరుడైన జీవుని కంటేనూ పరుడు! ఇత్యాదివాక్యాలచేత ప్రకృతి పురుషులకన్నా విశిష్టమైన భేదాన్ని కలిగియున్నాడు. అక్షరమనబడే అవ్యాకృతమైన ప్రకృతికంటే పరుడైన ఏ సమష్టి పురుషుడున్నాడో వానికంటే పరుడనబడేవాడు అదృశ్యత్యాదిగుణములు కల్గినవాడై అక్షర శబ్దము చేత చెప్పబడేవాడు పరమాత్మ అని అర్థము. అక్షరమనగా అశ్నుతే తినుచున్నాడు / తినుచున్నది, లేక నశించిపోవడము లేనిది కనుక అక్షరము. ప్రకృతి వలె అవ్యాకృతమైనప్పటికీ తనయొక్క వికారాల ద్వారా వ్యాప్తిని కల్గియున్నందునగానీ మహదాదుల వలే మరొకపేరుతో పిలువడానికి తగిన క్షరణము లేనందువల్లగానీ అక్షరత్వము ఎట్లాగయినా కుదురుతుంది.

సూ॥ **రూపోపన్యాసాచ్చ 1-2-24** పరమాత్మ యొక్క రూపాన్ని వివరించి చెప్పినందువల్ల. **అగ్నిర్మూర్ధా చక్షుషీ చంద్రసూర్యౌదిశశ్శ్రోత్రే వాగ్వివృతాశ్చవేదాః వాయుః ప్రాణోహృదయం విశ్వమస్యపద్భ్యాం పృథివీహ్యేష సర్వభూతాన్త రాత్మా.** ఆ పరమపురుషునికి అగ్నిశిరస్సు, చంద్రుడు సూర్యుడు రెండు కండ్లు. దిక్కులు చెవులు. వాక్ రూపములో వెలువడినవి వేదాలు. వాయువు ప్రాణము. అతనికి ఈ విశ్వము హృదయము పాదాలనుండి పుట్టినట్టిది భూమి. ఇట్టి ఈ పురుషుడు సమస్త భూతాలకు అన్తరాత్మయై ఉన్నాడు **అని** చెప్పిన విధంగా ఇట్లాంటి రూపం సర్వభూతాన్తరాత్మయైన పరమాత్మకే సంభవించుతుంది. ఇందువల్ల కూడా అదృశ్యత్వాది గుణకుడు పరమాత్మనే. **అని అదృశ్యత్వాధికరణము ముగిసింది.**

★ ★ ★

## ఇక వైశ్వానరాధికరణము

సూ॥ **వైశ్వానరః సాధారణ శబ్ద విశేషాత్ 1-2-25** వైశ్వానరుడు పరమాత్మనే. ఆ శబ్దము సాధారణమైనదే ఐనా విశేషాన్ని చెప్తున్నందువల్ల. ఛన్దోగులు దీన్ని చదువుతున్నారు. **ఆత్మానమేవేమం వైశ్వానరం సమ్ప్రత్యధ్యేషి తమేవనో బ్రూహి.** వైశ్వానరుడు అనబడే ఈ ఆత్మను ఇప్పుడు నీవు అధ్యయనం చేస్తున్నావు. ఆయనను గురించే మాకు తెలుపుము అని మొదలుపెట్టి **యస్త్వేతమేవం ప్రాదేశమాత్ర మభివిమాన మాత్మానం వైశ్వానరముపాస్తే** ఎవడైతే ఇతడిని ప్రాదేశమాత్రుడిని ఐనా కొలత అనేది లేనివాడిని ఆత్మయైన వైశ్వానరుడిని ఉపాసించుతాడో! అని, ఇచ్చట సందేహము. ఈ వైశ్వానరుడనబడే ఆత్మ పరమాత్మ అని నిర్ణయించడానికి చేతనవుతుందా! లేదా అని ఏది నిశ్చితమైనది అని అనగా అశక్యనిర్ణయుడు నిర్ణయము చెయ్యడానికి వీలుకానివాడు అని. ఎందువల్లనంటే వైశ్వానరశబ్దము నాలుగు అర్థాలలో ప్రయోగించుట కనుపడుతున్నది. కడుపులో కలిగే ఆకలిమంటలు అనే విషయంలో **అయమగ్నిర్వైశ్వానరోయేనేదమన్నం పచ్యతేయది దమద్యతే. తస్యఏషఘోషోభవతి యావదే తత్ కర్ణావపిధాయ శృణోతి. సయదో త్క్రమిష్యన్ భవతి. నైనం ఘోషం శృణోతి.** ఈ అగ్నివైశ్వానరుడు. మనం తిన్న అన్నాన్ని ఎవడు పక్వము / జీర్ణము చేస్తున్నాడో, అతని యొక్క ధ్వని ఇట్లాగా ఉంటున్నది. ఎపుడైతే చెవులను మూసుకొని మనస్సును దానిపై లగ్నము చేస్తామో అపుడు వినగలము. ఎపుడైతే ఈ దేహము నుండి వెళ్ళిపోదల్చుకున్నాడో అపుడు ఇతని ధ్వనిని వినలేదు

అని. ఇక పంచమహాభూతాలలో మూడవదైన దానిని గురించి **విశ్వస్మాఅగ్నిం భువనాయదేవాః వైశ్వానరంకేతమహ్నామకృణ్వన్.** విశ్వమంతటికి ఉపకారం చేయడానికి దేవతలు పంచభూతాలలో మూడవవాడైన అగ్నిని సూర్యునిగా చేసినారు. అని దేవతను గురించి **వైశ్వానరస్యసుమతౌస్యామ రాజా హికమ్ భువనానామభిశ్రీః** వైశ్వానరుడనబడే మంచి మనస్సు కలవాని యందు ఉపాసకులము / ఆరాధకులము అగుదుము గాక. సర్వ సంపత్ సమృద్ధి గల అతడు మనకు రాజై ఉన్నాడు కదా! అని. ఇక పరమాత్మ విషయంలో **తదాత్మన్యేవ హృదయ్యేఽగ్నౌవైశ్వానరే ప్రాస్యత్.** హృదయాగ్నియందుండే ఆత్మయందే వైశ్వానరుడనబడే వానియందు ఉండినాడు. అని **సఏషవైశ్వానరో విశ్వరూపః ప్రాణోఽగ్నిరుదయతే.** అట్టి ఈ వైశ్వానరుడు విశ్వమంతటియందు నిండియున్నాడు. అతడు విశ్వరూపుడు. ప్రాణము వంటివాడు. అగ్నివలె తేజోవంతుడై పైకి వస్తున్నాడు. అని కూడా. వాక్య ఉపక్రమ, ఉపసంహారాదుల యందు కనిపించే తాత్పర్యలింగాలు కూడా పైన చెప్పిన అందరికీ తగినట్లు సమన్వయము చేయడానికి వీలుగా ఉన్నాయి. అని.

ఇట్లాగా పూర్వపక్షము ఏర్పడగా సమాధానము చెప్పబడుతున్నది. వైశ్వానరః సాధారణ శబ్దవిశేషాత్ అని. వైశ్వానరః =పరమాత్మ. ఎందువల్లనంటే సాధారణమైన శబ్దవిశేషమగుటవలన. విశేష్యతే = విశేషింపబడుతుంది గనుక విశేషము. సాధారణమైన వైశ్వానర శబ్దము పరమాత్మకు మాత్రమే చెందిన అసాధారణ ధర్మాలతో విశేషింపబడుతున్నది కాబట్టి అని అర్థము. అది ఇట్లాగా – ఔపమన్యుడు మొదలైన మహర్షులు ఐదుగురు ఒకరిని ఒకరు కల్సుకొని **కోన ఆత్మా. కింబ్రహ్మ** మనకు ఆత్మ ఎవరు బ్రహ్మ అనగా ఏది? అని విచారించి **ఉద్దాలకోహవై భగవన్తోఽయమారుణిః సమ్ప్రతీమమాత్మానం వైశ్వానర మధ్యేతి తం హన్తా భ్యుపగచ్ఛామ** ఓ పూజ్యులారా! అరుణుని కుమారుడైన ఈ ఉద్దాలకుడు ఇపుడు ఈ ఆత్మయైన వైశ్వానరుడిని గురించి అధ్యయనమును చేస్తున్నాడు. ఆహా! మనమందరము ఆయన వద్దకు కల్సిపోదాము. అని కూడబలుక్కొని ఉద్దాలకునికి ఉన్న వైశ్వానర ఆత్మ విజ్ఞానాన్ని గమనించి ఆతని వద్దకు వెళ్ళినారు. ఆ ఉద్దాలకుడున్నూ ఈ వైశ్వానర ఆత్మ జిజ్ఞాసువులను గుర్తించి తనకు కూడా ఆ విషయంలో పూర్తిగా తెలియదని ఎంచుకొని వారితో ఇట్లాగా పలికినాడు. **అశ్వపతిర్వై భగవన్తోఽయంకేకయః సమ్ప్రతీమమాత్మానం వైశ్వానరమధ్యేతి తం హన్తా భ్యుపగచ్ఛామః** ఓ పూజ్యులారా! ఈ కేకయదేశానికి

రాజైన అశ్వపతి అను ఆయన ఇప్పుడు మనవలెనే ఆత్మయైన వైశ్వానరుడిని గురించి అధ్యయనము చేస్తున్నాడు. ఆనందంగా ఆయన దగ్గరకు పోదాము అని ఉద్దాలకునితో కలసి ఆ ఆర్గురు ఆ అశ్వపతి అను మహారాజు వద్దకు వెళ్ళినారు. ఆ రాజుగారు కూడా ఆ మహర్షులందరినిన్నీ విడివిడిగా వాళ్ళ యోగ్యతలకు తగ్గట్టుగా అర్చన చేసినాడు. తరువాత **నమేస్తేనః** నేను దాచుకోవలసింది ఏమీలేదు. **యక్ష్య మాణోహవై భగవన్తోఽహమస్మి.** పూజ్యులారా! నేను ఒక యజ్ఞాన్ని చేస్తూ ఉన్నాను. అని ముగిసే వాక్యము ద్వారా తాను దీక్షలో ఉన్నానని కనుక మీరు సమర్పించే దాన్ని పుచ్చుకోవడానికి తగిన అర్హతను కలిగి యున్నానని తెలుపుతూనే బ్రహ్మవేత్తలైనవారు నిషేధించిన వాటిని వదిలిపెట్టాలి. అట్లే తమకు ఆచరించవలసినవాటిని తప్పక పాటింపదగునని తెలియపరుస్తూ **యావదేకైకస్మా ఋత్విజేధనం దాస్యామి తావత్ భగవద్భ్యో దాస్యామి. వసన్తు భవన్తః.** నేను చేస్తున్న యజ్ఞములో ఋత్విక్కులుగా ఉన్నవారికి ఒక్కొక్కరికి ఎంతెంత దక్షిణ ఇవ్వనున్నానో అంతే మొత్తములో తమరికి అందరికిన్నీ ఇస్తాను. మీరందరూ యజ్ఞము పూర్తి అయ్యేంతవరకు ఇక్కడే ఉండండి అని చెప్పినాడు. ముముక్షువులు ఐన ఆ ఆరుగురున్నూ వైశ్వానరుడిని ఆత్మనున్నూ తెల్సుకోదల్చుకుని వచ్చిన వారు కాబట్టి ఆ వైశ్వానరుడిని గురించే మాకు ఉద్బోధించు అని అనినారు. ఈ విధంగా **కోన ఆత్మా కింబ్రహ్మ** ఎవడు మాకు / మనకు ఆత్మ. బ్రహ్మ ఎవరు? అని జీవాత్మను, ఆత్మయైన బ్రహ్మనున్నూ తెల్సుకోదల్చినవారు ఆ వైశ్వానరాత్మను తెల్సుకున్నవాడిని వెతుకుతున్నవారు కనుక ఆ విజ్ఞానము ఉన్న కేకయ రాజుగారి వద్దకు వచ్చి అడుగబడుతున్నవాడు, వైశ్వానరాత్మ పరమాత్మ అని అర్థమవుతున్నది. ఆత్మ, బ్రహ్మ శబ్దాలతో ఉపక్రమించి తదుపరి అన్నిచోట్లలోనూ ఆత్మ వైశ్వానర శబ్దాలతో వ్యవహారము చేస్తూ వచ్చినందున కూడా బ్రహ్మ శబ్దానికి బదులుగా నిర్దేశింపబడుతున్న వైశ్వానరశబ్దము బ్రహ్మను గురించే చెప్పుతున్నదని తేటపడుతున్నది. ఇంతేకాకుండా **ససర్వేషులోకేషు సర్వేషు భూతేషు సర్వేషు ఆత్మసు అన్నమత్తి** ఆయన సర్వలోకాల్లోనూ సర్వభూతాల్లోనూ అన్ని ఆత్మలయందున్నూ అన్నమును / ఆహారాన్ని తినుచున్నాడు. **2) తద్యథా ఇషీకా తూలమగ్నౌ ప్రోతం ప్రదూయేత ఏవం హాస్య సర్వే పాప్మానః ప్రదూయన్తే.** ఎట్లాగా రెల్లుగడ్డి యొక్క దూది గుట్ట మంటల్లో పడి దాని గుర్తు ఏమీ మిగులకుండా మాడి మసై పోతుందో అదే విధంగా భగవదుపాసకుడైన వాని యొక్క అన్ని రకాలైన పాపాలు పుణ్యముతో సహా నశించిపోతాయి అని చెప్పబోయే వైశ్వానరాత్మను గురించి తెల్సుకున్నందువల్ల /

ఉపాసించినందువల్ల కలుగబోయే ఫలము కూడా వైశ్వానరాత్మను పరంబ్రహ్మ అనియే సూచిస్తున్నది. ఇందువలన కూ డా వైశ్వానరుడు పరమాత్మయే.

సూ॥ **స్మర్యమాణమనుమానం స్యాదితి 1-2-26** అందరియొక్క స్మృతిలో ఉన్న పరమాత్మ స్వరూపమే ఇక్కడ హేతువు ఔతున్నది. స్వర్గలోకము/ఆకాశము మొదలుకొని పృథివి దాకా అవయవాలుగా విభజించి వైశ్వానరుని యొక్క విరాట్ రూపము ఇక్కడ ఉపదేశింపబడుతూ ఉన్నది. అది శ్రుతులలోను, స్మృతులలోనూ పరమపురుషుడి యొక్క రూపంగా అందరికీ పరిచితమైనట్టిదే. అదే ఇక్కడ ఆయనదే అని స్మరింపబడుతున్నది. ఇంతకుముందు చూచి ఎరిగి ఉన్నదానినిగా ప్రత్యభిజ్ఞ చేయబడుతూ వైశ్వానరుడు పరమపురుషుడే అని అనడంలో అనుమానము - లింగము అవుతున్నది అని అర్థము. సూత్రములోని ఇతి శబ్దం ప్రకారాన్ని తెల్పుతున్నది. ఇట్లాంటిదైన రూపము (పరమపురుషుడిదిగా గుర్తింపబపడుతున్నట్టిది) వైశ్వానరుడు ఎవరో కాదు పరమాత్మనే అని అనుమానించడానికి హేతువు అవుతున్నది. శ్రుతి స్మృతులలో పరమ పురుషుడి యొక్క రూపము ఇటువంటిదిగా ప్రసిద్ధమై ఉన్నది. అధర్వణవేదంలో **అగ్నిర్మూర్ధా చక్షుషీ చంద్రసూర్యౌ దిశః శ్రోత్రే వాగ్వివృతాశ్చ వేదాః వాయుః ప్రాణో హృదయం విశ్వమస్య పద్భ్యాం పృథివీ హ్యేష సర్వభూతాన్తరాత్మా.** పరమాత్మ యొక్క శిరస్సు అగ్ని. సూర్యచంద్రులు ఇద్దరూ రెండు కండ్లు. దిక్కులు చెవులు. విస్తారమైన వాక్కులు వేదాలు. వాయువే ప్రాణము. ఈ విశ్వమంతా కూడా ఆయనకు హృదయము. నేల పాదములుగా ఉన్నది. ఈయన ఎవరో కాదు భూతాలన్నింటికీ ఆత్మగా ఉన్నటువంటివాడు. అని చెప్పబడింది. అగ్ని ఇక్కడ ద్యులోకముగా పేర్కొనబడింది. ఇందుకు ప్రమాణవాక్యము ఇది. **అసౌవైలోకో అగ్నిః** ఈ లోకమే అగ్ని అని. ఇది శ్రుతివాక్యము. మునులు కూడా ఇట్లాగా శ్రుత్యర్థాన్ని స్మృతి రూపంగా తలచి చెప్పినారు. **ద్యామ్ మూర్ధానం యస్య విప్రా వదన్తి ఖమ్ వైనాభిమ్ చంద్రసూర్యౌచనేత్రే దిశః శ్రోత్రే విద్ధి పాదౌక్షితించ సోఽచిన్త్యాత్మా సర్వభూత ప్రణేతా॥** వేదము నేర్చిన అర్థమును ఎరిగిన బ్రాహ్మణులు పరమాత్మకు శిరస్సుగా ద్యులోకాన్ని, ఆకాశాన్ని నాభిగా, చంద్రసూర్యులు నేత్రాలుగా, దిక్కులు చెవులుగా, నేలను పాదాలనుగా తెల్సుకొమ్మని చెపుతున్నారు. ఆయన ఆలోచనలకు అందనివాడు. ఆత్మయైనవాడు. సమస్త భూతాలను పుట్టించినవాడు అని. **యస్యాగ్ని రాస్యమ్ ద్యౌమూర్ధాఖమ్ నాభిః చరణౌక్షితిః। సూర్యశ్చక్షుః దిశశ్శ్రోత్రమ్ తస్మైలోకాత్మనే**

**నమః.** ఎవనికి అగ్ని నోరుగానూ ద్యులోకము తలగానూ ఆకాశము బొడ్డుగానూ నేల పాదాలుగానూ సూర్యుడు కండ్లుగా దిక్కులు చెవులుగా అవుతున్నాయో అటువంటి లోకాత్మకు – లోకమంతా తన దేహముగా – లోకస్థులైన ప్రాణులందరికీ ఆత్మగా అయ్యి ఉన్నవాడికి నమస్కారము చేయుచున్నాను. అనిన్నీ వర్ణింపబడినాడు. ప్రస్తుత ఉపనిషత్తులోనూ ద్యులోకము మొదలైనవన్నీ వైశ్వానరుడికి తలకాయ మొదలైన అవయవాలుగా చెప్పబడ్తూ ఉన్నవి. అదెట్లాగంటే – తనవద్దకు వచ్చిన ఔపమన్యుడు మొదలైన మహర్షులు **ఆత్మానమేవేమం వైశ్వానరం సమ్ప్రత్యధ్యేషి తమేవనో్బ్రూహి** ఆత్మయైన ఈ వైశ్వానరుడిని నీవిపుడు అధ్యయనం చేస్తూ ఉన్నావు. ఆయనను గురించే మాకు కూడా తెలియచేయవయ్యా! అని అడిగినారు. కేకయరాజుగారు వారికి వైశ్వానరుడి గురించి ఉపదేశించదల్చుకొని వారికి తెలిసియున్న వైశ్వానరాత్మయొక్క విశేషాలను కొన్ని ప్రశ్నలు వేయడం ద్వారా తెల్సుకొని అవి వైశ్వానరుని యొక్క సమగ్ర స్వరూపాలు కావని అర్థం చేసుకొని వారికి వైశ్వానరాత్మను గురించి కొంత తెలుసును మరికొంత తెలువదు అని నిశ్చయించుకొని ఆయా జ్ఞాత అంశాలను తేటగా వారినోటితోనే విని తెల్సుకోవాలని భావించి ఒక్కొక్కరిని ఒక్కొక్కరిని ప్రశ్నించినాడు. ముందుగా ఔపమన్యువు అనే మహర్షిని – **ఔపమన్యవ! కం త్వమాత్మాన ముపాస్సే** ఓ ఔపమన్యుడా! నీవు ఎవరిని ఆత్మనుగా ఉపాసించుచున్నావు అని అడిగినాడు. **దివమేవభగవో రాజన్.** ఓ పూజ్యుడవగు రాజా! నేను ద్యులోకాన్నే ఉపాసిస్తున్నాను అని ఆయన బదులు చెప్పినాడు. అపుడు రాజుగారు ద్యులోకాన్ని మాత్రమే వైశ్వానరుడియొక్క సంపూర్ణ రూపంగా భావించి ఉపాసించడాన్ని ఆయన బుద్ధి నుండి తొలగించదల్చుకొని వైశ్వానరుడికి ద్యులోకము మూర్ధ / శిరస్సు అని ఉపదేశించుతూ వైశ్వానరుడిలో ఒక అంశమైన ఆ ద్యులోకానికి సుతేజాః అని గుణనామధేయాలను చెప్పి వివరించినాడు.

ఇదే విధంగా సత్యయజ్ఞాదులు ఆదిత్యుడు వాయువు ఆకాశము జలము పృథివీ మున్నగు వాటిని ఒక్కొక్కరు ఒక్కక్కదానిని ఉపాసనము చేస్తున్నాము అని చెప్పినారు. వాటికి **విశ్వరూపుడు, పృథక్ వర్త్మ, బహులః, రయిః, ప్రతిష్ఠా** అని ఒక్కొక్కటికి ఒక్కొక్క గుణనామధేయాలను చెప్పి అవి అన్నీ వైశ్వానరాత్మకు కన్నులు, ప్రాణము, సన్దేహము (నడముభాగము) వస్తి (మూత్రకోశము) పొత్తికడుపు, పాదాలు అనే అవయవాలు అని చెప్పినాడు. సందేహము అనగా శరీరము యొక్క నడుమ భాగము. ఇందువలన

ఇట్లాంటి – ద్యులోకము తలకాయ వంటివి / అవయవాలనుగా కల్గినరూపము పరమ పురుషుడి యొక్క రూపమే కావున వైశ్వానరుడు పరమ పురుషుడే. ఇట్లయినా తేటగా నిర్ణయము కాలేదనుకొని ఆ అనుమానాన్ని తొలగించు తున్నారు –

సూ॥ **శబ్దాదిభ్యోఽన్తఃప్రతిష్ఠానాచ్చనేతిచేన్న తథాదృష్ట్యుపదేశాత్ అసమ్భవాత్ పురుషమపిచైన మధీయతే 1-2-27** వైశ్వానరుడు పరమాత్మనే అని నిశ్చయింపబడుతున్నది అని ఏమాట చెప్పినారో అది సరియైనది కాదు. శబ్దాదుల వలన, అన్తఃప్రతిష్ఠానము లోపల ఉండుట వల్లనున్నూ జఠరాగ్నే అని ఇక్కడ ప్రతీతి కల్గుతున్నది. కడుపులో ఉండే అగ్నికి వైశ్వానరాగ్ని అనే పేరు – శబ్దము లోకప్రసిద్ధము. అట్లే లోన ఉండుటవల్లనున్నూ అని. శబ్దము వాజసనేయ శాఖలోని వైశ్వానరవిద్యాప్రకరణములో ఈ విధంగా వినిపిస్తున్నది. **సఏషోఽగ్నిర్వైశ్వానరః** అతడు ఈ వైశ్వానరాగ్నియే అని వైశ్వానర శబ్దముతో సామానాధికరణ్యము కల్గియున్న అగ్ని అని. ప్రస్తుతము ఈ ప్రకరణములో కూడా **హృదయంగార్హపత్యో మనోఽన్వాహార్యపచనః ఆస్యమాహవనీయః** హృదయముగార్హపత్యాగ్ని మనస్సు అన్వాహార్య పచనుడు – జఠరము నందుండెడి వైశ్వానరుడు – ముఖము ఆహవనీయాగ్ని అని వైశ్వానరుడిని హృదయాదులలో ఉన్న వాడిని మూడు అగ్నులు – గార్హపత్య దక్షిణాగ్ని, ఆహవనీయాగ్ని – గా కల్పనము చేయబడుతున్నది. **తద్యద్ భక్తం ప్రథమమాగచ్ఛేత్ తత్ హోమీయమ్. సయాం ప్రథమామాహుతిం జుహుయాత్ తాంజుహుయాత్ ప్రాణాయస్వాహా.** ఏ ఆహారమైతే మొదటగా ముందుకు తేబడుతుందో అది హోమీయము అనబడుతుంది. ఆ భోక్తయైన పురుషుడు దేనిని మొదటిసారిగా ఆహుతిని ఇస్తాడో దానిని ప్రాణాయస్వాహా అనే మన్త్రముతో (పండ్లకు నాలుకకూ తగులకుండా అంగిటిలో) నోటిలో వేసుకోవాలి. శరీరములోపల ఉండే అగ్నిని హోమకుండములో ఉండే అగ్నితో పోల్చుతూ భోజనము లోనూ ప్రాణాహుతులు వేసుకోవాలి. ఇత్యాది వాక్యాలద్వారా వైశ్వానరుడు ఈ పురుషుడితో అన్తః ప్రతిష్ఠితుడై ఉన్నాడని వాజసనేయులు పఠించుతున్నారు. **సయో హైత మగ్నింవైశ్వానరం పురుషవిధం పురుషేఽన్తః ప్రతిష్ఠితం వేద** ఎవడైతే పురుషాకారములో నున్న వైశ్వానరాగ్నిని పురుషుడి యొక్క శరీరములో నిల్చి ఉన్నాడని ఎరుగుతున్నాడో అని. ఇందువల్ల అగ్ని శబ్దంతో సామానాధికరణ్యము ఉన్నందువల్ల, ఈ అగ్నిని త్రేతాగ్ని రూపంగా కల్పన చేసినందువలన, ప్రాణహుతులకు ఆధారమై ఉన్నందున, అన్తఃప్రతిష్ఠానము వల్లనున్నూ వైశ్వానరుడికి జాఠరాగ్నిత్వమున్ను తెలియవస్తున్నది.

కాబట్టి ఏకపక్షంగా పరమాత్మ అని సిద్ధాన్తము చేయతగదు. అని అంటున్నారా? ఆ మాట సహేతుకము కాదు.

ఆ విధంగా దృష్టి / భావన / చూపు పెట్టాలి అని చెప్పినారు కాబట్టి. ఇంతకుముందు చెప్పబడిన ముల్లోకాలూ తనకు శరీరంగా కల్గిన పరబ్రహ్మఐన వైశ్వానరుడిని జఠరాగ్నిని శరీరముగా కలవాడుగా ఎంచి, అలాంటి జఠరాగ్నిని శరీరముగా కల్గినవాడిని ఉపాసన చేయి అని ఉపదేశించినారు కాబట్టి. అగ్ని శబ్దాదుల వలన కేవలము జాఠరాగ్ని మాత్రమే ప్రతిపాదింపబడడం లేదు. కాని జాఠరాగ్నితో విశిష్టుడైన పరమాత్మనే అర్థముగా చెప్పబడుతున్నాడు. అది ఎట్లాగా తెలుస్తున్నది? అని ప్రశ్నించినట్లయితే, నీవు చెప్పిన విధంగా వట్టి జాఠరాగ్నికి త్రైలోక్యశరీరత్వము – మూడులోకాలనున్నూ తనకు శరీరాన్నిగా కలిగి ఉండడమనేది ఎట్టి పరిస్థితుల్లోనూ సంభవించేదికాదుకాబట్టి.త్రైలోక్యశరీరుడుగాగుర్తింపబడుతున్న,వైశ్వానరశబ్దముతో సామానాధికరణ్యమును కలిగియున్న, కడుపులో (జఠరములో) ఉన్నవాడుగా గుర్తింపబడుతున్న అగ్ని శబ్దము జఠరమును మాత్రమే శరీరముగా కలవాడైనందున వాడితో కూడియున్న, తద్విశిష్టుడైన పరమాత్మను మాత్రమే చెప్పుతుంది అని అర్థము. భగవన్తుడు ఇట్లాగనే చెప్పి ఉన్నాడు కదా! శ్లో॥ **అహంవైశ్వానరోభూత్వా ప్రాణినాందేహమాశ్రితః। ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్॥** నేను వైశ్వానరుడనుగా అయ్యి ఆ పేరుతో పిలువబడుతూ ప్రాణులయొక్క శరీరాన్ని ఆశ్రయించి ప్రాణాపానములనే వాయువులతో కలసి వాళ్లు తిన్న ఆహారాన్ని నాలుగు విధాలుగా పక్వము చేస్తున్నాను. అని. జాఠరానలమును శరీరముగా చేసుకొని అని వైశ్వానరపదానికి అర్థము. ఇందువల్ల జాఠరాగ్నితో విశిష్టుడైన వాడిని ఉపాసన చేయండి అని ఉపదేశింపబడుతున్నది. ఇంతేకాకుండా వాజసనేయ శాఖవారు పురుషుడినిగా కూడా పఠించుతున్నారు. సఏషోఽగ్నిః వైశ్వానరో యత్పురుషః అని. – కావున కేవల జాఠరాగ్నికి పురుషత్వం లేదు. పరమాత్మకే కదా నిరుపాధికమైన– విశేషణము లేని / కారణము లేని – పురుషత్వము ఉన్నది. ఎట్లాగంటే – **సహస్ర శీర్షా పురుషః 2) పురుష ఏవేదం సర్వమ్.** పురుషుడు వేలకొలది తలలు కలవాడు. ఈ విశ్వమంతా పురుషుడే సుమా! ఇత్యాదులలో గమనించవచ్చును. పురమనగా శరీరము దానిలో శయనించి ఉంటున్నాడు. చేరి ఉంటున్నాడు కనుక పురుషుడు అనబడుతున్నాడు. జీవుడు ఒక్క శరీరములో మాత్రమే ప్రవేశించి ఉంటున్నాడు. పరమాత్మ సర్వాత్మ అన్ని శరీరాలలోనూ ప్రవేశించి ఉంటున్నాడు. ఆయా జీవులకు

ఉనికిని కలిగించుతున్నాడు. జీవునిది కర్మ కారణంగా కలిగినట్టిది శరీర ప్రవేశము. పరమాత్మ తన ఇష్టము ప్రకారము నియన్తగా ప్రవేశించుతున్నాడు. జీవులను వాళ్ళ వాళ్ళ కర్మఫలాలను అనుభవించేటట్లుగా నడిపించుతున్నాడు. కనుక నిజమైన పురుషుడు పరమాత్మనేకాని జీవుడుకాదు.

సూ॥ **అత ఏవ నదేవతా భూతం చ 1-2-28** ఇంతకుముందు చెప్పిన త్రైలోక్యశరీరత్వాదికారణాలచేతనే దేవతకానీ మూడవదైన మహాభూతము కానీ వైశ్వానరము అని అనబడవు.

సూ॥ **సాక్షాదప్యవిరోధం జైమినిః 1-2-29** వైశ్వానరశబ్దముతో సమానాధి కరణ్యము కలిగిన అగ్ని శబ్దము జాఠరాగ్నిని శరీరాన్నిగా కల్గి తద్విశిష్టుడైన పరమాత్మకే వాచకము అని, అతడే ఆ రూపములో ఉపాసించదగినవాడని చెప్పబడింది. ఆచార్యుడైన జైమిని ఐతే వైశ్వానర శబ్దము వలెనే అగ్ని శబ్దము కూడా సాక్షాత్తూ / నేరుగా పరమాత్మకే వాచకము అని అనేట్లయితే వైరుధ్యము ఏమీ ఉండదు అని తలుస్తున్నాడు. అనగా చెప్పబడిన విషయము ఇది. వైశ్వానర శబ్దము ఎట్లాగా సాధారణ శబ్దమే ఐనా అనగా అగ్నిని మాత్రమే చెప్పేది ఐనా పరమాత్మలో ఉండే అసాధారణ ధర్మ విశేషముతో కూడియున్నందున పరమాత్మకే వాచకము అవుతున్నదో అట్లాగే నరులందరినీ ముందుకు నడిపించుట అనే గుణమును చెప్పడంచేత, యౌగిక శక్తి ద్వారా పరమాత్మనే చెప్పుతున్నది అని నిర్ణయింపబడుతున్నదో ఆ విధంగానే అగ్ని శబ్దము కూడా అగ్రనయనము అనే గుణము కలిగియున్నందున మండేవాడైన నిప్పు / అగ్ని యందు వాచకమవుతున్నదో అట్లాగే అదే గుణము కలిగి నిరుపాధికుడై మిక్కిలి పైస్థానములో ఉన్నందున – మోక్షరూపమైన అత్యున్నత స్థానానికి చేర్చేవాడవుతున్నందున – పరమాత్మ యందు కూడా వాచకము అవుతున్నది. కనుక ఈ ప్రకరణములో పరమాత్మలో ఉండే అసాధారణ ధర్మ విశేషాన్ని బట్టి పరమాత్మనే వైశ్వానరశబ్దము చెప్తుంది అని.

అగ్రనయనము – తనను ఉపాసించేవాడిని అగ్నిదేవత ప్రస్తుత స్థితిగతులనుండి మరింత మరింత మేలైన స్థానానికి చేర్చుట జరుగుతున్నది. అట్లాగే పరమ పురుషుడు కూడా పురుషార్థాలలో కెల్లా శ్రేష్ఠమైన మోక్షపురుషార్థాన్ని ఇచ్చి తనను ఉపాసించేవారిని అగ్రమునకు చేరుస్తున్నాడు. కనుక అగ్ని శబ్దము పరమాత్మకు చక్కగా వర్తిస్తుంది.

**యస్త్వేతమేవం ప్రాదేశమాత్రమభివిమానమ్** అనే శ్రుతి వాక్యములో అపరిచ్ఛిన్నుడైన పరబ్రహ్మకు ద్యులోకము మొదలుకొని పృథివి వరకు ఉన్న ప్రదేశముతో సమ్బన్ధము కలిగిన ఒకానొక పరిమాణము / కొలతతో పరిచ్ఛిన్నత్వము / విభజించబడుట చెప్పబడింది కదా! అది ఆయనకు ఎట్లాగా పొసగుతుంది? అనే ప్రశ్నకు సమాధానాన్ని క్రింది సూత్రముతో చెప్పుతున్నారు.

సూ॥ **అభివ్యక్తేరితి ఆశ్మరథ్యః 1-2-30** ఉపాసకుడికి తేటగా అర్థమవడంకోసం పరమాత్మకు ప్రాదేశమాత్రత్వము చెప్పబడింది అని ఆశ్మరథ్యుడు అనే ఆచార్యుడు అభిప్రాయపడుతున్నాడు. అభివ్యక్త్యర్థము – బుద్ధిసౌకర్యము కొరకు పరిచ్ఛేదము – విభజించి చెప్పడము ద్వారా బుద్ధికి / తెల్సుకోవడానికి సౌకర్యము కల్గుతుంది. దాన్నే వివరిస్తున్నారు. ద్యులోకము శిరస్సు / (తలపై భాగము మాడ) సూర్యుడు కన్నులు, వాయువు ప్రాణము, ఆకాశము శరీరములో మధ్యభాగం జలము వస్తి మూత్రకోశము. పృథివీ పాదాలు అని ఆయాప్రదేశాలతో సమ్బన్ధము కల మాత్రతో / పరిమాణముతో / కొలతతో పరిచ్ఛిన్నత్వము చేసి చెప్పడము అనేది విశ్వమంతటా వ్యాపించి ఉన్నందువల్ల ఎట్లాంటి కొలతలకూ అందనివాడైన వాడిని సులభంగా తెల్సుకోవడం కోసము చెప్పడం అయ్యింది.

అయితే తల మొదలు కొని పాదాలవరకు ఉన్న అవయవవిశేషాలతో ఒక పురుషుడిగా పోల్చి చెప్పడమెందుకు? అనే ప్రశ్నకు సమాధానాన్ని క్రింది సూత్రము ద్వారా తెలుపుతున్నారు.

సూ॥ **అనుస్మృతేః బాదరిః 1-2-31** పురుషరూపముతో పోల్చిచెప్పడము ఉపాసన చెయ్యడం కొరకు అని బాదరి అనే ఆచార్యుడు తలుస్తున్నాడు. **యస్త్వేత మేవ మభివిమానమాత్మానం వైశ్వానరము పాస్తే స సర్వేషు లోకేషు సర్వేషు భూతేషు సర్వేషాత్మస్వన్నమత్తి** అని బ్రహ్మప్రాప్తి కొరకు ఉపాసనము చేయ్యవలెనని ఉపదేశించబడుతున్నది. **ఏతమేవమ్** అని అనగా ఇప్పుడు చెప్పినవిధంగా పురుష ఆకారములో ఉన్నవాడిని అని అర్థము. **సర్వలోకాలయందు సర్వభూతాలయందు సర్వఆత్మలయందు ఉంటూ ఉన్న ఏ అన్నము – భోగ్యమైనది / రుచికరమైనది. తదత్తి – దానిని తినుచున్నాడు అనగా అన్నిచోట్లా ఉంటూ ఉన్న సహజమైన అనవధికమైన అతిశయమైన ఆనందస్వరూపుడైన బ్రహ్మను అనుభవించుచున్నాడు.** ఏదైతే

కర్మవశ్యులైన ఆత్మలు అందరూ ప్రత్యేకంగా ఎవరికి వారుగా అనన్యసాధారణముఐన ఇతరులను ఎవ్వరికీ సమ్బన్ధము లేని ఏ అన్నమును అనుభవించుతున్నారో అది ముముక్షువులకు స్వీకారయోగ్యము కాదు కనుక అది ఇక్కడ గ్రహింపబడడం లేదు.

వైశ్వానరుడు పరమాత్మనే అయ్యేటట్లుంటే హృదయము మొదలైన వాటిని అగ్ని హోత్రానికి సమ్బన్ధించిన వేది(క) ఆదులుగా కల్పించడము ఏ తీరుగా పొసగుతుంది? జఠరాగ్నిగానే అర్థం చెప్పుకొన్నప్పుడు ఈ కల్పన సరిగా పోలుతుంది కదా! అంటే చెపుతున్నారు.

సూ॥ **సమ్పత్తేరితిజైమినిః తథాహిదర్శయతి 1-2-32** పరమాత్మ ఐన ఈ వైశ్వానరుడిని ద్యుప్రభృతి పృథివ్యన్తమైన దానిని శరీరముగా కలవాడిని ఉపాసకులు ప్రతిదినమూ చేస్తున్న సమారాధన రూపమైన ప్రాణాహుతి రూపక్రియకు అగ్నిహోత్రత్వాన్ని చేకూర్చడం కోసం ఈ ఉరః ప్రభృతులైన వాటికి వేదిత్వాదులుగా ఉపదేశించడము జరుగుతున్నదని జైమిని ఆచార్యుడు భావించుతున్నాడు. అదెట్లాంటే! పరమాత్మను ఉపాసనచేసినందుకు కలిగిన ఫలితమే దీనికి ఫలితము అని ప్రాణాహుతులు వేసుకోవడము ద్వారా అగ్నిహోత్రమును చేసినట్లవుతుందని ఈ శ్రుతి వివరిస్తున్నది. **సయ ఇదమ విద్వానగ్నిహోత్రంజుహోతియథా అంగారానపోహ్యభస్మని జుహుయాత్ - తాదృక్ తత్ స్యాత్. అథయఏతదేవం విద్వానగ్ని హోత్రంజుహోతి, తస్య సర్వేషు లోకేషు సర్వేషుభూతేషు సర్వేషు ఆత్మసుహుతం భవతి. తద్యథేషీకతూలమగ్నౌ ప్రోతంప్రదూ యేత ఏవమిహాస్యసర్వేపాప్మానః ప్రదూయన్తే.** తెలియనివాడు అగ్నిహోత్రం చేసేటప్పుడు నిప్పులను పక్కకు తోసివేసి బూడిదలో నెయ్యిని ఉంచినట్లు అవుతుంది. ఇక ఎవడైతే విద్వాంసుడై వైశ్వానరుడుగా పరమాత్మ అన్ని భూతాలలోను అన్నిలోకాలలోను ఉన్నాడని తెల్సుకొని భోజనము చేయడానికి ముందు తనదేహములో ఉన్న వేశ్వానరాగ్నిహోత్రములో ప్రాణాహుతులద్వారా హోమమును చేసినట్లయితే అన్నిలోకాలలో అన్ని భూతాలలో అన్ని ఆత్మలలో ఉన్నవాడిని ఆరాధించినట్లు అవుతుంది. అందువల్ల రెల్లు దూది గుట్టను నిప్పు/మంటలో వేసినట్లయితే నామరూపాలు లేకుండా నశించిపోయిన తీరుగా వైశ్వానరాగ్ని విద్యను తెల్సి హవనం చేసిన వాడియొక్క పాపాలన్నీ దుంపనాశనమవుతాయి. అని. అనగా సర్వాత్మకుడైన భగవదారాధనం వల్ల సమస్త విశ్వమూ ఆరాధింపబడినట్లవుతుంది అని తాత్పర్యము.

సూ॥ **ఆమనన్తి చైనమస్మిన్ 1-2-33** ఏనమ్ – పరమపురుషుడు ద్యుమూర్ధత్వాది విశిష్టుడూ ఐన ఈ వైశ్వానరుడిని, అస్మిన్ఽఉపాసకుని శరీరము నందు ప్రాణాహుతులకు ఆధారత్వమగుట కొరకు ఆమననము చేస్తున్నారు. పఠించుతున్నారు. **తస్యహవా ఏతస్య ఆత్మనో వైశ్వానరస్యమూర్ధైవసుతేజాః** ఇత్యాది వాక్యాలద్వారా. దీనికి ఇదీ అర్థము – **యస్త్వేతమేవం ప్రాదేశమాత్రమభివిమానమాత్మానంవైశ్వానర ముపాస్తే** అని త్రైలోక్యశరీరుడు పరమాత్మఐన వైశ్వానరుడిని ఉపాసన చేయండి అని ఆదేశించి **సర్వేషులోకేషు** ఇత్యాది వాక్యము ద్వారా బ్రహ్మ ప్రాప్తిని ఫలంగా ఉపదేశించి ఈ వైశ్వానరోపాసనకే అంగము ఐన ప్రాణాగ్నిహోత్రాన్ని **తస్యహవాఏతస్య** ఇత్యాది వాక్యముతో చేయండి అని ఉపదేశిస్తున్నది. ఇంతకుమునుపు ఎవడు ఉపాసించదగిన వాడుగా ఉపదేశించబడిన వైశ్వానరుడు ఉన్నాడో అతనికి అవయవములైన అగ్ని ఆదిత్యుడు మొదలైన వారిని సుతేజో విశ్వరూపాది పేర్లు కలవారిని ఉపాసకుని యొక్క శరీరమునందు తల మొదలు పాదాల వరకూ ఉన్న అవయవాలయందు కల్పించుతున్నాడు.

**మూర్ధైవసుతేజాః** ఉపాసకుని యొక్క మూర్ధనే / శిరస్సే పరమాత్మకు మూర్ధము ఐనద్యులోకము అని అర్థము. **చక్షుర్విశ్వరూపః** = కన్ను ఆదిత్యుడని అర్థము. **ప్రాణఃపృథక్వర్త్మా** – ప్రాణము వాయువు అని అర్థము. **వస్తిరేవరయిః**ఽఇతని వస్తియే ఆ పరమాత్మకు అవయవమైన నీరు అని అర్థము. **పృథివ్యేవపాదౌ**ఽఇతని పాదాలే ఆయనకు పాదము వంటిదైన భూమి అని అర్థము. ఈ తీరుగా ఉపాసకుడు తన శరీరము నందు పరమాత్మయైన త్రైలోక్యశరీరుడగు వైశ్వానరుడిని తనకు మిక్కిలి దగ్గరలో ఉన్నాడని తలచుకొని తనదైన వక్షఃస్థలము వెంట్రుకలు – రోమములు, హృదయము, మనస్సు, నోరులను ప్రాణాహుతుల కాధారమైన పరమాత్మయగు వైశ్వానరుడికి వేది, దర్భలు, గార్హపత్య అన్వాహార్యపచన ఆహవనీయాగ్నులను – అగ్నిహోత్రము చేయుటకు సాధనాలైన వాటినిగా ఊహించుకొని ప్రాణాహుతులను అగ్నిహోత్రములో వ్రేల్చే ఆహుతులనుగా కల్పించుకొని ఈ విధమైన ప్రాణ అగ్నిహోత్రము ద్వారా పరమాత్మయైన వైశ్వానరుడిని ఆరాధించాలి అని **ఉరఏవవేదిః లోమాని బర్హిఃహృదయం గార్హపత్యః** వక్షఃస్థలమేవేది. దానిపైనున్నరోమాలు దర్భలు హృదయము గార్హపత్యము ఇత్యాది వాక్యముతో ఉపదేశింపబడుతున్నది. ఇందువల్ల పరమాత్మఐన పురుషోత్తముడే వైశ్వానరుడని సిద్ధమైనది.

ఇంతటితో శ్రీ భగవద్ రామానుజుల వారిచే రచించబడిన శారీరక మీమాంసా భాష్యము నందు ప్రథమాధ్యాయములో రెండవపాదము సమాప్తము.

**ఈ పాదములో అస్పష్ట జీవలింగకములు –** జీవుడే పరమాత్మ. సృష్టికి కారణము అని సూటిగా చెప్పక అనుమానాస్పదంగా ఉన్న వాక్యాలు ఐన శ్రుతివాక్యాలపైన చర్చచేసి జీవుడికి అటువంటి అర్హతలేదు. ఆ వాక్యాలన్నీ పరమాత్మనే సూచిస్తున్నవి అని నిర్ణయించినారు. ఇక రాబోయే మూడవ పాదములో స్పష్టంగా జీవుడిని సూచించే గుర్తులు ఉన్న వాక్యాలపైన చర్చచేసి పరమాత్మపరములే ఆ వాక్యాలు అని నిర్ధారణ చేయబోతున్నారు. **అని వైశ్వానరాధికరణము.**

**ఇంతటితో శ్రీభాష్యమునందు ప్రథమాధ్యాయములోని**
ద్వితీయపాదము ముగిసినది.

శ్రీమతే రామానుజాయనమః

## శ్రీభాష్యము – ప్రథమాధ్యాయము – తృతీయపాదము

## ద్యుభ్వాద్యధికరణము

సూ॥ **ద్యుభూఆద్యాయతనం స్వశబ్దాత్ 1-3-01** ద్యులోకము భూలోకము మొదలైనవాటికి నెలవు ఐనవాడు పరమాత్మనే. ఆయనకే చెందిన శబ్దముతో చెప్పినందువల్ల. ఆథర్వణికులు చదువుతున్నారు. **యస్మిన్ ద్యౌః పృథివీ, చాన్తరిక్షమ్ ఓతమ్ మనస్సహప్రాణైశ్చసర్వైః తమేవైకంజానథఆత్మానం. అన్యావాచో విముంచథ. అమృతస్యైష సేతుః.** ఎవనియందైతే ద్యులోకము, భూమి రెండింటికీ నడుమ ఉన్న ఆకాశము మనస్సుతో కలసియున్న పంచప్రాణాలతో సహా అందరూ ఆధారపడిఉన్నారో అతడిని మాత్రమే ఆత్మ అని తెల్సుకోండి. ఇతరులు ఎవరో ఆత్మ అని చెప్పే మాటలను పెడచెవినపెట్టండి. ఈ ఆత్మ మాత్రమే అమృతమనబడే మోక్షపురుషార్థానికి, ఆనందానికి చేర్చే సేతువు, వంతెన అని. దీనిపైన సందేహము కలుగుతున్నది. ఏమని? ద్యుపృథివ్యాదులకు ఆయతనముగా / నివాసస్థానముగా / ఆధారముగా చెప్పబడుతున్నవాడు జీవుడా? లేక పరమాత్మనా? అని. ఇందులో ఏది

తగును? అని అనేట్టయితే జీవుడనియే చెపుతాము. ఎందువల్లనంటావా? **అరాఇవ రథనాభౌ సంహతాయత్రనాడ్యః సఏషోఽ న్తశ్చర తే బహుధాజాయమానః** రథచక్రము యొక్క నడుమ ఉండే బొడ్డు కుండయందు అరలు / ఆకులు ఎట్లాగా కూర్చబడి ఉన్నవో అట్లాగే వీడియందు కూడా నాడులు – శరీరములోనివి అన్ని జతపర్చబడి యున్నవి. అట్లాంటి వీడు శరీరములో అంతటా సంచరించుతూ ఉన్నాడు. పలుమార్లు పుట్టుతూ ఉన్నాడు. అని తరువాతి శ్లోకములో పూర్వవాక్యము నందు ప్రస్తావించబడిన ద్యుపృథివ్యాదులకు ఆయతనమైన వానిని **యత్ర** అని సప్తమీ విభక్త్యన్తమైన పదముతో పరామర్శించి అతడు నాడులకన్నింటికీ ఆధారమైనవాడు అని చెప్పి, మళ్ళీ **సఏషోఽన్తశ్చరతే బహుధాజాయమానః** అని ఆయనకు పలుమార్లు పుట్టుకలు పుడుతూ ఉండడము కూడా ఉన్నదని చెప్పబడుతున్నది. 1) నాడులతో సమ్బన్ధము 2) దేవతిర్యక్ మనుష్యస్థావరాది రూపాలతో పలుమార్లు జన్మించడమున్నూ జీవునికి చెందిన ధర్మములు. ఇదే శ్లోకంలో కూడా **ఓతం మనః సహ ప్రాణైశ్చసర్వైః** అని ఐదు ప్రాణాలకు మనస్సుకున్నూ ఆశ్రయమై ఉండడమున్నూ చెప్పబడుతున్నది. అది కూడా జీవుని యొక్క ధర్మమే. ఈ విధంగా జీవత్వము నిర్ణయము చేయబడితే ద్యుపృథివ్యాద్యాయతనత్వాదికము ఎట్లాగో ఒకట్లాగా, ఏదో విధంగా సరిపోల్చుకోవచ్చును. సమన్వయం చేసుకో తగును అని.

ఇట్లాగా పూర్వపక్షము ముందుకు వస్తే సమాధానాన్ని వివరించుతున్నాము. వినండి. ద్యుపృథివ్యాదులకు ఆయతనము / ఆధారము ఐనవాడు పరబ్రహ్మనే. ఎందువల్లనంటే స్వశబ్దాత్ఽపరబ్రహ్మను మాత్రమే సూచించే అసాధారణశబ్దము ఆ వాక్యంలో ఉన్నది కనుక. అమృత స్యఏషసేతుః అని పరబ్రహ్మకు మాత్రమే చెల్లే అసాధారణ శబ్దము ఉన్నది కదా! **తమేవం విద్వానమృత ఇహ భవతి. నాన్యః పన్థా అయనాయవిద్యతే.** తమశ్శబ్దవాచ్యమైన సూక్ష్మప్రకృతికి – చీకటికి – ఆవల సూర్యుని వలె వెలుగుతున్నవాడిని తెల్సుకొని ఉపాసించినవాడు ఇహ లోకములోనే అమృతస్వరూపుడు ఆనందమయుడు అవుతున్నాడు. ఇంతకు మించి పరమాత్మను చేరుకోవడానికి మరో దారి లేదు. అని అన్ని ఉపనిషత్తులలోనూ ఆ పరబ్రహ్మ ఒక్కడే జీవుడికి అమృతత్వాన్ని పొందడానికి కారణము అవుతున్నాడని వినిపించుతున్నది. సినోతి అనే ధాతువుకు బన్ధనము అనే అర్థమున్నందున సేతుః అమృతత్వాన్ని పొందించేవాడు / చేర్చేవాడు / ప్రాపకుడు అని అర్థము. లేదా సేతువువలే ఉపయోగపడుతున్నాడు కనుక సేతువు అని కూడా అనవచ్చును. నదులు మొదలగు

వాటిపైన వంతెన ఆవలి ఒడ్డును చేర్చుతుంది. సంసారము అనే సముద్రానికి ఆవలి గట్టుఐన అమృతత్వానికి ఇతడు చేర్చేవాడు అని అర్థము. ఇక ఈ వాక్యంలో ఉన్న ఆత్మ శబ్దము కూడా నిరుపాధికము / ఎటువంటి విశేషణము లేనిది ఐనందున పరబ్రహ్మను మాత్రమే ముఖ్యార్థముగా చెప్పుతున్నది. ఆప్నోతి పొందుతున్నాడు కనుక ఆత్మా అనబడుతున్నాడు. తనకంటే వేరుగా ఉన్న సమస్త విశ్వములో నియన్తగా – **శాస్తా** వ్యాపించి ఉండడము ఆ పరబ్రహ్మకు మాత్రమే చెల్లుతుంది. అందువల్ల ఆత్మ శబ్దమున్నూ ఆ పరమాత్మను తెలిపే పదమే. **యః సర్వజ్ఞః సర్వవిత్** ఇంతకు ముందు చెప్పబడిన శబ్దాలన్నీ పరబ్రహ్మకే చెందిన శబ్దాలు. నాద్యాధారత్వము జీవాత్మకే కాకుండా ఆయనకున్నూ చెల్లుతుంది. **సన్తతం సిరాభిస్తులమ్బత్యా కోశసన్నిభమ్.** మొగ్గవలె ఉండి ఎల్లపుడూ సిరలపైన ఆధారపడి వ్రేళ్ళాడుతూ ఉంటుంది అని మొదలుపెట్టి **తస్యాశ్శిఖాయా మధ్యే పరమాత్మావ్యవస్థితః** దానియొక్క శిఖకునడుమన పరమాత్మా నెలకొని ఉన్నాడు. అని వినిపిస్తున్నది కనుక. **బహుధాజాయమానః** పలుమార్లు పుడుతూ ఉండుట అనే ధర్మమున్నూ పరబ్రహ్మయందు వర్తిస్తుంది.

**అజాయమా నోబహుధావిజాయతే. తస్యధీరాః పరిజానన్తియోనిమ్.** ఆయన కర్మ కారణంగా పుట్టనవసరము లేకున్నా పలుమార్లు వివిధ రూపాల్లో పుడుతూనే ఉన్నాడు. అతని పుట్టుకను జ్ఞానులైనవారు చక్కగా తెలుసుకొంటున్నారు. అని దేవాదులైన వారికి ఆశ్రయము ఇవ్వడము కోసము ఆయా జాతులలో పుట్టినపుడు వారివారి జాతికి తగినట్లున్న రూపము, సంస్థానము, గుణాలు, కర్మలతో / చేష్టలతో / పనులతో కూడిన వాడై తనదైన స్వభావాన్ని వదులుకోకుండా తన ఇష్టము, సంకల్పము ప్రకారమే పలుసార్లు పరమపురుషుడు పుడుతూ ఉన్నాడని వేదము చెప్పుతున్నందువల్ల. ఇక స్మృతి (**భగవద్గీత**) కూడా ఇట్లా చెప్పింది.

**శ్లో॥ అజోఽ పిసన్ అవ్యయాత్మాభూతానాం ఈశ్వరోఽపిసన్ / ప్రకృతిమ్ స్వామధిష్ఠాయ సంభవామి ఆత్మమాయయా॥** నేను పుట్టుకలు లేనివాడను ఐనా. మార్పులు వికారాలు లేనివాడను, ప్రాణులకు అన్నింటికీ ప్రభువునుఐ ఉండి కూడా నాదైన పంచోపనిషణ్మయ ప్రకృతి ఆధారంగా చేసుకొని నా సంకల్పము ప్రకారమే పుడుతున్నాను. అని ఇంక మనస్సు మొదలుకొని జీవుని ఉపకరణాలు – ఇంద్రియాలు – అన్నింటికిన్నీ తానే ఆధారమై ఉండడమున్నూ సమస్త విశ్వానికి ఆధారుడైనందున సర్వాధారుడనబడుతున్న పరమపురుషుడికే బాగా ఒప్పుతుంది. ఇందువల్ల కూడా జీవుడు కాదు. పరమపురుషుడే.

సూ॥ **ముక్తోపసృప్య వ్యపదేశాచ్చ 1-3-02** ఈ ద్యుపృథివ్యాదులకు ఆధారమైన వాడు అగు పురుషుడు సంసార బన్ధాన్నుంచి విడుదల పొందిన ముక్తులకున్నూ చేరదగినవాడుగా ప్రాప్యముగా చెప్పబడుతున్నాడు. **యథాపశ్యః పశ్యతే రుక్మవర్ణం కర్తారమీశం పురుషం బ్రహ్మయోనిమ్ తదావిద్వాన్ పుణ్యపాపేవిధూయ నిరంజనః పరమం సామ్యముపైతి.** ఉపాసకుడైన బ్రహ్మవేత్త ఎపుడైతే బంగారు వంటి వన్నెగలవాడిని, మెరుస్తూ ఉన్నవాడిని సమస్త జగత్తును పుట్టించిన వాడిని, ఈ అన్నింటినీ తన ఇచ్ఛ ప్రకారము శాసించేవాడిని అసాధ్యములైన వానినన్నింటినీ చేయగల కర్తను దర్శించుతున్నాడో అపుడే ఆ ఉపాసకుడు / విద్వాంసుడు తనదైన పుణ్యపాపాలను దులపరించుకొని ఏ కర్మలతోనూ ఏ ద్వంద్వాలతోను ఏ దేహబన్ధువులతోనూ సమ్బన్ధము లేనివాడై పరమాత్మతో సాటిలేని సమానభావాన్ని పొందుతున్నాడు. 2) **యథానద్యః స్యందమానాః సముద్రేఅస్తంగచ్ఛన్తి నామరూపే విహాయ। తథా విద్వాన్ నామరూపాద్విముక్తః పరాత్ పరం పురుషముపైతిదివ్యమ్.** ఏ విధంగా నదులు పారుతూ ఉన్నవై సముద్రంలోకి చేరి తమదైన నామరూపాలను వదలి కనబడకుండా పోతున్నవో అట్లాగే బ్రహ్మోపాసకుడు బ్రహ్మోపాసనకు ఫలితంగా తనకు ఉన్న నామరూపాలనుండి విడిపోయినవాడై పరుడైన ముక్తునికంటే / కూటస్థుడి కంటే పరుడైన దివ్యుడైన పురుషుడిని చేరుతున్నాడు. అని. సంసారబన్ధాలనుండి విముక్తులైన వారే విధూత పుణ్యపాపులు, నిరంజనులు, నామరూపాల నుండి విడివడినవారు అవుతున్నారు. సంసారమంటే పుణ్యపాపాలకు కట్టుబడి అచిత్తుతో సంసర్గము వలన కలిగిన నామరూపాలను అనుభవించుతూ ఉండడము / పొందడము. ఇందువల్ల పుణ్యపాపాలను దులపరించుకొన్నవారు, నిరంజనులు, ప్రకృతిలో కలయిక లేనట్టివారు పరబ్రహ్మతో పరమమైన సామ్యతను పొందినవారు చేరుకోదగిన వాడుగా చెప్పబడినవాడు ద్యుపృథివ్యాదులకు ఆధారభూతుడైన పురుషుడు పరంబ్రహ్మనే.

పరబ్రహ్మకు మాత్రమే చెందిన అసాధారణ శబ్దాదులతో పరంబ్రహ్మ అని సాధించి ప్రత్యగాత్మ (జీవుడు) కు మాత్రమే సంబన్ధించిన అసాధారణమైన శబ్దాలు లేవు కాబట్టిన్నీ ఈద్యుభ్వాదులకు ఆధారమైన పురుషుడు పరుడే అని చెపుతున్నాడు.

సూ॥ **నానుమానం అతత్ శబ్దాత్ ప్రాణభృచ్చ 1-3-3** తనకు చెందిన శబ్దము లేదు కాబట్టి ప్రకృతికాదు. ఊపిరితో కల్సి ఉండే జీవుడున్నూ కాదు. ఈ ప్రకరణంలో ప్రధానానికి (ప్రకృతి) సంబన్ధించిన శబ్దము లేదు కనుక ప్రధానము ఎట్లాగా

ప్రతిపాదింపబడడం లేదో అట్లాగే ప్రాణభృత్ ప్రాణాలను ధరించేవాడు జీవుడు – కూడా ప్రతిపాద్యుడు కాడు. అనుమీయతే అనుమానింపబడుతున్నది. కార్యకారణ సంబన్ధాన్ని బట్టి ఊహింపబడుతున్నది అనుమానము అనబడేది సాంఖ్యుడు చెప్పిన ప్రధానము. అనుమాన శబ్దము చేత చెప్పబడుతున్నది. లేదా అనుమాన ప్రమాణము చేత ప్రమితమవుతున్నది కాబట్టి ఐనా అనుమానము అని అనవచ్చును. అతచ్ఛబ్దాత్ – దాన్ని గురించి చెప్పే శబ్దము లేదు కనుక అని అర్థము. అతచ్ఛబ్దాత్ యొక్క వ్యుత్పత్తి సమాసాన్ని గురించి వివరిస్తూన్నారు. **అర్థాభావే యదవ్యయమ్** అనే పాణినీయ సూత్రం ద్వారా అవ్యయీ భావసమాసము ఏర్పడింది. ఇందువల్లనూ ప్రత్యగాత్మ కాదు.

సూ॥ **భేదవ్యపదేశాత్ 1-3-4** పరమాత్మకూ జీవుడికిన్నీ భేదాన్ని తెల్పుతున్నందు వల్ల జగదాధారము జీవుడు కాడు. **సమానే వృక్షేపురుషోనిమగ్నోఽనీశయా శోచతి ముహ్యమానః। జుష్టం యదాపశ్యత్యన్యమీశం అస్యమహిమానమితి వీతశోకః॥** తనకూ పరమాత్మకూ సమానవృక్షము నందు బాగా కూరుకుపోయిన జీవుడు ప్రకృతి సమ్బన్ధము కారణంగా మోహపరవశుడై యథార్థమేదో తెలియక అజ్ఞానముతో దిగులుతో దుఃఖిస్తూ ఉన్నాడు. ఇందుకు కారణము తన ఇంద్రియాలను తాను అదుపులో ఉంచుకోలేకపోవడమే. ఎపుడైతే తనకంటే వేరుగానున్న మరొకడైన ఆనందముతో ఉన్న ఈశ్వరుడిని చక్కగా అర్థము చేసుకొని దర్శించుతాడో అపుడు అతనికి ఉన్న ఈశితృత్వాన్ని తెల్సుకొని ఇదీ ఈయన యొక్క మహిమ అని అర్థం చేసుకున్నప్పుడు శోకాన్ని కోలుపోతాడు. ఆనందాన్ని పొందుతాడు. ఇత్యాదివాక్యాల ద్వారా జీవుడికంటే విలక్షణుడిగా పరమాత్మ చెప్పబడుతున్నాడు. **అనీశయాఽ**భోగ్యముగా ఉన్న ప్రకృతి చేత వ్యామోహింపబడి జీవుడు దుఃఖించుతున్నాడు. వీడు ఎపుడైతే తనకంటే వేరయిన వాడిని సమస్తజగత్తుకూ ఈశ్వరుడైన వాడిని సంతోషముతో ఉన్నవాడిని, ఈశ్వరుడియొక్క మహిమనున్నూ నిఖిలమైన జగత్తునూ నియమించే స్వరూపము గలవాడిని దర్శించుతాడో అపుడు వీత శోకుడు శోకము / దిగులు / విచారము లేనివాడు అవుతున్నాడు.

సూ॥ **ప్రకరణాత్ 1-3-5** ఈ ప్రకరణము పరబ్రహ్మకు చెందినది అని **అదృశ్యత్వాది గుణకో ధర్మోక్తేః** అనే సూత్రము దగ్గరనే తేటగా చూపించినాము. 1) నాడీ సంబన్ధము 2) పలుమార్లు పుట్టడము 3) మనస్సు ప్రాణాలకున్నూ ఆధారముఐ

ఉండడము అనే హేతువులచేత ప్రకరణము తెగిపోయిందనే శంకను మాత్రమే ఇక్కడ పరిహరిస్తున్నాము.

సూ॥ **స్థిత్యదనాభ్యాం చ 1-3-06** శరీరములో ఉండడము, కర్మఫలాల ననుభవించడముల వల్లనున్నూ. **ద్వాసుపర్ణా సయుజా సఖాయా సమానం వృక్షం పరిషస్వజాతే. తయోరన్యః పిప్పలమ్ స్వాద్వత్తి అనశ్నన్నన్యో అభిచాకశీతి.** రెండు చక్కని రెక్కలు కలిగి ఎపుడూ ఒకదానిని ఒకటి విడిచిపెట్టకుండా కలసిమెలసి తిరుగుతూ ఉండే రెండు పక్షులు సమానమైన ఒకే వృక్షాన్ని ఆశ్రయించి ఉన్నాయి. వాటిలో ఒకటి పిప్పలము అనబడే ఆ చెట్టు కాసిన పండును రుచికరమైన దానిని తింటున్నది. మరొక్కటి దానిని తినకుండానే ఆనందముగా వెలుగుతూ ఉన్నది. అని ఒకదానిని కర్మఫలాన్ని తినడమును, మరొకదానికి కర్మఫలాన్ని తినని దానికి వెలుగొందుతూ ఉన్నందువల్ల శరీరములోపల ఉండడమును మాత్రమే ఈ మన్త్రము ప్రతిపాదించుతున్నది. ఆ రెండింటిలో కర్మఫలాన్ని తినకుండానే వెలుగొందే పక్షియే సర్వజ్ఞుడు, అమృత సేతువు సర్వాత్మ ద్యుభ్వాదులకు ఆయతనము / ఆధారము కావడానికి తగినవాడైయున్నాడు. అంతేకాని కర్మఫలాన్ని అనుభవించుతూ దుఃఖితుడైన ప్రత్యగాత్మ ద్యుభ్వాద్యాయతనము కాజాలడు. ఇందువలన ద్యుభ్వాద్యాయతనుడు పరంబ్రహ్మనే. **అని ద్యుభ్వాద్యధికరణము.**

★ ★ ★

## ఇక భూమాధికరణము

సూ॥ **భూమా సమ్ప్రసాదాదధ్యుపదేశాత్ 1-3-7** జీవునికంటే పరమాత్మనే అధికుడుగా చెప్పబడుతున్నందున భూమా శబ్దముతో చెప్పబడేవాడు పరబ్రహ్మనే. ఛాందోగులు ఈ విధంగా పఠించుతున్నారు. **యత్రనాన్యత్ పశ్యతి నాన్యత్ శృణోతి నాన్యత్ విజానాతి సభూమా. అథయత్రాన్యత్ పశ్యతి అన్యత్ శృణోతి అన్యద్విజానాతి తదల్పమ్.** దేనికన్న గొప్పదైన మరొక్క వస్తువును కనడో వినడో తెల్సుకోడో అది భూమా. దేనికన్న గొప్పదైన మరొక్క వస్తువును కంటాడో వింటాడో తెల్సుకుంటాడో అది అల్పము, చిన్నది అని. ఇక్కడ భూమాశబ్దము భావార్థములో వచ్చిన ప్రత్యయాన్తము. అది ఎట్లాగా అంటే పృథు ఆదిగణములో బహుశబ్దాన్ని పఠించుతాము. దానికిపైన **పృథ్వాదిభ్య ఇమనిజ్వా** అనే సూత్రము ప్రకారము ఇమనిచ్ ప్రత్యయాన్ని చేర్చుకుంటాము. అటుపిమ్మట **బహోర్లోపో భూచ బహోః** అనే సూత్రము వల్ల ప్రకృతి

ప్రత్యయాలకు రెండింటికిన్నీ మార్పులు వస్తే భూమాశబ్దము ఏర్పడుతుంది. అనగా బహుశబ్దానికి లోపము వచ్చి దాని స్థానములో భూ అనే శబ్దము చేరినాక ఇమనిచ్ ప్రత్యయములోనున్న ఇకారము, చ్‌కారములోపించి, సుప్ ప్రత్యయము వచ్చి ప్రథమా ఏకవచనము నందు భూమా అనే పదము ఏర్పడుతుంది. అప్పుడు భూమా అనగా బహుత్వము అని అర్థము వస్తుంది. ఇక్కడ భూమా శబ్దము వైపుల్యము అనే అర్థాన్ని ఇస్తుంది తప్ప సంఖ్యను తెలుపునదికాదు. యత్రాన్యత్‌పశ్యతి... తదల్పమ్ అని అల్పము అనే పదానికి ప్రతియోగిగా వ్యతిరేకంగా ప్రయోగము జరిగింది కనుక. అల్పశబ్దముతో నిర్దేశింపబడిన ధర్మికి ప్రతియోగి ఐనవాడిని ప్రతిపాదిస్తున్నందున ధర్మిపరంగా నిర్ణయము చేయబడుతున్నది కాని ధర్మాన్ని మాత్రమును కాదు. ఈ విధంగా భూమా అని అనగా విపులమైనది అని అర్థము. ఇట్లాంటి వైపుల్యము చేత విశేషింపబడేవాడు ఆత్మ అని అవగాహన కలుగుతున్నది. ఎందుకనగా **తరతి శోకమాత్మవిత్** ఆత్మను గురించి తెల్సుకున్నవాడు శోకసముద్రాన్ని దాటి పోతాడు అని మొదలుపెట్టి భూమాను గురించిన విజ్ఞానాన్ని ఉపదేశించి **ఆత్మైవేదమ్** ఇదంతా ఆత్మనే అని దాన్ని గురించే తెల్పుతూ ఉపసంహారాన్ని చేసినారు కదా!

అయితే ఇక్కడ సందేహము పుడుతున్నది. ఏమని? ఈ భూమా గుణవిశిష్టుడు ప్రత్యగాత్మనా? లేక పరమాత్మనా? అని. ఇందులో ఏది తగునని అంటావా? ప్రత్యగాత్మనే అని మేమంటాము. ఏ కారణంచేత అని అనేటట్లయితే **శ్రుతంహ్యేవమే భగవద్ దృశేభ్యః తరతి శోకమాత్మవిత్ ఇతి.** నారదుడు సనత్కుమారుడితో అంటున్నాడు. మీబోటి పూజ్యులైన వారివలన ఆత్మను గురించి జ్ఞానాన్ని పొందినవాడు దుఃఖాన్ని దాటుతాడు అని. అని ఆత్మను గురించి తెల్సుకోదల్చినవాడై ప్రశ్నించిన నారదుడికి నామము మొదలుకొని ప్రాణము వరకు ఉన్నవాటిని ఉపాసించదగిన వాటినిగా ఉపదేశించగా **అస్తి భగవోనామ్నో భూయః** ఓ భగవానుడా! నామముకంటే గొప్పది ఇంకొకటి ఉన్నదా? **అస్తి భగవోవాచోభూయః** ఓ భగవన్తుడా! వాక్కుకంటే గొప్పది ఉన్నదా? ఇత్యాదులు ఐన ప్రశ్నలు బయలుదేరగా వాక్కుకంటే **వాగ్వావనామ్నో భూయసీ** వాక్కే నామము కంటే గొప్పది. **మనోవావ వాచో భూయః** వాక్కుకంటే మనస్సే కదా గొప్పది ఇత్యాదులైన సమాధానాలు ప్రాణముకంటే ముందున్న వాటివరకు వినిపిస్తున్నది. ప్రాణము విషయములో మాత్రము ఎరుగము. ఇందువల్ల ప్రాణపర్యన్తమే ఈ ఆత్మోపదేశము అని తోస్తున్నది. ఆ కారణంగా ఇక్కడ ప్రాణశబ్దము

చేత చెప్పబడినవాడు ప్రాణానికి సహచారి ఐన ప్రత్యగాత్మనే కానీ కేవలవాయు విశేషము మాత్రమే కాదు.

**ప్రాణోహ పితా ప్రాణోహమాతా** ప్రాణమే తండ్రి ప్రాణమే తల్లి. ఇత్యాది వాక్యాలన్నీ ప్రాణానికి చేతనత్వమున్నట్లు తెలియపరుస్తున్నవి. **పితృహామాతృహా** తండ్రిని చంపినవాడు తల్లిని చంపినవాడు ఇత్యాది వాక్యముచేత ప్రాణాలతో ఉన్న తండ్రి మొదలైన వారిని హింసించిన వారియందు హింసకత్వము కారణముగా నిందాపూర్వకవాక్యాలు ఉన్నవి. ఆ తల్లి తండ్రులే ప్రాణాలు విడిచిపెడితే మిక్కిలి బాధలను పెట్టినా ఉపక్రోశవచనాలు లేవు కాబట్టి హింసాయోగ్యుడు ఐన చేతనుడే ప్రాణశబ్దము చేత నిర్దేశింపబడుతున్నాడు. ప్రాణములు లేనివి ఐన స్థావరాలయందు, చేతనములయందు ఉపమర్ధభావము ఉంటే, (హింస ఉపమర్ధము) లేనపుడు హింసలేకపోవడము అనేది కనిపిస్తున్నందున ఈ హింసాయోగ్యుడుగా నిర్ధిష్టమైన ప్రాణము ప్రత్యగాత్మనే అని నిశ్చయింపబడుతున్నది. ఇందువల్లనే అరనాభి దృష్టాన్తాదులను ప్రదర్శించినందువల్ల ప్రాణశబ్దము చేత చెప్పబడినవాడు పరమాత్మ అని భ్రమపడకూడదు. పరమాత్మకు హింసా ప్రసంగమే లేనందున జీవునికంటే వేరయిన జీవునికి భోగ్యములుఐ భోగోపకరణములైన సమస్తవస్తువులూ జీవునిపైననే ఆధారపడి తమదైన స్థితిగతులను కల్గియుంటున్నందున ప్రత్యాగాత్మయందే అరనాభి (బండి చక్రములోని బొడ్డుకుండ) పోలిక పొసగుతూ ఉన్నది.

కనుక ఈ ప్రాణశబ్దము చేత నిర్దేశింపబడినవాడే భూమా. **అస్తి భగవః ప్రాణాత్ భూయః** ఓ భగవానుడా ప్రాణశబ్దవాచ్యుడికంటే గొప్పవాడున్నాడా? అనే ప్రశ్నకు **అదోవావ ప్రాణాత్ భూయః** ఇది కదా ప్రాణము కంటే గొప్పది. అనే ప్రతివచనము లేకపోవడంచేత మరియు భూమా శబ్దవాచ్యుడిని గురించి ప్రవచించడానికి ముందు ప్రాణప్రకరణము ముగిసిపోనందువల్లనున్నూ ప్రాణశబ్దనిర్ధిష్టుడే భూమా. ఇంతేకాకుండా ప్రాణాన్ని గురించి తెల్సినవాడికి "**అతివాది"త్వమును** చెప్పి, అతడినే **ఏషతువా అతివదతి** ఇతడు కదా అధికుడిని గురించి చెపుతున్నాడు అని ప్రత్యభిజ్ఞను చెప్పి **యః సత్యేనాతి వదతి** ఇతడు గదా సత్యశబ్దవాచ్యుడిని గురించి అతివాదము చేస్తున్నాడు. అధికుడని చెపుతున్నాడు. అని వానికి సత్యమును గురించి చెప్పడమును ప్రాణోపాసనకు అంగముగా ఉపదేశించి ఉపాదేయమైన సత్యవాదిత్వానికి శేషిగా ఇంతకుముందు నిర్దేశింపబడిన ప్రాణయాధాత్మ్య విజ్ఞానమును **యదావైవిజానాతి.**

**అథ సత్యం వదతి** ఎపుడైతే తెలుసుకొంటున్నాడో పిదప సత్యాన్ని చెపుతున్నాడు అని ఉపదేశించి, దాని సిద్ధికొరకుగాను మనన, శ్రద్ధానిష్ఠా, ప్రయత్నాలను కూడా ఉపదేశించి దాన్ని ప్రారంభించుటకొరకు ప్రాప్యమైన ప్రాణశబ్దము చేత నిర్దిష్టమైన ప్రత్యగాత్మ స్వరూపాన్ని సుఖరూపము అని తెలిపి, ఆ సుఖము విపులము **భూమాత్వేవ విజిజ్ఞాసితవ్యః** భూమా అనియే ఎంచిదాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నించాలి అని ఉపదేశింపబడుతున్నది.

ఈ విధంగా ప్రత్యగాత్మకే చెందిన అవిద్యతో సమ్బన్ధము లేని రూపము విపుల సుఖమని ఉపదేశించబడింది ఇందువలన **తరతి శోకమాత్మవిత్** అని ఆరంభించిన ఉపక్రమంతో వైరుధ్యము కూడా ఉండదు. కాబట్టి భూమా గుణవిశిష్టుడు ప్రత్యగాత్మయే. ఏ కారణంగానైతే భూమ గుణవిశిష్టుడు ప్రత్యగాత్మ అని నిర్ణయము అయ్యిందో దానివల్లనే అహమర్థమైన ప్రత్యగాత్మ యందు **అహమే వాధస్తా దహము పరిష్టాత్** నేనే అడుగున దిగువన ఉన్నాను. నేనే అందరికంటే పైన ఉన్నాను అని ఆరంభించి **అహమేవేదం సర్వమ్** ఈ కనిపించేదంతా నేనే అని ప్రత్యగాత్మయొక్క వైభవాన్ని ఉపదేశిస్తున్నది. ఈ తీరుగా ప్రత్యగాత్మత్వము నిశ్చయింపబడితే దానికి తగినట్లు వాక్యశేషాన్ని (మిగిలిన వాక్యాన్ని – తరువాతి వాక్యాన్ని) నిర్వహించుకోవాలి.

ఇట్లాగా పూర్వపక్షమురాగా సమాధానము చెప్పబడుతున్నది. భూమా సమ్ప్రసాదాదధ్యుపదేశాత్. భూమ గుణవిశిష్టుడు ప్రత్యగాత్మకాదు కానీ పరమాత్మనే అవుతాడు. ఎందువల్లనంటే సమ్ప్రసాదుడు ప్రత్యగాత్మ **ఏష సమ్ప్రసాధోఽస్మాచ్ఛరీరా త్సముత్థాయ పరంజ్యోతి రుపసమ్పద్య స్వేనరూపేణాభి నిష్పద్యతే.** ఈ సంప్రసాదుడు తనదైన ఈ పాంచభౌతిక శరీరాన్నుండి బయలుదేరి పరంజ్యోతియైన పరమాత్మ వద్దకు చేరుకుని తనదైన సహజరూపాన్ని పొందుతున్నాడు. సంసారబన్ధములో చిక్కకముందున్న జ్ఞానానందమయమైన రూపాన్ని తిరిగిపొందుతున్నాడు అని ఉపనిషత్ ప్రసిద్ధి ఉన్నది కాబట్టి సంప్రసాదుడు అనగా ప్రత్యగాత్మ అని అర్థము తెలుస్తున్నది. సమ్ప్రసాదాత్ – ప్రత్యగాత్మ కంటే అధికుడుగా సత్యశబ్దముతో చెప్పదగినవాడైన భూమా విశిష్టుడిని ఉపదేశిస్తున్నందువల్ల అని అర్థము. సత్యశబ్దంతో చెప్పబడేవాడు పరబ్రహ్మ. మొత్తం మీద ఇదీ చెప్పబడుతున్న విషయము.

ప్రాణపర్యన్తములైన నామాదులయందు ముందుముందు చెప్పబడిన వాటికంటే తరువాత తరువాత చెప్పబడిన వాటిని అధికములైనవి అని పేర్కొన్నందువల్ల

తరువాతి వాటికి అర్థాన్తరత్వము వస్తున్నది. అర్థాన్తరత్వము – మరొక్క విశేషార్థము. ఈ విధంగా ప్రాణశబ్దంతో చెప్పబడిన ప్రత్యగాత్మ కంటే అధికుడుగా చెప్పబడిన సత్యశబ్దవాచ్యుడు అర్థాన్తరమైనవాడే. సత్య శబ్దము చేత నిర్దిష్టుడైనవాడు మాత్రమే భూమా అనబడుతున్నాడని సత్యం అనే పేరు గల బ్రహ్మనే భూమా అని ఉపదేశింపబడుతున్నాడు. దాన్నే వృత్తికారుడు ఇట్లాగా చెప్పినాడు. **భూమాత్వేవేతి భూమా బ్రహ్మ. నామాది పరమ్పరయా ఆత్మనః ఊర్ధ్వమస్య ఉపదేశాత్.** భూమాత్వేవ విజిజ్ఞాసితవ్యః అను వాక్యములో ఉన్న భూమా అనబడేవాడు బ్రహ్మ. నామాదుల పరమ్పరలో ఆత్మకన్నా పైన ఈ భూమా చెప్పబడినాడు కదా! అని.

ప్రాణశబ్దము చేత చెప్పబడినవానికంటే అధికుడుగా సత్యుని గురించి చెప్పినారని ఎట్లాగా తెలుస్తున్నది? అని అంటే? **స వా ఏష ఏవం పశ్యన్ ఏవం మన్వానః ఏవం విజానన్ అతివాదీ భవతి.** అట్లాంటి ఇతడు ఈ విధంగా దర్శించుకుంటూ, మనస్సులో గట్టిగా తల్చుకుంటూ, విశేషంగా తెల్సుకుంటూ నేను తెల్సుకొన్న నమ్మిన ఇదే అంశము/వ్యక్తి అధికమైనవాడు అని చెప్తూ అతివాది అవుతున్నాడు అని ప్రాణాన్ని గురించి తెల్సినవాడికి అతివాదిత్వాన్ని చెప్పి, **ఏషతువా అతివదతి. యః సత్యేనాతివదతి** వీడు కదా అతివాది. ఏ వ్యక్తియైతే సత్యుడుని ఆధారము చేసుకొని ఆయనయొక్క ఆధిక్యాన్ని చెపుతున్నాడో అని సత్యశబ్దవాచ్యుడైన వాడిని తెల్సుకోవడం చేత అతివాదియైన వాడిని **తుశబ్దముతో** దీనికన్నా ముందు చెప్పబడిన ప్రాణాతి వాదికంటే అధికుడని చెప్పి ప్రాణాతివాదిని పక్కకు తప్పించుతున్నాడు. ఇందువల్లనే **ఏష తు వా అతివదతి** అనేచోట ప్రాణాతివాదికి ప్రత్యభిజ్ఞ లేదు. అందువల్ల ఇతని అతివాదిత్వానికి కారణముఐన సత్యము పూర్వాతివాదికి నిమిత్తమైన ప్రాణానికంటే అధికమని తెలుస్తున్నది.

ఏమండీ ప్రాణాన్ని గురించి తెల్సినవానికే సత్యవదనము అంగముగా చెప్పబడింది.కావుననేప్రాణప్రకరణవిచ్ఛేదముజరిగిందిఅనిచెప్పినారు.అనిఅనవద్దు. ఇది యుక్తమైనదికాదు. తుశబ్దముచేత అతివాదిఐన మరొకడు తెలియవస్తున్నాడు. అంతేకాని ఆ అతివాదికే సత్యవదనమును అంగముగా కలవాడని అని కాదు. **ఏషతువా అగ్నిహోత్రీ యః సత్యంవదతి** ఎవడు సత్యమును పల్కుతున్నాడో అతడే అగ్నిహోత్రి. ఇత్యాదులలో మాత్రమే మరొక అగ్నిహోత్రిని గురించి ప్రతీతి/తోచుట/ ప్రసిద్ధిలేదు కాబట్టి ప్రతీతుడైన అగ్నిహోత్రికే సత్యవదనాంగమని క్లిష్టగతి – కష్టముతో

సమన్వయము చేసుకొనేతోవ – ఆశ్రయింపబడుతున్నది. ప్రస్తుతవాక్యములోనైతే మాత్రము మరొక అతివాది ఉన్నాడని చెప్పడానికి కారణమైన సత్య శబ్దాభిధేయుడైన పరబ్రహ్మ కానవస్తున్నాడు. సత్యశబ్దము **సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ** అనేచోట, ఇంకా కొన్నిచోట్లలోనూ పరబ్రహ్మ విషయంలో ప్రయోగింపబడింది. ఇందువల్ల సత్యనిష్ఠుడైన అతివాదికి ఇతని కన్నముందున్న అతివాది కంటే అధికత్వము/ ఆధిక్యము ఏర్పడుతూ ఉన్నది కనుక వాక్యస్వారస్యము ద్వారా ఏర్పడిన అన్యత్వాన్ని (మరొకటి ఐ ఉండడాన్ని) తోసి వేయకూడదు. అసలు అతివాదిత్వము అంటే మరొక వస్తువుకన్నా పురుషార్థమైనందువల్ల దాన్ని మించినదిగా తాను ఉపాసించేదాన్ని గురించి వాదించడము. నామము మొదలుకొని ఆశ – దిక్కు – పర్యన్తమైన ఉపాస్యవస్తువులను మించిపోయిన తాను ఉపాసించే ప్రాణశబ్దము చేత నిర్దేశింపబడిన ప్రత్యగాత్మను గురించి వాదించుతున్నాడు కనుక ప్రాణవేదికి అతివాదిత్వము దక్కింది. అతనికంటే అతిశయ పురుషార్థమైనందువల్ల, నిరతిశయ పురుషార్థమైనందువలన ఉపాస్యుడైన పరబ్రహ్మను గురించి వాదించేవాడే సాక్షాత్ అతివాది ఔతున్నాడు. కనుకనే **ఏషతువా అతివదతి యస్సత్యేనాతివదతి** అని చెప్పబడింది. సత్యేన అనే పదమునందు ఇత్థం భూత లక్షణలో తృతీయావిభక్తి వచ్చింది. అందుచేత సత్యేన అని అనగా – ఉపాస్యుడైన పరబ్రహ్మచేత ఉపలక్షితుడై ఎవడు అతివాది ఔతున్నాడో అని అర్థము. ఇందువల్లనే గురువు గారిని శిష్యుడు ఇట్లా ప్రార్థిస్తున్నాడు. **సోఽహంభగవః సత్యేన అతివదాని.** ఓ భగవన్తుడా! నేను కూడా సత్యమును గురించిన జ్ఞానాన్ని కలవాడినై అతివాదిని అవుతాను. అని ఇక ఆచార్యుడు కూడా **సత్యంత్వేవ విజిజ్ఞాసితవ్యమ్.** సత్యాన్ని గురించే తెల్సుకొనే ప్రయత్నం చెయ్యాలె అని చెప్పినాడు. **ఆత్మతః ప్రాణః** ఆత్మ నుండి ప్రాణము అనిన్నీ ప్రాణశబ్దముచేత నిర్దేశింపబడినవానికి ఆత్మనుండి పుట్టుక చెప్పబడుతున్నది. ఇందువల్ల **తరతి శోకమాత్మవిత్** అని ఉపక్రమింపబడినవాడు ఐన ఆత్మ ప్రాణశబ్దనిర్దేశితుడైన వానికంటే వేరయినవాడే.

ఇంతకుముందు మీరు ఏమాటనైతే చెప్పినారో – **అస్తి భగవోప్రాణాద్ భూయః** అనే ప్రశ్నకు **అదో వావప్రాణాద్భూయః** అని ప్రతివచనము కనబడడంలేదు కనుక ఆరంభింపబడిన ఆత్మోపదేశం ప్రాణోపదేశముతో ముగిసిపోతున్నది తెలుస్తున్నది అని అది తగినది కాదు. ప్రశ్నప్రతివచనాల ద్వారా మాత్రమే అర్థాన్తరము తెలియబడదు. ఇతర ప్రమాణాలచేత కూడా తెలుస్తుంది. ప్రాణోత్పత్తి లింగము అని ప్రమాణాన్తరము

ఇంతకుముందే చెప్పబడింది. **అస్తి భగవో[ప్రాణాద్భూయః** అని అడుగకపోవడానికి ఇది అన్తరార్థము. నామము మొదలుకొని ఆశాపర్యన్తమున్న అచేతనాలు ఒకదానికంటే ఒకటి అధికపురుషార్థము కలవి కావున పూర్వపూర్వాన్ని మించిన ఉత్తరోత్తరాలను ఉపదేశించగా వాటి వాటిని ఎరిగిన వారి గురించి ఆచార్యుడు అతివాదిత్వాన్ని చెప్పలేదు. ప్రాణశబ్దమచేత నిర్దేశింపబడిన ప్రత్యగాత్మ యొక్క యథార్థజ్ఞానాన్ని తెల్సినవాడిని గురించి మాత్రము పురుషార్థము దండిగా ఉన్నదని వానియొక్క అతిశయాన్ని తలచిన ఆచార్యుడు **సవాఏష పశ్యన్నేవంమన్వానః ఏవం విజానన్నతివాదీ భవతి** అని మిగతావాటిని అతిక్రమించిన వస్తువాదిత్వాన్ని చెప్పినాడు అందువల్ల ఇక్కడనే ఆత్మోపదేశము ముగిసింది అని భావించిన శిష్యుడు తిరిగి ప్రశ్న వేయలేదు. ఆచార్యుడు మాత్రము దీన్నికూడా సాతిశయమైనదిగా (స+అతిశయము = సాతిశయము = తనకన్నా మించిన దాన్ని, ఎక్కువైన వస్తువును కలిగినటువంటిది.) తలచి నిరతిశయ పురుషార్థమైన సత్యశబ్దము చేత చెప్పబడే పరబ్రహ్మను (గురించి) **ఏషతువా అతివదతి యః సత్యేన అతి వదతి** అని స్వయముగానే ముందు బెట్టినాడు. శిష్యుడు కూడా పరమ పురుషార్థ రూపుడైన పరమబ్రహ్మ (యందు ముగింపబడిన) ను, తత్స్వరూపము, ఆయన ఉపాసన యాథాత్మ్యాన్ని తెలుసుకోవాలనే కోరికతో **సోऽహం భగవః సత్యేన అతివదాని** అని ప్రార్థించినాడు. అటుపిమ్మట బ్రహ్మసాక్షాత్కారానికి కారణమైన అతివాదిత్వము సిద్ధించడం కొరకు బ్రహ్మసాక్షాత్కారము జరుగడానికి ఉపాయమైన బ్రహ్మోపాసనను **సత్యంత్వేవ విజిజ్ఞాసి తవ్యమ్** అని ఉపదేశించి, దానికి మార్గమైన బ్రహ్మను గురించిన మననాన్ని **మతిస్త్వేవ విజిజ్ఞాసితవ్యా** అని ఉపదేశించి మననమనేది విన్న దాన్ని గట్టిగా చెదరిపోకుండా నిలిపేది కాబట్టి మననాన్ని ఉపదేశించడం ద్వారా విన్న అర్థాన్ని సిద్ధమైనదిగా తలచి శ్రవణానికి ఉపాయమైన పరబ్రహ్మ యందలి శ్రద్ధను **శ్రద్ధాత్వేవ విజిజ్ఞాసితవ్యా** అని ఉపదేశించి దానికి మార్గమైన అందుకు పూనుకోవడమైన ప్రయత్నరూపమైన క్రియనున్నూ (కృతి) **కృతిస్త్వేవ విజిజ్ఞాసితవ్యా** అని ఉపదేశించి శ్రవణాది ఉపక్రమరూపమైన కృతి సిద్ధించడానికి ప్రాప్యుడైన సత్యశబ్దము చేత చెప్పబడే బ్రహ్మయొక్క సుఖరూపత తెల్సుకోవాలి అని **సుఖంత్వేవ విజిజ్ఞాసితవ్యమ్** అని ఉపదేశించి నిరతిశయ విపులమైన సుఖమే పరమపురుషార్థరూపము అవుతుందని, సుఖరూపుడైన ఆ బ్రహ్మయొక్క నిరతిశయవిపులతను తెల్సుకోవాలి అని **భూమాత్వేవ విజిజ్ఞాసితవ్యః** అని ఉపదేశించి నిరతిశయ విపుల సుఖస్వరూపుడైన బ్రహ్మయొక్క లక్షణము ఇది అని చెప్పబడుతున్నది. **ఏమని? యత్రనాన్యత్ పశ్యతి నాన్యత్ శృణోతి**

**నాన్యద్విజానాతి. సభూమా.** అని ఈ వాక్యానికి ఇదీ అర్థము. అవధిలేని అతిశయము కల సుఖస్వరూపుడైన బ్రహ్మను అనుభవించుతుంటే ఆయనకంటే వేరుగా మరొకరిని అనుభవించేవాడు చూడడు. ఎందుకంటే ఈ సమస్త ప్రపంచమంతా ఆయన స్వరూపములోనూ ఆయనయొక్క ఐశ్వర్యములోనూ అన్తర్భాగము అయ్యి ఉన్నది కాబట్టి. ఇందువల్ల ఐశ్వర్యము అనే పదానికి మరొక పర్యాయపదము ఐన విభూతి, గుణాలతో కూడి ఉన్న నిరతి శయ సుఖరూపుడైన బ్రహ్మను అనుభవించుతూ ఆయనకంటే వేరొక వస్తువు లేకపోయినందువల్లనే మరొక్కవస్తువును దేన్నీ చూడడు. ఆ విధంగా అనుభవించదగినదంతా సుఖ రూపమే ఐనందువల్ల దుఃఖాన్ని కూడా పొందదు. చూడడు. ఏదైతే అనుభవింపబడుతూ ఉన్నదై పురుషుడికి అనుకూలమై ఉంటుందో అదే సుఖము అని అనబడుతుంది.

ఏమండీ। ఈ జగత్తే బ్రహ్మకంటే వేరయినదిగా ఎంచి అనుభవించినపుడు దుఃఖరూపమైనది, పరిమితసుఖము మాత్రమే కలదిగా అవుతూ బ్రహ్మయొక్క విభూతియైనందువలన బ్రహ్మాత్మకంగా భావించి అనుభవించితే కేవలము సుఖరూపమే ఎట్లాగా ఔతుంది? అని అంటే చెప్తున్నాము వినండి. కర్మవశ్యులైన క్షేత్రజ్ఞులు బ్రహ్మకంటే వేరయినదానినిగా ఈ జగత్తును గురించి తలచితే అపుడు ఈ సమస్త ప్రపంచము వాళ్ళ వాళ్ళ కర్మలకు తగినట్లుగా దుఃఖాత్మకమూ పరిమిత సుఖము కలదిగానూ అవుతున్నది. ఇందువల్ల బ్రహ్మ కంటే వేరవడం చేత పరిమిత సుఖము కలది, దుఃఖములు అధికముగా జగదనుభవము ఉంటున్నదంటే అందుకు కారణము కర్మ. అయితే అదే కర్మ రూప అవిద్యనుండి విముక్తుడైన వానికి ఆ ప్రపంచమే విభూతి గుణవిశిష్టుడైన బ్రహ్మానుభవములో అన్తర్గత మయ్యి సుఖమే అవుతుంది. ఎలాగంటే? పిత్తవ్యాధి కలిగినవాడు తాగిన పాలు పిత్తరసము యొక్క తారతమ్యము – (ఎక్కువ తక్కువ లగుట) వలన అల్పసుఖాన్నిస్తాయి. లేదా విపరీత ఫలాన్నైనా ఇస్తాయి. అవే పాలు పిత్తవ్యాధి లేనివాడికి సుఖాన్నే కలిగిస్తాయి. అట్లాగే రాజకుమారుడికి తండ్రియొక్క లీలోపకరణము తండ్రిది కాదని భావించినప్పుడు అప్రియాన్ని కలిగిస్తుంది. తండ్రిదేనని భావించినప్పుడు ప్రియతమము అవుతుంది. ఆ విధంగానే నిరతిశయ ఆనందస్వరూపుడైన బ్రహ్మయొక్క, అనవధిక అతిశయ అసంఖ్యేయ కళ్యాణగుణాకరుడైన వాని లీలోపకరణము బ్రహ్మాత్మకముగా అనుసన్ధింపబడినపుడు ఈ జగత్తు నిరతిశయ ప్రీతినే కలిగిస్తుంది. అందువల్ల జగదైశ్వర్యము కలవాడు

అనవధికాతిశయ సుఖస్వరూపుడు ఐన బ్రహ్మను అనుభవిస్తూ ఆయన కంటే వేరుగా దేన్ని దర్శించడు. దుఃఖాన్ని కూడా పొందడు. దీన్నే వాక్యశేషము ప్రతిపాదిస్తున్నది. **స వా ఏష ఏవం పశ్యన్ ఏవమ్ మన్వానః ఏవం విజానన్ ఆత్మరతిః ఆత్మక్రీడః ఆత్మ మిథునః ఆత్మానందః సస్వరాడ్ భవతి. తస్యసర్వేషు లోకేషు కామచారో భవతి. అథయేఽన్యథాఽతోవిదు రన్యరాజానః తేక్షయ్యలోకాః భవన్తి. తేషాం సర్వేషు లోకేషు అకామచారోభవతి.** ఆ విధంగా భూమా స్వరూపాన్ని తెల్సుకొని ఉపాసించి ఇదంతా బ్రహ్మాత్మకమని తలచినవాడు ఇట్లాగే దర్శిస్తూ, తలుస్తూ, మరిమరి తెలుసుకుంటూ ఆత్మయైన బ్రహ్మయందు రతి (ప్రేమ) కలవాడై ఆయనతోనే ఆడుతూ ఆత్మతో జంటగా ఉంటూ ఆయన వలననే ఆనందాన్ని పొందుతూ స్వరాట్ – తనకు తానే రాజు అవుతాడు. అతనికి లోకాలన్నింటిలోనూ స్వేచ్ఛగా రాకపోకలు, అధికారము కల్గుతుంది. ఇక ఎవరైతే ఈ జగత్తునంతా బ్రహ్మాత్మకము కాదని తలుస్తారో అలాంటి వాళ్ళు కర్మకు విధేయులైనవారై నశించేలోకాలకు మాత్రమే పోతారు. వారికి అన్నిలోకాల్లో స్వేచ్ఛగా పోయిరావడానికి అధికారముండదు అని. **స్వరాట్ఽ**కర్మలకు వశుడు కాని వాడు. **అన్యరాజానః = కర్మవశ్యులు.** అట్లే **నపశ్యోమృత్యుమ్ పశ్యతి. నరోగం నోతదుఃఖ తామ్. సర్వం హపశ్యః పశ్యతి సర్వమాప్నోతి సర్వశః.** సర్వత్రా బ్రహ్మను సమస్త జగత్తూ బ్రహ్మాత్మకము అని ఎవడు చూడగల్గుతాడో వాడు మృత్యువును దర్శించడు. రోగాలు రావు దుఃఖాలు కలుగవు. సమస్తాన్నీ తనకళ్ళ ఎదుటఉన్నట్లుగా చూడగలుగుతాడు. తానుకోరుకున్న ప్రతివస్తువును నూటికి నూరు పాళ్ళూ పొందగలడు. అనిన్నీ. బ్రహ్మయొక్క నిరతిశయ సుఖరూపత్వాన్ని ఆనందమయోఽభ్యాసాత్ అనే సూత్రము దగ్గర విపులముగా వర్ణించినాము. ఇందువల్ల **"ప్రాణశబ్దము చేత నిర్దేశితుడైన ప్రత్యగాత్మకంటే మరొక అర్థము – వస్తువు – ఐన, సత్య శబ్దము చేత చెప్పబడే బ్రహ్మను భూమా అని అంటారు"** అని ఉపదేశించి నందువల్ల భూమా అనబడేవాడు పరబ్రహ్మనే కాని మరొకడు కాడు.

సూ॥ **ధర్మోప పత్తేశ్చ 1-3-8** పరమాత్మయందే ధర్మాలు చక్కగా పొసుగు తున్నందువలన. ఈ భూమా శబ్దవాచ్యుడికి ఏ ధర్మాలు వేదములో చెప్పబడినాయో అవి అన్నీ పరబ్రహ్మయందే పొసగుతవి. **ఏత్ దమృతమ్** ఇతడే ఆనందస్వరూపుడు అని స్వాభావికమైన అమృతత్వము, **స్వేమహిమ్ని** తనదైన మహిమయందు అని ఎవ్వనిపైనా ఆధారపడి ఉండకపోవడము, **సఏవాధస్తాత్** అని మొదలుబెట్టి **సఏవేదమ్ సర్వమ్**

అని సర్వాత్మకత్వము **ఆత్మతః ప్రాణః** ఇత్యాదిగా ప్రాణము మొదలుకొని సమస్తాన్నీ పుట్టించడము మొదలైన ధర్మాలు అన్నీ పరమాత్మవే. ఏదైతే **అహమేవాధస్తాత్** ఇత్యాది వాక్యము ద్వారా సర్వాత్మకత్వము ఉపదేశింపబడిందో అది భూమ విశిష్టుడైన బ్రహ్మను అహంగ్రహణము – తానుగా భావించుట – తో ఉపాసించుటను / పద్ధతిని ఉపదేశిస్తున్నారు. **అథాతోऽహంకారాదేశః** అని అహంగ్రహ ఉపదేశాన్ని ఆరంభించినారు కాబట్టి. అహమర్థము ఐన ప్రత్యగాత్మకు కూడా ఆత్మయైనవాడు పరమాత్మ అని అన్తర్యామి బ్రాహ్మణాదులలో చెప్పబడింది. ఇందువలన ప్రత్యగర్థము పరమాత్మ వరకూ చెల్లుతున్నది కాబట్టి అహం శబ్దము కూడా పరమాత్మ పర్యవసాయి అవుతున్నది కనుక ప్రత్యగాత్మను శరీరముగా కలవాడై ఉన్నందున పరమాత్మగా తనను అనుసంధానము చేసుకోవడం కొరకు అహంగ్రహోపదేశము చెయ్యబడింది. పరమాత్మ చిదచిత్తులను అన్నింటినీ శరీరముగా చేసుకొన్నవాడు కనుక సర్వాత్మఐనందున ప్రత్యగాత్మకు కూడా ఆత్మ పరమాత్మనే. దాన్నే **అథాత ఆత్మాదేశః** ఇత్యాదివాక్యముతో **ఆత్మైవేదమ్ సర్వమ్** అనే చివరతో చెప్పినారు. దీనినే బలపరచడం కోసము ప్రత్యగాత్మకు కూడా ఆత్మయైన పరమాత్మనుండే సమస్తమూ పుడుతున్నదని చెప్పబడుతున్నది. **తస్య హ వా ఏతస్య ఏవం పశ్యత ఏవం మన్వానస్య ఏవం విజానతః ఆత్మతః ప్రాణః ఆత్మతః ఆకాశః** అనే వాక్యము ద్వారా. ఉపాసకుడికి అన్తర్యామిగా ఉంటున్న పరమాత్మనుండే సమస్తానికి జన్మ కలుగుతున్నదని అర్థము. ఇందువలన పరమాత్మ ప్రత్యగాత్మను శరీరముగా కలిగి ఉన్నాడనే జ్ఞానము గట్టిగా నాటుకు పొయ్యేందుకుగాను అహంగ్రహోపాసనమును చెయ్యాలి. అందువల్ల భూమా విశిష్టుడు పరమాత్మనే అని సిద్ధమయ్యింది. **ఇది భూమాధికరణము.**

★ ★ ★

## ఇక అక్షరాధికరణము

సూ॥ **అక్షరమమ్బరాన్తధృతేః 1–3–9** అక్షర శబ్దము చేత చెప్పబడేవాడు పరమాత్మనే. ఆకాశానికిన్నీ మూలమైన ప్రకృతిని ధరించినందువలన. వాజసనేయ శాఖకు చెందినవారు గార్గీ ప్రశ్నలో ఈ విధంగా పఠిస్తున్నారు. **సహో వాచ ఏతద్వై తదక్షరం గార్గి! బ్రాహ్మణా అభివదన్తి. అస్థూలమ నణ్వహ్రస్వమదీర్ఘమలోహిత మస్నేహమచ్ఛాయమ్** ఆ యాజ్ఞ వల్క్యుడు చెప్పినాడు. ఓ గార్గి! అక్షరమనబడే వస్తువు ఇట్లాంటిది అని బ్రహ్మవేత్త లైన పెద్దలు చెప్పుతున్నారు అది లావైనది కాదు.

అణువంతటిదీకాదు. పొట్టిదికాదు. పొడుగైనదీ కాదు. ఎర్రనిది కాదు. అంటుకొనే స్వభావము కలదేకాదు. కాన్తిలేనిది / నీడలేనిదీ కాదు అని. ఇందులో సందేహము కల్గుతున్నది. ఈ అక్షరము అనబడేది ప్రధానమా? జీవుడా లేక పరమాత్మనా? అని. ఏది తగును? అని అంటే ప్రధానము – ప్రకృతి అని అనడమే తగును. ఎందువల్ల నంటే **అక్షరాత్పరతః పరః** అక్షరమునకంటే పరమైన వాడికన్నా పరుడు ఇత్యాది వాక్యాలలో అక్షర శబ్దము ప్రయోగింపబడుట కనిపిస్తున్నది. అంతేకాక అస్థూలత్వాది లక్షణాలన్నీ చక్కగా ప్రధానానికే అతుకుతున్నాయి గనుక. అయితే **యయాతదక్షరమధిగమ్యతే** దేనిచేతనైతే అక్షర శబ్దవాచ్యుడు చేరుకోబడుతున్నాడో ఇత్యాదులయందు పరమపురుషుని విషయంలో అక్షర శబ్దము ప్రయోగింపబడియున్నది కదా అని అంటారేమోకానీ అది సరియైనది కాదు. దేనికైనా ఇదీ అర్థము అని నిర్ధారించేటప్పుడు ప్రమాణాన్తర ప్రసిద్ధి, శ్రుతి ప్రసిద్ధి రెండున్నూ ముందుకు వచ్చినప్పుడు ముందుగా ప్రమాణాన్తర ప్రసిద్ధే మనకు తోస్తుంది. దాన్నే మనము స్వీకరించితే వైరుధ్యము ఉండదు కాబట్టి ప్రమాణాన్తర ప్రసిద్ధి ప్రకారము ముందుగా తోచిన ప్రధానాన్ని గ్రహించడంలో దోషము లేదు. ఇంతేకాకుండా **యదూర్ధ్వం గార్గిదివో యదర్వాక్ పృథివ్యాః** ఓ గార్గి! ఏది ద్యులోకాని కంటే పైన పృథివి కంటే దిగువన ఏది ఉన్నదో అని మొదలుపెట్టి భూతభవిష్యత్ వర్తమానకాలాలు మూడింటియందున్నూ ఉంటున్న కారణభూత, ఆకాశ ఆధారత్వాలు ప్రతిపాదింపబడినాయి. **కస్మిన్నుఖలు ఆకాశః ఓతశ్చ ప్రోతశ్చ** ఎవనియందు / దేనియందు ఆకాశము ఓతము ప్రోతము ఐనదో – ఓతము ప్రోతములు అనగా పడుగుపేకలు (నిలువు + అడ్డము) దారాలు అని అర్థము. ఆ రెండూ కలిస్తే వస్త్రము అవుతుంది. అని ఆకాశానికి కూడా కారణము ఐనది ఏది? దానికి ఆధారమైనది ఏది? అని అడిగితే ప్రత్యుత్తరముగా చెప్పబడినది అక్షరము అని. అది అన్నిరకాల వికారాలకు కారణమయ్యి వాటికి ఆధారమయ్యి ప్రమాణాన్తరము చేత ప్రసిద్ధము ఐన ప్రధానము అనే మనకు తోస్తున్నది. కనుక అక్షరమనగా ప్రధానమే అని పూర్వపక్షము.

దీనికి సమాధానాన్ని చెపుతున్నారు. అక్షరమంబరాన్త ధృతేః అని. అక్షరమనగా పరబ్రహ్మ. ఎందువల్లనంటే అమ్బరాన్తధృతేః అమ్బరస్య – ఆకాశానికి, అన్తః – ఆవలి కొసఐన అవ్యాకృతము – నామరూపాలులేక ఉండిన మూల ప్రకృతి దాన్ని ధరించి ఉన్నాడు కనుక. దానికి ఆధారముగా ఈ అక్షరపురుషుడిని గురించి ఉపదేశింపబడింది

కనుక అని అర్థము. ఇది తేట అర్థము – **కస్మిన్నుఖలు ఆకాశః ఓతశ్చ ప్రోతశ్చ** అనేచోట ఆకాశ శబ్దముచేత చెప్పబడినటువంటిది గాలితో నిండిన మిన్నుకాదు. దానికి ఆవలి చివరగా ఉన్న అవ్యాకృతము అనబడే ప్రకృతి కనుక ఆ అవ్యాకృతమైన దానికిన్నీ ఆధారమైనదిగా చెప్పబడేది ఐన అక్షరము అవ్యాకృతమే కావడానికి అవకాశము లేదు అని.

అయితే ఆకాశశబ్దముతో చెప్పబడినది వాయువుతో నిండిన ఆకాశము కాదని ఎట్లాగా తెలుస్తున్నది? అని అంటే **యదూర్ధ్వమ్ గార్గి! దివో య దర్వాక్పృథివ్యాః యదన్తరాద్యావా పృథివీ ఇమే. యద్ భూతం చ భవచ్చ భవిష్యచ్చ ఇత్యాచక్షతే ఆకాశ ఏవ తదోతం ప్రోతం చ** ఓగార్గి ద్యులోకానికిపైన నేలకు దిగువన ద్యావా పృథివీలకు నడుమ/ దేనినడుమ ఈ రెండూ ఉన్నవో ఏది గడచిపోయిన కాలముందున్నదో వర్తమాన కాలమందున్నూ ఉన్నదో రాబోయే కాలములోనూ ఉండనున్నదో అని చెప్పబడుతున్నదో అది అంతా ఆకాశము నందే పడుగు పేకలుగా అల్లుకుపోయి ఉన్నది. అని చెప్పినప్పుడు మూడు కాలాలలోనూ ఉండే వికారములైన వస్తువులకు (చిదచిన్మిశ్రమైన వాటికి) ఆధారమైనదిగా నిర్దేశింపబడిన ఆకాశము వాయువుతో కూడి ఉన్న మిన్ను కావడానికి అర్హత కలది కాదు. ఆ మిన్నుకూడా వికారాలలో ఒకటి అయ్యే ఉంటున్నది కాబట్టి. అందువల్ల ఆకాశ శబ్దము చేత చెప్పబడినట్టిది భూత సూక్ష్మము – పంచభూతాలకున్నూ పుట్టుకకు కారణమయ్యి అతిసూక్ష్మరూపంలో ఉన్న ప్రకృతి– అని స్ఫురిస్తున్నది. అందువల్ల ఆ భూతసూక్ష్మానికి కూడా ఆధారమైనది ఏది? అని ప్రశ్నింపబడుతున్నది. **కస్మిన్ను ఖలు ఆకాశః ఓతశ్చ ప్రోతశ్చ** అనే వాక్యం ద్వారా. ఆ కారణంగా భూత సూక్ష్మానికి ఆధారమయినదిగా నిర్దేశించబడే అక్షరము ప్రధానము కాజాలదు.

ఏదైతే శ్రుతిప్రసిద్ధమైన దానికంటే ప్రమాణాన్తర ప్రసిద్ధము ఐనది మొట్టమొదటగా ప్రతీయ మానము అవుతుంది అని నీవు అన్నావో అదిసరియైనది కాదు. అక్షర శబ్దానికి అవయవ శక్తితో – వ్యుత్పత్త్యర్థము ద్వారా – యోగార్థము ద్వారా – దానియొక్క అర్థాన్ని నిర్ణయము చేయగల్గుతున్నప్పుడు మరొక ప్రమాణము యొక్క అవసరము లేదు. అర్థమైన దానితో సమ్బన్ధాన్ని గ్రహించే దశలో ఏ ప్రమాణము చేతనైతే అర్థస్వరూపము ఇది అని అవగతమవుతున్నదో అది ప్రతిపాదించే దశలో అపేక్షణీయము – అవసరమైనది కాదు. అనగా అక్షర శబ్దానికి వ్యుత్పత్తి నక్షరతి –

నశించేది కాదు అని చెప్పుకొన్నప్పుడు ఏకాలములోనూ లేదు / లేదు అనబడకుండా సదా అస్తి శబ్దవాచ్యుడైన పరమాత్మ తప్ప జీవుడు, ప్రధానమున్నూ అక్షర శబ్దానికి వాచ్యములు కావు. జీవుడు ప్రకృతి సమ్బన్ధము వల్ల ఒకప్పుడు ఉన్నాడు, ఒకప్పుడు లేదు అనబడుతున్నాడు. ప్రకృతి ఎప్పుడూ పరిణామాలను పొందుతుంది. ఒక్క తీరుగా ఉండదు. కనుక లేదు అనబడుతూ క్షరము అవుతున్నది. సూక్ష్మరూపంలో ప్రళయకాలము నందు పరమాత్మలో ఉంటుంది కనుక క్షరము కానిది ఔతున్నది. కనుక నిజంగా అక్షరుడు పరమాత్మనే.

ఇట్లా అయితే అక్షరశబ్ద వాచ్యము ప్రధానము కాకపోనీ, జీవుడిని అక్షరుడు అని అందాము. ఆ జీవుడు భూత సూక్ష్మము వరకు ఉన్న అచిద్వస్తువునకు ఆధారభూతుడు అవుతున్నాడు. అట్లే అస్థూలం మొదలైన విశేషణాలన్నీ కూడా అతనిలో పొసగుతవి. **అవ్యక్తమక్షరే లీయతే** అవ్యక్తము అక్షరుడిలో లీనమవుతున్నది. 2) **యస్యావ్యక్తం శరీరం యస్యాక్షరం శరీరం** ఎవడికి అవ్యక్తము శరీరమో ఎవడికి అక్షరము శరీరమో **3) క్షరః సర్వాణి భూతాని కూటస్థోఽక్షర ఉచ్యతే** సమస్త భూతాలు క్షరము అనబడుతవి. కూటస్థుడు అక్షరుడు అని చెప్పబడుతున్నాడు. ఇత్యాది స్థలాల్లో ప్రత్యగాత్మ యందు అక్షర శబ్ద ప్రయోగము కనబడుతున్నది కదా! అనే వాదనకు ఇట్లా సమాధానము చెప్పబడుతున్నది.

సూ॥ **సాచప్రశాసనాత్ 1-3-10** అమ్బరాన్తధృతి అనునది తనయొక్క మాట మాత్రము వల్లనే జరుగుతున్నందున అక్షర శబ్దవాచ్యుడు పరమాత్మనే. ఆ విధమైన అమ్బరాన్త ధృతి ఈ పరమ పురుషుని యొక్క శాసనము వల్లనే జరుగుతున్నది అని ఉపదేశింపబడుతున్నది. **ఏతస్యవా అక్షర స్యప్రశాసనే గార్గి! సూర్యాచంద్రమసౌ విధృతౌతిష్ఠతః. ఏతస్యవా అక్షరస్య ప్రశాసనే గార్గి ద్యావా పృథివ్యౌ విధృతౌ తిష్ఠతః ఏతస్యవా అక్షరస్యప్రశాసనే గార్గి! నిమేషా ముహూర్తాః అహోరా త్రాణ్యర్ధ మాసా మాసా ఋతవః సంవత్సరాః ఇతి విధృతాస్తిష్ఠన్తి.** ఓ గార్గి! ఈ అక్షరుని ఆజ్ఞ ప్రకారమే సూర్యచంద్రులు ఆకాశములో నిలదొక్కుకుని ఉంటున్నారు. ద్యులోకము పృథివీ నిల్చి ఉంటున్నవి. ఈతని శాసనము ప్రకారమే నిమేషాలు, ముహూర్తాలు రాత్రింబవళ్ళు పక్షములు నెలలు, ఋతువులు, సంవత్సరాలు అనేవి ధరింపబడి ఉంటున్నవి. ఇత్యాది వాక్యము ద్వారా పై విషయము తెలుస్తున్నది. ప్రకృష్టమైన శాసనము ప్రశాసనము. అనగా ఒకానొకప్పుడు కూడా అడ్డగింపు / ఎదురులేని శాసనము ప్రశాసనము

అని అర్థము. ఇట్లాంటి తనయొక్క శాసనానికి కట్టుబడియుండిన సర్వవస్తువులను విశేషంగా ధరించడము అనేది బద్ధుడు, ముక్తుడు అనే రెండు అవస్థలలోనూ ఉన్న జీవుడికి / ప్రత్యగాత్మకు కలుగనే కలుగదు. ఇందువల్ల పురుషోత్తముడు మాత్రమే ప్రశాసితయైన అక్షరము.

సూ॥ **అన్యభావ వ్యావృత్తేశ్చ 1-3-11** ప్రకృతిని జీవాత్మనున్నూ త్రోసి రాజన్నందువల్ల పరబ్రహ్మనే అక్షర శబ్ద వాచ్యుడు. అన్యభావః - అన్యత్వము ప్రధానాది భావము. ఈ అక్షరానికి పరమ పురుషుడికంటే వేరొకడై ఉండడము అనేది వాక్యశేషము నందు త్రోసివేయబడుతున్నది. **తద్వా ఏతదక్షరం గార్గి! అదృష్టం ద్రష్టృ. అశ్రుతం శ్రోతృ. అమతం మంతృ. అవిజ్ఞాతం విజ్ఞాతృనాऽన్యదతోऽస్తి విజ్ఞాతృ. ఏతస్మిన్ను ఖల్వక్షరే గార్గి ఆకాశ ఓతశ్చప్రోతశ్చ.** ఓ గార్గి! అదిగదా! ఈ అక్షరము. కనపడదు గానీ అన్నింటినీ చూస్తుంది. వినిపించదు గానీ అన్నీ వింటుంది. ఎవరికీ తెలియనిదేకాని అన్నింటినీ తెల్సుకుంటుంది. మననము చేయబడదు కానీ తాను మననము చేసుకుంటుంది. దీనికంటే ద్రష్ట మరొకటి లేదు. శ్రోత లేదు మన్త లేదు. విజ్ఞాత లేదు. ఈ అక్షరమునందు మాత్రమే ఆకాశము ఓ తము ప్రోతము అయ్యి ఉన్నది. అని ఇక్కడ ద్రష్టృత్వము, శ్రోతృత్వము మున్నగు వాటిని ఉపదేశించుట వలన ఈ అక్షరము అచేతనమైన ప్రధానముకాదని త్రోసివేయబడుతున్నది. అందరికీ కనబడకుండానే ఉంటూ ఉనికి గలిగియున్న ఇతనికి అన్నింటినీ చూడగల ద్రష్టుత్వాదులు ఉన్నవని చెప్పడం వల్ల ప్రత్యగాత్మ అని అనుకోరాదని ప్రక్కకు పెట్టబడుతున్నవి. ఇందువల్ల ఈ అన్యభావవ్యావృత్తి ఈ అక్షరుడిని పరమ పురుషుడు అని భావించడాన్నే గట్టి చేస్తున్నది.

అన్యభావవ్యావృత్తిని ఈ విధంగానైనా చెప్పవచ్చును. ఇతరునికి సద్భావము - ఉండడము - ను వ్యావృత్తిః - తొలగించడము అన్యభావ వ్యావృత్తి. ఎట్లాగైతే ఈ అక్షరము ఇతరుల చేత చూడబడనిది అవుతూనే ఇతరులను చూచేది అవుతూ తనకంటే వేరయిన సమస్తానికి ఆధారమవుతున్నదో అదే తీరున ఈయన చేత చూడబడక ఈయనను చూచేది అయ్యి ఈయనకు ఆధారమైనట్టిది లేదని చెపుతూ **నాన్యదతోऽస్తిద్రష్టృ** ఇత్యాదియైన వాక్యశేషము ఇతరుని యొక్క ఉనికిని / అస్తిత్వాన్ని పక్కకు పెడుతూ ఈ అక్షరుడికి ప్రధాన భావము, ప్రత్యగాత్మ భావాన్ని నిషేధిస్తున్నవి.

ఇంతేకాకుండా **ఏతస్యవా అక్షరస్య ప్రశాసనేగార్గి దదతో మనుష్యాః ప్రశంసన్తి. యజమానం దేవాః దర్వీంపితరో అన్వాయత్తాః** ఓ గార్గి! ఈ అక్షరుని యొక్క

ప్రశాసనము ప్రకారము దానము చేసెడి వాడిని మనుష్యులు మెచ్చుకుంటున్నారు. యాగాలు చేసే యజమానిని దేవతలు మెచ్చుతున్నారు. (**అన్వాయత్తాఃఽఅనువశాః, లొంగి ఉన్నవారై**) అని. శ్రౌత స్మార్త యాగదాన హోమాదులు ఐన అన్ని కర్మలున్నూ ఎవని ఆజ్ఞ వలన కొనసాగుతున్నవో ఆ అక్షరుడు పరబ్రహ్మఐన పురుషోత్తముడే అని తెలుస్తున్నది. మరియు **యోవా ఏతదక్షరం గార్గ్యవిదిత్వా అస్మిన్ లోకేజుహోతి యజతే తపస్తప్యతే బహూని వర్షసహస్రాణి అన్తవదేవాస్యతథ్భవతి. యోవాఏతదక్షరం గార్గి! అవిదిత్వాఽస్మాల్లోకాత్ ప్రైతి. సకృపణః. అథయఏత దక్షరం గార్గి! విదిత్వాఽస్మాల్లోకాత్ ప్రైతి స బ్రాహ్మణః.** ఓ గార్గి! ఎవడైతే ఈ అక్షరుడిని తెల్సుకోకుండా ఈ లోకంలో హోమాలు యాగాలు చేస్తాడో తపస్సును చేస్తాడో ఏండ్ల కొద్దీ ఎడతెగకుండా చేసినా ఆ కర్మల ఫలితమంతా నశించి పోయ్యేదే అవుతుంది. ఎవడైతే ఆయనను గురించి తెల్సుకోకుండా మరణించుతాడో వాడు దౌర్భాగ్యుడు. ఎవడైతే ఈ అక్షర పురుషుడిని గురించి తెల్సుకొని కర్మల ద్వారా ఆరాధించి చివరకు దేహత్యాగం చేసి ఊర్ధ్వలోకాలకు పోతాడో వాడు బ్రాహ్మణుడు. అని ఎవడిని గురించి తెల్సుకోకపోతే సంసారప్రాప్తి ఎవడిని గురించి తెల్సుకుంటే అమృత్వరూపమైన మోక్షాన్ని పొందడం జరుగుతుందో ఆ అక్షరము/డు పరబ్రహ్మనే అని తేలిపోయింది. **ఇది అక్షరాధికరణము.**

★ ★ ★

## ఇక ఈక్షతి కర్మాధికరణము

**సూ॥ ఈ క్షతి కర్మ వ్యపదేశాత్ సః 1-3-12.** ఈక్షతి శబ్దానికి అర్థమైన కర్మగా పేర్కొనబడినందున అతడు పరమాత్మనే. ఆథర్వణికులు సత్యకామప్రశ్న యందు ఇట్లా చదువుతున్నారు. **యః పునరేతం త్రిమాత్రేణ ఓమిత్యేతేనైవ అక్షరేణ పరం పురుషమభిధ్యాయీత. సతేజసి సూర్యేసమ్పన్నః. యథా పాదోదరస్త్వ చా వినిర్ముచ్యతే. ఏవం హ వై స పాప్మనా వినిర్ముక్తః. ససామభిరున్నీయతే బ్రహ్మలోకమ్. సఏతస్మాజ్జీవఘనాత్ పరాత్పరం పురిశయం పురుషమీక్షతే.** ఎవడైతే ఈ మూడు మాత్రలకాలములో ఓమ్ అనే అక్షరముతో పరమపురుషుడిని చక్కగా ధ్యానమును చేస్తాడో అతడు తేజో రూపుడైన సూర్యుని యందు చేరుకుంటాడు. ఏ విధంగా నైతే పాము తన కుబుసాన్ని విడిచిపెడుతుందో అట్లాగే పాపాల నుండి విడివడినవాడై సామగానముతో బ్రహ్మ లోకానికి ఉర్ధ్వదిశగా కొనిపోబడుతాడు. అతడు అక్కడ

జీవఘనుడనబడే కూటస్థ పురుషుడికంటే పరాత్పరుడు ఐ సౌలభ్యము కొరకు దహరాకాశములో నుండే పురుషుడిని దర్శించుకుంటాడు. అని. ఇక్కడ ధ్యాయతి, ఈక్షతి అనే శబ్దాలు ఒకే విషయాన్ని చెపుతున్నాయి. ఈక్షణము / దర్శించడము అనేది ధ్యానక్రియ చేయగా ఫలితంగా లభించేటు వంటిది. **యథాక్ర తురస్మిన్ లోకే పురుషః** ఈ లోకములోని పురుషుడు ఇక్కడ ఎటువంటి క్రియను ఆచరిస్తాడో పరలోకంలోనూ అటువంటి ఫలితాన్నే పొందుతున్నాడు. అనే న్యాయం ప్రకారం తాను దేన్ని ధ్యానించినాడో అదే అతనికి ప్రాప్యము – పొందదగిన ఫలము – అవుతున్నది. అటువంటి దాన్నే పొందుతాడు కూడా. **పరం పురుషమ్** అని రెండు వాక్యాల్లోనూ కర్మభూతమైన అర్థము గుర్తింపబడుతున్నది. ఈక్షతి ధ్యాయతి అనే రెండు క్రియాపదాలచేత ధ్యానము చేయబడిన వాడినే దర్శించుతున్నాడని తెలుస్తున్నది. ఈక్షతి ధ్యాయతి అనేవి క్రియలైనపుడు ఆ రెండింటికి కర్మఐనవాడు పరబ్రహ్మ. ఆయననే ధ్యానం చేస్తున్నాడు ఆయననే ధ్యానానికి ఫలంగా దర్శించుకుంటున్నాడు. ఇదే రెండుచోట్లలోనూ కర్మ కావడము.

ఇక్కడ సందేహము కలుగుతున్నది. ఈ వాక్యములో **పరంపురుషమ్** అని నిర్దేశించబడిన పురుషుడు జీవసమష్టిరూపుడైన అండాధిపతియైన చతుర్ముఖుడా? లేక సర్వేశ్వరుడైన పురుషోత్తముడా? అని. ఈ రెండింటిలో ఏది తగును అనేట్లయితే సమష్టి క్షేత్రజ్ఞుడేనని మేము అంటాము. హేతువేది? అంటే **సయోహవై తద్భగవన్ మనుష్యేషు ప్రాయణాన్తమోంకార మభిధ్యాయీత. కతమం వా వ స తేనలోకం జయతి.** ఓ పూజ్యుడా! మనుష్యులలో ఎవడైతే తాను చనిపోయే నాటి వరకు ఓంకారాన్ని ఉపాసన చేసి ఎటువంటి లోకాన్ని గెల్చుకుంటాడు అని ఆరంభించి ఒక మాత్రాకాలములో ఉచ్చరించబడే ప్రణవాన్ని ఉపాసించే వాడికి ఈ లోకములోనే సుఖాదులు ప్రాప్తిస్తాయి అని చెప్పి, రెండు మాత్రల ఓంకారాన్ని ఉపాసించినవానికి అన్తరిక్షలోకప్రాప్తిని చెప్పి, మూడు మాత్రల ఓంకారాన్ని ఉపాసించినవాడికి పొందదగినదిగా చెప్పబడిన బ్రహ్మ లోకము అన్తరిక్షానికంటే పైన ఉన్న జీవసమష్టి పురుషుడైన చతుర్మఖ బ్రహ్మయొక్క లోకము అని తెలుస్తున్నది. అక్కడికి పోయిన ఉపాసకునిచేత చూడబడేవాడు ఆ లోకానికి అధిపతియైన చతుర్ముఖుడే. **ఏతస్మాత్ జీవఘనాత్ పరాత్పరం** అనే వాక్యము ద్వారా కూడా దేహేంద్రియాల కంటే పరుడు, దేహేంద్రియాలతో పాటు ఘనీభూతుడైన జీవవ్యష్టి పురుషుడికంటే బ్రహ్మలోకవాసి ఐన సమష్టి పురుషుడు చతుర్ముఖుడికి

పరత్వము బాగా నప్పుతుంది. ఇందువల్ల ఈ వాక్యములో నిర్దేశింపబడుతున్న పరుడైన పురుషుడు సమష్టి పురుషుడగు చతుర్ముఖుడే. ఈ విధంగా చతుర్ముఖత్వము నిశ్చితమైతే అజరత్వాదులు ఎట్లో ఒకట్లా సమన్వయం చేసుకోవాలి.

ఈ విధంగా పూర్వపక్షము సిద్ధముఐతే దానికి సమాధానమును చెపుతున్నాము. ఈక్షతి కర్మ వ్యపదేశాత్ సః. ఈక్షతి కర్మయైనవాడు అతడే – పరమాత్మ. ఎందువల్ల నంటే అట్లాగని వ్యపదేశము చేయబడింది కనుక. ఈక్షతి కర్మ పరమాత్మగా వ్యపదేశింపబడింది. అది ఇట్లాగా – ఈక్షతి కర్మకు విషయంగా ఉదాహరింపబడిన శ్లోకంలో **తమోంకారేణాయతనేనాన్వేతి విద్వాన్‌యత్తత్ శాన్తమజరమమృతమభయం పరం చ.** ఎరిగి ఉపాసించేవాడు ఆ పరబ్రహ్మను ఓంకారమనే ప్రణవాన్ని ఆయతనము (ఇల్లు)గా గలవాడిని చేరుకుంటాడు. ఎవడైతే పరమ శాంతుడు అజరుడు ఆనంద స్వరూపుడు ఆశ్రయించినవానికి అభయము నిచ్చెడివాడు సర్వస్మాత్ పరుడుఐ ఉన్నాడో! అని. పరంశాన్తం అజరం అమృతం అభయం అయినట్టి స్వరూపము పరమాత్మదే. **ఏతదమృతమ్ అభయం ఏతద్‌బ్రహ్మ** ఇత్యాది శ్రుతివాక్యాల వల్ల ఈ విషయము బలపడ్తున్నది. **ఏతస్మాత్ జీవఘనాత్పరాత్పరమ్** అనేది కూడా పరమాత్మకే సూచన. కాని చతుర్ముఖుడిది కాదు. ఆయన కూడా జీవఘన శబ్దము చేత చెప్పబడుతున్నాడు. ఎవడికైతే కర్మ కారణంగా దేహములభిస్తున్నదో వాడు జీవ ఘనుడని చెప్పబడుతున్నాడు. చతుర్ముఖుడికి కూడా ఆ విధంగా శరీరము లభించినట్లు వినిపిస్తున్నది. **యోబ్రహ్మాణంవిదధాతిపూర్వమ్** ఎవడు బ్రహ్మను తొట్టతొలుతగా పుట్టించుతున్నాడో ఇత్యాది వాక్యాలందు.

ఏదైతే మీరు ఇంతకుముందు చెప్పినారో – అన్తరిక్షలోకానికి పైన ఉన్నట్టిదిగా నిర్దేశింపబడుతున్న బ్రహ్మలోకము చతుర్ముఖలోకము అని తెలియవస్తున్నది అని. అందువల్ల అక్కడుండేవాడు చతుర్ముఖ బ్రహ్మ అనిన్నీ. అని అది తగినది కాదు. **యత్తత్‌శాన్తమ జరమమృతమ్ అభయమ్** ఇత్యాది వాక్యములతో ఈక్షతి కర్మయైనవాడు పరమాత్మ అని నిశ్చయింబడితే ఈక్షితుడైన వానియొక్క స్థానముగా నిర్దిష్టమైన బ్రహ్మలోకము క్షయిష్ణువు – నశించే వాడైన చతుర్ముఖుని యొక్క లోకము కాబోదు. ఇంతేకాకుండా **యథా పాదోదరః త్వచా వినిర్ముచ్యతే, ఏవం హవై స పాప్మనా వినిర్ముక్తః ససామభిరున్నీయతే బ్రహ్మలోకమ్** అని అన్ని పాపాలనుండి వినిర్ముక్తుడైన వానికి చేరుకోదగినదిగా చెప్పబడినది చతుర్ముఖస్థానము కాదు. ఇందువల్లనే

ఉదాహరణ శ్లోకములో ఈ బ్రహ్మలోకాన్ని గురించే వినపడుతున్నది. **యత్తత్ కవయో వేదయన్తి** దేనినైతే కర్మవశ్యులుకాని వారైనందువల్ల అసంకుచితమైన జ్ఞానము కల సూరులు తెల్పుతున్నారో అని. కవయః – సూరులు సూరులచేత దర్శించుకోబడేది విష్ణువు యొక్క స్థానమే. **తద్విష్ణోః పరమం పదం సదాపశ్యన్తి సూరయః** నిత్యసూరులు ఆ విష్ణువు యొక్క నివాసస్థానమైన పరమపదాన్నే ఎల్లప్పుడూ దర్శించుకుంటున్నారు. ఇత్యాదివాక్యాల ద్వారా తెలుస్తున్నది. అంతేకాదు. అన్తరిక్షమునకుపైన చతుర్ముఖ లోకములేదు. మధ్యలో స్వర్గలోకము వంటి చాలా లోకాలున్నాయి కదా! ఇందువల్ల **ఏతద్వైసత్యకామ। పరం చాపరం చ బ్రహ్మ యదోంకారః. తస్మాద్విద్వానేతేనై వాయనేనైకతరమన్వేతి.** ఓ సత్యకాముడా! ఈ ఓంకారమే కదా పరము అపరము అనబడే బ్రహ్మ అందువల్ల ఈ ఓంకారాన్ని ఉపాసించినవాడు ఇదే మార్గంగా ఏదో ఒక స్థానానికి చేరుకుంటున్నాడు. అనే బదులు చెప్పిన వాక్యములో ఇంకొక కార్య బ్రహ్మనిర్దేశింపబడినదో అది ఐహికము ఆముష్మికము అని రెండుగా విభజించి ఏక మాత్రాకాలికమైన ప్రణవాన్ని ఉపాసించిన వారికి ఐహికమైన మనుష్యలోకాన్ని పొందుట రూపమైన ఫలాన్ని చెప్పి రెండు మాత్రలకాలము కల్గిన ఓంకారాన్ని ఉపాసించిన వాళ్ళకు ఆముష్మికమైన అన్తరిక్షశబ్దము చేత ఉపలక్షితమైన ఫలాన్ని చెప్పి త్రిమాత్రాకాలికమైన పరబ్రహ్మను తెలియజెప్పే ప్రణవముతో పరమ పురుషుడిని ధ్యానము చేసేవారికి పరంబ్రహ్మనే ప్రాప్యుడుగా ఉపదేశించుతున్నది. కనుక అంతా సమంజసమే. ఇందువల్ల ఈక్షతిక్రియకు కర్మయైనవాడు పరమాత్మ. **అని ఈక్షతి కర్మాధికరణము.**

★ ★ ★

**ఇక దహరాధికరణము ఆరంభమవుతున్నది.**

సూ॥ **దహర ఉత్తరేభ్యః 1-3-13** దహర పురుషుడు పరమాత్మనే. తదుపరి ఉన్న వాక్యాలను బట్టి. ఛాన్దోగులు దీన్ని పఠించుతున్నారు. **అథయదిదమస్మిన్ బ్రహ్మ పురేదహరం పుణ్డరీకంవేశ్మ దహరోఽస్మిన్నన్తరాకాశః తదస్మిన్ యదన్తః తదన్వేష్టవ్యమ్. తద్వావ విజిజ్ఞాసితవ్యమ్.** ఇక ఏదైతే బ్రహ్మపురమందు జీవునియొక్క దహరమనే తామరమొగ్గ వంటి ఇల్లు ఉన్నదో దానిలో దహరమనే అన్తరాకాశమున్నది. దానిలోపల ఏది ఉన్నదో దానిని వెతకాలి. దానినే కదా తెలుసుకోవాల్సి ఉన్నది. అని. అక్కడ సందేహము. హృదయ పుండరీకము యొక్క నడుమ ఉండే దహరాకాశము

అనేది పంచమహాభూతాలలో ఒకటైన ఆకాశమా? లేక ప్రత్యగాత్మనా? ఇవేవీ కాకపోతే పరమాత్మనా? అని. ఏది యుక్తమైనది? అని అనేట్లయితే మహాభూతవిశేషము అనే అంటాము. కారణము ఏమిటంటే ఆకాశశబ్దానికి భూతాకాశానికి వాచకత్వము ఉన్నది. అట్లాగే పరమాత్మ యందున్నూ ఉన్నది. ఇట్లా రెండింటి యందూ ప్రసిద్ధి ఉన్నా భూతాకాశానికే ఎక్కువ ప్రసిద్ధి ఉన్నది. **తస్మిన్ యదన్తః తదన్వేష్టవ్యమ్** దానికి లోపల ఏది ఉన్నదో దానిని మాత్రమే అన్వేషించవలెను అని అన్వేషించాల్సిన అన్తరము అసాధారణమైనదిగా తోస్తున్నది కదా! ఈ విధంగా పూర్వపక్షము సిద్ధమైతే దానికి సమాధానము చెప్పబడుతున్నది.

దహర ఉత్తరేభ్యః అని. దహరాకాశము పరబ్రహ్మ. ఎందువల్ల? తరువాత ఉన్న వాక్యాలలో చెప్పబడిన కారణాల వలన. **ఏష ఆత్మా. అపహత పాప్మావిజరో విమృత్యుః విశోకో అవిజిఘత్సో అపిపాసస్సత్యకామః సత్యసంకల్పః** ఇతడు ఆత్మ పుణ్యపాపరూపాలైన కర్మలు లేనివాడు. ముసలితనము, మరణము, శోకము, ఆకలి దప్పికలు లేనివాడు. సత్యకాముడు, సత్యసంకల్పుడు. అని నిరుపాధికమైన ఆత్మత్వమున్నూ దహరాకాశములో ఉన్నట్లుగా వినిపిస్తున్న గుణాలు దహరాకాశాన్ని పరమాత్మ అని నిరూపిస్తున్నవి. **అథయ ఇహ ఆత్మానమనువిద్య వ్రజన్త్యేతాంశ్చ సత్యాన్ కామాన్. తేషాం సర్వేషు లోకేషు కామచారోభవతి.** ఎవరైతే ఈ లోకంలో ఆత్మను గురించి తెల్సుకొని ఉపాసించి బ్రహ్మలోకానికి వెళ్ళుతారో వారు ఈ సత్యకామ సత్యసంకల్పత్వాదులను పొందుతారు. వారికి అన్ని లోకాలలోనూ స్వేచ్ఛగా తిరిగే అధికారము వస్తుంది. ఇత్యాదివాక్యాలచేతనే గాక **యంకామం కామయతే సోఽస్య సంకల్పాదేవ సముత్తి ష్ఠతి. తేన సమ్పన్నో మహీయతే.** ఏ కోరికను కోరుకుంటాడో అది అతనియొక్క మనస్సులో సంకల్పము (తలచుకోవడం) తోనే ఎట్టఎదుట ప్రత్యక్షం అవుతుంది అనే వరకు ఉన్న వాక్యముచేత దహరాకాశాన్ని తెల్సుకొని ఉపాసించిన వానికి సత్యసంకల్పత్వము సిద్ధించుతుంది అని చెప్పబడ్తున్నందున ఈ దహరాకాశము పరబ్రహ్మ అని అర్థమవుతున్నది. **యావాన్ వాఅయమాకాశః తావానేషోఽన్తర్ హృదయఆకాశః** ఈ బయట కనిపించుతున్న ఆకాశము ఎంతటిదో హృదయములో ఉండే ఆకాశమున్నూ! అంతటిదే. అని ఉపమాన ఉపమేయభావము కూడా దహరాకాశము నీవు చెప్పినట్లు భూతాకాశమే ఐతే పొసగకుండా పోతుంది. ఉపమాన ఉపమేయ భావము హృదయమంతటిది అని – హృదయావచ్ఛేదనిబన్ధమైనది అని

అనేట్లయితే అపుడు హృదయావచ్ఛిన్నమైనదానికి (అంతమాత్రమే కొలతగా ఉన్న దానికి) ద్యావాపృథివ్యాదులు మొదలైనవాటికన్నింటికీ ఆశ్రయమై ఉండడము పొసగదు. హృదయాకాశము పరమాత్మనే ఐనా బాహ్య ఆకాశానికి ఉపమేయము కావడమనేది కుదరదు. ఎందుకంటే **జ్యాయాన్ పృథివ్యాః జ్యాయానన్తరిక్షాత్** పృథివికంటే పెద్దది అన్తరిక్షానికంటే పెద్దది అని చెప్పుతున్నందువల్ల. అన్నింటికంటే జ్యాయస్త్వము (పెద్దగా ఉండడము) వినిపిస్తున్నది. అని అనడం సరికాదు. అసలు ఈ వాక్యము ఎందుకు బయలుదేరిందంటే దహరాకాశము హృదయపుండరీకము యొక్క నడుమ ఉంటున్నందువల్ల వచ్చిపడిన అల్పత్వాన్ని (కొద్దితనాన్ని) నివారించడం కొరకే. అంటే ఇది చిన్నది అని అనుకోకు మహిమలో పృథివి కంటే అన్తరిక్షము కంటే పెద్దది సుమా అని చెప్పడానికి వచ్చింది. ఎలాగంటే మిక్కిలి వేగంగా తూర్పుదిశ నుండి పడమటిదిక్కుకు సూర్యుడు వేగంగా ప్రయాణిస్తుంటే ఆ వేగాన్ని తెలుపడం కొరకు **ఇషువద్గచ్ఛతి సవితా** సూర్యుడు బాణము వలె పోతున్నాడు అని చెప్పినపుడు సూర్యుడితో పోలిస్తే బాణము ఆయన వేగంలో ఎంత పాటివేగాన్ని కల్గిఉంటున్నది? ఐనా అట్లాగా పోల్చిచెప్పడము మాత్రము గతి మాంద్యమును – మెల్లగా పోవడాన్ని – తొలగించడము కొరకు అని ఎట్లా అర్థమవుతున్నదో అట్లాగే ఇక్కడ కూడా!

ఒకవేళ ఇట్లా కావచ్చును – **ఏషఆత్మాఅపహతపాప్మా** ఇత్యాది వాక్యము చేత దహరాకాశము నిర్దేశింపబడటంలేదు. **దహరోఽస్మిన్నన్తరా కాశః తస్మిన్ యదన్తః తదన్వేష్టవ్యమ్** అని దహరాకాశము లోపల ఉన్న ఆయన కంటే వేరైన మరొకరిని అన్వేషించడము చెప్తున్నందున అదే ప్రస్తుత విషయమైనందున **ఏష ఆత్మా అపహతపాప్మా** అని ఆ మరొకడిని అన్వేషించడమే తగునని నిర్దేశించడము యుక్తము అవుతుంది కనుక.

నిజమే! నీవన్నట్లుకావచ్చును. ఒకవేళ శ్రుతియే దహరాకాశాన్ని, దాని లోపల ఉన్నవాడినీ విభజించి చెప్పకపోయినప్పుడు. కానీ ఆ వేదము విభాగము చేసి చూపింది. అది ఇట్లాగా ఉన్నది – **అథయదిదమస్మిన్ బ్రహ్మపురే దహరం పుండరీకం వేశ్మ దహరోఽస్మిన్నన్తరాకాశః తస్మిన్యదన్తః తదన్వేష్టవ్యమ్** అని బ్రహ్మ పురశబ్దముతో ఉపాస్యుడుగా సన్నిహితుడైన పరబ్రహ్మకు పురముగా ఉపాసకుడైన వానియొక్క శరీరాన్ని నిర్దేశించి, దానికి నడుమనున్న, దానికి (శరీరానికి / ఉపాసకుడికి) అవయవమైన పుండరీకము యొక్క ఆకారములో ఉండి అల్పమైన పరిమాణాన్ని కల్గిన

హృదయమును పరబ్రహ్మకు వేశ్మ (ఇల్లు)గా చెప్పి, సర్వజ్ఞుడు సర్వశక్తులు కలవాడు ఆశ్రిత వాత్సల్యైక జలధిని ఉపాసకుని యందున్న అనుగ్రహము కొరకు ఆ యింటిలో దగ్గరగా ఉన్నవాడిని సూక్ష్మంగా ఉన్నాడుగాబట్టినీ్న ధ్యానము చేయదగినవాడిని దహరాకాశ శబ్దముతో నిర్దేశించి ఆయనకు లోపల ఉన్న అపహత పాప్మత్వాదులు సహజంగానే ఉన్న నిరస్తనిఖిల హేయత్వాన్ని సత్యకామత్వాది స్వాభావిక అనవధిక అతిశయ కళ్యాణ గుణసముదాయాన్ని ధ్యేయమని అంటూ **తదన్వేష్టవ్యం** దానిని అన్వేషించాలి అని ఉపదేశింపబడుతున్నది. ఇక్కడ **తదన్వేష్టవ్యం** లో ఉన్న తత్ శబ్దముతో దహరాకాశాన్ని అందులో ఉన్న గుణసముదాయాన్ని పరామర్శించి/ ఎత్తిచూపి ఆ రెండూ అన్వేషింపబడదగినవి అని ఉపదేశింపబడుతున్నది. **యదిదమస్మిన్ బ్రహ్మపురే దహరం పుండరీకవేశ్మ** అని అనువదించి (లోగా చెప్పిన విషయాన్ని తిరిగి చెప్పి) ఆ దహరపుండరీకమనే ఇంటిలో ఏ దహరాకాశము ఉన్నదో, అందులో ఉన్న ఏ గుణసముదాయము ఉన్నదో ఆ రెండున్నూ అన్వేషించాలి అని విధింపబడుతున్నది అని అర్థము.

దహరాకాశ శబ్దము చేత నిర్దేశింపబడినవాడు పరబ్రహ్మ అని **తస్మిన్** అని నిర్దేశింపబడినదాన్ని అతనియొక్క గుణజాతము అనినీ్న, తత్ శబ్దముతో రెండింటినీ పరామర్శించి పరబ్రహ్మను ఆయనలోని గుణాలనున్నూ అన్వేషించాలి అని విధింపబడిన తీరున్నూ ఎట్లాగా తెలియవస్తున్నది? అని అనేటట్లయితే దాన్ని శ్రద్ధగా విను. చెపుతున్నాను.

**యావాన్ వా అయమాకాశః తావానేషోఽన్తర్హృదయఆకాశః** అని అంటూ దహరాకాశముయొక్క అతిమహత్తను (విస్తారంగా ఉండడాన్ని) చెప్పి **ఉభే అస్మిన్ ద్యావాపృథివీ అన్తరేవసమాహితే. ఉభావగ్నిశ్చ వాయుశ్చ సూర్యాచన్ద్ర మసావుభౌ విద్యున్నక్షత్రాణి.** ఈ దహరాకాశము నందే ద్యులోకము భూలోకము, అగ్నివాయువులు సూర్యచంద్రులు విద్యుత్తునక్షత్రాలు అన్నీ దీనిలోనే చక్కగా కుదురుకొని ఉన్నాయి అని ప్రకృతమైన ఆ దహరాకాశాన్ని '**అస్మిన్**' అని ఆ దహరాకాశాన్నే పరామర్శించి, దానిలో ఈ ఉపాసకుడికి ఈ లోకంలో ఏది భోగ్యపదార్థ సముదాయమున్నదో ఏది మాత్రము మనోరథము మాత్రమై ఇక్కడలేదో అదంతా / ఆ భోగ్యమైనదంతా ఈ దహరాకాశము నందే సిద్ధమై ఉన్నదని నిరతిశయమైన భోగ్యత్వాన్ని దహరాకాశానికి చెప్పి, ఆ దహరాకాశానికి దేహానికి అవయవమైన హృదయములో ఉంటున్నదైనప్పటికీ,

దేహానికి ముసలితనము, నశించిపోవడము వంటివి ఉన్నా పరమకారణుడైనందువల్ల మిక్కిలి సూక్ష్మము ఐనందువల్లనూ ఎలాంటి వికారాలు లేవని చెప్పి ఆ కారణం వల్లనే **ఏతత్ సత్యం బ్రహ్మపురమ్** అని ఆ దహరాకాశాన్నే సత్యమైన బ్రహ్మ అనే పేరు గల పురమని, అది నిఖిల జగత్తుకూ ఆవాసమైనట్టిది అని ఉపపాదించి **అస్మిన్ కామాః సమాహితాః** దీనిలో కామాలు నెలకొని ఉన్నవి. అని దహరాకాశాన్ని **అస్మిన్** అని నిర్దేశించి కోరదగినవైన గుణాలను **కామాః** అని చెప్పి అవి దహరాకాశంలో ఉంటున్నవి అని పలికి, అదే దహరాకాశానికి కామ్యాలైన కళ్యాణగుణాలతో కూడి ఉండడాన్ని (విశిష్టత్వాన్ని) దానికి ఆత్మత్వాన్నీ **ఏషఆత్మా అపహత పాప్మా** ఇత్యాది వాక్యముతో ఆరంభించి **సత్యసంకల్పః** అని అన్తముగా గల వాక్యంతో స్పష్టము చేసి **యథా హ్యేవేహ ప్రజా అన్వావిశ్తని** ఎప్పుడైతే ప్రజలు దీనిలో అనుసరించి ప్రవేశించుతున్నారో అని మొదలుపెట్టి **తేషాం సర్వేషులోకేషు అకామచారోభవతి** అని ముగిసే దానితో ఈ గుణాష్టకాన్ని దహరాకాశ శబ్దముతో నిర్దిష్టుడైన ఆత్మను – భగవంతుడిని – గురించి తెలియని వారికి, ఈ పరమాత్మకంటే వేరయిన భోగ్యములు ఐన పదార్థాలు పొందడానికి కర్మలను చేసేవారికి ఒకనాటికి తరిగిపోయే – ముగిసి పోయే తరిగిపోయే ఫలాలే లభిస్తాయి అని చెప్పి పైగా అసత్య సంకల్పత్వాన్నీ – తాము కోరినవి దక్కకపోవడాన్ని – కూడా చెప్పి **అథయఇహ ఆత్మానమనువిద్య వ్రజన్త్యేతాంశ్చ సత్యాన్ కామాన్. తేషాం సర్వేషు లోకేషు కామచారో భవతి** ఇత్యాది వాక్యముతో దహరాకాశ శబ్దముతో నిర్దేశింపబడిన ఆత్మను, ఆయనలోనున్న కోరదగినవైన అపహత పాప్మత్వాది గుణాలను బాగుగా ఎరిగి ఉపాసించినవారికి ఉదారగుణ సాగరుడైన ఆ పరమపురుషుని యొక్క అనుగ్రహము వల్లనే అన్ని కామాలను పొందడము సత్యసంకల్పత్వమున్నూ కలుగుతుందని చెప్పబడుతున్నది.

ఇందువల్ల దహరాకాశము అనగా పరబ్రహ్మ, ఆయనలో ఉన్న అపహత పాప్మత్వము మొదలైన కామ్యగుణ సముదాయము రెండున్నూ అన్వేషించదగినవి. తెల్సుకోదగినవనిన్నీ చెప్పబడుతున్నది అని నిశ్చయము చేయబడుతున్నది. ఇదే విషయాన్ని వాక్యకారుడు కూడా **తస్మిన్యదన్తరితి కామవ్యపదేశః** దానిలో ఏది అన్తర్గతమై యున్నదో అనే వాక్యముచేత కామములను గురించి చెప్పబడింది అనే వాక్యము ద్వారా తెల్పినాడు. ఇందువల్ల ఈ ఉత్తర వాక్యాలద్వారా చెప్పబడిన కళ్యాణగుణాలు కల్గి ఉన్నవాడు పరబ్రహ్మనే అని తేట తెల్లమయ్యింది. ఇదిగో ఈ కారణము వల్లనూ దహరాకాశము పరబ్రహ్మనే –

సూ॥ **గతిశబ్దాభ్యామ్ – తథాహిదృష్టమ్. లింగమ్ చ 1–3–14** గతిశబ్దాలవల్ల – ఉదాహరణవల్ల – హేతువు వల్లనున్నూ పరమాత్మనే. **తద్యథా హిరణ్యనిధిం నిహితమక్షేత్రజ్ఞాః ఉపర్యుపరి సంచరన్తః న విందేయుః. ఏవమేవేమాః సర్వాః ప్రజాః అహరహర్గచ్ఛన్త్య ఏతం బ్రహ్మలోకం నవిందన్తి. అనృతేనహిప్రత్యూఢాః** అది ఎట్లాగంటే తమ ఇంట్లోబంగారు నిధి దాచిపెట్టబడింది అని దాని చోటు ఇక్కడ అని తెలియనివారు ప్రతిదినమూ దానిమీదుగానే నడుచుకుంటూ కూడా ఆ నిధిని ఎట్లాగా చేజిక్కించుకోలేకపోతున్నారో అదే తీరుగా ఈ ప్రజలు అందరూ ప్రతిదినమూ పరమాత్మ దగ్గరకు పోయి వస్తూ కూడా బ్రహ్మను పొందలేకపోతున్నారు. వారు అనృతము చేత – కర్మ రూపమైన అవిద్యతో కప్పబడి ఉన్నారు. అనే వాక్యములో **ఏతమ్** అనే పదము ప్రస్తుత దహరాకాశాన్ని నిర్దేశించి ఆయన వద్దకు క్షేత్రజ్ఞులందరూ పోవడమును, పోదగినదైన ఆ దహరాకాశాన్ని "**బ్రహ్మలోక**" శబ్దముతో నిర్దేశించడమూ దహరాకాశము పరబ్రహ్మ అని తెల్పుతున్నవి. ఈ రెండు కారణాలు ఏ విధంగా ఈ దహరాకాశానికి పరబ్రహ్మత్వాన్ని సాధిస్తున్నాయి అనే సందేహానికి సమాధానము చెప్పినాడు. **తథాహిదృష్టమ్** అట్లాగా చూచినాము అని. పరబ్రహ్మ వద్దకు క్షేత్రజ్ఞులు అందరున్నూ ప్రతిదినమూ తమ సుషుప్తి– గాఢనిద్ర – సమయంలో పోవడాన్ని వేరొక ఉపనిషత్తు చెప్పింది. **ఏవమేవఖలు సోమ్యేమాః సర్వాః ప్రజాః సతి సమ్పద్యనవిదుః. సతి సమ్పత్స్యామహే ఇతి.** ఓ సోమ్యుడా! ఇట్లాగానే జరుగుతున్నది. ఈ ప్రజలందరూ సత్‌శబ్దవాచ్యుడైన పరమాత్మ వద్దకు పోతూ కూడా పరమాత్మవద్దకు పోతూ ఉన్నాము అని తెల్సుకోలేకున్నారు. అని **సతఆగమ్య నవిదుః సతఆగచ్ఛామహే ఇతి.** సత్ శబ్దవాచ్యుడైన పరబ్రహ్మ నుండి బయలుదేరి తిరిగి వెనుకకు వస్తూ కూడా సత్ అనబడే పరమాత్మ నుండి వస్తున్నాము అని అనిన్నీ. అట్లాగే బ్రహ్మలోక శబ్దము పరబ్రహ్మ విషయంలో ప్రయోగింపబడడమున్నూ చూడబడింది. **ఏష బ్రహ్మలోకః సమ్రాడితి హోవాచ.** ఈ బ్రహ్మ లోకము సమ్రాట్ అని కూడా పలికినాడు. అని బ్రహ్మకంటే వేరయినచోటకు గమనదర్శనము జరుగక ఉండుగాక! ఈ దహరాకాశమునందే సర్వక్షేత్రజ్ఞులు ప్రళయ కాలంలో వలె నిరస్తనిఖిల దుఃఖులై – తమ దుఃఖాలన్నింటినీ మర్చిపోయి – సుషుప్తికాలంలో ఉండడమనేది వినిపిస్తున్నది. అదే దహరాకాశానికి పరబ్రహ్మత్వమును సాధించడానికి చాలినంత సాక్ష్యము. అదేవిధంగా బ్రహ్మలోకశబ్దమున్నూ సమానాధికరణ వృత్తి ద్వారా అనగా కర్మధారయ సమాసము ద్వారా – బ్రహ్మైవలోకఃఽబ్రహ్మయేలోకము అని – దహరాకాశము

నందు ప్రయోగింపబడుతున్నదై ఈ దహరాకాశానికి బ్రహ్మత్వమునందు మరొక ప్రయోగముతో అవసరం లేకుండానే చాలినంత లింగము అని ఎంచి సూత్రములో **లింగంచ** అని సూత్రకారుడు ఐన వ్యాసమహర్షి చెప్పినాడు. నిషాదస్థపతి న్యాయము వలన కూడా షష్ఠీ సమాసము కంటే సమానాధికరణ సమాసమే న్యాయమైనది.

నిషాదస్య స్థపతిః – నిషాదునియొక్క స్థపతి నిషాదస్థపతి అని షష్ఠీ తత్పురుష సమాసము. దీని ప్రకారము నిషాదుడు ఆటవికుడు నిషాదుడు ఆయనకు ఒక స్థపతి ఉండడము అసంబద్ధము. కనుక నిషాదశ్చాసౌ స్థపతిశ్చఽనిషాదస్థపతిః, నిషాదఏవస్థపతిః నిషాదుడే స్థపతి, నిషాదుడైన స్థపతి అని చెప్పుకున్నపుడు ఒక నిషాదుడు ఒక గ్రామీణుడిని ఆశ్రయించి స్థపతి (శిల్పి) కావడంలో దోషంలేదు. కనుక నిషాద ఏవ స్థపతి అని విగ్రహవాక్యము చెప్పుకోవాలి. దీని విషయమై పూర్వమీమాంసలో చర్చచేసి నిర్ణయించబడింది దాని ప్రకారము ఇక్కడ బ్రహ్మణః లోకఃఽబ్రహ్మ యొక్క లోకము అని షష్ఠీ సమాసము చెప్పుకోవడం కంటే బ్రహ్మ ఏవ లోకః అని సమానాధికరణ – ప్రథమా – కర్మధారయసమాసము చేసుకోవడం తగును ఇది విభక్తితో **స్థపతిర్నిషాదః స్యాత్. శబ్దసామర్థ్యాత్. పూర్వమీమాంసా – 6–1–51** అనేచోట గమనించవచ్చును లేదా శ్రుత ప్రకాశికలోనూ విపుల చర్చ ఉన్నది పరిశీలనచేయగలరు. లేదా

**అహరహర్గచ్ఛన్త్యః** అనే పదము / వాక్యముతో సుషుప్త విషయమైన గమనము చెప్పబడడం లేదు. కాని ఆ వ్యక్తుల హృదయాలలో అన్తరాత్మగా ఎల్లపుడూ ఉంటున్న దహరాకాశము – పరమపురుషార్థము ఐనట్టి దానివద్దకు ప్రతిదినమూ పోతూ ఉన్నవారై – అన్ని కాలాలలో ఉంటున్నవారు ఆయనను / దహరాకాశాన్ని, ఎరుగక ఆయనను పొందలేకపోతున్నారు. దాచిపెట్టబడిన బంగారు నిధియొక్క ప్రదేశాన్ని తెలియనివారై దానిపైననే ఎప్పుడూ ఉంటూ కూడా దాన్ని చేజిక్కించుకోలేకపోతున్నారు. దానివలెనే ఈ విషయమున్నూ అని అర్థము. ఈ విధంగా అన్తరాత్మగా దహరాకాశముపైన, ఆయన చేతనియమింపబడ్తూ ప్రవర్తిస్తూ ఉన్న, తెలియని ప్రజలందరూ పోతూ ఉన్న పోకడ పరబ్రహ్మము దహరాకాశము అని తెల్పుతున్నది. మరొక ఉపనిషత్తులో ఇదే ముచ్చట ఇట్లా తెలుపబడింది. అన్తరాత్మగా ఉన్న పరబ్రహ్మను గురించి ఆయనచేత నియమింపబడే వారౌతూ ఆయనపై ఆధారపడి జీవిస్తున్న ప్రజలు ఆయనను

తెల్పుకోలేక పోవడము కనిపించుతున్నది. ఎట్లాగంటే అన్తర్యామి బ్రాహ్మణములో **యః ఆత్మనితిష్ఠన్ ఆత్మనోఽన్తరో యమాత్మానవేద యస్యాఽత్మా శరీరమ్ యః ఆత్మాన మన్తరో యమయతి** అని మరియు **అదృష్టోద్రష్టా అశ్రుతో శ్రోతా** అనిన్నీ. మరొకచోట దర్శనము / కనబడడము లేకపోవునుగాక. నిధి దృష్టాన్తము చేత అర్థమవుతున్న పరమ పురుషభావము ఈ హృదయస్థుడైన వానిపైన (వానియందే) ఆధారపడి ఉన్నందువల్ల ప్రతిదినమున్నూ ప్రజలందరూ పోతున్న పోకడ ఈ దహరాకాశమే పరంబ్రహ్మ అని అనడములో బలమైన కారణము అవుతున్నది. ఇందువల్ల కూడా దహరాకాశము పరబ్రహ్మ.

సూ॥ **ధృతేశ్చ మహిమ్నోఽస్య అస్మిన్ను పలబ్ధేః 1–3–15 అథయఆత్మా** అని ప్రకృతమైన దహరాకాశాన్ని ఎత్తిచూపి **సః సేతుః విధృతిః ఏషాంలోకానాం అసంభేదాయ** ఆయన సేతువు వంటివాడు విశేషముగా ధరించేవాడు. ఈ లోకాలు కలగలసిపోకుండా కాపాడేవాడు. అని ఈ దహరాకాశ శబ్దవాచ్యుడైన వానియందు ఉన్నదని తెలుస్తున్న/వినిపిస్తున్న జగద్విధరణము – లోకాలను రక్షణ పోషణల ద్వారా ధరించడము – పరబ్రహ్మ అని తెల్పుతున్నది. జగద్విధరణమనేది పరబ్రహ్మ యొక్క మహిమకదా! **ఏష సర్వేశ్వరః ఏషభూతాధిపతిః ఏషభూతపాలః ఏషసేతుః విధరణః ఏషాం లోకానాం అసంభేదాయ.** ఇతడు అందరికీ ఈశ్వరుడు ఇతడు భూతములకు అధిపతి. ఇతడు భూతాలకు పాలకుడు. ఇతడు ఈ లోకాలన్నీ కలసి పోకుండా సేతువువలె పుణ్యాత్ములను తనదైన పరమపదమనే స్థానానికి చేర్చే వంతెనవంటివాడు. అని, **ఏతస్యవా అక్షరస్యప్రశాసనేగార్గి! సూర్యాచంద్రమసౌ విధృతౌ తిష్ఠతః.** ఇంకా ఇట్లాంటివే ఐన మరెన్నో వాక్యాలచేతనున్నూ తెలుస్తున్నది. అట్లాంటి దైన పరబ్రహ్మయొక్క "**ధృతి అనే పేరుగల మహిమ**" ఈ దహరాకాశము నందు దొరుకుతున్నది. ఇందువల్ల దహరాకాశము పరబ్రహ్మ.

సూ॥ **ప్రసిద్ధేశ్చ 1–3–16** ప్రసిద్ధి – అందరికీ తెలిసి ఉండడము వల్ల – కూడా. ఆకాశ శబ్దము కూడా పరబ్రహ్మవిషయములో ప్రసిద్ధమైనట్టిదే. **1) కోహ్యే వాన్యాత్ కః ప్రాణ్యాత్, యదేష ఆకాశఆనందోనస్యాత్** ఈ ఆకాశము అనబడే ఆనందపురుషుడు లేకుంటే ఎవడు ఈ జగత్తును పోషించుతాడు, ధరించుతాడు. (ఊపిరి పీల్చుతూ ఉన్నాడు అని అనబడేటట్లు చేస్తాడు.) **2) సర్వాణిహ వాఇమాని**

**భూతాని ఆకాశాదేవసముత్పద్యన్తే.** సమస్తము లైన ఈ భూతాలన్నీ ఆకాశాన్నుండే పుడుతున్నవి. ఇత్యాదుల యందు ఈ ప్రసిద్ధ ప్రయోగము కనిపిస్తున్నది. అపహత పాప్మత్వాది గుణాలతో కూడి ఉన్న ఈ ప్రసిద్ధి భూతాకాశప్రసిద్ధి కంటే బలీయమైనది. అని అభిప్రాయము.

ఈ విధంగా దహరాకాశము భూతాకాశము కాదనే విషయము స్థాపించబడింది. ఇక ఇపుడు దహరాకాశము జీవుడు ఎందుకు కాకూడదు? అని శంకించి దాన్ని తోసివెయ్యడానికి పూనుకుంటున్నారు.

సూ॥ **ఇతర పరామర్శాత్ సఃఇతిచేత్ న అసమ్భవాత్ 1-3-17.** వాక్యశేషము వల్ల దహరాకాశము పరబ్రహ్మ అని ఏమాట అన్నారో అది సరియైనది కాదు. వాక్యశేషంలో పరబ్రహ్మ కంటే మరొకడు ఐన / వేరైన జీవుడిని గురించే సూటిగా పరామర్శ చేసినారు. **అథయః ఏషః సమ్ప్రసాదోఽస్మాత్ శరీరాత్ సముత్థాయ పరంజ్యోతి రుపసమ్పద్యస్వేన రూపేణాభినిష్పద్యతే ఏష ఆత్మేతి హోవాచ. ఏతదమృతమభయమేతద్ బ్రహ్మ.** ఇక ఈ సంప్రసాదుడనబడేవాడెవడు ఉన్నాడో అతడు ఈ శరీరాన్నుండి పైకిలేచి పరంజ్యోతియైన పరమాత్మ వద్దకు పోయి తనదైన సహజరూపాన్ని పొందుతున్నాడు. ఇతడు ఆత్మ అని చెప్పినాడు. ఈ ఆత్మ అమృతము ఆనందమయమైనట్టిది. ఇదియే బ్రహ్మ. దీనికి ఏ భయమూ లేదు. అని ఒకవేళ **దహరోఽస్మిన్నన్తరాకాశః** అని చెప్పినట్లు హృదయమనే పుండరీకము యొక్క నడుమ ఉండేదిగా ఉపదేశించబడిన ఆకాశానికి, బాహ్యాకాశానికిన్నీ ఉపమేయ ఉపమానభావము మొదలైనవి పొసగనందువల్ల భూతాకాశము అని అనలేకపోయినా వాక్యశేషము కారణంగా ప్రత్యగాత్మ అని అనుకోవడం తప్పు కాబోదు. ఆకాశశబ్దము కూడా ప్రకాశాదులతో కలసియున్నందున జీవుడియందే వర్తిస్తుంది అని అంటే దానికి సమాధానము. న. కాదు. అసంభవాత్. సంభవము కానందువల్ల అని ఈ ఆకాశము జీవుడు కాదు. ఇతడిలో అపహత పాప్మత్వాదులైన గుణాలు సంభవించవు. అని పరమాత్మకే చెందినట్టి సహజగుణాలు.

సూ॥ **ఉత్తరాచ్చేత్, ఆవిర్భూతస్వరూపస్తు 1-3-18** తరువాత కలిగిన దానివలన అని అనరాదు. అది సహజం కానిది. పుట్టుకొచ్చిన రూపము. ఉత్తరాత్ ప్రజాపతివాక్యము వలన జీవుడికే అపహత పాప్మత్వాది గుణములు ఉన్నవికదా! అట్లాగని నిశ్చయింపబడుతున్నది అని అనేట్లయితే ఇదీ ఈ వాక్యము ద్వారా

చెప్పబడుతున్న విషయము – ప్రజాపతి వాక్యము జీవుడికి సమ్బన్ధించినదే. అదెలాగంటే – **య ఆత్మా అపహతపాప్మా విజరోవిమృత్యుర్విశోకోఽవిజిఘత్సోఽపి పాసః సత్యకామః సత్యసంకల్పః సోఽన్వేష్టవ్యః. సవిజిజ్ఞాసితవ్యః ససర్వాంశ్చలోకాన్ ఆప్నోతి సర్వాం శ్చ కామాన్. యస్తమాత్మానమనువిద్య విజానాతి** అనే ప్రజాపతి వాక్యం ఐతిహ్య రూపంగా విని అన్వేషించదగిన ఆత్మ స్వరూపాన్ని తెల్సుకోవాలి అనే కోరికతో ప్రజాపతి వద్దకు పోయిన ఇంద్రుడికి ప్రజాపతి జాగ్రత్ స్వప్నసుషుప్తి అవస్థలలో ఉన్న జీవాత్మను సశరీర క్రమంలో ఇంద్రుడు శుశ్రూష చేయడానికి తగినవాడేనా? కాడా? అనే యోగ్యతను పరీక్షించదల్చుకొని ఆదేశించినాడు. ఆయా అవస్థలలో భోగ్యత ఏ మాత్రమూ లేదని తెల్సుకున్నందువల్ల పరిశుద్ధమైన – కర్మ సమ్బన్ధము లేని ఆత్మ స్వరూపాన్ని గురించి ఉపదేశించడానికి ఇంద్రుడు యోగ్యుడని ఎరిగి అతనికి **మఘవన్ మర్త్యంవా ఇదం శరీరమాత్తం మృత్యునా. తదస్యామృతస్య అశరీరస్య ఆత్మనో అధిష్ఠానమ్.** ఓ ఇంద్రుడా! మరణశీలమైన / నశించే స్వభావం గల్గిన ఈ శరీరమును మృత్యువు స్వాధీనము చేసుకొన్నది. ఆ శరీరము ఆనంద స్వభావుడైన శరీరము లేని ఆత్మకు అధిష్ఠానము నిలిచే ప్రధాన ఆధారము అని శరీరము అధిష్ఠానము అని, ఆత్మ అధిష్ఠాత అని, శరీరము లేని ఆత్మ అమృతస్వరూపుడు అనిన్నీ చెప్పి **నహవై సశరీరస్యసతః ప్రియాప్రియయో రపహతి రస్తి. అశరీరం వా వ సన్తం నప్రియాప్రియే స్పృశతః** శరీరముతో కలసి ఉన్న వానికి ప్రియా ప్రియములు నశించిపోవు. శరీరము లేకుండా ఉన్న వానికి అవే ప్రియా ప్రియములు అంటవు దరి జేరవు అని కర్మవలన వచ్చిన శరీరాన్ని కలిగిఉన్న వాడికి ఆ శరీరానికి తగినట్లు సుఖదుఃఖాలు అనుభవింపవలసిరావడము – ఇది అనర్థము, ఇష్టము కానిది – ఈ అనర్థాన్నుంచి విడివడడానికి మోక్షాన్ని సంపాదించాలని ఆ మోక్ష దశలో అనర్థము లేదనిన్నీ చెప్పి **ఏవమే వైష సమ్ప్రసాదోఽస్మాత్ శరీరాత్ సముత్థాయ పరంజ్యోతి రుప సమ్పద్య స్వేనరూపేణ అభినిష్పద్యతే** అని జీవాత్మకు స్వరూపము శరీరము లేకపోవడమేనని ఉపదేశించినాడు. **స ఉత్తమః పురుషః సతత్రపర్యేతి జక్షత్ క్రీడన్ రమమాణః స్త్రీ భిర్వా యానైర్వా జ్ఞాతిభిర్వానోపజనమ్ స్మరన్నిదం శరీరమ్.** ఆ భగవదనుగ్రహాన్ని పొందిన ఉపాసకుడు ఉత్తముడైన పురుషుడు. అతడు ఈ దేహాన్ని విడిచి పరబ్రహ్మ సన్నిధికి పోతాడు. తాను పూర్వము మధురపదార్థాలను తింటూ ఆడుతూ ఆనందపడుతూ స్త్రీలతో గాని వాహనాలతోగానీ సోదరులతోగానీ అనుభవించిన అనుభవాలను, చివరికి తాను

అత్యన్త ప్రీతితో కాపాడుకున్న శరీరాన్ని తన కోసం చుట్టూ మూగిన పరివారాన్ని గానీ లెక్కపెట్టకుండా భగవదనుభవము కోసము ఎప్పుడెప్పుడా? అనే ఆర్తితో వెళ్ళిపోతాడు. అని ప్రాప్యుడైన పరంజ్యోతి పురుషోత్తముడు అని, ప్రకృతి సమ్బన్ధము వల్ల కమ్ముకున్న అజ్ఞానపు పొరతొలగిపోయి పరంజ్యోతిని చేరుకున్న ప్రత్యగాత్మకు బ్రహ్మలోకంలో యధేష్టమైన భోగాలు లభించడము ప్రియాప్రియములతో సమ్బన్ధము లేని కర్మకారణంగా వచ్చిన శరీరాదులైన అపురుషార్థాలను తలచుకోకపోవడమునున్నూ తెలిపి **సయథాప్రయోగ్యః ఆచరణేయుక్తః ఏవమస్మిన్ శరీరే ప్రాణోయుక్తః** గుఱ్ఱము ఎట్లాగైతే బండికి / రథానికి కట్టబడుతుందో అదేవిధంగా శరీరము నందు జీవుడు కట్టివేయబడినాడు. అని శరీరము లేని ఆనందస్వరూపుడైన జీవునికే సంసారదశలో కర్మమనబడే కారణంగా శరీరముతో జతకూడడాన్ని గుఱ్ఱము బండితో కట్టబడడమనే దృష్టాన్తంతో చెప్పి **అథయత్రైతత్ ఆకాశమను విషణ్ణం చక్షుః స చాక్షుషః పురుషః, దర్శనాయ చక్షుః. అథయోవేద, ఇదమ్ జిఘ్రాణి ఇతి సఆత్మా గన్ధాయ ఘ్రాణమ్. అథయో వేద ఇదమభివ్యాహరాణీతి. సఆత్మా. అభివ్యాహారాయవాక్. అథయోవేదేదం శృణవాని ఇతి, స ఆత్మా శ్రవణాయశ్రోత్రమ్. అథయో వేదేదమ్. మన్వానీతి, స ఆత్మా. మనోఽస్యదివ్యం చక్షుః** ఇక ఎక్కడైతే ఆకాశముతో కన్ను సమ్బన్ధము కల్గియున్నదో / డో అతడు చాక్షుష పురుషుడు. అతడు చూడడం కొరకు కన్ను ఉన్నది. ఇక ఎవడైతే దీనిని వాసన పీలుస్తున్నాను అని అనుకుంటున్నాడో అతడు ఆత్మ గన్ధము కొరకు ముక్కు ఉన్నది. ఇక ఎవడైతే దీన్ని పలుకుతున్నానని తెల్సుకుంటున్నాడో అతడు ఆత్మ. తేటగా పలుకడం కొరకు వాగింద్రియము (నాలుక) ఉన్నది. ఇక ఎవడైతే నేను వింటున్నానని తెల్సుకొంటున్నాడో అతడు ఆత్మ. వినడానికి గాను చెవి ఉన్నది. ఇక ఎవడైతే తలచుకుంటున్నానని అనుకుంటున్నాడో అతడు ఆత్మ. మనస్సు అనేది సాధారణమైన కన్ను వంటిది కాదు దివ్యమైన కన్ను అని చక్షురాదులు అన్నీ కరణాలు / సాధనాలు అనీ రూపాదులు జ్ఞేయములు అని (తెల్సుకోదగినవి) జీవుడికి జ్ఞాతృత్వాన్ని ప్రదర్శించి, ఈ కారణంగానే శరీరము ఇంద్రియాదులకంటే జీవుడు వేరయినవాడని ఉపపాదించి **సవా ఏష ఏతేన దివ్యేన చక్షుషా మనసైతాన్కామాన్ పశ్యన్ రమతే యఏతే బ్రహ్మలోకే** అటువంటి శరీరాన్నుంచి ముక్తుడైన వాడు ఈ దివ్యచక్షువు ఐన మనస్సుతో ఈ కామాలను (కోరబడేవాటిని) చూస్తూ ఆనందపడుతున్నాడు. అని ఆ జీవుడికే కర్మసమ్బన్ధమైన శరీరాన్ని ఇంద్రియాలను దులిపేసుకున్న వాడికి

మనస్సు అనే శబ్దంతో చెప్పబడిన దివ్యమైన స్వాభావిక జ్ఞానంతో అన్ని కామాలను అనుభవించుతాడు అనే విషయాన్ని చెప్పి **తం వా ఏతం దేవాః ఆత్మానము పాసతే. తస్మాత్ తేషాం సర్వే చలోకాః ఆత్తాః సర్వేచకామాః** అలాంటి సహజ జ్ఞానాన్ని పొందిన ఇతడిని ఇంద్రియాలు అన్నీ ఉపాసిస్తవి. అందువలన వారికి లోకాలు అన్నీ స్వాధీనములు అవుతవి అట్లే సర్వకామాలు సిద్ధించుతవి. అని ఈ విధమైన ఆత్మను జ్ఞానులు తెల్సుకుంటున్నారని చెప్పి **సర్వాన్ లోకాన్ఆప్నోతి సర్వాంశ్చకామాన్ యస్తమాత్మానమను విద్య విజానాతి. ఇతి హప్రజాపతిరువాచ.** సర్వలోకాలను సర్వకామాలను పొందుతున్నాడు. ఎవడైతే ఆత్మను ఎరిగి బాగుగా ఉపాసిస్తున్నాడో అని ప్రజాపతి చెప్పినాడు అని ఈవిధమైన ఆత్మను తెల్సుకున్నటువంటివాడు సర్వలోక సర్వకామములను అనుభవించుట అనే ఉపలక్షణముతో గుర్తింపబడిన బ్రహ్మయొక్క అనుభవాన్ని ఫలమునుగా చెప్పి ఉపసంహరించినాడు. ఇందువల్ల వాక్యంలో అపహత పాప్మత్వాది గుణాలు ఉన్నట్టివాడు తెల్సుకోదగినవాడు గాను చర్చతో సమ్బన్ధము ఉన్నవాడు జీవుడేనని అర్థమయ్యింది. కావున జీవునికి అపహతపాప్మత్వాలు సంభవించుతవి. ఈ కారణంచేత దహరవాక్యశేషము నందు వినిపిస్తున్న జీవుడికి అపహతపాప్మాత్వాది గుణాలు సంభవిస్తున్నవి కనుక అతడే దహరాకాశము అని నిశ్చయాన్ని చేస్తున్నాము అని అన్నట్లయితే –అని.

దానికి సమాధానమును చెప్పినాడు – ఆవిర్భూతస్వరూపస్తు అని. ఇంతకు మునుపటికాలములో అనృతముచేత కప్పివేయబడిన అపహతపాప్మత్వాది గుణాలు కల్గిన, స్వరూపాన్ని కలిగిన (పొందినవాడై) శరీరములోనుండి పైకి లేచినవాడై పరంజ్యోతిని చేరుకొని శరీములో ప్రవేశించటానికి ముందు ఉండిన తనదైన సహజమైన స్వరూపము మొలుచుకొని వచ్చిన స్వరూపాన్ని కలవాడై అపహత పాప్మత్వాది గుణాలతో కూడిఉండిన వాడు ఆ వాక్యములో **ప్రజాపతి వాక్యములో** చెప్పబడుతున్నాడు. దహరవాక్యమునందు మాత్రము కప్పివేయబడని స్వభావము కల అపహత పాప్మత్వాది విశిష్టుడైన వాడేదహరాకాశము అని స్ఫురిస్తున్నాడు. ఇక ఆవిర్భూత స్వరూపుడైన జీవుడికి కూడా ఊహించడానికైనా వీలుకాని సేతుత్వ, సర్వలోక విధరణత్వాదులు "**సత్యశబ్దానికి ఇచ్చిన నిర్వచనం చేత తెలియవచ్చిన చేతనాచేతనాలను రెండింటిని నియన్త్రించడము**" దహరాకాశానికి పరబ్రహ్మత్వాన్ని

సాధిస్తున్నవి. సేతుత్వ సర్వలోకవిధరణత్వాదులు ఆవిర్భూత స్వరూపుడికైనా సంభవించవు అని **జగద్వ్యాపారవర్జమ్** అనే సూత్రము వద్ద ఉపపాదించుతాము.

సత్యశబ్దానికి నిర్వచనము ఛాన్దోగ్య ఉపనిషత్తులో – (8.3) ఈ విధంగా చెప్పబడింది. **తానిహవా ఏతాని త్రీణ్యక్షరాణి సత్, తి, యమ్ ఇతి. తద్యత్ సత్ తదమృతమ్. అథయత్ తి తన్మర్త్యం అథయత్ యమ్ తేన ఉభేయచ్ఛతి.** అవి కదా ఈ మూడు అక్షరాలు. సత్, తి, యమ్ అని వాటిలో ఏ సత్తు ఉన్నదో అది ఆనందమయము / అమృతము. ఇక ఏ తి అనబడేది ఉన్నదో అది నశించేస్వభావము కల్గినట్టిది. చివరగా ఏది యమ్ అనబడ్తున్నదో అది ముందరి రెండింటినీ అదుపుచేస్తున్నది. అనగా జీవుడు ప్రకృతి పరమాత్మలను సత్యశబ్దము చెప్పుతున్నది. కనుక పరమాత్మ చేతనాచేతనాలను నియంత్రిస్తున్నాడని అర్థమవుతున్నది. **అన్తః ప్రవిష్టః శాస్తా జనానాం సర్వాత్మా** అనే వాక్యమున్ను ఇదే విషయాన్ని వివరిస్తున్నది.

ఇక ఇది ఇట్లాగే అయ్యేటట్లయితే దహరవాక్యము నందు **అథయ ఏష సమ్ప్రసాదః** ఇత్యాదియైన వచనముతో జీవుని గురించి ప్రస్తావనను ఎందుకు చేసినారు అనేటట్లయితే సమాధానాన్ని చెప్పుతున్నారు. ఈ దిగువ సూత్రముతో.

**సూ॥ అన్యార్థశ్చ పరామర్శః 1-3-19** దహరాకానికే అపహత పాప్మత్వ జగద్ విధరణత్వాదులు ఉన్నట్లు ముక్తుడు ఆ పరంజ్యోతిని చేరుకోవడం ద్వారా అపహత పాప్మత్వాది కళ్యాణగుణవిశిష్టము ఐన స్వాభావికమగు రూపాన్ని పొందుతున్నాడని చెపుతున్నందువలన. అందుకు కారణమైన పరమ పురుషునికే అసాధారణమైన గుణాన్ని ఉపదేశించడానికి ప్రజాపతిచే చెప్పబడిన జీవుడిని ఇక్కడ పరామర్శిస్తున్నారు. ప్రజాపతి వాక్యములోనూ ముక్తాత్మయొక్క స్వరూప యాథాత్మ్య విజ్ఞానము దహరవిద్యకు ఉపయోగపడుతుందని చెప్పినారు. బ్రహ్మను చేరుకోవాలని కోరుకుంటున్న జీవాత్మకు తాను పొందబోయే స్వరూపము తెల్సుకోదగినదే. స్వయంగా కళ్యాణగుణాలను కలిగియున్న వాడే అవుతూ అవధి / హద్దు / పరిమితి లేని అతిశయమున్న అసంఖ్యేయ / లెక్కింపరాని కళ్యాణగుణగణములు కల పరంబ్రహ్మను అనుభవించనున్నాడు కనుక స్వరూప యాథాత్మ్య విజ్ఞానమనేది బ్రహ్మోపాసనకు ఫలమైన మోక్షములో ఒక భాగమవుతున్నది. **సర్వాంశ్చలోకాన్ ఆప్నోతి సర్వాంశ్చ కామాన్ 2) సతత్రపర్యేతి జక్షత్ క్రీడన్** ఇత్యాది ముచ్చట్లు ప్రజాపతి వాక్యంలో చెప్పబడుతున్నట్టివి – ఫలముగా ఉన్నది దహరవిద్యాఫలమే.

సూ॥ **అల్పశ్రుతిరితి చేత్ –తదయుక్తమ్ 1–3–20** కొద్ది స్వరూపము కలవాడంటే! అది తగదు. **దహరోఽస్మిన్** అని అల్పపరిమాణాన్ని తెలిపే శ్రుతివాక్యము ఆరాగ్రము – బుడమ, గొట్టె రకాలవద్ల గింజల చివరలో ఉండే ముల్లుతో పోలిక జీవునికి మాత్రమే వర్తిస్తుంది. అంతేకాని అన్నిటికన్నా పెద్దతనము కలిగిన పరబ్రహ్మకు కాదని అనేటట్లయితే దానికి ఏది సమాధానంగా చెప్పవలెనో అది ఇంతకుమునుపే **నిచాయ్య త్వాదేవమ్** అనే సూత్రము వద్ద 1–2–7. మొత్తము సూత్రము ఇది. అర్భకౌకస్త్వాత్ తద్వ్యపదేశాచ్చ నేతిచేన్న. నిచాయ్యత్వాదేవం వ్యోమవచ్చ! చెప్పినాము. ఇందువలన దహరాకాశము అవిద్యాది దోషగన్ధము ఏమాత్రము లేనివాడు. స్వాభావికమైన అతిశయమైన తనకంటే మిన్నఐనదిలేని జ్ఞాన, బల, ఐశ్వర్య, వీర్య, శక్తి, తేజస్సు మొదలైన అపరిమిత ఉదారగుణ సాగరుడైన పురుషోత్తముడే. ప్రజాపతి వాక్యము చేత నిర్దేశింపబడిన వాడేమో **ఘ్నన్తిత్వేవైనం విచ్ఛాదయన్తి** ఇతడిని ఇబ్బందులపాలు చేస్తున్నవి. పైపెచ్చు జీవుడిని బాగా కప్పివేస్తున్నవి ఇట్లాంటి వాక్యాలచేత తెల్సుకోబడుతున్న కర్మ కారణంగా దేహాన్ని పొందినవాడు తదుపరికాలంలో పరంజ్యోతి వద్దకు పోయి కొత్తగా ఇంతదాకా లేని కళ్యాణగుణాలైన అపహత పాప్మత్వాదులు మొల్చుకు వచ్చిన (వాడైన) స్వరూపము కల వాడౌతున్నాడు. కనుక జీవుడు దహరాకాశము కాడు. ఇందువల్ల కూడా ఇది ఇట్లాగే ఉంటుంది.

సూ॥ **అనుకృతేస్తస్యచ 1–3–21** ఆ పరమాత్మను అనుకరించినందువల్ల కూడా. ఆ దహరాకాశమైన పరబ్రహ్మను అనుకరించడం వలన ఈ అపహత పాప్మత్యాది గుణాలు కలవాడు బన్ధాలనుండి విడిపోయిన వాడు ఐన ప్రత్మగాత్మ దహరాకాశముగా చెప్పబడడు. కాడు. **తదనుకారః** – ఆయనతో సామ్యము, పోలిక. అది ఇట్లాగా ఉన్నది. బన్ధవిముక్తుడైన ప్రత్యగాత్మకు పరబ్రహ్మానుకారము వినిపిస్తున్నది. **యదాపశ్యః పశ్యతేరుక్మవర్ణమ్ కర్తారమీశం పురుషం బ్రహ్మయోనిమ్. తదా విద్వాన్ పుణ్యపాపేవిధూయ నిరంజనః పరమం సామ్యముపైతి.** బ్రహ్మజ్ఞానము కల్గి భక్తితో భగవన్తుడిని బంగారము వంటి మెరుపు కాన్తితో పచ్చగా మెరిసే వాడిని సమస్తలోకాలను సృష్టించినవాడిని, వాటికి అధిపతియై నియంత్రించే వాడిని పురుషుడిని బ్రహ్మపుట్టడానికి కారణమైన వాడిని వేదాలను బ్రహ్మకు అందచేసినవాడిని ఎపుడు దర్శించుకుంటాడో అపుడా ఉపాసకుడు తనదైన పుణ్యపాపాలను తుడిచివేసుకొని ఎట్లాంటి కర్మలను రాగద్వేషాలనున్నూ లేనివాడై

పరమాత్మతో సాటిలేని సామ్యాన్ని/ పోలికను పొందుతున్నాడు అని. ఇందువల్ల అనుకర్త ప్రజాపతి వాక్యముచేత చెప్పబడినాడు. అపుడు అనుకరింపదగినవాడు బ్రహ్మయైన దహరాకాశము, అవుతున్నాడు.

సూ॥ **అపిస్మర్యతే 1-3-22** స్మృతిలోనూ చెప్పబడ్తున్నందువల్ల కూడా! సంసారిగా ఉండిన జీవుడికి ముక్తావస్థలో పరమ సామ్యము వచ్చి చేరడమనే లక్షణముగల పరబ్రహ్మానుకారము స్మరింపబడుతున్నది. **ఇదం జ్ఞానముపాశ్రిత్యమమ సాధర్మ్యమాగతాః। సర్గేఽపి నోపజాయన్తే ప్రలయే నవ్యధన్తి చ.** భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ పలికిన పలుకు ఇది. ఓ అర్జునా! ఇంతదనుక నేను చెప్పిన జ్ఞానాన్ని ఆశ్రయించి నాతో సమానమైన ధర్మాలను పొందినవారు సృష్టికాలంలో తిరిగి పుట్టరు. అన్నీ నాలో చేరిపోయే కాలములో తమ ఉనికిని కోలుపోరు. అందువల్ల దుఃఖపడరు అని.

కొంతమంది **అనుకృతేఃతస్యచ, 2) అపిస్మర్యతే అనే** పై రెండు సూత్రాలను వేరే అధికరణమని **తమేవభాన్త మనుభాతిసర్వం తస్యభాసాసర్వమిదం విభాతి** ప్రకాశిస్తూ ఉండే ఆయనను అనుసరించి ఈ సమస్తమూ ప్రకాశిస్తున్నది. ఆయన కాన్తిచేతనే తమకాన్తి వల్ల కాకుండా ఈ సర్వమూ విశేషంగా వెలుగుతున్నది. అనే శ్రుతికి పరబ్రహ్మ పరత్వమును చెప్పడానికి బయలుదేరింది అని చెప్పుతున్నారు. ఆ ముచ్చట **అదృశ్యత్వాది గుణకోధర్మోక్తేః 2) ద్యుభ్వాద్యాయతనం స్వశబ్దాత్** అనే రెండు అధికరణాలతో ఆ ప్రకరణానికి పరబ్రహ్మత్వ విషయము ప్రతిపాదింపబడింది. **జ్యోతిశ్చరణా భిధానాత్** ఇత్యాదులయందు పరబ్రహ్మ భారూపుడు అని తేటపడింది కనుక పూర్వపక్షము ఏర్పడడానికే అవకాశము లేదు. అందువల్ల వారి వాదము చెల్లదు. పైగా సూత్రక్షరాలతో సారూప్యము లేక వైరూప్యమే ఏర్పడుతుంది. **ఇది దహరాధికరణము**

★ ★ ★

## ఇక ప్రమితాధికరణము

సూ॥ **శబ్దాదేవ ప్రమితః 1-3-23** వేదశబ్దము వల్లనే పరమాత్మ ప్రమితి – కొలత – కలవాడని తెలుస్తున్నది. కఠవల్లియందు ఇట్లాగా వినిపిస్తున్నది. **అంగుష్ఠమాత్రః పురుషోమధ్యే ఆత్మనితిష్ఠతి. ఈశానోభూతభవ్యస్య నతతో విజుగుప్సతే ఏతద్ వై తత్**

**2) అంగుష్ఠ మాత్రః పురుషః జ్యోతిరివాధూమకః ఈశానో భూతభవ్యస్య సఏవాద్య స ఉశ్వః ఏతద్వైతత్ 3) అంగుష్ఠమా త్రః పురుషః అన్తరాత్మా సదా జనానాం హృదయే సన్నివిష్టః. తమ్ స్వాత్ శరీరాత్ ప్రవృహేత్ ముంజాది వేషికాం ధైర్యేణ. తం విద్యాత్ శుక్రమ మృతమ్.** 1) బొటనవ్రేలు యొక్క ఒక కణుపు పరిమాణము ఉన్నటువంటి పురుషుడు హృదయములో ఉంటున్నాడు. అతడు గడచిపోయినవాటికి రానున్నవాటికిన్నీ శాసించే ప్రభువు. ఆయనను గురించి తెల్సినవాడెవ్వడూ జుగుప్స – అసహ్యము – రోత – చేయడు 2) అంగుష్ఠమంత మాత్రమే ఉన్న ఒకపురుషుడు పొగలేని అగ్ని వలె వెలుగుతూ ఉన్నాడు. భూతభవ్యాలకు ఈశ్వరుడు. అతడే ఇవాళ ఉన్నాడు. రేపుకూడా ఉండగలడు. ఇది అతనియొక్క స్వరూపము. మహిమ. 3) అంగుష్ఠమాత్ర పురుషుడు ఆత్మలో ఉన్నాడు అన్తరాత్మ అని పేరు. జనులయొక్క హృదయాలలో ఎపుడూ ఉంటున్నాడు. అతడిని తన శరీరములో నుండి బయటికి తీసుకురావడానికి పూనుకోవాలి. ఉద్యమించాలి. ముంజగడ్డి నుండి ధైర్యంగా – చెదరక బెదరక – ఇషీకాన్ని / పోచను బయటికి పెరికినట్లు వ్రేళ్ళు కోసుకోకుండా గట్టిగా పట్టుకొని పైకి తీసుకురావాలె. ఆ హృదయ పురుషుడు పుణ్యపాపరూప కర్మలతో అంటులేనివాడు. ఆనందమయుడు అని తెల్సుకోవాలి అని. ఇక్కడ అనుమానము కలుగుతున్నది. ఈ అంగుష్ఠమాత్రుడు / అంతే పరిమాణము ఉన్నవాడు ప్రత్యగాత్మనా? లేక పరమాత్మనా? అని. ఏది తగినదంటే ప్రత్యగాత్మనే అని మేమంటాము. ఎందువల్లనంటే మరొకచోట జీవుడు అంగుష్ఠ మాత్రుడని వినిపిస్తున్నది.

**ప్రాణాధిపః సంచరతి స్వకర్మభిః అంగుష్ఠమాత్రో రవితుల్య రూపః సంకల్పాహంకార సమన్వితో యః** ఎవడైతే ప్రాణాలకు అధిపతియై తన కర్మల కారణంగా సంచరించుతున్నాడో అతడు అంగుష్ఠమంతటివాడు. ఐనా సూర్యుడి వంటి కాన్తి గలవాడు. అతడు సంకల్పము, అహంకారాలతో కలసి ఉన్నాడు. అని పరమాత్మ ఉపాసన కొరకు తప్ప ఇతర సందర్భాలలో అంగుష్ఠ మాత్రుడని చెప్పబడుతూ లేదు. కాబట్టి జీవుడు అంగుష్ఠ మాత్రుడు అని నిర్ణయించితే, ఈశానత్వము – అదుపులో పెట్టుకొని నడిపించడము అనేది కుదురుతుంది. శరీరమును, ఇంద్రియాలను, భోగ్యవస్తువులను బోగోపకరణాలనున్నూ తన ఇష్టము ప్రకారము నడిపిస్తున్నాడు కనుక వాటిపైన ఈశానత్వం కుదురుతుంది. కనుక అంగుష్ఠమంతటి వాడు జీవుడే. అని పూర్వ పక్షము ఏర్పడినప్పుడు సమాధానాన్ని చెప్పుతున్నాము.

శబ్దాదేవ ప్రమితః అని. అంగుష్ఠముతో కొలతచెప్పబడిన వాడు పరమాత్మనే. ఎందుకంటే **ఈశానో భూతభవ్యస్య** అని వేదంచెప్పుతున్నది కదా! కర్మ పరవశుడైన జీవుడికి, భూతభవ్యాలైన సర్వ లోకాలకు/సర్వప్రాణులకు ఈశితృత్వము సంభవించదు కాబట్టి. ఐతే పరమాత్మ అంగుష్ఠమాత్రుడు ఎట్లా అవుతాడు అని అంటే–

సూ॥ **హృద్యపేక్షయా తుమనుష్యాధికారత్వాత్ 1–3–24** భగవన్తుడిని ఉపాసించే అధికారము మనిషికే ఉన్నది. అతని హృదయాన్ని బట్టి పరమాత్మకు కొలత ఉన్నది. పరమాత్మ ఉపాసకునియొక్క హృదయంలో ఉంటున్నాడు అది అంగుష్ఠ మంతమాత్రమే పరిమాణము కలది. దాన్నిబట్టి అందులో ఉంటున్న పరమాత్మ అంగుష్ఠమాత్రుడు అవుతున్నాడు. జీవుడికిన్నీ అంగుష్ఠ ప్రమితత్వము అనేది ఆ హృదయాన్నిబట్టే చెప్పబడ్తున్నది. ఆ జీవుడు ఆరాగ్ర మాత్రుడు అని శ్రుతి చెప్తున్నది కదా! మనుష్యులకు మాత్రమే ఉపాసన చేసే అవకాశము జ్ఞానము ఉంటున్నది. మనుష్యుడి హృదయము వాడి వాడి బొటనవ్రేలంత మాత్రమే ఉంటుంది గాడిద, గుఱ్ఱము, పాము మొదలైన వాటి హృదయాలు అంగుష్ఠమంత లేకపోయినా తప్పేమీ లేదు. దీనిపైన చెప్పవలసిన విషయము తరువాత చెప్తాము. ప్రాసంగికంగా తల ఎత్తిన కొన్ని అంశాలపైన ప్రస్తుతము చర్చకొనసాగుతున్నది **దీనిలో అన్తర్భాగంగా** దేవతా అధికరణము – దానిలో భాగంగా మధ్వధికరణము – దానిలో భాగంగా అపశూద్రాధికరణము చర్చించబడి, చిట్టచివరకు ప్రమితాధికరణము ముగించబడుతుంది. పరమాత్మను ఉపాసించే అధికారము దేవతలకు ఉన్నదా లేదా? అనే అంశము పైన చర్చకొనసాగనున్నది. దానిలో భాగంగా దేవతా అధికరణాన్ని ఆరంభించుకుందాము. **సాధారణంగా అధికరణము అనే దానిలో ఐదు అంశాలు ఉంటాయి. ఉపవిభాగాలతో కలిపితే పది దాకా ఉండవచ్చును. ప్రస్తుతము ఐదింటిని గురించి తెల్సుకుందాము. 1) విషయము 2) విశయము లేక సంశయము 3) పూర్వపక్షము 4) దానికి సమాధానము / ఉత్తరము 5) సిద్ధాన్తము** 1) విషయము చర్చనీయాంశమైన వేదవాక్యము 2) దానిపైన అనుమానము లేక సందేహము 3) పూర్వపక్షము 4) పూర్వపక్షముపైన చర్చ ఖండన 5) సిద్ధాన్తము చివరకు తేల్చబడే అంశము అని విభాగాలు. **అని ప్రమితాధికరణము.** (మిగిలినది 400 పేజిలో)

★ ★ ★

## ఇక దేవతాధికరణము

**సూ॥ తదుపర్యపి బాదరాయణః సంభవాత్ 1-3-25** పరబ్రహ్మకు అంగుష్ఠమంత ఆకారము ఉన్నది అని చెప్పిన విషయాన్ని సమర్థించడానికి గాను బ్రహ్మోపాసన చేయడానికి మనుష్యుడికే అధికారమున్నదని అతడి హృదయములోపలి స్థలము అంతపాటిదే కాబట్టి ఆయన అంతటివాడు అన్నది శాస్త్రము. మానవుడిని బ్రహ్మను గురించి ఉపాసనము చేయవయ్యా అని పురికొల్పింది. బ్రహ్మ విదాప్నోతి పరమ్. బ్రహ్మవేద బ్రహ్మైవభవతి ఇత్యాదులు ఇందుకు ప్రమాణాలు ఆ సందర్భంగా ఇప్పుడు బ్రహ్మ విద్యయందు దేవాదులకు అధికారము ఉన్నదా? లేదా? అని విచారిస్తున్నారు. ఏది తగును? అనగా దేవతలకు అధికారము లేదనియే పూర్వపక్షము. ఎందువల్లనంటే సామర్థ్యము లేదు కాబట్టి. శరీరం లేని దేవతలకు వివేక, విమోకములు మొదలైన సాధన సప్తకము ద్వారా బ్రహ్మోపాసనను అనుష్ఠించడానికి తగిన సామర్థ్యము లేదు. అంతేకాదు దేవతలకు శరీరాలు ఉన్నవి అనడంలో ప్రమాణాలు ఏవీ కనుపించడంలేదు. పరినిష్పన్న వస్తువు ఐన పరబ్రహ్మ విషయంలో వ్యుత్పత్తి కారణంగా వేదాన్త వాక్యాలు ప్రమాణాలు కాగల్గుతున్నాయి. అట్లాగైనప్పటికీ దేవతలు మున్నగు వారికి విగ్రహము - రూపము ఉన్నది అని చెప్పే ఒక్క వాక్యము కూడా లభించడంలేదు. మన్త్రాలు అర్థవాదాలు కర్మలను ప్రబోధించేవిగా వాటికి శేషములుగా కర్మసంబన్ధులుగా అపూర్వము వంటి వాటిని సాధించేవిగానే ఉన్నాయి కానీ దేవాది ఆకారాలను తెలియపరచేవిగా, ఎత్తి చూపేవిగా లేవు. కర్మవిధులు యజమానులు అపేక్షించే విషయాలను ఇవ్వగలుగడం తప్ప దేవతలకు సంబన్ధించిన ఏ విషయాన్నీ సాధించలేకున్నాయి. అందువలననే వారికి అర్థిత్వము - కోరిక ఉండడము అనేదిన్నీ లేదు. అందువలననే సామర్థ్యము, అర్థిత్వము ఈ రెండూ లేవు కాబట్టి దేవతలకు అధికారము లేదు అని.

ఇట్లాగా పూర్వపక్షము ఏర్పడితే సమాధానము చెప్పుతున్నాము. తదుపర్యపి బాదరాయణః సమ్భవాత్ - తదుపర్యపి - తత్ ఆబ్రహ్మను ఉపాసించటము, ఉపరి- దేవాదులయందున్నూ సంభవించుతుందని భగవన్తుడైన బాదరాయణుడు - వ్యాసులవారు తలంచుతున్నారు. దేవాదులకు అర్థిత్వము కోరిక, సామర్థ్యము - దానిని సాధించుకోవడానికి అవసరమైన శరీరమున్నూ ఉన్నవి కనుక. అర్థిత్వము ఐతే ఆధ్యాత్మికాది ఓర్వలేని దుఃఖాల తాకిడి వలన, పరితపించడం వలన, తమకన్న

మిన్నయైన వాడై కోరికలను తీర్చగల పరబ్రహ్మలో ఎలాంటి ఎక్కువతక్కువలూ లేకుండా అన్నిరకాల దోషాల వాసనే లేకపోవడం, అనవధిక అతిశయఅసంఖ్యేయ గుణగణాలు ఉండడము, నిరతిశయమైన భోగ్యత్వాదులు ఉన్నాయని తెల్సుకోవడము వలన ఆ పరబ్రహ్మ లక్షణాలు తమకూ కావాలని కోరిక కలుగడం తప్పక జరుగుతుంది. అందుకు తగిన పటిష్ఠమైన దేహము ఇంద్రియాదులను కల్గి ఉన్నందున సామర్థ్యమున్నూ కలుగుతుంది.

బ్రహ్మాదులకు దేహము ఇంద్రియాలు ఉన్నవని అన్ని ఉపనిషత్తుల్లో సృష్టి ప్రకరణాల్లో, ఉపాసన ప్రకరణాల్లోనూ కనిపిస్తున్నది. వినిపిస్తున్నది. అది ఇట్లాగా **సదేవ సోమ్యేదమగ్రఆసీత్.... తదైక్షత బహుస్యామ్. ప్రజాయేయేతి. తత్తేజోఽసృజత** అని మొదలుపెట్టి అచేతనాన్నంతటినీ తేజస్సు నీరు అన్నము (పృథివీ) మొదలైన అవస్థా విశేషాలను కలదిగా విడదీసి **అనేన జీవేన ఆత్మనాఽనుప్రవిశ్యనామ రూపేవ్యాకరవాణి** అని సంకల్పించి బ్రహ్మ మొదలుకొని స్థావరములు చివరగా ఉన్న భూతసముదాయాన్ని వారివారి కర్మలకు తగినట్లు శరీరాలను వాటికి నామరూపాలనున్నూ పొందేటట్లు ఈ పరమాత్మ చేసినాడని చెప్పబడింది. ఇట్లాగే సృష్టి వాక్యాలన్నిటిలోనూ దేవతిర్యక్ మనుష్య స్థావరాల రూపంలో నాలుగు ప్రకారాలుగా ఉన్న సృష్టి చెప్పబడుతున్నది. దేవాదులలో ఆయాభేదాలకు కారణము వారి వారి కర్మలకు అనుగుణంగా బ్రహ్మలోకము మొదలుకొని పద్నాలుగు లోకాలలో ఉన్న ఫలాలను అనుభవించడానికి తగిన దేహ ఇంద్రియాదులతో సమ్బన్ధాన్ని కల్గియున్నది. సహజంగా ఆత్మలకు దేవాది విభేదాలు లేవు. అట్లాగే **తద్దఉభయే దేవాసురా అనుబుబుధిరే. తేహఊచుః... ఇంద్రోహవైదేవానామభిప్రవవ్రాజ. విరోచనోఽసురాణామ్. తౌహఅసంవిధానావేవ సమిత్పాణీ ప్రజాపతి సకాశమాజగ్మః తౌ హద్వాత్రింశతంవర్షాణి బ్రహ్మ చర్యమూషతుః తౌహ ప్రజాపతిరువాచ.** అపుడు దేవదానవులు ఇద్దరూ తెల్సుకున్నారు. వారు పలికినారు దేవతల పక్షాన ఇంద్రుడు ముందుకు వచ్చినాడు. రాక్షసులపక్షాన విరోచనుడు. వారిద్దరూ చక్కగా తెలియని వారైనందున జ్ఞానార్జన కొరకు బ్రహ్మవద్దకు సమిధలు దర్భలనున్నూ తీసుకొని పోయి ముప్పది రెండు ఏండ్లు బ్రహ్మచర్యాన్ని పాటించినారు. వాళ్ళతో ప్రజాపతి ఇట్లాగా పలికినాడు. ఇత్యాది వాక్యాల వల్ల దేవాదులకు శరీరము ఇంద్రియాలూ ఉన్నట్లు స్పష్టంగా స్ఫురించుతున్నది. కర్మ విధులకు శేషభూతములైన – సమ్బన్ధము కల – మన్త్ర అర్థవాదముల యందున్నూ

**వజ్రహస్తః పురందరః** పురందరుడు – ఇంద్రుడు వజ్రమును చేతిలో ధరించిఉన్నాడు. **తేనేంద్రో వజ్రము దయచ్ఛత్** ఆచేతితో వజ్రాయుధాన్ని ప్రయోగించినాడు. ఇత్యాది వాక్యాలద్వారా తెలియవస్తున్న విగ్రహాది మత్త్వము ప్రమాణాన్తరములతో వైరుద్ధ్యము లేక దేవతలకు అర్థిత్వసామార్థ్యాలున్నవనియే తెల్పుతున్నవి.

అనుష్ఠించదగినదైన అర్థాన్ని వెల్లడించుట స్తోత్రము చేయుటవలన మన్త్రాలు అర్థవాదాలు ప్రతీయమానమవుతున్న తెలుస్తూ ఉన్నదానికంటే వేరయిన మరొక విషయాన్ని తెల్పుతున్నవి అని చెప్పడానికి వీలులేదు. శరీరాలు గుణాలు స్తుత్యాదులకు ఉపయోగపడుతూ ఉన్నాయి. ఆ శరీరము గుణాలు లేనప్పుడు ధ్యానాదులు పొసగవు. స్తుతి అనేది ఆయా ఉపాస్యమైన దేవతల యొక్క గుణాలను తెల్పినపుడే దానిపేరు సార్థకము అవుతుంది. గుణాలు లేనప్పుడు స్తుతిత్వము లేకుండా పోతుంది గుణాలు లేకుండడము, వాటిని చెప్పకుండడాలతో ప్రరోచన / ఆసక్తి పుట్టదు. కావున కర్మలను ఆచరించండి అని ప్రరోచనను/ ప్రేరణను కల్గించే అర్థవాదాలు ఆయాదేవతలకు గుణాలు ఉన్నవి అనే తెల్పుతున్నవి. మన్త్రాలు కూడా ఆయాకర్మలలో వినియోగింపబడ్తూఏదో ప్రయోజనాన్ని పొందడం కొరకు ఆచరించవలసిన/ అనుష్ఠించదగిన అర్థాన్ని వెల్లడి చేస్తున్నవై దేవాదులలో ఉన్న విగ్రహాదులను గుణవిశేషాలనున్నూ తెల్పుతూ ఉన్నట్టివై కొంతమేలును చేకూరుస్తూ ఉన్నాయి. అట్లా కానప్పుడు ఇంద్రాదులను గుర్తించడము తలచుకోవడం వంటివి కుదురవు. ఇంతేకాదు ఏవిశేషమూ లేని దేవత మన బుద్ధికెక్కదు. ఈ సందర్భములో ప్రమాణాన్తరములతో తెలియరాని గుణాలను స్వయంగానే బోధించి వాటిద్వారా ఆయా కర్మలను ఆయా దేవతలను మీరు కోరుకున్న ఫలాల కొరకు ఆచరించండి అని పురికొల్పుతున్నాయి. గుణవిశిష్టుడైన వాడినే వెలుగులోకి తెస్తున్నవి. ఇంతకుముందే తెలిసినవాటిని మరొక సారి వివరించి వాటితో ప్రరోచనము ప్రకాశనములను చేస్తున్నవి. ఒకవేళ వైరుద్ధ్యము ఏదైనా ఉంటే అటువంటివాటిని తెలిపే వాచకశబ్దాలతో అవిరుద్ధాలైన గుణాలను బాగా ఎరుకపడేట్లు చేసి లక్ష్యాన్ని సాధిస్తున్నాయి. చేయమని పురికొలుపబడిన / విధించిన కర్మకు సమ్బన్ధించిన దేవతకున్న ఐశ్వర్యము తెల్సుకోదగినదయ్యే ఉంటున్నది. కోరిక గలవాడికి చేయదగినదిగా విధించబడిన కర్మ తాను స్వయంగా మరొక క్షణములో నశించేది కావున మరెప్పుడో – వర్తమాన కాలములో చేయబడినది కర్మ. దాని ఫలము – స్వర్గము అదికర్తతన పూర్ణాయుష్యాన్ని అనుభవించిన తర్వాత సుమారు ఏభై ఏండ్లకు – తనకు చెందిన ఫలాన్ని అందించలేదు. కనుక యజమానికి / కర్తకు ఆ ఫలాన్ని

అందించగల మరొక సాధకమును కోరుతుంది. అందుకే అపూర్వము అనే దాన్ని యజ్ఞము సృష్టిస్తుంది అని మీమాంసకులు అంటున్నారు. మన్త్రములు అర్థవాదాల్లోను **వాయుర్వైక్షేపిష్ఠాదేవతా. వాయుమేవస్వేనభాగధేయేన ఉపధావతి. సఏవైనం భూతింగమయతి.** వాయుదేవుడు కుప్పలు తిప్పలుగా కుమ్మరించే దేవుడు. తన అదృష్టం కొద్దీ ఒకడు ఆయనను ఆరాధించుతాడు. అలాంటి సమృద్ధిగా ఫలాలనిచ్చే వాయువు ఈ ఉపాసకుడిని గొప్ప సంపదలను పొందేటట్లు చేస్తాడు. **2) యదనేన హవిషా అశాస్తే. తదశ్యాత్ తదృధ్యాత్. తదస్మైదేవారాధన్తామ్.** 2) ఈ విధమైన హవిస్సుతో దేన్ని ఆశిస్తాడో ఆ దేవతకు అర్పించిన పిదప మిగిలిన హవిస్సును ఆయన ప్రసాదంగా భుజించాలి. అందుకు సన్తోషించిన ఆ దేవత అతడిని పెంపుచేస్తుంది. అందువలన మీరు కోరిన ఈ ఫలాన్ని అందుకోవడానికి దేవతలను ఆరాధించండి. మొదలైన వాక్యాలయందు కర్మ చేత ఆరాధింపబడిన దేవతకు తగిన ఫలాన్ని ఇవ్వగల శక్తి దానికి తగిన ఐశ్వర్యమున్నూ తెల్సుకోదగినవిఐ వాక్యార్థములో సమన్వయాన్ని పొందుతున్నవి. దేవపూజను తెలిపె యజిధాతువున్నూ యాగము అనే పేరుగల కర్మ సులభముగా ఆరాధించే వీలున్న, తనకు ఆరాధ్యులైన దేవతను ప్రధానుడుగా స్ఫురింపచేస్తున్నది.

అందువల్ల మొత్తము వాక్యాన్ని పర్యాలోచన చేసినపుడు వాక్యమే విధిచేత కోరబడిన సమస్తమూ, అర్థము అవుతున్నది కనుక యజ్ఞాన్ని చేయండి అని విధించినపుడు – వ్యుత్పత్తి సమయంలో – తెలియరాని దానిని – అపూర్వము వంటిదానిని – కర్మలను విధించిన వాక్యాలలోనే చెప్పవలెను అని గాని, లేక అందులో / విధి వాక్యంలో చెప్పబడనందున దాన్ని కల్పించుకోదగినదిగా కాని ఆశ్రయించవలసిన అవసరము లేదు.

అదే తీరుగా సంకీర్ణములు, బ్రాహ్మణములు, మన్త్రములు అర్థవాదములు మున్నగు వేదవాక్యాలను ఆధారముగా చేసుకున్న ధర్మ శాస్త్రము, ఇతిహాసము, పురాణములయందు బ్రహ్మాదులకు దేవాసురులు మొదలైన వారికి కూడా దేహము ఇంద్రియాదులు తత్కారణంగా స్వభావభేదాలు, ఉండేచోట్లు, భోగాలు, వాళ్ళవాళ్ళ పనులున్నూ ఇంకా తదితరాలు చాలా తేటగా ప్రతిపాదింపబడ్తున్నాయి. ఇందువల్ల విగ్రహాదులు ఉన్నాయికనుక దేవాదులకు కూడా బ్రహ్మను ఉపాసనను చేసే అధికారము ఉన్నది.

సూ॥ **విరోధః కర్మణీతి చేన్న అనేకప్రతిపత్తేర్దర్శనాత్ 1-3-26** శరీరము ఉంటే కర్మలయందు విరోధము వస్తుందనుకోకూడదు. అనేక శరీరాలను పొందుట కనపడ్తున్నది కదా. దేవాదులకు శరీరము ఉన్నట్లు అంగీకరించితే యజ్ఞాది కర్మలలో వైరుధ్యం వస్తుంది. వేరువేరు ప్రదేశాలలో వేరువేరు వ్యక్తులు యాగాలు చేస్తూ ఉంటే ఒకేసారి శరీరమున్న ఇంద్రుడిని **అగ్ని మగ్న ఆవహ! ఓ అగ్నిదేవా! ఈ అగ్నిలో (మంటలో) ఆవహించు. ఇంద్రాగచ్ఛ హరివ ఆగచ్ఛ** ఓ ఇంద్రుడా! వచ్చేయవయ్యా। హరివ(పచ్చని గుఱ్ఱాలు కలవాడా) రావయ్యా! ఇత్యాది మన్త్రాలతో పిలిస్తే వారి వద్దకు ఒకేసారి పోవడం కుదరదు. అగ్న్యాదులు ఆయా ప్రదేశాలకు వచ్చిపోతున్నట్లు వేదము చూపుతున్నది. **కస్యహ వాదేవాః యజ్ఞ మాగచ్ఛన్తి. కస్యవాన. బహూనాంయజమానానామ్. యోవైదేవతాః పూర్వాః పరిగృహ్ణాతి. సఏనాః శ్వోభూతేయజతే.** చాలామంది యజ్ఞము చేస్తూ ఉన్నపుడు ఎవని యజ్ఞానికి దేవతలు వస్తున్నారు ఎవని యజ్ఞానికి రావడం లేదు. అని భావించకూడదు. ఎవడైతే తొలుతదేవతలను ఆహ్వానించాడో తెల్లవారితే చేయబోయే యజ్ఞములో ముందుగా పిల్చిన వానివద్దకు వస్తారు అని. కావున దేవతలకు శరీరమున్నట్లు అంగీకరించితే యాగాది కర్మలయందు వైరుధ్యము వస్తుంది కదా అన్నట్లయితే అదిసరికాదు. ఇంద్రాదులు అనేక రూపాలను పొందుతున్నారు. ఆ విషయం కనిపిస్తూనే ఉన్నది. సాధారణ మానవుడుగా పుట్టిన సౌభరిమహర్షి వంటివాండ్లు తమతమ తపశ్శక్తి కారణంగా ఒకేసారి అనేక శరీరాలను పొందిన దృష్టాన్తాలున్నవి కదా!

సూ॥ **శబ్ద ఇతిచేన్న. అతః ప్రభవాత్ ప్రత్యక్షానుమానాభ్యాం. 1-3-27** శబ్దమునందు విరోధమున్నదనకూడదు. దానినుండే సృష్టి జరుగుతున్నది. ఈ ముచ్చట శ్రుతి స్మృతులవల్ల తెలుస్తున్నది. సూత్రములో విరోధము అని ఉన్నది. కర్మయందు విరోధము / ఆటంకము / అడ్డంకి జరుగకుండుగాక. అనేక శరీరాలను శక్తి శాలురు ఐన దేవతలు మొదలైనవారు పొందుతున్నారు గనుక. వైదికశబ్దము నందైతే విరోధము ఏర్పడుతుంది. అనిత్యము ఐన అర్థముతో కలయిక ఉన్నందువల్ల. ఇంద్రశబ్దముతో పిలువబడే ఇంద్రుడికి స్వర్గాధిపతికి విగ్రహము ఉన్నపుడు, అది ఇంద్రియాలు హస్తములు పాదాలు మొదలైన అవయవాదులతో కూడి ఉంటున్నందువల్ల సావయవాలు అన్నీ కాలము ఉన్నంతవరకూ ఉండక మధ్యలో నశించిపోక తప్పదు. కావున ఇంద్ర శరీరము నశించిపోతే ఇంద్రశబ్దము లేకుండా పోతుంది. అపుడు

శబ్దము కూడా అనిత్యమే కావలసి ఉంటుంది. అందుచేత శరీరము శబ్దమూ రెండూ అనిత్యాలుకాక తప్పదు. దానితో లౌకకమైన దేవదత్తాది శబ్దాల వలె ఇంద్రాది శబ్దాలకు అర్థమైనవాడు పుట్టకముందు, నశించిపోయిన తరువాతనున్నూ వైదికాలైన ఇంద్రాది శబ్దాలకున్నూ అర్థము లేకుండా పోవడము జరుగుతుంది. లేదా! నిత్యమైన వేదము అనిత్వము కావలసివస్తుంది గదా అని అనేటట్లయితే అట్లా అనడం తగదు. వైదికశబ్దాలు అనర్థకము లేమీ గావు. అతః ప్రభవాత్ – ఈ ఇంద్ర ఆదిశబ్దాలనుంచే మళ్ళీమళ్ళీ ఇంద్రాదులైన అర్థముగా ఉండే వ్యక్తులు పుట్టుకొని వస్తున్నారు కదా!

**ఇది ఇక్కడ చెప్పబడుతున్న విషయము** – లౌకికాలైన దేవదత్తాది శబ్దాలవలె వైదికాలైన ఇంద్రాది శబ్దాలు ఒకానొక వ్యక్తియందు మాత్రమే సంకేతాలుగా / వాచకాలుగా వ్యవహరింపబడడం లేదు. ఐతే స్వభావపూర్వకంగానే వాటిని చెప్పే వాటివిగా ఉంటున్నాయి. అందువల్ల ఒకానొక ఇంద్రుడనబడే వ్యక్తి నశించిపోతే ఈ ఇంద్రశబ్దాన్నుంచే, మనస్సులో తలచుకోబడుతుండగా ఆ శబ్దము చేత చెప్పబడే ఇంద్రునియొక్క ఆకారాన్ని అర్థం చేసుకొని మునుపు ఉండినటువంటి ఇంద్రుని యొక్క ఆకారవిశేషాలతో కూడియున్న అటువంటి ఇంద్రుడినే చతుర్ముఖ బ్రహ్మ సృష్టిస్తున్నాడు. ఎట్లాగైతే కుమ్మరివాడు తన మనస్సులో కుండను చేయదల్చుకొని దానియొక్క రూపురేఖలను మనస్సులో తల్చుకుంటూ కుండ అని అనడానికి తగిన ఆకారాన్ని కల్గిన దానినే సృష్టి చేస్తున్నాడో అదే విధంగా బ్రహ్మగారు ఆయా శబ్దాలను తల్చుకుంటూ అందుకు తగ్గరూప రేఖావిలాసాలు గుణాలు కలవాడిని ఇంద్రశబ్దవాచ్యుడిని పుట్టించుతున్నాడు అని.

ఐతే ఇది ఎట్లాగా తెలుస్తున్నది? అని అంటే ప్రత్యక్షానుమానాల వల్ల తెలుస్తున్నది. అనగా శ్రుతులు స్మృతుల వలన అని అర్థము. తొలుతగా శ్రుతి చెప్పిన వాక్యము – **వేదేన రూపే వ్యాకరోత్ సతాసతీ ప్రజాపతిః.** చిద చిత్తులయొక్క వివిధములైన రూపాలను ప్రజాపతియైన బ్రహ్మవేదము సాయంతో చేసినాడు. **2) సభూరితి వ్యాహరత్. స భూమిమసృజత్. సభువ ఇతివ్యాహరత్ సోఽన్తరిక్షమసృజత.** ఆ బ్రహ్మగారు భూః అని వేదములోని శబ్దాన్ని పలికినాడు. పిదప ఆ శబ్దానికి అర్థమైన ఇంతకుముందు సృష్టిలో ఉన్నదానియొక్క రూపాన్ని స్మరించుకొని అట్లాంటి రూపగుణాలు కల భూమిని పుట్టించినాడు. తరువాత భువః అని ఉచ్చరించి దానికి అర్థమైన ఆకాశాన్నీ సృష్టించినాడు. ఇట్లాంటివి ఇంకా ఎన్నో ముందుగా వాచకమైన శబ్దాన్ని స్మరించుకొని

దానికి అర్థమైన ఆకారాన్నీ తల్చుకుంటూ ఆయా శబ్దాలను అర్థమైన దాన్ని దానికి ఉండే సంస్థానాన్నీ దానితో కూడిన అర్థమైన వస్తువునున్నూ సృష్టించినాడని అర్థము. ఇక స్మృతి కూడా ఇట్లాగా చెపుతున్నది. **శ్లో॥ అనాది నిధనా హ్యేషా వాగుత్సృష్టా స్వయమ్భువా! ఆదౌ వేదమయీ దివ్యా యతస్సర్వాప్రసూతయః॥** స్వయంభువు ఐన శ్రీమన్నారాయణుని చేత ఆది, అంతము లేనిదియైన వేదమయీ / విజ్ఞానస్వరూపమైన వేదము అనే పేరు గలిగిన వాక్కు తనలో నుంచి బయలు పర్చబడింది. దాని నుండే ఈ సమస్త చరాచరప్రాణి జాతులు పుట్టినాయి అని, **శ్లో॥ సర్వేషాంతు సనామాని కర్మాణి చ పృథక్ పృథక్। వేదశబ్దేభ్య ఏవాదౌ పృథక్ సంస్థాశ్చ నిర్మమే॥** ఆ బ్రహ్మ దేవతిర్యక్ మనుష్య స్థావరాదులన్నిటికిన్నీ పేర్లను వారు చేయాల్సిన పనులను విడివిడిగా ఆకారాలనున్నూ ఎవ్వరికి వారికిన్నీ వేరువేరుగా తొట్టతొలికాలంలో వేదములో శబ్దాలను ఆధారముగా చేసుకొనే నిర్మించినాడు. అని, **సంస్థాః** సంస్థానాలు, రూపాలు అని అర్థము. అట్లాగే మరొక ప్రమాణము. **శ్లో॥ నామరూపం చభూతానాం కృత్యానాంచ ప్రపంచనమ్। వేదశబ్దేభ్య ఏవాదౌ దేవాదీనాంచకార సః॥** దేవాదులైన భూతాలయొక్క రూపాలను కృత్యాలను, పేర్లను వాటి వైవిధ్యాన్నీ వేదములోని శబ్దాల నుంచే ఆ బ్రహ్మ చేసినాడు అని. ఇందువల్ల దేవాదులకు ఆకారాలు ఉన్నప్పటికీ వైదిక శబ్దాలకు అనర్థకత, వేదానికి ఆది మత్వము – పుట్టుక – అనేవి కలుగవు.

సూ॥ **అతఏవచ నిత్యత్వమ్ 1-3-28** ఇందువల్లనే వేదానికి నిత్యత్వము సిద్ధించుతున్నది. ఏ కారణంగా నైతే ఇంద్ర వసిష్ఠాది శబ్దాలకు దేవ ఋషి వాచకాలైన వాటికి ఆయా ఆకారాలను మాత్రమే చెప్పగల్గడం, ఆయా శబ్దాలతో ఆయా అర్థాలను ముందుగా తల్చుకొని ఆయా అర్థాలైన వాటిని సృష్టిచేయడం జరుగుతున్నదో ఆ కారణం చేతనే **మన్త్రకృతో వృణీతే. నామ ఋషిభ్యో మన్త్రకృద్భ్యః. అయం సో అగ్నిరితి విశ్వామిత్రస్య సూక్తమ్ భవతి.** ఇత్యాది వాక్యాలచేత వసిష్ఠుడు మొదలైన వారికి మన్త్రకృత్త్వము, కాండకృత్త్వము, ఋషిత్వము మొదలైనవి అనగా మన్త్రాలను వ్రాయడము, కాండలను వ్రాయడము ఋషిగా గుర్తింపును పొందడము – తోస్తున్నా వేదము నిత్యమే. వీరిచేతనే వ్రాయబడింది కాదు అని నిత్యత్వము సిద్ధిస్తున్నది. ఈ శబ్దాలను ఆధారంగా చేసుకొనే **మన్త్రకృతో వృణీతే** మన్త్రాలను చేసినవాడిని / వ్రాసినవాడిని ఎంచుకుంటున్నాడు. ఇట్లాంటివేద శబ్దాలతోనే ఆయా కాండములు – సూక్తాలు – మన్త్రములనూ రచించిన ఋషులను, వారి ఆకారాలను, వారికున్నటువంటి శక్తులు మొదలైనవాటిని విచారించి / ఆలోచించి తెల్సుకొని ఆయా ఆకారములు శక్తులు గల వారిని సృష్టించిన

ప్రజాపతి వాళ్ళనే ఆయా మన్త్రాలను వ్రాయడానికి నియోగిస్తాడు. వారు కూడా బ్రహ్మ చేత ఆవాహనచేయబడిన శక్తి గలవారై వాటి వాటికి తగిన విధంగా తపస్సును చేసి ఎప్పుడూ నిల్చియుండే (నిత్యసిద్ధాలైన) తమకన్నా ముందుండిన పూర్వపూర్వ వసిష్ఠాదుల చేత కనుగొనబడిన ఆయా మన్త్రాలనే ఇప్పటికి ఇప్పుడు చదివినవి గాకుండా మునుపు ఎప్పుడో చదివి ఉన్న వాటిని లాగా స్వరాలు వర్ణాలు తప్పిపోకుండా ముందటి సృష్టికాలంలో ఉన్నటువంటి వాటిని దర్శించుతారు. అంటే తమయొక్క తపః కాలంలో శ్రవణేంద్రియాలకు వినిపించిన వాటిని చదువుతారు. కనుకనే వేదాలకు శ్రుతులు అని పేరు. ఈ సృష్టిలో ఇదే మొదటిసారి కాబట్టి పశ్యన్తి – కనుగొంటున్నారు, చూస్తున్నారు అని అంటున్నారు. ఇందువల్ల వేదాలకు నిత్యత్వము సిద్ధిస్తున్నది. వీళ్ళకు మన్త్రకృత్త్వమున్నూ సిద్ధించుతున్నది.

ఇట్లా కావచ్చును. నైమిత్తిక ప్రలయాదులయందు ఇంద్రాదుల పుట్టుకలో వేదములోని శబ్దాల ద్వారానే పూర్వ ఇంద్రాదులను స్మరించుకోవడం ద్వారా ప్రజాపతి సృష్టి చేయునుగాక ప్రాకృత ప్రలయము నందైతే స్రష్టయైన ప్రజాపతికి భూతాది, అహంకార పరిణామాలను భూతములు – అహంకారాది పరిణామాలను గురించి తెలిపే శబ్దము కూడా నాశనమై పోయింది కాబట్టి శబ్దాలను తలచుకొని ప్రజాపతి తన సృష్టిని ఏ విధంగా చేయగల్గుతాడు? ఆ విధంగా నష్టమై పోయినపుడు వేదము నిత్యము ఏ తీరున కాగల్గుతుంది? అందువల్ల వేదము నిత్యము అని చెప్పే నీవు దేవాదులకు విగ్రహవత్త్వాన్ని ఒప్పుకున్నా లోకవ్యవహారము సవ్యంగా సాగడానికి ప్రవాహ అనాదిత్వమును / ప్రవాహనిత్యత్వాన్ని ఆశ్రయించాలి అని. దీనికి సమాధానాన్ని చెపుతున్నారు.

సూ॥ **సమాననామ రూపత్వాచ్చ ఆ వృత్తావప్యరోధోదర్శనాత్ స్మృతేశ్చ 1–3–29**
ప్రస్తుతమున్న జగత్తంతా ఉపసంహరింపబడినప్పటికీ తిరిగి సృష్టి చేయబడినప్పుడు పాత సృష్టిలోని ఇంద్రాదుల వంటి రూపాలే ఇప్పటి ఇంద్రాదులకున్నూ ఉంటున్నాయి. కనుక ఎటువంటి విరోధము లేదు. అది ఇట్లాగా – భగవన్తుడైన ఆ పురుషోత్తముడు ప్రలయము ముగిసే సమయంలో పూర్వంలో ఎటువంటి రూపాన్ని ఈ జగత్తు కల్గియుండిందో దానిని స్మరించుకుంటూ **బహుస్యామ్** ఇప్పటివరకూ నేను ఒక్కడినే ఉన్నాను. ఇక ఇప్పుడు అనేకములుగా అవుతాను అని సంకల్పించి అప్పటిదాకా భోగ్యవర్గము భోక్తల యొక్క సముదాయమున్నూ తనయందు తమ స్వరూపమంతా

నశించి కేవలం శక్తి ఒక్కటే దక్కియుండి తనలో లీనమై / కలసి పోయి తామెవరో తెలియకుండా ఉన్నటువంటి వారిని విడగొట్టి మహత్తు మొదలుకొని హిరణ్యగర్భుడు – చతుర్ముఖ బ్రహ్మ వరకు ఉన్న బ్రహ్మాండాన్ని ప్రలయము జరుగడానికి ముందు ఉన్న తీరుగా సృష్టించి వేదాలను కూడా పూర్వాను పూర్వీ విశేషాలతో కూడిన వాటిని – ముందున్నవారు పలికినట్లు స్వరవర్ణాలతో సహా పలుకడం – ఆవిష్కరించి హిరణ్యగర్భుడికి ఉపదేశించి, ఇంతకుముందు ఉన్న విధంగానే దేవాద్యాకారాలతో కూడియున్న జగత్తును సృష్టించడానికి నియోగించి – ఆదేశించి – స్వయంగా ఆ బ్రహ్మగారి హృదయంలో ఆయనకు అన్తరాత్మగా నిల్చి ఉండినాడు ఇందువల్ల దేవాదులకు విగ్రహవత్త్వము, వేదనిత్యత్వమున్నూ అన్నీ ఉపపన్నములే / పొసగినవే అవుతవి.

ఇదే వేదానికి అపౌరుషేయత్వము – ఒక పురుషుడు మనిషిచేత వ్రాయబడకుండడము – నిత్యత్వమున్నూ – ఏదైతే – పూర్వపూర్వులయొక్క ఉచ్చారణ క్రమాన్ననుసరించి ఉచ్చరించడం ద్వారా పుట్టిన సంస్కారముతో ఆ మొట్టమొదటి క్రమవిశేషాన్నే తలంచుకొని అదే క్రమము ప్రకారము పలుకబడుట. అది మనలోను సర్వేశ్వరుడియందున్నూ సమానమే. ఇది మాత్రము విశేషము. పురుషోత్తముడగు నారాయణుడు ఏ సంస్కారాన్ని ఆశించకుండానే తానే మునుపు ఉన్న స్వరవర్ణాలతో సహా అనుసంధించగలడు.

ఇప్పుడు మీరు చెప్పినదంతా తెలుసుకున్నది దేన్నిబట్టి. అని అనేట్లయితే దానికి సమాధానము చెప్పినాడు సూత్రకారుడు. దర్శనాత్ స్మృతేశ్చ అని. దర్శనమంటే **యోబ్రహ్మాణం విదధాతి పూర్వమ్. యోవైవేదాంశ్చ ప్రహిణోతి తస్మై.** తొట్టతొలుతగా ఎవడు బ్రహ్మను సృష్టిస్తున్నాడో ఎవడు ఆ చతుర్ముఖునికి వేదాలను అందజేస్తున్నాడో అనే శ్రుతివాక్యాన్ని బట్టి అని. ఇక **మనుస్మృతి ఆసీదిదం తమో భూతమ్** ఇపుడు కనిపిస్తున్న ఇదంతా అపుడు ఏది వస్తువో గుర్తించటానికి వీలుగాకుండా చీకటి వలె సూక్ష్మరూపము గలదిగా ఉండెను అని ఆరంభించి **శ్లో॥ సోఽభిధ్యాయ శరీరాత్ స్వాత్ సిసృక్షుః వివిధాః ప్రజాః । అపఏవససర్జాదౌ తాసువీర్యమపా సృజత్॥** ఆ విధంగా సంకల్పించిన నారాయణుడు తన శరీరములో నుంచే వివిధము లైన ప్రజలను సృష్టించదల్చుకొని తొట్టతొలుతగా నీరును పుట్టించినాడు. దాని వెనుక వీర్యమనబడే జీవవర్గాన్ని ఆ నీటిలోకి ప్రవేశపెట్టినాడు. **శ్లో॥ తదండమభవత్‌హైమమ్**

**సహస్రాంశుసమప్రభమ్। తస్మిన్‌జజ్ఞే స్వయం బ్రహ్మా సర్వలోక పితామహః** అట్లాగా నీటిలోకి చేర్చబడిన వీర్యము సూర్యుడితో సమానమైన కాన్తి గల అండముగా మారినది. దానిలో నుండి సర్వలోకాలకూ పితామహుడైన బ్రహ్మ తానుగానే పుట్టినాడు. అని.

అట్లాగే పురాణ వాక్యము– **తత్రసుప్తస్యదేవస్యనాభౌ పద్మమజాయత। తస్మిన్ పద్మే మహాభాగ। వేదవేదాంగ పారగః బ్రహ్మోత్పన్నః స తేనోక్తః ప్రజాః సృజ మహామతే** – ఆనీటి పైన పడుకొని ఉన్న నారాయణుని యొక్క బొడ్డులో పద్మము పుట్టింది. ఓ మహానుభావా! ఆ పద్మము నందు వేదములు వేదాంగములందున్నూ ఆరితేరినవాడైన బ్రహ్మ పుట్టినాడు. ఆ బ్రహ్మ నారాయణుని చేత గొప్ప బుద్ధి కలవాడా! ప్రజలను సృష్టించు అని ఆదేశింపబడినాడు. అని అదేవిధంగా **పరోనారాయణోదేవః తస్మాజ్జాతః చతుర్ముఖః** నారాయణుడు అందరికన్నా మిన్నఐనదేవుడు. ఆయన నుండి చతుర్ముఖబ్రహ్మ పుట్టినాడు. అదే విధంగా **ఆదిసర్గమహంవక్ష్యే** అని ఆరంభించి చెప్పబడుతున్నది. **శ్లో॥ సృష్ట్వానారం తోయమ్ అన్తఃస్థితోఽహమ్ యేనస్యాన్మే నామనారాయణేతి। కల్పేకల్పే తత్రశయామి భూయః సుప్తస్యమే నాభిజం స్యాత్ యథాఽబ్జమ్॥ ఏవం భూతస్యమే దేవినాభిపద్మే చతుర్ముఖః ఉత్పన్నః సమయాచోక్తః ప్రజాసృజమహామతే॥** తొట్టతొలుతటి సృష్టిని గురించే నేను చెపుతున్నాను. నారము అనగా నీరు. దానిని నేను పుట్టించి అందులో నేనున్నాను కనుక నాకు నారాయణ అనే పేరు కలిగింది. ప్రతికల్పంలోనూ నేను నీటిపైన పండుకుంటాను. తిరిగి పండుకున్న నా బొడ్డులో నుండి, నీళ్ళలో నుండి తామర పూలు పుట్టినట్లుగానే నాభి పద్మము నుండి చతుర్ముఖుడు పుట్టినాడు. ఆయనతో నేను ఓ మహామతే ప్రజలను పుట్టించు అని అన్నాను. అని శ్రుతులు స్మృతులు పురాణాలూ చెప్పుతున్నవి కనుక వాటి ద్వారా మాకు తెలిసింది. ఇందువల్ల దేవాదులకు అర్థిత్వ సామర్థ్యము ఉన్నందున బ్రహ్మ విద్యయందు వారికి అధికారమున్నదని నిశ్చితమైనది. **ఇది దేవతాధికరణము**

★ ★ ★

## ఇకపైన మధ్వధికరణము

**మధ్వాధిషు అసంభవాత్ అనధికారం జైమినిః 1-3-30** మధ్వాదులలో సంభవించదు. అధికారం లేదు అని జైమిని. బ్రహ్మవిద్యయందు దేవాదులకున్నూ అధికారమున్నదని చెప్పబడింది. ఇప్పుడు ఈ విషయమై విచారం చేయబడుతున్నది. ఏ ఉపాసనలయందు ఏఏ దేవతలను ఉపాసించాలి. వాటియందు వారికి

అధికారము ఉన్నదా? లేదా? అని. ఏది నిశ్చయింపబడ్డున్నదంటే చెపుతున్నాము. మధ్వాదివిద్యలయందు వారికి అధికారము లేదు అని పూజ్యుడగు జైమిని అభిప్రాయపడుతున్నాడు గనుక. ఎందువల్లనంటే అది అసంభవము గనుక. ఆదిత్యుడు వసువులు మున్నగువారు ఆయా విద్యలలో వారే ఉపాసింపబడ్డున్నారు. వారే తిరిగి ఉపాసకులవడము కుదురదు. వారికంటే వేరుగా ఇంకో ఆదిత్యవస్వాదులు లేరు కదా! పోనీ వారికి వసుత్వము, ఆదిత్యత్వాలు లేవుకాబట్టి అవికావాలని కోరుకుంటున్నారా? అంటే అట్లాంటిది ఏమీ లేదు. వారు ఇప్పుడు అనుభవిస్తున్నవి ఆ అధికారాలనే కనుక పొందిన వాటిని మళ్ళీ పొందవలసిన అవసరము లేదు కనుక.

మధువిద్యయందు – ఋగ్వేదాదులయందు ప్రతిపాదింపబడిన కర్మల ద్వారా పుట్టబడినది, సూర్యునియొక్క కిరణాల ద్వారా ఆయన వద్దకు చేరుకున్న రసాని (నీటిని) కి ఆధారమైనందున **మధువు** అనే పేరుగలిగిన ఆదిత్యుని కిరణాలను వస్వాదులు భుజించుతున్నారు. కనుక వారికి ఉపాస్యత్వము, వస్వాదిత్వమున్నూ ప్రాప్యము – పొందదగినదిగా – వినిపిస్తున్నది. **అసౌవా ఆదిత్యోదేవమధు** ఈ ఆదిత్యుడేదేవతలకు మధువు అని మొదలుబెట్టి, **తత్‌యత్ ప్రథమం అమృతం తద్ వసవః ఉపజీవన్తి.** ఏదైతే మొట్టమొదటిదిగా చెప్పబడే మధువు అనబడే అమృతము ఉన్నదో దానిని వసువులు ఆరగించుతున్నారు / దానిపై ఆధారపడి జీవించుతున్నారు అని చెప్పి **స య ఏతదేవమమృతం వేద వసూనామేవైకో భూత్వాఽగ్నినైవ ముఖేన ఏతదేవామృతందృష్ట్వా తృప్యతి** అట్లాగే ఇదే అమృతమని ఎవడు గుర్తించుతున్నాడో ఆ వ్యక్తి వారిలో / వసువులలో ఒకడుగా అయ్యి అగ్ని ముఖంగా ఈ అమృతాన్ని చూచి తృప్తిని పొందుతున్నాడు. ఇట్లాంటి వాక్యాలద్వారా సూర్యకిరణాల ద్వారా ఆకాశానికి చేరిన కర్మరసాన్ని మధువు అనబడే దాన్నిపొంది వసువులు అనే పేరును, ఆ పేరుతో ఇతరులకు ఉపాస్యులుగానూ అవుతున్నారు. అనగా కర్మలచేత ఉపాసింపబడి ఉపాసకులకు వారు కోరిన ఫలితాలను ప్రసాదిస్తున్నారు.

సూ॥ **జ్యోతిషి భావాచ్చ 1-3-31** పరంజ్యోతిని గురించి ఉపాసన చేయడ మున్నందువల్ల కూడా! **తందేవాః జ్యోతిషాంజ్యోతిరాయుర్హోపాసతేఽమృతమ్.**

జ్యోతిస్సులైన వారికిన్నీ వెలుగులను ప్రసాదించే పరంజ్యోతియైన పరబ్రహ్మను వారి ఆయుష్యము ఉన్నంతకాలము మాకు ఈయన ఊపిరి అమృతవలె ఆనందమునిచ్చేవాడు అని ఉపాసించుతున్నారు అని జ్యోతిషి – పరబ్రహ్మను

ఉపాసనచేయడము దేవతలకు ఉన్నదని తెలుస్తున్నది. దేవతలూ మనుష్యులూ ఇద్దరూ పరబ్రహ్మను ఉపాసిస్తున్నప్పటికీ దేవతలకు ఉపాసకత్వాన్ని చెప్పడమనేది తాము ఉపాస్యులు ఐనందున మళ్ళీ తమకంటే వేరైన ఇతరులను ఉపాసించడాన్ని నిషేధించడమును సూచించుతున్నది. అందువల్ల ఈ ఉపాసనలయందు వీరికి అధికారం లేదు. అని పూర్వపక్షము ఎదురయ్యింది. దీనికి వ్యాసభగవానుని సమాధానము ఇట్లాగా ఉన్నది –

సూ॥ **భావంతు బాదరాయణః. అస్తిహి 1-3-32** ఆదిత్యవస్వాదులకున్నూ బ్రహ్మోపాసనలయందు అధికారము ఉన్నది అని భగవన్తుడైన బాదరాయణుడు తలుస్తున్నాడు. ఆదిత్యవస్వాదులకు కూడా తమ రూపంలో ఉన్న బ్రహ్మను ఉపాసించడం ద్వారా వస్వాదిత్వములను పొందుతూ దానినుంచి క్రమంగా బ్రహ్మను పొందాలి అనే కోరికను కల్గి ఉండడము, ఆ కారణంగా బ్రహ్మను ఉపాసించి ఆయన అనుగ్రహంతో బ్రహ్మ లోకాన్ని పొందవచ్చును కదా! అట్లా జరుగడానికి అవకాశము ఉన్నది కదా! ఇపుడు వస్వాదులుగా ఉన్నవారికి దీనితర్వాత రానున్న కల్పంలో కూడా మేము వస్వాదులుగానే ఉండాలి అనే కోరిక ఉంటుంది కదా! ఇక్కడ రహస్యమేమిటంటే కార్యబ్రహ్మ, కారణబ్రహ్మ అనబడే రెండు రూపాల్లోనున్న బ్రహ్మోపాసనము విధింపబడుతున్నది. కారణరూపంగా ఉన్న బ్రహ్మను కార్యరూపంలో ఉన్న / వస్వాదులరూపంలో ఉన్న బ్రహ్మ ఉపాసిస్తున్నాడు. **అసౌవా ఆదిత్యోదేవమధు** అని ఆరంభించి **అథతత ఊర్ధ్వముదేత్య** తరువాత ఊర్ధ్వము / పైకి / ఎత్తుగా వచ్చి / ఉదయించి అనే దానికి ముందువరకు ఆదిత్యుడు, వసువులు మున్నగు రూపాల్లో ఉన్న కార్యము అనే విశేషావస్థలో ఉన్న బ్రహ్మ ఉపాసింపదగిన వాడు అని ఉపదేశింపబడుతున్నది. **అథ త్తఊర్ధ్వం ఉదేత్య** ఇత్యాది వాక్యము చేత ఆదిత్యుడికి అన్తరాత్మగా ఉన్న కారణావస్థలో ఉన్న బ్రహ్మ ఉపాస్యుడుగా చెప్పబడుతున్నాడు. ఈ విధంగా కార్యము, కారణము అనే రెండు అవస్థల్లో ఉన్న బ్రహ్మను ఉపాసించినవాడు మరొక కల్పములో వస్వాదిత్వాన్ని పొంది దాని ముగింపువేళలో కారణమైన పరబ్రహ్మ వద్దకే చేరుకుంటున్నాడు. **న హ వా అస్మా ఉదేతి. ననిమ్రోచతి. సకృద్ధివా హైవాస్మైభవతి, య ఏతామేవబ్రహ్మోపనిషదం వేద.** ఎవడైతే ఈ బ్రహ్మవిద్యను తెల్సుకొని ఉపాసనను చేస్తున్నాడో ఇతనికొరకు మాత్రమే ఉదయించడంలేదు అస్తమించడం లేదు. ఎప్పుడున్నూ ఇతడికి పగలుగానే ఉంటుంది. అని మధు

విద్య అంతాబ్రహ్మోపనిషత్తే / బ్రహ్మ విద్యనే అని వినిపిస్తున్నందువల్ల బ్రహ్మను చేరుకోవడం వరకు ఉన్న వస్వాదిత్వమైన ఫలమునూ తెలుస్తున్నందువల్లనున్నూ వస్వాదులకు భోగ్యముగా ఉన్న ఆదిత్యాంశాన్ని గురించి విధించబడుతున్న ఉపాసన ఆ ఆదిత్యుడుగా ఉన్న బ్రహ్మకే చెందినది అని గుర్తింపబడుతున్నది. ఇందువల్ల ఈరకమైన ఉపాసనము ఆదిత్య వస్వాదులకు కూడా కలుగుతుంది. కాగా బ్రహ్మమాత్రమే – కారణ కార్యరూపాల్లో ఉన్న బ్రహ్మనే – ఉపాసించదగిన వాడవుతున్నందువల్ల **తందేవాః జ్యోతిషాంజ్యోతిః ఇత్యాదివాక్యాలు పొసగుతున్నాయి. దానినే వృత్తికారుడు అస్తిహి మధ్వాదిషుసమ్భవః బ్రహ్మణ ఏవ సర్వత్ర నిచాయ్యత్వాత్.** మధ్వాదివిద్యలందు దేవాదులకు ఉపాసనము చేసే అధికారము కలదు అని / కలుగుట కనబడుతున్నది కదా! అన్నిరూపాల్లోనూ బ్రహ్మ మాత్రమే ఉపాసింపదగినవాడు అవుతున్నందువల్ల అని చెప్పినాడు. **ఇది మధ్వధికరణము**

★ ★ ★

## ఇక అపశూద్రాధికరణము

సూ॥ **శుగస్య తదనాదరశ్రవణాత్ తదాద్రవణాత్ సూచ్యతేహి 1-3-33** ఇతనికి శోకము అనాదరము వలన పుట్టింది. అది పరుగెత్తడము వల్ల తెలుస్తున్నది. ఇప్పుడు బ్రహ్మవిద్యను తెల్సుకోవడానికి, ఉపాసించడానికిన్నీ శూద్రుడికి అధికారము ఉన్నదా? లేదా? అని విచారింపబడుతున్నది. అర్థిత్వము – బ్రహ్మకావాలనే కోరిక – సామర్థ్యము – ఉపాసనచేయడానికి తగిన శరీరము ఇంద్రియాదులు ఉన్నాయి / ఉన్నందువల్ల – శూద్రుడికి అధికారము ఎందుకు ఉండకూడదు? అనేది, అధికారము ఉండవచ్చును కదా! అనేది సంశయము. రెండింటిలో ఏది తగును అని అంటే అధికారము ఉన్నదనియే. ఎందువల్ల నంటే? అర్థిత్వము సామర్థ్యము అనేవి రెండు ఉండడమే అధికారానికి పునాదులు అవుతున్నాయి కదా! ఆ రెండూ శూద్రుడికి ఉండనే ఉన్నాయి. అందువల్ల శూద్రుడికిన్నీ అధికారము ఉన్నది. ఒకవేళ అగ్నివిద్యను/ హోమం చేయడంద్వారా పూర్తిచేయబడే కర్మల్లో అగ్నివిద్య తెలియనందువల్ల శూద్రుడికి అధికారము లేకున్నా బ్రహ్మవిద్య దానితో సమ్బన్ధము లేదు. మానసిక వ్యాపారంతోనే బ్రహ్మోపాసనను చేయవచ్చును గనుక ఆ మానసిక వ్యాపారము నందు /ధ్యానము చేయడము నందు అధికారము ఉండనే ఉన్నది. అందుకు మనస్సు/ కోరిక ఉంటే చాలు. ఉపాసనకు శాస్త్రీయ క్రియతో అవసరము ఉన్నప్పటికీ, ఆయా

వర్ణాలవారికి, ఆయా ఆశ్రమాలలో ఉన్నవారికిన్నీ వాళ్ళవాళ్ళ వర్ణాశ్రమాలకు తగినట్లు, శూద్రుడిని గురించి ఇక్కడ చర్చింపబడుతున్నందువల్ల ఆ శూద్రుడికి తన వర్ణానికి తగినదైన తన వర్ణానికంటే పైనపైన వర్ణాలవారికి శుశ్రూష/సేవను చేయడమే క్రియ/ కర్మ అవుతుంది. **తస్మాత్ శూద్రోయజ్ఞే అనవక్లప్తః** అందువల్ల శూద్రుడు యజ్ఞము చేయుట అనే క్రియలో / కర్మలో ఎంతమాత్రమూ సమ్బన్ధము లేనివాడవుతున్నాడు అని చెప్పినందువల్ల కూడా అగ్నివిద్యతో సాధింపబడే యజ్ఞాదికర్మల యందు అధికారములేకపోవడమే న్యాయసిద్ధము అని ఇంతకుమునుపే చెప్పబడిన అంశమే తిరిగి ఎత్తి చెప్పబడుతున్నది.

ఏమండీ! వేదాన్ని అధ్యయనము చేయనందువల్ల, అంతేగాక వేదాన్తాలను గురించి ఆచార్యుల సన్నిధిలో వినకపోయినందు వల్లనూ బ్రహ్మయొక్క స్వరూపము, ఆయనను ఉపాసించే పద్ధతులనూ తెలియనివాడు కావడంవల్లనూ ఏవిధంగా శూద్రుడికి బ్రహ్మోపాసన చేయడానికి అధికారము కలుగుతుంది? అని అంటే చెప్తున్నాము వినండి.

వేదాలు చదువకున్నా, వేదాన్తవాక్యాలను గురువుల వద్ద వినకున్నా రామాయణ భారతేతిహాసాలను పురాణాలను విన్నా బ్రహ్మ స్వరూపాన్ని గురించిన విజ్ఞానము, ఆయనను ఉపాసించే జ్ఞానము / తెలివి కలుగుతుంది. శూద్రుడు ఇతిహాసపురాణాలను వినడానికి అనుమతి ఉన్నది కదా! **శ్రావయేత్ చతురోవర్ణాన్ కృత్వాబ్రాహ్మణమగ్రతః** బ్రాహ్మణుడిని ఎదురుగా ఉంచుకొని ఆయనకు వినిపించుతూ తద్ద్వారా నాలుగు వర్ణాలవారికిన్నీ వినిపించవచ్చును. అనేటువంటి వాక్యాలద్వారా తెలుస్తున్నది. బ్రహ్మనిష్ఠులైన విదురుడు మొదలైనవారిని గురించి ఇతిహాసపురాణాదులలో కనిపించుతూనే ఉన్నది కూడాను. అదేవిధంగా ఉపనిషత్తులలోనూ సంవర్గవిద్య యందు శూద్రుడికిన్నీ అధికారము ఉన్నదని తెలుపబడింది. శుశ్రూష చేసి బ్రహ్మవిద్యను పొందడానికి వచ్చిన జానశ్రుతి అనేవాడిని ఆచార్యుడైన రైక్వుడు "**శూద్ర**" అని సంబోధించి పిల్చి అతనికి బ్రహ్మవిద్యను చెప్పినాడు. **ఆజహారేమాః శూద్ర! అనేనైవ ముఖేన ఆలాపయిష్యథాః** ఓ శూద్రుడా! ఈ గోవులు బంగారము కన్యలు మొదలగువాటిని తీసుకొనివచ్చినావు. వీటిద్వారా బ్రహ్మను గూర్చి ముచ్చటింపచేయదల్చినావు. ఇత్యాది వాక్యము ద్వారా శూద్రుడికి బ్రహ్మఉపాసన చేయడానికి అధికారము ఉన్నది అని. పూర్వపక్షము ఎదురుపడితే చెప్తున్నాము.

శూద్రుడికి అధికారము లేదు అందుకు తగిన సామర్థ్యము లేదు కాబట్టి. బ్రహ్మస్వరూపము, ఆయనను ఉపాసించే పద్ధతి తెలియని వానికి, ఆ ఉపాసకు అంగముఐన గురువు ఉచ్చారణ ఉపదేశముల ప్రకారముగానే అట్లే ఉచ్చరించడము యజ్ఞాదికర్మలను ఆచరించడములోనూ అధికారము లేనివానికి ఉపాసన చేయడము, దాన్ని ఉపసంహరించడము / ముగింపు పలుకడములోనూ సామర్థ్యము లేదు. అసమర్థుడైన వానికి అర్థిత్వము / కోరిక ఉన్నప్పటికీ అధికారము ఉండబోదు. అసామర్థ్యము ఎందువల్లనంటే వేదాధ్యయనము చేయలేదు కాబట్టి. ఎట్లాగా అంటే! త్రైవర్ణికులకు – బ్రాహ్మణులు క్షత్రియులు వైశ్యులు మాత్రమే అధికారము ఉండి అధ్యయనము చేయాలి అని శ్రుతిచేత చెప్పబడినందున / విధించబడినందున/ శాసించబడినందున తద్వారా సిద్ధించిన స్వాధ్యాయాన్ని పఠించినందువల్ల సంపాదించుకోదగిన జ్ఞానము లభించుటచేత కర్మలను చేయవలసిన పద్ధతులు, జ్ఞానము దానికి / వాటికి చెందిన ఉపాయాలను / మార్గాలను తనకు చెందని ఇతరములైన వాటిని ఒప్పవు. ఆ తీరుగనే బ్రహ్మోపాసనావిధులు తమతో సమ్బన్ధములేని కర్మలను అంగీకరించవు. అంటే కర్మలు జ్ఞానాన్ని / బ్రహ్మజ్ఞానము కర్మలను ఒప్పవు. కనుక అధ్యయన విధిచేత సిద్ధించిన స్వాధ్యాయము ద్వారా సమ్పాదింపబడిన జ్ఞానము మాత్రమే బ్రహ్మోపాసనకు మార్గమవుతున్నందువల్ల శూద్రునికి బ్రహ్మోపాసన సామర్థ్యము లేదు.

ఇతిహాసాలు, పురాణాలు కూడా వేదార్థాన్ని విశదీకరించుతున్నవై మాత్రమే జ్ఞానోపాయాలు అవుతున్నవి. అంతే కానీ జ్ఞానాన్ని అవిస్వతంత్రంగా పుట్టించవు. అందువల్ల బ్రహ్మను గురించిన జ్ఞానం పుట్టడానికి కారణాలు కావు. శూద్రుడికి ఇతిహాసపురాణాలు వినవచ్చును అని అధికారమును ఎందుకిచ్చినారంటే వారి పాపాలను పోగొట్టడమనే ఫలము దక్కడం కొరకే కానీ ఉపాసనను చేయడానికి కాదు.

విదురాదులు ఐతే మాత్రము పూర్వజన్మలలో దక్కించుకొన్న జ్ఞానవికాసము చేత సంపూర్ణజ్ఞానులైనా ప్రారబ్ధకర్మకు చిక్కి ఇట్లాంటి వేదాధికారము లేని తక్కువకులములో పుట్టినారు. కనుక వారు పూర్వజన్మకారణముగా వచ్చిన అదృష్టము వల్ల బ్రహ్మనిష్ఠులు ఐనారు.

సంవర్గ విద్యలో శుశ్రూషువు ఐన జాన శ్రుతిని శూద్ర అని సంబోధించడము శూద్రుడికి ఉపాసనాధికారాన్ని సూచిస్తున్నదని మీరేదైతే అన్నారో అది సరికాదని

సూత్రకారుడు చెప్తున్నాడు. ఏమని "**శుగస్యతదనాదర శ్రవణాత్ తదాద్రవణాత్ సూచ్యతేహి**" అని– పౌత్రాయణుడైన జానశ్రుతికి బ్రహ్మజ్ఞానమొక్కటి తక్కువఐనందువల్ల హంసచేత పలుకబడిన అనాదర వాక్యాలను వినడంతో అప్పుడే బ్రహ్మవేత్త ఐన రైక్వుడి వద్దకు పరుగులు పెట్టినందువల్ల ఇతనికి దుఃఖము కలిగింది అని సూచింపబడుతున్నది. అందువల్ల రైక్వుడు శూద్ర అని పిలిచినాడు. కానీ నాలుగవ వర్ణములో పుట్టినందువల్ల కాదు. శూద్రపదానికి వ్యుత్పత్తి ఇది. శోచతిదుఃఖించుతున్నాడు కనుక శూద్రుడు అనబడుతున్నాడు. శు**చేర్దశ్చ** అనే పాణినీయ సూత్రప్రకారము రక్‌ప్రత్యయము వచ్చినాక ధాతువునకు దీర్ఘము వస్తే చకారము యొక్క స్థానంలో దకారాదేశముకాగా శూద్ర అనే రూపము ఏర్పడుతుంది. అందువలన శోచితృత్వము – దుఃఖించడం మాత్రమే ఈ జానశృతికి ఉన్నదని ఈ శూద్రప్రయోగము చేత తెలుస్తున్నది. అంతేకాని అతడు శూద్రుడు అని, శూద్ర జాతికి చెందిన వాడని కాదు.

జానశ్రుతి పౌత్రాయణుడు. ఆయన రాజుఐ బహుసంపదలు కల్గియున్నాతాను సుఖించడానికి భోగాలననుభవించడానికి ఉపయోగించక ప్రజలకు యాచకులకు సమృద్ధిగా ద్రవ్యాన్ని పంచేవాడు. అంతేకాకుండా వండిన ఆహారపదార్థాలను పెట్టి అన్నదాతగా కూడపేరు తెచ్చుకున్నాడు. అట్లాంటి ధార్మికాగ్రేసరుడు ఐన ఆతని యందు ఆతని ధార్మిక గుణానికి సంప్రీతులైన కొందరు మహాత్ములు ఇతనికి బ్రహ్మజిజ్ఞాసను కల్గించాలని అనుకొని హంసలరూపంలో రాత్రిపూట ఈయనకు దగ్గరగా పోతూ ఇద్దరిలో ఒకడు మరొకనితో మాట్లాడుతూ ఇట్లాగా అన్నాడు. ఓఓ భల్లాక్ష! భల్లాక్ష! పౌత్రాయణుడైన జానశ్రుతియొక్క ప్రభావము స్వర్గము దాకా పాకింది. రాత్రివేళ కూడా పగటిపూటవలె అతని కాంతి అంతటా వ్యాపించి ఉన్నది. ఆయనకు మరీదగ్గరనుంచి పోబోకు. ఆయన కాన్తి నిన్ను దహించవచ్చును సుమా అని. ఈవిధంగా జానశ్రుతిని పొగడుతున్న మాటను విని మరొక హంస బదులు పలికింది. ఓ కమ్వరా! ఇతడిని సత్పురుషుడై బ్రహ్మోపాసకుడయ్యి పరమ ఆస్తికుడైన ఎప్పుడూ బండితో ప్రయాణము చేసే గుణశ్రేష్ఠుడైన రైక్వుని వలె గొప్పగా చెపుతున్నావు? అని అన్నాడు. దాని ఉద్దేశము ఇది. "**కంసన్తమేనం**" ఏదో ఒక సమ్పద కల్గి ఉన్న ఈ జానశ్రుతిని బండి కల్గియున్న గుణశ్రేష్ఠుడైన, బ్రహ్మజ్ఞానము కల్గి ఉన్న రైక్వుడివలె ఇతడినిన్నీ గుణ వంతుడి వలె చెప్తున్నావు. ఆ బ్రహ్మజ్ఞుడైన రైక్వుడే లోకంలో మిక్కిలి గుణవంతుడు. గొప్ప ధార్మిక

గుణము ఉన్నప్పటికీ బ్రహ్మజ్ఞానము లేని ఈ జానశ్రుతికి ఉన్న గుణము ఎంతపాటిది? ఎవనియొక్క గుణము వల్ల పుట్టిన తేజస్సు రైక్వుని యొక్క తేజస్సు వలె నన్ను కాల్చివేస్తుంది అని అంటున్నావు అని అర్థము. ఇట్లా పలికిన తర్వాత అవతలి పక్షి ఎవరీ రైక్వుడు అని అడిగితే **లోకంలో ఏదైనా మంచికర్మచేయబడితే అది, సర్వచేతనులలో గల విజ్ఞానమేమున్నదో ఆ రెండున్నూ జ్ఞానకర్మలు ఎవని కర్మజ్ఞానాలలో ఒక భాగంగా పరిగణింపబడుతవో అటువంటి కర్మజ్ఞానాలను కల్గినవాడు రైక్వుడు** అని చెప్పినాడు. ఈ విధంగా ఉన్న హంసవాక్యాన్ని విన్న జానశ్రుతి తనకు బ్రహ్మజ్ఞానము లేదు కాబట్టి తనను నిందించు తున్నదిగాను, బ్రహ్మజ్ఞానము కలవాడైనందువల్ల రైక్వుడిని ప్రశంసించేదిగానూ ఉన్నదని తలచి వెనువెంటనే ఒకరాజభటుడిని రైక్వుడిని తెల్సుకొని రమ్మని పంపించి, అతడు తెల్సుకొని రాగానే స్వయంగా తాను రైక్వుడి వద్దకుపోయి ఆరువందల ఆవులు ఆరువందల బంగారు నాణాలు కంచరగాడిదలను కట్టిన రథాన్నినీ రైక్వుడికి కానుకగా సమర్పించి, రైక్వుడిని ప్రార్థించినాడు. **ఓ భగవన్తుడా! నీవు ఏదేవతను ఉపాసించుతున్నావో ఆ దేవతను గురించి నాకు తెలియజెయ్యి. అని నీవు** ఉపాసించే పరదేవతను నాకు తెలియచెయ్యి అని అర్థము. ఆ రైక్వుడు కూడా తన మహిమతో ముల్లోకాలలోని విషయాలనన్నింటినినీ తెల్సుకున్న వాడు గనుక ఈ జానశ్రుతి హంసల వల్ల తనకు బ్రహ్మజ్ఞానము లేనందువల్ల అనాదరముగా మాట్లాడిన వాక్యాల వలన శోకావిష్టుడైనవాడు. దాని తర్వాతనే బ్రహ్మను తెల్సుకోవాలనే కోరికతో ఈ విధమైన పూనికను కలిగి తన దగ్గరకు వచ్చినాడని, ఇతనికి బ్రహ్మవిచారము చేయడానికి తగిన యోగ్యత ఉన్నదనినీ తెల్సుకొని చాలాకాలము సేవచేయకుండా దానికి బదులుగా కొంతద్రవ్యాన్ని సమర్పించుట ద్వారా తనకున్న శక్తిననుసరించి ద్రవ్యసమర్పణ చేస్తేనే కాని బ్రహ్మ విద్య అతడికి నిలువదని తలచి, ఆయనను అనుగ్రహించుతూ అతడు శోకముతో కూడియుండుటను, అట్లాగే బ్రహ్మవిద్యను ఉపదేశించుటకు తగిన యోగ్యతను కల్గియుండుటనూ వెల్లడించే శూద్రశబ్దముతో పిలుస్తూ సంబోధించి ఈ విధంగా పలికినాడు. **అహహ అరే త్వాశూద్ర తవైవ సహగోభిరస్తు** అని. ఓ శూద్ర! ఈ ఆవులతో పాటు రథాన్ని కూడా నీవే ఉంచుకో! ఇంత మాత్రమే నాకు సమర్పించినందువల్ల బ్రహ్మ జిజ్ఞాసతో శోకావిష్టుడవైన నీకు బ్రహ్మ విద్య నిలువదు. అని అర్థము. ఆ జానశృతి తిరిగి తన శక్తికి తగినట్లుగానే ఆవులు, ధనము, కన్యనున్నూ సమర్పించి ఆయన వద్దకు పోయి వేడుకున్నాడు. రైక్వుడు ఇప్పుడు కూడా అతని యోగ్యతను ప్రకటించుతూ శూద్ర శబ్దముతో సంబోధించి

పిల్చుతూ ఈ విధంగా పలికినాడు. ఓ **శూద్రుడా! వీటిద్వారా నన్ను పలుకరించడానికి, సంభాషించడానికి వీటినన్నింటినీ తెచ్చినావు** అని. ఈ ధనాలను నీ శక్తికి తగినట్లు తీసుకొని వచ్చినావు. వీటి ద్వారానే చాలకాలము సేవచేయకుండానే నాతో నీవు కోరిన బ్రహ్మోపదేశరూపమైన వాక్యాలను పలికించడానికి ప్రయత్నిస్తున్నావు. అని పలికి ఆయనకు బ్రహ్మోపదేశాన్ని చేసినాడు. ఇందువల్ల శూద్ర శబ్దమును ప్రయోగించి అతడియొక్క బ్రహ్మవిద్యోపదేశయోగ్యతను ప్రకటించినారు తప్ప నాలుగవ వర్ణానికి చెందినవాడు అనికాదు.

సూ॥ **క్షత్రియత్వగతేశ్చ 1-3-34** క్షత్రియుని యొక్క పోకడలు కనిపించు తున్నందువల్ల కూడా. **బహుదాయీ** పలురకాలైన ధనధాన్యాదులను సమృద్ధిగా ఇచ్చినటువంటివాడు అని దాతృత్వము కలవాడు గాను, **బహుపాక్యః** అనే దానితోనూ **సర్వత ఏవమే అన్నమత్స్యన్తి** అన్నిచోట్లా నేను పెట్టించుతున్న ఆహారాన్నే తింటున్నారు. అనువాక్యము చివరగా కల్గిన దానితో పలురకాలైన వండిన అన్నాలను / వంటకాలను పంచిపెడుతున్నట్లు తెలుస్తున్నందువల్ల **సహ సంజిహాన ఏవక్షత్తారమువాచ** ఆయన ఆసనాన్నుంచి పైకి లేస్తూనే రాజభటుడితో పలికినాడు కదా! అని క్షత్తను పంపించడం ద్వారానూ, చాలా గ్రామాలను అగ్రహారాలుగాను సేవలు చేసినందున ఇచ్చినట్లు తెలియవస్తున్నది కనుక జనపదానికి అధిపతి అనే విషయం తెలుస్తున్నందువల్ల ఈ జానశ్రుతి క్షత్రియుడనే విషయము తోస్తున్నది కాబట్టి జానశ్రుతి శూద్రుడు కాదు. శోకావిష్టుడు మాత్రమే.

ఈ విధంగా ఆరంభములో చెప్పబడిన చిన్న కథ యందు క్షత్రియుడు జానశ్రుతి అని తెలియజేయబడింది. ఇక ఉపసంహారములో నున్న ఆఖ్యాయికలోనూ ఇతడికి క్షత్రియత్వము ప్రతీయ మానమవుతున్నదని చెప్పుతున్నాడు –

సూ॥ **ఉత్తరత్ర చైత్రరథేనలింగాత్ 1-3-35** ఈ జానశ్రుతికి ఉపదేశింపబడుతున్న ఈ సంవర్గ విద్యయందే తరువాతి భాగములో కీర్తింపబడుతున్న అభిప్రతారి అనే పేరు గల చైత్రరధుడు అనే క్షత్రియుడితో కలసి ఉండడము అనే కారణంగా ఇతడు కూడా క్షత్రియుడు అనియే తెలుస్తున్నది. ఎట్లాగంటే! **అథహ శౌనకంచ కాపేయమ్ అభిప్రతారిణమ్ చ కాక్షసేనిమ్ పరివిష్యమా ణౌ బ్రహ్మచారీబిభిక్షే.** తరువాత కాపేయుడైన శౌనకుడిని కాక్షసేనుడైన అభిప్రతారినిన్నీ విస్తరిలో అన్నము

వడ్డించుచుతుండగా ఒకానొక బ్రహ్మచారి భిక్షమును పెట్టుమని అడిగినాడు. ఇత్యాది వాక్యముచేత **బ్రహ్మచారిన్నేదముపాస్మహే** ఓ బ్రహ్మచారీ! మేము దీనిని ఉపాసించుతూ లేము. అనేది చివరగా కలవాక్యము చేతనూ కాపేయుడు అభిప్రతారి అను ఇద్దరికీ, భిక్షను కోరుతున్న బ్రహ్మచారికిన్నీ సంవర్గ విద్యతో సమ్బన్ధము ఉన్నట్లు తెలుస్తున్నది. వారిలో అభిప్రతారి క్షత్రియుడు. మిగిలిన ఇద్దరూ బ్రాహ్మణులు. ఇందువలన ఈ విద్యలో బ్రాహ్మణునికి, ఇతరులైన వారిలో వైశ్యశూద్రులు తప్ప క్షత్రియుడికి మాత్రమే అన్వయము / సమ్బన్ధము తోచుతున్నది. కానీ శూద్రుడికి సంబన్ధము లేదు. ఇందువల్ల ఈ సంవర్గ విద్యయందు సమ్బన్ధము కల బ్రాహ్మణుడైన రైక్వుడికంటే వేరయిన జానశ్రుతికి కూడా క్షత్రియత్వమే తగినది. కానీ నాలుగవ వర్ణమైన శూద్ర సమ్బన్ధము కాదు. ఏమండీ! ఈ ప్రకరణములో అభిప్రతారి అనబడేవానికి చైత్రరథత్వము క్షత్రియత్వమున్నూ వినిపించడం లేదు. అందువల్ల ఈ అభిప్రతారికి చైత్రరథత్వము గానీ క్షత్రియత్వముగానీ ఎట్లాగా సిద్ధించుతున్నది? అని అంటే దానికి సమాధానమే సూత్రములో చెప్పబడిన లింగాత్ అనేది. **అథహ శౌనకంచ కాపేయమభిప్రతారిణంచ కాక్షసేనిం** కాపేయుడైన శౌనకుడిని, కాక్షసేనుడైన అభిప్రతారినిన్నీ అని చెప్పబడిన వాక్యము ద్వారా అభిప్రతారికి కాపేయుడితో సాహచర్యము. సాహచర్యము అనగా ఇద్దరూ కలిసి ఒక్క గురువుగారి వద్ద అధ్యయనము చేయడము కాపేయుడితో కలసి చదివినందున ఇతడికి క్షత్రియత్వము సిద్ధించుతున్నది. అనే లింగము / గుర్తుతో ఈ అభిప్రతారికి కాపేయుడితో సమ్బన్ధమున్నట్లు తెలుస్తూ ఉన్నది. మరొకచోటకూడా **ఏతేనవై చైత్రరథమ్ కాపేయాః అయాజయన్** ఈ కారణంగా చైత్రరథుడితో కాపేయులు యజ్ఞాన్ని చేయించినారు అని కాపేయుడితో సమ్బన్ధమున్న వారికి చైత్రరథత్వము వినిపిస్తున్నది. ఆ విధంగా చైత్రరథుడికి క్షత్రియత్వము తెలుస్తున్నది. **తస్మాత్ చైత్ర రథీనామేకః క్షత్రపతి రజాయత** అందువలన చైత్రరథులలో (చిత్రరథుడితో సమ్బన్ధము కల వారిలో) ఒకడు క్షత్రపతి అయినాడు. ఇందువల్ల అభిప్రతారికి చైత్రరథత్వము క్షత్రియత్వమున్నూ తెలియవస్తున్నవి.

ఆ విధంగా న్యాయానికి విరుద్ధంగా శూద్రుడికి బ్రహ్మోపాసన చేసే అధికారము ఉన్నది అని అనడానికి లింగము / గుర్తు లభించడం లేదు అని చెప్పబడింది. ఇపుడు న్యాయసిద్ధమైన, శూద్రుడికి అధికారము లేదు అనే ముచ్చట శ్రుతులు, స్మృతుల ద్వారా తెలుస్తున్నది అని చెపుతున్నాడు.

సూ॥ **సంస్కార పరామర్శాత్ తదభావాభిలాపాచ్చ 1-3-36** ఉపనయన సంస్కారాన్ని గురించి పరామర్శించుట, దానికి అధికారము లేదనుటవల్ల కూడా. బ్రహ్మ విద్యను ఉపదేశించే సందర్భాలలో ఉపనయన సంస్కారాన్ని గురించి పరామర్శ చేయబడుతున్నది. **ఉపత్వానేష్యే** నిన్ను నేను దగ్గరకు తీసుకుంటాను. **తం హ ఉపనిన్యే** అతడిని తనవద్దకు చేర్చుకున్నాడు. ఇత్యాది వాక్యాలయందు శూద్రుడికి ఉపనయన సంస్కారం లేకపోవడం చెప్పబడుతున్నది. **నశూద్రే పాతకంకించిన్నచ సంస్కార మర్హతి** శూద్రుని యందు ఎటువంటి పాతకము అనగా సంధ్యావందనాదులు లేని / చేయని కారణంగా వచ్చే పాపము లేదు ఐనా ఉపనయన సంస్కారానికి అర్హుడు కాడు. **చతుర్థో వర్ణః** ఏకజాతిర్నచసంస్కార మర్హతి ఏకజాతి అనగా ఒకేపుట్టుక కల్గి ఉండుట రెండు జన్మలు కలది కాదు. బ్రాహ్మణాదులకు పుట్టుకతో ఒక జన్మ ఉపనయన సంస్కారముతో రెండవ జన్మ వస్తుంది. **ఏకజాతి ర్న చసంస్కారమర్హతి.** నాలుగు వర్ణాలలో ఒక్క జాతికి మాత్రమే సంస్కారము లేదు. ఇత్యాదివాక్యాలలో.

సూ॥ **తదభావనిర్ధారణే చ ప్రవృత్తేః 1-3-37** శూద్రుడు కాదని నిర్ధారణ చేసుకోవడంలో పూనుకోవడం చేతనున్నూ. **నైత దబ్రాహ్మణో వివక్తుమర్హతి. సమిధం సోమ్యాహర.** దీన్ని బ్రాహ్మణుడు కానివాడు వివరించజాలడు. ఓ సోమ్యుడా సమిధలను / మోదుగుపుల్లలను తీసుకొనిరా! అని బ్రహ్మవిద్యను తెలుసుకో గోరిన జాబాలికి శూద్రత్వము లేదని నిర్ధారణ అయ్యినాకనే బ్రహ్మవిద్యను ఉపదేశించడానికి పూనుకోవడంవల్ల శూద్రుడికి అధికారము లేదని తెలుస్తున్నది.

సూ॥ **శ్రవణాధ్యయన అర్థప్రతిషేథాత్ 1-3-38** వేదాన్ని వినడము, చదువడము, అర్థాన్ని తెల్సుకోవడాలను నిషేధించినందువల్ల. శూద్రుడికి వేదాన్ని వినడము, దాన్ని చదువడము, దాని అర్థాలైన అనుష్ఠానాలు నిషేధింపబడుతున్నాయి. **పద్యు హవా ఏతత్ శ్మశానం. యచ్ఛూద్రః తస్మాత్ శూద్రసమీపే నాధ్యేతవ్యమ్.** ఈ శూద్రుడు నడుస్తూ ఉన్న శ్మశానము. అందువలన అతడి వద్ద వేదాన్ని చదువకూడదు. **తస్మాత్ శూద్రో బహుపశుః అయజ్ఞీయః** అందువల్ల శూద్రుడు పశువుతో సమానుడు. గౌరవింపదగినవాడు కాడు. **బహుపశుః** పశువుతో సాదృశ్యము కలవాడు అని అర్థము. ఆచార్యులవద్ద వినని వానికి అధ్యయనము చేయడము, దాని అర్థాన్ని తెలుసుకోవడము, దాని అర్థమైనవాటిని ఆచరించడమున్నూ జరుగవు. ఇందువల్ల అవన్నీ కూడా నిషేధింపబడినట్టివే.

సూ॥ **స్మృతేశ్చ 1–3–39** స్మృతులు కూడా నిషేధించుతున్నవి కాబట్టి. శ్రవణాది నిషేధము స్మరింపబడుతున్నది – **అథహాస్య వేదముపశృణ్వతః త్రపుజతుభ్యామ్ శ్రోత్రప్రతిపూరణమ్. ఉదాహరణే జిహ్వాచ్ఛేదః ధారణే శరీరభేదః** వేదమును వింటున్న విన్న శూద్రుడికి సీసము, తగరములతో చెవులను నింపాలి. వినరాకుండా మూసివేయాలి. విన్నదాన్ని నోటితో పలికి ఉదాహరించితే నాలుకను కోసివేయాలి. బుద్ధిలో నిలుపుకుంటే శరీరాన్ని ముక్కలుగా చేయాలి. (తల నరకాలి) అని, **నచాస్యోపదిశేద్ధర్మమ్ నచాస్య వ్రతమాదిశేత్.** ఇతనికి ధర్మాన్ని / కర్మను ఉపదేశించకూడదు. ఇతడికి వ్రతాలనున్నూ చేయుమని ఆదేశించకూడదు అని కూడా స్మృతులలో చెప్పబడింది. ఇందువల్ల శూద్రుడికి అధికారము లేదని సిద్ధమైంది.

ఎవరైతే నిర్విశేష చిన్మాత్రం బ్రహ్మనే పరమార్థము ఆయన కంటే వేరుగా ఉన్నట్టు కనిపించుతున్నదంతా మిథ్యనే. అది ఉన్నట్లు కనిపిస్తుంది. కానీ నిజంగా ఆలోచిస్తే అది ఉన్నది సత్తుకాదు. బంధము కూడా పరమార్థము కాదు. అది ఏకమేవాద్వితీయం బ్రహ్మ, తత్త్వమసి ఇత్యాదివాక్యాల చేత పుట్టిన, వస్తువుయొక్క యథార్థస్థితిని తెలిపే జ్ఞానము చేతనే తొలగిపోతుంది. ఆ విధంగా బన్ధము తొలగిపోవడమే మోక్షము అని చెప్పుతున్నారో వారు బ్రహ్మజ్ఞానవిషయములో శూద్రుడికి అధికారములేదు అని చెప్పలేరు. ఉపనయన సంస్కారము లేక, వేదాన్ని చదువక, వేదాన్త వాక్యాలను దాని అర్థాన్ని గురుముఖతః వినక ఎవడో ఒకడి ద్వారా ఎట్లాంటి విశేషాలు లేక కేవలజ్ఞానము మాత్రమే బ్రహ్మ. ఆయనే పరమార్థము. తక్కినదంతా ఆ బ్రహ్మయందే కల్పించబడింది. మిథ్యయైనది. అని తెలిపే సాధారణ వాక్యము వలన వస్తువు యొక్క యథార్థాన్ని తెలిపే జ్ఞానము పుడుతున్నది. అంతమాత్రము చేతనే బన్ధము కూడా తొలగిపోతుంది. కనుక ద్విజాతులు మాత్రమే ఉపనయన సంస్కారాన్ని పొంది వేదాధ్యయనం చేసి వేదాన్త వాక్యార్థ విచారణ చేసి బ్రహ్మజ్ఞానము పొందాల్సిన అవసరము లేదు. శ్రమ లేకుండా ఎవరో ఒకరి మాటతో జ్ఞానము కలిగి బంధాన్నుండి విముక్తుడవుతూ ఉంటే ఈ జంఝాటాన్నంతా నెత్తిన పెట్టుకొని బాధపడవలసిన అవసరమేమున్నది? ఐతే తత్త్వమసి ఇత్యాది వాక్యము వల్లనే జ్ఞానోత్పత్తి జరుగుతుంది. వేరే వాక్యాల వల్ల కాదు అని నియంత్రించడం తగదు. జ్ఞానము అనేది ఏ ఒక్క పురుషుడిచేతిలో మాత్రమే ఉండేదికాదు. అందుకు తగిన సామగ్రి – ఉపకరణాలు –

ఉన్నప్పుడు వ్యక్తి కోరుకోకున్నా జ్ఞానము పుడుతుంది. వేదవాక్యాలవల్లనే వస్తువు యొక్క యథార్థ జ్ఞానము పుడితేనే బంధము తొలగిపోతుంది. అని కూడా చెప్పవీలులేదు. ఏదో ఒక విధంగా వస్తువు యొక్క యథార్థస్థితి తెలియగానే భ్రాన్తి తొలగిపోతుంది కదా! ఎట్లాగంటే ఆప్తుడైన ఒక పురుషుని యొక్క మాటతో ముత్యపు చిప్ప యందు వెండి అనే భ్రాన్తి బ్రాహ్మణుడికి గాని శూద్రుడికైనా సమానంగానే తొలగిపోతుంది కదా! అదే తీరుగా శూద్రుడికి కూడా వేదము తెల్సిన సంప్రదాయ పరుడైన వానియొక్క వాక్యముతో వస్తుయాధాత్మ్య జ్ఞానము కల్గి దానితోనే జగత్తు అంతా ఉన్నదనే భ్రమనే కాని నిజము కాదు అని తెలిసి భ్రమతొలగిపోగలదు. **న చా స్య ఉపదిశేద్ధర్మమ్** ఈ శూద్రుడికి ధర్మాన్ని ఉపదేశించకూడదు. ఇత్యాది నిషేధము ఉన్నది కనుక వేదవేత్తలు శూద్రాదులకు జ్ఞానప్రబోధము చేయరు అని అనడానికి వీలులేదు. తత్త్వమసి మొదలైన వాక్యాలవల్ల తానే బ్రహ్మ అని తెల్సిపోయినందువల్ల వేదము యొక్క శిరస్సు పైన ఉండేవారవడం చేత అధికారాలు చేసే వారెవ్వరూ లేక అవన్నీ తగులబడి పోయినందువల్ల నిషేధ శాస్త్రానికి వారు కింకరులు కారు. కనుక వారు శాస్త్రానికి లొంగక స్వేచ్ఛగా ప్రవర్తించవచ్చును. లేదా నిషేధ శాస్త్రాన్ని ఉల్లంఘించే స్వభావమున్నవారెవరైనా బ్రహ్మ ఒక్కటే సత్యము. జగత్తు భ్రమ మాత్రమే. అది యథార్థము కాదు అని గనుక ఉపదేశించితే దానితో శూద్రాదులకు జ్ఞానము తప్పక పుడుతుంది. ఐతే ముత్యపు చిప్పయందు వెండి ఉన్నదనే భ్రమ తొలగిపోయినట్లుగానే పురుషులు మాట్లాడే వాక్యాల వల్ల పుట్టిన తత్వజ్ఞానము తరువాత శూద్రుడికి జగద్భ్రమ తొలగిపోదు అని అనకూడదు. మీరన్నదే నిజమైనప్పుడు తత్త్వమస్యాదివాక్యాలను విన్న తరువాత కూడా బ్రాహ్మణుడికి కూడా జగధ్భ్రమ తొలగిపోవడం లేదు కదా! నిధి ధ్యాసనముతో ద్వైతవాసన తొలగిపోయినప్పుడే తత్త్వమస్యాది వాక్యము నివర్తకజ్ఞానాన్ని పుట్టించుతుంది అని అంటావా? ఐనప్పుడు వేదవాక్యము కాక పౌరుషేయ వాక్యం కూడా శూద్రాదులకు నీవు చెప్పినట్లే నివర్తక జ్ఞానాన్ని కలిగించ కలుగుతుంది. కనుక విశేషము / ప్రత్యేకత ఏమీ ఉండబోదు సుమా! నిదిధ్యాసనం అంటే బ్రహ్మాత్మభావాన్ని – నేనే బ్రహ్మను అనే భావాన్ని – బోధించే వాక్యము ఏ అర్థాన్ని ప్రతిపాదించడానికి తగినదో దానియొక్క అర్థాన్ని తలచుకోవడం, లేక ఊహించడము. అదే విపరీత వాసనను – బ్రహ్మ సత్యము జగత్తు మిథ్య అని ఉండగా దానికి బ్రహ్మ లేదు ప్రపంచమే ఉన్నది అనే ఆలోచనను

– తొలగిస్తుంది. అని నిది ధ్యాసనము చేయవయ్యా అని ధ్యానవిధికి దృష్టార్థత్వాన్ని అనగా విపరీత వాసన తొలగి పోవడాన్ని చెప్పుతున్నావా? ఐతే వేదానువచనాదులు – వేదాధ్యయనాన్ని చేయడము మొదలైనవి – వివిదిషా – తెల్సుకోవాలనే కోరికను పుట్టించడములో తోడుపడుతవి. అని అన్నట్లయితే శూద్రుడికి కూడా పూర్వ జన్మలో చేసిన సుకృతము వలన ఈ జన్మలో బ్రహ్మను గురించి తెల్సుకోవాలనే కోరిక కలిగినప్పుడు వేదవాక్యము వల్లకాక పౌరుషేయవాక్యము వల్ల, నిషేధవాక్యాన్ని ధిక్కరించి ప్రవర్తించే వారియొక్క మాటల వల్ల, నిది ధ్యాసనాదుల వల్ల, విపరీత వాసన తొలగిపోతే బ్రహ్మజ్ఞానము పుడుతుంది. దానితో పరమార్థము కాని బన్ధము తొలగిపోగలదు.

లేదా తర్కముతో కూడిన ప్రత్యక్షము – కార్యకారణసమ్బన్ధాన్ని ఊహించడమే తర్కము – లేదా అనుమాన ప్రమాణము వలననున్నూ విశేషాలు ఏమీలేని స్వయం ప్రకాశము కల్గిన జ్ఞానమే అయిన ప్రత్యగ్వస్తువు నందు – ఆత్మయందు – అజ్ఞానానికి సాక్షిగా ఉండడము – ఆ అజ్ఞానము వలన పుట్టిన వివిధము, వింత వింతలూ ఐన జ్ఞాత జ్ఞేయము మొదలైన భేదాలతో కూడి ఉన్న సమస్త జగత్తూ ఆరోపింప బడి ఉన్నది అని నిశ్చయాన్ని చేసుకొని, ఇట్లాగా అజ్ఞానంతో కూడి ఉన్న పరిశుద్ధుడైన ప్రత్యగాత్మ (జీవుడి) యందు ఎడతెగకుండా తలచు కోవడంతో విపరీత వాసనను తోసిపారేసి ఆ ప్రత్యగ్వస్తువునే సాక్షాత్కరించుకొని శూద్రాదులున్నూ బన్ధాన్నుండి విడిపించుకోబడగలరు. కనుక మిథ్య ఐన విచిత్ర ఐశ్వర్యము, విచిత్ర సృష్టి మొదలైన అలౌకిక అనన్త విశేషాలను పట్టుకొని వ్రేళ్ళాడుతున్న వేదాన్త వాక్యముచేత ఎంతమాత్రమూ ప్రయోజన మిక్కడ కనబడుటలేదు. కనుక శూద్రాదులకే బ్రహ్మవిద్యయందు అధికారము సులభంగా చేజిక్కుతున్నది. కనుక ఈ పద్ధతి ప్రకారమే బ్రాహ్మణాదులకు కూడ బ్రహ్మజ్ఞానము లభించుతున్నది కనుక దేశకాలవ్రతములు మొదలైన అనేక నియమాలతో కూడి తపస్విని – శోచనీయ – ఐన ఉపనిషత్తు మూడు దోసిళ్ళ నీళ్ళు ఇచ్చి వదిలిపెట్టదగినదే కాగలదు.

సహజమై అనాదిగా వస్తూ ఉన్నలోక వ్యవహారములో భ్రమించుతున్న ఈ జీవుడికి ఎవరో ఒకాయన ఎదురుపడి ఈ లోక వ్యవహారమంతా వట్టి భ్రమ. పరమార్థమైతే ఇది సుమా! అని చెప్పినప్పుడే ప్రత్యక్షంగా ఉన్న లోకాన్ని అనుమానించదగిన – ఊహించదగిన పరమార్థాన్ని తెల్సుకోవడానికి కోరిక కల్గుతుంది. కనుక ఆ విషయాన్ని

తెలుపడానికి వేదము కూడా ఉండితీరాలి అని అనకూడదు. ఎందువల్ల నంటే పుట్టడం, దుఃఖాలననుభవించడము, చావడము అనే సంసారదుఃఖాలకు భయపడిన వారికోసము సాంఖ్యులు మొదలైనవారు ప్రత్యక్ష అనుమాన ప్రమాణాల సాయంతో వస్తువులయొక్క యథార్థ స్వరూపాన్ని నిరూపణమును చేస్తూన్నవారై ప్రత్యక్షానుమాన ప్రమాణాలయొక్క యథార్థస్థితి తెల్సుకోవాలనే కోరికను పుట్టిస్తున్నారు. ఆ తీరుగ బుభుత్స కల్గిన తరువాత ఆ ప్రత్యక్ష అనుమాన ప్రమాణాలచేతనే నిత్యము, శుద్ధము స్వప్రకాశము, అద్వితీయము, కూటస్థము ఐన చైతన్యమే సత్తు. తక్కినది. అంతా సత్తుపైననే ఆరోపించబడింది. అని సులభంగా ఆలోచించుకోవచ్చు. ఇప్పుడే చెప్పిన స్వయంప్రకాశమైన వస్తువులో వేదము ద్వారా మాత్రమే తెల్సుకోదగిన మరొక విశేషము ఉన్నదని మేము తలచడం లేదు. అందువలన ఒప్పుకోబోము కూడా. నీ అభిప్రాయము ప్రకారము ఆ శ్రుతి అధ్యస్తమైన (ద్రై) దానికి సహజము కాని రూపాన్ని తొలగించేది మాత్రమే కదా! సత్తుఐన ఆత్మ ఆనందరూపమును కలది. దాన్ని తెల్సుకోవడానికి ఉపనిషత్తు ఉండితీరాలి అని అనకూడదు. ఆత్మ కేవలము జ్ఞానమే రూపము గలది కావున దానితోనే సకల ఇతర జ్ఞానము కంటే వేరుగా ఉన్న రూపాలన్నీ తొలగిపోయినందువల్లనే అది ఆనందరూపమవుతున్నది కాబట్టి మళ్ళీవేదమంటూ ఒకటి ఉండి ఆత్మ అనేది ఆనందరూపము అని చెప్పవలసిన పనిలేదు.

ఎవరికైతే మోక్షాన్ని సంపాదించిపెట్టేది వేదాన్తవాక్యాల చేత విధింపబడిన జ్ఞానము ఉపాసనారూపమై ఉంటున్నదో అది పరబ్రహ్మ ఐన పరమపురుషుడిని సంతోషపర్చడమే. అది కేవలము వేదశాస్త్రము చేత మాత్రమే తెలుస్తుంది. ఉపాసన శాస్త్రము కూడా ఉపనయనాదులతో సంస్కరింపబడి చదివిన స్వాధ్యాయము వల్ల పుట్టిన జ్ఞానము. అది వివేకవిమోకము మొదలైన సాధనాలతో సహకరింపబడినదైతేనే తనకు ఉపాయముగా స్వీకరిస్తుంది. ఇట్లాగా ఉండిన ఉపాసన చేత సంతోషపడిన పురుషోత్తముడు తనను ఉపాసించిన వాడికి సహజమైన ఆత్మయాథాత్మ్య జ్ఞానాన్ని ఇచ్చి కర్మలవల్ల పుట్టిన అజ్ఞానాన్ని నశింపచేస్తూ బన్ధాన్నుండి విడిపించుతాడు. అని ఎవరి పక్షమో వారికి ఇప్పటివరకూ చెప్పిన న్యాయము ప్రకారము శూద్రాదులకు అధికారము లేదనుట బాగుగా పొసగుతుంది. **ఇది అప శూద్రాధికరణము**

★ ★ ★

## ఇక ప్రమితాధికరణశేషము

**ఇక్కడ నుండి ప్రమితాధికరణములో మిగిలిన భాగము.** ఈ విధంగా ప్రసంగాన్ని బట్టి నడుమ వచ్చిన ఉపాసనాధికారము ఉన్నదా? లేదా? అనే విషయాన్ని ముగించి ప్రస్తుతము ఐన అంగుష్ఠము అంతమాత్రమే ఉన్న భూతభవ్యాలకు ఈశ్వరుడై నందువల్ల పరబ్రహ్మగా గుర్తింపును పొందిన వానిని సమర్థించే మరొక్క హేతువును చెప్పుతున్నాడు.

సూ॥ **కమ్పనాత్ 1-3-40** అంగుష్ఠమాత్రుడిని చూచి వణుకుతున్నందువల్ల. **అంగుష్ఠమాత్రో పురుషో మధ్యే ఆత్మని తిష్ఠతి** బొటనవ్రేలు అంతటి పురుషుడు ఆత్మకు నడుమ ఉంటున్నాడు. **అంగుష్ఠ మాత్రః పురుషోఽన్తరా త్మా.** అంగుష్ఠమంతటి పురుషుడు అన్తరాత్మ. అనే ఈ రెండు వాక్యాలకు నడుమ **యదిదంకించ జగత్ సర్వం ప్రాణ ఏజతినిస్సృతమ్. మహద్ భయం వజ్రముద్యతం యఏవం విదుర మృతాస్తే భవన్తి. భయా దగ్నిస్తపతి భయాత్తపతి సూర్యః భయాదింద్రశ్చ వాయుశ్చ మృత్యు ర్ధావతి పంచమః.** ఈ కనిపించేది ఏదైతే ఉన్నదో అంతా కూడా ప్రాణశబ్దవాచ్యుడైన పరమాత్మనుండే పుట్టింది. అది అంతా ఆయనను చూచి వడవడ వణుకుతున్నది. మిక్కిలి భయంకరమైన వజ్రాన్ని తమమీదకు ప్రయోగించడానికి ఎత్తబడినదా? ఏమి? అని భయపడుతున్నారు. ఈ విషయాన్ని తెల్సుకున్నవారు ఆనందరూపమైన మోక్షాన్ని పొందుతున్నారు. ఆయన వల్ల భయంతో అనగా తమ విధులను సక్రమంగా నిర్వహించకపోతే ఏమి ముప్పు ముంచుకొని వస్తుందో అనే భయంతో కర్తవ్య పరాయణులై ఉంటున్నారు. ఈ భయం వల్లనే అగ్ని సూర్యులు తపించుతున్నారు (వేడిమిని వెలుతురునూ పుట్టిస్తున్నారు) అదేవిధంగా ఇంద్రవాయువులున్నూ తమతమ పనులను పూర్తిచేయడానికి ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ఇక ఐదవవాడైన మృత్యువు కూడా పరుగెత్తిపోతున్నాడు. అని సమస్త జగత్తూ అగ్నిసూర్యాదులున్నూ ఈ అంగుష్ఠ మాత్రుడైన ప్రాణశబ్దము చేత వ్యవహరింపబడే వానిపై ఆధారపడి ఉంటున్న, ఆయననుండే పుట్టుకొచ్చిన వారందరికిన్నీ ఆయననుండే గొప్పభయము కల్గినందువల్ల ఏ జనమ్ – కంపనము వణుకు వినిపించుతున్నది. ఆయన ఆజ్ఞను ఉల్లంఘించితే ఏమి కానున్నదో అనే గొప్పభయంతో ప్రయోగించడానికి పైకి ఎత్తబడిన వజ్రాన్ని చూచినట్లుగానే సమస్త ప్రపంచమున్నూ వణుకుతూ ఉన్నది అని

అర్థము. **భయాదగ్నిస్తపతి** అనే వాక్యముతో ఏకార్థత ఉన్నందువల్ల – ఒకే అర్థాన్ని చెపుతున్నందువల్ల – **మహద్భయం వజ్ర ముద్యతం** అనే చోట పంచమీ విభక్త్యర్థములో ప్రథమా విభక్తిని ప్రయోగించినారని తెల్సుకోవాలి. ఇది పరబ్రహ్మ యొక్క స్వభావము. **ఏతస్య వాఅక్షరస్యప్రశాసనేగార్గి। సూర్యాచంద్రమసౌ విధృతౌ తిష్ఠతః 2) భీషాఽస్మాద్వాతః పవతే. భీషోదేతిసూర్యః భీషాఽస్మాదింద్రశ్చాగ్నిశ్చమృత్యుర్ధావతి పంచమః** అని చెప్పబడిన తన శాసనానికి అనుగుణంగా అందరినీ నడిపించడం అనే ఐశ్వర్యం – పరబ్రహ్మఐన పురుషోత్తముడిదేనని తెలుస్తున్నది. ఇందువలన కూడా అంగుష్ఠ ప్రమితుడు పురుషోత్తముడే –

సూ॥ **జ్యోతి ర్దర్శనాత్. 1-3-41** పరంజ్యోతిగా కనిపించుతున్నందువల్ల. ఆ అంగుష్ఠ ప్రమితుడైన వాడికే చెందిన రెండు వాక్యాల నడుమ పరబ్రహ్మకే అసాధారణమైనది సర్వతేజస్సులను కప్పివేసేటటువంటిది. సూర్యాగ్ని చంద్ర తారకాదులకు కారణమైనట్టిది, వారికి తగిన తేజస్సును ప్రసాదించేది ఐన అంగుష్ఠప్రమితుడైన వానియొక్క జ్యోతి కనిపించుతున్నది. **నతత్ర సూర్యోభాతి న చంద్రతారకం నేమా విద్యుతో భాన్తి కుతోఽయమగ్నిః తమేవభాన్త మనుభాతి సర్వమ్. తస్యభాసాసర్వమిదం విభాతి.** ఆ వెలుగు ముందర సూర్యుడు వెలుగడు. చంద్రుడు చుక్కలగుంపు వెలుగవు. ఈ మెరుపులూ ప్రకాశించవు ఐనప్పుడు అగ్ని ఎట్లా వెలుగగలడు. ఈ వెలుగుల ప్రపంచమంతా ఆయన యొక్క వెలుగుననుసరించే ప్రకాశిస్తున్నది. ఈ ప్రపంచమంతా ఆయన కాన్తి నుండే తాను వెలుగుతున్నది అని. ఈ శ్లోకమే అథర్వణ వేదములోనూ పరబ్రహ్మను గురించి వినిపిస్తున్నది. జ్యోతులకన్నింటికీ జ్యోతియై ఉండే పరంజ్యోతిత్వము పరబ్రహ్మకే ఉన్నదని వినిపిస్తున్నది. ఎట్లాగంటే. **పరంజ్యోతిరుపసమ్పద్యస్వేన రూపేణాభినిష్పద్యతే** పరంజ్యోతి యైన వాని వద్దకు చేరుకొని తనదైన రూపమున ఆవిర్భవించుతాడు. **తందేవాః జ్యోతిషాం జ్యోతిః ఆయుర్హోపాసతేఽమృతమ్.** ఆ జ్యోతిస్సులన్నింటికీ జ్యోతిస్సు ఐనవాడిని దేవతలు అందరూ ఆయువు, అమృతము, అని ఉపాసించుతున్నారు. **అథయదతః పరోదివోజ్యోతిర్దీప్యతే** ఇక దీనికంటే పైన ద్యులోకానికి ఆవల ఏజ్యోతి వెలుగుతూ ఉన్నదో ఇటువంటి వాక్యాలయందున్నవాడు ఇందువల్ల అంగుష్ఠ ప్రమితుడైన పరంబ్రహ్మనే. **ప్రమితాధికరణము ముగిసింది.**

★ ★ ★

## ఇక అర్థాన్తరత్వాది వ్యపదేశాధికరణము ఆరంభమవుతున్నది.

సూ॥ **ఆకాశోఽర్థాన్తర త్వాది వ్యపదేశాత్ 1-3-42** ఆకాశశబ్దవాచ్యుడు పరమాత్మనే. బద్ధముక్తావస్థలలోనున్న జీవుడికంటే అర్థాన్తరముగా/మరొకడుగా పేర్కొనబడినందువల్ల. ఛాందోగ్యము నందు ఇట్లాగా వినిపిస్తున్నది. **ఆకాశో వైనామరూప యోర్నిర్వహితా, తేయదన్తరా, తద్బ్రహ్మ తదమృతం స ఆత్మా.** ఆకాశమేకదా నామరూపాలను నిర్వహిస్తున్నది. నీలోపలకూడా ఉన్నది. ఆ ఆకాశమే బ్రహ్మ. అది ఆనందమయము -అతడు ఆత్మ. అని ఇచ్చట సంశయము. ఈ ఆకాశశబ్దము చేత నిర్దేశింపబడినవాడు ముక్తాత్మనా? పరమాత్మనా? అని. ఏది తగును అని అంటే ముక్తాత్మనే అని అంటున్నాము ఎందువల్లననేటట్లయితే చెప్తున్నాము. విను. **అశ్వఇవ రోమాణి విధూయపాపం చంద్రఇవరాహోర్ముఖాత్ ప్రముచ్య, ధూత్వాశరీరమ్ అకృతమ్ కృతాత్మా బ్రహ్మలోకమభిసంభవామి.** గుర్రము తన రోమాలను దులిపివేసుకున్నట్లే పాపాన్ని వదిలించుకొని, రాహువు నోటినుండి చంద్రుడివలె విడుదలను పొంది, అకృతమ్ అనబడే ఈ శరీరాన్ని వదలి / ప్రక్షాళన చేసుకొని కృతాత్మను అయ్యి / ఆత్మ విజ్ఞానంతో బ్రహ్మను ఉపాసించి బ్రహ్మ లోకానికి చేరుకుంటాను. అని ముక్తుడిగా శరీర పాతానన్తరము కానున్నందున, **తేయదన్తరా** నీకు లోపల నీకు తెలియకుండా ఉన్న అనిన్నీ నామరూపాలనుండి విడిపోయిన ఆ ముక్తుడినే చెప్పుతున్నందువలన **నామరూపయోః నిర్వహితా** నామ, రూపాలను నిర్వహించడంతోనూ ఆ ముక్తుడే ముక్తిని పొందకమునుపు నామరూపాలను నిర్వహించినవాడైనందువల్ల ఆ ఉపలక్షణముతో గుర్తింపదలచినట్టివాడు. అతడే కదా దేవాదిరూపాలను, వాటికి తగిన నామాలనున్నూ ఇంతకు మునుపు ధరించినాడు కదా! అట్లాంటి వాడిదే నామరూపాలనుండి విడుదలను పొందిన ప్రస్తుతమున్న ముక్తావస్థ. దానినే **తద్ బ్రహ్మ. తదమృతమ్** అని అంటున్నారు. ఆకాశమనే శబ్దము యౌగికార్థము ప్రకారము కుదించుకుపోని ప్రకాశముతో కూడి ఉన్నది కాబట్టి ముక్తాత్మయందున్నూ చక్కగా సమన్వయము అవుతుంది.

ఏమండీ! ప్రస్తుత విషయవాక్యము దహర వాక్యము యొక్క శేషము / మిగులు ఐనందున ఇక్కడి ఈ ఆకాశ శబ్దవాచ్యుడు ముక్తాత్మ కాకుండా ఆదహరపురుషుడు, పరమాత్మ, దహరాకాశము అని తోస్తున్నది కదా! ఆ ఆకాశము పరమాత్మ అని నిర్ణయించినారు కదా! అని అనుకుంటున్నారు కాని అది మీరన్నట్లు కాదు. నడుమ

ప్రజాపతి వాక్యము వచ్చి దానికి ఎడము / దూరాన్ని / విడదీయడాన్ని కల్పిస్తున్నది. ప్రజాపతి వాక్యములో కూడా ప్రత్యగాత్మ యైన జీవుడి యొక్క ముక్త్యవస్థానమైన రూపము చెప్పబడింది. దాని తరువాత కూడా **విధూయ పాపమ్** అని ఆ ముక్తావస్థలో నున్నవాడే పొగడబడినాడు / ప్రస్తావించబడినాడు. అందువల్ల ఇక్కడ ఉన్న ఆకాశ శబ్దవాచ్యుడు ముక్తాత్మనే.

అని పూర్వపక్షము ఏర్పడితే చెప్పుతున్నాము. ఆకాశః అర్థాన్తరత్వాది వ్యపదేశాత్ అని. ఆకాశము పరబ్రహ్మనే. ఎందువల్ల? అర్థాన్తరత్వాదివ్యపదేశాత్. అర్థాన్తరవ్యపదేశము అనగా **ఆకాశో హ వైనామ రూపయోర్నిర్వహితా** అని. నామరూపాలను నిర్వహించగలగడం. బద్ధుడు ముక్తుడు అనే రెండు అవస్థలలో నున్న ప్రత్యగాత్మ కంటే వేరేఒకడు అయ్యి ఉండడము అనేది ఆకాశానికి ఉపపాదిస్తున్నది. బద్ధావస్థలోనున్న వాడు స్వయంగా తాను కర్మలకు లొంగి ఉన్నవాడైనందున నామరూపాలను పొందియుంటున్నాడు కాబట్టి ఇతరులయొక్క నామమును రూపమునున్నూ నిర్వహించజాలడు. ముక్తావస్థలో ఉన్నవాడికి జగద్వ్యాపారము – సృష్టి స్థితిలయాదులను చేయడము – నిర్వహించే అవకాశము బొత్తిగా లేదు కనుక నామరూపాలను నిర్వహించగలుగడమనేది ఎంతమాత్రము సమ్భవించదు. ఈశ్వరుడు మాత్రము సకల జగత్తును నిర్మాణము చేయగల సామర్థ్యము కలవాడైనందున నామరూపాలను నిర్వహించగలడు అని వేదము చేతనే గుర్తింపబడి చెప్పబడింది. **1) అనేన జీవేన ఆత్మనా అనుప్రవిశ్యనామ రూపే వ్యాకరవాణి 2) యః సర్వజ్ఞః సర్వవిత్ యస్యజ్ఞానమయం తపః. తస్మాదేతద్ బ్రహ్మ నామరూపమన్నంచజాయతే 3) సర్వాణి రూపాణి విచిత్యధీరః నామాని కృత్వా అభివదన్ యదాస్తే** 2) ఎవడు సర్వజ్ఞుడో సర్వమును బాహ్యాభ్యన్తరాలలో ఎరిగినవాడు, ఎవని ఆలోచన జ్ఞానరూపమైనదో అతడినుండి ఈ ప్రకృతి నామరూపాలు కల జీవుడు అన్నము ఆహారము, ప్రకృతి పుడుతున్నవి. 3) అన్నిరకాలైన రూపాలను ధరించి బుద్ధితో ఆనందపడుతున్నవాడై అనేకములైన నామాలను కూడా ఏర్పరచి వాటిని ఆయా పేర్లతో పిలుస్తూ ఎవడున్నాడో ఇత్యాది వాక్యాల ద్వారా తెలియవస్తున్నది. ఇందువల్ల నిర్వహింపదగిన నామరూపాలను కల్గియున్న ప్రత్యగాత్మ కంటే నామరూపాలను నిర్వహించే వాడైన ఈ ఆకాశము ఆముక్తుడు, జీవుడి కంటే కూడా వేరయినవాడే. అతడే పరబ్రహ్మ. దాన్నే **తేయదన్తరా** అని ఉపపాదిస్తున్నది శ్రుతి. ఎందువల్ల నైతే ఈ ఆకాశము నామరూపాలకు అన్తరా – వాటితో తాకబడనిదై అర్థాన్తర మయ్యిందో ఆ

కారణంచేతనే నామరూపాలకు నిర్వహితా (నిర్వహించేది; నడిపేది) అయ్యింది. పుణ్యపాపరూపకర్మలు లేనిది కాబట్టి సత్యసంకల్పమును కలది ఐనందున నిర్వహితా అవుతున్నదని అర్థము. సూత్రం లోని ఆదిశబ్దము చేత బ్రహ్మత్వము, ఆత్మత్వము, అమృతత్వములు గ్రహింపబడుతున్నవి. నిరుపాధిక బృహత్వాది ధర్మాలు పరమాత్మకు మాత్రమే సంభవించుతవి. ఆ కారణము చేత ఇక్కడి ఆకాశము పరబ్రహ్మనే ముక్తాత్మ కాదు. ఏదైతే **ధూత్వా శరీరమ్** అనే దానితో తర్వాత చెప్పబడిన ముక్తుడు అని ఏమాటను చెప్పినారో అది సరికాదు. బ్రహ్మలోకమభి సంభవామి అని పరబ్రహ్మయే అనన్తరము ప్రస్తావింపబడినాడు. ఒకవేళ (కాబోయేవాడు – అభిసంభవితా) అభి సంభవిత ఐన ముక్తునికి నామరూపనిర్వాహకత్వము మొదలైనవి అసంభవాలు కాబట్టి అభిసంభావ్యుడైన పరబ్రహ్మనే అక్కడ గుర్తించాలి.

ఇంతే కాకుండా ఆకాశ శబ్దముతో ప్రకృతమైన దహరాకాశము ప్రత్యభిజ్ఞ చేయబడుతున్నందున, ప్రజాపతి వాక్యమున్నూ ఉపాసక స్వరూపాన్ని చెప్పడం కోసము బయలుదేరింది కనుక ఉపాస్యుడైన దహరాకాశమే ప్రాప్యము / చేరుకోదగినదిగా చెప్పబడి ముగింపు చేయబడుతున్నది అని తలచడమే యుక్తమైనది. అకాశశబ్దము ఎక్కడా కూడా ప్రత్యగాత్మ అనే అర్థములో ప్రయోగింపబడి కనపడడం లేదు. ఇందువల్ల ఈ వాక్యములోని ఆకాశము పరబ్రహ్మనే.

ఒకవేళ ఇట్లా కావచ్చును – ప్రత్యగాత్మ కంటే అర్థాన్తరమైన మరొక ఆత్మ అనేదే లేదు. ఐక్యాన్ని – ఒక్కటే ఉన్నదని – చెప్పినందువల్ల మరియు పొరపాటున రెండోది ఉన్నది అనుకుంటావేమోనని రెండవ వస్తువు లేనేలేదని ద్వైతాన్ని నిషేధించినందువల్లనూ ఇట్లాగా తలుస్తున్నాము. కర్మ సమ్బన్ధము లేక శుద్ధావస్థలో ప్రత్యగాత్మనే పరమాత్మా, పరంబ్రహ్మ, పరమేశ్వరుడు అనే పేర్లతో పిలువబడుతున్నాడు. ఇందువల్ల ప్రస్తుత చర్చకు అవకాశమిస్తున్న బ్రహ్మగా మారబోయే ముక్తాత్మ కంటే అర్థాన్తరమైన అభిసంభావ్యమైన బ్రహ్మ లోకము వేరే లేదు. బ్రహ్మైవ బ్రహ్మయే లోకము అని అర్థము చెప్పుకోవాలి. ఇందువల్ల నామరూపాలను నిర్వహించేవాడు అనబడుతున్న ఆకాశమున్నూ ఆ ముక్తాత్మనే కావడానికి అర్హతను కలిగి ఉన్నాడు. అని. దీనికి సమాధానమును చెపుతున్నాడు.

సూ॥ **సుషుప్తి ఉత్ క్రాన్త్యోర్భేదేన 1-3-43** గాఢనిద్ర, మరణవేళల యందు జీవపరమాత్మలకు భేదము ఉన్నందున. వ్యపదేశాత్ అనే పదము సూత్రములో

ఉన్నది. సుషుప్తి – గాఢనిద్ర పోవుట, ఉత్‌క్రాన్తి – మరణదశలో జీవుడు శరీరాన్ని వదిలి లేచిపోవుట ఈ రెండు సందర్భాలలోనూ ప్రత్యగాత్మ కంటే వేరుగా పరమాత్మను చెప్పుటచేత ప్రత్యగాత్మ కంటే అర్థాన్తరమైన పరమాత్మ ఉండనే ఉన్నాడు. అది ఎలాగంటే వాజసనేయక శాఖలో **కతమ ఆత్మేతి. యోఽయం విజ్ఞానమయః ప్రాణేషు** ఎవడు ఆత్మ అని విచారము రాగా ప్రాణాలయందు ఎవడైతే విజ్ఞానమయుడు ఉన్నాడో అ ప్రకృత ప్రత్యగాత్మకు సుషుప్తి అవస్థయందు ఏ కొంచెమంత కూడా తెలియని వీడికి సర్వజ్ఞుడైన పరమాత్మతో కౌగిలింత పఠింపబడుతున్నది. **ప్రాజ్ఞేన ఆత్మనా సమ్పరిష్వక్తః నబాహ్యంకించన వేద, నాన్తరమ్.** ప్రాజ్ఞుడైన ఆత్మ చేత కౌగిలించుకోబడినవాడై బాహ్యప్రపంచాన్ని ఎరుగడు అన్తరము మనస్సులోని మార్పు చేర్పులనున్నూ ఎరుగడు అని. అట్లాగే ఉత్‌క్రాన్తి వేళలో కూడా. **ప్రాజ్ఞేన ఆత్మనా అన్వారూఢః ఉత్సర్జన్ యాతి.** ప్రాజ్ఞుడైన ఆత్మతో సమానమైన వాహనాన్ని అధిరోహించినవాడై శరీరాన్ని వదిలిపెట్టి పోతున్నాడు అని. ఏమీ తెలియని వాడైన జీవుడు నిద్రిస్తున్నపుడు కాని శరీరాన్ని విడిచిపెట్టి దాని లోనించి లేచిపోతున్నప్పుడు కానీ సత్ శబ్దవాచ్యుడు సర్వజ్ఞుడు ఐన ప్రాజ్ఞునితో తన యిష్టము ప్రకారమే పరిష్వంగము కానీ అన్వారోహము కానీ సంభవించవు. పోనీ మరొక క్షేత్రజ్ఞుడితోనూ కలుగవు. వాడికిన్నీ సర్వజ్ఞత్వాదులు లేవు. సుషుప్తి ఉత్ క్రాన్తి సందర్భాలలో భగవన్తుని ఇష్టము ప్రకారమే పరిష్వంగా న్వారోహములు కలుగుతవి.

ఈ చెప్పబోయే కారణము వల్లనున్నూ ప్రత్యగాత్మ కంటే అర్థాన్తర మైనవాడు పరమాత్మనే.

సూ॥ **పత్యాది శబ్దేభ్యః 1-3-44** ఈ పరిష్వంగము చేసుకొనే పరమాత్మ తరువాతి వాక్యాలలో పత్యాది శబ్దాలతో వ్యవహరింపబడుతున్నాడు. **సర్వస్యాధిపతిః** జగములన్నింటికీ అధిపతి ఐనట్టివాడు. **సర్వస్యవశీ సర్వస్యే శానః** – సమస్తాన్నీ తన వశములో – అదుపులో ఉంచుకున్నవాడు ఈశ్వరుడు కూడా. **సనసాధునాకర్మణా భూయాన్, నోఏవా సాధునా కనీయాన్. ఏష సర్వేశ్వరః ఏష భూతాధిపతిః ఏషభూతపాలః ఏషసేతుర్విధరణః ఏషాం లోకా నామసమ్భేదాయ. తమేతం వేదానువచనేన బ్రహ్మణాః వివిదిషన్తి. ఏతమేవ విదిత్వామునిర్భవతి. ఏతమేవ ప్రవ్రాజినో లోకమి చ్ఛన్తో ప్రవ్రజన్తి.** ఆయన సాధుకర్మల ద్వారా గొప్పవాడు కాడు. అట్లే అసాధుకర్మలచేత తక్కువవాడు కాడు. అనగా ఎల్లప్పుడూ ఒక్క తీరుగనే

ఉంటాడు. ఇతడే సర్వేశ్వరుడు. ఇతడే భూతాలకు అధిపతి. ఇతడే భూతాలను పాలించేవాడు. ఇతడు లోకాలను కలిసిపోకుండా ఉంచుతూ ఉన్న వాడు. సేతువు వలె రాకపోకలకు ఉపయోగపడేవాడు. సేతువనగా వంతెన. ఇటువంటి మహానుభావుడిని బ్రాహ్మణులు వేదాన్ని ఆచార్యుని ద్వారా నేర్చుకొని దాని సాయంతో తెల్సుకోవడానికి ప్రయత్నించుతున్నారు. వాళ్ళల్లో బాగా ప్రయత్నించి శ్రమచేసినవాడు ఇతడిని తెల్సుకొని ఆ తెల్సుకొన్న రూపాన్ని గుణాలను మాటిమాటికి తల్చుకుంటూ ముని అవుతున్నాడు. ఇతడిలోకాన్ని, ఇతడిని చేరుకోవడానికి సన్యాసులు పరివ్రాజకులై లోకసంచారాన్ని చేస్తున్నారు. **సవాఏషమహాన్ అజః ఆత్మా అన్నాదో వసుదానః** అట్టి మంగళ గుణాలు కల ఈయన గొప్పవాడు. పుట్టుకలేనివాడు. ఆత్మ ఐ ప్రాణులను బ్రతికించుతున్నాడు. అన్నమును అందిస్తున్నాడు. వసు–ధనాన్ని కూడా ఇస్తున్నాడు.

**అజరోఽమృతోఽభయోబ్రహ్మ.** ముసలితనము లేనివాడు. తరిగిపోనివాడు. ఆనందమయుడు. భయము లేనివాడు. సంసారభయాన్ని పోగొట్టేవాడు. అతనే బ్రహ్మ అని. ఈ పతిత్వము జగత్ విధరణత్వము సర్వేశ్వరత్వము మొదలైనవి ప్రత్యగాత్మకు ముక్తావస్థలో కూడా సంభవించవు. ఇందువల్ల ముక్తాత్మకంటే అర్థాన్తరమైనవాడు, నామరూపాలను నిర్వహించేవాడు ఆకాశమే. ఐక్యోపదేశము మాత్రము చిదచిదాత్మకమైన ఈ సమస్తమూ బ్రహ్మయొక్క కార్యమైనందున బ్రహ్మాత్మకమైనందున పొసగుతుంది. **సర్వం ఖల్విదంబ్రహ్మ తజ్జలాన్ ఇతిశాన్తఉపాసీత** ఇత్యాదివాక్యాలచేత ప్రతిపాదింపబడుతున్నదని ఇంతకుమునుపే సమర్థించినాము. ఆ కారణంచేతనే రెండు లేవు (ద్వైతము)అని నిర్ణయించడంకూడా పైన చెప్పినకారణము చేతనే, కనుక ఏ దోషమూ లేదు. జీవుడికంటే పరమాత్మ వేరయిన వాడే జీవుడు పరమాత్మ ఇద్దరు కనిపిస్తున్నా జీవుడు కార్యము, పరమాత్మ కారణము. ఈ రెండూ ఒక్కటే. కారణావస్థలో ఉన్నదే తరువాత కార్యావస్థను పొంది కార్యము – ప్రపంచము అనబడుతున్నది. ప్రపంచములోని అన్నివస్తువులలోనూ ఆత్మగా / అన్తరాత్మగా ఉంటున్నందున ప్రపంచము బ్రహ్మాత్మకము. కావుననే సర్వం ఖల్విదం బ్రహ్మ అని అన్నారు కదా! కనుక ఐక్యము, అభేదము రెండూ పొసగుతవి. **ఇది అర్థాన్తరత్వాది వ్యపదేశాధికరణము.**

**ఇంతటితో శ్రీభాష్యమునందు ప్రథమాధ్యాయములోని**

తృతీయపాదము ముగిసినది.

శ్రీమతే రామానుజాయనమః

## శ్రీభాష్యము – ప్రథమాధ్యాయము – చతుర్థపాదము

## - సుస్పష్ట జీవాది లింగకము -

### అనుమానికాధికరణము.

సూ॥ **అనుమానికమప్యేకేషామితి చేన్న, శారీరరూపక విన్యస్త గృహీతేః దర్శయతిచ 1–4–01** అనుమాన ప్రమాణము చేత నిరూపింపబడే ప్రధానము జగత్కారణమని కొన్ని శాఖల్లో ఉన్నదనకూడదు. శారీరుడి నిరూపకాలంకార ప్రక్రియలో పోల్చి చెప్పినారు. పరమపురుషార్థ లక్షణమైన మోక్షాన్ని సాధించుకోవడానికి ఉపకరించే సాధనమైనందున జగజ్జన్మాదులకు కారణమైన బ్రహ్మ తెల్సుకోదగిన వాడు. అతడు అచిద్ వస్తువైన ప్రధానాదులకంటే, బద్ధ ముక్త అనబడే రెండు అవస్థలలో ఉన్న జీవుడికంటే విలక్షణుడు. ఆయన హేయగన్ధము ఏమీలేనివాడు. సర్వజ్ఞుడు. సర్వశక్తి మన్తుడు. సత్యసంకల్పుడు. సమస్త కళ్యాణగుణాలు ఉన్నవాడు. చిదచిత్తులకన్నింటికీ అన్తరాత్మగా ఉన్నట్టివాడు. నిరంకుశమైన ఐశ్వర్యాన్ని కలిగి ఉన్నవాడు అని మునుపటి పాదాలలో తేల్చి చెప్పబడింది.

ఇప్పుడు కపిలతన్త్రములో ప్రతిపాదింపబడిన, బ్రహ్మాత్మకము కాని ప్రధానము, పురుషుడు మొదలైనవాటిని ప్రతిపాదించడం ద్వారా ప్రధానాన్నే జగత్‌సృష్టికి కారణముగా ప్రతిపాదించుతున్నట్లు కొన్ని గుర్తులు కల్గిన వేదాన్తవాక్యులు, కొన్నికొన్ని వేద శాఖలలో కనపడుతున్నాయి అని అనుమానపడి బ్రహ్మ ఒక్కడు మాత్రమే కారణమనే అంశాన్ని నిలపడం కొరకు ఆ వాక్యాలను ఎత్తి చూపుతూ చర్చించి త్రిప్పికొడుతున్నారు.

కఠవల్లులయందు ఇట్లాగా పఠించుతున్నారు. **ఇంద్రియేభ్యః పరాహ్యర్థాః. అర్థేభ్యశ్చ పరంమనః మనసస్తు పరాబుద్ధిః బుద్ధేరాత్మా మహాన్‌పరః మహతః పరమవ్యక్తమ్ అవ్యక్తాత్ పురుషః పరః పురుషాన్న పరం కించిత్ సాకాష్ఠా సా పరాగతిః.** ఇంద్రియాల కంటే పరమైనవి శక్తివంతములైనవి అర్థాలు అనగా అనుభవింపబడే శబ్దస్పర్శ రూపరసగంధాదులు. వాటికంటే మనస్సు బలమైనది. మనస్సు కంటే బుద్ధి శక్తి శాలి. బుద్ధికంటే ఆత్మ ఆత్మపరుడు. గొప్ప వాడు. మహాన్/మహత్తుకంటే

అవ్యక్తము పరమైనది. అవ్యక్తము కంటే పురుషుడు పరుడు. ఆ పురుషుడి కంటే శక్తిశాలి పరమైన వాడు ఎవడూ లేడు. అదే చిట్టచివరిది. అదే పరమగతి అని. ఇక్కడ సందేహము కలుగుతున్నది.

కపిలతన్త్రములో సిద్ధమైన బ్రహ్మాత్మకము కాని ప్రధానము ఇక్కడ అవ్యక్త శబ్దంచేత చెప్పబడుతున్నదా? లేక కాదా? అని. రెండింటిలో ఏది తగును అని అంటే ప్రధానమేనని అంటున్నాము. ఎందుచేత? అని అంటున్నారా? చెప్తున్నాము. వినండి. **మహతః పరమ వ్యక్తమ్. అవ్యక్తాత్ పురుషః పరః** అనే వాక్యముచేత కపిల తంత్రము నందు సిద్ధమైన తంత్రప్రక్రియయే ఇక్కడ కనిపిస్తున్నది. ఆ ప్రత్యభిజ్ఞ కారణంగా అదే ఇది అని తోస్తున్నది. **పురుషాన్నపరం కించిత్ సాకాష్ఠా సా పరాగతిః** అని ఇరువది ఐదవ తత్త్వమైన పురుషుడి కంటే ఆవల ఇంకొక తత్త్వము ఏదీ లేదని నిషేధించినారు కాబట్టి. ఇందువల్ల అవ్యక్తమే కారణము అని నిర్ణయము అయ్యింది. అందువల్లనే ఈ మాట సూత్రములో చెప్పబడింది. ఆనుమానికమప్యేకేషామితి చేత్ అని. కనుక కొందరిశాఖలలో ఆనుమానికమనబడే ప్రధానము కూడా కారణముగా పఠింపబడుతున్నది అని.

దీనికి సమాధానము చెప్తున్నాము. కాదని. అవ్యక్తశబ్దము చేత బ్రహ్మాత్మకము కాని ప్రధానము ఇక్కడ చెప్పబడడం లేదు. ఎందువల్ల నంటావా? శరీరరూపక విన్యస్త గృహీతేః అని. శరీరము అనే పేరు గల రూపకవిన్యస్తమైన దానికి (అవ్యక్తము అనే దానికి) గ్రహణము ఉన్నది కాబట్టి. ఆత్మ శరీరము బుద్ధి మనస్సు ఇంద్రియాలు విషయాల యందు రథి రథములుగా పోలిక చెప్పబడిన వాటియందు రథము రూపముగా గ్రహించినందువల్ల అని అర్థము. ఇదీ చెప్పిన విషయము – ఈ వాక్యానికి ముందు **శ్లో॥ ఆత్మానంరథినం విద్ధి శరీరంరథమేవచ। బుద్ధింతుసారథింవిద్ధి మనః ప్రగ్రహమేవచ। ఇంద్రియాణి హయానాహుః విషయాంస్తే షుగోచరాన్.** ఓ నచికేతా! ఆత్మను/ తనను/ జీవుడిని రథమును కల్గిప్రయాణంచే వాడినిగా/ రథిగా తెల్సుకో. శరీరము రథము. దానికి బుద్ధి సారధి రథాన్ని నడిపే వాడినిగా గుర్తించు. మనస్సు పగ్గము. ఇంద్రియాలు గుఱ్ఱాలు శబ్దస్పర్శరసాదులైన విషయాలు బండిని లాగే గుఱ్ఱాలకు కనిపించేవిగా గుర్తించు. ఇత్యాది వాక్యము ద్వారా చెప్పి **సోऽధ్వనః పారమాప్నోతి తద్విష్ణోః పరమంపదమ్** అతడు తాను ప్రయాణము చేసే గమ్యానికి సంబంధించిన బాటయొక్క ఆవలి కొసలో ఉన్న ఆ విష్ణువు యొక్క

శ్రేష్ఠమైన నివాసస్థానాన్ని చేరుకుంటాడు. అని ముగిసే వాక్యంతో సంసారమనే బాటకు ఆవలిదరిఐన విష్ణువుయొక్క స్థానాన్ని / పాదాన్ని చేరదల్చుకున్న ఉపాసకుడిని రథినిగా (రథమెక్కినవానిగా) అతని శరీరము అవయవాలను రథము, రథము యొక్క భాగాలుగా ఆరోపించి (పోల్చి) చెప్పి **యస్యైతే రథాదయో వశేతిష్ఠన్తి, సఏవాధ్వనః పారంవైష్ణవం పదమాప్నోతి.** ఏ వ్యక్తికైతే ఈ రథాదులన్నీ స్వాధీనము నందు ఉంటాయో అతడు మాత్రమే తాను ప్రయాణించే బాటయొక్క అటు చివరన ఉన్న విష్ణునిదైన పదాన్ని చేరుకుంటున్నాడు అని చెప్పి రథాదులుగా ఆరోపింపబడిన ఏవి వేటికంటే స్వాధీనములో ఉంచుకొనే విషయంలో ప్రధానాలుఐ ఉన్నవో వాటిని చెప్పుతున్నారు. **ఇంద్రియేభ్యః పరాః** ఇంద్రియాలకంటే ముఖ్యములైనవి. ఇత్యాదివాక్యాల ద్వారా!

అక్కడ గుర్రాలుగా ఆరోపించబడిన ఇంద్రియాలకంటే వాటికి కనిపించేవిగా చెప్పబడిన విషయాలు వశీకరించుకోవడములో మిక్కిలి ముఖ్యములైనట్టివి. ఎంతగా ఇంద్రియనిగ్రహము ఉన్నవానికైనా విషయాలు ఎదురుగా కనిపిస్తున్నపుడు ఇంద్రియాలను నిగ్రహించడము కష్టమైన పని. వాటికంటే పగ్గముగా చెప్పబడిన మనస్సు పరమైనది. మనస్సు విషయాలను దాస్యము చేస్తూ ఉంటే విషయాలు ఎదురుగా లేకుండా పోవడము దేనికీ కొరగాదు. ఆ మనస్సు కంటే సారధిగా నిరూపింపబడిన బుద్ధిపరమైనది. అధ్యవసాయము / పట్టుదల లేనప్పుడు మనస్సు కూడా ఏమీ చేయలేదు. ఆ బుద్ధి కంటే రథములో ప్రయాణమును చేసే రథిగా రూపించబడిన ఆత్మకర్తృత్వము కలవాడవడం చేత ప్రాధాన్యము కలవాడైనందున ఆయన పరుడు. ఈ అన్నీ ఆత్మకు వశములై ఉంటవి కనుక ఆత్మనే మహాన్ అనే పదముతో విశేషింపబడుతున్నాడు. ఆ ఆత్మకంటే రథముగా చెప్పబడిన శరీరము బలీయమైనది. జీవాత్మయొక్క అన్నివిధాలైన పురుషార్థాలను సాధనము ప్రవృత్తి దాని ద్వారానే నేరవేరుతవి కనుక అది బలవంతమైనది. శరీరము సహకరించకుంటే మానవుడు ఏ పనినీ చేయజాలడు. ఆ ఆత్మకంటే పరమైనవాడు. సర్వాన్తరాత్మ ఐనవాడు, సంసారమనే మార్గానికి / జీవనయానానికి ఆవలి చివర ఐనవాడు పరమపురుషుడు పరుడు. ఇంతవరకూ చెప్పుకుంటూ వచ్చిన ఆత్మ వరకూ ఉన్నటువంటి అన్నిటికిన్నీ ఆయన సంకల్పమే మూలము. దాని ప్రకారమే ఈ ప్రపంచమంతా నడుచుకొంటున్నది కనుక. ఆయన అన్తర్యామిగా ఉన్నందుచేత ఉపాసకుని ఉపాసనను ప్రోత్సహించుతాడు. ఫలాన్ని సిద్ధింపచేస్తాడు. **పరాత్తుతత్ శ్రుతేః** అనే బ్రహ్మ సూత్రము ద్వారా

జీవాత్మయొక్క కర్తృత్వము పరమాత్మ చేతిలో ఉన్నది అని మున్ముందు చెప్పనున్నారు. వశీకరించుకొనుట, ఉపాసనను కొనసాగించుటలకు ఉపాయాలలో చిట్టచివరివాడు ప్రాప్యములైన వాటిలో గొప్పప్రాప్యము ఆయననే. అందువల్లనే ఈ విధంగా చెప్పబడుతున్నది. **పురుషాన్న పరం కించిత్ సాకాష్ఠా సా పరాగతిః** అని అదేవిధంగా అన్తర్యామి బ్రాహ్మణంలో **యః ఆత్మని తిష్ఠన్** ఇత్యాది వాక్యాలతో అన్నింటినీ తన ఎదుట ఉన్నవాటిగా సాక్షాత్కరించుకుంటూ అన్నింటినీ నియమించుతున్నాడు అని చెప్పి **నాఽన్యోఽతోఽస్తిద్రష్టా** ఈయన కంటే నిజమైన ద్రష్టాఽచూచేవాడు మరొకడు లేడు. అని మరొక నియన్తను నిషేధించినారు. భగవద్గీత లోకూడా **అధిష్ఠానం తథా కర్తా కరణం చపృథగ్ విధమ్। వివిధా చపృథక్ చేష్టాదైవం చైవా త్ర పంచమమ్।।** ఆధారమైన అధిష్ఠానము, కర్త, పలురకాలైన కరణాలు / సాధనాలు, పలురకాలైన చేష్టలు, దైవము ఐదవది ఇవన్నీ ఒక పని జరుగడానికి కారణాలు. పరస్పరము సహకరించుకో వలసి ఉన్నది. ఇక్కడ దైవము అనగా పురుషోత్తముడే.

**సర్వస్యచాహం హృదిసన్నివిష్టః మత్తః స్మృతిః జ్ఞానమపోహనంచ.** అందరికిన్నీ నేను హృదయములో ప్రవేశించియుండి దగ్గరలోనే ఉన్నాను. కనుక నాప్రేరణ వల్లనే తలచుకోవడము, కొత్తవిషయాలను తెల్సుకోవడము అపోహనము అనగా ఒకటి ఉంటే మరొకటిగా తలచడము జర్గుతూ ఉన్నవి. అని చెప్పినాడు గనుక. అట్లాంటి హృదయస్థుడైన పరమాత్మను స్వాధీనము చేసుకోవడమనగా ఆయనను శరణువేడుకోవడమే. ఆయనే చెప్పిన మాట ఇది. **ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జునతిష్ఠతి। భ్రామయన్ సర్వభూతాని యన్త్రారూఢానిమాయయా।। తమేవశరణంగచ్ఛ.** ఓ అర్జునా! అన్నిభూతాలకూ హృదయస్థానంలో ఈశ్వరుడు ఉంటున్నాడు. ఆయన తన సంకల్పరూపమైన మాయతో యంత్రము (రంగుల రాట్నము) ను ఎక్కించి తిప్పినట్లు తిప్పుతున్నాడు. భ్రామయన్ – భ్రమను కలవాళ్ళుగా చేస్తూ. ఆ విధంగా ఉన్న ఈశ్వరుడిని శరణు వేడుకో సంసారబన్ధాలు తొలగిపోతవి అని.

ఆ కారణము చేత **ఆత్మానం రథినంవిద్ధి** ఇత్యాది వాక్యము చేత రథి ఆది రూపకముతో ఆరోపింపబడిన ఇంద్రియాదులు **ఇంద్రియేభ్యః పరాహ్యర్థాః** అనుచోట ఇంద్రియాణి అని తమను నేరుగా తెలిపే మాటలతోనే గుర్తింపబడుతున్నవి. కాని రథముగా ఆరోపించబడిన శరీరము కాదు. కనుక పారిశేష్యన్యాయము ప్రకారము ఆ

శరీరమే అవ్యక్తశబ్దం చేత చెప్పబడుతున్నది అని నిశ్చయింపబడుతున్నది. ఇందువల్ల కపిలతన్త్రములో సిద్ధమైన ప్రధానానికి ఇక్కడ ప్రసంగమే లేదు.

ఆ తంత్రములో సిద్ధమైన ప్రక్రియవలెనే ఇక్కడ ఉన్నందున దాని ప్రత్యభిజ్ఞ – గుర్తింపు ఉన్నదని భ్రమించకూడదు. **ఇంద్రియేభ్యోపరాహ్యర్థాః** అని ఇంద్రియాలకంటే అర్థములైన శబ్దస్పర్శరూపరస గన్ధాదులను పరములైనవి అని కీర్తించబడింది కనుక ఆ సాంఖ్యదర్శనంలో శబ్దాదులు ఇంద్రియాలకు కారణాలు కావు. **అర్థేభ్యశ్చపరంమనః** అర్థాలకన్న మనస్సు పరమైనది అనే మాట కూడా వాళ్ళ తంత్రములో పొసగేది / సంగతమైనది కాదు. కారణము కాదు కనుకనే. అదే విధంగా **బుద్ధేరాత్మామహాన్‌పరః** అనేది కూడా అసంగతమే. బుద్ధి శబ్దముతో మహత్తత్వము చెప్పబడుతున్నదని వాళ్ళు ఒప్పుకున్నారు కాబట్టి. ఎందుకంటే? మహత్తుకంటే మహాన్ అనేది పరమైనది కాదు. అట్లాగే మహత్ ఆత్మశబ్దానికి విశేషణముగా భావించడమున్నూ కుదిరేది కాదు.

అందువలన రూపకముతో పోల్చి / ఆరోపించి చెప్పబడినవాటిని గ్రహించడమే మంచిది. దాన్నే చూపుతున్నాడు కూడా. **శ్లో॥ ఏషసర్వేషు భూతేషు గూఢో ఆత్మానప్రకాశతే. దృశ్యతే త్వగ్రయా బుద్ధ్యా సూక్ష్మయాసూక్ష్మదర్శిభిః** ఈ ఆత్మ అన్ని భూతాలలో గుప్తంగా ఉన్నవాడేఐనా అందరికి కనిపించడు. సూక్ష్మదర్శులైనవారు తమదైన కుశాగ్రబుద్ధితో ఆత్మను చూస్తారు. **యచ్ఛేత్‌వాక్ మనసీ. ప్రాజ్ఞః తద్‌యచ్ఛేత్ జ్ఞాన ఆత్మని / జ్ఞానమాత్మనిమహతినియచ్ఛేత్ తద్యచ్ఛేత్ శాన్త ఆత్మని.** ప్రాజ్ఞుడైనవాడు మాటను మనస్సు నందుంచి అదుపులో పెట్టుకోవాలి. ఆ మనస్సును బుద్ధి యందు, ఆ జ్ఞానాన్ని మహత్తుఐన ఆత్మ యందు నియమించాలి. దాన్ని ప్రశాన్తమైన తనకు ఆత్మయైన పరమాత్మ యందు నియమించాలి. అని. బాహ్యేంద్రియాలను అన్తరింద్రియాన్ని అదుపుచేసుకోలేని వానికి ఈ పరమపురుషుడు ప్రత్యక్షము కాదు అని చెప్పి గుఱ్ఱాలుగా చెప్పిన ఇంద్రియాదులను స్వాధీనము చేసుకొనే పద్ధతి ఈ విధంగా చెప్పబడింది. వాక్కును మనస్సునందు నియమించాలి. అనగా వాక్కును మనసు నందు నిల్పి అదుపు చేయాలి. వాక్కు మొదలైన కర్మ ఇంద్రియాలను జ్ఞానేంద్రియాలనున్నూ మనస్సు నందు నియమించాలి అని అర్థము. వాఙ్మనసి అన్నచోట వాచం అని ద్వితీయావిభక్తి పదం ఉండాలి. అక్కడ ద్వితీయా విభక్తి "సుపాంసులుక్" అనే సూత్రముచేత ప్రత్యయములోపిస్తుంది. అపుడు వాక్ అనే ప్రాతిపదిక మాత్రమే మిగులుతుంది. మనసీ అని ఉన్నపుడు మనసి అని మాత్రమే సప్తమ్యన్తపదము ఉండాలి

కానీ మనసీ అని దీర్ఘము కనపడుతున్నది. వైదిక ప్రయోగము కనుక దీర్ఘాన్తముగా ప్రయోగించబడింది. దానిని జ్ఞానరూపమైన ఆత్మ యందుంచి నియన్త్రణ చేయాలి. ఆ మనస్సును బుద్ధి యందు ఉంచాలి. ఇక్కడ జ్ఞానశబ్దం కనపడుతున్నది. దానిద్వారా ఇంతకుముందు చెప్పిన బుద్ధి వ్యవహరింపబడుతున్నది. జ్ఞాన ఆత్మని అన్నప్పుడు సమానాధికరణము కాకుండా వ్యధికరణ సప్తమీ విభక్తులు ఉన్నవి. ఆత్మ ఉంటుండగా జ్ఞానము నందు నియంత్రించాలి అని అర్థము. జ్ఞానాన్ని మహత్తు ఐన ఆత్మయందు నియన్త్రణ చేయాలి. అనగా బుద్ధిని కర్తయైన మహత్ అనే విశేషము గల – గొప్పదైన ఆత్మయందు నియమించాలి. ఆ ఆత్మను శాన్తమైన ఆత్మయందు నియమించాలి అంటే ఆకర్తఐన ఆత్మను సర్వాన్తర్యామియైన పరబ్రహ్మ యందు నియన్త్రణ చేయాలి. వ్యత్యయము కారణంగా **తత్** అని నపుంసకలింగ ప్రయోగము. ఆత్మ శబ్దము పుంలింగము. తంయచ్ఛేత్ అని ఉండవలసింది కానీ వ్యత్యయము కారణముగా తత్ అని నపుంసకలింగ పదముతో పులింగమైన ఆత్మను పేర్కొన్నారు. ఈ తీరుగా ఉన్న రథి వైష్ణవమైన పదానికి పోవాలి అని అర్థము. అవ్యక్తశబ్దముతో వ్యక్తమైన శరరీము ఎట్లా చెప్పబడుతుంది? అన్న దానికి ఉత్తరము ఈయబడ్తున్నది.

సూ॥ **సూక్ష్మంతు తదర్హ త్వాత్ 1-4-2** సూక్ష్మ ప్రకృతి తగిన అర్హత కలది కాబట్టి అవ్యక్తమనబడవచ్చును. భూతాలయొక్క సూక్ష్మము అవ్యాకృతము అనబడుతుంది. అది ఒక అవస్థా విశేషాన్ని పొందినప్పుడు శరీరము అవుతుంది. ఆ అవ్యాకృతమే ఇక్కడ శరీరావస్థను పొందినందున దానిక మూలమైన దాని పేరుతో అవ్యక్తమనే శబ్దముతో చెప్పబడుతున్నది. తదర్హత్వాత్ ఆ అవ్యాకృతమనబడే అచిద్వస్తువుకే వికారము పొందినప్పుడు రథము వలె పురుషార్థాన్ని సాధించుకోవడానికి చేసే ప్రయత్నానికి అర్హమైయున్నందువల్ల భూతసూక్ష్మమైన శరీరాన్ని అవ్యక్తము అని అన్నారు.

ఒకవేళ భూతసూక్ష్మాన్ని అవ్యాకృతమని ఒప్పుకున్నట్లయితే అదే విషయాన్ని చెప్పుతున్నకాపిలతన్త్రసిద్ధమైనదాన్నిస్వీకరించేటందుకుద్వేషాన్నిప్రదర్శించుతున్నారు దేనికి? అక్కడ కూడా భూతాలకు కారణమైన దాన్నే అవ్యక్తమని అంటున్నారు కదా! అనే ప్రశ్నకు ఉత్తరమును చెప్పుతున్నాడు సూత్రకారుడు.

సూ॥ **తదధీనత్వాద ర్థవత్ 1-4-03** పరమాత్మకు లొంగి ఉంటున్నందువల్ల అర్థవన్తమవుతుంది. పరమకారణుడైన పరమ పురుషుడికి లొంగిఉన్నందున భూతసూక్ష్మము – ప్రయోజనవన్తము అవుతున్నది. ఇది చెప్పబడుతున్న విషయము

– మేము అవ్యక్తాన్ని దాని పరిణామవిశేషాలను ఉన్నదున్నట్లు అంగీకరించము. కాని పరమ పురుషుడికి శరీరము ఐనందున ఒప్పుకుంటాము. బ్రహ్మాత్మకము కాదంటే ఒప్పుకోము. ఆయనను ఆత్మగా కల్గి ఉన్నప్పుడే, ఆయనతో సమ్బన్ధము ఉన్నప్పుడే ప్రకృతి మొదలైనవి తమ ప్రయోజనాన్ని సాధించుకుంటున్నవి. అట్లాకాక పోయినప్పుడు స్వరూపము, స్థితి, ప్రవృత్తి భేదాలు వాటికి ఉండవు. ఆ విధంగా బ్రహ్మాత్మకత్వమును అంగీకరించనందుననే మేము తన్త్రసిద్ధమైన ప్రక్రియను నిరసించుతున్నాము అని.

శ్రుతిస్మృతులయందు జగదుత్పత్తి, ప్రలయాలకు సంబన్ధించిన వాదాలలో, అట్లాగే పరమపురుషుని మహిమను తెల్పే ముచ్చట్లలోనూ ప్రకృతి, దాని వికారాలు, పురుషుడు అందరున్నూ బ్రహ్మాత్మకులు అని కీర్తింపడుతున్నవి. ఎట్లాగంటే – **పృథివ్యప్సులీయతే** భూమి నీటిలో కల్సిపోతుంది అని మొదలుపెట్టి **తన్మాత్రాణి భూతాదౌలీయన్తే, భూతాదిః మహతి లీయతే. మహానవ్యక్తే లీయతే. అవ్యక్తమక్షరే లీయతే. అక్షరం తమసి లీయతే. తమః పరేదేవే ఏకీ భవతి.** తన్మాత్రలు శబ్దస్పర్శాదులు భూతాది యందు, భూతాది మహత్తునందు, మహత్తు అవ్యక్తము నందు అవ్యక్తము అక్షరమునందు అక్షరము తమస్సు నందు కలసిపోతాయి. చివరిదైన తమస్సు పరుడైన దేవుని యందు ఒకటిగా అవుతున్నది. అదే తీరుగా **ఎవనికి పృథివీ శరీరమో, ఎవనికి నీరు శరీరమో, తేజస్సు శరీరమో, వాయువు, ఆకాశము, అహంకారము, బుద్ధి, అవ్యక్తము అక్షరము, మృత్యువు శరీరముగా అవుతున్నాయో ఈ సర్వభూతాలకు అన్తరాత్మ ఐనవాడు పుణ్యపాపరూపకర్మలు లేనివాడు దివ్యుడు దేవుడుఒక్కడు నారాయణుడే.** అట్లాగే **శ్లో॥ భూమిరాపోఽనలో వాయుః ఖంమనో బుద్ధిరేవచ। అహంకార ఇతీయంమే భిన్నాప్రకృతి రష్టధా॥** భూమి, నీరు, నిప్పు, గాలి, మిన్ను, మనస్సు, బుద్ధి, అహంకారము అనబడే ఈ ఎనిమిది వేరువేరుగా కనబడుతున్నా అన్నీ నాదైన ప్రకృతికి చెందినవే. **శ్లో॥ అపరేయమితస్త్వన్యాం ప్రకృతిం విద్ధిమేపరామ్। జీవభూతాం మహాబాహో యయేదం ధార్యతే జగత్** ఓ మహాబాహో దీనికంటే వేరుగా పరా అనబడే ప్రకృతి ఒకటి ఉన్నది. అది జీవుడనబడుతున్నది. దానిచేతనే ఈ పంచభూతాత్మక జగత్తు ధరించబడుతున్నది. మునుపు చెప్పినదాని పేరు అపరా ఈ రెండవది పరా అని పిలువబడుతున్నది. **శ్లో॥ ఏతద్యోనీని సర్వాణీత్యుపధారయ। అహం కృత్స్నస్యజగతః ప్రభవః ప్రలయస్తథా॥ మత్తః పరతరం నాన్యత్ కించిదస్తిధనంజయ। మయి సర్వమిదం ప్రోతం సూత్రేమణి గణాః ఇవ.** ఈ పరాఽపరా అనబడే ప్రకృతినుండి

అన్నీ పుడుతున్నవి. నేను సమస్త జగత్తు పుట్టడానికి, లయము కావడానికినీ కారణమవుతూ ఉన్నాను. నాకంటే వేరుగా నన్ను మించినవాడు మరొకడు లేడు. ఈ సమస్త ప్రపంచము నాయందే ఆధారపడి ఉన్నది. ఒక దారముపైన మణుల యొక్క గణాలు అన్నీ ఆధారపడి ఒక హారముగా ఏర్పడినట్లే నా పైన ఆధారపడి సర్వప్రాణులూ ఉన్నవి. అని. **వ్యక్తమ్ విష్ణుః తథా అవ్యక్తమ్ పురుషః కాలఏవచ।** తేటగా ఇది ఈ వస్తువు చెప్పటానికి వీలున్న కనపడే వస్తువు విష్ణువు అట్లే అవ్యక్తము జీవుడు కాలము కూడా విష్ణువే. విష్ణ్వాత్మకాలే. **ప్రకృతిర్యామయాఽఽ ఖ్యాతావ్యక్తాఽవ్యక్తస్వరూపిణీ। పురుషశ్చా ప్యుభావేతౌ లీయేతే పరమాత్మని। పరమాత్మాచసర్వేషా మాధారః పరమేశ్వరః.** ఓ మహర్షీ। వ్యక్తాఽవ్యక్త స్వరూపాలతో ప్రకృతి ఉన్నదని నేను ఏ మాటతో చెప్పినానో ఆ ప్రకృతి, జీవుడు / పురుషుడు ప్రకృతి జీవులిద్దరున్నూ పరమాత్మయందు లీనమవుతున్నవి. పరమాత్మ పరమేశ్వరుడు ఐన ఆయన అందరికీ ఆధారమై ఉన్నాడు. అని తదధీనములు, తదాత్మకాలు అని చెప్పుతున్నాయి.

సూ॥ **జ్ఞేయత్వావచనాచ్చ 1-4-4** తెలుసుకోదగినదిగా చెప్పనందువల్ల ఒకవేళ ఈ వేదవాక్యాలలో తన్త్రసిద్ధమైన అవ్యక్తాన్నే చెప్పదల్చుకొని ఉన్నట్లయితే జ్ఞేయము అవ్యక్తము అని చెప్పి ఉండేవారు. వ్యక్తా వ్యక్తాలను తెల్సుకొన్నట్లయితే మోక్షము సిద్ధిస్తుంది అని చెప్పే కపిలతంత్ర సిద్ధాన్తవేత్తలు ఆ ప్రధానానికి సంబన్ధించిన అంశాలనన్నింటినీ జ్ఞేయములే అని అంగీకరించినారు. వేదములో ప్రధానాన్ని / అవ్యక్తాన్ని జ్ఞేయము / తెల్సుకోదగినది అని చెప్పలేదు. ఇందువల్ల కపిల తన్త్ర సిద్ధమైన అవ్యక్తానికి ఇచ్చట గ్రహణము లేదు.

సూ॥ **వదతీతి చేన్న. ప్రాజ్ఞోహి ప్రకరణాత్ 1-4-5** చెప్తున్నది వేదమని తలచవద్దు. ప్రకరణాన్ని బట్టి తెల్సుకోదగినవాడుగా చెప్పబడినవాడు ప్రాజ్ఞుడైన పరమాత్మ. **అశబ్దమస్పర్శ మరూపమవ్యయం తథాఽరసం నిత్యం అగన్ధవచ్చ యత్। అనాద్యనన్తమ్ మహతః పరంధ్రువమ్ నిచాయ్యతం మృత్యుముఖాత్ ప్రముచ్యతే** ఏదైతే శబ్దము లేనిది, స్పర్శ లేనిది, రూపము లేనిది తరుగుదల లేనిది అట్లాగే రసములేనిది, ఎల్లప్పుడూ నిల్చి ఉండేది, గన్ధము లేనిదిఐ ఉన్నదో అది ఎప్పటి నుండి ఉంటున్నదో తెలియనిది, అన్తమూ లేనిది మహత్తు అనబడే దానికి పైన ఉండేది నిశ్చలమై ఒక్కచోట స్థిరంగా ఉంటున్నదో అటువంటి దానిని తెలిసి ఉపాసించిన వాడు మృత్యువు అనబడే సంసారపు నోటిలో నుండి విడుదలను పొందుతున్నాడు. అని అవ్యక్తాన్ని గురించి

తెల్సుకొనవలసినదని వెనువెంటనే ఇదే శ్రుతి చెప్పుతున్నది గదా అని అనేట్లయితే అది సరికాదు. ప్రాజ్ఞుడైన పరమ పురుషుడే ఈ శ్లోకంలో ఉపాసింపదగినవాడుగా ప్రతిపాదింపబడుతున్నాడు. **విజ్ఞానసారథిర్యస్తు మనః ప్రగ్రహవాన్నరః। సోऽధ్వనః పారమాప్నోతి తద్విష్ణోః పరమంపదమ్॥ 2) ఏషసర్వేషు భూతేషు గూఢో ఆత్మా నప్రకాశతే। దృశ్యతే త్వగ్ర్యయా బుద్ధ్యా సూక్ష్మయా సూక్ష్మబుద్ధిభిః** అని ప్రాజ్ఞుడే ప్రస్తావింపబడినాడు. ఇందువల్లనే **పురుషాన్నపరంకించిత్** అని ఇరువదిఐదవవాడైన పురుషుడి కంటే పైన మరొక్కతత్వములేదని నిషేధించినారు. అట్లాంటి పరమపురుషుడి యొక్క ధర్మాలే **యత్తదద్రేశ్యమగ్రాహ్యమ్** ఇత్యాది శ్రుతులయందు ప్రసిద్ధములుగా చెప్పబడుతున్నవి. **మహతః పరమ్** అని కూడా **బుద్ధేరాత్మా మహాన్పరః** అని ఇంతకుముందు ప్రస్తావింపబడిన జీవాత్మకంటే పరత్వమే చెప్పబడుతున్నది.

సూ॥ **త్రయాణామేవచైవముపన్యాసః ప్రశ్నశ్చ 1-4-06** ఈ ప్రకరణములో ఉపాయము – మార్గము, ఉపేయము – చేరదగినది, ఉపేత = చేరేవాడు, ఈ ముగ్గురిని గురించే ఈ విధంగా ఉపన్యసింపబడుతున్నది. జ్ఞేయముగా/ తెల్సుకోదగినదిగా ఉపన్యాసము దానికి చెందిన విషయము, ప్రశ్న కనిపిస్తున్నదే. అంతేకాని సమ్బన్ధములేని అవ్యక్తాదులను గురించికాదు. అది ఇట్లుగా ఉన్నది – నచికేతుడు మోక్షాన్ని పొందాలని కోరుతున్నవాడై యమధర్మరాజు ఇచ్చిన మూడు వరాలలో మొదటివరంతో తనకు పురుషార్థయోగ్యతను సంపాదించిపెట్టే తనపైన తనతండ్రిగారికి కోపము పోయి సౌమనస్యాన్ని పొంది, రెండవ వరముతో మోక్షమును పొందదానికి ఉపాయమైన / మార్గమైన నాచికేతాగ్ని విద్యను ఎంచుకొన్నాడు. **సత్వమగ్నింస్వర్గ్యమధ్యేషి మృత్యో ప్రబ్రూహితం శ్రద్ధ ధానాయమహ్యమ్। స్వర్గలోకా అమృతత్వంభజన్తే ఏతద్ ద్వితీయేన వృణే** వరేణ. ఓ యమధర్మరాజా! నీవు ప్రస్తుతము స్వర్గము నందుండే అగ్నిని అధ్యయనము చేస్తున్నావు. శ్రద్ధ గల నాకు దాని గురించి తెలియజెయ్యి. స్వర్గలోకస్థులు అమృతత్వాన్ని ఆనందాన్ని పొందుతున్నారు కదా! దీన్ని నేను రెండవ వరంగా కోరుకుంటున్నాను. అని స్వర్గ శబ్దముతో ఇక్కడ పరమ పురుషార్థమైన మోక్షము చెప్పబడుతున్నది. **అమృతత్వమ్ భజన్తే** అని అక్కడ ఉన్నవారికి జననము మరణములు లేవని వినిపిస్తున్నది కాబట్టి. అంతేకాదు దానికి తర్వాత నశించే ఫలాలను ప్రసాదించే కర్మలను నిందించడమున్నూ కనిపిస్తున్నది. **త్రిణాచికేతః త్రిభిరేత్యసన్ధిమ్ త్రికర్మకృత్ తరతి జన్మమృత్యూ** అయంవావయః పవతే అని ఆరంభింపబడే మూడు అను వాకాలను

అధ్యయనము చేసినవాడు యజనము అధ్యయనము చేయుట, దానము చేయుట లేదా పాకయజ్ఞము హవిర్యజ్ఞము, సోమయజ్ఞములను చేసినవాడు, త్రినాచికేతములు అనబడే అగ్నులతో పరమాత్మను ఉపాసించి ఆయనతో సమ్బన్ధాన్ని పొంది జననము, మరణములను దాటిపోతున్నాడు. అని ప్రతివచనము వినిపిస్తున్నందువల్ల మూడవదైన వరముతో మోక్షానికి చెందిన స్వరూపాన్ని తెల్సుకో గోరిన ప్రశ్నద్వారా ఉపాయస్వరూపము ఉపేయస్వరూపము, ఉపేతయొక్క స్వరూపము, ఉపాయమైన కర్మలతో సహకరించబడిన ఉపాసన యొక్క స్వరూపమునున్నూ అడిగినాడు. **యేయంప్రేతే విచికిత్సా మనుష్యే అస్తీత్యేకే నాయమస్తీతిచైకే। ఎతద్విద్యామను శిష్టస్త్వయాఅహమ్ వరాణామేషవరస్తృతీయః** మానవుడు శరీరాన్ని వదలిపోయిన తరువాత ఆ వ్యక్తి / జీవుడు ఉన్నాడు అని లేదు అని కొందరు విచికిత్సా / విచారమును చేస్తున్నారు. ఈ రహస్యము ఏదో దాన్ని మీద్వారా తెలియజేయబడిన వాడిని అవుతాను. తమరు నాకు ఇచ్చిన మూడు వరాలలో ఇది మూడవదైన వరము అని. ఈ విధంగా మోక్షాన్ని గురించి అడిగితే, దాన్ని గురించి ఉపదేశించడానికి తగిన యోగ్యత ఉన్నదా? లేదా? అని పరీక్షించి ఉపదేశించినాడు. **తం దుర్దర్శం గూఢమను ప్రవిష్టమ్ గుహాహితం గహ్వరేష్ఠమ్ పురాణమ్। అధ్యాత్మయోగాధిగమేనదేవం మత్వాధీరో హర్షశోకౌ జహాతి.** చూడడానికి వీలుకానివాడు త్రిగుణాలతో కప్పబడక కనపడక రహస్యముగా ఉన్నట్టివాడు. శరీరములో జీవుడితోపాటు (అతని వెంటనే) ప్రవేశించినవాడు, హృదయగుహలోకి చేరి ఉన్నవాడు, జీవుడిలోపల ఉన్నటువంటి వాడు ఐన దేవుడిని ఉపాసించి ధీరుడైన ఉపాసకుడు ఆనందము దుఃఖములను వదలిపెడుతాడు అని. అందువల్ల ఈ తీరుగా సామాన్యమైన పద్ధతిలో ఉపదేశించగా నచికేతుడు సంతోషమును పొందినవాడై "**దేవంమత్వా**" అని ఉపాస్యుడుగా చెప్పబడిన ప్రాప్యమైన దేవుని యొక్క, "**అధ్యాత్మయోగేన**" అని తెల్సుకోదగినవాడు ఐన చేరుకోబోయేవాడైన ప్రత్యగాత్మ యొక్కయూ, "**మత్వాధీరో హర్షశోకౌ జహాతి**" అని నిర్దేశించబడిన బ్రహ్మోపాసనముయొక్క స్వరూపాన్ని లోతుగా తెల్సుకోదగినవాడై తిరిగి ప్రశ్నించినాడు. **అన్యత్రధర్మాత్ అన్యత్రాధర్మాదన్యత్రా స్మాత్ కృతాకృతాత్। అన్యత్రభూతాచ్ఛవ్యాచ్చయత్తత్ పశ్యసి తద్వద.** ప్రసిద్ధమైన ఉపాయము కంటే వేరయిన శ్రేష్ఠమైన ఉపాయము కంటే వేరుగా, లోకంలో ప్రసిద్ధమైన సాధ్యవస్తువుల కంటే విలక్షణమైన ఫలము ఇపుడున్న దానికంటే వేరైన, ఇంతకుముందున్న దానికంటే,

రాబోయే దానికంటే ఏది విలక్షణమైనదై ఉన్నదో దానిగురించి నాకు చెప్పు అని, ఈ విధంగా సకలేతరమైన గడిచిపోయినది, రానున్నది, ప్రస్తుతమున్నట్టిది ఐన సాధ్యము, సాధనము సాధకులతో విలక్షణుడు ఈ ముగ్గురిని గురించి అడిగితే, ముందుగా ప్రణవాన్ని (ఓంకారాన్ని) ప్రశంసించి దానిచేత చెప్పబడే ప్రాప్యస్వరూపాన్ని, దానిలో ఒక భాగమైన పొందేవానియొక్క రూపాన్ని వాచకరూపమైన ఉపాయాన్ని తిరిగి సాధారణమైన రీతిలో తెల్పుతూ ప్రణవాన్ని ఉపదేశించినాడు. **సర్వే వేదాః యత్పదమామనన్తి తపాంసి సర్వాణి చయద్వదన్తి। యదిచ్ఛన్తో బ్రహ్మచర్యం చరన్తి తత్ తే పదం సంగ్రహేణబ్రవీమి॥ ఓమి త్యేతత్.** వేదాలన్నీ ఏ పదాన్ని మాటిమాటికి పఠిస్తున్నాయో! తలుస్తున్నాయో, జ్ఞానప్రధానాలైన ఉపనిషత్తులన్నీ దేన్ని గురించి చెపుతున్నాయో దేన్ని గురించి కావాలని కోరుకుంటూ ఇంద్రియనిగ్రహరూపమైన బ్రహ్మచర్యాన్ని పాటిస్తున్నారో దాన్ని నేను నీకు సంగ్రహంగా చెప్తున్నాను విను. ఓమ్ అనేదే అది అని. ఈ విధంగా ఉపదేశించి మళ్ళీ ప్రణవాన్ని ప్రశంసించి మొదట మోక్షరూపపురుషార్థాన్ని పొందే ప్రత్యగాత్మ యొక్క స్వరూపాన్ని చెప్పినాడు. **నజాయతే మ్రియతే వా విపశ్చిత్** వివిధములైన వస్తువులను తెల్సుకొనే ప్రత్యగాత్మ పుట్టేవాడు కాడు. మరణించేవాడూ కాడు. ఇత్యాదివాక్యాలతో. ప్రాప్యమైన పరబ్రహ్మయగు విష్ణువుయొక్క స్వరూపాన్ని **అణోరణీయాన్** అణువు ఐన జీవుడికంటే చిన్నవాడు ఇత్యాది వాక్యాలతో, **క ఇత్థా వేదయత్ర సః** ఇటువంటి వాడు పరంబ్రహ్మ అని, ఆయన ఏ చోటున ఉంటాడని ఎవనికి తెలియును అనే వాక్యము చివరగా గలదానితో ఉపదేశించుతూ నడుమ **నాయమాత్మా ప్రవచనేన లభ్యః నమేధ యా నబహునా శ్రుతేన** ఈ ఆత్మయైన పురుషోత్తముడు వేదాదులను మాటికిమాటికి తలచడము చదవడము వాటిచే బోధింపబడిన కర్మలను ఆచరించినా పెద్దలవద్ద విన్నా జ్ఞానము చేతగానీ లభించేవాడుకాడు ఇత్యాదివాక్యాలతో ఉపాయమైన ఉపాసనము భక్తిరూపముగా ఉండాలి అని చెప్పినాడు. **ఋతంపిబన్తౌ** అనే వాక్యముతోనూ ఉపాస్యుడైన పరమాత్మ ఉపాసకుడైన జీవునితో కలిసియే ఉంటున్నందువల్ల పరమాత్మ సులభంగా ఉపాసించదగినవాడు అని చెప్పి **ఆత్మానం రథినంవిద్ధి** ఇత్యాదివచనముతో **దుర్గం పథస్తత్ కవయోవదన్తి** ఆ ఉపాసనామార్గము సుఖంగా ప్రయాణించడానికి అనువైనది కాదు అట్లాగని క్రాన్తదర్శులైన సూరులు / పండితులు చెప్పుతున్నారు. అనే వాక్యము (ముగింపులోనున్న) తో ఉపాసన చేసే ప్రకారాన్ని ఉపాసించేవాడికి విష్ణువుకు చెందిన

పరమ పదప్రాప్తినిన్నీ చెప్పి **అశబ్దమస్పర్శమ్** అనే దానితో ముగించినాడు. ఇందువల్ల ముగ్గురిని గురించే తెల్సుకోవాల్సినదిగా (జ్ఞేయము) వివరణము ప్రశ్నమున్నూ ఉన్నవి. కనుక ఇక్కడ కపిలతన్త్ర సమ్బన్ధమైన అవ్యక్తాన్ని గ్రహించడమనేది లేనేలేదు.

సూ॥ **మహద్వచ్చ 1-4-7** మహత్తువలెనే అవ్యక్తము గ్రహింపబడడం లేదు. ఎట్లాగా నైతే **బుద్ధేరాత్మామహాన్ పరః** అనేచోట ఆత్మశబ్దంతో సామానాధి కరణ్యము ఉన్నందువల్ల కపిలతన్త్రసిద్ధమైన మహత్తత్వము గ్రహింపబడటంలేదో అదే తీరుగా అవ్యక్తము కూడా ఆత్మకంటే పరమైనదిగా చెప్పబడుతున్నందువల్ల కాపిలతన్త్ర సిద్ధమైన అవ్యక్తము గ్రహింపబడటం లేదు. **ఇది ఆనుమానికాధికరణము**

★ ★ ★

## ఇక చమసాధికరణము

సూ॥ **చమసవదవిశేషాత్ 1-4-8** చమసము వలెనే. విశేషాన్ని చెప్పేది ఏదీ లేదు కాబట్టి. ఈ అధికరణములోనూ తన్త్రసిద్ధమైన ప్రక్రియ నిరసింపబడ్తున్నది. ఐతే బ్రహ్మాత్మకాలైన ప్రకృతి మహదహంకారాదుల స్వరూపాన్ని కాదు. వాటిని గురించి శృతిస్మృతుల యందు బ్రహ్మాత్మకాలు అని ప్రతిపాదింపబడింది కాబట్టి.

ఆథర్వణికులు ఈ విధంగా చదువుతున్నారు. **వికారజననీం అజ్ఞాం అష్టరూపాం అజామ్ ధృవామ్. ధ్యాయతే అధ్యాసితాతేన తన్యతే ప్రేర్యతేపునః। సూయతే పురుషార్థంచ తేనైవాధిష్ఠితాజగత్. గౌః అనాద్యన్త వతీ సాజనిత్రీభూతభావినీ. సితాఽ సితాచ రక్తా చ సర్వకామ దు ఘావిభోః। పిబన్త్యేనా మవిషమాం అవిజ్ఞాతాః కుమారకాః। ఏకస్తుపిబతేదేవః స్వచ్ఛన్దోఽ త్రవశానుగామ్। ధ్యానక్రియా భ్యాం భగవాన్ భుంక్తేఽసౌ ప్రసభంవిభుః। సర్వసాధారణీం దోగ్ధ్రీమ్ పీడ్యమానాంతు యజ్వభిః**

వికారాలను పుట్టించేది, జ్ఞానము లేనిది (జడము) ఎనిమిది రూపాలుగా ఉన్నటు వంటిది. పుట్టుకలేనిది. నాశము లేనిది. పరమాత్మ చేత తనదైన సంకల్పరూపమైన జ్ఞానముతో తెల్సుకోబడేది. ఆయన చేత అధిష్టించబడినదై స్థూలావస్థరూపంగా విస్తరింపజేయబడుతున్నది. సమష్టి భూత రూపంగా చేయబడుతున్నది. వ్యష్టి సృష్టి కొరకు ప్రేరేపింపబడుతున్నది. జీవులచే కోరబడే భోగ్యములు, భోగోపకరణాలు భోగస్థానాలను సృష్టించుతున్నది. (కంటున్నది) వీటన్నింటినీ ఆ పరమాత్మ చేత అధిష్ఠింపబడినదై చేస్తున్నది. ఆవు వంటిది. ఆది అన్తములు లేనిది అది జనిత్రీ భూతాలను

తలచి పుట్టించుతుంది. తెలుపు నలుపు ఎరుపు రంగులతో (సత్వరజస్తమస్సులు) నున్నట్టిది. ఈశ్వరుడికి అన్ని కోరికలను లీలారసాన్ని తీర్చుతున్నది. ఇలాంటి ఆవు వంటిదైన ప్రకృతి ఎవ్వరియందున్నూ పక్షపాతము లేకుండా వారివారి కర్మలననుసరించి ఫలాలను అందించునట్టిది. తమ ఆత్మ, శరీరాలకు మించి వేరయిన దాన్ని ఎరుగని పిల్లవాండ్లు దీన్ని అనుభవించుతున్నారు. కర్మలకు వశము కాని వాడైన ఒకడు దేవుడు తన ఇష్టము ప్రకారము నడచుకొనేవాడు తన వశములో ఉండి తన ఇష్టము ననుసరించి ప్రవర్తించెడి దానిని అనుభవిస్తున్నాడు. హఠాత్తుగా / బలంగా భగవన్తుడు సంకల్పము సృష్టి వ్యాపారాలతో భుజించుతున్నాడు. ఏ ఒక్కనికో చెందక అందరికీ భాగస్వామ్యమున్నట్టిదై కర్మవశ్యులైన జీవాత్మల చేత భుజింపదగిన ఫలాలకనుగుణంగా పరిణమించునట్టిదై పీడింపబడుతూ ఉన్నది. **2) చతుర్వింశతి సంఖ్యాతం అవ్యక్తం వ్యక్తముచ్యతే.** ఇరువది నాలుగు విభాగాలుగా / తత్వాలుగా ఉన్న ఇది అవ్యక్తము వ్యక్తము అని చెప్పబడుతున్నది. అని. ఇక్కడ ప్రకృతి మొదలైన వానియొక్క స్వరూపము చెప్పబడింది. ఈ ప్రకృత్యాదులన్నీ ఏ బ్రహ్మాత్మకాలు అయ్యి ఉన్నవో ఆ పరమపురుషుడు కూడా **తంషడ్వింశకమిత్యాహుః సప్తవింశమథాఽ పరేపురుషం నిర్గుణం సాంఖ్యమ్ అథర్వశిరసోవిదుః** ఆ పరమాత్మను 26 ఇరువది ఆరవ తత్వముగా కొందరు చెప్పుతున్నారు. మరికొందరు ఇరువది ఏడవ తత్త్వము గానూ చెప్తున్నారు. ఆయన పురుషుడు పురము అనగా శరీరము దానిలో, జీవుడిని శరీరమునుగా చేసుకొని అతని హృదయస్థానములో ప్రవేశించి ఉంటున్నాడు కనుక పురుషుడు. ఆయన సత్వరజస్తమో గుణాలు లేనివాడు. జ్ఞానమయుడు అని అథర్వశిరస్సు అనబడే నాల్గవవేదాన్ని అధ్యయనము చేసినవారు తెల్సుకుంటున్నారు / ఉపాసిస్తున్నారు. అని ప్రతిపాదింపబడుతున్నది. మరికొందరు ఆథర్వణికులు **అష్టౌ ప్రకృతయః షోడశవికారాః** ఎనిమిది ప్రకృతులు, పదహారు వికృతులు అని చదువుతున్నారు.

శ్వేతాశ్వతరోపనిషత్తుకు చెందిన వారున్నూ ప్రకృతి పురుషుడు ఈశ్వరులయొక్క స్వరూపాన్ని అధ్యయనం చేస్తున్నారు. **శ్లో॥ సంయుక్త మేతత్క్షరమక్షరంచ వ్యక్తావ్యక్తం భరతేవిశ్వమీశః। అనీశశ్చాత్మా బధ్యతే భోక్తృభావాత్ జ్ఞాత్వాదేవం ముచ్యతే సర్వపాశైః.** ఈ క్షరమనబడే ప్రకృతి, అక్షరమనబడే జీవుడూ కలిసి ఉన్నారు. ఈ వ్యక్తా వ్యక్తాలతో కూడిన విశ్వాన్ని ఈశ్వరుడొక్కడే భరించుతున్నాడు. తనను తాను సంబాళించుకోలేని

ఆత్మయైన జీవుడు భోక్తఐ నందువల్ల ప్రకృతిలోని భోగ్యపదార్థాలను అనుభవించడం కొరకు ప్రకృతిలో ప్రవేశించి దానికి కట్టుబడిపోయి బద్ధుడు అవుతున్నాడు. దానిచేతికి చిక్కుతున్నాడు. ప్రకృతియొక్క యథార్థ స్వరూపాన్ని తెల్సుకున్న జీవుడు ఆనందమయుడై వెలుగుతున్న దేవుడిని తెల్సుకొని ఉపాసించి అన్నిరకాలైన పాపాలనుండి విడుదలను పొందుతున్నాడు. **జ్ఞాజ్ఞౌద్వావజా వీశనీశౌ అజాహ్యేకా భోక్తృభోగార్థయుక్తా। అనన్తశ్చాత్మా విశ్వరూపో హ్యకర్తా్త్రయం యదావిన్దతే బ్రహ్మమేతత్.** జ్ఞానము కలవాడు, జ్ఞానము లేనివాడు అని ఇద్దరు చేతనులున్నారు. ఒకడు ఈశ్వరుడు మరొకడు అనీశుడు. వీరుకాక భోక్తయైన వానియొక్క భోగానుభవము కొరకు కావలసిన పదార్థాలతో కూడిన ఒకామె ఉన్నది. వీరు ఇద్దరికీ ఆత్మఐన వాడు ఏ విషయంలోనైనా అంతములేనివాడు. విశ్వమునందంతటానిండి ఉన్నాడు. దేనికీ కర్తకాడు. ఈ ముగ్గురినీ ఎవడు తెల్సుకుంటున్నాడో వాడు బ్రహ్మను చేరుకుంటున్నాడు. **క్షరమ్ ప్రధానమ్ అమృతాక్షరం హరః। క్షరాత్మానావీశతేదేవఏకః. తస్యాభిధ్యానాత్ యోజనాత్ తత్త్వభావాత్ భూయశ్చాన్తే విశ్వమాయానివృత్తిః** క్షరము అనబడే ప్రధానము నశించే స్వభావము కలది. నాశములేనివాడు ఆనందము కలవాడు హరుడు భోగ్యపదార్థాలను ఆరగిస్తాడు కనుక ఇతడు జీవుడు. ఈక్షర ఆత్మలను దేవుడైన వాడు అదుపులో పెట్టుకొని ఉంటున్నాడు. ఆ దేవుడిని బాగా ధ్యానించడము వలన, మానసికంగా యోగమార్గముతో భగవన్తుడితో కలువడం వల్ల ఇద్దరూ ఒకే తత్త్వము (చైతన్యము) కలవారవడం వల్ల తిరిగి అన్తకాలము నందు ఒక్కదగ్గర చేరుతున్నారు కనుక విశ్వమంతటనూ వ్యాపించి యున్న భగవత్ సంకల్పరూపమైన మాయ / ప్రకృతి నుండి ముక్తి కలుగుతుంది. **ఛన్దాంసియజ్ఞాః క్రతవో వ్రతాని భూతం భవ్యమ్ యచ్చవేదాః వదన్తి / అస్మాన్మాయీ సృజతేవిశ్వమేతత్ తస్మింశ్చాన్యో మాయయా సంనిరుద్ధః। మాయాంతు ప్రకృతిం విద్యాత్ మాయినంతు మహేశ్వరమ్। తస్యావయవభూతైస్తు వ్యాప్తమ్ సర్వమిదంజగత్.** శ్రుతులుయజ్ఞాలు, క్రతువులు వ్రతాలు గడచిపోయినట్టిది, రానున్నది ఏదైతే ఉన్నదో, వేదాలు ఏమి చెపుతున్నవో అదంతా ఈ ప్రకృతి నుండే మాయీ ఐన భగవన్తుడు సృష్టిస్తున్నాడు. ఆ ప్రకృతిలో – మాయలో – భగవన్తుని కంటే వేరయిన మరొక్కడు భగవన్తుని సంకల్పము కారణముగానే బన్ధింపబడుతున్నాడు. మాయ అనగా ప్రకృతి అని తెల్సుకోవాలి. దాన్ని ఏ పురుషుడైతే తన వశములో ఉంచుకొని ఉన్నాడో అతడు మాయీ. ఆయన ఈశ్వరులు అనబడే వారందరికిన్నీ ఈశ్వరుడు. కనుక మహా + ఈశ్వరుడు అనబడుతున్నాడు. ఆయనకు శరీరములోని

అవయవాలు ఐన చిత్ అచిత్తులతో ఈ జగత్తు అంతా నిండి ఉన్నది అని. దీని తర్వాత కూడా **ప్రధానక్షేత్రజ్ఞ పతిర్గుణేశః సంసార మోక్షస్థితి బన్ధహేతుః** ఆయన ప్రధానము – ప్రకృతి, క్షేత్రజ్ఞుడు – జీవుడు ఇద్దరికినీ ప్రభువు. సత్త్వర జస్తమస్సులనే గుణాలకు శాసకుడు. పుట్టుట చచ్చుట అనే సంసారములో పరిభ్రమించడానికి, దానినుండి విడుదల చేయబడడానికి, లేదా అందులోనే కొనసాగడానికి, మరింతగా కర్మబన్ధాలతో కట్టివేయడానికిన్నీ కారణమైనవాడు అని చెప్పబడింది.

స్మృతి కూడా **ప్రకృతింపురుషంచైవ విద్ధ్యనాదీ ఉభావపి। వికారాంశ్చ గుణాంశ్చైవ విద్ధిప్రకృతి సమ్భవాన్। కార్యకారణకర్తృత్వేహేతుః ప్రకృతిరుచ్యతే। పురుషః సుఖదుఃఖానాం భోక్తృత్వేహేతురుచ్యతే। పురుషః ప్రకృతిస్థోహిభుంక్తే ప్రకృతిజాన్ గుణాన్। కారణం గుణసంగోఽస్య సదసద్యోని జన్మసు॥** ఓ అర్జునా! ప్రకృతి పురుషులు ఇద్దరున్నూ ఎప్పటినుండి ఉంటున్నారో తెలియదు కనుకనే వారిని అనాదులు అని అంటున్నారు. వికారాలు, సత్త్వరజస్తమో గుణాలు ప్రకృతినుండి పుడుతున్నాయి అని తెల్సుకో. కార్యము, కారణము, కర్తృత్వములలో ప్రకృతి హేతువు అని చెప్పబడ్తున్నది. పురుషుడు సుఖదుఃఖాలను అనుభవించడంలో భోక్తృత్వము నందు హేతువని చెప్పబడుతున్నాడు. పురుషుడు ప్రకృతిలో దూరి ప్రకృతినుండి పుట్టే గుణాలను అనుభవించుతున్నాడు. అదే మంచి–చెడు జన్మలలో పుట్టడానికి కారణమవుతున్నది. గుణములతో సంగమే జీవుడి అవస్థలకు హేతువు. **సత్త్వంరజస్తమః ఇతిగుణాః ప్రకృతి సమ్భవాః। నిబధ్నన్తి మహాబాహోదేహేదేహినమవ్యయమ్॥** సత్త్వరజస్తమస్సులు అనే గుణాలు ప్రకృతి నుండి పుడుతున్నవి. సహజస్వరూపములో ఎట్టి మార్పులు లేని జీవుడిని దేహి ఐనవాడిని దేహంలో బన్ధిస్తున్నవి. అదేవిధంగా **సర్వభూతానికౌన్తేయప్రకృతిం యాన్తి మామికామ్। కల్పక్షయేపునస్తాని కల్పాదౌవిసృజామ్యహమ్॥ ప్రకృతిం స్వామవష్టభ్యవిసృజామిపునః పునః। భూతగ్రామమిమం కృత్స్నమ్. అవశం ప్రకృతేర్వశాత్. మయాఽధ్యక్షేణ ప్రకృతిః సూయతే సచరాచరమ్। హేతునాఽ నేన కౌన్తేయ జగద్విపరివర్తతే॥** ఓ అర్జునా! కల్పము ముగిసినవేళలో ఈ ప్రాణులు అన్నీ నాదైన ప్రకృతిలో కలిసిపోతాయి. తిరిగి వాటిని కల్పము మొదలైనప్పుడు నాలో నుంచి బయటకు పంపిస్తాను. నాదైన ప్రకృతిని ఆధారంగా చేసుకుని మాటికిమాటికి ఇట్లాగే సృష్టిస్తున్నాను. ఈ భూతాలు అన్నీ కూడా ప్రకృతికి లొంగియున్నందున తమ ఇష్టానుసారము వర్తించలేవు. ఐతే ఈ ప్రకృతి స్వతంత్రంగా సృష్టి చేయజాలదు.

నేను దానికి అధ్యక్షుడినై ఉండగా చరాచరములన్నింటినీ ప్రకృతి సృష్టించుతుంది. ఈ కారణంగా జగత్తు వివిధములుగా మార్పులను చెందుతూ ఉంటుంది అని. అందువలన అబ్రహ్మాత్మకమైన కపిలుడు చెప్పిన సాంఖ్యతంత్రములో నిశ్చయింపబడిన ప్రకృత్యాదులు నిరసింపబడ్డున్నవి.

శ్వేతాశ్వతరోపనిషత్తులో ఈ విధంగా వినిపిస్తున్నది. **అజామేకామ్ లోహితశుక్ల కృష్ణాం బహ్వీః ప్రజాః సృజమానాం సరూపాః। అజోహ్యేకో జుషమాణోఽనుశేతే జహాత్యేనాం భుక్తభోగామజోఽ**న్యః పుట్టుక లేనిది ఐన ఒకతి ఎరుపు తెలుపు నలుపు వర్ణాలు కలది తనతో సమానమైన రూపములు కల అనేకులైన బిడ్డలను కంటున్నది. పుట్టుకలేని వాడొకడు ఆమె యందు అనురాగము కలవాడై ఆమెతో కలిసి మెలసి ఉంటున్నాడు. పుట్టుకలేని మరొక్కడు ఇతరునిచే అనుభవింపబడిన ఈమెను వదలిపెడుతున్నాడు. అని. అచ్చట సందేహము ఏర్పడుతున్నది. ఈ మన్త్రములో తన్త్రసిద్ధమైన కేవల ప్రకృతి చెప్పబడుతున్నదా! లేక బ్రహ్మతో సమ్బన్ధము కల ప్రకృతి చెప్పబడుతున్నదా! అని.

ఏది తగునని అంటే కేవల ప్రకృతియేనని చెప్తున్నాము. ఎందుకనగా **అజామేకామ్** అని చెప్తున్నందువల్ల పుట్టుకలేనిది కావున ఒకరిచే సృష్టింపబడి కార్యము కాదు అని తెలుస్తున్నది గనుక. **బహ్వీఃప్రజాః సృజమానాం సరూపాః** అని స్వతన్త్రంగా తన ఇష్టము ప్రకారమే తనతో సమానరూపాలు గల చాలామంది పిల్లలను సృష్టించుతున్నటువంటిదిగా వినిపిస్తున్నందువల్ల.

ఈ విధంగా పూర్వపక్షము ఎదురుపడితే చెప్తున్నాము. చమసము వలె ఇతర సమర్థకమైన వాక్యము యొక్క సహాయము లేకుండా నిర్ణయించడానికి అవకాశము లేదు కనుక. ఇక్కడ తన్త్ర సిద్ధమైన ప్రకృతి చెప్పబడడంలేదు. ఎందువల్లనంటే నజాయతేఽపుట్టడము లేదు కనుక అజా అని అంటున్నాము. అందువల్ల తన్త్ర సిద్ధమైన అజా అని నిర్ణయించడంలో విశేషము ఏదీ కనిపించడం లేదు. ఎలాగంటే చమసము వలె. **అర్వాగ్బిలః చమస ఊర్ధ్వబుధ్నః.** పైకి కొబ్బరికుడుక వంటి ఆకారము గలిగి దిగువ భాగంలో రంధ్రము కల్గినట్టిది. చమసము అనే మన్త్రములో అది తినడానికి పనికివచ్చే ఒక సాధనంగానే చమస శబ్దముతో తెలియబడుతున్నదే కాని అంతమాత్రము చేత అది ఒక విశేషము కల వస్తువుగా తెలియరావడం లేదు. సాధారణంగా రూఢి అర్థాలను చెప్పే పదాలకు భిన్నంగా యోగికార్థాలను తెలియచెప్పే వస్తుసామర్థ్యము ప్రకరణము

మొదలైన అర్థవిశేషాలను నిర్ణయించే వాటితోడు లేకుండా ఇది ఈ పదానికి అర్థము అని విశేషార్థాన్ని నిశ్చయించడం కుదరదు. అది ఎట్లాగంటే **ఇదం తచ్ఛిరః ఏషహి అర్వాగ్‌బిలః చమసఊర్ధ్వబుధ్నః** ఇది దానియొక్క శిరస్సు, ఇది కదా పైకి గుండ్రని ఆకారాన్ని కలిగి దిగువన బిలము / రన్ధ్రము కలిగియున్నట్టి చమసము. ఇత్యాదియైన వాక్యశేషముతో శిరస్సునకు చమసత్వనిశ్చయము చేయబడినది. అదే తీరుగా ఇక్కడ కూడా అర్థము ప్రకరణము మున్నగు వాని ద్వారానే అజా శబ్దము యొక్క అర్థము నిర్ణయింపబడాల్సి ఉన్నది. ఇక్కడ కపిలతన్త్రమైన అజాను గ్రహించడానికి తగిన హేతువులు ఏవీ కనిపించడం లేదు. ఈ అజా అనబడే ప్రకృతికి స్వతంత్రంగానే సృష్టిచేసే సామర్థ్యము ఉన్నట్లు స్ఫురించడం లేదు. **బహ్వీః ప్రజాః సృజమానాం** అని స్రష్టృత్వము మాత్రమే తోస్తున్నది. ఇందువల్ల ఈ మన్త్రము వలన బ్రహ్మాత్మకముకాని అజా చెప్పబడడం లేదు.

బ్రహ్మాత్మకమైన అజాను గ్రహించడంలోనే విశేషకారణము ఉన్నదని చెపుతున్నాడు.

సూ॥ **జ్యోతిరుపక్రమాతు తథాహ్యధీయతేఏకే 1-4-9** సూత్రములోని తుశబ్దము అవధారణార్థకము. ఈ అజా బ్రహ్మను కారణముగా కలదియే. జ్యోతిః అనగా బ్రహ్మ. **తందేవాః జ్యోతిషాం జ్యోతిః** దేవతలందరూ ఆ జ్యోతిస్సులకు – ప్రకాశించేవారికి – జ్యోతి వెలుగులనిచ్చేవాడిని. **అథయదతః పరోదివోజ్యోతిర్దీప్యతే.** ఇక దీనికంటే పైన ద్యులోకములో ఏ జ్యోతి వెలుగుతున్నదో ఇత్యాది శ్రుతుల ద్వారా ప్రసిద్ధి ఉన్నది కాబట్టి జ్యోతి రుపక్రమణికా – బ్రహ్మను కారణముగా కలది అని అర్థము. తథాహ్యధీయతేఏకే – అట్లాగని కొందరు చదువుతున్నారు కదా! హి అనుపదము హేత్వర్థములో నున్నది. ఏ కారణంగానైతే అజా శబ్దానికి బ్రహ్మకారణికత్వాన్ని తైత్తిరీయులు అనే ఒక శాఖ వారు చదువుతున్నారు. **అణోరణీయాన్ మహతో మహీయాన్ ఆత్మా గుహాయాంనిహితోఽస్యజన్తోః.** అణువుకంటే చిన్నవాడు. మహత్తు అనబడే పెద్ద కొండ వంటి దానికన్నా ఎత్తుగా ఉన్నట్టి, బరువైనట్టివాడు ఐన ఆత్మశబ్దానికి అర్థమైన పరమాత్మ ఈ చావు పుట్టుకలను కల్గియున్న జీవుని యొక్క హృదయగుహాలో నెలకొని ఉన్నాడు. అని హృదయగుహాలో ఉపాస్యుడుగా బ్రహ్మ అందుబాటులో మరీ దగ్గరగా ఉన్నాడని చెప్పి **సప్త ప్రాణాః ప్రభవన్తి తస్మాత్** ఆయననుండి ఏడువిధాలైన ప్రాణాలు పుడుతున్నవి. ఇత్యాది వాక్యముతో సర్వలోకాలు బ్రహ్మాదులందరూ ఆయన నుండే పుడుతున్నారని

చెప్పి అన్నింటికీ కారణభూతురాలైన అజా ఆయన నుండే పుడుతున్నదని చెప్పబడుతున్నది.

**అజామేకాం లోహిత శుక్లకృష్ణామ్ బహ్వీం ప్రజాం జనయన్తీమ్ సరూపామ్। అజోహ్యేకోజుషమాణోఽనుశేతే జహత్యేనాం భుక్త భోగాం అజోఽన్యః** అని. ఆయన కంటే వేరుగా ఉన్న సమస్తానికి ఆయన నుండే ఉత్పత్తి జరుగుతున్నది అని తెలుస్తున్నందువల్ల బ్రహ్మాత్మకత్వాన్ని ఉపదేశించుతూ ఆసృష్టి ప్రక్రియ నారంభించుతున్న సమయంలో చెప్పబడుతున్నందువల్ల ప్రాణము, సముద్రము, పర్వతాలు మొదలైన వాటివలెనే పుట్టించుతున్నదై కర్మవశ్యుడైన జీవాత్మతో భుజింపబడుతూ, పైపై మెరుగులకు లోబడిపోయే వాడు గాక అన్నింటి మర్మాలను బాగా తెల్సిన విద్వాంసుడుగాబట్టి చిదచిత్తులకూ ఆత్మయైన బ్రహ్మచేత విడిచిపెట్టబడ్తూ ఉన్నదై బ్రహ్మనుండి పుట్టినది బ్రహ్మతో సమ్బన్ధము కలిగి బ్రహ్మాత్మికఐ ఉన్నది ఈ అజా అనబడే ప్రకృతి అని అర్థము చేసుకోవాలి.

ఇందువల్ల వాక్యశేషాన్ని బట్టి చమసవిశేషాన్ని వలె ఇతర శాఖకు చెందిన ఈ అజాతో పోలిక కలిగిన దానివల్ల అదీ ఇదీ రెండూ ఒక్కటే అనే ప్రత్యభిజ్ఞాయమానమైన అర్థాన్ని కల్గిన వాక్యము వల్ల బ్రహ్మాత్మికమైనది ఈ అజా అని నిశ్చయింపబడుతున్నది. ఇక్కడ కూడా ఈ ప్రకరణాన్ని ఆరంభించే సమయంలో **కింకారణం బ్రహ్మ** సృష్టికి బ్రహ్మనే కారణమా? అని ఆరంభించి **తేధ్యానయోగగతాః అపశ్యన్ దేవాత్మ శక్తిమ్ స్వగుణైః నిగూఢామ్** వారు ధ్యానయోగము నందు నిల్చినవారై దైవికమైన ఆత్మ శక్తి గలదై తనవైన గుణాలతో తేటగా తెలియరాని దానిని చూచినారు. అని పరబ్రహ్మయొక్క శక్తి స్వరూపము గల అజను అర్థము చేసుకొని, దానికిపైన **అస్మాత్మాయీ సృజతే విశ్వమేతత్, తస్మింశ్చాన్యోమాయయా సన్నిరుద్ధః. మాయాంతు ప్రకృతిమ్ విద్యాత్ మాయినంతు మహేశ్వరమ్. 1) యో యోనింయోనిమధితిష్ఠ త్యేకః** 1. ఎవడైతే ప్రతిజన్తువులోనూ అధిష్ఠించి ఉన్నాడో అతడు ఒక్కడే. అనిన్నీ ఆ బ్రహ్మాత్మికయైన అజా / ప్రకృతే తోస్తున్నందువల్ల ఈ మన్త్రము నందు తన్త్రసిద్ధము ఐన స్వతంత్ర ప్రకృతిని గురించి తోచే ప్రతిపత్తి కలిగే అవకాశమే లేదు.

అట్లాగే ఐనట్లయితే జ్యోతిస్సు నుండి పుట్టుకొచ్చిన ఎరుపు, తెలుపు నలుపు రంగులు కల ఈ ప్రకృతికి అజాత్వము – పుట్టుకలేనిది అనే పేరు రావడము ఎట్లా

జరుగుతుంది? అజా ఐన దానికి అనగా అసలే పుట్టక లేనిదానికి జ్యోతిరుపక్రమాత్వము ఎట్లా పొసగుతుంది? అని అంటే సమాధానమును చెపుతున్నాడు.

సూ॥ **కల్పనోపదేశాచ్చ మధ్వాదివదవిరోధః 1–4–10** సృష్టి చేయబడుతున్నదని చెప్తున్నందువల్ల, సూర్యడిని మధుకల్పన చేసినట్లవు తున్నందున విరోధము లేదు. ప్రాసంగికముగా వచ్చిన శంకను తొలగించడానికోసము సూత్రంలో చ శబ్దము చెప్పబడింది. ఈ ప్రకృతికి అజాత్వము – పుట్టుక లేకపోవడము, జ్యోతిరుపక్రమాత్వము – బ్రహ్మ చేత సృష్టించబడడమున్నూ చక్కగా పొసగుతవి. వైరుధ్యము లేదు. ఎందువల్ల అంటే కల్పనను గురించి చెప్పినారు. కనుక. కల్పనము అనగా సృష్టి. మొత్తమ్మీద అర్థమేమనగా జగత్తంతా సృష్టింపబడింది అని చెప్పినందువల్ల అని తెల్సుకోవాలి. ఎట్లాగైతే **సూర్యాచంద్రమసౌధాతా యథాపూర్వమకల్పయత్** సూర్యచంద్రులను బ్రహ్మముందటి ప్రళయకాలానికి ముందున్న తీరుగానే పుట్టించినాడు. అని కల్పనం సృష్టి అని. ఇక్కడ కూడా **అస్మాన్మాయీ సృజతే విశ్వమేతత్** ఈ ప్రకృతి నుండే మాయను స్వాధీనములో నుంచుకొన్నవాడు. ఈ విశ్వాన్ని సృష్టించుతున్నాడు. అని జగత్ సృష్టి క్రమము ఉపదేశింపబడుతున్నది. తనదైన చిదచిత్తులను వేరు చేయకముందున్నటువంటి కారణరూపమైన ఈ సూక్ష్మావస్థ నుండి, కారణమైనదాని నుండి మాయి ఐన సర్వేశ్వరుడు ఈ జగత్తును మొత్తాన్ని సృష్టించుతూ ఉన్నాడని అర్థము. ఈ విధంగా సృష్టిని గురించి ఉపదేశించినందువల్ల ఈ ప్రకృతికి కార్యము, కారణము అనే రూపంలో ఉన్న రెండు అవస్థలతో పొత్తు ఉన్నదని తెలుస్తున్నది. ఆ ప్రకృతి ప్రళయకాలము నందు బ్రహ్మతను పొంది / బ్రహ్మ అనబడి / బ్రహ్మలో చేరి వేరుగా లేక చూచేవారికి ఒక్కటే అని అనిపించి, బ్రహ్మకు తనకూ విడివిడిగా నామము రూపమూ లేక సూక్ష్మమైన రూపంతో బ్రహ్మలో ఉంటుంది. సృష్టి సమయములో మాత్రము సత్వాదిగుణాలు పెల్లుబికి రాగా వేరు చేయబడిన నామము రూపములను కలదిఐ వ్యక్తము, మహత్తు మొదలైన శబ్దాలతో / పేర్లతో పిలవబడుతున్నదై తేజస్సు, నీరు, భూమి మొదలైన రూపాలతో పరిణమించి లోహిత, శుక్ల, కృష్ణ ఆకారాలు కలదై ఉంటుంది. ఇందువల్ల కారణావస్థలో ఉన్నపుడు అజా అనబడుతుంది. కార్యావస్థలో జ్యోతిరుపక్రమా అని అనబడుతుంది. కావున విరోధము ఏమీ లేదు. మధ్వాదివత్ – మధ్వాదులవలె. ఎట్లాగైతే – ఈశ్వరుడు ఆదిత్యుడిని కారణావస్థలో ఒక్కడుగానే ఉన్న వాడిని కార్యావస్థయందు ఋక్ యజుస్సామ అధర్వములనబడే వేదాలలో

ప్రతిపాదింపబడిన కర్మలచేత పుట్టింపబడిన రసానికి ఆశ్రయమైనందువల్ల వసువులు మొదలైన దేవతలయొక్క అనుభవం కొరకు మధువునుగా సృష్టించడం, ఉదయించడం, అస్తమించడం అనే వాటిని సృష్టించినాడో, అవి ఎట్లాగా విరుద్ధములు కావో అదేవిధంగా ప్రకృతికి కూడా అజాత్వము అనే ధర్మము, జ్యోతిరుపక్రమాత్వమున్నూ పరస్పర విరుద్ధాలు కావు. అందుకే మధువిద్యయందు ఈ విధంగా చెప్పబడింది. **అసౌవా ఆదిత్యోదేవమధు** అని మొదలుపెట్టి **అథతత ఊర్ధ్వముదేత్య నైవోదేతా నాస్తమేతా, ఏకల ఏవమధ్యే స్థాతా.** అనేంతవరకూ, ఏకలః ఒకే విధమైన స్వభావము కలవాడై. కనుక ఈ మన్త్రము చేత బ్రహ్మాత్మికఐన అజా అనబడే ప్రకృతియే చెప్పబడుతున్నది. కాపిల తన్త్రము నందు చెప్పబడిన ప్రధానము కాదు అని నిశ్చితమైనది.

కొందరు ఇట్లా అంటున్నారు. ఈ మన్త్రంలో తేజస్సు నీరు భూమి అనబడే రూపాలు కల అజా ఒకటి చెప్పబడుతున్నది అని. వారిని ఈ విషయంలో అడుగవలసిన ప్రశ్నలు కొన్ని ఉన్నాయి. 1) తేజోఽబన్నాలే తేజోఽబన్నాత్మికా అజా అనేది ఒక్కటేనా? 2) లేక తేజోఽబన్నరూపుడు బ్రహ్మనేనా? 3) తేజోఽబన్నాలకు కారణమైనది ఐన ప్రకృతి, బ్రహ్మలకంటే వేరైన ఏదో ఒక వస్తువా? అని. మొదటికల్పము ప్రకారమైతే తేజస్సు నీరు భూమి అనబడేవి ఒక్కటే కాక అనేకాలుఐ ఉన్నవి కావున **అజామేకాం "అజను ఒక్కదానిని"** అని చెప్పడం కుదరదు. తేజోఽబన్నాలు అనేకాలు ఐనప్పటికీ త్రివృత్ కరణము – మూడింటినీ కలిపివేసినందున వాటిలో అధిక మొత్తంలో దానిని ఆ పదార్థంగా చెపుతున్నాముకాని అవి అన్నీ ఒక్కచోట కనిపిస్తున్నవి కనుక ఒకటే – చేసినందువల్ల ఒక్కటిగానే వ్యవహరింపబడుతున్నవి కదా! అని పలుకవద్దు. త్రివృత్ కరణము చేసినప్పటికీ ఏకత్వము రాలేదు. బహుత్వము తొలగిపోలేదు. **ఇమాఃతిస్రోదేవతాః 2) తాసాంత్రివృతం త్రివృతం ఏకైకాం కరవాణి.** అని ప్రతిఒక్కదానిని మూడు భాగాలు కలదానినిగా చేసినట్లు తెలుస్తున్నది. ఇక రెండవ కల్పము మళ్ళీ రెండుగా విడదీసి ఆలోచించవలసి ఉన్నది. తేజోఽబన్న రూపాలుగా వికారాలను పొందిన బ్రహ్మనే – ప్రకృతే – అజా ఒక్కటేనా? లేక తనదైన రూపము తోనే వికారాలు లేకుండా ఉన్నదా? అని. మొదటి కల్పముతో బహుత్వము తొలగిపోలేదు గనుక పక్కకు తోసివేయబడుతున్నది. ఇక రెండవకల్పములో కూడా **లోహిత శుక్లకృష్ణామ్** ఎరుపు తెలుపు నలుపు కలది అనడంతో అదే వైరుధ్యము ముందుకు వస్తున్నది. పోతే మూడవదైన కల్పములో కూడా అజా శబ్దంతో తేజోఽబన్నాలను

నిర్దేశించి వాటితో, వాటికి కారణావస్థ ఏదో ముందు బెట్టాల్సి ఉంటుంది. దానికంటే అజా శబ్దంతో తేజోఽబన్నకారణావస్థను పొందియున్న దైన (కారణావస్థ బ్రహ్మతను పొందిన) శ్రుతి ప్రసిద్ధిగల ప్రకృతిని గురించి చెప్పుకోవడమే ఎంతో మేలు.

ఏదైతే ఈ ప్రకృతికి అజా శబ్దముతో (మేక) ఛాగత్వమును కల్పించుకోవాలని చెప్పబడ్తున్నదని అన్నారో అది కూడా అసంగతమైనట్టిదే. అట్లా మేకనుగా కల్పించుకోవడము వల్ల కలిగే ప్రయోజనము ఏదీ లేదు కనుక. ఎట్లాగైతే **ఆత్మానం రథినంవిద్ధి** ఇత్యాదుల యందు బ్రహ్మప్రాప్తికి ఉపాయతను తెలుపడం కొరకు. శరీరాదులను రథము రథి గుఱ్ఱాలుగా ఆరోపించి చెప్పడం జరుగుతున్నదో, 2) సూర్యుడియందు వస్వాదిదేవతలయొక్క భోగము కొరకు మధువునుగా కల్పన / సృష్టి చేయబడుతున్నదో వాటివలెనే ప్రకృతిని మేకగా కల్పన/సృష్టి చేయడము దేనికి ఉపయోగపడుతుంది? కేవలము ఉపయోగము లేకపోవడమేకాదు పైపెచ్చు విరోధము కూడా ఏర్పడుతుంది. సమస్త జగత్తుకు కారణమైన, తనతో అనాదికాలము నుండి కట్టుబడియున్న చేతనులందరికిన్నీ అన్నిరకాలైన సుఖదుఃఖాలను అనుభవించుటకు, మోక్షానికీ సాధనమైన, చైతన్యములేని, అత్యల్పులైన ప్రజాసర్గమును చేయగల, తనకులేని, వచ్చిచేరిన వానియొక్క సంగమము వలన చేతన విశేషమైనదానితో భేదము లేక ఏకరూపమును పొందిన అత్యల్పప్రయోజనాన్ని సాధించడానికి మాత్రమే పరిమితమైన సాధనమైనట్టిది, తనను వదలిపెట్టడానికి కారణము కాని, తనతో సంబన్ధియైన దానిని / వానిని పరిత్యాగము చేయడానికి సమర్థత కలిగిన చేతన విశేషరూపమైన ఛాగము యొక్క స్వభావాన్ని ప్రకటించడం కొరకు ఆ రూపము కల దానినిగా / ఛాగము / మేకగా కల్పించడము విరుద్ధమే అవుతుంది. **1) అజామేకాం 2) అజోహ్యేకః 3) అజోఽన్యః** అనేచోట్ల కనిపిస్తున్న అజా శబ్దమునకు పొసగని/ విరూపమైన అర్థాన్ని కల్పించి చెప్పడము మంచిదికాదు. ఒక్కచోట పై మూడు స్థలాల్లోనూ అజా శబ్దానికి మేక అనే అర్థాన్నే చెప్తాము అని అంటే **జహాత్యేనాం భుక్త భోగామజోఽన్యః** అనుచోట అజశబ్దం చేత చెప్పబడే బొత్తిగా ప్రకృతితో సంబన్ధాన్ని వదులుకున్న విద్వాంసుడికి [పరమాత్మకు] లేదా మరొకడికి (జీవుడికి) తిరిగి సంబన్ధము ఉండడానికి అవకాశమున్న భాగముగా పరికల్పనము బొత్తిగా విరుద్ధమే/ ఇట్లా ఛాగముగా కల్పన చేయడానికి కారణములేదు, ప్రయోజనమూ లేదు కనుక ఇట్లా కల్పించడాన్ని దూరంగా తోసి వేస్తున్నాము. అని చమసాధికరణము ముగిసింది.

★ ★ ★

## ఇక సంఖ్యోపసంగ్రహాధికరణము

సూ॥ **నసంఖ్యోపసంగ్రహాదపి. నానాభావాదతిరేకాచ్చ 1-4-11** సంఖ్య సమానముగా ఉన్నప్పటికీ ప్రకృతి జగత్ కారణము కాదు. ఆ సంఖ్యలో అనే కాలు ఉన్నవి. కొండొకచో ఎక్కువగా కూడా కనిపించుతున్నవి. వాజసనేయ శాఖవారు పఠిస్తున్నారు. **యస్మిన్ పంచపంచజనాః ఆకాశశ్చ ప్రతిష్ఠితః. తమేవంమన్య ఆత్మానం విద్వాన్ బ్రహ్మమృతోఽమృతమ్.** ఎవనియందైతే ఐదు ఐదుగురుజనులు ఆకాశమును నెలవుకొని ఉన్నాయో అటువంటి ఆత్మను గురించి తెల్సినవిద్వాంసుడు బ్రహ్మ భావాన్ని పొందుతాడు. ఆనందస్వరూపుడౌతున్నాడు. అని. ఈ మంత్రము కపిలుని సాంఖ్యశాస్త్రములో ప్రతిపాదింపబడిన తత్వాలను ప్రతిపాదించేదా? లేదా అని సందేహింపబడుతున్నది. రెండింటిలో ఏది తగును అని అంటే తంత్ర సిద్ధమైన తత్వాలను ప్రతిపాదించేదే అని అంటున్నాము. ఎందుకంటే? పంచ (ఐదు) శబ్దముతో విశేషింపబడిన పంచజనశబ్దము వల్ల ఇరువది ఐదు తత్వాలు తెలియవస్తున్నాయి కాబట్టి. అనగా చెప్పబడుతున్న విషయమిది. పంచ జనాః అనే సమాసము సమాహారానికి చెందినది. ఐదు ఐదుగురు జనులు ఉన్న జన సమూహాలు. పంచపూల్యః అన్నదానివలె. ఇక్కడ సమూహము ఐనపుడు పంచజనమ్ కావలసి ఉంటుండగా పుంలింగముగా ప్రయోగింపబడిందంటే కారణము వైదికప్రయోగమే. అందువలన సాధువే. లింగవ్యత్యయము దోషము కాదు. అవి ఎన్ని సమూహాలు అని అన్నప్పుడు పంచ జన శబ్దానికి విశేషణమైన మన్త్రములోని మొదటి పంచశబ్దముచేత ఐదుగురున్న గుంపులు ఐదు అని తెలుస్తున్నది. ఎట్లాగంటే పంచపంచపూల్యః అని అన్నట్లు. ఇందువల్ల పంచపంచజనాః అని పంచవింశతి పదార్థాలు అని అర్థమైనపుడు అవిఏవి అని తెల్సుకోవలసి వచ్చినప్పుడు మోక్షాధికారము ఉన్నందువల్ల ముముక్షువులచేత తెల్సుకోదగినటువంటివిగా స్మృతిలో ప్రసిద్ధాలైన ప్రకృతి మొదలైనవియే అని తెలుస్తున్నది. **మూల ప్రకృతిః, అవికృతిః, మహదాద్యాః ప్రకృతి వికృతయః సప్త। షోడశకశ్చ వికారోన ప్రకృతిః నవికృతిః పురుషః.** మూల ప్రకృతి వికారము లేనిది. మహత్తు మొదలైనవి ఏడు ప్రకృతి వికృతులు. పదహారు వికృతులు. ప్రకృతీ వికృతి కానివాడు పురుషుడు ఒకడు. మొత్తము ఇరువది ఐదు. అని కపిలమతస్థుల నిర్ణయమున్నది. కనుక ఇది తన్త్ర సిద్ధతత్వాన్ని ప్రతిపాదించేది అని నిర్ణయము.

ఇట్లాగా పూర్వపక్షము ఏర్పడగా దీనికి సమాధానాన్ని చెప్తున్నాము. నసంఖ్యోపసంగ్రహోదపి అని. పంచజనాః అని పంచవింశతి సంఖ్యను గురించి తెలుస్తున్నప్పటికీ తన్త్రసిద్ధమైన తత్త్వాలను గురించి తెలియరావడము లేదు. ఎందువల్లనంటే ఆతత్త్వాలు ఇరువై ఐదే అని నిర్ణయము లేక నానారకాలుగా ఉన్నది కాబట్టి. ఈ ఐదు సంఖ్యతో విశేషింపబడిన పంచజనులకు తన్త్రసిద్ధాలైన తత్త్వాలకంటే వేర్పాటు ఉన్నందువల్ల. **యస్మిన్ పంచజనా ఆకాశశ్చ ప్రతిష్ఠితః** అని వీటికి యత్ శబ్దము చేత నిర్దేశింపబడిన పరబ్రహ్మను ఆశ్రయించి ఉన్నవి అని తెలుస్తున్నందువల్ల అవి అన్నీ బ్రహ్మాత్మకాలు అని అర్థమవుతున్నది. **తమేవం మన్య ఆత్మానం విద్వాన్ బ్రహ్మఽమృతోఽమృతమ్** అనే వాక్యము నందు **తమ్** అని పరామర్శ చేసినందువలన యత్ శబ్దము చేత నిర్దిష్టుడైనవాడు బ్రహ్మ అని నిర్ధారణ అవుతున్నది. ఇందువల్ల వాటికంటే వేరయినవి పంచజనాః అనేవి అనే కారణంతో పంచజనాః అనేవి తన్త్రసిద్ధాలు కావు ఇవి.

ఇంకా ఈ తత్త్వాలు ఇరువది ఐదే కాకుండా ఎక్కువగా కూడా ఉన్నవి. తన్త్ర సిద్ధాలైన తత్త్వాలకంటే ఈ మన్త్రము నందు అధికంగా ఉన్నట్లు తెలుస్తున్నవి. యత్ శబ్దము చేత చెప్పబడిన ఆత్మ, ఆకాశమున్నూ ఇక్కడ ఎక్కువగా ఉన్నాయి. కనుక **తంషడ్వింశకమిత్యాహుః. సప్తవింశమథాఽపరే** పరమాత్మను ఇరువది ఆరవ తత్వంగా కొందరు పరిగణిస్తుంటే ఇరువది ఏడవ తత్వంగా కొందరు చెపుతున్నారు. అని ఇక్కడ శ్రుతి ప్రసిద్ధుడైన సర్వతత్త్వాలకూ ఆశ్రయముఐన సర్వేశ్వరేశ్వరుడు పరమ పురుషుడు ఈ మన్త్రము నందు చెప్పబడుతున్నాడు. **న సంఖ్యోపసంగ్రహోదపి** అను సూత్రములోని అపిశబ్దము చేత, పంచపంచజనాః అనుచోట పంచవింశతి తత్త్వాలు ఉన్నాయనితోచనేతోచడం లేదు. అని అభిప్రాయము. ఎట్లాగా అంటే. పంచ సంఖ్యతో ఆరబ్ధమైన సమూహాలు ఐదు అనేవిలేవు కాబట్టి. తన్త్ర సిద్ధతత్త్వాలలో ఐదు ఐదింటిలో అనువర్తించే ఒక్క గుంపుగా చేర్చడానికి వీలయ్యే జాత్యాదులు లేవు. ఐతే మీరిట్లా అనకూడదు. ఐదు కర్మేంద్రియాలు, ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు మహాభూతాలు, ఐదు తన్మాత్రలు – శబ్ద స్పర్శరూపరసగన్ధాలు, మిగిలినవి ఐదు అని అవాన్తర సంఖ్యానివేశము ఉన్నది కదా! అని కానీ ఇక్కడ ఆకాశాన్ని విడిగా చెప్పినందున ఐదు గుంపులుగా చెప్పినవాటిల్లో నాలుగు మహాభూతాలే మిగిలి ఉంటున్నవి కనుక ఐదు

మహాభూతాల సముదాయము ఏర్పడడం లేదు. కనుక పంచజనాః అనేది సమాహార విషయము కాదు. ఇది **దిక్ సంఖ్యే సంజ్ఞాయాం** అని సంజ్ఞకు సమ్బన్ధించినట్టిది. అదేకాకపోతే పంచజనాః అని లింగము మారిపోతుంది. దాన్ని నిర్వహించడమూ క్లిష్టము అవుతుంది. పంచజనాః అనేపేరుతో కొందరు ఉన్నారు. వాళ్ళు పంచసంఖ్యతో విశేషింపబడుతున్నారు. కనుక పంచ పంచజనులు అని చెప్పడము సప్తసప్తర్షులు – అన్నట్లు వ్యవహరింపబడ్తున్నారు.

ఐతే ఆ పంచజనులు ఎవరు? అని అంటే వివరిస్తున్నారు.

సూ॥ **ప్రాణాదయో వాక్యశేషాత్ 1-4-12** వాక్యము యొక్క శేషము వలన ప్రాణాదులని తెలుస్తున్నది. **ప్రాణస్యప్రాణముత చక్షుషశ్చక్షుః శ్రోత్రస్యశ్రోత్రమన్నస్య అన్నమ్ మనసోయే మనోవిదుః.** ప్రాణశబ్దానికి అర్థము త్వగింద్రియము. దానికి స్పర్శను తెలియజేసేవాడు. చక్షువునకు చూపును ఇచ్చేవాడు, చెవికి వినికిడిని అందించేవాడు. అన్నము అనగా నాలుక ముక్కు అని అర్థాలు. ఆ రెండింటికీ ఆయా శక్తులను ప్రసాదించేవాడు మనస్సుకు మనస్సు ఐనవాడుగా ఎవరు తెల్సుకుంటున్నారో అని వాక్యశేషము వలన ప్రాణాదులు అన్నీ బ్రహ్మను ఆశ్రయించి బ్రహ్మపై ఆధారపడి ఉన్నట్టి పంచజనులు అని తెలుస్తున్నది. వారెందరు అని అన్నప్పుడు ఐదుగురు అని అర్థము చేసుకోవలసి ఉన్నది.

ఐతే ఇట్లాకావచ్చును కాణ్వులకు మాధ్యందినులకున్నూ యస్మిన్ పంచపంచజనాః అనే మన్త్రము సమానంగానే ఒక్కతీరుగానే ఉన్నది. ప్రాణస్యప్రాణమ్ ఇత్యాదివాక్యశేషము నందు మాత్రము అన్నస్య అన్నమ్ పాఠము లేదు. వారి విషయంలో పంచపంచజనాః అనగా ప్రాణాదులు అని చెప్పడానికి అవకాశములేదుకదా! అని అంటే దానికి సమాధానమును చెప్తున్నారు.

సూ॥ **జ్యోతిషా ఏకేషాం అసత్యన్నే 1-4-13** అన్నము అని పాఠము లేకపోయినా జ్యోతిస్సుతో అది పూర్తవుతుంది. ఒకరైన కాణ్వశాఖీయుల పాఠమునందు అన్నస్య అన్నః అనే పాఠము లేకపోయినా జ్యోతిశబ్దముతో పంచజనులు ఇంద్రియాలు అని తెలుస్తున్నది. వారియొక్క వాక్యశేషము తెలియడము కొరకు. అనగా ఇక్కడ చెప్పబడుతున్న విషయమిది. యస్మిన్ పంచపంచ జనాః అనే మన్త్రానికి ముందరి మన్త్రములో **తందేవా జ్యోతిషాం జ్యోతిరాయుర్హోపాసతేఽమృతమ్** అని జ్యోతిస్సులకు

జ్యోతియైనవాడు జ్యోతిష్ట్వత్వము వల్ల తమ పనులన్నీ బ్రహ్మకు లోబడి యున్నటువంటి కొన్ని జ్యోతిస్సులు గుర్తింపబడినవి. అవి శబ్దస్పర్శాది విషయాలను తెలిపిడిజేసే ఇంద్రియాలు అని యస్మిన్ పంచపంచజనాః అనే వాక్యములో విశేషాలను ఇవి అని నిర్దేశించకుండా ఐదు అని చెప్పినందువల్ల అవగతము అవుతున్నది అని.

ప్రాణస్య అని ప్రాణశబ్దముతో స్పర్శను తెలిపే త్వక్ ఇన్ద్రియము గ్రహింప బడుతున్నది. అది వాయువుతో సమ్బన్ధము కలది. ముఖ్యప్రాణాన్ని జ్యోతిస్ శబ్దముతో ప్రదర్శించడానికి కుదురదు. చక్షుషా అనే పదముతో నేత్రేందియము. శ్రోత్రస్య అనుదానితో కర్ణేంద్రియము. అన్నస్య అని ముక్కు నాలుకలను తాంత్రికంగా స్వీకరించుతున్నాము. అన్న శబ్దము చేత అన్నము పృథివి నుండి పుడుతున్నది కనుక గన్ధవతీ పృథివీ అని అన్నారు గనుక వాసనను గుర్తించే ముక్కు గ్రహింపబడ్తున్నది. అద్యతే అనేన దీనితో తినబడ్తున్నది. ఇందుకు సాధనమైనది నాలుక కావున రసనేంద్రియము కూడా అన్న శబ్దము చేతనే గ్రహింపబడ్తున్నది. మనసః అనే పదంతో అన్తరింద్రియమైన మనస్సు కాగా ఆరు ఇంద్రియాలు అవుతున్నాయి కదా అని ఆక్షేపించవచ్చును కానీ. నాలుక ముక్కులను తర్కశాస్త్రము ప్రకారము ఒక్కటిగానే తీసుకుంటున్నాము కనుక ఐదు ఇంద్రియాలు – పంచ అని అనడానికి వచ్చిన ముప్పేమీలేదు. కనుక విషయాలను ప్రకాశింప చేసేవి మనస్సు వరకు ఉన్న ఇంద్రియాలు ఐదున్నూ పంచజన శబ్దము చేత నిర్దేశింపబడినవి. ఆ ఐదు అని అనడానికి వైరుధ్యము రాకుండా ముక్కు నాలుకలను తన్త్రము ప్రకారము స్వీకరించాము. అందువల్ల ఈ వివరించిన ప్రకారము యస్మిన్ పంచపంచజనాః ఆకాశశ్చప్రతిష్ఠితః అనే వాక్యములో చెప్పబడిన విధంగా పంచజన శబ్దము చేత నిర్దేశింపబడిన ఇన్ద్రియాలు ఆకాశ శబ్దముతో ప్రదర్శింపబడిన మహాభూతాలు ఐదున్నూ బ్రహ్మ యందే ఆధారపడి ఉన్నాయి కనుక అన్ని తత్త్వాలకున్నూ బ్రహ్మాశ్రయత్వము ప్రతిపాదింపబడింది కాబట్టి తన్త్రసిద్ధమైన పంచవింశతి తత్త్వాల జోలి ఇందులో లేదు. కావున వేదాన్తములో అంతటా సంఖ్యల ఉపసంగ్రహము – కూర్పు ప్రస్తావము వచ్చినపుడు కానీ వాటి ఉనికి లేనప్పుడు కానీ కాపిలతన్త్ర సిద్ధమైన తత్వములగురించి ప్రతీతి లేదు అని సిద్ధము ఐనది. అని సంఖ్యోపసంగ్రహఅధికరణము

★ ★ ★

**ఇక కారణత్వాధికరణము ఆరంభమవుతున్నది.**

సూ॥ **కారణత్వేన చాకాశాదిషు యథావ్యపదిష్టోక్తేః 1-4-14** ఆకాశాదులకు కూడా పూర్వము చెప్పబడిన బ్రహ్మనే కారణముగా చెప్పబడి నందువల్ల. మళ్ళీ ప్రధానమే జగత్కారణమని వాదించే వ్యక్తి అడ్డము తిరుగుతున్నాడు. వేదాన్త వాక్యాలలో ఒక్కడినుండే సృష్టి జరుగుతున్నట్లు చెప్పబడడం లేదు కనుక జగత్తుకు బ్రహ్మ ఒక్కడే కారణము అని చెప్పడానికి వీలులేదు. అది ఎట్లాగంటే! **సదేవ సోమ్యేదమగ్రఆసీత్** అని సత్తు నుండి మొదట సృష్టి ఆరంభమవుతున్నట్లు తెలుస్తున్నది. అదేవిధంగా అసద్వా **ఇదమగ్ర ఆసీత్** అసత్తే సృష్టికి పూర్వము ఉంది. అని అసత్తు ముందర ఉండి తరువాత సత్తు వచ్చి దానినుండి ఆరంభమయినట్లు అర్థమవుతున్నది. కనుక సృష్టి సత్పూర్వికనేగాక అసత్ పూర్విక కూడా అవుతున్నది. మరొక ఉపనిషత్తులో **అసదేవేదమగ్ర ఆసీత్. తత్ సదాసీత్. తత్ సమభవత్.** తొట్టతొలుత అసత్తే ఉండింది. అది సత్తుగా అయ్యింది. అది అనేక రూపులుగా పుట్టింది. అని కూడా చెప్పబడింది. కనుక వేదాన్తాలలో సృష్టికర్త ఎవ్వరు? అన్నప్పుడు ఇదీ సృష్టి కారణము అని ఒకనిశ్చయము లేక తికమక ఏర్పడుతున్నందువల్ల జగత్తు పుట్టడానికి బ్రహ్మ ఒకడే కారణము అని నిశ్చయించడానికి వీలుగాకుండా ఉన్నది. పైగా బాగా ఆలోచించినప్పుడు ప్రధానమే కారణమని నిర్ణయించడానికి అవకాశము ఉన్నది. **తద్ధేదం తర్హ్యవ్యాకృతమాసీత్.** అది అపుడు విభాగము చేయబడకుండా ఉండింది. అని నామరూప విభాగము లేని జగత్తు ప్రధానములో లీనమైనదని చెప్పి **తత్ నామరూపాభ్యామేవ వ్యాక్రియత** అది నామరూపాలతో విడదీయబడింది. అని అవ్యాకృతమైన ప్రకృతి నుండే జగత్తు యొక్క సృష్టి కూడా చెప్పబడింది. అవ్యాకృతము అంటే అవ్యక్తము. నామరూపాలతో విడదీయబడకుండా ఉండింది. ఇది ఇట్లాగా అని ఇది దీనిపేరు అని. ఈపేరుగల దానికి పేరు ఇది అని తేట తెల్లము కావడం లేదు కాబట్టి అవ్యక్తము అనబడుతున్నది అని అర్థము. అవ్యక్తమంటే ప్రధానమే. దీని స్వరూపము నిత్యమైనది. పరిణామము చెందుతూ ఉండడము దీని ధర్మము. అందువల్ల వివిధ పరిణామాలకు ఆశ్రయము/ నెలవుగా ఉంటున్నది. కావున జగత్ కారణవాక్యాలలో ఉన్న సత్, అసత్ శబ్దాలు బ్రహ్మ యందు వలెనే ఈ ప్రధానములో పొసగుతున్నవి. వైరుధ్యాన్ని కల్గిలేవు. ఈ విధంగా అవ్యాకృతమైన ప్రకృతి కారణంగా నిశ్చయింపబడితే, ఈక్షణాదులు కారణములో ఉన్నటువంటివి సృష్టికి ఔన్ముఖ్యాన్ని తెలిపేవి, పూనుకోవడాన్ని తెలిపేవిగా సమన్వయము చేసుకోవాలి. ఇక్కడ కనిపించే బ్రహ్మ, ఆత్మ అనే శబ్దాలు కూడా

బృహత్త్వము – అన్నిటికన్నా పెద్దదిగా ఉండడము, వ్యాపిత్వము – అన్నింటిలో నిండి ఉండడము అనే లక్షణాలతో ప్రధానమునందే నిజంగా వాచకాలుగా వర్తించుతవి. కనుక స్మృతి న్యాయములందు ప్రసిద్ధమైన ప్రధానమే జగత్ కారణము అని వేదాన్తవాక్యాలచేత ప్రతిపాదింపబడుతున్నది.

అని పూర్వపక్షము ఏర్పడితే సమాధానమును చెపుతున్నాము. **"కారణత్వేన ఆకాశాదిషు యథావ్యపదిష్టోక్తేః"** అని ఇందులోని '**చ**' అనే శబ్దము **తు** అనే శబ్దము యొక్క అర్థములో ప్రయోగింపబడింది. సర్వజ్ఞుడు సత్యసంకల్పుడు సర్వేశ్వరుడు దోషగన్ధము బొత్తిగా లేనివాడు ఐన పరబ్రహ్మనుండే జగత్తు పుడుతున్నది. అని నిశ్చయించడానికి వీలవుతున్నది. ఎందువల్లనంటావా? ఆకాశాదులయందు కారణముగా యథావ్యపదిష్టముగా – కారణమైనవాడుగా – చెప్పబడినందువల్ల. అనగా సర్వజ్ఞత్వాదిగుణాలతో కూడియున్నందున **జన్మాద్యస్యయతః.** ఇట్లాంటి సూత్రాలయందు ప్రతిపాదింపబడిన బ్రహ్మ – కారణమైనవాడుగా – ఉపదేశించబడి నందున **యథా వ్యపదిష్టమ్** అనబడుతున్నాడు. ఆయన ఒక్కడికే ఆకాశము మొదలైనవాటికి కారణముగా చెప్పబడినందున. **తస్మాద్వాఏతస్మాదాత్మన ఆకాశస్సమ్భూతః** అట్లాగా సంకల్పము చేసిన ఈ ఆత్మనుండే ఆకాశము పుట్టింది. **తత్ తేజోఽసృజత** ఆసత్తు అనబడే వాడు తేజస్సును పుట్టించినాడు. ఇత్యాది వాక్యాలయందు సర్వజ్ఞుడైన బ్రహ్మనే కారణుడుగా చెప్పబడినాడు. అది ఎట్లాగంటే – **సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ. 2) సోఽశ్నుతేసర్వాన్ కామాన్ సహ బ్రహ్మణా విపశ్చితా** అని ప్రస్తుత చర్చలో ఉన్న విపశ్చిత్ – అన్నీ తెల్సినవాడు – ఐన బ్రహ్మనే **తస్మాద్వాఏతస్మాత్ అ**ని పరామర్శ చేయబడుతున్నాడు. అదే విధంగా **తదైక్షతబహుస్యాం** అని చెప్పబడిన సర్వజ్ఞుడైన బ్రహ్మనే **తత్తేజోఽసృజత** అని పరామర్శింపబడుతున్నాడు. ఈ విధంగానే సృష్టి వాక్యాలన్నింటిలోనూ కనుగొనాలి. కనుక బ్రహ్మ ఒక్కడే జగత్తు కారణమని నిశ్చయింపబడుతున్నది.

ఏమండీ! అసద్వాఇదమగ్ర ఆసీత్ అనే వాక్యమువల్ల అసత్తే కారణముగా చెప్పబడుతున్నట్లు తెలుస్తున్నది. అందువల్ల సర్వజ్ఞుడు సత్య సంకల్పుడు ఐన బ్రహ్మనే కారణమని మీరు ఎట్లా నిశ్చయించుతారు? అని అంటే బదులు చెప్తున్నారు.

సూ॥ **సమాకర్షాత్ 1-4-15** ఒకచోట చెప్పబడిన సమ్బన్ధముగల అంశాన్ని తరువాత స్థలానికి తెచ్చుకోవడం వల్ల. **అసద్వా ఇదమగ్ర ఆసీత్** అనేచోట కూడా

వివిధములైన వాటి వాని లోగుట్టును తెల్సుకోగల్గినవాడు. ఆనందమయుడు, సత్యసంకల్పుడు ఐన బ్రహ్మనే సమాకర్షింపబడుతున్నాడు. ఎట్లాగని అంటే **తస్మాద్వాఏ తస్మాద్విజ్ఞానమయాదన్యోఽన్తర ఆత్మాఆనందమయః** ఈ విజ్ఞానమయుడైన వానికంటే వేరయినవాడు; లోపల ఉండేవాడు ఆత్మయైనవాడు ఆనందమయుడు. **సోఽకామయత బహుస్యాంప్రజాయే యేతి.** ఆయన తలచినాడు. నేను అనేకరూపములుగా అవుతాను అని. అందుకోసము జన్మల నెత్తుతాను. **సఇదం సర్వమసృజత, యదిదం కించ. తత్సృష్ట్వా; తదేవా నుప్రావిశత్. తదనుప్రవిశ్యసచ్చత్య చ్చాభవత్.** ఈ కనిపించే దాన్నంతటినీ ఆయననే పుట్టించినాడు. అట్లా పుట్టించిన వెనక దానిలోకి ఆయన ప్రవేశించినాడు. తదుపరి సత్తు అనబడేవాడు త్యత్ అనబడే ప్రకృతియున్నూ ఆయననేఐనాడు. ఇత్యాదివాక్యాల చేత, బ్రాహ్మణాల చేత సత్యసంకల్పుడు అన్నింటినీ పుట్టించినవాడు, అన్నింటిలోకీ ప్రవేశించి వాటికి ఆత్మయైన వానినిగా చెప్పి **తదప్యేష శ్లోకోభవతి.** అని చెప్పిన విషయాని కంతటికీ సాక్షిగా ఈ శ్లోకాన్ని చెప్పినారు. **అసద్వాఇదమగ్ర ఆసీత్** అని. అట్లాగే దీని తరువాత కూడా **భీషాఽస్మాద్వాతః పవతే** ఇత్యాది వాక్యముతో ఆ బ్రహ్మనే ఆకర్షించి – అక్కడ ఉన్నవాడిని ఇక్కడకు తీసుకొని వచ్చి ఈ అంతటినీ ప్రశాసించేవాడు, నిరతిశయానందాన్ని కలిగినవాడని గుణాలు చెప్పబడినాయి. కనుక ఈ మన్త్రము ఆయనకు చెందినదే. అట్లాగా సృష్టి జరుగడానికి ముందు నామము రూపము వంటి విభాగాలు లేనందున, వాటికి సమ్బన్ధించిన వస్తువులకూ ఉనికి లేనందువల్ల అప్పుడు ఉన్న బ్రహ్మనే అసత్ శబ్దముతో చెప్పబడుతున్నాడు. **అసదేవేదమగ్ర ఆసీత్** అనేచోట కూడా ఇదే విధంగా సమన్వయము చేసుకోవాలి.

ఏదైతే మీరన్నారో – **తద్ధ ఇదం తర్హి అవ్యాకృతమాసీత్** అనే వాక్యముతో జగత్ కారణంగా ప్రధానమే చెప్పబడుతున్నదని, అది తప్పు అని మేము అంటున్నాము. ఆ వాక్యములో కూడా అవ్యాకృత శబ్దంతో నామరూపాలతో తనలో ఉన్న చిదచిత్తులను వేరుచేయకముందు ఉన్న దశలో, చిదచిత్తులను తనకు శరీరమునుగా కలిగిన బ్రహ్మనే చెప్పబడుతున్నాడు. **సఏష ఇహ ప్రవిష్ట ఆనఖాగ్రేభ్యః పశ్యం శ్చక్షుః శృణ్వన్ శ్రోత్రం మన్వానోమనః। ఆత్మేత్యేవోపాసీత.** అటువంటి ఆ పరమాత్మ ఈ శరీరములో ప్రవేశించినాడు. కాలి గోళ్ళనుండి శరీరమంతా ఆయనే నిండియున్నాడు. చూచేకంటికి కన్నుగా, వినే చెవికి చెవిగా తలచే మనస్సుగా ఐనాడు. అతడిని తనకు

ఆత్మ – నిర్వాహకుడు అనియే ఉపాసించాలి అనుచోట సఏషః అనే తత్ శబ్దంతో ముందు అవ్యాకృత శబ్దంతో చెప్పబడిన వాడిని మనలో ప్రవేశించి ప్రశాసనము చేసేవాడుగా అనుకర్షణము చేసినందువల్ల **1) తత్ సృష్ట్వా తదేవాను ప్రావిశత్ 2) అనేన జీవేనాత్మనాఽనుప్రవిశ్య నామరూపేవ్యాకరవాణి.** అని స్రష్టఐన సర్వజ్ఞుడైన పరబ్రహ్మకు కార్యమైన ఈ చిదచిన్మిశ్రితమైన జగత్తు నందు ప్రవేశించి నామరూపములను ఏర్పాటు చేసినట్లు ప్రసిద్ధి కూడా ఉన్నందువల్ల. **అన్తః ప్రవిష్టః శాస్తాజనానాం సర్వాత్మా.** అని అనుప్రవేశము చిదచిత్తులను నియమించడానికోసమే ఐనందువల్ల ఇటువంటి ప్రశాసితృత్వము, అనుప్రవేశము ప్రధానానికి లేనేలేదు. అది కుదరదు కూడా. కనుక అవ్యాకృతమే అంటే ప్రధానమనికాదు అవ్యాకృతాన్ని శరీరంగా కల్గిన బ్రహ్మ అని అర్థము చేసుకోవాలి. **తన్నామ రూపాభ్యాం వ్యాక్రియత** అని అట్లాగా నామరూపాలతో విభజింపబడని బ్రహ్మ సర్వజ్ఞుడు సత్యసంకల్పుడు. తనకు తానుగానే వేరుచేయబడి నామాన్ని రూపాన్ని ఏర్పర్చుకొంటున్నాడు అని చెప్పబడుతున్నది.

ఇది ఇట్లాగా ఐనందువల్లనే ఈక్షణాదులు ముఖ్యార్థాలే ఔతాయి కాని గౌణాలు కావు. బ్రహ్మ, ఆత్మ అనే శబ్దాలు కూడా నిరతిశయ బృహత్త్వము, అన్నిటినీ నియమించడం కొరకైన వ్యాపిత్వం లేనందువల్ల ప్రధానమును ఎంతమాత్రమూ చెప్పజాలవు. కనుక బ్రహ్మను మాత్రమే కారణముగా కలది ఈ జగత్తు. **అని కారణత్వాధికరణము ముగిసింది.**

★ ★ ★

## ఇక జగద్వాచిత్వాధికరణము

సూ॥ **జగద్వాచిత్వాత్ 1–4–16** జగత్ శబ్దము పరమాత్మయొక్క సృష్టిని చెప్పుతున్నది. తిరిగి సాంఖ్యుడు ఎదురు నిలుస్తున్నాడు. ఒకవేళ వేదాన్తవాక్యాలు చేతనాన్నే జగత్కారణంగా ప్రతిపాదించినా తన్త్రసిద్ధమైన ప్రధానము పురుషులకంటే వేరుగా ఉన్న మరొక వస్తువేదో జగత్కారణంగా తెల్సుకోతగినది అని ఆ వేదాన్తవాక్యాలచేత తెలియరావడం లేదు. అది ఎట్లాగంటే – భోక్తయైన పురుషుడినే జగత్ కారణమని అతడే తెల్సుకోదగినవాడనిన్నీ కౌషీతకీ ఉపనిషత్తులోని బాలాకీ, అజాత శత్రు సంవాదంలో కనిపిస్తున్నది. **బ్రహ్మతే బ్రవాణి** నీకు నేను బ్రహ్మను గురించి చెపుతాను. అని మొదలుపెట్టి **యోవైబాలాకే। ఏతే షాం పురుషాణాం కర్తా, యస్యవా**

**ఏతత్కర్మ సవైవేదితవ్యః** ఓ బాలాకీ ఈ పురుషులకు కర్త ఎవడో, ఈ జగత్తు ఎవడు చేసిన పనియో, అటువంటి వాడే తెల్సుకోదగినవాడు. అని ఆరంభంలో చెప్పుకోదగినవాడుగా బాలాకి చేత చెప్పబడిన బ్రహ్మను గురించి విని అతడికి బ్రహ్మను గురించి ఏమీ తెలియదని తెల్సుకొని నీకే నేను బ్రహ్మను తెలియజేస్తాను అని చెప్పి అజాతశత్రువు అనే రాజుగారే **సవై వేదితవ్యః.** అతడు గదా తెల్సుకోదగినవాడు అని బ్రహ్మోపదేశమును చేసినాడు. **యస్యవాఏతత్కర్మ** అని కర్మ సమ్బన్ధము వినిపించుతున్నందు వల్ల ప్రకృతికి అధ్యక్షుడు ఐన భోక్తా పురుషుడు తెల్సుకోదగినవాడుగా ఉపదేశింపబడిన బ్రహ్మ అని నిశ్చయము చేయబడుతున్నది. కానీ అతనికంటే వేరొకడు కాదు. అతనికి కర్మ సమ్బన్ధము లేదని మీరే ఒప్పుకున్నారు కదా! పుణ్యపాపరూపమైన కర్మక్షేత్రజ్ఞునికే ఉంటున్నది. ఐతే మీరిట్లా అనవద్దు – క్రియతే చేయబడుతున్నది కనుక కర్మ అనే వ్యుత్పత్తి ప్రకారము, ప్రత్యక్షము మొదలగు ప్రమాణాల చేత, నెలకొలుపబడిన జగత్తు ఇతని కర్మ అని నిర్దేశింపబడుతున్నది. ఈ జగత్తు అంతా ఎవనికర్మనో – చేత / పని ఐ ఉన్నదో అటువంటివాడే తెల్సుకోదగినవాడు అని క్షేత్రజ్ఞుని కంటే మరోకడైన వాడే స్ఫురించుతున్నాడు అని. అట్లాగా మీరు చెప్పిందే సరిఐనట్లయితే **యోవైబాలాకే। ఏతేషాం పురుషాణాంకర్తా యస్యవాఏతత్ కర్మ.** ఓ బాలాకే ఈ పురుషులకు ఎవడు కర్త ఐనవాడో ఈ ప్రపంచమంతా ఎవడి పనియో అని విడిగా నిర్దేశించినది వ్యర్థము కావాల్సి వస్తుంది. కర్మశబ్దానికి లోకంలోను వేదంలోనూ పుణ్యపాపరూపమైన దానియందే ప్రసిద్ధి ఉన్నది. ఆయా భోక్తలయొక్క అనుభవాల కొరకు వారికర్మలననుసరించి జగదుత్పత్తి చేయబడింది. కావున ఈ పురుషులకు కర్త అని అనడమున్నూ భోక్తఐనవాడికే చెల్లుతుంది. కనుక నిశ్చితమైన అర్థము ఇది. ఈ ఆదిత్యమండలము మొదలైన అధికరణాలకు, క్షేత్రజ్ఞులయొక్క భోగ్యభోగోపకరణాలైన పురషులకు ఎవడు కారణమైనవాడో, వీటన్నింటికీ కారణభావాన్ని పొందడానికి హేతువైన పుణ్యాపుణ్యలక్షణమైన కర్మ ఎవనిదో వాడుకదా! తెల్సుకోవలసినవాడు. అటువంటి వానియొక్క స్వరూపాన్ని ప్రకృతికన్నవిడిగా। వేరుగా నున్నది అని తెల్సుకోవాలి అని –

అదే తీరుగా వాక్యములోని తరువాత భాగంలో **తౌహ సుప్తం పురుషం ఈయతుః... తంయష్ట్యాచిక్షేప.** బాలాకి, అజాతశత్రువులిద్దరూ నిదురపోతున్న ఒక పురుషుడి వద్దకు పోయినారు. ఆ నిద్రించుతున్న వాడిని చేతి కర్రతో తట్టినాడు. అని గాఢనిద్రలో ఉన్న పురుషుని వద్దకు రావడం కఱ్ఱతో కొట్టిలేపడము

వంటివి అన్నీనూ భోక్తను ప్రతిపాదించేగుర్తులే. అట్లే ఇంకాపైపైన కూడా భోక్తనే ప్రతిపాదింపబడుతున్నాడు. **తద్యథా శ్రేష్ఠీస్వైఃభుంక్తే యథాస్వాఃశ్రేష్ఠినం భుంజన్తి. ఏవమేవైషప్రజ్ఞాత్మా ఏతైరాత్మభిఃభుంక్తే. ఏవమేవైత ఆత్మానః ఏనంభుంజన్తి.** అదెట్లాగా అంటే ఒక సంపన్నుడు / భాగ్యశాలి తనవారలచేత అనుభవింపబడుతున్నాడో, ఆయనకు చెందిన వారున్నూ ఆయన వద్దకు చేరి అతని సంపదలను ఎట్లాగా భుజించుతున్నారో అదే ప్రకారంగా ప్రజ్ఞాత్మా – అన్నీ తెల్సినవాడు బ్రహ్మ – తక్కిన ఆత్మల ద్వారా అనుభవిస్తున్నాడు ఈ ఆత్మలున్నూ ఆయనను చేరి అనుభవించుతున్నవి అని. అదేవిధంగా **క్వైషఏతద్ బాలాకే పురుషోఽశయిష్ట. క్వవా ఏతదభూత్ కుతఏతదాగాత్.** ఓ బాలాకీ! ఈ పురుషుడు ఎక్కడ పడుకున్నాడు. ఎక్కడ ఉండినాడు. ఎక్కడనుండి తిరిగి వెనుకకు వచ్చినాడు. అని అడుగగా ఆ విషయాన్ని తెలియక తెల్లమొఖం వేసిన అతనికి తానే సమాధానాన్ని చెప్పినాడు. **హితాః నామహృదయస్యనాడ్యః. తాసుతదాభవతి. యదాసుప్తః స్వప్నంనకథంచన పశ్యతి. అథాస్మిన్ ప్రాణఏవఏకధా భవతి. తదైనం వాక్ సర్వైర్నామభిః సహాప్యేతే.... మనఃసర్వైః ధ్యానైఃసహాప్యేతి. సయదాప్రతిబుధ్యతే, యథాఽగ్నేఃవిస్ఫులింగావిప్రతి ష్ఠేరన్. ఏవమేవైతస్మాదాత్మనఃప్రాణాః యథాఽయతనం విప్రతిష్ఠన్తే. ప్రాణేభ్యోదేవాః దేవేభ్యోలోకాః.** హితాః అనేవి హృదయానికి చెందిన నాడులు. మానవుడు నిద్రించినపుడు సుషుప్తి వేళలో అక్కడ ఉంటాడు. ఎప్పుడైతే స్వప్నము అనేదాన్ని చూడడో. అపుడు ప్రాణశబ్దవాచ్యుడైనవానియందు ఒక్కటిగా కలసిపోతాడు. ఆవేళలో వాక్కు మొదలైన ఇంద్రియాల వ్యాపారాలన్నీ ఉడిగి పనిచేయకుండా కలసిపోతాయి. నిదురపోయనవాడు ఎప్పుడు మెలకువపొందుతాడో అపుడు మండుతున్న అగ్నిలోంచి నలుదిక్కులకు నిప్పురవ్వలు ఎట్లా ఎగిసిపడుతాయో అదేవిధంగా ఇంద్రియాలన్నీ వెనుకకు తిరిగి వస్తాయి. ప్రాణాలనుండి అదేవిధంగా ఇంద్రియాలన్నీ వెనుకకు తిరిగివస్తాయి. ప్రాణాలనుండి ఇంద్రియాలు, వాటిలోకాలు / విషయాలు తెలుస్తాయి అని సుషుప్తికి ఆధారంగా, స్వప్న, సుషుప్తి, జాగరిత(మెలకువ) అవస్థలయందు ఉంటున్నవాడు వాక్కు మొదలైన ఇంద్రియాలకు కలిసిపోవడము, బయటకు రావడములకు స్థానమైన జీవాత్మను **అథాస్మిన్ ప్రాణఏవైకధాభవతి** అని చెప్పినాడు. ఈ జీవాత్మయందు ప్రాణాలను ధరించి ఉంటున్న కారణంగా ప్రాణశబ్దము వర్తిస్తున్నది. **సయదాప్రతిబుధ్యతే** అని ప్రాణశబ్దము చేత చెప్పబడినవానికి మెలకువగల్గుతున్నది అని వినిపిస్తున్నది కనుక. ముఖ్య ప్రాణుడనబడే ఈశ్వరునికి

సుషుప్తి – గాఢ నిద్ర, ప్రబోధము – మేల్కొనుటలు లేవుకదా! లేదా! **అస్మిన్ ప్రాణే** అని అన్నపుడు సమానాధికరణం లేని వ్యధికరణార్థములో సప్తమిని చెప్పుకోవాలి. అవి రెండు. ఈ జీవుడు ఆత్మయందు ఉండగా ప్రాణము నందే ఏకము అవుతుంది వాగాది ఇన్ద్రియసముదాయము అని. ప్రాణశబ్దం ముఖ్యప్రాణము అనే అర్థంనందే ముఖ్యార్థత ఉన్నప్పటికీ ఈ ప్రకరణంలో మాత్రము జీవుడే చెప్పబడుతున్నాడు. సహజంగా ప్రాణమనేది జీవుడికి ఉపకరణమైనందువలన. కనుక వక్తవ్యుడుగా / చెప్పదగినవాడుగా ఉపక్రమింపబడిన బ్రహ్మ పురుషుడే / జీవుడే. కనుక అతనికి మించి ఈశ్వరుడు అనేవాడు తెలియరావడం లేదు. జగత్కారణము అని చెప్పబడేవానిలోని ఈక్షణాదులు చేతనుని ధర్మాలు కనుక అవి కూడా ఇతనియందే పొసగుతున్నాయి. కనుక ఈ పురుషుడి చేత అధిష్టించబడిన ప్రధానమే జగత్కారణము.

అని పూర్వపక్షాభిప్రాయము రాగా చెప్పుతున్నాము. జగద్వాచిత్వాత్ అని. ఇక్కడ పుణ్యాపుణ్యాలకు లొంగి నడచుకొనేవాడు, కొద్దివాడు, క్షేత్రజ్ఞుడు, తనయందు ప్రకృతి ధర్మాన్ని ఆరోపించుకొని దానికి పరిణామాలు ఏర్పడడంలో కారణమైన పురుషుడు చెప్పబడడంలేదు. కానీ అవిద్య వలన ఏర్పడేటువంటి దోషాలనన్నీ దూరముగా పారద్రోలినవాడు, వాటి వాసన కూడా తనలో లేనివాడు, హద్దులేని అతిశయమైన, లెక్కింపరాని కళ్యాణగుణ గణములకు పాతర వంటివాడు నిఖిల జగత్తుకు తానొక్కడే కారణమైనవాడు పురుషోత్తముడు చెప్పబడుతున్నాడు. ఎందువల్లనంటే **యస్యవాఏతత్ కర్మ** అనుచోట ఏతత్ శబ్దముతో అన్వయించుతున్న కర్మ శబ్దము పరమపురుషుని యొక్క కార్యము ఐన జగత్తును చెప్పుతున్నది. కనుక ఏతత్ శబ్దము అర్థము, ప్రకరణము మొదలైన వాటితో సంకుచితమైన, కొద్ది వస్తువును బోధించేదికాకుండా తేడా అనేది లేకుండా ప్రత్యక్షాధిప్రమాణాలతో బలపర్చబడిన చిదచిన్మిశ్రమైన జగత్తును గురించి తెలుపుతున్నది. ఈ మన్త్రములో పుణ్యఅపుణ్య రూపమైన కర్మ, కర్మ శబ్దముచేత చెప్పబడడం లేదు. **బ్రహ్మతే బ్రవాణి** అని మొదలుపెట్టి, బ్రహ్మగా బాలాకి చేత చెప్పబడిన / నిర్దేశించబడిన ఆదిత్యమండలాదులను అధికరణములుగా / ఆధారములుగా, తాము నివసించే స్థానాలుగా కలిగిన ఆయా పురుషులు బ్రహ్మలు కారు గనుక **మృషావైఖలు మా సంవాదయిష్ఠాః.** అసత్యాలను గురించి నాతో వాదించబోకు అని బ్రహ్మవేత్త కాని అతడిని పక్కకు నెట్టి అతనికి తెలియని బ్రహ్మను గురించి తెలుపడంకోసం ఈ వాక్యము అవతారికగా చెప్పబడింది. **యోవైబాలాకే**

ఇత్యాదిగా. పుణ్యాపుణ్య లక్షణమైన కర్మతో సమ్బన్ధము ఉన్న ఆదిత్యాద్యధికరణులు వారితో సజాతీయులు ఐన పురుషులు మాత్రమే అతనికి తెల్సినవారు అని గుర్తించి అతనికి తెలియని పురుషవిశేషుడిని గురించి తెలిపిడిచేసేది ఈ కర్మ శబ్దము. అంతేకానీ పుణ్యపాపాలను తెలిపేది కాదు. పోనీ క్రియను మాత్రమే చెప్పేది కాదు. కానీ ఈ జగత్తు కార్యము అని తెలిపెడిది. ఇట్లాగే కదా తెలియని అర్థము ఉపదేశించే పద్ధతి ఉంటున్నది. కర్మ సమ్బన్ధము చేతనే గుర్తింపదగిన స్వభావరూపములు గలవానికి తెలియని వాడిని తెలుపవలసివచ్చినపుడు లక్షణా వస్తుంది. కర్మతో మాత్రమే సమ్బన్ధము కలవాడిని మాత్రమే తెల్సుకోబడదగిన స్వరూపలక్షణాలు కలవాడైనప్పుడు ఇది ఎవని పనియో వాడు తెల్సుకోదగినవాడు అని ఇంతమాత్రము చేతనే సిద్ధిస్తున్నది. పైగా **యస్యవాఏతత్ కర్మ** అనే వాక్యములో ఏతత్ శబ్దాన్ని ప్రయోగించనక్కర లేకపోయినందువల్ల ఆపదము వ్యర్థమవుతుంది. **యః ఏతేషాంకర్తా. యస్యవాఏతత్ కర్మ** అని విడిగా చెప్పడానికిన్నీ ఇదే ఉద్దేశ్యము / అభిప్రాయము – నీవు ఎవరినైతే బ్రహ్మగా భావించి చెప్పినావో వారికి కర్త / పుట్టించినవాడు ఎవడో – వారు ఎవని కార్యములో ఒకభాగమో దేన్ని ఆధారంగా చేసుకొని విశేషించి చెప్పబడుతున్నదో – **కృత్స్నం జగత్ యస్యకార్యమ్** – ఈ జగత్తంతా ఎవని పనియో – గొప్పవారు, తక్కువవారు ఐన చేతనులు, అచేతనాలు అందరున్నూ ఎవని చేత సృష్టిలో సమానులో, అట్లాంటి పరమకారణమైన పురుషోత్తముడు తెల్సుకోదగినవాడు అని. జగదుత్పత్తికి జీవుని యొక్క కర్మయే కారణమైనా తనకు భోగ్యము ఐనదానిని, దాన్ని అనుభవించడానికి అవసరమైన ఉపకరణాలను – శరీరేంద్రియాలను తానుగా సృష్టించుకోలేడు. కానీ తన కర్మలకనుగుణంగా ఈశ్వరుడు సృష్టి చేసిన దానినంతా అనుభవించుతాడు. ఇందువల్ల ఆ పురుషులకు తాను కర్త కాడు. ఈ కారణము చేత వేదాన్తాలన్నింటిలోనూ పరమకారణమైన వాడుగా ప్రసిద్ధుడైన పరబ్రహ్మనే తెల్సుకోదగినవాడుగా ఉపదేశింపబడుతున్నాడు.

సూ॥ **జీవముఖ్యప్రాణలింగాన్నేతి చేత్ – తద్ వ్యాఖ్యాతమ్. 1-4-17** జీవుని యొక్క ముఖ్య ప్రాణము యొక్క గుర్తులున్నవనగూడదు. దాన్ని ఇంతకు ముందే వివరించి ఉన్నాము. ఇంకా ఏదైతే చెప్పబడిందో – జీవునికి సంబన్ధించిన గుర్తులు ఉన్నందున ముఖ్యప్రాణాన్ని గురించి కీర్తించినందువల్ల ఆ హేతువును బట్టిన్నీ భోక్తఐన జీవుడే ఈ ప్రకరణంలో ప్రతిపాదింపబడుతున్నాడు. పరమాత్మ కాదని అన్నారో, దాన్ని గురించి ఇంతకు మునుపే వ్యాఖ్యానించినాము. అనగా దానికి సంబన్ధించిన పరిహారము

ప్రతర్దన విద్యయందు చెప్పబడింది. అనగా చెప్పబడుతున్న విషయము ఇది – ఎక్కడైతే ఉపక్రమము, ఉపసంహారము – ఆరంభము, ముగింపులను బాగా పరిశీలించినపుడు ఆ వాక్యము బ్రహ్మకు సమ్బన్ధించినది అని నిశ్చయము చేయబడితే ఆ చోట కనిపించే వేరు గుర్తులు ఉపక్రమోపసంహారాల సమన్వయపరంగా నిశ్చయింపబడిన దానికి తగినట్లు సమన్వయాన్ని చెప్పుకోవాలి అని ప్రతిపాదింపబడింది. ప్రస్తుతము ఇక్కడ కూడా ఉపక్రమంలో **బ్రహ్మతేబ్రవాణి** అని బ్రహ్మనే ముందుంచబడినాడు. మధ్యలో కూడా **యస్యవైతత్కర్మ** అని నిర్దేశింపబడినవాడు పురుష మాత్రుడు కాడు. కానీ అతడు సమస్త ప్రపంచానికి ఏకైక కారణము ఐన బ్రహ్మనే అని చెప్పబడింది. ఇక ఉపసంహారములో కూడా **సర్వాన్ పాప్మనోఽపహత్య సర్వేషాంభూతానాం శ్రైష్ఠ్యం స్వారాజ్యమాధిపత్యం పర్యేతి. యఏవం వేద.** అన్ని పాపాలనూ అణచివేసుకొని అన్ని భూతాలకన్నా శ్రేష్ఠతను, తనకు తానే రాజై ఉండుటను, అధిపతిత్వాన్ని పొందుతాడు. ఎవడైతే ఇట్లాగని తెల్సుకుంటాడో అని బ్రహ్మను ఉపాసించినందుకు మాత్రమే చెందినది, అన్ని పాపాలను నశింపచేసుకొనుట ద్వారా స్వారాజ్యాన్ని పొందుట అనే ఫలము వినిపింపబడింది. కనుక ఈ వాక్యానికి ఇది బ్రహ్మకు చెందినది అని నిశ్చయింపబడినందువలన జీవలింగము, ముఖ్యప్రాణానికి సమ్బన్ధించిన హేతువులను కూడా బ్రహ్మకు సంబన్ధించినటువంటి వాటినిగా వర్ణించాలి అని.

ప్రతర్దనవిద్యలో బ్రహ్మను ఉపాసించే పద్ధతులు మూడు చెప్పబడినవి. కనుక జీవ, ముఖ్యప్రాణాలకు చెందిన లింగాలు బ్రహ్మకు చెందినవిగా చెప్పబడినాయి. ఇక్కడ కూడా **అథాస్మిన్ ప్రాణఏవ ఏకథాభవతి** అని సామానాధికరణ్యము తెలుస్తుండగా వైయధికరణ్యాన్ని ఆశ్రయించడము తగదు. గనుక బ్రహ్మయందే ప్రాణశబ్దము ప్రయోగింపబడింది అనే నిశ్చయముతోనూ ప్రాణాన్ని శరీరంగా కల్గిన బ్రహ్మను ఉపాసించడం కొరకు ప్రాణాన్ని కీర్తించడము అనే లింగము చక్కగా పొసగుతుంది. ఐనప్పుడు జీవుడిని సూచించే లింగాలను బ్రహ్మపరములు అని చెప్పడం ఎట్లా పొసగుతుంది అని అంటే సమాధానాన్ని చెపుతున్నారు.

సూ॥ **అన్యార్థంతుజైమినిః ప్రశ్నవ్యాఖ్యానాభ్యాం అపిచైవమేకే. 1-4-18**
ప్రశ్నవ్యాఖ్యానాలు జీవునికన్నవేరయినవాడిని తెలుపడం కొరకని జైమిని అంటున్నాడు. వేరొక శాఖవారు కూడాను. సూత్రములో ఉన్న తు శబ్దము జీవుడిని కీర్తించినందువల్ల వాక్యము జీవుడికే చెందినదని ఊహించడాన్ని తొలగించడం కొరకు అని అర్థము.

అన్యార్థం – జీవుడిని సంకీర్తించడము జీవునికంటే వేరైన బ్రహ్మయొక్క స్వరూపాన్ని తెలిపిడి చేయడానికని జైమిని అనే ఆచార్యుడు తలపోస్తున్నాడు. ఎందువల్లనంటే ప్రశ్నలు వ్యాఖ్యానాలను బట్టి అని. ప్రశ్న ఏదంటే. **తౌహసుప్తంపురుషమీయతుః** ఇత్యాది వాక్యము చేత ప్రాణము ఆగిపోకుండానే నిదురించుతున్నవాడిని ప్రాణము పేర్లతో పిలువడము, వినడము, కర్రతో కొట్టిలేపడముల ద్వారా ప్రాణాదులకంటే వేరైన జీవుడిని మేల్కొలిపి, తిరిగి జీవుడికంటే వేరైన బ్రహ్మను గురించి వివరించడము కనిపిస్తున్నది. **క్వైషబాలాకే। ఏతద్ పురుషోఽశయిష్ట. క్వవాఏతదభూత్. కుత ఏతదాగాత్** అని దానికి వ్యాఖ్యానమున్నూ **యదాసుప్తః స్వప్నంనకధంచనపశ్యతి. అధాస్మిన్‌ప్రాణఏవైకధాభవతి. ఏతస్మాదాత్మనః ప్రాణాఃయధాఽయతనంవిప్రతిష్ఠన్తే. ప్రాణేభ్యోదేవాః దేవేభ్యోలోకాః** అని జీవునికంటే అర్థాన్తరమైన పరమాత్మ పరమే. నిద్రపోయిన జీవుడు ఎవనివద్దకు చేరుతున్నాడో అక్కడ మెలకువ, కలలు గనడము అనే దశలకు సమ్బన్ధించిన వింత వింతలైన సుఖదుఃఖాలను అనుభవించడమనే కాలుష్యము లేకుండా ప్రశాన్తత, స్వస్థతా – ఆరోగ్యము లభిస్తాయో, తిరిగి ఈ ఐహిక సుఖదుఃఖాలను అనుభవించడం కోసము ఎవడినుండి బయలుదేరి రావడము జరుగుతుందో, ఆ సుఖస్థానము ఎవరోకాదు పరమాత్మనే. అదెట్లాగంటే – **సతాసోమ్యతదాసమ్పన్నోభవతి.** ఓ సోమ్యుడా అపుడు అతడు సత్ శబ్దవాచ్యుడైన వాని దగ్గరకు చేరుకుంటున్నాడు. **2) ప్రాజ్ఞేనాత్మనా సమ్పరిష్వక్తః. నబాహ్యంకించనవేద. నాన్తరమ్.** ప్రాజ్ఞుడుఐనపరమాత్మచేతకౌగిలించుకొనబడినవాడైబయటిముచ్చటలను గాని లోపలి ముచ్చటలను గానీ ఎఱుగడు. అని సుషుప్తికి ఆధారమైనవాడు ప్రసిద్ధుడైన జీవుడికంటే వేరయిన వాడు ప్రాజ్ఞుడైన పరమాత్మయే. కనుక ప్రశ్న, ప్రతివచనము – సమాధానములవల్ల సంకీర్తనం– చెప్పడము జీవుడికంటే అర్థాన్తరమైన పరమాత్మను ప్రతిపాదించడం కొరకు మాత్రమే అని నిశ్చయింపబడుతున్నది.

ప్రశ్న వాఖ్యానాలు జీవుడికి సంబన్ధించినవే, సుషుప్తి స్థానము నాడులే. ఇంద్రియసముదాయము కూడా ప్రాణశబ్దము చేత చెప్పబడినదికాదు. నాడులు సుషుప్తి స్థానాలు కావు స్వప్నస్థానాలు మాత్రమే అవుతున్నాయి కనుక. ఇంతకు ముందు వివరించిన ప్రకారము పరబ్రహ్మనే సుషుప్తి స్థానమవుతున్నాడు. ప్రాణశబ్దముచేత చెప్పబడిన బ్రహ్మయందు జీవుడు, ఆయనకు ఉపకరణాలైన వాక్కు మొదలైన సాధన సామగ్రి ఐక్యతను, విభాగమున్నూ చెప్పబడినందువల్ల. అనగా బ్రహ్మయందు జీవుడు,

ఏకతా పత్తిని పొందితే ఇంద్రియాలు విడిగానే ఉండిపోయినాయి. ఈవాక్యములో క్రమాలంకారము ఉన్నది దానితో సమన్వయం చేసుకోవాలి.

ఇంకా కొంతమంది ఇట్లాగా పఠించుతున్నారు. వాజసనేయశాఖవారు ఇదే బాలాకి అజాతశత్రు సంవాదంలో గాఢనిద్రాపరవశుడైన విజ్ఞానమయుడికంటే భేదము కలవాడుగా, ఆ జీవుడికి ఆశ్రయమైన పరమాత్మను గురించి ప్రవచిస్తున్నారు. **యఏష విజ్ఞానమయఃపురుషః క్వైషతదాఽ భూత్. కుతఏతదాగాత్. యత్రఏతత్ సుప్తోఽ భూత్. యఏషవిజ్ఞానమయఃపురుషః తదైతేషాంప్రాణానాంవిజ్ఞానేన విజ్ఞానమాదాయయ ఏషోఽన్తర్ హృదయఆకాశః తస్మింఛ్ఛేతే.** ఈ విజ్ఞానమయుడైన పురుషుడు ఆగాఢ నిద్రాకాలములో ఎక్కడ ఉన్నాడు. ఎక్కడ నుండి తిరిగి వచ్చినాడు. ఎక్కడ (ఎవనియందు) నిద్రపోయినాడు? ఈ విజ్ఞానమయుడైన పురుషుడు ఆ నిద్రాకాలంలో ఇంద్రియాలలోని జ్ఞానశక్తిని తన విజ్ఞానముతో కలిపి వెంటబెట్టుకొని తన హృదయములో ఉన్న ఆకాశము వద్దకు పోయి దాని యందు పండుకొంటాడు. అని ఆకాశ శబ్దము పరమాత్మవాచకముగా ప్రసిద్ధమే. **దహరోఽస్మిన్నన్తరాకాశః** అని.

కనుక ఈ ప్రకరణమునందు జీవసంకీర్తనము అతడికంటే మరొకడైన ప్రాజ్ఞుడైన పరబ్రహ్మను గురించి తెలిపిడి కొఱకేనని తెలుస్తున్నది. కావున ఈ వాక్యము నందు పురుషుడికంటే అర్థాన్తరుడు ఐన నిఖిల జగత్ కారణుడు ఐన పరబ్రహ్మ తెలుసుకోదగిన వాడుగా చెప్పినందున తన్త్రసిద్ధుడైన పురుషుడు, అతడి చేత అధిష్ఠింపబడిన ప్రధానమును గురించి జగత్ కారణత్వాన్ని చెప్పే వాక్యాలు వేదాన్తముల యందు ఎక్కడా కనబడడం లేదు. ఇది జగద్వాచిత్వాధికరణము.

★ ★ ★

## ఇక వాక్యాన్వయాధికరణము

సూ॥ **వాక్యాన్వయాత్ 1-4-19** వాక్యాలు పరస్పరము అన్వయము కావడం వల్ల పరమాత్మనే చెప్పబడుతున్నాడు. ఈ అధికరణములోనూ కపిలుని తన్త్రములో ప్రసిద్ధుడైన పురుషతత్త్వాన్ని తెలిపే వాక్యము ఒకచోట కనిపిస్తున్నది కనుక ఆ పురుషుడి కంటే వేరైన మరొక పురుషుడు ఈశ్వరుడు అనబడేవాడు ఎవ్వడూ ఉండడానికి వీలులేదు అని సందేహించగా దాన్ని నిరాకరించుతున్నాడు.

బృహ దారణ్యకములో మైత్రేయీ బ్రాహ్మణము నందు ఇట్లా వినిపిస్తున్నది. **నవా అరే! పత్యుఃకామాయపతిః ప్రియోభవతి.** అరే! భర్తయొక్క ఇష్టము ప్రకారము స్త్రీకి పతి

ఇష్టము / ప్రియుడు కావడంలేదు. అని మొదలు పెట్టి **నవా అరే! సర్వస్యకామాయసర్వం ప్రియం భవతి. ఆత్మనస్తు కామాయ సర్వంప్రియంభవతి / ఆత్మావా అరే! ద్రష్టవ్యః శ్రోతవ్యోమన్తవ్యోనిదిధ్యాసితవ్యోమైత్రేయి! ఆత్మనిఖల్వరే! దృష్టే శ్రుతే మతేవిజ్ఞాతే ఇదం సర్వమ్ విదితమ్.** అరే! అందరి కోరిక కొరకు అందరు / అంతా ప్రియము కావడంలేదు. ఆత్మయొక్క (బ్రహ్మయొక్క) కోరిక ప్రకారము / ఆత్మను కోరుకున్న వారికి అంతా పరమాత్మ మయమే ఐనందున ప్రీతిపాత్రము అవుతున్నది. ఆత్మనే కదా చూడదగినవాడు. వినదగినవాడు. మాటిమాటికి తల్చుకోదగినవాడు సమగ్రంగా ధ్యానము చేయదగినవాడు. ఓ మైత్రేయీ! ఆత్మను గనుక దర్శించుకుంటే, వింటే, మననము చేస్తే ఆత్మస్వరూపము తెలిస్తే ఈ కనిపించేదంతా తెలుస్తుంది. అని ఇక్కడ సందేహము. ఈ వాక్యములో దర్శించతగినవాడుగా చెప్పబడుతున్నవాడు తన్త్ర సిద్ధపురుషుడేనా? లేక సర్వజ్ఞుడు సత్యసంకల్పుడు ఐన సర్వేశ్వరుడా? అని. ఏది తగును అన్నట్లయితే పురుషుడేనని అంటున్నాము. ఎందువల్లనంటే? ఈ ఉపనిషత్తులో ఈ ప్రకరణము నందు మొదట్లో మధ్యలో చివరలోనూ పురుషుని గురించే ప్రతీతి కలుగుతున్నది. ఉపక్రమంలో మగడు, భార్య కొడుకులు ధనము పశువులు మొదలైనవాటియందు ప్రియత్వము కూడి ఉంటున్నది కనుక జీవాత్మనే అని తోస్తున్నది. ఇక నడుమ కూడా **విజ్ఞానఘనఏవైతేభ్యో భూతేభ్యఃసముత్థాయ తాన్యే వానువినశ్యతి. నప్రేత్యసంజ్ఞాఽస్తి.** విజ్ఞానఘనుడైన జీవుడు ఈ భూతాలనుండి/ శరీరాలనుండి లేచిపోయి వాటిననుసరించి నశించుతున్నాడు. ఇక్కడ నుండి వెళ్ళిపోయిన తరువాత ఇక పేరు లేదు. అని పుట్టుక, చావులతో కూడి ఉన్నందున ఆ జీవుడే అవగతమవుతున్నాడు. అదేవిధంగా చివరలో కూడా **విజ్ఞాతారం అరే! కేనవిజానీయాత్** అరే విజ్ఞానము కలవాడిని ఏ లక్షణము ద్వారా గుర్తుపడ్తాము. అని ఆ జ్ఞాత క్షేత్రజ్ఞుడే స్ఫురించుతున్నాడు. కానీ ఈశ్వరుడు కాడు. ఇందువల్ల ఈ వాక్యము / ప్రకరణము తన్త్ర సిద్ధపురుషుడిని ప్రతిపాదించేది అని నిశ్చయింపబడుతున్నది.

**అమృతస్యతు నాఽశాఽస్తివిత్తేన** అమృతము / మోక్షం ఆనందమునందే ఆశ ఉన్నది. కానీ విత్తము నందు లేదు. అని మొదలు ఐనందున అమృతత్వ ప్రాప్తికొరకైన ఉపాయాన్ని ఉపదేశించేదిగా ఈ వాక్యమున్నదని తోస్తున్నది గదా! ఐనప్పుడు ఈ వాక్యము పురుషుడి ప్రతిపాదనకు చెందింది అని ఏవిధంగా అనవచ్చును? అని అంటున్నారా? ఐతే వినండి. అమృతత్వాన్ని పొందదానికోసం ఉపాయాన్ని

ఉపదేశించేది ఐనందువల్లనే పురుషప్రతిపాదనపరము అని మేము అంటున్నాము. కాపిలతన్త్రములో అచిద్ధర్మాధ్యాసము – అచిద్ధర్మం అజ్ఞానము / జడత్వము / చైతన్యము లేకపోవడము – వీటిని ఆరోపించుకోకుండా ఉన్న పురుషుని యొక్క యథార్థస్వరూపాన్ని తెల్సుకోవడమే అమృతత్వాన్ని పొందడానికి హేతువని చెప్పబడుతూ ఉన్నది. కనుక జీవాత్మయొక్క ప్రకృతితో సమ్బన్ధము లేని స్వరూపమే ఇక్కడ అమృతత్వమును **పొందడానికే – ఆత్మావా అరేద్రష్టవ్యః** ఇత్యాది వాక్యాలతో చెప్పబడుతున్నది.

ఆత్మలందరికిన్నీ ప్రకృతితో సమ్బన్ధము లేని రూపము ఒకే తీరుగా ఉంటుంది. కనుక ప్రకృతి వియుక్తమైన తనదైన ఆత్మ యొక్క యథార్థస్వరూపాన్ని తెల్సుకుంటే ఆత్మలందరినీ గురించి తెలుస్తుంది. కాబట్టి ఆత్మ విజ్ఞానంతో – తనను గురించి తెల్సుకోవడంతో సర్వవిజ్ఞానము కలుగడం బాగుగా కుదురుతుంది. దేవతలు మొదలుకొని స్థావరాల వరకు ఉన్న అన్ని భూతాలయందున్నూ ఉన్న ఆత్మ స్వరూపము జ్ఞానస్వరూపమే కాబట్టి **ఇదం సర్వంయత్ అయమాత్మా.** ఈ కనిపించేదంతా ఆత్మనే అని ఆత్మ ఏకమే అని ఉపదేశము చేయబడింది. దేవాది ఆకారాలు – శరీరాలు ఆత్మ స్వరూపాలు కావు. **సర్వమ్ తంపరాదాత్** ఆయనను మించినది అంతా శూన్యమే. ఇత్యాది వాక్యాలతో మరొకటి లేదని నిషేధము కూడ చేయబడింది. **యత్రహిద్వైతమివభవతి** ఎక్కడ/ ఏ పురుషుని విషయమందైతే రెండు ఉన్నాయని తోస్తుందో అని ఒక్కటే ఉన్నది. నానా ఆకారాలులేవు అని నిషేధించిన కారణాన ఒక్కతీరుగా ఉండే ఆత్మయందు దేవుడు మొదలైన ప్రకృతికి చెందిన పరిణామాలలో ఉండే భేదాన్ని బట్టి వచ్చిన నానాత్వము – పలురూపులుగా ఉండడము మిథ్య అని చెప్పబడుతున్నది. **అస్యమహతో భూతస్య నిశ్వసితమేతత్ యదృగ్వేదః** ఈ ఋగ్వేదము అనబడేది ఏది ఉన్నదో అది ఈ మహాభూతము యొక్క నిశ్వాస. ఇత్యాది వాక్యాలున్నూ ప్రకృతికి అదిష్ఠాత ఐ ఉండడము వలన, ఈ జగత్తు పుట్టుక అంతా పురుషుడి కొరకే అయినందువలన పొసగుతుంది.

ఈ విధంగా ప్రస్తుత విషయవాక్యము పురుషుడికి చెందినది అని నిశ్చయించితే, దానితో ఏకాభిప్రాయము ఉన్నందున వేదాన్త వాక్యాలన్నీ తన్త్రసిద్ధుడైన పురుషుడినే చెప్తున్నవి కనుక పురుషుడి చేత అధిష్ఠింపబడిన ప్రకృతే జగదుత్పత్తికి ఉపాదాన కారణము అవుతుంది. కానీ ఈశ్వరుడు ఉపాదానకారణము కాదు అని.

ఇట్లాగా పూర్వపక్షము సిద్ధముకాగా సమాధానాన్ని చెపుతున్నాము. వాక్యాన్వయాత్ అని. ప్రస్తుత చర్చా విషయమైన వాక్యములో సర్వేశ్వరుడే గుర్తింపబడుతున్నాడు. ఎందువల్ల నంటే ఇట్లా చెప్పుకున్నపుడే వాక్యములోని అవయవాలకు అన్వయము కుదిరి రసవంతమై సమంజసము అవుతుంది. **అమృతస్యతు నాఽఽశాఽస్తివిత్తేన** అని యాజ్ఞ్యవల్క్యుడు అడిగితే **యేనాహం నామృతాస్యామ్, కిమహంతేనకుర్యామ్. యదేవభగవాన్ వేద తదేవమేబ్రూహి** ఏ ధనము వల్లనైతే నేను మోక్షాన్ని పొందజాలనో దాన్ని నేను ఏమి చేసుకోను? భగవన్తులైన తమరు మోక్షాన్ని పొందడానికి మార్గము ఇదని దేన్ని ఎరిగి ఉన్నారోదాన్నే నాకు తెలుపండి అని అమృతత్వానికి ఉపాయము కానందువలన విత్తాదులయందు ప్రేమను చూపక మోక్షాన్ని పొందడానికి తగిన మార్గాన్నే కోరుతున్న మైత్రేయీ అనబడే తన ఇల్లాలుకు అమృతత్వానికి ఉపాయము, దర్శించుకోదగినవాడుగా చెప్పబడిన ఈ ఆత్మ పరమాత్మనే. **తమేవ విదిత్వా అతిమృత్యుమేతి** అతడిని మాత్రమే తెల్సుకొని ఉపాసించినవాడు జనన మరణాలరూపమైన ఈ సంసారాన్ని దాటుకోగలడు. **తమేవం విద్వానమృత ఇహభవతి** ఆయనను ఈ విధంగా తెల్సి ఉపాసించినవాడు ఈ లోకంలోనే అమృతుడు / ముక్తిని పొందినవాడౌతాడు. **నాన్యః పన్థాః** మరోదారి లేదు. ఇత్యాది వాక్యాలవల్ల మోక్షాన్ని పొందడానికి పరమపురుషుడిని తెల్సుకోవడము ఒక్కటే ఉపాయంగా ప్రతిపాదించినందువల్ల. పరమపురుషునియొక్క యథార్థస్థితిని అపవర్గానికి సాధనమైన పరమపురుషుడిని తెల్సుకోవడంలో అక్కరకు వచ్చేదిగా అర్థం చేసుకోవాలి. కానీ తన ఆత్మ యథార్థస్థితికి సమ్బన్ధించిన జ్ఞానము నేరుగా మోక్షోపాయముగా తలచకూడదు. కనుక ఇక్కడ పరమాత్మ మాత్రమే అమతత్వోపాయముగా **ద్రష్టవ్యః** ఇత్యాది వాక్యముతో చెప్పబడుతున్నాడు.

అదే విధంగా **అస్యమహతోభూతస్యనిః శ్వసితమేతత్ యత్ ఋగ్వేదః** ఇత్యాది వాక్యముతో చెప్పబడుతున్న జగత్ కారణత్వము పరమపురుషుడికంటే వేరొకడైన కర్మ పరవశుడికి, ఏ పనీ చేయని భోగములననుభవించడమే తప్ప జగత్తును పుట్టించడము వంటి పనులు చేయడానికి యోగ్యతలేని ముక్తుడికి పురుషుడు అనబడే వాడికిన్నీ కలుగనే కలుగదు. ఆ ప్రకారమే **ఆత్మనోవా అరేదర్శనేన** ఇత్యాదివాక్యము చేత చెప్పబడిన ఒక్క వస్తువును తెల్సుకుంటే అన్ని వస్తువులను గురించీ తెలుస్తుంది అనే సర్వవిజ్ఞానము పరమాత్మను – అందరికీ ఆత్మఐన వాడిని పరమాత్మను తెల్సుకున్నప్పుడే సాధ్యమవుతుంది.

ఆత్మలన్నీ ఒకే రూపాన్ని కల్గిఉంటున్నందున ఒక్కదాన్ని తెల్సుకుంటే అన్నింటిని గురించి తెలుస్తుంది అని ఏమాట అన్నారో అది సరియైనది కాదు. అచేతన ప్రపంచాన్ని గురించిన జ్ఞానము సర్వవిజ్ఞానములో ఒక భాగమై ఉంటుండగా చేతనమైన దాన్ని గురించి తెలియబడదు కనుక అప్పుడు సర్వవిజ్ఞానమనుట కుదురదు. ఈ సర్వ విజ్ఞాన ప్రతిజ్ఞా ఉపపాదనము కొరకు కూడా **ఇదం బ్రహ్మేదం క్షత్రమ్** ఇతడు బ్రాహ్మణుడు ఇతడు క్షత్రియుడు అని ఆరంభించి **ఇదం సర్వం యదయమాత్మా** అని ప్రత్యక్షాది ప్రమాణాలచేత సిద్ధమైన ప్రపంచాన్ని ఇదం అని నిర్దేశించి **ఏతత్ అయమాత్మా** అని ఆత్మ ఐక్య ఉపదేశమున్నూ పరమాత్మకు మాత్రమే చెల్లుతుంది. ఇదం శబ్దముచేత చెప్పబడే ఈ చిదచిన్మిశ్రప్రపంచము అచిత్‌తో కూడిన పురుషుడితో కాని, అచిత్తుతో నుండి విడివడిన తనదైన స్వరూపంతో ఉన్నవాడితోనైనా ఏకత్వాన్ని / ఐక్యాన్ని పొందదు. కనుకనే **సర్వం తంపరాదాత్ యోఽన్యత్రాత్మనఃసర్వంవేద.** అని పరమాత్మకంటే వ్యతిరేకమైనందుననే సర్వవేదననింద చేయబడింది. అట్లాగే ప్రథమ మైత్రేయీ బ్రాహ్మణములో **మహద్ భూతమనన్తమపారమ్.** అది చాలా పెద్దది. పెద్దభూతము. అంతములేనిది. అపారమైనది. అని వినిపిస్తున్న మహత్త్వాదులైన గుణాలు పరమాత్మకే ఉంటాయి. ఇందువల్ల ఇక్కడ ఆ పరమపురుషుడే ప్రతిపాదింపబడుతున్నాడు.

భర్త భార్య కొడుకులు ధనము పశువులు మొదలైన నచ్చిన వస్తువులతో సమ్బన్ధము కల్గియుండే జీవాత్మను గురించి ఆరంభములో అన్వేష్టవ్యుడుగా ప్రతిపాదించినారు కనుక ఈ వాక్యము ఆ జీవాత్మకు సమ్బన్ధించినదే అని మీరు చెప్పిన మాట సరికాదు. **ఆత్మనస్తుకామాయ** అనే వాక్యములో ఆత్మ శబ్దముచేత జీవాత్మను గురించే చెప్పినట్లయితే **ఆత్మావా అరే ద్రష్టవ్యః** అనే వాక్యముతో అన్వయము / కలయిక / పొత్తు / సమ్బన్ధము లేకుండా పోతుంది. **ఆత్మావా అరే ద్రష్టవ్యః** అని ఆత్మ / పరమాత్మ ద్రష్టవ్యత్వ – దర్శింపదగినవాడుగా – ఉపయోగమును పొందుతున్నాడు కాబట్టి **ఆత్మనస్తుకామాయ** అని ఉపదేశించబడినదని తెలుస్తున్నది. ఆత్మనస్తుకామాయ అనగా ఆత్మ యొక్క కామము / కోరిక / సంకల్పము నెరవేరుట కొరకు అని అర్థము. కామ్యతే ఇతి కోరబడుచున్నది కనుక కామము. ఆత్మకు ఇష్టము చేకూరుటకు అని. జీవాత్మయొక్క ఇష్ట సంపత్తి కొరకు **సుఖాదుల కొరకు** పతిమొదలైనవారు ప్రియులు అగుచున్నారు అని చెప్పినట్లయితే ఆ జీవుడి యొక్క స్వరూపము అన్వేషించదగినది – వెతుకదగినది – కావడం లేదు. ప్రియమైనదే వెతుకబడుతున్నది. ప్రియానికి

శేషియైనవాని ప్రీతిలేని స్వరూపము అన్వేషింపదగినది కాదు. అన్వేషింపబడదు. ఏ కారణము చేతనైతే ఆత్మకు సుఖము కలుగుటకొరకు పత్యాదులు ప్రియులు / నచ్చినవారు అగుతున్నారో ఆ కారణము వల్లనే పతి మొదలైన ప్రియులను వదిలిపెట్టి ప్రీతిలేని ఆత్మస్వరూపము అన్వేషింపదగినది అని అనడము అసంగతము ఔతుంది. పైగా పత్యాదులకు శేషమగుట – విధేయుడగుట – వలన పత్యాదులు ప్రియులుకారు. కానీ ఆత్మకు (పరమాత్మకు) శేషమైనందున పత్యాదులు ప్రియమై ఉంటున్నారు అని చెప్పితే తనకు (పరమాత్మకు) శేషులు ఐనందున వారే స్వీకరింపదగినవారౌతున్నారు. **ఆత్మ నస్తుకామాయ సర్వం ప్రియం భవతి** పరమాత్మయొక్క ఇష్టసమ్మతి కొరకు అంతా ప్రియమే అవుతున్నది అని అన్నప్పుడు పరమాత్మతో తరువాతి వాక్యముతో అన్వయము లేకపోతే వాక్యభేదము – రెండుగా చేయబడుట – ఏర్పడుతుంది. అట్లాగా వాక్య భేదాన్ని ఒప్పుకున్నా మొదటివాక్యానికి ప్రయోజనము అంటూ ఉండదు.

కావున పత్యాదులైన ప్రియులను వదలిపెట్టి ఆత్మను మాత్రమే అన్వేషించాలి అనే విషయము ఏవిధంగా ఉంటుంది – **అమృతత్వస్యతునా శాఽస్తి విత్తేన** అని ధనము మొదలైనవి నిత్యము నిర్దోషము నిరతి శయ ఆనంద రూపమైన అమృతత్వప్రాప్తికి ఉపాయాలు కావు అని చెప్పి, ధనము కొడుకులు భర్త భార్య మొదలైనవాడు తమ కన్న అధికులను కల్గియున్నవారు. దుఃఖముతో కలగలుపు ఉన్నవారు, ఎప్పుడో ఒకానొకపుడు ప్రియులు అవుతూ ఉన్నట్టివారు. వారు ఏమైనా ప్రీతిపాత్రులు అవుతున్నారంటే అది పత్యాదులు ఐనందువల్ల కాదు. కానీ నిరతిశయమైన ఆనంద స్వభావాన్ని కల్గిన పరమాత్మ కారణంగానే. కనుక ఎవడైతే నిరతిశయానందాన్ని కలవాడై ఉంటూ తనకంటే వేరయినవాళ్ళను కూడా ప్రియత్వలేశాన్ని / కొద్దిపాటి ప్రీతిని కలవాళ్ళనుగా చేస్తాడో ఆ పరమాత్మను మాత్రమే దర్శించుకోవాలి. అని ఉపదేశించబడుతున్నది. ఆ విధంగా సమన్వయము చేసుకున్నప్పుడు తెలియవచ్చిన అర్థమిది. **నవా అరేపత్యుః కామాయ పతిఃప్రియోభవతి.** భర్త యొక్క ఇష్టాన్ని నెరవేర్చడం కొరకు భర్త ఇష్టమైనవాడు కావడంలేదు. అనగా భర్త భార్య పుత్రవిత్తాదులు నాప్రయోజనం కొరకు నేను ఇతనికి ప్రియుడినికావాలి అని తల్చుకొని ఎదుటివారికి ప్రియులు కావడంలేదు. కానీ ఆత్మ (అన్తరాత్మయొక్క) సంకల్పానుసారము ప్రీతిపాత్రులు అవుతున్నారు. తనను ఆరాధించే వాడికి ప్రీతిని / ఇష్టాన్ని కలిగించాలని పరమాత్మ చేసిన సంకల్పము, ఇష్టము నెరవేర్చుటకొరకే అని అర్థము. పరమాత్మ

ఉపాసకులు చేసే కర్మలచేత ఆరాధింపబడివారి వారి కర్మలకు తగినట్లుగా ఆయాదేశములు, కాలాలు, స్వరూపాలకు తగిన మోతాదుల్లో ఆరాధకులకు ఆయా వస్తువులయందు ప్రియత్వమును కలిగించుతాడు. వాళ్ళ ఉపాసనలకు తగినట్లుగా ఎదుటి వారికి వీరిపై ప్రేమకలిగేటట్లుచేస్తాడు అని అర్థము. **ఏషహ్యే వానందయాతి** ఈయననే కదా ఆనందింపచేస్తాడు అని కదా శ్రుతి వివరించుతున్నది. వాస్తవానికి ఆయా వస్తువు తనదైన స్వరూపాన్ని బట్టి ప్రియము అప్రియమూ కావడంలేదు. అట్లాగా అనే కదా చెప్పినారు. **తదేవప్రీత యేభూత్వా పునర్దుః ఖాయజాయతే। తదేవకోపాయ యతఃప్రసాదాయచజాయతే। తస్మాత్ దుఃఖాత్మకం నాస్తినచకించిత్సుఖాత్మకమ్.** ఆ వస్తువే సన్తోషాన్ని కలిగించి తరువాత కాలంలో దుఃఖాన్ని కూడా కలిగించుతున్నది. అదే కోపానికి కారణమవుతున్నది మరియు అనుగ్రహానికిన్నీ హేతువగుచున్నది. అందువల్ల ఏ వస్తువుకూడా దుఃఖాత్మకమూ కాదు. సుఖాత్మకమూ కాదు. అది దాని తీరుగా ఉంటున్నది. భోక్తచేసుకున్న కర్మ కారణంగా పరమాత్మ సంకల్పం ప్రకారము ఆనందాన్ని దుఃఖాన్నీ కల్గిస్తున్నది. అని.

**ఆత్మనస్తుకామాయ** అనే వాక్యము జీవాత్మపరమే ఐనా కూడా **ఆత్మావా అరేద్రష్టవ్యః** అనేచోట మాత్రము పరమాత్మకు సమ్బన్ధించిందే. అప్పుడు ఇదీ అర్థము– ఎందువల్లనైతే పత్యాదులకు ఇష్టాన్ని చేకూర్చడం కొరకు వారికి పరవశులు/ లొంగిఉన్నవారు ఐనందున పతి మొదలైనవారు ప్రియమైనవారుగా దగ్గరకు తీసుకోబడుతు లేరో, ఐతే తమ ఇష్టమును చేకూర్చుకోవడం కొరకు మాత్రమే స్వతంత్రముగా / తమ ప్రేమ కొద్దీ / ఎవరో చెప్పితే కాకుండా తమకు ఎవడైతే ఆత్మకు ఏ కారణం లేకుండానే దోషాలు లేనివాడై నిరవధిక ప్రియుడు అగుతున్నాడో ఆ పరమాత్మ మాత్రమే దర్శించుకోదగినవాడు. అంతేకాని దుఃఖముతో కూడిన అల్పసుఖము, దుఃఖములకు కారణములైన వారు, ఇతరులు / కర్మకు లొంగి ఉండిన ఆయాస్వభావాలు కల పతి జాయాపుత్రవిత్తాదులు ఐన విషయాలు అన్వేష్టవ్యములు / వెతుకులాడదగినవి కావు. అని.

ఈ ప్రకరణంలో జీవాత్మను చెప్పే శబ్దంతో కూడా పరమాత్మను గురించే చెప్పినందువల్ల **ఆత్మనస్తుకామాయ, ఆత్మావా అరే ద్రష్టవ్యః** అనే చోట్లు రెండింటిలోనూ ముందు వివరించిన ప్రకారము ఆత్మ శబ్దాలు రెండూ ఒకే విషయాన్ని చెపుతున్నాయి. మరొక అభిప్రాయము ప్రకారము / విధంగా కూడా జీవశబ్దంతో పరమాత్మను చెప్పడాన్ని సమర్థించడానికి హేతువును చెపుతున్నారు.

సూ॥ **ప్రతిజ్ఞాసిద్ధేః లింగమ్ ఆశ్మరథ్యః 1-4-20** ఒక్కదానిని తెల్సుకుంటే అన్ని వస్తువులను గురించి తెల్సుకున్నట్లు అవుతుందనడానికి, ప్రతిజ్ఞా సిద్ధికి ఇది లింగము / హేతువు. జీవాత్మను తెలిపే శబ్దాలతో పరమాత్మను చెప్పడము అని ఆశ్మరథ్యుడు అనే ఆచార్యుడు అభిప్రాయపడుతున్నాడు. ఒకవేళ ఈ జీవుడు పరమాత్మకార్యమైనందున పరమాత్మకాకపోయినట్లయితే అపుడు పరమాత్మకంటే వేరొకడు అవుతున్నాడు కాబట్టి పరమాత్మను తెల్సుకుంటే జీవాత్మను గురించి తెల్సుకోవడం సాధ్యము కాదు. **ఆత్మావా ఇదమేకఏవాగ్ర ఆసీత్** సృష్టికి పూర్వకాలంలో ఆత్మ ఒక్కటే ఉండినాదు. అని సృష్టికి పూర్వకాలములో ఒక్కడే ఉన్నాడని నిర్ధారణ అవుతున్నందువల్ల, **యథా సుదీప్తాత్ పావకాత్ విస్ఫులింగాః సహస్రశఃప్రభవన్తే సరూపాః. తథాఽ క్షరాత్ వివిథాః సోమ్య!భావాఃప్రజాయన్తే. తత్రచైవాపియన్తి.** ఎట్లాగైతే బాగుగామండుతున్న / కణకణలాడుతున్న అగ్ని నుండి నిప్పురవ్వలు వేలకొలదిగా నిప్పుతో సమానమైన రూపమును కలవై పుట్టుకొస్తున్నాయో అదే విధంగా నాశనము లేని పరమాత్మ నుండి పలురకాలైన ప్రజలు పుడుతున్నారు. మళ్ళీ అతడిలోనే కలిసిపోతున్నవి. ఇత్యాదివాక్యాల ప్రకారము బ్రహ్మనుండి జీవులు  పుడుతున్నారు. మళ్లీ ఆయనలోనే లీనమవుతున్నారని తెలుస్తున్నందువల్ల జీవులు బ్రహ్మయొక్క కార్యములు – ఉత్పత్తి చేయబడినవారు. కారణము బ్రహ్మ – కార్యము జీవులు, రెండింటికీ భేదము లేదు. కారణము కార్యములో కలిసి ఉంటున్నది – కనుక బ్రహ్మతో ఐక్యము తెలియవస్తున్నది. కనుక జీవశబ్దముతో పరమాత్మను చెప్పినారు అని.

సూ॥ **ఉత్క్రమిష్యతః ఏవమ్భావాదిత్యౌడులోమిః 1-4-21** శరీరములో నుంచి లేచి పోతున్న జీవుడు బ్రహ్మ భావాన్ని పొందుతున్నాడు కనుక అని ఔడులోమి గారు అంటున్నారు. జీవుడు బ్రహ్మచేత పుట్టింపబడినందున కార్యము ఔతున్నాడు. కనుక కార్యకారణములకు అనన్యసమ్బన్ధము ఉన్నందువల్ల బ్రహ్మతో జీవుడికి ఏకత్వం తోస్తున్నది కాబట్టి ఏకవిజ్ఞానము వలన సర్వవిజ్ఞానము కలుగుతుంది. అనే ప్రతిజ్ఞను ఉపపాదించడానికి జీవవాచకశబ్దముతో బ్రహ్మను ప్రతిపాదించినారని ఏమాట చెప్పినారో అది తగినది కాదు. **నజాయతే మ్రియతేవావిపశ్చిత్** విపశ్చిత్ అయిన బ్రహ్మ పుట్టేవాడు కాడు. చనిపోయేవాడున్నూ కాడు అని పరమాత్మకు పుట్టుకలేదని తెలుస్తున్నందువల్ల జీవాత్మ పరమాత్మలు వేరువేరే. ఈ జగత్ సృష్టి జీవాత్మలయొక్క కర్మల ఫలితాలను అనుభవించడం కొరకే చేయబడుతున్నది. ఇట్లా కాక పోయినట్లయితే జగత్తులోని ఎక్కువ తక్కువలకు లంకె దొరుకదు. బ్రహ్మకార్యమైన

జీవుడికి బ్రహ్మత్వాన్ని పొందడమనే లక్షణము గల మోక్షము, ఘటాకాశము, మఠాకాశములు అవి పగిలినప్పుడు కూలినప్పుడు మహా ఆకాశములో కల్సిపోయిన విధంగానే తప్పనిసరి ఐనది కనుక దాన్ని సాధించే ఉపాయమును విధించుట, దాన్ని ఆచరించుటలు అర్థములేనివి ప్రయోజనము లేనివి కావాల్సివస్తుంది. ఘటాదులు తమ పుట్టుకకు కారణములైన పృథివి మొదలైనవాటిలో చేరుకోవడమనేది వినాశరూపమే కాబట్టి మోక్షము అపురుషార్థము అవుతున్నది. కనుక జీవపరబ్రహ్మలు వేరువేరే. కనుక జీవ శబ్దముతో పరమాత్మను చెప్పినారనుట తగదు. జీవాత్మ పుట్టడము, కారణములో ప్రలయము కావడము అనే వాదాలు తగునని తరువాత సందర్భము వచ్చినపుడు విస్తరించి చెప్పగలము. కావున **ఏషసమ్ప్రసాదోఽస్మాచ్ఛరీరాత్ సముత్థాయ పరంజ్యోతి రుపసమ్పద్య స్వేనరూపేణాభినిష్పద్యతే** ఈ భగవదనుగ్రహపాత్రుడైన జీవుడు శరీరాన్నుండి పైకిలేచి క్రమంగా పరంజ్యోతియైన పరమాత్మ వద్దకు చేరుకొని తన సహజమైన రూపాన్ని పొందుతున్నాడు. **2) యథానద్యః స్యన్దమానాః సముద్రేఅస్తంగచ్ఛన్తి నామరూపే విహాయ। తథావిద్వాన్ నామరూపాద్విముక్తః పరాత్పరం పురుషం ఉపైతి దివ్యమ్.** ఏవిధంగానైతే నదులు జాలువారుతున్నవై క్రమంగా సముద్రంలోకి చేరుకొని తమ నామరూపాలను వదిలిపెట్టి కనబడకుండా పోతున్నవో అట్లాగే బ్రహ్మ స్వరూపాన్ని తెల్సుకొని ఉపాసించినవాడు తనయొక్క నామరూపాలనుండి విడుదల పొందినవాడై ఉజ్వలంగా వెలిగే పరాత్పరుడిని చేరుకుంటున్నాడు అని ఈ దేహంలో నుంచి లేచిపోయే వాడికి పరమాత్మ భావము వస్తున్నది కాబట్టి జీవశబ్దముతో పరమాత్మకే పేరు వ్యవహారమున్నది అని ఔడులోమి అనే ఆచార్యుడు తలంచుతున్నాడు.

సూ॥ **అవస్థితేరితి కాశకృత్స్నః 1-4-22** దేహంలో నుంచి లేచిపోయే జీవుడికి బ్రహ్మభావము వస్తున్నది. కనుక ఆ జీవశబ్దముతో పరబ్రహ్మను పిలువవచ్చును అని ఏది చెప్పినారో అది కూడా తగినది కాదు. వికల్పము చేస్తే – ఔనా? కాదా? ఇట్లాగా? అట్లాగా? అని రెండుగా విడదీస్తే – తట్టుకోలేదు. నిలువదు గనుక. ఈ జీవాత్మకు ఉత్క్రాన్తి – (లేచిపోవడము)కి ముందు ఈ బ్రహ్మగా లేకపోవడము అనేది పుట్టుకతో వచ్చినదా? సహజమా లేక ఔపాధికమా? ఏదో ఒక కారణముతో వచ్చినటువంటిదా? అని. అందులోనూ ఈ ఉపాధి పారమార్థికమా? అపారమార్థికమా? (నిజమైనదా? లేక కల్పితమైనదా?) అని.

బ్రహ్మస్వరూపము స్వాభావికమైనదేఐతే తిరిగి బ్రహ్మభావాన్ని పొందడము అనేది పొసగదు. భేదము అనేది తన స్వరూపాన్ని బట్టి ఏర్పడేది కాబట్టి తనదైన స్వాభావిక బ్రహ్మస్వరూపము ఉంటుండగా అది తొలగిపోవడంలేదు. కాబట్టి స్వాభావికము అనడానికి వీల్లేదు. ఇక భేదముతోపాటు స్వరూపము కూడా తొలగిపోతుంది అని అనేటట్లయితే భేదము స్వరూపమూ నశించిపోయింది కాబట్టి అతడికి బ్రహ్మభావము సిద్ధించదు. సర్వవినాశము పురుషార్థము కాదు కనుక అపురుషార్థత్వాది దోషాలు వస్తాయి.

ఉపాధి పరమార్థము అని అంగీకరించితే ఇంతకుమునుపు కూడా బ్రహ్మనే అయ్యి ఉన్నాడు కాబట్టి **ఉత్క్రమిష్యతః ఏవంభావాత్** అనే విశేషణము చెప్పకూడదు. ఈ పక్షములో ఉపాధి సహితుడైన బ్రహ్మకంటే వేరుగా మరొకవస్తువు లేదు కాబట్టి అవయవాలు లేని బ్రహ్మకు ఉపాధితో వేరు చేయడానికి కుదురదు కనుక ఉపాధికి సమ్బన్ధించినదే। దానితో వచ్చినదే భేదము కాబట్టి ఉత్క్రాన్తికి ముందుకూడా బ్రహ్మనే అవుతాడు.

ఉపాధివల్ల వచ్చే భేదము పరమార్థము / యథార్థము కాకపోయినప్పుడు ఉత్క్రాన్తి జరిగిన పిదప ఈ బ్రహ్మభావము ఎవడికి వస్తుందో చెప్పవలసి ఉంటుంది. అవిద్య అనే ఉపాధి చేత మూసుకుపోయిన తన స్వరూపము కల బ్రహ్మకే అని అనడము తగదు. నిత్యముక్తస్వప్రకాశము కల జ్ఞానస్వరూపుడైన బ్రహ్మ అవిద్య అనే ఉపాధి చేత కమ్మివేయబడడము అనేది పొసగదు కాబట్టి. తిరోధానము కప్పివేయడము అంటే వస్తువు యొక్క స్వరూపము ఉంటూ ఉండగా దాని ప్రకాశము లేకుండా పోవడమే. ప్రకాశమే ఆ వస్తువు యొక్క స్వరూపము అని ఒప్పుకున్నప్పుడు తిరోధానము ఉండదు. లేదా స్వరూపము నశించి ఐనా పోవాల్సి ఉంటుంది. కనుక నిత్యమూ తనదైన స్వరూపము ఆవిర్భూతమే అయ్యి ఉంటున్నది కాబట్టి అటువంటివాడు ఉత్క్రాన్తి జరిగిన తరువాత తిరిగి బ్రహ్మభావాన్ని పొందితే వచ్చే విశేషము ఏదీ ఉండదు కనుక **ఉత్క్రమిష్యతః** అనే విశేషణాన్ని వేయడం దండుగే అవుతుంది. **అస్మాత్ శరీరాత్ సముత్థాయ** అనే వాక్యముతో ఇంతకుముందు ఇట్లాంటి రూపములేనివాడికి అప్పుడు బ్రహ్మతాపత్తిని చెప్పలేదు కానీ బద్ధుడు కాకమునుపు ఉన్నటువంటి రూపము వెలుగులోకి రావడము / బయల్పడడాన్ని చెప్పినారు. అందుకే **సమ్పద్యావిర్భావః స్వేనశబ్దాత్** ఇత్యాది సూత్రాలతో చెప్పనున్నారు.

కనుక **అనేన జీవేన ఆత్మనాఽనుప్రవిశ్య 2) యఆత్మనితిష్ఠన్ ఆత్మనోఽన్తరోయ మాత్మానవేదయస్యాత్మా శరీరమ్ యఆత్మానమన్తరో యమయతిసతేఆత్మా అన్తర్యామీ అమృతః 3) యోఽక్షరమన్తరే సంచరన్ యస్యాక్షరం శరీరమ్ యమక్షరంనవేద. ఏష సర్వభూతాఽన్తరాత్మాఽపహతపాప్మాదివ్యోదేవ ఏకోనారాయణః 4) అన్తఃప్రవిష్టః శాస్తాజనానాం సర్వాత్మా** అని చెప్పినట్లు తనకు శరీరమైన జీవాత్మయందు ఆత్మగా ఉంటున్నందువలన జీవశబ్దంతో బ్రహ్మను ప్రతిపాదించినారని కాశకృత్స్నుడు అనే ఆచార్యుడు తలచుచుండినాడు. జీవశబ్దము పరమాత్మ వరకు ఉన్న వాడికే వాచకము. కేవలము శరీరానికి, దానిలో ఉన్న ఆత్మకే కాక అన్తరాత్మగా ఉన్న పరమాత్మను కూడా చెప్తుంది. వాచకము అవుతున్నది. ఒట్టి జీవుడిని మాత్రమే కాదని ఇంతకుముందే చెప్పినాము **నామరూపే వ్యాకరవాణి** అనే వాక్యవివరణము దగ్గర.

ఈ విధంగా ఆత్మ శరీరభావసమ్బన్ధాన్ని బట్టి తాదాత్మ్యాన్ని ప్రతిపాదించినప్పుడు పరబ్రహ్మకు అపహతపాప్మత్వము, సర్వజ్ఞత్వము వంటి కళ్యాణగుణాలను ప్రతిపాదించేవి, అజ్ఞానియైన జీవుడికి సంసారదుఃఖాల వల్ల విచారిస్తున్నవాడికి బ్రహ్మను ఉపాసించినందువల్ల మోక్షము కలుగుతుందని చెప్పేవి, జగత్తుకూ బ్రహ్మకున్నూ తాదాత్మ్యాన్ని ఉపదేశించేవీ ఐన అన్ని శ్రుతులూ చక్కగా ఉపపాదించినవి అవుతాయి. కనుక కాశకృత్స్నుడికి చెందిన అభిప్రాయాన్నే తన అభిప్రాయంగా సూత్రకారుదు స్వీకరించినాడు.

చివరగా ఇక్కడ తేల్చబడిన వాక్యార్థము ఇది – అమృతత్వోపాయాన్ని మైత్రేయి అడుగగా యాజ్ఞవల్క్యుడు **ఆత్మావా అరేద్రష్టవ్యః** ఇద్యాదివాక్యాలద్వారా పరమాత్మను ఉపాసించడమే అమృతత్వాన్ని పొందడానికి ఉపాయము అని చెప్పి **ఆత్మనిఖల్వరే దృష్టే** ఇత్యాదిగా ఉపాస్యుడైన బ్రహ్మయొక్క లక్షణమును, దుందుభి మొదలైన దృష్టాన్తాలతోనూ ఉపాసన చేయడానికి సాధనాలైన మనస్సు మొదలగు సాధనాలను / ఇంద్రియాలను అదుపులో పెట్టుకోవడాన్నిన్నీ సాధారణంగా చెప్పి **సయథాఽర్ద్రైధాగ్నేః** ఇత్యాదిగా **సయథాసర్వాసామపాం సముద్ర ఏకాయనమ్** – భూమిమీదున్న జలమంతటికీ సముద్రమొక్కటే స్థానమైనట్లు ఇత్యాది వాక్యాలతో ఉపాస్యుడైన పరబ్రహ్మకు వాచ్యవాచక భోగ్యభోగస్థానాదులతో కలసి ఉన్న సమస్త జగత్తుకూ తానొక్కడే అన్నివిధాల కారణమై ఉండడాన్ని, సకల విషయాలనూ అనుభవించడానికి ముందుకు పరుగులు పెట్టడానికి కారణమైన ఇంద్రియముల

సముదాయాన్ని అదుపులో పెట్టే విధాన్ని విస్తారంగా ఉపదేశించి, **సయథాసైన్ధవఘనః** ఆ ఉప్పుగడ్డ వలె ఇత్యాదిగా అమృతత్వాన్ని పొందడానికి ఉపాయమైన దానియందు పూనుకొనడాన్ని ప్రోత్సహించడం కొరకు జీవాత్మ స్వరూపంలో ఉన్న పరమాత్మను అపరిచ్ఛిన్నమైన, దేనితోనూ ఇంత అని చెప్పడానికి, కొలత బెట్టడానికి వీలుకాని జ్ఞానము ఒక్కటే ఆకారముగా గలవాడని ఉపపాదించి, అట్లాంటి అపరిచ్ఛిన్న జ్ఞానమే ఏకాకారముగా గలవాడు సంసారదశలో భూతపరిణామాలను అనుసరించి నడచుకొంటూ ఉండడాన్ని **విజ్ఞానఘన ఏవైతేభ్యోభూతేభ్యః సముత్థాయ తాన్యేవానువినశ్యతి** అని చెప్పి, **నప్రేత్యసంజ్ఞాఽస్తి** అని మోక్షదశలో స్వాభావికమైన అపరిచ్ఛిన్న జ్ఞానానికి, సంకోచము – కుదింపు – తగ్గిపోవడము – లేనందువల్ల భూతాల సమూహముతో ఒక్కటిగా చేసి ఆత్మయందు దేవతిర్యక్ మనుష్యస్థావరాదులు అనే భేదజ్ఞానము లేదని చెప్పి మళ్ళీ ఏ అవస్థయందైతే పరమాత్మ తాను అనే ద్వైతము, ఉన్నట్లుగా అనిపిస్తుందో (**యత్రహిద్వైతమివభవతి**) ఇత్యాది వాక్యముతో అబ్రహ్మాత్మకము – బ్రహ్మము కానిది – ఐనందున అనేక వస్తువులు ఉన్నట్లుగా దర్శించడము అజ్ఞానము వల్ల జరుగుతున్నదని, అన్నిరకాల అజ్ఞానాలు తొలగిపోయి సమస్తప్రపంచాన్నీ బ్రహ్మాత్మకమే – బ్రహ్మ సమ్బన్ధము కలది – అని అనుభవిస్తున్నవాడికి / దర్శించుకుంటున్నవాడికి బ్రహ్మకంటే వేరయిన వస్తువు లేదు కాబట్టి భేద దర్శనము కూడదని నిరసించి **యేనేదంసర్వం విజానాతి తంకేన విజానీయాత్.** (ఎవని ద్వారానైతే ఈ సమస్తాన్ని తెలుసుకుంటున్నాడో అటువంటి కారణమైన వాడిని దేనితో గుర్తించాలి) అనిన్నీ జీవాత్మ తనకు ఆత్మగా నున్నటువంటి ఏ పరమాత్మ ద్వారానైతే నింపబడిన జ్ఞానము కలవాడై ఈ సమస్తాన్ని కనుగొంటున్నాడో అటువంటివాడిని ఈ జీవుడు ఆ పరమాత్మను దేనితో / దేనిద్వారా దేని సహాయముతో తెల్సుకోగల్గుతాడు అని అంటే దేనితోనూ తెల్సుకోలేడు అని పరమాత్మను అర్థము చేసుకోవడం కష్టము అని గట్టిగా చెప్పి **స ఏషనేతినేతి** (ఆయన ఇతడు కాడు ఇతడుకాడు) ఇత్యాదివాక్యముతో ఈ సర్వేశ్వరుడు తనకంటే వేరైన వాళ్ళందరికన్నా, సమస్త చిదచిద్వస్తువులకన్నా విలక్షణమైన స్వరూపముగలవాడయ్యే ఉంటూ అందరినీ తనకు శరీరాలనుగా చేసుకున్నవాడై అందరికీ ఆత్మగా అయ్యి ఉన్నాడు అని చెపుతూ, తనకు శరీరాలు ఐన చిదచిద్వస్తువులలో ఉన్న దోషాలతో అంటులేకుండా ఉన్నాడని చెప్పి **విజ్ఞాతారమరేకేనవిజానీయాత్ ఇత్యుక్తాఽనుశాసనాఽసిమైత్రేయి! ఏతావదరేఖల్వమృతత్వమ్.** (విజ్ఞాత ఐనవాడిని దేని ద్వారా తెల్సుకోగలము అని

చెప్పబడినావు. ఇట్లాగా నడచుకో అని శాసింపబడినావు. ఓమైత్రేయీ ఇదే గదా అమృతత్వము) అని సమస్త వస్తువులకంటే విసజాతీయుడు సమస్త జగత్తుకూ ఏకైక కారణమైనవాడు అన్నింటినీ తెల్సినవాడు ఐన పురుషోత్తముడిని ఇంతవరకూ చెప్పబడిన ప్రకారము చెయ్యవలసిన ఉపాసన ద్వారా తప్ప దేనితో తెల్సుకోగలము అని **ఈ ఉపాసనమే అమృతత్వాన్ని పొందడానికి ఉపాయము. బ్రహ్మను చేరుకోవడమే అమృతత్వము అని అనబడుతుంది అని చెప్పినాడు.** కావున పరబ్రహ్మనే ఈ వాక్యములో ప్రతిపాదింపబడుతున్నాడు. కనుక పరబ్రహ్మనే జగత్ కారణము. పురుషుడు కాడు. అతడిచే అధిష్ఠింపబడిన ప్రకృతి కూడా కాదు అని నిల్చినది. **అని వాక్యాన్వయాధికరణము**

★ ★ ★

## ఇక ప్రకృత్యధికరణము

సూ॥ **ప్రకృతిశ్చ ప్రతిజ్ఞాదృష్టాన్తానుపరోధాత్ 1-4-23** ఉపాదాన కారణమున్నూ పరమాత్మనే. ప్రతిజ్ఞ, దృష్టాంతములు విరోధించడం లేదు గనుక. ఈ విధంగా నిరీశ్వరసాంఖ్యుడు తప్పుకొని పోయినాక సేశ్వరసాంఖ్యుడు ముందుకు వస్తున్నాడు. ఈక్షణము మొదలైన గుణాలతో కూడి ఉన్నాడు కనుక సర్వజ్ఞుడైన ఈశ్వరుడిని జగత్ కారణంగా ఉపనిషత్తులు ప్రతిపాదించుతున్నా అవే వేదాన్తాల చేత జగత్తుకు ఉపాదాన కారణముగా ప్రధానమే ప్రతిపాదింపబడుతున్నది అని తెలుస్తున్నది. వేదాన్తాలు సర్వజ్ఞుడు పరిణామాలను పొందనివాడూ అధిష్ఠాత ఐన ఈశ్వరుడికి అధిష్ఠేయము ఐన అచేతనము పరిణామాలను పొందేది ఐన ప్రధానము యొక్క తోడ్పాటు లేకుండా జగత్తుకు కారణంగా చెప్పలేవు. మేము చెప్పినట్లుగానే ఈశ్వరుడిని పరిణామము లేని వానిగాను, ఇతడి చేత అధిష్ఠింపబడిన ప్రకృతిని రకరకాలమార్పులను పొందేదిగానూ కొన్ని వేదాన్తవాక్యాలు చెప్పుతున్నాయి. **1) నిష్కలం నిష్క్రియమ్ శాన్తం నిరవద్యం నిరంజనమ్.** అవయవాలు లేని వాడు ఏ పనులూ చేయనివాడు ప్రశాన్తుడు దోషాలు లేనివాడు దేనితోను సమ్బన్ధము లేనివాడు **2) సవాఏషమహానజ ఆత్మాఽజరోఽమరః** ఈయన గదా గొప్పవాడు, పుట్టుకలేని వాడు, అందరికీ ఆత్మ ఐనవాడు ముసలితనము, తరుగుదల లేనివాడు, మరణము లేనివాడు. **3) వికారజననీ మజ్ఞామష్టరూపామ్ అజాంధృవామ్.** పలురకాలైన వికారాలను / మార్పులను పుట్టించేది జ్ఞానము / చైతన్యము లేనిది ఎనిమిది రూపాలు

గలది, పుట్టుకలేనిది, స్థిరంగా నిల్చి ఒక దగ్గర ఉండేది. **4) ధ్యాయతేఽధ్యాసితాతేన తన్యతేప్రేర్యతేపునః। సూయతే పురుషార్థంచతేనైవాధిష్ఠితాజగత్॥ గౌరనాద్యన్తవతీ సాజనిత్రీ భూతభావినీ.** పురుషుడిచేత తలచుకోబడుతుంది. అతడిచేత అధిష్ఠింపబడి తన రూపాన్ని విస్తరించుకుంటుంది. పురుషుడి కొరకు అతడికి కావాల్సినవాటిని పుట్టించుతుంది. ఆవు వలె కోరిన కోరికలను తీరుస్తుంది. ఆద్యన్తాలు లేనిది. జనులను కంటున్నది. భూతాలు ఆకాశము మొదలైనవాటి చేత గుర్తింపబడుతుంది. అని. అదే విధంగా ఉపాదానమైన ప్రకృతిని అధిష్ఠించే ఈశ్వరుడు విశ్వాన్ని జగత్తునూ సృష్టిస్తున్నాడనిన్నీ వినిపిస్తున్నది. **అస్మాన్మాయీ సృజతే విశ్వమేతత్. మాయాంతుప్రకృతిం విద్యాత్ మాయినంతు మహేశ్వరమ్.** దీనినుండే మాయి ఐనవాడు ఈ విశ్వాన్ని సృష్టించుతున్నాడు. మాయ అనగా ప్రకృతి అని, మాయగలవాడు మహేశ్వరుడైన వాడు మాయీ అని తెల్సుకోవాలి. అని. స్మృతి కూడా **మయాఽధ్యక్షేణప్రకృతిః సూయతే సచరాచరమ్.** నేను అధ్యక్షుడనై సరిచూస్తుండగా ఈ ప్రకృతి చరాచరాలనన్నింటినీ కంటున్నది. అని అంటున్నది.

ఈ విధంగా శ్రుతివాక్యాలు వినిపించకున్నా ప్రధానము ఉపాదానముగా లేకపోయినట్లయితే బ్రహ్మకు జగత్కారణత్వ శ్రుతి అర్థవన్తము కాకుండా పోతుంది కనుక ప్రధానము యొక్క స్వరూపము, దాన్ని ఈశ్వరుడు అధిష్టించి జగత్‌కు ఉపాదానకారణము కావడమున్నూ సిద్ధించుతుంది. ఇదే తీరుగా లోకంలో నిమిత్తము ఉపాదానములు అనే రెండు కారణాలు పూర్తి భిన్నంగా కనిపిస్తున్నాయి. అచేతనమైన మట్టి బంగారము మొదలైనవి కుండ, దండ కడియము మొదలైనవానికి ఉపాదానాలు అవుతున్నాయి. చేతనుడైన కమ్మరి కంసాలి మొదలైనవారు నిమిత్త కారణమై ఉండడము పరస్పరము విడదీయరాని సమ్బన్ధనాన్ని – నియతత్వాన్ని – కలిగి ఉంటూండడము తేటగా కనిపిస్తున్నది. ఏదైనా ఒక పని జరుగాలంటే తప్పనిసరిగా అనేక కారకాలు ఒక దగ్గర చేరితేనే అందరివంతూ పూర్తి చేస్తేనే తప్ప వస్తువు ఉత్పత్తి కాదు. అట్లాగా చూస్తున్నాము కూడా. ఈ విధంగా నిమిత్తోపాదానాలు మిక్కిలి భేదాలను కల్గిఉండడము, ఒక పని జరిగి దానినుండి వస్తువుపుట్టుకొని రావడానికి అనేక కారకాలతో అవసరము తప్పని సరిఐ ఉండడము అనేనియమాన్ని అతిక్రమించి, బ్రహ్మ ఒక్కడు మాత్రమే ఉపాదానము, నిమిత్తమూ అవుతున్నాడని వేదాన్తవాక్యాలు ప్రతిపాదించలేవు.

కనుక బ్రహ్మ నిమిత్తకారణమే కాని ఉపాదానకారణము కాదు. ఉపాదానము మాత్రము ఆయన చేత అధిష్ఠింపబడిన ప్రధానమే. అని పూర్వపక్షము ఎదురైతే సమాధానము చెప్పబడుతున్నది. ప్రకృతిశ్చ ప్రతిజ్ఞా దృష్టాన్తాను పరోధాత్ అని. ప్రకృతిశ్చ – ఉపాదానము కూడా. నిమిత్త కారణము మాత్రమే బ్రహ్మ కాదు. ఉపాదానకారణము కూడా బ్రహ్మనే అని అర్థము. ఎందువల్లనంటే ప్రతిజ్ఞా దృష్టాన్తానుపరోధాత్. ఈ విధంగా కదా ప్రతిజ్ఞా దృష్టాన్తాలు ఫలవన్తములు ఔతున్నవి. ప్రతిజ్ఞయైతే **స్తబ్ధోఽసి ఉతతమాదేశమప్రాక్ష్యః యేనా శ్రుతంశ్రుతం భవతి. అమతంమతమవిజ్ఞాతం విజ్ఞాతమ్.** ఏమీ తోచకుండా స్తబ్ధుడవై ఉన్నావు. ఆ తెలియని దానిని గురించినీ గురువుగారిని అడిగినావా? దేని చేతనైతే విననిది విినినట్లు తెలియనిది తెల్సినట్లు మననము చేయనిది మనము చేయబడినట్టిది అవుతుందో. అని ఒక వస్తువును తెల్సుకుంటే సర్వమును గురించిన విజ్ఞానము లభిస్తుందో అని. దృష్టాన్తము ఇది. **యధాసోమ్యైకేన మృత్పిండేన సర్వంమృణ్మయం విజ్ఞాతంస్యాత్. యధాసోమ్యైకేన లోహమణినా యధాసోమ్యైకేన నఖనికృన్తనేన.** ఎట్లాగంటే ఓ సౌమ్యుడా! ఒక్క మట్టిముద్దను గురించి తెల్సుకుంటే మట్టితో చేయబడినవన్నీ మృణ్మయాలు అని తెలుస్తవో, ఒక లోహమణితో బంగారు వస్తువులు, ఒక గోరుగల్లును గురించి తెల్సుకుంటే ఇనుపవస్తువులు అన్ని తెలుస్తాయో! అని కారణాన్ని గురించి తెల్సుకుంటే కార్యాన్ని గురించిన విజ్ఞానమంతా తెలుస్తుంది. మీరన్నట్లు బ్రహ్మనిమిత్తకారణమే ఐతే అప్పుడు ఆయనను గురించి తెల్సుకున్నప్పుడు సమస్త జగత్తును గురించి తెలియదు. కుమ్మరి కమ్మరి కంసాలులను గురించి తెల్సుకుంటే వారు సిద్ధంచేసిన వస్తువులను గురించి – ఘటాదులను గురించి ఏమీ తెలియదు కదా! కనుక ప్రతిజ్ఞ దృష్టాన్తాలకు విరోధము / బాధ కలుగుతుంది. అదే బ్రహ్మను ఉపాదానంగా అంగీకరించితే ఉపాదానమైన మట్టిముద్ద, లోహమణి, నఖనికృన్తనము – గోరుగల్లులను గురించి తెల్సుకున్నప్పుడు, కుండ, చిప్పలు, దండకడియము, కిరీటములు, బాడిశ గండ్ర గొడ్డళ్ళు మొదలైన వాటి కార్యములను గురించిన విజ్ఞానము కల్గినట్లే నిఖిల జగత్తు కంతటికీ ఉపాదానము ఐన బ్రహ్మను గురించి తెల్సుకుంటే ఆయన చేత చేయబడిన సృష్టింపబడిన సమస్త జగత్తూ తెల్సిపోతుంది. సహజంగా కారణమైన పదార్థమే మరొక అవస్థను / దశను పొందితే కార్యము అనబడుతుంది. కానీ మరొక ద్రవ్యము అని అనబడదు. కనుక కార్యకారణ రూపాలుగా ఉన్న మట్టి దాని వికారాలను ఉదాహరణగా చూపి ప్రతిజ్ఞను – ఒకదాన్ని గురించి – కారణాన్ని

గురించి – తెల్సుకుంటే దాని కార్యాలు – దాని నుండి పుట్టిన వస్తువులు తెలుస్తాయి. అనే ప్రతిజ్ఞను సమర్థించినందువలన బ్రహ్మ జగత్తుకు ఉపాదాన కారణము కూడా అవుతున్నాడని నిర్ణయింపబడుతున్నది.

నిమిత్త + ఉపాదానాలకు భేదము వేద వాక్యాలద్వారానే తెలియవస్తున్నదని ఏ మాట చెప్పినారో అది సరియైనది కాదు. నిమిత్త ఉపాదానాలు రెండున్నూ ఒక్కటే అని తెలియవస్తున్నది. **ఉతతమాదేశ మప్రాక్ష్యః యేనాశ్రుతం శ్రుతంభవతి** అనే వాక్యమే ఇందుకు సాక్ష్యము. ఆదిశ్యతే – ప్రశిష్యతే అనేన ఇత్యాదేశః. చక్కగా తెలియచేయబడుతుంది గనుక ఆదేశము. శాసించబడుతుంది. ఇట్లాగా చెయ్యి, ఇట్లాగా నడచుకో అని శాసించబడుతుంది గనుక ఆదేశము. తెలియనిదాన్ని తెలిపి ఆ రీతిగా నడచుకొనేటట్లు చేయడము ఆదేశమనబడుతున్నది. **ఏతస్య వాఅక్షరస్య ప్రశాసనేగార్గి** అనే శ్రుతివల్ల ఈ విషయము అర్థమవుతున్నది. సాధకతమ మవుతున్నందున కర్తను గురించి వివక్ష – (వక్తుమిచ్ఛా వివక్షా – తెలుపాలనే కోరిక / ఉద్దేశ్యము) – చేయబడింది. ఆ ఆదేష్టను – గురువుగారిని – అడిగినావా? దేన్ని వింటే విననిది అంతా విన్నట్లు అవుతుందో – ఏ ఆదేష్టతో – అధిష్ఠాతతో – ద్వారా – వినబడిన దాని సాయంతో విననిది కూడా వినినట్లు అవుతుందో! అని నిమిత్త ఉపాదానాలకు రెండింటికీ ఐక్యంతోస్తున్నది. రెండు (నిమిత్త ఉపాదానాలు) తెలుస్తేనే తెలియనిది కూడా తెలుస్తుంది కనుక ఇట్లాగా వివరించబడింది. **సదేవసోమ్యేదమగ్ర ఆసీదేకమేవ.** ఓ సోమ్యుడా! ముందుకాలములో ఇది ఒక్కటిగానే ఉండింది. అని సృష్టికి మునుపు ఒక్కటే ఉన్నది అని నిశ్చయమవుతున్నది. ఇక్కడ ఉన్న "**అద్వితీయం**" అనే పదముతో సృష్టి కార్యంలో పాలుపంచుకొనే మరొక అధిష్ఠాత లేదని నిర్ధారణ అవుతున్నది కనుక సృష్టి చేసిన పరమాత్మ ఒక్కడే ఉపాదానము, నిమిత్త కారణాలు అవుతున్నాడని తెలుస్తున్నది.

ఏమండీ! బ్రహ్మనే జగదుపాదానమయినట్లైతే **వికారజననీమ్, గౌరనాద్యన్తవతీ** ఇత్యాది వాక్యాలద్వారా ప్రకృతికి ఆద్యన్తాలు లేనందున నిత్యత్వము, జగత్తుకు ఉపాదానము కావడమున్నూ వినిపిస్తున్నది కదా! అది ఎట్లా కుదురుతుంది అని అంటే చెపుతున్నాము.

అక్కడ కూడా నామరూప విభాగాలు లేని కారణావస్థలో ఉన్న బ్రహ్మనే ప్రకృతి శబ్దంతో పిలువబడుతున్నాడు. అప్పుడు బ్రహ్మ కంటే వేరుగా మరొక వస్తువు లేదు కదా!

దాన్నే శ్రుతులు ఇట్లాగా చెప్పుతున్నాయి. 1) **సర్వంతంపరాదాత్, యోఽన్యత్రాత్మనః సర్వం వేద 2) యత్రత్వస్యసర్వం ఆత్మైవాభూత్, తత్ కేన కంపశ్యేత్** మొదలైనవి. **సర్వమ్ ఖల్విదంబ్రహ్మ 2) ఐతదాత్మ్యమిదం సర్వమ్** అని కార్యావస్థలో ఉన్నది, కారణావస్థలో ఉన్న అంతా – జగత్తంతా – బ్రహ్మాత్మకమే – బ్రహ్మ స్వరూపమే అని వినిపిస్తున్నందువల్ల కూడా ప్రకృతి శబ్దవాచ్యుడు బ్రహ్మనే. **ఇది ఇక్కడ చెప్పబడిన మాట యః పృథివీ మన్తరే సంచరన్ యస్యపృథివీ శరరీం యంపృథివీనవేద** అని మొదలుపెట్టి **యోఽవ్యక్తమన్తరే సంచరన్ యస్యావ్యక్తం శరీరమ్ యమవ్యక్తం నవేద, యోఽక్షరమన్తరే సంచరన్ యస్యాక్షరం శరీరం యమక్షరం నవేద. యఃపృథివ్యాం తిష్ఠన్ పృథివ్యాఅన్తరో యంపృథివీనవేద యఃఆత్మనోఽన్తరోయమాత్మానవేదయ స్యాఽఽత్మా శరీరం య ఆత్మానమన్తరోయమయతిసతే ఆత్మాఅన్తర్యామీ అమృతః** అనిన్నీ సర్వచిదచిద్వస్తువులను తనకు శరీరముగా చేసుకొని ఉన్నందువల్ల ఎల్లప్పుడూ సర్వులకూ ఆత్మయైన పరబ్రహ్మ ఒకప్పుడు సృష్టికాలములో విభాగము చేయబడిన నామరూపాలు కలవాడుగా, మరొకప్పుడు అనగా ప్రళయకాలంలో అవిభక్తములైన నామరూపాలు కలవాడుగానూ ఉంటున్నాడు. ఎప్పుడు విడదీయబడిన/ వేరు చేయబడిన నామరూపాలు కలవాడుగా ఉంటున్నాడో అపుడు ఆ బ్రహ్మనే అనేకులుగా కార్యముగానూ పిలువబడుతున్నాడు. ఎప్పుడైతే విభజింపబడక, విడిగా నామరూపాలు లేకుండా ఉంటున్నాడో అప్పుడు ఒక్కడు, అద్వితీయుడు, కారణము అనిన్నీ పిలువబడుతున్నాడు. ఈలాగున ఎల్లప్పుడూ చిదచిద్వస్తువులను శరీరమునుగా కల్గియున్న పరబ్రహ్మ యొక్క అవిభక్తనామరూపములు గల ఏ కారణావస్థ ఉన్నదో అది **గౌరనాద్యన్తవతీ, వికారజననీమజ్ఞామ్, అజామేకాం** ఇత్యాది వాక్యాలతో చెప్పబడుతున్నది అని.

అట్లాగే ఐనప్పుడు **మహానవ్యక్తే లీయతే** మహత్తు ప్రళయకాలములో అవ్యక్తము నందు కలసిపోతున్నది. **అవ్యక్తమక్షరేలీయతే** అవ్యక్తము అక్షరము నందు లీనమవుతున్నది. అని ప్రళయము జరిగే వివరము చెప్పినప్పుడు అవ్యక్తానికి (ప్రకృతికి) ఉత్పత్తి – పుట్టుక – లయములు చెప్పబడుతున్నవి. అదే విషయము మహాభారతంలోనూ **తస్మాదవ్యక్తముత్పన్నం త్రిగుణంద్విజసత్తమ। అవ్యక్తం పురుషే బ్రహ్మన్ నిష్క్రియేసమ్ప్రలీయతే.** ఓ బ్రాహ్మణుడా! దానినుండి సత్వరజస్తమస్సులు అనబడే మూడు గుణాలు కల్గిన అవ్యక్తము పుట్టింది. ఆ అవ్యక్తము ప్రళయ సమయంలో

ఏ పని చేయకుండా ప్రశాన్తంగా ఉన్న పురుషుడిలో బాగుగా కలిసిపోతున్నది. అనినీ చెప్పినారు కదా! ఇది ప్రకృతి శబ్దవాచ్యుడైన పరబ్రహ్మకు ఉత్పత్తి వినాశాలు ఉండడమనే దోషాన్ని కల్గించవా? అని అంటే ఇదేమీ దోషం కాదు. అచిత్తు అనబడే వస్తువును శరీరంగా కల్గియున్న బ్రహ్మకు అవ్యక్తశబ్దము చేత చెప్పబడే త్రిగుణాలను కల్గియున్న అవస్థలో ఉన్నట్టి ప్రకృతి కార్యమవుతున్నది. **యదా తమస్తన్నదివాన రాత్రిః** ఎప్పుడైతే తమస్సు ఉంటున్నదో పగలు లేదు రాత్రి లేదో! అని అంతా ప్రలయదశలో ఉన్నపుడు కూడా బ్రహ్మాత్మకమైన అతిసూక్ష్మమగు అచిద్వస్తువు ఉన్నదని చెప్పినందువలన జగత్ కారణమైన పరబ్రహ్మకు విశేషణము / ప్రకారము అవుతున్నది కనుక సూక్ష్మమైన అచిత్ వస్తువు నిత్యమయ్యే ఉంటున్నది. దాన్ని తనకు ప్రకారముగా చేసుకొన్న బ్రహ్మనే **గౌరనాద్యన్తవ తీ** ఇత్యాదుల యందు చెప్పబడుతున్నాడు.

ఇందువల్లనే బ్రహ్మకు ప్రకారమై అచిద్వస్తువు ఉంటున్నది కాబట్టే – **అక్షరం తమసి లీయతే తమః పరేదేవే ఏకీభవతి.** అక్షరము తమస్సు నందు లయమవుతున్నది. ఆ తమస్సు పరుడైన దేవునిలో. ఒక్కటిగా అవుతున్నది. అని తమస్సు ఏకీభావాన్ని పొందుతున్నది అనే వినిపిస్తున్నది. కాని లయము వినిపించదము లేదు. (విశేషణము / ప్రకారము ఐన వస్తువు విశేష్యములో విడదీయరానిదిగా కల్సి ఉంటున్నది. కానీ బొత్తిగా కనుపడకుండా పోదు. శ్యామసుందరుడిలోని శ్యామత్వము అనే విశేషణము ఆయన దేహములో అంతటా ఉన్నా వేరు చేయబడదు. ఆయనను వదలి ఉండదు. కాన తాను ప్రకారమై / విశేషణమై ఆయనను శ్యామసుందరుడిని చేస్తున్నది. అదేవిధంగా తమస్సే అనబడే ప్రకృతి సూక్ష్మరూపియై బ్రహ్మలో ఎడబాయకుండా (వేరుగా ఉండకుండా) తన ఉనికిని చాటుకుంటూనే ఉన్నది. కనుక దాన్ని శరీరంగా కల పరమాత్మతో పాటు అదీ ఉనికిని కల్గియే ఉంటున్నది కనుక ఉత్పత్తి ప్రలయాలు లేవు. ఆయన దాన్ని తన శరీరంగా కలవాడై ఉన్నందున ఆయన దాని పేరుతో వ్యవహరింపబడుతున్నాడు.)

ఏకీభావమనగా తమస్సు అనే పేరు గల అతిసూక్ష్మ అచిత్తు, బ్రహ్మయొక్క అవిభక్తనామ రూపముగా ఉండడము అని చెప్పబడుతున్నది. **తమ ఆసీత్ తమసా గూఢమగ్రే ప్రకేతమ్. తమసస్తన్మహిమాజాయతైకమ్.** తొలుత తమస్సు ఉండినది. కాన్తివన్తమైనది తమస్సు చేత కప్పబడిఉండినది. తమస్సు నుండి మహత్తు పుట్టినది. ఇత్యాదివాక్యాలున్నూ దీన్నే చెప్పుతూ ఉన్నవి. అదే తీరుగా మనుస్మృతి లోని మాటలు – **ఆ సీదిదంతమో భూతమ్ అప్రజ్ఞాతమలక్షణమ్। అప్రతర్క్యం**

**అవిజ్ఞేయం ప్రసుప్తమివసర్వతః.** సృష్టి జరుగడానికి ముందు ఇప్పుడు కనిపిస్తూ ఉన్న ప్రపంచమంతా తమస్సుగా ఉండింది. ఏది ఏమిటి? అని గుర్తించడానికి వీలు లేకుండా ఊహించడానికిన్నీ ఆస్కారము లేకుండా నిద్రపోయినట్లుగా నిశ్చలంగా పడి ఉండింది అని. **అస్మాన్మాయీ సృజతే విశ్వమేతత్** దీనినుండే మాయ కలవాడు జ్ఞాని ఈ విశ్వాన్ని పుట్టిస్తున్నాడు. అని దీనికి వెనువెంటనే ఉపపాదించనున్నాడు. అట్లాగే బ్రహ్మకు పరిణామము లేదు అనే శ్రుతులనున్నూ చెప్పనున్నారు.

ఒకేదానికి నిమిత్తత్వము ఉపాదానత్వమున్నూ కుదురదు. కార్యము ఒకే కారకము చేత పుట్టింపబడదు. అట్లాగా లోకంలో కనిపించడం లేదు కూడా. కనుక అగ్నినాసించేత్ – **అగ్నితో చల్లాలి** – అని అన్నట్లు వేదాన్తవాక్యాలు ఒక్కడినుండే పుట్టుక జరుగుతున్నదని ప్రతిపాదించజాలవు అని ఏ మాట అన్నారో అది సరికాదు. లోకంలో ఉండే అందరి కన్నా విలక్షణమైన వాడు సర్వశక్తులు ఉన్నవాడు సర్వజ్ఞుడు ఐన పరబ్రహ్మకు ఒక్కడికి మాత్రమే అన్నీ సాధ్యములే. ఆయన అఘటన ఘటనా సమర్థుడు. అచేతనములైన మట్టి మొదలగు వాటికి జ్ఞానము లేదు కాబట్టి అవి అధిష్ఠాతలు కాలేవు కనుక అధిష్ఠాత ఐన కుమ్మరి వాడు మొదలైన వారికి వింతవింతలుగా పరిణామాలను చెందే శక్తిలేదు గనుక సత్యసంకల్పుడూ కాదు గనుక లోకంలో ఉపాదాన కారణము నిమిత్తకారణమూ రెండున్నూ వేరువేరుగా కనిపిస్తున్నాయి. కనుక బ్రహ్మనే జగత్తు పుట్టుకకు ఉపాదాన కారణమూ నిమిత్త కారణమూ ఔతున్నాడు.

అగ్నినాసించేత్ అంటే నిప్పులతో చల్లవలెను అని అర్థము. నిప్పులను చల్లడం కుదరదు. నీళ్ళను మాత్రమే చల్లుతారు. ఇట్లా నీళ్ళను చల్లడము శుద్ధికొరకు చేస్తారు. నిప్పులతో నేలను శుద్ధి చేయరుకదా! ఇది విరుద్ధముగా కనిపిస్తున్నది. దీనికి సమన్వయము ఏమిటంటే వేడి నీళ్ళతో చల్లడము చేయాలి అని అర్థము. ప్రస్తుతము ఉపాదానము నిమిత్తములు రెండు విరుద్ధ స్వభావాలు కలవి. ఒకటి జడము. రెండవది చైతన్యవంతము. పరబ్రహ్మ ఉపాదానము నిమిత్తకారణమున్నూ కావడము అనేవి విరుద్ధధర్మాలు కనుక పై పోలికను చెప్పి వేదాన్త వాక్యాలు పరమాత్మను రెండు లక్షణాలు కలవాడిగా చెప్పడం సరికాదని పూర్వపక్షివాదన.

సూ॥ **అభిధ్యోపదేశాచ్చ 1-4-24** పరమాత్మ యొక్క సంకల్పాన్ని వేదము చెప్తున్నందువల్ల కూడా ఇదిగో ఈ చెప్పబోయే కారణం వల్ల కూడా రెండు కారణాలున్నూ పరబ్రహ్మనే. **సోఽకామయత. బహుస్యాంప్రజాయేయ, తదైక్షత**

**బహుస్యాం‌ప్రజాయేయ.** అని సృష్టి కర్త ఐన పరబ్రహ్మ తానే అనేక రూపాలను ధరించాలని తలచినాడని శ్రుతి చెప్పుతున్నది. కుమ్మరివాడు మట్టి ముద్దను కుండ, గురిగి, ప్రమిద వంటి ఆకారాలుగా మార్చినట్లు కాకుండా తానే అనేక రూపాలను ధరించినాడు. వింతవింతలైన చిదచిద్రూపాలతో చాలా విధాలుగా నేనే అవుతాను. ఆ విధంగా పుడుతాను అని ముందుగా ఏఏ రూపాలుగా కావాలో సంకల్పించుకొని ఆ విధంగా అయినాడు అని గదా సంకల్పపూర్వకమైన సృష్టి ఉపదేశింపబడుతున్నది.

సూ॥ **సాక్షాచ్చోభయామ్నాత్ 1-4-25** ఉపాదానకారణము, నిమిత్త కారణమున్నూ ఆయనే అని సూటిగా చెప్పినందువల్ల. కేవలము ప్రతిజ్ఞ, దృష్టాన్తము, పేరు మొదలైన వాటితోనే ఈ రెండు కారణాలు కావడాన్ని చెప్పడం లేదు. బ్రహ్మగారికే నిమిత్తత్వము, ఉపాదానత్వమున్నూ నేరుగా చెప్పబడుతున్నాయి. **కింస్విద్వనం క ఉస వృక్ష ఆసీత్. యతోద్యావాపృథిపీ నిష్టతక్షుః. మనీషిణోమనసా పృచ్ఛత తత్‌యదధ్యతిష్ఠత్ భువనానిధారయన్. బ్రహ్మవనం బ్రహ్మ స వృక్షః ఆసీత్. యతోద్యావా పృథివీనిష్ఠతక్షుః. మనీషిణోమనసావిబ్రవీమి. వో బ్రహ్మాధ్యతిష్ఠత్ భువనానిధారయన్** అయ్యా! మేము తెల్సుకోవాలి అనే కోరికతో అడుగుతున్నాము. వనము అంటే ఏమిటి? ఏది? దాన్లో చెట్టు ఏది? ఎవడు? ఈ భువనభాండాలనన్నీ ధరించుతూ నిలబెద్తూ ఉన్నవాడు ఎవడు? వాటిని చెక్కినవాడు ఎవడు? అనగా ఆ బ్రహ్మవేత్త ఇట్లాగా పలికినాడు. ఓ బ్రహ్మ జిజ్ఞాసులారా శ్రద్ధగా దాచుకోకుండా చెప్పుతున్నాను వినండి. బ్రహ్మనేవనము. బ్రహ్మనే అందులో వృక్షమున్నూ అందులోని చెట్టు మొద్దులతోనే ఈ ఆకాశము నేలలను చెక్కినాడు. బ్రహ్మనే లోకాలను ధరించుతూ అధిష్ఠాతఐ! అధ్యక్షుడై నిర్వాహకుడై ఉన్నాడు అని. ఈ వాక్యములో స్రష్ట ఐన బ్రహ్మకు ఉపాదానము ఏది? ఉపకరణాలు ఏవి? అని లోకం పోకడ ప్రకారము తెల్సుకోగోరితే సకల ఇతర విలక్షణుడైన బ్రహ్మకు సర్వశక్తులూ ఉండడముతో వైరుధ్యము ఏమీలేదు అని చెప్పుతూ బ్రహ్మనే ఉపాదానము, ఉపకరణాలు కూడా బ్రహ్మనే అని చెప్పి వైరుధ్యాన్ని తొలగించినారు. కనుక ఉపాదానమూ, నిమిత్తమూ రెండున్నూ బ్రహ్మనే.

సూ॥ **ఆత్మకృతేః 1-4-26** తననుండే చిదచిత్తుల తోడి జగత్తును పుట్టించినాడు కనుక. **సోఽకామయత బహుస్యామ్ ప్రజాయేయ.** అని సృష్టిచేయదల్చుకొని దానికోసం పూనుకున్న బ్రహ్మ **తత్ ఆత్మానం స్వయం అకురుత** అందుకొరకు తనను తాను అవసరమైన ఉపాదాన ఉపకరణాలనుగా మల్చుకున్నాడు అనే వాక్యము

చేత సృష్టికి కర్మ కర్త ఆయనే అని తెలియవస్తున్నది కాబట్టి తననే అనేకములుగా చేసుకున్నందువల్ల ఆయనకే నిమిత్తత్వము, ఉపాదానత్వమున్నూ ఉన్నట్లు ఎరుకపడుతున్నది. తనలో నుంచి చిదచిత్తులను వేరు చేయకుండా ఉన్నప్పటి ఆత్మ కర్త. అతడే చిదచిత్తులను వేరుచేసి వాటిని రెండింటిని కలిపి నామరూపాలను ఏర్పరచినప్పుడు కార్యము అవుతున్నాడు. కనుక కర్తృత్వకర్మత్వాలకు విరోధము లేదు. స్వయంగా తనను తాను జగద్రూపంగా చేసుకున్నాడు కనుక నిమిత్తమూ ఉపాదానము పరమాత్మనే.

**సత్యంజ్ఞానమనన్తం బ్రహ్మ 2) ఆనందో బ్రహ్మ 3) అపహతపాప్మావిజరో విమృత్యుః విశోకోఽవిజిఘత్సోఽపిపాసః 4) నిష్కలం నిష్క్రియం శాన్తం నిరవద్యం నిరంజనమ్ 5) సవాఏష మహానజ ఆత్మా అజరోఽమరః** అని చెప్పిన విధంగా సహజంగానే సమస్త చేతన అచేతనాలలో ఉండే దోషాలు లేనివాడు, తనకంటే మించినదేదీలేని జ్ఞానానందాలు కలిగి వాటికి తానొక్కడే ఒకే ఒక్క స్థానమై ఉన్న పరబ్రహ్మ విచిత్రములు అనన్తములు ఐన అపురుషార్థాలకు నెలవు ఐన చిదచిత్తులతో కలగలుపు కల్గియున్న ప్రపంచరూపంగా తనను బహుభవన సంకల్ప పూర్వకంగా – చాలా రూపాలతో పుట్టాలనే సంకల్పంతో – అనేక రూపాలు అయ్యేట్లు చేసుకోవడం ఎట్లా పొసగుతుంది? అని సందేహించుకొని సమాధానాన్ని చెపుతున్నాడు సూత్రకారుడు–

సూ॥ **పరిణామాత్ 1–4–27** పరిణామము చెందే స్వభావము కల శరీరాన్ని కల్గియున్నందున. ఇక్కడ చెప్పబడుతున్న పరిణామము పరబ్రహ్మకు దోషాన్ని తెచ్చిపెట్టే స్వభావము కలదికాదు. పైగా నిరంకుశమైన ఐశ్వర్యాన్ని – తిరుగులేని అధికారాన్ని తెచ్చిపెట్టేదే అని అభిప్రాయము. ఇట్లాగా కదా పరిణామము ఉపదేశింపబడుతున్నది. అన్నిరకాలైన హేయగుణాలకు ప్రత్యనీకమైన ఎదురైన – కళ్యాణగుణాలకు ఒకే ఒక్క నెలవుఐన, తనకన్నా ఇతరులైన సమస్త వస్తువులకంటే విలక్షణుడు, సర్వజ్ఞుడు, సత్యసంకల్పుడు, అన్ని కోర్కెలనూ చేజిక్కించుకున్నవాడు, అనవధికమైన అతిశయము ఐన ఆనందమును కలవాడు. తనయొక్క లీలలకు ఉపకరణమైన సమస్త చిత్ అచిత్ వస్తువులను తనకు శరీరమైన ప్రపంచములో, శబ్ద స్పర్శరూపరసగన్ధాలు అనే తన్మాత్రలు, అహంకారము మొదలైన కారణాల వరసతో కలసి తమ శ్శబ్దము చేత చెప్పదగిన మిక్కిలి సూక్ష్మమైన అచిత్ వస్తువుగా ఒక్కటే మిగులుగా ఆ తమస్సు కూడా

ఆయనకు శరీరమే అయ్యి ఉన్నా విడివిడిగా ఇది ఇది అని చెప్పడానికి వీలుకానంతగా ఉన్న తమస్సును శరీరంగా కల్గిన బ్రహ్మ ప్రళయానికి ముందు కాలములో వలె విడదీయబడిన నామరూపాలు గల చిదచిత్తులతో మిశ్రమైన – కలగలసి ఉన్న – ప్రపంచమనే శరీరాన్ని కల్గినవానినిగా అవుతాను అని సంకల్పం చేసి – దిగువ నుండి ఎగువకు తనకు కారణమైనదానిలో ప్రతి ఒక్కటి కల్సిపోయి తమస్సు అనే స్థితికి చేరుకున్నట్లే – పైనుండి క్రిందికి తమస్సు నుంచి మొదలై పాంచ భౌతిక శరీరము వరకు. జగచ్ఛరీరుడైన వానిగా తనను మార్చును – పరిణామాన్ని పొందేటట్లు చేస్తాడు అని అన్ని ఉపనిషత్తులలోనూ పరిణామాన్ని ఉపదేశించడం జరిగింది.

అదే తీరుగా **బృహదారణ్యకమనే ఉపనిషత్తులో** సమస్త జగత్తు బ్రహ్మకు శరీరముగాను, బ్రహ్మ దానికి ఆత్మగానూ ఉన్నట్లు / ఉపదేశింపబడుతున్నది. **యః పృథివ్యాంతిష్ఠన్ పృథివ్యాఅన్తరో యంపృథివీనవేద యస్యపృథివీ శరీరం యః పృథివీ మన్తరోయమయతి. ఏషతఆత్మా అన్తర్యామీ అమృతః** అని ఆరంభించి **యస్యాఽపః శరీరమ్, యస్యాగ్నిః శరీరమ్, యస్యాన్తరిక్షం శరీరం, యస్యవాయుశ్శరీరమ్, యస్యద్యౌః శరీరమ్, యస్య ఆదిత్యః శరీరమ్, యస్యదిశః శరీరం, యస్య చంద్రతారకం శరీరం, యస్య సర్వాణిభూతాని శరీరం, యస్యప్రాణః శరీరం, యస్యవాక్ శరీరం, యస్య చక్షుః శరీరం, యస్య శ్రోత్రం శరీరం, యస్యమనః శరీరం, యస్య త్వక్ శరీరం, యస్య విజ్ఞానం శరీరమ్, యస్య రేతః శరీరమ్** అనేంతవరకూ కాణ్వపాఠము ఉన్నది. మాధ్యన్దినుల పాఠములో విజ్ఞానము యొక్క స్థానములో **యస్య ఆత్మా శరీరమ్** అని విశేషము కనిపిస్తున్నది. ఇంతేకాకుండా లోకము యజ్ఞము వేదము అనేవి కూడా పరమాత్మకు శరీరాలే అని అదనంగా చెప్పబడింది.

ఇంక **సుబాలోపనిషత్తులోనూ** పృథివీ మొదలైన తత్త్వాలు అన్నీ పరమాత్మకు శరీరాలు అని చెప్పి **వాజసనేయకులు** చెప్పని తత్త్వాలకున్నూ శరీరత్వాన్ని చెప్పి, బ్రహ్మఆత్మ అని చెప్పినారు. **యస్యబుద్ధిః శరీరమ్, యస్య అహంకారః శరీరమ్, యస్య చిత్తం శరీరమ్, యస్య అవ్యక్తం శరీరం, యస్య అక్షరం శరీరం, యోమృత్యుమన్తరే సంచరన్ యస్యమృత్యుః శరీరం, యంమృత్యుర్నవేద, ఏషసర్వభూతాన్తరాత్మా అపహత పాప్మాదివ్యోదేవో ఏకోనారాయణః** అని ముగించినారు.

ఇక్కడ మృత్యుశబ్దముతో చాలాచాలా సూక్ష్మమైన అచిద్వస్తువు – తమశ్శబ్దము చేత చెప్పబడేది – సూచించబడింది.

**అవ్యక్తం అక్షరే లీయతే అక్షరం తమసి లీయతే** అవ్యక్తము అనేది అక్షరము నందు కలుస్తుంది ఆ అక్షరము తమస్సులో కలుస్తుంది అని అదే ఉపనిషత్తులో లయమయ్యే వరుస గుర్తుచేయబడింది.

ఆత్మలందరికిన్నీ తమకు ఉన్న జ్ఞానము కప్పివేయబడడము అనేది అన్నిరకాలైన అనర్థాలకు – దుఃఖాలకు – కారణమైనందున అదే మృత్యుశబ్దము చేత చెప్పబడుతున్నది. సుబాలోపనిషత్తులోనే బ్రహ్మకు శరీరాలైనందున బ్రహ్మాత్మకాలు ఐన అన్ని తత్వాలూ ఆయనలోనే లీనమవుతున్నట్లు ప్రలయము జరిగే పద్ధతి చెప్పబడుతున్నది. **పృథివీ అప్సుప్రలీయతే, ఆపస్తే జసి లీయన్తే, తేజో వాయౌ లీయతే, వాయురాకాశే లీయతే, ఆకాశమింద్రియేషు, ఇంద్రియాణి తన్మాత్రేషు, తన్మాత్రాణిభూతాదౌ లీయన్తే. భూతాదిర్మహతి లీయతే, మహానవ్యక్తే లీయతే, అవ్యక్తమక్షరే లీయతే, అక్షరం తమసి లీయతే తమః పరేదేవేఏకీభవతి.** భూమి నీటిలో కలుస్తున్నది. నీళ్ళు తేజస్సులో, తేజస్సు వాయువు నందు వాయువు ఆకాశములో, ఆకాశము ఇంద్రియాలలో, ఇంద్రియాలు తన్మాత్రలలో, తన్మాత్రలు భూతాదిలో, భూతాది మహత్తులో మహత్తు అవ్యక్తము నందు, అవ్యక్తము అక్షరము నందు, అక్షరము తమస్సు నందు ఆ తమస్సు పరుడైన దేవుని యందు ఏకమవుతూ ఉన్నది అని చిదచిత్తులు విభాగము చేయబడకుండా కలసి పోయి ఉన్న ప్రళయ దశలోనూ అతిసూక్ష్మమై తమదైన కర్మ సంస్కారముతో పాటే ఉంటవి అని తరువాత చెప్పుతారు. **నకర్మవిభాగాదితి చేన్న అనాది త్వాదుపపద్యతేచ.** అనే బ్రహ్మ సూత్రము దగ్గర.

ఈ విధంగా తన నుండి విడిచి ఉండునట్టివి అని చెప్పడానికి వీలుగాకుండా, అట్లా అయ్యే అర్హతలేనందువల్ల పరమాత్మతో ఒక్కటిగా అయ్యి ఉన్న మిక్కిలి సూక్ష్మమై ఉన్న చిదచిద్వస్తువులు అనే శరీరాన్నుంచి, ఒక్కదాన్నుంచి మాత్రమే అద్వితీయమైన నిరతిశయమైన ఆనందము కల సర్వజ్ఞుడు సత్యసంకల్పుడూ ఐన బ్రహ్మ నామరూపవిభాగములకు తగిన స్థూలచిదచిద్వస్తు శరీరము కలవాడవడము ద్వారా బహుభవన సంకల్ప పూర్వకముగా జగదాకారంతో పరిణామముచెందడం వినిపించుతున్నది. **సత్యంజ్ఞానమనన్తంబ్రహ్మ. 2) తస్మాద్వాఏతస్మాత్ విజ్ఞానమయాత్ అన్యోఽన్తరఆత్మాఆనందమయః 3) ఏషహిఏవఆనందయాతి 4) సోఽకామయత బహుస్యామ్ ప్రజాయేయేతి సతపోఽతప్యత సతపస్తప్త్వా ఇదం సర్వమసృజత. యదిదంకించ. తత్ సృష్ట్వాతదేవాను ప్రావిశత్. తదనుప్రవిశ్యసచ్చత్యచ్చాభవత్.**

**నిరుక్తంచానిరుక్తంచ. నిలయనం చానిలయనంచ. విజ్ఞానంచావిజ్ఞానంచ. సత్యంచానృతంచ సత్యమభవత్.** 3) ఇతడు మాత్రమే కదా ఆనందింపచేస్తాడు. 4) ఆయన కోరుకున్నాడు. నేను అనేకులుగా అవుతాను. అందుకొరకు వేరువేరు రూపాలతో పుడుతాను. ఆయన ఆలోచించినాడు. అట్లాగా ఆలోచన చేసి ఈ సమస్త ప్రపంచాన్ని సృష్టించినాడు. జగత్తును పుట్టించి దానిలోకి జీవుడి ద్వారా ప్రవేశించినాడు. ప్రవేశించిన పిదప ఆయన సత్తు (జీవుడు) తృత్ వదిలిపెట్టబడే శరీరము – చిత్తు ఆయనే ఐనాడు. నామము కలది నామము లేనిది, ఒకచోట ఉండేది, ఉండనిది, విజ్ఞానము, అవిజ్ఞానమున్నూ ఐనాడు. వేయిమాటలేల సత్యము (జీవుడు) అనృతము (ప్రకృతి) సత్యము (పరమాత్మ) ఐనాడు. అని ఈ వాక్యములో తపః శబ్దముతో ఇంతకుముందున్న జగదాకారమును గురించి పునరాలోచన / పర్యాలోచన – ఎవరు ఎవరు ఎట్లా ఉండినారు. ఎవరెవరి పుణ్యపాపాలు ఏమిటి? తిరిగి వాళ్ళను ఏయే శరీరాల్లోకి చేర్చాలి. ఇట్లాంటి విషయాలను స్మరించడము. అది జ్ఞానము. దాన్నే తపశ్శబ్దముతో చెప్పినారు. **యస్యజ్ఞానమయంతపః** ఎవనియొక్క తపస్సు జ్ఞానమయమైనదో అని శ్రుతిచెప్తున్నది. ఇంతకుముందు సృష్టి చేయబడిన జగత్తు యొక్క స్వరూపాన్ని ఆలోచించి ఇప్పుడు కూడా అటువంటి ఆకారములోనే ఉన్న జగత్తును ఇపుడు పుట్టించినాడు అని అర్థము. ఆ ప్రకారము గానే చతుర్ముఖబ్రహ్మ అన్ని కల్పాలలోనూ ఒకే తీరుగా ఉండే ప్రపంచాన్ని సృష్టిస్తున్నాడు. **సూర్యాచంద్రమసౌధాతా యధాపూర్వమకల్పయత్. దివంచపృథివీంచాన్తరిక్షమథోసువః** బ్రహ్మ సూర్య చంద్రులను ఇంతకుమునుపు ఉన్నరీతిగానే పుట్టించినాడు / ఏర్పర్చినాడు. స్వర్గాన్ని, నేలను అన్తరిక్షాన్ని సువర్లోకాన్ని కూడా మునుపటివలెనే సృష్టించినాడు. **శ్లో। యథా ఋతుషుఋతులింగాని నానారూపాణిపర్యయే। దృశ్యన్తే తానితాన్యేవ తథాభావాఃయుగాదిషు.** ఋతువులు మారినప్పుడు ఆయా ఋతువులకు సూచనలైన లింగాలు పలురకాలుగా ఉండేవి. మళ్ళీ మళ్ళీ కనిపిస్తుంటాయో అవే అవే వచ్చిపోతుంటాయో అదేవిధంగా యుగాలకు మొదట్లో, కల్పాలకు మొదట్లో అగుపడుతుంటాయి అని శ్రుతిస్మృతుల ద్వారా తెలుస్తున్నది.

పై శ్రుతులపర్యాలోచన ద్వారా తేలిన సారాంశము ఇట్లున్నది –

పరమాత్మ తాను అపరిచ్ఛిన్నమైన ఆనందాన్ని కల్గిన స్వభావుడై మరీ సూక్ష్మముఐ, అసలు ఆ వస్తువులేదోమో అన్నట్లుగా ఉండి (భగవన్తుడికి) తనకు లీలా

ఉపకరణమైన చిదచిద్వస్తువులను శరీరముగా చేసుకొని తన్మయుడు (వాటితో కలిసి అవే పైకి భేదము లేనట్లుగా కనిపిస్తున్న) ఐన పరమాత్మ వింతవింతలు అనన్తములూ ఐన ఆటవస్తువులను సమ్పాదించుకొనదలచి తనకు శరీరము ఐన ప్రకృతి పురుషుల సమష్టిపరమ్పరతో మహాభూతాల వరకు ఆయా శరీరాలను కలవాటినిగా పరిణమింపచేసి తన్మయుడై తిరిగి సత్ త్యత్ శబ్దాల చేత చెప్పబడే విచిత్రములై చిదచిత్తులతో కలగలసి దేవతలు మొదలుకొని స్థావరాల వరకు ఉన్న జగద్రూపుడుగా ఐనాడు అని. 1) **తదేవానుప్రావిశత్. తదనుప్రవిశ్య** అని అనడం ద్వారా కారణావస్థయందు ఆత్మగా ఉన్న పరమాత్మనే కార్యరూపముగా వికారాలను చెందే ద్రవ్యాలకు కూడా ఆత్మగా ఉండి ఆయా వస్తువులుగా ఐనాడు అని చెప్పబడుతున్నది.

ఈ తీరుగా పరమాత్మ చిదచిత్తులయొక్క కలయికగా ఉన్న జగదాకారంగా పరిణామాన్ని చెందినపుడు పరమాత్మ యొక్క శరీరము ఐన చిదంశములో ఉన్న అన్ని అపురుషార్థాలు, అట్లే శరీరమైన అచిదంశములోని అన్నిరకాల వికారాలు వాటికే చెందుతవి. పరమాత్మకు కార్యత్వము వస్తుంది. అనగా కార్యముగా పరిణామాన్ని చెందడము జరుగుతుంది. ఆయా అవస్థలలో (కార్య) కారణ అవస్థలలో ఉన్న చిదచిత్తులను నియన్త్రించేవాడవుతున్నందున ఆత్మత్వమును పొందుతాడు. చిదచిత్తులు పరిణామాన్ని పొందుతే వాటికి తాను మునుపటివలెనే నియన్తఐ ఉంటున్నందున, ఆత్మగా వ్యవహరించుతున్నందువల్లనూ వాటిలోని అపురుషార్థాలు వికారాలతో సమ్బన్ధము లేకుండానే ఉంటాడు. తనకు సహజమైన అపరిచ్ఛిన్నమైన ఆనందమయుడవడంతో ఎల్లవేళలా – కారణావస్థ, కార్యావస్థలలో, ప్రళయకాలములో జగదాకారరూపమైన సృష్టి అవస్థలోనూ – ఒకే ఆనందమయరూపుడై ఉంటూనే జగత్తుగా పరివర్తనము చేయుట – మారుట – అనే ఆట ఆడుకుంటూ ఉంటాడు. అందుకే ఇట్లా వేదపురుషుడు అన్నాడు. **సత్యం చానృతం చసత్యమభవత్.** తొలుతగా సత్ శబ్దముతో చెప్పబడేవాడై ఉన్న ఆయన జగద్రూపంగా పరిణమించి అసత్యముగా అనిపించుకొని ప్రళయకాలానికి వచ్చేటప్పటికి తాను తానుగా మిగిలి సత్యమనిపించుకుంటున్నాడు. అని విచిత్రమైన చిదచిద్రూపాలుగా వికారాలుగా మార్పును పొందినా బ్రహ్మ సత్యమేఐనాడు. అనగా అన్నిరకాల దోషాలకు దూరమై వాటివాసనే లేకుండా ఉంటూ హద్దులేని జ్ఞానానందుడుగా ఒకే రూపాన్ని కలవాడుగా ఐనాడు అని అర్థము.

సూక్ష్మదశను పొందినా, స్థూలదశను పొందినా చిదచిద్ వస్తువులన్నీ కూడా పరబ్రహ్మకు ఆటలాడుకొనే ఆటవస్తువులు సృష్టిస్థితి లయాలు అనేవి ఆటలు అని భగవన్తులగు వ్యాసుడు పరాశరుడు మొదలైనవాళ్ళు చెప్పినారు. పరాశరుడు విష్ణుపురాణములో చెప్పిన మాటలు ఇట్లా ఉన్నాయి. **శ్లో। అవ్యక్తాది విశేషాన్తం పరిణామర్ధిసంయుతమ్। క్రీడా హరేరిదం సర్వంక్షరమిత్యుపధార్యతామ్॥** అవ్యక్తము మొదలుకొని విశేషము వరకు ఉన్న పరిణామము, ఋద్ధి (మార్పు వృద్ధులను పొందుట) లతో కూడిన ఈ నశించే జగత్తు అంతా కూడా శ్రీహరియొక్క ఆట అని తెల్సుకోండి. **క్రీడతో బాలకస్యేవచేష్టాంతస్యనిశామయ.** ఆ నారాయణునియొక్క సృష్టి స్థితిలయాదిక్రియలన్నీ ఆటలాడుకునే పిల్లవాడిచేతలుగా తెల్సుకో. **బాలఃక్రీడనకైరివ** బాలుడు ఆటబొమ్మలతో వలె. ఇట్లాంటివి. ఇక సూత్రకారుడైన వ్యాసుడు కూడా ఇవే బ్రహ్మసూత్రాలలో **లోకవత్తులీలాకైవల్యమ్** అని చెప్పనున్నాడు.

**అస్మాన్మాయీ సృజతే విశ్వమేతత్ తస్మింశ్చాన్యోమాయయా సన్నిరుద్ధః** అనే వాక్యము చేతనున్నూ బ్రహ్మ జగత్తురూపంలోకి వికారాన్ని పొందినప్పటికీ ఆయనకు విశేషణము ఐన అచిదంశములో ఉన్న అన్ని వికారాలూ, ఆయనకే విశేషణముఐన జీవుడిలో ఉన్న అపురుషార్థాలు అన్నీ ఇది ఇట్లా విడదీసి గుర్తుపట్టడానికి వీలుగాకుండా, బ్రహ్మ శరీరము వంటివారైన ప్రకృతి పురుషులు ఇద్దరూ ఆ పేర్లతో పిలువడానికి అనర్హమైన సూక్ష్మదశను పొందినందువల్ల బ్రహ్మతో ఒక్కటిగా ఐనా వారిని భేదంతో వ్యపదేశము – పిలుచుటను చేస్తున్నారు. కారణమేమంటే **తదాత్మానం స్వయమకురుత.** సత్ శబ్దవాచ్యమైన బ్రహ్మ సృష్టిచేయదల్చుకొని తననే అనేకములుగా చేసుకొన్నది అనే వాక్యముతో ఏకాభిప్రాయాన్ని కల్గి ఉన్నందున. మనుస్మృతిలోని వాక్యమున్నూ అదే భావాన్ని వెల్లడిస్తున్నది. **శ్లో। సోఽభిధ్యాయశరీరాత్ స్వాత్సిసృక్షుఃవివిధాః ప్రజాః। అపఏవ ససర్జాదౌతాసు వీర్యమపాసృజత్.** అపరమాత్మ బాగుగా ఆలోచించి వివిధములైన ప్రజలను సృష్టి చేయదల్చుకొని తన శరీరమునుండే ముందుగా నీటిని పుట్టించినాడు. పిమ్మటవాటిలో వీర్యాన్ని వదలినాడు అనగా జీవుడిని చేర్చినాడు అని. కావుననే బ్రహ్మకు దోషము లేదని, వికారము లేదని చెప్పే శ్రుతులు చక్కగా అర్థవన్తములు అవుతున్నవి.

సూ॥ **యోనిశ్చహిగీయతే. 1-4-28** ఉపాదాన కారణముగా కూడా బ్రహ్మనే చెప్పబడుతున్నాడు. ఈ కారణం చేత కూడా బ్రహ్మ నిమిత్తకారణమూ ఉపాదాన

కారణమున్నూ అవుతున్నాడు. **కర్తారమీశం పురుషం బ్రహ్మయోనిమ్.** లోకాలన్నింటికీ కర్త ఐనవాడు, ఈశ్వరుడు, పురుషుడు – శరీరంలో అన్తరాత్మగా ఉండేవాడు – పెద్దదిగా ఉన్న ఈ ప్రపంచానికి కారణమైనవాడు అని **యద్ భూతయోనింపరిపశ్యన్తి ధీరాః.** ఈ భూతాలన్నీ పుట్టడానికి కారణమైన వాడిని ధీరులు – జ్ఞానులు దర్శించుతున్నారు. అనిన్నీయోని శబ్దము చేత చెప్పినారు కనుక. యోనిశబ్దము ఉపాదానకారణాన్ని చెపుతున్నదని **యథోర్ణనాభిః సృజతే గృహ్ణతేచ.** ఊర్ణనాభి అని పిలువబడే ఒకానొక సాలెపురుగు – ఈగల పులి – తనలోనించి దారాన్ని పుట్టిస్తుంది. తిరిగి తనలోనికి తీసుకుంటుంది అట్లాగే ఈశ్వరుడు జగత్తును తనలోంచి పుట్టిస్తున్నాడు. తిరిగి తనలోనే కలిపివేసుకుంటున్నాడు. **అని ప్రకృత్యధికరణము.**

★ ★ ★

## ఇక సర్వవ్యాఖ్యానాధికరణము

సూ॥ **ఏతేన సర్వేవ్యాఖ్యాతా వ్యాఖ్యాతాః 1–4–29** ఏతేన – నాలుగు పాదాల్లో చెప్పబడిన న్యాయసముదాయము చేత అన్ని ఉపనిషత్తులలోనూ జగత్ కారణమైన వాడిని ప్రతిపాదించే వాక్యవిశేషాలన్నీ చేతనాచేతనాలకంటే విలక్షణుడై సర్వజ్ఞుడు సర్వశక్తులు కలవాడు ఐన బ్రహ్మను ప్రతిపాదించేవి వివరించబడినవి. వ్యాఖ్యాతాః అనే పదము రెండుమార్లు పలుకబడడము అధ్యాయము ముగిసిందని చెప్పుతున్నది / సూచిస్తున్నది. **అని సర్వవ్యాఖ్యానాధికరణము.**

**భగవద్ రామానుజ విరచితమైన శ్రీభాష్యమునందు ప్రథమాధ్యాయములోని**
చతుర్థపాదము, ప్రథమ అధ్యాయము ముగిసినది.

**విజయతాం రామనుజ దివాకరః.**